

భారత తీర్థయాత్రా దర్పణం

# మన పుణ్యక్షేత్రాలు

దర్శించండి..

సంకలనం

వొరుగంటి రామకృష్ణప్రసాద్

# మన
# పుణ్యక్షేత్రాలు




తొలి సేకరణ :

**శ్రీ మదన్ మల్లాజోస్యుల**

కూర్పు :

ఆధ్యాత్మికసాహితీ చక్రవర్తి
బహుపురాణాల గ్రంథకర్త - గురుదేవులు

**శ్రీశ్రీశ్రీ వొరుగంటి రామకృష్ణ ప్రసాద్**

విజయవాడ - 3.



**నవరత్న బుక్ హౌస్**

28-22-20, రహిమాన్ వీధి, అరండల్ పేట, విజయవాడ-520 002,
ఫోన్ : 0866-2432813, వెబ్ సైట్ : www.navaratnabookhouse.com

**"మన పుణ్యక్షేత్రాలు"**

కూర్పు :

గురుదేవులు

**శ్రీ వొరుగంటి రామకృష్ణ ప్రసాద్**


ప్రచురణ హక్కులు :

**నవరత్న బుక్‌హౌస్**

28-22-20, రహమాన్ స్ట్రీట్,
అరండల్‌పేట, విజయవాడ - 2.
ఫోన్ : 0866 - 2432813
సెల్ : 98480 82432

**టైప్ సెట్టింగ్ :**

శ్రీవాగ్దేవి
విజయవాడ

**వెల : రూ. 400/-**

**ముద్రణ :**

**లావణ్య ఆఫ్ సెట్ ప్రింటర్స్**
**విజయవాడ**

# మా మాట

భారతదేశయాత్రలకు సంబంధించి ఒక సమగ్ర పుస్తకాన్ని ప్రచురించాలనే కోరిక మాకు 2001 సంవత్సరం నుండి వుంది. అయితే ప్రచురించకపోవడానికి కారణాలు అనేకం. మొత్తానికి ఈ సంవత్సరంలో మా కోరిక ఫలవంతం కాబోతోంది.

అనుకోకుండా 2001 సం॥లో సేకరించిన వివరాలను మా గురువుగారు శ్రీ వోరుగంటి రామకృష్ణ ప్రసాద్ గారికి ఇవ్వడం, వారు ఆంధ్రప్రదేశ్‌తో ప్రారంభించి, అక్షరక్రమంలో భారతదేశంలోని అన్ని పుణ్య క్షేత్రములను, తీర్థాలను చూడగల్గినంత వరకు ఇచ్చారు.

ఇక్కడ భక్తికి, అందునుండి అభించే పుణ్యానికే ప్రాముఖ్యత ఇచ్చారు. ఆ విధంగానే తీర్థ, క్షేత్ర వివరాలను ఇచ్చారు. ఇందులో మీరు సంతోషించదగ్గవి, అభిమానించి, అభినందించదగ్గవి ఆంధ్రప్రదేశ్. దీనికి సంబంధించిన వివరాలను సంపూర్ణంగా అనలేముకాని విశేషంగా ఇచ్చాం. అలాగే ఆసక్తికల్గిన వారి అభిరుచికి తగ్గట్లు ఒక జిల్లా, ఆ జిల్లాలోని చూడవలసిన వూళ్ళు ఓ వరుస క్రమంలో కూడా ఇవ్వబడ్డాయి.

ఈ మా ప్రయత్నం మీ అందరి అభిమానానికి పాత్రులను చేస్తుందని తలుస్తాము. కాకపోతే ఇందులో చేసిన తప్పు కాదుకాని విహారక్షేత్రాలు ప్రత్యేకంగా జలపాతాలు, కేవలం శిల్పాలు, అపురూప నిర్మాణమని కొండలు, గుట్టలు, దుర్గాల గురించి పెద్దగా తెలుపలేదు.

అవి సంక్షిప్తంగానైనా, తెలుసుకునే వారికి సమగ్రమనే అనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని పదకొండు కోట్లమందికి తీర్థయాత్రలు చెయ్యాలని, పుణ్యప్రదేశాలు దర్శించాలని, విహార యాత్రలు చెయ్యాలని విశిష్ఠ నిర్మాణాలు, జలపాతాలు, కేవలం కళాభిరుచితో అపురూప కళాఖండాలు, అలాగే కొండలు, గుట్టలు, దుర్గమాలు, దుర్గాలు చూడాలని వుండదు. కొందరికి చూడాలనివున్నా, ఆసక్తి, దాంతోపాటు ఆర్థికస్తోమతు, ఇంకా చెప్పాలంటే ఓర్పు ఓపిక కావాలి. ఇన్నీ సమకూరితే యాత్ర వారుకోరిన ప్రకారం ఆనందదాయకమౌతుంది. ఈ ఆనందం దర్శించడంలోను కల్గుతుంది, కొందరికి పఠించడంలోను కల్గుతుంది.

ఈ ఆనందాన్ని యాత్రాభిలాషులు పొందాలనే కుతూహలంతో మేము తలపెట్టిన ఈ ప్రయత్నం, పఠితులకు, ఆసక్తిపరులకు ఏమాత్రం ఆనందం కల్గించినా, ధన్యులమని తలుస్తూ ....

మీ ఆనందాన్ని సదా కోరే ....

**-- ప్రచురణకర్తలు**

**గమనిక :**

మరుపు మానవ సహజం. మరచిపోయినవాటిని, తెలియక విడిచిపెట్టిన వానిని తెలియబరిస్తే తప్పక మలి ప్రచురణలో చేర్చెదమని నమ్మకమైన మాట ఇస్తూ ---

# నా మాట - ఒక మాట

ఆనందం పొందాలనుకునేవారికి "ఆనంద"నందన" వందనాలు. పుట్టింది మొదలు, పెరుగుదల, చదువు, వివాహం, సంతానం, వారి అభివృద్ధి, బాధ్యతలు... ఇలాగ ప్రతి వ్యక్తి గానుగెద్దు జీవితంలో, శ్లేష్మంలో పడ్డ ఈగలాగ సతమతమవుతాడు. ఇది కాలచక్ర భ్రమణం.

ఇటువంటి వారికి మధ్యలో 55-65 సం॥ల మధ్య కొద్దిగా ఖాళీ దొరికి, 'ఓపిక - ఓర్పు' వుండి ఆసక్తి, 'ఆ (ధన)శక్తి' వుందనుకోండి. అటువంటివారికి ఈ తీర్థయాత్ర దర్పణం ఎంతో మేలు చేస్తుంది. ముందు చదవడానికి, తద్వారా తెలుసుకోవడానికి, ఆతదుపరి ఒక క్రమపద్ధతిలో ముందుకు పయనించడానికి దోహదపడుతుంది.

పూర్వకాలంకన్నా ఇప్పుడు ప్రయాణ-రవాణా సదుపాయాలు, వసతి-భోజనాలు, యాత్రా బస్సులు, రైల్వేవారి పర్యాటక స్కీములు ... ఎన్నో... అన్ని మనకు అనుకూలంగా - చెయ్యిపట్టుకుని తీసుకువెడుతున్నట్లు తోడు నీడగా వున్నాయి. వాటికి తోడుగా అసలైనమిత్రునిగా, ఈ "భారత తీర్థయాత్రా దర్పణం" మిమ్ము పరిపూర్ణ యాత్రాపరునిగా సుఖసంతోషయాత్రీకునిగా తీర్చిదిద్ది, చెయ్యిపట్టుకుని నడిపిస్తుంది.

"అబ్బే! వయస్సు చిన్నదే. అనారోగ్యం పెద్దది." అడుగు వెయ్యలేననేవారు, ఆసక్తివున్నా ఆర్థిక స్తోమతు లేదన్నవారు, వెళ్ళాలని వుందికాని, పరిస్థితులని .... పెదవులు తడుపుకునేవారు, నీళ్ళు నమిలేవారికి - ఈ గ్రంథం... ఆద్యంతం మిమ్ము పర్యాటన చేయించినట్లు, ఆ ప్రదేశాలు దర్శించినట్లు, మిమ్ము పరవశింపచేస్తుంది. తృప్తి పరుస్తుంది. ఇదొక ప్రత్యక్షసాక్షి, అదొక మధురానుభూతి అన్న మాటను సత్యవంతంచేస్తుంది. ఈ ప్రయత్నం - ప్రతి ఒక్కరికి కల్గించాలని, ఎందుకంటే .... నేనుకూడా అన్ని ప్రదేశాలు చూడలేనివాడిగా, ఒకప్పుడు, డబ్బులేదు, ఇప్పుడు డబ్బువున్నా వెళ్ళలేని మధ్యలో సమస్యలు, అందులో బాధలు ... అనారోగ్యం... కలిసి, కదలలేని స్థితిని కల్పించడంతో --

ఈ స్థితిలో వున్న వారిని నిరాశానిస్పృహలకు గురికానివ్వకుండా, అందరిలో ఆనందానుభూతులను కల్గించాలనే మా ఈ ప్రయత్నం (నాది, ప్రచురణకర్తలది) ఏమాత్రం ఫలించినట్లు మీ ఆదరాభిమానాలను ప్రసాదింపచేసినా, ప్రసాదించినా .... ధన్యులము. పరమ కృతజ్ఞులము.

**"ఓం శ్రీ తీర్థదేవాయనమః**

**ఓం శ్రీ క్షేత్రదేవాయనమః**

**ఓం - శ్రీ - సంపూర్ణ తీర్థయాత్ర ఫలం సిద్యర్థం ...."** అంటూ

**నమస్కారం.**

అయితే ఒక విషయం. ఆంధ్రప్రదేశ్ విషయానికే కాదు, ఈ దేశంలో అడుగడుగునా ఏ ప్రాంతంలోనైనా ఏదో ఒక పురాతన ఆలయం, ఆనాడు ... అంటూ పురాణగాథ చెబుతారు. అంతవరకెందుకు... అమలాపురం ప్రక్కనగల పేరూరులో, మదనగోపాలస్వామి ఆలయం వుంది. అది పాండవుల మాత కుంతీదేవి ప్రతిష్ఠ. ఇది ఆ వూళ్ళో పాతతరంవారికి తప్ప క్రొత్తతరం వారికి తెలియదు.

ఇటువంటివెన్నో మనకు అడుగడుగునా పలుకరిస్తాయి. అందుకని వీలైనంతవరకు ప్రతి గ్రామంలోను, అందులోని ఆలయ, అపురూప నిర్మాణాల చరిత్రను, అంతో ఇంతో, తెలుసుకోవడానికి వీలుగా ఇచ్చాను.

వివరంగా ఇస్తే -- అదొక "స్కాందపురాణమో, పురాతత్వశాఖ వారి చారిత్రక గ్రంథమో, అవుతుంది. పర్యాటకులు, లేదా భక్తులు, సమగ్రమంటూ ఇచ్చే పెద్దపెద్ద గ్రంథాలను చదువలేరు. కారణం వారి బ్రతుకు యాంత్రికజీవనంలో బ్రతికే ఒక జీవన యంత్రం కాబట్టి.

కనుక కేవలం అర్థమవడానికి వీలుగా అవసరమైనంతవరకు ఇచ్చిన వివరాలతో మీరు – మీ ఆశాదీపాన్ని వెల్గించుకుని ఆనందమూర్తులై మెలగమని కోరుతున్నాము.

ఇదొక భగీరథ ప్రయత్నం. ఇదీ కనీసం ఓ 20 సంవత్సరాలకు ముందు రావాల్సింది. అప్పుడు సావకాశం చిక్కలేదు. ఇప్పుడు ఆ సావకాశం చిక్కి, అనారోగ్యంగా వున్నా, ప్రత్యేకంగా నన్ను పిలిపించి "ఈ పుణ్యక్షేత్రా"లను తీసుకురాదలిచాను. మీరు శ్రమించి ... అంటాడు

**చి॥ బుగ్గలకోటి రామమూర్తి.** అందుకు ....

నాకు ఆనందం వేసింది. భగవంతుని కృప నర్థిస్తూ ప్రారంభించాను. కానీ... కారణమేమైనా గ్రంథం ప్రచురించాలన్న మూర్తి "కీర్తిశేషులయ్యారు. అలాగని ఈ కార్యక్రమం ముగింపక, వారి ఆశ, ఆశయాలకన్న మిన్న, నా శక్తిమేరకు తీర్చిదిద్దాను.

**చి॥ మూర్తి** కోరికను గౌరవిస్తూ, అద్భుత గ్రంథాల ప్రచురణను, అక్షరాలు వచ్చినవారు లక్షణంగా – సులభ శైలిలో చదువుకోవడానికి వీలుగా ప్రచురించే కార్యక్రమంలో నాకో పెద్ద పీట వేసారు.

శ్రీసాయిసువర్చల సదన్
రామలింగేశ్వరపేట 6వలైను,
**విజయవాడ – 520 003.**
సెల్ : 93930 07648

మీ ...
ఆధ్యాత్మికసాహితీ చక్రవర్తి,
బహుపురాణాల గ్రంథకర్త
**వోరుగంటి రామకృష్ణ ప్రసాద్**

# విషయసూచిక


| | |
|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 7 |
| తెలంగాణా | 161 |
| అరుణాచల ప్రదేశ్ | 253 |
| అస్సాం | 255 |
| బీహార్ | 261 |
| ఛత్తీష్‌ఘడ్ | 269 |
| ఢిల్లీ | 273 |
| గోవా | 281 |
| గుజరాత్ | 287 |
| హర్యానా | 299 |
| హిమాచల్ ప్రదేశ్ | 305 |
| జమ్ము - కాశ్మీర్ | 315 |
| జార్ఖండ్ | 329 |
| కర్ణాటక | 333 |
| కేరళ | 363 |
| మధ్యప్రదేశ్ | 381 |
| మహారాష్ట్ర | 391 |
| మణిపూర్ | 415 |
| మేఘాలయ | 419 |
| మిజోరామ్ | 421 |
| నాగాలాండ్ | 423 |
| ఒరిస్సా | 425 |
| పంజాబ్ | 435 |
| రాజస్థాన్ | 441 |
| సిక్కిం | 451 |
| తమిళనాడు | 455 |
| త్రిపుర | 505 |
| ఉత్తరప్రదేశ్ | 507 |
| ఉత్తరాఖండ్ | 519 |
| పశ్చిమ బెంగాల్ | 535 |
| రుద్రాక్షలు | 543 |
| ప్రసిద్ధ దత్త క్షేత్రములు | 544 |
| పంచ ప్రయాగలు (5) | 545 |
| హిమాలయములలోని 'చార్‌ధామ్' | 545 |
| స్త్రీలకు ప్రవేశార్హత లేని ఆలయములు | 545 |
| పంచకాశీలు | 546 |
| శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు వెలసిన ప్రముఖ క్షేత్రాలు | 546 |
| లక్ష్మీదేవికి - సరస్వతీ దేవికి గల 12 నామములు | 547 |
| అష్టైశ్వర్యములు | 548 |
| అష్టకష్టాలు | 548 |
| అష్టమదములు | 548 |
| అష్టభోగాలు | 548 |
| అష్టగణపతులు | 548 |
| దేవతలు - వాహనములు | 548 |
| సప్త పుణ్యములు | 549 |
| యంత్రములు నిక్షిప్తమైయున్న ప్రముఖ దేవాలయాలు | 549 |
| నాలుగు ధామాలు | 551 |
| పంచారామాలు | 551 |
| ఇతర పుణ్యతీర్థాలు | 552 |

# ఆంధ్రప్రదేశ్



TELUGU TALLI




2001 జనాభా లెక్కల ప్రకారం తక్కువ జనాభా వృద్ధిరేటు గల్గిన రాష్ట్రాలలో ఒకటిగా స్థానం సంపాదించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. హైదరాబాద్‌లో రాజధానిగా గల ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 23 జిల్లాలున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుండి 11 తెలుగు జిల్లాలు కలిసి 1953 అక్టోబరు 1వ తేదీన ఆంధ్రరాష్ట్రంగా అవతరించాయి. అప్పట్లో కర్నూలు రాజధానిగా ఉండేది. స్టేట్ రీ ఆర్గనైజేషన్ –1956లో, అంతవరకు నిజాం ఆధీనంలో ఉన్న తెలంగాణ ప్రాంతాన్ని కూడా ఆంధ్ర రాష్ట్రంలో కలిపారు. 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. రాష్ట్ర రాజధాని కర్నూలు నుండి హైదరాబాద్‌కు తరలించారు.

తరువాత **2014, జూన్ 2** వ తేదీన "తెలంగాణ" రాష్ట్రం పది జిల్లాలతో కూడి "నూతనరాష్ట్రం"గా అవతరించడంతో, ప్రస్తుతం **"ఆంధ్రప్రదేశ్ 13 జిల్లాలతో"** ఉన్నది.

రాశులుగా వజ్రాలను పోసి తూనికలతో అమ్మిన శ్రీకృష్ణదేవరాయల పాలనకు, రాణి రుద్రమదేవి పౌరుషానికి, పల్నాటి బ్రహ్మనాయుడు, నాగమ్మల ఎత్తు పై ఎత్తులకు నెలవు అయిన ఈ తెలుగు గడ్డ చరిత్ర ఎంతో ఘనమైనది. యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షించిన ఆంధ్రప్రదేశ్ భారత్ స్వాతంత్ర్య పోరాటంలో కూడా గణనీయమైన పాత్ర కలిగి వుంది.

**విస్తీర్ణం : 1,60,205 చ.కిమీ.** **ప్రధాన భాషలు : తెలుగు**

**సరిహద్దులు :** తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన కర్ణాటక; ఉత్తరాన ఛత్తీష్‌ఘడ్, వాయవ్యమున తెలంగాణ, ఈశాన్యమున ఒడిషా రాష్ట్రాలు, దక్షిణాన తమిళనాడు రాష్ట్రాలు సరిహద్దులుగా ఉన్నాయి. 972 కి.మీ. పొడవుగల తీర రేఖ ఉంది.

## శ్రీకాకుళం జిల్లా

## శ్రీసూర్యభగవానుని నివాసం - అరసవిల్లి



తన తేజస్సుతో వెలుగునిచ్చే ప్రత్యక్ష దైవము శ్రీ సూర్య భగవానుడు. ఇంద్ర ప్రతిష్టగా నెల కొనియున్న ఆదిత్య పుణ్య క్షేత్రమైన అరసవిల్లి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంజిల్లా శ్రీకాకుళం నకు 2 కి.మీ. దూరంలో ఉంది. క్షేత్రముచేరుకొను భక్తులు తమ కొర్కెలు తీర్చుకుని హర్షాతిరేకాలతో మరలిపోతారు గనుక ఈ క్షేత్రానికి హర్షవల్లి అని పేరు వచ్చినది. కాలక్రమేణా అది అరసవిల్లిగా మారింది.

**స్థలపురాణం :** ఉమారుద్ర దేవాలయాన్ని ఇంద్రుడు దర్శించడానికి వచ్చినపుడు, అది ఉమారుద్రుల ఏకాంత సమయ మని నంది, మహాకాళి చెప్పగా వారిమాట వినక ఇంద్రుడు ముందుకు పోవడానికి ప్రయత్నించినపుడు నంది హుంకరించా డట. దానితో ఇంద్రుడు తూర్పున తూలిపడి సూర్యభగవానుని ప్రార్థించగా అతని కోరికపై "ఉషాపద్మిని సహితంగా శ్రీ సూర్యభగవానుడు" ఈ క్షేత్రమునందు వెలిశాడని, తరువాత ఇంద్రుడు ఆ దివ్యమంగళ విగ్రహాన్ని సకల దేవతల సమక్షంలో ప్రతిష్టించినట్లు చెప్పబడుచున్నది. అందువల్ల ఈ దేవాలయంలో ఇంద్రుని విగ్రహం కూడా ఉంటుంది. ఇక్కడ ఉన్న పుష్కరిణికి ఇంద్రపుష్కరిణి అని కూడా పేరు ఉంది. మరో కథనం ప్రకారం, కురుక్షేత్ర యుద్ధం తాను చూడనని, అందులో పాల్గొనని చెప్పిన బలరాముడు తీర్థయాత్రలకు వెడతాడు. చివరకు యుద్ధం చివరిరోజులలో అంటే దుర్యోధన – భీముల గదాయుద్ధానికి తిరిగి వస్తాడు. అప్పుడు బలరాముడు ఇన్ని యాత్రలు చేసాడా? అనే ప్రశ్న వస్తుంది. అందుకు కుపితుడైన బలరాముడు, "నేనేకనుక త్రికరణ శుద్ధిగా ఈ యాత్రలు జరిపినట్లయితే ఇక్కడ గంగ ప్రవహించుగాక" అని నాగలితో కర్రు చేస్తాడు. అంతే! గంగ అక్కడ ఉద్భవిస్తుంది. ఆ గంగకు "నాగావళి" అనే పేరు వస్తుంది. ఈ నది ఒడ్డున బలరాముని ప్రార్థనకు సంతోషించిన శివుడు "కోటీశ్వరస్వామి"గా వెలుస్తాడు.

ఈ ఆలయం 7వ శతాబ్దంలో నిర్మించిన్నట్లు శాసనాలు తెలుపుతున్నాయి. కాకపోతే ఇక్కడ లభించిన శాసనాల ద్వారా గంగవంశరాజులు నిర్మించి, అభివృద్ధి చేసిన దరిమిలా 11 శతాబ్దంలో ఇక్కడి ఇంద్రపుష్కరణి (సూర్యకుండాన్ని) నిర్మించినట్లు తెలుస్తుంది. మరో కథనం ప్రకారం బలరాముడు ప్రతిష్ఠించిన కోటేశ్వర స్వామిని దర్శించడానికి సకాలంలో ఇంద్రుడు రాకపోవడంతో నంది ఆతనిని అడ్డుకోగా, ఇంద్రుడు వజ్రాయుధం తీస్తాడు. కోపించిన నంది కొమ్ములు ఝుడించగా, ఇంద్రుడు అరసవెల్లి ఒకనాటి హర్షవల్లి, ప్రస్తుత ఆలయమున్న ప్రాంతంలో పడిపోగా, భాస్కరుడు కరుణించి, ఇంద్రా! ప్రస్తుతమిక్కడ నా విగ్రహం ప్రతిష్ఠించి, సుఖసంతోషాలు పొందమని చెబితే,




ఇంద్రుడు ప్రతిష్ఠించాడని (ప్రతిష్ఠ విషయంలో భేదంలేదు - కథలోనే మార్పు) చెబుతారు. ఆ తరువాతి కాలంలో 1788 సం॥లో దీనిని యలమంచిలి పుల్లాజీపంతులుగారు పునరుద్ధరిస్తారు. అరసవెల్లికి దగ్గరలో "ముఖలింగ"మనే క్షేత్రం వుంది. ఆ వూరి ఇప్పిలి వంశస్థులు. అరసవెల్లి దేవాలయానికి, ఇప్పటికీ ఆలయ నిర్వహణ, అర్చనాదికాలు జరుపుతున్నారు.

ఉత్తరాయణ, దక్షిణాయన ప్రారంభదినాలలో సూర్యభగవానుని కాంతి కిరణాలు ఈ విగ్రహ పాదములపై పడతాయి. స్వామి వారి నడుమునకు "చురకత్తి" ఉంది. దీనినే సూర్యకతారిగా వ్యవహరిస్తారు. దక్షిణ భారతదేశంలోగల ఒకే ఒక సూర్యదేవాలయము "అరసవిల్లి" ఈ క్షేత్రము చేరు భక్తులు శ్రీకాకుళంలో వసతి చూసుకుని అరసవిల్లి వెళ్లవలెను.

దక్షిణ భారతంలో కుంభకోణంలో శ్రీ సూర్యనారాయణ మూర్తి దేవాలయం వున్నా, అరసవెల్లి క్షేత్రమే చెప్పుకోదగ్గది. దీనిని దర్శించిన వారికి ఆయురారోగ్యములు లభిస్తాయనడంలో సందేహంలేదు.

## శ్రీ కూర్మనాధస్వామి ఆలయం - శ్రీకూర్మం

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం పట్టణమునకు సుమారు 10-15 కి.మీ. దూరంలోనికి ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకూర్మం. ఇచ్చట స్వామి వారి పేరు శ్రీ కూర్మనాధస్వామి. అందువలననే ఈ ఉరికి శ్రీకూర్మం అని పేరు వచ్చినది. అతి ప్రాచీనమైన ఈ క్షేత్రం అపురూపమైన శిల్ప సంపదతో ఇమిడి ఉంటుంది. ఈ ఆలయంలోనే శ్రీరామానుజాచార్యులు, శ్రీ వరద రాజస్వామి, శ్రీ కోదండరామ స్వామి మొదలగు దేవాలయాలు భక్తులు దర్శించవచ్చును. పడమటి ముఖంగా ఉన్న ఈ స్వామి వారి దేవాలయంలో రెండు ధ్వజ స్థంబాలు ఉండటం విశేషం. ఇటువంటి ఆలయం భారతదేశంలోనే మొదటిగా చెప్ప వచ్చును. ఇక్కడగల పుష్కరిణిని "శ్వేత పుష్కరణి" అని పిలుస్తారు. ఈ ఆలయం నాలుగవ శతాబ్దంలో నిర్మింపబడినట్లు, ఆలయ గోడలు స్తంభాలపై గల శాసనాలు తెలుపుతున్నాయి.



ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని శ్వేతచక్రవర్తి పరిపాలిస్తూండేవాడు. ఈయన భార్య "విష్ణుప్రియ". ఆమె మహాభక్తురాలు. ఏకాదశి వ్రతం చేసే పుణ్యాత్మురాలు. అటువంటి సమయంలో భార్యపై మనసుపడ్డ చక్రవర్తి, ఆమెను సమీపించబోతే పరమపావనమైన వ్రతం చేస్తున్న సందర్భంగా తనవద్దకు రావలదంటుంది. అయినా మనసును చంపుకోలేక ఆ రాజు ముందుకు వస్తే శ్రీమహావిష్ణువును సందర్శించి తనను రక్షించమంటుంది. దాంతో వారిద్దరిమధ్య గంగను పారిస్తాడు. దాని ప్రవాహ వేగాన్ని తట్టుకోలేని చక్రవర్తి పరుగు ప్రారంభిస్తాడు. ఆ సమయంలో నారదమహర్షి ఈ రాజుకు కనుపించి "కూర్మ" మంత్రాన్ని ప్రసాదించి తరించమంటాడు. ఆ మంత్ర ప్రభావంతో మహావిష్ణువు 'కూర్మం" గా దర్శనమిస్తాడు. అక్కడే శ్వేతపుష్కరిణి ఏర్పాటవుతుంది. స్వామి "కూర్మం"గా అవతరిస్తాడు. తన ప్రభువు శ్రీకూర్మమయ్యేసరికి మహాలక్ష్మి శ్రీమహాలక్ష్మిగా అక్కడ అవతరించి, కోరినవారి కోర్కెలు తీర్చే కన్నతల్లి అవుతుంది. శ్వేత పుష్కరిణిలో నీటి అడుగు భాగం తెల్లగా వుంటుంది. భక్తులు, ఆ నీటి అడుగున గల మట్టిని "గోపీచందనం"గా స్వీకరిస్తారు. ఇటువంటి అద్భుతం మనకు, గుజరాతు రాష్ట్రంలోని "ద్వారక"కు దగ్గరగా వున్న "గోపీతలాబ్" అనే ప్రాంతంలో కూడ కనుపిస్తుంది.



కూర్మనాధస్వామి ఆలయం బయట ఈశ్వరాలయం వుంది. ఈయన పేరు పాతాళసిద్ధేశ్వరుడు. ఈయనను దర్శించిన తదుపరే కూర్మనాథుని దర్శించాలన్నది స్థలపురాణం చెబుతుంది. శ్రీకాకుళం జిల్లాలో వున్న శివాలయాల్లో తూర్పున కళింగపట్టణంలో కర్పూరేశ్వరుడు, ఉత్తరాన సింగూరపు కొండల్లో హటకేశ్వరుడు, పడమట శ్రీకాకుళంలోనే కోటేశ్వరుడు, దక్షిణానగల ఇప్పిలిలోని సుందరేశ్వరుడు, దర్శించవలసినవారు. వీరంతా కూర్మనాథునికి క్షేత్రపాలకులుగా వ్యవహరిస్తున్నారు.

అద్భుతమైన శిల్ప సంపద, మనసును ఆహ్లాదపరిచే ప్రకృతి పరిసరాలను, అరసవెల్లి నుండి అతి తక్కువ ఖర్చుతో దర్శించి, తరించవచ్చును.




**శివాలయ, విష్ణాలయములలో ప్రదక్షిణ చేయునపుడు**



**యానికానిచ పాపాని జన్మాంతర కృతానిచ ।**
**తానితాని ప్రణశ్యంతి ప్రదక్షిణ పదేపదే ॥**
**పాపోహం పాపకర్మాణాం పాపాత్మా పాపసంభవః ।**
**త్రాహిమాం కృపయాదేవ శరణాగతవత్సల ॥**
**అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ ।**
**తస్మాత్కారుణ్య భావేన రక్ష రక్ష మహేశ్వర ॥ రక్ష రక్ష జనార్ధన ॥**
**(విష్ణు ఆలయం)**

## ఆంధ్ర - ఉత్కళమైత్రీ చిహ్నం - శ్రీముఖలింగం



అతి ప్రాచీన చరిత్ర కలిగి ఆంధ్ర – ఉత్కళ మైత్రీ చిహ్నంగా, సర్వ దేవతా నిలయమైన శివపుణ్యక్షేత్రము శ్రీ ముఖలింగం శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలములో వుంది. శ్రీ ముఖ లింగం పుణ్యక్షేత్రము గానే గాక, శిల్పకళా సంపత్తికి అలవాలంగా ఉంది. వంశధార నదీ తీరాన ఆహ్లాదకరమైన, ప్రశాంత వాతావరణంలో ముక్కోణపు ఆకారములో వెలసిన ఇక్కడి ఆలయాలను 8వ శతాబ్దములో నిర్మించినట్లు తెలుపుచున్నారు.

కృతయుగములో గోవిందేశ్వర, జయంతీశ్వర నామాలతో ఆరాధనలందిన శివుడే త్రేత, ద్వాపరయుగములలో మధుకేశ్వరు డని, కలియుగమున ముఖలింగేశ్వరుడు అను పేరుతో శ్రీ ముఖలింగంలో వెలసినట్లు పురాణాలు చెబుతున్నాయి.

ఈ ముఖలింగేశ్వరస్వామిని **"శ్రీ గంగా విశ్వేశ్వర త్రికలింగ దేవర మధుకేశ్వర స్వయం భూలింగమూర్తి"** అని పిలిచే వారని ప్రతీతి.

ఇది ఇంద్రాదులు ప్రతిష్ఠించిన దేవతాప్రతిష్ఠ. అందుచేత దీనిని సర్వదేవతానిలయ క్షేత్రంగా చెప్పుకుంటారు. ఇక్కడ ముందు దేవప్రతిష్ఠిత శివలింగాలను దర్శించి, 'శ్రీముఖ' (లింగేశ్వరు)ని దర్శించాలంటారు. చారిత్రంగా కీ॥శ॥ 573 సం॥లో గంగ వంశానికి చెందిన హస్తివర్మ అనే రాజు సోమేశ్వర, భీమేశ్వర, మధుకేశ్వరాలయాలను మూడు భాగాలుగా ప్రతిష్ఠించినట్లు చెబుతారు. కళింగుల శిల్పకళలో అలరారే దీని క్షేత్ర పురాణానికి వస్తే.

ఈ ఆలయంలోని శివలింగం నిజమైన శివలింగంకాదు. ఇప్పచెట్టు మొదలు నరికివస్తే అది శ్రీముఖ లింగమైంది. ఇప్ప (సంస్కృతంలో మధుకం) నుండి ఆవిర్భవించిన స్వామిని 'మధుకేశ్వరు'డని పిలువబడుతున్నాడు. ఇదికాక, ఆలయానికి 'ఎనిమిది వైపుల శివలింగాలున్నాయి. వరహావతార, వామన, సూర్య విగ్రహాలు కనుపిస్తాయి. పంచబ్రహ్మాత్మకమన్నట్లు కాలభైరవుడు, వారాహీ, సూర్యనారాయణ, కుమారస్వామి, గణపతి, అష్టదిక్పాలకులు, నందీశ్వరుడు వగైరా ... విగ్రహాలనెన్నింటినో మనం చూడవచ్చును.

వుండి దీనిని 11 శతాబ్దంలో కళింగరాజు ఈ మధుకేశ్వరంకాక భీమేశ్వరాలయం కూడా, ఈ గ్రామంలోనే నిర్మించాడని తెలుస్తుంది. కాదు వేంగీచాళుక్యుడు విమలాదిత్యుడు నిర్మించాడనేది మరొక కథనం. పురాణాలలోకి వెడితే పాండవులలోని భీముడు నిర్మించాడనేది మరొక కథనం. ఇక్కడ కోటికి ఒకటి తక్కువగా శివలింగాలున్నాయి. రెండునందులుకూడా – ఒకటి ఆంధ్రా, రెండు ఓఢ్ర నందులని చెప్పుకుంటారు. ఇక్కడి మరో ఆలయం మధుకేశ్వర ఆలయగాధలాగ హస్తివర్మ నిర్మించాడని, కాకపోతే 11 శతాబ్దంలో తన జైత్రయాత్ర తదుపరి అనంతవర్మ నిర్మించాడనేది మరొక కథనం. స్థల పురాణం ప్రకారం సాక్షాత్తు సోముడు (చంద్రుడు) నిర్మించాడు కాబట్టి ఇది సోమేశ్వరాలయం అని చెప్పుకుంటారు.

## ఎండల మల్లికార్జునుడు



శ్రీకాకుళంజిల్లాలోని టెక్కలి సమీపంలోని రావివలసలోని 20 అ॥ ఎత్తుగల శివలింగం ఎండలో ఎండుతూ కొన్ని వందల సం॥గా ఆరుబయట వుండే స్వామి ప్రక్కనే మరొక చిన్న శివలింగం వుంది. దీనిని త్రేతాయుగంలో రావణ సంహారణానంతరం రాముడు సీతతో అయోధ్యకు వెడుతూ దారిలో ఇక్కడ ఆగి శివార్చన చేసిన లింగమట. ఆ.. చిన్నది .. ఆ ప్రక్కనున్న కొలనును 'సీతాకుండం' మంటారు. ఇంతేకాదు, పాండవులు తమ అజ్ఞాతవాస కాలంలో దీనిని పూజించారుట. 1870 ప్రాంతంలో టెక్కలి జమీందారు ఈ ఆలయానికి పైకప్పు నిర్మించాలని తలువ, అది విఫలమైందని, ఎండల మల్లికార్జునుడనే పేరును స్వామి శాశ్వతంగా పొందాడని భక్తులు చెప్పుకుంటారు.

## సంగం - సంగమేశ్వరాలయం



నాగావళి, స్వర్ణముఖి, వేదవతి నదుల సంగమ ప్రదేశంలో బలరాముడు మహాభారతానంతరం ప్రతిష్ఠించిన అయిదు శివక్షేత్రాలలో దీనినొకటిగా చెబుతారు. ఇంకో విశేషం నాగావళి తీరంలో బలరాముడు ప్రతిష్ఠించిన అయిదు శివలింగాలను ఒకేరోజున ఉదయం నుండి సాయంకాలంలోగా దర్శించినట్లయితే, వారికి పునర్జన్మరాదుట. నీటికి కటకటలాడే వారిని చూసిన బలరాముడు కలతచెంది తన నాగలితో ఒరిస్సానుండి, శ్రీకాకుళంలోని కళ్ళేపల్లి వరకు గంగను తెచ్చాడని, దానివలన కల్గిన పాప నివారణానికిగాను అయిదు శివలింగాలు ప్రతిష్ఠించాడని, ఇందులో రెండు ఒరిస్సాలోని పాయక పాడులో, ఇంకోటి విజయనగరం జిల్లా గుండక్షేత్రం. మిగిలినవి 2 సంగమేశ్వరుడు, శ్రీకాకుళంలోని ఉమారుద్రకోటేశ్వరుడు, కళ్ళేపల్లిలోని మణినాగేశ్వరావు. ఇంకా .......

బొబ్బిలిరాజుల ఆరాధ్యదేవత **పాలకోరం – కోట దుర్గమ్మతల్లి,** 260 సం॥నాటి సనారి విశ్వేశ్వర స్వామి, జగన్నాథస్వామి ఆలయం, గుళ్ళ సీతారాంపురంలో బొబ్బిలివారు నిర్మించిన, (ఎవ్వరులేని) ఏకాంత శ్రీసీతా రామాలయం, పాండవులు అజ్ఞాతవాసం చేసినట్లు చెప్పే గుట్ట, అచ్చుటి వరాహస్వామి, పాండవులు ప్రతిష్ఠించినట్లు

చెప్పే బారావ శ్రీ కోటిలింగేశ్వరస్వామి, జగన్నాధస్వామి, మెళియాపుట్టి శ్రీవేణుగోపాలస్వామి (టెక్కలికి 24 కి.మీ) బొందిలీపురం జగన్నాధస్వామి, కుటి చింతామణి అమ్మవారు, ఇచ్ఛాపురతల్లి స్వేచ్ఛావతి అమ్మవారు, అక్కడనుండి మహేంద్రగిరులు ఓపికపెట్టి చూడదగినవి. ఇంకా ...

## మహేంద్రగిరులు

శ్రీకాకుళంజిల్లాలోని మందస నుండి ఒరిస్సా రాష్ట్రంలోని జరగం గ్రామానికి దగ్గర్లో వున్నవి శ్రీమహావిష్ణు అవతారమైన పరశురాముని నివాసస్థానాలు. త్రేతాయుగంలో పరమేశ్వరుని గోహత్యాపాపానివారణార్థం ఇక్కడ తపస్సు చేసాడని సీతాదేవి జాడ కోసం, హనుమంతుడు ఇక్కడ నుండే సముద్రం లంఘనానికి సిద్ధపడ్డాడని, ఆ తదుపరి కాలంలో అంటే ద్వాపరంలో బలరామ కృష్ణులు ఈ గిరులలోనే పరశురాములవార్ని కలుసు కున్నారని, పురాణగాధలు చెబుతున్నాయి. పాండవులు కూడా ఈ ప్రాంతంలో కొంతకాలం నివసించారని కూడా తెలుస్తుంది.



ఓ కధలుగా కాక పైవాటికి నిదర్శనాలు కూడా ఇక్కడ గుహలలో మనం చూడగల్గుతాము. ఈ కోవలో పాతపట్నంలోని నీలమణి దుర్గాదేవి శ్రీనీలకంఠేశ్వ రాలయం, దర్శనీయాలు. జూలై – జనవరి మధ్యలో శ్రీనీలకంఠేశ్వరుని దర్శించుకోవడానికి భక్తులు విశేషంగా వస్తుంటారు. అందుకు కారణం – గర్భగుడిలో నీరు వుబికి వుబికి రావడం. ఈ నీటినే తీర్థంగా కూడా ఇస్తారు. ఈ నీటి రాకపోకలు, అర్థంకాని చిత్రం. ఈ ఆలయంలోని పంచలోహ నందీశ్వరుడు ఇతర శిల్పాలు దర్శించి, శిరసువంచి మ్రొక్కాలనిపిస్తాయి.

**బలగ (శ్రీకాకుళం) భద్రమ్మతల్లి, కోటబొమ్మళి కొత్తమ్మతల్లి, గ్రామదేవతలు.** వీటిని దర్శించే ఇతర దేవతాపూజలు జరుపడం, చరిత్రచెప్పే ఆనవాయితీ. ధర్మంచెప్పే ఆచారం. సింగుపురం కొండపైనగల సింధూరపు ఉమా హటకేశ్వరస్వామి 11వ శతాబ్దంలో నిర్మించిన ఆలయంగా చెబుతారు. ఈ ఆలయం ఈత్యంత ప్రాచీన అద్భుత మహిమలు కలది. కొండపైని జలాశయం, ఇక్కడి స్వామి, ఆలయాలు, అందలి దేవతలు, సాధుసత్పురుషులు దర్శనీయాలనడంలో ఆశ్చర్యం, అతిశయంలేదు.

**రాజాంలోని గౌరీకల్యాణ మల్లికార్జునస్వామి సారిహుండం – శ్రీవేణుగోపాలస్వామి,** చారిత్రాత్మక ప్రాధాన్యత కల దేవాలయాలు. అలాగే రాజంలోనిదే అయిన శ్రీపోలిపల్లి పైడితల్లి అమ్మవారు, చల్లని తల్లి. శ్రీకాకుళంలోని శ్రీఉరూజరలేశ్వరస్వామి, శ్రీరుద్రకోటేశ్వరాలయాలు ఏళ్ళ చరిత్రకల్గిన దివ్యక్షేత్రాలు.

# విజయనగరం జిల్లా

## శ్రీ పైడితల్లి అమ్మవారు - విజయనగరం



విజయనగర మహారాజుల వారి గారాలబిడ్డ ఆరాధ్యదైవం శ్రీ పైడితల్లి అమ్మవారుగా శ్రీ కనకదుర్గమ్మ విజయనగరంలో వెలసిన దేవత. వరాల పసిడి తల్లిగా ఉత్తరాంధ్రా జిల్లాల నుండే కాక రాష్ట్ర నలుమూలల నుండి అటు ఒరిస్సా రాష్ట్రము నుండి వచ్చే లక్షలాది భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారం ఈ తల్లి. దాదాపు రెండు వందల నలభై వసంతాల క్రితం ఈ చల్లని తల్లి విజయనగరంలో పుణ్యదేవతగా వెలయటం విజయనగర మహారాజులు చేసుకున్న పుణ్యఫలం.

విజయనగర మహారాజులు జన సామాన్య జగత్పతులు. వీరు శారద, నాగావళి, చంపావతి, వంశధార మొదలగు నదుల జలతరంగాలలో రంగరించిన బంగారు భూమిలో 108 దేవాలయాలను ప్రతిష్ఠించిన ఘనులు, వదాన్యులైన విజయనగర గజపతుల దాతృత్వానికి చిహ్నం ఈ విద్యల నిలయం విజయనగరం.

**స్థలపురాణం :** విజయనగర సామ్రాజ్యాధిపతులు శ్రీ విజయరామ గజపతులు వారు రాజ్యమేలుతున్న రోజులలో పొరుగు వారితో పోరు వచ్చింది. ఆ పోరు విజయనగర సామ్రాజ్యానికి సుఖశాంతులు కోరదని, లోక శ్రేయస్సుకే హానికరమని, యుద్ధము చేయవలదని గజపతుల చిన్నారి శ్రీ పైడితల్లమ్మ శతవిధాలపోరి చెప్తుంది. ఆమె మాటలను శ్రీ విజయరామరాజు లక్ష్య పెట్టలేదు. ఆ పోరులో గజపతి సోదరుడు దక్కలేదు. ప్రజలు సుఖపడలేదు. అంతటనా చిన్నారి పైడితల్లి ఆవేదన చెంది తనువు చాలిస్తుంది. ఆ రోజే గజపతులకు అత్యంత సన్నిహితుడైన శ్రీపతివాడ అప్పలస్వామి నాయుడు కలలో కనబడి విజయనగరానికి పశ్చిమ దిక్కున గల పెద్ద చెరువులో ఉన్న విగ్రహాన్ని వెలికితీసి పూజా పునస్కారాలు చేయమని చెప్పినట్లు ఆమె శ్రీ పైడితల్లి అమ్మవారుగా అవతరించినట్లు విశేష పూజలు అందుకుంటోంది.

ఆనాటి నుండి దిన దినాభ్యుదయంతో సిరిసంపదలు కురిపించే చల్లని తల్లిగా, అభయహస్తముతో ఆదుకునే మహాలక్ష్మిగా భక్తి ప్రవాహంలో ఓలలాడించే అమృతవర్షిణిగా పూజలు అందుకుంటోంది.

**ఆలయ ప్రత్యేకత :** రాష్ట్రములో మరే దేవాలయంలో జరగని రీతిలో అమ్మవారి "సిరిమాను" ఉత్సవం ఈ దేవాలయంలో జరుగుతుంది. దేశ చరిత్రలోనే ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ సిరిమాను ఉత్సవానికి లక్షలాది మంది భక్తులు విచ్చేస్తారు. ఈ సిరిమాను ఉత్సవం ఆశ్వీయుజ శుద్ధ దశమి అంటే విజయదశమి వెళ్లిన మొదటి మంగళవారం జరుగుతుంది.

ఈ పండుగ ఆశ్వీయుజ శుద్ధ విదియ నాడు ప్రారంభమై కార్తీక శుద్ధ పాడ్యమితో ముగుస్తుంది. సిరిమాను ఉత్సవానికి పదేహేను రోజులు ముందు ఆలయ ప్రధాన అర్చకులు అయిన శ్రీ బైరాగినాయుడు కలలో అమ్మవారు

కనిపించి ఫలానా సిరిమంతుని తోటలో తాను పెరుగుతున్నానని చెప్తుంది. శ్రీ బైరాగినాయుడు సంతోషంలో, సుగంధ ద్రవ్యాలు, ఫలపుష్పాలతో, వేద పండితులతో మంగళవాయిద్యాలతో ఆ ప్రదేశానికి వెళ్లి ఆ తోటలో పెరిగిన ద్రమానును సిరిగల దేవతగా, ద్రమానుగా వెలసిన **"సిరిమాను"** తమకిమ్మని ఆ తోట ఆసామిని అడుగుతారు. తమ పూర్వ జన్మ పుణ్యఫలంగా భావించి ఆ ద్రమానును వారికి భక్తితో సమర్పిస్తారు. ఆ ద్రమానుకు ఆలయ అర్చకులు పూజలు చేసి ఇంటికి తీసుకువచ్చి నేర్పరులైన శిల్పులతో అందంగా చెక్కి సిరిమానుగా మలుస్తారు. ద్రమానుకు చివరన ఒక సింహాసనం అమరుస్తారు. ఈ నిడివైన ద్రమానును పూలరధానికి బలమైన మోకులతో అమరుస్తారు. బైరాగినాయుడు ఉపవాస దీక్షలో స్నానము చేసి జయజయ ధ్వనులతో అమ్మవారి ఆలయానికి వస్తారు.

మంత్రోక్తముగా అర్చనలు జరుగునపుడు అమ్మ ఆలయ అర్చకులైన బైరాగినాయుడును అవహిస్తుంది. వీరు సిరిమాను చివర అమర్చిన సింహాసనంపై అధిరోహిస్తారు. లక్షలాది మంది భక్తులు జయ జయ ధ్వనుల నడుమ ఊయల గగన వీధికి చేరుతుంది. ఏనుగు, పాలధార, అంజలి రధము ముందు నడుస్తుండుగా మెల్లమెల్లగా సిరిమాను ఉత్సవము విజయనగర మహారాజుల కోటవరకు మూడుసార్లు నడుస్తుంది. ఈ అమ్మవారి రధము ఆలయం నుండి కోటవరకు మూడుసార్లు నడుచు సమయంలో విజయనగర గజపతుల ఆడపడుచు అయిన శ్రీ పైడితల్లి అమ్మవారిని సిరిమాను సంబరాన్ని రాజ కుటుంబం వీక్షించి అమ్మవారికి నీరాజనాలు అందిస్తారు.

ఈ జిల్లాలోని **నెల్లిమండలంలోని 'రామతీర్థాలు'**లోని అతి పురాతన రామస్వామి ఆలయం, పౌరాణిక, చారిత్రక ప్రాధాన్యంగలదిగా తెలుస్తుంది. పురాణ, చారిత్రక ప్రాధాన్యం ఎంతో కనుపిస్తుందీ ఆలయంలో. గర్భాలయంలోని విగ్రహాలు శ్రీకృష్ణుడు పాండవులకు ప్రసాదించినవట. రాముడు కూడా ఈ ప్రాంతంలో సంచరించాడుట. కాలక్రమంలో జనావాసం అరణ్యమైపోవడంతో శ్రీకృష్ణుడు పాండవులకు ప్రసాదించిన విగ్రహాలు, అజ్ఞాతవాసానంతరం, వీరు వేదగర్భునకు ఇస్తే, ఆతడు బౌద్ధం స్వీకరించడంతో అవి భూమిలోకి వెళ్ళడం జరిగింది. ఇన్నాళ్ళకు ఈ అడవిలో కట్టెలు కొట్టుకొనేవారిలో ఒకామె, అప్పుడు వచ్చిన గాలివానకు దారితెలియక తప్పిపోతే, ఆ మూగపిల్లకు రాముడు నాలుకపై బీజాక్షరాలు వ్రాసి మాట తెప్పించడంతో, ఆమె ఆ ప్రాంత మహిమను తెలిపితే పూసపాటి శ్రీసీతారామచంద్ర గజపతి 16వ శతాబ్దంలో ఆలయ నిర్మాణం చేయించాడని కథనం.

ఆలయంలో కేవలం వివిధ దేవతామూర్తుల దర్శనమే కాదు ప్రక్కనున్న కొండలో రామపాదచిహ్నాలు, రామగుండం, సీతాగుండం, సీతాదేవి పురుడు మంచం, భీముడు వంటపొయ్యి, సభావేదికలు, రకరకాల శాసనాలు కనుపిస్తాయి. ఇక్కడి ..

శ్రీ నీలకంఠేశ్వరుడు, బొబ్బిలిలో వారి కులదైవమైన శ్రీవేణుగోపాలస్వామి, గజపతినగరంలో 17వ శతాబ్దంలో నిర్మించిన శివాలయం, దీనితోపాటు ఇతరాలయాలు, అతిపురాతనంగా చెప్పే శృంగవరపుకోటకు సమీపంలోని పుణ్యగిరి, ధారగంగమ్మ ఈశ్వరాలయం, పాచిపెంటలోని శ్రీత్రినాధ ఆలయం, సాలూరు సమీపంలోని శంబర పోలమాంబ అమ్మవారు; జామి శ్రీయల్లారమ్మ (పాండవులు తమ ఆయుధాల సంరక్షణకు జామిచెట్టుపై నిల్పిన తల్లిగా) భక్తరక్షణిగా ప్రతీతి. ఇచ్చటి జనార్దనుడు ప్రాచీనుడే. అలాగే జయతి శ్రీమల్లికార్జునుడు సహజసిద్ధంగా ఏర్పడిన లింగం. ఈ శివలింగం పెరుగుతుందని కూడా చెబుతారు. అలనాటివంటే – శిధిలాలుగా మనవాళ్ళు

చూపిస్తారు అటువంటిది రెండు ఆలయాలు మరెన్నో తీపిగుర్తులు మనం కొన్నికొన్ని ప్రాంతాలలో వద్దన్నా చూడగల్గుతాము. ఇక్కడి సమీపంలోని నీలావతి భైరవశిఖరం కూడా ఓపిక చేసుకుని చూడదగ్గదే. ఇక్కడి కొండపైన తులసిచెట్టు ఏకాలంలోను వాడిపోదు. శిఖరం మధ్యలోని కొలనులోని నీరు ఎప్పుడు ఇంకిపోదు.

బలిజపేట మండలంలోని **గళావిరి శ్రీకామలింగేశ్వరాలయం** పురాతనమైంది. 11వ శతాబ్దంలో నిర్మించబడింది. ఈ విఘ్నేశ్వర, వాయుదేవుడు, నైఋతిలో చండీశ్వరి, ఉత్తరాన కుబేరుడు, గాయత్రి, నందీశ్వరు(విగ్రహా)లున్నారు. ఇంకా బలిజపేట వేంకటేశ్వరుడు, గాజులరేగ ముత్యాలమ్మతల్లితోపాటు రెల్లివలసకు దగ్గర్లోని 'కుమిలి' గ్రామంలోని ఆలయ సముదాయాలుకూడా చూడదగ్గవే!

## పద్మనాభం (విజయనగరం)

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా పద్మనాభం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కుంతీమాధవస్వామి పుణ్యక్షేత్రము ముఖ్యంగా చెప్పుకోదగ్గది. భారతదేశములో పేరెన్నికగన్న పంచ మాధవులలో ఇది ఒకటి. కాశిలో బింధు మాధవస్వామి, ప్రయాగలో వేణుమాధవ స్వామి, రామేశ్వరంలో సేతుమాధవస్వామి, పద్మ నాభంలో కుంతీ మాధవస్వామి, పిఠాపురంలో సుందరమాధవస్వామి ముఖ్యమైనవేకాదు, ఆసక్తి, ఓపిక వున్నవారు దర్శించదగ్గ క్షేత్రాలు, పరమ పవిత్రాలు.



ఈ క్షేత్రము విజయనగరం – విశాఖలకు 20 కి.మీ. దూరంలో ఉంది. ఈ క్షేత్రములో పాండవులు అరణ్యవాస అనంతరం అజ్ఞాతవాస సమయంలో కొద్దికాలం గడిపారని ఆ సమయంలో పాండవులు శ్రీ కృష్ణ పరమాత్ముని ప్రార్థించగా, ఆయన లోక కళ్యాణార్థం శంఖు, చక్రము, లక్ష్మి, అనంతులతో ఇక్కడ వెలిసారని చెబుతారు. కొండమీద ఉన్న ఈ దేవాలయమును చేరాలంటే సుమారు 2000 మెట్లు ఎక్కాలి. కొండ దిగువన కుంతీదేవి ప్రతిష్టించిన కుంతీ మాధవస్వామి ఉన్నారు. ఎడమ చేతిలో అభయ మిచ్చే ఈ స్వామి వారు ఈ ప్రాంతములో ఉండటం విశేషం. దీని ప్రక్కనేగల "మాడుగుల" ఆనాటి విరాటనగరమని , అలకొండ ఆనాటి ఆలమందలు దాచిన ప్రదేశమని, జామి గ్రామం జమ్మిచెట్టు ప్రదేశమని, పురాణగాథ తెలుపుతున్నది. భాద్రపద శుద్ధ చతుర్దశినాడు ఆనంత పద్మనాభస్వామి వారి ఉత్సవము, ఫాల్గుణమాస శుద్ధ ఏకాదశి రోజున కళ్యాణోత్సవము జరుగుతుంది. కార్తీక బహుళ అమావాస్యరోజున కొండ మీద జరుగు దీపాలంకరణ ఉత్సవమునకు అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారు.


# విశాఖపట్నం జిల్లా

## శ్రీవరాహలక్ష్మీనరసింహస్వామి - సింహాచలం (విశాఖపట్నం)

### సింహాద్రి కొలువు - చూసి వద్దాము రండి !

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో తిరుపతిలో తిరుమల తరువాత సింహాచలం భక్తుల కోరికలను తీర్చే కల్పతరువు. ఆధ్యాత్మిక భావాలను నింపుతున్న సింహాచలం విశాఖపట్నం జిల్లా విశాఖపట్నంకు అనుకుని ఉన్న సింహగిరి కొండపై వెలసిన శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి వారి పుణ్యస్థలము చూడవలసిన పుణ్యక్షేత్రము.

హరినామస్మరణే ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా భావించే ప్రహ్లాదుని తండ్రి అయిన హిరణ్యకశిపుడు విష్ణువును చూపించమని వేధించు సమయంలో స్తంభము నుంచి నరసింహ అవతారరూపములో విష్ణుమూర్తి ప్రత్యక్షమై హిరణ్యకశిపుని సంహరించిన తరువాత తన శరీరాన్ని పరిశుభ్రం చేసుకున్న ప్రాంతాన్ని కృతశౌచంగా, నృసింహుడు ఉగ్ర రూపుదైన ప్రాంతాన్ని పాపహారంగానూ, సింహం ఆకారంలో గల పర్వత ప్రాంతంలో ప్రహ్లాదుని మొరవిని శాంతి స్వరూపాన్ని పొందిన ప్రదేశాన్ని సింహాచలంగాను చెప్పబడుచున్నాయి.



ప్రహ్లాదుని కోరిక మేరకు సింహాచలంలో అవతరించిన స్వామి వారే శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి. హిరణ్య కశిపుని మరణానంతరం ప్రహ్లాదుడు ఈ ఆలయాన్ని సింహాచలంలో నిర్మించి నృసింహస్వామిని ప్రతిష్ఠించినట్లు, ఆతర్వాత కాలంలో అంటే ఈ కలియుగంలో పురూరవ చక్రవర్తి ఆలయాన్ని అభివృద్ధి చేసినట్లు చెబుతారు. పురూరవ చక్రవర్తికి స్వామి కలలో కనబడి 12 మణుగుల చందనాన్ని స్వామి నిజరూపంపై ఉంచమని ఆదేశించినారట. స్వామి అప్పటి నుంచి చందనంతో కప్పబడి ఉండేవారు. సంవత్సరమునకు ఒక పర్యాయం చందనం ఒలిచిన ఒకే ఒక్క రోజు మాత్రమే భక్తులకు స్వామి నిజరూప దర్శన భాగ్యము కలిగిస్తారు. 10వ శతాబ్దంలో శ్రీ కృష్ణదేవరాయలు ఈ ఆలయాన్ని దర్శించి పచ్చల పతకాన్ని స్వామివారికి సమర్పించి ఆరాధించినట్లు చరిత్ర చెబుతోంది. 17వ శతాబ్దంలో మహమ్మదీయుల దాడుల్లో శిల్పకళ దెబ్బతిన్నట్లు అనంతరం విజయనగరం మహారాజులు తిరిగి దేవస్థానం అభివృద్ధి చేసినట్లు చెబుతారు.

ఆనాటి నుండి ఈనాటి వరకు విజయనగర వంశీకులు ఆలయశాశ్వత ధర్మకర్తలుగా వ్యవహరించు చున్నారు. ప్రతీ సంవత్సరం పుష్య బహుళ అమావాస్య రోజున స్వామి వారి కొండకు దిగువన ఉన్న కోనేరులో తెప్పోత్సవము జరుగుతుంది. ఈ ఉత్సవమునకు రాష్ట్రము నుండే కాక ఇతర రాష్ట్రములనుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. హంస రూపాలంకారంతో చేయబడిన ఈ తెప్పపై అర్చక స్వాములు వేద పండితులు, మంగళ వాయిద్యాలతో స్వామి వారు పుష్కరిణిలో విహారం చేస్తారు.



ప్రతి ఏడాది చైత్ర శుద్ధ ఏకాదశి రోజున కొండపైన భక్తుల సమక్షంలో శ్రీస్వామి వారికి కళ్యాణ ఉత్సవము జరుగుతుంది. ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆ సమయంలో విజయనగర రాజావారి వంశ పారంపర్య ధర్మకర్తలు గోవిందరాజస్వామికి, లక్ష్మిదేవికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

ప్రతి ఏడాది వైశాఖశుద్ధ తదియనాడు స్వామివారికి చందన ఉత్సవము జరుగుతుంది. వైశాఖ శుక్ల విదియనాడు రాత్రి స్వామివారిపైన చందనం ఒలిచి తదియనాడు భక్తులకు నిజరూప దర్శన భాగ్యం కలుగజేస్తారు. సాయంత్రం వరకు నిజరూపదర్శనం భక్తులకు కలుగుతుంది. అనంతరం సహస్రఘటాభిషేకం జరిపి రాత్రి అర్చక స్వాములు చందన సమర్పణ చేస్తారు. ఇవికాక ఫాల్గుణశుద్ధ పౌర్ణమి రోజున 'డోలోత్సవము', ప్రతిరోజు పవిత్ర ఉత్సవాలు జరుగుతాయి.

సింహాచల క్షేత్రమునకు దర్శించుటకు రోడ్డు ద్వారా వాహనములలోనూ, మెట్ల మార్గంద్వారా కాలినడకన భక్తులు కొండపైకి వెళ్ళవచ్చును. మెట్ల గుండా వెళ్ళు వారు భైరవ ద్వారము, హనుమంతు ద్వారము, ఆకాశ ధార ద్వారా కొండపైకి వెళ్ళి గంగధార వద్ద స్నానము చేసి తలనీలాలు సమర్పించుకుని ఆలయంలోనికి వెళ్తారు.

ఆలయంలో నిత్యము స్వామి లింగాకారములో ఉండి రుద్రాక్షమాల ధరించి ఉంటారు. నిజరూప దర్శనంనాడు మాత్రం స్వామి నరసింహరూపంలో దర్శనం ఇస్తారు.

ఆలయం వెలుపల గల మండపము వద్దగల **"కప్ప స్థంబము"** ను ఆలింగనం చేసుకున్న భక్తులకు వారి కోరికలు నెరవేరతాయని నమ్మకం.

అనేక సుగంధ పరిమళ పుష్పాలతో, పండ్ల తోటల నడుమ ఉన్న ఈ ఆలయం నల్లరాతితో నిర్మించబడి ఉన్నది. దేవవాలయం స్థంభములపై ఉన్న శిల్పకళ చూసి తీరవల్సిందే. మొదటి ఆలయం ప్రాంగణం దాటిన తరువాత స్వామి వారి ఆలయం వెనుక ఏక శిల రాతిరథం కూడా భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఆలయ ప్రాంగణంలో భక్తులకు స్వామివారి ప్రసాదం పులిహోర, లడ్డులతో పాటు స్వామి వారి చందనం. స్వామి వారి చిత్రపటము దేవస్థాన విక్రయ కేంద్రంలో అమ్ముతారు.

ఆలయం వెలుపల క్రిందకి వస్తే 15వ శతాబ్దంలలో శ్రీ కృష్ణదేవరాయలు తన విజయానికి గుర్తుగా ఏర్పాటు చేసిన "విజయస్థూపం" చూడవచ్చు. కొండ దిగువున 33 అడుగుల ప్రసన్న ఆంజనేయస్వామి విగ్రహం కూడా భక్తులు చూడవచ్చును.

కొండ పైభాగమున జయసత్రం రుక్మిణీ కళ్యాణ మండపము, వెంకటేశ్వర కళ్యాణ మండపము, గజపతి, సింహాద్రి సత్రంలు ఉన్నవి. కొండ దిగువన టి.టి.డి., పుష్కరిణి, పురూరవ, శ్రీదేవి సత్రంలు, యాత్రనివాస్, గోదా కళ్యాణ మండపము, శ్రీ రామరాజు కళ్యాణ మండపములు భక్తులకు సేవలు అందిస్తున్నవి. కొండపై కాటేజీలు మరియు భోజన హోటళ్ళ సదుపాయం కలదు.

## శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం (విశాఖపట్నం)



భక్తులకు అష్టైశ్వరములనూ ప్రసాదించే సత్యగుణ దాయని శ్రీకనకమహాలక్ష్మి స్వయంభూ మూర్తిగా వెలసి నివాసముంటున్న ఈ మహాపుణ్యస్థలము ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం నగరంలో బురుజు పేటలో ఉన్నది. భక్తితో కొలిచినంతనే అష్టైశ్వర్యములను ప్రసాదించే ఈ అమ్మవారు విశాఖ మహారాజుల కులదైవం. విశాఖ భక్తజనులకు కోరిన కోర్కెలు తీర్చే "కల్పవల్లి" ఈ తల్లి. ఈ క్షేత్రములో అమ్మవారు. నిత్యం భక్తులతో స్వయంగా పూజలు అందుకుంటోంది. పాలాభిషేకం అత్యంత ప్రీతి పాత్రమైన దిక్కడ. శ్రీ కనకమహాలక్ష్మికి స్త్రీ పురుష బేధములేకుండ పసుపు, కుంకుమలతో సంతృప్తి పరచి తమ మొక్కులు తీర్చుకుంటున్నారు.

సూర్యచంద్రులు నేరుగా ఈ అమ్మవారిని పూజించుటకుగాను ఆలయం పైకప్పు వేయడానికి ప్రయత్నించినపుడు పట్టణంలో ప్లేగు వ్యాధి వచ్చి అపారమైన ప్రాణనష్టం సంభవించెనని ఆ ప్రయత్నం విరమించుకోగానే ప్లేగు వ్యాధి తగ్గినదని అందువలన అమ్మవారి దేవాలయమునకు పైకప్పు ఉండదని స్థల పురాణం.

సకలైశ్వర్యాలను ప్రసాదించే శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని మార్గశిర మాసములో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. అందువలననే ఆలయం ముందు భాగమున విశాలమైన మంటపము నిర్మించినారు. ఆలయ అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ దేవస్థానము భక్తజనుల సౌకర్యార్థం ఎన్నో ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థాన అధికారులు తెలుపుతున్నారు.

విశాఖపట్నానికి 50 కి.మీ దూరంలో **పాడేరులోని శ్రీమోదకొండమ్మ** గ్రామదేవత. దట్టమైన అడివిలో ఎత్తైన కొండలపై వున్న ఈ తల్లి గిరిజనుల ఆరాధ్యదైవం. ఒకసారి ఒక గిరిజనుడు అమ్మవారికి మంచి నీళ్ళ నిమిత్తం తీసుకువెళ్ళిన చెంబు అమ్మవారి దగ్గర మరచిపోయాడు. కొంతదూరం కొండదిగి వచ్చిన అతనికి చెంబు జ్ఞాపకంవచ్చి అమ్మదగ్గరకు వెడితే ఆ తల్లి నిజరూపంలో తన ఏడుగురు అక్కచెల్లెళ్ళు తమ్ముడు పోతరాజుతో నైవేద్యం తీసుకోవడం గమనిస్తాడు. దాంతో అమ్మవారు తన వునికి తెలిసిందనే వుద్దేశంతో ఇకపైన ఎవరు కొండపైకి రావద్దని, ఈ చెంబుపడిపోయిన ప్రదేశంలో ఆలయం నిర్మించి తనను సేవించుకోమని చెప్పి, ఆ చెంబును గట్టిగా తన్నేసరికి అది 'అమ్మవారి పాదాలుగా చెప్పుకునే విశాఖ – పాడేరు మధ్యపడింది. ఆ మహిమగల తల్లికి ఆపైన ఆలయం కట్టి పూజించుకోసాగారు.

ఇక్కడి **శ్రీచక్రశ్రీమేరు ఆలయం** ఈనాటిదే అయినా దీనికి అంకురార్పణ విజయనగర సామ్రాజ్యనిర్మాణ గురుమూర్తి శ్రీ విద్యారణ్యస్వాములవారి కోరిక ఇన్నాళ్ళకు ఈ విధంగా తీరిందట. శ్రీవిద్యోపాసకులు, అమ్మవారి అంకితభక్తులు, ఓపిక చేసుకుని చూడదగ్గ క్షేత్రం. పరమపవిత్రపుణ్యధామం.

విశాఖపట్నం – వేలంపేట **శ్రీదుర్గాలమ్మ తల్లి,** అతిప్రాచీన **పోలమాంబ తల్లి** సదా ఆరాధ్యనీయ గ్రామదేవతలు.

**బిక్కవోలులోని** శ్రీగోలింగేశ్వరాలయమేకాదు, ఇంకా ఎన్నో శివాలయాలు, ఇక్కడ చాళుక్యరాజుల నిర్మితాలు మనకు దర్శనమిస్తాయి. ప్రధాన గోలింగేశ్వరాలయంలో, స్వామికి కుడిప్రక్కన రాజరాజేశ్వరీదేవి, ఒకదానికంటే మరొకటి పెద్దదైన వాలు నందివిగ్రహలు, అలాగే నాగేశ్వర, నందీశ్వర, విశ్వేశ్వర లింగాలు, శివాలయానికి ఎడంవైపున సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయం పుట్టలతో అత్యంత వైభవంగా ధూపదీపనైవేద్యా లతో విరాజిల్లుతుంది. గుడిలోని రంగనాధస్వామి ఇక్కడ ఎంతో కాలంగా వుండి సేవించుకునే శేషుడు. నాలుగువందల మెట్లెక్కి దర్శించాలి. దీనికి కొంత దూరంలో నారాయణేశ్వరాలయ మొకటుంది. ఇక్కడి ఆలయానికి కొద్ది దూరంలో విష్ణుపాదాలు, శ్రీచక్రం మనం చూడవచ్చు. విష్ణుపాదోద్భవి గంగ అన్నది ఇక్కడి పాదాలు, శ్రీచక్రంమీదుగా ప్రవహించి ఋజువుచేస్తుంది.



**భీమునిపట్నం – నరసింహుడు** స్వయంభువుడు. ఈ సౌమ్యగిరి దేవుడు చూడదగ్గవాడు. దీనిని 12-13 శతాబ్దాలలో నిర్మించినట్లు తెలుస్తుంది. ఈ సౌమ్యగిరి పర్వతం ఒకప్పటి బౌద్ధక్షేత్రమని, ఈ 11-12 శతాబ్దాల వైష్ణవప్రచారా నికి గురి అయిందని కృష్ణదేవరాయలకాలంలో పోషింపబడి, పూసపాటివారి సమయంలో ప్రజాదరణ పొందినదన్నది ప్రత్యక్షసాక్ష్యం. మాఘ ఆదివారం, శ్రావణనక్షత్రంతోకూడిన అమావాస్య– అయితే అర్ధోదయంగాను, అమావాస్య సోమ వారం వరకు వుంటే మహోదయమని చెబుతారు. ఈ సమయాలలో సూర్యుని కాంతి శ్రీవారి పాదాలపై బడుట అర్ధోదయమని, మహోదయ విశిష్ఠతగా చెబుతారు.



ప్రతి 40 సంగిలకు వచ్చే అర్ధోదయ, మహోదయాలు, 60 సంగిలకు వచ్చే గోవిందద్వాదశిలు, పూర్వరూప పుణ్యదినాలని చెప్పాలి. అప్పుడిచటి గోస్తనీసంగమస్నానం, స్వామిదర్శనం అత్యంత పవిత్రమనేది భక్తజనుల పరిపూర్ణవిశ్వాసం.

యలమంచిలికి 10 కి.మీ దూరంలో **రాంబిల్లిలో**, ఫణిగిరి పర్వతంపై భూగర్భం నుండి వచ్చే అయిదు 'పంచ'ధారలు విచిత్రంగా మనం చూడగల్గుతాము. ఇక్కడి దేవుడు **ధర్మలింగేశ్వరుడు**. యమధర్మరాజు తన కుష్ఠురోగం పోగొట్టుకోవడానికిగాను శివుని ప్రతిష్ఠించి ఇక్కడ పూజించిన ప్రదేశమని, ఈ పంచధారల జలం పరమపవిత్రమని స్థానికుల, పెద్దల మాట. ఇచ్చటి ఆలయం, వాటిపై శిల్ప సంపద కనులకు పండుగచేస్తాయి.

## కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారుతల్లి అనకాపల్లి నూకాలమ్మ



ఉత్తరాంధ్ర జిల్లాలకే తలమానికమైన అనకాపల్లి శ్రీ నూకాంబికా అమ్మవారు విశాఖపట్నంనకు 36 కి.మీ. దూరంలో అనకాపల్లి పట్టణ నడిబొడ్డున వెలసియున్నారు. శ్రీ నూకాంబిక అమ్మవారు పార్వతీదేవి సద్యోగర్భాన జన్మించిన లక్ష్మిదేవి అవతారంగా ప్రాశస్త్యము. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా కర్నాటక, తమిళనాడు రాష్ట్రముల నుండే కాక విదేశీ యాత్రికులతో అంతర్జాతీయ ఖ్యాతిని పొంది కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, పిలిచిన పలికే ఇలవేల్పుగా, సకల అష్టఐశ్వర్య ప్రదాయినిగా ప్రత్యక్ష మహిమలుగల దేవతగా ప్రసిద్ధికెక్కింది. ఈ తల్లి అనఘాదేవి స్వరూపమని, ఈ తల్లి పేరుతోనే ఈ వూరు అనకాపల్లి అయిందని కూడా ఒక కథ ప్రచారంలో వుంది.

'యుగాది' నుండి తొమ్మిది రోజులుపాటు శక్తి స్వరూపంగా విశేషమైన అలంకారాలతో అలరారుతుంది. వీటినే వసంత నవరాత్రులుగా వ్యవహరిస్తారు. ప్రధాన శక్తులలో ప్రధాన పూర్ణశక్తిగా విరాజిల్లే శక్తి దుర్గ, మహాలక్ష్మి, మహాకాళి, మహాసరస్వతి మూర్తుల ఏకరూపం దుర్గ. ఈ సందర్భంలో కలశ స్థాపనతో, స్తోత్రనామాలతో శ్రీ నూకాంబిక అమ్మవారి మహోత్సవాలు జరగడం విశేషం. మొదట శ్రీ నూకాంబిక అమ్మవారు కాకతాంబగా వెలసియున్నారు. 1450 సంవత్సర కాలంలో సామంత రాజుగా వ్యవహరించిన అప్పలరాజుకాలంలో ఆలయాన్ని పునర్నిర్మించి శ్రీ కాకతాంబ అమ్మవారిని వారికి ఇలవేల్పు అయిన శ్రీ నూకాంబిక అమ్మవారిగా కొలవసాగారు.



ఇక్కడ కలియుగారంభాన్ని అనుసరించి శ్రీ నూకాలమ్మ జాతర మహోత్సవాలు జరగడం విశేషం. ప్రతి ఏటా యుగాది ముందు రోజు వచ్చు కొత్త అమావాస్యతో జాతర మహోత్సవాలు ప్రారంభమై మరుసటి అమావాస్య వరకు అత్యంత వైభవంగా నెలరోజుల పాటు జాతర మహోత్సవాలు జరుగుతాయి. కోరిన వరాలిచ్చే కొంగు

బంగారు అయిన శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవాలయం వద్ద ఘటాలు అమ్మవారికి చూపి వంటలు చేసుకుని బంధుమిత్ర సమేతంగా భోజనం చేసి తరలివెళ్ళుట ఈ ప్రాంత ప్రజల ఆనవాయితి.

1936 సంవత్సరం నుండి దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ దేవాలయం స్థానిక పెద్దల సలహాలు, సూచనలు మేరకు దినాదినాభివృద్ధి చెంది అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఎక్కడలేని విధంగా వంటగ్యాసు సదుపాయంతో, ఆధునిక సౌకర్యాలతో కూడిన 11 కాటేజిలు, రెండు అంతస్థులతో కూడిన కళ్యాణ మండపము మరియు కొబ్బరితోటలతో అమ్మవారిని దర్శించుటకు వచ్చు భక్తులకు వసతి సౌకర్యం కల్పిస్తున్నారు.

## అప్పికొండ - సోమేశ్వర ఆలయం

విశాఖపట్నం జిల్లా అనకాపల్లి సమీపంలో గల చిన్న గ్రామం అప్పికొండ. ప్రసిద్ధి చెందిన ఈ గ్రామంలో 11వ శతాబ్ధానికి చెందిన సోమేశ్వర ఆలయం ఒకటి. ఈ దేవాలయాన్ని పశ్చిమ చాళుక్యరాజు అయిన మూడవ సోమేశ్వరుడు నిర్మించినందున ఇక్కడ స్వామి వారికి సోమేశ్వరుడు అని పేరు వచ్చింది. మహాశివరాత్రి పర్వదినంలోను, కార్తిక మాసంలోను విశేష సంఖ్యలో భక్తులు ఈ గ్రామానికి వచ్చి శ్రీ సోమేశ్వర స్వామిని దర్శించుకుంటారు.

## బౌద్ధరామం - బొజ్జన్న కొండ

చారిత్రక ప్రసిద్ధిగాంచిన బౌద్ధరామాలలలో విశాఖపట్నం జిల్లా అనకాపల్లి దగ్గరలో గల బొజ్జన్నకొండ ఒకటి. బహుళ ప్రాచుర్యం పొందిన ఈ ఆరామము ఉత్తరాంధ్రలో చెప్పుకోదగ్గ బౌద్ధరామము. పురావస్తుశాఖ త్రవ్వకాలలో బయటపడిన అనేక బౌద్ధ అవశేషాలు ఈ ప్రాంతంలో దొరుకుట బౌద్ధమత ప్రాబల్యానికి నిదర్శనం. 2000 సం॥లుకు పైగా చరిత్రగల ఈ బొజ్జన్నకొండ బౌద్ధరామము వీరశైవుల దాడికి గురై వాటిని శైవక్షేత్రాలుగా మార్చే ప్రయత్నాలు జరిగాయిని చరిత్రకారులు చెబుతారు. సుమారు 30 అడుగుల పొడవు, 8 అడుగుల ఎత్తు, 16 స్థంభాలతో నిర్మించిన గుహ ఆలయములో 4 అడుగుల ఎత్తుగల ఏకశిలా స్థూపం, ద్వారం వద్ద జ్ఞానముద్రలో ఉన్న బుద్ధుని విగ్రహం దర్శనమిస్తుంది.

## కన్యకాపరమేశ్వరి దేవాలయం (అనకాపల్లి)

ఉత్తరాంధ్రా జిల్లాలో విశాఖపట్నంనకు 36 కి.మీ. దూరంలో ఉన్న అనకాపల్లిలో వేంచేసియున్న ముఖ్య దేవాలయాలలో ఒకటి శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయం. ఆర్యవైశ్యులకు ఇలవేల్పు అయిన ఈ దేవాలయమును పట్టణ వైశ్య ప్రముఖులు 1925 ఫిబ్రవరి 4వ తేదిన మాఘశుద్ధ ఏకాదశి పర్వదినమున స్థాపించారు. ఇదే ఆలయంలో శ్రీ జనార్ధనస్వామిని, శ్రీనగరేశ్వరస్వామిని ప్రతిష్ఠించారు. ఈ దేవతామూర్తికి మనదేశములో అనేక దేవాలయాలు కలవు. ఈ దేవాలయం సర్వంగ సుందరంగా విశాలమైన ప్రాంగణంతో ఇక్కడకు విచ్చేయు



భక్తులను ఎత్తైన గాలిగోపురంతో విశేషంగా ఆకర్షిస్తుంది. దేవాలయం లోకి ప్రవేశించగానే ముందుగా రామకోటి స్తంభము స్వాగతమిస్తుంది. గర్భాలయంలో ఉన్న షోడశకళా పరిపూర్ణమయిన శ్రీ కన్యకాంబ తన అభయహస్తమును చూపుతూ అశేష భక్తజనావళిని పలుకరించు నట్లు దర్శనమిస్తుంది. శ్రీదేవి దివ్యమంగళ విగ్రహాన్ని చూసిన శ్రీ శృంగేరి పీఠాధిపతులు షోడశ కళా ప్రపూర్ణాంబగా సంబోధించటం విశేషం.

ఈ దేవాలయమునకు అనుబంధముగా 50 గదులు గల వసతి, ధర్మసత్రములు, వంటశాల భోజనశాలకల పెద్దహాలు కలవు. ఇవికాక దేవాలయం ఆధ్వర్యంలో కళ్యాణ మండపాలుకూడా కలవు.

ఈ దేవాలయం ఆధ్వర్యంలో బాల బాలికలకు సంస్కృత పాఠశాల, కవి పండితులను సత్కరించుటకు సాహిత్యగోష్ఠి నిర్వహించుటకు సాహిత్య సమితి ఏర్పాటు చేయుట జరిగినది. ఈ ఆలయంలో వైశాఖ శుద్ధ దశమి అమ్మవారి జన్మదినము రోజున, అశ్వయిజ మాసములో దేవి నవరాత్రులు సమయంలో, మాఘ పాల్గుణ మాసములలో నగరేశ్వరస్వామి, జనార్ధనస్వామి వారి కళ్యాణ మహోత్సవాలకు విశేషంగా భక్తులు తరలి వస్తారు.

*ఈ ఆలయం విశాఖపట్నం నుండి విజయవాడ వెళ్ళు మార్గములో విశాఖపట్నంనకు సుమారు 36 కి.మీ. దూరంలో ఎన్. హెచ్-5 అనుకుని ఉన్నది. రైలు, బస్సు సౌకర్యం కలదు.*

## సర్వపాప హరణం ఉపమాక వెంకన్న దర్శనం

విశాఖపట్నం జిల్లా యలమంచిలి దగ్గరలోని ఉపమాక శ్రీ వెంకటేశ్వరుని దర్శిస్తే చాలు కోరిన కోరికలు సిద్దిస్తాయని, సర్వపాపములు హరించబడతాయని అటు ఉభయగోదావరి ప్రజలలోనూ, ఇటు విశాఖపట్నం జిల్లా ప్రజలలోనూ నమ్మకం. ఇక్కడ ఉన్న వెంకన్న స్వామి పగలు తిరుపతి కొండపై భక్తజనావళి పూజలను అందుకుని రాత్రి సమయంలో లక్ష్మిదేవితో కలసి ఉపమాకలోని గరుడాద్రి కొండపై ఉన్న ఆలయానికి వస్తారని ఈ ప్రాంత ప్రజల నమ్మకం. ఈ క్షేత్రములో ఉన్న బాంధుర సరస్సు మానస సరోవరం మాదిరిగా ఉంటుందని అంటారు. ఈ బంధుర సరస్సులో ఫాల్గుణశుద్ద ఏకాదశినాడు స్నాన మాచరించే వారికి దీర్ఘాయువు, పుత్ర పౌత్రాది సుఖములు కలుగునని బ్రహ్మాదేవునికి శ్రీహరి ఉపదేశించునట్లు పురాణగాథ.



**స్థలపురాణం :** కలియుగంలో పెరిగిపోతున్న పాపకార్యాలనుంచి జనులకు మోక్షం కలిగించమని నారద మహాముని ఒకనాడు తిరుపతి వెంకటేశ్వరుని వేడుకొనగా త్వరలో ఉపమాక గరుడాద్రిని చేరుకుంటానని

అక్కడ తనను దర్శించిన సర్వజనులకు పాప విముక్తి కలుగుతుందని వెంకటేశ్వరుడు చెప్పినట్లు చెబుతారు. ఈ ఉపమాక వెంకటేశ్వర ఆలయాన్ని 4వ శతాబ్ధములలో కృష్ణంరాజు అనే జమీందారు నిర్మించినట్లు కూడా స్థలపురాణం ద్వారా చెబుతారు. అత్యంత రమణీయ సుందర పక్రృతిగా ఉన్న ఈ ఆలయము జమిందార్ల హయాంలో మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లింది. ప్రస్తుతం ఈ దేవాలయం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉన్నది. ఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు ఉపమాకవెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు, పౌర్ణమినాడు జరిగే పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి చక్రస్నానం కార్యక్రమం తిరుమలలలో నిర్వహించే విధంగా ఉంటుంది. ఈ రోజున ఉత్తరాంధ్ర జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారి దర్శనం చేసుకుంటారు.

## చూడవలసిన అరకులోయ అందాలు

ప్రకృతిని దర్శించడానికి, ఆనందం పొందడానికి అందుబాటులోనున్న అపురూప విహారభూమి ఈ అరకులోయ.



1960 సం॥ వరకు ఎవరికీ తెలియని ఈ ప్రాంతం, 1995 తర్వాత ప్రజలదృష్టిని ఆకర్షించడం ప్రారంభించింది. ఇక్కడ బుర్రా గుహ లున్నాయి. ఓపికవున్నవారు చూడవచ్చును. ఎండాకాలంలో ఇది "ఊటీ" వలె చల్లగా వుంటుంది. అని అనడం తప్ప, చూడటానికి మాత్రమే తప్ప, వుండటానికి ఏమాత్రం వసతులు లేని ప్రాంతం ఈ అరకులోయ.

అసలు ఇది రామాయణంలోని ఒకనాటి దండకారణ్య ప్రాంతం. కాకపోతే ఈ రోజులలో 'మన్యం', మన్యం ప్రాంతమని పిలుచుకుంటూండేవారు. ఈ ప్రాంతంలో వుండే ఇనుపఖనిజం రవాణా నిమిత్తం డి.ఎం.కె. ప్రాజెక్టు పేరుతో రైలుమార్గం వేసారు. అరకు వెళ్ళాలంటే, కిరండల్ వెళ్ళే రైలు మార్గంద్వారాను, విశాఖపట్టణంనుండి బస్సులద్వారాకూడా వెళ్ళవచ్చును.

అరకులోయకు వెళ్ళే దారిలో బుర్రాగుహలు వున్నాయి. ముందు గుహల్ని చూసుకుని, ఆ తదుపరి అరకు వెళ్ళడం ఒక పద్ధతి. ఇంకోటి బస్‌స్టేషనుదగ్గరవున్న సమాచారకేంద్రంలోను, రెండోది రైల్వేస్టేషనులోని సమాచార కేంద్రంలోను ఈ ప్రయాణ వివరాలు తెలుసుకుని కూడా ఏ విధమైన ఇబ్బందిలేకుండా ఉదయం వెళ్ళి, సాయంత్రానికి తిరిగివచ్చే పద్ధతి వుంది.

ఇక – ఈ రోజుల్లో ఆర్థికంగా సదుపాయాలున్నవారు స్వంతంగా బయలుదేరి వెళ్ళవచ్చును. అక్కడ వసతి, భోజన సదుపాయాలు ఇప్పుడు లభిస్తున్నాయి.

ప్రకృతి అందచందాలు, చూడాలనుకునేవారు రైలులో ప్రయాణిస్తే, ఆ అనుభూతి, ఆనందం వూహించుకోవాల్సిందే తప్ప చెప్పలేనిది.ప్రకృతి అందాలు దర్శించాలనే ఆరాధకులకు, ఇదొక స్వర్గధామం.

ఉదయంపూట, సూర్యకాంతులనుండి తొంగి తొంగి చూస్తూ పలకరిస్తున్నట్లు పులకరింపచేసే ఈ ప్రకృతి కన్య అందాలు, ఆరాధకులారా! చూసి సమ్మోహనులై మురిసి, ముదమొందండి!!

# తూర్పుగోదావరి జిల్లా

## ఆంధ్రుల ఆరాధ్య దైవము శ్రీ సత్యనారాయణస్వామి - అన్నవరం

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన గిరి క్షేత్రములలో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో అన్నవరం లోని రత్నగిరి క్షేత్రము ఒకటి. విశాఖ – విజయవాడ జాతీయ రహదారిలోనూ, రైలు మార్గంలోనూ ఈ అన్నవరంలో దిగి క్షేత్రదర్శనం చేయవచ్చును. రైల్వే స్టేషన్‌కు 2కి.మీ. దూరంలో పంపానది తీరాన రత్నగిరి శిఖరాన వెలసిన అనంత లక్ష్మి, సత్యవతి సమేతుడైన శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి భక్తుల పాలిట ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్నారు. రాష్ట్రములోని వివిధ ప్రాంతముల నుండి ఇక్కడకు విచ్చేస్తున్న భక్తులు పంపానదిలో స్నానమాచరించి శ్రీ వీరవెంకట సత్యనారాయణస్వామి సన్నిధికి చేరుకుని శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతము భక్తి శ్రద్ధలతో చేసుకుంటారు.



రాష్ట్ర ప్రజలు ఎవరి ఇంట శుభకార్యము జరిగినా ఈ సత్యదేవుని వ్రతము చేసుకోవటం అనాదిగా వస్తున్న ఆచారం. స్వామి వారి సన్నిధిలో వేల సంఖ్యలో వివాహాలు ఏడాది పొడవున జరుగుతూ ఉంటాయి. సాయం సమయంలో ప్రకృతి సౌందర్యాలతో కొండమీద నుండి కనబడే దృశ్యాలు చూడ ముచ్చటగా ఉంటాయి. ఒక వైపు రెండు కొండల మధ్య ప్రవహించి అశేష ప్రజానీకానికి నీరు అందించే పంపానది. మరోవైపు ఆంధ్ర కళామతల్లికి పట్టెడు అన్నం పెట్టే వరి పంట పొలాలు, ఇంకోవైపు కొండ కోనలు, అందమైన వృక్షాలు చూడముచ్చట కలిగిస్తాయి. దేవాలయ ప్రాంగణములో స్వామి మంటపమునకు ఎడమవైపు 'సన్‌డయల్' అని పిలువబడే యంత్ర నిర్మాణము యాత్రికులకు సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతుందనటంలో ఎట్టి అతిశయోక్తి లేదు. సూర్యుని నీడ ఆధారంగా కాలనిర్ణయం తెలిపే ఈ యంత్రమును 1943లో నిర్మించినట్లు చెబుతారు. కొండమీద అనేక వసతి గృహాలు, స్నానమాచరించడానికి స్నానపు గదులు, వ్రత మంటపము, దేవాలయము ముందు మెట్ల దారిలో భోజనాలయము భక్తులకు ఉపయోగపడుచున్నది. కొండ దిగువ భాగమున వివిధ కులములకు చెందిన హోటళ్ళు వివాహ సమయంలో రద్దీగా ఉండి కళకళలాడుతూ ఉంటాయి. పవిత్ర పంపానది తీరాన గల అన్నవరం క్షేత్రములో శ్రావణ శుద్ధ విదియనాడు స్వయం వ్యక్తమైన శ్రీ సత్యదేవుని దర్శనం శుభప్రదం. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు దర్శనం చేసుకునే అవకాశము కలదు. యాత్రికులకు ప్రసాదము 24 గంటలు ఈ దేవస్థానము వారిచే విక్రయించబడుచున్నది. ఈ దేవాలయంలో శాశ్వత కళ్యాణము చేయించుకొను భక్తులు 3000/–, శాశ్వత విశిష్ట వ్రతము 1116/–, శాశ్వత ప్రత్యేక వ్రతము 500/–, శాశ్వత వ్రతము 300/–, శాశ్వత నిత్యపూజకు 250/–, గోత్రనామ పూజకు 35/– రూపాయలు చెల్లించవలసి ఉంటుంది. వైశాఖ శుద్ధ దశమి నుండి వైశాఖ బహుళ పాడ్యమి వరకు శ్రీ స్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

ఇచ్చుటి క్షేత్ర దేవత సీతారామస్వామి. స్వామివారు మొదట కొండపైన కనుపించిన ప్రాంతమునే క్షేత్రపాలకునిగా శ్రీ సీతారామస్వాములవారిని ప్రతిష్ఠించారు.

నిజం చెప్పాలంటే ఇది చారిత్రకమైనది. ఈ కలియుగంలో 1891 సం॥లో ఖరనామ సం॥ శ్రావణ శుద్ధ విదియనాడు, ఒక అంకుడు చెట్టు వద్దగల పెద్ద పొదలో త్రిమూర్తులు కలిసిన దివ్య స్వరూపంగా ఇది దర్శనమిచ్చింది. ఈ విషయాన్ని సత్యదేవుడు కలలో స్వయంగా ఈరంకి ప్రకాశరావు అనే భక్తునకు, అలాగే అప్పటి జమీందారు ఇనుగంటి వెంకట్రామా రామాయణింగారికి తెలియబరిచాడు. ఆ రకంగా స్వామి ఎవరికి తెలియని నేరేళ్ళమ్మ గుడి ప్రక్కనగల కొండమీద ఆవిర్భవించారు.

ఇక్కడి ఆలయం విశేషం. స్వామి త్రిమూర్త్యాత్మకంగా కనుపించడం, "గణపతి – ఆదిత్య – కాత్యాయని – శివ– విష్ణుస్వరూప పంచాయతనంపై "మహా వైకుంతనారాయణ" యంత్రంతో ప్రతిష్ఠించబడటం మరొక విశేషం. గర్భగుహ ప్రారంభంలో బ్రహ్మ, మధ్యలో శివుడు, అగ్రభాగాన శివ కేశవ స్వరూపంగాను, అచ్చుటి యంత్రాలయాన్ని దర్శించవచ్చును. అచ్చుటి అమ్మవారు "అనంత లక్ష్మీసత్యవతి" దేవి.

స్వామివారు ఆవిర్భవించిన శ్రావణ శుద్ధ విదియనాడు జయంత్సుత్యవం, వైశాఖ శుద్ధ ఏకాదశినాడు కళ్యాణము, శ్రీరామనవమినాడు క్షేత్రపాలకులకు కళ్యాణం జరుపండుతుంది. తిరుపతి తర్వాత చెప్పుకో దగ్గది – నిత్య కల్యాణం పచ్చతోరణమనదగ్గది – స్వామివారు తనంతట తాను వెలిసిన ఈ దివ్యక్షేత్రం.

## దక్షిణకాశి - ద్రాక్షారామం



పంచారామాల్లో ద్రాక్షారామం ఒకటి. అలాగే త్రిలింగ క్షేత్రాలలో శ్రీశైలం, శ్రీకాళహస్తి, ద్రాక్షారామాలను "త్రిలింగ"ములంటారని, వీటి మధ్య దేశాన్ని త్రిలింగ దేశమంటారని చరిత్ర చెప్పిన సత్యం. అందులో ఈ ద్రాక్షారామం ఒకటి. పవిత్ర గోదావరి మండలంలో దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన ఈ ద్రాక్షారామం రామచంద్రపురం (తూర్పుగోదావరిజిల్లా)నకు 6 కిలోమీటర్ల దూరంలోనూ, రాజమండ్రికి 50 కి.మీ. దూరం లోనూ ఉంది. శివ పురాణం ప్రకారం కుంభకర్ణుడి కుమారుడు భీముడు ఈ ఆలయాన్ని నిర్మించి నందున దీనికి భీమేశ్వర ఆలయం అని పేరు వచ్చినదంటారు.

మరొక పురాణ కథనం ప్రకారం ఇక్కడ దక్షయజ్ఞం ధ్వంసం జరిగినది. కనుక దీనికి దక్షారామమని పేరు వచ్చిందని కాలక్రమంలో 'దక్షారామం' ద్రాక్షారామమయిందని చెపుతారు. చారిత్రాత్మకంగా ఈ ఆలయం 9వ శతాబ్దములో భీముడు నిర్మించినట్లు తెలుస్తోంది. చాళుక్యరాజు భీముడు తరువాత సుమారు 2 వందల సంవత్సరాల పిదప కొన్ని మంటపాలను, ఆలయంలో ఉన్న ప్రదక్షిణ మంటపాన్ని కుమారరెడ్డి అనే రాజు నిర్మించినట్లు తెలుగు శాసనంలో ఉంది. రామచంద్రపురం సంస్థానాధీశులు రాజా కాకర్లపూడి వంశీయులు ఆ ఆలయానికి ధర్మకర్తలు.

భీమేశ్వరం ఆలయంలో శివలింగం 15 అడుగుల ఎత్తు ఉంటుంది. ఇది 2 అంతస్తుల ఆలయం. మొదటి అంతస్తు చీకటిగా ఉండుట వలన దీనిని చీకటి కోణం అంటారు. ఇక్కడి శివలింగం రోజురోజుకూ పెరిగి పోతుండటం వల్ల స్వామి ఆదేశం మేరకు మేకు దిగగొట్టడం వల్ల పెరగడం ఆగి పోయిందని చెబుతారు. ఈ కారణంగా శివలింగం చివర చిట్లినట్లుగా ఉంటుంది. ఇక్కడ స్వామివారి దేవేరి పేరు మాణిక్యాంబ అష్టాదశ పీఠాల మహారాణి ఈ తల్లి. కార్తీక పౌర్ణమి పర్వదినమున జ్వాల తోరణం, మాఘ శుద్ధ ఏకాదశి రోజున భీమేశ్వర కళ్యాణం జరుగుతాయి. ఈ దేవాలయము నకు క్షేత్రపాలకులు అయిన లక్ష్మీనారాయణులకు కూడా అదే రోజు కళ్యాణం జరగడంవల్ల శివ – కేశవులకు ఒకేసారి కళ్యాణం ఈ క్షేత్రములో మాత్రమే జరుగుచున్నది. ఆలయానికి ఆనుకుని ఉన్న సప్త గోదావరి కొలనులో స్నానమాచరిస్తే సకల పాపములనుండి విముక్తి పొందగలరని పెద్దల, భక్తుల విశ్వాసం. ఇక్కడి బావినీరు తియ్యగావుంటే, వూళ్ళోని బావులన్నీ ఉప్పు నీటితో వుండటమొక విశేషం. వూరందరికి దాహార్తి ఈ మంచినీటి బావే తీరుస్తుంది.



ఒకసారి కాశీలో తన శిష్యులతో వుండే వేదవ్యాసునికి వారంరోజులపాటు శివుడు ఆహారం దొరకకుండా చేస్తాడు. దాంతో కోపమొందిన వ్యాసుడు కాశీక్షేత్రాన్ని శపించబోతే, క్షేత్రదేవతయైన విశాలాక్షి అన్నపూర్ణగా, వ్యాసునికి, ఆతని శిష్యులకు భోజనం పెడుతుంది. "అమ్మను తిడతావా?" అంటుంది. కడుపు మంటనిలాగ ... అంటుంటే, కడుపునిండిన వ్యాసునితో శివుడు "ఇన్ని పురాణాలు వ్రాశావు. ధర్మాలు చెప్పావు. కర్మ అనివార్య మన్నావు. నువ్వు చేసిందేమిటి? నువ్వు నీ శిష్యులు ఈ కాశీని విడిచిపెట్టండని ఆదేశిస్తాడు.

తనకే ఈ దుస్థితి దాపురించేసరికి, విధిలేక అక్కడనుండి ఈ ద్రాక్షారామానికి వచ్చి తపోమూర్తి అవుతాడు. వ్యాసుని రాకవలన ద్రాక్షారామం, 'దక్షిణ కాశి'గా ప్రసిద్ధి చెందింది. ఇటువంటి దివ్యక్షేత్ర సందర్శనం "సర్వపాపహరం".

## సామర్లకోట 'కుమరారామం'

"పంచారామాలు" అని చెప్పబడే ఆరామాలలో ఒకటైన 'కుమారారామం" ఈ వూరిలోనే వుంది. ఆ ఆరామం వున్న ప్రాంతాన్ని పాతసామర్లకోట అంటారు. అక్కడ స్మశానం వుంది. అందులోనే ఈ అపురూప ఆలయం, మహాద్భుత శిల్ప సంపదతో సర్వదేవతలతో, అడుగడుగునా గుడి, అందులో చెప్పలేని దేవుని రూపం.... ఓపికగా మొత్తం ఆలయాన్ని దర్శిస్తే ధన్యులమయ్యామనిపిస్తుంది.




నిజానికీ రచయితకు ఈ ఆలయంగూర్చి తెలియదు. ఒకానొక సమయంలో, ఈ రచయితకు కలలో స్వామి ఈ దివ్యారామాన్ని దర్శింపచేస్తాడు. ఆ సమయంలో రచయిత మామగారు సామర్లకోట లోని బియ్యపు మిల్లులో గుమస్తా. వారిని చూడటానికి అక్కడికి వెళ్ళినప్పుడు "అయ్యా! ఇక్కడ ఈ పరిసరాలలో, చరిత్ర ప్రసిద్ధి గాంచినది, చెప్పుకోతగ్గది, పురాతనమైనది, పురాణకాలానికి సంబంధించిన ఆలయం వుండాలి. ఎక్కడో తమకు తెలుసా?" అంటే ముందు ఇక్కడేం లేదన్న మామగారు...

ఆ ..... పాతసామర్లకోటలో శివాలయం వుంది. అది ప్రాచీనమైందే. కాకపోతే ప్రొద్దున్నేవెళ్ళి, సాయంకాలానికి తిరిగి వచ్చేయాలి. అది స్మశానంలోవుంది. అక్కడెవరు ఉండరు. ఇక్కడ నుండి పూజారిని తీసుకుని వెళ్ళాలన్నారు. ఆ రకంగా దైవప్రేరణతో శివాజ్ఞతో ఆ ఆరామం దర్శించడం జరిగింది. నిజంగా అపురూపమైంది. ఇక్కడి దేవుడు భీమేశ్వరుడు. ద్రాక్షారామవాసి, ఈ కుమారారామ వాసి, ఇద్దరు భీమేశ్వరులే. ఇక ఆలయాలు కూడా ఒకే రకంగా వున్నా కుమారారామం, ద్రాక్షారామం కన్న విశాలమైనది.

క్రీ॥శ॥ 892 నుండి 922 వరకు ఈ ప్రాంతాన్ని పాలించిన చాళుక్యభీముడు ఈ ఆలయాన్ని నిర్మించడం జరిగింది. ఆయన పేరునే స్వామికి భీమేశ్వరుడని పేరు వచ్చింది. ఆ తరువాత 14, 15 శతాబ్దాలలో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన రెడ్డిరాజులు ఈ ఆలయాన్ని బాగా అభివృద్ధిపరిచారు. నిత్యనైవేద్య దీపారాధనలకు మాన్యాలను కూడా ఏర్పాటుచేసారు.

వివిధ సమయాలలో ఈ ఆలయాన్ని దర్శించిన ప్రభువులు, మండలాధీశులు, చేసిన దానాల వివరాలు శాసనాలుగా ఈ ఆలయం గోడలనిండా పరుచుకున్నాయి.

చెప్పుకోవడానికి వూరు, చరిత్రలేని, ఆ పాతసామర్లకోటలోని ఈ ఆలయం – అతిపురాతనమైన ఆలయం. పరమ ప్రశాంతతను, భక్తిముక్తులను కోరేవారు తప్పక దర్శించవలసిన దివ్య దేవతాక్షేత్రం.



విశాఖపట్నం – విజయవాడ రైలు మార్గములో సామర్లకోట జంక్షన్‌లో ఉన్న సామర్లకోట గ్రామంలో ఉన్న కుమారారామం (సోమారామం) భీమేశ్వరలింగం కుమారస్వామిచే ప్రతిష్ఠించ బడినది. పంచారామాలలలో ఒకటైన ఈ క్షేత్రము కాకినాడకు 13 కి.మీ. దూరంలో ఉంది. చాణుక్యుల కాలంలో అభివృద్ధి చెందిన ఈ దేవాలయము నకు సరిఅయిన గుర్తింపు లేక వెనుకబడి ఉంది. ప్రస్తుతం ఈ దేవాలయ ప్రాముఖ్యత భక్తులకు తెలిసి అభివృద్ధి జరుగుచున్నది.


దీనిని 9వ శతాబ్దంలో చాళుక్యభీముడు నిర్మించాడని ద్రాక్షారామాన్ని కూడా ఆతడే నిర్మించినందువలన రెండు ఒకేవిధంగా వున్నాయని చారిత్రకారుల ఉద్దేశ్యం. ఇక్కడి లింగం 9 అ॥ ఎత్తులో తెల్లగా వుంటుంది. రెండంతస్తుల ఆలయంలో పైన పూజారికాలు, ఇక్కడి అమ్మవారు బాలాత్రిపురసుందరి. 1340–1468 సం॥ల మధ్యకాలంలో కాకతీయరాజులు ఈ ఆలయం కొంతభాగాన్ని పునర్నించినట్లు తెలుస్తోంది. ఒకపెద్ద కోటలా వుండే ఈ ఆలయం అపురూప శిల్పకళా సంపదతో నిజభక్తులకు పరతత్త్వకారిణిగా చెప్పవచ్చును. ఊయలమంటపం, నూరుస్తంభాలమంటపమేకాదు ఆలయం చుట్టుకల గూళ్ళలో సర్వదేవతలున్నారు. ఇన్నిచోట్ల శివలింగాలు దరిశన మిస్తాయి. చూడాలిబాబూ! అనే కళ్ళకు ఇది నయనానందమనే చెప్పాలి. ఇక్కడి పుష్కరిణి స్నానం సర్వపాపహరణ మంటారు.

ఈ క్షేత్రమునకు 4 కి.మీ. దూరంలో ఉన్న పెద్దాపురం గ్రామంలో శ్రీ సూర్యనారాయణస్వామి దేవాలయం ప్రసిద్ధి చెందినది. పాండవులమెట్టపై ఉన్న ఈ దేవాలయం నుండి రాజమండ్రికి సొరంగమార్గం ఉన్నదని అజ్ఞాత వాసకాలంలో పాండవులు దీనిని ఉపయోగించారని అందువలనే ఈ మెట్టకు పాండవుల మెట్ట అని పేరు వచ్చినదని గ్రామస్తులు చెబుతారు.





## శ్రీపాద శ్రీవల్లభస్వామి - పిఠాపురం



ప్రముఖ దత్తపుణ్య క్షేత్రములలో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలోని పిఠాపురం ప్రధమ స్థానం, దత్తావతారమైన శ్రీ పాద శ్రీ వల్లభస్వామి జన్మస్థలమే ఈ పిఠాపురం. ఇది ప్రాచీన దత్తావతారక్షేత్రములలో మొదటిది. శ్రీ దత్తాత్రేయులు పీఠికాపురం (పిఠాపురం)న శ్రీమతి సుమతి, అప్పలరాజు పుణ్య దంపతులకు ఉదయించి శ్రీపాద శ్రీ వల్లభ అను పేర దత్తుని ప్రధమావతారంగా "శ్రీపాద శ్రీవల్లభులుగా" ప్రసిద్ధులైనారు.

ఈ పుణ్యక్షేత్రము విజయవాడ – విశాఖపట్నం మధ్య సామర్లకోట రైల్వేస్టేషను నుండి సుమారు 12 కి.మీ. దూరములో ఉన్నది. ఈ పుణ్య క్షేత్రమునకు మన రాష్ట్రము నుండి కాక యితర రాష్ట్రముల నుండి వచ్చు భక్తుల సౌకర్యార్ధము శ్రీ పాద శ్రీవల్లభ సంస్థానం వారు ఒక వసతి గృహము ఏర్పాటు చేసిరి. ఈ సంస్థానమునకు ఆనుకుని శ్రీపాద శ్రీవల్లభదేవాలయం ఉన్నది. పిఠాపురంలోని శ్రీ కుక్కటేశ్వర ఆలయములో ఔదంబర వృక్షము క్రింద శ్రీ దత్తమందిరం ఇక్కడకు విచ్చేసిన యాత్రికులకు పుణ్యస్థలము. ఈ దేవాలయము ముందు ఉన్న కోనేరులో భక్తులు స్నానమాచరించి పితృతర్పణము చేయుదురు. ఇక్కడ చేసే శ్రాద్ధకార్యాలు గయక్షేత్రంలో జరిపిన పుణ్యాన్ని ప్రసాదిస్తుంది.

అష్టాదశ పీఠాలలో ఒకటైన ఈ పీఠికాపురం, 'పిష్టపుర'మనే పిఠాపురం చెప్పుకోదగ్గదేతప్ప – చరిత్రకందనిది. అధిష్ఠానదేవత "పురుహూతికాదేవి" అని చెప్పడానికేగాని, అందుకు ఆధారాలు లేవు. ఆలయం కనబడదు. కాకపోతే పాతబస్టాండు దగ్గరవున్న గ్రామదేవత ఆలయం దగ్గర భూమిలోకి ఒక పాతాళబిలమున్నదని, అందులో అమ్మ అదృశ్యరూపంలో వుందని స్థానికులు చెబుతారు.

దీనిని "పాదగయా" క్షేత్రమంటారు. దీనిని గూర్చి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

పూర్వం గయాసురుడనే రాక్షసుడుండేవాడు. అతడు అమ్మవారు పురుహూతికాదేవికి మహాభక్తుడు. ఆ తల్లి కరుణతో అద్భుతవరాలు పొందాడు. ఇంద్రాదులను జయించి, యజ్ఞహవిర్భాగాలను పొందుతుండేసరికి, దేవేంద్రుడు తన పరివారంతో త్రిమూర్తులను దర్శించి తనగోడు చెప్పుకుంటాడు. దానికి త్రిమూర్తులు బ్రాహ్మణవేషాలతో గయాసురుని దర్శించి "లోకకల్యాణార్థం తాము యజ్ఞం చేస్తున్నామని దాని తీవ్రతను భూమి భరించలేదు కనుక మహాభక్తుడవైన నీవు నీ శరీరాన్ని అర్పిస్తే విశ్వకల్యాణం జరుగుతుందంటారు.

ఏడు రోజులు జరిగే ఈ యజ్ఞంలో నువ్వు స్థాణువులాగ వుండాల్సిందే తప్ప కదలరాదని షరతుపెట్టి మరో యజ్ఞం ప్రారంభిస్తారు. ఆరు రోజులు గడిచాయి. అమ్మ దయతో అతడు విగ్రహంలాగవుండిపోయాడే తప్ప కనీసం ఒక్కసారైనా వూపిరి పీల్చలేదు. దీంతో శివుడు, ఇతన్ని మాయోపాయంతోనే సంహరించాలని తలచి, ఇక కొద్దిగడియలలో ఏడవరోజు పూర్తవుతుంది కాబట్టి "కుక్కుటం" కోడివలె కూస్తాడు. ఆ కుక్కుటమే మనంచూసే "కుక్కుటేశ్వరుడు".

గయాసురుడు కదులుతాడు. మాటతప్పావని విష్ణువు తన చక్రంతో అతన్ని సంహరిస్తే అతని శరీరం మూడుముక్కలవుతుంది. శిరస్సు గయాక్షేత్రంగాను, మొండెం ఒరిస్సాలోని జాజ్‌పూరులోను, పాదాలు పిఠాపురంలోను పడ్డాయి. ఇవి వరుసగా "శిరోగయ, నాభిగయ, పాదగయ"లుగా ప్రసిద్ధిగాంచాయి.

ఇక్కడ ఈశ్వరుడు అధిదేవత, అమ్మవారు "రాజరాజేశ్వరి" ఆరాధ్యదేవతలుగా విలసిల్లుతున్నారు. ఈ కుక్కుటేశ్వర ఆలయంలోని కుడివైపు చివరన "దత్తాత్రేయుని" ఆలయం వుంది. దీనిని మొదట్లో బ్రహ్మదేవునిగా తలచేవారు. తరువాతి కాలంలో క్షేత్ర స్థలపురాణాల సమీక్షనుబట్టి దానిని దత్తాత్రేయ మందిరంగా తీర్మానించారు. ఈ క్షేత్రానికి, దత్తునికి గల సంబంధమే ఈ నిర్ణయానికి గల ప్రత్యేక కారణం.

ఈ వూళ్ళో ... అనగనగా కాదుకాని, ఓ మూడు వందల సం॥కు ముందు, అప్పలరాజశర్మ, సుమతి అనే దంపతులుండేవారు. వీరు దత్తభక్తులు. ఒకనాడు వీరింట, పితృతిథినాడు యువకునిగా దత్తుడు వచ్చి భిక్ష అడుగుతాడు. నిజానికారోజు పితృదేవతలకు తప్ప, ఇతరులకు భిక్ష వెయ్యరు. ఆతిథ్యమివ్వరు. అయినా ఆ యువకుని చూసిన ఆనందంలో, ఆతని తేజస్సుకు మురిసి ఇంటి ఇల్లాలు సుమతి భిక్షనిస్తుంది.

"అమ్మా" అని ఆ కుర్రవాడు పిలిచి, నాకు భిక్షనిచ్చావుకాబట్టి, నీకేం కావాలో కోరుకో!"మంటాడు. యాంత్రికంగానే ఆ తల్లి సుమతి "అమ్మా! అన్నావుకాబట్టి ఆమాటను నిజంచేసి పుత్రునిగా పుట్టమని కోరుతుంది. తథాస్తు!.."అంటాడు. పుత్రునిగా పుడతాడు. అతడే శ్రీపాదశ్రీవల్లభుడు. ఆంధ్రదేశంలో వెలిసిన శ్రీదత్తుని ప్రథమావతారం.

తల్లిదండ్రులకు ఆనందం, అంతకు ముందే వున్న అన్నలకు జీవితం ప్రసాదించి, విశ్వకల్యాణమూర్తి యౌతాడు. ఇటువంటి దివ్యక్షేత్ర దర్శనం సర్వపాపహరమేకాదు, సర్వాభీష్టదాయకం. ఇంకో విశేషం. ఇక్కడి కుక్కుటేశ్వర ఆలయంలో శ్రీదత్తుని వెనుకభాగంలో "పంచగురు" క్షేత్రం నిర్మితమైంది. దీనిని నిర్మించాలనే ఆలోచన, జగద్గురు దత్తాత్రేయ మహాసంస్థానాధిపతులు, దత్తావతారులుగా విఖ్యాతులైన శ్రీశ్రీశ్రీ విఠలానందసరస్వతి మహారాజు, శిష్యకోటిలోని శ్రీ వాడ్రేవు శ్రీనివాసరావుకు వచ్చి, శ్రీపాద శ్రీవల్లభుల కరుణతో "పంచగురుసన్నిధి" రూపుదిద్దుకుంది.

## పంచమాధవులలో ఒకరు కుంతీ మాధవస్వామి - పిఠాపురం



ఆంధ్రప్రదేశ్‌లోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రములలో పిఠాపురంలోని కుంతీ మాధవస్వామి క్షేత్రము ప్రసిద్ధమైనది. కృతయుగమున దేవేంద్రునకు వృత్రాసురుని సంహరించుటచే బ్రహ్మ హత్యాపాపము సంభవించింది. పాపనివృత్తికై శాస్త్రోక్త రీత్యా నారాయణోపనిషత్తులో చెప్పబడిన పంచాత్మ (భూతాత్మ, ఇంద్రియాత్మ, ప్రధానాత్మ, ఆత్మ, పరమాత్మ) రూపుడగు శ్రీమన్నారాయణుని పంచమాధవుల పేర భూలోకమున దేవేంద్రుడు ప్రతిష్టించాడు. ఈ పంచమాధవులు కాశిలో బింధుమాధవ స్వామి, ప్రయాగలో వేణుమాధవస్వామి, పద్మనాభం (కేరళ) లో సుందర మాధవ స్వామి, రామేశ్వరంలో సేతు మాధవస్వామి, పిఠాపురంలో కుంతీ మాధవస్వామిగా పూజలందు కొనుచున్నారు.

ప్రధానాత్మ అయిన మాధవస్వామిని ద్వాపర యుగమున కుంతీదేవి అర్చించి తరించగా కుంతీమాధవ స్వామి పేరు సార్ధకమయ్యెను. పిఠాపురంలో తూర్పుగా ఉన్న శ్రీ మాధవస్వామి ఆలయమునకు ఉత్తర గోపురంతో వైకుంతనాధుని వలె దశావతార మకర తోరణ శోభతో శ్రీ భూసమేతులైన శ్రీకుంతీ మాధవస్వామి దర్శనమిస్తారు. వైకుంత ఏకాదశినాడు భక్తులు స్వామికి ఉత్తరముగా ఉన్న ద్వారము గుండా వెళ్ళి దర్శనం చేసుకుని తమ భక్తి ప్రపత్తులను చాటుకుంటారు. ఏకాదశినాడు భక్తులు తిరుమంజనోత్సవము జరుపుతారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అనురీతిగా ఇక్కడి లక్ష్మిదేవి మాతృదేవిగా, శ్రీమాధవస్వామి పితృదేవునిగా, శ్రీరామానుజులు ఆచార్య దేవునిగా దర్శినమిస్తారు. ఈ పిఠాపురం క్షేత్రములోనే కుక్కుటేశ్వరస్వామి, గయాసురుని పాదస్థానమైన పాదగయ క్షేత్రములుకూడా కలవు.

## సర్పవరం - భావనారాయణస్వామి



సామర్లకోట – కాకినాడల మధ్యగల జంక్షన్ సర్పవరం. ఈ వూళ్ళో చెప్పుకోదగ్గ ఆలయం వున్నదని యాత్రికుడనేవాడికి తెలియదు. చుట్టుప్రక్కలవారికి అసలు తెలియదు. ఇటువంటి మహోద్భుతమైన “కుమారా రామం, ద్రాక్షారామాల శైలికి సంబంధించిన దివ్యాలయ మొకటి వుంది. అదే భావనారాయణస్వామి ఆలయం.
తొమ్మిది, పది శతాబ్దాలనాటి చాళుక్యులు ఈ ఆలయ నిర్మాణం గావించారు. ఎంతో విశిష్టంగా విశాలంగా,

అపురూపంగా నిర్మించబడిన ఆలయం, కోటగోడలవంటి రెండు ప్రాకారాలు కల్గివుంది. రెండవ ఆవరణంలో భావనారాయణస్వామి ఆలయం వుంది. ఆలయం చుట్టు నాలుగు విశాలమైన మండపాలు, పొడుగైన ముఖమంటపము, అంతరాలయం వున్నాయి.

ఒకానొకప్పుడు నారదుడు తనంతటి జితేంద్రియుడు లేడని అనుకుంటుంటే, 'నిజమే. నువ్వు ఇంద్రియ నిగ్రహుడివి' అంటూ తీసుకువెళ్ళి ఒక కొలనులో స్నానం చేయిస్తాడు విష్ణుమూర్తి. అంతే నారదుడు తన వునికిని కోల్పోయి, చక్కని అందమైన స్త్రీ అవుతాడు. ప్రక్కనేగల పిఠాపురాన్ని పాలించే రాజు దగ్గరకు వెళ్ళి నువ్వు తండ్రిగా నాకు వివాహం చెయ్యమని కోరింది. ఎంత ప్రయత్నించినా రాజు వివాహం చేయలేకపోతాడు. చివరకో బోయవాడు ఈమెను పెండ్లి చేసుకుంటాడు. అరవైమంది పిల్లలకు తల్లి అవుతుందామె. ఇలాగ కాలం గడుస్తున్న తరుణంలో, దైవకృపగా, పూర్వస్మృతికలిగి, తాను ఏ కొలనులో స్నానంచేసి ఆడదిగా మారిందో, ఆ కొలనులో స్నానం చేసేసరికి పూర్వనారద రూపం వస్తుంది. కాని ఆడవారిచేతికుండే గాజులు మాత్రం నారదుని విడువలేదు. దీంతో శ్రీమహావిష్ణువుగూర్చి పదివేల సం॥లు, ప్రస్తుత మీ ఆలయంవుండే ప్రాంతంలో తపస్సు చేస్తాడు. విష్ణువు ప్రత్యక్షమయి, నారదుని చేతిగాజులను తొలగిస్తాడు. దాంతో వినయవిధేయతలను పుణికిపుచ్చుకుంటాడు. విష్ణుమాయకు వందనశతాలు అర్పిస్తాడు. నారదుని గర్వభావాన్ని తొలగించినందువలన, స్వామి "భావనారాయణు" డయ్యాడు.

ఆలయం వెనుక ప్రక్కనే ఓ చిన్న గది వుంది. అక్కడ నారదుడు తపస్సు చేసాడుట. దీనికి కొంచెం దూరంలో గల చెరువులో స్నానం చేసి, మాయోపాయాలకు లొంగిపోయాడుట. అందుకని ఈ చెరువును "నారదకుండ"మని పిలుస్తారు.

పురాణ కథ ఎలాగవున్నా, తెలుసుకోవాలన్నా, తెలియని పరమరహస్యంగా వున్న ఈ అద్భుత శిల్ప నిర్మాణ శైలిగల ఆలయాన్ని దర్శించడం, మనలను ధన్యులను చేస్తుందనడంలో ఆశ్చర్యం కనబడదు.



## క్షేత్రపాలక శ్రీ వేణుగోపాలస్వామివారి క్షేత్ర మహిమ - ఆలయ ప్రాముఖ్యము - రాజమండ్రి



రాజమహేంద్రవర పట్టణములో అతి ప్రాచీన కట్టడములలో శ్రీ వేణు గోపాలస్వామి వారి ఆలయం ఒకటిగా ఒప్పుచున్నది. దీనికి ఆధారముగా చరిత్ర ఏమియు లేకున్నను వాడుకలో నున్న కథ ఆధారముగా శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామివారు మూలవిరాట్టు (విగ్రహము) 13వ శతాబ్దము నాటిదనియును, అప్పటికే నేటి 1వ పట్టణ ఠాణా, మెయిన్‌రోడ్ (రాజవీథి) లో నున్న పోలీసుస్టేషను ప్రక్కన తూర్పు సింహద్వారములో ఉన్నదనియు, దరిమిలా 13వ శతాబ్దములో మహమ్మదీయుల దండయాత్రలో శ్రీ అల్లాఉద్దీన్ ఖిల్జీవారి సేనాధిపతి అయినటువంటి రుస్తుంఖాన్ శ్రీ స్వామివారి మూలవిరాట్టును పెకలించివేసి ఆలయమును మసీదుగా మార్పు చేసినారట. నాటి హిందూ దేవాలయ చిహ్నములు నేటికినీ పెద్ద మసీదునందు కొట్టవచ్చినట్టుగా కన్పిస్తున్నాయి.

మన హిందువులు రాజవీథిలో భద్రత లేదని తలచి సదరు మూలవిరాట్టును భద్రముగా గోదావరీ నదీ తీరమునందు, కంభం వారి సత్రం వీథి ప్రక్కసందులో 17వ శతాబ్దిలో ప్రతిష్ఠించడం జరిగింది. పూర్వ వైభోగమును వచ్చుటకు ఎంతో శ్రమపడినారు. 18వ శతాబ్దిచివర శ్రీ స్వామివారి ఆలయమును దివ్య క్షేత్రముగా మలచబడినది. తదుపరి సుమారు 1930-40 ప్రాంతములో శ్రీ కూర్మారెడ్డినాయుడు జమీందారువారు శ్రీ స్వామివారి యందుగల భక్తి ప్రపత్తులకు చిహ్నంగా కోలంక గ్రామంలో కల భూమి శ్రీ స్వామివారికి కైంకర్యము చేయుటయేకాక, విలువైన ఆభరణములను కూడ సమర్పించుట జరిగినది. అంతయేకాక వారి కుమార్లు ముగ్గురకు శ్రీ స్వామివారి పేర్లుంచుట జరిగినది. భక్తుల మనోభీష్ట సిద్ధి నెరవేర్చుట శ్రీ స్వామివారి కరుణాకటాక్షముల వల్లనే అని నిరూపించు ప్రత్యక్షసాక్ష్యం శ్రీ కూర్మారెడ్డి నాయుడుగారు మద్రాసు- ఆంధ్రా, గవర్నరుగా నియమింపబడుటమొక నిదర్శనం.



హనుమాన్ దేవాలయం, రాజమండ్రి



శ్రీసారంగధరేశ్వర దేవాలయం, రాజమండ్రి

## జగన్మోహిని కేశవస్వామి ఆలయం - ర్యాలి గ్రామం

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట తాలూకా ర్యాలీ గ్రామంలోని జగన్మోహిని – కేశవస్వామి ఆలయం ఎందరో భక్తులను పునీతులు గావిస్తోంది. ఈ గ్రామం రావులపాలెంకు 6కి.మీ. దూరంలో ఉంది. రాజగోపురంతో, అంతరాలయంతో, గర్భగుడిలో అలరారే ఈ దేవాలయములో చెయ్యివేస్తే జారిపోయే సాలిగ్రామశిల అద్భుత శిల్పకళా సంపదతో విరాజిల్లుతూ చూడముచ్చటగా ఉంటుంది.



నల్లరాతిపై చెక్కబడిన ఈ దేవాలయములో విగ్రహము ముందు భాగమున విష్ణుమూర్తి శంఖ, చక్ర, గదా పద్మములతో కూడిన వార్రై ఉన్నారు. వెనుక భాగమున స్త్రీ మూర్తిగా కనిపించే జగన్మోహిని భక్తులకు దర్శనమిస్తుంది. కాకతీయ శిల్పాలతో పోల్చిచూస్తే ఈ శిల్ప చాతుర్యం అత్యున్నత స్థాయికి చెందినది. 5 అడుగుల ఎత్తు 3 అడుగుల వెడల్పుతో జీవకళ ఉట్టిపడేలా ఉండే ఈ ఏకశిలా విగ్రహం ఒకరిచేత తయారు చేయబడినది కాదని కొందరు భావిస్తున్నారు. విష్ణువు శిరస్సున కిరీటము, నుదుట ఎరుపు, తెలుపులనామము, చెవులకు మకర కుండలములు, మెడలో కౌస్తుభమణిహారము, వనమాల, రత్నహారములు కలవు. విష్ణువు చతుర్భాహువుల యందలి శంఖము, చక్రము, గద, పద్మములతో ఎడమ చేతిలోని చక్రము, అభయహస్తములోని పద్మము ప్రస్తుతంలేవు. ఈ విగ్రహము నందలి ప్రతీ భాగమున విశ్వమండలి సర్వలావణ్యం ఇమిడియున్న దేమోనన్న భావన ప్రతి కళాకారుడికి కల్గుతుంది. విష్ణువు కుడివైపు క్రింది భాగములో శ్రీదేవి, ఎడమవైపున భూదేవి, శ్రీదేవి ప్రక్కన రుక్మిణిదేవి, భూదేవి ప్రక్కన సత్యభామ, పాదముల దగ్గర గరుత్మంతుడు చేతులు జోడించి నమస్కరిస్తున్న భంగిమలో స్పష్టంగా కన్పిస్తారు. రెండు పాదముల మధ్య ఎప్పుడూ నీరు స్రవించటం మహాద్భుతం.

ఇక స్వామి వెనుకవైపు మోహిని రూపంతో స్త్రీ రూపం ఎంతో సుందరంగా కనులు చెదిరే విధంగా ఉంటుంది. గోచిపోసిన చీరకట్టు, రవిక కట్టుకున్నట్లుగా దాని అంచు, పమిటచెంగు వెనుక భాగమున వ్రేలాడటం, చేతులకు దండ పట్టీలు, సిగలో పారిజాతపు పువ్వుతో అలంకరించుకోవటం ఈ జగన్మోహిని ప్రత్యేకత. జగన్మోహిని – కేశవస్వామి దేవాలయానికి ఎదురుగా కొద్ది దూరంలో శివాలయం ఉంది. ఈ ఆలయంలో గర్భగుడిలో అభిషేకం జలం ఇంకి పోతుంది. ఇలాంటి సోమసూత్రం లేని ఈశ్వర ఆలయం భారతదేశంలో మరెక్కడా లేదు. ఈ రెండు దేవాలయములు ఎంతో ప్రసిద్ధి చెంది భక్తుల కోరికలను తీరుస్తూ ర్యాలి పుణ్యక్షేత్ర విశిష్టతను చాటి చెప్పుచున్నవి.

అమృతమధనం జరిగిన తర్వాత శ్రీమహా విష్ణువు జగన్మోహినిగా అవతరించి, దేవాసురులను సమ్మోహన పరిచాడనేసరికి, ఆ రూపం తాను చూడాలనుకుంటాడు శివుడు. ఆ జితేంద్రియునికి మానసోల్లాసం కలిగించాలని,



చూస్తూండగా మహావిష్ణువున్నా ప్రదేశంలో కనుపించిన జగన్మోహినిని చూసి, శివుడు – ఆశ్చర్యం, ఆవేశం పొందుతాడు. విష్ణువును కౌగలించుకోబోతాడు. తక్కున జగన్మోహిని అదృశ్యమై, మరల యధాప్రకారం శ్రీహరి దర్శనం కలుగుతుంది. ఈ సమయంలో జగన్మోహిని తలనుండి ఒక పువ్వురాలి పడిందట. దాంతో ఆ గ్రామం 'ర్యాలి' అయిందట.

మరొక కథనం ప్రకారం ఈ ప్రాంతాన్నేలే (11వ శతాబ్దంలో) విక్రమదేవవర్మ అనే రాజుకు, శ్రీహరి కలలో కనుపించి తానిక్కడ శిలారూపంలో వున్నానని, ఈ ప్రాంతంలో రథాన్ని త్రిప్పితే, దాని చక్రశీల ఎక్కడ రాలిపడుతుందో, అక్కడ తాను దర్శనమిస్తానని చెప్పడం, రాజు శ్రీహరి ఆదేశాన్ని శిరసావహించడం జరుగుతుంది. రథ చక్రశీల ఇక్కడ రాలడంవలన స్వామి ఆవిర్భావం, గ్రామానికి "ర్యాలి" అని పేరు రావడం జరిగిందని స్థల పురాణం.

కేశవస్వామి ఆలయానికి ఎదురుగా బ్రహ్మ సృష్టించిన కమండలేశ్వరస్వామి ఆలయం వుంది. అన్ని ఆలయాల కన్నా భిన్నంగా పాన పట్టంలేని శివాలయమిది. ఇక్కడి అభిషేక జలం ఎక్కడికి వెడుతుందో ఆ హరునికే తెలియాలి. కాకపోతే కేశవస్వామి ముగ్ధమోహన రూపాన్ని స్వామికి ఎదురుగా ఉండి, కమండలేశ్వరుడు దర్శిస్తూ, ఆనందిస్తున్నాడన్నది ఒక ఆనంద వాక్యం.

అపురూప శిల్ప సంపదకు, పుట్టినిల్లుగా భావించే ఈ క్షేత్ర దర్శనం – అందులో గంగతోకూడిన కేశవస్వామి దర్శనం సకలాభీష్టదాయకంగా గుర్తించి, దర్శించి, తరించమన్నది మా కోరిక.

## ఆధ్యాత్మికతా నిలయం - అంతర్వేది పుణ్యక్షేత్రము

తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి మండలంలో వశిష్ట గోదావరి సముద్రములలో కలిసే చోటున ఉన్న చిన్న గ్రామం అంతర్వేది. ఇక్కడ వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఆంధ్రప్రదేశ్ లోని పేరేన్నికగన్న పవిత్ర ఆలయాలలో ఒకటి.



బ్రహ్మ పురాణంలో గౌతమి మహత్యంలో స్థలపురాణం ఈ విధంగా తెలుపబడింది. బ్రహ్మదేవుడు కృత యుగమున మహారుద్ర యాగము చేసి

ఈశ్వర అనుగ్రహాన్ని పొందుతాడు. ఈ యజ్ఞశాలలోని అంతర్వేదిలో నీలకంఠేశ్వరుని ప్రతిష్ఠించాడు. వశిష్ఠ మహర్షి అక్కడికి గోదావరి నుండి పాయను తెచ్చి సముద్రములో కలిపాడు. సాగర సంగమస్థానంలో ఆశ్రమాన్ని నిర్మించుకుని నివసించాడు. గోదావరి పాయ వశిష్ఠగానూ, నది సముద్రం మధ్యలో ఉన్న ఆ స్థలాన్ని అంతర్వేదిగాను పిలుస్తారు.  వశిష్ఠుని ప్రార్థన మేరకు నరసింహుడు అర్చన యోగ్యమైన రూపంలో అక్కడ అవతరించాడని, వశిష్ఠుడు లక్ష్మీనరసింహస్వామిని ప్రతిష్ఠించాడని పురాణ గాథ తెలుపుతోంది. అంతేకాదు బ్రహ్మ కూడా ఇక్కడ యజ్ఞం చేసాడని ఇక్కడ నిర్మించిన "అంతర వేదిక" ప్రకారం, ఇది 'అంతర్వేది' అయిందని ఒక కథ. అంతర్వేదిలో మాఘశుద్ధ దశమినాటి రాత్రి స్వామివారి కళ్యాణం జరుగుతుంది. ఆ మరునాడు భీష్మఏకాదశి రోజున రథయాత్ర నిర్వహిస్తారు.

ఎక్కడెక్కడినుండో భక్తులు వస్తారు. నరసాపురం, పాలకొల్లు, రాజోలు, రాజమండ్రి నుండి బస్సుల సదుపాయం వుంది. బ్రహ్మాండమైన నిత్యాన్న దాన పథకం అమలవుతోంది.

## శ్రీశ్రీశ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి దేవస్థానం (మందపల్లి, తూ॥గో॥జిల్లా)



తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి అభిషేకం, ముఖ్యముగా శనివారం త్రయోదశి పర్వదినమునందు నువ్వుల తైలముతో చేస్తే భక్తుల శనిదోష పరిహారము జరుగునని పురాణాల ద్వారా చెప్పబడుచున్నది. ఈ దేవాలయములో అభిషేకము చేయించుకునే భక్తులు వ్యక్తిగతంగా గాని, పోస్టలు ద్వారా మనియార్డరు చేసి గాని అభిషేకము చేయించుకునే అవకాశము కలదు. ఈ అభిషేకము ఒకసారిగాని శాశ్వతముగా గాని చేయించుకొన వచ్చును. ఈ శనేశ్వర దేవాలయములో అభిషేకములు – వాటి రుసుముల వివరాలు కూడా దేవాలయ కమిటివారిని అడిగి తెలుసుకొన వచ్చును. ఇక్కడే క్షేత్ర మహత్యాన్ని సంక్షిప్తంగా తెలుసుకుందాం!

ఊరు చిన్నది, పేరుపెద్దది. శనిదోషం వున్నవారు ఈ క్షేత్రానికి స్వయంగాను, పోష్టుద్వారా తగు రుసుమును పంపి అభిషేకం చేయించుకొనవచ్చును. రాజమండ్రి నుండి, రావులపాలెం నుండి ఈ క్షేత్రానికి వెళ్ళవచ్చును. ఇక శనిదేవుని మహిమ లేక విశేషం.

ఒకసారి ఈశ్వరుడు, శనితో మాటలమధ్యలో "అవును, త్రిమూర్తులలో ఒకడిని, లయకారకుడైన నన్ను కూడా నువ్వు ... అంటే..." శని నవ్వుతూ "అది నాధర్మ"మంటాడు.

ఎవర్ని పీడించడం నాకిష్టంలేదని, వారి జీవితకాలంలో వారిని నేను కలవాల్సి వస్తే మాత్రం , దానికి తగ్గ ఫలితముంటుందని, అలాగే మీకుకూడా, నా ప్రభావం తెలియని, "నేను" మీ జాతకంలో వుంటే "విధేయుడ"నంటాడు.

అయితే సరే. నీ ప్రభావం చూద్దామంటూ శివుడు మర్నాడు తెల్లవారుతూనే కైలాసం వదిలిపెట్టి శనికి తన ఆనవాలు తెలియకుండా వుండటానికి ఒకఅరణ్యంలోని చెట్టుతొర్రలో భద్రంగా వున్నాననుకుని పదిలంగా దాక్కుంటాడు. ఆ మర్నాడు, శని ప్రభావం తనమీద పడలేదని చెట్టుతొర్రలోంచి బయటికి వచ్చి చూస్తే ఎదురుగ్గా శని "ఏం శనీ!" అంటాడు.

"చిత్తం! నా ధర్మం నేను నిర్వర్తించా"నంటాడు.

శివుడు ఆశ్చర్యపోయాడు. "అదెలాగ?" అంటాడు.

"మహానుభావా! కైలాసంలో పార్వతి, కుమార, గణపతులతో, ప్రమధ గణాలతో ఆనందంగావుండే మీరు, అన్ని విడిచి మరచినట్లు, నన్ను తప్పించుకోవాలని చెట్టుతొర్రలో కూర్చోవడం నా ప్రభావంకాదా! కాస్త ఆలోచించండి".

శివుడు నాలుక కరచుకుని, సిగ్గుతో తలదించుకుంటాడు. అతని శక్తికి, భక్తికి మెచ్చినట్లు ఆత్మలింగాన్నిస్తాడు. అదే ఇక్కడ ప్రతిష్ఠించబడి "మందేశ్వరు"నిగా పేరుపొందిన మందపల్లి "శివ" ఆలయం. ఇక్కడ మరో నాలుగు ఆలయాలు వున్నాయి. అందులో బ్రహ్మ ప్రతిష్ఠిత లింగం కూడా వుంది. దీనిని "బ్రహ్మేశ్వరుడు" అని పిలుస్తారు. సర్పరాజు కర్కోటకుడు ప్రతిష్ఠించిన "నాగేశ్వర" లింగం వుంటే, మరొక ఆలయంలో గౌతమమహర్షి ప్రతిష్ఠించిన వేణుగోపాలస్వామి ఆ ప్రక్కనే సప్త మాతృకలు వున్నాయి.

అయితే తన దోషాన్ని పోగొట్టి భక్తులను కరుణించడంతో ప్రసిద్ధుడైన శనిదేవునికి, శివుడు చెట్టుతొర్రలో దాక్కున్న త్రయోదశినాడు, అదీ శనివారం వస్తే, శని త్రయోదశిగా పూజించి, అభిషేకాలు జరపడం ఆనవాయితిగా వస్తుంది. కాని స్థల పురాణం, చరిత్ర వివరాలు స్పష్టంగా తెలియని "శని" దివ్యక్షేత్రమిది.

ఇంకా వివరాలు తెలుసుకోదలచినవారు "కార్యనిర్వహణాధికారి, మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానము, మందపల్లి, కొత్తపేట తాలూకా, తూర్పు గోదావరి జిల్లా ను సంప్రదించవచ్చును.

## ఉమాసమేత మార్కండేశ్వరుడు - రాజమండ్రి

ఇది మహాభక్తుడు మార్కండేయుడు ప్రతిష్ఠించుకున్న శివలింగం. ఇక్కడి దేవుడు శ్రీఉమాసమేత మార్కండేశ్వరుడు. మంటపంలో నందీశ్వరుడు, ఈశాన్యంలో సూర్యనారాయణుడు, సుబ్రహ్మణ్యేశ్వరుడు లను మనం చూడవచ్చును. ఈ మహాశివభక్తుని పేరున మార్కండేయ స్నానాలరేవుగా అనాదిగా పిలువబడుతున్న అతిప్రాచీనమైన ఆలయం. ఇక్కడి లక్ష్మీనరసింహస్వామి సింహాచలేశునికి ప్రతిరూపం. అర్చనాదికాలన్నీ సింహాచలంలోలాగనే జరుగుతాయి. వైదికతంతు అంతా అంతే.

నగరంలోని చారిత్రక ప్రాధాన్యమైనది సారంగధర మిట్ట. వేణుగోపాలస్వామి 13వ శతాబ్దంనాటి ప్రభువు తురుష్కుల దండయాత్రలో ఈ స్వామి (విగ్రహ)ని దర్శించుకుని ఆతదుపరి రెడ్డిరాజులు దీనిని అభివృద్ధిచేసి భోగభాగ్యాలు కల్పించారు. మొత్తానికిది ప్రాచీన దేవాలయం. చూడదగ్గది. సేవించదగ్గది.

## శ్రీసోమేశ్వర - సిద్ధి జనార్ధనస్వాములు - కోటిపల్లి

పౌరాణిక నేపథ్యంగల దివ్యక్షేత్రం. సోమేశ్వరుని చంద్రుడు, కోటీశ్వరుని ఇంద్రుడు, తమ పాపాలు పరిహారార్థం ప్రతిష్ఠించారని పురాణగాధ. ఇక్కడి స్వామి దర్శనం, తీర్థస్నానంవలన కోటిఫలాలను ప్రసాదిస్తుంది. శివకేశవులకు ఒకేఒక శిఖరమున్న ఆలయం కూడా ఇదే. అసలు 'కోటిఫలి' అయితే కాలాంతరములో అది "కోటిపల్లి" అయికూర్చుంది. ఫలంకోరే వారు దర్శించవలసిన ఆలయ సముదాయమిది.

## శ్రీఉమాకొప్పులింగేశ్వరస్వామి - పలివెల

దీనిని ఆగస్త్యప్రతిష్ఠగా చెబుతారు. శివలింగానికి కొప్పువుండటం ఇక్కడి విశేషం. పైగా మహిమాన్విత క్షేత్రంకూడ. స్వామికి కొప్పురావడాని కోకథ వుంది.అది – మహాభక్తుడైన ఈ ఆలయపూజారి, తనకున్న దురలవాటు భాగంగా, తన ప్రియురాలికి అలంకరించిన పూలహారాన్ని శివునికి అలంకరించి దానిని శివప్రసాదంగా, మహారాజుకిచ్చేవాడు. ఒకనాడు మహారాజుకిచ్చిన దండలో పెద్ద వెంట్రుక వచ్చేసరికి ఆశ్చర్యపోయి, ఆ పూజారిని అడిగితే, తడుముకోకుండా శివునిదైవుండాలని అంటాడు. రాజు ఆశ్చర్యపోయి చూస్తానంటే రేపు ఉదయం నిర్మాల్యం తీసేసమయంలో శివుని కొప్పు చూడవచ్చునంటాడు. శివుని లింగానికి కొప్పా? ఇది మహారాజుకు ఆశ్చర్యం వేసింది.

ఇప్పుడు బ్రాహ్మణుడు 'శివా!' అని భోరుమంటాడు. ఆపద గడపమంటాడు. నిజభక్తితో సేవించే నన్ను, నీదాసుడిని దయ చూడవల్సిందేనంటాడు. కదలక గుండెలు పగిలేటట్లు కన్నీరుకారుస్తాడు. ఫలితంగా ఆ పలివెల శివుని లింగంపై శిరోజాలు వెలుస్తాయి. భక్తుని మాట చెల్లింది. తెల్లవారి శివదర్శనానికి, భక్తపరీక్షకు వచ్చిన రాజు ఆశ్చర్యపోయి ఆ మహాభక్తుని క్షమించమనడం శివుడు ఉభయులకు దర్శించి కరుణించడమొక పురాణగాధ. ఇక్కడి విశేషం – ఒకేపీఠంపై ఉమ, కొప్పులింగేశ్వరుడు, గణపతి, సుబ్రహ్మణ్యులు సకుటుంబంగా దర్శనం ప్రసాదించడమొక ఆనందం. అలాగే తూర్పున గోదావరి పాయలైన కౌశికి, దక్షిణం – సాంఖ్యాయని, పడమర వశిష్ఠ, ఉత్తరాన మాండవి మరియు పల్వల అంతర్వాహినిగా ఉన్న ప్రాంతంలో ఈ ఆలయం నిర్మించినట్లు, అంతరాలయంలో గర్భగుడిలో పై పవిత్రజలాలను చూడగల్గుతాము.

## బిక్కవోలు ఆలయాలు

849– 892 ప్రాంతంలో తూర్పుచాళుక్యులు ఎన్నో ఆలయాలు నిర్మించారు. అందులో ముఖ్యమైనది రాజరాజేశ్వరి, శ్రీచంద్రశేఖరస్వామి ఆలయాలు. ఇక్కడి గోవిందరాజస్వామి, శ్రీలక్ష్మీగణపతి, శ్రీసుబ్రహ్మణ్వేశ్వర ఆలయాలు అత్యంత ప్రాచీనమైనవి. దర్శించి తరించదగ్గవి. ముఖ్యంగా శ్రీసుబ్రహ్మణ్య ఆలయం భక్తజనుల కోర్కెలు తీర్చేకామిత ప్రదాయకుడు. ఇంకా ఇక్కడ మూడు శివాలయాలున్నాయి. గ్రామశివారులో ఒకటి, పంటపొలాలలో ఒకటి. అదే రెండవది. మూడవ శివాలయంలో గంగ, యమున నదీదేవతలు, సూర్య, విష్ణు విగ్రహాలు, గోలింగేశ్వరస్వామి ఆలయంలోవలె కనబడతాయి

17వ శతాబ్దం చివరిన, పెద్దాపురంలోని మానోజి చెరువు వద్ద వెలసిన దేవత ఈమరియమ్మతల్లి. ఈమెను

మారెమ్మగా కూడా చెబుతారు. చేతులెత్తి మ్రొక్కవలసిన గ్రామదేవత ఈ తల్లి. ఇక్కడికి సమీపంలోని పాండవుల మిట్టపై అజ్ఞాతవాసకాలంలో పాండవులు ప్రతిష్ఠించి, పూజించిన దేవుడు ఈ సూర్యనారాయణుడు. ఇప్పటిదే అయినా ద్వారపూడి అయ్యప్ప, కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి, చాళుక్యరాజులు నిర్మించినట్లు శాసనాలు తెలిపే ఈ దివ్యాలయం. 198 వైష్ణవదివ్యక్షేత్రాలలో ఒకటిగా తెలుపుతారు. ఈ ప్రాంతాన్ని చాళుక్యులు కాలంలో 'జలవనదుర్గ'మని, కాకతీయులు 'పాంచాలపుర'మని పిలిచేవారు.

నిజానికి ఆలయం, చరిత్ర – పురాణప్రాతినిధ్యంలేని ఆలయం భారతదేశంలోనేలేదు. ఆంధ్రప్రదేశ్‌లో లేదనడం వింతగా చెప్పుకోవాలి. రామచంద్రపురంలోని గోలింగేశ్వర సముదాయం, పెద్దాపురం మండలంలోని, తిరుపతి శృంగారవల్లభుడు ఈనాటిదే అయినా భగవంతుడు కదలివచ్చిన అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం, భద్రాచలంలో వలెనే పూజాదికాలు నిర్వహించే గొల్లలమామిడాడ శ్రీరామాలయం, తంటికొండ శ్రీవేంకటేశ్వరస్వామి, దర్శనీయాలు. తంటికొండ వేంకటేశ్వరస్వామి కొండమీద వున్నారు. అక్కడ స్వామి వారి పాదముద్రను దర్శించుకోగల్గుతాము. కోరిన కొర్కెలు తీర్చే కొండంతదేవుడు, కొండమీది దేవుడు.

## లోవ - తలుపులమ్మ

తీగకొండ – ధారకొండల మధ్యవున్న ఈ తల్లి ఆజగన్మాతే. శ్రీఅగస్త్యమహర్షులు త్రికాలసంధ్యవందనంలో భాగంగా సాయంసంధ్య చెయ్యబోతే నీరుదొరకక 'అమ్మా' గంగా..." అని పిలిస్తే ఆ తల్లి నిరంతరం ప్రవహించే ధారకొండ అవుతుంది. అప్పుడు జగన్మాతకూడా దర్శనమిస్తే, సంచారిణిగాకుండా, ఇక్కడవుండి తలచుకున్న వారి తలపులు తీర్చే తల్లిగా వుండమని ప్రార్థిస్తాడు. ఈ లోయలో ధారకొండవద్ద ఆ తల్లి వెలుస్తుంది. లోయలో తలపుతు తీర్చే తల్లి 'లోవ తలపులమ్మవారు' అయి భక్తజనులను కటాక్షిస్తుంది.

## లక్ష్మీజనార్దనస్వామి ఆలయాలు

ఒకనాటి 'ధవళగిరి' నేటి ధవళేశ్వరం. నారదుడు లక్ష్మీపతికై తపస్సుచేసి ఆ పరమేశ్వరుని ఆజ్ఞతో తొమ్మిది జనార్దనాలయాలు నిర్మించాడు. అందులో మొదటిది ధవళేశ్వరంలో కొండపైన వెలిసారు. క్రింద అగస్త్యేశ్వరస్వామి దేవాలయం వుంది.

నవజనార్దనాలయాలలో మరొకటి. కపిలేశ్వరపురం మండలం **కోరుమిల్లి**లోవుంది. ఇక్కడి స్వామి శ్రీదేవీ, భూదేవిలతో సాధకముద్రలో దర్శనమిస్తారు. ఇక్కడ దక్షిణాన సోమేశ్వరాలయం వుంది. దీనిని ద్రాక్షారామ భీమలింగంగా చెప్పవచ్చును. ఇది సూర్యప్రతిష్ఠ. దీనికి ఎనిమిది దిక్కులలో ఎనిమిది సోమేశ్వరాలయాలు చంద్రుడు ప్రతిష్ఠించాడంటారు.

ధవళేశ్వర సమీపంలోని **మడికి**లో ఇంకో **జనార్దనుడు**. సుందరుడు – సుఖస్వరూపుడు. ఈ ఆలయానికి ప్రక్కగా బాలాత్రిపురసుందరి సమేత శ్రీసోమేశ్వరస్వామి ఆలయం పశ్చిమాభిముఖంగా వుంది. ఒకేచోట శివకేశవుల దర్శనం అమోఘం – అద్భుతంకూడా!



మడికి సమీపంలోని **జొన్నాడలో ఇంకో జనార్దనుడు.** భక్తజన భాగ్యప్రదాత. శ్రీదేవి, భూదేవి సమేతుడై సంపూర్ణ వైష్ణవమూర్తిగా సేవలు పొందుతున్నాడు. ఈ స్వామికి తూర్పున ఉమామల్లేశ్వరస్వామి, ఆలయప్రాంగణంలో వల్లీ దేవసేనాసమేత సుబ్రహ్మణ్యుడు, భక్తులకు తమ దర్శనం ప్రసాదిస్తారు.

**మండపేట జనార్దనస్వామి** చూడదగ్గది. ఎంతో చక్కని దేవుడు. శివకేశవ నిలయం. ఆలయాలమయం. ఆనందతీర్థం. దీనిని 'రథంగుడి' అనికూడా పిలుస్తారు. ఆలయంలో దక్షిణం జనార్దనస్వామి, ఉత్తరం అగస్త్యేశ్వరస్వామి, సత్యనారాయణస్వామి, వగైరా ఎన్నో ఆలయాలున్నాయి. ఇక్కడ జనార్దనుడు– నారదుడు తాతపూడిలో నవ జనార్దన ప్రతిష్ఠలో భాగంగా ప్రతిష్ఠిస్తే, తరచు గోదావరి ముంపుకు గురయ్యే తాతపూడి నుండి భక్తులు, స్వామిని ఇక్కడికి తెచ్చి మండపేట జనార్దనుని చేసారు.

ఈ **కపిలేశ్వరపుర జనార్దనుడు** భక్తులకు సుఖసౌఖ్యాలు ప్రసాదించేవానిగా భక్తులు తలుస్తారు. దీనికి కొద్ది దూరంలో అగస్త్యేశ్వరాలయం వుంది. దీనికి రెండు స్నానఘట్టాలు. శివాలయం దగ్గర్లో భద్రయ్యగారి రేవు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి దగ్గర్లో సుబ్బారాయుడు రేవులున్నాయి. ఆలమూరులోను జనార్దనస్వామివారున్నారు. వీరు అభయముద్రతో అభయప్రదాతగా దర్శనమిస్తారు.

ధవళేశ్వరస్వామి – యోగముద్ర; మడికి జనార్దనుడు – సుదర్శనముద్ర; జొన్నాడ – అభయముద్ర; మండపేట– భోగముద్ర; కపిలేశ్వరపురం – పద్మాసనం; మాచర – జ్వాలాముద్ర; కోరుమిల్లి – సాధకముద్ర; కోటిపల్లి – సిద్ధిముద్ర. వీటి దర్శనం సర్వసంపత్కరం, శుభప్రదమని భక్తులు నమ్మిక. మాచర జనార్దనుడు కపిలేశ్వరపురం మండలంలోని వాడే! ఇది నవజనార్దనాలలోని ఏడవక్షేత్రం. ఇక్కడి గ్రామదేవత మాచరమ్మ నుండి కావిడి వెడితేనే తప్ప, జనార్దనస్వామేకాదు, ఏ శుభకార్యం జరగదు. ఇక్కడి ఉమామహేశ్వర శ్రీరామ లింగాలయం కూడా దర్శించి తరించదగ్గవి.

జగ్గంపేటకు దగ్గరలోవున్న కడలి వంటిదే **రాజోలు కపోతేశ్వరస్వామి**. కడలి కపోతాలు త్యాగస్వరూపిణిలు. రాజోలు – వేటకాని బారినుండి తప్పించుకుని శివుని శరణుపొందినవే. ప్రాచీనమైనవి. జంతువులు, మూగజీవులు తరిస్తే – మనం తరించాలికదా! అందుకే ఈ చరిత్రలు తీర్థయాత్రా వివరాలు.



కొత్తపేట మండలం, **వానపల్లి 'పళ్ళాలమ్మ'** బహు ప్రసిద్ధి మహిమలుగల తల్లి. అమలాపురానికి 21 కి.మీ. లో వున్న ఈ తల్లి పిల్లలమర్రి పినవీరభద్రునిచే పూజించబడింది. ఆరాధించబడింది. ఇది వానపల్లి తల్లికథ. గాధగా చెప్పాలంటే బండకామునివుద్ధరించి, ఉద్దండపండితుని చేసిన భక్తరక్షకి. ఇక––

రావులపాలెంకు 10 కి.మీ దూరంలో **'వాడపల్లి'** వుంది. ఇక్కడి **వేంకటేశ్వరుడు** ఇసుకలో లభించి, ఆలయమొంది భక్తజనుల సర్వకార్యాములు తీర్చే స్వయంభువు భగవంతుడే వేంకటేశ్వరుడు. ఇక ఈ జిల్లాలోని మరో మహిమాన్వితమూర్తి భావస్వరూపుడైన నారాయణుడ 'భావనారాయణుడు – కాకినాడ'లో ఇప్పుడు అంతర్భాగమైన ఎవరికీ తెలియని సర్వవర – సర్వేశ్వరుడు శ్రీభావనారాయణస్వామి. నారదుని గర్వమణచి, మహామాయాశక్తిని తెలుపడానికి నారాయణుడు నాటకమాడిన దివ్యప్రాంతం ఈ భావనారాయణస్వామి ఆలయ ప్రాంతం.

ఈ భావనారాయణస్వామి ఆలయాలు, ఆంధ్రదేశంలో అయిదువున్నాయి. ఇది పశ్చిమగోదావరిజిల్లా పట్టిసం, కృష్ణాజిల్లాలో భావదేవరపల్లి, గుంటూరులో పొన్నూరు, ప్రకాశంజిల్లాలోని పెదగంజాం. మొత్తం అయిదు.

మురమళ్ళ – భద్రకాళిసమేత వీరభద్రేశ్వరుడు. దుష్టజనశిక్షకుడు. రౌద్రుడు. రౌద్రుడే అయినా కార్యకారణ స్వరూపుడు. నిత్యకల్యాణం పచ్చతోరణంతో భక్తజనసౌభాగ్యప్రదాత, ఈ దివ్యరూపుడు.

## బ్రహ్మసంవేద్యం - పల్లంకుర్రు

వేదవ్యాసుడు బ్రహ్మదేవుని , ఆ తదుపరి శివుని పూజించి తపించి 'ఫలంకురు' అని అభ్యర్థిస్తాడు. ఇక్కడి దేవుడు బ్రహ్మేశ్వరుడు. చొల్లంగి అమావాస్యనాడు ఇక్కడ జరిగే ఉత్సవం చూడదగ్గది. నాటి వ్యాసుల 'ఫలంకురు' నేడు 'పల్లంకుర్రుగా పిలవబడుతోంది.

## పంచక క్షేత్రం

ఇది కాకినాడకు 43 కి.మీ. దూరంలో వుంది. ఇక్కడ వేదవ్యాసులు తపమాచరించారనేది స్థలపురాణం. ఇచట ఎన్నో ఆలయాలు వున్నాయి. వీటిలోని కనకలింగేశ్వరుడు, మావుళ్ళమ్మ కల్యాణవేణుగోపాలస్వామి, సుబ్రహ్మణ్యస్వామి కార్తికేయునిగా వెలసిన దివ్యప్రదేశం.

దేవుడు ఎక్కడలేడు? అంటే అంతటావున్నాడంటాడు భక్తప్రహ్లాదుడు. అలాగే అణువణువునా స్వామి, అనుభూతి, ఆలయాలు, మహదానందం – మనలను తరింపచేయ సిద్ధంగా వున్నాయి. ప్రయత్నిద్దాం. ఆ దేవదేవుని దర్శించి తరిద్దాం.

## కోటిపాపాల హరణం కోటిలింగాల దర్శనం - రాజమండ్రి

ఆంధ్రప్రదేశ్‌లోని పవిత్ర గోదావరి తీరమైన రాజమహేంద్రవరము (రాజమండ్రి)లో పురాణ ప్రసిద్ధి చెందిన కోటిలింగాల గట్టున వెలసిన ఉమాకోటేశ్వరస్వామి దేవాలయం ప్రసిద్ధి చెందినది. త్రిపురాసురుని సంహారం సమయంలో పరమశివుడు త్రిపురాసురుని అనుచరగణంలో కోటి మందిని వధించగా బ్రహ్మ వారిని కోటి లింగాలుగా మార్చినట్లు పురాణాలు చెబుతున్నాయి. శ్రీరామచంద్రుడు తన అరణ్యవాస కాలంలో కొంత సమయం ఇక్కడ గడిపినట్లు చెబుతారు. అందుకే ఈ ఆలయ ప్రాంగణంలో సీతారామాలయం కూడా ఉంది. గోదావరి తీరాన వెలసిన పంచారామక్షేత్రాలలో ఇది ఒకటిగా చెబుతారు. నాసికా త్రయంబకం వద్ద వీరరాముడు, దుమ్ముగూడెం

వద్ద ఉన్న పర్ణశాల దగ్గర యోగరాముడు, భద్రాచలం వద్ద భోగరాముడు, పాపికొండల వద్ద రామగిరిలో శోకరాముడు, ఈ క్షేత్రములో కళ్యాణరాముడుగా రాముడు ప్రసిద్ధి.

**నదీ స్నానము చేయుటకు ముందు పఠించవలసినవి**

**గంగేచ ! యమునేచైవ ! గోదావరి ! సరస్వతి !**
**నర్మదే ! సింధు ! కావేరి ! జలేఽస్మిన్ సన్నిధిం కురు**
**గంగా గంగేతి యో బ్రూయాత్ యోజనానాం శతైరపి**
**ముచ్యతే సర్వపాపేభ్యో విష్ణులోకం స గచ్ఛతి.**

అని ప్రార్థించి, చేసే గోదావరిస్నానం, చెప్పలేని పుణ్యాన్ని ప్రసాదిస్తుందని, సర్వపాపహరం చేస్తుందన్నది శృతివాక్యం.

## వరసిద్ధి వినాయక దేవాలయం - అయినవిల్లి



తూర్పు గోదావరి జిల్లా కోనసీమ ముఖ్య ప్రాంతమైన అమలాపురం నకు 10 కి.మీ. దూరంలో ప్రముఖ పుణ్యక్షేత్రము ముక్తేశ్వరము కలదు. దీనిని క్షణముక్తేశ్వరమని కూడా అంటారు. ఇక్కడ క్షణం కూర్చుంటే వారికి ముక్తి వస్తుందనేది సనాతనుల సదభిప్రాయం. ఈ ముక్తేశ్వరమునకు సుమారు 1కి.మీ. దూరంలో ఉన్న మరొక పుణ్యక్షేత్రమే "అయినవిల్లి" శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయం.

పవిత్ర గోదావరి మాత హస్తముల మధ్య అమరిన కోనసీమలో అడుగడుగున పవిత్ర పుణ్యక్షేత్రములే. అట్టి పవిత్రమైన ఆలయాలలో శ్రీ సిద్ధి వినాయకస్వామి ఆలయం ఒకటి. చిత్తూరు జిల్లా కాణిపాకం, కర్ణాటక రాష్ట్రములోని గోకర్ణము మాదిరిగానే ఈ విఘ్నేశ్వరునిది కూడా పేరు పొందిన దేవాలయం. దక్ష ప్రజాపతి దక్షయజ్ఞం నిర్వర్తించేముందు విఘ్న వినాయకుడైన ఈ వినాయకుని పూజించి పునీతుడైనట్లు క్షేత్ర పురాణం తెలుపుతోంది. వ్యాసమహర్షి దక్షిణ యాత్ర ప్రారంభంలో పార్వతీ తనయుణ్ణీ ప్రతిష్టించేడని మరొక కథ వ్యాప్తిలో ఉన్నది. అతి పురాతనుడైన ఈ 'సిద్ధి' ప్రియుడు కోర్కెలన్నీ తీర్చే సిద్ధి వినాయకుడుగా పేరుగాంచాడు. విశాలమైన అవరణలోనూ, ఎత్తైన ప్రాకారంలో విరాజిల్లుతున్న ఈ దేవాలయంలో విఘ్నేశ్వరుడు దక్షిణాభిముఖుడై నిల్చుని ఉంటాడు.



రెండు గోపురాలు, సింహ ద్వారములతో ఆలరారే ఈ దేవాలయం దక్షిణ సింహద్వారము ద్వారా క్షేత్ర ప్రభువును, తూర్పు గోపురం గుండా శ్రీ విశ్వేశ్వరుని దర్శించవచ్చు. ఈ ప్రాంగణంలోనే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కేశవస్వామి ఉండుటవలన శివకేశవ తారతమ్యాలు ఈ క్షేత్రములో లేవని చాటి చెబుతున్నారు. ఆస్తికుడనేవాడు తప్పక చూడవలసిన తొలి దేవుని దివ్యక్షేత్రం.

## శ్రీ ముక్తికాంతా క్షణముక్తీశ్వరస్వామివారి దేవస్థానం (తూర్పు గోదావరి జిల్లా)



శ్రీరాముడు లోకోపదేశము నిమిత్తమై గౌతమీ తటమందు అనేక శివలింగములు ప్రతిష్ఠించి, పుష్పకమెక్కి, గౌతమి పశ్చిమతటమునకు వచ్చుసరికి పుష్పకము కదలలేదు. ఇందు క్షేత్రవిశేషము కలదని పరిశోధించగా ఒక పుట్ట కనబడెను. దానిని తొలగించి అందులో తపమాచరించుచున్న స్త్రీని చూచి, నీవు ఎవరవు అని అడుగగా ఆమె, తన వృత్తాంతమును ఈ విధముగా వివరించెను.

"నా పేరు శ్రమణి. నా రూపమును చూసిన ఒక గంధర్వుడు నా పతిస్నానార్థమై వెళ్ళిన తరువాత నాపతి రూపములో వచ్చి కామలీల యందు ప్రయత్నించుచుండగా నా భర్త వచ్చి తన రూపములోనున్న గంధర్వుని భస్మము చేసెను. కృతాంజలిగా నున్న నన్ను చూచి నీవు ఛంఢాల స్త్రీ అగుమని శపించెను. శాపగ్రస్తురాలైన నేను మామగారి వద్ద మొరపెట్టుకొనగా, వారు దివ్యదృష్టిచే జరిగినది తెలుసుకొని గౌతమీ నదిలో స్నానమాత్రముచే నీ పాప పరిహారమగును. 'శివశివ'యని దారుణ తపము చేయుము. త్రేతాయుగములో శ్రీరామచంద్రుని దర్శనాభాగ్యముచే నీవు ముక్తిని పొందగలవని చెప్పి వెళ్ళిరి. అది మొదలు ఇప్పటి వరకు తపము చేయుచుంటినని చెప్పింది. అప్పుడు శ్రీరాముడు ఈశ్వరుని ప్రార్థించగా ఈశ్వరుడు ప్రత్యక్షమై శ్రీరాముని అలింగనము చేసుకొనెను. రాముడు "ఈశ్వరా, శ్రమణికి సాయుజ్యముక్తినిమ్మని, సర్వజనులు నిన్ను చూచిన క్షణకాలములో ముక్తినొందు వరము ప్రసాదించ"మని ప్రార్థించి, ఒక శివలింగమును ప్రతిష్ఠించెను. అందువలన ఈ క్షేత్రము క్షణ ముక్తీశ్వర క్షేత్రముగా వెలుగొందుచున్నది.

## శ్రీ కపోతేశ్వరస్వామివారి దేవస్థానము- కడలి (తూర్పు గోదావరి జిల్లా)

ఈ కడలి తూర్పుగోదావరి జిల్లాలో రాజోలు మండలంలో జగ్గన్నపేట సెంటరకు 3 కిలోమీటర్ల దూరమున వున్నది. క్షేత్ర మహాత్మ్యము బ్రహ్మాండ పురాణమున యీ విధముగా యున్నది. ఇప్పుడు ఆలయము ఉన్న ప్రాంతము ఒక అడవిగా నుండుటచే ఒక బోయివాడు వేటకువెళ్ళి వర్షమందు తడిసి ఆహారము లభించక వణుకుచు ఒక చెట్టు క్రింద కూర్చుండెను. ఆ చెట్టుపై ఒక పావురముల జంట కాపురముంటున్నది. ఆ గూటియందున్న



మొగ పావురము బయటకుపోగా మిగిలిన ఆడ పావురము చెట్టు క్రింద కూర్చుని ఉన్న బోయవాని చలిబాధను, ఆకలిబాధను గ్రహించినదై, ధర్మశాస్త్రము తెలిసినదై, పూర్వజన్మ జ్ఞానము కలదియై, తను అతిథి ఐన ఆ బోయవానికి ఆకలిబాధను, చలిబాధను తీర్చుటకు తాను ప్రక్కనవున్న స్మశానమున మండుచున్న చితికెలను తీసుకొనివచ్చి బోయవానిముందు పడవైచి, తనగూడును మంటయందు పడవైచి తాను కూడా ఆ మంటయందుపడి తన గృహస్థ జీవితమును సార్థకము చేసుకొనెను. అంత మగ పావురము విషయమును గ్రహించి తన భార్య చేసిన అతిథి సత్కారమునకు సంతోషించి తాను కూడా అగ్నియందుపడెను. అంత బోయవాడు కూడా ఆ కపోత దంపతుల అద్భుత త్యాగమునకు మురిసి తాను కూడా అగ్నియందుపడెను. అతిథి పూజకు, ఆ కపోత దంపతుల అద్భుత త్యాగమునకు ఆ పరమేశ్వరుడు ప్రతక్ష్యమై ఆ పావురము జంటకు శివ సాయుజ్యం అనుగ్రహించెను. అంత ఆ జంట "కరుణానిధీ" మాతోబాటుగా ప్రాణములు విడిచిన ఆ బోయవానికి కూడా మీ సాయుజ్యమును అనుగ్రహింపుము, అదియుంగాక మీరు శిలాకారములో యిక్కడ విజయము చేసి తమను సేవించినవారిని సద్గతులనొసగి కాపాడమని ప్రార్థింప, పరమేశ్వరుడు తథాస్తు అని అంతర్ధాన మయ్యెను. అంత శివుడు కపోతేశ్వరస్వామిగా ఆవిర్భవించెను. దీనికి నిదర్శనముగా నేటికినీ గూడా శ్రీ స్వామివారికి ఉత్తర భాగమున శ్మశానము కలదు. యిక్కడ స్వయంభూనిర్మితమైన శివలింగము కపోతాకారముతో దర్శనమిచ్చును.

## కోటిఫలాల పుణ్యక్షేత్రం - "కోటిపల్లి" అనే "కోటిఫలి"

తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ పట్టణానికి దగ్గరలో పామర్రు మండలంలోవున్న ఈ పుణ్యక్షేత్రం గురించి బ్రహ్మాండపురాణంలోనూ, స్కాంద పురాణంలోనూ తెలుపబడివుంది. ఈ కోటిఫలిలో దేవేంద్రుడు నిర్మించిన స్వయంభూ శివలింగం వుంది. యోగ లింగంగా కూడా దీనిని భావిస్తారు. పాతాళం నుంచి ఉద్భవించిన ఈ లింగానికి ఉత్సవాలు వుండవు. కారణము..... ఇది యోగలింగం అవటంవలన. ఈ కోటిపల్లి కోటేశ్వరుడు అయిదు మాసాలు కోటి తీర్థ జలంలో వుంటాడు. మిగతా ఏడు మాసాలు కోటి తీర్థ జలలింగాన్ని చేరి నేలమట్టం వరకూ తొణికిసలాడుతూ భక్తుల కన్నులను తరింపజేస్తాడు. అందరు చెప్పుకునే ఈ 'కోటిపల్లి' అసలు పేరు 'కోటిఫలి'. స్వామి దర్శనం కోట్లాది ఫలితాలనిస్తుంది కాబట్టి దీనిని 'కోటిఫలి' అనడం, రానురాను, మన తెనుగు భాషవలెను, రకరకాల రూపాంతరాల భాగంగా 'కోటిపల్లి' అయికూర్చుంది. దీని ధర్మాధికారులు విజయనగరం పూసపాటి వంశ గజపతులు.



**సంక్షిప్తంగా....**

✷ తూర్పుగోదావరి జిల్లాలో ప్రాచీన దేవాలయాలే కాక **అనపర్తిలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయం, కొవ్వూరు గోదావరి ఒడ్డునగల సాయిబాబా దేవాలయం, ధవళేశ్వరంలోని శ్రీ సాయిబాబా దేవాలయాలు** మానవ నిర్మితమై దినదినాభివృద్ధి చెందుతూ భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

✷ తూర్పుగోదావరి జిల్లాలో మరొక మానవ నిర్మితమైన **ద్వారపూడి శ్రీ అయ్యప్పస్వామి దేవాలయం** ఆంధ్రా శబరిమలగా పేరు పొందింది. కార్తీక మాసంలో అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాముల దర్శనం చేసుకుంటారు.

ఇవన్నీ ఒకచోటనుండి ప్రారంభించి, అడుగడుగునా తీర్థక్షేత్రాలతో పవిత్రమొనరించే ఈ పవిత్ర ప్రదేశాలను, అలాగ ముందుకు చూసు కుంటూ వెళ్ళవచ్చును. ఎటొచ్చి నాలుగడుగులు వెయ్యగల ఓపిక, చూడాలనే మనసువుంటే, ఈ ప్రయాణాలు సాధ్యమవుతాయి.

పూర్వకాలంలో, ప్రయాణసౌకర్యాలు లేనిరోజులలో మనతాత ముత్తాతలు కాలినడకన దర్శించారు. ఇప్పుడెన్నో సౌకర్యాలున్న ఈ సమయంలో మనం దర్శించలేకపోవడం మన దురదృష్టమనే చెప్పాల్సి వుంటుంది.

## శ్రీ కుండలేశ్వరస్వామి వారి దేవస్థానము (కుండలేశ్వరము, తూ॥గో॥జిల్లా)

కాశీలోని గంగానది పాపాత్ముల పాపములను పోగొట్టును గాని, రాత్రి సమయమున ఈ కుండలేశ్వర క్షేత్రమున వృద్ధ గౌతమీ నదిలో మునిగి హంసయై తేలుచుండెడిదని మునీశ్వరులు చెప్పెడివారట. అట్లే గౌతమముని సముద్రునిచే గౌతమీనదికి కానుకగా నీయబడిన కుండలములలో నొకదానిని గౌతమ ముని "మానవులు" కొరకు నది ఒడ్డున గల కుండలేశ్వర క్షేత్రమునను, రెండవ కుండలమును దేవతల కొరకు నదీగర్భమునను స్థాపించెనని స్థలపురాణం చెబుతుంది. నదీగర్భములో స్థాపింపబడిన ఈశ్వరునకే దేవతలే కంచుతో ఆలయమును నిర్మించుకొని ఆ దేవుని పూజించుచుందురనియు ప్రతీతి గలదు. తరువాత తనతో వచ్చిన వృద్ధ వనితతో ఈ కుండలేశ్వర క్షేత్రమునందలి కుండలాముఖ తీర్థములో గౌతమముని స్నానము చేయగా ఆ వృద్ధవనిత 16 సం॥ కన్యకగాని, తాను 20 సం॥ల యువకుడుగాను మారినట్లును అనంతరము వారు దంపతులై సుఖజీవనమున గడిపినట్లును చెప్పుదురు.

కుండలేశ్వర క్షేత్రమునకు "అనంతం కుండలాపదం" అను సామెత కలదు. తూర్పుగోదావరి జిల్లా ఈ క్షేత్రము కోనసీమలో కొనభాగమున కొబ్బరితోటల నడుమ పచ్చని పంట చేల మధ్య మనోహరముగా విరాజిల్లుచున్నది. ఈ క్షేత్రమున ఆలయవిమానము భారతదేశములో నెచ్చటను కానరాని విధమున 23 శివలీలలు నిర్మింపబడినవి.

# పశ్చిమగోదావరి జిల్లా

## శ్రీ రాట్నాలమ్మ అమ్మవారి దేవస్థానము (రాట్నాలకుంట, ప॥ గో॥ జిల్లా)



ప్రాచీన కాలమున రాట్నాలకుంట గ్రామ పరిసర ప్రాంతాలు దట్టమైన అడవి ప్రాంతంగా ఉండేవి. వన్య ప్రాణులు, పశు పక్ష్యాదులు నివసించే ఈ దట్టమైన అటవీ ప్రాంతం కాలక్రమంలో రాట్నాల అయిందని స్థల పురాణం పేర్కొంటోంది.

అనంతరం వేంగిని పరిపాలి స్తున్న శ్రీ రాజరాజనరేంద్రమహారాజు అటవీప్రాంతంలోని అమ్మ వారి విగ్రహాన్ని దర్శించుకున్నాడు. చుట్టు చెల్లాచెదురుగా ఉన్న విగ్రహా లన్నింటిని ఒక క్రమపద్ధతిలో ఏర్పాటు చేశాడు. నాటి నుండి శ్రీ అమ్మవారిని గ్రామ దేవతామూర్తిగా కొలవడం ఆచారంగా మారింది. శతాబ్దాల తరబడి పందిరి కిందనే పూజ లందుకున్న ఈ తల్లికి మూడు దశాబ్దాల క్రితం ఆలయం నిర్మించి విగ్రహ ప్రతిష్ఠ జరిపించారు. నాటి నుండి నేటి వరకు భక్తజన కోటి కోర్కెలను తీరుస్తూ కల్పవృక్షంగా పేరుగాంచింది. ఆరాధ్య దైవమైన అమ్మ దర్శనం తోడనే అష్ట ఐశ్వర్యాలు సమకూరుతాయని భక్తుల నమ్మకం.

చుట్టు ప్రక్కల గ్రామాలు, జిల్లాల వారే కాకుండ సుదూర ప్రాంతాల నుండి కూడా భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. ముఖ్యంగా ఆది, గురువారాల్లోను తిరునాళ్ళలోను భక్తులు భారీ ఎత్తున తల్లిని దర్శించుకుంటారు. వైభవోపేతంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమి నుండి ఐదు రోజులపాటు తిరుణాళ్ళు ఉత్సవాలు రంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ దేవాలయాన్ని 1988వ సంవత్సరంలలో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ స్వాధీనం చేసుకుంది.



## నిత్యకళ్యాణం పచ్చతోరణం - ద్వారకా తిరుమల



మన రాష్ట్రములో ఉన్న ఆలయాలలో వెంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రముగా తిరుపతి ఎంత ప్రసిద్ధి చెందినదో అంతే ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమల. ఈ క్షేత్రము ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరునకు సమీపములో ఉన్నది. ఈ క్షేత్రమును 'చిన్న తిరుపతి' అని కూడా భక్తులు పిలుస్తారు.

ద్వారకుడు అనే భక్తుడు ప్రతి సంవత్సరము తిరుపతిలో ఉన్న వెంకటేశ్వరుని దర్శిస్తూ వుండేవాడు. వృద్ధాప్యంలో ఎక్కువ దూరం నడచి వెళ్లలేని స్థితిలో కూడా తిరుపతికి ప్రయాణమవుతాడు. కొంత దూరం వెళ్లిన తరువాత అలసిపోయి క్రిందపడిపోతాడు. అపుడు స్వామి అతనికి కలలో కనుపించి "ఓయి! ద్వారకా! శేషాచలంలో ఉన్న నా అంశ యిక్కడ వుంది. వెళ్ళి పూజించు. తిరుపతి క్షేత్రము దర్శించినంత ఫలితం కలుగు తుంది". అని చెప్పి శ్రీ వెంకటేశ్వరుడు అదృశ్యమయెను. ద్వారకుడు ఎంతసేపు వెదికినా శ్రీవేంకటేశ్వరస్వామి కనిపించనందున అక్కడే ఉన్న కోనేరులో స్నాన మాచరించుచుండగా ఒక గరుడ పక్షి "క్రిష్ణా! క్రిష్ణా" అని ఎగురుతూ ఈశాన్యదిశగా వెళ్లింది. అది చూసిన ద్వారకుడు ఆ పక్షి వెళ్ళిన వైపు చూడగా ఒక పుట్టలో దివ్యతేజస్సు కలిగిన వేంకటేశ్వరస్వామి అతనికి కనిపించెను. కొంతకాలము తరువాత కొంతమంది భక్తులతో వేంకటేశ్వరుని దివ్యమూర్తిని శేషాచలంపై ప్రతిష్టించెను. ఆ శేషాచలమే నేడు ద్వారకాతిరుమలగా ప్రసిద్ధి చెందెను. ఈ క్షేత్రమునకు మైలవరం జమిందారులైన సూరపనేని వంశీయులు వంశపారంపర్య ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు.

దీనికి బస్ సదుపాయం వుంది. విజయవాడ – విశాఖ పట్టణం మార్గంలో ఏలూరు లేదా భీమడోలు లో దిగి బస్సులో వెళ్ళవచ్చును. ఇక్కడ యాత్రీకులకు కావలసిన సర్వసదుపాయాలు ఇప్పుడు లభిస్తున్నాయి. ఉచిత నిత్యాన్న భోజన పథకం కూడా అమలులోవుంది.



పెద్ద తిరుపతి వెళ్లలేని భక్తులు ఈ ద్వారకా తిరుమలను దర్శిస్తే తిరుపతి వెళ్ళినంత ఫలితం దక్కుతుందని ప్రతీతి. ఆశ్వయుజ మాసములో జరుగు స్వామివారి కళ్యాణ ఉత్సవములకు రాష్ట్రము నలుమూలల నుండి అనేక మంది భక్తులు వస్తూంటారు. భక్తుల కోర్కెలు తీర్చే ఈ క్షేత్రము జిల్లాలలోని అన్ని ముఖ్య కేంద్రముల నుండి వచ్చు భక్తులతో నిత్య కళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతూ దినదినాభివృద్ధి చెందుతోంది.

**శ్రీస్వామి వారికి అర్జిత కళ్యాణములు సేవలు జరుపబడని తిథులు**

శ్రీ స్వామి వారికి వైశాఖ శుద్ధ దశమి నుండి బహుళ విదియ వరకు మరియు ఆశ్వయుజ శుద్ధ దశమి నుండి బహుళ విదియ వరకు, గోదా కళ్యాణము రోజున, శ్రీరామనవమి, కృష్ణాష్టమి రోజున మరియు శ్రావణ శుద్ధ త్రయోదశి నుండి బహుళ పాడ్యమి వరకు, గ్రహణం రోజున ఏ విధమైన ఆర్జిత సేవలు జరుపబడవు.

## మహిళాలోకానికే మణిపూస, వాసవి కన్యకాపరమేశ్వరి - పెనుగొండ



ఆంధ్రప్రదేశ్‌లోని పవిత్ర వశిష్ట గోదావరి సమీపమున సిద్ధాంతం నుండి 8 కిలోమీటర్ల దూరమున విజ్జేశ్వరం – నర్సాపురం కాలువ ఒడ్డున పెనుగొండ క్షేత్రము యావద్భారత ఖ్యాతి పొందిన **శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి** ఆలయం గల పవిత్ర పుణ్య స్థలము.

పూర్వం స్వారోచిషమనువు కాలంలో సమాధి అనే పేరుగల వైశ్యోత్తముడు తపస్సు చేసి దేవి ప్రసన్నం పొందుతాడు. దేవి ప్రసన్నము కావడంతో నూటొక్క వంశముల వారికికూడ మోక్షము కలుగునట్లు వరం పొందుతాడు. అనంతరం సమాధి కల్హారుడు అనే అతనికి పుత్రునిగా జన్మించాడు. బాలునికి కుసుమ శ్రేష్ఠి అని నామకరణం చేసారు. మణి కుండలుడు అనే వైశ్యుని కుమార్తె కౌశంబితో వివాహం జరుగుతుంది. వారికి చాలా కాలం సంతానం లేనందున పుత్రకామేష్ఠి వ్రతము చేస్తారు. అప్పుడు పరమేశ్వరుడు అగ్నిదేవుడ్ని పంపుతాడు. నిజస్వరూపంలో అగ్నిదేవుడు యజ్ఞ గుండం నుండి వచ్చి పాయసంతో నిండిన స్వర్ణపాత్రను ఇస్తారు. కౌశంబి ఆ పాయసం సేవించాక విరూపాక్షుడు, వాసవి జన్మిస్తారు. నిజానికి “వాసవి” ఆ జగన్మాత పార్వతీదేవే!



వాసవి సమస్త వేదశాస్త్ర పారంగతురాలు అవుతుంది. వైశ్యమునుల శాప ప్రభావముతో చిత్రకంఠు డనే గంధర్వుడు భూలోకమున విష్ణువర్ధన మహారాజుగా జన్మిస్తాడు. విష్ణువర్ధనుడు జైత్రయాత్రకు బయలుదేరి పెనుగొండ సమీపమున బసచేస్తాడు. సామంతరాజు అయిన కుసుమ శ్రేష్ఠి రాజుకు సకల మర్యాదలు చేస్తారు. శ్రేష్ఠి కుమార్తె అయిన వాసవి సౌందర్యమునకు పరవశుడైన రాజు ఆమెను వివాహము చేసుకుంటానని అంటాడు. కుసుమశ్రేష్ఠి బంధు వర్గాన్ని సంప్రదించగా 612 గోత్రలవారు వివాహమునకు అంగీకరిస్తారు. 102 గోత్రలవారు అగ్ని ప్రవేశం చేస్తారు. వెంటనే శాపంతో విష్ణువర్ధనుడి శిరస్సు వెయ్యి ముక్కలు అయి మరణిస్తాడు. ఈ ఆలయంలో వాసవి అగ్నిప్రవేశం చేసినచోట వాస్తవరూపంతో విగ్రహాలను నెలకొల్పారు. వైశ్యులకీ తల్లి నిత్య ఆరాధిని.

## బౌద్ధభిక్షుకుల తపోనిలయం - క్షీరారామలింగేశ్వరాలయం (పాలకొల్లు)

ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయ గోపురాలలోకెల్లా శ్రీ క్షీరారామ లింగేశ్వర ఆలయ గోపురం చాలా ఎత్తయినది. దీని ఎత్తు 120 అడుగులు దీనిలో తొమ్మిది అంతస్తులు ఉన్నాయి. క్రీ.శ. 918లో చాణుక్య దేముడు ఈ ఆలయాన్ని నిర్మింపగా రెడ్డిరాజులు పునరుద్ధరించారని, 18వ శతాబ్ధము వెలుపలి దేవన్న కవి ఆలయ గోపురాలను నిర్మించారని శాసనాల ద్వారా తెలుస్తోంది. క్షీరారామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవములు ఏటా చైత్రశుద్ధ దశమిరోజున నిర్వహిస్తారు. ఏటా లక్షల మీద ఆదాయం వచ్చే ఈ దేవాలయం పురోభివృద్ధి చెందుచున్నవి.



**స్థల చరిత్ర:** క్షీరసాగర మధనంలో ఉద్భవించిన అమృతలింగాల్ని తారకాసురుడు భక్తితో పూజించి బలోపేతుడయ్యాడు. బల గర్వంతో దేవలోకాన్ని బాధించసాగాడు. దీనికి ఆగ్రహించిన కుమారస్వామి అతడిని యుద్ధములో సంహరించాడు. అమృతలింగాన్ని ముక్కలుగా చేయగా ఆ లింగము అయిదు ప్రాంతాలలో పడింది. దానిలో 5వ ముక్క పాలకొల్లులో పడింది. ఇదే పంచారామములలో 5 వది. గౌతముడు భూతలంలో ప్రవహింపచేసిన గోదావరి తీరంలో సప్తఋషులు తపస్సు చేయగా, వారిలో వశిష్ఠుడు క్షీరారామంలో భీమేశ్వరుని ప్రతిష్టించాడు.

ఆ దేవాలయమునకు సమీపంలో కౌశికుడు అను సంపన్న బ్రాహ్మణుడు ఉండేడివాడు. సంతానంలేని ఆ బ్రాహ్మణునికి భీమేశ్వరుని అనుగ్రహంతో ఉపమన్యుడను పుత్రుడు కలిగెను. క్రమేపి సంపద కోల్పోయిన ఆ దంపతులు కుమారుని గారాబంగా పెంచారు. మన గ్రామంలో పిల్లలందరూ పాలు పోసుకుని భోజనం చేస్తున్నారు. కాబట్టి తనకు కూడా పాలతో అన్నం పెట్టమని తల్లిని ఆ బాలుడు అడిగాడు. దిక్కుతోచని తల్లి ఈశ్వరుని ఆశ్రయించి మార్గం చూపకుంటే అక్కడనుంచి కదలనని భీష్మించింది. దానితో ఈశ్వరుడు ప్రత్యక్షమై శూలంతో పుష్కరిణిని సృష్టించాడు. అందులో పాలుపుట్టాయి. ఆ పాలకొలను శివుడు ఆమెకు ఇచ్చాడు. అప్పటినుండి ఆ పురమునకు పాలకొల్లు అని, ఉపమన్యపురమని పేరు వచ్చినది. క్రమేపి పాలకొల్లుగా మారింది.

## శ్రీ యల్లారమ్మ అమ్మవారి దేవస్థానము (మండపాక, ప॥గో॥ జిల్లా)



**స్థల చరిత్ర :** అష్టాదశ పీఠ మహా శక్తులలో ఏకవీరా దేవి ఒకరు. శ్రీనాథ మహాకవికృత క్రీడాభిరామములో ఏకవీరాదేవిని గురించి వర్ణిస్తూ ఈమె కాకతమ్మకు సైదోడుగా మండపాక మున్నగు గ్రామము లలో వసించెనని వర్ణించినారు.

పూర్వము పరిమి వెంకప్పగారి పుసుపుతోటలో నౌకరు నాగలి దున్నుచుండగా నాగలి సాలు బెట్టుపట్టినది. అతడు బలవంతముగా దోలగా ఎద్ల పాదముల నుండి రక్తము కారినది. అది చూచి నౌకరు రక్తము క్రక్కి మరణించాడుట. అంతట వెంకప్పగారు జాగ్రత్తగా మన్ను తొలగించి చూడగా, శ్రీ అమ్మవారి పాదములు, విగ్రహము శిరస్సు బయల్పడినవి. అంత నూజివీటి జమీందారులు ఆలయమును కట్టించినారు. అప్పటి నుండి పరిమి వారి ఆడబడుచుగా యల్లాలమ్మ తల్లి వెలుగొందుచున్నది.

"కాకతమ్మకు సైదోడు ఏకవీర" అను క్రీడాభిరామవచనమున ఈ దేవి ఆలయములో శ్రీ ఎల్లారమ్మ వారి సంపూర్ణ విగ్రహమే కాక నేరుగా ఒక శిరస్సు పాదములు కూడా కలవు. శిరస్సు ఏకవీరాదేవి అనియు సంపూర్ణ విగ్రహము కాకతమ్మ అనియు పరిశోధకుల అభిప్రాయము.

బహు సుందరముగా సాలగ్రామ శిలతో చేయబడిన శ్రీ యల్లారమ్మ అమ్మవారికి ముందరి కుడి చేతిలో ఖడ్గము, వెనుక కుడి చేతిలో ఢమరుకము, ముందరి ఎడమ చేతిలో పాయస పాత్ర, వెనుక ఎడమ చేతిలో త్రిశూలము కలవు.

## శ్రీ మద్ది ఆంజనేయస్వామివారి దేవస్థానము (గురువాయిగూడెం, ప॥గో॥జిల్లా)



జంగారెడ్డిగూడెం మండలం, గురువాయిగూడెం గ్రామంలో ఎర్రకాల్వ ఒడ్డున తెల్లమద్ది చెట్టు చెంతన స్వయంభూవులుగా వెలసి 600 సం॥రములు నుండి భక్తులచే శ్రీ మద్ది ఆంజనేయస్వామిగా హనుమంతుడు విశేష పూజలు అందుకొనుచున్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం గం.12.00ల నుండి గం.12.30ని.ల మధ్య కాలంలో స్వామివారిపై సూర్యకిరణములు ప్రసరించుట అద్భుతము. ఈ సుందర దృశ్యము మాటలతో చెప్పనలవి కానిది. అందుచే తెల్లమద్ది చెట్టు స్వామివారికి నాగ పడగగా ఉండటం మరొక విశేషం. స్వామివారికి ఒక చేతిలో గద, ఒక చేతిలో ఫలము ఉండుట విశేషము. పెళ్లికాని వారు 11 వారములు స్వామివారికి 108సార్లు ప్రదక్షిణలు చేసి దర్శించినచో వివాహము జరుగుతుందని, మూడు రాత్రులు స్వామి వారి సన్నిధిలో నిద్రించినచో ఎటువంటి అనారోగ్యమైన తొలగిపోవునని భక్తుల నమ్మకము. ఇటువంటి శ్రీరామభక్తుని, మహాశక్తివంతుని దర్శించ గల్గడం, నిజంగా మన అదృష్టంగా చెప్పుకోవాలి.

స్థలపురాణం ప్రకారం స్వామి త్రేతా, ద్వాపర, కలియుగంలతో కలిసిన ఒక భక్తుడు – మొదట్లో అసురుడు – ఆ తదుపరి భక్తుడై ఆంజనేయుని కొలుస్తాడు. చివరకు ఆ భక్తశ్రేష్ఠుడు హవ్యునిగా హనుమద్దేవుని సేవలను ఈ ప్రాంతాలతో పొందాలంటాడు. మొదట్లో అర్థంకాదు, చివరకు 'స్వామీ...' అంటే 'భక్తి నాయనా, భక్తి... అందుకు దాసుడ'నంటాడు. ఆ మధ్వుడు మద్దిచెట్టుగా, స్వామి స్వామిగా ఇక్కడ వెలిసి, భగవద్భక్తిని లోకానికి చాటుతారు.

## గోష్పాదక్షేత్రం - కొవ్వూరు

గోదావరే పవిత్రము, దాని తీరప్రాంతాలు నిజంగా పరమపవిత్రాలు. ఇక ఈ కొవ్వూరు మహాతపస్వి గౌతముడు, తన భార్య అహల్యతో నడయాడిన ప్రదేశం. ఈ మహనీయుని వివరాలు (ఈ రచయితే నిత్య పారాయణ గ్రంథంగా వ్రాసిన) దేవీభాగవతంలో దర్శించవచ్చును. గోవు దాటిన వూరు 'గోవూరు'గా, ఆ తదుపరి 'కోవూరు, కొవ్వూరు' అయింది. ఈ కలికాలంలో కరువులతో అలమటిస్తున్నవారిని తన తపోశక్తితో 12 సం॥లు సేవిస్తాడు. ఇతని భక్తికి శివుడు పశుపతి కాబట్టి, శివ, గణపతులు, ఆవుదూడలై పంట పాడు చేస్తుంటే, గౌతముడు అదిలిస్తాడు. గోవు మరణించడంతో దుఃఖితుడైతాడు. కింకర్తవ్యం ... ఆలోచిస్తున్నాడు.



కృష్ణుడు, రుక్మిణి, సత్యభామలతో వచ్చి వూరడిస్తారు. విగ్రహరూపమొంది తరించమంటారు. అప్పుడు శివుడు గోరూపం వదలి, తన దూడ గణపతితో చిందులువేస్తాడు. గౌతముడు తన్మయుడౌతాడు. ఇక్కడ ఎన్నో ఆలయాలు వున్నాయి. అన్ని ప్రాచీనము కాకపోయినా, ఈ క్షేత్రం తీర్థం పరమపవిత్రాలు, పునీతాలు.

ఇంకా ఈ జిల్లాలో నర్సాపురం నుండి 3 కి.మీ దూరంలోని లక్ష్మణుడు ప్రతిష్ఠించాడనే 'దుర్గా లక్ష్మణేశ్వర స్వామి' ఆలయం.

## యనమదుర్రు - శక్తేశ్వరుడు

దేశంలో ఎక్కడాలేని విధంగా శివలింగం భీమవరం, యనమదుర్రు గ్రామంలో ఉంది. తలక్రిందులుగా తపస్సు చేస్తున్నట్లుగా లింగంపై ముద్రలు ఉండటం ఇక్కడి విశేషం. ఈ ఆలయానికి ఎన్నో విశేషాలు వున్నాయి. ప్రపంచానికి శివ, శక్తుల సమానత్వాన్ని నిరూపించటానికి ఒకే పీఠంపై నెలకొన్న శివుడు, పార్వతి కుమారస్వామి విగ్రహాలు బయల్పడ్డాయి. పార్వతీదేవి శక్తి. ఆశక్తితో కూడుకున్న ఈశ్వరుడు



శక్తీశ్వరుడు. జగన్మాత అయిన ఆ పార్వతీదేవి నెలల పిల్లాడయిన కుమారస్వామిని ఒడిలో లాలిస్తున్న రూపం ఇక్కడ అమ్మది. అలాగే శివుడుకూడా ఒక ప్రత్యేక భంగిమలో వెలిశారు. సాధారణంగా దర్శనమిచ్చే లింగరూపాన్ని వదిలెయ్యటమేకాక సాకార రూపంలో కూడా వైవిధ్యం చూపించారు మహాశివుడు. ఇక్కడ శీర్షాసనంలో తపోభంగిమలో కనబడతారు. శివుని జటాజూటం భూమికి తగులుతుంటుంది. ఆపైన ముఖం, కంఠం, ఉదరం, మోకాళ్ళు, పాదాలు.

స్వయంభువు అయిన యనమదుర్రు శక్తీశ్వరుడు ఏకపీఠం మీద వుండటం ఇది భూగర్భం నుండి వెలువడటం చెప్పుకోదగ్గ విశేషం. ఇక మహిమ విషయానికి వస్తే 'శక్తిగుండం' లోని నీరే స్వామివారికి అభిషేకాది కార్యక్రమాలకు ఉపయోగపడుతుంది. ఒకసారి మరమ్మత్తుల సమయంలో ఈ నీటితో నివేదన చేస్తే అది ఉబికి స్వామికి అర్పణమైంది. ఇందులో కాశీగంగ అంతర్వాహినిగా ప్రవహిస్తుందనేది భక్తజనుల దృఢవిశ్వాసం.

## పట్టిసాచలక్షేత్రం



పోలవరం మండలంలోని 'పట్టిసాచలక్షేత్రం'గా చెప్పే పాత పట్టిసంలో కొండకు దక్షిణాన వీరేశ్వరుడు, ఉత్తరాన భావ నారాయణ (శివకేశవులు) కొలువైయున్నారు. ఇచ్చటి వీరభద్రుడు లింగరూపుడు. దక్షయజ్ఞంకోసం పుట్టి, యజ్ఞధ్వంసానంతరం తన పట్టిసం ఆయుధాన్ని ఇక్కడ గోదావరిలో కడిగి, ఈ కొండపై భద్రకాళి సమేతుడై వెలిసాడనేది పురాణకథనం. ఆలయ మంటపంలో సూర్యనారాయణ, లక్ష్మి, గణపతి, నవగ్రహాలు, అలాగే శివకేశవాలయాల మధ్య 'అనిస్త్రీ - పునిస్త్రీ' అనే గ్రామ దేవతలు వున్నారు. భావనారాయణస్వామి కొలువైన ప్రాంతాన్ని నీలాచలమంటారు.

ఇక్కడి మరో విశేషం. వీరభద్రుడు, చక్రాయుధాన్ని భావనారాయణునకిక్కడే ప్రదానం చేసినట్లు స్థల పురాణం చెబుతుంది. నీళ్ళలో వున్న ఈ ఆలయం చెక్కుచెదరకపోవడం మరొక విశేషం. దేశంలోని అయిదు ప్రఖ్యాత ఆలయాలలో దీనినొకటిగా చెబుతారు. ఇక్కడి ఆలయంలో 'అరీశ్వరి, పురీశ్వరి' అనే దేవతలకు పూజలు చేస్తే సంతానంలేని వారికి సంతాన భాగ్యం కలిగిస్తారుట.

## ఆచంట - ఉమారామేశ్వరుడు

పాలకొల్లుకు 8 కి.మీ దూరంలో గౌతమి, వశిష్ఠల మధ్యగల ఆచంటలో ఉమారామేశ్వరస్వామి ఆలయం చాలా ప్రాచీనమైనది. చోళులు, చాళుక్యుల సమయంలో ఇది నిర్మింపబడివుండవచ్చునేది చారిత్రకుల భావన. ఇక పురాణం దృష్ట్యా ఆలోచిస్తే, తారకాసుర వధానంతరం శివపార్వతులు ఆనందముద్రలో నాట్యం చేస్తే శివసాయుజ్యంకోరి కైలాసంచేరిన .... దంపతులు, శివదంపతులను చూడటం గమనించిన శివుడు వారిని




బాలబాలికలను చేసి, బ్రహ్మచర్యానంతరం తనసన్నిధి లభిస్తుందని చెబుతాడు. దురదృష్టవశాత్తు శివునాజ్ఞను మీరిన వారలు భూలోకంలో తిరువళ్ళూరులో ఒకరు, మార్తాండపురం (నేటి ఆచంట)లో మరొకరు జన్మిస్తారు. మార్తాండపురంలో తీర్థయాత్రలతో శివధ్యానం చేస్తూ వచ్చిన ఆ దంపతులలోని పురుషుడు, ఇక్కడి కళావంతుల ఇంట్లో పుట్టిన తన భార్యను చూసాడు. అయినా శివభక్తిలో వారిరువురు ఏ భేదం లేకుండా సేవచేస్తుంటారు. చివరకొక మహాశివరాత్రిన పరస్పరానురాగమూర్తులైన వారు ఆదమరచి నిద్రపోయి లింగోద్భవపూజ చేయలేకపోతారు. చటుక్కున కళ్ళుతెరచిన ఆ భక్తుడు నిరంతర శివనామప్రియుడు కనుక తన ప్రియురాలి స్తనాగ్రమును లింగముగా తలచి, పరవశించి పూజిస్తాడు. అందుకు మురిసిన శివుడు వారికి తన సాయుజ్యము ఆ చంటి (స్తనాగ్రం)లో దర్శనమొసగినవాడు, ఇక్కడ ఆ'చంటీ'శ్వరుడిగ వెలుస్తాడు. దీంతో ఆచంట అయింది. భక్తకైలాసమయింది. ఇచ్చటి మదనగోపాలుడు చూడవలసిన దేవుడు.

చూడవలసిన **నత్తా రామలింగేశ్వరం.** రావణసంహారానంతరం తన రాజధానికి సీతతో బయలుదేరిన రాముడు దారిలో సీత ఈ సముద్ర ప్రాంతానికి మురిసి శివలింగప్రతిష్ఠ చెయ్యాలనుకుంటుంది. రాముడు ఆంజనేయుని బాణలింగం తెమ్మని పంపుతాడు. శివలీలగా కాలహరణమవుతుంటే సీత అక్కడ సముద్రంలో లభించే నత్తగుల్లలు ఇసుకతో లింగం రూపొంది ప్రతిష్ఠిస్తుంది. నత్తలతో రూపొందిందినందువలన ఈ లింగం, వూరు 'నత్తారామేశ్వర' మౌతుంది.

తాడేపల్లిగూడెం మండలంలోని **'ముత్యాలాంబపురం' లోని ముత్యాలమ్మతల్లి** గ్రామదేవత. కానీ, నిజమైన తల్లిగా భక్తసంరక్షణకు అన్నివిధాల ముందుంటుంది. హనుమాన్ జంక్షన్‌లోని ఆంజనేయస్వామి, వరప్రసాది. ఇచ్చటి రామాలయం దర్శనీయమైంది.

300 సం॥ల క్రితం నిర్మించిన శ్రీ ఆదిదేవ **ఎంబరుమన్నారు దేవాలయం,** ప.గో.జిల్లా **నర్సాపురంలో** చూడవచ్చును. అలాగే ద్వారకాతిరుమల సమీపంలోని **ఐ.యస్. జగన్నాథపురం**లోని 'నృసింహగిరి' కొండపైనగల **శ్రీభూత నరసింహస్వామి, కనకవల్లి అమ్మవార్లు** చూడదగ్గ దేవుళ్ళు. ఈ ఆలయానికి ఎదురుగా శ్రీపంచముఖ ఆంజనేయస్వామి, ఏకాక్షర గణపతి, ఆ వెనుక సర్వశ్రీనివాసులు దర్శించవచ్చును. ఇచ్చటి విశేషం, మనోవికారాలు, భూతబాధలు, నిస్సంతానం, అవివాహం, ఇతర సమస్యలతో బాధపడేవారు స్వామిని దర్శించి, సుఖానుభూతులను పొందవచ్చును.

ఈ16వ శతాబ్దంలో ఆకివీడు మండలంలోని పెదకాపవరంలో ఈ శ్రీవేణుగోపాలస్వామి ఆలయాన్ని నిర్మించారు. దీని స్థలపురాణం ప్రకారం 18వ శతాబ్దంలో ఆనాటి ధర్మకర్త శేషన్నగార్కి కూర్మనాధుడు కలలో కనుపించి తనవునికిని తెలియబరిస్తే, తెల్లవారి ఈ విషయం గ్రామస్థులకు తెలిపి జాడ తెలుసుకునే మార్గం కోసం భజన

చేస్తూంటే వీరి చుట్టు ఓ గరుడపక్షి ప్రదక్షిణం చేసి ముందుకు సాగింది. దానిని కొందరు అనుసరించారు. కొంతదూరంసాగి ఒక మట్టిదిబ్బమీద ఆగింది. దాంతో అక్కడ త్రవ్వడం, కూర్మనాధుని శిలారూపం దర్శనమివ్వడంతో, స్వామిని ప్రతిష్ఠించి, నిత్యోత్సవాలతో స్వామిని పూజించసాగారు.

ఏలూరు సమీపంలోని శరభసాల్వంలోని శ్రీజరాపహరేశ్వరుడు పురాతన దేవుడు. ఇక్కడి రాతి నంది కాలికి ఇనుప కడియం వుండటమొక విశేషం. ఎందుకు తొడిగారా ఎవరు చెప్పరు. ఎవరికి తెలియని పరమ చిదరంబర రహస్యమది.

## దువ్వ - దానేశ్వరి తల్లి

తణుకుకు 7 కి.మీ దూరంలోని దువ్వలో నిదానేశ్వరీ తల్లి త్రేతాయుగంనాటిదిగా చెబుతారు. ఈ దువ్వ పేరు దూర్వాసపురమని, ఇక్కడ దూర్వాసులు అఖండ తపస్సు చేసారని, వారి మంత్ర'శక్తి' స్వరూపమే ఒకనాడు అదృశ్యరూపంలో వున్న దానేశ్వరితల్లి. శక్తిమయమైన ఈ ప్రాంతం ప్రజలకు ఏ విధమైన కలతలు, కష్టాలురాకుండా, సకల గంగాజలాలతో పాడిపంటలను ప్రసాదించే చల్లని తల్లి 'కన్నతల్లి'గా విఖ్యాతమయింది.

## తడికలపూడి - శ్రీగోగేశ్వరస్వామి ఆలయం

800 ఏండ్లనాటిది. వేంగి చాళుక్యులు నిర్మించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తుంది. ఈ ఆలయంలోని శివలింగం తళతళ మెరుస్తూంటే, 'తళుకులపూడి' అనేవారు. అది కాలక్రమంలో 'తడికలపూడి' అయ్యింది. శివలింగంపై సూర్యకిరణాలు పడితే ఆ లింగం ఎంతో శోభాయమానంగా, చూడముచ్చటగా వుంటుంది. ఇంకో విశేషం. ఇది భీష్మపితామహుని ప్రతిష్ఠగా చెప్పుకుంటూంటారు.

**ఏలూరులోని చెన్నకేశవాలయం** 200 సం॥ల నాటిది. అయితే ఇక్కడ లభించిన శాసనాలను బట్టి ఇది 10వ శతాబ్దంలో వేంగీచాళుక్యుల కాలంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. ఇంకా తణుకుకు 16 కి.మీ దూరంలోని అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి దేవాలయం, అందలి ఉపదేవతలు, అలిమేలుమంగతాయారు, సిద్ధిబుద్ధి వినాయకుడు, వల్లి, దేవసేన సహిత సుబ్రహ్మణ్యుడు ... ఎందరినో చూసి తరించవచ్చును.

**'నిడదవోలు'**ను ఒకప్పుడ 'నిర్వ్యేపురం'మని పిలిచేవారుట. చాళుక్య ప్రభువు విజయాదిత్యుని కాలంలో ఓ గోపాలునికి శివలింగం కనిపిస్తే దానిని రాజుగారికిస్తాడు. ఆయన ఈ ఆలయం కట్టిస్తాడు. దీని పేరు **'గోలింగేశ్వరు'**డైంది. చరిత్ర ప్రసిద్ధి ఆలయంకాక, ఇంకా ఆలయాలు చూడతగ్గవే వున్నాయి.

'అత్తిలి' సమీపంలోని **'బల్లిపాడు'లోని రుక్మిణీసమేత మదనగోపాలుడు** చరిత్రకందనివాడు. ఒకసారి బల్లిపాడు గ్రామస్థులు, పాలకొల్లు దగ్గరగల 'పెనుమదం' గ్రామంలో చెరువు త్రవ్వడానికి వెడితే మనదగోపాలస్వామి విగ్రహం బయటపడింది. 300 సం॥ల క్రితం దొరికిన ఆ విగ్రహాన్ని అప్పుడు ఆ గ్రామస్థులు తమగ్రామంతో ఆలయం కట్టి ప్రతిష్ఠించుకున్నారు. చరిత్రకాదు. కాని తెలియని మదనగోపాలుడు, ప్రక్కనే శ్రీవేంకటేశ్వరునికూడా నిర్మించుకుని గ్రామస్థులు చరిత్ర సృష్టించుకున్నారు. ఇంకా కొన్ని ఉపాలయాలు కూడా నిర్మించుకుని ఆనంద మూర్తులయ్యారు. చూడదగిన వాటిలో ఇదొకటి.

ఒకనాటి 'దూతికాపురము' నేటి **జుత్తిగ.** ఇక్కడ **ఉమావాసుకీ రవిసోమేశ్వరక్షేత్రం,** గోస్థనీ నదీమహాత్మ్యము గురించి బహుపురాణ గ్రంథకర్త వేదవ్యాసుడు వ్రాసిన వాయుపురాణంలో ప్రస్తావించబడింది. వాసుకి, రవి, చంద్రులచేత ఈ శివలింగ ప్రతిష్ఠ జరిగిందట. ఇందుకు సంబంధించిన పురాణగాథ త్రిలోక విజేత అయిన రావణబ్రహ్మ ఒకానొక సమయంలో తన బలదర్పాలతో సర్పరాజు వాసుకిని, సూర్యచంద్రులను కూడా పరాభవించాడుట. అందుకు కుపితులైన వాసుకి, రవిచంద్రులు 'శివా'అంటూ లింగప్రతిష్ఠ చేసి భోరుమని విలపించారుట. ఆనాటి ఆ దివ్యప్రదేశమే ఈ గోస్తనీతీర బుత్తిగ.

ఇక్కడి ఆలయంలో దక్షిణ ముఖంగా పార్వతి, ఎడంవైపు భద్రకాళి వీరభద్రేశ్వరులు, ముఖమండపంలో అలిసిరమ్మ, శారదామాత, కుమారస్వామి, వున్నారు. పంచాయతన పద్ధతిలో వాయవ్యం – లక్ష్మీజనార్దనుడు, ఈశాన్యం సూర్యుడు, కాలభైరవులు; ఆగ్నేయం  గణపతి, నైఋతిన దుర్గాదేవి – నిలచి పూజలందుకుంటున్న అతి పురాతనమైన ఆలయమిది. ఇక్కడి ఘృష్ణేశ్వరుడు – జ్యోతిర్లింగంలోని ఒకడని, ఇక్కడి వారి భావన. ఇక్కడ ఆగ్నేయంలో గణపతి ప్రక్కన, ద్యుతికాదేవి వుంది. ఇక్కడ 'మృత్యుంజయకల్పం' అనే ప్రత్యేక పూజను చేయడం విశేషం. సర్వాభీష్టములు, సమస్యలు తొలగి ఈ పూజవలన సర్వులు సుఖంగా వుంటారు.

**'పెదవేగి'** చరిత్ర ప్రాధాన్యంగల గ్రామం. బౌద్ధ, జైనాల ప్రభావంతో ప్రకాశించిన గ్రామంకూడా! ఇందుకు సంబంధించిన చారిత్రక శిధిలాలను ఇప్పుడుకూడా మనం గుర్తించగల్గుతాం. పైగా ఇది ఒకప్పటి వేంగీరాజుల రాజధాని. దీనికి నిదర్శనంగా దీనికిక్కడో విశాలమైన పెద్ద మట్టి దిబ్బను చూడగల్గుతాం. ప్రస్తుతం ఆలయం పురావస్తుశాఖ వారి త్రవ్వకాలలో లభించినది. ఇంకా 5, 6,7 శతాబ్దాలనాటి శిధిలశిల్పాల నెన్నింటినో, ఆసక్తిపరులు ఇక్కడ చూడగల్గుతారు.

**ద్వారకాతిరుమల** సమీపంలోని **'కుంకుళ్ళమ్మతల్లి'** మహిమగల గ్రామదేవత. ఈమెనే 'రేణుకాదేవి' అని పిలుస్తారుట. సంతానం, విదేశ ప్రయాణాలు, అభీష్టసిద్ధి, ఫలించని కోర్కెలు నెరవేర్చడం, క్షుద్రదేవతాశక్తుల నిర్మూలనం, ఈ తల్లి కటాక్షం వలన సంప్రాప్తిస్తాయి.

**'తణుకు'** కు 3 కి.మీ దూరంలో **తేతలి** గ్రామం వుంది. ఇక్కడి **శ్రీరాజరాజేశ్వరస్వామి** 11వ శతాబ్దంలో రాజరాజనరేంద్రుడు నిర్మించినట్లు, ఈ స్వామి ఆనాది సంభవుడని చెప్పుకుంటారు. ఇక్కడి విగ్రహం అమ్మవారు, నాల్గుమూలలో నిలచిన మూషికవాహన గణపతి, వల్లి,దేవసేనాసమేత సుబ్రహ్మణ్యేశ్వరుడు, ఎప్పటిదో అయినా, ఇప్పటికీ అందంగా, చూడదగ్గవిగా దర్శినమిస్తున్నాయి. చరిత్రకు శిల్పసంపదకు శిరసువంచింప చేస్తున్నాయి.

ద్వారకాతిరుమలకు 7 కి.మీ తూర్పు **యడవల్లి** గ్రామం, పచ్చని ప్రకృతి అందాలకొబ్బరితోటల మధ్య ఆనందదాయకంగా వుండటంమొక విశేషం. ఇక్కడి మరో భద్రాద్రి అన్నట్లు నిలిచిన **శ్రీసీతారామస్వామి** వారి ఆలయం మరొక విశేషం. అడుగుపెట్టి చూస్తే ఆనందం, అందులోంచి, భక్తి... తెలుసుకోగల్గుతాము.

ప.గో.జిల్లాలోని మరో ప్రశాంత ప్రదేశం **జంగారెడ్డిగూడెం.** ఇక్కడ 'పారిజాతగిరి' అని చెప్పడానికి వీలుగా అశేష పారిజాత వృక్షాలతో విరిసే ఏడుకొండలలోని మూడోకొండపై ఆ తిరుపతి వేంకటేశ్వరుడు వెలిసి గోకుల తిరుమల పారిజాతగిరిగా ఈ ప్రాంతాన్ని పవిత్రం చేసాడు. తిరుమలలో జరిపేటట్లు ఇక్కడి పూజాదికాలు నిర్వహించబడతాయి.

పాలకొల్లు సమీపంలో **'కొంతేరు'** అనేవూరు. అక్కడ **శ్రీ కుంతీలక్ష్మీనరసింహస్వామి.** చక్కని ప్రకృతి అందాలమధ్య దర్శించవచ్చును. ఇక్కడి విశేషం ఈ స్వామిని కుంతీదేవి గజపీఠంపై ప్రతిష్ఠించినట్లు చెబుతారు. ఈ గజపీఠం 3 ఏనుగులతో, శంఖచక్రాలు గుండ్రని ఆకృతిలో రంధ్రం వుండటంలో, స్వామిని సాలగ్రామ రూపంలో వుండటంతో, ఎప్పుడు దీనిని నీటిలోనే వుంచుతారు. రోజు మార్చుతుంటారు. అలాగ మార్చకపోతే స్వామి సెగలు, పొగలు గ్రక్కుతాడు. ఈ సాలగ్రామతీర్థం పుచ్చుకున్న వారికి ఎటువంటి రోగమైనా నిర్మూలించ బడుతుందంటే... పిచ్చి కుదరడమొకలెఖ్ఖా?!

'కొర్సావారిగూడెం' పంచాయితీ సమీపంలోని **'గోగులపూడి'**లో **'గుబ్బలమంగమ్మ'** ఆలయం వుంది. ఈ రాతికొండమధ్యలో గుబ్బలు, గుబ్బలులో ఆలయం వుండటంతో, చరిత్ర తెలియని, చెప్పలేని ఈ గ్రామ దేవత ఆలయం భక్తజనుల చేత నమస్కరింపబడుతుందేతప్ప, వివరాలు మాత్రం దొరకడంలేదు. అందుకు 'అమ్మా! అంటూ నమస్కరించడం మన సంస్కారం. కాకపోతే ఏడాది పొడువునా గుడి పైభాగంనుండి జలధారలు ప్రవహించి, ఆ తల్లి శక్తిని అందరికి చాటుతుంది.

## కోట - సత్తెమ్మతల్లి

నిడదవోలు మండలం, 'తిమ్మరాజుపాలెం' గ్రామంలో కోటసత్తెమ్మతల్లి ఆలయముంది. 13 వ శతాబ్దంలో తూర్పు చాళుక్యులు పరిపాలించిన కాలంలో రుద్రమదేవి భర్త, వీరభద్రచాళుక్యుడు ఈ జిల్లాలోని కొంత భాగాన్ని పరిపాలించాడుట. వారికి దుర్గమాలకు రక్షకి ఈ కోటసత్తెమ్మతల్లి. కాలప్రభావంగా, ఆయా రాజ్యాలు అంతరించడంతో అదృశ్యమైన ఆ తల్లి ఈమధ్యకాలంలో 1936లో మరల వెలుగుచూసింది.

## ఉప్పులూరు - చెన్నకేశవస్వామి



పల్నాటి యుద్ధ సమయంలో జరిగిన దాడుల సమయంలో కన్నమదాసు సంతతి వారు చెన్నకేశవస్వామి విగ్రహంతో పారిపోయి, ముందు సింహాచలం, అటునుండి 'ఉండి' మండలం లోని ఉప్పులూరు చేరుకున్నారు. పల్నాటి దేవుడు సంచార దేవుడైపోయాడు. పరిస్థితులకు అనుగుణంగా 'సింహాచల అప్పన్న'ను చేసిన, తిరువీధి నారాయణదాసు సోదరులు, నైవేద్యం కోసం గ్రామంలోకి, మర్రిచెట్టు మొదట్లో స్వామిని వుంచి, మరీ వెళ్ళారు.

ఆనాటి స్థితిలో వారు బందీలయ్యారు. తరువాత స్వామి గ్రామ పెద్దకు కలలో కనుపించి విషయం చెబితే, స్వామిని తెచ్చి, ఆలయం కట్టి ప్రతిష్ఠిస్తారు. 1835లో ఆలయం, 1868లో ఈ అప్పన్న యధావిధిగా చెన్నకేశవుడయ్యాడు. అప్పటినుండి 'అందరివాడ'నడానికి నిదర్శనంగా, దళిత అర్చకులతో అర్చనాదికాలు, వేదాభ్యాస ఘోషలు ఇక్కడ సాంప్రదాయబద్ధంగా సాగుతున్నాయి.

ఇవికొన్నే, ఇంకా ... ఓపిక వుండాలికాని, చెప్పడానికి కాదు, చూడటానికి ఎన్నోవున్నాయి. అన్నింటికి ముందు ఓ నమస్కారం... ఆతర్వాత అదృష్టం, భగవత్కటాక్షం.

## శ్రీసోమేశ్వర జనార్దనుడు - గునుపూడి (భీమవరం)

పంచారామాలలోని మరొకటి. ఇది చంద్రప్రతిష్ఠ. తూర్పుచాళుక్యులలోని మొదటి చాళుక్యభీముడు ఈ ఆలయాన్ని నిర్మించాడని చరిత్రకారుల ఆలోచన. ఈ ఆలయానికి క్షేత్రపాలకుడు జనార్దనస్వామి. ఇచ్చట అయిదు నందులు ఉండటంతో శ్రీసోమేశ్వరజనార్దనుడు, అయిదు నందుల దేవుడని పిలువడం కూడా కలదు.

అగస్త్యమహర్షి - కాశీవిశ్వేశ్వరుని వియోగం భరించలేక దక్షిణాదికి వచ్చి ఈ క్షీరారామ, సోమారామాలను దర్శించాడని పురాణకథనం. దీనిని సోమారామమని కూడా అంటారని శ్రీనాథ మహాకవి తనకాశీఖండంలో తెలియబరిచాడు. ఇక్కడి విశేషం. ఇది చంద్రప్రతిష్ఠ కావడంతో తన పదహారుకళలు లింగంపై ప్రతిబింబిస్తాయి. ఈ లింగం అమావాస్యనాడు బూడిద/గోధుమవర్ణానికి, పున్నమినాటికి క్రమక్రమంగా శ్వేతవర్ణానికి వస్తుంది. ఇక్కడి నందులు విచిత్రమైనవే.

కోనేటినందినుండి చూస్తే స్వామి, దేవాలయం ముందున్న నందినుండి చూస్తే అన్నపూర్ణాదేవిని చూడగల్గుతాము. ఇది త్రేతాయుగంనాటిదని, దేవతానిర్మాణమని చెబుతారు. చరిత్రకు, సత్యధర్మాలకు నిలువెత్తు సాక్ష్య మీ గునుపూడి స్వామి.

## పిలిస్తే పలికే భీమవరం మావుళ్ళమ్మ



మామిడిచెట్ల మధ్యలో వెలిసిన ఈ తల్లిని 'మామిళ్ళమ్మ' అంటే అది కాలక్రమంలో 'మావుళ్ళమ్మ' అయింది. ఈమె గ్రామదేవత. ఇవ్వాల్టి పేటలు - ఆనాటి గ్రామాలు. వారంతాకలిసి, అమ్మను పూజించు కోవడం సాంప్రదాయమైంది. 1200 సం॥లో వీరవాసరం సమీపంలోని రాయకుదురు గ్రామంలో వెలిసారంటారు కానీ కీ.శ. 1880నుండి ఆ తల్లి లీలలు తెలుస్తున్నాయి. మా వూరి అమ్మ... మావూళ్ళమ్మ... అటునుండి మావుళ్ళమ్మ... అయిందని కొందరు పెద్దలు చెబుతారు. ఏదిఏమైనా ఈ తల్లి ....

మారెళ్ళ మాచిరాజు గ్రంధి అప్పన్నలకు దొరికిన విగ్రహం దెబ్బతింటే, గ్రంధినర్సన్నకుమారుడు అప్పారావు అమ్మను శాంతమూర్తిగా రూపొందించాడని, తాతవోలు నాగభూషణాచార్యులు, దెబ్బతిన్న విగ్రహం బదులు శ్రమించి విగ్రహం రూపొందిస్తే, అది కాస్త ఉగ్రంగా వుండటంతో గ్రంధి అప్పారావు శాంతిమూర్తిగా ఆ తల్లిని రూపొందింపచేస్తాడు. ఇప్పుడే తల్లికి మెంటేవారు, అల్లూరివారు పుట్టింటివారిగాను, గ్రంధి అప్పన్న వారి వంశీయులు అత్తింటివారుగాను.. సకల శుభదాయకంగా... కల్యాణాదులు జరిపిస్తున్నారు.

# కృష్ణా జిల్లా

## కనకదుర్గ అమ్మవారి దేవాలయం (విజయవాడ)

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా ప్రధాన కేంద్రమయిన విజయవాడ లోని ఇంద్రకీలాద్రి పర్వతముపై వెలసిన కనకదుర్గ అమ్మవారిని తెలుగు ప్రజలు చల్లని తల్లిగా భావించి పూజిస్తారు. అష్టాదశ శక్తి పీఠములలో ఒకరైన శ్రీకనకదుర్గ అమ్మవారి వల్ల ఈ పట్టణమునకు కనకవాడ, కనకపురి, విజయవాడ అని పేరు వచ్చినది. ఈ అమ్మవారు స్వయంగా వెలసినట్లు పురాణాల ద్వారా చెప్పబడు చున్నది. కానీ విజయవాడకు చరిత్ర ప్రసిద్ధి సహజంగానే లభించిందితప్ప దీని అభివృద్ధికి ఏ ఒక్కరు పాటుపడలేదు. రాజకీయంగా, వ్యాపార, సాంఘికంగా, రవాణా, ప్రయాణ విషయాలలో పొందిన అభివృద్ధి "విశాఖపట్టణం సహజరేవు" వంటిది. ప్రతి ఒక్కరు ఇక్కడనుండి ఎదిగినవారే తప్ప విజయవాడను ఎదగనిచ్చినవారు లేరనే చెప్పాలి.



ఇక కనకదుర్గ ఆలయం ఎప్పుడు నిర్మించబడిందో చెప్పే ఆధారాలుకూడా ప్రత్యేకంగా కనబడటంలేదు. "దుర్గ"గా పిలువబడే తల్లి "కనక" దుర్గ ఎప్పుడయిందో, ఎలాగయిందో చెప్పడానికి సరైన చారిత్రకాధారాలు కనబడటం లేదు.

ఒకప్పుడు "ఇంద్రకీలుడ"నేవాడు దుర్గమ్మగూర్చి తపస్సుచేసాడని, అందుకే ఈమెను దుర్గగా, ఈ పర్వతాన్ని ఇంద్రకీలాద్రిగా వుదహరించడం జరుగుతుందని చెబుతారు.

మొదట్లో మహాతీక్షణంగా ఉగ్రంగా వుండే ఈ తల్లిని ఆదిశంకరులవారు శ్రీచక్రం ప్రతిష్ఠించి శాంతపరచారనేది ఒకకథనం. తన శరీరంలోని 'ఉగ్రం' చల్లారకపోయేసరికి, ఈ తల్లి తన కుడికన్నుద్వారా అగ్నిని బయటకు చిమ్మిందని, దాంతో అమ్మవారికి కుడివైపున వున్న భాగం విడిపోయి ఆకాశానికి ఎగరడం, దూరంగా పడటం, ఆ అగ్నిసెగలు క్రక్కే ఆ పర్వతభాగంపై ఉగ్రనరసింహుడు అడుగుపెట్టడంతో దానికి మంగళగౌరి పాదస్పర్శచే పవిత్రమైంది కాబట్టి "మంగళగిరి" అయిందని...

స్వామిని, పర్వతాన్ని శాంతింపచెయ్యడానికి పానకం నివేదనగా అర్పిస్తూ – ఇక్కడ వుండే స్వామిని పానకాల నరసింహస్వామి చేసారని మరొక కథనం. జగన్మాత ఇంద్రకీలాద్రిన నివసించడంతో జగత్పతియైన శివుడు ఈ పర్వతంపై నివసించడంతో ఆ ఆదిదంపతులను బ్రహ్మగారు "మల్లెపూల"తో పూజించినందు వలన శివునికి "మల్లేశ్వరుడ"ని పేరు వచ్చిందని చెబుతారు. బ్రహ్మపూజకు, స్వామి దర్శనానికి పులకించి, అమ్మవారు కనకవర్షం కురిపించిందని, దాంతో "దుర్గ" గావుండి దుర్గమాసురుని చంపిన ఈ తల్లి, దుర్గనుండి "కనకదుర్గ" అయిందన్నది ఇంకో కథ.

అయితే పాశుపతాస్త్ర కథకు, విజయవాడకు సంబంధలేదన్నది మరొకవాదన. కాకపోతే రథం సెంటరునుండి ముందుకు వెడితే ఒక పురాతన శివాలయం కనుపిస్తుంది. ఇక్కడ ఈయన పేరుకూడా మల్లేశ్వరుడే. అమ్మవారి

పేరు 'భ్రమరాంబ" అని ఇదే పురాతన శివాలయమని, ఇంద్రకీలాద్రిపైవున్న అమ్మవారు "దుర్గ" ప్రాచీన స్వరూపమేనని ఎటొచ్చి శివుడే ఆ తరువాత నిర్మాణమైనాడనేదొక వాదన. మొత్తానికి కథలు చెప్పుకుంటున్నాము కానీ, నిజానికి వాటి ఆనవాళ్ళు అంటే చరిత్రకాధారాలు చాలవరకు దొరకడం లేదు. కాకపోతే దుర్గమ్మ "కనకదుర్గమ్మ"గా మారిన కథ – తెలుసుకుంటూ, ఆ తల్లి కరుణను అందరు పొందాలనే తపనతో తరిద్దాం.

"విజయవాడ" అనే ఈ"విజయవాటిక"ను మాధవశర్మ పరిపాలిస్తూండేవాడు. ఒకనాడాతని కుమారుడు రథం మీద విపరీత వేగంతో వెడుతూంటే ఒక బాలుడు రథం క్రింద పడ్డాడుట. ఆ వార్త రాజుగారికి అందింది. యువరాజు అనికూడా చూడకుండా, ఆ రాజు భావి మహారాజుకు మరణ దండన విధిస్తాడు.

ఇది అధిదేవతయైన దుర్గమ్మకు ఆనందదాయకమై రాజు ధర్మనిరతికి సంతోషించి, చనిపోయిన బాలుని వధించిన రాజకుమారుని బ్రతికించి, ఆనందంతో కనకవర్షం కురిపించిందట. ఆ క్షణం నుండి ఇంద్రకీలాద్రిపై వెలసిన జగదంబను అందరు "కనకదుర్గ"మ్మ అని పిలవడం ప్రారంభించారు.

ఇటువంటి దుర్గమ్మ కథనం భారతంలోనూ వుంది. శ్రీమద్భాగవతంలో ఈ తల్లి ప్రస్తావన వుంది. కాని పూర్తి చారిత్రక వివరాలు మాత్రం... 'ఇది' అని చెప్పదగ్గ విధంగా కనబడకపోయినా...

ఇక్కడి తల్లి మాత్రం .. "తల్లే..." సర్వధర్మసంరక్షిణి. ఈ తల్లికోసం, భారతదేశం మొత్తంనుండి వచ్చే భక్తులు వున్నారు. ఈ తల్లిని సేవించి పొంగళ్ళు సమర్పించేవారున్నారు. ఈ తల్లిని సేవించుకోవడం, భక్తిప్రపత్తులు ప్రదర్శించుకోవడం మనకు భాగ్యం.

త్రేతాయుగమున శ్రీరామచంద్రుడు అరణ్యవాసము చేస్తూ సీతాసమేతంగా ఈ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గను అర్చించినట్టు శ్రీరాముడు ఒక వాయులింగాన్ని కూడా ఈ కొండపై ప్రతిష్టించినట్లు, ఈ వాయులింగమే రామలింగేశ్వరుడని పురాణాల ద్వారా చెప్పబడుచున్నది. శ్రీ కనకదుర్గ అమ్మవారి బ్రహ్మోత్సవాలు చైత్రపూర్ణిమకు, శివరాత్రి, ఆశ్వయుజ పాడ్యమి మొదలు దశమి వరకు జరుగుతాయి.

**అమ్మవారి అలంకారములు :** పాడ్యమినాడు – శ్రీ బాలాత్రిపుర సుందరిదేవిగా, విదియనాడు శ్రీ కనకదుర్గగా, తదియనాడు – శ్రీ గాయత్రిదేవిగా, చవితినాడు – శ్రీ మహాలక్ష్మిగా, పంచమినాడు శ్రీ అన్నపూర్ణగా, షష్టినాడు – శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా, సప్తమినాడు – శ్రీ సరస్వతీదేవిగా, మహర్నవమినాడు – శ్రీ మహిషాసురమర్ధనిగా, విజయదశమినాడు – శ్రీ రాజరాజేశ్వరిగా అలంకరించి దుర్గమ్మ శరన్నవరాత్రోత్సవాలు దిగ్విజయంగా నిర్వహిస్తారు.

ఈ దసరా ఉత్సవాలలో లక్షలాది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ క్షేత్రములో శుక్ర, ఆదివారములలో నిర్విరామంగా దర్శనం కొనసాగుతుంది. మిగిలిన రోజులలో ఉదయం గం॥5–00 నుండి గం॥12–00 వరకు, మధ్యాహ్నము గం॥2–30 నుండి గం॥9–00 వరకు దర్శనం చేసుకోవచ్చు. అమ్మవారి దేవాలయమునకు క్రింద కృష్ణానదిలో దుర్గాఘాట్ ఎంతో పవిత్రమైన స్థలము. 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే కృష్ణానది పుష్కరాలలో ఈ స్నానఘాట్‌లో స్నానం చేసి అనంతరం కొండపై నున్న అమ్మవారిని మెట్లు మార్గంలో వెళ్ళి దర్శించుకోటానికి ప్రాధాన్యతనిస్తారు.

దసరా రోజులలో దుర్గాఘాట్ నుండి హంస వాహనంవలే అమర్చిన తెప్పపై అమ్మవారు విహారం చేసి భక్తులకు కనువిందు చేస్తారు. విజయదశమి రోజు సాయంత్రం మెట్లు మార్గము దగ్గర ఉన్న జమ్మి దొడ్డిలలో పోలీసు వారి ఆధ్వర్యంలో శమీ పూజ జరుగుతుంది. ఆ రోజు రాత్రి విజయవాడ నగరం అంతా అమ్మవారి ఊరేగింపు జరిపి తెల్లవారుజామున కొండపైకి తీసుకొనివెళతారు.

ఈ ఇంద్రకీలాద్రి పర్వతంపై శ్రీ కనకదుర్గ అమ్మవారితో పాటు మల్లిఖార్జునస్వామితోపాటు అనంతర కాలంలో నిర్మించిన నటరాజస్వామి, శివకామ సుందరీదేవి కొలువుతీరి ఉంటారు. శివరాత్రినాడు జరిగే రథోత్సవము ఈ ఆలయంలో మరో ప్రత్యేకత.

విజయవాడ రైల్వే స్టేషన్ దగ్గర నుండి, దుర్గ ఘాట్ వద్ద నుండి కొండపైకి దేవస్థానం బస్సు సౌకర్యము కలదు. కొండపై దేవస్థానం వారి పూజ సామానులు అమ్మవారి ఫోటోలు, ప్రసాదము అమ్ము కౌంటరులు కలవు. ఇది చారిత్రక, పౌరాణిక, ప్రశస్తికల్గిన ప్రదేశం. చాళుక్యరాజు త్రిభువనమల్లు, అనంతరకాలంలో సింగభూపాలుడు, శ్రీకృష్ణదేవరాయలు వగైరా రాజులు కనకదుర్గామల్లేశ్వర దేవస్థానాన్ని అభివృద్ధి చేసారని ఎన్నో కానుకలు, నిత్యకైంకర్యములకై దానాలు (భూములు) ఇచ్చారని కూడా శాసనాలుద్వారా తెలుస్తున్నాయి. అగస్త్యమహర్షి ఈ తల్లిని సేవించారని, బ్రహ్మఇక్కడ శతాశ్వమేధయాగాన్ని చేసారని, అందుకు సంతోషించిన శివుడు జ్యోతిర్లింగుడై దర్శనమివ్వ, బ్రహ్మ ఆ ఈశ్వరుని మల్లికాపుష్పాలతో పూజించిన కారణంగా, మల్లికేశుడు, మల్లేశ్వరుడు అయ్యాడని, ఇక్కడే బ్రహ్మ దుర్గామల్లేశ్వరులకు సాంప్రదాయకంగా కల్యాణం జరిపించాడని ఆ ఆనవాయితీ ఇప్పటికి కొనసాగుతుంది. కాకపోతే అదృశ్యరూపంలోవున్న జ్యోతిర్లింగాన్ని ఆదిశంకరులవారు దర్శించి, దాని స్థానంలో ఆదిశంకరులు లింగప్రతిష్ఠను జరిపారని ఇప్పుడది మల్లేశ్వరలింగంగా పిలువబడుతుందని, ఇలాగే అగస్త్యులవారు ఈ మల్లీశ్వరుని దర్శించి అర్చించారని కూడా తెలుస్తుంది.

ఇక్కడే ఇంద్రకీలాద్రికి దక్షిణభాగంలో పాండవమధ్యముడైన అర్జునుడు, శివలింగాన్ని ప్రతిష్ఠించాడని, దానిని 'జయేశ్వరస్వామి'గా పిలుస్తారు. విజయుని పేరిట (అర్జునుని మరోపేరు) ఇది "విజయవాడ"గా మారిందనికూడా చెబుతారు.

మొత్తానికిది దివ్యక్షేత్రం – చూసి, తరించాల్సిన పరమ పవిత్రక్షేత్రం.

ఈ అమ్మను భాగవత శిఖామణి, భాగవత (తెలుగు) కర్త బమ్మెర పోతన, తన భాగవతంలో ఇలాగ స్తుతించాడు.

: : దుర్గాస్తుతి : :

అమ్మలఁగన్నయమ్మ ముగురమ్మలమూలపుటమ్మ, చాలఁపె
ద్దమ్మసురారులమ్మ కడుపాఱడీపుచ్చినయమ్మ, దన్నులో
నమ్మినవేల్పుటమ్ముల మనమ్ములయుండెడియమ్మ, దుర్గ
మాయమ్మ కృపార్ధియిచ్చు తమహత్త్వకవిత్వపటుత్వ సంపదల్.



☆☆☆

విజయవాడ పాతబస్తీలోని కన్యకాపరమేశ్వరి ఆలయం చెప్పుకోదగ్గది. దీనికో వంద సంవత్సరాల చరిత్ర ఉంటే, భావనారాయణవీధిలోని కోదండరామస్వామి ఆలయానికి 200 సం॥ల చరిత్రవుంది. ఇచ్చటి విశేషం చిత్రంగా శ్రీరామునికి ఎడంవైపున ఉండాల్సిన సీతకుడిప్రక్కన, ఇక్కడ వుండే లక్ష్మణుడు ఎడమప్రక్కన వున్నారు.

☆☆☆

ఇక గుడ్లవల్లేరులోని గంగాపార్వతీ సమేత సిద్ధేశ్వరాలయం 400 సంవత్సరాలనాటిది, కాకపోతే 1993 సం॥లో దానిని పునరుద్ధరించారు.

☆☆☆

చినకళ్ళేపల్లిలోని శ్రీగంగాబాలత్రిపురసుందరీ సమేత శ్రీనాగేంద్రస్వామి ఆలయం కూడా పురాతనమైనది.

☆☆☆

విజయవాడకు 25 కి.మీ దూరంలో ఆగిరిపల్లి. అక్కడ కొండ, దానిపేరు శోభనాచలం. అక్కడి దేవుడు వ్యాఘ్రనృసింహస్వామి. ఈ గ్రామంలో రెండు నరసింహస్వామి ఆలయాలు వున్నాయి. ఒకటి కొండపైన, రెండోది పాదభాగంలో. కొండ ఎక్కలేని భక్తుల ప్రార్థనతో స్వయంభువు అయిన స్వామి కొండభాగాన వెలిసాడని 500 సంవత్సరాలనాటి సంఘటనగా చెబుతారు. నూజివీడు జమీందారులు వేలాది ఎకరాలు స్వామి కైంకర్యానికిగాను సమర్పించుకున్నారు.

## శ్రీలక్ష్మితిరుపతమ్మ - పెనుగంచిప్రోలు




ఒక సామాన్య గృహిణి, తిరుపతమ్మ. తన భక్తి ప్రపత్తులతో అడుగుపెట్టిన చోట సిరిసంపదలను ప్రసాదించే తల్లిగా గ్రామస్థులు ప్రశంసించేవారు. ఒక సంవత్సరం వర్షాలు కురవక కరువు కాటకాలు సంభవిస్తే, ఇదేదో ఈ తల్లి తప్పుగా, అత్త, తోడికోడలు ఆరళ్ళుపెట్టారు. అన్నింటిని భరించింది. ఇటువంటి స్థితిలో భర్త గోపయ్య, పశువుల మేతకు అడవిలోకి వెళితే పెద్దపులి చంపుతుంది. అదివిన్న ఈ తల్లి శరీరం విడిచిపెడుతుంది. తానీ వూళ్ళోనే దేవతగా వెలుస్తానని, మీ బాధలు తీరుస్తానని చెబుతుంది.

భర్త శరీరంతో సహగమనం చేసి, దేవత అవుతుంది. ఈ తల్లికి 17వ శతాబ్దంలో శ్రీరాజావాసిరెడ్డి జగ్గభూపాలుడు, ఆమె నివసించిన పెనుగంచిప్రోలులో ఆలయనిర్మాణం చేస్తాడు. పేరంటాలుగా తల్లి, ఎందరో పూజలనందుకుంటూ వారివారి కోర్కెలను తీర్చి కరుణిస్తుంది.

ఇక్కడో ప్రాచీన శంభులింగేశ్వరాలయముంది. అలాగే లక్ష్మీనరసింహస్వామి ఆలయం. ఇదీ ప్రాచీనమైనదే.

శ్రీకాకుళంగ్రామంలోని ఏకరాతి ప్రసన్న మల్లికార్జునస్వామి ఆంధ్రమహావిష్ణువు ఆలయాలు ఎంతో ప్రసిద్ధి గాంచినవి. ఈ ఆంధ్రమహావిష్ణువును, శ్రీకృష్ణదేవరాయలు దర్శించాడని, ఎన్నో భూములు, కానుకలు ఇచ్చాడనీ, ఇది బ్రహ్మ ప్రతిష్ఠితమని చెబుతారు. చోళరాజైన అనంతదండపాలుడు, రాజగోపురం నిర్మాణం చేసాడని శాసనాల ద్వారా తెలుస్తుంది. చివరగా యార్లగడ్డ వంశీయులైన జమీందారు ఆలయనిర్వహణ వగైరాలు అనువంశీకంగా జరుపుతున్నారని, ఏదిఏమైనా ఇక్కడ రాయలు 'ఆముక్తమాల్యద' కు ప్రాణప్రతిష్ఠ చేసాడుకాబట్టి ఈ ఆంధ్రమహావిష్ణువును సాహితీచక్రవర్తిగా చెప్పవచ్చును.

**కృష్ణాజిల్లాలో ఎన్నో చెప్పుకోదగ్గ ఆలయాలు, చారిత్రక సత్యాలు మనకు తెలియబడతాయి.**

ఇచ్చటి **ఘంటసాల** – బౌద్ధనిర్మాణాల ఆనవాలు కనబడతాయంటారుకాని, ఇక్కడ అగస్త్యముని ప్రతిష్ఠించాడనే ఒకే పానపట్టంపై, జలధీశ్వరునిగా శివుడు, బాలపార్వతిదేవిగా జగన్మాతలు దరిశనమిస్తారు. ఇచ్చటి పానపట్టం భూమిని తాకదు. శ్రీచక్రం అమ్మవారిముందు పూజలందుకుంటోంది. ఈ ఆలయ ఆవరణంలో వల్లీదేవసేనాసమేత సుబ్రహ్మణ్యేశ్వరుడున్నాడు.

**మచిలీపట్నం** – దక్షిణ దిశలోని శ్రీనగరిపురిలోని **మహిషాసురమర్దినీ ఆలయం** 300 సం॥ నాటిదట. దీనినే 'శివగంగ' ఆలయమని పిలుస్తారట.

ముదినేపల్లి మండలం – **వడాలిలోని జగన్నాధస్వామి ఆలయం** 400 సం॥నాటిదట. చిలకలపూడి –

పాండురంగస్వామి, 500 సం॥నాటిది. మచిలీపట్నం వేంకటేశ్వరస్వామి దర్శించదగ్గవి. అలాగే వైరా (వీరులపాడు పశ్చిమంగా కట్టలేరు – వైరాసంగమం) లోని సంగమేశ్వరాలయం, 200 సం॥ల నాటిది. ఇందులో చెన్నకేశవస్వామి ఆలయం కూడా వుంది. శివ, కేశవభేమంలేకుండా భక్తజనులతో ఆరాధింపబడుతోంది.

**తోట్లవల్లూరులోని భ్రమరాంబా, చెన్నమల్లికార్జునస్వామి వారి ఆలయం, మచిలీపట్నంలోని శ్రీరాజరాజేశ్వరి రామలింగేశ్వరస్వామి** వారి, 400 సం॥నాటి ఆలయం, మంగినపూడి సముద్రతీరంలోని శ్రీదత్తాత్రేయ క్షేత్రంలో ఎప్పటినుంచో వున్న నగరేశ్వరస్వామి ఆలయం వెనక 12 పుణ్యతీర్థాలుగల బావులు నిర్మింపబడ్డాయి. శ్రీసుబ్రహ్మణ్య స్వామి, గణపతులతోపాటు 'హృషీకేష్'లో లభించిన 54 శివలింగాలను కూడా ప్రతిష్ఠించారు. దర్శనానికి వచ్చిన భక్తులు 12 బావులలోని జలాలతో ఈ శివలింగాలను అభిషేకించి అప్పుడు అమ్మవార్ని, అయ్యవార్ని దర్శిస్తారు.

**మచిలీపట్నం,** పరాసుపేటలోని **సువర్చలాసమేత ఆంజనేయస్వామి** వారిని ఛత్రపతి శివాజీ మహారాజు గురుదేవులు సమర్థరామదాసు నిర్మించారు. సీతాన్వేషణ సమయంలో ఆంజనేయులు ఇక్కడ కొద్దిసేపు గడిపిన స్థలంగా తలచి ఇక్కడ మందిరనిర్మాణంచేసారు.

## పృథ్వీశ్వరాలయం - నడకుదురు

ద్వాపరయుగంనాటికే ఈ ఆలయమున్నట్లు చెప్పుకుంటారు. ఆకాలంలో నరకాసురుడు ఇక్కడ ద్విముఖుడనే బ్రాహ్మణుని సంహరించిన వచ్చిన పాపానికి ఈ పృథ్వీశ్వరుడిని పూజించి పాపవిముక్తు డయ్యాడుట. అంతేకాదు. నరకాసుర సంహారానంతరం శ్రీకృష్ణుడు, ఇక్కడి లక్ష్మీనారాయణులను పాటలీ పుష్పాలతో పూజించాడని, వీటిని నందనవనంనుండి తెచ్చాడని చెబుతారు. కృష్ణుడు పూజించిన ఈ విగ్రహాలు కార్తీకవనంలో వున్నాయి. ఒకనాటి 'నరకోత్తారకక్షేత్రం' కాలంలో మార్పులవలె 'నరకొత్తూరు, నడకదురు,... చివరకు 'నడకుదురు'రైకూర్చుంది. ఈపృథ్వీశ్వరుడు పిల్లలులేని వారలకు పిల్లలనిస్తాడుట, ప్రయత్నించండి!

## పెదముక్తేవి

పంచలక్ష్మీనారాయణ క్షేత్రాలతో మొదటిది, ప్రధానమైనది పెదముక్తేవి, కృష్ణాజిల్లాలో వుంది. అవనిగడ్డ, నడకుదురులలో ఉండేవి మిగిలిన రెండు అయితే, మూడు, నాలుగు గుంటూరుజిల్లాలోని, నల్లూరు, రాచూరులలో వున్నాయి. వీటికి పంచవైష్ణవారామాలని పేరు. ఈ పెదముక్తేవిలోనిది వ్యాసప్రతిష్ఠగా పేర్కొంటారు.

## మోపిదేవి

పెదకళ్ళేపల్లికి ఏడు కి.మీ. దూరంలో ఈ మోపిదేవి ఉంది. ఇది సుబ్రహ్మణ్యక్షేత్రం. ఇక్కడ స్వామి సర్పాకారములో ఉంటాడు. ఇక్కడ కృష్ణ తూర్పు పాయ ప్రవహించే ప్రదేశం. ఈ పాయదాటితే పులిగడ్డ వస్తుంది. ఇది దాటి రేపల్లెవైపు వెళ్ళవచ్చును. మోపిదేవినుండి ఇప్పుడు అన్ని ప్రాంతాలకు ప్రయాణసౌకర్యాలు వున్నాయి.

ఈప్రాంతం గురించి స్కాందపురాణంలో వుంది.అందులో పులిగడ్డ ప్రస్తావనకూడా వస్తుంది. ఈ క్షేత్రాన్ని అగస్త్య నిర్మాణక్షేత్రమని ఒక పురాణగాథ ప్రచారంలో వుంది. కాకపోతే స్థానికుల కథనం ప్రకారం, ఈ ప్రాంతం పూర్వం పుట్టలమయమని, దీనికి దగ్గర్లోని చిన్న పల్లెలో కుంభారులు (కుమ్మరి) వుండేవారని, వారిలో పర్వతాలు అనే ఆయనకు స్వామి కలలో కనుపించి తనవునికిని చెప్పారని –



శ్రీస్వామి ఆదేశం ప్రకారం ఆయన పుట్టను త్రవ్వి అందులోని మూర్తిని పుట్టపైనే ప్రతిష్ఠించాడని చెప్పుకుంటారు. ఆ తర్వాత అతను తన వృత్తి నైపుణ్యంతో గుర్రం, నంది, పులి, గరుత్మంతుని విగ్రహాలను చేసి ఆ పుట్టపైనే వుంచాడు. ఇందులో ఇప్పుడు నంది, గుర్రం బొమ్మలు మాత్రమే వున్నాయి. ఈ సుబ్రహ్మణ్యుని దర్శనం – రోగాలను హరిస్తుంది. కర్మలు నశింపచేస్తుంది, వివాహాలు చేస్తుంది. సంతతిని ప్రసాదిస్తుంది. సకలాభీష్టదాయకమైన ఈ క్షేత్ర దర్శనం ఇహపరదాయకమన్నది అనుభవసత్యం.ఇది మొదట్లో మోహినీపురం. కాలక్రమంలో 'మోపిదేవి'గా మారింది. ఇక్కడ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి లింగరూపంలో వుండటమొక విశేషం. వింధ్యుని గర్వమణచాలని బయలుదేరిన అగస్తులవారు, ఈ ప్రాంతానికి వచ్చి మురిసి ఇక్కడ తపస్సు చేసుకుంటూంటే, ఒకనాడా తపస్వి మనస్సుకు పుట్టలో సుబ్రహ్మణ్యేశ్వరుడు ఉన్నాడని తలచి, ఆ పుట్టను తన శిష్యులతో త్రవ్వించగా స్వామి దరిశనమిచ్చాడని, ఆయనను ఇక్కడ ప్రతిష్ఠించాడనేది పురాణకథనం. ఈ స్వామి దర్శనం సకల పాపహరం. వ్యాధినాశనం. సంతానప్రదాయకం.

ఈ ఆలయానికి ప్రక్కన సగరచక్రవర్తి పూజించిన సకలేశ్వరాలయం ఉంది. 1786 సం॥లోని మోపిదేవి వరదలలో ఈ లింగం బయటపడితే దానిని అప్పటి జమీందారు ప్రతిష్ఠించారు. ఈ సకలేశ్వరుడు, సుబ్రహ్మణ్యునికి క్షేత్రపాలకునిగా చెబుతారు.

కృష్ణాతీరంలో తెలియకుండా, అక్కడవుండేవారికి ప్రక్కవారికి తెలియకుండా ఎన్నో ప్రాచీన, చారిత్రక ఆలయాలు వున్నాయి. జగ్గయ్యాపేటలోని చంద్రమౌళీశ్వరాలయం 400 సం॥కు ముందునుండే వుందని అంటారు. ముక్త్యాల వద్ద ఉత్తరవాహినియైన కృష్ణానదిలో దొరుకగా ఆలయం, శ్రీస్వామి ప్రేరణతోనే కట్టించారనేది స్థలపురాణంగా చెప్పుకొనవచ్చును. ఈ ఆలయంలో ఇప్పుడు, షిర్డిసాయిబాబా, అయ్యప్పలతో కలిసి అందరు దేవతామూర్తులు దరిశనమిస్తారు.

**ధనశైల సీతారామస్వామి :** ఇదీ పాతదే. 300 సం॥లనాటిది. విజయవాడ వద్ద ధనమ్మ బొడ్డ అనే ప్రాంతంలో త్రవ్వకాలలో లభించిన విగ్రహాలను ఇక్కడ ప్రతిష్ఠించారని చెబుతారు. అలాగే వరదరాజస్వామి ఆలయం, ఇదీ పురాతనమైనదే. ఇక్కడి మరొక ఆలయం, శేషశాయి రంగనాయకస్వామి. అనుమంచిపాలెం చెరువులో లభిస్తే దానిని వెలికిదీసి ఆలయం నిర్మాణం చేసి మరీ ప్రతిష్ఠించారుట.

## పెద్దకళ్ళేపల్లి

చల్లపల్లినుండి ఆగ్నేయంగా 9 కి.మీ. పెద్దకళ్ళేపల్లి, దక్షిణంగా ఏడు కి.మీ. మోపిదేవి వుంది. ఈ రెండు చూడవలసినవే. ఒకటి శివక్షేత్రం. రెండది శివకుమారుడైన సుబ్రహ్మణ్యుని దివ్యక్షేత్రం. ఇంతవరకు దక్షిణంగా ప్రవహించిన కృష్ణ ఇక్కడ ఉత్తరవాహిని అవుతోంది.

కశ్యపప్రజాపతి భార్య కద్రువ, తన శాపవిముక్తికోసం ఒక శివలింగాన్ని ప్రతిష్ఠించి, దానిని అరటిచెట్లతో ఎండ తగులకుండా కప్పి పూజచేసుకునేదట. ఆమె భక్తికి మెచ్చిన శివుడు, ఆ చెట్ల మధ్యనుండి రావడంతో, ఆ చెట్లు కూలిపోయాయట. కదళివనమున్న ప్రాంతం కాబట్టి 'కదళివన'మయింది. రానురాను కళ్ళేపల్లి అయింది. ఇది ఒకనాటి కదళిపురం. రానురాను పెద్దకళ్ళేపల్లిగా మారిపోయింది. దీనికి నాగేశ్వరక్షేత్రమని మరొకపేరు. కర్కోటకుడనే సర్పరాజు రూపంలో ఇచ్చటి స్ఫటికలింగం భక్తజనులకు దరిశనమిస్తుంది. సముద్రానికి దగ్గరగా వుండే ఈశ్వరుడు 'కడలిపల్లి' అనే వారనీ, కాలక్రమంలో 'కళ్ళేపల్లి' అయిందని మరొక వాదన. ఇక్కడ ఒకానొక సమయంలో శాపగ్రస్తులైన ఎనిమిది మంది సర్పరాజులు కదళిఫల (అరటి) చెట్టుమధ్య శివుని వుంచి, పూజించిన కారణాన ఇది అప్పుడు 'కదళిపుర'మని చెప్పబడింది. ఇక ఆలయానికి ఈశాన్యంలో 'నాగకుండ' మంది. సర్వతీర్థాల స్వరూపంగా దీనిని చెబుతారు. దీనికి 'పరికర్ణాకా'తీర్థమని మరొక పేరుంది.

ఈ ఆలయ దక్షిణంలోని సత్యస్తంభం వద్ద నిల్చుని ఎవరు అబద్ధం చెప్పరట. ఇక్కడి ఆలయ గోడలమీద సింహాసీనుడైన పంచముఖగణపతిని మనం దర్శించవచ్చును. ఇక్కడి చంద్రమౌళీశ్వరాలయం కూడా దర్శించవలసినదే.

## ముక్త్యాల - ముక్తేశ్వరలింగం

ఆరునెలలు నీటిలో మునిగివుండే ఈ ముక్తేశ్వరుడు, బలిచక్రవర్తి ప్రతిష్ఠించినవాడు. ఆరు నెలలు నీటిలో... అనేసరికి బలి "స్వామీ!" అంటే స్ఫటికంగా దర్శనమిచ్చాడు. దీనిని బలి 'భవానీముక్తేశ్వరాలయం'గా నిర్మించాడని అనంతరకాలంలో, చాగి పోతయరాజు పునర్మించాడని వాసిరెడ్డి జమీందారులు, వీటి నిర్వహణకు భూదానం చేసారు. ఇక జగ్గయ్యపేటకు 8 కి.మీ దూరంలో తిరుమలగిరి వేంకటేశ్వరుడు, భరద్వాజ మహర్షి కోరిక మేరకు ఇక్కడ వెలిసినాడనేది పురాణంద్వారా తెలుస్తోంది.

స్వామి ఎడమపాదముద్రతో, ఆ రూపంలో వున్న కోనేరు చూడదగ్గది. ఇక్కడి వేంకటేశ్వరుడు, పుట్టనుండి పుట్టాడుకాబట్టి, జరిగే పూజలన్నీ పుట్టకే. స్వామికి ప్రక్కనే వరాహమూర్తి, భ్రమరాంబమల్లేశ్వరులు వున్నారు. ఇక్కడి బిల్వవృక్షానికి పూజచేస్తే సంతానం కలుగుతుందట. ఇప్పుడు వేదాద్రి, జగ్గయ్యపేట మండలంలోని చిల్లకల్లుకు 10 కి.మీ దూరంలో కృష్ణాతీరాన ఈ వేదాద్రి వుంది. ఇది 12-13 శతాబ్దాలలోనిర్మించబడినట్లు తెలుస్తోంది. సోమకాసురుడు వేదాలు దొంగిలిస్తే, శ్రీమహావిష్ణువు మత్స్యావతారంలో వాటిని రక్షిస్తే, ఆ వేదాలు తమ శిరముల వుండమని కోరితే, తప్పక, ప్రహ్లాదభక్తవరదుడినై మిమ్ము అధివసిస్తాను. అంతవరకు ఈ కృష్ణవేణీతీరంలో సాలిగ్రామరూపమొంది వుండమని చెబుతారుట. ఆ రకంగా వేదాద్రి అందుకై స్వామి నివసించారు. శ్రీహరితాను

చెప్పినట్లు కృష్ణవేణిలో సాలగ్రామంగాను, పర్వతాగ్రాన జ్వాలానారసింహ, పాదభాగాన యోగానంద లక్ష్మీనరసింహునిగా, గరుడాద్రిన వీరనరసింహునిగాను పంచనారసింహులై 'పంచనారసింహక్షేత్రంగా, విలసిల్లుతోంది.

ఇక్కడి మరొక కథనం ప్రకారం యోగనిష్ఠుడైవున్న స్వామి కల్యాణానికి సుముఖుడు కావడంలేదని తలచిన ఋష్యశృంగులవారు, తనభార్య శాంతితో కలిసి 'లక్ష్మీనరసింహుని ప్రతిష్ఠించి, శాంతికల్యాణం జరిపించినట్లు చెప్పబడుతోంది.

## నెమలి - వేణుగోపాలస్వామి

అవతారం చాలించే కృష్ణపరమాత్మ, తన నెమలిపింఛం ఇక్కడ విడిచి తాను భూగర్భంలో వుండటాన్ని, యోగశక్తితో తెలుసుకున్న తపోమూర్తులు ఇక్కడ విలక్షణమనిపించే ఎడమపాదంపై కుడిపాదముంచిన భంగిమలో లభిస్తే ప్రతిష్ఠించిన ప్రదేశం. ఈ ఆలయానికి కిలోమీటరు దూరంలోని ఏటి నీటితో స్వామిని అభిషేకిస్తారు. మనకు తీర్థమిస్తారు. ఇది సర్వరోగనివారణిగా చెబుతారు.

విల్లిపుత్తూరులో వుండేటట్లు వుండే గుడివాడలోని శ్రీవేంకటేశ్వరాలయం, అలాగే 'గుడిలవాడ'గా ఒకప్పుడు చెప్పబడి, ఇప్పుడు 'గుడివాడ'యైన, ఇందలి పురాతన భీమేశ్వరాలయం చూడదగ్గవి. అలాగే పామర్రులోని రామాలయం, గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయాలు చూడదగ్గవి.

## హంసలదీవి - వేణుగోపాలస్వామి

ఇదొక సంగమస్థలం. కృష్ణానది, సముద్రంలో కలిసే ఈ స్థలం ఆస్తికులకు పవిత్రమైనది. ప్రకృతి ఆరాధ్యులకు, ఆకర్షులకు ఆనందదాయకమైంది. ఇక్కడి వేణుగోపాలస్వామి చరిత్ర కొన్ని శాసనాలద్వారా పుటలలోకి ఎక్కింది. తొమ్మిది లేదా పదో శతాబ్దంలో చాళుక్యరాజులు దీనిని నిర్మించినట్లు పరిష్కరింప బడిన కొన్ని శాసనాలద్వారా తెలుస్తోంది.



ఇంకా పరిష్కరింపబడని శాసనాలువున్నాయంటే ఈ ఆలయం ఎంతో ప్రాచీనమైనదని తెలుస్తూంది. ఇటీవల కాలంలో, దుర్గామల్లేశ్వరదేవస్థానం విజయవాడవారు దీనిని పునరుద్ధరించారని, అలాగే దేవతలు అసంపూర్ణంగా విడిచిన రాజగోపురాన్ని పూర్తిచేసారని కూడా చెబుతారు.

ఇక్కడి ఆలయంలోని వేణుగోపాలుడు, స్వయంభువు కాడు. ఆ విగ్రహం ప్రతిష్ఠించడానికి వీలులేనట్లు కొంత ఛిద్రమైతే, ప్రతిష్ఠచెయ్యలేకపోతున్నామని, బాధపడే గ్రామపెద్దకు కలలో కనుపించి, గోదావరి ప్రాంతంలోని, కాకలపర్తి గ్రామములోని భూస్వామి ఇంట్లో కాకరపాదు క్రింద తాను వున్నానని చెబితే –

ఆ గ్రామానికి వెళ్ళి వేణుగోపాలస్వామి విగ్రహం తెచ్చి ప్రతిష్ఠించారుట.

ఇటువంటి దివ్యక్షేత్రాలు, కృష్ణాజిల్లాలోనే కాదు, ఆంధ్రదేశంలోని అణువణువునా మనకు కనబడతాయి. మనకు చరిత్రను, గతిని, స్థితిని తెలియబరుస్తాయి. మన జన్మలను ధన్యంచెయ్యడానికన్నట్లు, చరిత్రను తెలుసుకుని తరించమని సూచిస్తాయి.

దీనిని దేవతానిర్మితంగా అచ్చటి ప్రజలు తలుస్తారు. ఇక ఈ వూరికే ఒక కథవుంది. పూర్వం దుర్మార్గుడైన జరాసంధుడనే రాజు, తన పాపంకొద్ది కాకి రూపమొంది, ఇక్కడికి వచ్చి నీటిలో మునిగితే కాకి, హంస అయిందిట. దాంతో ఇది **హంసలదీవిగా** పేరుపొందింది. ఇంకో కథ. భక్తజనుల సర్వపాపాలను భరించే గంగ నల్లబడటంతో, నారదుడు ఇక్కడ కృష్ణాతీరంలో మునగమన్నాడు. ఆమె మాలిన్యం పోయి హంసగా మారిందని చెబుతారు. అంతటి ప్రదేశమని దేవతలు ఆలయం నిర్మించి, వేణుగోపాలుని ప్రతిష్ఠించి, ద్వారగోపురం కడుతుంటే తెల్లవారిపోతే దానిని, దేవతలు అసంపూర్తిగా విడిచి వెళ్ళారుట.

ఈ ఆలయసమీపంలో బాలాత్రిపురసుందరి, అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరాలయం కూడా వుంది.

నాగాయలంక మండలం, **భావదేవరపల్లికి** 10 కి.మీ. లోని **సంగమేశ్వరాలయం**లోని సంగమేశ్వరుని, శివరాత్రి తదుపరి పదిహేనురోజులపాటు, సూర్యకిరణాలు స్వామిని సేవిస్తాయి. గుడ్లవల్లేరు మండలం **వేమవర గ్రామంలోని కొండాలమ్మ** కూడా ప్రసిద్ధిగాంచిన తల్లి. కృష్ణా, ప.గో.జిల్లా సరిహద్దులోని తమ్మిలేరు ప్రక్కన 'బలివే'గ్రామంలోగల రాముడు రావణసంహారానంతరం, బ్రహ్మహత్యాదోష నివారణార్థం రామేశ్వరం నుండి బయలుదేరి, ముఖ్యమైన ప్రాంతాలలో శివప్రతిష్ఠ చేస్తాడు. అటువంటి దివ్యమైన గ్రామం ఈ బలివే. ఇది పూర్వం బలిచక్రవర్తిపాలిత భాగం. ఇచ్చటి మృత్యుమల్లేశ్వరస్వామి ఆలయాన్ని తాతయ్యగుడిగా చెబుతారు. శ్రీరామలింగేశ్వరస్వామి కల్యాణానంతరం 'తాతయ్య'ను దర్శించడమొక ఆనవాయితీ.

అగట్లవల్లూరుకు 5 కి.మీలో **ఐలూరు** గ్రామం. అందులో **శ్రీ రామలింగేశ్వరుడు** రైభ్యశాలుని కోరికమేరకు ముహూర్తం దాటిపోతుంటే సైకతలింగాన్ని వేలుకూరులో, ఆంజనేయస్వామి తెచ్చిన లింగాన్ని ఐలూరులో ప్రతిష్ఠించారు. దీంతో శివుడు ప్రత్యక్షమై ఇది దక్షిణకాశీగాను, అభయరామేశ్వరక్షేత్రంగా వర్ధిల్లుతుందని అనుగ్రహించాడు. అందుకేనేమో రాముడు, భక్తజనరక్షకునిగా ఈ క్షేత్రంలో రఘునాయకస్వామిగా ఆవిర్భవించాడు.

ఇక్కడి వీరభద్రుడు **పాలంక వీరభద్రుడిగా**, విజయనగరరాజుల ఆరాధ్యదైవంగా పూజించబడుతున్నాడు. ఈ వీరభద్రునికి పర్వతాలమల్లయ్య, పాలకవీరయ్య, పాలకస్వామిఅని కూడా పేర్లున్నాయి. కృష్ణాతీరములోని నల్లమల అడవుల ప్రాంతంలో వున్నాడు. ఈ పాలంక వీరభద్రుడు.

అలాగే జిల్లాలోని **పరిటాల హనుమంతుడు, కంచికచర్ల శివసాయి** క్షేత్రాలు చూడదగ్గవి.

**కొల్లేటికోట పెద్దింటమ్మ,** 101 మంది గ్రామదేవతలలో పెద్దది. ఈమె 11వ శతాబ్దంనాటి వేంగీచాళుక్యుల నాటిదనీ, అగస్త్యమహర్షి ఈ తల్లికి 'కొల్లేటికోట' లంకగా చెప్పుకునే ప్రాంతంలో దుర్భేద్యమైన అగడ్త కూడా రూపొందించి పూజించాడనేది ప్రతీతి. **రాపర్ల వేంకటేశ్వరస్వామి, కాంప్రపాడు పంచముఖేశ్వరుడు,** దర్శించదగ్గవారు.

# కృష్ణాజిల్లాలో అపురూప ఆలయాలు, క్షేత్రాలు

ఏది గొప్ప అంటే .... నేను గొప్పని చెప్పుకోలేని శిల్పసంపదకు వారసులము. వాదులాటలకు తావులేని నిజాలను గుర్తించి, దర్శించి, తపించాలనే తపనగల్గిన మనసు గలవారము.

కృష్ణాపరీవాహక ప్రాంతంలో ముఖ్యంగా కృష్ణా – గుంటూరు జిల్లాలలో అతి ప్రాచీన ఆలయాలు వున్నాయి. ఇవి భారతదేశంలో వున్న ఇతరాలయాలకన్న అత్యంత పురాతనమైనవి అని చెప్పడంలో ఏమాత్రం తప్పులేదు. గొప్పకాదు. ఇప్పుడు చరిత్రకు వస్తే – కృష్ణాజిల్లాలోని శ్రీకాకుళం ఇప్పుడు చిన్న వూరే అయినా, ప్రప్రథమ తెలుగు సామ్రాజ్య నిర్మాతలైన శాతవాహనుల రాజధాని... అంటే, ఆనాడు ఈ చిన్నవూరు ఎంత పెద్ద నగరమో వూహించుకుంటే, ఆశ్చర్యం వెయ్యకమానదు.

ఆ తరువాతి కాలంలో శాతవాహనులు తమ రాజధానిని "ధాన్యకటక"(ధరణికోట) మనే అమరావతికి మార్చుకున్నారు. వీరు కేవలం ఆంధ్రాప్రాంతాన్నేగాక గుజరాత్, మధ్యప్రదేశ్‌లను దాటి ముందుకు విస్తరించారు. శాతవాహనుల కాలంలో బౌద్ధమత సంబంధ కట్టడాలు జరిగాయి. తదుపరికాలంలో ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, చాళుక్యులు చరిత్ర ప్రసిద్ధిగాంచిన కట్టడాలకు మూలమూర్తులయ్యారు.

శాతవాహనులు, అమరావతి రాజధానిగా చేసుకుని జావా, కంబోడియా, థాయ్‌లాండ్ దేశాలతో సముద్ర వ్యాపారం సాగించారు. అందుకేనేమో ఈ దేశాలలో తెలుగుసంస్కృతీ సంప్రదాయాలు ఇప్పటికీ కనుపిస్తున్నాయి. ఈ ప్రాంతాన్ని దివిసీమగా పిలుస్తున్నారు. ఇక్కడినుండే కృష్ణానది రెండు పాయలుగా చీలుతుంది. పెద్దపాయ అవనిగడ్డ, నాగాయలంకలను, చిన్నపాయ పెద్దకళ్ళేపల్లి, మోపిదేవి, భావదేవరపల్లి, హంసలదీవులను చుడుతోంది.

ఈ శ్రీకాకుళానికి దగ్గరలో **ఘంటసాల** వుంది. ఇది **బౌద్ధులకు పరమపుణ్యధామం** గా చెప్పాలి. ఇవన్ని చూడటం తేలికే, కాకపోతే ఎటునుండి ఎటు... అన్నది, మీ సౌకర్యం, అప్పటి అచ్చటి ప్రయాణ మార్గంబట్టి వుంటుంది.

## మొవ్వ

ఇది కూచిపూడి నృత్య సాంప్రదాయానికి మూలకోణం లేదా కేంద్రం. ఇదెంత విశ్వకీర్తి గడించినా, అధినాయకుని పేరు కన్న తనవూరు పేరుతోనే ఖ్యాతి గడించింది. ఈ వూరిలోగల సిద్ధప్ప అనే ఆయన తన తపస్సుతో సిద్ధేంద్రయోగి అవుతారు. ఈయనకు భరతముని నాట్యశాస్త్రాన్ని బోధిస్తే, దానిని తనదైన శైలిలో సిద్ధేంద్రులు కొన్ని నాటకాలు తయారుచేసి, కేవలం ఆ వూరిలోని తొమ్మిది కుటుంబాలకి నేర్పారట. అందులోని నాట్య సంప్రదాయాన్ని విడదీసి కూచిపూడి నాట్యమంటూ ప్రచారంలోకితేబడింది. ఇప్పుడు దీనిని స్త్రీ పురుషులిరువురు అభినయిస్తున్నారు. ఈ కళలలో నిష్ణాతుడై విశ్వకీర్తి గడించిన మహనీయుడు వేదాంతం సత్యనారాయణశర్మగారు. భారతప్రభుత్వం వీరిని పద్మభూషణతో ఘనంగా సత్కరించింది.

దివిసీమలోని **మొవ్వ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయం** మౌద్గల్యమహాముని కాలంలో నిర్మితమైనట్లు చెబుతారు. దీనికి దగ్గర్లోని బ్రాహ్మణపల్లెలో వరదయ్య అనే బ్రాహ్మణ పిల్లవాడు అల్లరిచిల్లరిగా తిరుగుతుండేవాడు.

ఒకనాడు మహర్షి అతన్ని చూసి, కారణజన్ముడిగా తలచి, మంత్రోపదేశం చేస్తాడు. దానిప్రభావంతో ఆతడు తిరిగేవాడు కాబట్టి క్షేత్రయ్యగా ఎన్నో క్షేత్రాలు దర్శించాడు. అంతకుమించి వేణుగోపాలునిపై ఎన్నో శృంగారకీర్తనలు వ్రాస్తాడు. ఎవర్ని స్తుతించినా, చివరకు అది 'మువ్వగోపాలా...! అని ముగించేవాడు.

ఇక్కడున్న మరో పురాతనాలయం, మౌద్గల్యవారే ప్రతిష్ఠించారని చెప్పబడే భీమేశ్వరాలయం. తదుపరి చూడ వలసింది, నాగాయలంకకు 7 కి.మీ ల దూరంలోవున్న **భావదేవరపల్లిలోని భావనారాయణస్వామి.** శివునికి పంచారామాలవలెనే, ఈ 'శ్రీహరిరూప' భావనారాయణునకు కూడా అయిదు క్షేత్రాలున్నాయి. కాకినాడ నగరభాగమైన సర్పవర, భావనారాయణ, పొన్నూరు, పెదగంజా, ప.గో.జిల్లా పట్టిసం, ఈ భావదేవరపల్లి, మొదట్లో దీనిని చోళరాజులు అనంతరం, తానీషా దీనిని పునరుద్ధరించారు. అయితే గాలిగోపురం మాత్రం చోళులనాటిదేనని తెలుస్తోంది.

ఇచ్చటి 365 రోజులు వెలిగే అఖండదీపారాధన చూడదగ్గది. ఇక్కడి చారిత్రాత్మక **జుజ్జూరు గ్రామంలో యోగానంద లక్ష్మీనరసింహాలయం** ఉంది. ఇది కొండమీద వుంటే, మరొకటి కోట తూర్పుభాగాన జమీందారులు కట్టుకున్నది. కొండమీద గుహాలయం, చరిత్ర ప్రసిద్ధిగాంచినది. ఇక్కడి సోమేశ్వరాలయం పంటాడుకు 5 కి.మీ దూరంలోని కపిళేశ్వరపురంలోని అగస్త్యునిచే ప్రతిష్ఠించబడ్డ అగస్త్యేశ్వరాలయం పేర్కొనదగినవి. దీని ఉపాలయంలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడున్నాడు.

**అవనిగడ్డ** లోకివస్తే ఈ ఊళ్ళో చోళులనాటి రాజరాజేశ్వరీసమేత **రాజశేఖరుని ఆలయ**ముంది. ఇక్కడే 12వ శతాబ్దంలో కట్టబడ్డ 'భూ, నీలా, రాజ్యలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామివారి ఆలయముంది. దీనిని 14వ శతాబ్దంలో పునరుద్ధరిస్తే, ఇప్పుడు శిధిలమైన ఆ ఆలయాన్ని దేవాదాయ శాఖవారు తిరిగి పునరుద్ధరిస్తున్నారు.

చరిత్ర తెలియని మనకు తెలిసినా లాభంలేదు. వూళ్ళు వల్లకాళ్ళు చేసి పట్నాలకు వలసలు పోయే ప్రజానీకం దృష్టిలో పరమాత్మ అంటే .. పైసా, ధనసంపాదనగా మారిపోయి ఒకప్పుడు ఒక రైతు కరువుకాటకాలు వచ్చి అద్దంకి విశ్వనాధపల్లె పారిపోతే, ఆ గ్రామదేవత ఈ రైతురామన్నకు కనుపించి, తనను పూజిస్తే యధాస్థితి ప్రసాదిస్తానంటుంది. పూజిస్తాడు. ఆ గ్రామదేవత అన్నమాట నిలబెట్టుకుంటుంది. దాంతో ఈమెకు విశ్వనాధపల్లెలో రామన్న తన శక్తికొలది ఆలయం నిర్మిస్తాడు. ఈమె అద్దంకినుండి వచ్చింది కాబట్టి అద్దంకి నాంచారమ్మగా ప్రసిద్ధి చెందింది.

## ఘంటసాల



ఇది బౌద్ధారామాలకు నిలయం. మొదట్లో శాతవాహనులు, ఆపైన ఇక్ష్వాకులు దీనిని గుర్తించి గౌరవించారు. వీరి కాలంలో నాగార్జున కొండ సుప్రసిద్ధ బౌద్ధక్షేత్రమయింది. అమరావతిలోకూడ చెప్పుకోదగ్గ విధంగా బౌద్ధస్తూపాలు, చైత్యాలు కనబడతాయి. ఘంటసాలలోని పురావస్తుశాఖ త్రవ్వకాలలో గ్రీకు, రోముదేశాలకు సంబంధించిన నాణాలు, శాతవాహనులనాటి చారిత్రక అవశేషాలు లభ్యమయ్యాయి.

## శ్రీకాకుళం

ఆంధ్రుల మొట్టమొదటి రాజధానియైన శ్రీకాకుళం ఒకనాడు గర్వంగా చెప్పుకునే ప్రదేశం. ఆంధ్రుల సంస్కృతికి, సముద్రరవాణా మరియు నౌకాసంస్కృతి, ఇతర సాంప్రదాయాలకు పుట్టినిల్లు, పెట్టినిల్లుగా చెప్పుకొన వచ్చును. అందుకేనేమో శ్రీమహావిష్ణువు శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువుగా ఇక్కడ జన్మించి, ఈ వూరిని చరిత్ర ప్రసిద్ధంచేస్తాడు.



ఒకప్పుడు బ్రహ్మదేవుడిక్కడ శ్రీమహావిష్ణువును గూర్చి తపస్సు చేస్తే శ్రీహరి ప్రత్యక్షమవుతాడు. ఇక్కడనే వుండి ప్రజల కష్టనష్టాలు తీర్చమని ప్రార్థిస్తే అలాగేనని స్వామి ఇక్కడ వుండిపోతాడు. బ్రహ్మకు నివాసమైన ఆశ్రమప్రాంతంలో అలరారే దీనిని, కాకుళయనీ, శ్రీనిలయుడైన విష్ణుమూర్తికి నిలయం కాబట్టి శ్రీకాకుళమని పేరు వచ్చిందని చెప్పుకుంటారు.

మూడు శిఖరాలతో అలరారే ఆలయం పెద్దది. ఆహ్లాదకరమైనది. ఒకటి శ్రీకాకుళేశ్వరునిది. రెండవది అమ్మవారిది. మూడవది చెన్నకేశవస్వామిది. క్రీ॥శ॥ 1081నాటికి ముందునుండే ఆలయం వుందని శాసనాలద్వారా తెలుస్తున్నది. ఆళ్వారులు గుర్తించిన 108 దివ్యక్షేత్రాలలో ఈ క్షేత్రం యాభైఏడవ తిరుపతిగా చెబుతారు. 6,7 శతాబ్దాలనాటికే ఈ ఆలయం బాగా ప్రసిద్ధిపొందిందని తెలుస్తుంది.

కాకపోతే తన జైత్రయాత్రలో భాగంగా 1519 సం॥ ఫిబ్రవరి నెల పదకొండవ తారీఖున, శ్రీమహావిష్ణువు ఆదేశం ప్రకారం "విష్ణుచిత్తీయ"మనే, ఆముక్తమాల్యద కావ్యానికి శ్రీకృష్ణదేవరాయలు ఇక్కడే శ్రీకారం చుట్టినట్లు స్వామికి కైంకర్యంగా అయిదు గ్రామాలు సమర్పించుకున్నట్లు ఆలయంలో వున్న శాసనంద్వారా తెలుస్తుంది.

శ్రీకృష్ణలీలాతరంగిణి కర్త నారాయణతీర్థులవారు కూడా శ్రీస్వామిని అనేక విధాల కీర్తించారు. కాలక్రమంలో ఇక్కడి ఆలయాన్ని కృష్ణానది వరదలనుండి రక్షించడానికి, పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా పాత ఆలయాన్ని జాగ్రత్తగా విడదీసి ఎత్తుపెంచి తిరిగి అలాగే నిర్మించారుట. దీని ప్రక్కనేగల శివాలయంలో ఒకరాత్రిలో వెలిసిన ఏకరాత్రి మల్లికార్జునుడు వున్నాడు.

ఇదంతా తొలితెలుగు నాయకులు, భారతదేశంలో ముప్పాతిక భాగం రాజ్యమేలిన శాతవాహనుల తొలిరాజధాని శ్రీకాకుళం ప్రాభవాన్ని చెప్పుకునే వరకు ఆపకుండా, చూడటానికి ప్రయత్నించడం మహాభాగ్యం. మన భాగ్యమని తలవాలన్నది నా మనవి.

## భావదేవరపల్లి

ఇక్కడి దైవం భావనారాయణస్వామి. శివునికి పంచారామాలవలె, ఈ భావనారాయణునికి అయిదు క్షేత్రాలు వున్నాయి. తూర్పుగోదావరిజిల్లాలో కాకినాడ సమీపంలోని సర్పవరంలో, పశ్చిమగోదావరిజిల్లా పట్టిసంలో,



గుంటూరుజిల్లా పొన్నూరులో, ప్రకాశంజిల్లా పెదగంజాం, ఈ భావదేవరపల్లి భావ నారాయణ క్షేత్రాలుగా వున్నాయి. అయితే స్థలపురాణాల కథలు మాత్రం భిన్నంగా వుంటాయి.

మొదట్లో దీనిని చోళులు నిర్మించారు. ఆ తరువాత దీనిని తానీషా పునరుద్ధరించడమో, పునర్నిర్మించడమో చేసాడని, ఆయన మంత్రులు అక్కన్న, మాదన్నలు 46 ఎ. పొలం, దేవునికి సమర్పించుకున్నారు. ఈ ప్రాంతంలో చెప్పుకునేటందుకు ఇదే పెద్ద ఆలయం. ఇక్కడ అఖండదీపారాధన జరుగుతుంది. కృష్ణాజిల్లా పర్యటన ప్రారంభించేవారు, ఈ క్షేత్రాన్ని దర్శించగలరని మా అభిప్రాయం.

## శ్రీ జ్వాలానరసింహస్వామి - వేదాద్రి



కృష్ణాతీరంలో నెలకొన్న నరసింహక్షేత్రమే వేదాద్రి. ఇక్కడి కృష్ణానది ఉత్తర వాహినిగా ప్రవహిస్తుంది. జగ్గయ్యపేటకు 10 మైళ్లు దూరంలో బ్రహ్మేశ్వర పర్వతమని పిలువబడే వేదాద్రిలోని స్వామి జ్వాలానరసింహ స్వామి ఈ స్వామికి ఇరువురు దేవేరులు. వారు చెంచులక్ష్మి, రాజ్యలక్ష్మి.

సోమకాసుర సంహారానంతరం శ్రీనరసింహస్వామిని తమ శిరస్సు మీద నిలచి ఉండుమని చతుర్వేదాలు కోరాయట. కృష్ణా తీరంలో సాలగ్రామ రూపంలో నిలచి ఉండవలసినదని వేదాలను శ్రీ స్వామి అదేశించాడట. హిరణ్యకశిపుని సంహారం తర్వాత శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రహ్లాదునికి యోగాభ్యాసం నేర్పుతూ ఇక్కడ జ్వాలానరసింహునిగా అర్చామూర్తియై నిలిచారట. ఇచ్చట వైశాఖమాసంలోనూ, ఫాల్గుణ మాసంలోనూ ఉత్సవాలు జరుగుతాయి. ఈ క్షేత్రము విజయవాడ–హైదరాబాదు మార్గంలో విజయవాడకు 65కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ స్వామి లింగాకారంలో ఉంటారు.

## దేముడు బొమ్మలకు ప్రసిద్ధి - కొండపల్లి



విజయవాడకు 16 కి.మీ. దూరంలో ఉన్న కొండపల్లి పేరు వినగానే గుర్తుకు వచ్చేవి బొమ్మలు. ఈ కొండపల్లి గ్రామంలోనే 14వ శతాబ్దములో కొండవీటి రెడ్డిరాజు అయిన అనవేమారెడ్డి నిర్మించిన ఖిల్లా కొండ శిఖరంపై ఉన్నది. రెడ్డిరాజుల వైభవం ఇంకా ఇక్కడి చిహ్నాల్లో కనబడుతుంది. ఈ కొండపల్లి బొమ్మలకు వేసిన రంగులు ఎన్నటికి పోవు. అదే కొండపల్లి ప్రత్యేకత.

# గుంటూరు జిల్లా

## అమరారామం - అమరావతి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో గుంటూరు జిల్లాలో ఈ అమరావతి వుంది. పంచారామములలో మొదటిది. ఈ క్షేత్రములో బృహస్పతి కోరిక మేరకు ఆశ్వయుజ శుద్ధదశమి నాడు శివలింగం ప్రతిష్ఠించబడింది. కావున ఈ స్వామికి అమరేశ్వరుడు అని పేరు వచ్చెను. దేవతలు అమరేశ్వరుని సేవిస్తూ నివసించిన ప్రదేశమే అమరావతి అయ్యెను.

ఇది కృష్ణానది ఒడ్డునగల పట్టణం. దీనిని నాగవంశంవారు, ఆ తదుపరి శాతవాహనులు పరిపాలించారు. వీరి తర్వాత ఇక్ష్వాకులు చక్రవర్తులయ్యారు. ఈ సమయంలోనే ఆచార్యనాగార్జునులు ఇక్కడ బౌద్ధవిశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. ఇందులో విద్యాభ్యాసానికి దేశవిదేశాలనుండి ఎందరో వచ్చేవారు. బుద్ధ భగవానుని పవిత్ర అవశేషంతో స్థూపమొకటి నిర్మంచబడింది. ఆ తదుపరి ఇక్ష్వాకులు తమ రాజధానిని అమరావతినుండి నాగార్జున కొండకు మార్చారు. ఇక్కడనుండి నౌకావ్యాపారం కూడా చేసేవారుట. అంతటి జగత్ప్రసిద్ధిపొందిన ఈ అమరావతి ఆలయంగూర్చి, వినడము తెలియదు, వివరాలు అసలే తెలియవు. గుంటూరుకు 32 కి.మీ. దూరంలో వున్న ఈ ప్రాంతానికి, రాష్ట్రం నలుమూలలనుండి ప్రయాణ సౌకర్యాలున్నాయి. కానీ, ఇక్కడ వుండటానికి కొన్ని వసతులున్నా, ఎవ్వరు ఇక్కడ వుండరు. ఉదయం వచ్చి సాయంత్రానికి తిరిగి వెళ్ళిపోవడానికే ఏర్పాట్లు చేసుకుంటూంటారు.

ఇక ఆలయం నిర్మించిన తీరు చూడముచ్చటగా వుంటుంది. మూడు ప్రాకారాలతో అందంగా, హుందాగావున్న ఆలయ ముఖమంటపంలో ఎడంవైపు అమ్మవారి ఆలయం, ఆలయానికి బయట ఎడం చేతివైపు వేణుగోపాలస్వామి వున్నారు. ఇచ్చట అమ్మవారి పేరు "బాల చాముండేశ్వరాదేవి". మొదటి ప్రాకారానికి, రెండవప్రాకారానికి మధ్య ప్రణవేశ్వరుడు. మూడు ప్రాకారము గల ఈ ఆలయంలో మొదటి ప్రాకారములలో శంకరాచార్యులు, ఉమామహేశ్వరుడు, దత్తాత్రేయస్వామి, రుద్రపాదాలు, జ్వాలాముఖి, అగస్తేశ్వరుడు పార్ధివేశ్వరుడు, సోమేశ్వరుడు, నాగేశ్వరుడు, కోసలేశ్వరుడు, వీరభద్రుడు, మహిషాసురమర్దని వుంటే, రెండవ ప్రాకారంలో విఘ్నేశ్వరుడు, కాలభైరవుల మంటపాలున్నాయి. ఆలయంచుట్టు శ్రీశైల మల్లేశ్వరుడు, కాశీవిశ్వేశ్వరుడు, చండీశ్వరుడు, శ్రీకాళహస్తీశ్వరుడు నాల్గుమూలల నిలచివున్నారు. కాలభైరవుడు ఇక్కడ క్షేత్రపాలకుడు.

పది అడుగుల ఎత్తులో, అభిషేకం చెయ్యడానికి వీలుగా ఇరుప్రక్కల మంచెలాగవున్న ఆలయశోభ, దాని శక్తి అనుభవించవలసిందే తప్ప వర్ణించ సాధ్యంకాదు. అంతటి మహిమాన్వితమైనది.

ఈ లింగ ప్రతిష్ఠ విషయంలో కూడా పురాణగాథ ఒకటి వుంది. శివభక్తుడైన తారకాసురుడు, శివుడు ప్రసాదించిన ప్రాణలింగాన్ని కంఠంలో ధరించి, సాధుసన్యాసులను, దేవతలను అల్లరిపాలు చేస్తూంటే, అతని

ఆగడాలను భరించలేని వారు విష్ణువును శరణువేడితే విష్ణువు, శివుని ఈ గండం నుండి గట్టెక్కించాడు. దాంతో శివుడు, కుమారస్వామిని పిలిచి తారకాసుర వధ చెయ్యమంటే, ఇద్దరిమధ్య యుద్ధమైతే భయంకరంగా జరుగుతుందని తారకుని తుదముట్టించలేకపోతాడు.

అప్పుడు శివుడు "అతని కంఠంలో నేను ప్రసాదించిన ప్రాణ లింగముండగా అతడు అమరుడు" అని చెప్పడం, కుమారస్వామి ఆ ప్రాణలింగాన్ని ఛేదించడం అది అయిదు ముక్కలవడం, ప్రతి ముక్క మళ్ళీ లింగరూపమొందడం జరుగుతుంది. ఆ ముక్కలలోని ఒకటి ఈ అమరలింగం. మిగిలిన నాల్గు భీమవరం దగ్గర గునుపూడిలోని 'సోమారామం', పాలకొల్లులోని 'క్షీరారామం', సామర్లకోటలోని 'కుమారారామం' ద్రాక్షారామంలోని 'భీమారామాలు'.

ఆశ్వయుజ శుద్ధ దశమినాడు ఇక్కడ లింగ ప్రతిష్ఠ జరిగింది. దీనికి "అమరారామ" మని పేరు పెట్టబడింది. శాతవాహనుల కాలములో దీని పేరు ధాన్యకటకం. 1466 సం॥లో దావులూరు ప్రభువు కొమ్మనాయుడు,1517 సం॥లో శ్రీకృష్ణదేవరాయలు ఈ ఆలయాన్ని దర్శించి, నిత్యనైవేద్యకైంకర్యాలకు పంటభూముల్ని ఇచ్చినట్లు తాను తులాభారమొందినట్లు ఇక్కడి శాసనాలు తెలుపుతున్నాయి. అనంతరం 1526లో హంద్రికం పెద్దప్పగారు, 1795లో రాజావాసిరెడ్డి వేంకటాద్రినాయుడు గారలు ఈ ఆలయాన్ని సమయానుకూలంగా జీర్ణోద్ధరణను చేసారు. ఇక్కడి బౌద్ధచైత్యాలు, వాటి నిర్మాణ శైలి ప్రశంసించదగ్గవి.

ఇంతటి ఘనచరిత్ర కల్గిన ఈ ప్రాంతం, ఇక్కడి శిల్పాలు, ఆలయాన్ని ఆనుకుని ప్రవహించే కృష్ణానదీమతల్లిని చూసి పొంగిపోవడం మన అదృష్టంగా భావించవచ్చును. ఈ అపురూప ఆలయాన్ని దర్శించండి! తరించండి!

## మంగళగిరి నరసింహస్వామి దేవాలయం

అతి ప్రాచీనమైన, చారిత్రాత్మకమైన పుణ్యక్షేత్రము మంగళగిరి. ఈ పుణ్యక్షేత్రములో శ్రీ రాజ్యలక్ష్మి నృసింహ దేవాలయం, చీకటి కోనేరు, పెద్ద కోనేరు, శ్రీ వల్లభాచార్యుల వట తీర్థము. శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయం, భ్రమరాంబా సహిత మల్లేశ్వరస్వామి దేవాలయం, శ్రీ లక్ష్మీనారాయణ దేవాలయాలు ప్రసిద్ధి చెందిన దేవాలయాలుగా ఉన్నవి. తూర్పు కనుమలలోని ఈ ప్రసిద్ధ గిరిక్షేత్రముపైనున్న శ్రీ పానకాల నృసింహస్వామి దేవాలయం గొప్ప విజ్ఞాన కేంద్రముగా విలసిల్లింది. కొండపై నున్న శ్రీ పానకాల నృసింహస్వామి దేవాలయంలో భక్తులు స్వామివారికి పానకం నైవేద్యంగా సమర్పించగా అందులో సగం స్వామి స్వీకరించి మిగిలిన పానకం స్వామివారి తీర్థముగా వస్తుందని చెబుతారు. చీమలు, ఈగలు వంటి క్రిమి కీటకాలు ఈ దేవాలయంలో కానరావు.



దిగువన ఉన్న రాజ్యలక్ష్మినృసింహస్వామి వారి దేవాలయం పెద్ద ప్రాకారములతో గాలిగోపురములతో, ముఖ మండపములతో, వస్తు

వాహనములు కలిగి భారతదేశంలో ముఖ్యమైన ఆలయంగా ప్రసిద్ధి పొందింది. జాతీయ రహదారిపై నుండి బస్సు, రైలు సౌకర్యము ఉన్న ఈ క్షేత్రము గుంటూరు- విజయవాడ- తెనాలి మధ్యన ఉన్నది. 1807 సంవత్సరములో శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు 11 అంతస్తుల గాలి గోపురం నిర్మించటం జరిగింది. 152 అడుగుల ఎత్తు 49 అడుగుల వెడల్పు గల ఈ గోపురం ఎక్కువ ఎత్తు, తక్కువ వెడల్పు గలిగి ఉండటం విశేషం. శుభములు ఇచ్చు కొండగా మంగళగిరిని భక్తులు పిలుస్తారు.

కొండపైనున్న శ్రీ పానకాల స్వామి వారి దేవాలయంలో ఉదయం గం.8.00 నుండి గం.12.00 వరకే అర్చనాదులు జరుగుతాయి. శ్రీ పానకాల నృసింహస్వామి దేవాలయం 4 యుగముల ముందు నుండి కొండపై ఉన్నట్లు చరిత్ర ఆధారాల ద్వారా చెప్పబడుచున్నది. ఈ స్వామికి కృతయుగమున అమృతం. త్రేతాయుగమున ఆవు నెయ్యి, ద్వాపర యుగమున ఆవుపాలు, కలియుగమున పానకం నివేదనగా సమర్పించబడినట్లు స్థల పురాణం ద్వారా చెప్పబడుచున్నది.

ఈ నరసింహస్వామిని "పానకాల నరసింహస్వామి" అనీ సింహాచలేశుని "అప్పలనరసింహస్వామి" అని పిలవడం మనకు తెలుసు. భారతదేశం మొత్తంమీద శ్రీనరసింహస్వామి ఆలయాలు, మన ఆంధ్రదేశంలోనే ఇరవైమూడు వున్నట్లు చెబుతారు.

ఆకాశాన్నంటే రాజగోపురంతో పాదభాగమున, కొండమీద గుహలోను శ్రీనరసింహస్వామి ఇటు ప్రశాంతంగాను అటు వుగ్రంగాను కనుపిస్తాడు. ఈ ఉగ్రనరసింహుని శాంతింపచేయడానికి "పానకం" నివేదనగా అర్పించడం. శ్రీనరసింహస్వామిపైనగల కొండపై ఆయన దేవేరి "రాజ్యలక్ష్మి"దేవిగా పూజలు అందుకుంటోంది.

ఎంతో చరిత్ర ప్రసిద్ధి కలిగిన ఈ ఆలయానికి సింహాచలం, యాదగిరి గుట్టలతో పోలిస్తే, తగిన ప్రచారం లేదనే చెప్పాలి. కనకదుర్గ ఆలయంనుండి మంగళగిరి పానకాల నరసింహస్వామి ఆలయానికి సిటీబస్సులు వున్నాయి. ఆటోలు, రూటు బస్సులు ఎన్నోవున్నాయి.

ఈ ఆలయాన్ని జగద్గురు ఆదిశంకరులు, రామానుజాచార్యులు, కృష్ణ భక్తిని వ్యాపింపచేసిన చైతన్యులు దర్శించారు.

ఈ విశాలమైన ఈ ఆలయం పది, పదకొండు శతాబ్దాలలో నిర్మించబడివుంటుందని చరిత్రకారుల అభిప్రాయం. మొదట్లో కొండవీటి (రెడ్డి) రాజులు, ఆ తదుపరి 19వ శతాబ్దంలో రాజావాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు గారలు అభివృద్ధిచేసారు. ఈ ఆలయ గోపురం, ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయాలలోని అతి ఎత్తైన గోపురాలలో ఒకటిగా చెబుతారు.పాదభాగమున కల నరసింహస్వామి ఆలయం తూర్పు ముఖంగా వుంటుంది. గర్భాలయం, అంతరాలయం, మండపముగావున్న ఈ ఆలయంలో స్వామివారి తొడమీద తన దేవేరి రాజ్యలక్ష్మిదేవి కూర్చున్నట్లు వుంటుంది. ఈ తల్లికి ప్రక్కన ప్రత్యేకంగా ఆలయమువుంది.

శ్రీలక్ష్మీనరసింహస్వామికి దగ్గర్లో వేంకటేశ్వరాలయం, సత్యనారాయణస్వామి, భ్రమరాంబాదేవి ఆలయాలు చరిత్ర ప్రసిద్ధిచెందినవి కాకపోయినా చూడదగ్గవి వున్నాయి.

విజయవాడనుండి కనకదుర్గమ్మను దర్శించుకున్నవారు అరగంటసేపు ప్రయాణించి, స్వామిని దర్శించి, ధన్యులవగలరనడంలో తప్పులేదనుకుంటాను.

## శ్రీ చెన్నకేశవస్వామి వారి దేవస్థానం (ములుకుదురు, గుంటూరు జిల్లా)



**స్థలపురాణం:** ఈ కాలమున ములుకుదురు అని పిలువ బడుచున్న ఈ గ్రామము పూర్వము అత్రిముని ఆశ్రమమని, ఇచ్చట వేంచేసి యున్న శ్రీ చెన్నకేశవ స్వామి వారు అనసూయా, అత్రిమునుల యారాధ్య దైవమని, అత్రిఋషి యొక్క శిష్య ప్రశిష్యుల యొక్క తదితర ఋషుల యొక్క ఆశ్రమము లతో నిండియున్న ఇది మునిస్థానమని, కాలక్రమంలో దీనిని మునికుదురు పేరుతో వ్యవహరించెడివారని, రాను రాను యిప్పటికి, మునికుదురు, ములుకుదురుగా మారినదని ప్రాంతీయ పెద్దల మాట. శ్రీ విఖనస మహాముని శిష్యులగు అత్రి ఋషి ఆదేశమును ననుసరించి వారి శిష్యులగు ఋషులు – శ్రీ వైఖానసాగమ సిద్ధాన్తముగా, శ్రీ కేశవస్వామి వారికి దేవాలయ నిర్మాణము చేసి, అర్చనోత్సవాదులు నిర్వర్తించుచుండిరి. తరువాత పరంపరగా శ్రీ వైఖానసాగమవేత్తలగు శ్రీ వైఖానసార్చకులు, యీనాటివరకు, శ్రీ కేశవస్వామివారికి అర్చనోత్సవాదులు భక్తిశ్రద్ధలతో జేయుచు స్థిరపడిరి. కనుక ఈ దేవాలయము "శ్రీ వైఖానసార్ష స్థలము"గా చెప్పుకుంటారు.

## చేజర్ల కపోతేశ్వరస్వామి

ఈ కపోతేశ్వరాలయాన్ని మూడు లేదా నాల్గవ శతాబ్దంలో నిర్మించినట్లు ఇక్కడి శాసనాలద్వారా పురాతత్వ శాస్త్రజ్ఞులు నిర్ణయించారు. చరిత్ర ప్రసిద్ధి, పురాతన ప్రశస్తిగల ఆలయం. కట్టినప్పుడెలాగుందో, ఇప్పుడు అలాగే వుందని చెప్పుకోగల ఆలయం ఈ కపోతేశ్వరాలయం. కపోతేశ్వరాలయం అనగానే మనకు శిబిచక్రవర్తి జ్ఞాపకాని కొస్తాడు. ప్రస్తుత కాశ్మీరు ప్రాంతానికి రాజు శిబి 'చక్రవర్తి'. ఈయనకు జీమూత వాహనుడు, మేఘాడంబరుడు అనే సోదరు లున్నారు.



వీరు తీర్థయాత్రలు చేస్తూ, చేస్తూ, ఈ చేజర్ల ప్రాంతానికి వచ్చి ఇక్కడున్న కొండ గుహలో తపస్సు చేసుకుంటూ తమ తనువులు ముగించారు. ఈ సంగతి తెలిసిన శిబి చక్రవర్తి ఈ క్షేత్రమహిమ తెలుసుకుందామని వస్తాడు. ఒక

అపూర్వ యజ్ఞం ప్రారంభిస్తాడు. దీని ఫలితంగా ఈ దానశీలి గొప్పతనాన్ని లోకానికి తెలుపాలన్నట్లు, విష్ణుమూర్తి పావురమౌతాడు. బ్రహ్మ డేగ, శివుడు బోయవాడై, ఎగిరే పావురంపై బాణం వేస్తే అది శిబి చక్రవర్తి యజ్ఞం చేస్తున్న స్థలానికి వస్తుంది. దాని వెనుకనే డేగ, బోయవాడు. ఇదిచూసి మనసు కరిగిన దానశీలి పావురానికి శరణమివ్వడంతో మన భాషలో డేగ అది తన ఆహారమంటుంది. నాదంటాడు బోయవాడు. శరణాగతరక్షణ నా ధ్యేయమంటూ, శిబిచక్రవర్తి పావురం బరువున్న మాంసాన్ని తన శరీరంనుండి కోసి ఇస్తానంటాడు. డేగ, బోయవాడు సరేనంటారు. పావురాన్ని త్రాసులో పెట్టి శరీరంలోనుంచి మాంసాన్ని కోసి ఎంతవేసినా చాలకపోయేసరికి తానే త్రాసులో కూర్చుంటాడు. ఇది అపూర్వము, ఆశ్చర్యమనిపించింది. ఈ సంఘటనతో పావురం, డేగ, బోయలు – త్రిమూర్తులై ఆతని త్యాగనిరతిని ప్రస్తుతిస్తారు. శిబి ఇక్కడ అతని త్యాగనిరతికి చిహ్నంగా కపోతేశ్వరుడై చరిత్ర ప్రసిద్ధిగాంచుతాడని వరమిస్తాడు. ఆ రకంగా ఈ ఆలయం ప్రతిష్ఠితమైంది. అందుకనే తెల్లని లింగవిగ్రహమూర్తి, శిబి శరీరంగా, లింగంపైవున్న గాట్లు, తన శరీరంనుండి కొద్దికొద్దిగా కోసిన శరీరగాట్లనీ, లింగవిగ్రహంపై గల రెండు రంధ్రాలు శిబి భుజములున్న ప్రదేశమని చెబుతారు.

ఈ శివలింగములోని విచిత్రం, లింగానికి వున్న రెండు రంధ్రాలలో కనుక పొరపాటున నీరు నిలువ వుంటే, తెల్లారేసరికి దుర్వాసన వస్తుందిట. శిబి చక్రవర్తి ఇక్కడికి వచ్చినందువలన "చేరిన జర్ల" అన్న ప్రదేశం కాలక్రమంగా అనేక రూపాంతరాలు చెంది "చేజర్ల" అయింది. త్రిమూర్తులు తమ రూపాలు మార్చుకున్న ప్రాంతం "రూపెనగుంట్ల" అనీ పావురం గాయపడి కుంటుకుంటూ వచ్చిన ప్రదేశం "కుంకులగుంట" అనీ, శిబి త్యాగానికి ఆశ్చర్యపడి దేవతలు విడిదిచేసిన ప్రదేశానికి "విప్పర్ల" అని పేర్లు వచ్చాయి. ఇవన్నీ చేజర్లకు దగ్గరగా వున్న గ్రామాలు.



దేశంలోని అత్యంత పవిత్రమైన 22 శైవ క్షేత్రాల్లో, ఇచ్చటి లింగం, ఈ చేజర్లకూడ ఒకటి అన్నది పండితాభిప్రాయంగా తెలుస్తుంది. ఇక్కడ ఆలయ విశిష్ఠత గూర్చి ఆలోచిస్తే, బయట నుంచి చూస్తే రెండు భాగాలుగా కనుపిస్తుంది. దీనికి శిఖరం వుంది. దానిపై శిల్పాలు కనబడవు. ఓ గుండ్రటి పెద్ద డ్రమ్మును మధ్యగా బోర్లావేస్తే ఎలాగ ఉంటుందో, అలాగ వుంటుంది.. ఇది శిఖరంగా చెబుతారు. ఇది నున్నగా గచ్చుచేసినట్లు కనబడుతుంది. ఈ శైలిలో నిర్మించిన ఆలయాలు మనదేశంలో రెండో మూడో వుంటాయి. ఈ నిర్మాణశైలిని 'హస్తిపుష్టశైలి' అంటారుట. క్రీ.శ. 3, 4 శతాబ్దంలో ఇది నిర్మించబడివుంటుందని, ఈ కపోతేశ్వరాలయం అతి ప్రాచీనమైనదని వూహించవచ్చును. అటు ఇటు శిథిలశిల్పాలు కనుపించినా, ఈ ఆలయం అప్పటికి ఇప్పటికి కొట్టవచ్చినట్లు కన్నులపండువచేస్తుంది. చూడాలనిపించే క్రొత్తదనం సంతరించుకుంది.

# చేబ్రోలు, పొన్నూరు



దక్షిణభారతం ఆలయాలు, అపురూప శిల్పాలకు నిలయం. ఒక్కోచోట తలపైకెత్తి చూడవలసిన అపురూప కట్టడాలు, శిల్పాలు, రాజగోపురాలు ... ఔరా... అనిపించడంకాదు, శిరసువంచి నమస్కరించేటట్లు చేస్తాయి. శాతవాహనుల కాలంనాటి చెప్పుకోదగ్గ చరిత్ర కల్గిన వూరు ఈ చేబ్రోలు. ఒకప్పుడు రాజధానిగా వెలసిన ఈ వూళ్ళో వందకు పైగా ఆలయాలు వుండేవిట. ఇప్పుడున్నవి మాత్రం కేవలం ఓ తొమ్మిది.

పురాతత్వశాఖ వారి త్రవ్వకాలల్లో అనేక వస్తువులు, నాణాలు, శాసనాలు లభించాయి. క్రీ.పూ. 1, 2 శతాబ్దాలవారైన శాతవాహనులు పరిపాలించిన ప్రాంతం. దరిమిలా ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, పల్లవులు, చాళుక్యులు ఆంధ్రప్రాంతపు చక్రవర్తులుగా పరిపాలించారు. వీరి సమయంలో చేబ్రోలు చెప్పుకోదగ్గ చరిత్రను పొందింది. ఈ ప్రాంతంలో బౌద్ధం శాతవాహనుల కాలంలో కొంత పుంజుకున్నా రానురాను, జైనబౌద్ధాలకు ఆ ప్రాంతంలో ఆనవాళ్ళులేవని చెప్పవచ్చును.

తూర్పు చాళుక్య వంశానికి చెందిన తొమ్మిదవ శతాబ్దపు రెండవ యుద్ధమల్లుడు చేబ్రోలు రాజధానిగా చేసుకున్నాడు. ఆతదుపరి పశ్చిమ చాళుక్యులు, 11వ శతాబ్దంలో కాకతీయులు, వీరి తర్వాత వెలనాటి చోళులు, గోల్కొండ నవాబులు కూడా ఈ ప్రాంతాన్ని పాలించారు. ఇక్కడ బ్రహ్మదేవుని ఆలయం వుండటమొక విశేషం.

చేబ్రోలులో 892 సం॥లో చాళుక్యభీముడు నిర్మించిన అతిప్రాచీన భీమేశ్వరాలయం వుంది. ఇది మొదట్లో బౌద్ధారామమని, చాళుక్యభీముడు శివాలయంగా మార్చాడని, చరిత్రకారుల భావన. ఇంకా ఈ వూళ్ళో వాసిరెడ్డివారు నిర్మించిన 'చతుర్ముఖ బ్రహ్మలింగేశ్వరాలయం, గంగాపార్వతీసమేత శ్రీనాగేశ్వరాలయం, శ్రీఆదికేశవాలయాలు శైవం బాగా వ్యాప్తిలో వున్న సందర్భంలో నిర్మించబడినవిగా తెలుస్తుంది.

ఒకనాడు ఈ చేబ్రోలు 'తామ్రపురి'గా చెప్పబడింది. అనంతరకాలంలో ఇది చేబ్రోలు' అయింది. ఆలయాలు 12 శతాబ్దంలోనే నిర్మించబడినట్లు ఆలయాలపైగల శిల్పసంపదను బట్టి తెలుసుకోవచ్చుఉ. అలాగే బాపట్ల భావనారాయణస్వామి 1400 సం॥కు పూర్వం చోళులచే నిర్మించబడినట్లు శాసనాలు చెబుతున్నట్లు ఆధారాలున్నాయి. క్రీ.శ. 594లో క్రిమికంధచోళుడు ఈ ఆలయనిర్మాతగా చెప్పబడుతుంది.

కృత, త్రేతా, ద్వాపర యుగాలలోకూడా ఈ ప్రాంతం ఎంతో విశిష్టమైనదని, ఇక్కడ ఎందరో ఋషులు శ్రీమన్నారాయణుని ప్రీత్యర్థం హోమాదులు సలిపేవారని, యుగధర్మప్రకారం దర్శనమొసగేస్వామి, ద్వాపరానికి వచ్చేసరికి క్షీరవృక్షాన్ని ఆవహించాడని, కలియుగంలో శ్రీస్వామిని ఎవరు గుర్తించలేకపోయారని, కుళోత్తుంగ చోళుడు ఈ ప్రాంతానికి రాగా, ఆహారంకోసం క్షీరవృక్ష ఆకులు తినే ఏనుగు తొండం, వృక్షాకులకు అంటుకుపోవడంతో, ఆశ్చర్యపోయిన రాజు, భగవంతుని ప్రార్థిస్తే, ఇద్దరు బ్రాహ్మణులద్వారా, స్వామి ఇక్కడ ఆలయాన్ని నిర్మించమని

కోరడం, కులోత్తుంగుడు నిర్మించడం జరిగింది. ఒకప్పటి భావపురి నేటి బాపట్ల.

ఇక్కడి మరో విశేషం. స్వామి దేవేరి రాజలక్ష్మిదేవి ఈ భావపురి సమీపంలోని 'కొండపాటూరు'లో వెలిసి, భావనారాయణునికి వాయవ్యదిశలో తన కాలయం నిర్మించమని కోరిందట. అప్పటినుండి ఈ తల్లిని తమ గ్రామబిడ్డగా తలచి, 'రాజలక్ష్మి భావనారాయణుల' కళ్యాణానికి పెండ్లిపెద్దలుగా వ్యవహరిస్తున్నారు. ఇంకా క్రీ॥శ॥ 9వ శతాబ్దంలో పల్లవరాజు నిర్మించినట్లు చెప్పబడే (శాసనాలనుబట్టి) కేశవస్వామి... అనే ఆదికేశవాలయం అతి ప్రాచీనమైనదిగా చెబుతారు. ఇక్కడి అమ్మవారి పేరు రాజ్యలక్ష్మి. ఇక్కడి భీమేశ్వరాలయం, చూడటానికి బౌద్ధసంబంధమైన నిర్మాణమని అనిపిస్తుంది. శిల్పశైలి, ఆదికేశవాలయంలో అపురూపమనిపిస్తే, ఘనమని చెప్పుకునే భీమేశ్వరాలయశైలి, బౌద్ధంపై హిందూ విజయంలాగ కనుపిస్తుంది.

ఇక్కడ వున్న మరో ఆలయం నాగేశ్వరాలయం, దీనిని 14వ శతాబ్దంలో మూర్తన్న, కంటెన్న ... అనే అన్నదమ్ములు అపురూపంగా నిర్మించారుట. ఈ నాగేశ్వరాలయం బయట ఒక మంటపం, అందులో అయిదు అడుగుల ఎత్తు, ఆరడుగుల వెడల్పు గల నందివుంది. ఈ మంటపం, నంది... అన్నీ ఎఱ్ఱ ఇసుకరాతి నిర్మాణాలు. అయితే దీని నిర్మాణవివరాలు మాత్రం లభ్యంకావడంలేదు.

నాగేశ్వరాలయానికి సమీపంలో వున్న బ్రహ్మేశ్వరాలయాన్ని పద్ధెనిమిదవ శతాబ్దంలో శ్రీరాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు నిర్మించారు. నాగేశ్వరస్వామి – బ్రహ్మేశ్వరాలయాల చుట్టు వేణుగోపాలస్వామి, వీరభద్రుడు, రంగనాథస్వామి, చంద్రమౌళీశ్వర, సహస్రలింగేశ్వర, నరసింహ, ఆంజనేయస్వామి ఆలయాలు వున్నాయి.

తమిళనాడులోని కుంభకోణం తర్వాత, ఇన్ని ఆలయాలు వున్న వూరు "చేబ్రోలు" అనే చెప్పాలి. ప్రాచీన సంస్కృతికి, పురాతన ప్రగతికి, మరోపేరు అయిన చేబ్రోలు చూడచక్కని వూరు.

## పొన్నూరు - సాక్షిభావనారాయణులు

పంచారామాల శివుని వలె, పంచక్షేత్రాలలో వెలసిన వాడు భావనారాయణస్వామి. ఈ వూరిలోని భావ నారాయణస్వామి "సాక్షి భావనారాయణు"నిగా పిలుస్తారు. పొన్నూరులో చూడవలసింది సాక్షి భావనారాయణస్వామి ఇది సృష్టి చెయ్యాలనే బ్రహ్మదేవుని సంకల్పంగా, ఇక్కడ తానొక సరోవరం ఏర్పాటు చేసుకుని, "బ్రహ్మసరోవర"మని పిలుచు కుంటూ తపస్సుచేసుకున్న ప్రదేశమిది. ఆ తరువాతి కాలంలో అత్రి మహర్షి విష్ణుకాశీలో తన వద్ద వుండమని కోరుతాడు. అలాగే... అన్న స్వామి అనుకోని పరిస్థితులలో తన భక్తుడైన గూని గోవిందుకు సాక్ష్యం చెప్పాలని బయలుదేరుతుంటే అత్రి మహర్షి "స్వామీ"అంటే భక్తజనరక్షకుడైన స్వామి, తనున్న చెట్టును, తనునుండి వెలువడిన తుంగభద్రా జలాలను, అత్రిమహర్షితో ఈ పొన్నూరుకు తీసుకువస్తాడు. ఇందుకు ఏర్పడిన పరిస్థితి...



పొన్నూరు సమీపంలోని నందూరు గ్రామంలోని కేశవయ్య సంతానార్థం కాశీయాత్రకు, తన మేనల్లుడు గూని గోవిందుతో బయలుదేరుతాడు. కాశీ చేరాక, నీపిల్లను నాకిచ్చి పెళ్ళిచేస్తా నంటే, నేను భావనారాయణ స్వామిని పూజిస్తా నంటాడు. అప్పటికి కేశవయ్య అలాగేనంటాడు. గోవిందుని భక్తి ఫలించినట్లు, కేశవయ్యకు ఆడపిల్ల పుట్టింది. వయస్సు వచ్చింది. కానీ గోవిందుకు తన పిల్లనివ్వడం ఇష్టంలేక తన పిల్లనివ్వనంటాడు. పైగా నీకెప్పుడు మాట ఇవ్వలేదంటాడు. అప్పుడు కాశీవెళ్ళి భావనారాయణస్వామికి తనగోడు వినిపించుకుంటే, తప్పక నేను వచ్చి సాక్ష్యమిస్తానంటాడు. వెనక్కి తిరిగి చూడకవెళ్ళమంటాడు. ఆ ప్రకారం బయలుదేరిన గోవిందు, పొన్నూరు వచ్చేసరికి "స్వామి వస్తున్నాడా?" అని వెనక్కి తిరిగి చూసేసరికి స్వామి శిలగా మారిపోతాడు. కేశవయ్యకీ విషయం తెలిసి, క్షమించమంటాడు. అప్పుడు భావనారాయణుడు సాక్షిగా గోవిందు గూని పోగొట్టి, పిల్లనిచ్చి పెళ్ళి చేయిస్తాడు.

10వ శతాబ్దంలో 'అవుకు' సీమను పరిపాలించే నారపరాజు తన శరీరంపై పెద్దకురుపు వేసి, అది తగ్గకపోతే, ఇక్కడి బ్రహ్మసరోవరంలో స్నానంచేయగా, అది తగ్గిపోయిందట. ఆయన ఇక్కడ ఆలయంకట్టి, పిల్లలకోసం తీర్థయాత్రలు సలిపే అనంతాచార్యులవారిని ఇక్కడవుండి, అర్చనాదికములు చూసుకోమంటే, సంతానం కోసం తీర్థయాత్రలు చేసే తను ఇక్కడవుండలేనన్నట్లు మాట్లాడతాడు. ఆ రోజు స్వామి కలలో అతనికో వెలగపండు ఇచ్చి, నీభార్య కివ్వు సంతానం కల్గుతుందంటాడు. అలాగే వారికి నల్గురు పిల్లలు పుడతారు.

వారిలో రెండవాడు చిన్నతనంలోనే సన్యసించి తపోమూర్తి అవుతాడు. మిగిలినవారు, వారి పేర్లతో, పెద్దవాడు "పెద్దింటి"వారనీ, పరాశరుని వంశస్థులకు "పరాశర్యు"లనీ, ఆఖరివాడు నారాయణుని సంతతివారు "నారాయణం" వారని ప్రఖ్యాతులౌతారు. క్రీ॥శ॥ 1119 సం॥లో చోళ దేశాన్ని పాలించే కులోత్తుంగచోళుడు, ఈ స్వామిని దర్శించి, అనేక దానాలు చేసినట్లు ఆలయంలోని శాసనం తెలియబరుస్తుంది.

ఎంతో చరిత్ర కల్గిన పొన్నూరులో సమీపగ్రామమైన రెడ్డిపాలానికి చెందిన కోట జగన్నాధదాసు గారు సహస్ర లింగేశ్వరాలయాన్ని భక్తులను భిక్షమడిగి నిర్మిస్తారు. ఈ ఆలయంలో అయిదు అఖండజ్యోతులు నిర్విరామంగా వెలుగుతున్నాయి. ఈ వూళ్ళోని మరో విశేషం 24 అడుగుల ఆంజనేయవిగ్రహం. 30 అడుగుల గరుత్మంతుని విగ్రహం.చూడబుద్ధివేసే ఈ అపురూప విగ్రహాలు 1969 సం॥ ఫిబ్రవరి 26న మహోత్సవం జరిపి మరీ ప్రతిష్ఠించారు.చారిత్రక, పౌరాణిక, ఆధునిక శిల్పాలు, శాసనాలు, కట్టడాలు కల్గిన ఈ పొన్నూరు చూడాలనుకోవడం కన్న చూడటం చాలా మంచిదన్నదే భావన.

గోష్ఠివనం, చక్రతీర్థం, స్వర్ణపురి, సుదర్శనక్షేత్రాలుగా పిలువబడే ప్రాంతమే నేటి పొన్నూరు. ఈ గ్రామంలో 1129 సం॥లో కులోత్తుంగ చోళుడు కాశీవిశ్వేశ్వరుని ప్రతిష్ఠించి, ఆలయ నిర్వహణకు గాను ఎన్నో భూములు, గ్రామాలు దానం చేసినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. ఇచ్చట శివకేశవ భేదంలేకుండా ఆలయాలు వున్నాయి. బ్రహ్మ శ్రీహరి కోసం తపస్సుచేస్తే శ్రీహరి ఆయనతో గోష్ఠిసల్పిన ప్రదేశమిది. ఇచ్చటి ఆలయాలను పలు సమయాలలో ఆయా పాలకులు దర్శించినట్లు చరిత్ర తెలుపుతుంది. ఈ పొన్నూరులో ఎన్నో ప్రాచీన ఆలయాలు వున్నాయి. వీటిలో ప్రాచీనమైనది వాసవీ కన్యకా పరమేశ్వరి. సహస్ర లింగేశ్వరుడు, నేటిదే అయినా ఇందు లోని 24 అ॥ ఎత్తుగల ఆంజనేయ, 30 అ॥ ఎత్తు గరుత్మంత ఆలయాల విగ్రహాలు చూడదగ్గవి. ఇలాగే ...

## తాడికొండ ఆలయాలు

14వ శతాబ్దానికిముందే వున్నట్లు ఇక్కడికి జగద్గురు ఆదిశంకరులు తమ సంచారంలో భాగంగా వచ్చినట్లు 'నవలింగా'లను ప్రతిష్ఠించినట్లు చెబుతారు. ఒకప్పటి 'తాళాద్రి' ఇప్పటి తాడికొండ. ఈ తొమ్మిది శివాలయాలలో కొన్ని జీర్ణావస్థకు వచ్చాయి. శంకరుల మహిమకో, శివశక్తికో ఈ కొండపై 'మల్లెలకోన, ఏనుగులకోన' అనే కోనేరులు సహజంగా ఏర్పడ్డాయి. ఏడాది పొడుగునా ఇందులో నీళ్ళు వుంటాయి. ఇక్కడో పాదముద్ర పెద్దది వుంది. దీనిని హనుమంతుని పాదముద్రగా చెబుతారు.

## భార్గవనరసింహస్వామి

ఈశాన్యంగా 2 కి.మీ దూరంలోవున్న ఆలయ ప్రవేశంలో పరశురాముడు తపస్సుచేస్తే, స్వామి హిరణ్యకశిపుని పొట్టను చీలుస్తున్నట్లు దర్శనమిచ్చిన ప్రదేశమిది. భార్గవుడు తపస్సు చేసి దర్శనం పొందిన ప్రదేశం కాబట్టి "భార్గవనరసింహస్వామి"ఆలయంగా ప్రశస్తి పొందింది. ఈ ఆలయానికి కాలానుగుణ్యంగా ఎందరో, రాజులు, భక్తులు – అమూల్యమైన దానాలనిచ్చినట్లు, 16వ శతాబ్దంనుండి ఆలయమంతావున్న శాసనాలద్వారా తెలుస్తుంది.

కాకతీయ ప్రతాపరుద్ర చక్రవర్తి, వీరశైవుడైనా ఈ ఆలయాన్ని అభివృద్ధిపరిస్తే 1515 సం॥లో శ్రీకృష్ణ దేవరాయలు రంగమంటపాన్ని నిర్మించినట్లు తెలుస్తుంది. యాంత్రిక జీవనానికి అలవాటుపడ్డ మానవులు, పరమప్రశాంతంగా ఇక్కడికి వచ్చి, ఇచ్చటి ప్రశాంతతను అపురూప కళాసంపదను, దర్శించి, పులకించి, తన్మయులవమనడం తప్పుకాదేమో! అలోచించండి!!

## నాగార్జునసాగర్ - రంగనాయకస్వామి



ఆచార్య నాగార్జునుని జన్మస్థలమైన ఈ క్షేత్రములో పురాతనమైన రంగనాయకస్వామి ఆలయం ఉంది. ఆంధ్రులు గర్వించ దగ్గ ప్రముఖ నాగార్జునసాగర్ ఆనకట్ట చూసి తీరవలసిన ప్రదేశం. లాల్‌బహుదూర్, జవహర్‌లాల్ పేరున నిర్మించిన ఈ ఆనకట్ట కుడి, ఎడమ కాలువల ద్వారా వేలాది ఎకరాల పంట పొలాలకు నీరు అందుతోంది. ఇక్కడకు 11 కి.మీ. దూరంలో ఉన్న ఎత్తిపోతల జలపాతం చూడదగ్గ స్థలము. లాంచీపై శ్రీశైలం క్షేత్రమునకు వెళ్ళవచ్చును. ఆచార్య నాగార్జునుని పేరు శ్రీ నాగార్జున విశ్వ విద్యాలయం కూడా ఈ ప్రాంతములలో ఉన్నది. ఇటు భక్తులు, అటు విద్యార్థులు కూడా ఈ ప్రాంతాన్ని సందర్శిస్తారు. వేసవి కాలంలో దేశ నలుమూలల నుండి ప్రజలు ఈ ప్రాంతమునకు వస్తుంటారు. ఉండటానికి విజయ విహార్, గవర్నమెంట్ వారి టూరిస్ట్ రెస్ట్‌హౌస్, యూత్ హాస్టల్, ఎ.పి.టి.డి.సి. వారి వసతి గృహములు కలవు.

## ఉండవల్లి

కృష్ణా బ్యారేజికి 2కి.మీ. దూరంలో క్రిష్ణానది ఒడ్డున ఉండవల్లి గ్రామము ఉంది. క్రీ.శ. 420–600 మధ్య కాలములో ఈ ప్రాంతాన్ని పాలించిన విష్ణు కుండినులు ఈ గుహలు తొలిపించారని చెబుతారు. నాలుగు అంతస్తులు ఉన్న ఈ గుహలు అనంత పద్మనాభ స్వామికి అంకితమివ్వబడినవని కూడా చెబుతారు. ఈ వైష్ణవ ఆలయంలో స్వామి వారి విగ్రహం పెద్దదిగా ఉంటుంది. 5, 6 శతాబ్దాల కాలంలో నిర్మించినట్లు ఈ దేవాలయాలలోని శాసనాల ద్వారా తెలుస్తోందని చరిత్రకారులు చెబుతారు. చూడదగ్గవి. చరిత్రను చెప్పుకొని స్మరించుకోదగ్గవి.



## (తెనాలి) వైకుంఠపురం - చిన తిరుపతి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని గుంటూరు జిల్లా తెనాలి పట్టణమునకు దక్షిణపు అంచున ఉన్న పండ్లతోటల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో వేంచేసియున్న వెంకటేశ్వరుని దర్శించుకున్న భక్తులు ఏడుకొండలస్వామి ఇక్కడకు వచ్చారా అని భావించటం సహజం. ఈ స్వామి వారికి కుడివైపు పద్మావతి ఎడమవైపు లక్ష్మిదేవి వేంచేసియున్నారు.



ఇది విశేషమని చెప్పదగిన దివ్యక్షేత్రం. ఇక్కడ వేంకటేశ్వరస్వామి ఆలయాలు రెండువున్నాయి. ఒకటి కొండమీద గుహలో, రెండవది కొండక్రింద. మొదటి (గుహలోని) ఆలయాన్ని స్వయంభువుగా చెబుతారు. అనంతర కాలంలో అందరు కొండ ఎక్కి దర్శించుకోలేని స్థితిలో దిగువనున్న మరొక ఆలయం నిర్మించబడింది. కొండమీద ఆలయం ఎగువ తిరుపతిగాను, దిగువన ఆలయాన్ని దిగువ తిరుపతిగాను చెప్పుకుంటారు. ఒకనాటి 'రాపూరు', ఇప్పుడు 'వైకుంఠపుర'మైంది.

ఈ పుణ్యక్షేత్రమును చిన్న తిరుపతి (వైకుంఠపురం) అని పిలుస్తారు. ఆర్థికంగా తిరుమల వెళ్లలేని భక్తులు ఈ క్షేత్రమును దర్శించి పునీతులవుతారు. ఈ క్షేత్రములో స్వామి వారికి కళ్యాణ మండపము, యాగశాల, కేశఖండనశాల

13 గదుల వసతి గృహము నిర్మించబడియున్నవి. వైశాఖ బహుళ తదియ మొదలు నవమి వరకు ఈ క్షేత్రములో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. తెనాలి బస్సుస్టాండ్ నుండి నిజాంపట్నం వెళ్లే దారిలో 2కి.మీ. దూరంలో వైకుంఠపురం ఉంది. ఇతర ప్రాంతముల నుండి వచ్చు యాత్రికులకు వసతి సౌకర్యము ఉంది. వైకుంఠ ఏకాదశి నాడు ఈ క్షేత్రమునకు వేలాది భక్తులు వస్తారు.

## త్రికూటేశ్వరుడు

ఈ శివుని శిఖరాలను – బ్రహ్మ, విష్ణు రుద్రశిఖరాలుగా పిలుస్తారు. శివ, కేశవులకు భేదములేదనడానికి నిదర్శనంగా, త్రికూటేశ్వర ఆలయం విష్ణుశిఖరంపై వుంది. ఇది వింతకాని విశిష్టత. ఈ ఆలయం మూడు భాగాలుగా వుంది. మొదటికొండపై ముసలికోటయ్యగుడి, రెండవదానిపై శివుడు, మూడోది దిగువనున్న బొచ్చుకోటయ్యగుడి. స్థలపురాణం/ పురాణచరిత్ర ప్రకారం, దక్షయజ్ఞంలో సతీదేవి యోగాగ్నిలో భస్మమవడం భరించలేని శివుడు, ఇక్కడ (వి)యోగమూర్తిగా వెలిశాడుట. అందుకే ఇక్కడ అమ్మవారి ఆలయం లేదు. కానీ భక్తురాలైన ఆనందవల్లి ఆలయముంది. ఈ కొండపైకి మెట్లు 1761 సం॥లో ఆనాటి పాలకుడు శ్రీ రాజామల్ రాజు గుండురాయులచే నిర్మించబడ్డాయని, కాలక్రమంలో 1998-2000 సం॥ల మధ్య కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మితమై భక్తులు స్వామిని దర్శించడం సులభమైందని చెప్పడంకాదు కళ్ళారా చూడవచ్చును. కొండవీడును జయించిన శ్రీకృష్ణదేవరాయలు ఈ త్రికూటేశ్వరుని దర్శించాడని ఎన్నో మడిమాన్యాలనిచ్చాడని, నిత్యనైవేద్యాలకు 'కొండకాపూరు' అనే గ్రామాన్ని సమర్పించాడని శాసనాలద్వారా తెలుస్తుంది.

## కాకుమాను - చెన్నకేశవుడు

ఈ దేవుడు చెన్నకేశవుడు, చోళులకాలంలో నిర్మితమైనట్లు తెలుస్తుంది. ఉన్నదానిని బాగుచేసుకోవడం చాతకాని మనం, చెడగొట్టుకునేందుకు మొదటివారిగా చెప్పుకొనవచ్చును. ఆలయం శిథిలమైతే, ఆ తీపి గుర్తులను భద్రం చేసుకోవాలని బుద్ధిపుట్టిన బుద్ధిమంతులు 2005 సం॥లో పునర్నిర్మించి, జాతికి అంకితమిచ్చారు. ఈ ఆలయ సముదాయంలో, శ్రీవేంకటేశ్వరుడు, వేణుగోపాలుడు, గరుడాళ్వారులు, సువర్చలాసమేత ఆంజనేయులు, షిర్డిసాయి, లక్ష్మీగణపతి, రాహుకేతుసమేత నాగదేవతలను దర్శించవచ్చును.

## భ్రమరాంబా - మల్లేశ్వరులు - పెదకాకాని

ఇదిగొప్ప పురాతన క్షేత్రం. క్రొత్తదంపతులు కొంగుముడివేసుకుని ఈ స్వామిని ఆలయమందలి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర, వినాయక, నాగదేవత, నవగ్రహాలు పూజలు చేసుకోవడం ఎంతో మంచిదిగా తలుస్తారు. మహామండలాధీశుడయిన శ్రీకృష్ణదేవరాయలు ఈ స్వామిని దర్శించాకనే, సంతానం పొంది, ఆ పిల్లవానికి సదాశివరాయలని పేరుపెట్టుకున్నాడని శాసనాలు తెలుపుతున్నాయి. ఇక్కడి సుబ్రహ్మణ్యేశ్వరుడు కూడా చాలా మహిమాన్వితుడని, ద్రవిడముని, అగస్త్యులవారి అభిప్రాయం. పైగా ఇది శివప్రియకరమైన 'సిద్ధసమాజ'క్షేత్రం. భక్తవశంకరుడైన శివుడిక్కడ వుండిపోవడంతో ...



శివునికై తపించే పార్వతి, తన చెలికత్తెల ద్వారా శివుడిక్కడ వున్నాడని తెలుసుకుని రప్పించుకుంటే, భ్రమరాంబకై శివుని కోసం వెళ్ళే శివుడు, ఈ సిద్ధ సమాజాన్ని విడువలేక, స్వయంభువుగా వెలుస్తాడు. అందుకే ఇక్కడ మల్లేశ్వరునితోపాటు, ఇటు భ్రమరాంబ, అటు భద్రకాళి, సమేత వీరభద్రుడు, గణపతి, సుబ్రహ్మణ్య, నందీశ్వరాదులు, మహా శక్తివంతులుగా నిలిచారు.

స్థలపురాణం ప్రకారం – ఇక్కడ భరద్వాజముని తాను స్వీకరించిన సమస్త తీర్థాల పవిత్ర జలం ఒకబావిలో వుంచాడని, ఆ జలం సర్వపాపనాశనమే కాదు, సర్వాభీష్టాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించుతుందని చెబుతారు. ఇందుకు ఉదాహరణగా ఒకానొక సమయంలో ఇక్కడికి వచ్చి శివదర్శనం చేసిన భరద్వాజులు యజ్ఞం చేయతలపెట్టి, ఋషిపుంగవులను ఆహ్వానించి కార్యక్రమం ప్రారంభిస్తారు. ఆ ఆహుతులను ఒక కాకి తింటుంటే, తన సంకల్పం అపవిత్రమౌతుందని వారించబోతే ...

"మహర్షీ! నేను కాకాసురుడనే రాక్షసుడను. బ్రహ్మ ప్రసాదించిన వరంవలన యజ్ఞహవిర్భాగములను స్వీకరించవచ్చును. నన్ను నివారించకండి. అంతేకాదు, మీరు ప్రారంభించిన యజ్ఞానంతరం, మీరు స్వీకరించిన పవిత్రతీర్థజలాలతో ఈ మల్లేశ్వరుని అభిషేకించి ఆ దివ్యజలం నామీద చల్లండి. శాపవిముక్తుడినై తరిస్తాను" అని సత్యం చెబుతాడు. భరద్వాజులు అలాగే చేస్తారు. కాకి తన నల్లతనం పోగొట్టుకుని హంసవలె తెల్లనిరంగు పొందుతుంది. దాంతో సంతోషించిన ఆ కాకాసురుడు స్వామిని మల్లెపూలతో పూజించి మహర్షికి ధన్యవాదాలు తెలిపి, మానససరోవరానికి వెళ్తుంది. కాకి పవిత్రమైన ప్రదేశంగా ఈ వూరు "కాకాని" అయింది. ఇప్పుడిది దర్శించదగ్గ మహాపుణ్యశివక్షేత్రం.

## మాచర్ల - చెన్నకేశవుడు

1113 సం॥లో కార్తవీర్యార్జునుడనే రాజు దీనిని నిర్మించాడని, హైహేయ వంశస్థుడైన అనుగురాజు పునర్నిర్మించినట్లు, 13వ శతాబ్దంలో బ్రహ్మనాయుడు దీనిని మరమ్మత్తులు చేయించినట్లు చరిత్ర చెబుతుంది. మొదట్లో ఇది శైవ సంబంధ ఆదిత్యేశ్వరాలయం. అంటే బ్రహ్మనాయుడు, వైష్ణవం చేసి, చెన్నకేశవుని ప్రతిష్ఠించాడనేది ఇప్పటి చరిత్ర. అత్యంత పెద్ద ఆలయం, శిల్పచాతుర్యం, ఒకనాటి ఆదిత్యేశ్వరాలయం, నాగస్తంభం, ఇప్పటి చెన్నకేశవుడితో ఆలయం చాలా చక్కగా చూడముచ్చటగా వుంటుంది. ఇది విశాలమైన ఆలయ విశిష్టత.

అత్యున్నత ప్రవేశద్వార గాలిగోపురం. లోపల రాతి ధ్వజస్తంభం. కూర్చుండటానికి వీలైన శిలాసింహాసనాల మండపం. దర్శనీయం. సంస్మరణీయంకూడా!

## శ్రీరంగనాయకులు

మాచర్లకు దగ్గర్లోగల ఎత్తిపోతల జలపాతం. చంద్రవంక నది, అటు, ఇటు పర్వతపంక్తులు. ఎడమవైపు గుహాలయాలు. ఏమిటని చూస్తే - ఒకటి రంగనాయక ఆలయం, రెండు మధుమతి - మూడు దత్తాత్రేయులు. ఎంతో ప్రాచీనమైన వీటిని ఆహ్లాదకర వాతావరణంలో ఆనందంగా భక్తితో దర్శించవచ్చును.

## సీతా'నగ'రం - ఆంజనేయస్వామి



చరిత్రలేని వూళ్ళు, పురాణ ప్రసక్తిలేని ప్రాంతం - ఈ భరతఖండంలో కనబడదు. అణువణువు ఆలయాలు, దేవతా నివాసప్రాంతాలు. అందులో ఒకటి సీత 'నగ' పడిన 'సీతానగరం'. ఇచ్చటి వీరాంజనేయస్వామి భక్తులు పాలిట అభయాంజనేయ స్వామి. ఈ స్వయంభువు సమీపంలో 1919 సం॥లో కోదండ రామాలయ ప్రతిష్ఠ జరిగింది. ఇది పురాణప్రసిద్ధ ప్రాంతం. గుంటూరు జిల్లాకు ముఖద్వారంగా చెప్పవచ్చును.

ఈ గుంటూరుజిల్లాలో - **భట్టిప్రోలు** ఉభయరామలింగేశ్వరాలయం, **కారంపూడి** చెన్నకేశవాలయం, **తెనాలి**లోని త్రేతాయుగంనాటి గంగాపర్వతవర్ధనీ సమేత శ్రీరామేశ్వరస్వామి, శ్రీకృష్ణదేవరాయలు సందర్శించిన గోవర్ధనకృష్ణుడు, తెనాలి రామలింగడు పూజించిన కాళిమాత ఆలయం దర్శనీయాలు.

తెనాలి తాలూకా, **చిలుమూరు**లోని త్రేతాయుగంలో రామప్రతిష్ఠ గావించిన ఉభయరామేశ్వర లింగాలు, **నందివెలుగులో** అగస్త్యులవారు ప్రతిష్ఠించిన అగస్తేశ్వరాలయం, చెప్పుకోదగ్గ, చారిత్రక, పురాణక్షేత్రాలు. **నిడుబ్రోలు**లోని శ్రీచౌడేశ్వరస్వామి, 12వ శతాబ్దంనాటి మాచర్లలోని వీరభద్రుడు, అలాగే గుంటూరులోకూడా ఎన్నో ఆలయాలు వున్నాయి. ఆంజనేయస్వామి (కొత్తపేట), లాలాపేట వేంకటేశ్వరుడు, బస్టాండు సమీపంలోని గంగాపార్వతీసమేత అగస్త్యేశ్వరుడు, నల్లచెరువువద్దగల మల్లేశ్వరాలయం పరమప్రాచీనాలు, దర్శనీయాలు.

పురాతనంగా చెప్పే **రాయపూడి సోమేశ్వరుడు, గురజాల పాతపాడేశ్వరి, వీరభద్ర ఆలయాలు, చందోలు బండ్లమ్మ; లింగోద్భవస్వామి, చెన్నకేశవుడు,** అలాగే **శేకూరు** గ్రామంలోని చారిత్రక ప్రసిద్ధ **రుక్మిణీసమేత వేణుగోపాలుడు,** కృష్ణదేవరాయలనాటి వేంకటేశ్వరుడు, బాలాసుందరీ, కుండలేశ్వరుడు, 16వ శతాబ్దంనాటి **అమృతలూరు 'శ్రీమిర్యాల భావన్నారాయణస్వామి, అమృతేశ్వరాలయం, వడ్లమూడిలోని** ప్రాచీన, విజయనగర రాజులనాటి **శ్రీవీరభద్రుడు,** చారిత్రక రామాలయం భక్తితో నమస్కరించడం, వీటి శిధిలావస్థకు గుండెపగిలేటట్లు భోరుమని ఏడవడం అప్రయత్నంగా జరిగేపని.

కారెంపూడికి సమీపంలో గల **పెద్దకొదమగుడ్లం ఉత్తరేశ్వరాలయం, మోదుకూరు, కొమ్మూరు, దుర్గి, వలివేరులలోని వీరభద్రుని ఆలయాలు** చారిత్రక ప్రాధాన్యతగలవి. పెదనందిపాడు దగ్గర్లోని నాగులపాడు, కట్టంపూడి, నవులూరు

పుట్ట, పెదకూరపాడులోని **నాగేంద్రస్వామి ఆలయాలు** మహామహిమాన్వితాలు. **వినుకొండలోని సంజీవనికొండ,** రామాలయం త్రేతాయుగ పురాణకథలతో కూడినవి. ఇక్కడి హనుమంతుని 'టపాఆంజనేయుడని' కూడా చెబుతారు. ఆ రోజులలో టపాసదుపాయం లేకపోవడంతో ఇచ్చటి బిలం వద్ద ఉత్తరం పెడితే స్వామి, అవతలివారికి అందిస్తారని, సమాధానంకూడా వస్తుందని చెప్పుకునేవారు.

100 బిలాల గుత్తికొండ 'వేదఅమరలింగేశ్వరులవారు, దుర్గి మండల అడిగోపుల గ్రామంలోని నిదానంపాటి లక్ష్మీఅమ్మవారు, సంతానప్రదాతేకాదు, సకల సౌభాగ్యప్రదాత. శిలాదు మహర్షితో శాపమొందిన జగన్మాత అమ్మ వారుగా జన్మించి ప్రాయశ్చిత్తమొందిన దివ్యప్రదేశమిది. వేంగిపుర మనబడే వేంగీపుర – వల్లభరాయుడు, అగస్త్యులు ప్రతిష్ఠించిన గంగాపార్వతీసమేత అగస్త్యేశ్వరుడు, సొలస శ్రీ రంగనాధస్వామి, పౌరాణిక, చారిత్రక, ప్రశస్తికల్గిన ప్రత్తిపాడు వేణుగోపాలుడు; నాదెండ్ల మూలస్థానేశ్వరుడు, ఒకనాటి నందపురం, నాదెండ్లఅయిన గోవర్ధనస్వామి ఆలయం, మల్లాది స్వయంభూ వేంకటేశ్వరుడు తెలిసి దర్శించే దైవమూర్తులు. తెలియక ఎందరో దేవతలు, ఎన్నో ఆలయాలు, తెలుసుకోవాలని వున్నా ఈనాడు చెప్పేవారు అరుదుగా – ఈ గ్రంథం కొంత వూరటకల్గిస్తుందన్నది, మా భావన.

## రామలింగేశ్వరస్వామి ఆలయం - తెనాలి

గుంటూరు జిల్లా తెనాలి పట్టణం నడిబొడ్డున శ్రీ రామలింగేశ్వర స్వామిగా పిలువబడే శివలింగం దశావతారములలో ఒకరైన పరుశురామునిచే ప్రతిష్టించబడిందని ప్రతీతి.



ఈ ఆలయంలో పార్వతీ, వినాయక, నాగేంద్ర, అయ్యప్ప, నవగ్రహాలు ఉన్నవి. కృష్ణదేవరాయల ఆస్థానములో వికటకవిగా పేరొందిన తెనాలి రామకృష్ణుని జన్మస్థలము తెనాలి అంటారు. ఆయన ఈ దేవాలయము నకు అందించిన కానుకలు నేటికి ఈ దేవాలయములో పూజలు అందుకుంటున్నాయి. దేవి వరంతో పామరుడు పండితుడయి లక్ష్మి సరస్వతుల అనుగ్రహంతో సాహితీ క్షేత్రాన్ని నందనవనం చేశారాయన.

తెనాలి రామకృష్ణకవి ఈ ఆలయములోని లింగమును అభిషేకించి అర్పించారనటానికి నిదర్శనం ఈ ఆలయానికి ఆయన సమర్పించిన ఉత్సవ మూర్తులు. ఆ మహానుభావుని ఇంటి పేరుగా నేడు అనేక రంగాలలో కళల కాణాచిగా తెనాలి విలసిల్లుతోంది.

గర్భిణి స్త్రీలు ప్రసవ వేదన ఎక్కువగా ఉంటే ఈ ఆలయంలోని నందిని కొంచెం కదిలిస్తే సుఖప్రసవం జరుగుతుందంటారు. భక్తులు కోర్కెలు తీర్చే దైవం రామలింగేశ్వరుడు. ఇదే ఆలయంలో పడమర వైపు మూలగా అష్టభుజములతో వెలుగొందే కాళికామాత విగ్రహము కూడా భక్తులను ఆకర్షిస్తుంది.

## కోటప్పకొండ

గుంటూరుజిల్లా నరసరావుపేటకు దగ్గరలో ఉన్న ఈ ప్రముఖ శివాలయములో ప్రతి శివరాత్రికి పెద్ద ఎత్తున భక్తులు, ప్రజలు, బండ్లు కట్టుకొని వస్తారు. ఈ సమయంలో రాష్ట్రనలుమూలల నుండి విచ్చేసే భక్తజన సందోహం కొరకు దేవస్థానం వారు ఏర్పాట్లు చేస్తారు. మూడు శిఖరాలు ఉన్న ఈ క్షేత్రమును త్రికుటాచలం అని కూడా పిలుస్తారు. చూడవలసిన శివక్షేత్రములలో ఇదిఒకటి.

## పల్నాటి సీమకు పెట్టింది పేరు చెన్నకేశవస్వామి దేవాలయం - మాచర్ల

ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా పల్నాడు తాలూకా మాచర్ల గ్రామమునందు గల శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయం వైష్ణవాలయంగా భక్తుల హృదయాలలో చోటు చేసుకుంది. కృష్ణానది ఉపనది అయిన చంద్రవంక నది ఒడ్డున గల శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం పల్నాటి కృష్ణుడుగా పేరు గాంచిన బ్రహ్మ నాయుడు 11వ శతాబ్దములో నిర్మించినట్లు చెపుతారు. శ్రీనాధుడు రచించిన పల్నాటి వీరచరిత్రలో కూడా ఈ క్షేత్ర వివరాలు మనకు కనిపిస్తాయి.



మాచర్ల గ్రామమునకు చివరగా విశాలమైన ప్రాంగణంలో ఎత్తైన ప్రాకారముతో నిర్మించబడిన ఈ ఆలయ సముదాయమునందు శివాలయం, వీరభద్రస్వామి దేవాలయం కూడా కలవు. ప్రధాన ఆలయంలో శ్రీ చెన్నకేశవస్వామి చతుర్భుజ మూర్తియై పూజలుఅందుకొంటున్నారు. మూడు అడుగుల ఎత్తుగల ఈ స్వామి శంఖు, చక్రములు, గధ, అభయ హస్తముతో చూడ ముచ్చటగా సుందర మందస్మిత ముఖారవిందముతో దర్శనమిస్తారు. నాలుగు స్థంభముల రంగమంటపము ద్వార బంధములు, ఉత్తరావళిపై ఉన్న గజలక్ష్మి చిహ్నం భక్తులు చూడవలసినవి.



రంగ మంటప స్థంభముల మీద చెక్కబడిన రామాయణ, భాగవత, భారత ఘట్టములు చూసి ఆనందించవలసినదే కాని వర్ణించనలవి కాదు. ఆలయం ముందు ఉన్న ముఖ మంటపము, నల్లసీసపు రాతితో మలచబడిన శివలింగము, కాకతీయ శిల్పకళను పోలిఉంటుంది. పల్నాటి సీమకు పెట్టింది పేరైన ఈ చెన్నకేశవస్వామి ఆలయము దగ్గరే వీరభద్రేశ్వర దేవాలయము కూడా కలదు. ఎత్తుగా ఉన్న ఈ ఆలయ గోపురం కూడా భక్తులు తిలకించవలసినది. పరమ పావనమైన ఈ క్షేత్రము దర్శించి ముందుకు సాగుదాం!

# ప్రకాశం జిల్లా

## శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవాలయం - మార్కాపురం




ఆకాశాన్ని అంటే గాలిగోపురంతో నిత్యం వేల సంఖ్యలో భక్తులు దర్శించుకునే మార్కా పురంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవాలయం భారతదేశంలోని పేరెన్నిక గన్న దేవాలయాలకు సరితూగగలదని చెప్పవచ్చు. 14వ శతాబ్దంలో శ్రీ కృష్ణదేవ రాయులు ధాన్యకటకాన్ని జయించి వరదరాజమ్మను వివాహం చేసుకుని తిరిగి వస్తూ యిచ్చట మకాం చేయగా స్వామి మహిమకు ప్రభావితుడై ఆలయం కట్టించాడని. ఆలయ ప్రాంగణానికి ఎదురుగా ఉన్న శిలాస్థంభము కూడా రాయలే తన దిగ్విజయ సూచకంగా ప్రతిష్టించినట్లు ఇక్కడి ప్రజలు అనుకుంటారు.

9 అంతస్తులు ఉన్న ఈ ఆలయ ముఖద్వారం 1929-1936 మధ్య కాలంలో నిర్మితమైనదని చెబుతారు. ఈ ఆలయంలో ధనుర్మాసములో సూర్యకిరణములు స్వామివారి పాదపద్మములపై పడటం విశేషం. ఈ ఆలయంలో మధ్య భాగంలలో ఒక స్థంబాన్ని దాటి లోపలికి వెళ్లే మార్గంలో యిరువైపుల ఇద్దరి అన్నదమ్ముల స్థంభాలు ఉన్నాయి. ఇరువురు సోదర శిల్పులు ఒకరిని ఒకరు చూసుకోకుండా మధ్య తెరకట్టుకుని శబ్ద గ్రహణంతో చెరి ఒక స్థంబాన్ని చెక్కినట్లు ఈ రెండు స్థంభాలు ఒకే రూపంలో ఎక్కడ భేదం లేకుండా మనోహరంగా ఉన్నాయి. ఇది కృష్ణదేవరాయల కాలంలో జరిగినట్లు చెప్పబడుచున్నది. శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి తిరునాళ్లు ప్రతిఏటా చైత్రపౌర్ణమి నుండి 15 రోజులు జరుగుతాయి. రోజుకు ఒక వాహనం ఊరేగింపు జరుగుతుంది. ఈ ఉత్సవాలలో రథోత్సవం ఒక గొప్ప విశిష్టత. యాత్రికులకు వసతి సౌకర్యము ఎక్కువగా లేని కారణంగా ఈ ఆలయం వృద్ధిలోనికి రావటం లేదని భావిస్తున్నారు.

మార్కాపురం ఈ కలిలోనేకాదు, గతమూడు యుగాలలోను వుంది. కృతయుగంలో గజారణ్యంగా, త్రేతాయుగంలో మాధకపురి, ద్వాపరంలో సోపానంగా, ఇప్పుడు మారికాపురమన్నది మార్కాపురమై ప్రకాశిస్తోంది. త్రేతాయుగంలో చివరలో గౌతమమహర్షి, ద్వాపరంలో దేవతలు, ఆ దేవదేవుని పూజించారుట. 'మారిక' అనే ఇల్లాలు వలన గ్రామం మారికాపురం, మార్కాపురం అయింది. ఆమె భక్తికి మెచ్చుకున్న చెన్నకేశవుడు గుండికానది (గండ్లకమ్మ)లోని ఇసుకను నీవు తెచ్చే పాల కుండ నిండా నింపుకుని నీ ధాన్యం గాదెలో పెట్టుకో. మేలు జరుగుతుందంటే అలాగే చేస్తుంది.

కాలాంతరములో గాదెలోని ఇసుక బంగారమౌతుంది. వారే ఆలయం కట్టిస్తారు. 'మారికా, మారకు'లనే ఆ దంపతుల విగ్రహాలు కూడా ఆలయంలో ఎడంవైపు దర్శించగల్గుతాం.

ఇక వివరాలలోకి వెడితే ---

## త్రిపురాంతకేశ్వరుడు - త్రిపురాంతకం




స్వయంభులింగస్వరూపుడు – అయిదు ముఖాలు, నెత్తిన గంగతో, శ్రీచక్రంపై నిర్మించిన ఆలయస్వరూపుడు ఈ త్రిపురాంతకుడు. ఇంకా విశేషం శివలింగంపైన ఓ గుంట వుంటుంది. అందులో నీరు ఎప్పుడు వూరుతూ వుంటుంది. తారకాసుర సంహారం జరిగాక, వాని ముగ్గురు కుమారులు తమ తండ్రి మరణానికి ప్రతీకారం తీసుకోదలచి, బ్రహ్మను ప్రార్థించి, మరణం లేని వరం కోరుతారు. అది కుదరదనే సరికి, తమ కెటువంటి ఆటంకాలు లేకుండా సాగగల్గిన ముగ్గురికి మూడు పురాలు ఇమ్మంటారు. బ్రహ్మ విశ్వకర్మద్వారా ఇప్పిస్తాడు.

'ఇవి విడిగావున్నంతవరకు మీరు అవధ్యులు. కలిసాయో మీరు మృతులు" అని బ్రహ్మ చెబుతాడు. అది వరంగా వారు విర్రవీగుతారు. రెచ్చిపోతారు. ఈ విషయం తెలిసిన శివుడు సమయంకోసం ఎదరుచూసి మూడుకలువగా ఒక్క బాణంతో వాటిని ధ్వంసంచేసి త్రిపురాంతకుడౌతాడు. స్వామి కొండపైన, అమ్మవారు కొండదిగవన త్రిపురసుందరి త్రిపురాంబికగా ఆరాధించబడుతుంది. అమ్మవారి ఆలయం వర్షాకాలంలో మునిగి వుంటుంది. ఆలయం ముందు సరస్సు అమ్మవారికి 3 గ॥ దూరంలో ఎత్తైన వేదికపై ఆదిశంకరులు తమ పర్యటనలో రాతి శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించారు. వర్షాకాలంలో అమ్మవారికి బదులుగా రాతిశ్రీచక్రం పూజించబడుతుంది. ఎక్కడలేని విధంగా అమ్మవార్ని కదంబ వనవాసిని అనడానికి నిదర్శనంగా, ఇక్కడ ఈ తల్లి ముందు గల సరస్సునందు తొమ్మిది కదంబవృక్షాలు వున్నాయి.

ఇంకా ఈ క్షేత్రానికి తూర్పున వినుకొండ మండల శివాపురం వద్ద పాతపాటిదుర్గ, ఈశ్వరుడు, దక్షిణాన కొచ్చర్లకోట రామలింగేశ్వరుడు, అంకానమ్మశక్తి; పడమట గడ్డ మీద పల్లె వద్ద వీరభద్రుడు, ఉత్తరాన శతకోడు గ్రామంలో శివుడు, అంకాళమ్మ శక్తి, దేవాలయాలతో పరివేష్ఠితమైంది త్రిపురాంతకం. ఇక్కడ కేదారేశ్వర, ఉత్తరేశ్వర, మల్లికార్జున, కపిలేశ్వర, గౌరీశ్వరా, అంగీరేశ్వర, మూలస్థానేశ్వర, పాపవిమోచన, స్వయంభూ శివలింగాలు; గంగావతి, పాపవిమోచన, పుష్పావతి, గుండీప్రభ, దూర్వాస, వనస్పతి, నేత్రావతి, మోక్షగుండం, తామ్రజాహ్నవి, చిత్రమహిమ కర్ణిక వగైరా తీర్థాలు వున్నాయి.

కులోత్తుంగ చోళునితోపాటు, కాకతీయులు, రెడ్డిరాజులు, చాళుక్య, విజయనగరప్రభువులు దర్శించి, తమ భక్తిప్రపత్తులను, దానాలద్వారా ప్రకటించుకున్నారు.





## మాల్యాద్రి శ్రీలక్ష్మీనరసింహులు - మాలకొండ

రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన ఆరు నరసింహ క్షేత్రాలలో ఇది ఒకటి, చెప్పుకోదగ్గది. మాలకొండ నరసింహుడన్నా, మాల్యాద్రి లక్ష్మీనరసింహుడన్నా ఒక్కటే. పురాణ ప్రసిద్ధిగాంచిన దివ్యక్షేత్రమిది. ఒకసారి లక్ష్మితో భూలోక విహారం చెయ్యతలచిన విష్ణువు తన వనమాలను పర్వతాకారం ధరించమంటాడు. ఆ మాల కొండయై మాలకొండ, మాల్యాద్రిగా అనంతరకాలంలో పేరు పొందింది. అగస్త్య మహర్షికి స్వామి ఇక్కడ జ్వాలాస్వరూపుడై దర్శనమివ్వగా, అలాగే అవతరించమని కోరాడుట. మార్కండేయ మహర్షి కూడా స్వామిని సమీపంలోని ఏట్లో స్నానం చేసి, పూజించాడని ముని స్నానంచేసిన నది 'మార్కండేయ నది'గా పిలువబడుతుందని, అదే ప్రస్తుతం 'మున్నేర'ని చెబుతారు.



ఈ మాలకొండపై గుహలు, గొడుగువంటి బండలు, కోనేరులు వున్నాయి. ఇక్కడ 108 పుణ్యతీర్థాలున్నట్లు చెబుతారు. ఇంకా ఒకే ఒక బండరాయి క్రిందవున్న గుహలో శివలింగం, నంది, దానికి దిగువన పార్వతీదేవి ఆలయం వున్నాయి. లక్ష్మీదేవి ఇక్కడ వెలువడంతో, దీనిని 'లక్ష్మక్కపేట'గా పిలుస్తున్నారని చెబుతారు. ఒకసారి అలిగిన లక్ష్మిని నరసింహుడు తన తొడపై కూర్చోపెట్టుకుని లాలించాడుట. ఆ దృశ్యం విగ్రహరూపంలో మనం దర్శించగలమిక్కడ.

## ఉప్పుటూరు వేంకటేశ్వరుడు

చీరాల మండలంలోని ఉప్పుటూరు వేంకటేశ్వరునికి 1500 సం॥ల చరిత్రవుంది. చోళరాజులు దీనిని నిర్మించారుట.ఒకనాటి లవణపురి ఇప్పుడు ఉప్పుటూరు అయింది. ఒకే ప్రాంగణంలో శ్రీవేంకటేశ్వరుడు, చెన్నకేశవులు, కాశీవిశ్వేశ్వరుడు ఆలయాలు నిర్మించబడటం ఇచ్చటి విశేషం, విచిత్రంకూడా!

జిల్లా సరిహద్దులోని కొత్తపల్లి గ్రామానికి 5 కి.మీ. దూరంలోగల భైరవకోన గుహాలయం, అమరనాథగుహలో కనుపించినది. అచ్చటి శివలింగం పోలిన శివలింగం. ఇక్కడ పార్వతీపరమేశ్వరులు ఏర్పరిచారనేది పురాణగాథ. ఈ నల్లమల అరణ్యప్రాంతంలో దేవతామూర్తుల శిల్పాలకు కొదవలేదు. ముఖ్యంగా ఒక కొండలో 8 ఆలయాలు చెక్కిన అద్భుతం, నిజంగా అద్భుతమే. ఇక్కడి దుర్గాంబపై కార్తీక పున్నమినాడు చంద్రకిరణాలు పడేటట్లు నిర్మించడం చాలా విశేషంగా తలవాలి. దీనిని చూడటానికి ఎందరో భక్తులు వస్తారు. అలాగే శివరాత్రికి ఇక్కడి సెలయేట్లో స్నానంచేసి, శివలింగరూపాలను దర్శించుకోవడం పరిసరభక్తుల ఆనవాయితీ.

కొండలో నిర్మించిన ఎనిమిది శివాలయాలను ఒకేసారి దర్శించుకోవచ్చును. ఏడు శివాలయాలు తూర్పుముఖంగా, ఎనిమిదవది ఉత్తరముఖంగా వుంది. వీటినిర్మాణశైలికి శిరసువంచి నమస్కరించడంతోపాటు,

సావకాశమున్నవారు దర్శించడం ఒక అదృష్టంగా తలవాలి. ఇచ్చటి ప్రధాన దైవం భర్గేశ్వరుడు. క్షేత్రపాలకుడు కాలభైరవుడు. ఈ ప్రాంతం చుట్టుగల కోట ఆనవాళ్ళనుబట్టి, ఈ ప్రాంతం 'భైరవకోన' అనడంలో ప్రభుత్వ రాజరిక వ్యవస్థ లక్షణాలు తెలుస్తున్నాయి.

ఇచ్చటి లింగాలన్ని సుప్రసిద్ధక్షేత్ర శివలింగాలను పోలివుండటంతో, వాటిని ఆయా పేర్లతోనే పిలుస్తున్నారు. అమరనాధ శశినాగలింగం, మేరుపర్వత 'రుద్రలింగం', 'కాశీవిశ్వేశ్వరలింగం, తిరుమల నగరికేశ్వరలింగం, రామనాధపుర రామేశ్వరలింగం, శ్రీశైలమల్లికార్జున, మందపర్వతంలోని పక్షఘాతలింగాలపేర్లు, ఇచ్చటి ఏడు లింగాలపేర్లు ప్రధానం. భర్గేశ్వరలింగం అన్నింటిలో ఏడో గుహాలయం ఇంకా బాగుంటుంది. ఇవి క్రీ.శ. 600 – 630 ప్రాంతాలమధ్య నిర్మించివుంటారనేది చరిత్రకారుల భావన. అడుగువేస్తే ఆలయం, జలగుంటలు... ఎన్నో తీర్థస్వరూపాలు చిత్రంగా దర్శనమిస్తాయి. బృందాలుగా కలిసి అడుగు, అడుగువేస్తే అడుగడుగు ఆలయం, ఆ దేవతానిలయభావం... అనుభవం, ఆనందం!

## నెమలిగుండ్ల శ్రీరంగనాయకస్వామి - జె.పి. చెరువు



రాచర్ల మండలం, జల్లివాని పుల్లల (జె.పి) చెరువుకు పడమర, 6 కి.మీ దూరంలో నల్లమల అడవిప్రాంతంలో పై నెమలిగుండ్ల శ్రీరంగనాయకస్వామి ఆలయం వుంది. ఇక్కడ ప్రవహించేది గుండ్లకమ్మనది. ఈ ప్రాంతంలో మయూర మహర్షి శ్రీహరికై తపస్సు చేయ ఆశ్రమం ఏర్పాటుచేసుకుని, తన అవసరాలకోసం కుక్కుతో గుండం తయారుచేస్తే తెల్లవారేసరికి అది జలపూర్ణ మయింది. ఇక ఇక్కడి చరిత్ర ప్రకారం, బయ్యన, బయ్యక్క చెంచు దంపతుల కుమార్తె రంగదేవి శ్రీమహావిష్ణువును మనువాడతా నంటూ తల్లి దండ్రులనుకాదని ఇక్కడికి వచ్చి మయూరమహర్షి ఆదేశంతో తపస్సుచేస్తే, శ్రీమహావిష్ణువు ప్రీతిచెంది రంగనాయకిని వివాహమాడి రంగనాయకుడు, నెమలిగుండ్ల రంగనాయకు డయ్యాడనేది చారిత్రక, పౌరాణిక నేపథ్య కథనం.

## సత్యవోలు - శ్రీరామలింగేశ్వరుడు

పాండవుల మనుమడు జనమేజయుడు ఈ ఆలయాన్ని నిర్మించాడని చెప్పుకుంటారు. 6వ శతాబ్దంలో బాదామిచాళుక్యులు నిర్మించారు. చారిత్రక, పౌరాణిక నేపథ్యం శిల్పకళావిశిష్ఠత చెప్పుకోదగ్గది. శ్రీరామలింగేశ్వరుని ప్రాంగణంలో ఆరు దేవాలయాలున్నాయి. అన్నింటిలోకి పెద్దది భీమలింగేశ్వరుడు. భారతప్రభుత్వం ఈ ఆలయాన్ని భారతజాతీయ సంపదగా ప్రకటించడమొక విశేషం.

## గొడ్రాలి కొండ - తిరుమలనాథస్వామి

పిల్లలులేని స్త్రీ, పుట్టలోపాలు పోసి సంతానం పొందింది. ఆ చిన్నగుట్టకు గొడ్రాలికొండ అనేపేరు తెచ్చిపెట్టింది. ఈ కొండపైనగల తిరుమలనాథస్వామి ఆలయం పురాతనమైంది. ఈ స్వామికై ప్రదక్షిణం చేసే దంపతులకు సంతానం కల్గుతారని ప్రతీతి.

## సింగరాయకొండ - శ్రీవరాహనరసింహస్వామి



అద్దంకి దగ్గర్లోగల ఈ గ్రామంలో అపూర్వ కళాశోభిత వరాహనరసింహస్వామి ఆలయముంది. దీనిని 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలు నిర్మించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. ఇచ్చటి విశేషం. ప్రధానాలయానికి ఆగ్నేయంగా, గల గుహయందు యోగా(నంద) లక్ష్మీ నరసింహస్వామి వున్నారు. దీనిని నారదప్రతిష్ఠగా చెప్పుకుంటారు. ఈ ఉగ్రమూర్తికి భయపడి, ప్రధానద్వారం స్వామికి ఎదురుగా కాక ఓ ప్రక్కగా నిర్మింపబడింది. సింహాచలం తదుపరి వరాహనారసింహుడన్న క్షేత్రమిదే! అపూర్వ కళాశోభ, అయిదు అంతస్తుల గోపురంతో స్వామి తేజోమూర్తిగా, భక్తజనసంరక్షకునిగా దర్శనమిస్తాడు. ఈ కొండక్రింద "భవనాశిని" అనబడే చెరువు ఒడ్డున ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, 600 సం॥ల చరిత్ర గలది వుంది.

పాలుట్ల పాలంకేశ్వరుడు, రంగధాముల శ్రీరంగడు, భార్గవకొండ – అష్టముఖ దుర్గాభైరవస్వాముల ప్రాచీన దేవాలయం, అద్దంకి. శ్రీరామలింగేశ్వరుడు, వందల సం॥ల ముందునుంచి వున్న మణికేశ్వరం – మల్లేశ్వరస్వామి, గుంటగంగ – భవానీ ఆలయం, చరుకూరు – త్రివిక్రమ, అగస్తేశ్వరస్వాములు, ఉలవపాడు వేణుగోపాలుడు, మోటుపల్లి వీరభద్రుడు, ఈయన అందనంత ఎత్తులో వుండటంతో పూజలన్నీ మోకాళ్ళకే జరుగుతున్నాయి. ఈ చారిత్రక క్షేత్రంలో ఎన్నో ఆలయాలు, అబ్బురపరుస్తాయి.

## కంభం - సత్యమాంబ దేవాలయం

5వ శతాబ్దంలో చాళుక్యులు దక్షిణాపథాన్ని పాలించే రోజులలో, రాజవంశీయుడైన సత్యపులకేశి ఈ ఆలయ నిర్మాణం జరిపాడని చెబుతారు. ఆ తదుపరి శ్రీకృష్ణదేవరాయల రెండవ భార్య వరదరాజమ్మ, కంభం చెరువుకు తూములు నిర్మించినట్లు, నవాబులు ఈ తల్లిని పూజించి యుద్ధాలకు వెళ్ళేవారని మహిమలు చెప్పుకునేవారు.

అద్దంకిలోని కమఠేశ్వరాలయం, చారిత్రక ప్రసిద్ధితోపాటు ఎన్నో ఆలయాలు వివిధకాలాల్లో, ఆనాటి రాజులు నిర్మించిన దివ్యప్రదేశం.

## మల్లవరం వేంకటేశ్వరుడు

1100 సం॥నికే వున్నట్లు మహాభారత ఆంధ్ర రచయితల్లో ఒకరైన ఎఱ్ఱన్న తమవారి వంశం పీఠికలో లిఖించారు. ఒకసారి తిరుమలవాసుడు ఇక్కడకు వచ్చాడని, నారదుడు స్వామిని ఇక్కడవుండమని కోరాడని పురాణగాధ. శ్రీకృష్ణదేవరాయలు గోపురాదులు నిర్మించ అద్దంకిసీమను ఏలిన రెడ్డిరాజులు ఆభరణాలు, ఆలయపోషణకు ఈ గ్రామమిచ్చినట్లు శాసనాలు తెలుపుతున్నాయి.

ఒకనాటి 'చతుర్వాటిక' నేడు **'చదలవాడ'**గా పేరుపొందింది. ఇచ్చటి లింగోద్భవస్వామి శ్రీరఘునాయక స్వామి దర్శనీయస్వామి. అలాగే కాకతీయులకు ముందు చోళరాజులు నిర్మించిన శ్రీదేవి,భూదేవి సమేత మాధవస్వామి ఆలయం, మిట్టపాలెం నారాయణస్వామి, పొదిలి నగరేశ్వరస్వామి చూడదగ్గవి. రావణ సంహారణానంతరం, ఈ దండకారణ్య ప్రాంతంలోని శివుని రాముడు పూజించినందువల్ల, ఈ ప్రాంతానికి రామతీర్థమని పేరు వచ్చింద(ట). ఇక్కడి కోనేరు రాయలవారే త్రవ్వించారుట.

**'మోక్షగుండ'** ముక్తేశ్వరాలయం తూర్పు కొండలోయలో వుంది. ఇది పురాణ – ప్రాచీనమైనది. పరశురాముడు మాతృహత్యాపాతకనాశనం కోసం పూజించిన లింగం. ఇది శ్రీవశిష్ఠులు ప్రతిష్ఠించారని, ఇక్కడ నీరులేకపోయేసరికి రాముడు బాణం సంధించి, నీటిని తెప్పించాడని చెబుతారు.

అలాగే **'వల్లూరు వల్లారమ్మతల్లి'**, 12వ శతాబ్దంలో చోళరాజులు నిర్మించిన సంతరావూరు పార్వతీసమేత శ్రీరామలింగేశ్వరస్వామి స్వయంభువు. దీనిని దర్శించగల్గడం ఒక అదృష్టం. కనీసం ప్రకాశంజిల్లా వారైనా సమయానుకూలంగా దర్శించుకోమని మా విజ్ఞప్తి.


**అద్దంకి** లో వింధ్యానివాసి సమేత **శ్రీనగరేశ్వరస్వామి** ని 19వ శతాబ్దంలో రెడ్డిరాజులు నిర్మించారు. స్థానికులు దీనిని 'వేయిస్తంభాలగుడి'గా కూడా పిలుస్తారు. ఇక ఈ జిల్లాలోని ఒంగోలుకు 20 కి.మీ దూరంలోని 'జమ్ములపాలెం' గ్రామంలో 1116 శివలింగాలున్నాయి. ఇక్కడి శివుడు పంచముఖేశ్వరుడని చెబుతారు.

జమదగ్నిమహర్షి నిలిచిన **కనకసురభేశ్వర కోన** లో **పాపేశ్వరస్వామి**. ఇది కంభం మండలంలోని తురిమెళ్ళ గ్రామానికి 2 కి.మీ దూరంలో వుంది. ఎందరో రాష్ట్రకూటులు, చోళులు, చాళుక్యులు, విజయనగర ప్రభువులు ఈ దివ్యక్షేత్రాన్ని దర్శించిన దాఖలాలు వున్నాయి.

ఒంగోలుకు 25 కి.మీ దూరంలోవున్న **నరసింగోలు** శనైశ్చరాలయాన్ని అగస్త్యులవారు ప్రతిష్ఠించారని, ఇక్కడే శివునిగూర్చి తపస్సు చేసారని స్థలపురాణ కధనం. ఈ ఆలయంలో ఈశాన్యంలో నూట నాగప్రతిమలు కల అశ్వత్థనారాయణవృక్షం వుంది. దీనిని సేవించుకున్నవారికి సంతానం, ఇతర సమస్యలెటువంటివైనా తీరుతాయన్నది భక్తుల నమ్మిక.

# నెల్లూరు జిల్లా

## శ్రీ పెనుశిల లక్ష్మినరసింహస్వామి దేవాలయం



నవ నారసింహులలో ఒకరైన పెనుశిల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయం నెల్లూరు జిల్లాలో, పట్టణానికి 80 కి.మీ పశ్చిమంగా వుంది. ఈ పెంచల కోనలో 'పెనుశిల లక్ష్మీనరసింహస్వామి' స్వయంభువుగా చెబుతారు. లక్ష్మీకళతో విలసిల్లే చెంచువనితను వివాహం చేసుకున్న ప్రాంతం. కణ్వమహర్షి తపస్సు చేసిన ప్రాంతం. లోకకంటకుడైన హిరణ్యకశిపుని చంపి, శ్రీహరి నరసింహునిగా నడయాడిన ప్రాంతం. దీని సమీపంలోని కణ్వనదీతీరప్రాంతంలో ఆనాడు శకుంతల దుష్యంతుల వివాహం జరిగినదంటారు.

తద మండలంలోని 'లేనాడు' గ్రామంలోని శృంగేశ్వర శ్రీరంగపెరుమాళ్ ఆలయంలో శివకేశవులు ఒకే ప్రాంగణంలో వుండటం చైత్రమాసంలో మూడురోజుల పాటు సూర్యకిరణాలు, శ్రీమహావిష్ణు పాదాలను తాకడం, నిర్మాణం తెలియని, ఈ ప్రాచీనాలయ విశిష్టత. నెల్లూరుకు 50 కి.మీ. దూరంలో ఉంది. ఈ స్వామి వారు స్వయంభువు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి, సింహాచలంలోని వరాహలక్ష్మీ నరసింహస్వామి, మంగళగిరిలోని పానకాల నృశింహస్వామి, వేదాద్రిలోని జ్వాలా నరసింహస్వామి, ఆహోబిలంలోని శ్రీ యోగానంద నరసింహస్వామి, హనుమకొండ దగ్గర ఉన్న ఉగ్రనరసింహస్వామి వంటి పుణ్యక్షేత్రముల వలె పెనుశిల శ్రీ లక్ష్మీనరసింహస్వామి కూడా అత్యంత మహిమ కలిగిన స్వామి.

గూడూరు నుండి 40 కి.మీ. దూరంలో ఉన్న ఈ స్వామి పెద్ద శిలగా ఉండుటవలన ఈ క్షేత్రమునకు పెనుశిల అని పిలువబడుచున్నది. కణ్వ మహర్షి నివసించిన ఈ ప్రదేశము చక్కటి వాతావరణంలో చుట్టూ కొండలలో ప్రకృతి సౌందర్యంతో ఎంతో ఉల్లాసంగా ఉంటుంది.

## నెల్లూరు – మూలస్థానేశ్వరుడు

ఉసిరిచెట్టు మొదట్లో వున్న తనకు ఆలయం కట్టమని కోరడం ఆంధ్రరాజ్యపాలకుడైన ముక్కంటి రెడ్డిరాజుగారు నిర్మించారని ఉసిరిచెట్టును తమిళంలో నెల్లివృక్షమంటారు కనుక శిలను నెల్లివృక్షం పేరుతో మూలస్వామి స్థానేశ్వరుడని, వూరు 'నెల్లూరు'గా మారిందని చెబుతారు. సిరులు సింహగిరి. ఈ ఆలయ దర్శనానంతరమే మహాభారత రచనకు తిక్కనగారు సిద్ధపడ్డారట. మనుమసిద్ధిరాజు, రాజగోపురం నిర్మించాడని, నెల్లూరులోని ప్రాచీన ఆలయాలలో ఈ మూలస్థానేశ్వరుడే మొదటివాడనేది పెద్దల భావన. ఇక్కడి పెద్ద వీరభద్రుడు చూడదగ్గవాడు.

ఇక్కడి గ్రామదేవత 'ఇరుగమ్మ' ఆలయం. అత్యంత ప్రాచీనమైనది. పదకొండు లేదా అంతకు ముందు నుంచి ఈ గ్రామదేవత ఇక్కడ పూజాదులు పొందుతున్నదనేది పెద్దలమాట. ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం స్వర్ణాల చెరువువద్ద వుందని, ఈ స్వర్ణాల చెరువు కాకతీయ గణపతిదేవుడు నిర్మించాడని, చెబుతారు. ఇక్కడ దొరికిన శాసనాలను బట్టి ఈ గ్రామదేవత ఆలయం అత్యంత ప్రాచీనమైనదిగా తెలుస్తుంది.

## తల్పగిరి రంగనాధస్వామి దేవాలయం (నెల్లూరు)

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో అన్ని హిందూ దేవాలయముల కన్న చాలా ప్రాచీనమైన దేవాలయం తల్పగిరి రంగనాథ స్వామి దేవాలయం. పెన్నానదికి దక్షిణ ఒడ్డున ఉన్న ఈ దేవాలయంలో స్వామి వారి పేరు రంగనాథస్వామి అందువలన ఈ ప్రాంతమునకు రంగనాయకుల పేట అని పేరు వచ్చినది.



**స్థలపురాణం :** శ్రీమన్నారాయణుడు లక్ష్మీదేవితో జీవుల రక్షణ కోసం భూలోకములో అవతరించ దలిచాడు. అందుకు ఆదిశేషుడు శ్రీ వేంకటాచలమునకు ఉత్తరభాగమున ఐదు అమడల దూరాన క్రీడా పర్వతముగా అవతరించమని ఆదేశించాడు. శ్రీమన్నారాయణుని ఆజ్ఞ మేరకు ఆదిశేషుడు ఆయన చెప్పిన ప్రదేశములో నానా విధ, ఫల పుష్ప వృక్షములలో అతి సుందరంగా విరాజిల్లే క్రీడా శైలంగా అవతరించారు. అదే పినాకిని (పెన్ననది) తీరములో గల తల్పగిరి.

ఈ స్వామి వారి ఆలయంలో గల అద్దాల మండపంలో శ్రీకృష్ణ చిత్ర నిర్మాణము కళానైపుణ్యంలో మిరుమిట్లు గొలుపుతూ ఉంటుంది. శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఫాల్గుణ శుద్ధ దశమి నుండి బహుళ పంచమి వరకు పదకొండు రోజులు పాటు వైభవోపేతంగా జరుగుతాయి.

సామాన్యంగా ముఖద్వారం, ప్రవేశ ద్వారంగా ఉంటుంది. కాని పెన్నానది దాదాపు ముఖద్వారము వరకు రావడంతో గుడికి వెనుక ఊరివైపు వేరొక ముఖ ద్వారము ఉంటుంది అందువలన ప్రధాన ద్వారము స్వామికి వెనుకవైపు ఉంటుంది. సాధారణంగా గోదాదేవి వెంకటేశ్వర ఆలయంలో ఉంటుంది. కానీ ఇక్కడ గోదాదేవి అమ్మవారు రంగనాథస్వామి ఆలయంలో ఉంటుంది. ఈ స్వామికి బంగారు గరుడ వాహనం ఉంది.

దీనిని చోళరాజుల కాలంనాటి ఆలయంగా చెప్పవచ్చును. ఇదీ స్థలపురాణం ప్రకారం దీనిని పాండవుల మనుమడు జనమేజయుడు నిర్మించాడని చెబుతారు. 17వ శతాబ్దంవరకు వైకుంఠంగా పిలువబడే ఈ ఆలయం, ఆతరువాత కాలంతో 'తల్పగిరి'గా రూపొందింది. కవిత్రయంలోని రెండవవాడైన తిక్కన్న ఇక్కడి వాడేకాదు మహాభారత రచనకూడా ఇక్కడే చేసాదడుట. ఇక పురాణం ప్రకారం ఆలోచిస్తే – పూర్వం కశ్యప ప్రజాపతి ఇక్కడ యజ్ఞంచెయ్యగా, అందుండి మూడు అగ్ను లుద్భవించాయని, అందులోని ఒక్కటి ఈ రంగనాయకుడని చెప్పుకుంటారు.


ఇక చరిత్ర ప్రకారం ఆలోచిస్తే – 7వ శతాబ్దంలో పల్లవులు, 12వ శతాబ్దంలో రెండవరాజరాజనరేంద్రుడు

బాగా అభివృద్ధి చేయగా 13వ శతాబ్దంలో జటావర్మ సుందరపాండ్యుడు, స్వామివారి కైంకర్యానికి తన వంతు సేవగా కొన్నిమాన్యాలను సమర్పించినట్లు శాసనాలు ద్వారా తెలుస్తుంది. శ్రీరంగక్షేత్రం ఆది 'శ్రీరంగ'మని, కన్నడ శ్రీరంగపట్టణం మధ్యశ్రీరంగ మని, ఈ తల్పగిరి అంత లేదా ఉత్తర శ్రీరంగమని వాడుక!

ప్రధాన ఆలయానికి నైఋతిభాగం రంగనాయకమ్మ, ఈమెకు దక్షిణాన ప్రసన్న వేంకటేశ్వర్లు వున్నారు. ఆలయప్రాంగణంలో నూరుకాళ్ళ మంటపం, గణపతి, ఆళ్వార్లు, అద్దాలమంటపం అన్నీ సర్వతోభద్రంగా వున్నాయి.

## జొన్నవాడ కామాక్షి

నెల్లూరుకు 25 కి.మీ. దూరంలో ఉన్న మరొక పుణ్యక్షేత్రము జొన్నవాడ. ఇక్కడి అమ్మవారి పేరు కామాక్షిదేవి. ఈ దేవి అనుగ్రహంతో దీర్ఘ రోగ నివారణ, గ్రహబాధ నివృత్తి, సంతానం లేని వారికి సంతాన ప్రాప్తి కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ ప్రదేశములోనే కవిత్రయంలో ఒకరైన తిక్కన్న యజ్ఞము చేసి సోమయాజి అయ్యారని చెపుతారు. ఆలయం చుట్టూ అనేక చిన్న చిన్న దేవాలయాలు ఉన్నవి.



క్రీ.శ. 1150లో ఈ ఆలయం నిర్మించబడినదిగా చెబుతారు. దీనిని శ్రీ ఆదిశంకరులు దర్శించి శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడే తిక్కన్న యజ్ఞంచేసి 'సోమయాజి' అయ్యాడు. ఈ జొన్నవాడ ఒకప్పుడు 'రత్నగిరి'. కశ్యపుడు యజ్ఞం చేసిన ప్రాంతమవడంతో 'జన్నవాడ' అయింది. జన్నము అంటే 'యజ్ఞం'. ఈ జన్మవాడ కాస్తా కాలక్రమంలో 'జొన్నవాడ' అయింది. కశ్యప ప్రజాపతి చేసిన యజ్ఞంనుండి ఉదయించు మూడు అగ్నులలో ఒకటి తల్పగిరి, రెండు జొన్నవాడ మల్లికార్జునుడయ్యాడు. ఈయన దేవేరి కామాక్షి అమ్మ, ఈ తల్లి శక్తి నాన్నకంటే అమ్మేగొప్పదని తెలియబరుస్తుంది. ఈ ఆలయంలో గణపతి, మల్లికార్జునుడు ఒక ఆలయంలో; సుబ్రహ్మణ్య, కామాక్షి, శంకరాచార్యులవారు, నవగ్రహాలు మరొక ఆలయంలో ప్రతిష్ఠించబడ్డారు.

పూర్వం వృషపర్వుడనే రాక్షసుని, కామాక్షితల్లి శక్తితో ఇంద్రుడు వధించాడని, అమ్మ కరుణతో దేవతలు సర్వశక్తిమంతులయ్యారనేది పురాణవచనం. పై దేవాలయాలే కాక నెల్లూరు జిల్లాలోని నెల్లూరు పట్టణములో శ్రీ అయ్యప్పస్వామి ఆలయం గ్రామదేవత ఇరుగాలమ్మ దేవాలయం కూడా భక్తులు దర్శించ దగ్గ స్థలములు.

## వేదగిరి - లక్ష్మీనరసింహులు

కశ్యపప్రజాపతి యజ్ఞంనుండి పుట్టిన త్రయాగ్నిలలో ఇది మూడవది. వేదగిరిలో వెలసిన నరసింహుని గుట్టపై నరసింహుడని, వేదగిరి నరసింహుడని పిలుస్తారు. సప్తఋషుల ఆధ్వర్యంలో యజ్ఞ జరిగింది. పూర్ణాహుతి తదుపరి యజ్ఞగుండం జ్యోతి వచ్చి అలాగ వెళ్ళిపోతుంటే, ఋషిప్రముఖులు దాని ననుసరించారు. ఆ జ్యోతి ఒకగుహలోకి

ప్రవేశించింది. అక్కడకు వెళ్ళి సప్తఋషులు జ్యోతికై వెతికితే అక్కడ నరసింవహుని దర్శనమవుతుంది. ఆయనే అసలు నరసింహుడు. అచ్చటి ప్రతిష్ఠామూర్తి ఇక చరిత్రకారుల దృష్టిలో క్రీ॥శ॥ 870-915 మధ్య పల్లవ చక్రవర్తి నరసింహవర్మ ఈ ఆలయ నిర్మాతగా శాసనాలు తెలుపుతున్నాయి. ఆనాటి ఏడు సప్తఋషుల యజ్ఞహోమగుండాలు ఏడు కోనేరులయ్యాయి. కాని అవి ఇప్పుడు శిథిలస్థితికి చేరుకున్నాయి. అపాండవం చేస్తానన్న అశ్వత్థామ, తన ఘాతుకానికి ప్రాయశ్చిత్తంగా ఇక్కడ తపస్సు చేస్తున్నాడని అవే అశ్వత్థామ గుహలని చెబుతారు. యాగసంరక్షుడైన గోవిందరాజస్వామిని దర్శించుకుని, నరసింహుని దర్శించాలిట. అద్భుతనిర్మాణం, గాలిగోపురం, ఆదిలక్ష్మి అమ్మవారి సన్నిధి ఇతర ఆలయాలు, శిల్పసంపద చూడవలసిన చారిత్రిక, పౌరాణిక ఆలయం.

## మల్లాం సుబ్రహ్మణ్యేశ్వరుడు

చరిత్ర, పురాణములకందని ప్రదేశం, ఈ భరతఖండంలో లేదనడంలో అతిశయోక్తి కనబడదు. నెల్లూరుజిల్లా, నాయుడుపేట సమీపంలోని 'మల్లాం సుబ్రహ్మణ్యేశ్వరుడు, చరిత్ర, పౌరాణిక ప్రాధాన్యత కల్గిన పరమపవిత్రుడు. కీ॥శ॥ 630లో పాండ్యభూపతి పల్లకి నిమిత్తం వెదురు కోస్తూంటే రక్తం ప్రవహించింది. ఏమిటా..? అని చూస్తే రెండు చేతులు ఖండించబడ్డ శ్రీసుబ్రహ్మణ్య స్వామి వారి స్వయంభూ విగ్రహం లభించింది. స్వామి జ్యోతిస్వరూపుడిగా దర్శనమిస్తాడు. దీనికి సంబంధించిన పురాణగాథ...

తారకాసుర సంహారానంతరం బ్రహ్మహత్యాపాతకం తొలగించుకోవడానికి ఇక్కడ కుమారస్వామి తపస్సు చేసుకుంటున్నాడు. పుట్టపెరిగి, అక్కడొకరున్నారని కూడా ఎవరికి తెలియకుండా పుట్టపెరిగి, అక్కడ వెదురు పెరగడంతో ఆ చక్కని వెదురును చూసి పల్లకి తయారుచేయడానికి బాగుంటుందన్న పని, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుని ఆవిర్భావానికి కారణభూతమైంది. చేతులు తెగిన స్వామిని గర్భగుడిలో, మూలవిరాట్టుకు ప్రక్కన నేటికి సందర్శించవచ్చును. ఈ స్వామిని సేవించడంవలన సర్ప, కుజదోషాలు తొలగి ఆరోగ్యంగా వుంటారనేది భక్తులనమ్మిక.

## కృష్ణపట్టణం ఓడరేవు

ఒకప్పుడు (12వ శతాబ్దం) కొల్సితులై, గండగోపాలపురం, కులోత్తుంగచోళపురం, కణనారాయణపురం, గ్రంథపురమని పిలువబడే ప్రాంతంలోని గండపురంలో చెప్పుకోదగ్గది వేణుగోపాలస్వామి ఆలయం. ఇది విజయనగరరాజుల కాలంలో నిర్మింపబడినదని చెప్పబడుతుంది. అలాగే ఇక్కడి శ్రీఉదయకాళేశ్వర, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాలు తెలుగుచోళుల కాలంలో నిర్మించబడినట్లు శాసనాలు తెలుపుతున్నాయి.

## చెంగాలమ్మతల్లి - సూళ్ళురుపేట

ఈ ఆలయం 4,5 శతాబ్దాలలో నిర్మించబడినదనే అతిపురాతన ఆలయం. ఈ తల్లి ఉత్సవాలలో ఒక కర్రకు మేకుకట్టి గాలిలో మూడుసార్లు గిరగిర తిప్పే 'సుళ్ళు'వుత్సవం, కారణాన, ఈ వూరుకు 'సూళ్ళూరుపేట' అని పేరు వచ్చిందంటారు. అంతకు ముందు దీని పేరు శుభగిరి. ఈ తల్లి అసలు టెంకాలమ్మ. ఇది రానురాను చెంగాళమ్మ

అయింది. అంతేకాదు ఈ తల్లివిగ్రహం ఇక్కడి పవిత్ర కాళంగి నదిలో దొరికితే దానిని తీసి మరొకచోట ప్రతిష్ఠించాలని తలంచారు. కాని ఆ విగ్రహం కదలలేదు సరికదా, మహిషాసురమర్దనిగా దర్శనమిచ్చిన దృశ్యం చూసి ఆ తల్లికి అక్కడే ఆలయం నిర్మించారు. తలుపులు పెట్టదలిస్తే మాత్రం, అమ్మ ఆ పనిచేయవద్దని కలలో చెప్పిన ప్రకారం, ఆలయానికి తలుపులు పెట్టలేదు. తల్లిని సేవించుకున్నవారి సర్వకోర్కెలు తీరుతాయన్నది భక్తుల విశ్వాసం.

## గొలగమూడి - వెంకయ్యస్వామి

ఈనాటి దేవుడు. భక్తులకు అభిమానపాత్రుడు. అందరివాడిగా ప్రసిద్ధిపొందిన ఆరాధనీయుని సమాధిప్రాంతం. దర్శించవచ్చును. ధన్యత చెందవచ్చును.

## సంగమేశ్వరుడు - సంగం

నెల్లూరుకు 32 కి.మీ లోని సంగంలోని కామాక్షి సమేత సంగమేశ్వరుడు, మాతృహత్య చేసిన పాపనివారణార్థం ప్రతిష్ఠించిన శివుని దివ్యప్రాంతం. ఇది స్థలపురాణం, చరిత్ర ఆ స్వామికే తెలియాలి.

## పర్రవాడ - వెంగమాంబ పేరంటాలు

మహాపతివ్రతల కథలన్నీ ముందు భాదామయం. ఆ తదుపరి భక్తజన సంరక్షణామయంగా కృష్ణాజిల్లాలోని పెనుగంచిప్రోలు తిరుపతమ్మతల్లి వలె,ఈ పేరంటాలమ్మ దేవతయై భక్తజన సంరక్షకి అయింది. ఈమె శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి చల్లని తల్లి. కరువుకాటకాలతో అలమటిస్తుంటే వర్షం కురిపించింది, అభాగ్యుల నాదరించింది. కానీ తన సౌభాగ్యాన్ని మాత్రం నిలుపులేక ఆత్మాహుతి చేసుకుంది. దేవతయై సర్వులను రక్షిస్తానని అభయమిచ్చింది.

## రామతీర్థం - రామలింగేశ్వరుడు

సీతతో అయోధ్యకు వెడుతూ రాముడు శివార్చన సమయమయ్యేసరికి, ఇక్కడికి వచ్చి ఇసుకలింగం చేసి, శివుని అర్చించాడుట. ఆతడే ఈ రామలింగేశ్వరుడు. రాముడు పాదం పెట్టిన ప్రదేశం కాబట్టి ఇది రామతీర్థం అయింది. ఈ కథనం త్రేతాయుగానిది. పల్లవరాజులకాలంలో పరిపూర్ణత నొందిన ఈ ఆలయం, ఇప్పుడు జీర్ణదశకు చేరుకోగా, పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. ఇది కొంతలో కొంత అదృష్టం.

నెల్లూరు 110 కి.మీ. దూరంలోని, ఇష్టకామేశ్వరీ సిద్ధేశ్వరాలయం ఎప్పటిదో... అతి పురాతనమైనదంటారు. దీనిని 'కాశీనాయన' అనే సత్పురుషులు సముద్ధరించారు. అలాగే – కొండబిట్రగుంట – ప్రసన్న వేంకటేశ్వరుడు, వేంకటగిరి కాశీవిశ్వనాథుడు, కామాక్షిసమేత 'పట్రంగి' పాండురంగేశ్వరుడు, మన్నారు పోలూరులోని జాంబవతీ, సత్యభామ సమేత అళుగుమరికృష్ణస్వామి చూడదగ్గవి. ముఖ్యంగా కృష్ణస్వామి ఆలయం 10వ శతాబ్దంలో చోళరాజులు, 13వ శతాబ్దాంలో మనుమసిద్ధి అనంతరం 18వ శతాబ్దంలో వెంకటగిరిరాజావారు తగు విధంగా పోషించారు. ఘనచరిత్రకు కారకులయ్యారు.

ఈ కృష్ణస్వామి అందమైన ఆలయం ఈ మన్నారుపోలూరులోనే వుందని, శ్రీకృష్ణజాంబవంతుల యుద్ధం

ఇక్కడే జరిగిందనేది ఓ పురాణగాథ. ఇక్కడి విశేషం. ఆలయంలోనున్న గరుత్మంతుని కళ్ళనుండి బొట్టుబొట్టుగా నీరుపడుతుందట. ఇక్కడ జాంబవంతుడు, సుగ్రీవ, జటాయువుల విగ్రహాలు కూడా మనం చూడవచ్చును.


గ్రామదేవతలకు నెలవు, కొలువైన ఈ ఆంధ్రదేశంలో ఉదయగిరి మండలానికి 10 కి.మీ. దూరంలో శ్రీ పేరంటాలమ్మ తల్లి, 'నరవాడ' అనే నేర్వాడ వెంగమాంబతల్లులు, ఆయా ప్రాంతాలవారికి దర్శనీయ, దయగల తల్లులు.

పొదలకూరు – మహ్మనపురం మధ్యగల ప్రభగిరిపట్నం చారిత్రక ప్రాధాన్యంగల పెరుమాళ్ళస్వామి దేవాలయాల నిలయం. 13వ శతాబ్దంలో శ్రీకృష్ణరాయల సామంతుని పాలనలో గల ఈ ప్రాంతంలో 101 దేవాలయాలు, అన్నే కోనేరులు వుండేవి. విజయనగర ప్రభువుల శాసనాలు పెరుమాళ్ళు స్వామి సమీపంలో వుంది. ఇక్కడి శివాలయం చారిత్రకమే. ఆలయశిల్పాలు, అచ్చట లభించిన విగ్రహాలు అపురూపమేకాదు ఆరాధ్యనీయం. ఇక ...


లేబూరు వరసిద్ధి వినాయకుడు, బుచ్చిరెడ్డిపాలెం కోదండరామస్వామి, ఇందుకూరుపేట శ్రీభద్రకాళి సమేత వీరభద్రుడు, తెలుగు చోళరాజులకాలంనాటి అలఘునాధాలయం, 2వ శతాబ్దంనాటినుండి వున్న గంగపట్నం శ్రీచాముండేశ్వరి దేవి, తూర్పు కనుపూరు ముత్యాలమ్మతల్లి, అల్లూరు పోలేరమ్మతల్లి, అతి ప్రాచీనాలయాలు. అభీష్టదాయకాలు. దర్శించగల్గడం అదృష్టం. కాదంటే... సావకాశంలేనివారు 'అమ్మా' అని మనస్సుమీర స్మరించుకోవడం మరొక మార్గం.



సిద్ధేశ్వరాలయం, కృష్ణరాజపురం



మూలస్థానేశ్వరుడు - నెల్లూరు


వెంగమాంబ దేవాలయం - నర్వాడ

# కడప జిల్లా

## ఒంటిమిట్ట - కోదండరాముడు



కడపకు 22 కి.మీ దూరంలో 160 అ॥ ఎత్తైన మిట్టపై శ్రీకోదండరామాలయం ఉంది. ఏకపీఠంపై రామ, సీత, లక్ష్మణులను ఇక్కడ దర్శించగల్గుతాం. దీనిని జాంబవంతుని ప్రతిష్ఠగా చెబుతారు. ఇక్కడి శ్రీరామతీర్థం లక్ష్మణతీర్థాలు. సీతకోసం, వారు వారి బాణాలతో పాతాళగంగను పైకి తెప్పించారు. దీని అసలు పేరు ఏకశిలానగరం. కాకపోతే 11 శతాబ్దంలో చోళరాజులు ఈ ఆలయం నిర్మించి వుంటారని అంచనా. తరువాత అంచెలంచెలుగా అభివృద్ధి జరిగినట్లు 1555, 58, 64 శాసనాలు తెలుపుతున్నాయి.

తీర్థుల పురాణం ప్రకారం, సీతారామకల్యాణం జరిగాక, మృకండ, శృంగిమహర్షులు రాక్షసబాధలు తెల్పి రక్షణకోరగా సీతాలక్ష్మణ సమేతుడై రాముడు కోదండం, పిడిబాకు, అంబులపొదితో వచ్చి యాగరక్షణ చేసాడని, ఇది అనంతరకాలంలో జాంబవంతునికి స్వప్నంలో రావడంతో ఇక్కడ ఏకపీఠంపై ప్రతిష్ఠించాడని చెబుతాడు. పరమతద్వేషి ఇమాంసాహెబ్, రామభక్తుడుగా మారి త్రవ్వించిన ఇమాంబావి ఇక్కడ ఆకర్షణ. మహాభక్తుడు పోతన ఇక్కడే భాగవత రచనచేసాడని, ఈ ఒంటిమిట్ట కోదండరాముని ఏకశిలాపురవాసా! ఈశా.... అని ప్రస్తుతించాడని, అలాగే జీర్ణమైన ఈ రామాలయాన్ని మహాభక్తుడు 'మందరం' మని సుందరంగా వ్రాసిన వావిలికొలను సుబ్బారావుగారు, కొబ్బరిచిప్ప పట్టుకుని చందాలు వసూలు ఆలయోద్ధరణ గావించారని, రామభక్తులు చేతులు జోడించి, వందనశతాలర్పిస్తారు. ఇక్కడ కల్యాణం నవమినాడు కాక చతుర్దశినాడు జరగడం, పున్నమినాడు రథోత్సవం జరగడం ఒక విశేషం.

## కడప సోమేశ్వరుడు

ఇక్కడి మరో చారిత్రగాంచిన పౌరాణిక ఆలయం శ్రీసోమేశ్వరాలయం. దీనిని చంద్రప్రతిష్ఠగా చెబుతారు. దీనికి సమీపంలో శ్రీవేంకటేశ్వరాలయముంది. ఆలయ ఆవరణలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి. అన్ని ఉత్సవాలు, పర్వదినాలలో ప్రత్యేక అర్చనలు యధావిధి సాంప్రదాయబద్ధంగా జరుగుతాయి. శ్రీవేంకటేశ్వరుని దర్శించుకోవడానికి మొదటిమెట్టు, దర్శించవడలసిన మొదటి ఆలయం, కడపలో భాగమైన దేవుని కడపలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరుని ఆలయం. ఇది కురుపాండవుల గురువైన కృపాచార్యుల ప్రతిష్ఠగా చెబుతారు. ఇది ఒకనాటి కృపాపురమని, ఇప్పటి 'కడప' అని చెబుతారు. శ్రీవేంకటేశ్వరుని దర్శించవలసినవారు, ఈస్వామిని దర్శించే తీర్థయాత్రచెయ్యాలిట. అప్పుడే ఫలసిద్ధి అని. ఇది తొలి'గడప'అని, కాలక్రమంలో 'కడప' అయిందని చెబుతారు.

## తాళ్ళపాక - చెన్నకేశవ, సిద్ధేశ్వరాలయాలు

కలియుగదైవమైన శ్రీ వేంకటేశ్వరుని 32 వేల కీర్తనలతో కీర్తించిన అన్నమయ్య జన్మస్థలమిది. ఈ పవిత్ర క్షేత్రంలో శ్రీచెన్నకేశవ, సిద్ధేశ్వరాలయాలు వున్నాయి. ఇవి సుమారు 9-10 శతాబ్దాలలో నిర్మించినట్లు తెలుస్తుంది. అంతేకాదు, ఇక్కడ శ్రీసుదర్శనాలయం వుంది. ఆంధ్రదేశంలో శ్రీసుదర్శనాలయమున్న ప్రాంతమిదే!

## వెల్లాల - సంజీవరాయుడు

ఇక్కడ ఎన్నో దేవాలయాలున్నా అన్నిటా ప్రసిద్ధిగాంచినది శ్రీసంజీవరాయని కోవెలే. లక్ష్మణుని మూర్ఛనుండి బ్రతికించడానికి సంజీవని పర్వతం కోసం బయలుదేరిన ఆంజనేయుడు, ఇక్కడికి వచ్చేసరికి, ఇచ్చటి కుందునదిలో స్నానంచేసి తన గురువైన శ్రీసూర్యనారాయణమూర్తికి నమస్కరించి ముందుకు సాగాడని, స్థలపురాణ కథనం. ఆయన స్నానంచేసిన కుండాన్ని, హనుమంతకుండమని, సంజీవనికై బయలేదురాడు కాబట్టి సంజీవరాయుడని ఇక్కడ భక్తులచేత పూజింపబడుతున్నాడు. ఇక్కడ ఆంజనేయుని పాదముద్రలు కూడా చూడవచ్చును. 15వ శతాబ్దంలో శ్రీసంజీవరాయుడు ప్రతిష్ఠింపబడ్డాడు. అయితే ఈమధ్య 50, 60 సం॥ల క్రితం చెన్నకేశవస్వామి ఆలయంలో వున్న స్వామిని గ్రామదక్షిణదిక్కులో పునఃప్రతిష్ఠించారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి

కందిమల్లయ్యపల్లెలో (మైదుకూరు సమీపంలో) శ్రీస్వామి వారి మఠం వుంది. శ్రీ వీరబ్రహ్మేంద్రులను శ్రీమహావిష్ణు అవతారంగా తలుస్తారు. కాలజ్ఞానం చెప్పడానికే కాదు, సర్వశక్తిమంతుడు, సర్వసమర్థుడు. ఇంకా కొందరు త్రిమూర్తి స్వరూపుడంటారు. మొత్తానికి అవతారపురుషుడు, యోగసంభవుడు. సమత, మమత, మానవతకు శ్రీవీరబ్రహ్మేంద్రులు నిలువెత్తు నిజస్వరూపం. ఈ గ్రామంలోని ప్రతీదీ పరమపవిత్రమైనది. అడుగడుగు నేల దర్శించి నమస్కరించదగ్గది. ఇటువంటి దివ్యక్షేత్రదర్శనం జన్మజన్మల పాపహరణం.

## అత్తిరాల - త్రిధేశ్వరస్వామి

రాజంపేటకు 6కి.మీ. దూరంలోని అత్తిరాలలోని బహుదానది ఒడ్డునగల త్రిధేశ్వర, కామాక్షి ఆలయాలు బహుప్రసిద్ధమైనవి. పైగా ఇది 'గయ'క్షేత్రమంత పరమపవిత్రమైనది. ఆలయాలున్నా కొండగిగువన పరశు రామాలయం, గదాధర ఆలయాలున్నాయి. ఇవేకాక ఇక్కడ వున్న ఏకా తాతయ్య విగ్రహానికి తలనొప్పితో బాధపడేవారు కనుక తల కొట్టుకుంటే నొప్పిపోతుందట. భార్యాభర్తలలో ఎవరుపోయినా వారు ఏడాది లోగా ఈ క్షేత్రాన్ని దర్శిస్తారు. ముఖ్యంగా స్త్రీలు కామాక్షిదేవిని దర్శిస్తారు. దీని మహిమ అనంతమని జాతర సమయంలో దేశం నలుమూలల నుండి వేలాదిమంది భక్తులు ఈ క్షేత్రాన్ని దర్శించి పరవశిస్తారు.

## గండికోట - వీరాంజనేయులు

పాపఘ్ని నదీతీరాన గండికోటలో ఈ వీరాంజనేయస్వామి సనాతనుడు, పురాతనుడు. శ్రీరాముడు సీతాలక్ష్మణులు

కపివీరులతో అయోధ్యకు తిరిగివెడుతూంటే ఈ ప్రాంతంలో వాయుదేవుడు గండిలోని రెండు కొండలకు బంగారుతోరణం కట్టి, వారలను ఆహ్వానించాడు. ఆ రాత్రికి సీతారాములు అక్కడ నిద్రించారు. వాయుదేవుని పరమభక్తికి మురిసిరాముడు, ఆతని వరప్రసాదుడైన ఆంజనేయుని చిత్రాన్ని బాణంతో కొండశిలపై చిత్రించాడుట. ఆ రకంగా ఈ క్షేత్రం పరమపవిత్రమైంది. భక్తజన ప్రియతమయింది.

## నందలూరు సౌమ్యనాధస్వామి

కడపకు 40 కి.మీ. దూరంలో నందలూరు, అందులో అమేయప్రతిభావంతుడైన సౌమ్యనాధస్వామి వున్నాడు. ఇది ఎంతో పురాతనమైనదని చెప్పడానికి, దీనిని నారదమహర్షి ప్రతిష్ఠించడమే నిదర్శనం. ఇక స్థలపురాణానికి వస్తే 11వ శతాబ్దిలో కులోత్తుంగచోళుడు ఆలయం నిర్మిస్తే, 12వ శతాబ్దంలో ప్రతాపరుద్రుడు ఈ ఆలయానికి గాలిగోపురం కట్టించాడు. ఇంకా దీనిని పాండ్యులు, విజయనగర ప్రభువులు, కొత్తపి పాలకులు, మల్లురాజులువారి వారి సమయాలలో తగు విధంగా అభివృద్ధి చేసారు. ఇప్పుడు మనం పిలిచే నందలూరు 'నందనూరు, నిరంతనూరు, నిరంధ్రాపురం, నెలందలూరు' అనికూడా పిలిచేవారుట.

ఆలయ ప్రాంగణంలో యోగనరసింహ, ఆంజనేయ, గణపతి విగ్రహాలున్నాయి. సౌమ్యనాధుని చొక్కనాధుడని కూడా పిలుస్తారుట. ఆదికవి నన్నయ్య, అన్నమయ్యలు ఈ స్వామిని సేవించారుట. కోర్కెలు తీర్చటంలో స్వామి ముందుంటాడుట.

## ప్రొద్దుటూరు కన్యకాపరమేశ్వరి



ఇక్కడి పెన్నానది శివుడు, జటాజూటంనుండి ప్రవహించిన 'గంగ'అనీ, శ్రీసీతాలక్ష్మణులతో శ్రీరామ చంద్రుడు ఇక్కడ కొన్నాళ్ళు గడిపినట్లు తెలుస్తోంది. ఇక ఇక్కడి కన్యకాపరమేశ్వరి ఆలయం 120 సం॥ల క్రితం నిర్మింపబడింది. ఈ ఆలయంలో నగరేశ్వర, విఘ్నేశ్వర, వీరభద్రుల ఆలయాలు కూడా వున్నాయి. నగరంలో ఎక్కడినుండైనా కనుపించే పెద్ద రాజగోపురం, ఈ ఆలయం ప్రత్యేకత. నాలుగుస్తంభాల మంటపం చర్చావేదిక. చూడచక్కని రీతిలో నిర్మించిన శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం చూడదగ్గది! విజయ దశమినాడు శ్రీచక్రమున్న పంచలోహరథంలో నగరమంతా సుభిక్షంగా, సుఖసంతోషాలతో వుండాలని అమ్మవార్ని వూరేగిస్తారు.

## అగస్త్యేశ్వరాలయం



ఈ ద్రవిడమహాముని ఇక్కడ తపస్సుచేసి శివలింగం ప్రతిష్ఠ జరిపి ఆలయం నిర్మించినట్లు, అది 11వ శతాబ్దికే దివ్యప్రభలతో వెలుగొందు తున్నట్లు తెలుస్తోంది. అనంతరకాలంలో అగస్త్యుల ప్రతిష్ఠించిన లింగానికి చోళ ప్రభువులు అత్యంత సుందరంగా ఆలయం నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. 120 అ।। పొడవు 140 అ।। వెడల్పుతో ఎత్తైన ప్రాకారాలు కలిగిన ఈ ఆలయంలో 8 భుజాలతో పాదాలక్రింద పొట్టేలు తలగల దక్షుని తలతో దర్శనమిస్తాడు. నాలుగు ప్రక్కల నాలుగు గోపురాలు, వాటిపై అయిదేసి సువర్ణకలశాలు 1498 విజయనగర ప్రభువు ఉమ్మడి నరసింహరాయల సైనికాధికారి సరసనాయకుడు ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసినట్లు, అలాగే మహాకవి పుట్టపర్తి నారాయణాచార్యులవారికి మూలం, ఈ అగస్త్యేశ్వర దేవాలయమేనని, ఇక్కడేవారు రచన చేసారని తెలుస్తోంది.

## ప్రొద్దుటూరు మహాలక్ష్మీ చెన్నకేశవస్వామి



ప్రొద్దుటూరులోని మరో దివ్యదేవాలయం. జనమేజయుడు ప్రతిష్ఠించినట్లు చెప్పే శ్రీమహాలక్ష్మిసమేత చెన్నకేశవస్వామి ఆలయం అపురూపమైంది. అయితే 15వ శతాబ్దంలో విజయనగరరాజుల కాలంలో ఎంతో ప్రాచుర్యం పొంది, నిర్మించినట్లు చెప్పబడుతుంది. ఎంత అందంగా వుంటుందీ ... అంటే... ఎంతో అందంగా... అని చెప్పే రాతిస్తంభాలు, మహామండపం, ముఖమండపంలో ప్రత్యేకంగా శ్రీమహాలక్ష్మి తూర్పు ప్రవేశద్వారం వద్ద అమ్మవారు, పడమర గోపురంలో శ్రీఆంజనేయస్వామికి ప్రత్యేక ఆలయం చక్కగా దర్శించవచ్చును. ప్రతి పర్వదినం ఇక్కడ నయనానందకరం, ఆనందకరం.

ఎక్కడికక్కడే దేవుడు భక్తుల సౌఖ్యంకోసం సులభాతిసులభుడు, సుశీలుడై తన కరుణను ప్రవహింపచేస్తున్నా అర్థంచేసుకోలేని జడధారి, మూర్ఖుడు, మానవుడు. అందుకు నిదర్శనం ఈ అడుగడుగు ఆలయాలు, పవిత్ర ప్రదేశాలు!!

## ముక్తి రామేశ్వరం

ప్రొద్దుటూరుకు 6 కి.మీ దూరంలో ఈ ముక్తిరామేశ్వరస్వామి ఆలయముంది. శ్రీరాముడు ఇక్కడ ఆలయం ప్రతిష్ఠించినందువల్ల దీనిని రామేశ్వరమని, పిల్లిరూపంలో వున్న రావణుని వధించి, ముక్తి ప్రసాదించడంవలన దీనిని 'ముక్తిస్థలి' అని, 'ముక్తిరామేశ్వర'మనడం జరుగుతోంది. రావణుడు బ్రహ్మవంశస్థుడు. కారణమేదైనా ఆతని

వల్ల శ్రీరామునికి బ్రహ్మహత్యాపాపం ప్రసాదింపచేసిందని, రామేశ్వరం నుండి ప్రారంభించి ఎన్నో ప్రాంతాలలో శివ(లింగ) ప్రతిష్ఠలు చేసాడు. ఆంజనేయుని శివలింగం తెమ్మనడం, సకాలానికి రాకపోవడం ఇసుక (సైకత)లింగాన్ని రాముడు ప్రతిష్ఠించడం జరుగుతోంది. హనుమంతునికాదనలేక, ఆ లింగాన్ని కూడా కొద్దిదూరంలో ప్రతిష్ఠించి, మానవులకు ముక్తిని ప్రసాదింస్తున్న దివ్యక్షేత్రాలలో ఇది ఒకటి. ముక్తి పొందఅర్హమైనది.

## పులివెందల - శ్రీరంగనాధస్వామి

ఇది పురాతనమైనది. ఏ కాలంలో అభివృద్ధి చెందిందీ అనే కథకన్న, దీనిని భగవద్రామానుజులు ప్రతిష్ఠించారని చెప్పుకుంటున్నారు. ఏడుపడగల ఆదిశేషునిపై శ్రీరంగనాధస్వామి శయనించి వుంటాడు. శ్రీలక్ష్మీదేవి, ఆళ్వారులు, రామానుజాచార్యులసన్నిధితో చూడముచ్చటగా వున్న వైష్ణవాలయం, మతం మరచి, దైవానికి శరణాగతులైనవారికి ఆనంద, ముక్తిక్షేత్రం.

## రాయచోటి - శ్రీవీరభద్రేశ్వరాలయం

8వ శతాబ్దంలో దీనిని చోళరాజులు నిర్మించినట్లు తెలుస్తుంది. వీరభద్రునికున్న పేరులలో 'రాజరాయుడు' ఒకటి. ఆ పేరుమీదే ఈ పట్టణం, క్రమక్రమంగా రూపాంతరం చెంది 'రాచవీడు, రాజవీడు', 'రాయచోటి' అయింది. ఇది దక్షయజ్ఞంనాటి కథలో ముడిపడిన కధ. వీరావేశంతో వుండే వీరభద్రుని, భద్రకాళిని పంపి శాంతింపచేస్తారు. అలాగ శాంతించినవారు స్థిరపడిన ప్రదేశం ఇప్పటి రాయచోటి. పెద్దపెద్ద గాలిగోపురాలతో, పెద్ద ధ్వజస్తంభంతో అత్యంత మనోహరంగా భక్తజనాభీష్టదాయంగా వెలుగొందే స్వామిని దర్శించి, తరించవలసిందే!

## మల్లెకొండ శివాలయం

గోపవరం మండలంలోని, ఓబులం అనే గ్రామానికి దగ్గరలో మాల్యవంతం (మల్లెకొండ)పై పురాతన శివాలయం వుంది. నల్లమల అడవిప్రాంతంలోని ఈ స్వామిని 'మల్లెకొండ మల్లయ్య' అని పిలుస్తారు. చిత్రంగా, దూరంగావుండి ఈ కొండలను చూస్తే 'మాల'లాగ కనుపిస్తుంది. దీంతో 'మాలవంత'మనేవారు. ఇప్పుడు మాత్రం మల్లెకొండగా పిలువబడుతోంది. స్వామి 'మల్లెకొండ మల్లయ్య'.

ఈ దేవుడు శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివుడు. ఈ ప్రాంతంలో శివపార్వతులు విహరిస్తారని, అందుకనే అప్పుడప్పుడు ఏదో దివ్యకాంతి కనుపిస్తుందని, చెబుతారు. ఇక్కడ మూడు – పసుపు, మోక్షం, తొంగి చూపుల గుండాలున్నాయి.వీటిలో స్నానం చేసినవారు అనంతతృప్తిని పొందుతారనేది భక్తజనుల నమ్మిక.

## గూడూరు - అంకాలమ్మతల్లి

కడపజిల్లాలో కూడ గూడూరు వుంది. ఇక్కడి గ్రామ దేవత అంకాలమ్మతల్లి. ఈ తల్లికి ఆలయం ఎప్పటినుంచో వుంది. ఎప్పటినుంచి.. అంటే.. ఎప్పటినుంచో ... అనాలి. ఈ తల్లికి తిరునాళ్ళు, జాతర్లు జరుపుతారు. గురు,

ఆదివారాలలో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఈ తల్లిని దర్శించుకుని ఆనందిస్తారు.

బ్రహ్మంగారి మఠానికి 30 కి.మీ ఈ అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి ఆలయం. దీనిని మహాతత్వవేత్త అవతార పురుషుడు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారికి గురువుగా భావిస్తారు. ఇక్కడి విశేషం. శిల్పం నిర్మించింది శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి. ప్రతిష్ఠ – ఈ మహనీయుని సంకల్పం, ఎందరో చూస్తూండగా 'ఓం నమో భగవతే వీరభద్రాయ' అంటే, ఆ విగ్రహం చిత్రంగా స్వయంప్రతిష్ఠామూర్తయి, భక్తజనుల కానందధామంచేసిన దివ్యప్రదేశమది.

ఈ రకంగా రూపొందిన ఈ దివ్యక్షేత్రం మహాద్భుతంగా నిర్మించబడింది. సకల సౌభాగ్యాలను ప్రసాదించే కలతలను తొలగించే, కోరికలు నెరవేర్చే దివ్యధామం. ప్రాంగణంలో శ్రీవీరభద్రస్వామివారితో పాటు, శ్రీఅర్ధ నారీశ్వరుడు, శ్రీకేదారేశ్వరస్వామి ఆలయాలు వున్నాయి. అన్నీ కామితప్రదాయకాలు. భక్తజనసంరక్షకులు చూడవలసిన పవిత్ర క్షేత్రాలు.

## సిద్ధవటం - నవబ్రహ్మేశ్వరాలయం

సిద్ధవటంలోని అతి పురాతన ఆలయం శ్రీసిద్ధేశ్వరస్వామి. సిద్ధులు కొలిచినందువలన వూరికి సిద్ధవటమని దేవుని సిద్ధేశ్వరునిగా పిలుస్తారు. ఈ వూళ్ళో మహామహిమాన్విత నవబ్రహ్మేశ్వరాలయాలున్నాయి. వీటిని క్రీ.శ. 658 సం॥ చాళుక్యవంశమొదటి విక్రమాదిత్యుడు శివభక్తుడై నందువలన, ఈ ప్రాంతాన్ని దర్శించి ఆనాటి రాత్రి ఇక్కడ నిద్రిస్తే కలిగిన దివ్యానుభూతికి నిదర్శనంగా ఈ పవిత్ర స్థలంలో నవబ్రహ్మేశ్వర ఆలయాలు నిర్మించాడు. అవి –1. బాల బ్రహ్మేశ్వరుడు, 2. కుమార, 3. అర్కబ్రహ్మేశ్వరుడు, 4. వీర బ్రహ్మేశ్వర, 5. తార బ్రహ్మేశ్వర, 6. గరుడబ్రహ్మేశ్వర, 7. స్వర్గబ్రహ్మేశ్వర, 8. విశ్వ బ్రహ్మేశ్వర, 9. పద్మబ్రహ్మేశ్వరాలు. అయితే ఆలయవాస్తు విధానం బాదామి చాళుక్యుల నిర్మాణరీతికి చెందినట్లు తెలుస్తుంది. అన్నింటి లోను ప్రధానాలయం బాలబ్రహ్మేశ్వరాలయం. ఇందులో జోగు లాంబ, కామాక్షి, పాలరాతి విఘ్నేశ్వరుడు, చతుర్భుజ ఆంజనేయుడు, శ్రీరంగనాయకస్వామి, శ్రీదేవి భూదేవులను చూడగల్గుతాం. 16వ శతాబ్దంలో మైసూరు నవాబు హైదరాలీ ఈ శ్రీరంగనాయకుని



దర్శించుకున్నట్లు తెలుస్తోంది. ఇచ్చటి శివలింగాలన్ని నల్లని స్ఫటికలింగాలు. ప్రతి ఆలయానికి ఎదురుగా నంది, ధ్వజస్తంభంతో నవబ్రహ్మేశ్వరాలయాలు నయనానందకరంగా, చూడముచ్చటగా వుంటాయి.

## సంగమేశ్వరాలయం

కడపకు 50 కి.మీ దూరంలో సంగమం వుంది. ఇక్కడి దేవుడు సంగమేశ్వరుడు. అనాది సిద్ధుడు. సదాశివుడు. చరిత్రను బట్టి చూస్తే 14, 15 శతాబ్దాలనాటిదనిపిస్తుంది. విజయనగర కళాశిల్పచాతుర్యం కళ్ళకు కట్టినట్లు

ఇక్కడ దర్శింపబడుతుంది. సంగమేశ్వరునితోపాటు ఆలయ ప్రాంగణంలో అద్భుత శిల్పాలు, శిల్పాలనడంకాదు, అద్భుతమనడంకాదు, చూసి, తీరవల్సిందే. దర్శించి ఆనందించవలసినవే!

## పుష్పగిరి - చెన్నకేశవుడు

ప్రతి దేవాలయానికీ ఒక అద్భుత చరిత్ర. ప్రతి ప్రాంతానికి పవిత్రతలో భాగంగా, పినాకినీ తీరంలో వెలసిన పవిత్ర ప్రాచీనాలయం – చెన్నకేశవస్వామిది. సాక్షాత్తు జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యులవారు ఇచ్చట శ్రీచక్రం ప్రతిష్ఠించారుట. ఇంకా ఈ ప్రాంతం పాపాఘ్ని, కుముద్వతి, వల్కల, మాండలి, పినాకిని అనే అయిదు నదుల సంగమస్థలం. ఇక్కడి పుష్పగిరి పీఠం వేదధర్మాలకు నిలయం. ఇక్కడి ఆలయ పరిసరాలు మహాద్భుతాలు. ఒకానొక సమయంలో ఆంజనేయుడు తారకమంత్రం కోరితే శ్రీమహావిష్ణువు తానుగా చెప్పక లక్ష్మీదేవిని కోరుకోమంటే, ఆతడు కోపించి, శిలారూపుడౌతాడు. దాంతో పార్వతీ, సరస్వతులు లక్ష్మిని చేరి ఆతనిని శాంతింపచెయ్యమంటే, శ్రీమహాలక్ష్మి ఆంజనేయుని ఎదురుగా పద్మాసనధారిణియై వెలసి 'హనుమా! శాంతించు. ఇక్కడి పూజలన్నీ ముందు నీకు, ఆతదుపరి నాకు (మాకు) జరుగుతా'యనేసరికి ఆ శివాంశుడు శాంతిస్తాడు.

ఇక ఇక్కడ నది కాళింది. ఇది కేవలం నదిగా తలుస్తారుతప్ప దీని మహిమ ఎవరికి తెలీదు. ఒకసారి ఒక రైతు ఒక ముసలి దున్నను తీసుకుని వచ్చి కాళిందిలో కడుగుతాడు. అత్యాశ్చర్యంగా ఆ ముసలి దున్న పడుచుదైపోతుంది. దాంతో ప్రతిఒక్కరు ఆరోగ్యవంతులౌతుంటారు. ఒకసారి ధర్మరాజు మునిమనుమడు, అభిమన్యు కుమారుడు జనమేజయుడు ఇక్కడికి వచ్చి కాళింది మడుగు మహాత్మ్యం తెలుసుకుని శివ,కేశవులకు ఆలయం కట్టిస్తాడు. అంతటి విశిష్ఠమైనది ఇక్కడి పుష్పగిరి పీఠం, ఇక్కడి దేవతలు!

## వైద్యనాథేశ్వరాలయం

ఆయుర్వేద మూలపురుషుడు ధన్వంతరి, ఇక్కడ శివుని గూర్చి తపస్సుచేస్తే, శివుడు వైద్యనాధునిగా దర్శనమిచ్చి, వైద్యమును ప్రచారంచేసి, లోకాలకు ఔషధీతత్వాన్ని, రహస్యాలను తెలియపర్చమని ఆదేశిస్తాడుట. ఇది పురాణగాథ. ఇక చారిత్రకంగా ఈ మధ్యకాలంలో ఆదిశంకరులవారు తమ పర్యటనలో భాగంగా ఈ ప్రాంతాన్ని దర్శించి యధాప్రకారం ప్రతిష్ఠించి, స్వామిని శక్తివంతుని చేసారుట.

రాజంపేట – కోడూరు మార్గంలో 'శారదాప్రయానంద' అనే తల్లి సన్యాసిగా చిన్మయానందులవారి శిష్యురాలై, ప్రాచీన గురుకులంవంటి ఆశ్రమాన్ని ఈ ఎల్లాయపల్లె పాదభాగంలో 25 ఎ॥లో నిర్మించి, ఆధ్యాత్మిక, ఆర్షధర్మ వ్యాప్తికి పరిశ్రమిస్తున్నారు. ఇది దేశ, విదేశాలలో పేరుపొందిన 'చిన్మయారణ్యాశ్రమం'. పరమప్రశాంత వాతావరణంలో, ఆశ్రమజీవితం గడపాలనేవారికి ఒక దివ్యధామం.

## మండెం - శ్రీలక్ష్మీనరసింహులు

శ్రీమాండవ్య మహర్షి చిన్నకుమారుడు నరసింహస్వామి భక్తుడు. అతడీ ప్రాంతంలో ఆశ్రమం ఏర్పాటు చేసుకుని తపస్సు చేసుకుంటూంటే, నరసింహస్వామి కలలో కనుపించి తన వునికిని చెబితే, స్వామిని ఆతడు ఈ చిన్నమండెంలో

ప్రతిష్ఠించాడుట. అనంతర కాలంలో 11వ శతాబ్దంలో కుతోత్తుంగ చోళుడీ ఆలయం నిర్మాణం చేసాడని శాసనాలద్వారా తెలుస్తోంది. శ్రీస్వామివారు తమ ఎడమ తొడపై లక్ష్మీదేవిని కూర్చుండబెట్టుకున్నట్లు స్వామిని మనం దర్శించి, ధన్యత చెందవచ్చును.

## పెద్దముడియం - శ్రీలక్ష్మీనరసింహస్వామి

జమ్మలమడుగు సమీపంలో 18 కి.మీ దూరంలో ఈ పెద్దముడియం వుంది. పెద్ద వేపచెట్లు క్రింద ఈ గ్రామం అగ్రహారంగా వుండటంతో దీనిని 'పెదవేము' అని పిలిచేవారు. 'వేము' అంటే 'వేప' 'ముడి' అంటే చెట్టు కనుక మొదట్లో 'పెదవేము' అని, ఆతర్వాత, 'పెదముడియం', 'పెద్దముడియ'మయింది. ఇక పురాణం ప్రకారం ఇక్కడి శ్రీలక్ష్మీనరసింహస్వామిని జనమేజయుడు ప్రతిష్ఠించినట్లు చెప్పుకుంటారు. ఏదిఏమైనప్పటికి, ఈ దివ్యాలయం రాజగోపురం మన దౌర్భాగ్యంవల్లనే శిథిలమైంది. ఆలయ ప్రాకారం, అంతేనని చెప్పాలి. ముఖమంటపం, రాతిధ్వజస్తంభముంది. వెనుక భాగంలో నాగులశిలలు ఎన్నో. హిరణ్యకశిపుని చీల్చే భంగిమలో గర్భగుడిలోని విగ్రహముంది. ప్రసన్నుడవుకమ్మని ప్రహ్లాదుడు ప్రార్థించే భంగిమ విగ్రహం మనం చూడగల్గుతాము. ఇచ్చట లక్ష్మీదేవికి ప్రత్యేక ఆలయం వుంది. చరిత్రకు శెలవుచెప్పి, స్వామికి నమస్కరించి, అభివృద్ధికి ఆ స్వామినే ప్రయత్నించమని చెప్పుకోవాలి. దొరికినదల్లా అమ్ముకోవడానికి తప్ప, అభివృద్ధికి ముందుకురాని ప్రభుత్వం, ఆయా గ్రామపెద్దలు, పెద్దలు సిగ్గుతో కుచించుకుపోవల్సిన విషయంగా దీనిని తలవాలి.

## వేంపల్లె - వృషభాచలేశ్వరుడు

ఇతడు శివుడుకాదు. శ్రీహరి మరో అవతారం. పెలివెందున సమీపంలోని వేంపల్లెలో పావన పాపాఘ్నినది ప్రవహిస్తుంది. దీనికి ఆనుకుని అతి దగ్గర్లో 'ఎద్దులకొండ' అనే ఎత్తైన కొండపై శ్రీవృషభాచలేశ్వరు డున్నాడు. ఈ కొండ తిరుమలనుండి శ్రీశైలంవరకు విస్తరించిన శేషాచలంలోని ఒకభాగ మీ ఎద్దులకొండ. ప్రకృతి రమణీయతకు పుట్టినిల్లుగా వుంది. ఇక పురాణ కథనానికి వస్తే – ద్వాపరయుగం చివరికాలంలో ఈ వేంపల్లెను 'భాస్కరక్షేత్ర'మని పిలిచేవారుట.కథలోకివస్తే – 'వృషభుడు' అనే రాక్షసుడు బ్రహ్మకై తపస్సు చేసి, దేవ,దానవ, నర, వానర, కిన్నెర, కింపురుషాదుల చేతిలో మరణంలేని వరం పొంది లోకభయంకరంగా ఈ పర్వతంపైని మునులను సాధుసజ్జనులను పీడించసాగాడు. అందరు కలిసి విష్ణువును ప్రార్థిస్తే, ఈ వృషభాసుర సంహారానికి వస్తాడు కానీ, అతన్ని చంపుకోలేక, అతని వరంలోని జంతురూపం వృషభావతారమెత్తి ఆ రాక్షసుని సంహరిస్తాడు.

మునులానందపడతారు. వారి ప్రార్థన మేరకు శ్రీహరి పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరుడై, ఈ వృషభాచలంపై వెలసి వారందరికి ఆనందం కలిగిస్తాడు. ఈ ఆలయం జనమేజయుడు ప్రతిష్ఠించినట్లు అనంతర కాలంలో శ్రీకృష్ణదేవరాయలు పునర్నిర్మించడం జరుగుతుంది. ఇక్కడి స్వామిని దర్శించే సంతానం పొందుతారు. 'వారాలు' ప్రదక్షిణాలు, ముఖ్యంగా శుక్రవారాలలో పూజలు చేసే వారి సర్వాభీష్టాలు నెరవేరుతాయి. ఇక్కడ ధనుర్మాసం అన్ని ఆలయాలవలె సందడేసందడి, భక్తులే భక్తులు.

# చిత్తూరు జిల్లా

## శ్రీకాళహస్తి

పంచభూత శైవక్షేత్రములలో శ్రీకాళహస్తి ఎంతో ప్రసిద్ధి చెందింది. కంచిలో పృథ్వీలింగము, జంబుకేశ్వరంలో జలలింగము, తిరువణ్ణామలైలో తేజోలింగము, శ్రీకాళహస్తి వాయులింగము, చిదంబరంలో ఆకాశలింగము ఇవి పంచభూత క్షేత్రములు. ఆ పంచభూత క్షేత్రాలలో ఒకటి ఈ కాళహస్తి. శ్రీ కాళహస్తీశ్వరాలయం రాహుకేతు నిలయం. వాయులింగేశ్వరుని దర్శిస్తే రాహుకేతు దోషం పోతుంది. ఇక్కడ ఆలయంలో ఏ మూల చూసినా సర్వదోష నివారణ పూజలు చేస్తున్న దృశ్యమే కనపడుతుంది. కాశిలో చనిపోతే ముక్తి. కాని ఇక్కడ కాలుపెడితేనే ముక్తి. ఇది తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయానికన్న ఎంతో ప్రాచీనమైనది.



తిరుపతినుంచి 34, రేణిగుంటనుంచి ఇరవైనాల్గు, గూడూరు నుంచి అరవై కిలోమీటర్లు దూరంలో వుంది. తిరుపతి, రేణిగుంట, గూడూరునుంచి, అలాగే రాష్ట్రం నలుమూలలనుండి ప్రయాణ సౌకర్యాలు విరివిగానే వున్నాయి. కాళహస్తికి రైలుమార్గంవుంది. కాకపోతే స్టేషనుకు ఆలయానికి రెండు కి.మీ. దూరం వుంటుంది.

ఇచ్చటనే భక్త కన్నప్ప చరిత్ర జరిగింది. స్వయంభూ లింగముగా వెలసిన ఈ స్వామిని సాలె పురుగు, కాళము, హస్తి మూడూ అకుంఠిత భక్తితో పోటాపోటీగా సేవించి, చివరికి మోక్షము పొందాయని పురాణ కథ. స్వర్ణముఖి నది ఒడ్డున దుర్గమ్మ గుడి వుంది. ఆ గుడి విశేషం .... ఆ తల్లి కాళ్ళకు సంకెళ్ళు వేసి ఉండటం, ఈశ్వరుడు ఋషిరూపంలో వచ్చి, మనుషుల్ని తింటున్న దుర్గమ్మకి సంకెళ్ళు వేశారన్నది ఇక్కడ స్థల మహాత్మ్యంలో చెప్పబడింది. ఈ క్షేత్రంలోనే బ్రహ్మగుడి కూడా ఉంది. ఈ క్షేత్ర సందర్శనం మహాభాగ్యమేకాదు, భక్తి, ముక్తిదాయకం.

కాళహస్తి దేవాలయం ఊరంత కట్టడంగా వుంటుంది. దక్షిణ భారతంలోని ఆలయాలలో శ్రీకాళహస్తి ఆలయం అత్యంత పెద్దది. ఇక్కడి ఆలయంలో కొన్ని వందల శివలింగాలు, శివభక్తులలో అగ్రగణ్యులైన 63మంది నాయనార్లు... అన్నీ ఓపిగా చూడదగ్గవే. ఈ ఆలయానికి పురాణ గాథవుంది. విశ్వామిత్రుడు, వసిష్ఠుని వందమంది పుత్రులను కోపంతో చంపేస్తే ఆ బాధను భరించలేక కొండమీదనుండి ఆత్మహత్య చేసుకోపోతే, భూమాత ఆ మహనీయుని రక్షించి, నీవంటివాడు ఈ పని చెయ్యకూడదు. ఈశ్వరుని ప్రార్థించి ఉపశమనం పొందమంటుంది.

ఆమె సలహాతో వశిష్ఠుడు శివునికై తపస్సు చేస్తాడు. శివుడు ప్రత్యక్షమవగానే పంచవర్ణ ప్రపంచాన్ని అయిదు భాగాలుగా పంచుకున్న పంచముఖాలతో పశ్చిమాభిముఖంగా దర్శనమిస్తాడు. సంసార తాపము, తాపత్రయం లేని బ్రహ్మవిద్యను ప్రసాదించమని కోరితే, "అభీష్టసిద్ధిరస్తు" అని ఆశీర్వదించి, వాయుముఖుడై అదృశ్యుడౌతాడు.

ఆ దివ్యప్రదేశమిది. అందుకే ఇది వాయులింగమైంది. శివుడు ఎక్కడా కనబడకపోతే, పార్వతి ఇక్కడకు వచ్చి జ్ఞానప్రసూనాంబికగా నిలిచింది. దీంతో సర్వదేవతలు, వారి ప్రత్యధి దేవతలతో ఇక్కడ స్థిరనివాసమొందుతారు. ఇటువంటి ఆలయాన్ని అగస్త్యులవారు తమ భార్యలోపాముద్రతో దర్శించి, చేసిన తపస్సు ఫలితంగా శివుడు ఆకాశగంగను భూమికి పారిస్తాడు. అదే సువర్ణముఖి అవుతుంది. ఆ తదుపరి బ్రహ్మ మఖానక్షత్రంనాడు సువర్ణముఖిలో స్నానం చేసి శివార్చన చేసిన ఫలితంగా "బుధు"డనే పుత్రుని కంటాడు. ఆ తరువాత 'శ్రీ' (సాలెపురుగు), కాళము (పాము), హస్తి(ఏనుగు)ల భక్తి ప్రభావాన ఈ క్షేత్రము "శ్రీకాళహస్తి" యై, తలచిన వారిని తరింపచేసే దివ్యధామ మౌతుంది. ఈ గిరికి త్రేతాయుగం తరువాత కూడ, పాము, ఏనుగు, సాలెపురుగులుమూలాన "శ్రీకాళహస్తి" అనే పేరు సుస్థిరమౌతుంది.

ఇక్కడే "భక్తకన్నప్ప" గా ప్రసిద్ధికి చెందిన తిన్నడు ముక్తుడయ్యాడు. మరొక విషయం గతంలో సాలెపురుగుగా చెప్పుకున్నవాడు విశ్వకర్మసుతుడు ఊర్ణినాభుడని, పాము – శంభుడనే నాగలోకవాసిగాను, ఏనుగు 'హస్తి' అనే ప్రమధుడనీ, తిన్నడు కర్మ పరిపక్వమొందదలచిన పాండవమధ్యముడు అర్జునుడనీ, కొన్ని కొన్ని కథలు తెలుపు తున్నాయి. ఇక్కడ సర్పదోష నివారణకు పూజలు కూడా జరుగుతాయి. తమ జీవితాలను సుఖసంతోషాలుగా మార్చుకోవడానికీ ఆలయదర్శనం – అత్యంతావశ్యంగా తలవాలి. దర్శన మొందడానికి ప్రయత్నం చేయాలి.

ఇక్కడ సర్వదేవతలు ప్రతిష్ఠించిన అనేక శివలింగాలను దర్శించగల్గుతాం. ముఖ్యంగా పాతాళగణపతి దర్శనం ధన్యుడిని చేస్తుంది. వివిధ గణపతులు, సుబ్రహ్మణ్య, శని, సూర్యులు, వేంకటేశ్వర, వరదరాజ, వీరరాఘవస్వామి విగ్రహాలు, అపురూప శిల్పకళ, మోర (తల) ఎత్తిచూసే గోపురాలు, జన్మఎత్తినవారు తప్పక చూడాల్సిన అపురూపాలు.

'యమగానిపల్లె'లో 5, 6 శతాబ్దాలకు ముందే నిర్మించిన పాండవుల పత్ని ద్రౌపది ఆలయం చూడదగ్గది. ఇక్కడి పర్వదినాలలో ఉదంక చరిత్ర, పాండవుల జీవితం లోని అతిముఖ్య ఘట్టాలు అంగరంగవైభోగంగా ప్రదర్శించబడతాయి.

'ఏనుగమల్లమ్మ' అనే మదనపల్లిలోని మల్లమ్మగుడి వివరాలు తెలియని ప్రాచీన గ్రామదేవత. గిరిజనులు ఆరాధ్యదేవత. తలచిన, కొలిచిన వారికి అభీష్టప్రదాయని.

'బత్తినయ్య' అనే భక్తుడు శివ, కేశవ భేదం లేకుండా పూజించేవాడు. తన తపోశక్తితో మూడు అంగలలో అగస్త్యేశ్వర పర్వతాలను దాటాడుట. ఇందుకు నిదర్శనంగా 'ముసలిపాడు' గ్రామంలో ఒకపాదం, మొనగాడిగుంచ అనే ప్రదేశంలో మరొక పాదం, కొండగుహవద్ద మూడోపాదం గర్తులు స్పష్టంగా చూడవచ్చు. ఆతదుపరి ఆత మహనీయుడు భక్తకోటిశ్వరుడిగా వెలసి, కలియుగంలో భక్తులను కరుణిస్తానని, యానాది దంపతులకు చెప్పడం, ఇక్కడ ఆలయం నిర్మాణమవడం జరుగుతుంది. భక్తుడే భగవంతుడనడానికి బత్తినకోన భక్తకోటీశ్వరునొక నిదర్శనంగా చెప్పవచ్చును.

'ములకలచెరువు' కోటమ్మతల్లి, ధర్మవరం – పాకాల రైలుమార్గంలోని సోమపాలెం రైల్వేస్టేషనులో దిగి ఈ ములకల చెరువులోని కోటమ్మతల్లిని దర్శించుకోవచ్చును. కోరిన కోరికలు తీర్చే ఈ తల్లిని, ఈ ప్రాంతంలోని అనేక దేవాలయాలను దర్శించుకోగల్గడమొక అదృష్టంగా చెప్పుకోవచ్చును.

కాళహస్తి తాలూకా, 'తొట్టంచేడు' లో ఒకనాడు 'పాపివిచ్ఛేద క్షేత్రం' నేడు 'విరూపాక్షపురం'గా పిలువబడే చోట 'సుభగాంబసమేత విజయేశ్వరు'డనే అర్థనారీశ్వరాలయముంది. అవంతీనగరంలో నివసించే విజయ, సుభగ దంపతులపేరిట ఈ అర్ధనారీశ్వరాలయ మేర్పడింది. ఈ దంపతులు మహాశివభక్తులు. కాళహస్తి చేరి స్వామిసేవలో తరించే ఆ దంపతులకు శివుడు కలలో కనుపించి అర్ధనారీశ్వరుని సేవించమంటే, ఈ విరూపాక్ష పురానికి వచ్చి నిష్ఠతో శివపూజ, సుభగ మట్టిలింగాలతో అర్చనచేయడంతో, పరమప్రసన్నుడైన కాళహస్తీశ్వరుడు నేనీ లింగమందు ఉంటానని, ఇకపై ఈ క్షేత్రంలో నేను 'సుభగాంబ సమేత శ్రీవిజయేశ్వర స్వామి'గా విరాజిల్లుతానని కాళహస్తిలో నన్ను సేవించిన సర్వపుణ్యఫలం ఇక్కడ లభిస్తుందని ఆ దంపతులను ఆశీర్వదించి, వరమిచ్చి మోక్షం ప్రసాదిస్తాడు. శివుని భాగం తెల్లమంచువలె తెల్లగావుంటే రెండవభాగం (అర్ధనారీశ్వరమనడానికి నిదర్శనంగా) పసుపురంగు కలిగివుంటుంది.

'బోయకొండ' గంగమ్మతల్లి ప్రాచీన దేవత. నవాబుల దురాక్రమణ, దౌర్జన్యాలనుండి, అసమర్ధులైన అమాయక ప్రజలను వూరడించి, తానే వృద్ధురాలి రూపంలో నవాబు సేనలను చంపి, అందరికి అభయమివ్వడంతో 'అమ్మా' నువ్విక్కడ నిలిచి మమ్ము కాపాడు'మని ఆ ప్రజలు ప్రార్థిస్తారు. అప్పుడామె బోయకొండ గంగమ్మగా వెలసి భక్తులను సదా రక్షించసాగింది.

చిత్తూరుజిల్లా అంటే ... ఆలయాల సముదాయమని, పరమపవిత్ర ప్రదేశమని చెప్పవచ్చును. ఈ జిల్లాలోని రేణిగుంటలో 11 శతాబ్దంనాటి ప్రాచీన శక్తిదేవతయైన 'పెద్దమ్మతల్లి' ఆలయం వుండేది. కాలక్రమంలో ఆ ఆలయం చిత్రంగా 'త్రికూటాలయం, సిద్ధేశ్వరాలయం, సర్వేశ్వరాలయాలుగా మారి ఆ పెద్దమ్మతల్లి భక్తుల నీరాజనాలు, పూజలందుకుంతోంది. ఈ ఆలయాలు చోళులకాలంనాటివంటే, కొందరు 11 శతాబ్దివని చెబుతారు. మొత్తానికి తళ్ళికోట యుద్ధం ప్రభావంతో కొందరు ఈ ఆలయాలను ధ్వంసం చేసారు. అయినా ఆ భగవంతుడిదయవల్ల మనమిప్పుడు వీటిని చూడగల్గుతున్నాము.

## పెనమానిపల్లె - శ్రీనివాసుడు

దేశంలోని ఎన్నో ఆలయాలవలె ఈ ప్రాచీన ఆలయానికి చరిత్ర లేదు. కాకపోతే ఈ ఆలయం శిధిలావస్థలో వుంటే, శ్రీరంగస్వామి అయ్యంగారు దీనిని పునరుద్ధరింపచేసి, రాజగోపురం కట్టించాడని స్థానికులవలన తెలుస్తూంది. తూర్పు ముఖంగా వుండే ఆలయ ఉత్సవాలకు కర్ణాకట, తమిళనాడు నుండి భక్తులు వచ్చి, స్వామిని సేవించుకుంటారుట.

## నారాయణవనం - అవణాక్షమ్మ

వేదాలు కన్నులుగా కల 'అమ్నాయాక్షి' ఇచ్చటి దేవత. కానీ, 'అమ్నాయాక్షి' కాస్తా, అవణాక్షమ్మగా కాలాంతరంలో మారిపోయింది. పురాణగాథ ప్రకారం సోమకుండనే రాక్షసుడు వేదాలను దొంగిలిస్తే జగన్మాత పార్వతివాడిని సంహరించి, వేదాలను బ్రహ్మ కొసగిందట. ఈ అవణాక్షమ్మ - నారాయణవన రాజులకులదైవమని రాక్షస సంహారిణిగా భయంకరంగా వుంటుంది. ఒంటరిగా అమ్మను చూడాలంటే పూజారులే భయపడతారుట.

## తాతయ్యగుంట - గంగమ్మతల్లి

శ్రీనివాసుని సోదరిగా చెప్పబడే ఈ తాతయ్యగుంట గంగమ్మతల్లి, గ్రామదేవత, గంగమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో ఏడు రోజులు జరుపుతారు. ఇది తిరుపతి గ్రామపొలిమేరలో వుంది. జాతర సమయంలో శ్రీనివాసుడు ఈ సోదరికి సారెపంపడ మానవాయితీ.

## అరగొండ - వీరాంజనేయులు

కాణిపాకానికి 10 కి.మీ దూరంలో కొండపై శ్రీవీరాంజనేయస్వామి, సంజీవరాయ పుష్కరణిలో స్నానంచేస్తే భక్తుల ఆదివ్యాధులు తీరుస్తున్నారు. ఇక పురాణకథ ప్రకారం ఆలోచిస్తే లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు సంజీవని కోసం ఆంజనేయుడు బయలుదేరి సంజీవ పర్వతంపై దిగి, మూలిక తెలుసుకోలేక, ఆ పర్వతంతో బయలుదేరుతాడు. తీరా ఈ ప్రాంతానికి వచ్చేసరికి హనుమంతుని తీవ్రవేగానికి అరకొండ విరిగి క్రిందపడుతుంది. ఆ అర్ధగిరి, కాలక్రమంలో అరగొండై కూర్చుంది. అప్పుడేర్పడిన పుష్కరిణీ 'సంజీవరాయ' పుష్కరిణి, ఆదివ్యాధుల నివారిణి.

## నారాయణవనం - 'సొరకాయల' పరమేశ్వరుడు

ఇక్కడి కల్యాణవేంకటేశ్వరస్వామి గురించి అందరికి తెలుసు. ఇక్కడే పరమేశ్వరుని ఆలయం కూడా వుంది. ఏది ప్రాముఖ్యత వహిస్తే దానినేతప్ప, ఇతరులను గూర్చి ఆలోచించని మనకు, ఈ పరమేశ్వరుని ఆలయం గూర్చి చెప్పుకోము. ఇది అత్యంత ప్రాచీనమైనది. ఇందులో ఒక సిద్ధ పురుషుడుండేవాడు. ఆయనను 'సొరకాయలస్వామి' అనే చెప్పుకునేవారు. దీనిని పరమేశ్వరాలయమని, సొరకాయలస్వామి ఆలయమని ప్రజలు చెప్పుకుంటారు.

ఇక కళ్యాణ వేంకటేశ్వరాలయం. 1544 సం॥లో పెనుగొండ వీరపున్న దీనిని నిర్మించాడని చెబుతారు. స్థలపురాణం ప్రకారం దీనిని ఆకాశరాజు కట్టించారంటారు. ఇక్కడే శ్రీవేంకటేశ్వర, పద్మావతిల కల్యాణం జరిగింది. ముక్కోటిదేవతలు ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించి తరించారు. ఈ ఆలయంలో శ్రీవేంకటేశ్వర, పద్మావతులతోపాటు, వివిధ దేవతలు మనకు దర్శనమిస్తారు.

## చంద్రగిరి - కోదండరామాలయం

1535 సం॥లో త్రవ్వకాలలో దొరికిన విగ్రహాలను శ్రీసీతారామలక్ష్మణ, భరతశతృఘ్న సమేతంగా శ్రీకోదండరామాలయంలో ఒకే పీఠంపై ప్రతిష్ఠించారు. చంద్రగిరిలోని అపురూప కోట, ఆనాటి రాజభవన చిహ్నాలు పోయినవి పోగా, ఇంకా కొన్ని మనం చూడగల్గుతాము. ఈ కోటకు 2 కి.మీ. దూరంలోని శ్రీకోదండరామాలయం, విజయనగరరాజుల దైవభక్తికి, కళాతృష్ణకు నిదర్శనంగా వీటిని దర్శించి, మురిసిపోవచ్చును.

## గుడిమల్లం - పరమేశ్వరుడు

తిరుపతికి 20 కి.మీ దూరంలోని ఏర్పేడు మండలంలో ఈ 'గుడిమల్లాం' వుంది. ఇక్కడ ఆంధ్రశాతవాహనుల కాలంనాటి పురాతన శివాలయం వుంది. ఇది చంద్రగిరి రాజుల కాలంలో మహావైభవంగా విలసిల్లింది. ఇక్కడి పరమేశ్వరుడు లింగరూపంలో కాకుండా ఒకచేతిలో తలక్రిందలు జింకపిల్ల, మరోచేతిలో నీటికుండతో

మల్లయోధుడిలాగ కనుపిస్తాడు. లింగంలోనుండి పొడచుకు వచ్చినట్లు వుంటాడు. పురుషలింగాకృతిలో వుండే ఈ శివుడు అతిప్రాచీనునిగా, ఒకనాటి శివారాధనకు దర్పణంగా కనుపిస్తాడు.

## విజలాపురం - వేణుగోపాలుడు

కుప్పం మండలంలోని 'విజలాపురం'లో 12 శతాబ్దానికి చెందిన అతి పురాతన వేణుగోపాలస్వామిని చూడగల్గుతాం. రుక్మిణీ, సత్యభామలతో వున్న ఈ వేణుగోపాలుడు సంతాన ప్రదాతగా కొలువబడుతున్నాడు.

## సురుటపల్లి - పల్లికొండలేశ్వరుడు

తిరుపతికి 76 కి.మీ దూరంలో నాగులాపురం మండలంలోని సురుటపల్లి 'శ్రీసర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వరస్వామివారి ఆలయం చూడతగ్గది. అమృతంకోసం దేవదానవులు వాసుకి సాయంతో మందర పర్వతం కవ్వంచేసుకుని పాలసముద్రం చిలకుతుంటే మహాభయంకర కాలకూట విషం వెలువడుతుంది. శివా, శంభో! అంటే ఆ పరమేశ్వరుడు, విషం మ్రింగేస్తాడు. పార్వతి కడుపులోకి పోకుండా చూడమంటుంది. కంఠంలోనే ఆ విషాన్ని ఆపేస్తాడు. ఆ విష ప్రభావంవలన నీలకంఠుడైన శివునికి కొంత తూలువచ్చి ఇక్కడ పడుకున్నాడని దీనిని 'శివశయన' క్షేత్రంగా చెబుతారని స్కందపురాణం ద్వారా తెలుస్తోంది.

ఇక్కడ పార్వతి ఒడిలో శివునితోపాటు బ్రహ్మాదిదేవతలు, కామధేను, కల్పవృక్షాదులు, ఇతర దేవతలను గూడ చూడగల్గుతాం. దీనికి వాల్మీకి క్షేత్రమని కూడా మరోపేరు వుండేది. ఇక్కడి సాకార శివుని దర్శించినవారికి, అన్నీ లాభాలే. ఏది కోరుకుంటే అది లభిస్తుందన్నది భక్తజనుల విశ్వాసం.

## దాచపాలెం - బాలగురునాధస్వామి

చిత్తూరు నుండి 40 కి.మీ రాజపాలెం గ్రామంలో చిన్నదే అయినా వటవృక్షం క్రింద 400 సం॥ల క్రితం నిర్మించబడ్డదీ ఆలయం. 6 అడుగుల ఎత్తు విగ్రహం, బాలగురునాధస్వామిగా పూజలందుకునే విగ్రహంపై నాగబంధం, త్రిమూర్తులు మలచబడ్డారు. విగ్రహానికి కుడివైపు గణపతి, ఎడంవైపు సుబ్రహ్మణ్యస్వామి వుండి, భక్తుల ననేకరకాల సంరక్షిస్తున్నారు. ప్రతినెలా పౌర్ణమినాడు జరిగే అభిషేకం భక్తుల సందడితో కళకళ లాడుతూ వుంటుంది.

## కార్వేటినగరం - వేణుగోపాలుడు

పుత్తూరుకు దగ్గర్లో ఈ కార్వేటినగరం వుంది. 1719లో కటారి సాళ్వనూకరాజ వెంకట పెరుమాళ్ళరాజు, ఈ శ్రీవేణుగోపాలస్వామి ఆలయం నిర్మించారని శాసనాలద్వారా తెలుస్తుంది. అద్భుత సౌందర్యంతో భక్తజనానందదాయకంగా శిల్పశోభలతో ఈ ఆలయం రుక్మిణి, సత్యభామా సమేతుడైన శ్రీవేణుగోపాలునితో కనువిందు చేస్తుంది.

## కైలాసకోన

ఇక్కడి గుహాలయంలో శివలింగం, దాని కెదురుగా నంది, దాని ప్రక్కన వీరభద్రుడు, కామాక్షీదేవి, ఆదిశంకరా చార్యులతో, అద్భుత జలపాతాల మధ్య హృదయానందం కలిగిస్తుంది. నారాయణ వనంలో జరిగే శ్రీవేంకటేశ్వర

కల్యాణానికి వచ్చిన శివపార్వతుల కైలాసబృందం ఇక్కడి ప్రకృతి రమణీయతకు ముగ్ధులై కొంతకాలముండటంతో దీనికి 'కైలాసకోన' అని పేరు శాశ్వతమైంది. అయితే ఇక్కడ రోజు అర్చనాదులు జరుగవు. ఒకటి పర్వతప్రదేశం. మరొకటి నిర్జనవనం. కావాలనుకునే భక్తులు ఇక్కడికి వచ్చి, ప్రకృతిమాతను, పరమశివుని ప్రత్యేకంగా అర్చించుకుని వెడతారు.

## తలకోన - శ్రీసిద్ధేశ్వరస్వామి

భాక్రాపేట సమీపంలోని శ్రీ వేంకటేశ్వర అభయారణ్యంలో 200 అడుగుల ఎత్తుగల తలకోన జలపాతం వద్ద శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయం వుంది. ఇటు ప్రకృతి పరవశత్వము, అటు సిద్ధపురుషుని దివ్య క్షేత్రం. తిలకించడానికి ఎందరో వస్తుంటారు. అందంతో ఆనందరూపంగా వుంటుందిది.

## మొగిలేశ్వరాలయం

పలమనేరు సమీపంలోని ఈ గ్రామంలోని మొగిలేశ్వరునిది, చాలా ప్రాచీనమైన ఆలయం. ఆలయంలోని దేవునికి నమస్కారం పెట్టడంతప్ప, దీని చరిత్ర అడిగేవారే తప్ప చెప్పేవారు కనబడరు. ఇక్కడి విశేషం నందినోటినుండి నీరు రావడం. ఎక్కడనుండి వస్తుంది? అందుకనే అందరు దర్శిస్తారు, ఆనందిస్తారు. అర్చనాదులతో సంతృప్తులౌతారు.

## కోదండరాముడు

తిరుపతిలో, అలిపిరికి వెళ్ళేదారిలో వున్నాడంటారు. ఈ రామాలయాన్ని 1480 సం॥లో నిర్మించినట్లు తెలుస్తుంది. ఎంతో విశాలమైన ఆవరణలో అపురూపంగా నిర్మించబడిన ఆలయం చూసి సంతోషించాలేతప్ప, ఇంక ఆలయ వివరాలు, నిర్మాణవిశేషాలు ... మరేమైన చరిత్ర ఎవ్వరికి తెలియదు. కాబట్టి ఎవరు చెబుతారు?

## వాల్మీకిపురంగా పిలువబడే వాయల్పాడు

ఇది తిరుపతికి 95 కి.మీ దూరంలో వుంది. ఇది వాల్మీకి పురంగా పిలువబడే ప్రాచీన ప్రాంతం. ఈ గ్రామంలోని పట్టాభిరాముడు, ప్రాచీనుడే. మహాభక్తుడు అన్నమయ్య గ్రామం దర్శించి, ఇక్కడి రాముడిపై 27 కీర్తనలు కీర్తించాడు. ఈ ఆలయాన్ని జాంబవంతుడు ప్రతిష్ఠించాడని అంటారు. శ్రీరామునికి కుడివైపు సీత, వింజామర వీస్తూ భరతుడు, ఎడంవైపు ధనుర్బాణములతో లక్ష్మణుడు, వింజామర పట్టుకుని శతృఘ్నుడు, గర్భగుడికి ఒకప్రక్క ఆంజనేయుడు. చక్రధారియైన శ్రీరాముడిని మనం చూడగల్గుతాము.

## తరిగొండ

మహాభక్తురాలు 'వెంగమాంబ' పేరు చెబితే, ఈ 'తరిగొండ' జ్ఞప్తికి వస్తుంది. ఇక్కడి ప్రాచీన ఆలయం శ్రీలక్ష్మీనరసింహుడిది. ప్రతి ఆలయానికి కొన్ని కథలుంటాయి. ఒక కథనం ప్రకారం ఇది దూర్వాసమహాముని ప్రతిష్ఠ. మరో కథ ప్రకారం ఒక దొరవారు తన భార్య, పశువులమందతోవచ్చి దట్టమైన ఈ అరణ్యప్రాంతంలో కొంతకాలం గడిపారట. ఒకసారి దొరగారి భార్య చల్ల చిలుకుతుంటే ఆ తరి(చల్ల)కుండలో ఒక రాయి కనుపించిందట. మర్నాడు అలాగ కనుపించేసరికి భర్తతో ఆమె చెప్పింది. అతడు ఆశ్చర్యపోయాడు. ఆనాటి రాత్రి శ్రీలక్ష్మీనరసింహుడు

వారికి కలలో కనుపించి 'రాజా!' అంటూ తన పేరుచెప్పి నీ భార్యకు తరికుండలో కనిపించినవాడను నేను. నాకు ఆలయం కట్టించు. డబ్బు గురించి ఆలోచించకు. ఫలానా చోట లభిస్తుందని ఆనవాళ్ళు చెప్పి మరీ స్వయంగా స్వామి ఆలయం కట్టించుకున్నాడు.

ఇక్కడ మహాభక్తురాలు వెంగమాంబ చిన్నగుడి కూడా వుంది. స్వామి శ్రీదేవీభూదేవి సమేతుడిగా ఇచ్చట వెలసి భక్తజనబాంధవుడయ్యాడు. వెంగమాంబ వలన మరింత ప్రాచుర్యము పొందాడు. భక్తులతోడిదే భగవంతుడు. వారి చరిత్రయే భాగవతం కదా! ఇక్కడ ఎవరు అబద్ధమాడరు. అంత సత్యవంతుడని భక్తజనవిధేయుడని, ఆపద్బాంధవుడని స్వామికి వున్న బిరుదు శాశ్వతం చేసుకునే దేవుడు.

## నాగులాపురం వేదనారాయణుడు

చరిత్ర ప్రసిద్ధము, ప్రాచీనమైన ఆలయం. ఒకప్పుడిది కృష్ణాలయమని, ఇప్పుడు వేదనారాయణునిగా ప్రసిద్ధి పొందుతున్నాడని చరిత్రకారులు చెబుతారు. ఇది 13వ శతాబ్దిలో నిర్మితమైన ఆలయం. శ్రీమహావిష్ణువు మహర్షులు, దేవతల కోరికపై సోమకాసురుని వధించడానికి మత్స్యావతారమెత్తి సోమకుని వధించి, వేదాలను బ్రహ్మకొసగిన దివ్యావతారుడు అలాగే స్వయంవ్యక్తుడయ్యాడు. ఈ దివ్యావతారునకు, లోహపుకాళ్ళు తగిలించారు. కారణం మత్స్యానికి కాళ్ళు వుండవు కనుక, నిలబడటం కష్టమని ఈ ఆలయాన్ని జాగ్రత్తగా చూస్తే ఈ ఆదిదేవుడు (దశావతారమూర్తి) కి శ్రీకృష్ణదేవరాయలు 3 ప్రాకారాలతో పన్నెండెకరాల భూమిలో నిర్మించినట్లు శాస్త్రకారుల అంచనా. అందుకే ఈ గ్రామం శ్రీకృష్ణదేవరాయల తల్లి నాగులాంబ పేరుతో నాగులాపురంమైందని అంటారు.

ఈ ఆలయం చుట్టు మహావిష్ణువుకు సంబంధించిన విగ్రహాలు కన్పిస్తాయి. ఇక్కడి విశేషం ప్రతి సం॥రం మార్చి 25, 26, 27 తేదీలలో సూర్యకిరణాలు 4 గం॥ తరువాత స్వామిని తాకుతాయి. మొదటి రోజు పాదాలు, రెండవరోజు నాభి, మూడవనాడు ముఖం దర్శనం చేసుకుంటాయని చెబుతారు.

## వ్యాసాశ్రమం - ఏర్పేడు

1926 ప్రాంతంలో శ్రీ అనంతానందగిరిస్వామి ప్రారంభించారు. ఆర్షధర్మానికి ప్రతీకగా, దిక్సూచిగా, ధర్మపీఠంగా 'మళయాళ'స్వామిగా విఖ్యాతులైన శ్రీస్వామి ఆర్షధర్మానికి దిశానిర్దేశంగా నిలిచి భగవద్గీతను ఇంటింటికి అందించారు. ఇప్పుడక్కడున్నది ఒక భాగం. మిగిలిన 3 భాగాల సేవ శ్రీశుకబ్రహ్మాశ్రమం కాళహస్తిగా,- తన సేవలను భక్తజనులైన ఆర్తులకు జిజ్ఞాసులకు అందిస్తుంది.

## రామకుప్పం - సుబ్రహ్మణ్యస్వామి

దక్షిణాదికి సుబ్రహ్మణ్యం ఆరాధనీయుడు. ఆ మహనీయునికి గల అనేక నామాలలో ఏదో ఒక నామం ఇక్కడి వారు పెట్టుకుని ఆనందపడుతుంటారు. స్వామిని ఆరాధిస్తుంటారు. సుబ్బారాయుడు, కుమారస్వామి, నాగరాజు, సుబ్బయ్య, సుబ్బరావు, సుబ్రహ్మణ్యం ... ఇలాగ ఎన్నో నామాలతో ఎందరో తమ పిల్లలను పిలుచుకుంటారు. ఇక దక్షిణాదిలోని రామకుప్పంలో ఒకనాడు నాగేంద్రస్వామి ఆలయంగా చెప్పుకునే ఆలయం ఇప్పుడు వల్లీ, దేవసేనాసమేత సుబ్రహ్మణ్యుడయ్యాడు. ఈ ఆలయం వెనుక నాగులముద్దమ్మ అనే శక్తి ఆలయం, నాగశిలలు కనుపిస్తాయి.

భాద్రపద మాసం నెలరోజులు ఇక్కడ పూజలు, ఉత్సవాలు, కృత్తికనాడు కావడి ఉత్సవాలు, పరమోత్సాహంగా చేస్తారు. మ్రొక్కులు సరేసరి. ఆనందమే ఆనందం ఈ సుబ్రహ్మణ్యం.

చిత్తూరుదగ్గరలోని పుంగనూరులో 'సుగుటూరు గంగమ్మ' అను గ్రామదేవత ఆలయం వుంది. ఈమె జమీందార్ల కులదేవతకూడా! ఇప్పుడు ఈ అమ్మవారిని పూజించే సుగుటూరు వంశస్థులు, ఒకప్పుడు వ్యవసాయకూలీలు. వారిలో ఒకతను మధ్యాహ్నం భోజనం చేసి విశ్రమిస్తూంటే, ఒక కృష్ణసర్పం పడగ పట్టడాన్ని ఒక తపస్వి చూసి, అతన్ని ఆశీర్వదించి, విజయనగర రాజులు దాచిన నిధి నిక్షేపాలు, అందులోవున్న గంగమ్మ తల్లి గురించి ఆరాధించుకుని రాచరికం పొందమని ఆశీర్వదిస్తాడు.

ఆ రకంగా గంగమ్మతల్లి స్వయంవ్యక్తయై సుగుటూరు వంశస్తులను, గ్రామస్థులకు కులదైవం, గ్రామదైవ మైంది. ఇక్కడ ఉగాది పండుగకు ముందు రోజు జరిపే జాతర చూడవలసిందే. ఇందుకు తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలనుండి, ఈ ప్రాంతాలవారికి తోడుగా ఎందరో వచ్చి ఆ తల్లి వేడుకలలో పాల్గొని తమ మ్రొక్కులు చెల్లించుకుని ఆనందిస్తారు.

## గోవింద రాజస్వామి దేవాలయం - తిరుపతి



ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరుజిల్లా తిరుపతి రైల్వేస్టేషన్ సమీపంలో గల ప్రముఖ దేవాలయములలో గోవిందరాజస్వామి దేవాలయం ఒకటి. క్రీ.శ. 1624 ప్రాంతంలో విజయనగర రాజుల సామంతరాజు అయిన కుమార అనంతరాయలు వారు నిర్మించిన ఈ దేవాలయ గోపురం తిరుమల తిరుపతికెళ్ళు భక్తులకు ముందుగా దర్శనమిస్తుంది. క్రీ.శ. 1135లో రామానుజాచార్యులు వారు నిర్మించిన ఈ ఆలయము గోవింద రాజ పట్టణముగా తిరుపతిని చెప్పుకుంటాడు.

శ్రీనివాసుడు పంపిన ధనమంతా కొలిచి అలసిపోయిన గోవిందరాజస్వామి భార్యలిద్దరూ పాదాలొత్తుచుండగా వెండి కుంచం తల క్రింద పెట్టుకుని శయనించినట్లు ఉంటారు. నాభియందలి పద్మములో బ్రహ్మ ఉంటాడు. ఇక్కడ సంతానగోపాలస్వామి ఆలయం కూడా ఉంది. మూడు ప్రాకారములుగా ఉన్న ఈ ఆలయములో లక్ష్మిదేవి, ఆళ్వారుల మండపములు, తిరుమల నంబి మండపము మొదలగు దేవాలయములు కలవు. ఆలయము వెలుపల ప్రధాన అర్చకులు ప్రతినిత్యము స్వామివారికి నివేదించిన ప్రసాదము విక్రయిస్తూ ఉంటారు. ఆలయమునకు ఎడమవైపున తిరుపతి దేవస్థానము వారి మ్యూజియం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆలయమునకు ఎదురురోడ్డులో స్వామి వారి పుష్కరిణి, దాని ప్రక్కనే యాత్రికుల వసతి గృహములు, బస్సు స్టాండు కలవు. ఈ గోవిందరాజస్వామి దేవాలయంలోనే పార్థసారధి దేవాలయం, గోదాదేవి ఆండాళ్ దేవాలయం, పుండరీకవల్లి దేవాలయాలు కూడా భక్తులు దర్శించదగినవి.

## తిరుపతి - తిరుమల



తిరుపతి చేరు భక్తులు ప్రతిరోజు ఉదయం గం.3.30ని.ల నుండి రాత్రి గం.11.00వరకు ప్రతి మూడు నిమిషాలకు తిరుమలకు బస్సు మీద వెళ్లవచ్చును.

తిరుపతి నుంచే కాక రేణిగుంట, గూడూరు నుంచి కూడా దేవస్థానము బస్సులలో తిరుమల చేరవచ్చును. టాక్సీలు, జీపులలో కూడా తిరుమల చేరవచ్చును.

**కాలిబాట :** అలిపిరి నుండి 11కి.మీ. దూరం గల కాలిబాటలో సుమారు 4,000 మెట్లు భక్తులు ఎక్కవలసి ఉంటుంది. శ్రీవారి పాద మండపం నుండి మైసూరు గోపురంనకు 300 మెట్లు, గాలిగోపురంనకు 2,100 మెట్లు, గాలి గోపురం నుండి శ్రీవారి సన్నిధికి 1650 మెట్లు భక్తులు ఎక్కవలసి ఉంటుంది. కాలిబాటలో ఉన్న వైకుంఠ పెరుమాళ్లు కోవెల, ఆంజనేయ స్వామి కోవెల, లక్ష్మినరసింహస్వామి కోవెల, యోగ నరసింహస్వామి కోవెల దర్శించుకుని ముందుకు వెడితే జింకల పార్కు మీదుగా బస్సు రూటు వస్తుంది. కొంత దూరం బస్సు రూటులో నడిచి మోకాళ్ళు పర్వతము మీదుగా తిరుమల చేరవలెను. మెట్టుమెట్టుకు ఒకనామం – భక్తులకు పుణ్య ఫలం లభిస్తుంది. తిరుమల కాలినడకన చేరగోరు భక్తులు తమ సామానులను అలిపిరి వద్ద యిచ్చి తిరుమల కేంద్ర విచారణ కార్యలయం వద్ద ఉచితంగా తిరిగి పొందవచ్చును.

## తిరుమల - తిరుపతి దేవస్థానం - తిరుమల



దేశంలోనే అత్యంత ప్రాచీనమైన దేవాలయం ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా తిరుపతిలోని సప్తగిరిపై వెలసిన శ్రీ వేంకటేశ్వర దేవాలయం, భారతదేశంలోని ప్రజలేకాక విదేశీ యాత్రికులు కూడా దర్శించుకునే ఈ పవిత్ర దేవాలయంలో కొలువైన స్వామి శ్రీ వేంకటేశ్వర స్వామి.

శ్రీ రామానుజులు వారి పాదస్పర్శతో పవిత్రమైన ఈ ప్రదేశం నిత్యము లక్షలాది భక్తులతో నిత్య కళ్యాణం పచ్చతోరణంలా వెలుగొందు తోంది. నిత్య కళ్యాణ చక్రవర్తి శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య మంగళ స్వరూపాన్ని భక్తులు గోవిందా, గోవిందా అంటూ దర్శించుకోవటం ఈ క్షేత్ర విశేషం. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా భక్తుల పాలిట కల్పతరువుగా కలియుగ ప్రత్యక్షదైవంగా వెలసిన ఈ స్వామి స్వయంభువని చెబుతారు. దేవతలు సైతం ఈ దేవాలయానికి వచ్చి స్వామి అనుగ్రహ పాత్రులవుతుంటారని పురాణ ప్రశస్తి.

ఈ తిరుమలను కృతయుగంలో వృషాచలంగా, త్రేతాయుగంలో అంజనాచలం, ద్వాపరంలో శేషాచలమని

ఈ కలియుగంలో వేంకటాచలమని పిలువబడుతుంది. పురాణగాధ అందరికి తెలిసిందే. చరిత్రకు వస్తేమాత్రం పల్లవ, చోళ, పాండ్య విజయనగర రాజులే కాదు, ఎందరో ప్రభువులు ఈ స్వామిని దర్శించి, తమ శక్తి భక్తికొలది ఆభరణాలు, మాన్యాలను ఇచ్చారు. ఇవన్నింటిని అసంఖ్యాక శాసనములు తెరచి, తరచి చూడలేని చరిత్రను, భక్తిని తెలుపుతాయి. భవిష్యోత్తరపురాణంలో శ్రీవేంకటాచల మహాత్మ్యం వుంది. ఇంతకు మించి ఎన్నో లీలలు, కథలు, గాధలు కోకొల్లలుగా మనకు దర్శనమిస్తాయి.

19వ శతాబ్దంవరకు తిరుమలపై, ఆలయంతోపాటు హథీరాంజీ మఠం తప్ప మరొకటిలేదు. 1870 నుండి సౌకర్యాలకు అంకురార్పణ చేసారు. చరిత్రలో మాత్రం ఎందరు రాజులు, రాణులు ఎన్నివిధాల స్వామిని సేవించి తమ భక్తిని ప్రకటించుకున్నారంటే చెప్పలేని అనంత చరిత్ర ఆ వేంకటాచలునిది. ఇక ఆలయం. ఆలయవిషయానికి వస్తే, అదివర్ణించడానికి అసాధ్యం. అపురూపశిల్పాలు, అఖండ శాసనాలు, స్వామివారి దర్శనం, పవిత్ర పుష్కరణిస్నానం, వివిధ తీర్థాలు, ప్రతిఒక్కటి దర్శించవలసిందే. తరించవలసిందే. అయితే ఈనాడు స్వామిని సేవించగలమా? అంటే అయితేకార్యనిర్వహణాధికారి, ఆలయపాలక అధ్యక్షుడు, ముఖ్యంగా ప్రధాని, రాష్ట్రపతులు అంగుళం అంగుళం చూడవచ్చును. కొందరి ప్రముఖులకు కొంత వెసులుబాటు సామాన్యులకు 'పోయ్యా! పోయ్యా!' అనే ఆహ్వానాలు అడ్డంతిరిగితే అరెస్టులు, ప్రసాదాలు, దర్శనాలనుండి ప్రతీదీ వ్యాపారమైకూర్చుంది. విమర్శించడంకాదు, కలి'కాల'మహిమగా చెప్పుకుని బాధ పడాలి. 1960 వరకు ఈ బాధలులేవు. ఇప్పుడు భక్తులు, విరజిమ్మగల అపారధనరాశులు, అధికార మదమత్తు, అడుగడుగు దండాలవానిని శాసిస్తున్నాయనడంలో తప్పు కనబడదు.

ఎంతో తేజోమయుడైన శ్రీ వేంకటేశ్వరుడు శ్రీ మహావిష్ణువు యొక్క అవతారమని భక్తుల ప్రగాఢ విశ్వాసము. నవరత్న ఖచితమైన దివ్య ఆభరణములతో, పట్టు పీతాంబరాలు, నాగాభరణాలతో ఊర్ధ్వ హస్తాలలో శంఖు - చక్రాలు ధరించిన వైకుంఠ వాసుని ఆనాదిగా సేవించి తరించే వారెందరో .....

## శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం



వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా భక్తులు పరుగు పరుగున శ్రీవారిని దర్శించుకోవడానికి ఉవ్విళ్లూరుతూ ముందు ఉన్న పిల్లలకు, వృద్ధులకు ఇబ్బంది కలిగిస్తారు. ఈ పుస్తకం చదివిన వారైనా దయచేసి ప్రక్క వారికి ఇబ్బంది కలుగకుండా చూసుకుంటూ ముందుకు నడవండి.

ముందుగా స్వామి వారి దేవాలయం మహాద్వారము వస్తుంది. అక్కడ నుండి ఎడమవైపు మీరు తిరుగ్గానే రంగనాయకుల మండపము, తిరుమల రాయల మండపం దర్శించుకోండి. తులాభారం తూగగోరే భక్తులు ఇక్కడ సంప్రదించవచ్చును. మండపం వెనుక నుండి నడిచి కుడి ప్రక్కకు తిరిగితే "తోడరమల్" విగ్రహాలు చూసుకుంటూ ముందుకు నడిస్తే ధ్వజస్తంభము, బలిహార పీఠములు కనిపిస్తాయి. భక్తులు 2వ ప్రాకారములో ఎడమవైపు వరదరాజస్వామి దేవాలయము దర్శించుకుని శ్రీవారి గరుడ మండపంలోనికి చేరుతారు. అక్కడ నుండి కొంచెము ముందుకు నడిస్తే బంగారు వాకిలి, శయనమందిరం, స్వామివారి గర్భాలయం ఉంటాయి. బంగారు వాకిలి నుండే భక్తులు వెనుకకు వెళ్లవలసి

ఉంటుంది. అక్కడ నుండి కుడివైపుగా తిరిగి శఠారి (పాదుకలు) తీసుకుని స్వామివారి వెనుకవైపు పరకామణి (స్వామివారి దక్షిణలు లెక్క పెట్టు స్థలము) చూసుకుంటూ విమాన వేంకటేశ్వరుని దర్శించుకోవాలి. అక్కడనుండి ముందుకు నడిచి తాళ్లపాక వారి దేవాలయం, రామానుజు వారి దేవాలయం, యోగ నరసింహస్వామి దేవాలయం దర్శించుకోవాలి. ఈ ప్రాంతములో స్వామివారికి సమర్పించుకొను కానుకలు భక్తులు హుండీలో వేయవచ్చును.

అక్కడ నుండి తిరిగి మొదటి ప్రాకారములోకి వచ్చి ఎడమవైపున ఉన్న ఉచిత ప్రసాదము తీసుకుని ఆయినామహల్ (అద్దాల మండపం), పూలబావి, ముఖమంటపం చూసుకుంటూ ప్రధాన ద్వారము వెలుపలకు రావాలి. మహాద్వారము గుండా వెలుపలకు వచ్చేటప్పుడు అక్కడే ఉన్న కృష్ణ దేవరాయల విగ్రహాలను దర్శించుకోండి. వెలుపలకు రాగానే ఎడమవైపు ప్రసాదాల కౌంటరు, స్వామి వారి పుష్కరిణి. ఎదురుగా స్వామివారి కర్పూర హారతి, దానికి దగ్గరలో పుష్కరిణికి ఎదురుగా స్వామివారి బంగారు రథము భక్తులు దర్శించుకొనదగిన పుణ్య స్థలములు.

## తిరుమలలోని ముక్తి తీర్థాలు

తిరుమల కొండ కృత యుగమున వృషభాద్రి అని, త్రేతా యుగమున అంజనాద్రి అని, ద్వాపరయుగమున శేషాద్రి అని, కలియుగమున వేంకటాద్రి అని పిలువబడుచున్నది. వేంకటాద్రి అని పిలువబడే ఈ తిరుమల గిరిపై ఉన్న చెట్లన్నీ దేవతలు, మృగాలన్నీ ఋషిశ్రేష్ఠులు, పక్షులన్నీ పితృదేవతలు, రాళ్ళన్నీ కిన్నెరలుగా భావింపబడుచున్నది.

ఈ వేంకటాచలంపై మొత్తం 65 కోట్ల పుణ్యతీర్థాలు ఉన్నట్లుగా బ్రహ్మాండ పురాణంలో తెలుపబడింది. అందులో ముఖ్యమైన 1008 పుణ్యతీర్థాలు ధర్మాసక్తిని, అందులో 108 జ్ఞానాన్ని, అందులో 68 తీర్థాలు వైరాగ్యాన్ని, అందులో 7 తీర్థాలు ముక్తిని ప్రసాదిస్తాయి. 1. స్వామి పుష్కరిణి 2. ఆకాశగంగ 3. పాపవినాశనం 4. పాండు తీర్థము 5. కుమారధార తీర్థము 6. తుంబురు తీర్థము 7. కృష్ణతీర్థము. ఈ పుణ్యతీర్థాలలో ప్రతి సంవత్సరము ఆయా తిథి నక్షత్ర సంయోగాన్ని అనుసరించి స్నానమాచరించినవారు మోక్షాన్ని పొందుతారు.

**స్వామి పుష్కరిణి :** ధనుర్మాసంలో శుక్ల ద్వాదశినాడు అరుణోదయ సమయంలో స్వామి పుష్కరిణి యందు సమస్త పుణ్య తీర్థాలు ప్రవేశిస్తాయి. ఆ సమయమున అందులో స్నానమాచరించిన వారికి తప్పక ముక్తి లభిస్తుంది. అనేక వేల జన్మల పుణ్యఫలం ఉంటేగాని ఇక్కడ స్నానము చేసే అదృష్టం ఉండదు. ఆ సమయంలో ఈ తీర్థములో స్నానం చేస్తే గంగానది పుణ్య నదులలో స్నానం చేసినంత పుణ్య వస్తుంది.





**పాప వినాశన తీర్థము :** ఆశ్వయుజ మాసంలో సప్తమి ఆదివారం ఉత్తరాషాఢ నక్షత్రము కలిసిననాడు ద్వాదశి ఉత్తరభాద్ర నక్షత్రములో కలిసిన రోజునైనా పాపవినాశన పుణ్యతీర్థములో స్నానము చేసిన మనుజుడు ముక్తిని పొందుతాడు. ఆ సమయంలో సాలిగ్రామ దానం చేస్తే పూర్వ జన్మలలోని పాపం సైతం నశిస్తుంది. శ్రీవారి ఆలయానికి 5 కి.మీ. దూరంలో ఇదివుంది.

**కుమారతీర్థము :** కుంభమాసంలో పూర్ణిమ మఖనక్షత్రము రోజున కుమారధారిక తీర్థములో స్నానము చేస్తే రాజసూయాగం చేసినంత పుణ్యం వస్తుంది. యోగ్యుడైన సత్పుత్రుడు లభిస్తాడు.

**తుంబుర తీర్థము :** సూర్యుడు మీనరాశిలో ఉండగా ఉత్తర ఫల్గుణి నక్షత్రంతో కూడిన పూర్ణిమనాడు తుంబుర తీర్థములో స్నానము చేసినా ఉపనయనం, కన్యాదానం కోసం ద్రవ్యం దానం చేసిన వారికి తిరిగి జన్మలేదు. ఇది ఆలయానికి ఉత్తరంగా 16 కి.మీ. దూరంలో ఉంది.

**కృష్ణ తీర్థము :** సూర్యుడు మకర రాశిలో ఉండగా పూర్ణిమనాడు పుష్యమి నక్షత్రం కలిస్తే కృష్ణ తీర్థములో స్నానము చేసిన వారికి సమస్త పాపములు నశించి కోర్కెలు తీరును.

**అళ్వారు తీర్థము - తిరుమల :** పూర్వము రామానుజాచార్యులు వారు శిష్యులైన ఆనంద ఆళ్వరును స్వామి వారికి పూల కోసం నియమించారు. ఆనందాళ్వారు తిరుమల యందు నివాసము ఏర్పరచుకొని పూలవనము పెంచుటకు తటాకమును నిర్మింపదలచినారు. ఆళ్వారు మట్టి తవ్వగా ఆయన భార్య మట్టిని తీసుకొని పోయి దూరంగా పోయిచుండెను. ఆది చూసి శ్రీ వేంకటేశ్వరస్వామి బాలుని రూపములో అక్కడకు వచ్చి సాయం చేయగా ఆళ్వారుకు భార్యపై కోపము వచ్చి గర్భవతి అయిన భార్యను రాయి పెట్టి కొట్టెను. అప్పుడు బాలుని రూపంలోని స్వామి గెడ్డమునకు ఆ రాయి తగిలి రక్తము కారుచుండగా, ఆళ్వారు అక్కడకు రాగా స్వామి రూపములోని బాలుడు అదృశ్యమయ్యెను. ఆళ్వారు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయమునకు వెళ్ళి దర్శనము చేసుకొనగా స్వామివారి గెడ్డము నుండి రక్తం కారుచుండగా స్వామి బాలుని రూపమున తన దగ్గరకు వచ్చి సాయపడెనని తలచి బాధపడెను. స్వామి గెడ్డమునకు పచ్చకర్పూరం పెట్టెను. అప్పటి నుండి స్వామి వారి గెడ్డమునకు పచ్చకర్పూరం పెట్టెదరని చెబుతారు. ఆళ్వారు తవ్విన తటాకము వద్దనే స్వామివారి పూల తోటకలదు. ఈ తటాకమునే ఆళ్వారు తీర్థము. ఆళ్వారు చెరువు అంటారు.

**పాండు తీర్థము :** వృషభ మాసంలో శుక్ల పక్షములో గాని, కృష్ణ పక్షంలో గాని, ద్వాదశి తిథినాడు ఆదివారం కాని, మంగళవారం గాని కలసివస్తే గంగ మొదలైన మూడు లోకాలలోని పుణ్య తీర్థాలు పాండు తీర్థములో కలుస్తాయి. అందువలన ఆ సమయంలో స్నానమాచరించిన ప్రతిబంధకాలు తొలగిపోతాయి. పాండు తీర్థమునే గోగర్భం అని కూడా అంటారు. పూర్వము పాండవులు అరణ్యవాసమున కొంతకాలము ఇచ్చట ఉండి ప్రతిరోజు ఈ తీర్థము నందు స్నానము చేసి తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించి తిరిగి తమ రాజ్యమును పొందినట్లు చెప్పబడుచున్నది. శ్రీవారి ఆలయానికి చాలా దగ్గరలో ఉన్న ఈ క్షేత్రములో క్షేత్రపాలక గుండు కూడా ఉండెడిదని, అర్చకులు గుడికి తాళము వేసి తాళం చెవులు ఈ గుండుపై ఉంచగా అది రాత్రివేళలో గుడి చూట్టూ తిరుగుతూ కాపలా కాసేదని ఒకసారి అర్చకుని కుమారునిపై ఈ గుండు పడి అతను మరణించగా అప్పటి నుండి అది ఇక్కడ ఉండుట భావ్యం కాదని గోగర్భమున ఉంచినట్లు చెప్పబడుచున్నది. అప్పటి నుండి ఇప్పటి వరకు ఆ గుండు ఈ తీర్థము వద్ద కలదు.

**ఆకాశ గంగ :** మాఘమాసంలో చిత్తా నక్షత్రయుక్త పూర్ణిమ తిథినాడు ఆకాశగంగలో స్నానము చేసిన మనుష్యుడు యాగాలు చేసిన పుణ్యం పొందుతాడు. ఆ సమయంలో సువర్ణదానం చేసిన కన్యాదాన ఫలం పొందుతారు.



తిరుమల శ్రీవారి సన్నిధి నుండి 3 కి.మీ. దూరంలో ఉంది. తిరుమల శ్రీవారి సన్నిధి నుండి మూడు కి.మీ. దూరంలో ఉన్న ఈ క్షేత్రమునకు భక్తులు నడిచి వెళ్ళవచ్చును. బస్సు సౌకర్యము కూడా కలదు. హిమాలయాల నుండి ప్రవహించు గంగ అంతర్ ముఖముగా వచ్చి ఇచ్చట బయల్పడినట్లు చెప్పబడుచున్నది. ఈ నీరు తాగుటకు చాలా బాగుగా ఉండును. ఈ నీటిని ప్రతిరోజు తిరుమల లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ అర్చకులు తీసుకువచ్చి అభిషేకమునకు ఉపయోగించెదరు. పూర్వము పుత్ర సంతతి లేని అంజనాదేవి మతంగ మహర్షి ఆదేశానుసారము వెంకటాచలమునకు విచ్చేసి ఆకాశ గంగ సమీపమున వాయుదేవుని గూర్చి తపస్సు చేసి వాయుదేవుని అనుగ్రహము వలన అంజనేయుని పుత్రునిగా బడసినట్లు చెప్పబడుచున్నది.

**కపిల తీర్థము :** తిరుమల నుంచి తిరుపతి వెళ్ళే బస్సు మార్గంలో శేషాద్రి పర్వత పాదంలో ఉన్న సుప్రసిద్ధ పుణ్య తీర్థమే కపిల తీర్థము. సుదూరం నుంచి కనబడే ఈ కపిల తీర్థ జలపాతము తిరుమల వెళ్ళు భక్తులకు



నయనానందకరం చేస్తుంది. కపిల తీర్థము సమీపించుసరికి ప్రవేశ ద్వారానికి అభిముఖంగా సర్వాంగ సుందరుడు అయిన నందీశ్వరుడు మనకు కనిపిస్తాడు. ఆ తర్వాత ప్రవేశ ద్వారము దాటిన తరువాత పశ్చిమాభిముఖంగా ఆళ్వారు ఆలయం కనిపిస్తుంది. పూర్వము కపిల మహర్షి ఈ ప్రాంతములో నివసిస్తూ ఈశ్వరుని పూజించుట వలన శివుడు కపిలేశ్వరుడు అయి నాడని జనశృతి. ఈ కపిల మహర్షి పేరు మీద ఈ క్షేత్రాన్ని కపిల తీర్థమని, ఆళ్వారు తీర్థమని వ్యవహరిస్తారు. తిరుమల పరిసర ప్రాంతాలలో సుప్రసిద్ధ శైవ క్షేత్రాలు రెండు ఉన్నాయి. అవి 1. జోగి మల్లవరం 2. కపిల తీర్థము. కార్తీక మాసములోనూ, పౌర్ణమి రోజులలో ఎక్కువ సంఖ్యలో భక్తులు ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటూ ఉంటారు. ఆగమశాస్త్రరీత్యా నిర్మించబడిన ఈ ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సూర్యనారాయణ, ఉమామహేశ్వర, చండీశ్వర, నవగ్రహ ఆలయాలు, నాగుల విగ్రహాలు ఉన్నాయి. కపిలేశ్వరస్వామి స్వయం భూలింగం అని భావింపబడుచున్నది. ప్రకృతి సౌందర్యానికి పెట్టింది పేరు అయిన కపిలతీర్థ పుణ్యక్షేత్రం ప్రతి హిందువు తప్పక దర్శించవలసినది.

**జాబాలి తీర్థము - తిరుమల :** తిరుమలలో ఉన్న 68 ముక్తి ప్రదమైన పుణ్య తీర్థాలలో జాబాలి తీర్థము ఒకటి. ఈ తీర్థము వద్ద హనుమంతుని దేవాలయం ఉంది. జాబాలి తీర్థము శ్రీవారి ఆలయానికి పశ్చిమాన పాపనాశనం వెళ్లే దారిలో ఆకాశగంగ దగ్గర ఉంది. స్వామివారి ఆలయానికి మూడు కిలోమీటర్ల దూరంలలో ఉన్న ఈ పుణ్య స్థలములలో జాబాలి మహర్షి ఆశ్రమం నిర్మించుకుని హనుమంతుని కొరకు తపము చేయగా హనుమంతుడు

ప్రత్యక్షమయ్యెను. జాబాలి మహర్షి తపస్సు గావించిన స్థలము జాబాలి తీర్థముగా ప్రసిద్ధి చెందినది. తిరుమలలోని స్థానికులు శ్రీహనుమత్ జయంతి సందర్భంగా ఈ తీర్థము దర్శించి పూజలు చేస్తుంటారు. ఇక్కడ ఆంజనేయస్వామిని దర్శిస్తే సకల దోషాలు పోతాయని, ఇక్కడ తీర్థములో స్నానమాచరిస్తే పంచమహాపాతకాలు నశిస్తాయని భక్తులు నమ్మకం. ఎత్తైన చెట్లు, చల్లని వాతావరణము, ప్రశాంతమైన స్థలము అయిన ఈ తీర్థము దర్శించుకునే భక్తులు ఆకాశగంగ దగ్గర బస్సుదిగి 1 కి.మీ. పాద యాత్ర చేయవలసి ఉంటుంది.

## శ్రీవారి పాదాలు - తిరుమల



సుమారు ఎనిమిది శతాబ్దాల క్రితం ప్రతిరోజు ఉదయాన్నే ప్రముఖ వైష్ణవుడు తిరుమల నంబి కొండదిగి ఇక్కడకు వచ్చేవాడట. అలాగే గోవిందరాజస్వామి దేవాలయం నుండి అలిపిరికి శ్రీ రామానుజాచార్యులు వచ్చేవారట. నంబి గారి దగ్గర రామానుజా చార్యులు వారు రామాయణ రహస్యాలు తెలుసుకొనెడి వారట. పాఠం ముగిసిన తరువాత ఆచార్యులువారు గోవిందరాజస్వామి గుడికి వెళ్ళగా తిరుమల నంబి కొండకు వెళ్ళి శ్రీవారి పాదములను అర్చించేవారుట. ఇది వీరి దిన చర్య. ఒకరోజు గురుశిష్యులు ఇద్దరు రామాయణ చర్చలో నిమగ్నమై ఉండగా కాల హరణం జరిగింది. గోవిందరాజస్వామి దేవాలయం లలో నైవేద్య ఘంటా నాదం వినవచ్చింది. అప్పుడు తిరుమల నంబి తేరుకుని నా స్వామి పాదాలను ఈ ఉదయం సేవించ లేకపోయానే అని బాధపడుచూ శ్రీ వేంకటేశ్వరుని ప్రార్థించగా స్వామివారు తన పాదాలను ఆ గురుశిష్యులు ఉన్న చోటనే సాక్షాత్కరింపజేశారట. అవే నేడు అశేష భక్త జనావళి దర్శించుకునే శ్రీవారి పాదపద్మములు. తరువాత శ్రీ మల్ల అనంత భూపాలుడు, మండపము, గోపురం నిర్మించాడుట. ఇక్కడ నుండే భక్తులు "గోవిందా! ఏడుకొండల వాడా గోవిందా!!" అంటూ వెంకటరమణుని కొలుస్తూ ముందుకు సాగుతారు.

**కళ్యాణకట్ట :** లక్షలాది భక్తజన సందోహం తిరుమల చేరి తమ కోర్కెలు తీర్చిన ఏడుకొండల వెంకటరమణకు ముందుగా తమ తలనీలాలు సమర్పించే స్థలమే కళ్యాణకట్ట. స్వామి వారి దేవాలయమునకు దగ్గరగా ఉన్న ఈ కళ్యాణకట్టలో బీద, ధనిక, ఆడ, మగ, పిల్లలు, పెద్దలు తారతమ్యం లేకుండా తలనీలాలు సమర్పించుకుంటారు. నాలుగు అంతస్థుల ఈ భవనంలో మ్రొక్కుబడులు తీర్చుకుని తమ బాధలను వేంకటేశ్వరునికి విన్నవించుకుంటారు.

## రంగ రంగ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవ సంబరాలు



అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన తిరుమలలోని శ్రీవారి బ్రహ్మోత్సవాలు దేవస్థానం వారు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. చతుర్ముఖుడైన బ్రహ్మ ఈ ఉత్సవాలు నిర్వహించారు. కావున ఈ ఉత్సవాలకు బ్రహ్మోత్సవాలు అనే నామకరణం జరిగిందని అంటారు. క్రీ.శ. ఏడవ శతాబ్దము నుండి శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగు తున్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది.

భక్తుల మదిలో పదికాలాల పాటు గుర్తుండే ఈ బ్రహ్మోత్స వాలలో మొదటి రోజు అంకురార్పణ, రెండవ రోజు ధ్వజారోహణము, మూడవ రోజున శేషవాహనం, హంసవాహనము, నాలుగోవ రోజున సింహ వాహనం, ముత్యపు పందిరి వాహనం, ఐదవ రోజు కల్ప వృక్ష వాహనము, సర్వ భూపాల వాహనం నిర్వహిస్తారు. ఆరవ రోజున కన్నుల పండుగగా మోహిని అవతారం, గరుడోత్సవము నిర్వహిస్తారు. ఏడవ రోజున హనుమంత వాహనం, గరుడ వాహనోత్సవము, ఎనిమిదవ రోజున సూర్యప్రభ, చంద్రప్రభ వాహనోత్సవములు, తొమ్మిదవ రోజున పెద్ద ఎత్తున ఆశ్వవాహనోత్సవము, శ్రీవారి రథోత్సవము జరుగుతాయి. పదవ రోజున పల్లకి ఉత్సవము, చక్ర స్నానము, ఆనంతరం ధ్వజావరోహణోత్సవాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

**వరాహాస్వామి దేవాలయం - తిరుమల :** తిరుపతి నుండి తిరుమల చేరు భక్తులు ముందుగా దర్శించుకొను పుణ్యస్థలము శ్రీ వరహాస్వామి దేవాలయం. స్వామి పుష్కరిణి ప్రక్కనగల ఈ దేవాలయంలో స్వామిని దర్శించుకుని శ్రీ వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకోవాలి. అప్పుడే వేంకటేశ్వర దర్శనఫలం లభిస్తుంది.

## తిరుమల గిరి నామావళి




ఆంధ్రప్రదేశ్‌లోనని ప్రసిద్ధ గిరి క్షేత్రములలలో తిరుమలగిరి అగ్రస్థానములో ఉంది. తిరుమల నాథుడైన శ్రీ వేంకటేశ్వరుడు క్షేత్ర నామముతోనే కాక ఏడుకొండలవాడనని, వేంకటాచలపతి అని పిలువ బడుచున్నారు. వేంకటేశ్వరస్వామి నివాసము శ్రీ నిలయం, శేషాశైలము, గరుడాచలం, వెంకట్రాది, నారాయణాద్రి, వృషభాద్రి, వృషాద్రి అనే ఏడునామాలలో పిలువబడుచున్నది.

**శ్రీశైలము:** శ్రీ అంటే సంపద. లక్ష్మి అనే అర్థాలు, శైలము అంటే కొండ, పర్వతము అనే అర్థాలు ఉన్నవి కనుక భక్తులకు 'శ్రీ' ప్రదమైంది కావడం వల్ల, లక్ష్మిదేవి దీనిపై నివసిస్తుండటం వల్ల ఈ కొండకు శ్రీశైలం అని పేరు వచ్చినది.

**శేషశైలం:** శ్రీ మహా విష్ణువు తల్పం అది శేషుడని, బ్రహ్మాండ పురాణంలో చెప్పబడినట్లు శ్రీ మహా విష్ణువు శ్రీనివాసుడుగా భూలోకములో నివసించడం కోసం, అదిశేషుని భూలోకములో పర్వత రూపము ధరించమని ఆజ్ఞాపించినట్లు ఆ పర్వతమునకు శేషశైలమని పేరు వచ్చినట్లు తెలుస్తోంది.

**గరుడాద్రి:** శ్రీ మహావిష్ణువు యొక్క వాహనం పక్షిరాజైన గరుత్మంతుడు శ్రీనివాసుని భూలోక నివాసార్థం వరాహస్వామి ఆజ్ఞచే వైకుంఠం నుంచి ఈ పర్వతం గరుత్మంతునిచే తీసుకురావడం వల్ల దీనికి గరుడాద్రి అని పేరు వచ్చినట్లు పురాణంలో చెప్పబడినది.

**వేంకటాద్రి:** వరాహ పురాణంలో వేంకట శబ్దానికి వ్యుత్పత్తి చెప్పబడింది. 'వేం' అంటే అమృతమని, 'కటం' అంటే ఐశ్వర్యమని అర్థం. ఈ పర్వతం ఆశ్రితులకు అమృతత్వాన్ని, ఐశ్వర్యాన్ని అనుగ్రహిస్తుంది. కాబట్టి దీనికి 'వేంకటాద్రి' అని పేరు వచ్చినది.

**వృషభాద్రి:** పూర్వం ఈ పర్వతంపై వృషభుడనే రాక్షసుడు తపస్సు చేసి శ్రీమన్నారాయణుని మెప్పించి తన పేరుతో ఈ పర్వతం పిలువబడాలని కోరగా స్వామి అనుగ్రహించాడు. అప్పటి నుండి ఈ పర్వతం వృషభాద్రిగా పిలువబడుచున్నదని బ్రహ్మాండ పురాణం ద్వారా తెలుస్తోంది.

**వృషాద్రి:** వృష అంటే ధర్మమని అర్థము. ధర్మం తన అభివృద్ధి కోసం ఈ పర్వతం మీద తపస్సు చేయడం వల్ల దీనికి వృషాద్రి అని పేరు వచ్చిందని వరాహ పురాణంలో చెప్పబడింది.

**అంజనాద్రి:** అంజనేయుని తల్లి, వానర రాజైన కేసరి భార్య అంజనాదేవి. ఆమె పుత్ర సంతానం కోసం మతంగముని చెప్పినట్లుగా తపస్సు చేసి వాయుదేవుని వర ప్రభావంతో మహాబలశాలి, తేజోవంతుడు అయిన పుత్రుని కన్నది. ఆ అంజనాదేవి తపస్సు చేయడం వల్ల దీనికి అంజనాద్రి అనే పేరు కలిగినట్లు పురాణాలలో చెప్పబడుచున్నది.

## స్వామి వారి వారం - సేవలు, ఉత్సవములు



**1. విశేష పూజ:** ప్రతి సోమవారం ఉదయం గం. 6.00లకు జరుగుతుంది. ఐదుగురు భక్తులకు దర్శన సదుపాయం ఉంటుంది. పూజ ఆనంతరం వస్త్రము, ఐదు పెద్ద లడ్లు, ఐదు వడలు ఇస్తారు.

**2. అష్టదళ పాదపద్మారాధన సేవ:** 108 బంగారు పుష్పములతో జరుగు సేవ ప్రతి మంగళవారం ఉదయం గం. 6.00లకు జరుగుతుంది.

**3. సహస్ర కలశ అభిషేకము:** ప్రతి బుధవారం గం॥ 5.30 నిమిషాలకు జరిగే ఈ సేవలో భక్తులు పాల్గొనవచ్చును.

**4. తిరుప్పావడ :** ప్రతి గురువారం ఉదయం జరిగే ఈ సేవలో భక్తులు పాల్గొనవచ్చును. వస్త్రము మరియు ప్రసాదము ఇస్తారు. శ్రీవారి నేత్ర దర్శనం ఈ రోజు ప్రత్యేకత.

**5. అభిషేకము :** ప్రతి శుక్రవారం తెల్లవారుజామున సుప్రభాతం తరువాత జరిగే ఈ సేవలో పాల్గొను భక్తులు పూరాభిషేకమునకు, అభిషేకమునకు , కస్తూరి అభిషేకమునకు అవకాశం ఉంటుంది.

**6. విశేష వస్త్రాలంకార సేవ :** దంపతులను దర్శనమునకు అనుమతిస్తారు. ఉత్తరీయంతో పాటు, రెండు చిన్న లడ్లు, రెండు వడలు, ఇతర ప్రసాదములు ఇస్తారు.

పై సేవల వివరాలు తెలుసుకొనువారు తిరుపతిలోని కార్యనిర్వహణాధికారి లేదా తమ తమ ప్రాంతాలలో వుండే సమాచారకేంద్రాలలో కూడా తెలుసుకొనవచ్చును.

## స్వామి వారికి జరిగే రోజువారి సేవలు

1. సుప్రభాత దర్శనం, 2. తోమాల సేవ, 3. అర్చన, 4. నిజపాద దర్శనం (ప్రతి శుక్రవారం),
5. తోమాల సేవ మరియు అర్చన (ప్రతి శుక్రవారం), 6. అమృతోత్సవము, 7. అర్చనానంతర దర్శనం
8. ప్రత్యేక దర్శనం, సర్వదర్శన వేళల్లో, 9. ఏకాంత సేవ.

పై సేవలు 1 నుండి 6 వరకు ముందు రిజర్వు చేసుకొనవలయును.

ప్రత్యేక దర్శనం మరియు ఏకాంత సేవ టిక్కెట్ తీసుకున్న వారిని రాత్రి సర్వదర్శనం అయిన తరువాత అనుమతిస్తారు.

పై టిక్కెట్లు తీసుకున్న వారు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌కు అరగంట ముందుగా రావాలని కోరుచున్నారు.




**సుప్రభాతం :** వేద పండితులలో ఉచ్ఛరించబడుతుంది. 200 మందికి మాత్రమే అవకాశమున్న ఈ సేవ ఆర్జితసేవగా నిర్ణయించబడింది.

**తోమాలసేవ :** ఒకరోజు ముందుగా దీనిని ఖరారు చేసుకోవచ్చు.

## సుదర్శనం

- తిరుమల చేరు భక్తులు స్వామి వారి దర్శనం కొరకు ఎక్కువ సమయం వృథా అవ్వకుండా తిరుమల తిరుపతి దేవస్థానం వారు "సుదర్శనం" పథకం ప్రవేశ పెట్టడం జరిగినది.
- తిరుపతి చేరు భక్తులకు ఉచితంగానూ, త్వరితంగాను "సుదర్శనం" ఉపయోగపడుతుంది.
- తిరుపతిలోని రైల్వేస్టేషన్ ఎదురుగా (చౌల్ట్రీ-1)లోనూ, రైల్వేస్టేషన్ వెనుక ఉన్న (చౌల్ట్రీ-2) లోనూ, అలిపిరి బస్‌స్టాండ్ వద్దనూ, పి.పి.సి. బస్‌షెడ్స్ వద్దనూ, తిరుమలలోని సి.ఆర్.ఓ. ఆఫీసుకు దగ్గరలోనూ ఈ సుదర్శనం టోకెన్సు గురించి తెలుసుకొనవచ్చును.
- సుదర్శనం టోకెన్ తీసుకున్న వారు వైకుంఠం క్యూకాంప్లెక్స్ దగ్గర రూ. 5/- ఇచ్చి లడ్డు తీసుకొనవచ్చును.
- ఈ సుదర్శనం టోకెన్ తీసుకున్న భక్తులకు టోకెను ఉన్న సమయం నుండి గం. 2.00ల లోపు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకోనవచ్చును.
- భక్తులు ఈ సుదర్శన టోకెను తీసుకొని దగ్గరలోని ఇతర ప్రాంతాలు దర్శించవచ్చును.
- ఈ సుదర్శనం టోకెన్సు గ్రూపులుగా ఇవ్వరు. ఎవరికి వారు వచ్చి టోకెను పొందవలసి ఉంటుందని, తిరుమల తిరుపతి దేవస్థాన కౌంటర్లులోనే వీటిని పొందవలసి ఉంటుందని, టోకెన్సు ఏట్టి పరిస్థితులలోనూ చేతి నుండి తీయరాదు.
- టోకెన్సు తీసుకున్న వారు వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా వెళ్ళవలసి ఉంటుందని, ఇతరుల వద్ద కొన్నవారిని, ఇతరుల నుండి మార్చుకున్న వారిని దర్శనమునకు అనుమతించరని దేవస్థానం కార్యనిర్వాహణాధికారులు తెలియజేస్తున్నారు.
- ఈ సుదర్శనం గురించి దర్శనాలు, ఆర్జిత సేవల గురించిన వివరములు కావలసిన వారు టి.టి.డి. ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో అడిగి తెలుసుకొనవచ్చును.

## సర్వసిద్ధి ప్రదాయిని - అలమేలుమంగ



తిరుపతికి అత్యంత సమీపంలోని తిరుచానూరు గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామివారి పట్టపుదేవి శ్రీఅలమేలు మంగ ఆలయంవుంది. ఇది తిరుమల వచ్చి శ్రీవారిని దర్శించుకున్న యాత్రికులలో అత్యధిక శాతం భక్తులు తప్పనిసరిగా దర్శించుకునే దివ్యక్షేత్రం. ఈ క్షేత్రములో అమ్మవారిని పద్మావతి అమ్మవారుగా పిలుస్తారు. కరుణా మయిగా, శాంతిని ప్రసాదించే జగన్మాతగా సర్వసిద్ధి ప్రదాయినిగా కొలిచే ఈ పద్మావతి అమ్మవారు సుమారు ఐదువేల సంవత్సరాల క్రితం తిరుచానూరులోని పద్మ

సరోవరంలో సహస్ర దళాలు కలిగిన బంగారు కమలంలో కార్తీకమాసం, శుక్లపక్షం పంచమి శుక్రవారం ఉత్తరాషాడ నక్షత్రం రోజున శ్రీ వేంకటేశ్వరుని కోరికపై జగత్కళ్యాణం కోసం పద్మావతి అమ్మవారుగా ఈ కోవెలలో వెలసి నిత్యం అశేష భక్తుల పూజలు అందుకొనుచున్నదని చెప్పబడుతోంది. ఈ అమ్మవారికి ప్రతీ ఏటా కార్తీక మాసములో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

తిరుమలలోని శ్రీవారికి అలంకరించిన పుష్పమాలికను ఈ బ్రహ్మోత్సవాల సమయంలో పంచమి రోజున పద్మావతి అమ్మవారికి పంపుతారు. ఈ పుష్పమాలికతో పాటు శ్రీ స్వామివారికి చెందిన పసుపు కుంకుమలతో పాటు పట్టుచీర, రవికలు ప్రసాదములతో కొండపై నుండి తిరుచానూరులోని అమ్మవారికి ఆలయ మర్యాదలతో పంపిస్తారు. అదే రోజున అమ్మవారికి పల్లకి ఉత్సవము కన్నుల పండుగగా జరుగుతుంది. చివరి రోజున జరిగే ఉత్సవములో లక్షలాదిమంది భక్తులు ఆలయం వద్ద ఉన్న పవిత్ర పుష్కరిణిలో స్నానమాచరించి శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకుని పునీతులవుతారు.

> **తిరుమలలో మ్యూజియం:** 10,11,12 శతాబ్దాలనాటి విగ్రహాలు వందల సంవత్సరాల నాటి సంగీత వాయిద్య పరికరాలు, అప్పటి ఆయుధాలు అన్నింటిని మించి స్వామి వారి పాదాలు చూడొచ్చు. మ్యూజియంలోకి ఇప్పుడు ఉచిత ప్రవేశము కలదు.

## శ్రీనివాస మంగాపురం - కళ్యాణవేంకటేశ్వరస్వామి

తిరుమల నుండి బాకారాపేటకు వెళ్ళే మార్గములో తిరుపతి నుండి 10కి.మీ. దూరంలో చంద్రగిరి నుండి సుమారు 2 కి.మీ. దూరంలో శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం ఉన్నది. ప్రతి నిత్యం తిరుమల వచ్చు భక్తులు శ్రీనివాస మంగాపురంలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటూ ఉంటారు. ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీన, కార్తీకమాస పర్వదినములలో పెద్ద సంఖ్యలో భక్తులు ఈ క్షేత్రమును దర్శించుకుంటారు.




అతి మనోహరమైన ప్రధాన గోపురం దాటిన తరువాత గర్భగుడి ప్రాంగణము వచ్చును. మూలవిరాట్టు ఉన్న గర్భగుడి ముందు విశాలమైన కట్టడము కలదు. మూలవిరాట్టు ఎదురుగా గరుడాళ్వారు వెలసి ఉన్నారు. శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహం చాలా ఎత్తు అయినది. స్వామితోపాటు శ్రీలక్ష్మినారాయణస్వామి, శ్రీదేవి, భూదేవి, వేణుగోపాలస్వామి, కోదండ రామస్వామి వార్ల ఉత్సవ విగ్రహములు కలవు. వేంకటేశ్వరస్వామి ప్రతిరోజు కళ్యాణము చేసుకుని మంగాపురంలో ఉండెడివారు అగుటవలన ఈ క్షేత్రమునకు శ్రీనివాస మంగాపురం అని పేరు వచ్చింది. శ్రీవారు వాహ్యాళికి వెళ్ళిన ప్రదేశము శ్రీవారి మెట్టగా ప్రసిద్ధి గాంచినది. ఈ శ్రీవారి మెట్ట నుండి తిరుమలకు చాలా దగ్గర దారికలదు. శ్రీనివాసమంగాపురం ప్రక్కనే స్వర్ణముఖినది ప్రవహించుచున్నది. ఇచ్చట ముక్కోటి అను ఉత్సవము బ్రహ్మాండముగా జరుపబడుతున్నది. మంగాపురంనకు సమీపంలో అగస్త్యేశ్వర ఆలయం కలదు. అగస్త్యేశ్వర స్వామి ఆహ్వానంపై శ్రీ

కళ్యాణవేంకటేశ్వరస్వామి కొద్ది నెలలు అగస్త్యేశ్వర ఆలయమున ఉండెనని భక్తుల విశ్వాసం. భక్తి, ఏకాగ్రతల సాధనకు శ్రీ కళ్యాణవేంకటేశ్వరుని సన్నిధి భక్తుల పాలిట పెన్నిధి.

అప్పలాయ గుంటలోకూడా శ్రీవేంకటేశ్వరాలయం వుంది. ఇదేకాదు, తిరుపతి చుట్టు ఏడు శ్రీవేంకటేశ్వరాలయాలు వున్నాయి. ఆ దేవదేవుడు సద్వ్యాప్తుడుకదా! అంతటా వెలసి భక్తజనులకానందం కల్గిస్తున్నాడు. కలిలో వేంకటేశ్వరుడు కరుణామయుడన్నది సత్యంగా శ్రీవేంకటేశ్వర దర్శనం సర్వత్రా జరుగుతుంది.

## శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం కాణిపాకం



సత్యధర్మ పరిపాలకుడుగా ఉన్న కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్థానం వారి దేవస్థానం. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా చిత్తూరు పట్టణమునకు 12కి.మీ. దూరంలో ఉంది. సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం బహుదా నది తీరంలో వరసిద్ధి వినాయకుడు స్వయంగా వెలిశారని ఎంత తవ్విన తుది లభించని ఈ స్వయంభువు సర్వాంగ సహితంగా నిత్యం పెరుగుతూనే వున్నారనడానికి నిదర్శనంగా స్వామివారికి ఒక భక్తుడు 50 సంవత్సరాల క్రితం సమర్పించిన వెండి కవచం నేడు సరిపోకపోవటమే నిదర్శనం. ఈ ఆలయంలో శ్రీ వినాయకస్వామివారి మోకాళ్లు, ఉదరం మాత్రమే మనకు కనబడతాయి. ఈ ఆలయ ప్రాంగణంలో ఎవరూ అసత్యం పలుకలేరు అన్నది లోక విదితమైన నమ్మకం.



నిజానికీ వరసిద్ధి వినాయక ఆలయాన్ని కులోత్తుంగ చోళుడు 11 శతాబ్దిలో కట్టించగా, 15వ శతాబ్దంలో విజయ నగరరాజులు అభివృద్ధి పరిచారనేది శాసనాల ద్వారా తెలుస్తున్న సత్యం. చరిత్రకువస్తే మూగ, చెవిటి, గ్రుడ్డి సోదరులు తమ పొలంలోని నుయ్యి ఎండిపోవడంతో దాన్ని విశాలపరదాలని చూస్తే గడ్డపారకు ఏదో తగిలి ఖంగుమనే శబ్దం నెత్తుటి బొట్లు వారి ముఖాలపై చిందడం, వారి అవిటి తనం పోవడంతో, గ్రామస్థులు ఆశ్చర్యపోతారు. రక్తప్రవాహం ఆగకపోయేసరికి 'స్వామీ, ఆలయం నిర్మిస్తామనే సరికి, రక్తం ఆగిపోతుంది. ఆ రకంగా వెలసిన స్వయంవక్త సర్వశక్తి సమన్వితుడే కాణిపాకం వరసిద్ధి వినాయకుడు.

ఇక ఇక్కడ వినాయకునితోపాటు, మణికంఠేశ్వరుడు, వరదరాజస్వామి, వీరాంజనేయుడు, నవగ్రహాలయా

లతో పాటు ఈ సత్యదేవుని దర్శనం సర్వసిద్ధిదాయకం, సకలాభీష్టదాయకమని చెప్పటంకాదు, సత్యమని ప్రకటించాలి.

ఈ ఆలయం ప్రాంగణంలో చెప్పే సాక్ష్యాలను చట్టం కూడా గౌరవిస్తుందని అంటారు. అలనాటి శిల్ప సౌందర్యాలను చాటి చెప్పే ఆలయ శిల్ప సౌందర్యంతో పాటు మణికంఠేశ్వర ఆలయం, వరదరాజాలయము కలిగి ఉన్న ఈ క్షేత్రం హరిహర క్షేత్రం. అనంత మహత్వ పరిపూర్ణమై శోభిల్లుతున్న ఈ క్షేత్రమునకు చిత్తూరు నుండి ప్రతి గంటకు బస్సు సౌకర్యము కలదు. చిత్తూరుకు రైలు సౌకర్యము కలదు. కాణిపాకంలో వసతి సౌకర్యం కలదు. చిత్తూరు జిల్లా ఐరాల మండలంలో ఉన్న స్వయంభూ శ్రీకాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానంలో శాశ్వత అభిషేకమునకు, శాశ్వత నిత్య పూజకు, శాశ్వత గణపతి హోమానికి, నిత్య అన్నదాన పథకమునకు భక్తులు తమ తమ విరాళాలను డిమాండు డ్రాఫ్ట్ పంపి సేవలు చేసుకొనవచ్చునని దేవస్థాన అధికారులు తెలుపుతున్నారు.

## సర్వసిద్ధి వినాయకుడు

కాణిపాకం తరువాత, చోడవరమే సర్వసిద్ధి వినాయక క్షేత్రమని చెబుతారు. చోడవర విఘ్నేశ్వరుని 15వ శతాబ్దిలో మత్స్యవంశరాజులు ప్రతిష్ఠించారుట. ఈ స్వామిని శివాలయంలో ప్రతిష్ఠించాలని చేసిన ప్రయత్నంలో వినాయకుని తుండం చివరి భాగం కనబడలేదుట. దానికోసం త్రవ్వితే ఆలయం ఎదురుగా గల పాతచెరువులో కొంత కనిపించిందని, మొత్తం తొండం లభించలేదని, దీనిని 'ఏనుగుబోద'గా పిలుస్తారు. కానీ దేవుడు మాత్రం దివ్యుడు. భక్తజనఅభీష్టప్రదాత. ఇది సత్యం. ఇక్కడి గౌరీశ్వరాలయం ఘనమైనది. ఘనత వహించినది. సదాప్రశంసించదగ్గది.

బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరుడు త్రిశూల పర్వతంపై 16వ శతాబ్దంలో చోళరాజులచే నిర్మితమైన పురాతన సనాతనాలయం. బలి చక్రవర్తి తపస్సుకు మెచ్చి బ్రహ్మ ఇక్కడ లింగప్రతిష్ఠ చేస్తాడు. కానీ అభిషేకించడానికి జలం లేకపోవడం, ఆసమయంలో వరాహావతారుడైన విష్ణువు హిరణ్యాక్షుడుని వెంటాడుతూ వెళుతూంటే 'బ్రహ్మ! అభిషేకజల'మని అడగడం, స్వామి సంచరించిన ప్రాంతం వరహానదిగా మారిందని స్థల పురాణ వచనం.

నర్సీపట్నం - భద్రాచలం రోడ్డులోని ధారాలమ్మ తల్లి, గ్రామదేవత అయినా, కోరికలు తీర్చే కల్పవల్లిగా ఎందరో అనుభూతులను పొందారు.

## కణితి (కాలని) శ్రీరథాలమ్మతల్లి

దువ్వాడనుండి ఈ గ్రామం ఆటోలలో చేరుకోవచ్చును. ఈ రథాలమ్మతల్లి చాలా చిత్రమైంది. ఈ గ్రామంలోరని రతనాలమ్మ అనే కన్య అందరికి తలలోని నాలుకవలె, వూరికి వుపకారిగా వుండేది. వివాహం మాట మరచి, వూరిసేవలో తరించే ఆమె అకాలమరణం చెందింది. గ్రామదేవతగా మారింది. నేను మిమ్ము సంరక్షిస్తానని చెప్పింది. ఆమె మరణించాక, ఆగ్రామం ఆనందరూపమైంది. ఒక సం॥ ఆమెకు పూజలు చేయలేదు. గ్రామం అల్లకల్లోలమైంది. దీంతో భయపడిన గ్రామస్థులు ఈ తల్లికి యధావిధి పూజలు, ఉత్సవాలు జరిపారు. దైవం మానుషరూపంలో అన్నది ఇక్కడ మానవుడు దైవమని గమనించ గల్గుతాము.

## అగస్తేశ్వరస్వామి ఆలయం - తొండవాడ



ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి పట్టణమునకు 6 కి.మీ. దూరంలో ఉన్న చంద్రగిరి మండలం లోని తొండవాడ అగస్తేశ్వర స్వామి ఆలయం ప్రశక్తి ఎంతో విశిష్టమైనది.

**స్థలపురాణం :** కైలాసగిరిలో ఆది పురుషులైన పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవానికి దేవత లంతా వెళ్లారనీ! ముక్కోటి దేవతలు ఒకచోట చేరగా కైలాసగిరి ఉత్తర దిక్కున క్రింద కుంగిపోయి దక్షణదిశపైకి ఎగిసింది. దానితో సమతుల్యత దెబ్బతినడంలో జరగబోవు ఉపద్రవాన్ని గుర్తించిన పరమశివుడు అగస్త్యమహామునిని పిలిచి దేవతల భారం వల్ల కైలాసగిరి ఉత్తర వైపునకు ఒరిగిపోయిందని. అందరూ ఒక ఎత్తు అయితే మీరు ఒక ఎత్తు కావున మీరు దక్షిణ దిశకు వెళ్లమని కోరుతాడు. అగస్త్యుడు తన సతీమణితో గోదావరి కృష్ణ మొదలగు పుణ్యనదులలో స్నానమాచరించి శ్రీశైలం, సిద్ధవరం, శ్రీకాళహస్తి మొదలగు పుణ్యక్షేత్రములను తిలకిస్తు వస్తారు. అయితే శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాలలో ఆయనకు ఒక లోపం కనిపించింది. దక్షిణ కైలాసమగు ఈ ప్రాంతమున ఒక నదీయు లేదని గుర్తించిన అగస్త్యుడు శ్రీకాళహస్తికి పడమటి దిక్కున గల ఒక మహాపర్వతం వద్దకు చేరి బ్రహ్మగురించి తపస్సు చేస్తారు. అగస్త్యుని తపోనిష్ట గురించి శివుని ద్వారా విన్న బ్రహ్మ అగస్త్యునికి ప్రత్యక్షమై తన అభీష్టం నెరవేరునట్లు వరం ఇస్తాడు. అగస్త్యుని వరప్రభావంతో ఆకాశగంగ నదీతీరములపై నుంచి దేదిప్యమానమైన సువర్ణకాంతులు వెదజల్లుతుండడంలో ఒక నది ఉద్భవిస్తుంది. ఆనదియే సువర్ణముఖినదిగా ప్రసిద్ధిగాంచినది. ఉదృతంగా వచ్చిన నదీ ప్రవాహం వల్ల తపస్సులో ఉన్న అగస్త్యుడు కొట్టుకు పోవుచుండగా తొండవాడ సమీపంలో ఒకరాతిని పట్టుకుని సురక్షితంగా ఒడ్డుకు చేరుతారు. తనకు రక్షణ కల్పించిన రాతిని అగస్త్యుడు శివలింగంగా మార్చి ప్రతిష్టిస్తారు. ఆ సమయంలో ముక్కొటి దేవతలు పూలజల్లులు కురిపించి ఆ స్వామిని అగేస్తేశ్వర స్వామిగా పిలిచారు. ఈ క్షేత్రము శ్రీకాళహస్తి అంతటి ప్రసిద్ధిచెందినది.

# అనంతపురం జిల్లా

## లేపాక్షి

విజయనగర సామ్రాజ్యములో ఒకభాగమైన పెనుగొండ సంస్థానంలో ఈ లేపాక్షి వుంది. దీనిని ఆరోజులలో "విరుపణ్ణ" అనే మండలాధీశుడు పరిపాలిస్తూండేవాడు. కళాత్మక హృదయుడైన విరుపణ్ణ ఈ లేపాక్షి ఆలయ నిర్మాణానికి పూనుకోవడం సహించలేని కొందరు చెప్పిన చాడీలకు, శ్రీకృష్ణ దేవరాయల అల్లుడైన అళియరామరాయలు విరుపణ్ణను పిలిచి, శిక్షించబోతే, తన విశ్వాసాన్ని ధిక్కరించి వెక్కిరించినట్లు రామరాయలు ప్రవర్తనకు బాధపడి తన కళ్ళను తానే పెరుక్కుని విసిరేయడంతో అవి లేపాక్షి ఆలయగోడలపైపడి, గుంట అయి అందు లోంచి రక్తం క్రిందకు కారిందట. అంతటితో అసంపూర్ణంగా లేపాక్షి ఆలయం వుండి పోయింది.



ఇక్కడ అన్ని విశేషాలే చుట్టుకొండలులేని ఒక గుట్టవంటి పెద్దబండను తొలిచి, 25' పొడువు, 15' వెడల్పు, 16' ఎత్తుగల నంది విగ్రహాన్ని ఎంతో ప్రశాంత స్వరూపంగా తొలచడం జరిగింది. ఇది ప్రపంచము లోని నంది విగ్రహలకంటే ఎంతో పెద్దది. దీని తర్వాతది తంజావూరు బృహదీశ్వరాలయంలోను, మూడవది మైసూరులోని చాముండి కొండమీద, నాలుగవది బెంగుళూరులోని బసవన్నగుడిలోను, అయిదు, ఆరు విగ్రహాలు హళేబీడులోని, హొయసిల ఆలయంలోను వున్నాయి. మిగిలినవన్నీ నల్లరాతితో చెక్కి సొగసులు తీర్చిదిద్దితే, లేపాక్షి బసవడిని మాత్రం ఎర్రజీర కలిసిన తెల్లబండరాయిపై తొలిచారు.

ప్రతి ఆలయం సాధారణంగా, తూర్పు – పశ్చిమ ముఖాలలో వుంటాయి. ఈ ఆలయం ఉత్తరముఖంగా వుంటుంది. సీతాదేవిని జటాయువు ఈప్రాంతంలోనే రక్షించి, తనప్రాణాలు అర్పించి సాయుజ్యాన్ని పొందిన కారణంగా శ్రీరామకరుణతో స్వర్గంలో లయమైన పక్షిగా చెప్పుకుంటారు. అది రానురాను "లయపక్షి" కాస్త 'లేపాక్షి'గా మారిపోయింది.

ఆలయానికి వెనుక భాగంలో అసంపూర్ణంగా ఎన్నో మంటపాలు వున్నాయి. దేనికి పై ఆచ్ఛాదనలేదు. కాని కళాకృతులు మాత్రం తొంగిచూసి మనలను పలుకరిస్తూన్నట్లుఉంటాయి. ఇక్కడో పద్ధెనిది స్తంభాల వేదిక వుంది. దీనికి కొద్దిదూరంలో 18' పొడుగు, అంగుళం లోతున పాదముద్ర కనుపిస్తూంది. అది సీతాదేవిదని చెబుతారు. ఈ పాదబొటనవేలునుండి ఎల్లప్పుడు నీరు వూరడం గమనించవచ్చును.

ప్రాకారాలతో మహాద్భుతంగా నిర్మించదలచిన ఈ ఆలయం దురదృష్టవశాత్తు ఒక మూల అసంపూర్ణమైంది. మరొకమూల ప్రాకారాలు రూపుమాసిపోయి చిట్టచివరి ప్రాకారంలోవున్న నంది విగ్రహం దానికిపైనగల మరో మూడు ప్రాకారాలు చెప్పుకునేటందుకు ఆనవాలు లేకుండా, ఆ ప్రాంతమంతా .... కూర్చుంది. ఇది మన దౌర్భాగ్యం.

అద్భుత శిల్పకళాసంపదకు, అపురూప కట్టడాలకు, మహోన్నత వారసత్వానికి, వారసులమైన మనం, స్వార్ధపరులమై 'చరిత్ర'కు గతులు లేకుండా సర్వనాశనం చేసుకుని, మహాకట్టడాలు నిర్మిస్తున్నామని భుజాలు చరచుకునే మనం, ఆ కట్టిన కట్టడం యాభై సం॥లు దాటితే కూల్చివేసే స్థితికి వచ్చాం.



ఈ ఆలయానికి వెనుక భాగంలోనే మరొక అపురూప శిల్పం – అక్కడికి వెళ్ళి సంస్కృతి, చరిత్ర తెలుసుకోదలచిన వారికి దరిశనమిస్తుంది. అది పది అడుగుల ఎత్తు వెడల్పు వుంది. పడగ మెడ ఆరు అడుగులు. ఈ పడగకు క్రింద ఒక శివలింగం వుంది. దీనిని కనుక పరిశీలనగా చూస్తే ముందు, ఈ నాగేంద్రుని నిర్మించి, తదుపరి శివలింగాన్ని జొప్పించా రేమోననిపిస్తుంది. దీని తర్వాత ఇక్కడ నాట్య మండపంలో ఒక అపురూప విచిత్రం కల్గిస్తుంది. ఇక్కడున్న ఒక స్తంభం ముఖమంటపం తూర్పుభాగాన వ్రేలాడే స్తంభం కనుపిస్తుందట. దీని పై మంటపమే ఆధారం తప్ప గరిమనాభిశక్తి కల్గిన భూమి ఆధారం కాదు. నేలకు స్తంభానికి మధ్య అంగుళం దూరం వుంటుంది.

ఈ నిర్మాణాన్ని చూసి బ్రిటిష్ ఇంజనీరు ఆశ్చర్యపోయారు. అంతుకనుక్కోలేక పోయారుట. ఇంతటి మహాశిల్ప సంపదకు వారసులైన మనము ...... దేవుడో, రాముడో, ప్రక్కనబెట్టి, ఇటువంటి దివ్యసుందర ప్రదేశాలను కళాదృష్టితో దర్శించి ధన్యులం కాగల్గితే మన జన్మ ధన్యమని నిస్సంకోచంగా చెప్పవచ్చును.

"లేపాక్షి బసవయ్య లేచిరావయ్యా!" అనే గేయం పాడగానే లేపాక్షి నంది గుర్తుకు వచ్చే ఈ క్షేత్రము కూర్మగిరిపై ఉంది. లేపాక్షిలోని శివ లింగాన్ని ఆగస్త్య ఋషి ప్రతిష్ఠించాడు. ఇచ్చట శివుడు పావనేశ్వరుడు శివాలయం ఎదురుగా ఉన్న రఘునాధస్వామి దేవాలయం కూడా యాత్రికులు దర్శించుకోవలసిన స్థలము. దీనిని విరుపణ్ణ పెద్ద దేవాలయంగా నిర్మించాడు. ఈ దేవాలయ స్థంభంపై దుర్గాదేవి వెలసి ఉంది. ఆలయంలో మొదటగా కనిపించేది వీరభద్రస్వామి విగ్రహం. ఈ క్షేత్రమునకు 4 మైళ్ళు దూరంలో కనుమ నరసింహస్వామి దేవాలయంలో పూజారి అభ్యర్ధన మేరకు స్వామి సింహకేసరాలతో దర్శనమిచ్చినట్లు చెబుతారు. ఇక్కడి నాగలింగం, శివలింగం శిల్పకళతో నిండి ఉంటాయి. కుల రాజకీయాలకు పాలబడి విసిగిన విరుపణ్ణ తన కన్నులను తానే పెకిలించుకున్నాడుట. విరుపణ్ణ చూడని శిల్పాలు చెక్కడం దండుగ అని ఇక్కడి శిల్పులు చిత్రలేఖనంపై దృష్టి

మరలించారు. ఈ వర్ణ చిత్రాలను మనం చూడవచ్చు. ఇక్కడి వ్రేలాడే స్తంభాలు నేటికి మనకు సవాలుగా నిలిచాయి.

ఈ క్షేత్రము హిందుపూర్‌కు 10 కి.మీ. దూరంలో ఉంది. హైద్రాబాద్-బెంగుళూరు రైలు మార్గంలో హిందుపురం వస్తుంది. ప్రసిద్ధి పొందిన ఈ క్షేత్రములోని నందీశ్వరుని బసవయ్యగా పిలుస్తారు. 20 అడుగుల ఎత్తు 30 అడుగుల పొడవు ఉన్న ఈ నంది విగ్రహం 16వ శతాబ్దంలో విరుపణ్ణ అనే శిల్పకారునిచే చెక్కబడినది. 108 శివక్షేత్రాలలో లేపాక్షి ఒకటి.



## అనంతపురం జిల్లాలో "రాయదుర్గం"



ఇది శ్రీకృష్ణదేవరాయల విడిదేకాదు, విజయనగర రాజుల ప్రతిభాపాటవాలకు చిహ్నంగా, ఎన్నో ఆలయాలు, కొలనులు, మనలను దర్శించమని కోరుతాయి.

**పెనుగొండ :** హిందూపురానికి 20 కి.మీ. విజయనగరరాజులు నిర్మించిన కోట, అనేక దేవాలయాలకు - ఇది నిలయం. పెనుగొండను రాజధానిగా చేసుని పరిపాలించిన ప్రభువులు, ఆ తరువాతి కాలంలో దీనిని తమ వేసవి విడిదిగా చేసుకున్నారు. చూడవలసిన వాటిలో ఒకటి "కుంభకర్ణుని" తోట.

**ఉంతకల్లు పాండురంగడు :** స్వామిమాలను వేసుకుని, మూడు ఏకాదశి రాత్రుళ్ళు ఇక్కడ దీక్షగా స్వామికి ప్రదక్షిణాలు చేస్తూ గడిపేస్తారు. ఆ మరునాడు నుండి ఎంతటి త్రాగుబోతయినా సరే... నాకా అలవాటు లేదంటాడు. ఈ ఉంతకల్లు, ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులో, అనంతపురంజిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని "బొమ్మనహళ్ళి (కోట)"లో వుంది.

**వేమన గుడి :** 1789 ప్రాంతంలో జీవసమాధియైన వేమనకు ఆ వూరి ప్రజలు గుడి కట్టి ఆరాధిస్తున్నారు. ఈ ఆలయాన్ని దర్శించడానికి, మన రాష్ట్రంతోపాటు, కర్ణాటకనుండి అభిమానులు వస్తారు. ప్రతిఏటా శ్రీరామనవమినాడు వేమన తిరునాళ్ళు, 3 రోజులు మహావైభవంగా జరుగుతాయి.

ఇక్కడవున్న తిమ్మమ్మ మర్రిమానును, కదిరి లక్ష్మీనరసింహస్వామిని చూడటానికి యాత్రికులు, భక్తులు రావడంతో, కటారుపల్లిలో వసతి సౌకర్యాలను ఏర్పాటుచేసింది. కదిరినుండి 12 కి.మీ దూరంలో ఈ కటారుపల్లి వుంది.

అనంతపురంజిల్లా తాడిపత్రినుంచి, గుత్తివెళ్ళే దారిలో "తొండపాడు" అనే గ్రామంవుంది. ఈ రహదారి ప్రక్కనే కి.మీ కొండపైకి వెళితే ఈ బోలికొండ రంగనాధస్వామి మహర్షి దర్శనమిస్తాడు. ఆ రోజులలో ఇక్కడ మహర్షులెందరో నివసించారని, లోకసంచారంచేసే వీరిని చూసి ఆగి, ఏం కావాలని అడిగితే, ఆయనను ఇక్కడ వెలియమని కోరారని చెబుతారు. అయితే ఈ మూర్తి స్పష్టంగా కనబడదు. పుట్టుశిలగా వెలిసినట్లు స్థలపురాణగాథ.

కడప – అనంతపురం వద్ద పార్నపల్లిలో వెలసిన శివుడు కోనమల్లేశ్వరుడిగా ప్రసిద్ధుడయ్యాడు. ఈ ఆలయాన్ని జనమేజయుడు నిర్మించాడని అంటారు. ఈ క్షేత్రంలో శివునికి ప్రతిరూపంగా తత్పురుష, వాయువ్య, అఘోర, మృత్యుంజయ, అగ్నిజ్యోత్స్న" అంటూ పంచలింగాలు, నంది నోటినుండి ధారగా ప్రవహించే కోనేరు, పూజించడానికి వీలైన నవగ్రహాలు.. దర్శించగల్గడమొక విశేషంగా తలవాలి.

## కదిరి నరసింహస్వామి



హిందూపురానికి 90 కి.మీ దూరంలో, కడప సరిహద్దుల్లో ఈ ఆలయముంది. శ్రీ కదిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం రెండున్నర ఎకరాలలో నిర్మించబడిన చాలా పురాతనాలయంగా చెబుతారు. కదిరి వృక్షమునందు వెలసిన స్వయంవ్యక్తుడు ఈ స్వామి. విజయనగర సామ్రాజ్య నిర్మాతలు హరిహర రాయలు, బుక్కరాయలకాలంలో ఇది నిర్మించబడినట్లు తెలుస్తుంది. ఈ ఆలయంలోని శిల్పసంపద – ద్రావిడ హొయసాల, విజయనగర రాజుల నిర్మాణ శైలిని తోపిస్తుంది. ఎత్తైన ప్రహారీగోడలతో, గర్భాలయం, అంతరాలయం, మండపంగా విభజించబడింది. గర్భాలయంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఎడంప్రక్కన చెంచులక్ష్మి అమ్మవారు దర్శనమిస్తుంటారు.



ఇక గర్భాలయాన్ని శ్రీప్రహ్లాదవరద నరసింహస్వామి సన్నిధిగా పిలుస్తారు. అష్టభుజములతో వున్న ఈ స్వామి ఉగ్రుడు. శ్రీస్వామి కోపానికి శాంతంగా ప్రహ్లాదరాయుడు, ఎడమప్రక్కన నిల్చుని స్తుతిస్తున్న విగ్రహం భక్తజనుల కానందదాయకం. కదిరికి చుట్టుప్రక్కల ఎన్నో తీర్థాలున్నాయి. అందులో ముఖ్యమైనవి భృగుతీర్థం, ద్రౌపది, కుంతి, పాండవ, వ్యాస తీర్థాలు చెప్పుకోదగ్గవి. ఈ నరసింహుడు, నవనారసింహులలో ఒకనిగా ప్రసిద్ధుడు.

**పెనుగొండ** కేవలం దూరమేకాదు, ఇక్కడి **శ్రీరామాలయం** వుంది. ఇందులో సుందరమైన గరుడ విగ్రహం, ఎర్రమంచిగేటులో 1575లో నిర్మించిన 11 అ. ఆంజనేయుని విగ్రహం చూడదగ్గది. ఇక్కడ ఇంకా 365 దేవాలయాలు ఉన్నాయని, ఇవన్నీ శ్రీకృష్ణదేవరాయలు నిర్మించారని శాసనాలు చెబుతున్నాయి. కదిరికి 32 కి.మీ దూరంలో ఈ పెనుగొండ ఈ అద్భుత ఆలయాలు, దుర్భేద్యమైన కోట దర్శనీయాలని చెప్పడం కాదు, దర్శనీయమే!

## తాడిపత్రి




ఈ వూరు రామాయణంలోని తాటకిని చంపిన ప్రదేశమట. ఈవూళ్ళో బుగ్గరామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి వున్నారు. ఒకనాటి దండకారణ్య ప్రాంతం. ఇప్పుడొక మాదిరి వూరై కూర్చుంది. ఇంకా వాలిని చంపడానికి రాముడు ఏడు తాటిచెట్లను ఇక్కడే నరికాడుట.

ఈ పాపపరిహారార్థం, పెన్నాతీరంలో బుగ్గరామలింగేశ్వర స్వామిని ప్రతిష్ఠించాడని పురాణగాథ. 16వ శతాబ్దంలో విజయనగర చక్రవర్తుల సామంతులలో రామలింగనాయకుడు "రామలింగస్వామి" ఆలయాన్ని, తిరుమల నాయకుడు వెంకట రమణస్వామి ఆలయాన్ని నిర్మించాడని ఇక్కడి శాసనాలద్వారా తెలుస్తుంది. రామలింగ స్వామి పీఠభాగంనుండి బొట్టు బొట్లుగా నీరు వస్తూందట. అందుకని ఈ దేవుడు బుగ్గ రామలింగేశ్వరుడయ్యాడు.

చింతలవెంకటరమణుడు మీద మాఘశుద్ధ ఏకాదశి, ద్వాదశి, త్రయోదశులలో సూర్యకిరణాలు పడేటట్లు రూపొందించడంతో దీనిని భాస్కరక్షేత్రమనికూడా పిలుస్తున్నారు. మొత్తానికి ఈ క్షేత్రమంతా చూడదగినదే. ఏది గొప్ప అంటే ... ఏది గొప్పో చెప్పలేని పరిస్థితి అవుతుంది. ఆలయాలు ఏమంత పెద్దవి కాదు కానీ, ప్రతి శిల్పం ముఖ్యంగా వినాయకుడు, గరుత్మంతుడు, శ్రీమహావిష్ణు-లక్ష్మీదేవి "అర్ధనారీశ్వరులుగా దర్శన మివ్వడం, మంటపం పై కప్పులో గిరగిర తిరిగే పద్మదళం...

తాడిపత్రి చింతలన్ని తొలగించే శ్రీచింతలవేంకటరమణుని చూసి చింతలు పోగొట్టుకోవలసిందే. రథసప్తమినాడు శ్రీసూర్యకిరణాలు స్వామి పాదాలను చుంబిస్తాయి. రాజగోపురం, మండపాలు, స్తంభాలు, గోడలమీద భారత, భాగవత, రామాయణగాథలు, కృష్ణలీలలతో పరవశించే మనకు ప్రధాన ఆలయానికి ఎదురుగా రాతిరథంవలె కనుపించే గరుబాలయం చూసి తీరాలి. ఇక మిగిలిన ఉత్సవాలు, కనుమ పండుగనాటి శాంతి కల్యాణంలో పాల్గొన్న వారు ధన్యులను చెప్పాలి. ఆళ్వారులు, శ్రీరామానుజులు, వరాహస్వామి, శ్రీదేవిభూసమేత కేశవస్వామి ఇతర దేవతలు చూసి ఆనందించాలి.

తాడిపత్రిలోని మరో ప్రాచీనాలయం పినాకిని నదిఒడ్డున గల బుగ్గరామలింగేశ్వరాలయం ప్రసిద్ధ శివక్షేత్రం. దీనిని 1460-1525 మధ్యకాలంలో విజయనగరసామ్రాజ్య మండలేశు డైన పెమ్మసాని రామలింగనాయుడు



నిర్మించాడనేది శాసనాల ద్వారా తెలుస్తున్న సత్యం. కాలానికి కాలపురుషుడైన ఈశ్వరుడు తల ఒగ్గినట్లు ఈ ఆలయంకూడ, ఆలనా పాలనా లేనట్లు కనుపిస్తుంది. కళావైభవం మాత్రం కనులకు ఆనందం, మనసుకు ఆహ్లాదం కలిగిస్తుంది. ఈ స్వామి నీటిబుగ్గలో దొరికినందువలన బుగ్గరామలింగేశ్వరుడైనాడు. అమ్మవారు పార్వతి. ఈ ఆలయాన్ని పరిసరాలను చూస్తూంటే, దీనినొక దేవభూమిగా చెప్పాల్సివస్తుంది. సువిశాలమైన ఆలయ ప్రాకారాలు, శిల్పచాతుర్యం మెచ్చుకోవడం కాదు, తెలియకుండా చేతులెత్తి నమస్కరిస్తాం. మన దురదృష్టంగా ఉత్తర, దక్షిణ, పశ్చిమ గోపురాలు శిధిలమయ్యాయి. గర్భగుడికి అటుఇటు కోదండరామ స్వామి, పార్వతి ఆలయాలు, ఈశాన్యంలో చండి, ఆలయం ఆ ప్రక్క ఎత్తైన మంటపం వుంది. స్వామికి ఎదురుగా నంది, నందినుండి పినాకినిని చూస్తే జన్మతరించినట్లేనని భక్తులు భావిస్తారు.

ఆలయ శిఖరం మీద, రామాయణ– భాగవత గాధలు, ప్రాకారాలు కమనీయ శిల్పాలతో అంగుళం ఖాళీలేకుండా, నయనానందకరంగా తీర్చిదిద్దడం, మాటలలో చెప్పలేని దివ్యానుభూతికి చూడాలనే తపనకు పరాకాష్ఠగా కనబడుతుంది. ఈ దేశం చేసుకున్న అదృష్టంగా --

అంగుళం అంగుళం శిల్పచాతుర్యము, అడుగడుగున ఆలయశోభలు... వూహలలో లేనివారి ఆలోచన పద్ధతి, నైపుణ్యాలకు కేవలం నమస్కరిస్తే చాలదు. సంస్కారవంతులుగా వాటిని దర్శించడం మన కనీస కర్తవ్యంగా చేసుకోవాలి. ... అని చెప్పకపోవడం మా తప్పుగా భావిస్తూ ... స్వస్తి.

## ప్రశాంత నిలయం - పుట్టపర్తి

పుట్టపర్తి – వివరాలు చెప్పవలసిన పనిలేదు. సత్యసాయి పేరుతో విశ్వవిఖ్యాతమయిందీ ప్రాంతం. శ్రీసత్యసాయి సమాధి చెందకముందు దేశవిదేశాల భక్తులు వరదగోదావరిలాగ రావడం, స్వామి దర్శనంతో పులకరించడం జరిగేది. తానే దైవమన్నా, అర్షధర్మానికి ప్రతీకగా ప్రాచీన సంస్కృతి, ధర్మాలను, సమాజ విశ్వాసాలు పాటింపబడేవి. భక్తజనకోటి తమ ముక్తిధామంగా పుట్టపర్తిని, శ్రీసత్యసాయిని తలచేవారు. ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లా ధర్మవరానికి దగ్గరలోని పుట్టపర్తి గ్రామము ఖండాంతరాలకు ఆధ్యాత్మికత భావాలను అందిస్తోంది. కోట్లాది మందికి ఆరాధ్య దైవమైన శ్రీ సత్యసాయిబాబా వారి జన్మస్థలమే పుట్టపర్తి.



1926 నవంబరు 26న ప్రేమతత్వమే తన మతంగా చాటిన ప్రేమైకమూర్తి జన్మించిన రోజు. శ్రీ వెంకమరాజు, ఈశ్వరాంబ పుణ్యదంపతులకు జన్మించిన శ్రీ సత్యసాయి బాబా వారి అసలు పేరు సత్యనారాయణగా చెబుతారు. దివ్యమైన కంఠస్వరముతో అసమానమైన తేజస్సులో తాను భగవానుడినని లోకానికి వెల్లడి చేయనున్నట్లు చిన్నతనంలోనే

కనిపించేవారని చెబుతారు. 1940 అక్టోబరు 20న తాను అవతారమూర్తిగా ప్రజలకు తెలియచెప్పారు. అనేక మహిమలు ఇంద్ర జాలములు చేయడం చూసిన ప్రజలు ఆయనకు చిన్న మందిరం కట్టి దానికి **"ప్రశాంత నిలయం"** అని పేరు పెట్టారు. పుట్టలతో నిండిన ఆ పుట్టపర్తి గ్రామం ఈ రోజు కోట్లాది భక్తుల హృదయాలలో విశేష స్థానం పొందింది.

పుట్టపర్తిలో తొలి రోజులలో ఒక సత్యసాయి మందిరం మాత్రమే ఉండేది. కానీ ఈ రోజు శ్రీ సత్యసాయి బాబా వారి విద్యా కేంద్రాలు, ఆసుపత్రులు, స్పిరిట్యువల్ మ్యూజియంలు, ప్లానిటోరియం, విశ్వవిద్యాలయాలు అనేక సంస్థలతో ప్రపంచ పటములోనే ఒక స్థానం సంపాదించుకుంది. కలియుగ అవతార పురుషునిగా, విశ్వమానవ కళ్యాణాన్ని ఆకాంక్షిస్తున్న మహనీయునిగా, ప్రేమతత్వమే తన మతంగా చాటిన ప్రేమ మూర్తిగా శ్రీ సత్యసాయిబాబా వారి సేవలు చిరస్మరణీయం. విద్యా, వైద్య, సమాజసేవలలో తనదైన బాణీతో పాలకులకు పథనిర్దేశం చేసిన ఈ మహనీయునికి భారతజాతి జేజేలు పలుకుతుంది. వీరి గురించి ఎంతరాసినా ఇంకా ఉంటుంది. కావున రాసిన దానికన్నా, చదువుటకన్నా చూసి తరించాలనేది భక్తుల కోరిక. దీనిని శిరసావహిద్దాం. పుట్టపర్తికి ధర్మవరం రైల్వేస్టేషన్‌లో దిగి వెళ్లాలి. ధర్మవరంకి అన్ని ప్రాంతాల నుండి రైలు సౌకర్యం కలదు. విమానరాకపోకలకు సదుపాయాలు కలవు. ఇక్కడకు వెళ్ళిన ప్రతివారు, ప్రయాణ, వసతిభోజనాలకు ఇబ్బంది పడవలసిన పనిలేదు.

## తొండపాడు - శ్రీరంగడు

శయనమూర్తి. అందుకనే పల్లికొండ శ్రీరంగనాధుడనేది. ఇదెంతో పురాతన ఆలయం. విశాలమైన ప్రాంగణంలో నిర్మించబడిన ఆలయంలోని శ్రీరంగనాధుడు, పడుకుని వుంటాడు. నాభినుండి బ్రహ్మ, పాదసేవనం చేస్తూ శ్రీదేవి, భూదేవి, ఈ స్వామి సేవలవల్ల సర్వకోర్కెలు నెరవేరుతాయి. పునర్జన్మ వుండదనే భక్తుల ప్రగాధ విశ్వాసం.

## ధర్మవరం - శ్రీలక్ష్మీచెన్నకేశ్వరస్వామి

ధర్మవరం బస్టాండుకు కి.మీ దూరంలో ఈ అపూర్వాలయంముంది. పురాతన మనడమేతప్ప, నిర్మాత, నిర్మాణకాలం తెలియడంలేదు. చూడముచ్చటగా అద్భుత శిల్పాలతో ఆనందదాయకంగా వుంది. చతుర్భుజుడైన చెన్నకేశవస్వామి ఆయనకు ఉత్తరంలో లక్ష్మీదేవి వున్నారు. ఆలయం శోభలు, ముఖమంటప, సభామంటపాదులు తనివితీర చూడాలనడంలో అతిశయోక్తిలేదు.

**పొన్నపల్లికోన** లోని – శ్రీ **కోనమల్లేశ్వరాలయాన్ని** జనమేజయుడు నిర్మించాడని చెబుతారు. ఇక్కడ శివునికి ప్రతిరూపంగా 'తత్పురుష, వాయవ్య, అఘోర, మృత్యుంజయ, అగ్నిజ్యోత్స్న' అను పంచలింగాలు ప్రతిష్ఠించబడాయి. ఆలయానికి ప్రక్కనే గల మహారుద్రకోనేరు వుంది. నంది విగ్రహంనుండి నీరు వస్తుంది. పంచలింగాలతో పరమప్రాచీన ఆలయదర్శనం, సేవలు భుక్తి, భక్తి, ముక్తిదాయకమని, భక్తుల మహానమ్మకం.

**ఆలూరుకోన – శ్రీరంగనాధస్వామి** దట్టమైన అడవిలో పర్వతాలమధ్యనగల కొండపై వున్నాడు. ఈ ఆలయం

అతిప్రాచీనమైనదని, హరిహరబుక్కరాయల కాలంనాటి విక్రమ తిమ్మరాజు ఈ ఆలయం నిర్మించాడని చెబుతారు. నైఋతిభాగంలోని పుట్ట శిల స్వామికి ప్రతిరూపంగా తలుస్తారు. విశ్వామిత్ర మహర్షి నిరాకారుడైన స్వామికి ప్రాణప్రతిష్ఠచేసినట్లు పురాణాలకథ. ఈశాన్యభాగంలోని కొంతదూరము రెండు కొండల మధ్య బుగ్గ ఏర్పడి, అందులోని జలం ఉత్తర, దక్షిణాలుగా ప్రవహిస్తుంది. భక్తులు ఈ బుగ్గలో స్నానం చేసి స్వామిని దర్శించుకుంటారు. మూడు అంతస్తుల గాలిగోపురంతో, అడవిలో ప్రాణం పోసినట్లు కనుపించే శిల్పసంపదకు, అలనాటి శిల్పులకు అంజలి ఘటించడం, మన కనీస విధి.

## ఉంతకల్లు - పాండురంగడు



ఆంధ్ర–కర్ణాటక సరిహద్దులోని బొమ్మనహల్లిలో, ఉంతకళ అనే గ్రామం, ఇక్కడి శ్రీపాండురంగడు. అందరు పాండురంగభక్తులే కనుక 'పాండురంగహరి జైజై! రామకృష్ణహరి జైజై!' అని తన్మయత్త్వంతో పొంగిపోతుంటారు. ఇక్కడి విశేషం మద్యానికి దాసులైనవారు 'మాల' వేసుకుని మండలదీక్షతో స్వామిని సేవిస్తే ఆ దురలవాటు పోతుంది. అదే కాదు ఏ దురలవాటైనా స్వామి పోగొడుతాడు. ఆ భక్తుని ఆనందసాగరంలో ముంచుతాడు. ఇటీవలనే అయినా పరమశక్తివంతుడు ఈ పాండురంగడు, రుక్మిణీవల్లభుడు.

ఇక – చూడదగ్గవి సూర్యభగవానుడు. చోళరాజులు నిర్మించారని శాసనాలు తెలుపుతున్నాయి. జీర్ణావస్థలో వుండి, పురావస్తుశాఖ వారి అధీనంలోవున్నా, ఆలనాపాలనా లేని ఈస్వామిని, విదేశాలలోవున్న ఈ గ్రామస్థులు కొందరు పునరుద్ధరించి, నిత్యార్చనలు జరిపేటట్లు చేసారు.

## హేమావతి - సిద్ధేశ్వరాలయం

7వ శతాబ్దానికి చెందినదంటే అతి పురాతనమైనదే కదా? అప్పట్లో నోళంబరాజుల పాలనలో ఈ ప్రాంతం వుండటం శ్రీసిద్ధేశ్వరస్వామిని 'నోళంబేశ్వరుడు' అనికూడా పిలిచేవారు. ఒక్కడి సిద్ధేశ్వరునితోపాటు, దొడ్డేశ్వర, విరూపాక్షేశ్వర, మల్లేశ్వర, సోమేశ్వర అనే నాలుగు శివలింగాలున్న ఆలయాలున్నాయిక్కడ. తమకు సంతానంలేకపోయేసరికి నోళంబరాజ వంశానికి చెందిన చిత్రశేఖర, సోమశేఖరులు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర కథ. ఇక్కడి స్వామి సిద్ధాసనంలో, నెత్తిన గంగ, జటలో సూర్యచంద్రులు, కుడిచేత బ్రహ్మకపాలం, దక్షిణహస్తాన జపమాల దాల్చి అర్థనిమీలితనేత్రుడై వుంటాడు. ఈ క్షేత్రంలో కోటిలింగాలు, కోటినందులు వుండేవంటారు.

ఇక్కడి శిల్పాలు, వాటి చరిత్ర తెలియకపోయినా, వాటిపై లిఖించిన శివలీలలు చూసి తరించవలసిందేతప్ప వర్ణించడం సాధ్యంకాదు. ఇక్కడి విశేషం శివరాత్రినాడు సూర్యకిరణాలు స్వామి పాదాలపై బడతాయి. ఇక్కడి

కోనేరు ఆదివ్యాధులులేకుండా సంతానాన్ని ప్రసాదించే దివ్యతీర్థం. ఆలయప్రవేశద్వారం ముందుగల ధునిలో, భక్తులు తమ మ్రొక్కులు సమర్పించుకుంటారు. ఆంధ్రయేకాదు, తమిళనాడు, కర్ణాటక నుండి భక్తులు వచ్చి మ్రొక్కులు తీర్చుకుంటారు. స్వామిని సేవించి తరిస్తారు.

## పెన్న అహోబిలం - లక్ష్మీనారసింహస్వామి



అనంతపురం నుండి బళ్ళారి వెళ్ళేమార్గంలో పెన్నానదీ తీరంలోని గుట్టమీద శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయముంది. ఈ స్వామి స్వయంవ్యక్తుడని, ఒకపాద మిక్కడ, మరోపాదం అహోబిలం కొండమీద పెట్టి భక్తజనులను సదా కాపాడుతున్నాడనే ఈ స్వామి దివ్యాలయాన్ని విజయనగర రాజులలో ఒకరైన సదాశివరాయలు 14 శతాబ్దంలో నిర్మించినట్లు శాసనాలు ఆధారం. ఇక్కడ స్వామి కుడిపాదముద్ర. దీనివెనుక స్వామిని ప్రతిష్ఠించారు. స్వామి పాదముద్ర దగ్గర్లో బిలంవుంది. స్వామిని అభిషేకించిన జలం ఈ బిలంగుండా 3 కి.మీ దూరంలో ప్రవహించే పెన్నానదిలో కలుస్తుందిట. అందుకే దీనిని 'అహోబిల'మని, పెన్నలో కలుస్తూంది కాబట్టి 'పెన్నఅహోబిల'మని పిలుస్తారు.

స్థల పురాణం ప్రకారం, అడవివంటి ఈ స్థలంలో ఉద్దాలక మహర్షి తపస్సుచేసుకుండేవారుట. ఆ అడవిలో వున్న రాక్షసుడు తన ఆకలి తీర్చుకోవడానికి కనుపించిన జంతువునల్లా చంపి, తిని, వాటి అవశేషాలను పెన్నాలో పడవేస్తుంటే, ఆ కాలుష్యాన్ని భరించలేని మహర్షి శ్రీమహావిష్ణువును ప్రార్థిస్తాడు. స్వామి నరసింహరూపంలో వీడిని వధించి, ఆ గుట్టపై వెలిసాడుట. ఆలయానికి తూర్పు పడమరల గోపురాలున్నాయి. ఉత్తర, దక్షిణ దిశలనుండి ఆలయంలోపలకు వెళ్ళి స్వామిని దర్శించుకోవచ్చును. చూడచక్కని ప్రదేశం. భక్తజనసంరక్షకుడిననే స్వామి నివాసం.

## బోలికొండ రంగనాథస్వామి - తొండపాడు

గుత్తికి సమీపంలో తొండపాడు వుంది. ఇక్కడినుండి ఒక కి.మీ దూరంలో బోలికొండ శ్రీరంగనాథస్వామి ఆలయం. శయనముద్రలో శేషశయ్యపై వుంటే స్వామి, కలియుగదైవం. శ్రీవేంకటరమణుని వలె ఆపదమ్రొక్కులవాడు, అడుగడుగుదండాలవాడై, అర్థించిన వార్ని, సంరక్షించడమొక లక్ష్యంగా పెట్టుకున్న దేవుడీయన. తెల్లటి రాళ్ళకొండను 'శ్వేతగిరి' అని, తెలుగులో 'బొల్లికొండ' అని పిలిచేవారు. కాలక్రమంలో ఈ దేవుడు బొలికొండ శ్రీరంగనాథుడయ్యాడు.

పూర్వము ఒకసారి తన కోరిక మేరకు విష్ణువు భూలోక విహారం చేస్తూ ఇక్కడి ప్రకృతి రమణీయతకు పరవశిస్తాడు. ఆ సమయంలో ఇచ్చట తపస్సు చేసుకునే మునులు శ్రీమహావిష్ణువు రాకను తెలుసుకుని దర్శించవస్తారు. అప్పుడు స్వామి వీరిని చూసి వరమడుగమంటే, విశ్రాంతికి అలవోకగా పడుకున్నా స్వామిని ఇక్కడ వెలసి సంసారబాధలలో తలమున్కలై దిక్కులేకుండా బాధపడేవారిని కాపాడమని ప్రార్థిస్తారు. ఇది స్థలపురాణం. ఈ రకంగా శ్రీస్వామి ఇక్కడ వెలసి భక్తజనుల కోర్కెలు దీర్చే కొంగుబంగారమయ్యాడు.

## గుంతకల్లు - బుగ్గసంగమేశ్వరుడు

గుంతకల్లుకు 7 కి.మీ దూరంలో బుగ్గ సంగమేశ్వరాలయం వుంది. పచ్చని ప్రకృతి శోభలతో వెలుగొందే ఈ ఆలయాన్ని శ్రీకృష్ణదేవరాయలు నిర్మించాడుట. ఈ సంగమేశ్వరుడు మహామహిమాన్వితుడని తలచిన విజయనగర ప్రభువులు సర్వవిధాల అభివృద్ధి పరచినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. అన్నిటా మనశ్శాంతి కొరవడిన ఒక బ్రాహ్మణుడు తన గురువుగారికి తన పరిస్థితిని చెప్పి దయచూడమని కోరతాడు. అప్పుడా గురువుగారు నిలువెత్తు కట్టెను కాశీలోని గంగానదిలో వదలి, ఇది నీకు ఎక్కడ తారసపడితే అక్కడ నీకు అనంత తృప్తి కల్గుతుందని చెబుతారు. శిష్యుడు తీర్థయాత్రలకు బయలుదేరుతాడు.

ఈతడు ఈ బుగ్గవద్దకు వచ్చేసరికి గురువుగారు వదిలిన కట్టె కనుపించి అపరిమితానందం పొందుతాడు. ఆ వెంటనే తెలియని తృప్తి, మనశ్శాంతిలు లభిస్తాయి. దాంతో ఆ బ్రాహ్మణుడు, ఆలయం నిర్మించి, శివలింగ ప్రతిష్ఠ జరిపి, సదా ఆ భగవన్నామంతో ఆనందిస్తున్నాడు. ఇక్కడి రెండు నీటిబుగ్గలు నిరంతరం కాశీలో మాదిరిగా ఉత్తరంనుండి దక్షిణానికి ప్రవహించడంతో స్థల పవిత్రతకు, ఆ బ్రాహ్మణుని భక్తికి పరవశించిన సదాశివుడు, బుగ్గరామలింగేశ్వరుడై ఇక్కడ వెలిసాడు. ఇక్కడ ఉసిరి, మారేడు చెట్లు వున్నాయి. అమ్మవారు పార్వతికి ఆలయం వుంది. ఈ ఆలయానికి ఎదురుగా ఎత్తైన కొండపై నంది, ఆ ప్రక్కన తామర లున్న కొలను, ఆద్యంతం మనసుకు ఆనందం కల్పిస్తూ సర్వాభీష్టప్రదాయకంగా నిలిచాడు ఈ పార్వతీసమేత బుగ్గరామలింగేశ్వరుడు.

## కసాపురం - నెట్టికంటి ఆంజనేయస్వామి



మహాప్రసిద్ధిచెందిన దేవుడు. భక్తుడే భగవంతుడైన దివ్యుడు. గుంటకల్లు మండలంలో వున్నాడీస్వామి. ఈ దేవుని నెట్టికంటి ఆంజనేయస్వామి, కసాపురం ఆంజనేయుడని భక్తులు ప్రేమతో పిలుచుకుంటారు. పూర్వం శ్రీవ్యాస రాయలవారు తుంగభద్రా తీరంలోని హంపీ క్షేత్రంలోవుండి అనుష్ఠానం చేసుకుంటూ ఎదురుగావున్న శిలమీద సింధూరంతో లీలారూపంగా శ్రీస్వామిరూపం చిత్రిస్తే, నిజరూపు ధరించి వెళ్ళిపోసాగాడు. ఇలాగ ఒక్కసారికాదు, అయిదారుసార్లు జరిగింది. ఆలోచించిన శ్రీవ్యాసరాయలు బీజాక్షరాలమధ్య శ్రీస్వామివారి రూపం చిత్రిస్తే, యంత్రంలో స్వామి బందీఅయ్యాడు. ఒకనాడు రాత్రి ఆంజనేయస్వామి, శ్రీవ్యాసరాయల వారికి కలలో కనుపించి, కేవలం కీర్తించి భజిస్తేచాలదు, నా ప్రతిష్ఠలు వివిధ ప్రాంతాలలో జరపాలని చెప్పారు.

శ్రీస్వామివారి ఆదేశంతో ఈ ప్రాంతంలో సుమారు 732 ఆంజనేయ విగ్రహాలను ప్రతిష్ఠించారుట. అటువంటి ప్రతిష్ఠాప్రయాణంలో భాగంగా, చిప్పగిరి గ్రామంలోని భోగేశ్వరస్వామి ఆలయంలో నిద్రిస్తే కలలో కనుపించి,

'నేను ఇక్కడినుండి దక్షిణ దిశలో కొద్దిదూరంలో భూమిలోవున్నాను. నన్ను తిరిగి ప్రతిష్ఠించండి. నాపై ఎండిన వేప చెట్టు వుంది. నీవక్కడికిరాగా అవి చిగురిస్తుందని సంకేతమిస్తారు. శ్రీస్వామివారి ఆదేశం ప్రకారమిక్కడ ప్రతిష్ఠిస్తారు. ఇది నెట్టికంటివూరు కాబట్టి నెట్టికంటి స్వామి అని, ప్రక్కనే కసాపురం వుండటంతో, కసాపురం శ్రీ ఆంజనేయులని కూడా భక్తులు పిలుచుకుని కొలుస్తారు.

స్వామి తూర్పు ముఖంతో, దక్షిణాన్ని చూస్తూ తలచినవారిని, కొలిచినవారికి అభయప్రదాత. పుష్కరిణిలో స్నానం చేసి 108 సార్లు రామనామం చేసేవారిని విధిగా వారి కోర్కెలు తీర్చి కరుణించడం శ్రీఆంజనేయస్వామి లక్ష్యం. "ఓం నమో హనుమతే వీరాంజనేయ"! మంత్రం, మహిమాన్వితం!

## అనంతపురం కాశీవిశ్వేశ్వరుడు

అనంతపురంలోని బుక్కరాయల చెరువుకట్ట వద్దగల ముసలమ్మ నగరంలో కాశీవిశ్వేశ్వరాలయం వుంది. ఒకప్పుడు దివ్యప్రభలతో వెల్గిన ఈ ఆలయం ఇప్పుడు ప్రాభవం కోల్పోయింది. విశ్వేశ్వరుడు (శివలింగం) కూడా అదృశ్యమయ్యాడు. ఇప్పుడు విశాలాక్షి మాత్రమే ఒంటరిగా నిలిచింది. దీనికి బాధపడిన సమీప భక్తులు, కూరగాయల మార్కెట్టు వారు కల్పించుకుని శివలింగం ప్రతిష్ఠ, కళాకలాపం జరిపారు. నిత్య అర్చనాదికాలను ప్రారంభింపచేసి తమ భక్తితత్పరలను ప్రకటించుకున్నారు. 1929లో నగరం నడిబొడ్డున శ్రీకాశీవిశ్వేశ్వర, కోదండరామాలయాలు ప్రతిష్ఠించబడి, శ్రీ హోసూరు రామయ్యగారి పుణ్యమాఅని భక్తులకు శ్రీరామాలయ, శివాలయాలు లభించాయి.

ఇంకో విశేషం. శివపంచాయతనాలయ మనడానికి వీలుగా, మధ్యలో విశ్వేశ్వరుడు, నైఋతి శ్రీమహాగణపతి, వాయవ్యంలో పార్వతి, ఈశాన్యంలో విష్ణువు, ఆగ్నేయంలో సూర్యనారాయణుడు దర్శనమిస్తారు. ఉపాలయాలు కూడా వున్నాయి. త్యాగరాజస్వామి ఆరాధనలతోపాటు, సర్వపర్వదినాలు పాటించబడతాయి. భక్తుల నానందపరుస్తాయి.

## శ్రీలక్ష్మీచెన్నకేశవాలయం

1848 సం॥లో స్వామి కలలో కనబడి మహాభక్తుడైన నరసింహాచారిగార్ని ఆలయం నిర్మించు. నేను ఫలానాచోట వున్నానని వునికి తెలిపారు. అంతే! భగవదాదేశంతో ఆలయ నిర్మాణం ప్రతిష్ఠలు జరిగాయి. నిత్యధూపదీప నైవేద్యాలకు కొరతలేని విధంగా వందలాది ఎకరాలను భక్తులు సమర్పించారు.

## విరూపాక్షాలయం

పాతూరులో శ్రీవిరూపాక్ష ఆలయముంది. దీనిని శ్రీవిజయనగరసామ్రాజ్య ప్రతిష్ఠాపనాచార్యులైన శ్రీశ్రీశ్రీ విద్యారణ్యులవారు నిర్మించినట్లు తెలుస్తోంది. ఆలయం చిన్నదే, మహిమ లనంతమన్నట్లు అందరు పిలుచుకునే శివుడు ఇక్కడ శ్రీ విరూపాక్షునిగా పూజలందుకుంటున్నాడు.

## నగరేశ్వరాలయం

విజయనగరసామ్రాజ్యన్ని నిర్మించాక, రాజ్యసంరక్షణార్థం శ్రీవిద్యారణ్యులవారే ఈ నగరేశ్వరుని ప్రతిష్ఠించి,

ఆలయం నిర్మించినట్లు తెలుస్తోంది. ఇంతేకాదు బుక్కరాయల చెరువు సమీపంలోని గట్టుమీద శ్రీగణపతి ఆలయంతోపాటు, అయ్యప్ప, శ్రీషిర్డిసాయి, శ్రీఆంజనేయస్వామి ఆలయాలు అధిక సంఖ్యలో భక్తులను ఆనందపరుస్తున్నాయి.

ఇక్కడ 1957లో నిర్మించిన శ్రీవాసవీకన్యకా పరమేశ్వరి ఆలయం చూడదగ్గది. ఇక్కడ కొల్హాపురమహాలక్ష్మి గ్రామదేవతగా పూజలందుకుంటోంది. ఇక్కడ రత్నగిరిలో శ్రీమల్లికార్జునస్వామి ఆలయం కూడా అతి ప్రాచీనమైనది. భక్తజనుల పూజలందుకునే పురాతనమైనది.

పామిడిలో శ్రీభోగేశ్వరాలయం వుంది. శివుడే ఇక్కడ త్రిలోచనుడు (లింగం) గా దర్శనమిస్తాడు. నిర్మాణ కాలం తెలియదు, నిర్మాతలు తెలియరు. చరిత్రకందని అతి ప్రాచీన ఆలయం. అయితే స్థలపురాణం ప్రకారం ఇచ్చట ఒకచెట్టు క్రిందగల పుట్టలో శివలింగం పాము ముడి(చుట్ట)గా చుట్టుబడి వుండటంతో మొదట్లో 'పాముముడి' అని రాను,రాను 'పామిడి' అయిపోయింది. ఆరడుగుల ఎత్తుగల శివలింగం, మూడు కళ్ళతో ముచ్చటగా భక్తులను ఆకర్షిస్తుంది. వారి కోర్కెలను నెరవేరుస్తుంది. ఇక్కడ నిత్యపూజలు, జాతర్లు, కార్తీకమాస అభిషేకాలు, అన్నీ మామూలే!

క్రొత్తచెరువు, సోమేశ్వరస్వామి. ఈ శివుడు సనాతనుడే. పురాతనుడే. వివరాలు అడగవద్దు. ఇక్కడి విశేషం 400 కిలోల గంట. దీనిని 'ధర్మగంట' అని చెప్పుకుంటారు. నిత్యపూజలు, ఉత్సవాలు సరేసరి! భక్తులు, భక్తి- యధావిధి.

## సుంకాలమ్మ

ఓబులాపురం ప్రాంతంలో ఓ గ్రామదేవత. ఇది ఎప్పటిదీ ... అంటే... 200 సం॥ల ముందునుండే ఈ ప్రాంతంలో వున్నట్లు, తమ దేవతయని గిరిజనులు చెప్పుకుంటారు. కాకపోతే, ఇప్పుడు కలిప్రాభవంగా మన పాలకులు, ఖనిజత్రవ్వకానికి అడ్డుగావుందని ఈ ఆలయాన్ని తరలించచూసారు. భక్తుల అభ్యంతరంతో వెనకడుగు వేసారు. ఈ ఆలోచన ఫలితం ప్రభుత్వ, ఈ తరలింపుకు తలచిన వారు తగు ప్రాయశ్చిత్తాన్ని పొందారు.

## దశభుజ గణపతి

రాయదుర్గంలో దశభుజ గణపతి ఆలయం, దీనితోపాటు శ్రీకృష్ణదేవరాయలు నిర్మించిన ఆలయాలు చిన్నవో, పెద్దవో, అడుగడుగున మనకు దర్శనమిస్తాయి. అటువంటి దేవాలయాలలో ఈ దశభుజ గణపతి చెప్పుకోదగ్గ ఆలయం. 10 అ॥ఎత్తుగల గణపతి ఎడమ తొడపై స్త్రీమూర్తి కూర్చుని వుంటుంది. ఆమెను లక్ష్మీదేవిగా, స్వామిని శ్రీలక్ష్మీగణపతిగా తలుస్తారు. ఇంకా ఇక్కడికి 3 కి.మీ దూరంలోని లింగాలబండపై గల పశుపతి నాథాలయం, అలాగే శ్రీకోదండరామ, భైరవ, మాధవస్వామి ఆలయాలను చూడవచ్చును. ఇక్కడ శ్రీకృష్ణదేవరాయలు విడిదిగా చెప్పుకునే తిరుమల ఆలయాన్ని పోలిన ఒక దివ్యాలయం చందనం కర్రతో చేయబడిన దానిని మనం చూడగల్గుతాం.

## నాగులమడక - శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుడు

ఉత్తర పినాకినీ నదీతీరంలో ఈ మహిమాన్విత ఆలయముంది. 400 సం॥లు క్రితం అన్నంభట్టు అనే బ్రాహ్మణుడు, తనకు కలలో కనిపించిన శిలాప్రతిమ కోసం నదీ తీరంలోని ఇసుకప్రాంతాన్ని నాగలితో దున్నిస్తుంటే ఏడుతలల

నాగేంద్రుడు శిలారూపంలో లభించాడు. దీనికి ఆలయనిర్మాణం విగ్రహప్రతిష్ఠ, కళాకలాపం సశాస్త్రీయంగా జరిగాయి. 'మడక' ... అంటే నాగలి. దానితో బయటపడిన స్వామిని ఈ ప్రాంతాన్ని కూడా 'నాగలిమడక' శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుడు అని వాడుకలోకి వచ్చేసింది. ఇక భక్తులు భక్తి, అది ఫలానా.. అని నిర్దేశించకూడదు. వీటికి చెప్పుకునే ప్రత్యేక నియమాలు వారివారి అభీష్టం – స్వామివారి కరుణను అందచేస్తుంది. భక్తివినా శ్రద్ధ విశ్వాసాలు అనంతఫలదాయకాలు.

## సలకంచెరువు - సత్య,వేణుగోపాలుడు

శింగనమలకు 11 కి.మీ దూరంలో 'సలకం చెరువు' అనే గ్రామముంది. ఇందులోని సత్య, వేణుగోపాలస్వామి ఆలయం అతిప్రాచీనమైంది. ఇచ్చటి ఒక శివాలయాన్ని పునరుద్ధరిస్తూంటే, 51/2 అడుగుల సత్య, వేణుగోపాలస్వామి విగ్రహం లభించింది. అర్ధనారీశ్వర పద్ధతిలో వున్న ఈ శ్రీసత్య, వేణుగోపాలస్వామి విగ్రహం 16వ శతాబ్దానికి చెందినదిగా చారిత్రకుల అభిప్రాయం. ఈ విగ్రహం ఎడమవైపు స్త్రీరూపం. నాలుగు చేతులలో విల్లు, పరశువు, బాణం, పాశములు కలిగ్ని వీరమూర్తిగా వుంటుంది. కుడి భాగంలో పురుష రూపం రెండు చేతులతో పట్టుకుని వేణువు వాయిస్తూంటే, పాదాలవద్ద గోవులు ఆ వేణునాదానికి తన్మయత్వమౌతున్నట్లుంటుంది. ఇటువంటి విగ్రహాలు అపురూపమనే చెప్పాలి.

## కూడేరు - జోడులింగాల ఆలయం

అనంతపురం కూడా మహాభక్తనిలయం, దివ్యక్షేత్రంగా తలువవచ్చును. శ్రీకృష్ణదేవరాయల ప్రాభవ చిహ్నాలనెన్నో ఇక్కడ దర్శించగల్గుతాం. ఇచ్చటి కూడేరు (సంగమం) జోడు ఆలయాలు పదవ శతాబ్దానికి చెందినవిగా చెప్పబడుతున్నాయి. దీనికి పౌరాణిక, చారిత్రక నేపథ్యం తెలిపే ఎన్నో శాసనాలు ఆలయ ప్రాంగణంలో, తెలుగు లిపిలో చూడగల్గుతాం. పశువులను తీసుకువెళ్ళే సిద్ధప్పనాయకుడు, ఈ కూడేరు వద్దకు రాగా, తన పశువులను ఒక ప్రక్కన పెట్టి, అక్కడ దొరికిన శిలలతో వంటచేయడానికి ప్రయత్నం చేస్తే పెద్దశబ్దంవచ్చి అతనికి పశువుల కాపరులకు కళ్ళుపోయాయి. అప్పుడొక బాలుడు వచ్చి ఇది పుట్టుశిలలని, వీటిని వంటకుపయోగించరాదని చెప్పి వారి ప్రార్ధనకు సమాధానంగా, బాలరూపంలో వచ్చిన శివుడు ఇక్కడి బూడిద పూసుకోమంటాడు. ఆ వెంటనే కళ్ళువస్తాయి.

ఊరికి దూరంగా విశాల ప్రాంగణంలో ఈ ఆలయం నిర్మింపబడింది. శివపార్వతుల అర్ధనారీశ్వర తత్వానికి నిదర్శనంగా, వారిద్దరు ఒకే పానపట్టంపైన దర్శనమిస్తారు. ఈ జోడు లింగాలపై సూర్యకిరణాలు పడటమొక విశేషం. ఈ ఆలయ ప్రాంగణంలో వినాయకుని దర్శించుకోగల్గుతాం. భక్తిగల భక్తులు, ప్రాంతాల భేదంలేకుండా కర్ణాటక రాష్ట్రంనుండి కూడా వస్తుంటారు. అన్ని అద్భుత శిల్పాలు గల ఆలయాలవలెనే ఈ ఆలయాలకు కూడా ఆలనాపాలనలు కనబడవు.

భక్తి ఒక్కటే కూడుపెట్టదు. గుడ్డ ఇవ్వదు. భక్తితో పాటు శ్రద్ధ–విశ్వాసాలు ప్రకటిస్తే ఆయా ప్రాంతాలలోని ఆలయాలను అభివృద్ధిపరచుకోవడం లేదా జాగ్రత్త పరచుకోడం చెయ్యవచ్చును.

# కర్నూలు జిల్లా

## శ్రీశైలం - మల్లిఖార్జునుడు



పురాణప్రసిద్ధమైన ఈ క్షేత్రంలో శ్రీశైల భ్రమరాంబికా మల్లికార్జునస్వామి వారు వేంచేసి వుంటారు. ఎక్కడా లేని విధంగా ఇక్కడ స్వామిని చేతులతో తాకి పునర్జన్మ లేకుండా ముక్తిని పొందవచ్చు. ఇంతటి మహత్తు గల పుణ్యక్షేత్రం ద్వాదశ జ్యోతిర్లింగములలో మొట్టమొదటిది. సముద్ర మట్టానికి 1500 అడుగుల ఎత్తులో వున్న ఈ అనాది క్షేత్రమును శ్రీరామచంద్రుడు బ్రహ్మహత్యాపాతక విముక్తికై ప్రదక్షిణ చేశాడు. శ్రీ భ్రమరాంబికాలయంతో పాటు ఎడమవైపు పార్వతీదేవి ఆలయం వుంది. ఆంధ్రులకు గర్వకారణమైన శ్రీశైలంలో దర్శనీయ స్థలాలు ఎన్నో వున్నాయి. శ్రీశైల శివలింగాన్ని చూస్తే పునర్జన్మ లేదన్నది శాస్త్ర వచనం, పెద్దల వాక్యం కూడా!

ఇటు తెలంగాణా, అటు ఆంధ్ర ప్రాంతాలను కలిపే నల్లమల కొండలు విస్తరించిన ప్రదేశమిది. శ్రీశైలానికి ముఖద్వారం దోర్నాలగ చెప్పాలి. మార్కాపురం, నంద్యాల, కర్నూలు రైలుమార్గం గల ప్రాంతాలు. ఇక్కడనుండి శ్రీశైలానికి బస్సు సౌకర్యంవుంది. అలాగే ప్రసిద్ధిగాంచిన విజయవాడ, గుంటూరుతోపాటు రాష్ట్ర రాజధాని, ముఖ్య ప్రాంతాలనుండి బస్సు సౌకర్యంవుంది. శ్రీశైలం నిజానికిది వూరు కాదు. శివుడు కోసం ఏర్పాటైన ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలలో మొట్టమొదటిది. ఇక్కడి భ్రమరాంబా మల్లిఖార్జున దేవస్థానంవారు వసతి గృహాలు, భోజన సదుపాయాలు వున్నాయి. ఇక్కడి విశేషమేమిటంటే, ప్రతి కులానికి సత్రాలున్నాయి. అక్కడ వసతి, భోజనాల సదుపాయాలు ఉచితంగా లభిస్తాయి.

ఈ శ్రీశైల దేవాలయాన్ని "చంద్రావతి" అనే ఆమె, శివుని ఆదేశంతో నిర్మించిందని, ఈమె ఒక రాజకుమార్తెఅనీ, సురాపానమత్తులో తండ్రే ఈమెను వంచించబోతే పారిపోయి అడవిలో గోవులను కాచుకుంటూ బ్రతుకుతోందని, ఈమెకు శివుడు కలలో కనుపించి, తాను పుట్టలో వున్నానని తెలియపరిస్తే, చంద్రావతి శివాలయం నిర్మించిందనే కథ ఆలయ గోడలపై చెక్కబడివుందిట.

అర్జునుడు పాశుపతాస్త్రం కోసం చేసిన తపస్సు, శివుడు కిరాతకునిగా వచ్చి అర్జునునితో యుద్ధం చేయడం, వగైరా కథ ఇక్కడే జరిగిందని, బోయవానిగా వచ్చిన శివుడు ఇక్కడ లింగరూపంలో వుండిపోయాడని, మరొక కథనం. అందువల్లనే ఈ ప్రాంతంలో వుండే బోయ, కోయ, చెంచు జాతివారు ఈ జంగమయ్యను తమ కులదైవంగా పూజిస్తారు. స్వామివారి కల్యాణోత్సవంనాడు జరిగే రథోత్సవాన్ని ముందుగా చెంచు జాతివారే నడిపించడం ఇక్కడి ఆచారం.

ఈ ఆలయానికి కృష్ణదేవరాయలు ప్రాకారం కట్టించారని, తులాభారంతో వెలలేని ఆభరణాలను సమర్పించాడని,

ఆలయంలోని శాసనాలు చెబుతున్నాయి. ఇక్కడ "రత్నగణపతి" అని, "సాక్షిగణపతి" అని వున్నారు. గుడి ఆవరణలో, స్వామివారి గర్భాలయానికి ఎడం ప్రక్కన "స్థానమల్లయ్య" అని లింగముంది. ఇదే చంద్రావతికి దొరికిన అసలు లింగంగా చెబుతారు. దీనికి కాస్త ముందుకు వెళితే సహస్రలింగేశ్వరుడు దర్శనమిస్తాడు.

ఆరవ శతాబ్దంలో కదంబ వంశపు రాజు మయూరవర్మ, ఆ తదుపరి పల్నాడు, కొండవీటి ప్రభువులు ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకున్నారు. పద్నాలుగవ శతాబ్దంలో కామారెడ్డి ఆలయం వరకు మెట్లను నిర్మిస్తే, ఆతని కుమారుడు అనవేమారెడ్డి కొన్ని మండపాలు నిర్మించి, ఆలయానికి శోభను చేకూర్చాడు.

తన విజయయాత్రకు, చిహ్నంగా జయమంటపం, రాయల గోపురం నిర్మించిన శ్రీకృష్ణదేవరాయలు స్వామివారికి ప్రాకారం కట్టించడమే గాకుండా, ఎన్నో వెలలేని ఆభరణములు సమర్పించి తన భక్తిప్రపత్తులను చాటుకున్నాడు. శివాజీ మహారాజుకు భ్రమరాంబ కత్తిని ప్రసాదించినదీ ఇక్కడే.

ఆచార్య నాగార్జునుడు మొదట్లో ఇక్కడేవుండి "మహాయాన" శాఖను స్థాపించి, బౌద్ధమత ప్రచారానికి తగు విధంగా స్పందించాడు. అంతవరకు శైవులకు, శాక్తేయులకు కేంద్రంగావున్న శ్రీశైలంలో బౌద్ధం ప్రబలి, స్వతంత్రంగా పూజచేసుకునే సిద్ధాంతానికి దారిచేసింది.

ఆదిశంకరుల పుణ్యమాఅని బౌద్ధం సన్నగిల్లి శైవం ప్రాణంపోసుకుంది. ఆది శంకరులు ఇక్కడే మహా శక్తివంతమైన బీజాక్షర నిర్మిత సౌందర్యలహరిని, భ్రమరాంబా అష్టకాన్ని రచించారుట. భ్రమరాంబకు శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించారు. భీమునికొలను, శిఖరేశ్వరాలయం, విభూతికుండం, వీరభద్రస్వామి ఆలయం, బయలు వీరభద్రస్వామి, సుదర్శన వీరభద్రుడు, ఆరామ వీరభద్రుడు, జటావీరభద్రుడు, దర్శించవలసిన ఆలయాలు. 36 మంది వీరభద్రులున్నారని చెబుతారు. అందులో ఆరుగురు శ్రీశైల పరిధిలో వున్నారు. ఉత్తర కర్ణాటక వారికిదొక ముఖ్య క్షేత్రం. వీరశైవానికి పునాదికూడ ఇక్కడే పడింది. వీరశైవానికి మూలపురుషులైన గురువులు వీరశైవుడైన పండితారాధ్యుడు చెప్పుకోదగ్గవారు. పన్నెండవ శతాబ్దంలో ఆ మహనీయుడు స్థాపించిన మఠం శ్రీశైలంలో మనం చూడవచ్చును.

ఇంకా ఇక్కడ "పాలధార – పంచధారలు" ఆది శంకరులు తపస్సు చేసిన ప్రదేశం, సహస్ర లింగాలయం, మనోహరగుండం, చంద్రకుండము, వృద్ధ మల్లికార్జున స్వామి, రుద్రాక్ష మంటపము, సారంగ మంటపము, పంచాక్షరీ మంటపము, గోగర్భం, ఘంటామఠము, ఏనుగుల చెరువు, పాతాళ గంగ, లింగాలగట్టు, నృసింహబిలము, హటకేశ్వరుడు, వగైరాలు దర్శించి తరించవచ్చును. ఒకప్పుడు కాలుపెట్టి ముందుకు సాగలేని ఈ అటవీప్రాంతం ఈనాడు సర్వులకు దర్శనీయమైన పరమ పవిత్ర పుణ్యక్షేత్రమయింది.

కృతయుగంలో దీనిని హిరణ్యకశిపుని పూజామందిరంగా చెప్పబడింది. త్రేతాయుగంలో శ్రీసీతారాములు ప్రతిష్ఠించిన సమస్రలింగేశ్వరుడు, ధ్వాపరంలో పాండవులు, ద్రౌపది ప్రతిష్ఠంచిన లింగాలను మనం దర్శించగల్గుతాం. ఇక కలియుగంలో శివాజీ, శ్రీకృష్ణదేవరాయలుతోపాటు ఎందరో శ్రీస్వామిని దర్శించి, తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు.

పూర్వం శిలాదుడనే మహర్షి సంతానంకోరి శివునికై తపస్సు చేస్తే ఇద్దరు పుత్రులు కలిగారు. ఒకరు నంది, మరొకడు పర్వతుడు. నంది శివుని ప్రార్థించి ఆయన వాహనమైతే పర్వతుడు తనపై వశించమని శాశ్వతత్వం

కల్గించమని కోరతాడు. అతన్ని పర్వతం చేసి, శివుడు ఆశైలంపై వెలుస్తాడు. వసుమతి అనే ఆమె తపోశక్తివలన ఆమె 'శ్రీ' అయి, శైలానికి 'శ్రీ'చేరి శ్రీశైలంగా విఖ్యాతమైంది. చెంచుమల్లయ్య అయిన శివలీలలు, ఆలయగోడలపై అర్ధవంతంగా ఆకర్షణీయంగా చెక్కబడివున్నాయి.

ఇక్కడి దేవత భ్రమరాంబ అష్టాదశ శక్తిపీఠ స్వరూపిణి. భ్రామరీ అయిన అంబ శివుని పరిణయమాడ తలిస్తే ఒక భ్రమరం చూపి అది విశ్రమించినప్పుడు పెండ్లాడతానంటాడు. ఎన్ని సం॥లు జరిగిందో తెలియదు. ఒకనాడు విశ్రమించిన భ్రమరం నుండి పరమశివుడు వృద్ధమల్లికార్జునుడిగా అవతరించి, ఇప్పుడు వివాహం తగదంటే, శారీరకంకన్నా, ఆత్మసౌందర్య మిన్నయనిచెప్పి, ఆమె ఆ వృద్ధమల్లికార్జునుని వివాహమాడుతుంది.

దేవీభాగవత కథనం ప్రకారం, లోకపీడాకరుడైన అరుణుడనే రాక్షసుని చంపడానికి భ్రమరమై అతడిని అంతంచేస్తుంది. దాంతో ఆమె భ్రమరాంబ అవుతుంది.

శ్రీశైలం చుట్టుపట్ల ఒకప్పుడు వందల కొలది మఠాలువుండేవట. ప్రస్తుతం ఘంటామఠం, భీమశంకరమఠం, వీరభద్రమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అని ఆరు మాత్రమే వున్నాయి. వీటిలో వీరభద్రమఠం మినహాయిస్తే మిగిలినవాటిని పంచమఠాలంటారు. వీటి అన్నింటిలో అతి ప్రాచీనమైనదిగా 'ఘంటామఠాన్ని' చెబుతారు.

శ్రీశైలం నుండి డోర్నాలవైపు, నెక్కంటి-పాలుట్ల అడవీమార్గంలో 10 కి.మీ. ప్రయాణిస్తే శ్రీఇష్టకామేశ్వరీ దేవి ఆలయం, మనం దర్శించవచ్చును. ఈ అతిప్రాచీన క్షేత్రం వేయి సం॥లదని చెప్పుకుంటారు. ప్రస్తుతం జనసంచారంలేని ప్రదేశం. ఇకపోతే శ్రీశైలంనుండి ఇక్కడికి వచ్చి ఈ తల్లికి పొంగలి ఆరగింపచేసి మనం తరించవచ్చును. కామేశ్వరి ఆలయాలు వున్నాయి. కానీ ఇష్టకామేశ్వరి ఆలయం మనకు తెలిసి ఇదే ప్రథమ మని చెప్పుకోవచ్చును.

## మల్లికాతీర్థం

ఇక్కడ ఎన్నో తీర్థాలు, తెలియని ప్రాంతాలు, ఋషీశ్వరుల ఆశ్రమాలు ఎన్నో... ఎన్నో.. వున్నాయి. కొన్నింటిని మనం చేరలేముకూడ. అలాగే ఇక్కడ మల్లికాతీర్థాన్నీ హైదరాబాదునుండి 44 కి.మీ ప్రయాణించి, వటువర్లపల్లిలో ఆగి, అక్కడనుండి సార్వపల్లి కుడిచింతల మీదుగా 10 కి.మీ. ప్రయాణిస్తే ఇక్కడికి ఆటోలు వాహనసౌకర్యం వుంది. కాకపోతే 1 కి.మీ లోయలోకి జాగ్రత్తగా నడిచివెళ్తే దివ్యమైన పవిత్రమైన మల్లికాతీర్థం దర్శించగల్గుతాము. ఇక్కడ శివలింగముంది. ఆయన పేరు మల్లిశ్వరుడు. కష్టపడి తన దగ్గరకు వచ్చినవారి సర్వకామ్యాలను తీర్చే దేవదేవుడు ఈ మల్లీశ్వరుడు.

పాతాళగంగనుండి 10 కి.మీ కృష్ణానదిలో ప్రయాణించి, అక్కడి బండరాళ్ళపై దిగి, భక్తితో శివనామస్మరణం చేసుకుంటూ ఈ గుహలను చేరుకోవచ్చును. గుహలలోపలకు వెడితే సహజసిద్ధంగా ఏర్పడిన శివలింగాకార దృశ్యం మనం చూడవచ్చును. ఇక్కడ ఎన్నో సహజ శిలారూపాల్ని మనం చూడవచ్చును. కన్నడ దేశంలోని 'ఉడుతడి' గ్రామంలో పుట్టి, శివుని తన సర్వస్వంగా తలచివచ్చి ఈ గుహలలో తపస్సు చేసి, కదళివనంలో సిద్ధిపొందిన శివప్రియ ఈ తల్లి. ఇక్కడ ఎన్నో శిలారూపాలు, సహజ స్తంభాలు మనం చూడగల్గుతాము.

# శివరాత్రికి శ్రీశైలం - భ్రమరాంబకు బ్రహ్మారథం



తెలుగు నేలపై వెలసిన ద్వాదశ జ్యోతిర్లింగాలలో రెండవది అయిన శ్రీశైలం మల్లిఖార్జునస్వామి, అష్టాదశ మహాశక్తులలో ఒకరైన శ్రీభ్రమరాంబాదేవికి నిలయం ఈ మహాక్షేత్రము ఏటేటా ఎక్కువ మంది భక్తులను ఆకర్షిస్తోంది. శాలివాహన శకారంభానికి ముందు సిద్ధ నాగార్జునుడు శ్రీశైలంలో నివసించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు.

శాతవాహన కాలం నుండి విజయనగర సామ్రాట్టుల వరకు ఆయా ప్రభువులు ఈ దివ్యక్షేత్రాన్ని దర్శించారు. శ్రీకృష్ణదేవరాయలు 1515లో శ్రీశైలం మల్లిఖార్జునుని సేవించి రథోత్సవము జరిపించారని తెలుస్తోంది. శ్రీశైలం ఆలయానికి నలువైపులా నాలుగు ప్రధాన గోపురాలు ఉన్నాయి. దక్షిణం వైపున విజయనగర సామ్రాజ్యాన్ని నిర్మించిన శ్రీహరిహరరాయలుచే నిర్మించబడిన గోపురం, ఉత్తరం వైపున ఛత్రపతి శివాజి నిర్మించిన గోపురం, తూర్పున శ్రీకృష్ణదేవరాయులు నిర్మించిన గోపురం గలవు. ఈ క్షేత్రములో వెలసిన మల్లిఖార్జునస్వామి, భ్రమరాంబదేవి ఇరువురు స్వయంభువులే. స్వామి దర్శనంతో పాటు కనువిందైన ఇతర దృశ్యాలు అనేకం ఉన్నాయి. పంచమఠాలు, నందిమంటపం, సాక్షిగణపతి, ఆటకేశ్వరం, పాలధార, పంచధారలు, శిఖరేశ్వరం, కైలాసద్వారం వంటి దృశ్యాలతో పాటు, జలవిద్యుత్ కేంద్రము దర్శనీయ స్థలాలు. ప్రతి ఏటా శివరాత్రికి జరిగే ఉత్సవములలో లక్షలాది మంది భక్తులు ఇతర రాష్ట్రముల నుండి కూడా విచ్చేస్తుంటారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో కృష్ణానది తీరాన గల శ్రీశైలం మల్లిఖార్జున దేవాలయం హైదరాబాదు నుండి 210 కిలోమీటర్ల దూరాన గలదు. నాగార్జునసాగర్ నుండి కృష్ణానదిలో జరియాలాంచిపై 96కి.మీ. ప్రయాణంచేసి శ్రీశైలం చేరుట యాత్రికుల మరచిపోలేని మధురానుభూతి.

## శ్రీశైలంలోని అష్ట శిఖరాలు


1. **వైఢూర్య శిఖరం** : కర్నూలు జిల్లా త్రిపురాంతకంలో ఉన్నది. అష్టవసువులకు నెలవు.
2. **మాణిక్య శిఖరం** : ఉమామహేశ్వరంలో ఉన్నది. మహేశ్వ రుని రుద్రగణాల క్షేత్రము.
3. **ప్రవాళ శిఖరం** : పుష్పగిరిలో ఉన్నది – రంభ, ఊర్వశి, మేనక, ఘృతాని, తిలోత్తముల నెలవు.
4. **బ్రహ్మ శిఖరం** : అలంపురంలో ఉన్నది, బ్రహ్మ, సరస్వతుల క్షేత్రము.
5. **రౌద్ర శిఖరం** : సోమేశ్వరంలో ఉన్నది. కుమారస్వామి తన ప్రమధగణాలతో నివశించే క్షేత్రం.
6. **హేమ శిఖరం** : ఉమామహేశ్వరంలో ఉన్నది. పార్వతి పరమేశ్వరులకు బంధుమిత్ర సపరివార క్షేత్రమిది.
7. **మరకత శిఖరం** : అహోబిలంలో ఉన్నది. శ్రీహరి, లక్ష్మీదేవి నివసించిన క్షేత్రము.
8. **వజ్ర శిఖరం** : నందీమండలంలో ఉన్నది. నందీశ్వరుని క్షేత్రము.

## త్రిపురాంతకం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని శ్రీశైలం మహాక్షేత్రము నకు తూర్పుదిక్కున గల ప్రధాన ద్వారమీ క్షేత్రము. తూర్పుదిక్కు నుండి వచ్చు యాత్రికులు ఈ క్షేత్రము నుండి శ్రీశైలం చేరుకుంటారు. విజయవాడ నుండి రైలులో డోర్నాల వచ్చి త్రిపురాంతకం మీదుగా శ్రీశైలం చేరవచ్చును. గుంటూరు నుండి కూడా శ్రీశైలం బస్సులో రావచ్చును. ఈ త్రిపురాంతక క్షేత్రములోని మూల విరాట్ త్రిపురాంత కేశ్వరుడు. స్వామి వారి దేవేరి త్రిపుర సుందరిదేవి. స్వామి వారి ఆలయం కుమారిగిరిపై ఉన్నది. దేవి మందిరం కదంబవనపు మధ్యనగల కాసారము (చెరువు) లో కలదు. స్వామి వారి ఆలయానికి ఉత్తర దిక్కున పూలకొండ, తారకాసురుడు సేవించిన శివలింగం ఉన్నవి. ఈ క్షేత్రం మార్కాపురానికి 40 కి.మీ. దూరంలో ఉంది.

## శ్రీ రాఘవేంద్రస్వామి బృందావనం - మంత్రాలయం



పవిత్ర తుంగభద్రానది సమీపంలో ఆదోని తాలుకాలోని మంత్రాలయం చిన్న గ్రామం. పూర్వం మంచాల అనే (శక్తి స్వరూపము) ఈ గ్రామంలో వెలసి నందున ఈ గ్రామమునకు మంచాల అని పేరు వచ్చినది. ఇప్పుడు ఈ గ్రామమే మంత్రాలయంగా పేరు గాంచినది. శ్రీ రాఘవేంద్రస్వామి జీవసమాధి అయిన ఈ ప్రాంతము పుణ్యస్థలముగా ప్రసిద్ధి చెంది లక్షలాది భక్తులకు వర ప్రదాయని అయినది. కుల, మత, వర్ణ, వర్గ విచక్షణ లేకుండా అనేక రాష్ట్రాల నుండి భక్తులు ఈ ప్రాంతమునకు విచ్చేసి శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించి తమ కోర్కెలు తీర్చుకుంటున్నారు.

ఈ దేవాలయంలో భక్తుల కొరకు రాత్రింబవళ్ళు ఉచిత భోజన వసతి సౌకర్యములు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతమునకు ఇతర ప్రాంతముల నుండి బస్సు సౌకర్యము కలదు. ఈ క్షేత్రములో భాద్రపద మాసములో గొప్ప ఉత్సవము జరుగుతుంది. స్వామి వారిని దర్శించే ముందు గ్రామదేవత అయిన మంచాలమ్మను కూడా తప్పనిసరిగా దర్శించాలని స్వామివారి ఆభీష్టము.శ్రీరాఘవేంద్రులు కారణజన్ములు. ఒకనాటి ప్రహ్లాదుడు శంఖుకర్ణుడను పేరుతో బ్రహ్మకు పూజాది కార్యక్రమాలలో తోడ్పడే అతడు ఒకనాడు శ్రీరామదర్శనం కల్గి విధినిర్వహణలో అలక్ష్యం ప్రదర్శిస్తే, రాక్షసునిగా పుట్టమని శాపమిస్తాడు. అతడే ప్రహ్లాదుడు. ఈ ప్రహ్లాదుడే కారణజన్మంగా ఈ కలియుగంలో మొదట వ్యాసరాయలు గాను, ఆ తదుపరి రాఘవేంద్రునిగాను జన్మిస్తాడు.

ఈ వివరాలు సంపూర్ణంగా తెలుసుకునేటందుకు, ఈ రచయితే – గురుదేవులు శ్రీశ్రీశ్రీ వొరుగంటి రామకృష్ణ ప్రసాద్ వ్రాసిన "శ్రీసద్గురు రాఘవేంద్రస్వామి జీవితచరిత్ర" (నిత్యపారాయణ గ్రంథం) చదవాలి.

ఆ రకంగా భూలోకంలో ముందు వెంకన్నభట్టుగాను, ఆ తదుపరి యత్యాశ్రమమొంది "రాఘవేంద్ర తీర్థు"లైన మహనీయులు, కోరికోరి ఒకనాడు ప్రహ్లాద ప్రభువులు యజ్ఞం చేసిన తుప్పలమాంచాలను అరణంగా కోరి, అక్కడ జీవసమాధి పొందుతారు.

తన గ్రంథాలకు జీవితం 300 సం॥లని, జీవసమాధిలో తాను 700 సం॥లు వుండి భక్తజనరక్షణం గావిస్తానని అభయప్రదానంచేసి, క్షేత్రాధిదేవతయైన మంచాలమ్మను తాను అభిమానించి పూజించే పంచముఖాంజనేయుని తన కర్తవ్యదీక్షలో సహకరించమని, తన భక్తులను సదా కాపాడమని కోరతాడు.

సామాన్యునిగా జీవించిన వెంకన్నభట్టు గురువు సుధీంద్రతీర్థులవారితోపాటు దిగ్విజయయాత్రలు చేసినా, అఖండ సన్మానాలు పొందినా ఆర్జించినది కీర్తినే తప్ప బ్రతుకడానికి కావల్సిన సిరిసంపదలను కాదు. దీంతో వున్న ఒకేఒక పిల్లవానికి పాలు కూడా ఇవ్వలేని దయనీయ స్థితిలో నీ కష్టసుఖాలకు మేము తోడున్నారన్న గురుదేవుల వాక్యంతో ఆశ్రమం చేరి పిల్లలకు పాఠాలు చెబుతూ, తాను అభివృద్ధి పొందుతూండగా ఉన్నట్టుండి ఒకనాడు సుధీంద్ర తీర్థులవారు, రాముని ఆదేశమంటూ "సన్యాసం" విషయం బయటపెడతారు. ముందు కలవరపడతాడు. తదుపరి వెంకన్నభట్టుకు సరస్వతిదేవి ప్రత్యక్షదర్శనమిచ్చి, ఆతని బాధ్యతలు గుర్తుచెయ్యడంతో విధిలేక అనుకున్నవాడు, ఆనందంగా యత్యాశ్రమం స్వీకరించి "రాఘవేంద్ర" గురుతీర్థులుగా ఎందరినో కరుణించి, కటాక్షించి ధన్యజీవులను చేస్తారు. అటువంటి పుణ్యక్షేత్రమిది.

ఈ పుణ్యక్షేత్రంలోనే శ్రీరాఘవేంద్రస్వామి చరిత్ర నిత్యపారాయణ గ్రంథంగా వ్రాయతలచి, ఈ గ్రంథ సేకరణ రచయిత, గురుదేవులు శ్రీశ్రీశ్రీ వొరుగంటి రామకృష్ణప్రసాద్, కేవలం ఏడు రోజులలో, అక్కడ స్వామివారు ఆశీర్వదించిన కరుణకు చిహ్నంగా నిత్యపారాయణ గ్రంథం వ్రాస్తారు.

ఇటువంటి పుణ్యక్షేత్రాన్ని దర్శించడం, శ్రీస్వామిని సేవించడం, చాతనైనంత వరకు మన కనీస కర్తవ్యంగా తలవాలి.

మంత్రాలయం వెళ్ళిన వారు ముందుగా 'నిన్ను, నీభక్తులను సదా కాపాడుతానన్న మంచాలమ్మ తల్లిని దర్శించాలి. ఈమె పరశురాముని తల్లి రేణుకాదేవి, మహాతపస్సంపన్నుడైన తండ్రి ఆజ్ఞతో మారుమాటాడక తల్లిని వధిస్తాడు. అందుకు సంతోషించిన తండ్రి జమదగ్ని, నీ మనోభీష్టమంటే 'నాతల్లిని, అన్నలను బ్రతికించమని కోరతాడు. సంతోషంతో జమదగ్ని వారినందర్నీ బ్రతికిస్తాడు. అనంతరం రేణుకాదేవే మంచాలమ్మగా ఈ తుంగభద్రానదీ తీరంలో వెలిసింది.

హిరణ్యకశిపుడి తల్లిని తమ కులదేవతగా పూజిస్తాడు. కాలక్రమంలో కోరి ఈ తుప్పలమంచాలను కోరిన రాఘవేంద్రులు మంచాలమ్మను చేరి అనుగ్రహించమని ఆశీర్వదించమని కోరతాడు. ఆమె 'అస్తు'అంటుంది. కనుక రాఘవేంద్రుని దర్శించాలని వచ్చే ప్రతి భక్తుడు ముందు మంచాలమ్మను, ఆపైన పంచముఖ ఆంజనేయుని ఆ తదుపరి, శ్రీస్వామిని దర్శించగల్గడం ఎంతో మంచిది. ఇంకా ఈ స్థల విశేషం ఈ స్థలంలో ప్రహ్లాదుడు ఎన్నో యజ్ఞాలు చేసాడు. ఈ ప్రాంతంలోనే తన శరీరాన్ని విడిచిపెట్టాడు. అంతకుమించి...

ద్వాపరంలో అర్జునుడు అనుసాల్వుల మధ్య యుద్ధం జరిగితే ఆ యజ్ఞం ప్రభావంవలన అనుసాల్వుడు విజయమొందుతూంటే, జగన్నాటకసూత్రధారియైన శ్రీకృష్ణుడు తన రథాన్ని వెనక్కి మరలిస్తే అనుసాల్వుడు కూడా ముందుకువస్తాడు. అంతవరకు విజయం సాధించిన అనుసాల్వుడు, అర్జునుని చేతిలో అపజయ మొందుతాడు. అంతటి పరమ పవిత్ర ప్రదేశమిది.

# ప్రసిద్ధ శైవ క్షేత్రం - మహానంది



కర్నూలు జిల్లా నల్లమల అడవులలో ఎత్తైన వృక్ష రాజముల మధ్య ఆహ్లాదకరమైన పర్వత శ్రేణుల దగ్గర ఉన్న పుణ్యక్షేత్రము మహానంది. నంద్యాలకు సుమారు 10 మైళ్ల దూరంలో ఉన్న ఈ క్షేత్రము ప్రసిద్ధ శైవ క్షేత్రముగా పేరు గాంచినది. ఈ మహానంది క్షేత్రము ఎన్నో పవిత్ర తీర్థములు కలిగియున్నది. మహానంది గుడిలో శివలింగం నుండి 5 ధారలు ప్రవహించి గుడికి ముందు ఉన్న కోనేరులలో కలియుచున్నవి. ఈ మహానందినే మహానంద తీర్థమని చెప్పబడుచున్నది. విజయనగర రాజులలో ఒకరైన నరసింహాదేవ రాయులు ఈ క్షేత్రమునకు విలువైన వస్తువులు కానుకగా ఇచ్చినారని చెబుతారు. గుడియొక్క "వాస్తుశైలి" గుడిముందు ఉన్న కోనేరును బట్టి ఈ దేవాలయం చాల పురాతనమైన దేవాలయంగా భావించ బడుచున్నది.

హిందు, ముస్లింలనే భేదము లేకుండా విరాజిల్లిన ప్రదేశములలో మహానంది ఒకటి. దేవదేవుని మండపమునకు ఎదురుగా ఉన్న కోనేరులో మంటపము ఒకటి ఉన్నది. ఈ కోనేరులోకి నీరు వచ్చుపోవు మార్గములు ఈనాటి ఇంజినీర్లకు అంతుబట్టని సమస్య. సుమారు 5 అడుగుల లోతు గల్గిన ఈ కోనేరులో నీరు స్వచ్ఛముగా ఉంటుంది. యిది శ్రీశైలధార, నరసింహధార, దైవోర్ధినిధార, నంది తీర్థము, కైలాస తీర్థము అని పిలవబడుచున్నది. ఈ దేవాలయ మూల విగ్రహము లింగా కారములో ఉండి పేద, ధనిక భేదము లేకుండా అందరూ తాక వచ్చును. ఈ మహానందిలో ఉన్న మూడు కొలనులను రుద్ర గుండము, విష్ణు గుండము, బ్రహ్మ గుండము అని పేర్లు. అమ్మవారి గుడి కూడా ప్రధాన దేవాలయమునకు ప్రక్కనే ఉన్నది. ఇచ్చట శ్రీ చక్రము శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యులు వారు స్వయంగా ప్రతిష్ఠించెనని చెప్పబడుచున్నది. ఈ మహానందికి పదిమైళ్ళ దురంలో నవనందులు కలవు. అయితే స్థానికంగా చెప్పబడే స్థల పురాణం ప్రకారం, ఈ ఆలయంలోని శివలింగ "స్వయంభువ"మని చెబుతారు. అసలీ ప్రాంతమంతా కొండలు, చెట్లు గుట్టలు వున్న అడవిప్రాతం. అక్కడో శివలింగం వుంది. దానిమీద పుట్ట. అదెవ్వరికి తెలియదు. ఆ ప్రాంతంలో పశువుల్ని కాచుకునే గోపాలుడు తన పశువులలో ఒకతి సరిగా పాలు ఇవ్వకపోయేసరికి, దానిని గమనిస్తూ ఒకనాడు పుట్టపై పాలుపోసే గోవును చూసి, కోపంతో చావబాదుతాడు.

ఆ హడావుడిలో ఆవు పుట్టను తొక్కడం, అందులోంచి ఆవు గిట్టలతో త్రొక్కబడిన శివలింగం బయట పడటం జరుగుతుంది. ఆ దృశ్యాన్ని మనం గర్భాలయంలో వున్న శివలింగంలో దర్శించవచ్చును. ఇక ఇక్కడి మరో విశేషం. ఆలయంముందు భాగములోని కోనేరు. ఇందులోకి నీరు ఎక్కడినుంచి వస్తాయో తెలియదు. స్వచ్ఛంగా తెల్లగా వుంటాయి.

ఇందులో పొరపాటున గుండుసూది పడినా చూడగల్గినంత స్పష్టంగా కనుపిస్తుంది. ఇందులో నీరు మరల వూరు చివరకు వెళ్ళి దాదాపు వెయ్యి ఎకరాల అరటితోటను ఫలవంతం చేస్తుంది. ఈ కొలనులోకి నీరు 'రాక-పోక' మాత్రం ఎవ్వరికి తెలియదు.

అంతటి యాంత్రికంగాని, అపురూప నిర్మాణ కొలనులో స్నానం చేస్తే ఎటువంటి దీర్ఘరోగాలైనా పోతాయని, ఆయురారోగ్యములు కల్గుతాయన్నది ఔషధీకృతపుష్కరిణీస్నానం, శివదర్శనం శుభదాయకంగా తలవండి!



## నవనందులు

మహానంది చుట్టు 18 కి.మీ. దూరంలో నవ (9) నందీశ్వరులున్నారు. 14 వ శతాబ్దంలో నందన మహారాజుల కాలంలో ఈ నవనందుల నిర్మాణం జరిగినట్లు తెలుస్తోంది.

**1. ప్రథమనంది –** నంద్యాలకు నైఋతిదిక్కున బ్రహ్మకోరిక మేరకు పరమేశ్వరుడు ప్రథమనందిగా ఇక్కడ వెలిసాడు. ఇక్కడి విశేషం కార్తీకమాసం నెలరోజులు సాయంసంధ్యలో సూర్యకిరణాలు నందీశ్వరుడిపై పడతాయి.

**2. నాగనంది –** నంద్యాలలోని ఆంజనేయస్వామి ఆలయంలో వెలిసాడు. పూర్వం నాగులు గరుత్మంతుని నుండి తప్పించుకోవడానికి పరమేశ్వరునికై ఇక్కడ తపమాచరిస్తే స్వామి 'నాగ' నందీశ్వరునిగా వెలిసాడు. ఇది నాగులకు అభయమిచ్చిన ప్రదేశంగా చెబుతారు.

**3. సోమనంది –** ఆత్మకూరు బస్టాండు సమీపంలో సోమనందీశ్వరుని ఆలయం వుంది. పూర్వం చంద్రుడు (సోముడు) పరమేశ్వరునికై ఇక్కడ తపము చేయగా, అతన్ని కరుణించినట్లు స్వామి, సోమనందీశ్వరుడిగా వెలిసిన ప్రదేశమిది.

**4. శివనంది –** మహానందికి ఉత్తరాన 10 కి.మీ. దూరంలో కడమల కాల్వ గ్రామంలో శివనందీశ్వరాలయ ముంది. ఇక్కడ స్వామి పరమప్రశాంతంగా వుంటుందని కాబోలు  తానుగా ఈ అరణ్యప్రాంతాలలో వెలిసాడు. మిగిలిన వాటికంటే ఇదే పెద్దఆలయం.

**5. సూర్యనంది –** సూర్యుని ప్రార్థనతో శివుడిక్కడ తమ్మడపల్లిలో వెలిసాడు. అందుకే కాబోలు ప్రతినిత్యం సూర్యోదయ సమీపంలోని సూర్యకిరణాలు శివునిపై పడతాయి.

**6. విష్ణునంది –** దీనినే 'కృష్ణనంది' అనికూడా అంటారు. 4 కి.మీ దూరంలోని ఈ ప్రాంతంలో శ్రీహరి శివునికై తపము చేస్తే శివుడు, విష్ణువు కోరికమేరకు విష్ణునందీశ్వరుడుగా వెలిసాడు. ఇక్కడ పాలరాతి నంది ఎంతో అందంగా వుంటాడు. ఇక్కడి నీరు కొన్ని వందల ఎకరాల పంటపొలాల సాగుకు అందించబడుతోంది.

**7. మహానంది –** నిజానికి స్వయంభూక్షేత్రం. కాకపోతే నందన వంశరాజుకు శివుడు కలలో కనుపించి ఈ మహానందితోపాటు, మరో ఎనిమిది ప్రాంతాలలో వివిధ నామాలతో వున్నానని, ఆలయనిర్మాణం చెయ్యమని ఆదేశిస్తాడు. దాని పర్యవసానమే ఈ 'నవ'నంది ఆలయాలు.

**8. వినాయక నంది –** ఇది మహానంది క్షేత్రంలోనే కోనేటి వద్ద వుంది. దీనిని వినాయకుడు తపమాచరించిన ప్రాంతంగా చెబుతారు. అందుకే శివుడు వినాయక నందీశ్వరునిగా వెలిసాడనే స్థలపురాణ రహస్యం.

**9. గరుడ నంది –** వినాయక నందీశ్వరుని దర్శించాలని ముందడుగు వేస్తుంటే, గరుడనందీశ్వరుడు దర్శనమిస్తాడు. మాతృమూర్తి దాస్యం తొలగించుకోవాలనే బయలుదేరే వినతాసుతుడు ఇక్కడే స్వామిని గూర్చి తపస్సు చేసి, శివుని ఆశీస్సులతో మాతృదాస్యం విముక్తి చేస్తాడు.

ఈ నవనందీశ్వరులు ఓపిక, తీర్థయాత్రలయందాసక్తి వున్నవారు తప్పక చూడవలసిన దివ్యస్వరూపాలు. కార్తీక మాసంలో ఇక్కడకు ఎన్ని లక్షలమంది వస్తారో, ఆ శివునికే తెలియాలి. ఇంకో విశేషం... నవనందీశ్వరులు కర్నూలు జిల్లాలోనే వున్నాయి. నవనారసింహాలు ఇక్కడే వున్నారు. చిత్రంగా వుందికదూ.. శివకేశవలీల!

## సంఘమేశ్వర దేవాలయం



కర్నూలు జిల్లా నందికొట్కూరుకు 20 మైళ్ల దూరంలో గల సప్తనదీ సంగమ క్షేత్రమే సంఘమేశ్వరం. ఇక్కడ కృష్ణవేణి, తుంగభద్ర, భవనాశిని మొదలగు ఏడునదులు కలుస్తాయి. ఇక్కడ అతి ప్రాచీనమైన సంఘమేశ్వర దేవాలయం కలదు. శ్రీశైలసాగర్ ఆనకట్ట కట్టుటవలన ఈ దేవాలయాలు పూర్తిగా జలమయ మయినందున ఈ సంఘమేశ్వర దేవాలయాలు నందికొట్కూరు తాలుకా జూపాడు బంగ్లా దగ్గర పునః నిర్మిస్తున్నారు. అయినా యాత్రికులు పవిత్ర పుణ్య స్నానములు చేయుటకు సంఘమేశ్వరం వస్తుంటారు. ఇది చాళుక్యుల నిర్మాణమని, ధర్మరాజు ప్రతిష్ఠ అనీ, సప్తసంగమం, ముక్తిక్షేత్రమని చెబుతారు. అందుకు ఎందరో ఇక్కడికి వచ్చి పవిత్ర స్నానాలు చేసి మరీ వెడుతుంటారు.

## అహోబిలం - నారసింహస్వామి



ఇది శ్రీమహావిష్ణువు నరసింహావతారంలో భక్త (ప్రహ్లాద) జనరక్షణలో భాగంగా హిరణ్య కశిపుని వధించిన ప్రదేశంగా చెబుతారు. ఎగువ, దిగువ అహోబిలాలతోపాటు, మరో ఎనిమిది నారసింహ క్షేత్రాలక్కడ వున్నాయి. తెలంగాణా మధ్యప్రాంతం నుంచి దక్షిణాన తిరుపతి వరకు విస్తరించిన ఈ నల్లమల కొండ లలో నంద్యాలకు 75 కి.మీ దూరంలో ఈ అహోబిల క్షేత్రం వుంది.

ఆంధ్రప్రదేశ్‌లోనే 23 నరసింహక్షేత్రా లున్నాయని చెబుతారు. అయితే సింహాచల, యాదగిరి గుట్ట, మంగళగరి ఈ అహోబిల క్షేత్రాల నరసింహస్వామే ప్రసిద్ధ క్షేత్రజ్ఞులని ప్రముఖుల మాట. ఆళ్ళగడ్డ నుండి అహోబిలం 24 కి.మీ, నంద్యాలనుండి ఆళ్ళగడ్డ మీదుగా షుమారు 75 కి.మీ. గంట గంటకు బస్సులున్నాయి. అహోబిల క్షేత్రం ఎగువ, దిగువ అని రెండు భాగాలుగా వుంది. దిగువ అహోబిలం నల్లమల కొండలకు పాదభాగం. ఇక్కడ బస్సుస్టాండు వద్ద లక్ష్మీనరసింహస్వామి ఆలయం వుంది.

నవ నరసింహాలయాలలో ఈ ఆలయం లెక్కకు రాదు. వూరికి దక్షిణంగా 2 కి. మీ. దూరంలో రెండు ఆలయాలు, ఊరికి ఉత్తరాన 3 కి.మీ. దూరంలో మరొక ఆలయం వుంది. ఇవి నవనారసింహులలో భాగమే. ఈ ఆలయాలను మనంగా చూడలేము. గైడులు (మార్గదర్శకులు) వుంటే, కాస్త సులభంగా దర్శనం చేసుకుని రాగల్గుతాము.

**1. ఎగువ అహోబిలం ఉగ్రనరసింహమూర్తి :** చిన్నగుహలో హిరణ్యకశిపుని వధిస్తూన్నట్లు, దానికి ఎదురుగా శాంతించమని ప్రార్థించే భక్తప్రహ్లాదుడు, సీతారాముల విగ్రహాలు వున్నాయి. ఈ ఆలయం గోడపైన ఆదిశంకరులు ప్రతిష్ఠించిన సుదర్శన చక్రం వుంది.

ఆది శంకరులు ఒకానొక సమయంలో ఒక రాజు శరీరంలోకి పరకాయ ప్రవేశం చేస్తారు. జగద్గురువుకదా! వారి పరకాయ ప్రవేశం ప్రజలు అధికారులకానందదాయకమౌతుంది. దాంతో అనుమాన మొచ్చిన అధికారులు అనాథప్రేతాలను సంస్కరించమంటే, ఆదిశంకరుల శరీరంకూడ అగ్నికి ఆహుతవుతుంది. పరిస్థితి ప్రమాదం గ్రహించిన జగద్గురు తన శరీరంలోకి ప్రవేశించి, కాలినచేతులను "కరావలంబం" అని లక్ష్మీనృసింహుని ప్రార్థిస్తారు. స్వామి కరుణిస్తారు. (ఈ స్తోత్రాన్ని రచయిత 'శ్రీలక్ష్మీనృసింహ కరుణించ కదలిరమ్మ" అని తేటతెలుగులో వ్రాసారు.)

భక్తప్రహ్లాదుని భక్తికి మురిసి కరుణించిన దేవదేవుని "అహోబల" అంటారు. అదే కాలక్రమంలో "అహోబిల" మైందని అంటారు. పరమశివభక్తుడైన ప్రతాపరుద్రుడు, ఒకసారి తన ఏలుపబడిలోని ఈ ప్రాంతానికి వస్తాడు.

నిత్యం బంగారు శివలింగంతో స్వామిని పూజించి, ఆ లింగాన్ని బ్రాహ్మణులకు దానమివ్వడం అలవాటుగా పెట్టుకున్న ప్రతాపరుద్రుడు, ఇక్కడ శివలింగం చేయించుకోలేకపోయాడు. ఆనాటి రాత్రి స్వామి కలలో కనబడి, ఈ మొత్తం నరసింహక్షేత్రమని శివకేశవుల భేదంలేకుండా తన మూర్తే ప్రకటితమౌతుందనేసరికి, ఆ మర్నాడు నరసింహస్వామి మూర్తిని శ్రీనివాసాచార్యులకు ఇస్తాడు. ఆయనే ఇక్కడ పీఠము, మఠం ప్రారంభించి వైష్ణవసిద్ధాంతాలను ప్రచారం చెయ్యసాగాడు. దేశంలోని 25 అహోబిల మఠాలకు ఇదే ప్రధాన కేంద్రం. ప్రతాపరుద్రుడు ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసి తన భక్తిప్రపత్తులు చాటుకున్నాడు.

**2. వరాహ నరసింహస్వామి :** ఈయనను క్రోడానరసింహస్వామి అనికూడా పిలుస్తారు. ఉగ్రనరసింహుని నుండి కి.మీ. దూరం 'భవనాశిని" తీర్థం ద్వారా ముందుకు సాగితే ఈ ఆలయం వస్తుంది. ఇక్కడే సోమకాసురుని వధించి, స్వామి వేదములను రక్షించింది. కనుక వేదాద్రి అనే పేరు కూడా పిలుస్తాడు.

**3. మాలోల నరసింహుడు :** వరాహనరసింహుని నుండి ఉత్తరంగా ఒక అర కి.మీ. వెడితే ఈ ఆలయం వస్తుంది. లక్ష్మీఅంశంతో పుట్టిన చెంచులక్ష్మితో స్వామి వేదాద్రిపై వుండిపోవడంతో, ఆయనను వెదుక్కుంటూ వచ్చి శ్రీమహాలక్ష్మిని ఇక్కడ ప్రసన్నం చేసుకుంటాడు. లక్ష్మీప్రియుడైన నరసింహుడని చెప్పడానికి ఇక్కడ స్వామిని "మాలోల" నరసింహుడని పిలుస్తారు.

**ప్రహ్లాదబడి :** మాలోల నరసింహునికి ఉత్తరంగా ఓ రెండు కి.మీ. వెడితే ఇది వస్తుంది. ఇక్కడ స్వామి యోగ నరసింహునిగా దర్శనమిస్తాడు.

**ఉగ్రస్తంభం :** నరసింహస్వామి ఆవిర్భవించిన స్తంభంగా దీనిని చెబుతారు. జ్వాలానరసింహునికి ఉత్తరంగా కి.మీ. దూరంలో వుంది.


**4. జ్వాలానరసింహం :** ఉగ్రనరసింహంనుండి 5 కి.మీ. దూరంలో వుంది. ఆరోజులలో హిరణ్యకశిపుని వధను చూడనివారికి ఈ క్షేత్రంలో హిరణ్యకశిపుని, ఆతని వధను స్పష్టంగా చూడవచ్చును. భవనాశినీ నది ఈ ఆలయం దగ్గరనే పుట్టింది. ఇక్కడి విచిత్రం దూరంనుంచి చూస్తే, ఎర్రగా వుండే నీళ్ళు, చేతిలోకి తీసుకుంటే మామూలుగా వుంటాయి.

**5. పావన నరసింహస్వామి :** ఇది ఉగ్రనరసింహస్వామికి దక్షిణంగా ఏడు కి.మీ. దూరంలో వుంది. ఇదిమాత్రం ప్రత్యేకించి వెళ్ళి చూడాల్సిందే. ఇది భారద్వాజమహర్షి తపస్సుచేసి, స్వామిని దర్శించిన ప్రాంతం. ఆదిశేషుడు పడగవిప్పి స్వామికి ఛత్రమైతే, ఆదిలక్ష్మి స్వామివారి తొడపై నున్న దివ్యమంగళ విగ్రహం ఈ ఆలయంలో మనం చూడవచ్చును.

**6. ఉగ్రనరసింహస్వామి** ఆలయంనుండి, పడమరగా కి.మీ. వెడితే దిగువ అహోబిలం రోడ్డులో వుంది. గోభిల్లుడు అనే మహర్షి తపస్సుకు మెచ్చి స్వామి కారంజి వృక్షం క్రింద దర్శనమిచ్చారుట. అలాగే ఆంజనేయస్వామి కూడా కారంజి వృక్షం క్రింద తపస్సు చేసుకుంటుంటే, స్వామివారు ప్రత్యక్షమయ్యారు. ఆంజనేయుడు, రాముడు వినా మరో దైవం చూడడని, తలవడని, ఒక చేతిలో ధనస్సు ధరించి శ్రీరామునిగా దర్శనమిచ్చారుట. దీనివలన స్వామి వారి చేతిలో ధనుస్సు, చిత్రంగా ఫాలభాగంలో మూడవకన్ను వున్నాయిట.

**7. ఛత్రవట నరసింహస్వామి :** ఈ ఆలయంలో పద్మాసనం వేసుకుని, తొడమీద తాళం వేస్తూ, గానం వింటున్న భంగిమలో శ్రీస్వామివారు దర్శనమిస్తారు. నరసింహ ఆలయాలలో ఈ మూర్తే పెద్దదని చెప్పాలి.

**8. యోగ నరసింహస్వామి :** ఛత్రవట స్వామినుండి అర కి.మీ. దూరంలో ఈ ఆలయం వుంది. ఇక్కడ పద్మాసనంపై, యోగముద్రలోవున్న యోగీశ్వరీశ్వరుని మనం దర్శించవచ్చును. ఇక్కడ యాత్రికులకు భోజన సదుపాయం వుంది.



Jwala Ahobila Kroda Malola Kaaranja

Bhargava Yogananda Malolan Serthi Kshatravata Pavana

## యాగంటి ఉమామహేశ్వరుడు

కర్నూలునుండి బనగానపల్లి, అక్కడనుండి 15 కి.మీ. ఎర్రమల కొండల్లో వెలసిన యాగంటిలో ఉమామహేశ్వర స్వామి దేవాలయం, చెప్పుకోవడానికి, చదువుకోవడానికికాదు, చూడటానికి అత్యంత శ్రేష్ఠమైనది. ఇచ్చటి విశేషం ఆది దంపతులైన పార్వతీపరమేశ్వరులు, ఒకే శిలపై ఉమామహేశ్వరులుగా దర్శనమిస్తారు. 15వ శతాబ్దంలో విజయనగర సంగం వంశప్రభువు బుక్కరాయలు ఈ ఆలయం నిర్మించినట్లు తెలుస్తోంది. స్థలపురాణం ప్రకారమైతే ఈ స్వామిని అగస్త్యులవారు ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది. ఇది త్రేతాయుగంనాటి దివ్యక్షేత్రంగా తలుస్తారు.



పూర్వం అగస్త్యమహర్షి ఈ ప్రాంతంలో శ్రీవేంకటేశ్వరుని ఆలయాన్ని నిర్మిచాలని తలచి విగ్రహం రూపొందిస్తే స్వామి బొటనవ్రేలి గోరు విరిగి పోయిందట. దీనికి బాధపడి శివుని కోసం తపస్సు చేస్తుంటే, కాకులు ఇబ్బందిపెడ్తుంటే కోపించి కాకులు ఇక్కడ తిరుగరాదని శపిస్తాడుట. ఆ కారణంగా ఇక్కడ కాకులు తప్ప మిగిలిన పక్షిజాలం చూడగల్గుతాము. ఆ

తర్వాత ఈశ్వరుడు ప్రత్యక్షమై వేంకటేశ్వరుని గురించి చింతించకు. నేను ఉమా మహేశ్వరుడినై భక్తజనుల కోర్కెలు తీరుస్తానంటాడు. అందుకు పరవశించిన అగస్త్యుడు“ నేగంటి శివుని, పరమశివుని...” అని పాట పాడుతాడు. ఆ ‘నేగంటి’ ... కాలక్రమంలో ‘యాగంటి’ గా మారింది.

ద్వాపరంలో పాండవులు, కలియుగంలో చాళుక్య, విజయనగరాధీశులు, ఈ ప్రాంతానికి వచ్చి స్వామిని సర్వతోభద్రంగా తమ శక్తికొలది అభివృద్ధిపరచి మాన్యాలు ఇచ్చారుట. ఇక్కడి కోనేటి నిర్మాణం విచిత్రమని చెప్పాలి. ఎర్రకనుమల నుండి నిరంతర ధారావాహికంగా నీరు ప్రవహిస్తుంది. అందులోని ఓషధీగుణాలు వలన స్నానంచేసినవారికి ఆరోగ్యం, సమస్యలనుండి పరిష్కారం లభిస్తుంది. దీంతో ప్రతి ఒక్కరు ఈ కోనేటిలో స్నానం చేసి స్వామిని దర్శిస్తారు.

కోనేరు మధ్యలోని మంటపంలో నందీశ్వరుడు, ఆతదుపరి గాలిగోపురం, ధ్వజస్తంభములను దర్శించ వచ్చును. వీరభద్రస్వామి, సుబ్రహ్మణ్వేశ్వరుడు, వినాయకుడు, మార్కండేయుడు వగైరా ఎన్నో దేవతా శిల్పాలను దర్శించవచ్చును. ఇక ఇక్కడ చెప్పుకోవలసింది యాగంటి బసవయ్య 15 అ॥ పొడవు, 8 అ॥ వెడల్పు అంతే ఎత్తుతో విగ్రహంలా కనుపించక, బలిష్ఠమైన ఎద్దు అక్కడ కూర్చున్నట్లు తలపులకొస్తుంది. ఈ బసవనిగొప్పతనాన్ని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వాములవారు ‘ఈ యాగంటి బసవయ్య అంతకంతకు పెరిగి కలియుగాంతమున రంకెవేసెనయ్యా’ అని తన కాలజ్ఞానంలో ఎలుగెత్తి మరీ చెబుతారు.

## ఊరుకుంద ‘ఈరన్న’



ఒక మహాతపస్వి తన జీవితం చాలించి దేవుడైన దివ్యక్షేత్రం. అసలీప్రాంత శ్రీనరసింహక్షేత్రం. ఈయననే ‘వీరన్న’అని పిలుచుకోవడం కలదు. శ్రీలక్ష్మీనరసింహస్వామితోపాటు, ఇప్పుడు శ్రీవీరన్నస్వామి గ్రామదేవతగా ఇక్కడ పూజింపబడుతున్నాడు. ఈ ప్రాంతం కర్ణాటక సరిహద్దుకు దగ్గరగా వుండటంతో, కన్నడుగులు ఇక్కడికి వస్తారు. ఈ వీరన్నను ‘ఈరన్న – ఈరణ’ అని వారి పద్ధతిలో పిలుచు కుంటారు. 1610 సం॥లో ఈరన్న స్వామి 12 ఏండ్ల వయస్సులో ఊరుకుంద గ్రామానికి వెళ్ళి ఆవులను మేతకు విడిచి తాను మౌనంగా ఒక రావిచెట్టు వద్ద కూర్చునేవాడు. అప్పుడా దారిన వెళుతున్న సిద్ధుడొకడు ఈరణ్ణుని చూసి దైవధ్యానంలో సత్యధర్మ స్వరూపుడివై శ్రీనరసింహుని సాన్నిధ్యంలో దివ్యుడివై వెలుగొందమని ఆశీర్వదిస్తాడు. ఆతడే కాలక్రమంలో ఈరణ్ణగా ప్రసిద్ధిడైన సహజసిద్ధుడు. ఆ గ్రామానికి గ్రామదేవత, నిత్యపూజ్యుడు.

శ్రీఈరణ్ణమహాత్మ్యం గురించి ఎన్నెన్నో లీలలుగా ఆనోట, ఈనోట, ఆవాడలో ప్రసిద్ధమయ్యాయి. అయితే

కొన్నాళ్ళకు వున్నట్టుండి ఈరణ్ణ అదృశ్యమౌతాడు. ఆ గ్రామ సంరక్షకుని వీరభద్రునిగా తలచి, ఆయనకూర్చున్న రావిచెట్టు వద్ద విగ్రహం ప్రతిష్ఠించాలని త్రవ్వుతుంటే చిత్రంగా నరసింహస్వామి విగ్రహం లభిస్తుంది. దానినే ఆ గ్రామస్థులు ప్రతిష్ఠించారు. కాలాంతరంలో ఒకసారి శ్రీరాఘవేంద్రస్వామి, ఆ ప్రాంతం నుండి వెడుతుంటే, వారి పల్లకి ఆగిపోతుంది. ఎంతసేపటికి కదలకపోయేసరికి, శ్రీరాఘవేంద్రస్వామి పరిస్థితిని సమీక్షించి, శ్రీనరసింహస్వామిని దర్శించి, తమ మ్రొక్కులు తీర్చుకుని, ఈస్వామిని దర్శించుకున్న భక్తుల సర్వబాధలు, భూతప్రేతాది గ్రహదోషాలు సమసిపోతాయని తెలిపి భక్తజనులననుగ్రహించారు.

కాల్వబుగ్గలోని శ్రీ **'బుగ్గ'రామలింగేశ్వరస్వామి**ది చాలా పురాతన ఆలయమని ఎర్రమల కొండలలోని ఈ ప్రాంతమంతా(కోనేటి) నీటిప్రవాహంతో వుండటం, చుట్టు కొబ్బరి, మామిడిచెట్లుతో వున్న కొండలమధ్య ఈ ఆలయం వుంది. సర్వపాపాలు హరించి, భక్తుల కరుణించే ఈ స్వామి పురాతనుడు, సనాతనుడు.

సాధారణంగా నరసింహక్షేత్రాలు కొండలపై వుంటాయి. ఈ **మద్దులేటి నరసింహస్వామి** ఒక లోయలో వుండి, గుడిచుట్ట కొండచరియలు, ప్రకృతి శోభతో మానసిక ప్రశాంతతని ప్రసాదిస్తాడు. ఎప్పుడు నీటితో వుండే ఈ ప్రాంతం అధినాయకుడైన శ్రీలక్ష్మీనరసింహస్వామి సంతాన ప్రదాతగా చెబుతారు. శనివారమైతే భక్తజనసమూహంతో, ఆ ప్రాంతమంతా కిటకిటలాడుతుంది.

## మూలసాగరం - చెన్నకేశవ, శ్రీఆంజనేయస్వాములు

పూర్వం హరిహరబుక్కరాయలు, వీటిని ప్రతిష్ఠించారంటారు. అయితే, మన దురదృష్టంకొద్ది శిధిలావస్థకు చేరుతుంటే 1998 సం॥లో వీటి జీర్ణోద్ధరణం చేసారు. నిత్యోత్సవాలు, శ్రీరామనవమి, హనుమజ్జయంతులను శాస్త్రబద్ధంగా నిర్వహిస్తున్నారు.

## శ్రీకొలను భారతీదేవి - ఆత్మకూరు




మన అదృష్ట కొద్ది భగవంతుడు ఏదో విధంగా మనల్ని కరుణించాలని ప్రయత్నిస్తూంటే, ఆ అదృష్టాన్ని అందుకోలేక పోవడం, మన దురదృష్టం. ఆత్మకూరుకు 18 కి.మీ. దూరంలో నల్లమల అటవీప్రాంతంలో, చాలపురాతన, ప్రాముఖ్యమైన కొలను భారతీదేవి ఆలయముంది. భారతీదేవి అంటే సరస్వతీ మాతే. భక్తులిక్కడకు వచ్చి తమ పిల్లలు సర్వతోభివృద్ధిగాను, అక్షరాభ్యాసం చెయ్యడం, ఇక్కడ ఆనవాయితీ. ఇక్కడ ప్రత్యేక సమయాల పూజలు జరుగుతాయి. ఉత్సవాలు జరుగు తుంటాయి. అక్షరాభ్యాస సమయంలో ఈ ప్రాంతమంతా కిటకిట లాడుతూ వుంటుంది.

## కైరుప్పల శ్రీవీరభద్రస్వామి

ఈ ప్రాంతమంతా శ్రీఅగస్త్యులవారు తపం చేసినది.ఇక్కడ వారి ఆశ్రమం, కొండను ఆనుకుని అగస్త్య సరోవరం వున్నాయి. ఒకసారి సూర్యవంశస్థుడైన త్రిశంకుడు, అగస్త్యులవార్ని దర్శించి, మహర్షి ఆదేశంతో త్రిమూర్తులను ప్రతిష్ఠించి, పూజించినట్లు స్థలపురాణం చెబుతుంది. అసలిక్కడ ఆలయం కాళమ్మ అనే భద్రకాళి వీరభద్రులది. ఒక భక్తునికి కలలో వీరభద్రుడు కనుపించి, తన వునికిని చెబితే, అక్కడికి వెళ్ళి అచ్చటి శిలను తొలగిస్తే వీరభద్రుని విగ్రహం దొరికింది. దానిని ఎడ్లబండిలో కోలాహలంగా తీసుకువచ్చి త్రిమూర్తుల ఆలయంలోని మల్లేశ్వర వేణుగోపాలస్వామి విగ్రహాలమధ్య ఈ వీరభద్రుని ప్రతిష్ఠించారుట. ఈ ఆనందానికి బండితో తెచ్చిన రెండు ఎడ్లు శిలలై స్వామికి తమను అర్పించుకున్నాయిట.

కృతయుగంలో భద్రకాళి, వీరభద్రుని వివాహం చేసుకోమని కోరితే నిరాకరించాడుట. దాంతో ఉక్రోషం పట్టలేని భద్రకాళి తన అనుచరులతో, వీరభద్రుని పిడకలతో కొట్టించిందట. అది పురాణగాధ. ఇప్పుడు దానికి చిహ్నంగా 'నుగ్గులాట' పేరుతో, గ్రామంలోనివారు రెండు వర్గాలై ఈ ఆటను ఆడుకుంటున్నారుట. ఇదొక భక్తజన ఆనందం.

## గొస్పాడు - పెద్దమ్మతల్లి ఆలయం

నంద్యాలకు దగ్గర్లోని గోస్పాడులో పెద్దమ్మతల్లి ఆలయముంది.ఇది ప్రాచీన ఆలయం. నంద్యాలనుండి కోయిలకుంట్లకు వెళ్ళే దారిలో, మధ్యలో గోస్పాడులో దిగి, ఈ తల్లిని దర్శించు కోవచ్చును. ఇది 300 సం॥లనాటిది. కాకపోతే ఈ మధ్యకాలంలో ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఆ సమయంలోని ఎద్దుల పందాలు చూడదగ్గవి. అవో ఆకర్షణ.

## దూబగుంట- శ్రీవీరభద్రస్వామి

దూబగుంటలో వీరభద్రుడు, నంద్యాలకు 11 కి.మీ దూరంలో వున్న ఈ స్వామి విజయనగర రాజులు నిర్మించినట్లు తెలుస్తుంది. కాలానుగుణంగా వచ్చే మార్పులకు, స్థానికులు సాహసించి, ఈ ఆలయాన్ని పునరుద్ధరించి భక్తులకు ఆనందధామం చేసారు.

## ఈశ్వరాలయం

కర్నూలునుండి 4 కి.మీ దూరంలో వున్న ఈ ఈశ్వరాలయం, 15-16 శతాబ్దాలమధ్య శ్రీవిజయనగర చక్రవర్తులు తమ పాలనాసమయంలో ఇక్కడో రెండు ఆలయాలు నిర్మించినట్లు తెలుస్తోంది.ఊరు మధ్యలో భీమేశ్వరాలయం, తనదేవేరి మాణిక్యాంబతో ప్రత్యేకంగా నిర్మించారు. రెండోది ఈశ్వరవీరభద్రాలయం, పైదానికి కొద్ది దూరంలో వుంది. ఈశ్వరవీరభద్రాలయం తన ప్రాచీనతను కోల్పోలేదు.కానీ భీమేశ్వరాలయంలో కాలానుగుణంగా మార్పులు

జరిగాయి. ఈశ్వరవీరభద్రాలయంలో ఈశ్వరలింగం పెద్దదిగా దక్షిణాభిముఖుడై వుంటాడు. వీరభద్రుడు చతుర్భుజాలు వివిధాయుధాలతో కుడిప్రక్కగ వుంటాడు.

## హోసూరు- శ్రీవరాల వీరభద్రస్వామి

ఆదోని మండలం, హోసూరులో శ్రీవరాల వీరభద్రస్వామి ఆలయం అతి పురాతనమైనదివుంది. ఆదోనినుండి ఇక్కడికి బస్సు సౌకర్యం వుంది. ఇక్కడ ప్రాచీన మహర్షులు వీరభద్రుని కొలిచారుట. ఆ తరువాత కాలంలో శ్రీవిజయనగర రాజులు, ప్రతిష్ఠించినట్లు చెబుతారు. ఈయన నమ్మినవారికి వరాలనివ్వడం వలన స్వామిని శ్రీవరాల వీరభద్రుడని ప్రేమతో పిలుచుకుని, భక్తితో సేవిస్తారు. చూడచక్కని ప్రదేశం, విగ్రహం. ఇక్కడ శ్రీభద్రకాళి, సమేత వీరభద్రుని ఉత్సవవిగ్రహాలను బట్టి, నిత్యపూజలు, పర్వదిన ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయని తెలుస్తుంది.

## నందవరం - శ్రీచౌడీశ్వరీదేవి ఆలయం

బనగానపల్లికి 8 కి.మీ దూరంలోని నందవరం గ్రామంలోని శ్రీచౌడీశ్వరీదేవి ఆలయం అతి పురాతనమైంది.




ఇది చాలా విశాలంగ, ఎత్తుగా నిర్మించారు. రాజగోపురం నగరంలో ఎక్కడినుండైనా చూడవచ్చును. ఈ తల్లి పార్వతీ అంశ .. ఇంకా చెప్పాలంటే ఆ కాశీవిశాలాక్షే.పూర్వం ఈ నందవరాన్ని పాలించే రాజు, ఒక సిద్ధుని సాయంతోపాదలేపనం పొంది నిత్యం కాశీవిశాలాక్షిని దర్శిస్తూంటే, ఒకనాడు దంపత సమేతంగా కాశీ వెళ్ళిన రాజు పాదాలకు పూసుకున్న లేపనం కరగిపోవడంతో, అక్కడి మహాతపస్వులైన బ్రాహ్మణులు ఈ రాజదంపతులను నందవరం పంపించే ఏర్పాటు చేస్తారు. వారికి కృతజ్ఞతగా తనవద్దకు వస్తేవారు కోరినదిస్తామని చెప్పాడు.

ఆ తర్వాత కాశీలో కరువు ఏర్పడి ఈ బ్రాహ్మణులు నంద(వర) రాజును దర్శించి, సహాయం కోరితే, ఇందుకు సాక్ష్యమేమిటంటే, ఆ విశాలాక్షేనని, వారు, విశాలాక్షిని సాక్ష్యం చెప్పమని కోరతారు. ఆ తల్లి వెనుదిరగకుండా వెళ్ళమని చెబుతుంది. తీరా నందవరం వచ్చేసరికి వీరు వెనుదిరుగుతారు. ఈమె శిలాకృతి దాల్చి 'చౌదేశ్వరి'గా మారిపోయింది. ఆ తల్లిని రప్పించుకునేటందుకే నేనిలాగ ప్రవర్తించినానని రాజు చెపుతాడు. కాశీనుండి ఇక్కడికి వచ్చిన విశాలాక్షి చౌడీశ్వరిగా నిజమైన అమ్మగా భక్తులను కరుణిస్తూ నీరాజనాలందుకుంటుంది. ఇక్కడి నవరాత్రి ఉత్సవాలు విశేషమని చెప్పాలి.

## ఉప్పలపాడు - నరసింహస్వామి

బనగానపల్లినుండి, తాడిపత్రికి వెడుతుంటే మధ్యలో 'అవుకు' అనే వూరువస్తుంది. దాని ప్రక్కన ఉన్నదే 'ఉప్పలపాడు'. ఇక్కడ శ్రీనరసింహస్వామి ఉడుమురూపంలో వుంటాడు. ఇది చాలా పురాతన క్షేత్రం. ఇక్కడ కొండను 'కంబగిరి' అంటారు. ఈ కొండపైన శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువుదీరాడు. ఈయనకు శ్రీకంబగిరి లక్ష్మీనరసింహస్వామి అనే పేరు సార్ధకమైంది. ఇక్కడ స్వామి ఉడుములా కనిపిస్తాడు. ఈ స్వామి మోకాళ్ళనుండి తేమరావడము ఒక విచిత్రం. చుట్టుప్రక్కల నీటికి సావకాశంలేదు. అయినా శ్రీస్వామి మోకాళ్ళనుండి రావటం విచిత్రం. ఈ తేమ సర్వరోగ నివారిణి.



## నంద్యాల - జగజ్జనని ఆలయం

మానససరోవరం తరువాత ఇటువంటి దివ్యరూపం కల్గినదిక్కడే. ఇక్కడి గర్భాలయంలో 9 అ॥ నల్లరాతి విగ్రహముంది. నాభి స్థానంలో పంచముఖ శివుడు, పాదపీఠంలో శ్రీమహావిష్ణువు చూడదగ్గది. ఇది నూతనంగా నిర్మించినది. అయినా మానసోల్లాసం కల్గించే మహిమాన్విత ఆలయం, నవనందులు, నవనారసింహులు వెలిసిన దివ్యక్షేత్రంలో ఈ అపురూప ఆలయం నిర్మించబడింది.

## కోవెలకుంట్ల - శ్రీపాండురంగవిఠలేశ్వరుడు

13 వ శతాబ్దంలో కాకతీయ ప్రభువు కాలంలోని 'కోయిల' అనే పేరుగల నాట్యకత్తెకు పాండురంగడు కలలో కనుపించి, ఆలయం నిర్మించమని ఆదేశించాడుట. స్వామి ఆజ్ఞకు ఆనందంగా ఆలయం నిర్మించింది. ధూప దీప నైవేద్యాలకు ఏర్పాట్లు చేసింది. దాంతో ఆమె పేరుతో ఈ కోయిలకుంట ఏర్పడిందని చారిత్రక కథనం.

## ఆదోనిలో శ్రీకోటవీరభద్రస్వామి ఆలయాలు

ఆదోనిలోని శ్రీ కోటవీరభద్రస్వామి, అతిపురాతన ఆలయం. ఈ వూళ్ళో రెండు వీరభద్రస్వామి ఆలయాలు వున్నాయి. ఒకటి కోటవీరభద్రుడు, రెండవది పేట వీరభద్రుడు. దీనిని విజయనగరరాజులు తమను సంరక్షకునిగా నిర్మించాలరని, కోటవీరభద్రుడు, భద్రకాళీసమేతుడై భక్తనీరాజనాలందుకుంటుంటే, పేటవీరభద్రుడు ఒంటరిగా భక్తజనులను సంరక్షిస్తున్నాడు.

## నాగులేటి - వీరభద్రుడు

శ్రీశైలానికి 90 కీ.మీ బైర్లూటి చెంచుగూడెం దాటి 6 కి.మీ దూరంలో నాగులేటి గ్రామం వుంది. ఇక్కడి అధిదేవత శ్రీవీరభద్రుడు. ఇక్కడికి జీపుల్లో వెళ్ళగలం. 13 శతాబ్దంలో రెడ్డిరాజులు వేయించిన మెట్లు ఇక్కడినుండే

ప్రారంభమవుతాయిట. అయితే ఇచ్చటి వీరభద్రాలయం 14,15 శతాబ్దాలలో విజయనగర ప్రభువులు నిర్మించారని చరిత్ర తెలుపుతుంది. దీనికి ఆ రోజులలో 12 అ॥ ఎత్తు, 3 అ॥ వెడల్పుగల కోటగోడ వంటి ప్రాకారముండేది. ఇప్పుడు శిథిలమైన ఆనవాళ్ళు మనకు దర్శనీయాలు. గర్భాలయం ద్వారబంధనంలోనే ద్వారపాలకుల నిర్మించడం ఒక విశేషం. ఈ మధ్యకాలంలో శిథిలమైన ఆనాటి 'వీర'భద్రుని స్థానంలో, సౌమ్యమూర్తిని నూతనంగా ప్రతిష్ఠించారు.

## రుద్రకోడూరు

ఆత్మకూరుకు 20 కి.మీ దూరంలో నంద్యాల మధ్యలో 4 కి.మీ ప్రయాణించి, నల్లకాలువ చేరుకుని, అక్కడనుండి 16 కి.మీ. అడవిలో అడుగువేస్తూ పోతూంటే, ఈ రుద్రకోడూరును చేరగల్గుతము. ఇక్కడి దేవుడు రుద్రకోటీశ్వరుడు. ఇది చాలా పురాతన ఆలయం. ఈ ఆలయాన్కి దగ్గర్లో 'కోడూరు' అనే చెంచుగూడెం ఉంది. కనుక ఈ ప్రాంతాన్ని 'రుద్రకోడూరు' అని కూడా పిలవడం జరుగుతోంది. ఈ క్షేత్రం గురించి పద్మపురాణంలో ప్రస్తావన కనుపిస్తుంది. ఇక్కడి పుణ్యతీర్థంలో స్నానం చేసి, స్వామిని అర్చిస్తే తరాలు తరిస్తారని చెబుతారు. పూర్వం శ్రీరాముడు, సప్తఋషులు కూడా ఈ క్షేత్రాన్ని దర్శించి, ఈ ఆదిదంపతులను పూజించారుట.

ఇక చరిత్రకొస్తే పుట్టలోవున్న ఈ స్వామి ఒక పశువులకాపరికి కనుపించి, తన వునికి చెప్పి ఆలయం నిర్మించమంటే, అతడు గ్రామస్థులకు చెప్పి పెద్దలతో కలిసి పుట్టత్రవ్వితే, స్వామి స్వయంవ్యక్తుడైనాడు. అంతా కలిసి ఆలయం నిర్మించారు. ఆలయ సమీపంలో కొండపై వున్న కల్పవృక్షం పార్వతీపరమేశ్వరుల నివాసమని భక్తుల నమ్మిక. ఈ ఆలయంలో రుద్రకోటేశ్వరునితోపాటు రుద్రాణి, నాగ ఛత్రం కలిగిన వీరభద్రుడు, గర్భాలయ ద్వారంపై గణపతి, అనకూడదుకాని మహాద్భుతంగా మలచబడిందీ ఆలయం.

గర్భాలయానికి ఎడమవైపు మంటపంలో లక్ష్మణ, హనుమత్సమేత శ్రీసీతారాములు, ఆలయానికి ఎడమవైపున హనుత్స్వామి దర్శనమిస్తారు. ఇక్కడి కల్పవృక్షం, కల్పవృక్షమే. ఆలయానికి ఎదురుగా రెండు కోనేరులలో నీరు ఎప్పుడూ తరుగకుండా నిలచివుంటుంది. కోనేరులు స్వచ్ఛజలాలతో, అడుగుభాగం నిర్మలంగా వుంటుంది. ఇక పూజ, ఉత్సవాలన్నీ మామూలుగానే ఆడంబరంగా సాగుతాయి.

**హృదయం లోపల ఆకాశం ఉంది. అందులో విజ్ఞానీ, అమృత స్వరూపుడు, జ్యోతిర్మయుడు అయిన పురుషుడున్నాడు. ఇది గ్రహించి ఆ పురుషుని ఉపాసించాలి.**

**- తైత్తిరీయ ఉపనిషత్తు**

**ప్రాచీనులు ఎలా వర్తించారో గుర్తుచేసుకోండి. అలాగే ఇప్పుడు ఇతరులు ఎలా వ్యవహరిస్తున్నారో గమనించండి. మర్త్యులు ధాన్యం మాదిరి పండి రాలిపోతారు. ధాన్యంలాగే మళ్ళీ పుట్టుకోస్తారు.**

**- కఠోపనిషత్తు**

# తెలంగాణ







**రా**శులుగా వజ్రాలను పోసి తూనికలతో అమ్మిన శ్రీకృష్ణదేవరాయల పాలనకు, రాణి రుద్రమదేవి పౌరుషానికి, పల్నాటి బ్రహ్మనాయుడు, నాగమ్మల ఎత్తు పై ఎత్తులకు నెలవు అయిన ఈ తెలుగు గడ్డ చరిత్ర ఎంతో ఘనమైనది. యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షించిన ఆంధ్రప్రదేశ్ భారత్ స్వాతంత్ర్య పోరాటంలో కూడా గణనీయమైన పాత్ర కలిగివుంది.

**2014, జూన్ 2 వ తేదీన "తెలంగాణ" రాష్ట్రం పది జిల్లాలతో కూడి "29వ రాష్ట్రం"గా అవతరించింది.**

**విస్తీర్ణం : 1,14,840 చ.కిమీ.** **ప్రధాన భాషలు : తెలుగు, ఉర్దూ**

**సరిహద్దులు :** తూర్పున ఒడిస్సా, కోస్తా ఆంధ్రప్రదేశ్; పశ్చిమాన కర్ణాటక; ఉత్తరమున, వాయవ్యమున మహారాష్ట్ర; ఈశాన్యమున ఛతీష్ఘడ్; దక్షిణమున ఆంధ్రాలోని రాయలసీమ సరిహద్దులుగా ఉన్నాయి. 972 కి.మీ. పొడవుగల తీర రేఖ ఉంది.

# ఆదిలాబాద్ జిల్లా

## జ్ఞానసరస్వతి దేవాలయం - బాసర



భారతదేశము నందలి దేవాలయములు అన్నింటిలోనూ సరస్వతి దేవాలయాలు మూడు కలవు. 1.హిమాలయ పర్వత శ్రేణులలోని కాశ్మీరులో గల ప్రౌఢ సరస్వతి దేవాలయం 2. కాళేశ్వరంలోని మహాసరస్వతి. 3. బాసరలోని జ్ఞానసరస్వతి. ఈ తల్లి తెలంగాణాలోని అదిలాబాద్‌జిల్లా మధోల్ తాలూకాలో పవిత్ర గోదావరి తీరములో గల బాసర క్షేత్రములోవుంది. వ్యాస మహర్షి కలలో దేవి కనబడి పవిత్ర గౌతమి నదిలో స్నానమాచరించి మూడు పిడికల ఇసుక తెచ్చి మూడు చోట్ల పోయమని, ఆ మూడు స్థలములలో నేను మూడు రూపాలుగా అవతరించెదనని చెప్పింది. ఆ మూడు ఇసుక కుప్పలు శ్రీమహాలక్ష్మి, శ్రీమహా సరస్వతి, శ్రీ మహాకాళీ విగ్రహములుగా మారెను. వీటిలో శ్రీమహాలక్ష్మి, శ్రీమహాకాళి విగ్రహములు సుల్తానుల వల్ల దెబ్బతినగా ఈ క్షేత్రములో నేటికి శ్రీజ్ఞానసరస్వతి మాత్రం భక్తులకు దర్శనమిస్తోంది. వ్యాసమహర్షి వల్ల పేరు పొందిన గ్రామం "వ్యాసపుర" గాను, రానురాను "బాసర్" గాను ప్రసిద్ధి గాంచినది. దేవాలయమునకు కొద్ది దూరములో ఉన్న వేదపతి అను శిలను రాతితో కొట్టిన సప్త స్వరములు వినిపించునని ఈ ప్రాంతీయులు చెబుతారు. పవిత్ర గోదావరి ఒడ్డున ఉన్న ఈ దేవాలయం మధోల్‌కు 14 కి.మీ. దూరంలోనూ, నిర్మల్‌కు 70 కి.మీ. దూరంలోనూ ఉంది.

దేవీభాగవతం ప్రకారం – గోలోకవాసుడైన కృష్ణునికి, లక్ష్మి–గంగ–సరస్వతి అని ముగ్గురు భార్యలు. వీరిలో సరస్వతికి దురుసు స్వభావం, గంగకు దూకుడు. దీంతో వారిద్దరి మధ్య తగవు వస్తుంది. ఈ పోట్లాటలో సరస్వతి, గంగను జుట్టుపట్టుకుని కొట్టబోతే లక్ష్మి వారిద్దరిమధ్య నిలచి తగువు తీర్చబోయింది. ఇది కోపకారణమైన సరస్వతి లక్ష్మిని చెట్టుగా పుట్టమంది. లక్ష్మిశాంతించిందే తప్ప తిరిగి శాపమివ్వలేదు. గంగమాత్రం 'నీ దురుసుతనానికి ఫలితంగా నదిగా పుట్టి అవతలివారి పాపాలను భరించ'మంది.

అయితే నువ్వు నాలాగ నదిగా పుట్టి, పాపాల బ్రతుకు బ్రతుకమంది. ఈ సమయంలో వచ్చిన కృష్ణుడు, వీరి తొందరపాటుకు బాధపడి "సరస్వతీ! నువ్వు భూలోకంలో అంశంతో నదిగాను, అంశాంశంతో బ్రహ్మదేవునికి భార్యగాను వుండమంటాడు. గంగను కూడా, భూమిమీద అంశాంశతోవుండి, శివరాణిగా వెలుగమంటాడు. ఇలాగ అయిదువేల సం॥లుండి, అనంతరం, బ్రహ్మ, శివులను శాశ్వతంగా చేరుతారని, వారిని ఊరడిస్తాడు.

ఆ ప్రకారం సరస్వతి బాసరలోని ఆలయం సమీపంలో తీర్థంగా వెలుస్తుంది. ఇందులో ఒకసారి సూర్యుడు, మరొక సందర్భాంలో ఇంద్రుడు తీర్థస్నానం చేసి పాపప్రక్షాళన మొందుతారు. ఇది సరస్వతికి గర్వకారణమైనట్లు వుండుండి ఇక్కడనుండి మాయమైపోతే, ఇంద్రాదులు బ్రహ్మను "దేవా!"అని సందర్శిస్తారు. వారిని వూరడిస్తూ

అనతికాలంలో వేదవ్యాసుడు సరస్వతిని మరల ప్రతిష్ఠించి, తరింపచేస్తాడని చెబుతాడు.

తరువాత కాలంలో ఒకనాడు పరాశరుని సంయోగంతో దాసరాజు పుత్రిక వ్యాసుని కంటుంది. ఇతనికి గర్భంలోనే శ్రీమహావిష్ణువు సరస్వతి మంత్రముపదేశింపచేస్తాడు. ఆతడే వేదవ్యాసునిగా ప్రఖ్యాతి చెందిన విష్ణు స్వరూపుడు. తల్లి పిలుపుకోసం తపించే తనయుడు. ఈ సరస్వతీ క్షేత్రమునకు వచ్చి ఆ తల్లిని గూర్చి ప్రార్థిస్తే – కరుణించి, అతని అభీష్టం తీర్చిన ఆ తల్లి ఇక్కడ తనను ప్రతిష్ఠించమని కోరుతుంది. దాంతో దీనిని "వ్యాసపురి" అని "వ్యాసర" అని, కాలాంతరంలో "బాసర" గా రూపాంతరం చెందుతుంది.

స్థలపురాణంలో ఇక్కడ ఇంద్రతీర్థం, విష్ణుతీర్థంగాక మరెన్నో తీర్థాలున్నాయని చెప్పబడుతుంది. గోదావరికన్న మరేతీర్థం ఆ చుట్టుప్రక్కల కనబడదు. బహుశః కాలాంతరములో సర్వతీర్థాలు ఈ గోదావరిలో కలిసిపోయి వుంటాయి.



ఆలయ ప్రాంగణంలో దత్తదేవుల విగ్రహం ఒక గూడువంటి దాంట్లో వుంది. కాళికాదేవి ఆలయం కూడా అమ్మవారి వెనుకప్రాంతంలో చూడవచ్చును. కొండప్రక్కన వుండి వూళ్ళోకి వెళ్ళే దారిలో అర కి.మీ. దూరంలో వేదికగా కనుపించే పెద్ద బండరాయి పది అడుగుల ఎత్తు, ఇరవై అడుగులు గల చుట్టుకొలతుంది. దీనిమీద ఈ ప్రక్కన రాయితో కొడుతూ ఆ ప్రక్కన చెవి ఆనించి వింటే, శబ్దం చిత్రంగా వస్తుంది.

ఇక్కడ సూర్యప్రతిష్ఠితమైన 'శివలింగం' సూర్యేశ్వరాలయంగా పిలువబడుతుంది. ఊరి మొదట్లో వినాయకుడు, పాపహరేశ్వరస్వామికాక జీర్ణావస్థలోవున్న శివాలయం వున్నాయి. ఒకప్పుడు ఇక్కడకు భక్తసంచారం లేకపోయినా, ఇప్పుడు మాత్రం ఈ తల్లి, తన శక్తిని పెంపొందించుకుంటున్నట్లు భక్తజనులతో కిటకిట లాడుతోంది. అక్షరాభ్యాసాలు, ఆశ్వయుజ మాసంలో నవరాత్రులు, ముఖ్యంగా మూలానక్షత్రం సరస్వతీపూజ ... వగైరాలు ఘనంగా జరుగుతున్నాయి.

అభీష్టసిద్ధిని కోరేవారు తప్పక దర్శించవలసిన క్షేత్ర మని చెప్పాలి.

ఆలయం చుట్టూ ఎనిమిది దిక్కుల యందు ఎనిమిది తీర్థాలు ఉన్నవి. ఇంద్ర, సూర్య, వ్యాస, వాల్మీకి, విష్ణు, గణేష్, శివ తీర్థములు మధ్య శ్రీ సరస్వతి తీర్థము కలదు. ఇక్కడ పావనగంగ అంతర్వాహినిగా వచ్చి కలుస్తుందని చెబుతారు. విజయదశమి రోజున శ్రీ జ్ఞాన సరస్వతి దేవికి అత్యంత వైభవంగా పల్లకి సేవ జరుగుతుంది. మహాశివరాత్రికి విశేషంగా జాతర జరుగుతుంది.

## కేస్లాపూర్ - నాగోబా మందిరం



గిరిజనుల ఆరాధ్యదేవత, ముట్నూరుకు 3 కి.దూరంలో వుంది ఈ కేస్లాపూర్. గోందుజాతికి చెందిన గిరిజనులు, ముఖ్యంగా సర్వదేవతయైన నాగోబాను పూజించడం, జాతర్లు చెయ్యడం గొప్ప విశేషంగా, చూడచక్కని పండుగగా చెప్పాలి. ముఖ్యంగా గోందుజాతిలోని మొస్త్రం వంశీయులు, ఈ నాటివరకు ప్రాధాన్యమివ్వడమే కాదు, తాము ఇక్కడినుండి ఇంద్రవెల్లి, ఉట్నూరు, జైనూరు, సిర్పూర్ మీదుగా కలమడుగులోని గోదావరిని చేరి, అక్కడ పూజలు గోదావరి మాతకు చేసి ఆ పవిత్రనీటిని తిరిగి పాదయాత్రగా నాగోబా గుడికి చేరుస్తారు. ఇక్కడ శ్రమదమాదుల కన్న భక్తిశ్రద్ధలు ప్రముఖపాత్ర వహించి, జాతరను మహోత్సహంగా నిర్వహిస్తారు. ఎక్కడనుంచి.... అంటే... ఎక్కడనుంచి అని అనకుండా, అనేక రాష్ట్రాలనుండి తమ సమస్యాపరిష్కారం కోసం గిరిజనులు పెద్ద ఎత్తున రావడం, ఈ జాతర నిర్వహించడం ఘనచరిత్రగా తలవాలి. మనమందరం గర్వపడాలికూడా!

సదర్‌పూరులోని అతిప్రాచీన శివాలయంలోని విశిష్ట స్వామి దర్శనానికి వెళ్ళినవారు ఆ శివలింగాన్ని ఎత్తి పట్టుకొని మనసుకు హత్తుకుని తమ కోరిక చెప్పుకుంటే, అది తప్పక ఆ శివయ్య తీరుస్తాడని నమ్మకం.

సిరిచల్ల శ్రీసోమేశ్వరాలయం 2వ శతాబ్దికి చెందినది. శైవ, వైష్ణవ, జైన ప్రాభవాలు కనుపించే అపురూప సంపద ఇక్కడ కనుపిస్తుంది. ఒకసారి శ్రీకృష్ణదేవరాయలు సతీసమేతంగా ఇక్కడికి వచ్చి శ్రీ స్వామిని దర్శిస్తే, రాయలదేవేరి ఎన్నో ఆభరణాలు అర్పించడం అర్చనాదులు చేయడం జరిగింది. దీనిని బట్టే శ్రీస్వామివారి మహిమ తెలుస్తుంది. శివరాత్రి ఉత్సవాలు అప్పుడు జరిపే జాతర పరవశించి చూడదగ్గవి.

### ఉత్తర వాహినీ అగస్త్యేశ్వరుడు

ద్వాపరయుగంలో ఇక్కడ తపస్సు చేసుకోవడానికి వచ్చిన అగస్త్యులవారు, ఈ ప్రకృతి ప్రశాంతతకు పరవశమొంది ఒక పెద్ద శివలింగాన్ని ప్రతిష్ఠించారుట. అదే అగస్త్యేశ్వరాలయం. ఇది ఉత్తరవాహినిగా వుండటంతో, ఎక్కువమంది మరణించిన తరువాత అస్థికల నిమజ్జనానికి, పితృపితామహుల ఉత్తమలోకాలు కల్పించడానికి వస్తుంటారు.

అలనాడు అగస్త్యులవారి ప్రతిష్ఠించిన ఈ ఆలయాన్ని 1289 సం॥లో కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు పునర్నిర్మించాడుట. ఆతరువాత మహమ్మదీయుల దాడి మనకు శాపంగా ఈ ఆలయం దెబ్బతింటే, శ్రీకృష్ణదేవ రాయలు, చెన్నూరు ప్రాంతానికి వచ్చినప్పుడు పునరుద్ధరించినట్లు, ఆలయంలో దొరికిన శాసనం తెలియబరుస్తుంది.

కాశీలోని గంగవలె, ఇక్కడ గోదావరి ఉత్తరవాహిని, అలాగే ఈ ఆలయంలో అఖండజ్యోతి వుంది. 410 సం॥ క్రితం జక్కిపల్లి శివయ్య ఈ దీపాన్ని వెలిగించాడు. అప్పటినుండి ఈ అఖండజ్యోతి దీపం వెలుగుతున్నది.

ఆదిలాబాద్‌కు 21 కి.మీ దూరంలో పల్లవరాజులు నిర్మించారని చెప్పబడే ఇక్కడి లక్ష్మీనారాయణస్వామి

ఆలయం కాక, ఇతర ఆలయాలు కూడా జైనవాస్తును పోలడంతో, ఈ ప్రాంతాన్ని "జైనాథ్" గా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాంతానికి దగ్గర్లో ఒక శివాలయంముంది. ఇచ్చటి శివలింగాన్ని చేతులతో ఎత్తి పట్టుకుంటే, వారి కోర్కెలు తీరుతాయట.

బెల్లంపల్లికి 7 కి.మీ. బుగ్గరాజేశ్వరాలయం వుంది. ఇక్కడో రెండు గుంటలున్నాయి. నిరంతరం ఇందులోనుండి నీరు వస్తుంటుంది. దీని వునికి మాత్రం ఎవ్వరికి తెలియదు. ఇచ్చోడ గ్రామానికి సమీపంలోని సిరిదర్శా గ్రామంలోని సోమేశ్వరాలయం 7వ శతాబ్దానికి చెందింది. శైవ, వైష్ణవ, జైన, బౌద్ధాలకు అపురూప శిల్పసంపద నిక్కడ మనం చూడగల్గుతున్నాము. ఈ ఆలయాన్ని శ్రీకృష్ణదేవరాయలు దర్శించి, అర్చించినట్లు శిలాశాసనాలు తెలుపుతున్నాయి.

ఇవేకాక, ఈ జిల్లాలోనే కాదు, ప్రతిజిల్లాలో అడుగడుగునా గల ఆలయాలవలన మన చరిత్ర గొప్పతనాన్ని చెప్పుకోవడంకూడా అనుసరించగల్గిన అదృష్టంగా తలవాలి.

## చెన్నూరు - అగస్త్యేశ్వరాలయం



ఈ దక్షిణముని దక్షిణాదిని పవిత్రం చెయ్యడంలో భాగంగా ఎన్నో ఆలయాలను నిర్మించాడు. అందులో ఒకటి ఈ చెన్నూరులోని అగస్తేశ్వరాలయం. ఇక్కడ తపస్సుకై వచ్చిన స్వామి, శివుని ప్రతిష్ఠించాడు. కాకపోతే 1289 ప్రాంతంలో, కాకతీయ ప్రతాపరుద్రుడు పునర్నిర్మించినట్లు స్థలపురాణం ద్వారా తెలుస్తుంది. ఆ తర్వాత అల్లావుద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్‌కపూర్ ఈ ఆలయంపై దాడిచేసి, గోపురాన్ని ధ్వంసం చెయ్యగా, తన జైత్రయాత్రలలో భాగంగా చెన్నూరు వచ్చిన శ్రీకృష్ణదేవరాయలు, దీనిని తిరిగి పునర్నిర్మించినట్లు ఆలయంలోని శాసనాలద్వారా తెలుస్తోంది. తెలుగు, కన్నడ భాషల మిశ్రమంగా వున్న ఈ శాసనంలో మనం మహామంత్రి తిమ్మరుసు సంతకాన్ని చూడగల్గుతాము.

ఇచ్చటి మరో విచిత్రం నదులన్నీ సాధారణంగా పశ్చిమంనుండి తూర్పుకు ప్రవహిస్తాయి. కాశీలో గంగ ఉత్తరవాహినిగా 6 కి.మీ సాగితే, ఇక్కడి గోదావరి ఉత్తరదిశగా15 కి.మీ ప్రవహిస్తుంది. ఇక్కడ తప్ప గోదావరి ఉత్తరవాహినిగా మరెక్కడలేదు. పారుపల్లి కొండలపై దిగంబరంగావున్న భైరవుడిని చూడలేక, గోదావరి మాత తన దిశ మార్చుకుని, ఈ ప్రాంతాన్ని పవిత్రం చేసిందని, ఇక్కడ పవిత్ర స్నానాలు, అస్తికల నిమజ్జన, పిండప్రదానాదులు ఎంతో భక్తితో సలుపుతారు. ఇక్కడి ఆలయంలో అగస్త్యులవారు ప్రతిష్ఠించిన భారీ శివలింగంతోపాటు, 410 సం॥కు పైగా నిరంతరం వెలిగే జక్కెరపల్లి సదాశివయ్య అనే భక్తుడు వెలిగించిన అఖండదీపం కూడా చూడగల్గుతాము. ఈ జ్యోతి పరిరక్షణ సదాశివయ్య మునిమనుమడు హిమకరశర్మ చూసుకుంటున్నాడు. పుష్కరాల సమయంలో

రాష్ట్రాలు, ఎల్లలు మరచి ఎక్కడెక్కడివారో పవిత్ర స్నానాలకు వస్తారు. ఈ అఖండదీపానికి పూజలు కూడా చేస్తారు.

ఇక్కడున్న మరో దేవాలయం జగన్నాధస్వామిది. దీనిని సుమారు 500 సం॥లక్రితం ఆ ప్రాంతాన్నేలే రమ్యపురి మహారాజుకు స్వామి కలలో కనుపించి, ఈ ఉత్తరవాహిని ప్రాంతంలో తనకు ఆలయం నిర్మించమని కోరగా, పూరి క్షేత్రంలో వలె ఇక్కడకూడా దారుశిల్పాలతో ఆలయం నిర్మించబడింది. కాకపోతే విగ్రహాలు పూరిలో చేయించి ఇక్కడకు తీసుకువచ్చిన 3 సం॥లకు జగన్నాధలీలగా ప్రతిష్ఠాకార్యక్రమం జరిగి, ఇప్పుడు ఎంతో మంది భక్తులకు ఆనందోత్సవాలను ప్రసాదిస్తుంది.

**చెన్నూరు** మండలానికి 4 కి.మీ దూరంలో ఈ **కత్తెరశాల మల్లన్న** ఆలయముంది. 1600 సం॥లో కాకతీయ రాజులీ ఆలయనిర్మాణం చేసినట్లు తెలుస్తుంది. ఇదే పంచాయితిలోని నారాయణపూర్ సరిహద్దునకు ఉత్తరవాహిని కోటిలింగాలవద్ద అగస్త్యమహాముని స్నానమాచరించి, సౌరంగమార్గాన ఈ కత్తెరశాల మల్లన్న వద్దకు వచ్చి పూజలు చేసేవారని స్థలపురాణకథ. ఇక్కడి యాదవులు మల్లన్న భక్తులు. ఉత్సవాలలో వచ్చే వేలాదిమంది భక్తుల తోపాటు ఒగ్గుపూజారుల ఒగ్గుకథలు వినవిచిత్రంగా వుంటాయి. ఉత్తరవాహినియైన గోదావరి స్నానం, మల్లన్న దర్శనం మోక్షప్రదమని భక్తజనుల ప్రగాఢ విశ్వాసం. ఇక్కడే ఆలయానికి ఎదురుగా వుండే రావిచెట్టు వద్దగల నాగేంద్రస్వామికి పూజలు చేస్తే సంతానం లేనివారికి, సంతానం కల్గుతుందనేది స్థిరనమ్మకం. అన్ని ప్రాంతాలలో వలె ఇక్కడ 1992 లో స్వర్ణనదీతీర కద్దాల్ అయ్యప్ప ఆలయాన్ని నిర్మించారు. జిల్లాలో మొట్టమొదటిదిగా చెప్పే ఈ ఆలయానికి ప్రక్క జిల్లాలవారు కూడా వస్తారు. తమ భక్తిప్రపత్తులను చాటుకుంటూంటారు.

**పేలాలమల్లన్న ఆలయం** చెప్పుకుందుకు ఒక్కటే అయినా శివరాత్రినాడు, సమీపంలో గుట్టపై వున్న గట్టు మల్లన్న దేవాలయాలన్ని జాతరకు సిద్ధమైన ఆ దృశ్యం, ఆ వైభవం చూడాల్సిందే.ఇది జైపూరు మండలంలో వుంది. స్థలపురాణం ప్రకారం పోగులపుల్లు అనే బాలుడు తన పశువులను తోలుకుంటూ, గుట్టపైగల కోనవద్దకు పోతుండేవాడు. మల్లన్నా... అని పిలిస్తే, స్వామి ఇతడికి పలికేవాడు. ఇది నమ్మని ఇతర కాపరులు, నీ స్వామి, నువ్వు ...అని స్వామిని దూషించగా మల్లన్న పలకడం మానివేసాడు. పోగులపుల్లు అదృశ్యమై పోయాడు. దాంతో పశులకాపరులు "మల్లన్నా! మమ్మాదుకో! నీవారము, చెంతకొచ్చాము." అని భక్తితో పూజించడం మొదలుపెట్టారుట.

**జైనాథ్ – శ్రీలక్ష్మీనారాయణ దేవాలయం** జైనసాంప్రదాయంలోవున్న అతి ప్రాచీన ఆలయం. పల్లవ రాజులు దీనిని నిర్మించారని తెలుస్తుంది. కానీ ఆలయగోడలమీద, గోపురంపైగల శిల్పాలు జైనసాంప్రదాయాన్ని సూచిస్తాయి. గర్భాలయంలోని లక్ష్మీనారాయణులపై నాల్గు నెలలపాటు సూర్యకిరణాలు పడటమొక విశేషం, అపురూపం కూడా. ఇక్కడగల ఒక శిలాశాసనంపై 'పూర్వాయనమః' అని వుంది. ఆలయం ముందర సరోవరం, ఇది ఇప్పుడు ఆలనాపాలనా లేనట్లు, కొద్దిగా నీరు మిగిలింది. గడ్డితో నిండివుంది. కార్తీక శు॥ అష్టమినుండి బహుళ సప్తమి వరకు ఇక్కడ జరిగే బ్రహ్మోత్సవాలు పాల్గొనదగినవి.

**గూడెంగుట్ట సత్యనారాయణస్వామి** చాలా పురాతనమైన ఆలయంగా చెబుతారు. అదిలాబాదుకు 108 కి.మీ దూరంలో ఈ గూడెంగుట్ట వుంది. అన్నవరం వలె ఈ ఆలయం ఎంతో ప్రఖ్యాతి పొందింది.

ఆదిలాబాదులోని శ్రీవేంకటేశ్వరుడు, పురాతనుడు, పురాణపురుషుడు, ఆలయం నవీనత సంతరించుకున్న అధునాతనమందిరం విశిష్టత స్వామిది. విఖ్యాతి ప్రాంతమిది.

## కల్వ - నరసింహస్వామి



మూడు కర్రముక్కల రూపంలో వుండటం ఇక్కడ విశేషం. ఉత్సవ సమయాలలో మాత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పూజారి ఇంటినుండి వూరేగింపుగా తీసుకువచ్చి కార్యక్రమాలు జరుపుతారు. మిగిలిన సమయాలలో కర్రముక్కలస్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు.

హుమామూర్ అటవీగ్రామంలో "బొడ్డెమ్మ" అనే గ్రామదేవత ఆలయముంది. ఇక్కడ గోండు జాతి గిరిజనులు ఎక్కువగా వుంటారు. ఇంకా ఇక్కడ "అహి పెన్నమ్మ, ఆవుల పెన్నమ్మ, మైసమ్మ, సత్తెమ్మలనే గ్రామ దేవతల గుళ్ళుకూడా వున్నాయి. కాని నిత్యనీరాజనా లందుకునే గౌరీదేవి అంశగా చెప్పే బొడ్డెమ్మతల్లి వుట్టిసమయాలలో మనం వెళ్ళలేకున్నా జాతర్ల సమయంలో చూస్తే కేవలం సాంప్రదాయం ఆచారాలేకాక, వారి భక్తిప్రపత్తులు, శద్ధను గమనించి పులకరిస్తాం. పెండ్లికాని యువతులు, పుట్టమట్టితో పెద్దబొడ్డెమ్మతల్లిని చేసి పసుపు, కుంకుమలతో అలంకరించి, ఆ అమ్మవారి చుట్టూ తిరిగి నృత్యాలు చేస్తే మంచి మొగుడు లభిస్తారన్నది వారి సాంప్రదాయం, విశ్వాసం.



**నిర్మల్‌లోని శ్రీవేంకటేశ్వరాలయం** అతి ప్రాచీనమైనదని, ఇంకా ఈగ్రామం, కృష్ణాజిల్లా కొండపల్లి వలె నిర్మల్ కూడ ఆటబొమ్మలకు ప్రసిద్ధిచెందినది. ఈ గ్రామాన్ని నిమ్మ నాయకుడు నిర్మించాడని, ఆయన పేరున పిలిచే నిమ్మ పట్టణం, రానురాను నిర్మల్ అయి చారిత్రక కళా కేంద్రం గాను, అలాగే ఈ ప్రాచీన దేవునితో పరమ పుణ్యధామం గాను తయారైంది. ఇంకా ఇక్కడ ఎన్నో దేవాలయాలు వున్నాయి. అనేవారేతప్ప వాటి వునికిని, కీర్తిని చెప్పేవారు మాత్రం కనబడటంలేదు.

నిర్మల్ – బాసర రహదారిపై వలం, మాటేగాంవ్ గ్రామాలకు దగ్గర్లో వున్న **'కదిలి' లో పరశురాముడు** ప్రతిష్ఠించిన "పాపహరేశ్వరాలయం" వుంది. ఈ ఆలయంలోని కాకతీయుల శిల్పకళాసంపద వారి కళాభిరుచికి, తృష్ణకు తార్కాణంగా కనబడుతుంది. మతోన్మాదులు ఈ దేశములోని ఏ ప్రాంతంలోని ఆలయాన్ని విడువలేదు. అలాగ వారి ఘాతుకాలకు గురయినా, చెక్కుచెదరని శిల్పసంపదను మనం ఇప్పటికిని చూడగల్గుతాము.

తన తండ్రిని దారుణంగా చంపినందుకు క్షత్రియనాశనమనే కోపంతో సంహారక్రీడగావించిన పరశురాముడు, అనంతరం పశ్చాత్తాపమొంది ప్రాయశ్చిత్తంగా 32 ఆలయాలను నిర్మిస్తారు. అందులో దీనిని చివరిదానిగా చెబుతారు. శివరాత్రి, శ్రావణ, కార్తీకమాసాల చేసే ఉత్సవాలు ఇక్కడ చూడదగినవని భక్తులు చెబుతారు.

## నిజామాబాద్ జిల్లా

### శ్రీలింబాద్రిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి

జిల్లా కేంద్రంనుండి 62 కి.మీ దూరంలోని భీంగల్ గ్రామానికి 4 కి.మీ దూరంలో వుందీ లింభాద్రిగుట్ట. దీనిని శ్రీమన్నింబాచలమని కూడా అంటారు. ఇక్కడ శ్రీలక్ష్మీనృసింహస్వామి అతి ప్రాచీనాలయముంది. దీని నిర్మాత, నిర్మాణకాలం తెలియదుకాని కొండపైన ఓ సొరంగంలో స్వామివారు వెలిసారని ఈ ప్రాంత ప్రజలకు స్వామివారంటే విపరీతమైన అభిమానం. ఒక రైతు పొలం దున్నుతుంటే శ్రీస్వామి విగ్రహం, బయటపడిందని, దానిని చూసి ఏంచెయ్యాలో అర్థంకాని రైతు చూస్తుండగా ఒక పాము అతనిముందు నుండి సాగిపోతుంటే చిత్రంగా దానిని అనుసరించడం, అది కొండపైని సొరంగం లోకి వెళ్ళి మాయమవడంతో, స్వామివారిని అక్కడ ప్రతిష్ఠించడం జరిగింది.



ఆ రకంగా వెలసిన స్వామి భక్తజనులచేత ఆరాధింపబడటమేకాదు, వారికి ఆరాధ్యుడయ్యాడు. ఈ సొరంగం రెండు భాగాలుగా కనుపిస్తుంది. మొదటిదానిలో రథం, రెండవదానిలో స్వామి వుంటారు. ఆలయానికి ఎదురుగా పవిత్ర పుష్కరిణి వుంది. దీనిలోని నీరు ఎల్లకాలం ఒకేలాగ వుంటుంది. ఒకప్పుడు ఎంతో విశాలంగా వుండే సొరంగం ఒకసారి కొందరు దొంగలు స్వామివారి ఆభరణాలన్ని తీసుకు పారిపోబోతుంటే స్వామి ఆ సొరంగాన్ని ఇరుకుచేసి వారిని బంధించడంతో నగలు విడిచి స్వామికి సాగిలపడి పారిపోయారు. అప్పటినుండి ఆ సొరంగమలాగ ఇరుకుగానే వుండిపోయింది.

డిచ్‌పల్లి గుట్టపైగల రామాలయం అతి పురాతనమైనది. మహిమాన్వితమైంది. 17వ శతాబ్దంలో నిర్మాణమైనట్లు చెప్పే ఆలయం. ఎంతో అందంగా, అద్భుతశిల్ప కళతో కన్నులకు పండుగ చేస్తుంది. ఇక్కడి ఆలయమే కాదు డిచ్‌పల్లిగ్రామం కూడా చారిత్రాత్మకమైనది. ఒకప్పుడు దీనిని దక్షానగరము, సీతానగరమని పిలిచేవారుట. అంతేగాకుండా ఇక్కడ వచ్చివారు ఎక్కువగా వుండటంతో 'దచ్‌పల్లి' అనేవారుట. అది రానురాను డిచ్‌పల్లిగా పేరు పొందింది. దక్షిణాన కోనేరు, మధ్యలో మండపంగల 60 అడుగుల ఎత్తుగల ఈ ఆలయాన్ని ఖజురాహో ఆలయంగా చెప్పుకుంటారు. ఇక్కడి మూలవిరాట్టు, ఇతర విగ్రహాలు, క్రొత్తగా నిర్మించినట్లు కనబడే ఆలయశోభ ఈనాటిది కాదు. కళాపోషకులైన విజయనగర రాజుల కాలంనాటిదిగా చెబుతారు. చూడచక్కని కళాశోభ ఈ ఆలయం స్వంతమని చెప్పవచ్చును. అలాగే...

ఈ జిల్లాలోని బిచ్కుంద గ్రామములో 108 ఆలయాలు, చెరువులు, అన్నే బావులు వున్నాయని 2000 సం॥ క్రితం, ఒక వ్యక్తి తానొక్కడే అద్భుతమని చెప్పే శివాలయం నిర్మించాడని చెప్పుకుంటారు. ఇందుకు మట్టి లేదా కేవలం రాళ్ళను పేర్చి ఆలయం నిర్మించడం, అది ఇవ్వాల్టికి 'కమ్మరిగుడిగా' దర్శనమివ్వడం విశేషాలకే విశేషం. ఈ గుడిలోని శివలింగం క్రిందనుండి బన్సువాడ మండలంలోని జోర్లంబసవేశ్వర మందిరానికి సొరంగమార్గముండేదని చెబుతారు.

నిజమాబాదులో 1400 సం॥ల సుదీర్ఘ చరిత్ర కల్గిన ఒక అపురూప ఆలయం నీలకంఠేశ్వరాలయం. ఇది జైన, ఆర్యశిల్పా కళాశోభితం.మొదట్లో ఇది జైన ఆలయమని, రెండవపులకేశి దీనిని కట్టించాడనేది చరిత్ర చెప్పే సాక్ష్యం. ఆ తర్వాత కాకతీయ ప్రభువులు దీనిని శివాలయంగా మార్చిరని, శివుడిని ప్రతిష్ఠించారని, శివకేశవభేదం కనుపించకుండా, శివుని వెనుక శేషశయనుడైన శ్రీమహావిష్ణువును కూడా చూడవచ్చును. మూడెకరాల స్థలంలో విస్తరించిన ఈ ఆలయం త్రిమూర్తులను, అలాగే అద్భుత అందాలను ప్రకటిస్తే ఆ నీలకంఠేశ్వరాలయంవలన, గ్రామానికి కూడ అదే పేరు స్థిరపడింది.

ఇక్కడ నీలకంఠేశ్వరుడు, వెనుక శేషశయన శ్రీమహావిష్ణువు, ఆయనబొడ్డునుండి ఉదయించిన బ్రహ్మతో విలసిల్లుతుంది. ఇక ఇక్కడ అంతరాలయాలలో కుడిభాగాన వీరభద్రుడు, ఎడమవైపు గణపతి, మండపంలోని కుడిభాగానగల గుడిలో పార్వతీదేవి, మధ్యలో నందీశ్వరుడు మొ॥గు దేవతల దర్శనం లభిస్తుంది. మందిరానికి ఎదురుగా కోనేరు, సింహద్వారానికి దక్షిణాన విఠలాలయం, హనుమాన్ ఆలయం, రావిచెట్టు, శివలింగాలు, సర్వదేవతల నిత్యపూజలు, అభిషేకాలు, పర్వదినాలలో ప్రత్యేక ఉత్సవాలుతో వెలుగొందే చూడదగ్గ అతి ప్రాచీన ఆలయమిది.

నిజామాబాదుకు 6 కి.మీ దూరంలో సారంగపూరు, 400 సం॥ క్రితం ఇటువైపు వచ్చిన ఛత్రపతి శివాజీ మహారాజు గురువు శ్రీసమర్ధరామదాసు వర్షాలు లేక బాధపడుతున్నవారిని, వూరిని ఆదుకోవడానికి తపస్సు చేసిన ప్రాంతంలో అతి పెద్ద ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్ఠించబడింది. ఈ ఆంజనేయుడు భక్తాంజనేయుడై, దర్శించిన వారిని తరింపచేయడం తన లక్ష్యంగా మహిమలను ప్రకటిస్తున్నాడు.

నిజామాబాదులో నూతనంగా రాజస్థాన్ భక్తులతో నిర్మింపబడిన హింగుళాదేవి ఆలయం, చిన్నదైనా భక్తికి ఏ విధమైన ఇబ్బంది కలుగనీయనిది. అలాగే జిల్లాకేంద్రానికి 9 కి.మీ దూరంలోని మానిక్‌బందరు లోని గుట్టపై వెలసిన శ్రీఅఘోరలక్ష్మీనరసింహస్వామి, 70 మెట్లెక్కి గుట్టపైకి వెడితే రాతిపుష్కరిణి, పెద్ద రాతి గుండుగల గుహలో గర్భాలయం. అందులోవున్న 11/2 అ॥ ఎత్తుగల స్వామివారి విగ్రహం, చతుర్భుజాలతో ఆయుధాలు, పొడుగాటి గడ్డంతో, పద్మంపై నిలబడి దర్శనమిస్తాడు. ఆ పాదాల వద్ద హంస వుండటం మొక విశేషం.

## జండా బాలాజీ ఆలయం, నిజామాబాదు



ఇది 1890 సం॥లో చిన్నగా ఆ శ్రీనివాసకృపగా నిర్మితమైన ఆలయం. 'తుకాజీ' అనే కందాద గ్రామస్థుడు ప్రతి సం॥ తిరుపతి వెళ్ళి స్వామిని దర్శించేవాడు. మధ్య మార్గంలో ప్రస్తుతం బాలాజీ మందిరమున్నచోట కొంత విశ్రాంతి తీసుకుంటూండేవాడు. వయసు మళ్ళి ఓపిక తగ్గి, ఇక తిరుపతి చూడలేననే బాధతో స్వామీ! అని సాగిలపడతాడు. భక్తుని బాధను గ్రహించిన బాలాజీ, కరుణామయుడై, తన మహంతుకు తుకాజికి ఉత్సవ

విగ్రహాలనిమ్మని చెప్పాడుట. శ్రీవారిచ్చిన కలకు పరవశించిన మహంతు, తుకాజీని వెదుక్కుంటూ వచ్చి, స్వామివారి కరుణను వివరించి, విగ్రహాలిస్తాడు. తిరుమలలో తిరుమల వాసుని కరుణకు మురిసిన గోస్వామి ఆ విగ్రహాలతో తాను మార్గమధ్యలో విశ్రాంతి తీసుకునే వృక్షం వద్దకువచ్చి యధాప్రకారం విశ్రాంతి తీసుకుంటాడు. తెల్లవారేసరికి చిర్నపల్లి జమీందారు, తుకాజీని వెదుక్కుంటూ వచ్చి శ్రీస్వామి ఆదేశమంటూ ఆ ప్రాంతాన్ని శ్రీస్వామివారికోసం తుకాజీకి సమర్పించుకుంటాడు. ఆనందభరితుడైన తుకాజీ అక్కడ శ్రీవారికోసం చిన్న ఆలయం నిర్మించదలచి, విగ్రహాలతో తన గ్రామానికి బయలుదేరబోవ, నేలపై వుంచిన విగ్రహాలు వూడిరాలేదు. దానిని స్వామి ఆజ్ఞగా తలచి, అచ్చటనే వుండి స్వామిని పూజిస్తూ చిన్న ఆలయం కట్టుకున్నాడు. ఆతదుపరి కాలంలో అంటే 1930 సం॥లో నర్సాగౌడ్ అనే భక్తుడు ఇప్పటి ఆలయాన్ని నిర్మించి తన భక్తిప్రపత్తులను చాటుకున్నాడు.

ఆర్మూర్ గుట్టమీదగల నవనాథ ఆలయం "సిద్ధేశ్వరాలయం, సాధకులు చూడదగ్గ దివ్యధామం. పూర్వం ఇచ్చటి గుహల్లో నవనాథులైన సిద్ధులు – గోరఖ్‌నాథ, జలంధర్‌నాథ, రపట్‌నాథ్, అపభంగనాథ్, కాన్షీనాథ్, మశ్చీంద్రనాథ్, చౌరంగీనాథ్, రేవనాథ్, బర్తరీనాథ్‌లు, దేశ సంచారంలో భాగ్యంగా ఇక్కడికి వచ్చి, తపస్సు చేసుకున్నారని చెప్పుకుంటారు. ఈ విషయం తెలిసిన భక్తులు కొందరు గుట్టపై ఆ సిద్ధులను దర్శించారుట. 'ఆరు + మూడు' మొత్తం తొమ్మిదిమంది సిద్ధులవలన, ఆరు+మూడు అని, కాలక్రమంలో 'ఆర్మూర్' అని ఈ గ్రామానికి పేరు వచ్చింది.ఇచ్చటి శిలలు శిల్పాలవలె దర్శనమివ్వడమొక విశేషం. నవనాథసిద్ధేశ్వరాలయం ప్రక్కన గల కోనేటినీరు దీర్ఘవ్యాధులను నయం చేస్తుందని భక్తుల, ప్రజల ప్రగాఢ నమ్మకం.

ఈ గుహ దాటిపైకి వెడితే అక్కడో రామాలయం వుంది. దీనికి సొరంగమార్గంవుంది. మెట్టమార్గమువుంది. ఇక్కడి గుహలో శివాలయం, ఏకశిలాస్తంభం, పాలగుండం, జలకుండం, పాతాళగంగలను చూడవచ్చును. ఈ సిద్ధప్రదేశం దర్శనం, అర్చనాదులు, అదృష్టవంతులకు మాత్రమే... అంటే కోపగించుకోకండి!

అంక్సాపూరులోని 511 కిలోల పాదరస లింగం ఎంతో మహిమగలదిగా చెబుతారు. వేల్పూరు మండలంలోని ఈ అంక్సాపూరుకు, శివదర్శనార్థం మహాశివరాత్రికి అసంఖ్యాక భక్తులు, ఎక్కడినుంచి అంటే ఎక్కడనుండో, గుంపులుగుంపులుగా వస్తారు.

## దుర్కి శ్రీసోమలింగేశ్వరాలయం



బీర్కూరు మండలంలోని 'దుర్కి' అనే గ్రామం శివారులో అతి పురాతన శ్రీసోమలింగేశ్వరస్వామి ఆలయం, 17వ శతాబ్దికి చెందిన కాకతీయుల కళాప్రాభవం వుట్టిపడేటట్లు విశాలమైన మంటపం, చుట్టూ ఎత్తైన అరుగులు, వాటిపై చూడముచ్చట గొలిపే రాతిస్తంభాలు, ప్రతి కోణంలో నుండి చూడవలసినదే. పూర్వకాలంలో శివావతారుడైన శ్రీదూర్వాసు మహర్షి తన తపస్సుతో శివుని దర్శించి లింగ ప్రతిష్ఠ జరిపాడని, అక్కడే కాకతీయ రాజు సోమ భూపాలుడు ఆలయం నిర్మించడం, సోమభూపాలుని పేరున స్వామి శ్రీసోమలింగేశ్వరునిగా ప్రసిద్ధి గాంచడం జరిగిందంటారు.

ఇక మహర్షి పేరు 'దుర్కి'గా సంక్షిప్తమొందిందని స్థానికుల అభిప్రాయం. అన్ని శివక్షేత్రాలవలెనే ఇక్కడ మహారాత్రి, శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా జరుపుతారు. విశేష సంఖ్యలో భక్తులు తరలివస్తారు.

జిల్లాకేంద్రానికి దగ్గర్లోని ఇందురు గ్రామంలో ఒక ఖిల్లా, ఆ కోటలో రఘునాధాలయముంది. కోటలో ప్రవేశించడానికి ఎత్తైన ద్వారం, ఏకశిలతో చెక్కిన ద్వారబంధాలు, వాటిపైభాగంలో రెండు సింహాలమధ్య పద్మంలోగల గజలక్ష్మిఅమ్మవారు చూడముచ్చటగా వుంటుంది. ఇది 10వ శతాబ్దినాటి ఆలయంగా చెబుతారు. రాష్ట్రకూటులకు చెందిన ఇంద్రుడు అనే రాజు 914-928 సం॥ల మధ్య ఈ కోటను నిర్మించినా, ఇప్పటికే ఇది భద్రంగా వుంది. ఇక్కడి ఆలయాన్ని ఛత్రపతి శివాజీ మహారాజు గురువుగారు శ్రీసమర్ధరామదాసు నిర్మించారని, కాకపోతే ఆ తర్వాతి కాలంలో ఈ కోటలోని శ్రీసీతారాముల విగ్రహాలను శిర్నాపల్లి సంస్థాన మహారాణి ఇందవ్వారలు రామాలయానికి తరలించారని, ఇప్పుడు మనం చూసేవి ఇప్పటికాలానివని స్థానికులు చెప్పుకుంటారు.

కోటలో దశావతారాల ఏకశిలను చూడవచ్చును. ఇక్కడి కోనేటిని ఉద్యానవనంగా మార్చారు. ఇక్కడి ఆలయంలొ శ్రీసీతారాములను కూర్మపీఠంపై ప్రతిష్ఠించారు. విగ్రహాలు భద్రాచలాన్ని గుర్తుచేస్తాయి. కోటలోకి వెళ్ళే మార్గంలో ఆంజనేయస్వామి ఆలయం వుంది. ఈ ఆలయం ముందు పెద్దపెద్ద బండరాళ్ళు కోటగోడల్లా నిలచివుండటం చూడదగ్గది.

## బిక్కనూరు - సిద్ధరామేశ్వరుడు

కామారెడ్డి పట్టణానికి 12 కి.మీ దూరంలో బిక్కనూరు వుంది. ఇక్కడి గుట్టమీద శ్రీసిద్ధరామేశ్వరాలయం వుంది. రామగిరి, సిద్ధగిరి అనేవారలు ఇక్కడ తపస్సు చేసుకుంటూ, ఒకనాడు ఆవు పుట్టలో పాలు పోయడం చూసి ఆశ్చర్యపోతూ, జాగ్రత్తగా చూస్తే అందులో శివలింగం కనుపిస్తుంది. దాంతో అది తమకు భాగ్యంగా తలచినవారు, ఆ లింగాన్ని భక్తితో పూజించుకుంటుంటే, ఒకనాటి రాత్రి శివుడు వారికి కలలో కనుపించి 'ఆలయాన్ని నిర్మించి, నన్నందులో ప్రతిష్ఠించండి. మీకు నేనిచ్చే గ్రంథం ద్వారా, ఆలయనిర్మాణానికి కావల్సిన ధనం సమకూరుతుందంటాడు.




ఆ తర్వాత కళ్ళు తెరచిచూస్తే అక్కడో గ్రంథం కనబడు తుంది. దాని మహిమవలన తగిన ధనం లభ్యమవడం, ఆలయనిర్మాణం జరగడం జరుగుతుంది. సిద్ధునివలన ప్రతిష్ఠించబడినది కాబట్టి శ్రీసిద్ధరామేశ్వరాలయమని, ఆ ఇద్దరి పేరుతో శివుడు ప్రసిద్ధుడౌతాడు. ఆలయం ఉత్తరముఖం, పానపట్టం తూర్పు ముఖం. ఇక్కడి విశేషం- పానపట్టరంధ్రంనుడి సూర్యకిరణాలు ఆలయంలోకి ప్రవేశించి, శివుని అర్చించడమొక అపురూపం.

అష్టసిద్ధి - నవనిధి ప్రదాతయైన ఈ స్వామి సాధకులకు ఏదైనా ప్రసాదించగల అసాధ్యుడని భక్తుల, జనుల నమ్మకం. ఇచ్చటి నంది చూడదగ్గది. పుష్కరిణి ఎంతో పవిత్రమైనది. ఆలయానికి మూలగా వున్న బావిలోని జలం

మంత్రజలంగా చెబుతారు. ఎంతో మహిమాన్వితుడైన స్వామిగా భక్తులు కీర్తించే ఇక్కడి ఉత్సవాలు, జరిపే ప్రత్యేక పూజలు చూడదగ్గవి. పాల్గొనదగ్గవి కూడా.

## ఇస్సన్నపల్లి - కాలభైరవుడు

కామారెడ్డికి 8 కి.మీ దూరంలో వుంది ఇస్సన్నపల్లి. దీనికి రామిరెడ్డి గ్రామాలమధ్య వున్నాడు మనం తలచి, కొలిచే కాలభైరవుడు. ఇది పురాతన ఆలయమనే చెప్పాలి. 1415 సం॥ లో నిర్మించారు. కాలభైరవునితోపాటు, అష్టభైరవుల ప్రస్తావన మనకు వామన, బ్రహ్మవైవర్త పురాణాలలో కనబడుతుంది. శివుడు జటనుండి పుట్టిన మహాక్రోధి ఈ కాలభైరవుడు. మనదేశంలోనేకాదు విదేశాలలో కూడా ఈ కాలభైరవ ఆలయాలు, పూజలు కనుపిస్తాయి. ఇతను అసలు దక్షయజ్ఞ వినాశనం కోసం పుట్టినట్లు మనకు తెలుసు. ఇంకా ముందుకు వెడితే, ఆ కాలంలో బ్రహ్మకు అయిదు తలలు వుండేవి. దాంతో తానే అధికుడననే గర్వం పెరిగి, శివకేశవులను ఖాతరు చెయ్యటం మానేసాడు.



ఆ సమయంలో కాలభైరవుడు, మహాక్రోధియై వెలసిన అఘోరరూపం, బ్రహ్మ తలను ఖండించేసరికి, తలతెగి, గర్వం నశించి, నిజస్థితికి వచ్చాడు. ఆ దృశ్యాన్ని చూసిన శివుడు, 'అఘోరీ! నీవు కాలభైరవుడిగా, ఈ బ్రహ్మకపాలం ధరించి 12 సం॥లు భిక్షాటనం చెయ్యి. అప్పుడు బ్రహ్మహత్యాపాపవిముక్తుడౌతావు. నాకు క్షేత్రపాలకుడి వవుతావు" అని అనుగ్రహిస్తాడు. ఇది పురాణమైతే, చరిత్ర ప్రకారం ....

దోమకొండ సంస్థానాన్ని పాలించే రామిరెడ్డి, కామారెడ్డిలు శత్రువులనుండి సంస్థానాన్ని ఎలాగ కాపాడుకోవాలో తెలియక సతమతమవుతుంటే ఒకనాటి రాత్రి కాలభైరవుడు కనుపించి కాశీలోవున్న తన విగ్రహాన్ని తెచ్చి పూజించండి. మీ అందరికి నేను రక్షగా వుంటానని చెబుతాడు. స్వామి ఆదేశం ప్రకారం విగ్రహాన్ని ఎడ్లబండిలో తీసుకువస్తారు. కానీ ఇస్సన్నపల్లి శివారు వద్దకు వచ్చేసరికి రాత్రి అవడంతో, ఇక ముందకు సాగలేక అప్పటికి అక్కడ విశ్రాంతి తీసుకుంటారు. అలసిపోయిన వారు తొందరగా నిద్రపోతారు. అప్పుడొక బ్రహ్మాండమైన శబ్దం. దాంతో వాళ్ళు ఉలికిపడి లేచేసరికి ఎడ్లబండి విరిగిపోయి, కాలభైరవుడు ప్రతిష్ఠించినట్లు నిటారుగా నిలబడివుంటాడు. దాంతో కొంత ఆశ్చర్యపోయినా దీనిని కాలభైరవ లీలగా తలచి, అక్కడే ఆలయ నిర్మాణం చేస్తారన్నది అక్కడి పెద్దల మాట.

శునక వాహనామూర్తయిన కాలభైరవుడు ఇస్సన్నపల్లి గ్రామ పొలిమేరల్లో ఈశాన్యదిక్కులో పశ్చిమాభిముఖంగా 8 అ॥ మూర్తి నిలచి భక్తజనులను కరుణిస్తున్నాడు. ఈ స్వామి ఇలాగ అవతరించడానికి గల కారణమాలోచిస్తే పూర్వం ఈ గ్రామానికి ఎనిమిది దిక్కులలో అష్టభైరవులు వుండేవారని, వారలీ గ్రామరక్షకులని చెబుతారు. వీరిలో మొదటివాడు కాలభైరవుడు. మిగిలిన ఏడుగురు .. అంటే... అవెలాగ కనుమరుగయ్యాయో ఎవరు చెప్పలేరు.

అనావృష్టి ఏర్పడితే స్వామి విగ్రహానికి పేడను కొట్టేవారుట. అది తొలగిపోయేటంతగా వర్షం కురిసి అనావృష్టి

మటుమాయమయ్యేదిట. ఈ ఆలయంతోపాటు శనీశ్వరాలయం కూడా నిర్మించారు. ఇందులో వున్న బావి నీటితో స్నానం చేస్తే దీర్ఘకాలంగా వున్న చర్మవ్యాధులు కూడ మటుమాయమవుతాయట. కార్తీక బహుళ అష్టమినుండి దశమి వరకు ఇక్కడ జరిగే సంబరం అంబరాన్నంటుతుంది. కనుక మనం చూసి తీరాలనడంలో తప్పులేదుకదూ!

## బోధన్‌లో ఎల్లమ్మగుడి

బోధన్‌లో ఎల్లమ్మగుడి అతి ప్రాచీనమైనది. కాలక్రమంలో చారిత్రక నేపథ్యం గూడా ఈ పట్టణం ఏర్పరచుకుంది. ఇది ఒక పెద్ద మట్టి దిబ్బపై రూపుదిద్దుకున్న గ్రామము. 14 శతాబ్దంలో విశ్వవిమలరాజు అనే సామంతునికి జగదాంబ కలలో కనుపించి తన కొరక ఆలయం కట్టించమని, నిన్ను నీ ప్రజలను సదా కాపాడుతానని చెప్పింది. ఆ రకంగా ఎల్ల ప్రజలను కాపాడే తల్లి 'ఎల్లమ్మ' అని చెప్పుకుంటూ ఆ ఆలయం నిర్మించడం జరిగింది. మొదట్లో ఇది జంతుబలులు, తామసిక పూజలకు కేంద్రము. జోగినీవ్యవస్థ కూడా మొదట్లో ఇక్కడే ప్రారంభమైందని అంటారు. ఏమైనా అందరి తల్లి ఈ ఎల్లమ్మతల్లి అని అక్కడివారందరు చుట్టుప్రక్కల వారితో కలిసి ఆ తల్లిని సేవించుకుంటారు.

కామారెడ్డికి 17 కి.మీ దూరంలోగల చుక్కపూర్ అడివిలోగల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయమొక వింత, సాధరణంగా విగ్రహం వెనుకవైపు గోడకు ఆనుకునో, దగ్గరగానో వుంటుంది. ఇక్కడ గర్భాలయం మధ్యలో వుంటుంది. ఇక్కడ నందాదీపం నుండి వచ్చే నల్లని తిలకాన్ని భక్తులు ధరిస్తారు. వైష్ణవ సాంప్రదాయం పాటించే ఈ ఆలయంలో స్వామికి పొంగళ్ళ నివేదించడం ఒక ఆచారం. ఆనాటి అడవి ఇప్పుడు జనసంచార మొందింది. పర్వదినాలలో భక్తులు పోటెత్తినట్లు వస్తారు.

## ఏకచక్రేశ్వరాలయం

బోధన్ మండలంలో అతి పురాతనమైన ఏకచక్రేశ్వరాలయాన్ని మనం చూడగల్గుతాం. వేల ఏండ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయములో వెలసిన స్వామి స్వయంభూ లింగం. అంటే అయోధ్య, కాశీ మొ॥ ఏడు ముక్తిక్షేత్రాలను దర్శించుకోలేని వాళ్ళు ఈ ఏకచక్రేశ్వరుని కనుక దర్శిస్తే ఆ సప్తముక్తిక్షేత్రాలను దర్శించుకున్న సద్గతి లభిస్తుంది. పరశురాముడు, పాండవులు తిరిగిన ఏకచక్రపురమనే ప్రదేశమే నేటి బోధన్. దీనికి చారిత్రక, పౌరాణిక ప్రాధాన్యం గూడా ఎంతో వుంది.

ఇక్కడి స్వామిని పరశురామ ప్రతిష్ఠగాను, శాండిల్యమహర్షి తన శిష్యులతో ఇక్కడ వేదఘోష సలిపేవాడని శివలీలామృతమనే గ్రంథంద్వారా తెలుస్తుంది. ఈ స్వామి కోరిన కోర్కెలు తీర్చడమేకాదు సంతానప్రదాతగా కూడా చెబుతారు. బకాసురుని హత్యాకథ ఇక్కడ జరిగిందే. కుంతీమధ్యముడైన భీముడు బకాసురుని చంపి ఆ గ్రామస్థులకు ఆనందం కల్గించింది ఇక్కడే. ఆనాడు పాండవులు స్నానమాచరించిన పాండుతీర్థం, చక్రతీర్థాలనిక్కడ మనం దర్శించవచ్చును.

ఈ పురాన్ని దర్శించిన పరశురాములవారు ప్రస్తుతం చెక్కిచెవురు (చక్రితీర్థం) గా పిలిచే ప్రాంతంలో తానుండి రామలింగేశ్వరాలయం నిర్మించినట్లు చెబుతారు. త్రేతాయుగంలో నిర్మించిన ఆలయం, కాలప్రభావంగా మట్టిలో కప్పబడిపోయింది. కలిలో, కాకతీయుల కాలంలో తరచు జరిగే మహ్మదీయ దండయాత్రల నుండి రక్షించుకోవడానికి

ఈ ఆలయం భూస్థాపితం చేయబడింది. అది 1959 సం॥లో జరిగిన త్రవ్వకాలలో ఆనాటి ఆలయం బయటపడింది. నాల్గు వైపులా ద్వారాలు, నాల్గు స్తంభాలతో మంటపంగా, మధ్యలో శివలింగం, పైన దానికి కప్పుతో చూడచక్కగా వుంది. ఏకచక్రపురంలో దొరికింది కాబట్టి దీనిని చక్రేశ్వరాలయం అని పిలువబడి అపురూప ఆలయంగా ఇక షరామామూలే అన్నట్లు అర్చనలు, అభిషేకాలు ఉత్సవాలు సమయానుకూలంగా నిర్వహిస్తూ, జనులు భగవంతునిపై తమకుగల భక్తిని చాటుకుంటున్నారు.

## వందస్తంభాల ఆలయం

ఈ బోధన్‌లోనే జిల్లాకేంద్రమునకు 30 కి.మీ దూరంలో ఇంద్రనారాయణ ఆలయంగా చెప్పుకునే వందస్తంభాల ఆలయముంది. హిందువులు ఇంద్రనారాయణ ఆలయమంటే ముస్లిం సోదరులు దేవత మశీదుగా పిలుచుకుంటూ ప్రార్థనలు చేస్తారు.మొత్తానికి ఉభయులకు అభిమాన పాత్రమైన ఆలయం. ఎప్పుడు కట్టారు దీని నిర్మాత ఎవరు? అనేది సృష్టిరహస్యమంత నిగూఢమైకూర్చుంది. ఈ వందస్తంభాల ఆలయంలోని శిల్ప సంపద చూడదగ్గదని చెప్పడం తప్పుకాదనేది అభిమానుల భావన.

## శ్రీదత్తాత్రేయస్వామి - బోర్గం

1. బోర్గం గ్రామంలో భక్తజనుల కోరికపై వెలసిన సద్గురు నాధుడు శ్రీదత్తదేవుడు. ఆరాధించినవారి సర్వ సమస్యలను పరిష్కరించే విశ్వగురువు సర్వసమర్థుడు శ్రీదత్తనాథుడు. అత్రి, అనసూయల వర, తప ప్రభావమైన శ్రీదత్తునిగా, విశ్వగురువుగా శ్రీమహావిష్ణువు అవతరించాడు. వేదాలు సాకారాలై ఈ విశ్వగురువును సేవించడానికి, విశ్వాసానికి ప్రతీకలుగా చెప్పే శునకాలయ్యాయి. సర్వదేవలు స్తుతించారు. స్వామి జంభాసురాది రాక్షసులను శిక్షించి, యోగలక్ష్మి మహిమను, తత్వజ్ఞానాన్ని ప్రసాదించిన దివ్యక్షేత్రమే ఈ చోద్యం ఇక్కడి దత్తగురువు.

2. ఇక్కడి గుట్టపైగల ఆదిబసవేశ్వరాలయం అతి ప్రాచీనమైనది. బసవేశ్వరునిగా వెలసింది ఆది బస వేశ్వరుడని భక్తుల భావన. అచ్చోసి ఆంబోతుగా విడిచిపెట్టిన బసవన్న ఇష్టారాజ్యంగా గ్రామంలో తిరుగుతుంటే, తమ పొలాలు పాడుచేస్తూంటే రైతులు దానిని భయపెట్టబోతే అది కాస్తా ఈ గుట్టపైకి ఎక్కి అదృశ్యమైందిట. ఆ రకంగా బసవేశ్వరుని ఆలయం ఇక్కడ ఏర్పడింది. ఇక్కడి విశేషం 200 సం॥ల నుండి వెలుగుతున్న అఖండజ్యోతి. ఇచ్చటి బసవారాధన వీరశైవం ప్రకారం జరుపబడుతుంది. పండుగదినాలలో భక్తుల రద్దీ ఎక్కువగా వుంటుంది.

3. ఇక్కడి మూడో ఆలయం. శ్రీమార్కండేయ మందిరం. చూడటానికి చిన్నదైనా ప్రాచీన ఆలయంగా దీనిని చెబుతారు. మహాశివభక్తుడైన మార్కండేయుడు ప్రళయంలో కూడా చిరంజీవిగా, అనంతరం కూడా ఆ వటపత్రశాయి చెంత నిలచివుంటాడని వరం పొందినదివ్యుడు. ఇటువంటి వారి ఆలయాలు చాలా అరుదుగా వుంటాయి. వున్నంతలో, తెలిసినంతలో వీరిని దర్శించుకోవడం ఉత్తమోత్తమన్నది బుద్ధిమంతుల భావన. ఇక...

జానకమ్మపేటలో 5 కి.మీ దూరంలో పర్వత భాగానకల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఎప్పటిదో తెలియదు. ఎవరు నిర్మించారో తెలియదు. ఆలయంలోవున్నది 4 1/2 అ॥ విగ్రహం. చూడటానికి పేరుకు తగ్గట్లు నరసింహుడే. లక్ష్మి ప్రక్కనవుంది కాబట్టి బ్రతికిపోయాం. 13వ శతాబ్దికే ఇది ప్రసిద్ధిపొందిన క్షేత్రం ముస్లిం ప్రభువులు ఈ స్వామికి అగ్రహారాలు, భూములు నిత్యకైంకర్యాల నిచ్చినట్లు తెలుస్తుంది. ఇక్కడి ఆలయం వద్ద అగస్త్యమహర్షి తమ తపశ్శక్తితో రప్పించిన అష్టదిక్పాలురు, అష్టభుజాలుగా కనబడతారు. ఈ ఎనిమిది మూలలలో మెట్లున్నాయి. ఇదే అభిషేకజలం కూడా.

ఇంకా విశేషం. ఈ స్వామివారికి బొడ్డులో సాలగ్రామం వుంది. ఆలయానికి వెనుక శివాలయం, పుష్కరణి, పడమర ప్రాచీన యజ్ఞశాల వుంది. ఇక్కడి కార్యక్రమాలన్నీ అంగరంగవైభోగంగా జరగడమొక విశేషం.

రామిరెడ్డిపల్లిలో 17వ శతాబ్దిలో నిర్మించిన శివాలయం, దీని ప్రక్కన రామాలయం వున్నాయి. ఒకనాటి దోమకొండ సంస్థానాధిపతులు వీటిని నిర్మించారని చెబుతారు. ఒకే విధంగా వుండే ఈ ఆలయాలకు ఒకటే కోనేరు, ఒకటే రథం వున్నాయి. ఈ ఆలయాలను ప్రస్తుతకాలంలో తమభక్తి ఏవిధంగాను తగ్గలేదనడానికి నిదర్శనంగా జీర్ణోద్ధరణం చేసారు. నిత్య,నైమిత్తిక ఉత్సవాలు జరిపిస్తున్నారు.

బీర్కూరు శ్రీవేంకటేశ్వరాలయం, రెండు కొండలపై వెలసినది. రెండవ తిరుపతిగా పేరుపొందినది. ఆలయం 50 సం॥లనాటిది. కానీ స్వామి అనంతశక్తిసంపన్నుడు. పిలిచిన పలికే ప్రత్యక్షదైవం. ఇక్కడ ఈ మధ్య కాలంలో ప్రతిష్ఠించిన 30 అ॥ హనుమాన్ విగ్రహం, సర్వరక్షగా మనను అలరిస్తుంది.

## నందిగుట్ట నందీశ్వరుడు

స్వామివున్న నందిగుట్టలో చిన్నచిన్న గుహలు ఎన్నో వున్నాయి. వీటిలో సిద్ధులు నివసించేవారని చెప్పుకుంటారు. ఇక్కడి ఆలయం ఎంతో ప్రాచీనమైనది. ఇక్కడ గల నంది చూడదగ్గది. ఈ నందివల్లనే ఈ ప్రాంతానికి నందిగుట్ట అని పేరు వచ్చింది. ఈ నందిని దాటగా గుండ్రంగా ఒక సొరంగం దీని గోడలపై షిర్డిసాయి, ప్రాచీన శివరూపం, నిలబడివున్న ఆంజనేయుడు, విశ్రాంతి మందిరం, దీనికి ఎదురుగా గణపతి విగ్రహము చూడదగ్గవి. ఇచ్చట శివరాత్రి ఉత్సవాలు, జాతర్లు జరుగుతాయి కానీ నిత్యపూజలు జరుగాల్సి, పూజించుకోవాలంటే మనం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాల్సి వుంటుంది.

## మల్కాపూర్ (ఎ) - అనంతపద్మనాభుడు

మనరాష్ట్రంలో అనంతపద్మనాభస్వామి, తెలంగాణా జిల్లాలలోని నిజమాబాదు, రంగారెడ్డిజిల్లాలోని అనంతగిరి, మల్కాపూర్ (ఎ), జిల్లాకేంద్రానికి 7 కి.మీ దూరంలో వుంది. ప్రకృతి సహజంగా గోపురం, స్వామి రూపం, ఆ ప్రాంతం అంతా అనంతపద్మనాభుని దివ్యలీలావిలాసానికి మచ్చుతునకగా చెప్పవచ్చును. ఈ లీలావిలాస ఆలయానికి 360 సం॥ల చరిత్రవుంది. కోరి వెలసిన దేవదేవుడు ఈ స్వామి.

కోనమాచార్యులనే బ్రాహ్మణునకు స్వామి కలలో కనుపించి, నేనిక్కడ వెలుస్తాను. కొందరు రాజవంశీయులు ఇక్కడికి వచ్చినప్పుడు తెల్లని గుర్రంగా వారికి నా ఉనికి తెలియబరుస్తానంటాడు. ఒకనాడు ఆ ప్రాంతాన్ని పాలించే గాంధార సంస్థానాధీశులు తమ రాజ్యవిస్తరణలో భాగంగా, ఈ ప్రాంతానికి వస్తారు. ఆ సమయంలో చెరువుగట్టున వున్న కోనమాచార్యులు తనకు తెలిసిన విషయం చెప్పడం, చిత్రంగా అక్కడ తెల్లగుర్రం కనబడటంతో, నిజం తెలుసుకోవాలని సంస్థానాధిపతులు దానిని వెంబడించారు. మల్కాపూరు శివారుగుట్టకు వచ్చి ఆ గుర్రం అదృశ్యమైంది. కోనమాచార్యులు, సంస్థానాధీశులు మెల్లిగా ఆ గుహలోకి వెళ్ళి చూస్తే సన్నటి వెలుగు పూర్తిగా రూపుదిద్దుకోని స్వామి, లక్ష్మీదేవిల రూపులు చూసి పూజలు ప్రారంభించారు. ఆ రకంగా వెలుగులోకి వచ్చిన ఆలయం, సహజశిల్పాకృతి, గోపురం, తోరణాలతో భక్తజనసమ్మోహితునిగా, అభీష్టదాయకునిగా నిలిచాడు.

# కరీంనగర్ జిల్లా

## వేములవాడ రాజరాజేశ్వరుడు

పేరులోనే వుంది పెన్నిధి 'అన్నట్లు స్వామి మహిమ, సార్వభౌమత్వం, శైవక్షేత్రాలలో చెప్పుకుని పరవశించడంకాదు, దర్శించుకుని పులకరించదగ్గది శ్రీవేములవాడ రాజరాజేశ్వరస్వామి. చాళుక్యరాజులు 175 సం॥ పాలించారని చరిత్ర చెబుతుంది. రాజరాజనరేంద్రుడు నిత్యం ఈ ప్రాంతంలోని ఒక వీధికి వస్తుంటే కుష్ఠువ్యాధితో బాధపడే కుక్క కోనేటి స్నానం చేయడం, చూస్తుండగా చిత్రంగా దాని కుష్ఠువ్యాధి పోవడం రాజరాజును ఆశ్చర్యపరచింది. దాంతో సత్యం గ్రహించాలని ఆ చెరువును త్రవ్విస్తే అందులో శివలింగం దొరకడం దానినక్కడే ప్రతిష్ఠించడం జరుగుతుంది. దక్షయజ్ఞ సమయంలో వీరభద్రుడు సూర్యుని చేతులు నరికితే ఆతడు ఇక్కడగల ధర్మకుండంలో స్నానంచేసి తన చేతులను పొందాడుట. ఇటువంటి మహిమలెన్నో మనం వినగల్గుతాము.



అలాగే ఒకానొకప్పుడు ఈ ప్రాంతాన్ని 'లెంబావు వాటిక' అని, లేములవాడ అని పిలిచి, పిలిచి, చివరకు వేములవాడయింది. ఈ దేవాలయానికి తూర్పున 'వళ్ళుబండ' అని పెద్ద బండ వుంది. ఇక్కడ కోరుకున్న కోర్కెలు తీరుతాయని మ్రొక్కుకుంటారు. ఈ ఆలయంలో 22 శివలింగాలున్నాయి. ఇంకా ఇక్కడ కోదండ రామాలయం, కాశీవిశ్వనాథాలయం, మహిషాసురమర్దిని ఆలయాలు కూడా చూడవచ్చును. ఇవి కాక మరెన్నో ఆలయాలు, ఆలయప్రాంగణంలో కొన్ని, బయటకొన్ని వున్నాయి. సింహద్వారం ముందుగల రావి వేపచెట్టును దర్శించి లోపలకు వెడితే ఎడమవైపు సూర్యుడు, కుడివైపు కాలభైరవుడు, ఆంజనేయస్వామిలను చూస్తాము. ఇక గర్భాలయంలోని రాజరాజేశ్వరునికి ఎడమవైపున పార్వతి, కుడివైపు శ్రీలక్ష్మీగణపతి, రాజరాజేశ్వరునికి కుడివైపు చండీశ్వరుడు, దక్షిణామూర్తి, సుబ్రహ్మణ్యులు, వెనుకవైపు బాలాత్రిపురసుందరి, సోమేశ్వరుడు, ఉమామహేశ్వరుడు, ఆలయం బయట మహిషాసుర మర్దిని, దీనికి ఎడమవైపున కోటిలింగాలు, ఉత్తరాన ధర్మకుండమనే కోనేరు – ఆలయ సార్వభౌమత్వాన్ని, స్వామి శ్రీరాజరాజేశ్వరత్వాన్ని ప్రకటిస్తూ సర్వశోభాయమానంగా దర్శించి పులకించిపోతాము.

వృత్రాసురుని చంపిన పాపపరిహారార్థం దేవేంద్రుడు ఇక్కడి ధర్మకుండంలో స్నానం చేసి బ్రహ్మహత్యాపాపం నుండి బయటపడతాడట. సూర్యునివలన ఈ క్షేత్రాన్ని భాస్కరక్షేత్రమని పిలుస్తారు. ఇక్కడి ధర్మకుండంలో స్నానం చేసే సూర్యుడు కోల్పోయిన చేతుల్ని పొందుతాడుగదా! మహిషాసురమర్దనిలోని ఈ స్వామి పాత్రవుంది. సతీదేవి ఆత్మాహుతి ఇక్కడే జరిగినదని, దీనిని 'దక్షవాటిక' గా కూడ పిలుస్తారని స్థలపురాణం వలన తెలుస్తుంది.

శ్రీరాముడు, సీతాలక్ష్మణ సమేతుడై తన అరణ్యవాసకాలంలోను, పాండవులు కూడా ఇక్కడి స్వామిని అర్చించారని, శ్రీరామనవమి ఇక్కడ అంగరంగవైభోగంగా జరుగుతుందని, స్థలపురాణంతోపాటు, భక్తులు ఘనంగా చెబుతారు.

ఇక్కడి విచిత్రంకాని, ఆచారం 'కోడెల' మ్రొక్కు. అలాగే నందిపూజ ఇక్కడి మరో విశేష కార్యక్రమం. గండదీపం వెలిగించడం, దీనిని జన్మజన్మల పుణ్యంగా తలుస్తారు. శివరాత్రినాడు ఇక్కడ అడుగుపెట్టడమే కష్టం. శివనామస్మరణం, స్వామిని దర్శించడం, తమ మ్రొక్కులు చెల్లించుకోవడం వంటివి, మహామహాదృష్టంగా తలచి, పునీతులై పుణ్యాత్ములు పులకితులౌతారు.

కాశీ, చిదంబరం, శ్రీశైలం, కేదారేశ్వరాలను పవిత్రం చేసిన శివుడు, ఇక్కడికి వచ్చి ఈ ప్రాంతాన్ని పునీతం చేసాడని భక్తులు ఘనంగా చెప్పుకుంటారు. స్థలపురాణం సరేసరి మరి చూడటం మన బాధ్యతకదూ!

## వేములవాడ భీమేశ్వరుడు



ఆబాలగోపాలానికి తెలిసిన దేవుడు, చాలా ప్రాచీన ఆలయం కూడా. క్రీ॥శ॥ 850–985 మధ్య పరిపాలించిన రెండవ యుద్ధమల్లుని కుమారుడు బద్దిగ భూపతిని ఆలయ నిర్మాతగా చెబుతారు. ఈ స్వామి అత్యంత ప్రాచుర్యం పొందడానికి మూలకారకుడు, ఈతని పేరేగల భీమకవి. ఈతనిని 'తిట్టుకవి' అని కూడా అంటారు ఏదంటే అది జరుగుతుంది. ఈతడు భీమేశ్వరుని అనుగ్రహ వరప్రసాదునిగా కూడ చెబుతారు. ఈతడు కవి పండితుడు. అంతకు మించిన మహాభక్తుడు. ఈ ఆలయంలో ఒక పెద్దమఱ్ఱి (వటవృక్షం) చెట్టువుంది. ఈ చెట్టుకింద వటసావిత్రీ వ్రతం చేసే ఆనవాయితీ కొన్ని వందల సం॥గా వస్తుంది. ఈ ప్రాంతమందే 'బద్దిపోచమ్మ' అనే అమ్మవారు గ్రామదేవతగా పూజలందుకుంటుంది. మాఘబహుళ అమావాస్యనాడు ఈ తల్లికి జరిపే ఉత్సవం / జాతర చూసి తీరవలసిందే.

భీమేశ్వరుని ఆలయంలో అడుగుపెట్టగానే ఎడమవైపు ప్రాచీన విగ్రహాలుగల మంటపం, దీనికెదురుగా ఉన్నతమైన వేదిక, కుడిప్రక్కన నవగ్రహ మండపం, ఇక్కడి రాతిస్తంభాల మండపం తరువాత ఉన్నతమైన వేదికపైన 3 అ॥ ఎత్తుగల భీమేశ్వరుడు శివలింగరూపంలో దర్శనమిస్తాడు. స్వామికి ముందు ఆంజనేయస్వామి ఆలయం, వెనుకవైపు నాగప్రతిమలు, నైరుతిలో గాయత్రీమాత ఆలయం కనబడుతాయి. శిల్పసౌందర్యం చెప్పుకోదగ్గది. ఓం నమశ్శివాయ అనే పంచాక్షరి మంత్రం ఇక్కడ ఎక్కడనుండైనా వినవచ్చును.

హుస్నాబాదు మండలం పొట్టుపల్లిలోని స్వయంభూ రాజేశ్వరస్వామి చాలా గొప్ప మహిమకల వాడుగా అక్కడ ప్రఖ్యాతి. నిజానికిది ఇంటిపునాదులలో లభించిన అతి పెద్ద శివలింగం. ముందు దీనిని మల్లికార్జునస్వామి ఆలయంలో జలావాసంచేసి, అనంతరం ప్రత్యేక ఆలయం కట్టి అందులో ప్రతిష్ఠించారు. ఇక్కడ ప్రతి సోమవారం, మహాశివరాత్రి, బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా జరుగుతాయి. ఇదేకాక హుస్నాబాదులో కాకతీయుల కాలంనాటి

అతిప్రాచీన దేవత రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయం చూడగల్గుతాము. కాకతీయుల కాలంనాటినుండి ఈ తల్లిని శక్తిస్వరూపిణిగా ఆరాధించడం జరుగుతోంది. మే నెలలో జరిపే జాతర చూసి తీరవలసిందే. ఈ అపురూప ఆలయ దర్శనానికి ఉత్తర తెలంగాణా జిల్లాలవారితోపాటు హైద్రాబాదునుండి కూడా బృందాలుగా ఇక్కడికి వచ్చి మ్రొక్కులు తీర్చుకుంటుంటారు.

## ధర్మపురి - శ్రీలక్ష్మీనరసింహస్వామి

క్రీ॥శ॥ 7వ శతాబంలో ధర్మపురిని కేంద్రంగా చేసుకుని విష్ణువర్ధన మహారాజు చేసిన, ధర్మపరిపాలన ఫలమే ఈ ధర్మపురిక్షేత్రం. ఇక ఆధ్యాత్మికంగా చూస్తే దీనిని హరిహర క్షేత్రమని, సమతాస్వరూపమని కూడా చెప్పవచ్చును. కారణం ఇక్కడ స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహ స్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి, మసీదు ప్రక్కప్రక్కనే వుండి సమతాభావాన్ని చాటిచెప్పుతున్నాయి. ఇక్కడి నారసింహుడు యోగానంద నారసింహునిగా భక్తాభీష్టములను తీరుస్తాడు.



యమధర్మరాజు ఈ ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహుని దర్శించి, ఇక్కడే వుండిపోయినట్లు పురాణవచనం. ఇది నిజ మన్నట్లు స్వామివారి ఆలయ కుడి ద్వారం వద్ద యమధర్మరాజు విగ్రహం, దానికి పూజలందుకు నిదర్శనం. దీనివలన అకాల మృత్యువు, యమబాధలు తొలగిపోతాయన్నది భక్తజనుల విశ్వాసం. దేశంలో యమధర్మరాజుకు ఇదే మొదటి ఆలయం. ప్రతిఒక్కరు యమకరుణను పొంది, తదుపరి శ్రీలక్ష్మీ నరసింహుని అనుగ్రహమాశిస్తున్నారు. నరసింహశతకాన్ని వ్రాసిన శేషాచలదాసు ఈ గ్రామం వాడేనట. ఇంకో విశేషం. ఆది శంకరులు "శ్రీలక్ష్మీనృసింహ మమదేహి కరావలంబం" అనే స్తోత్రం వ్రాసిన సంగతి భగవద్భక్తులకు తెలిసేవుంటుంది. దానినీ గ్రంథరచయిత శ్రీ వొరుగంటి రామకృష్ణప్రసాద్ శ్రీలక్ష్మీనృసింహ కరుణించ కదలిరామ్మా" అని తేటతెలుగులో అక్షరాలు వచ్చిన వారు లక్షణంగా చదువుకోవడానికి వీలుగా వ్రాసారు.

ఔరంగజేబు కాలంలో ఈ దేవాలయం కూడా రోహిల్లాల దాడికి గురైంది. ఈ దేవాలయాన్ని మశీదుగా మార్చారు. కొన్ని వందల సం॥తర్వాత నృసింహుని విగ్రహం గోదావరిలో జయటపడింది. ఇది పాత నృసింహస్వామి. ఇప్పుడీక్షేత్రంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి, యోగనృసింహ, పురాతన నృసింహులు ప్రధాన దైవాలు. ఇవికాక ఉగ్రనృసింహ, శ్రీవేంకటేశ్వర, శ్రీరామలింగేశ్వర, ప్రసన్నాంజనేయస్వామి వారివి అనుబంధ ఆలయాలు. అలాగే శ్రీ గౌతమేశ్వరాలయం, సత్యవతీమందిరం (ఇసుకస్తంభం) రాజేశ్వరాలయాలు చూడదగ్గవి.

ప్రధానాలయం దగ్గర్లో బ్రహ్మపుష్కరిణి, దక్షిణాన శ్వేతవరాహతీర్థం, పశ్చిమాన పుష్పసరోవరం, తూర్పున గోదావరిలు భక్తజనులను పవిత్రమొనరింప చేసే పావన నదీమూర్తులు.

## శ్రీ కాళేశ్వర ముక్తేశ్వరుడు

మంథనికి 32 కి.మీ. దూరంలో ఈ పవిత్ర కాళేశ్వర క్షేత్రం, అక్కడి ముక్త్వేశ్వరుడు చూడదగ్గవాడు. ఇక్కడ గోదావరి, ప్రాణహితలలో మరో దివ్యనది అంతర్వాహినిగా వుందిట. ఇక్కడి విశేషం – ఒకే పానపట్టంమీద రెండు శివలింగాలు వుండటం. ఒకదానిని ముక్తేశ్వరలింగమని, రెండవదానిని కాళేశ్వరలింగమని చెబుతారు. అలాగే పిలుచుకుంటారు. ఇక్కడ ఈ శివాలయంకాక మరెన్నో మందిరా లున్నాయి. అందులో అపురూపమని చెప్పబడే బ్రహ్మ ఆలయమొకటి. స్కాందపురాణంలోని 'కాళేశ్వరఖండం' ఈ క్షేత్ర చరిత్ర స్వామిగాథ వివరంగా తెలియబరుస్తుంది. నిజం చెప్పాలంటే కాశీకన్న బియ్యపుగింజంత ఈ క్షేత్రమే గొప్పదన్న భావం 'సత్యంలా' సత్యంగా ప్రకటితమౌతుంది.



ఒక పురాణగాథ ప్రకారం – ఇక్కడి భక్తులంతా పంచాక్షరీ మంత్రంతో పరవశించిపోతూంటే పాపాత్ములనేవారు లేక, తన లోకానికి రాక వెలవెలబోతుంటే యమధర్మరాజు ఇక్కడికి వచ్చి స్వామిని దర్శించి తన ఆవేదన బయట పెడతాడు. సమాధానంగా శివుడు 'యమధర్మరాజా! నా ప్రక్కన వుండు. నిన్ను పూజించకుండా వెళ్ళేవారికి ముక్తి దొరకదు. దాంతో వారు నీ లోకవాసులై తమ ప్రారబ్ధాన్ని అనుభవిస్తారంటాడు. ఆ రకంగా కాలేశ్వరుడై న యముడు 'కాళేశ్వరు'డైనాడు. ప్రతి భక్తుడు ముఖద్వారం వద్దగల వినాయకుని, లోపలికి వెళ్ళాక ముందు కాళేశ్వరుని, ఆ తదుపరి ముక్తేశ్వరుని దర్శించి, పూజిస్తేనే ఫలం – ఫలితం.

కాళేశ్వర, ముక్తేశ్వరులతోపాటు సోమేశ్వరాలయం, సంగమేశ్వరాలయం, చండీ కేశ్వరాలయాలు ఎడంప్రక్కన, వెనుక ఆదిముక్తేశ్వరాలయం, ముందు భాగాన చంద్రశేఖ రాలయాలు, వల్లి దేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వరుడు, సమీపంలో విజయగణపతి, సరస్వతి ఆలయాలు వున్నాయి. కాశ్మీరులోని బాలసరస్వతి, బాసర జ్ఞానసరస్వతిలైతే, ఇక్కడి తల్లి మహాసరస్వతి, (ఈమెను ప్రౌఢసరస్వతిగా కూడా చెబుతారు.)ని చూసి ఆనందించగల్గుతాము.

చొప్పదండి నియోజకవర్గంలోని కొండగట్టుపై ప్రకృతిసౌందర్యంతో అలరారు ప్రదేశంలో, ఆంజనేయస్వామి దేవాలయముంది. దీనికి దక్షిణాన కొండలరాయుని కోట గుహలు, బొజ్జపోతన, కందలరాయుని గుర్రపు డెక్కల గుర్తులు, సీతమ్మ కన్నీటి గుంటల్ని చూస్తున్నామంటే ఇదెంతటి ప్రాచీన క్షేత్రమో అర్థమవుతుంది.

160 సం॥ క్రితం కృష్ణారావుదేశముఖ్ ఈ ఆలయాన్ని పునరుద్ధరించి, కొంత భూమిని కూడా సమర్పించు కున్నాడుట. ఇక స్థలపురాణం ప్రకారం 500 సం॥ క్రితం కొడిమ్యాల పరగణాలలో సింగంసంజీవుడు ఇక్కడ ఆవులు మేపుకుందుకు రాగా ఒక ఆవు తప్పిపోతుంది. సంజీవుడు దానిని వెదకుతూ వచ్చి అలసి ఒక చింతచెట్టు క్రింద నిద్రపోతాడు.

అప్పుడు శ్రీస్వామి అతనికి కనుపించి "నేను కోరండ పొదలలో వున్నాను. నన్ను ఈ ఎండవాన ముండ్లపొదల నుండి రక్షించు. నీ ఆవు ఇక్కడవుంది" అంటూ చూపించి అదృశ్యమౌతాడు. కలచెదరిన సంజీవుడు స్వామివారిపై నమ్మకంతో వెదుకగా దేదీప్యమానంగా వెలిగే స్వామి, తన ఆవు కనుపించడంతో, తన వారందరితో కలిసి స్వామి

కొక చిన్న మందిరం నిర్మింపచేస్తాడు. ఈ క్షేత్రంలోని ఆంజనేయుడు, వానర–నారసింహ ముఖాలతో వుండటమొక ప్రత్యేకత. నరసింహస్వామి, రాముడు ఇరువురు శ్రీవిష్ణు స్వరూపలే. హనుమకు ఆరాధనీయులే. అందుకేనేమో, హనుమ శంఖచక్రములు, వక్షస్థలంలో రాముడు, సీతకల్గి వుండటమొక ప్రత్యేకత, విశేషం కూడా! ఈ గట్టుమీద స్వామి వెలిసారు కాంబట్టి స్వామికి కొండగట్టు ఆంజనేయస్వామి అని పేరు వచ్చింది. ఇంకా ఇక్కడో కథ చెబుతారు. లక్ష్మణుని మూర్ఛ తొలగించడానికి ఆంజనేయస్వామి సంజీవనిపర్వతం తీసుకువెడుతుంటే అందులోంచి పడిన ముక్కే ఈ పవిత్రమైన 'కొండగట్టు' గా చెప్పబడుతుంది. ఈ కొండగట్టులో ఆంజనేయస్వామితోపాటు బ్రహ్మపుష్కరిణి, సీతమ్మకణీలు, శ్రీరామపాదుకలు, భేతాళుడు, సీతాదేవి కన్నీటి గుంటలు చూడగల్గుతాము. ప్రకృతిసహజంగా ఏర్పడిన పుష్కరిణి స్నానం ఎంతో శ్రేష్ఠం. ఇక్కడ మండలదీక్షలో స్వామిని ఆరాధిస్తే శుభాలు జరుగుతాయనేది భక్తుల విశ్వాసం.

## ఓదెల - మల్లికార్జునుడు

తెలంగాణాలో ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రాలలో ఇది ఒకటి. ఈ ఆలయం కాకతీయుల కాలంలో పునర్నిర్మాణం చేసారనేది చరిత్రకారుల భావన. ఈ శివలింగాన్ని శ్రీపంకజమహాముని తపస్సు చేసారని, అసలు సిద్ధులు, మునులు 12 గం॥ల తర్వాతే తమ తపోదీక్ష కొనసాగించేవారని చెబుతారు. అనాది సిద్ధ దేవాలయం కాలగతికి పాడుపడి పుట్టతో పెరుగడం, ఓదేలు అనే రైతు సేద్యం చేస్తుంటే నాగటి కర్రుకు ఏదో పట్టుకున్న ట్లవడంతో పుట్టను త్రవ్వచూస్తే అక్కడొక శివలింగం బయటపడుతుంది. అప్పటినుంచి ఈ ప్రాంతం శివుడు ఓదెల అయ్యాడు. శ్రీశైలమల్లన్నకు, ఈ ఓదెలస్వామికి పోలికలు వున్నాయని, అసలీ ఆలయాలు ఒకే కాలంనాటివన్నది మరొక కథ. ఇక ఈ ఓదెల ప్రసిద్ధినొందడానికిగల కారణం రాముడు తన వనవాసకాలంలో ఇక్కడ సేదతీరినందువలన మల్లన్నతోపాటు శ్రీసీతారాముల ఆలయంకూడా నిర్మించబడింది.

ఇక ఈ మల్లన్న ఆలయంలో ఉత్తరాన వీరభద్రుని ఆలయం, ఖండేశ్వరస్వామి, మేడదులదేవి, కేతమ్మల విగ్రహాలు, అలాగే మిధునం పోచమ్మ, బంగారు పోచమ్మల ఆలయాలు కూడా భక్తజనులు దర్శించి తమ మ్రొక్కులు చెల్లిస్తారు. ఈ స్వామి దర్శనానికి రాష్ట్రం, జిల్లాలుకాదు, ఇతర రాష్ట్రాలు, వివిధ ప్రాంతాలనుండి ఇక్కడికి వచ్చి ప్రత్యేక ఉత్సవాలలో పాల్గొంటారు. ఇక్కడి పరిసరాలవారికి ఈ స్వామి పేరు ఉండటమొక విశేషం. శివరాత్రి ఇక్కడ ప్రత్యేక ఉత్సవంగా జరుగుతుంది. కేశోరాం సిమెంటువారు ఈ మధ్యకాలంలో అభివృద్ధి చేసినట్లుగా చెబుతారు.

## కమాన్‌పూర్ ఆదివరాహుడు

శ్రీవరాహస్వామి ఆలయాలలో చాలా తక్కువ. ముఖ్యంగా మన రాష్ట్రంలో రెండు చోట్లే ఆలయాలు ప్రసిద్ధిని మనం చూడగల్గుతాం. మొదటి తిరుమలలోని ఆదివారాహుడు, రెండవది ఇక్కడి వరాహస్వామి. తిరుమలలో భక్తులు ముందుగా ఆదివరాహస్వామిని దర్శించి, శ్రీవేంకటేశ్వరుని దర్శించాలి. అది ఆనవాయితీ. అయితే ఇక్కడ స్వామి సంచరించిన ఆనవాళ్ళుగా ఆయన పాదముద్రలను ఇక్కడగల బండలపై చూడవచ్చును. ఒక మహర్షి

తపస్సు చేయగా ఆయనకు కలలో కనుపించి, ఆ మహర్షి అభీష్టానుసారం ఒక బండపై స్వామి ఆకృతి దాల్చాడు. ఈయనను పూజించినవారి సర్వకోర్కెలు నెరవేరడంతో, పూజాదికాలు ప్రత్యేక పర్వదిన ఉత్సవాలు అంగరంగవైభవంగా సాగుతున్నాయి. ఇక్కడి ఆదివరాహునికి మందిరంలేదు. నిర్మిద్దామనుకుంటే, తననిలాగ వుండమని, తనకే విధమైన నిర్మాణాలు అవసరంలేదని, అడిగినవారికి అడిగినట్లు, దర్శించిన వారికి దర్శించినట్లు తన కరుణను స్వామి ప్రసాదిస్తున్నాడు.

## కొత్తకొండ - కోరమీసాల వీరభద్రుడు

హుస్నాబాదు నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండలో చిత్రమన్నట్లు కోరమీసాల వీరభద్రస్వామిని చూడగల్గుతాం. ఇది పురాతనమైనదేకాదు, శైవక్షేత్రాల్లో చెప్పుకోదగ్గ ప్రముఖ ఆలయంగా విరాజిల్లుతుంది. ఇక్కడి స్వామి లింగమూర్తిగాదు, కోరమీసాల అర్చామూర్తి. ఇది నాల్గు వందల సం॥ల నాటిదని, స్థలపురాణం ప్రకారం 17 శతాబ్దప్రాంతంలో కొంతమంది కుమ్మరులు వంటచెరకు (కట్టెల) కోసం ఎడ్లబండిలో వెళ్ళారు. తీరా తాము కట్టెలు కొట్టుకుని వచ్చేసరికి వారి ఎడ్లబండ్లు కనుపించేసరికి, ఆ చుట్టుప్రక్కల వెదకుతూ ఆరాత్రి అక్కడే విశ్రమించగా, ఆ రాత్రి వీరభద్రుడు కలలో కనబడి తను గుహలో వున్నానని తనవునికి చెప్పి కొండక్రింద ఆలయంలో నన్ను ప్రతిష్ఠించండి, తప్పక కనుపించకుండా పోయిన మీ ఎడ్లబండ్లు దొరుకుతాయని చెప్పడంతో వాళ్ళు శ్రీస్వామి ఆదేశాన్ని పాటించి, గుహలో నుండి స్వామిని కొండక్రిందకు తెచ్చారు. 1410 ప్రాంతంలో కాకతీయుల కాలంలో శ్రీమల్లికార్జున పండితుని మనుమడు, కేదారి పండితుడు ఈ ఆలయప్రతిష్ఠా వగైరా కార్యక్రమాలు నిర్వహించినట్లు చరిత్ర ద్వారా తెలుసుకోగల్గు తున్నాము.

ఈ దేవుడు చాలా గొప్పవాడు. అంటే మహామహిమాన్వితుడనీ, సంతానంలేని వారు స్వామీ! నీకు కోరమీసాలను వెండి లేదా బంగారంతో సమర్పించుకుంటానని మ్రొక్కుకుంటే వారికి తప్పక సంతానం కల్గుతుందట. ఈ స్వామికి కోడెదూడలను సమర్పించుకోవడం మరొక ఆచారం. సంక్రాన్తి సమయంలో ఇక్కడి ఉత్సవాలు, జాతర, శ్రీస్వామి వారి కల్యాణం... ఒక్కటేమిటి – అన్ని అంగరంగవైభోగంగా, మహోత్సాసహంగా జరగడం చూసి పరవశించాలి. వాటి వివరాలు చెప్పేకన్నా స్వయంగా దర్శించి పొంగిపోవడం మహాదానందకరం.

కరీంనగర్‌కు 35 కి.మీ దూరంలోని బెజ్జంకి గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వందల సం॥ల నాటి చరిత్రప్రసిద్ధిపొందిన మహాపుణ్యక్షేత్రం. 12 శతాబ్దంలో కాకతీయులకాలంలో గణపతి దేవచక్రవర్తి సేనాధిపతి రేచర్లరుద్రుడు. ఎత్తైన గోపురం, విశాలమైన మండపంతో నక్షత్రాకారంలో ఈ ఆలయాన్ని నిర్మింపచేసాడు. మూడువైపుల ద్వారాలు, మండపాలతో, ఉత్తరాన 30 ఎత్తుగాగల స్తంభం కల్గివుంది. ఈ స్తంభానికి ఒడిబియ్యం కట్టి సంతానం కోరుకునేవారికోరికను, స్వామి తప్పక నెరవేరుస్తాడుట. ఇదే గుట్టపై గల గుండ్రాయిపై చతుర్భుజ భైరవవిగ్రహం, పడమటివైపున శ్రీస్వామి పుష్కరిణి వున్నాయి. మ్రొక్కులు మ్రొక్కుకున్న దివిటీలు వెల్గించడమిక్కడి అలవాటు. ఇచ్చట అన్ని ఆలయాలలోవలె నిత్యపూజలు, పర్వదినాల ఉత్సవాలు, ప్రత్యేక పూజలు, విశేషాలతో ఈ స్వయంభూస్వామి తన మహిమలు చాటుతున్నాడు.

జగత్యాల మండలంలో వుండే 'పొలాస' గ్రామం. దీనికి ఒకనాడు రాష్ట్రకూటులు, చాళుక్యులు, కాకతీయుల

కాలాలలో పౌలస్త్యాశ్రమ పట్టణమని, పౌలవాసదేశమని, పౌలస్తేశ్వరపురమని పిలుచుకునేవారు. ఇంతటి చారిత్రక పట్టణంలోగల పౌలస్తేశ్వరస్వామి భక్తజనప్రియుడని, కోరినవారి కోర్కెలు తీరుస్తాడని ఇచ్చట నిత్యపూజలతోపాటు, పర్వదినాలలో ప్రత్యేక పూజలు ఉత్సవాలు జరుగుతాయని, స్వామి పేరుతోనే ఈ వూరు వెలిసిందని చెబుతారు.

## రామగిరి

కరీంనగర్‌కు 40 కి.మీ దూరంలోగల 'బేగంపేట' అనే గ్రామంలోని రామగిరి పర్వతంపై శ్రీసీతారాముల దేవాలయం వుంది. ఇక్కడ శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం రాముని పాదముద్రలు, సీతమ్మవారి పాదాల గుర్తులు కూడ చూడగలం. ఈ రామగిరికి "రత్నగిరి' అనే మరొక పేరువుంది. దీనికి రెండు మైళ్ళదూరంలో 'బహుగుళ్ళు' అనేవూరు వుంది. ఇక్కడ శ్రీరామకరుణకోరి ఎందరో మునులు అనేకలింగాలు ప్రతిష్ఠించి పూజించి నందువలన ఈ కొండకు 'బహుగుళ్ళు' అని పేరు వచ్చిందట. రామగిరికి దగ్గర్లో ఇంకా 'పాండవలంక' అనే పుణ్యస్థలం వుందిట. మన అదృష్టంకాకపోతే, దేవతలు భూలోకంలో పుట్టి ఈ పవిత్రభూమితో పావనమయ్యారు. ఇక్కడలేని భక్తుడు, దేవుడిని మరెక్కడా మనం చూడలేము. ఇది సత్యం, నిజంకూడా!

కాకతీయులనాడు నిర్మించిన పురాతన 'నగుదూర్'కోట. మన దురదృష్టంగా అత్యంత పటిష్ఠమైనకోట శిధిలావస్థలో అడుగుపెడుతూంటే ఇక్కడి ఆలయాలు మాత్రం మన అదృష్టంగా నేటికినిలచి, మనల్ని పలుకరిస్తున్నట్లు పులకరింప చేస్తున్నాయి. ఇవి మూడు దిక్కులలో వున్నాయి. శ్రీలక్ష్మీనారాయణం, త్రికూటాలయం, వాటిపైనగల శిల్పసంపద, సంగీతనాట్యభంగిమల శిల్పకళాభిరుచి చూసితీరవలసిందే. ఈ కోట కరీంనగర్‌కు 8 కి.మీ దూరంలో వుంది.

జగిత్యాలకు 8 కి.మీ దూరంలోని పెంబట్లగ్రామంలో శివలింగరూపంలోగల శ్రీదుబ్బరాజేశ్వరస్వామి ఆలయాన్ని చూడబోతున్నాం. ఇది చాలాచాలా పురాతనమైనది. అయితే, ఈ ఆలయనిర్మాణం ఎప్పుడు జరిగిందీ, నిర్మించినదెవరు అన్నది చిదంబరరహస్యం. శివుడు కదా సృష్టి అంతా తానై నిలిచినవాడి రహస్యం ఆయన తప్ప మరొకరు విప్పలేరు, చెప్పలేరు. కాకపోతే కొంత ఈ ఆలయాన్ని పునర్మించడంతో, ఉత్సవాలు వగైరాలు జరిపి ఇక్కడి ప్రజలు ఆలయ చారిత్రకతను గుర్తు చేసుకుంటున్నారు.

## కొత్తగట్టు - మత్స్యగిరీంద్రస్వామి

జిల్లా కేంద్రానికి 30 కి.మీ దూరంలో ఈ కొత్తగట్టు గ్రామం, అందులోని కొండపై శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయం ముచ్చటగావుంది. 13వ శతాబ్దిలో కాకతీయుల పాలనాకాలంలో ఇది నిర్మింపబడినట్లు తెలుస్తుంది. ఇటువంటి ఆలయం అపురూపమైనది, ఇక్కడి కోనేరు మహాశక్తివంతమైనదని, కోరిన కోర్కెలు తీర్చడమేకాదు, ఈ నీటిని పంటపొలాలపై చల్లితే చీడపీడలు పోతాయనేది రైతుల, భక్తుల విశ్వాసం. ఇక పురాణ కథలోకి వస్తే వేదాలను కోల్పోయిన బ్రహ్మ శ్రీమహావిష్ణువును ప్రార్థిస్తాడు. అప్పుడు స్వామి మత్స్యావతార మెత్తి సముద్రంలో దాగిన రాక్షసుని చంపి వేదాలను బ్రహ్మకిచ్చి "జాగ్రత్త" అని హెచ్చరిస్తాడు. ఇక్కడ మాఘపౌర్ణమినాడు బ్రహ్మోత్సవాలు, శ్రీనీలా–భూదేవి సహిత శ్రీస్వామివారి కల్యాణం చూడదగ్గవి.

"మంత్రపురి" అనే పేరుగల ..... శతాబ్దాల చరిత్రతోపాటు ఎన్నో ఆలయాలుకూడ ఆ గ్రామంలో చూడ

గల్గుతాము. శనేశ్వర, లక్ష్మీనారాయణ, ఓంకారేశ్వర, మహాలక్ష్మి అమ్మవార్ల దేవాలయాలు వాటిపైనగల అపురూప శిల్పసంపద, వీటిచుట్టుగల జ్యోతిర్లింగాలు, కాకతీయుల శిలాశాసనాలు చూడగల్గుతాము. ఒకే పానపట్టం మీద 11 శివలింగాలు చూడతగ్గవి. కళింగదేవి అమ్మవారికిగల యజ్ఞోపవీతం చూడగల్గుతాము. ఇంకా ఇక్కడి విశేషం. ఒక విగ్రహంలో 11 నందులను తీర్చిదిద్దడం.

మేములవాడ ఉత్తరాన మూలవాడుకు, దక్షిణ ఒడ్డున ఈనాంపల్లి నరసింహస్వామి వున్నారు. ఈక్షేత్రంకు రాజరాజనరేంద్రుడు, సారంగధరులతో అవినాభావసంబంధముందని చరిత్ర తెలుపుతోంది. ఇప్పుడీ క్షేత్రం పర్యాటక కేంద్రంగా రూపొందడంతో పూర్వంవలె 500 మెట్లు ఎక్కనవసరంలేకుండా రోడ్డుమార్గం గుండా సునాయాసంగా గుట్టనెక్కవచ్చును.

## రాయకల్ - శ్రీకేశవనాధస్వామి

కరీంనగర్‌కు 75 కి.మీ దూరంలో రాయకల్, అక్కడ అపురూప అతి ప్రాచీన కేశవస్వామి వారి ఆలయం వుంది. ఈ ప్రాంతంలోని ఆలయాలలో కాకతీయుల కృషి, శిల్పకళ లేకుండా ఎక్కువ భాగం దేవాలయాలను మనం చూడలేము. ఇక్కడ శ్రీకేశవనాధ స్వామి వారి ఆలయంతోపాటు, పంచముఖేశ్వరుడి ఆలయంకూడా చూడ గల్గుతాము. పంచముఖేశ్వరుడు, కాశీలోను, ఇక్కడేవున్నాడు. ఇక్కడ భీమన్నగుడి జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరిగే జాతర్లకు, ముఖ్యమైన పండుగలను నిర్వహణను చూడగల్గుతాం.

జమ్మికుంటకు 15 కి.మీ దూరంలోని ఇల్లెందుకుంట గ్రామంలో అతి పురాతనమైన (500 సం॥క్రితం వెలుగు లోకి వచ్చింది) రామాలయం వుంది. సాదాసీదాగా ఏమాత్రం శిల్పకళామెరుగులు, మెరుపులు లేకుండావుంది. గర్భగుడిలోని విగ్రహాలు మాత్రం దర్శనీయంగా అందంగా వున్నాయి. సీతాలక్ష్మణులతో దండకారణ్యంలో సంచరించే రాముడు ఒకసారి ఈ ప్రాంతానికి వచ్చాడుట. అది మనసులో పెట్టుకుని నల్గొండజిల్లావారు ఒకరు ఇక్కడ రామాలయం నిర్మించారని చెప్పుకుంటారు. ఇక్కడ శ్రీరామనవమిమాత్రం గొప్పగా చేస్తారు. ఆ తరువాత చెప్పుకోదగ్గది 'జరాటే' జాతర.

కరీంనగర్‌కు 43 కి.మీ దూరంలోని నందిమేడారం కాకతీయుల కాలంనాటి పెద్ద నంది విగ్రహం వుంది. ఇది ఏకశిలానిర్మితం. దీనికి దగ్గర్లో శాతవాహనరాజు మేడరాజు నిర్మించిన కోటబురుజు, కాకతీయులనాటి పెద్ద చెరువు, అక్కడి త్రికూటాలయం, అమరేశ్వరస్వామి ఆలయాలను కన్నులారా చూడగల్గుతాం. కారణం వాటి శిల్పశోభే. ఇచ్చటి పెద్ద నందివిగ్రహం వల్లనే ఈ గ్రామానికి 'నందిమేడారం' అనే పేరు వచ్చిందని స్థానికులు స్థల పురాణంగా చెబుతారు.

## వెల్లటూరు కోటిలింగాల ఆలయం

కరీంనగర్‌నుండి ఆదిలాబాదు వెళ్ళే దారిలో వుందీ వెల్లటూరు, దీనికి 4 కి.మీ దూరంలో కోటిలింగాల ఆలయంవుంది.ఇది ఎంతో పురాతనము, ప్రసిద్ధిపొందిన క్షేత్రంకూడా. శాతవాహనులకాలములో ప్రముఖ ఓడరేవుగా ప్రసిద్ధిపొందినట్లు చెబుతారు. గోదావరి నది, పెద్దవాగు సంగమస్థానంలో వున్న ఈ గ్రామంలో కోటి లింగాలు

వున్నాయని, దాంతో ఈ వూరు కోటిలింగాల గ్రామమైందని కొందరు; నిజానికి ఇక్కడ కోటిలింగాలు లేవని, కోటలో కోటేశ్వర, సిద్ధేశ్వర లింగాలు వుండటంతో, ఈ ప్రాంతం కోటలింగాలుగా రానురాను కోటిలింగాలుగా పేరుపొందిందని చెబుతారు. ఇక పురావస్తుశాఖ వారి త్రవ్వకాలలో పాతకాలంనాటి ఎన్నో నాణాలు ప్రార్థనా మందిరాలు... ఎన్నో... ఎన్నెన్నో బయటపడ్డాయి. చరిత్రను గుర్తుచేసాయి. ఇది ఒకప్పుడు ఎగుమతులు, దిగుమతుల ఓడరేవుగావుండేదని గోదావరి ఒడ్డునగల కట్టడాలవల్ల తెలుస్తుంది.

నగునూరు గ్రామంలో అతి పురాతనమైన శివాలయం వుంది. త్రికూటాలయమనే ఈ ఆలయంకాక ఇక్కడ 400 దేవాలయాలు వుండేవని కూడా చెబుతారు. అందుకేనేమో 'నాలుగునూర్లు' అని పిలువబడే ఆలయాల గ్రామం చివరకు 'నగునూరు' అయింది. ఇక్కడ ఎక్కడచూసినా శిల్పాలు, శిలావిగ్రహాలను మనం చూడగల్గుతాము. ఇక్కడ వున్నాయన్న శైవ, వైష్ణవ, జైన దేవాలయాలు కాలగర్భంలో కలిసిపోయాయి. కాకపోతే గ్రామం బయట ఒక పెద్ద నాగశిల్పముంది. ఈ ఆలయాల చరిత్ర తెలిసినవారు నిత్యం ఇక్కడకు వస్తుంటారు. ఇక్కడ పరిస్థితి చూచికొందరు గుండెలు బాదుకోవడం కూడా కద్దు.

## రేకుర్తి శ్రీనరసింహస్వామి

జిల్లా కేంద్రానికి 3 కి.మీ దూరంలో రేకుర్తి గ్రామంలోని ఎత్తైన కొండపై శ్రీనరసింహస్వామి ఆలయముంది. ఎత్తైన కొండపై నిండుగావున్న అతి పురాతన ఆలయమిది. దీనినిర్మాణ వివరాలు తెలియడంలేదు. కొండపై చక్కని ఆలయం, కుడివైపు కోనేరు, వాతావరణం చక్కగా వుంది. కొండక్రింద శ్రీరంగనాథస్వామి, క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి. ఈ శ్రీనరసింహాలయానికి కొద్దిదూరంలో వీరభద్రుడు, లక్ష్మీదేవి, సరస్వతి దేవి ఆలయాలు కూడా మనం చూడగల్గుతాము. ఒకప్పుడు మహావైభవంగా వెలిగింది. ఇప్పుడు సామాన్య పద్ధతిలో సాదాసీదాగా సాగుతుంది.

## మంథని - గౌతమేశ్వరుడు

మంథని గ్రామ సమీపమందు గోదావరి నదీతీరాన గల చిన్నకొండపై శ్రీగౌతమేశ్వరుడున్నాడు. ఇది చోళుల కాలంలో నిర్మింపబడిదని చరిత్ర చెబుతోంది. కాలక్రమంలో ఇది శిథిలమైతే ఈ తరంలో అది పునరుద్ధరించబడిందిట.

గౌతమమహర్షి తన సంచారంలో భాగంగా భార్యతో ఇక్కడికి వచ్చి కొన్నాళ్ళున్నారు. అయితే వర్షాభావ పరిస్థితులు రానురాను అచ్చటివారిని ఇబ్బందిపెడుతుంటే 'మహర్షి' అని వారు గౌతముని ప్రార్థిస్తారు. గౌతముడు వరుణుని ప్రార్థించి ఆ ప్రాంతం జలపూర్ణం చేస్తారు. ఇక పురాణాలలోకి వెడితే శివుడు గంగను విడిచి పెట్టకపోయేసరికి పార్వతి అలుగుతుంది. వినాయకుడు పరిస్థితి గమనించి, కుమార-పార్వతిలతో గౌతమ ఆశ్రమం చేరుతాడు. ఒకనాడు అదనుచూసి జయ అనే చెలికత్తెను గోరూపం ధరిస్తుంది. గౌతముని తపోశక్తితో ప్రతినిత్యం లభించే వరి పేలాలతో అచ్చటి మహనీయులకు భోజనం పెడతారు. ఒకనాడు వినాయకుని సూచన ప్రకారం జయ గోవుగా ఆచేలలో పడి చేలు పాడుచేస్తుంటే గౌతముడు 'హు' అని అదిలించడం, అది మరణించడంతో గోహత్యాపాతకమనేసరికి ఆ పాపం నుండి బయటపడటానికి శివుని ప్రార్థిస్తాడు. శివుడు గంగతో వచ్చి ఆ ప్రాంతాన్ని పవిత్రం మొనరిస్తాడు.

గోవుపై గంగ ప్రవహిస్తుంది. అప్పుడు మహర్షి కోరికను మన్నించిన శివుడు, గంగకోరిక మేరకు ఆ కొండపై లింగ రూపుడై గంగతో కలిసివుంటాడు.

ఈ మొత్త కార్యక్రమానికి ఆది వినాయకుడు, అభిలాష పార్వతి కోరిక. ఆలాగ పార్వతి అర్ధనారీశ్వరి ఆనంద మూర్తిగా మసలుతుంది. ఈ రకంగా ఏర్పడిన ఆలయం చోళులకాలంలో నిర్మించబడి కాకతీయుల కాలంలో అభివృద్ధిచెందింది. కాలక్రమంలో భాగంగా ఆనాటి ఆలయం శిథిలమైతే ఈనాటి ఆలయం చిన్నదైనా భక్తజనులచేత ఆరాధనలందుకుంటుంది. ఈ శివాలయానికి దక్షిణంగా వెలమజమీందార్లు నిర్మించిన రామాలయాన్ని కూడా చూడగల్గుతాము. దీనికి మాన్యాలున్నాయి. నిత్యపూజలు మహాశివరాత్రి, దేవీనవరాత్రిళ్ళు, గొప్పగా జరుపుతారు. మామూలు ఉత్సవాలు సరేసరి.

## శ్రీ పంచముఖ నరసింహస్వామి - నర్సింపల్లి

జిల్లా కేంద్రంనుండి 27 కి.మీ దూరంలో నర్సింపల్లి అనే గ్రామం. అందులో శ్రీపంచముఖ నరసింహస్వామి అపురూప ఆలయం. ఎంతపురాతనమైనదంటే ఎంతో పురాతనమైనదని చెప్పాల్సివస్తుంది. పూర్వకాలంలో నందరాజు అనే మహారాజు దీనిని నిర్మించాడుట. కొండపైన గుహలో వున్న శ్రీనరసింహస్వామి ముందుభాగం పైకప్పుగా ముందుకు వచ్చినట్లు వుండటంతో దీని ఆధారంగా చేసుకుని ఆలయం నిర్మాణం చేసారు. పదహారు చేతులతో వున్న పంచముఖ నరసింహస్వామి 6 అడుగుల ఎత్తు 4 అడుగుల వెడల్పు 16 చేతులతో హిరణ్యకశిపుని చీలుస్తున్న స్వామి ఇంకా చిత్రంగా ఎడమకాలు వంచి స్వామి రాక్షసరాజు డొక్కలో కొమ్ముతుంటే హిరణ్యకశిపుడు ఒక కాలులేపి విలవిలలాడడం చిత్రంగా చెక్కబడింది. ఈస్వామి అభయప్రదాత, భక్తజన రక్షకుడు. కోరికలు, మ్రొక్కులు తీర్చుకునేవారు వెండినామాలు, మీసాలను సమర్పించుకోవడమిక్కడ ఆనవాయితీ.

కరీంనగర్‌కు 20 కి.మీ దూరంలోని మల్లన్నపేటలో రాత్రికి రాత్రే 14వ శతాబ్దంలో నిర్మించిన ఆలయాన్ని చూడవచ్చును. శిల్పకళ బాగుంది. చాళుక్యరాజులు నిర్మించినందువలన రాత్రికి రాత్రే నిర్మించబడిన ఈ స్వామిని 'దొంగమల్లన్న'గా పిలువడం మొదలుపట్టారు. మార్గశిర మాసంలో పంచమినుండి 7 వారాలపాటు జాతర్లు నిర్వహించడ మిక్కడ విశేషం.

## పందిళ్ళ - నరసింహస్వామి

గోదావరి ఖనికి 5 కి.మీ దూరంలోని గోదావరి తీరాన గల పందిళ్ళ గ్రామంలో అతి పురాతన శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవాలయం, దీనికి దగ్గర్లో పొలాలలో కాకతీయుల శిలాస్తంభ శాసనం చూడగల్గుతాము. ఈ శ్రీలక్ష్మినరసింహస్వామి ద్వారాల ఎత్తు తక్కువగా వుంటుంది. దేవాలయ మండపం కాకతీయుల కాలంనాటిదే. ఉత్తరాన రెండు గర్భాలయాలు, వాటిముందు అంతరాలయాలను చూడగల్గుతాం. రోజువారీ జరిగే పూజలు సరేసరి. పర్వదినాలు మాత్రం మహాకోలాహలంగా వుంటాయి.

# మెదక్ జిల్లా

## నాచారంగుట్ట - శ్రీనరసింహస్వామి




గజ్వేల్ నుంచి 18 కి.మీ దూరంలో 44కి.మీ. జాతీయరహదారిపై తూప్రాన్, దానికి 6 కి.మీ లలో నాచారం గుట్ట. ఇక్కడి హరిద్రానది తీరమందలి నాచాగిరి (శ్వేతగిరి)పై అతి ప్రాచీన, మహామహిమాన్విత శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయముంది. దీని నిర్మాణసమయం, నిర్మాత తెలియదు. కానీ ద్వాపరాంతంలో భూదేవి కోరిక మేరకు శ్రీకృష్ణుడు, సకల ఉపద్రవాలను అరికట్టడానికి వీలుగా నవవిధ భాగవతధర్మాలను సాకారం చేసి, వారిని కలిప్రమాదం నుండి భక్తజనులను సంరక్షించమని ఆదేశిస్తాడు. శ్రీహరి రూప శ్రీకృష్ణుని ఆనతిమేరకు, ఈ నవవిధ భాగవతధర్మాలు లోకంలో సంచరిస్తూ, ఈ నాచగిరివద్దకు వచ్చేసరికి వినిపించిన సింహగర్జన ఆనందం కల్గించి ఇక్కడ స్థిరనివాసులౌతారు. తపోమూర్తులౌతారు.

కొంతకాలం గడిచేసరికి ఇక్కడి గుహలో గుప్తంగా వున్న నరసింహస్వామి వారిని అనుగ్రహిస్తాడు. దీంతో స్వామి శక్తి బహిర్గతమౌతుంది. ఆ రకంగా నరసింహస్వామి ప్రక్కన లక్ష్మీదేవితో వెలసి దినదిన ప్రవర్ధమానమయ్యాడు. భక్తజనులకు కొంగుబంగారమయ్యాడు. దీంతో ఇక్కడ శ్రీస్వామితోపాటు రామాలయం, పుష్కరిణి, ఆంజనేయ మందిరం, శంకరమఠం, ఆలయానికి ఎడమప్రక్క శ్రీదత్తమందిరం, మధ్యభాగంలో నవనాథులు తపమాచరించిన గుహలు, భక్తజనులను పరవశింపచేస్తాయి.

## ఏడుపాయల వనదుర్గాభవాని - నాగ్సాన్‌పల్లి

పాపన్నపేట మండలం, నుగ్సాన్‌పల్లి పంచాయితీలోని గణపవరం డామ్ పర్వతారణ్యాల మధ్యగల మంజీరా నదిలో ఏడు పాయలు (వాగులు) కలిసే ప్రదేశంలో వెలసిన తల్లి శ్రీవనదుర్గామాత. ఈమెను ఏడుపాయల తల్లిగా చెప్పుకుంటారు. ఈమె కనకదుర్గమ్మతల్లే. వనదేవతగా వెలసి ఈ ప్రాంతాల వారి కల్పవల్లిగా విఖ్యాతమై 'వనదేవత'గా పేరు పొందిన తల్లి ఏడుపాయల వనదుర్గా భవానిమాత. ఇక్కడ ప్రవహించే మంజీరానదిలో కలిసిన ఏడుపాయలు సప్తఋషులు పేర్లతో ప్రఖ్యాతమైన పుణ్యజలకేంద్రాలు. ఇంకా ఇక్కడ వనదుర్గామాతతోపాటు పాపాలమడుగు, ఏడుత్తరశత మండలం, మునిపుట్ట, తపోభూమి సందర్శించడానికి, సందర్శకులను తరింపచెయ్యడానికి సిద్ధంగా వున్నాయి. గోదావరి ఉపనదిగా తలచే మంజీరా, గరుడగంగగా కూడ పిలుస్తారు. అదెలాగ వచ్చిందంటే – పాండవుల మనుమడైన జనమేజయుడు, తన తండ్రిని పగబట్టి చంపిన తక్షకునిపై కోపంతో సర్పయాగాన్ని సప్తఋషుల ఆధ్వర్యంలో చేస్తాడు. అప్పుడు నాగకులమంతా ఇంచుమించు అగ్నికి ఆహుతవుతుంది.

దీంతో అగ్నిపాలైన నాగకులానికి ఉత్తమ లోకాలను కల్గించాలని గరుత్మంతుడు పాతాళంలోని భోగవతి

నదిని భూమిపైకి తెచ్చి వారలను పవిత్రుల్ని చేస్తాడు. కుండాలపై ప్రవహించి, ఏడుపాయల గరుడ గంగగా ప్రసిద్ధి చెందుతుంది. అందుకనే ఇక్కడివారు ఎక్కువగా గంగ, శివుడు, ముత్యాలమ్మలను పరమభక్తితో కొలుస్తారు. ఇక్కడ జరిగే శివరాత్రి జాతరకు రాష్ట్రాలతో సంబంధం లేకుండా ఎక్కడెక్కడివారు ఇక్కడికి వచ్చి మ్రొక్కులు చెల్లించుకుని మురిసిపోతారు.

## బొంతపల్లి - వీరభద్రుడు

ఇదీ అతిప్రాచీన ఆలయమే. ఇక్కడ అద్దాల మండపం కూడ వుంది. అత్యంత మహిమాన్వితము, అరుదైన క్షేత్రమని భక్తుల నమ్మకం. పూర్వం ఒకానొక సమయంలో శివుని కోపం నుండి వీరభద్రుడు పుట్టి దక్షుని తలనరికి, యజ్ఞం ధ్వంసం చేయడంతో దక్షుని అనుచరులు దండకారణ్యం చేరి అచ్చటి శివభక్తులను హింసిస్తుంటే వీరభద్రుడైన శివుడు దక్ష అనుచరులను సంహరిస్తాడు. అనంతరం బిల్వ వృక్షములచే నిండియున్న ఆ ప్రాంతం తనకు ఆనందం కల్గించడంతో, భక్తవ శంకరుడై శంకరుడు అక్కడ నివశిస్తాడు. దాంతో భక్తులు ఓ చెరువును త్రవ్వి వీరన్న చెరువని, ఒ గ్రామం నిర్మించి 'బొంతపల్లి' అని చెబుతారు. అలాగ అక్కడ భక్తజనుల కారాధ్యదైవమై వీరభద్రుడు విరాజిల్లుతాడు.



కాకతీయుల నాటికే ఈ ఆలయమున్నదంటే ఎంత ప్రాచీనమైనదో అర్ధమవుతుంది కాని ఇంక ఏ చరిత్ర, నిర్మాణ వివరాలు, వగైరాలు తెలియడంలేదు. ఈస్వామిని సేవించినందువలన అసాధ్యాలు సాధ్యమవుతాయని, గొడ్రాలు సంతానవతి అవుతుందనేది నమ్మదగిన సత్యమై కూర్చుంది. ఈ వీరభద్రుని వెనుక భద్రకాళి అమ్మవారిని దర్శించవచ్చును. కోరిన కోర్కెలు ఫలవంతం చేసుకొన వచ్చును. హైదరాబాద్‌కు 35 కి.మీ దూరంలో బొంతపల్లి కమాన్ నుండి 3 కి.మీ దూరంలో జిన్నారం మండలంలో వున్న ఈ బొంతపల్లి వీరభద్రుడు దర్శించదగ్గ ఫలప్రదాత.

మెదక్ – సంగారెడ్డి మధ్యలో కౌడిపల్లి మండలంలోని చిట్కూల్ గ్రామంలోని చాముండేశ్వరి మాత ఆలయం అపురూపమైనది. మైసూరు తర్వాత చెప్పుకోదగ్గ ఆలయం ఇక్కడే వుంది. అది ప్రాచీనమైనది. ఇది నవీనమైనది. అయినా మహిమగల తల్లి 11 అడుగుల ఎత్తులో ఏకశిలతో నిర్మింపబడిన ఈ అపురూప ఆలయతల్లి మంజీరా జలాల అభిషేకంతో భక్తజనులను పరవశింపచేస్తుంది.

రామాయంపేటలోని తౌనగొండ్ల గ్రామంలో 108 అ॥ ఆంజనేయస్వామి విగ్రహం దర్శించదగ్గది. పరవశించ దగ్గది.

## ఝరాసంగమం - శ్రీ కేతకీసంగమేశ్వరాలయం

జహీరాబాదుకు 16 కి.మీ దూరంలో గల గ్రామం 'ఝరాసంగమం'. ఇది పురాతన, మహాప్రశస్తి గాంచిన ఆలయం. ఈ దేవుని 'కేతకీసంగమేశ్వరుడు" అంటారు. ఝరాసంగమేశ్వరుడనికూడా పిలుస్తారు. ఇది పౌరాణిక ప్రాధాన్యం గల పరమపవిత్ర ప్రదేశం. పూర్వం కేతకి అను అప్సరస ఇక్కడే శాపవిమోచన మొందిందని, శౌనకాదులు ఇక్కడ యజ్ఞయాగాదులు చేసారని పురాణాలు తెలుపుతున్నాయి. ఇక్కడి కుండాన్ని 'అమృతకుండ'మని, కాశీ నుండి ఒక ఝర ఇక్కడికి వచ్చి అమృతకుండంలో కలుస్తుందనేది ఒక నమ్మకం.

శివపూజకు మొగలిపూవు పనికిరాదు. కానీ ఇక్కడి స్వామికి మొగలిపూల అర్చన తప్పక చేస్తారు. బ్రహ్మ కోరికపై ఈ కేతకీ వనప్రాంతంలో శివుడు స్థిరనివాసుడై మొగలిపూజ అందుకుంటున్నాడు. ఇక్కడ పరమేశ్వరుని అభీష్టం మేరకు జరిగే మొగలిపూల పూజ ప్రపంచంలో మరెక్కడా జరుగదు. కారణం - ఒకసారి బ్రహ్మ - విష్ణువులు నేను గొప్ప అంటే, నేను గొప్పని వాదించుకుంటుంటే వారి మధ్య శివుడు లింగరూపుడై వెలసి ఆద్యంతాలు తెలుసుకు వచ్చినవారు నిజమైన గొప్పవారంటాడు. దాంతో బ్రహ్మ విష్ణువులు ఆకాశ పాతాళలోకాలకు ఆద్యంతాలు తెలుసుకోవడానికి బయలుదేరుతారు.

ఈ సమయంలో ఊర్ధ్వభాగం చూడలేని బ్రహ్మ నిరాశతో శివపూజ చేసుకుని వచ్చే మొగలిని, కామధేనువును చూసి, తను శివుని చూసినట్లు చెప్పమంటాడు. బ్రహ్మను కాదనలేని మొగలి, కామధేనువులు తలవూపుతాయి. విష్ణువు మాత్రం వరాహరూపంతో పాతాళమంతా త్రవ్వి, ఫలితం లేనట్లు నిరాశతో వెనుతిరుగుతాడు.

అందరు శివుని చేరుతారు. మొగిలి, కామధేనువులు బ్రహ్మ శిఖరం చూసినట్లు చెబుతాయి. ఇక్కడి విచిత్రం కామధేనువు తలతో ఔనని, తోకతో కాదంటుంది. శివునికేమీ తెలియదన్నట్లు ప్రవర్తించినవారి ప్రవర్తనకు శివుడు కోపించి, బ్రహ్మకు ఆలయ అర్చనాదులు భూలోకంలో వుండవని, మొగిలి పూజార్హ్వాలు కాదని, కామధేనువు మొహం పాపాన్ని, సత్యం చెప్పినతోక, సకల పుణ్యాలను ప్రసాదిస్తుందని తెలుపుతాడు.

కేతకీ వనంలో చేసిన తపస్సువలన బ్రహ్మపునీతుడౌతాడని, మొగిలికి ఇక్కడ తప్ప మరెక్కడ పూజార్హత లేదని, విష్ణువే - సర్వశ్రేష్ఠుడని ప్రకటిస్తాడు. ఇంతటి అపూర్వ క్షేత్రం దర్శనం జన్మజన్మల పుణ్యఫలంగా తలవాలి.

## రాంపురం - నవగ్రహదేవాలయం

దేవతా, ప్రత్యధిదేవతా సహితంగా 1999 సం॥లో నిర్మించబడినది. ఇటువంటి ఆలయం, ఇక్కడేతప్ప మరెక్కడా సంపూర్ణ నవగ్రహాలయంలేదు. 64 మంది దేవతామూర్తులతో ఇక్కడే చూడగల్గుతాము. అంటే ఇది తప్పక దర్శించ వలసిందేనని ఆస్తిక మహాశయులు, యాత్రా విశేషకులు తప్పక తలవాలి. ఆగమశాస్త్రం ప్రకారం, అలాగే ఆయా గ్రహాల విధివిధానంగా, విశేషంగా నిర్మించి, పరమశివుడు, శ్రీరాముడు, సరస్వతి, పంచముఖ హనుమాన్, సంతాన నాగేశ్వరుడు, మేధాదక్షిణామూర్తి, గాయత్రి, దత్తాత్రేయుడు, ఆది శంకరాచార్యులవారి విగ్రహాలను కూడా భక్తితో దర్శించేటట్లు తీర్చిదిద్దారు.

## కూడవెల్లి - ఆలయ సమూహం - రామాయంపేట

సిద్ధిపేట రోడ్డు మార్గంలో జాతీయ రహదారికి 2 కి.మీ దూరంలో మాండవ్య నది సమీపంలో, ఈ ఆలయాల సమూహమైన 'కూడలి' వుంది. ఇది మొదట్లో కూడలి. ఆ తర్వాత కూడెల్లి. ఇప్పుడు కూడవెల్లి. ఇక్కడి అయిదారు ఆలయాల సమూహంలో రామలింగేశ్వర, వేణుగోపాల, సంగమేశ్వర, కాశీ విశ్వనాథ, శ్రీవేంకటేశ్వరాలయాలు వున్నాయి. ఇక్కడి సంగమేశ్వరాలయం, అందలి శిల్పకళ, అందులోని మూడు నంది విగ్రహాలు చూడదగ్గవేకాదు, ఒళ్ళు గగుర్పొడిచే అద్భుత శిలాకళా సంపదల నిలయంగా చెప్పవచ్చు. ఈ 3 నందులులోని ఒకటి లేపాక్షి బసవయ్యను గుర్తుచేస్తుంది. ఈ ఆలయానికి నలువైపులా ఉపాలయాలు – గణపతి, వీరభద్రుడు, కుమారస్వామి, పార్వతులు వున్నాయి.

కాశీ విశ్వనాధ ఆలయంలోని నంది బాగుంది. ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. శ్రీవేంకటేశ్వర ఆలయము అంతే. ప్రస్తుతం రామలింగేశ్వరాలయం జీర్ణోద్ధరణ కార్యక్రమం జరుగుతోంది. మిగిలినవి కూడా ఆ దేవుని దయతో పునుద్ధరింపబడతాయని తలుద్దాం. పునరుద్ధరించమని ఆ దేవుని ప్రార్థిద్దాం.

పెద చింతలరేవు ఆంజనేయస్వామి ఆలయం పురాతనమైంది. చింతలు తీర్చేస్వామిగా ఈయన ప్రఖ్యాతి. రాష్ట్రాల ఎల్లలు దాటి ఎక్కడెక్కడినుండో ఇక్కడికి వచ్చి మ్రొక్కుకుని, మ్రొక్కులు తీర్చుకుంటూంటారు. ఒకప్పుడు ఈ ఆంజనేయుడు కోపిష్ఠి అని, శ్రీవ్యాసరాయలవారు ఈ స్వామిని యంత్రంతో శాంతపరచి భక్తజనబాంధవునిచేశారని చెప్పుకుంటూంటారు. ఇక చరిత్ర విషయానికి వస్తే --

నల్లసోమనాద్రి సంస్థానంలో పనిచేసే శేషప్ప అనే పట్వారి అవమానమొంది చనిపోవాలని, చింతచెట్టు సమీపంలో పాముపుట్టలతో నిండిపోయిన ఈ ప్రాంతానికి వచ్చి పాముపుట్టలో చెయ్యి పెడతాడు. ఏపాము కరవలేదు సరికదా చేతికొక రాయి తగులుతుంది. విధి కూడా తనకెదురు తిరుగుతుందని ఆ రాత్రి అక్కడే నిద్రిస్తాడు. అప్పుడాంజనేయస్వామి కలలో కనుపించి, తాను నువ్వు చెయ్యిపెట్టిన పుట్టలో వున్నానని చెప్పి తనను బయటికి తీసి పూజించమని చెబుతాడు. తెల్లవారి తన కల ప్రకారం పుట్టను త్రవ్వితే ఆంజనేయ విగ్రహం లభిస్తుంది. కృష్ణానదిలో స్నానం చేసి ఆంజనేయుని పూజిస్తూ కాలం గడుపుతుంటే ఒకనాడు స్వామి కలలో కనుపించి మల్దకల్‌లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరుని సేవించమంటే, అక్కడికి వెళ్ళి ఆంజనేయస్వామి మహిమలు చెబుతూ సేవలు చేస్తుంటే, ఈతని భక్తికి చిహ్నంగా స్వామివారిని గంగాదేవి శ్రీస్వామిపాదాలచెంత నిలచి తన వునికిని చాటుతుంది. దాంతో చిత్రంగా స్వామి పాదాలచెంత తడి ఆరకుండా వుండటమొక విశేషమై విష్ణుపాదాల చెంత పుట్టిన గంగ, శ్రీవేంకటేశ్వర పాదాలచెంత నిలచి ఆమె భక్తిని కూడా చాటుకుంటుంది.

సంగారెడ్డి పాతబస్టాండ్‌కు 4 కి.మీ దూరంలోగల కలబగూర్ గ్రామము కాకతీయులు 11వ శతాబ్దంలో నిర్మించినట్లు తెలుస్తుంది. దీని నిర్మాణంలో వరంగల్లులోని వేయిస్తంభాల మంటప శైలిని చూడవచ్చును. ఈ వూరిలో ఈ కాశీవిశ్వేశ్వరాలయంతోపాటు గర్భాలయానికి దక్షిణాన శ్రీ అనంతపద్మనాభస్వామి, ఉత్తరాన శ్రీవేణు గోపాలస్వామి ఆలయాలు వున్నాయి. ఈ మూడింటిని కల్పి త్రికూటాలయంగా చెబుతారు. అనంత పద్మనాభస్వామి

ఆలయ అందాలు చూదగినవి. అలాగే వేణుగోపాలస్వామి ఆలయం కాశీ నుండి ఇక్కడికి ప్రవహిస్తున్న నీటిపై కట్టబడినది స్థానికులు, పెద్దలమాట. దీనికి తగ్గట్లు మనం వేణుగోపాలస్వామి గర్భాలయంలోని నిర్థిష్టప్రాంతంలో నాణెం కనుక విడిస్తే నీటిలో వేస్తే వచ్చే శబ్దాన్ని మనం ఇప్పటికీ వినగల్గుతాము.

ముండపాక మండలం, దుద్దెడ గ్రామంలో శివస్వరూపుడైన వీరభద్రుడు లింగరూపంలో పూజలందు కుంటున్నాడు. ఈ పురాతన ఆలయంలోని లింగరూపుని యోగ లింగేశ్వరుడిగాను, ఈ క్షేత్రాన్ని సిద్ధక్షేత్రంగా కూడ చెబుతారు. ఇది 12వ శతాబ్దంలో కాకతీయులు నిర్మించారంటారు. ఇంకా ఈ ఆలయం విశేషం యోగలింగేశ్వరుని ప్రక్కన పానపట్టంనుండి జలపై మరో లింగముంది. ఇంకా పానపట్టంపైని లింగాన్ని విడిగా తీయచ్చును. అందుకే ఈ స్వామిని అక్షయజలధీశుడని ప్రత్యేకంగా, ముద్దుగా భక్తితో పిలుస్తారు.

ఈ ఆలయం ఎదురుగా కోనేరు అక్కడనుండి పడమర, ఉత్తర, దక్షిణాలవైపు సొరంగముంది. ఇందులో పశ్చిమమార్గం ఇక్కడి గర్భగుడికి, ఉత్తరద్వారాన్ని కాశీద్వారంగాను, దక్షిణభాగం కొమరవెల్లి దేవస్థానానికి వెడతాయని చెబుతారు. కానీ వెళ్ళే ప్రయత్నం మాత్రం ఎవరూ చేయరు.

ఎల్లారెడ్డి పేటలో పురాతన త్రిలింగేశ్వరాలయం కాకతీయుల కాలంనాటిదని చెబుతారు. ఆలయమే శివలింగరూపంలో కట్టబడింది. ఇంత గొప్ప ఆలయం ప్రచారలోపం వలన, గుప్తంగానే వుండిపోయింది. ఈ మధ్యకాలంలో కొద్దిగా భక్తులు రావడం ప్రారంభిస్తున్నారు. ఏమైనా ఎంతటి మహిమాన్వితుడైనా త్రిలింగేశ్వరుడు అజ్ఞాతవాసం చేస్తున్నాడని చెప్పకతప్పదు.

## వర్గల్ - విద్యాధరి



గజ్వేలునుండి 10 కి.మీ దూరంలోని వర్గల్‌లో చదువులతల్లి విద్యాధరి వెలసివుంది. ఈ ప్రసిద్ధ క్షేత్రాధిదేవత కొండపై నిలచి, కోర్కెలు కోరేవారికి కొండంత అండగా వుంది. పొరుగూరునుండే కాదు, జంటనగరాలనుండి విశేష సంఖ్యలో భక్తులిక్కడకు వస్తుంటారు. అక్షరాభ్యాసాలు, వసంతపంచమి, విశిష్ట పూజలు, దసరా నవరాత్రులు, దర్శించదగినవి. చదువుల తల్లి కరుణ కోరతగ్గది.

నాందేడ్ ప్రధాన రహదారిపైగల 'రాంపూరు' గ్రామంలోని పెద్దమ్మ రుద్రమాను, దాని మొదలులోని పెద్దమ్మతల్లి ఎంతో విశిష్టమైనవి. మర్రిమానువూడలే ఆలయద్వారాలుగా గల ఈ తల్లిని రహదారిపైపోయే ప్రతి ఒక్కరు దర్శించుకుంటారు. అయితే ఈ దేవాలయం, తల్లి ఎప్పటిదో చెప్పేవారు కరువయ్యారు. ఎప్పటిదో.... అనేమాటతప్ప మరే విషయం తెలియదు. అక్కడ 40 సంIIగా ఒక పుట్టవుంది. ఎందరో పాదచారులు, యాత్రీకులు, ఈ తల్లిని దర్శించి, మ్రొక్కులు

మొక్కుకుని మరీ తరిస్తారు. దసరాలలో జరిగే ఉత్సవాలకు, ఎక్కడెక్కడివారో ఎందరో వచ్చి పెద్దమ్మతల్లిని సేవించుకుని మురుస్తారు.

ఆలయగర్భంలో కోటిలింగాలను వుంచిన కోటిలింగాల ఆలయం సిద్ధిపేట శివారులలో విరాజిల్లుతుంది. ఇక్కడ జరిగే మహాశివరాత్రి ఉత్సవం కన్నుల పండుగగా దర్శించవచ్చును.

నందికండి రామలింగేశ్వరాలయం, సంగారెడ్డికి 15 కి.మీ దూరంలో వున్న బహుపురాతన ఆలయం. దీనిని కల్యాణచాళుక్యులు నిర్మించారంటారు, కొందరు రామేశ్వరాలయంగా కూడా పిలుస్తారు. చూడచక్కనిది. అందమైన నాలుగు స్తంభాలతో అందు శిల్పసంపదతో, నక్షత్రాకారంలో నిర్మించిన అపురూప ఆలయం, ఇచ్చటి స్తంభాలపైనగల త్రిమూర్తులు, నరసింహ, వరాహ, నటరాజ, మహిషాసురమర్దనీ, సరస్వతి, గజలక్ష్మి వగైరా దేవతల మూర్తులను తీర్చిదిద్దిన తీరు చూసితీరవలసిందే.

సిద్ధిపేటకు 10 కి.మీ లోని ఘనపురం గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి శాంతమూర్తి సుందరరూపి, 1782 సం॥ ప్రాంతంలో పెద్దబావిని త్రవ్వబోతే అక్కడ ఈ శాంతమూర్తితోపాటు తొమ్మిది మంది ఆళ్వారుల విగ్రహాలు లభించాయట. ఇక్కడి స్వామి అయిదు అడుగుల ఎత్తులో ఎడమ తొడపై శ్రీమహాలక్ష్మి కూర్చునివుంటుంది. ఇంతటి శాంతమూర్తి మరెక్కడా లేదని తెలుస్తుంది.

దౌలతాబాదు మండలంలోని అజానీపూరులో గల ప్రాచీన శివాలయం, అందులోని నర్మదా బాణలింగం అపురూపమైనదిగా తప్పక చెప్పాలి. బంగారుకాంతితో వుండే ఈ అపురూప లింగం, స్ఫటికలింగ మనిపిస్తుంది. ఈ ప్రాచీన దేవాలయంలో లింగమూర్తితోపాటు, నంది, పార్వతిపరమేశ్వరులు, వినాయకుడు, నాగేంద్రుడు, లక్ష్మీనారయణులను మనం చూడగల్గుతాము.

దీనికి కొద్ది దూరంలో నిదిలాపూరులో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయముంది. ఇక్కడి తెలుగు శాసనాలు, ఇక్కడి ప్రాచీన వినాయకుడు, వీటికి ధ్వజస్తంభాలు వున్నాయి. ఇక్కడి హనుమాన్ దేవాలయానికి మాత్రం ధ్వజస్తంభాదులు, దీపస్తంభం వుండటమొకవిశేషం.

800 సం॥నాటి ఈశ్వరపురం, భవానీ ఆలయాన్ని బసవకల్యాణపీఠ, కర్ణాటక పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ జ్ఞానానంద సరస్వతి స్వామి, దీనిని జీర్ణోద్ధరణం చేసి ఈనాడు భక్తజనులెల్లరు, పులకించి, తరించేటట్లు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భాద్రపద మాసంలో ఈ తల్లికి 50 కిలోల పసుపు అద్దుతారు. 15 అ॥ఎత్తు కల్గిన ఈ ఏకశిలా విగ్రహం దర్శనీయమే. ఇక్కడి దసరా నవరాత్రులుకూడ చూడదగ్గవి. మనతోపాటు కర్ణాటక, మహారాష్ట్రలనుండి భక్తులు విచ్చేసి తమ మ్రొక్కులు చెల్లిస్తుంటారు.

పటాన్ చెరువు – అమీనపూర్ పంచాయితీలోని బీరం గూడా మల్లికార్జునస్వామి, విశేష ఆదరణ పొంది, రెండవ శ్రీశైలంగా ప్రశస్తి పొందింది. ఈ పురాతన ఆలయ ప్రాంతంలో భృగుమహర్షి కొందరు మునులతో కలిసి తపస్సు చెయ్యగా శివుడు ప్రత్యక్షమయ్యాడని, అప్పుడే ఒక కొలను కూడా ఏర్పడినదంటారు. ఈ ఆలయం 13వ

శతాబ్దిలో నిర్మించబడినదని, ఈ ఆలయంనుండి శ్రీశైలానికి సొరంగమార్గంఉండేదని స్థానికులు చెబుతారు. చిత్రమేమిటంటే, కొంతమంది ఈ ఆలయానికి ఎదురుగా మరొక ఆలయం నిర్మించి, చరిత్రకు తూట్లు పెట్టి మన గొప్పతనాన్ని మనమే పోగొట్టుకున్నామనడంలో ఏమాత్రం సందేహంలేదు. అయినా ఇచ్చటి కార్తీక మాస ఉత్సవాలలో పాల్గొంటే ఈ ఆలయవిశిష్టత మనకర్థమౌతుంది. నిజం!

## అనంతసాగర్ - సరస్వతి

సిద్ధిపేటకు 20 కి.మీ దూరంలో అనంతసాగరమనే గ్రామంవుంది. ఇక్కడి చదువులతల్లి ఇప్పటి ప్రతిష్ఠే అయినా సౌభాగ్యలక్ష్మి, మహంకాళీమాతలతో కలిసి, త్రిమాతలను ఇక్కడ ప్రతిష్ఠించబడ్డారు. కాకపోతే ఇక్కడి సరస్వతి దేవి విశిష్టత, వీణాపాణియై నిల్చున్న మూర్తి. ఇటువంటి దేవతామూర్తులు దేశంలో చాలా అరుదు. ఆలయం ప్రక్కనేగల గుహలో 3 దొనెల్లో నీరు నిరంతరం ప్రవహిస్తూంటుంది. ఇనుప దోనెలో నీరు పొలాలకు క్రిమిసంహారిణిగాను, మాటలురాని వారికి మందుగా నుపయోగిస్తారు. రెండవదైన పాలధార నీరు తెల్లగా తియ్యగా వుంటాయి. మూడవదైన చీకటి దొన్నెలోని నీరు బాగున్నా ఆక్కడ అంతా గబ్బిలాల మయం. ఇక్కడికి వచ్చిన భక్తులు ఈ మూడింటిని కూడా దర్శించుకుని తరించామని తన్మయు లౌతారు.



మెదక్‌కు 35 కి.మీ దూరంలోని వేలుపుగొండలో అపురూపమైన తుంబురనాధ దేవాలయం ఉంది. ఈ ఆలయ గోడలపై స్త్రీపురుషుల నృత్య సన్నివేశాలు హావభావాలతో రాగ రంజితంగా చెక్కబడ్డాయి. ఈ ఆలయాన్ని దర్శించినవారు ఆనంద మూర్తులౌతారనడంలో ఏమాత్రం అతిశయోక్తి కనబడదు.

అతి పురాతనమైన ఆలయాలలో వేలుపుగొండ తుంబురనాధుడి తదుపరి చెప్పుకోదగ్గది "బెల్లాపూర్" మీసాల వేణుగోపాలస్వామి. దుబ్బాక మండలంలో వున్న ఈ ఆలయంలోని స్వామికి ఎక్కడాలేని పౌరుషానికి చిహ్నంగా మీసాలు వుంటాయి. దాదాపు 200 సం॥ల దుబ్బాకదొరల ఏలుబడిలో వుండి, పన్నులు పన్నులు అంటూ ప్రజల్ని పీడించేవారట. దాంతో గ్రామస్థులు దొరను, ఇక్కడ మేము వేణుగోపాలస్వామి ఆలయాన్ని నిర్మించదలిచా రంటారు. కృష్ణభక్తుడైన ఆ దొర కూడా తన వంతు కొంత విరాళమిచ్చి అక్కడ నుండి మరోచోటికి వెళ్ళాడు. అలాగ ఈ మీసాల వేణుగోపాలుడు వెలిసాడు. మరో కథ ప్రకారం ....

బెల్లాపురం గ్రామస్థులు చందాలు వసూలు చేసి ఆలయ నిర్మాణమైతే చేసారుకాని, విగ్రహాన్ని తయారుచేయించలేదు. ప్రక్కవూరిలో ఏ పూజలేక నిరాదరణగావున్న శ్రీవేణుగోపాలస్వామిని దొంగతనంగా తీసుకు వస్తూంటే, విషయం తెలుసుకున్నవారు వీరిని తరిమితే వారీ విగ్రహాన్ని బెల్లూరు కోనేటిలో దాస్తారు. ఆలయం పూర్తయ్యాక ఎవరికి అనుమానం రాకుండా వేణుగోపాలునికి మీసాలు, కిరీటం పెట్టి తమ వూరి ఆలయంలో

ప్రతిష్ఠ చేసుకున్నారుట. ఏది ఏమైనా ఆరకంగా మీసాలతో వేణుగోపాలుడు ప్రక్కవూరినుండి ఈ వూరికి వచ్చి ఆలయం, ధూపదీపనైవేద్యాలు పొంది భక్తవరదుడయ్యాడు.

జోగిపేటకు 6 కి.మీ దూరంలో వుందీ డాకూరు గ్రామం. ఇచ్చటి వీరభద్రేశ్వరాలయం 8 భుజాలతో, చూడసొంపుగా, ఖడ్గ, ఢమరుక, అంకుశ, చక్ర, త్రిశూలం, విల్లంబులు, గొడ్డలి, డాలు ధరించి తలపై అయిదు తలల నాగుతో సర్వాలంకారములతో విరాజిల్లుతున్నాడు. 11, 12 శతాబ్దాల సంధికాలంలో నిర్మిచినట్లు తెలిపే ఈ ఆలయం ఈమధ్యకాలంలో జీర్ణోద్ధరణం చెయ్యబడింది. దీనికి మూడు గర్భాలయాలున్నాయి. మధ్యదాంట్లో శివలింగం, కుడివైపు పార్వతి, ఎడంవైపు ఈ అందాల వీరభద్రుడు చూడచక్కగా దర్శనమిస్తారు. సప్తమాతృకలు కల శిలాఫలకము, నాగప్రతిమలు కూడ చూడవచ్చును. నునుపైన గోడలతో మూడు ఆలయాలుగా నిర్మించబడిన దివ్యాలయంగా దర్శించవచ్చును.

హైదరాబాద్‌నుండి రామగుండం వెళ్ళే రహదారిలో గౌరారం గ్రామానికి 12 కి.మీ దూరంలో ఈ ములుగు గ్రామం వుంది. భావానంద భారతి ఈ ఆశ్రమ, ఆలయస్థాపకులు. 1933 సం॥లో ప్రశాంత వాతావరణంలో ప్రపంచవాసనలకు దూరంగా వున్న ఈప్రాంతం ఎటువంటి వారినైనా వారి సమస్యలనుండి దూరం చేస్తుంది. అనంతరకాలంలో భక్తులు చూపే ఈ ప్రేమకు భావానందభారతి పండరీకి వెళ్ళి స్వామి విగ్రహలను అక్కడే చేయించి, ఇక్కడ ప్రతిష్ఠించారు.

రుక్మిణీ సమేత పాండురంగడితోపాటు, ఒక వైపు రామాలయం, మరొకవైపు భవానీ శంకరాలయం క్షేత్రపాలకునిగా ఆంజనేయుడు దరిశనమిస్తారు. ఇంకా ఇక్కడ భక్తజనులు తరించడానికన్నట్లు "హరిగంగ, శివగంగ" అనే రెండు కుండాలు, పవిత్రస్నానాలు చెయ్యడానికి ఏర్పడ్డాయి. సర్వసమస్యలకు పరిష్కారమా? అన్నట్లు పరవశింపచేసే ఈ పాండురంగ ఆశ్రమం, సాధకులకు, సమస్యలతో సతమతమయ్యే వారు దర్శించదగ్గ అపురూపక్షేత్రం. ఇంకా...

సిద్ధిపేట పట్టణశివారులలో సిరిసిల్ల మార్గంలో రేణుకా ఎల్లమ్మ దేవాలయముంది. గ్రామదేవతగా ఈ తల్లి కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిపొందింది. సాధారణంగా ప్రతిచోట గ్రామదేవతలకు జంతుబలులు ఇస్తారు. కాని ఆ ఆచారమిక్కడలేదు. ఎంతో శాంతమూర్తిగా వున్న ప్రశాంత మూర్తికి వైదికాచారపద్ధతిలో అర్చనాదులు జరుగుతాయి. నివేదనలు ఆ విధంగానే చేస్తారు. అమ్మకదా? ఎంతప్రాచీనమైనదైనా ప్రేమను పంచడం, భక్తులను రక్షించడం ఆ తల్లి ధర్మంగా ఈ రేణుకా ఎల్లమ్మ తల్లి తన బాధ్యతలను తాను నిర్వర్తిస్తూంది.

**కర్మయోగం తాలూకు లక్ష్యం నైష్కర్మ్య సిద్ధి, నైష్కర్మ్య సిద్ధి అంటే చేయాల్సిన పనులు (కర్మలు) చేసినప్పటికీ కర్మలచేత బంధింపబడకపోవడం. అయితే ఈ స్థితి నిర్వ్యాపారం వల్ల సిద్ధించదు.**

– భగవద్గీత

**మూఢవిశ్వాసం మానవుడికి ప్రబల శత్రువు. కానీ స్వమత దురభిమానం, పరమత ద్వేషం అన్నవి అంతకంటె దారుణమైనవి సుమా.** – వివేకానంద

# వరంగల్లు జిల్లా

## వేయిస్తంభాల గుడి



'వరంగల్' అనేసరికి వేయిస్తంభాలగుడి, రామప్ప దేవాలయం, భద్రకాళి అమ్మవారి ఆలయం వరుసగా జ్ఞాపకానికి వస్తాయి. అద్భుత కళాసంపద ఆశ్చర్యపరిచే నిర్మాణకౌశలము చూడాలి. రెండుచేతులు జోడించాలి. మన పూర్వుల ప్రతిభాపాటవాలముందు మన జన్మ నిరర్థకమని ఏడవాలి లేదా సిగ్గుతో కుచించుకుపోవాలి. ఇంతటి దిక్కుమాలిన వ్యవస్థలో మనం బ్రతుకు తున్నందులకు రాతిశిల్పాల స్థానే సిమెంటు బొమ్మలు పెట్టుకుని ఏదో సాధించామనే తృప్తి పొందుతున్నందు లకు, ఈ బ్రతుకు బ్రతుకేకాదని నిరసించాలి. ఇక ఈ అపురూప శిల్పాల కొచ్చి మనసును కొంతలో కొంత కుదుటపరచుకుందాం.

వరంగల్‌నుండి 5 కి.మీ దూరంలో హనుమకొండ –దాని నగరబొడ్డున వేయిస్తంభాల గుడిగా చెప్పబడే రుద్రేశ్వరాలయం. ఒక్కసారిదాని దగ్గరకు వెళ్ళి రెండు కళ్ళు విచ్చుకుని రెండు చేతులు జోడించి, పితామహ, పూర్వపితామహ, ఆచార్య, శిల్పాచార్య, పూర్వాచార్యులకందరికి 'త్రికరణశుద్ధి'గా నమస్కరించి, అప్పుడు ముందుకు అడుగువెయ్యాలి. ఇప్పుడు మనం చూసిన ఆలయంపేరు రుద్రేశ్వరాలయం. దీనిని ఆనుకుని విడిగావున్న కల్యాణమండపమే 'వేయిస్తంభాల' మంటపం. ఈ మంటపం వలన రుద్రేశ్వరాలయం పేరుబదులు వేయిస్తంభాలు గుడిగా విశ్వవిఖ్యాతమయింది.

ఈ అపురూప రుద్రేశ్వరాలయాన్ని ప్రోలరాజు, రుద్రమ్మ దేవి తనయుడైన రుద్రదేవ మహారాజు క్రీ॥ 1163 సం॥ జనవరి 19వ తేదీన ప్రతిష్ఠించినట్లు ఇక్కడి శిలాశాసనం తెలుపుతుంది. కాకతీయుల వైభవ ప్రాభవాలకు కీర్తికిరీటం, కలికితురాయిగా చెప్పాలి. 1138–1145 ప్రాంతంలో ఈ అత్యద్భుత నిర్మాణం ప్రాణం పోసుకుంది.ఇక్కడి నల్లరాయి జీవంతో జీవిగా సుందరాతిసుందరంగా చూడగల్గుతాము. ఇక్కడి ప్రతి శిల్పం మనలను పలుకరిస్తున్నట్లు పులకరింపచేస్తుంది. ఆ శిల్పాల అందం ముందు మనము మన అందాలు వెలవెలబోతాయనడంలో ఆశ్చర్యం లేదు. శిల్పాలు పగులగొట్టడం, విరగ్గొట్టడం తప్ప అవి నిర్మించగలిగే అశక్తత చోటుచేసుకున్న మనం, శ్రీనారాయణరెడ్డి వలె "ఈ నల్లని రాయిలో ఏ కన్నులు దాగెనో... ఈ బండలమాటున ఏ గుండెలు దాగెనో... " అని వాటి విపులకీర్తిని కీర్తించడమొక్కటే చెయ్యగల్గింది.

అలాగ ఒక్కొక్కటే చూస్తుపోతుంటే ఆ శిల్పాలు రంగమండప స్తంభాలు ద్వారతోరణాలు, అంతరాలయగోడలు, లోపలి కప్పు ... ఎలాగ వీటిని చెక్కారు , తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారని తెలియకుండానే చేతులు మోడ్చి చూస్తూ, ముందుకు సాగుతుంటాము. ఇదంతా అప్రయత్నమనడంలో ఆశ్చర్యంకనబడదు. ఇక త్రికూటాలయం. ఇక్కడ నంది విగ్రహం. తొందరపడి ముందుకు వెడితే కొమ్ములతో పొడుస్తుందేమోనన్నట్లు గంభీరంగా చూస్తుంది.



ఆలయ పీఠం నక్షత్రాకృతిలో మధ్యనున్న రాతి చెక్కడాలు వలయాకార దర్పణం (గుండ్రని అద్దం)లాగ కనబడు తుంది. దీనిపైపడిన సూర్యకాంతి గర్భగుడిలో వెలుగులు ప్రసరించడం ఎంతటి అపూర్వమో వారి మేధా శక్తి సాంకేతిక పరిజ్ఞానం, ఈనాటి వారికి ఉన్నది తగులబెట్టడానికేకాని, సరిచేయడానికి ఏమాత్రం పనికిరాదన్నది నిజమౌతుంది.


ఇక్కడనుండి ఓ సొరంగం వుందని, దీని ద్వారా కాకతీయ ప్రభువులు, భద్రకాళి దేవాలయాన్ని, వరంగల్ ఖిల్లాను, అలాగే రామప్ప దేవాలయానికి వెళ్ళే వారుట. వేయిస్తంభాల మంటపం, రుద్రేశ్వరాలయ నిర్మాణాలకొక ప్రాచీన గాధ వుంది. అది కాకతీయుల కాలం. అప్పటిరాజు ప్రోలయరాజు. ఈయనకో మగబిడ్డ కలిగాడు. కానీ ఆతనివలన తండ్రికి మరణమనడంతో అతనిని బ్రాహ్మణునకిచ్చి ఆతనివద్ద పెంచుతున్నాడు. కాని కర్మమనుభవించా లన్న అనుకోని కారణాలు వల్ల ప్రోలయరాజు కుమారుని చేతిలోనే మరణిస్తాడు. దీంతో కలతబడిన ఆ కుమారుడు తండ్రి ఆత్మశాంతికై పై ఆలయాలనేకాదు, ఆతని రాజ్యం లోని నలుమూలల ఆలయాల నిర్మించాడు. అందు భూదానాల్చి తండ్రికి ఆత్మశాంతి కల్గించాడు. అందులోని భాగమే, ఈ రుద్రేశ్వర, కల్యాణమంటపాదులు. రుద్రేశ్వరుడు, నంది, వాటి పునాది శ్రీచక్ర ఆకారంలో వుండి, ఇటువంటి నిర్మాణశైలి మరెక్కడా లేనట్లు ప్రకటితమౌతుంది.

ఉత్తరప్రాకారం గుండా లోపలికి వెడితే పానపట్టంలేని శివలింగాలపై కరవీర పుష్పాలు అభిషేకించినట్లు పడటమొక విశేషం. ఈశాన్యంలో అలనాటి కోనేరు కళాతృష్ణ కలిగిన వారికి కన్నులపండుగ చేస్తాయి. ఇక ప్రధానాలయంలో మూడు ఆలయాలు ఏకపీఠంపై నిర్మించడమొక విశేషం. అందుకే దీనిని మూడు కూటములు కలిసినదిగాన త్రికూటాలయమని పిలుస్తారు. మూడింట్లో తూర్పు ముఖంగా వున్న దాంట్లో శివుడు, దక్షిణాముఖంగా వున్నదాంట్లో విష్ణుమూర్తి, మూడవ పశ్చిమముఖం దాంట్లో సూర్యప్రతిమలు నిలబెట్టారు. సూర్యుని విగ్రహం మాత్రం ఆలయంలో చూడలేము. వీటి తలుపులు ఏకరాతితో గోడకు అంటకుండా నిలబెట్టడం వారి మేధాశక్తికి మచ్చుతునక. ఇది రోజూ యాత్రీకులు, నిత్యం భక్తులతో ఎప్పుడు కిటకిట లాడుతుంది. పర్వదినాలు నిజంగా పండుగే.

## పాలంపేట రామప్పదేవాలయం

వరంగల్‌కు 50 కి.మీ దూరంలోని ఈ పాలంపేటగ్రామానికి సమీపంలో చరిత్ర చెప్పుకుని చేతులెత్తి నమస్కరించే రామప్ప దేవాలయాన్ని "రామలింగేశ్వర దేవాలయ"మని కూడా అంటారు. ఈ ఆలయ నిర్మాత కాకతీయ ప్రభువు గణపతిదేవుడు సైన్యాధిపతి రాచెర్ల రుద్రుడు. ఈతడు బెజ్జంకి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కూడా కట్టించాడు. రుద్రుడు కట్టించాడు కాబట్టి రుద్రప్పదేవాలయంగా, రుద్రేశ్వరాలయంగా ప్రసిద్ధి చెందినది. ఈ ఆలయానికి ఒక ప్రక్క కోటేశ్వరాలయము, మరొకప్రక్క కామేశ్వరాలయముంది. ఇవి రుద్రేశ్వరాలయం తర్వాత నిర్మింపబడినవిగా

చెబుతారు. ఏమైనా రుద్రేశ్వరాలయానికి వచ్చిన పేరుప్రతిష్ఠలు వీటికి దక్కలేదు.



ఈ రామప్ప దేవాలయ మెంతటి విశిష్టత పొందినదంటే, దేవాలయ నిర్మాణానికి ఇటుక శ్రేష్ఠమైనదే కాకుండా, నీటిలో వేస్తే తేలేవిధంగా తయారు చెయ్యబడింది. ఈ ఆలయంలోని రాతి స్తంభాలు సంగీత ధ్వనులు వినిపించడం ఇంకా ఇక్కడి విశేషంగా చెప్పుకుని మురిసిపోవాలి. ఈ ఆలయ గర్భగుడి అంతరాలయద్వారాలపై మలచబడిన శిల్ప సంపద వివిధ నాట్య రీతులను, పద్ధతులను తెలియబరుస్తున్న నృత్యకళామూర్తులను చూస్తూ, అప్రయత్నంగానే అడుగులు కదుపుతారు, తెలియకుండా నాట్యం చేస్తారనడంలో ఆశ్చర్యం కనబడదు. అంతటి సన్న వెంట్రుక పోచవంటి నగిషీలు ఎప్పుడో చెక్కితే ఇప్పటికి తమ సొగసులు, సొంపులు ఒలకబోస్తూ ఎంతగొప్పగావున్నాయో ... వూహాతీతం.

ఇక ఈ శివాలయం – ప్రధాన ప్రతిష్ఠ దేవతపేరుతోకాక, నిర్మించిన రామప్ప పేరు ఎందుకు వచ్చిందో కూడా వూహాతీతం. ఇక్కడి ప్రధాన దైవం రామలింగేశ్వరుడు. ఇక్కడి నంది – శివుడు పిలుపుకు సిద్ధమన్న భంగిమలో మనం ఎటునుంచి చూసినా అది మనల్నే చూస్తున్నట్లుండటం ఇంకో విశేషం. ఇక్కడవన్నీ ఎర్ర ఇసుక రాయి నిర్మాణాలే. ఎటొచ్చి గర్భాలయం, ద్వారబంధం ఆ ప్రక్కన శిల్పాలు ముఖమంటప స్తంభాలు వగైరా మాత్రం నల్లరాతి నిర్మాణాలు. నగిషీల పనితనం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. గుడి ప్రక్కన చెరువు దాని ప్రక్కన పట్టణము కాకతీయుల సాంప్రదాయం. అదిక్కడ నిరూపితమైంది. అందుకే గుడి, చెరువు, ఆపై వూరు క్రమంలో నిర్మింపబడ్డాయి.



## భద్రకాళి అమ్మవారు- వరంగల్

వరంగల్లు భద్రకాళి ఈ ప్రాంతంవారికి తెలిసిన, వినిపించేపేరు. భద్రకాళి చెరువు, గుట్టపై తల్లి ప్రధాన రహదారిపై వుంది. ఇది ప్రాచీన ఆలయం. ఇక్కడ సిద్ధుల సంచారముంటుందని, తెలిసికాని, తెలియక కానీ ఎవరు తప్పులు చెయ్యరు. పొరపాటున చేసివుంటే ఆ తప్పులు పరిహరింపబడతాయనేది ఒక నమ్మకం. శ్రీరాముడు వనవాస సమయంలో ఇక్కడికి వచ్చినప్పుడు ఈ ప్రాంతంలోని ఋషులు రాముడిని రాక్షసబారినుండి కాపాడమని కోరారని చెబుతారు. సుగ్రీవాదులు కూడా ఇక్కడే నివసించారని అందుకే ఈ ప్రాతంలోని కొండకు హనుమకొండ అని పేరువచ్చిందని చెబుతారు.



భద్రకాళి విగ్రహం 9 అడుగుల ఎత్తు వెడల్పుతో పశ్చిమాభి ముఖంగా కూర్చుని, భక్తులను కరుణిస్తుంటుంది. అమ్మవారు ప్రేత (శవం)పై కూర్చుని ఆమె కుడి వైపు చేతులలో ఖడ్గము, ఛురిక, జపమాల, దమరుకం, ఎడమచేతులలో ఘంట, త్రిశూలము, చిన్న మస్తకం (నరికిన తల) పానపాత్రలు వుంటాయి. క్రీ॥ 625లో రెండవ పులకేశి చక్రవర్తి ఆలయం నిర్మించి, భద్రకాళిని ఇచ్చట ప్రతిష్ఠించాడని అనంతరకాలంలో కాకతీయులు, శక్తి ఆరాధనలో భాగంగా ఈ తల్లిని సేవించి తరించారు. 1565లో విజయనగర పతనం కాకపోతే వారి కాలంలో కూడా ఈ తల్లి అంగరంగవైభోగంతో వెలుగొందేది. ప్రతాపరుద్రుని కాలంలో ఈ తల్లి ఎంతగొప్పగా వెలుగొందిందో చెప్పలేము.

ఇలాగుండగా ఒకనాడు సుదర్శన పండితుడు తన నూరుగురు విద్వాంసులతో ప్రతాపరుద్రుని కొలువుకు వస్తాడు. అక్కడ ఆయన పండితులు ఇతన్ని ఓడిస్తారు. అది అవమానంగా తలచిన సుదర్శనులు తను గెలవాలనే పట్టుదలతో ఒక వింత పందెం పెడతాడు. అది పండితులారా! ఇవాళ కృష్ణ చతుర్దశి. రేపు అమావాస్య. అవునా? అడుగుతాడు. అందుకువారు క్షణకాల మాలోచించి, ఇవ్వాళ చతుర్దశేకావచ్చును. కాని తమ పరువుప్రతిష్ఠలకోసం పౌర్ణమి అని చెబుతారు. వారిలో మల్లికార్జునభట్టు రాత్రి భాగాన అమ్మవార్నిచేరి 'అమ్మా! ఆపద...' అంటూ ఆ తల్లిని స్తుతిస్తాడట. తప్పక నీ అపజయం నా అపజయమంటూ తల్లి మర్నాడు పున్నమి వెన్నెలను పుష్కలంగా కురిపించిందిట.

ఈ జరిగింది మొత్తం గ్రహించిన సుదర్శన మిత్రుడు, అమ్మకరుణకు, దైవశక్తికి సాగిలబడి వెళ్ళిపోయాడుట. దీనిని బట్టి చూస్తే ప్రతాపరుద్రుని కాలానికే అమ్మ భద్రకాళి శక్తిలోకవిదితమవడంకాదు, భక్తజనావళిని కరుణించే బంగారు తల్లిగా విరాజిల్లుతోంది. మొదట్లో ఉగ్రంగా వుండే తల్లిని 1950 ప్రాంతంలో అమ్మను శాంతపరచి, గర్భగుడిలో అమ్మవారి చేత శ్రీచండీయంత్రాన్ని ప్రతిష్ఠించారు. రౌద్రాచారాన్ని విడిచిపెట్టి శాంతకలాపం ప్రవేశపెట్టారు. ఈ దేవాలయం పరిసరాలలో వివిధ ఆలయాలున్నాయి. ముందుభాగంలోని మహామండపంలో సుబ్రహ్మణ్యస్వామి,

ఆంజనేయులతోపాటు ధ్వజస్తంభం, సింహవాహనం, బలిపీఠాలు ఏర్పరచారు. ఇక్కడ ఇప్పుడు శాకంబరి ఉత్సవాలు కూడా నిర్వహిస్తున్నారు. ప్రతి పండుగను, "పండుగ" చేసి అర్చించడం ఇక్కడొక ఆనవాయితీ అయికూర్చుంది. 1940 నుండి వామాచారతంత్రం,క్షుద్రపూజలు విడిచి, దక్షిణాచార విధంగా షోడశపూజలు, సాధారణ నివేదనలు వేదోక్తంగా జరుగుతున్నాయి.

వరంగల్ జిల్లాలోగల మరొక ప్రాచీన ఆలయం శంభులింగేశ్వరాలయం. దీనిని రెండవ ప్రోలరాజు 1162లో నిర్మించినట్లు తెలుస్తోంది. రెండవ ప్రోలరాజు పరిపాలనాకాలం పాడిపంటలతో తులతూగుతుండేది. ఒకానొక సమయంలో రైతులు తమ పంటను బండ్లపైకి ఎక్కించుకుని తీసుకువస్తుంటే, అప్పుడా బండ్లలోని ఓ బండిచక్ర ఒకచోట కూరుకోపోయింది. ఎంతపెరికినా రాక, పూరుపూరు కదలితే అతి బలవంతంగా వచ్చిందికాని చిత్రంగా ఆ బండి చక్రం బంగారుకాంతులతో మెరువసాగింది. చివరకిది ఆనోటా, ఆనోటా రాజుగారి చెవిలో పడటం, ఆయన రావడం, ఆ ప్రాంతాన్ని స్వర్ణమయంగా చూడటం జరుగుతుంది.

"ఓం నమశ్శివాయ" అనే పంచాక్షరి మంత్రం పఠిస్తుంటే, స్వయంభూ శివలింగం కనబడింది. దానిని తన రాజ్యంలో ప్రతిష్ఠించాలని తలిచాడు. కాని శివుడు అంగీకరించలేదు. దాంతో రాజుగారు తమ గురువుల సలహా కోరతాడు. దాంతో శ్రీగురువులు శ్రీపాదులవారు "రాజా! ఇది సామాన్య శివలింగం కాదు. ఇనుమును బంగారం చెయ్యగల శక్తికలది. కనుక ఇక్కడే ప్రతిష్ఠించమంటారు. "రాజా! దీనికి చుట్టు ఎటుచూసినా ఆమడదూరముండేటట్లు ఏడు కోటలు కట్టించమంటారు. ఆ రకంగా ఒక అద్భుత శివాలయం, దానితో కోట, పెద్ద పట్టణం అనుకోకుండా శివకరుణతో లభించింది.

## గణపుర - గణపేశ్వరాలయం

11, 12 శతాబ్దాలలో కాకతీయ ప్రభువు శ్రీగణపతి చక్రవర్తి దీనిని నిర్మించినట్లు తెలుస్తుంది. ఈ ఆలయం చుట్టు మట్టికోట వుండటంతో దీనికి 'కోటగుళ్ళు' అనేపేరు నిలబడిపోయింది. ఈ ఆలయం చుట్టు 16 దేవాలయాలు, వాటిలో శివలింగాలున్నాయి. కాని కాలం కాటేసినట్లు ఉపాలయాలలోని లింగాలను ధూర్తులు, మోసగాళ్ళు ధ్వంసం చేసారు. ప్రస్తుతం గర్భగుడిలో శిథిలావస్థలోన్ను శివలింగాన్ని ఇటీవలెనే పునరుద్ధరించారు. శివరాత్రినాడు ఇక్కడ జరిపే శివపార్వతుల కల్యాణం చూసితీరవలసిందే.

## సమ్మక్క - సారక్క - మేడారం

'మేడారం' అనేసరికి సమ్మక్క – సారలమ్మ జాతర ఈనాడు కళ్ళలో కనబడుతుంది. చెవులలో వినబడుతుంది. అంత ప్రశస్తిపొందినదీ గిరిజన జాతర. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ వగైరా రాష్ట్రాలనుండి వచ్చే గిరిజనులు తరలివచ్చి తమ మ్రొక్కులు చెల్లించుకుంటారు. ఆపదలో ఆదుకునే మా తల్లి అని ఈ తల్లిని పూజించడం, గతంలో ఒక ప్రాంతానికి పరిమితమైనా, ఈనాడు భారతదేశంలోనే ఈ సమ్మక్క – సారమ్మల పేర్లు వినగానే చేతులు మోడ్చే స్థితి ఏర్పడిందటే 'భక్తి' గొప్పతనం, భగవంతుని శక్తి మనం అర్థం చేసుకోగల్గుతాము. పన్నెండో శతాబ్దపు కథ ప్రకారం, మేడరాజుకు దైవప్రసాదంగా ఆడబిడ్డ దొరకుతుంది. దాన్ని పెంచి పెద్దచేసి

మేనల్లుడు మేడారం పాలకునికిచ్చి పెండ్లిచేస్తాడు. వారికి సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అని ముగ్గురు సంతానం కల్గుతారు. ఒకసారి కరువుకాటకాలతో శిస్తుకట్టకపోవడం, మేడరాజు మేనల్లుడి దగ్గరకు చేరడంతో కాకతీయ ప్రభువు ప్రతాపరుద్రుడు, తనమంత్రి యుగంధరుని పగిడి రాజు వద్దరకు పంపుతాడు.

అక్కడ అనుకోకుండా యుద్ధం జరిగి అందరు మరణిస్తారు. సమ్మక్క తెగించి వీరోచితంగా యుద్ధం చేసి ఇక అది తన పనికాదన్నట్లు చిలుకలగుట్ట వైపు వెళ్ళింది కాని ఆమె జాడ కనబడలేదు. కాకపోతే ఆ ప్రాంతంలోని ఒక పుట్టవద్ద పసుపు, కుంకుమలు గల భరిణ వారికి కనిపించింది. అందులో సమ్మక్కతల్లి కనుపించడంతో, మేడారంలో యుద్ధం జరిగిన ప్రదేశంలో రెండు గద్దెల్ని ప్రతిష్ఠించారు. అప్పటినుంచి ప్రతి రెండేళ్ళకు మాఘశుద్ధ పున్నమినాడు సమ్మక్క జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. కన్నెపల్లినుండి సారలమ్మను, చిలకలగుట్టనుండి భరిణె రూపంలో సమ్మక్కను తెచ్చి గద్దెలపై ప్రతిష్ఠించి, మూడవనాడు వారిరువుర్ని కలిపి చేసే ఈ జాతర ఆ తదుపరి ఉద్వాసన తెలిపి, వారివారి యుద్ధస్థానాలకు పంపడమనేది ఒక చిత్రమైన అనుభూతే. పౌరుషాలకు, ధైర్యస్థైర్యాలకు, ధర్మానికి, మంచికి ఒక మచ్చుతునక. అన్యాయదుర్మార్గాలకు అంతంగా తలుస్తారు. ఇక్కడ బంగారమంటే బెల్లం నివేదన చేస్తారు. అదే నిజానికి ప్రసాదంకూడా!

## కొమరవెల్లి - మల్లన్న

ఈ కొమరవెల్లి గ్రామంలోని ఇంద్రకీలాద్రిపై 11వ శతాబ్దిలో కొమరవెల్లి మల్లన్న పేరుతో ఒక గ్రామ దేవత వెలిసినట్లు తెలుస్తుంది. ఒకనాడీ స్వామి ఒక గొర్రెలవారికి కలలో కనుపించి, తాను ఇంద్రకీలాద్రిపై వున్నానని, నన్ను పూజిస్తే నీకు మేలు జరుగుతుందని చెబుతాడు. ఆమాటలకు ఆ కాపరి ఇంద్రకీలాద్రిలో శ్రీస్వామిని దర్శిస్తాడు. పూజిస్తాడు. ఇది అందరికి తెలిసి పూజలు, భక్తులు పెరిగారు. ఈయన 500 సం॥నాటి దేవుడట. ఈ స్వామి విగ్రహం పుట్టమట్టితో చేసిందట. అయినా ఇప్పటికి చెక్కు చెదరకుండా వుందిట.

ఈ మల్లన్నకు నాభిలో లింగం, నెత్తిపై ఏడు శిరస్సుల నాగేంద్రుడు, కోరమీసాలతో వుంటాడు. ఇక్కడ లింగబలిజులు వీరశైవమాగమశాస్త్రప్రకారం యాదవ కులస్తులు ఒగ్గుపూజాదుల ద్వారా అర్చనాదికాలు జరుపు తున్నారు. చివరకి ఇక్కడొక సాంప్రదాయమై కూర్చుంది. ఇక్కడి నివేదనను భక్తులు మట్టిపాత్రలలో సమర్పించి, ఆ పాత్రలను తమ ఇంటికి తీసుకువెళ్ళి, పాలకై వుపయోగించుకుంటారు. ఇక ఈ ఆలయం ఎదురుగా గంగిరేగుచెట్టు, ఒళ్ళుబండవున్నాయి. ఈ చెట్టుకు ముడుపులు కట్టి, ఆ ఒళ్ళుబండ వద్ద తమ కోర్కెలు చెప్పుకుంటే నెరవేరుతాయనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇక్కడి జాతర జనవరిలో మొదలుపెట్టి ఉగాది వరకు సాగుతుంది. చూసి తీరవలసిన ఉత్సవసంబరం.

## అయినవోలు - మల్లన్న

వరంగల్లునుండి 12 కి.మీ దూరంలో ఈ గ్రామం వుంది. కాకతీయరాజులు కట్టించిన చారిత్రక, పురాతన మల్లన్న దేవాలయం కూడా ఇక్కడేవుంది. మల్లన్న లేదా మల్లికార్జునుడు తమ కులదైవంగా అయ్యన్న దేవుడనే మంత్రి ఈ ఆలయ నిర్మాణం జరిపినట్లు, ఆయన పేరునే ఈ గ్రామానికి అయ్యన్నవోలు, క్రమంగా అయినవోలు

అయిందని చెబుతారు. ఇంకా ఇక్కడి స్వామివారు యాదవుల ఆడబిడ్డ గొల్లకేతమ్మ, బలిజుల బిడ్డ మేడాలమ్మను పెండ్లిచేసుకుని ఇరువైపులా పెట్టుకుంటాడు. వీరిని మనం ఆలయంలో స్పష్టంగా, చక్కగా చూడగల్గుతము. ఇక దేవుడు గూర్చి ఆలోచిస్తే స్వామి ఇటు లింగరూపుడో, అటు మూర్తో (విగ్రహం) వుండాలి. అలాగ కాక లింగానికి ముందు భాగంలో మూలవిరాట్టు మల్లి (మల్లన్న)కార్జునుడు వుండటము, లింగానికి అర్ధపానపట్టముండటం, ఇంకా లింగం శ్వేతవర్ణం కల్గివుండటం... ఇవన్నీ ఇక్కడ విశేషాలుగా చెప్పుకోవాలి. పూజలు మాత్రం శైవాగమపద్ధతిలో సాగుతాయి. ఇక పర్వదినాలన్ని ఈస్వామివేనన్నట్లు ప్రతి పండుగ 'నిజంగా పండుగ' వలె జరుపడమొక విశేషం.

## కురవి వీరభద్రుడు

మహబూబాబాద్ నుండి 9 కి.మీ దూరంలో ఈ కురవి గ్రామముంది. ఇక్కడ వేంగీచాళుక్యులనాటిదని చెప్పే వీరభద్రాలయం వుంది. ఇది కాకతీయుల కాలంలో మరింత అభివృద్ధి చెందిందంటారు. తన దేవేరి భద్రేశ్వరి సమేతుడై వీరభద్రుడిక్కడ వెలిసాడు. పేరుకు, చూడటానికి వీరభద్రుడైనా, భక్తజనపరిరక్షకుడీ ప్రభువు. క్రీ॥శ. 850లో వేంగి (ఏలూరు) రాజధానిగా పాలించే ఈతడు రాష్ట్రకూటులతో ఓడింపబడి చాళుక్యులకు సామంతుడై ఇక్కడికి వచ్చినట్లు ఈ ప్రాంతాన్ని పాలిస్తూ వీరభద్రేశ్వరాలయాన్ని కురవిలో నిర్మించాడని శిలాశాసనాలద్వారా తెలుస్తోంది. ఆ తర్వాత కాకతీయుల తొలి స్వతంత్రరాజు ఒకటవ చేతరాజు ఈ ఆలయాన్ని అభివృద్ధి పరచినట్లు ఓ పెద్ద చెరువు నిర్మించినట్లు తెలుస్తుంది.

24 స్తంభాల మహామండపంతో మూడు గర్భాలయాలతో ఈ స్వామి ఆలయం విస్తరించబడివుంది. ఇక్కడ స్వామి వారిచెంత వినాయకుడు నాల్గుచేతులతో వుండగా దక్షిణభాగమున బ్రహ్మ, ఈశ్వరునితో సప్తమాతృకలుగల శిల్పం చూసితీరాలి. వీరభద్ర గర్భాలయ ఉత్తరదక్షిణ భాగాలలో శ్రీరామలింగేశ్వరుడు, చంద్రమౌళీశ్వరులను దర్శించవచ్చును.

## శ్రీశ్వేతార్క మూలగణపతి - ఖాజీపేట

ఇది క్రొత్తదే అయినా ప్రథమపూజ్యునికి వందనశతాలర్పిస్తూ ఈశ్వేతార్క గణపతిని దర్శిద్దాం. కేవలం గరికలతో ప్రదక్షిణలు చేస్తే సంతోషించి కోరికలు తీర్చే కొండంత దేవుడు శ్రీగణపతి. 1996 సం॥లో శ్రీశర్మగార్కి స్వామి తెల్లజిల్లేడు చెట్టు మూలంలో తీర్చిదిద్దినట్లు వెలిసారు. ఇది మనఅదృష్టం. ఆలయ నిర్మాణం, అపురూప శ్వేతార్క గణపతి ప్రతిష్ఠ దర్శనాలు, దర్శనీయాలు, జన్మధన్యాలుకూడా! ఇంకా ఇక్కడ శ్రీమహాలక్ష్మి జ్ఞానసరస్వతి, నవగ్రహాలు, సత్యనారాయణస్వామి, అయ్యప్ప, శ్రీషిర్డిసాయి వగైరా మూర్తులను కూడ మనం సందర్శించుకోవచ్చు. ప్రతి మంగళవారం, వినాయక చవితీ. ఇతరత్రా పర్వదినాలలోని విశేషార్చనలు చూడదగ్గవి, చేసుకోదగ్గవికూడా!

పాలకుర్తి ... అంటే క్షీరగిరి. ఇక్కడి శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయం, అత్యంత పురాతనమైనది. ఇందలి స్వయంభువు క్షీరగిరి పర్వతంపై వున్నాడు. ఇది శివపంచాయతనక్షేత్రం. ఇక్కడ శివుడు శ్రీసోమేశ్వరుడు విష్ణువు, శ్రీలక్ష్మీనరసింహస్వామి, స్వయంభువులై చెరొక గుహలో వెలిసారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి గుహలో పుట్టిన నీటిపాయ, కోనేరు, అటునుండి గ్రామచెరువులో కలిసి అది పాలేరుగా మారి చివరకు గోదావరిలో

సంగమిస్తోంది. ఇది హరిహరక్షేత్రం. ఒకప్పుడు ఈ కొండగుహలనుండి పాలధార ప్రవహించినందువలన ఇది పాలకుర్తి (క్షీరగిరి)గా పేరుపొందింది. శ్రావణ మాసంలో ఇక్కడ జరిగే లక్షబిల్వార్చన, కుంకుమార్చన, తులసి అర్చనలు, ఇతర ప్రత్యేక పూజలు నిర్వహింపబడుతున్నాయి.

## కాశీబుగ్గ శ్రీరంగనాధస్వామివారి ఆలయం

శివలింగం వుండే పానపట్టంపై వుండటమొకవిచిత్రం.పూర్వం శివాలయంలో శివలింగమే వుండేది. కాని కాలక్రమంలో దాని పానపట్టంపై శ్రీరంగనాధస్వామి వుండటం, ఆలోచించదగ్గదే, అలాగే పార్వతిదేవి నిత్యం గంగాస్నానం చేయాలని కోరడంతో శివుడు ఇక్కడ ఒక బుగ్గ నిర్మించి, తన మనోరాణి కోరిక తీర్చిన దివ్యప్రదేశమిది.

**చిలుకూరులో బులుగు వేంకటేశ్వరస్వామి ఆలయం** వుంది. తిరుమలవాసుడు అప్పు తీర్చలేక కుబేరునికి కనబడకుండా ఇక్కడ బులుగు వేంకటేశ్వరుడు దాక్కున్నాడట. 400 సం॥ క్రితం అక్కడ తపస్సు చేసుకునే మునులకు స్వామి కనుపించి తన వునికిని చెప్పటంతో ఇక్కడ స్వామి వునికి ప్రచారంలోకి వచ్చింది. ఇక్కడ కల్యాణం జరగడాలు వుండదంటే అతిశయోక్తికాదు.

## జీడికల్లు - శ్రీవీరాచలరామచంద్రుడు

జనగాంకు 15 కి.మీ దూరంలో జీడికల్లు దీనికి 2 కి.మీ ఒక పెద్దరాయి, దానిపై రెండు నీటిగుంటలు, ఒకటి పాలగుండు, రెండవది జీడిగుండు. ఈ జీడిగుండం వల్లనే దీనికి 'జీడికల్లు' అనే పేరు స్థిరపడింది. దీనికి మరో పేరు 'లేడిబండ'. ఇంకా ఈ వూళ్ళో వీరాచలమనే కొండ వుంది. దానిపై రాముని ఆలయముంది. ఇది చాలా పురాతనమైంది. ఇక్కడ "వీరుడు" అనే ముని తపస్సు చేస్తూ శ్రీరామానుగ్రహం పొందినందువలన దీనికి వీరాచలమనే పేరు వచ్చింది. ఈయన స్వయంభువు అని పద్మాసనంపై వుండటం వలన వీరాచలరామచంద్రుడని పేరుపొందాడు. శ్రీరాముని మాట ప్రకారం ఈ ఆలయం అసంపూర్తిగా నిలిచిందని, పైగా రాముడు మాయలేడిని వెదకుతూ ఈ ప్రాంతం దర్శించాడని చెబుతారు.



లేడి అడుగులు, రాముని పాదగుర్తులు, బాణం కూర్చే రాముని ఎడమ మోకాలి ముద్ర లేడిబండపై ఇప్పటికి చూడగల్గుతాము. మనం చేసే పనులు పాపాలకు తెలియ కుండానే దారితీస్తాయని, రామగుండంలో కనుక స్నానం చేస్తే ఆ పాపాలు తొలగిపోతాయనడానికి నిదర్శనం– పూర్వం బాలచంద్రుడు, బాలచంద్రిక అనే కవలలు తప్పిపోయారు. వయస్సు వచ్చాక ఆ అన్నాచెల్లెళ్ళుకు వివాహం కాకతాళీయంగా నిర్ణయమౌతుంది. స్వయంవరాలు, పూలదండలు మార్చుబడ్డాయోలేదో వారి శరీరాలు నల్లబడుతాయి.

త్రికాలజ్ఞులైన మహర్షులు వారి జన్మరహస్యము, బాంధవ్యము చెప్పేసరికి వారిరువురు తీర్థయాత్రలు చేస్తూ చివరకు ఇక్కడికి వచ్చి, రామగుండంలో స్నానం చేస్తే వారి పవిత్రులై పుణ్యలోకాలకు వెళ్ళారు. ఇంతగొప్ప క్షేత్రంలో గాలి, వెలుతురు వచ్చేటట్లు రామాలయం, ఇతర సదుపాయాలు, అర్చనాదులు, కార్తీక మాసంలో కల్యాణం, జాతర్లు మహావిశేషాలు. దర్శించిన వారు ధన్యులు.

**'మల్లూరు' కు** 5 కి.మీ ల దూరంలో **'హేమాచల'**మని పిలువబడే గుట్టపై శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయముంది. కాకతీయుల కాలంనాటిది. దర్శనం ఉదయంనుండి మధ్యాహ్నం వరకు మాత్రమే. తిరిగి మర్నాడే. ఈ ఆలయంలో మూలవిరాట్టు గుహకు ఆనుకున్న 9 అడుగుల నల్లరాతి విగ్రహం. ఇక్కడి విశేషం– పుట్టలోంచి స్వామిని వెలికితీస్తుంటే గునపం బొడ్డుకు తగిలిందట. అక్కడనుండి చిత్రంగా వూటవంటి తేమవస్తుంటే, ఉపశమనమన్నట్లు అర్చకులు చందనం పూస్తున్నారు. ఇక ఈ విగ్రహం రాతివిగ్రహ మనిపించదు. ఎక్కడతాకినా మెత్తగా మానవశరీరభ్రమ కల్గిస్తుంది. దీంతో పూర్వం ఇప్పనూనె, ఇప్పుడు నువ్వుల నూనెతో స్వామికి అభిషేకం చేస్తున్నారు. ఇక పండుగలు, ఉత్సవాల షరా మామూలే. భక్త జనుల తాకిడి, ఆనంతం.. అది... షరా మామూలే!

రేగొండ మండలంలో **"కొడవటంచ"** అనే గ్రామంలో **శ్రీలక్ష్మీనరసింహస్వామి**వారి ఆలయంలో అందులో స్వామి పిలిస్తే పలికేటట్టు వుంటాడు. ఫాల్గుణ మాసంలో ఏకాదశినుండి బ॥ ద్వాదశి వరకు బ్రహ్మోత్సవాలు, జాతర్లు ఒక్కటేమిటి... స్వామికి, భక్తులకు ఆనందనయనోత్సవాలు అద్భుతంగా సాగుతాయి. చూచేవారు అదృష్టవంతులు. చూడదలచుకునేవారు మరింత అదృష్టవంతులు. ఇక్కడ ఎడ్ల బండ్ల ప్రదర్శన భక్తులకు మరొక ఆకర్షణ.

ఇక **కొండపర్తి** లోని **శ్రీగణపతి ఆలయం**తో వరంగల్ దివ్య "దేవ–దేవీ" లీలావిలాసాలను తెలిసినంత తెలిపి, తెలియనివాటికై మీవంటి మహాభక్తులనుండి విషయాలకు ఎదురుచూస్తూ శ్రీగణపతి లీలతో, ఆ స్వామి కరుణతో ఆనందంగా వ్యవహరిద్దాం.

15వ శతాబ్దంలో **కొండపల్లి చెరువుకట్టకు** దగ్గర్లో **శ్రీగణపతి ఆలయాన్ని** శ్రీచండసేనాని నిర్మించినట్లు చెప్పబడింది. గణపతి విగ్రహం రెండు చేతులతో భుజంపైనుండి చేలాంచనం (జరీకండువా) నగిషీలు జాగ్రత్తగా చూస్తే మనం చూడగల్గుతాము. అద్భుత శిల్పాల నిలయం ఈ ప్రాంతాలు, ఆనాడు... ఈనాడు కూడా దొరలపాలనలో, పెద్దలు, ప్రముఖులనేవారు భ్రష్టుపట్టించారు. ఎన్నో కోటలు, చీడీలు, దిక్కులేని స్థితిలో నేలజారుతున్నాయి. అదే స్థితి ప్రస్తుత శ్రీగణనాథునికి పట్టింది. ఈ ఆలయానికి సమీపంలో భైరవాలయం కూడా వుంది. తల్లికి తద్దినం పెట్టక పినతల్లికి పిండప్రదానం చేసాడుట.

అలాగ మన సంస్కృతీ సాంప్రదాయ సదాచారవారసత్వాల్ని, కళాభిరుచులను, ఏదో రకంగా కొల్లగొట్టి విదేశాలకు అమ్ముకోవాలనే దౌర్భాగ్యులు ఏ గడ్డితిన్నా డబ్బు సంపాదించడమే లక్ష్యంగా బ్రతికే రాజకీయ నాయకులు, వారి పుత్రులు, వారి అధికార హోదాదర్పాల, దౌర్జన్యాలనుండి ఈ దేశం కాలం, రాష్ట్రం, కళాసంపద, ఎప్పటికైనా "పురుడుపోసుకుంటుందా... తల్లీ! ఆ కళాభారతికి తీర్థ, క్షేత్రభారతికి వందనశతాలర్పిస్తూ ...

స్వస్తి.

# హైదరాబాద్ జిల్లా

## బిర్లా మందిరం



హైదరాబాదు - సికింద్రాబాదుకు మధ్యనగల హుస్సేన్‌సాగర్‌కు దగ్గర ఓల్డు ఎం.ఎల్.ఎ. క్వార్టర్స్ దగ్గరలోని ఆదర్శనగర్ కొండపై నున్న ఈ పాలరాతి దేవాలయములో స్వామి వారు శ్రీ వేంకటేశ్వరస్వామి బిర్లా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిర్మించబడిన ఈ దేవాలయంలో ముందుగా భక్తులకు దర్శనమిచ్చేది ఎత్తైన నల్లని గరుత్మంతుని విగ్రహం. ఇటు భక్తులను, అటు పర్యాటకుల్ని ఆకర్షించే ఈ దేవాలయమునకు కుల, మత, వర్ణ విభేదము లేకుండా భక్తులు తరలి వస్తారు. విశాలమైన ప్రాంగణంతో, ప్రశాంత వాతావరణం, చల్లని హుస్సేన్ సాగర్ గాలి కలిగియున్న ఈ దేవాలయం జంటనగర వాసులకు బిర్లా ట్రస్ట్ వారు అందజేసిన గొప్ప కానుక, దేవాలయ ప్రదక్షిణ చేసి లోపలి వేంకటేశ్వరస్వామి విగ్రహము చూసిన వారికి తిరుపతి వేంకటేశ్వరస్వామిని సాక్షాత్తు ఈ దేవాలయములో చూసిన అనుభూతి పొందుతారు.

## జూబ్లీహిల్స్ - పెద్దమ్మ దేవాలయం



వేల సం॥ల చరిత్రగల ఈ తల్లి 7 ఎకరాల స్థలంలో విస్తరించిన సనాతనమైనది. జంటనగరాలలోని అతిప్రాచీన, పెద్ద దేవాలయాలలో ఈ తల్లి ఆలయం ఒకటిగా చెప్పబడు తుంది. ప్రక్కన చిన్నపెద్దమ్మ గుడి వుంది. ఇది 150 సం॥ దిగా చెబుతారు. ఈ ఆలయం చూడముచ్చటగా రూపొందింది. ఇక్కడి ధ్వజ స్తంభం ముందుగల పీఠభాగంపై రూపాయినాణెం నిలబెట్ట గల్గితే వారి కోర్కెలన్ని సిద్ధిస్తాయని చెబుతారు.

ఈ పెద్దమ్మతల్లి కరుణ, చలువ కోరుతూ నిత్యం అభిషేకాలు, కుంకుమార్చనలు జరుగుతాయి. దసరా ఉత్సవాలు, శాకంబరి ఉత్సవాలు జరుగుతాయి. నాగదేవ తాలయంలో నాగదోష పూజలు, రథసప్తమినాడు రథోత్సవం, చండిహోమం, అన్నదానం, బలిహరణం వగైరాలు జరుపబడుతాయి. కోరేవారి కొంగుబంగారంగా ఈ పెద్దమ్మ తల్లి నిలిచి కాపాడటం, స్మరించదగ్గ దర్శించదగ్గ అదృష్టంగా తలవాలి. గర్భాలయం వెనుక నవదుర్గల ఆలయముంది. అందులో శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రిలను మనం దర్శించవచ్చును.

## బేగంపేట - కట్టమైసమ్మ మహలక్ష్మి

లోయర్‌టాంక్‌బండ్ వద్దగల శ్రీకనకాలకట్టమైసమ్మ ఆలయం. పురాతన ఆలయాలలో ఒకటి. ఈమె శ్రీమహాలక్ష్మి అవతారమని భక్తుల విశ్వాసం. నిజాంకాలంలో సుమారు 1835 - 40 మధ్య ఇక్కడ అమ్మవారు వెలసినట్లు చెబుతారు. 1907లో వచ్చిన వరదలకు ఇక్కడ గంగపూజ చేయడంతో ప్రమాదం తప్పిందని అప్పటినుండి ఇప్పటివరకు అటువంటి ఉపద్రవం ఏర్పడలేదని ఇది కట్టమైసమ్మతల్లి మహిమయని భక్తుల పరిపూర్ణ నమ్మకం. సుమారు 33 ఏళ్ళనాడు హైదరాబాదు పబ్లిక్‌స్కూల్ కడుతున్న సమయంలో కాంట్రాక్టరుకు కట్టమైసమ్మతల్లి కలలో కనుపించి తనకో ఆలయం కట్టించమని, మిమ్మల్నిందర్నీ సదా సంరక్షిస్తానని చెప్పడంతో, ఆ కాంట్రాక్టరు చిన్నదేవాలయం కట్టిస్తాడు. ఆ తరువాత కాలంఎన్నో మార్పులు, చేర్పులతో ఈనాడు సకలకళాశోభితమై విరాజిల్లుతోందీ భక్తకల్పవల్లి.

## బాల్కంపేట - ఎల్లమ్మతల్లి

'ఎల్లమ్మతల్లి' అంటే పరుశురాముని తల్లి జమదగ్నిమహర్షి, భార్య రేణుకాదేవి. ఈతల్లిని దశమహవిద్యలలో ఒకరైన ఛిన్నమస్తాదేవి అని కూడ పిలుస్తారు. అలాగే బాలాత్రిపురసుందరి. ఈ తల్లిని బాలా, బాలాంబికా, బాలకాంబికా అని వారివారి అభీష్టాన్ని బట్టి పిలుచుకుంటారు. ఇక్కడ ఆ తల్లి వుండటంతో ఈ ప్రాంతాన్ని 'బాలకమ్మపేట'గా, తరువాతి కాలంలో 'బల్కాంపేటగా' పిలువబడుతుంది. ఇక ఎల్లమ్మదేవత ఒక భూమికి 70 అడుగుల దిగువున శయనరూపంలో తూర్పున చూస్తూ స్వయంభువుగా దివ్యప్రభలతో విరాజిల్లుతూ భక్తజనులచేత ఆరాధింపబడుతుంది. 700 సం॥కు పూర్వమే ఈ ఆలయం ఇక్కడ వున్నట్లు చెప్పుకుంటారు. ఈ ఎల్లమ్మతల్లికి వెనుకగల బావినుండి జలవూట ఉద్భదిస్తుంది. దీనిని తీర్థంగా సేవిస్తారు. ఈ తీర్థసేవనం సర్వరోగ, పాపనివారణిగా భక్తులు తలుస్తారు.

నిజాంల కాలంలోను, ఆ తరువాత 1919 సం॥లో బెహలుగాన్ గూడాగా పిలువబడే ఈ ప్రాంతంలోని ఎల్లమ్మ ఆలయాన్ని శ్రీరాజా శివబహద్దూర్ పునర్మిర్మాణ కార్యక్రమాలు చేపట్టి, ఈ ఆలయాన్ని పునరుద్ధరించడంతో పాటు మరో ఆలయం పోచమ్మతల్లి (శీతలాదేవి)ని క్షేత్రపాలకురాలిగా ప్రతిష్ఠించడం జరిగింది. ఇప్పుడు ప్రతినిత్యం రద్దీగా వుంటుంది. ఆషాఢ, దసరాలలో ఈ తల్లికి అత్యంత వైభవంగా ఉత్సవాలు జరుగుతాయి. తప్పక చూడాలనే ఆశ ప్రతిఒక్కరిలో కనబడుతుంది.

## వాసవీ కాలనీ - అష్టలక్ష్మి దేవాలయం

కంచికామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జయేంద్రసరస్వతి వారి ప్రేరణతో, వాసవీకాలనీలోని వారంతాకలసి శ్రీఅష్టలక్ష్మిదేవాలయం, తమిళనాడు రాష్ట్రం ఉత్తరమేరూరులోని, చెన్నయ్ అడయారులోని అష్టలక్ష్మీదేవాలయాలను దర్శించి ఆ ప్రకారంగా ఇక్కడ మహాద్భుతంగా శ్రీ అష్టలక్ష్మిదేవాలయాన్ని నిర్మించడం, 1996 ఏప్రియల్ 28న ప్రతిష్ఠాదికార్యక్రమాలు జరగడం జరిగింది. ఆ తర్వాత అభయవినాయకస్వామిని ప్రధానాలయంలో మనం



చూడవచ్చును. ప్రధాన గర్భాలయం చుట్టు మరో ఏడు ఉపాలయాలున్నాయి. ప్రధాన ఆలయం ఆదిలక్ష్మిసమేత శ్రీమన్నారాయణుడు, మిగిలిన ఏడు ఆలయాలలో శ్రీసంతాన లక్ష్మీ, గజలక్ష్మీ, ఐశ్వర్యలక్ష్మీలు వరుసగా కొలువుదీరారు. గర్భాలయ శ్రీమన్నారాయణుడు సాలగ్రామ మాల ధరించి నందువలన సర్వపాపవిమోచనునిగా శ్రీస్వామిని కీర్తిస్తారు. ఇప్పటిదే అయినా నిత్యోత్సవ పూజ, అర్చనాది ఇతర పర్వదిన ప్రత్యేక కార్యక్రమాలతో అలరారే శ్రీలక్ష్మీనిలయం ఈ అష్టలక్ష్మీ దేవాలయం.

దిల్‌షుఖ్‌నగర్‌లోని శ్రీ షిర్డిసాయి ఆలయం, నాగోలు జైపురి కాలనీ శివపురిలోని శ్రీ కాశీవిశ్వేశ్వరాలయం, బిర్లావారి శ్రీవేంకటేశ్వరమందిరం, సంఘి వారి శ్రీవేంకటేశ్వరుడు, చూడ తగ్గవి. ఈనాటివని నిరసించలేము. ప్రతిష్ఠ ఇప్పటిదే అయినా, దైవం సనాతనుడు, సదా తరింపచేయువాడు.

**సీతారాంబాగు రామాలయానికి** 400 సం॥ల చరిత్ర వుంది. ప్రధాన రహదారిపై కోటగోడలోపల గల ప్రధానాలయమిది. 16 స్తంభాలుగల ఆలయం మంటపంతో విలసిల్లే ఈ సీతారాంబాగ్ శ్రీరామాలయం ఏడు ఎకరాల విస్తీర్ణంలో వున్నట్లు చెబుతారు. ఇక్కడ మొదట శ్రీగణేశుని దర్శించి, అనంతరం శ్రీరామదర్శనం చేయడమొక ఆచారం. ప్రధానాలయంలో శ్రీరాముడు శ్రీసీతాలక్ష్మణ, భరత, శత్రుఘ్నసమేతుడై పట్టాభిషేక మూర్తిగా దర్శనమిస్తాడు. ఇక్కడ శ్రీరామాలయంలో 3 సోపానాలున్నాయి. మొదటి మెట్టుపై రామాదులు, రెండవ దానిపై రాధాకృష్ణులు, మూడవ మెట్టుపై సాలిగ్రామాన్ని చూడగల్గుతాము.

ఇక్కడి మరో ప్రత్యేక ప్రదేశంలో గరుడాళ్వార్, వానికెదురుగా శ్రీ తాయారుసమేత పెరుమాళ్ళను మనం చూడగల్గుతాము. ఇంకా ఇక్కడ శివాలయం, ఆంజనేయ, శ్రీగణేశాలయాలు, బ్రహ్మ, ఆండాళ్, వరదరాజస్వామి అయిదుగురు ఆళ్వార్‌ల ప్రత్యేక ఉపాలయాలున్నాయి. శ్రీసీతారాముల దర్శనానంతరం, ఈ ఆలయాలను భక్తులు శ్రద్ధగా దర్శిస్తారు. రాజస్థాను నుండి వచ్చిన శేఠ్ ఈ ఆలయపునరుద్ధరణ కార్యక్రమం చేపట్టి తన భక్తిని ఆలయరూపములో మనకందించారు.

## శ్రీభాగ్యలక్ష్మి అమ్మవారు - చార్మినారు

ఇది పాతబస్తీలో చార్మినారుకు అతి సమీపంలో వున్న అత్యంత పురాతనమైన ఆలయం. ఈ తల్లి వల్లనే ఈ ప్రాంతానికి భాగ్యనగరమని పేరువచ్చిందని చెబుతారు. అంతేగాకుండా శతాబ్దం క్రిందట గోల్కొండను పాలించిన నిజాం నవాబులు ఈ ప్రాంతాన్ని భాగ్యవతిపురమని పిలిచేవారు. ఇక్కడి విశేషం ఒకసారి అమ్మవారు ఒక సైనికుడికి దర్శనమొసగి ఫలానా వ్యక్తిని తీసుకురమ్మంటే, ఆ ప్రత్యేక వ్యక్తిని రాజుగారు వస్తున్నారు వారు వచ్చేవరకు ఇక్కడే వుండమని చెప్పి, వుంటానని ఆతల్లితో మాట తీసుకుని రాజుగారికా విషయం చెబితే, ఆతల్లి శాశ్వతంగా

తమవద్ద వుండాలని తలచిన ప్రభువు ఈ సైనికుని ఉరితీయించడంతో, భాగ్యలక్ష్మి తల్లి ఇక్కడే వుండిపోయిందని, ఈ పాత జీర్ణాలయాన్ని 1975 సం॥లో పునరుద్ధరించారని స్థానికులు తెలుపుతారు.

**జారాలండ శ్రీమహంకాళి ఆలయం** దశాబ్దాల చరిత్ర కల్గినది. ఆ రోజుల్లో ఈ ప్రాంతం కూరగాయలు సరఫరా ప్రాంతంగా వుండేది. ఇలా కాలం గడుస్తుంటే బందిఖానాలో వుంచిన పశువులు అనారోగ్యం పాలవుతుంటే బస్తీ పెద్దలు రావిమొక్కనాటి దానిముందు అమ్మవారిని వుంచి పూజించడం జరిగింది. అలాగే 1908 సం.లో మూసీకి వరదలు వచ్చి ఆప్రాంతాలను అల్లకల్లోలం చేస్తుంటే ఇక్కడి వారి ఆచారం ప్రకారం సాలార్‌జంగ్ అమ్మవారికి పూజలు చేసినట్లుగా చెబుతారు. అంతటి విశిష్ఠమైన ఆలయం ఇప్పుడు నిత్యపూజలు, ఆషాఢ బోనాలతో అంగరంగవైభోగంగా పూజలు పొందుతుంది.

**లాల్‌దర్వాజాలోని మహంకాళీ** ఆలయానికి 400 సం॥ల చరిత్ర వుంది. ఈ తల్లి మహిమలు ఇచ్చటి వారందరికి తెలుసు. నిత్యం భక్తులతో కిటకిటలాడే ఆలయం ప్రత్యేక పర్వదినాలలో మహోత్సాహంతో భక్తజనులతో విరాజిల్లుతుంటుంది.

19వ శతాబ్దంలో తానీషా ఆస్థానంలో మంత్రులుగ పనిచేసిన శ్రీ అక్కన్న, మాదన్నలు నిర్మించిన ఆలయం, అలాగే గోల్కొండకు వెళ్ళే ప్రతిసారి ఇక్కడికి వచ్చి ఈ తల్లిని సేవించుకుని వెళ్ళేవారుట. ప్రతి సం॥ ఇక్కడ జరిగే ఉత్సవాలు, వివిధ ఆలయాలలో ఘటాలను అలంకరించి, శ్రీకాశీవిశ్వనాధాలయం శాలిబండ నుండి ఊరేగింపుగా ఇక్కడికి తీసుకువచ్చి జరిపే బోనాల పండుగ, చెప్పడంకన్న చూసి తరించగల్గడమొక అదృష్టమనే చెప్పాలి.

**బంజారాహిల్స్‌లో** అతి పురాతనంగా చెప్పే **శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం,** ఇస్కాన్ వారు దత్తత తీసుకుని నిర్వహిస్తున్నారు. అలాగే ఇక్కడ పూరీని పోలిన **జగన్నాథ ఆలయం**, ఇప్పటికాలంలో నిర్మించి, జగన్నాథుని చూసిన తృప్తిని కల్గిస్తున్నారు.

**దిల్‌సుక్‌నగర్** లోని **కనకదుర్గా దేవాలయం** పౌర్ణమినాడు జరిపే చండి హోమాలు, ఇతర అర్చనలతో ప్రతి నిత్యం వందలాది మంది దర్శించుకుంటూంటారు.

ఇంకా ఇక్కడ **రామకృష్ణాపురం** లోని అష్టలక్ష్మి ఆలయ సమీపంలో **కుర్తాళం పీఠంలో శ్రీ ప్రత్యంగిరాదేవి ఆలయం** చూడగల్గుతాము. త్రిమూర్తులకే అసాధ్యమైన రాక్షస వధను చేసిన తల్లి ఈ శ్రీప్రత్యంగిరాదేవి. ఈ తల్లిని ఆయాకాలాలలో శ్రీరాముడు, ఆంజనేయుడు, కృష్ణుడు, ధర్మరాజు, నరకాసుర, జరాసంధ, ఇంద్రజిత్తాదులు పూజించి వారివారి కార్యక్రమాలలో విజయులైనట్లు చెబుతారు.

ఈ తల్లిని మానససరోవరంలో 'కృత'గాను, తమిళనాడులోని కుంభకోణంలో 'నికుంభలాదేవి'గాను (రామాయణంలో ఈ తల్లి ప్రస్తావన వుంది), పూజలందుకుంటుంది. ఇంకా కాళీ, తార, చిన్నమాస్తా, త్రిపుర, భైరవి, భగళముఖి, ధూమవతి, మాతంగి, షోడశి, కమలాత్మిక మొ॥గు దేవతలను ఇక్కడి ఆలయంలో ప్రతిష్ఠించారు. శనిదోష ప్రభావులు ఈ తల్లిని పూజిస్తే సుఖశాంతులతో వర్ధిల్లుతారు. ఈ తల్లి ఏదైనా ప్రసాదించగలదని, దుష్టగ్రహ పీడలు బాధలు శమింపచేస్తుందన్నది భక్తుల విశ్వాసం. ఈ ఆలయంలో నిత్యపూజలతోపాటు, ప్రత్యేక పూజలు కూడా భక్తజనుల సంక్షేమార్థం నిర్వహిస్తున్నారు.

## కల్పగూరు - శ్రీకాశీవిశ్వేశ్వరాలయం

10, 11 శతాబ్దాలలో ఆంధ్రదేశాన్ని పాలించిన కాకతీయ ప్రభువుల కాలంలోనిర్మించినట్లు చెప్పబడే ఈ ఆలయప్రాంగణంలో శ్రీకాశీవిశ్వేశ్వరాలయంతోపాటు, శ్రీవేణుగోపాల, అనంతపద్మనాభస్వామి ఆలయాలు కూడా వున్నాయి. ఎనిమిది స్తంభాల నంది మంటపంలో నందీశ్వరుడు వున్నాడు. శిల్పకళావైభవంతో అలరారే ఆలయంలో పూజలు, ఉత్సవాలు, పర్వదినాలలో అర్చనాదులు .. షరా.. మామూలే.

## జియాగూడా శ్రీరంగనాథుడు

ఇక్కడి శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని 400 సం॥ల క్రితం విశిష్టాద్వైతపీఠాధిపతులు శ్రీ వనమామలై జియ్యర్‌స్వామి ఇటువైపురాగా 'ముచికుందనది'గా పిలువబడే మూసీ నది కొంతప్రాంతం విడిదిగా ఇచ్చారుట. అప్పుడు తనతో శ్రీరంగంనుండి తెచ్చిన శ్రీరంగనాథుని ఇక్కడ ప్రతిష్ఠించారు. అప్పటినుండి దానిని 'జియ్యర్ గూడె'మని పిలువడం ప్రారంభించారు. రానురాను అది జియాగూడాగా మారిపోయింది.శ్రీరంగనాయకుడిగా వుండే స్వామి ఇచ్చటి భక్తజనులకు కల్పవృక్షమయ్యారు. ఇచ్చట శ్రీస్వామితోపాటు శ్రీదేవి, భూదేవి, నీలాదేవిలున్నారు. ఇచ్చట శ్రీఆంజనేయస్వామితోపాటు వైష్ణవాలయాలలో మనం చూడని నవగ్రహ మంటపాన్ని చూడవచ్చును. వివిధ సమయాలలో జరిపే వివిధోత్సవాలను భక్తిపూర్వకంగాను దర్శించవచ్చును.

**చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరుడు :** ఇతడు పురాతనుడు.సనాతనుడు, సదా పూజింపదగువాడు అయితే ఆలయమే నవీనం. నవీన శోభలతో, పలుఉత్సవాలుతో భక్తజనులకు పారవశ్యం కలిగించేది.

**బి. హెచ్. ఇ. యల్** : బి. హెచ్. ఇ. యల్‌కు 4 కి.మీ దూరంలోని **శ్రీపంచముఖ గాయత్రీ ఆలయం**, అమ్మవారు బంగారు, ఇంద్రనీల, వజ్ర, ధవళ వర్ణాలతో, ప్రతిముఖానికి మూడేసి కళ్ళతో వరద, అభయ, అంకుశ, కుశకుసా, శుభ్రకపాలం, గద, శంఖ, చక్ర ఆయుధాలతో ప్రసన్నవదనంతో హంసవాహినియై దర్శనమొసగే తల్లి దర్శనం అద్భుతం, మహాద్భుతం. గాయత్రి మంత్రాన్ని లోకాలకు తెలియచేసినవారు విశ్వామిత్రులు. నిర్గుణోపాసనతో మంత్రశక్తిని పొందినవారు శ్రీవశిష్ఠులు.

ఇక్కడి **పంచముఖ శివుడు** – సద్యోజాత, వామదేవ, ఈశాన, తత్పురుష, అఘోరమూర్తియైన పంచముఖుడు. ఇంకా ఇక్కడ పంచముఖ ఆంజనేయులు, నరసింహ, హయగ్రీవ, గరుత్మంత, వరాహ రూపాలతో ప్రకాశిస్తూ భక్తజన కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు.

అలాగే **ఫిల్మునగర్‌లోని శ్రీకనకదుర్గ మాత ఆలయం, కుకట్‌పల్లిలోని శ్రీ అయ్యప్ప దేవాలయం, ఇసామియా బజారు**లోని చెప్పుకోదగ్గ **త్రిశక్తి ఆలయం**, చాలాపురాతనమైనదిగా చెప్పే **కుకట్‌పల్లి శ్రీబాలాంజనేయస్వామి** 400 సం॥ల క్రితమే నిర్మింపబడినదని చెబుతారు. ఒక శిలగా దర్శినమిచ్చిన స్వామికి ఆలయం కట్టి అర్చనాదులు ప్రారంభించారు. ఆ రామభక్తుడు భక్తజనదాసానుదాసుడై తన భక్తి తత్వాన్ని కర్తవ్యాన్ని నమ్మినవారికి అందిస్తున్నాడు.

హైదరాబాదులోని శ్రీకృష్ణదేవాలయాన్ని 150 సం॥ల క్రితం రాజా రఘురాం అనే భక్తుడు నిర్మించాడని, దీనిని కిషన్‌బాగ్ దేవాలయమని, భక్తజనుల అర్చనాదులు, విశేషపూజలతో ప్రఖ్యాతి పొందింది.

## సనత్‌నగర్ - శ్రీహనుమాన్ ఆలయం

మొదట్లో ఇది ఆంజనేయస్వామి ఆలయం. నూతన ప్రతిష్ఠే. రానురాను, ఎన్నో ఉపాలయాలకు, ఉత్సవాలకు, పండుగలకు కేంద్రస్థానమైన దివ్యాలయమైంది. హనుమాన్, గణపతి, శ్రీవేంకటేశ్వరుడు, శ్రీభ్రమరాంబాసమేత మల్లికార్జునుని, అలాగే అయ్యప్ప, నాగదేవతాలయం, దుర్గామాత సంతోషిమాత, శ్రీషిర్డిసాయి... ఇలాగ సర్వులు కొలువుదీరి, తమభక్తజన రక్షణాదీక్షను కొనసాగిస్తున్నారు.

**అమీరుపేట** హనుమంతుడు ప్రాచీన దేవునిగా ప్రసిద్ధి పొందాడు. కాకపోతే 1970 సం॥లో ఇక్కడ శ్రీరాజరాజేశ్వర, రాజరాజేశ్వరీ దేవతలను ప్రతిష్ఠించారు. ఇంకా ఇక్కడ, గణపతి, వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యుడు, తన దేవేరీలతో శ్రీవేంకటేశ్వరుడు, సాయిబాబా, శ్రీదత్త, నవగ్రహమంటపాలు శ్రీవేణుగోపాలస్వామి, వరుసగా ఒక్కటొక్కటిగా ప్రతిష్ఠించి, భక్తజనులకు ఆనందం కల్గించారు.

## బి.హెచ్.ఇ.యల్. శ్రీరామాలయం

ఇది రామదాసును చెరవిడిపించడానికి వచ్చిన రామలక్ష్మణులు, ఇక్కడినుండే తానీషావద్దకు వెళ్ళి ఆయన బాకీ తీర్చిరని, అక్కడ శ్రీరామాలయం నిర్మించారు. హిందువుల పరదైవమైన శ్రీరామునితోపాటు ప్రక్కప్రక్కనే చర్చి, మసీదులు కూడా నిర్మింపబడ్డాయి. పరమత సహనం మనకున్నా, అది అవతలివారికి కూడా వుండాలి. అంతటి విశిష్ట సాంప్రదాయంగలదీ భరతభూమి.

"ముచుకుంద నది" అనగానే ఇదెక్కడిది? అని అనుకుంటారు. కృష్ణకు ఉపనదియైన 'మూసీనది' పేరని చాలా మందికి తెలియదు. **ఉస్మాన్‌షాహి (విఠల్‌నగర్)** ప్రాంతంలో గల **పాండురంగ దేవాలయం** ఇప్పటిది కాదు. రెండు శతాబ్దాలనాటిది. దీనిని శ్రీగున్నాజి మహరాజ్ నిర్మిస్తే, ఈ ఆలయానికి సయ్యద్ హుస్సేన్‌ఖాన్, బహద్దూర్ స్థలాన్ని ఇచ్చాడు. ఇందుకుగల కారణం పరమత సహనం ఒక్కటేకాదు, పురుష సంతానం లేని హుస్సేన్‌ఖాన్‌కు పాండురంగని ఆశీస్సులతో గున్నాజీ మహరాజు ప్రార్థనతో పురుషసంతానం కలిగింది. అందుకు స్వామికి కృతజ్ఞతగా ఆలయానికి కావల్సిన స్థలాన్ని సమర్పిస్తాడు.

ఇంకా ఇక్కడ ఆంజనేయస్వామి, నవగ్రహ, శివపార్వతుల ప్రతిష్ఠలు జరిగాయి. మాణిక్యప్రభు సంస్థాన పీఠాధిపతి శ్రేష్ఠమనోహర ప్రభువు వంటి ప్రముఖులెందరో ఈ ఆలయాన్ని సందర్శించారు. ప్రార్థనలు చేసారు. కాకపోతే 1908 సం॥లో వచ్చిన మూసీవరదల్లో దేవాలయం కొంత దెబ్బతింది. దీనిని 2003 సం॥లో పునరుద్ధరించి భక్తజనుల పూజార్థం అందించబడింది.

**గచ్చిబౌలిలోని శ్రీరంగనాథస్వామి ఆలయం** ఒకప్రక్క ప్రాచీనమైనదంటూ మరొక ప్రక్క 50 సం॥ల క్రితం నిర్మించబడినదిగా చెబుతారు. ఏమైనా ఇక్కడి ప్రధాన దైవము శ్రీమహావిష్ణువు. ఇచ్చటి బ్రహ్మోత్సవాలేకాదు. ఈ ఆలయాన్ని మతాతీతంగా దర్శించుకుని సకల శుభాలు భక్తులు పొందుతున్నారని చెబుతున్నారంటే ఈ ఆలయ విశిష్టతను మనం అర్థం చేసుకోవచ్చును.

బాపూఘాట్‌కు సమీపంలోని **లంగరుహౌస్‌లోని** 800 ఏండ్ల చరిత్రగల్గిన **శ్రీవిజయరాఘవస్వామి దేవాలయం** ఎంతో ఘనమైనదిగా చెబుతారు. రామదాసుని చెరవిడిపించడానికి, తానీషాకు కట్టవలసిన పైకం కట్టి తగు రసీదుతో స్వామి ఈ ప్రాంతానికి వచ్చి ఇక్కడవుండిపోయాడని చారిత్రక, పౌరాణిక గాధ చెబుతారు. సీతాలక్ష్మణులతో రాముడిని ఇక్కడ దర్శించగల్గుతాము. ఇంకా ఇక్కడి విశేషం ఒకే గర్భాలయంలో దక్షిణాన నరసింహస్వామి, ఉత్తరాన శ్రీకృష్ణమూర్తి తూర్పున శ్రీ సీతాలక్ష్మిసమేత రఘునాయకులను దర్శించగల్గుతాము. ఇంకా ఇక్కడ శ్రీవేంకటేశ్వరుడు, పంచముఖ హనుమాన్ సిద్ధిబుద్ధి సమేత స్వర్ణమయ వినాయకుడు, శివాలయంలోని శివుడు 'స్ఫటికలింగడి'గా ప్రసాదించే దర్శనం భక్తాభీష్టదాయకం. ఆనందప్రదాయకంకూడా.

## జిల్లెంగూడ శ్రీవేంకటేశ్వరుడు

500 సం॥ల అద్భుత చరిత్ర కలిగిన ఈ ఆలయానికేకాదు స్వామికికూడా అద్భుతమైన ప్రత్యేకత వుంది. స్వామి శరీరము మత్స్యావతారాన్ని పోలివుంటే శిరస్సు శివలింగాకారంలోవుండి, శివకేశవులు ఒక్కటేననే పరమసత్యమిక్కడ ప్రత్యక్షంగా దర్శించగల్గుతాము. అందుకే దీనిని హరిహరక్షేత్రమని కూడా అంటారు. ఈ వేంకటేశ్వరుడు ఎప్పుడు ఉత్తరాభిముఖుడై తనను చేరిన భక్తుల కోర్కెలు తీర్చి మోక్షాన్ని ప్రసాదిస్తాననే తన తత్త్వం తెలియబరుస్తున్నట్లుంటుంది. ఇక కార్యక్రమాలు ప్రతి ఉత్సవం, పండుగ పండుగే. నిత్యపూజలతోపాటు బ్రహ్మోత్సవాలు, శ్రవణానక్షత్ర ధనుర్మాసాది పూజలు చూసి తరించవచ్చును. పాల్గొని పరవశింపవచ్చును.

## రామకోఠిలోని శ్రీశక్తి గణపతి ఆలయం

వివిధ రకాల గణపతులను నయనానందకరంగా దర్శించవచ్చును. ఇచ్చటి గణపతి నవరాత్రులు చూసి తీరవలసినదే తప్ప వర్ణించశక్యంకాదు. నవరాత్రుళ్ళలో లక్షపుష్పాలతో సువర్ణపుష్ప గణపతి, కోదండరామ, శ్రీవేంకటేశ్వర, ఫల, శ్రీలక్ష్మీనరసింహ, మహారాజదద్ధోజనం గణపతి, రాధాకృష్ణ గణపతులను నయనానందకరంగా దర్శించగల్గుతాము. ఇచ్చటి ప్రతి పూజ అర్చనాభిషేకాలు, హోమాలు చూడటం మేలు, పాల్గొనడం పరమానందమనే చెప్పాలి. పాల్గొనాలికూడా!

## కాలసంహార (శివ)మూర్తి మందిరం, పురానాపూల్

జూపార్కుకు వెళ్ళే దారిలో, మూసీనది ఒడ్డున వున్న ఈ మందిరానికి ఎన్నో వందల సం॥ల చరిత్ర వుందని చెబుతారు. ఈ స్వామిని సేవిస్తే అపమృత్యుభయం తొలగుతుందని, అష్టసిద్ధి – నవనిధుల నిధియైన శివుడు భక్తజన దారిద్ర్యాన్ని తొలగిస్తాడని ఇక్కడి గణపతి సర్వాభీష్టప్రదాతని, సుబ్రహ్మణ్యస్వామి వివాహసంతానాలు ప్రసాదిస్తాడని అత్యంత విశ్వాసంతో భక్తులు వచ్చి స్వామిని సేవించుకుంటారు. ఇక్కడ శ్రీ ఆంజనేయుడు నవగ్రహాలు కూడా వుండి, తమ అభయహస్తాన్ని భక్తులకు అందిస్తున్నారనడంలో ఆశ్చర్యంలేదు.

ఇక్కడి మరో ఆలయం 400 సం॥నాటిదని చెప్పే **శ్రీరంగనాథస్వామి దేవాలయం.** ఇంకా అసలీ ఆలయం జనయేజయుడునాటిదని ఇచ్చట కశ్యపప్రజాపతి ఇక్కడకు వచ్చి యజ్ఞం చేసారని ఆ ప్రాంతమునే ఈ ఆలయ

నిర్మాణం జరిగిందని స్థలపురాణం ద్వారా తెలుస్తుంది. దీనిని శ్రీరంగనాధనగర్ అని కూడా అంటారు. జల–భూగర్భ గుహ గృహ అంతరాలయం మండపంలో శ్రీరంగ నాధుడు పడుకుని శ్యామల వర్ణంలో చూడముచ్చటగా వుంటాడు. శ్రీదేవి, భూదేవి, గోదాదేవి, ఆళ్వారులతో అచ్చం శ్రీవైష్ణవ మూర్తిగా ఇచ్చే స్వామి దర్శనం అందరికి ఆనందదాయకం. ఉత్సవాలన్ని యధాప్రకారం 'అంగరంగవైభోగంగా జరుగుతాయి.

## మెహదీపట్నం శ్రీగణపతి పంచాయతన ఆలయం

గాంధీనగర్, యస్.బి.ఐ కాలనీలోని శ్రీపరమేశ్వర రామాలయం, చూడగల్గుతాము. ఇక్కడి శ్రీసహస్ర పూర్ణ లింగేశ్వరస్వామి రధాకారంలో నిర్మించబడటమొక విశేషం. ఇంకా ఇక్కడి విజయగణపతి, సుబ్రహ్మణ్యస్వామి, మనచింతలను తీర్చే సిద్ధిబుద్ధి ప్రదాతలు. శ్రీరాజరాజేశ్వరి, శ్రీపట్టాభిరామచంద్రస్వాములు, భద్రాచలంలోని ఆలయమూర్తులవలె దర్శనమిస్తారు. ఇక్కడి దాసాంజనేయుడు క్షేత్రపాలకుడు. చూడవలసిన దేవాలయం.

## ఎల్లారెడ్డిగూడ - శ్రీఆంజనేయస్వామి



మనదేశంలో ప్రాచీన ఆలయాలకు, వారిని సేవించుకునే భక్తులకు కొదువలేదు. రెండు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. అందుకు నిదర్శనం మన దేవుళ్ళకన్న స్వాములు, పీఠాధిపతులు, యోగులకన్న బాబాలు, భక్తజన హృదయచోరులు... విశేషంగా అడుగుఅడుగున దర్శనమిచ్చి ధన్యులను చేసేవారు కొందరైతే, వీరితో సమానంగా నట్టేట్లో ముంచేవాళ్ళను గూడ చూడగల్గుతాం. సరే. ఇక ఎల్లారెడ్డి గూడలోని ఆంజనేయస్వామి, ఎప్పటివాడో తెలియదుకాని, సర్వ దేవతా మంత్రస్వరూపుడైన ఈ స్వామి సేవనం, సకలాభీష్టదాయకమే కాదు, సర్వానందప్రదాయకము. ఇక్కడ ప్రధాన దైవం ఆంజనేయ స్వామి అయినా నైఋతిలో గణపతి వాయవ్యంలో సుబ్రహ్మణ్యుడు, పశ్చిమాన శివపంచాయతనం, అలాగే నాగదేవత, నవగ్రహాలు, అయ్యప్ప వగైరా దేవతలందరు భక్తజనకామ్యక ప్రదాతలుగా దర్శనమిస్తున్నారు.

**దిల్‌సుఖ్‌నగర్‌లోని** కోదండరామనగర్‌లోని **శ్రీప్రసన్నాంజనేయుడు** భక్తపరాధీనుడు. చెడువున్నచోట్ల దాని నాశనానికి ముందుండే శ్రీప్రసన్నాంజనేయుడితో, భూతగణాధిపతి, భక్తాభీష్టప్రదాతయైన శివుడు కూడా భక్తజనులను తరింపచేయ సంసిద్ధంగా నిలిచారు.

**కొత్తపేటలోని వాసవీకన్యకాపరమేశ్వరిదేవాలయం** లో అమ్మవారితోపాటు, 102 స్తంభాలమీద 162 గోత్రాలవారి చరిత్రతో సుందరాతిసుందరంగా నిర్మించారు. ఇంకా ఇక్కడ త్రిమాతలు, శ్రీపార్వతీసహిత శ్రీనగరేశ్వరస్వామి, ఆంజనేయ, నవగ్రహాలు కన్నులారా దర్శించి మహదానందమొందగల్గుతాము.

**వనస్థలిపురంలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయం** చూడదగ్గది. ఇప్పటిదే అయినా, ఎప్పటిదో అన్నట్లు నిర్మించారు. ప్రత్యేకంగా వెళ్ళి చూడవచ్చును. సావకాశం దొరికి చూడటానికి వెళ్ళికూడా చూడవచ్చును.

## షేక్ పేట - శ్రీఆంజనేయస్వామి

స్వామి స్వయంభువు అని, ఇది జాబాలి మహర్షి కాలంలోనిదని స్థలపురాణం చెబుతోంది. ఒకప్పుడిది చిన్న ఆలయం అన్నింటిలాగే తరువాతి కాలంలో పెద్దగా, హంగులు చేర్చుకుంది. ఇక్కడి రెండు ఆంజనేయ విగ్రహాలున్నాయి. స్వామిని పూజించామంటే ముందుగా రెండో విగ్రహానికి పూజించి, ఆపైన ఆలయంలోని మూలవిరాట్టును పూజించాలి. ఇది వినాయకుడి పూజను తలపింపచేస్తుంది. విఘ్ననాయకుడైనా ముందు పసుపు వినాయకుడిని పూజించి, ఆతదుపరి యధావిధి మిగిలిన పూజాకార్యక్రమం నిర్వహించాలి. ఇక్కడ ఆంజనేయస్వామిదీ ఇదేతంతు. ఇక్కడి శ్రీమల్లికార్జునస్వామిని సేవిస్తే పునర్జన్మ వుండదుట. కనుక స్వామిని దర్శించి, తరిద్దాం.

**యూసఫ్‌గూడాలోని శ్రీ షిరిడిసాయిబాబా మహాలక్ష్మి దేవాలయం**. ఇందులో మహాలక్ష్మి పురాతనమైనది. శ్రీషిరిడిసాయి ఈనాటి సకలాగమ సన్నుత సమర్ధసద్గురువు. ఆలయంలో కుడివైపు సీతారాములు, శ్రీదత్తుడు, ఎడంవైపు శ్రీలక్ష్మీఅమ్మ, శ్రీకృష్ణుని ఆలయాలు ప్రధాన ద్వారమునందు శ్రీగణపతులను దర్శించవచ్చును. సరే. శ్రీసాయిసద్గురువు వున్న ప్రాంతం భక్తజనులతో కిటకిటలాడుతుందనేది జగమెరిగిన సత్యం కాబట్టి ప్రత్యేకప్రస్తావన అనవసరం.

**శ్రీకృష్ణనగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ శ్రీభ్రమరాంబాసమేత శ్రీమల్లికార్జునస్వామి** ఆలయం ప్రాంగణంలో ఆంజనేయుడు ఆనాటివాడు, భ్రమరాంబ మల్లికార్జునులు ఇప్పటివారయ్యారు. శివపార్వతులు ఆదిదంపతులేకాదు 'జగతః పితరౌవందే పార్వతీపరమేశ్వర"మని ఈ లోకాలకే తల్లిదండ్రులు. కనుక వీరి పూజ వలన తల్లిదండ్రులు లేక పూజలు చేయని వారు ఆ ఫలితాన్ని పొందవచ్చును. శ్రీగణపతి, కార్తికేయుడు, ఈ కలియుగంలో పుండరీకుడు, ధర్మవ్యాధుడు... ఇలాగ ఎందరో మాతాపితలను సేవించి మహోన్నత స్థితిని పొందారు. ఆ ఫలితం ఇక్కడి భ్రమరాంబమల్లికార్జునులను సేవిస్తే లభిస్తుందన్నది ఇక్కడి భక్తుల విశ్వాసం. ఇక్కడ అందరు దేవతలు ఉన్నారు. అన్ని పండుగదినాలు ఆచరించబడతాయి. కాబట్టి ఇటువంటి ఆలయదర్శనం నిజంగా అదృష్టంగా తలవాలి.

**మలక్‌పేట- యస్.బి.ఐ. ఆఫీసర్స్ కాలనీలో,** టి.వి టవర్‌కు సమీపంలో శ్రీకంచికామకోటి పీఠంవారి సారధ్యంలో నడిచే **శ్రీవేంకటేశ్వరాలయం** వుంది. ఇక్కడ శ్రీ వేంకటేశ్వరునితోపాటు, వినాయక, ఆంజనేయ, పార్వతీసరమేశ్వర, సుబ్రహ్మణ్య, నాగరాజ, దేవతలు నవగ్రహమంటపం, శివకేశవబేధం లేకుండా సర్వులకు దర్శించగల్గుతాము. ఇక్కడి విశేషం- నిత్యపూజలతోపాటు సోమవారం శివునికి, మంగళవారం సుబ్రహ్మణ్యునకు, బుధవారం వినాయకుడు, శుక్రవారం అమ్మవారికి, శనివారం శ్రీవేంకటేశ్వరునికి, ఆదివారం ఆంజనేయస్వామయికి, ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు. కనుక ఆయా రోజులలో మనం వెళ్ళి మనభక్తిని ప్రకటించుకోవచ్చును.

కేసరి హనుమాన్ దేవాలయాన్ని శ్రీసమర్ధరామదాసుగారిచే అప్పుడు ప్రతిష్ఠజరుపబడింది. ఇంకా ఇక్కడ 400 సం॥నాడు వెలిగించిన దీపాలు, అలాగే వెలుగుతుండటమొక విశేషం.ఇది భాగ్యనగరంలో మూసి నది ఒడ్డున గల మహామహిమాన్వితమైన దేవాలయంగా చెప్పబడటానికి తార్కాణం భక్తజనుల రాక పోకలే.

కొన్నికొన్ని దేవాలయాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. చిత్రంగా అంటే ఆశ్చర్యంగా వుంటుంది. మనకు 'చిత్రగుప్తునినోము' తెలుసు. ఆలయాలు అంటే, పెదవి విరవ్వాల్సివస్తుంది. అటువంటిది పాతబస్తీలోని కందికల్ గేటు ప్రాంతంలో ఆర్తులైనవారికి, అపురూప చిత్రగుప్త 250 ఏండ్లనాటిదని చెప్పే పురాతన ఆలయముంది. ఇది

నిజాం నవాబుల కాలంలో రాజాకిషన్ పర్షాన్ దీనిని అభివృద్ధి చేసారు. దీని నిర్మాణానికి రాజా వారి పూర్వీకులు కృషి చేసారని చెబుతారు. అయితే నిర్మాణ, నిర్మాతలెవరన్నది తెలియని విషయమైంది. ఈ చిత్రగుప్తుని బ్రహ్మసంతానంగా చెబుతారు. యమధర్మరాజువద్ద ఇతడువుండి, ప్రతి జీవి పుణ్యపాపాలను నిస్వార్థంగా నిర్ధారించి, ఆ రకంగా వారి కర్మలను అనుభవింపచేస్తాడు. ఇక పురాణం ప్రకారం ఆలోచిస్తే – ఒకసారి ఇందలి జీవుల పాపపుణ్యాలను లెక్కించడమెలాగ? అని ఆలోచిస్తూంటే పదకొండువేల సం॥లు గడిచిపోయిందట. తీరా కళ్ళు తెలిచేసరికి ఎదురుగా చేతిలో తాళపత్రాలు, గంటం, నడుంభాగంలో ఖడ్గం ధరించిన వ్యక్తి కనబడతాడు. అప్పుడు బ్రహ్మ నీవెవరు? అంటే మీ శరీరం (చిత్తు) లో గుప్తంగా వున్నవాడినని, అయితే చిత్రగుప్తుడివన్నమాట అని, జీవులలో నిలిచి వారి పాపపుణ్యాలు లిఖించి, కర్మలననుభవింపచేయడం నీ ధర్మం... అని విషయం చెబుతాడు.

ఇంకా ఇక్కడ పేరుకు చిత్రగుప్తుడి ఆలయమున్నా ఇంకా ఇందులో శివాలయం, ఆంజనేయ, అయ్యప్ప, సాయిబాబా ఆలయాలు, వారికి సంబంధించిన పూజాదులతో భక్తజనసమ్మతంగా వుంది. కాకపోతే ఇక్కడ చిత్రగుప్తుడికి ఎటువంటి ప్రత్యేక పూజలువుండవు. దీపావళి వెళ్ళిన మర్నాడు చిత్రగుప్తుడి పుట్టినరోజు యమ ద్వితీయనాడు, విశేష పూజలు చేస్తారు. ఈయనకు ఇష్టమైన వారం బుధవారం. చిత్రగుప్తునికి ఇద్దరు భార్యలని, పెద్దభార్య బ్రాహ్మణస్త్రీ. ఆమె పేరు సూర్యదక్షిణ నందిని. రెండవ భార్య క్షత్రియస్త్రీ శోభావతి. ఈమెకు ఎనిమిది మంది కుమారులు, కుమార్తెలు కాగా, పెద్దభార్యకు నలుగురు కుమారులు, కుమార్తెలు. మృత్యుదోషం, కేతుగ్రహ దోషనివారణలకు ఇక్కడ పూజలు జరుగుతాయి కాబట్టి భవిష్యత్తు బాగుండాలనుకునేవారు ఒకమారు దర్శించడం మంచిదని తలవాలి.

## సికింద్రాబాద్ – ఉజ్జయిని మహంకాళి



ఈ తల్లి చెప్పుకోదగ్గ దేవత. పేరు మహంకాళి అయినా, ఈ తల్లిని మైసమ్మ, ఎల్లమ్మ, రేణుకామాత, పోచమ్మ, పెద్దమ్మ, పోలేరమ్మ, మారెమ్మ, అంకాలమ్మ అని ఇంకా అనేక పేర్లుతో పిలుచుకుని పూజించి మొక్కులు తీర్చుకుని ఆనందిస్తారు. ఈ దేవాలయానికి 200 సం॥ల ఘనచరిత్ర వుంది. 1813 సం॥లో మిలటరీలో పనిచేసే సురిటి అప్పయ్య ఉజ్జయినికి బదిలీ అయ్యాడు. ఆ సమయంలో కలరా వ్యాధి ప్రబలి వేలల్లో మరణిస్తుంటే, అప్పయ్య 'అమ్మా! వీరంతా నీ ప్రజలు వీరిని రక్షించు. నీ మాతృత్వాన్ని నిలబెట్టుకో. ఇక్కడి నుండి మావూరు వెళ్ళాక నిన్నుకూడా ప్రతిష్ఠించి పూజించుకుంటానంటాడు. అతని భక్తికి అమ్మ పరవశించినట్లు కలరావ్యాధి మాయమైంది. ఆ తర్వాత సికింద్రాబాదుకు వచ్చిన అప్పయ్య, ఆతని బృందం 1815 సం॥లో ఒక చెట్టుకాండాన్ని అమ్మవారిగా రూపొందించి, ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు.

ఇలాగ వుండగా, పూర్వం ఇక్కడో బావి వుండేదిట. దాని మరమ్మత్తుల సమయంలో "మాణిక్యాదేవి" అనే దేవత విగ్రహమొకటి దొరుకుతుంది. అలా వెలిసిన ఈ దేవతలను 1864 సం॥లో సురటి అప్పయ్య ఆలయం నిర్మించి, అందులో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠింపచేస్తాడు. ఆ రకంగా ఉజ్జయినీమాత, ఇక్కడ తానై వెలసిన మాణిక్యాలదేవితో కలిసి కొలువైంది. భక్తజనులకు కొంగుబంగారమయ్యారు. ఇప్పుడాలయం సుమాటి వంశీకుల చేతుల్లో నిత్యనీరాజనాలతో నిత్యకల్యాణం పచ్చతోరణంగా వుంది.

రైల్వేస్టేషన్‌లోనే అన్నట్లున్న **శ్రీసికింద్రాబాదు గణపతి** చూడదగ్గదేకాదు, చూసి మురిసిపోదగ్గదికూడా. బ్రిటిషు వారిని ఆవేశించి, తాను ప్రతిష్ఠ అయినట్లు తెలుస్తుంది. 1824 సంవత్సరంలో బ్రిటిషు సిపాయిలు మంచినీటికోసం బావిని త్రవ్వుతున్నప్పుడు బయటపడ్డ వినాయకుడిక్కడ శాశ్వతనివాస మేర్పరచుకున్నాడు. ఈ ఆలయానికి క్షేత్రపాలకుడు శ్రీవేంకటేశ్వరుడు. లింగరూపంలో వున్న ఉమామహేశ్వరస్వామి, పార్వతీదేవి, శ్రీరాజరాజేశ్వరి, వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యుడు, ఆంజనేయ, నవగ్రహాలను కూడా మన మిక్కడ దర్శించ గల్గుతాము. ప్రధానంగా వినాయక ఆలయం కనుక స్వామిని




వేదసూక్తులతో నిత్యపూజలు పర్వదినాలలో ప్రత్యేక పూజలు, గణపతి నవరాత్రులతో పాటు, ఇక్కడున్న మిగిలిన దేవతలకు వారివారి పద్ధతిలో అర్చనాదులు జరుగుతుంటాయి.

**సికింద్రాబాద్** స్టేషనునుండి 10 కి.మీ దూరంలో గల కంటోన్మెంటు ప్రాంతంలో **శ్రీకోటేశ్వరస్వామి** వారి ఆలయం, కేవలం రాతితో నిర్మించబడిన, పురాతనమైదానిని మనం చూడవచ్చును. గర్భాలయం గుహ వలె, ఆలయంలోని శివలింగం భూమికి క్రిందభాగంలో వుంటుంది. ఈ ఆలయానికి రెండు ప్రధాన ద్వారాలువున్నా తూర్పునుండి ప్రవేశిస్తే సంజీవరాయుడు, శివలింగానికి ఎదురుగా నందిని చూస్తారు. అక్కడున్న పెద్ద వృక్షానికి గంటలు కట్టబడివుంటాయి. శిక్షణలోవున్న సైనికులు కట్టినట్టుగా చెబుతారు.

ఈ చెట్టు క్రింద యమధర్మరాజు, దుర్గామాత విగ్రహాలు, అమర్‌నాథ ఆలయనమూనా, అందులోని మంచు లింగం, మహదానందంగా చూడగల్గుతాము.

**సికింద్రాబాదు నుండి బోయినపల్లి** వెడుతూంటే రామాయణ కాలంలో జాబాలి మహర్షి ప్రతిష్ఠించినట్లు చెప్పే మూడు ఆలయాలలో, ఈ **వీరాంజనేయస్వామి ఆలయం** మొదటిది. రెండవది హృషీకేశ్‌లోను, మూడవది తిరుపతిలోను వున్నాయి. అందుకే వీటికి 'జాబాలి క్షేత్రా'లని పేరు. మహర్షి ప్రతిష్ఠించిన ఈ విగ్రహం ఇక్ష్వాకుల కాలంనాటిదని ప్రతీతి. మరుగుపడిన ఈ ఆలయం ప్లేగువ్యాధి వచ్చి ప్రజలు భయపడి పోయి,



ఇక్కడి నుండి పారిపోతుంటే, 1927 సం॥లో స్వామి కొందరి భక్తులకు కలలో కనుపిఒంచి, తన వునికిని చెప్పడంతో పునఃప్రతిష్ఠ, అర్చనాదులు జరగడంతో ప్లేగువ్యాధి పేరులేకుండా పోయింది. ఇచ్చట శివపంచాయతనం, నవగ్రహ మండటం, శ్రీ సీతాలక్ష్మణసమేత దాసాంజనేయ శ్రీరాములను ప్రతిష్ఠించి, స్వామి సేవలతో మనలనందర్నీ తరింపచేస్తున్నాయి.

**వెస్టు మారేడ్‌పల్లిలోని శ్రీసిద్ధి వినాయకస్వామి,** ఇప్పటిదే అయినా, దేవుడు ప్రధమపూజ్యుడు. చూడచక్కగా భక్తజనులకు దర్శినమొసగివారి ఆదిబాధల్ని తొలగిస్తున్నాడు. ఇంకా ఇక్కడ శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడు, నిత్యం చందన పూతతో ప్రకాశించే ఉమామహేశ్వరుడు, ఆ ప్రక్కన పార్వతి, రాజరాజేశ్వరిని చూడగల్గుతాం. ఇచ్చట చండిహోమాలు, శ్రీచక్రపూజలు, అభిషేకాలు, అర్చనలు, అన్నీ పర్వదినాలలో కొన్ని, ఇతర సమయాలలో మరికొన్ని జరుపుతున్నారు. కుజదోషం, సర్పదోషం కలవారు ఇక్కడి సుబ్రహ్మణ్యుని పూజిస్తే వివాహ మౌతుంది. నిస్సంతులకు సంతానం కల్గుతుంది.



నిజాం ప్రభుత్వ సమయంలో 1823 లో **సికింద్రాబాదుకు కి.మీ దూరంలోని శివాజీనగర్** లో అతి ప్రాచీన **శ్రీవేంకటేశ్వరస్వామిని**, ఆనాటి తహసిల్దార్ శ్రీగోవింద మొదలియార్, 1841లో ఆర్కాట్ రామస్వామి మొదలియార్ ఈ ప్రాంతాన్ని కూడా అభివృద్ధిపరచి, ఇక్కడొక కోనేరు నిర్మించడంతో, దీనికి కోనేరు వీధి అని కూడా పేరు వచ్చింది. ఆనాటి కోనేరు ఈనాడు పాడుబడింది. అయినా దాని ప్రక్కన శ్రీసుదర్శన భూవరాహస్వామి వారి ఆలయం వుంది. ఇక్కడ నవగ్రహమంటపం వుంది. బుధవారాల్లో రాహుకేతువు పూజలు కూడా జరుగుతుంటాయి.

ఈ **శివాజీనగర్**‌లోనే ఆనందభవన్ హోటల్‌కు సమీపంలో **శ్రీరంగనాధస్వామి ఆలయం** చూడగల్గుతాము. ప్రధాన ఆలయంలో స్వామి శేషశయనుడు. ఉపాలయాలలో శ్రీరంగనాయకి, ఆండాళ్ తల్లులను చూడవచ్చును. ఇంకా ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీశ్రీనివాసుడు, ధన్వంతరి, రాధాకృష్ణులను కూడా మనం చూడవచ్చును. కాని ధ్వజస్తంభంలేని ఆలయ మిదని చెప్పాల్సివుంటుంది.

ఇంకా **షిర్డిసాయి దేవాలయాలు,** అడుగడుగునా వున్నాయి. ఆ సమర్థసద్గురువు లీలావిశేషాలను ఈ సంకలనకర్త, శ్రీగురుదేవులు, 1200 పైగా ఆధ్యాత్మిక రచనల మహర్షి, బహుపురాణ గ్రంథకర్త, 63 సం॥లుగా సాయి నామం, వింటూ స్మరిస్తూ, అంటున్న శ్రీసాయి శరణా నందులు వ్రాసిన సమగ్రసాయినాథ సాహిత్యం 'శ్రీసాయిచరిత్ర'లలో చదువవచ్చును.



# రంగారెడ్డి జిల్లా

## చిలుకూరు - బాలాజీ



బాలాజీయే ప్రపంచ ప్రసిద్ధి చెందిన విశ్వాత్ముడు. ఆక ఆ రూపమే అయిన చిలుకూరు బాలాజీ వీసా – విదేశాలు చూపించే విశ్వపురుషునిగా విఖ్యాతుడు. దీనిని పురాతన ఆలయంగా కూడా చెబుతారు. ఇక్కడ ముందు 11 ప్రదక్షిణలు, కోరికతీరాక108 ప్రదక్షిణలు మ్రొక్కుగా తీర్చుకుంటారు. దీనిని 500 సం॥ల క్రితం గొన్నా మాధవరెడ్డి అనే వృద్ధ భక్తుడు తిరుపతికి వెడుతూ అలసి స్మృహతప్పితే, తిరుమలవాసుడు ఆయనను వూరడించి, నువ్వు ప్రయాసపడి నా వద్దకు రావల్సిన పనిలేదని, చిలుకూరు పొదలలో నేనున్నానని నన్ను ప్రతిష్ఠించుకుని తిరుమలవాసునిగానే నన్ను చూడవచ్చంటాడు. దాంతో మాధవరెడ్డి చిలుకూరు పొదలలో వెదుకగా శ్రీస్వామి సుందరవిగ్రహము నయనానందకరంగా కన్పించడం, ఆలయనిర్మాణం చేసి ప్రతిష్ఠించడం జరుగుతుంది. అక్కడ నుండి స్వామి మహిమలు భక్తజనుల కానందధామమయ్యాయి.

## కర్మన్‌ఘాట్ - ధ్యానాంజనేయస్వామి

నాంపల్లి రైల్వే స్టేషనుకు 15 కి.మీ దూరంలోవున్న ఈ ఆంజనేయులు భక్తజనకామితప్రదాత. ఈ స్వామి స్వయంభువు. ఆలయం అతి ప్రాచీనమైనది. భక్తులకు కొండంత అండయిన ఈ ధ్యానాంజనేయ స్వామి చెంత కోదండరాముడు, విశ్వనాధ, శ్రీనాగేశ్వర, గణపతి, సంతోషిమాత, సరస్వతి, దుర్గాదేవి, శ్రీవేణుగోపాల, జగన్నాధస్వామివార్లకు వేరువేరుగా ఉపాలయాలున్నాయి. ఇక స్వామిని రెండవ ప్రతాపరుద్రుడు నుండి ఔరంగజేబు వరకు ఎందరో సేవించి తరించారు.

కాకతీయ రెండవ ప్రతాపరుద్రునకు వేటంటే అత్యంతాసక్తి. ఆరోజులలో ఈ ప్రాంతమంతా అడవి. దీనిని లక్ష్మీపురమని పిలిచేవారు. వేటకు వచ్చిన ప్రతాపరుద్రునికి పులి అరుపు వినబడితే తరుముకుంటూ వస్తాడు. పులి కనబడదు. అలిసిపోయిన రాజు విశ్రాంతి తీసుకుంటుంటే చిత్రంగా 'శ్రీరామ్' అంటూ రామనామం వినబడుతుంది. ఆ పొదలను తొలగిస్తే ధ్యానంలో వున్న ఆంజనేయుడు. స్వామికి నమస్కరించి తిరుగుప్రయాణమవుతాడు. ఆరోజు రాత్రి ఆంజనేయస్వామి ఈ రాజుకు కలలో కనుపించి తనను చూసినచోటనే తనకు ఆలయం నిర్మించమంటాడు. ఆ రకంగా ధ్యానాంజనేయుడు భక్తజన కల్పవృక్షమయ్యాడు. ఇదంతా 1143 సం॥లో జరిగింది. ఆ సం॥ము హనుమజ్జయంతినాడే ఈ ఆలయానికి అర్చకులు నియమించడం, అర్చనాదులు జరిపించడం మొదలయ్యింది.

ఆ తర్వాత కాలంలో ఔరంగజేబు పరమతసహనం భరించలేక 'హిందు'వన్న మాట వినకూడదని ఆలయాల ధ్వంసానికి సిద్ధపడుతూ ఇక్కడి తన సేనలను పంపితే వారు అశక్తులై తిరిగి వస్తారు. ఔరంగజేబు స్వయంగా

బయలుదేరి ఇక్కడకు రాగా ముందు గుండె భద్రంచేసుకుని మరీ అడుగువెయ్యమంటే 'అలాగా! నీవు నిజమైతే కనిపించు నమ్ముతా'నంటాడు. ఇందుకు అంగీకరించినట్లు స్వామి తేజోరూపుడై ధ్యానమూర్తిగా క్షణకాలం దర్శనమిస్తాడు. దీంతో ఔరంగజేబు వెనుతిరుగుతాడు. ఆనాటినుండి ఇది 'కర్-మన్-ఘాట్'గా పిలువబడుతుంది. ఇక పండుగలా? ప్రతి పండుగ పర్వదినంగా ఉత్సవాలతో స్వామి భక్తజనాలను ఆనందమూర్తిగా కరుణిస్తున్నాడు.

## తాండూరు - భద్రేశ్వరస్వామి ఆలయం

అతి పురాతనమైనది. 200 సం॥ క్రితం శరణు బసవేశ్వరుడు, కర్ణాటక నుండి ఇక్కడికివచ్చి అదృశ్యమైనట్లు చెప్పుకుంటారు. ఈ భద్రేశ్వరుని సేవించడానికి కర్ణాటక నుండి భక్తజనులు వస్తారు. ఇక్కడి రథోత్సవం, లంకాదహనకార్యక్రమాలు చూడదగ్గవి.

## చేవెళ్ళ శ్రీలక్ష్మీవేంకటేశ్వరుడు

చేవెళ్ళ శ్రీలక్ష్మీవేంకటేశ్వరుడు సర్పాకారంగా శేషాచలపర్వతాన్ని పోలిన బెల్లంరంగు కలిగినట్లు వుంటుందీ క్షేత్రం. ఇది పంచమహాక్షేత్రాలలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంతమొకటి. రామగుండం రామలింగేశ్వ



రాలయం, ఎల్లంకొండ పార్వతీపరమేశ్వరాలయం, రాకమచర్ల యోగానంద నరసింహాలయం, అనంతగిరి శ్రీఅనంతపద్మనాభ స్వామి, ఈ చేవెళ్ళ శ్రీవేంకటేశ్వరుడు.

స్థల పురాణం ప్రకారం 1305లో రంగదాసు, ఆ తదుపరి పశువులకాపరులు, కళ్ళువచ్చిన అంధుడైన చీమన్న, ఆ తర్వాత మరొక రైతు శ్రీవేంకటేశ్వరుని లీలలను అనుభవించారు. చివరకు శ్రీస్వామివారి ఆదేశంతో సాలగ్రామ రూపంలో వున్న స్వామిని గ్రామపురోహితుడైన తిరుపతి భట్టు పాత ఆలయంలోనే ప్రతిష్ఠిస్తారు. అతి ప్రాచీనమైన ఆ ఆలయం, కట్టడాలు చూడముచ్చటగా వుంటాయి. ఈ ఆలయ ప్రాంగణంలో అశ్వత్థ వృక్షం, నాగబంధాలను చూడవచ్చును. ఒక ప్రక్క శివాలయం, మరోప్రక్క నవగ్రహాలకు ఆలయాలు, దగ్గర్లో పుష్కరిణి వున్నాయి. తిరుమలకు మ్రొక్కుకున్నవారు కూడా తమ మ్రొక్కులు ఇక్కడ తీర్చుకోవచ్చునట.

రంగారెడ్డి జిల్లాలోనే వీరపట్నం నుండి 11 కి.మీ దూరంలో **గున్‌గుల్ గ్రామంలో వీరభద్రస్వామి ఆలయం** వుంది. ఇది ప్రాచీనమైనదే. దీనికి సంబంధించిన మల్లయ్యగూడెంలో "బీరపుగుడి" వుంది. బీరపు అనగా- వీరప్ప, వీరభద్రప్ప అని స్థానికుల అభిప్రాయం. ఇక్కడ నాల్గు సం॥లకొకసారి జరిగే ఉత్సవాలలో అసంఖ్యాకంగా భక్తులు పాల్గొంటారు.

తాండూరుకు 50 కి.మీ దూరంలో **అల్లిపురం**, అక్కడి **వీరభద్రుడు** అతి ప్రాచీనుడు. అంటే పాతకాలంనాటి దేవుడు. ఇక్కడ శ్రావణమాసంలో జరిగే అమావాస్య జాతర చూడదగ్గది. ఇవన్నీ ఓ 80 సం॥ల నుండి జరుగుతున్నట్లు చెబుతారు.

**శంషాబాదు** తెలియని వారెవ్వరు ఇప్పుడు లేరు. ఇక్కడి **సిద్ధులగుట్టపై శ్రీవెండికొండ సిద్ధేశ్వరస్వామి ఆలయం** వుంది. సర్వకోర్కెలు సిద్ధింపచేసే వాడు కనుక సిద్ధేశ్వరుడనీ, ఆయనవున్న గుట్ట 'సిద్ధులగుట్ట'అని ప్రఖ్యాతి పొందింది. ఆలయానికి పైకప్పులేదు. ఈ ప్రాంతమంతా తెల్లగా వుండటంతో దీనిని భక్తులు 'వెండికొండ'గా పిలిచేవారు.

ఒక సిద్ధపురుషుడు ఇక్కడ శివలింగం ప్రతిష్ఠించాలనుకుని పంచాక్షరి మంత్రపఠనం చెయ్యగా, శివుడు దర్శనమిచ్చి తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు. అలాగే ఇక్కడో గుహవుండేదని, దానినుండి శ్రీశైలానికి వెళ్ళవచ్చునంటారు. ప్రస్తుతం ఆ గుహద్వారం మూసివేయబడింది. స్వామివారికి ఎదురుగా నంది, భవాని, వినాయకుడు, వీరభద్రుడు, ఆంజనేయస్వామిలను మనం చూడవచ్చును. పర్వదినాలలో ప్రత్యేక శోభతో, అర్చనలతో అలరారే ఈ సిద్ధక్షేత్రం, కోర్కెలు సిద్ధింపు చేసే దివ్యక్షేత్రమని భక్తుల మనోభావన. ఆదివారం, శుక్రవారాలు, ఇతర శెలవు దినాలలో ఇక్కడ విపరీతమైన రద్దీవుంటుంది.

## ఘట్‌కేసర్ – కామకామేశ్వరి దేవాలయం

రంగారెడ్డిజిల్లా, ఘటకేసర్‌లోని ఎల్.సి.ఐ. నగర్‌లో శ్రీఅయ్యల సోమయాజుల శ్రీరామచంద్రమూర్తిగారు, జంటనగరవాసులకేకాదు, అమెరికాలోని కొన్ని కుటుంబీకుల వారికి గురువుగారుగా విఖ్యాతి గాంచిన మహనీయులు, శ్రీరామభక్తులు, శ్రీశృంగేరీవిరూపాక్ష పీఠాధిపతుల అంతేవాసి – అత్యంత శ్రద్ధాభక్తులతో 'శ్రీరామకామకామేశ్వరీ' ఆలయాన్ని – కొండ(బండ)లు తొలిపించి, ఈమధ్య కాలంలో అపురూప నిర్మాణం గావింపచేసారు. శ్రీరామచంద్రమూర్తిగారు వారి గురువులైన శ్రీకల్యాణానంద భారతీస్వామితోపాటు పరమాచార్యులు శ్రీబోధానంద భారతి మాంధాచార్యులవారి మూర్తులను, అలాగే అత్యద్భుత కామకామేశ్వరీ ఆలయంతో పాటు 50 అ॥ శివుని మహాద్భుతంగా నిర్మింపచేసారు. ఈ అపురూప నిర్మాణంతో ఇచ్చటివారికే కాదు, పరిసరప్రాంతాలవారికి కూడా శ్రీశ్రీ రామచంద్రమూర్తిగారు పరమపూజ్యులు అయ్యారు.

## కీసర – శ్రీరామలింగేశ్వరస్వామి

హైదరాబాదుకు 25 కి.మీ 'కీసరగుట్ట' అను కొండపైన ఈ పురాతన శివాలయం 'శ్రీరామలింగేశ్వరాలయం వుంది. ప్రధాన ఆలయానికి సమీపంలో అనేక శివలింగాలను చూడగల్గుతాం. గర్భగుడిలో మాత్రం అన్నింటా




కనుపించే శివలింగం బదులు, మూర్తిని మనం దర్శించ గల్గుతాం. ఇక స్థలపురాణానికి వస్తే త్రేతా యుగంనాటి కథ వినబడుతుంది. ఒకసారి సీతా రాముడు, హనుమత్సేవితుడై ఇక్కడికి రావడం ప్రకృతి సౌందర్యానికి మురిసి శివలింగం ప్రతిష్ఠించా లనుకోవడం ఆ విషయాన్ని అక్కడ వున్న మహర్షులకు తెలిపితే వారు ముహూర్త నిర్ణయం చేయడం జరుగుతుందిట.

దాంతో శ్రీరాముడు, హనుమంతుని వాయువేగాన కాశీనుండి శివలింగం తెమ్మని చెబుతాడు. హనుమ కాశీకి వెళ్ళి 101 శివలింగరూపములతో శివుడు దర్శినమివ్వగా వాటితో బయలుదేరుతాడు. ఇక్కడ మునులు శ్రీరాముడు ముహూర్త సమయానికి శివప్రతిష్ఠ జరగాలని తలచి శివుని ప్రార్థిస్తే, పరమశివుడు లింగరూపుడవుడం ఇక్కడ ప్రతిష్ఠించడం జరుగుతుంది. 101 శివలింగాలతో వచ్చిన హనుమ, తన శ్రమవ్యర్థమయ్యిందనే కోపంతో తను తెచ్చిన లింగాలను విసిరెయ్యడంతో అవి అటు ఇటు చెల్లాచెదరుగా పడతాయట. అవే ఇప్పుడు మనం ఆలయ పరిసరాలలో చూసే శివలింగాలు. ఇక ...

పరిస్థితిని గమనించిన వాయువు ఆంజనేయుని శాంతపరచతలచి 'హనుమా! ప్రతిదానికి కారణ ముంటుంది. శివుడే ఇక్కడ లింగరూపుడయ్యాడు. శివరూపుడవైన నీకు ఆనందం కల్గించడానికి ఇప్పటినుండి ఈ క్షేత్రం కేసరి గుట్టగా పిలువబడుతుంది." అంటాడు. అదే మనం అర్చించే కీసరగుట్ట. అంతేకాకుండా హనుమ తెచ్చిన శివ లింగాలలో ఒకదానిని స్వామివారికి ఎడమవైపున శ్రీ మారుతీ కాశీవిశ్వేశ్వర శివలింగంగా ప్రతిష్ఠించి రాముడు ఆంజనేయుని ఆనందపరుస్తాడు. సర్వదేవతాస్వరూపుడు శ్రీ ఆంజనేయుడు కాబట్టి ఆలయం, పరిసరాలలో నాగదేవతా ప్రతిమతో సహ సర్వదేవతలు కొలువై భక్తజనుల యొక్క సర్వకోర్కెలు తీరుస్తూ తమవునికిని చాటుకుంటున్నారు. ఇంకా ఇక్కడ అక్కన్న, మాదన్నలు నిర్మించిన రెండు ఆలయాలు, గోన కోటారెడ్డి ప్రతిష్ఠించిన విజయస్తంభాలను మనం చూడగల్గుతాము.

## అనంతగిరి - శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామి

వికారాబాదుకు 4 కి.మీ. దూరంలో గల ఎత్తైన అనంతగిరి కొండలపైగల స్వామి శ్రీలక్ష్మీఅనంతపద్మనాభ స్వామి. 600 సం॥ల క్రితం గోల్కొండ నవాబుల కాలంలో ఈ ఆలయం నిర్మించినట్లు చెబుతారు. ఈ ఆలయసమీపంలో 7 కుండాలు, గుహలు, సరస్సులు ఉన్నాయంటారు. ఈ ఆలయం 1300 సం॥లనాటిదని, ఇక్కడి గురువు శ్రీమార్కండేయ మహర్షి తపస్సు చేస్తూంటే శ్రీమహా విష్ణువు ఆతని భక్తికి మెచ్చి వరం కోరుకోమంటే 'స్వామీ! నీవు అనంతుడవు, నారసింహుడు, శ్రీనివాసు డవు. ఈ దివ్యత్రిమూర్తి అవతారంతో నన్ను తరింప చెయ్యమని కోరుతాడు. భక్తాభీష్టప్రదాయుడైన పరమాత్మ అనంతనారసింహ సాలగ్రామరూపంలో వెలిసాడని, దీనిని సర్వాలంకారయుక్తం చేస్తే శ్రీనివాసునిగా దర్శనం లభిస్తుందంటాడు.



మార్కండేయమహర్షి చేసిన తపోవనప్రాంతమైన ఈ కొండపై గుహ, అక్కడ నుండి సొరంగమార్గంలో కాశీకి వెళ్ళి మహర్షి గంగాజలంతో ఈ స్వామిని అభిషేకించేవారట. ఇదొక పురాణ గాథ. ఇకస్థలమహాత్మ్యానికి వస్తే 600 సం॥లనాడు మహ్మదీయుల సారథ్యంలో నిర్మించినట్లు చెబుతారు. ఇంతటి పెద్ద సాలగ్రామ శిల అపు రూపంగా చెబుతారు. శిరస్సు నారసింహం, మధ్యభాగం శంఖచక్రాలు నాగపడగలతో అనంతపద్మ నాభునిగాను,

సర్వాలంకారుడైతే శ్రీనివాసునిగా దర్శనమిచ్చే ఈ స్వామి నిజరూప దర్శనం కావాలంటే ఉదయం 5-6 గం॥లమధ్య ఆలయానికి చేరుకోవాలి. స్వామి ప్రక్కన దాసానుదాసుడు హనుమ. అనంతలక్ష్మిని ఆపైన శ్రీసీతాలక్ష్మణసమేత శ్రీరాముడని చూడగల్గుతాము. ఇక్కడి భగీరథ కుండం సర్వవ్యాధినాశకం. మరొక ప్రక్క దీపస్తంభాలు కోరికలు తీరిన వారు దీపాలు వెలిగించడం ఇక్కడి ఆచారంగా చెబుతారు.

## సురారం - కట్టమైసమ్మతల్లి

కుత్బుల్లాపూర్ మండలంలోని 'సురారం'లో వుందీ కట్టమైసమ్మతల్లి. ఎంతో పురాతనమైన ఈ తల్లిని గొప్ప మహిమకల దేవతగా చెప్పుకోవడంకాదు, జాతర్ల సమయంలో ఇసుకవేస్తే క్రిందరాలనంత భక్తజన సంగమం ఈ తల్లి గొప్పతనాన్ని లోకానికి చాటుతుంది. పరిసర గ్రామాలు, జిల్లాలనుండే కాక వివిధ రాష్ట్రాలనుండి వచ్చే భక్తజనం 'భక్తి', మనకు మార్గదర్శకత్వం.

## జుంటుపల్లి - శ్రీసీతారాములు

గోల్కొండ నవాబుల కాలంలో శ్రీకృష్ణవదనరావు, శ్యామారావు అను సోదరులు, యాలాల మండలంలోని జుంటుపల్లి గ్రామంలో ప్రధాన రహదారికి 2 కి.మీ దూరంలోని ఎత్తైన కొండపై ఈ ఆలయాన్ని నిర్మించారు. అయితే ఒకసారి ఈ సోదరులు జుంటుపల్లి పరిసరాలలో పర్యటిస్తుంటే శ్రీరాముని విగ్రహ శిలాఫలకం దొరికింది. ఇది దొరికాక శ్రీరాముడు కలలో కనుపించి ఆలయ నార్మిణం చెయ్యమని కోరతాడు. ఆ రకంగా శ్రీరాముని ఆలయం ఏర్పడింది. ఇక్కడి శ్రీరాముని విగ్రహం నుండి పరిశుద్ధ గంగాజలం వుబికి రావడమొక ప్రత్యేకత. 400 అ॥ ఎత్తులోని కొండపైని విగ్రహం నుండి నీరు రావడం - ఎప్పటికీ ఆశ్చర్యమే. దీని రాక అంతులేని రహస్యమేననాలి.

ఇదికాక ఇక్కడి మరో గుట్టలో నడుములోతు నీటి జలవుంది. ఇక్కడ శ్రీరాముడు స్నానంచేసి, అనుష్ఠానాదులు చేసుకునేవాడని భక్తుల విశ్వాసం. ఈ దివ్యక్షేత్ర దర్శనానికి పెద్దలు, పిల్లలు, శెలవుదినాలు పండుగ రోజులలో విశేషంగా రావడం ఈ స్థల ఆలయ మహాత్మ్యగొప్పతనం తెలియబరుస్తుంది.

రంగారెడ్డి జిల్లా, **మోమిన్‌పేట** మండలానికి 6 కి.మీ దూరంలో ఒకనాడు 'ఏనుగుతల'గా, ఇప్పుడు **'ఎన్కతల'**గా పిలిచే గ్రామం, ఇక్కడి అపురూప **శనిదేవాలయం** వలన విఖ్యాతమైంది. శ్రీశంకరభారతీ మహారాజు చిన్నతనంలోనే హిమాలయాలకు వెళ్ళి తపస్సు చేసి ఇక్కడికి వచ్చి ఈ అపురూప ఆలయ నిర్మాణానికి తలపెట్టడం, అభగవానుని దయవలన రాష్ట్రంలోనే ప్రముఖ దేవాలయంగా పేరు పొందడం జరిగింది.

ఆలయద్వార తోరణంపై వినాయకుడు, మరో ద్వారంపై శ్వేతవర్ణ గణపతి, ఉత్తరాభిముఖంగా శ్రీశనైశ్చరుని దర్శించగల్గుతాం. నిజానికిదంతా అటవీప్రాంతం. ఎప్పుడో నిర్మించబడి జీర్ణావస్థలోవున్న ఆలయాన్ని పునరుద్ధరించి శంకరభారతిమహరాజ్ శ్రీశనేశ్వరుని ప్రతిష్ఠించారు. ఇంకా ఇక్కడి విశేషం, సప్తవృక్షాలతోగల సప్తదేవాలయాలు. ఇక్కడ దుర్గాదేవిది ప్రధాన ఉపాలయం. అమ్మవారు విశాలనయనాలతో, వివిధ ఆయుధాలతో వరద హస్తంతో ఎదుట శివలింగం అయిదుపడగల నాగుతో దర్శనమిస్తుంది. ఇక్కడి సప్తదేవతావృక్షాలు - 1. వేపచెట్టు ఆదిశక్తిగా,

2. జిల్లేడు చెట్టు ఆదిగణపతి, 3. రావిచెట్టు విష్ణుమూర్తి, 4. శివరావిచెట్టు శివుడు, 5. మేడిచెట్టు శ్రీదత్తునిగా 6. ఉసిరిచెట్టు కృష్ణునిగా, 7. మారేడు మాతృస్వరూపిగా ఆరాధింపబడుతున్నాయి.

ఇక్కడ 41 రోజులు ప్రదక్షిణాలు చేస్తే ఎటువంటి సమస్యైనా, అది తీర్చలేనిదైనా తప్పక పరిష్కరింపబడి ఆనందానుభూతులను ప్రసాదింపచేస్తుంది. శనివారం, అమావాస్య రోజులతోపాటు ప్రతి శనివారం తైలాభిషేకం ఇక్కడి ప్రత్యేకత. ఎందరో, ఎక్కడెక్కడినుండో భక్తజనులు దర్శించే ఈ ఆలయ దర్శనం, సర్వసమస్య పరిష్కారంగా తలచి, స్వార్థంతోనైనా దర్శించగల్గబూనడమొక అదృష్టంగా తలవాల్సివుంటుంది.

**వర్గల్ సరస్వతి మందిరం :** ఎప్పటిదో తెలియదుకానీ ఈ విద్యాసరస్వతి వర్గల్ గ్రామంలోని కొండపై కొలువున్నా ఈ తల్లి తన బిడ్డలకు భాగ్యభవిష్యత్తు ప్రసాదిస్తూందనే నమ్మకంతో ఎందరో ఇక్కడికి వచ్చి తల్లిని పూజించి తరిస్తారు.

పరిగి మండలంలోని **కాళ్ళాపూరులోని "సప్తముఖ ఆంజనేయస్వామివారి ఆలయం"...** అతి పురాతనమైనది. మహిమాన్వితమైనదని ఎక్కడెక్కడినుండో భక్తులు ఇక్కడికి వచ్చి స్వామిని సేవించుకుంటారు. ఈ ప్రాంతం త్రేతాయుగంలో శ్రీ సీతారాములచే పవిత్రమైన ప్రదేశంకాబట్టే, ఈ కాళ్ళాపూర్ గ్రామానికి 1.5 కి.మీ దూరంలోవున్న రెండు కొండలమధ్య ఈ శ్రీఆంజనేయస్వామి వెలిసారు. శ్రీ సప్తముఖ ఆంజనేయస్వామివారి ఆలయంలో ఏడు పలకలున్నాయి. ఈ పలకల ఆంజనేయస్వామికి చందనం పూస్తారు. ఈ పవిత్రమైన ప్రదేశంలో తరగని నీటి ప్రవాహం ఎల్లప్పుడు వున్నందువలన సప్తఋషులు ఇక్కడ తపస్సు చేసారని, వారికోరికపై శ్రీ ఆంజనేయస్వామి ఇక్కడ వెలిసారని పెద్దలమాట.

**శంషాబాదుకు** 6 కి.మీ దూరంలో ఏకశిలపై **శ్రీసీతారాములు, దశావతారాలున్న** ఆలయంగా భక్తజనులు దీనిని దర్శించి పులకరిస్తారు. పూర్వకాలంలో ఈ ప్రాంతంలో ప్లేగు వ్యాధి రావడంతో మహాత్ములు ఇక్కడ రామాలయం నిర్మిస్తే ఎటువంటి వ్యాధులు దరిచేరవని చెప్పడంతో ఈ ఆలయం నిర్మింపబడినదని, వీరు భక్తజనులకు ఆరాధ్యదైవాలని చెప్పుకుంటారు. ఇంకో విషయం. శ్రీకోదండరామాలయం గోపురాన్నిబట్టే కుతుబ్‌షాహీలు చార్మినార్ నిర్మించారనే కథనం కూడా బహుప్రచారంలో వుంది. వేంగిరాజులు ప్రతిష్ఠించినట్లు ఎన్నో శిల్పాలను ఇక్కడ చూడగల్గుతాం. విశాలమైన మంటపాలు, ఆలయం చుట్టూ కోనేరులతో చూడచక్కని ప్రాంతంగా చెప్పడం కాదు, దర్శించి తీరాల్సిన ప్రదేశంమనే అనాలి.

**వేల్చాల శ్రీలక్ష్మీనరసింహస్వామి** ఆలయాన్ని సముద్ర మట్టానికి 300 మీ॥ ఎత్తులోగల కొండపై ఎంతో భక్తితో పద్మయ్య అనే భక్తుడు గొడ్డలితో రోజు కొంత కొంత తొలిచి, స్వామిని ప్రతిష్ఠించే ఆలయానికి అంకురార్పణ చేసాడు. నిరుపేదలకు ఈ దేవుడు వివాహ వేదికగా నిలిచాడు. చెప్పుకోదగ్గ శివపంచాయతన ఆలయం. 15, 16 శతాబ్దాలలో నిర్మించిన ఈ ఆలయం కాలక్రమంలో శిథిలంకాగా, మహేశ్వర మండలంలోని పెండ్యాల గ్రామంలోని ఈ ఆలయంలో అయిదు ఆలయాలు నిర్మించబడి వున్నాయి. మధ్యలోని ప్రధానాలయం. ఇందులో శివలింగం, మిగిలిన ఉపాలయాలలో వరుసగా – నంది, పార్వతి, గణేశుడు, కుమారస్వామిలను చూడగల్గుతాము. ఒకప్పుడు ఈ ఆలయం వెనుక భాగంలో కోనేరు వుండేదని అనుకుంటారు. ఇప్పుడు చూడలేముకాని ఇక్కడి శిల్పసంపద, జింక, హంస, సింహం చిలకలు వగైరా ఇతర శిల్పాలు మాత్రం ఇంకా ఇంకా చూడాలనిపిస్తాయి.

**ఘటేశ్వరమండలం, "ఏదులాబాదు"** గ్రామంలోని శ్రీఆండాళ్ సమేత శ్రీమన్నారు రంగనాధస్వామి ఆలయం. దాని ప్రక్కనేగల శ్రీరాధాగోపాలస్వామి ఆలయాలు వున్నవి. పచ్చని పంట పొలాలమధ్యయినా, 500 సం॥ల చరిత్ర కల్గి అపురూపంగా దర్శనమిస్తుంది. స్వామి వారికి కుడివైపు ఆండాళ్, ఎడంవైపు విష్ణుచిత్తులవారిని చూస్తాము. దీనిని శ్రీఅప్పలదేశికాచార్యులవారు నిర్మించారని, వారి వంశస్థులే పూజారులైన అర్చకులు తెలుపుతారు. ఇచ్చటి ఆండాళ్ళమాత మహిమాన్వితురాలు. కన్యలకు వివాహం, దంపతులకు అన్యోన్యత, ఆండాళ్ మాత ప్రసాదిస్తుందనే భక్తులనమ్మకం. ఇక్కడ అద్దాలమంటపం, సింహవాహనంపై దుర్గాదేవి అలాగే అమ్మవారికి పైభాగంలో శ్రీరంగనాయక స్వామి వున్నారు. 40 అ. దూరంలోగల పుష్కరిణిస్నానం మోక్షప్రదమని భక్తజనులు తలుస్తారు. ఇక్కడ అంతా వైష్ణవసాంప్రదాయం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. ఇది భక్తులకు నచ్చింది కాదుకానీ, ఎవరి ఆచారం వారిదిగా పర్వదినాలు ఉత్సవాలు నిర్వహించబడి అందర్నీ ఆనందపరుస్తాయి.

ఇక **సరూర్ నగర్ శ్రీవేంకటేశ్వరస్వామి, ఎల్.బి. నగర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి**, అలాగే 1942 సం॥లో నిర్మించిన **శ్రీదత్తావతారునిగా** చెప్పే **మాణిక్యప్రభు ఆలయాలు,** మీయాపూర్ ఆల్విన్ కాలనీ (ఇంద్రారెడ్డి) వెలసిన **శ్రీప్రసన్నాంజనేయస్వామి**, మేడ్చల్ 2 కి. దూరంలోవున్న **ప్రసన్నాంజనేయస్వామి**లు, ఈనాటివే అయినా దర్శనీయాలు. నిత్యం భక్తజనులతో నిండివుండేవి. మంగళ, శనివారాలు, పర్వదినాలలో ఇక్కడి భక్తుల కోలాహలం ఆందం వర్ణనాతీతం.

నవాబుపేట మండలంలోని శివాలయాన్ని **'ఎల్లంకొండ దేవాలయ'**మని పిలుస్తారు. దీనికో పురాణగాథ వుంది. పూర్వం పార్వతీపరమేశ్వరులు తమ విహారంలో భాగంగా ఇక్కడకు వచ్చి కొంతకాలం వున్నారని, అందుకునిదర్శనంగా వారి వాహనమైన కామధేనువు గిట్టల గుర్తులు గుట్టపైని ఎర్రరాళ్ళపై పడ్డాయని, మనం చూడవచ్చునని, ఆదిదంపతులు ఇక్కడ వెలిసారని చెబుతారు.

## కోహెడ - శ్రీ వేణుగోపాలుడు

400 సం॥ల చరిత్ర కలిగిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయం సంతానవేణుగోపాలునిగా ప్రసిద్ధిచెంది, భక్తజనుల నిత్యనీరాజనాలతో వర్ధిల్లుతుంది. ప్రధానగోపురం, ఆరు అంతస్తులతో, స్వామి-రుక్మిణిసత్యభామా సమేతుడై సర్వాలంకారాలతో ప్రకాశిస్తున్నాడు. సుదీర్ఘ చరిత్రవున్న సుందరుడు, సుశీలుడు, సులభుడు శ్రీవేణుగోపాలస్వామి.

## పుప్పాలగూడ - కాశీవిశ్వేశ్వరుడు

ఇది పురాతన కాలానిదే, అయినా కాలక్రమంలోని మార్పులవల్ల దీనిని జీర్ణోద్ధరణం చేయవలసి వచ్చింది. గ్రామ సర్పంచు కస్తూరి నరేంద్రముదిరాజుగారు దీనిని పునరుద్ధరించినట్లు చెబుతారు. గోపన్నకథ, ప్రభుత్వ సొమ్ముతో భద్రాచలంలో శ్రీరామాలయ నిర్మాణం, అందుకు గాను తానీషా, ఆతనిని బంధించడం, గోపన్న రాముని వివిధ పద్ధతులలో కీర్తించడం అందరికి తెల్సిన విషయమే. అయితే మహాభక్తుల బాధలనుండి బయటపడవేయదలచిన రామలక్ష్మణులు, తానీషా వద్దకు వెడుతూ ఈ శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో కొంతసేపు విశ్రమించి స్వామిని పూజించి ఆతదుపరి గోపన్నకు విముక్తి కల్గించారని చెబుతారు. ఇక ఈ ఆలయ ప్రాంగణంలో

వీరహనుమాన్ గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహాదేవతామూర్తులు కొలువైవున్నారు. ఇచ్చటి సుబ్రహ్మణ్యుని కొలిచిన వారికి సంతానం లభించడం తథ్యం. ఇది భక్తజనుల పరిపూర్ణ విశ్వాసం.

## మల్కాజ్‌గిరి - శ్రీఆంజనేయ, వేంకటేశ్వరులు

ఇది పురాతనమంటూనే, కనీసం 100 సం॥ చరిత్ర కల్గిందని, ఇక్కడ శ్రీ ఆంజనేయ, వేంకటేశ్వరస్వాములు కరుణకోసం భక్తులు వేలసంఖ్యలో రావడం, వారివారి కోర్కెలు నెరవేరడంతో, ఆలయచరిత్రకన్న శ్రీస్వామిని భక్తితో ప్రతిఒక్కరు శిరస్సు వంచి నమస్కరిస్తారు. ఇక్కడ ఆంజనేయస్వామికి మంగళ, శనివారాలు, శ్రీవేంకటేశ్వరునకు శుక్ర, శనివారాలతో పాటు బుధవారపూజ, సేవలు చూడతగ్గవి, పాల్గొనదగ్గవికూడా!

**సిద్ధపురం శ్రీవీరభద్రస్వామి,** 400 సం॥ల నాటి మహిమాన్వితమూర్తి. శ్రీతిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆలయాల జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఈ మధ్యకాలంలో దీనిని పునరుద్ధరించారు. ఇక్కడ శ్రీవీరభద్రునితోపాటు భద్రకాళి అమ్మవారు, శివుడు, వినాయకుడు, నందీశ్వరాదులు కొలువుదీరివున్నారు. నాగదేవతలు, సప్తమాతృకల శిథిలమైన విగ్రహాలను కూడా ఈ ఆలయప్రాంగణంలో మనం చూడగల్గుతాము.

**తులాంజగిరిలో** వున్న మరో దివ్యాలయం **అష్టభుజ దుర్గాదేవి.** ఈ తల్లి వరదాయిని కామ్యకకల్పవల్లి. ఇక్కడి శివుడు కూడా పేరుకు తగ్గట్లే బోళాశంకరుడు. అడిగిన వారిని అడిగినట్లు కరుణించే ఆపద్బంధువు కూడా! ఇక్కడ 36 రోజులు దీక్షతో ఈ దుర్గామాతను సేవిస్తే వారు కోరినది తప్పక లభిస్తుంది. ఇక్కడ నిత్యపూజలతోపాటు, సామూహిక దీపాలంకరణ, లలితాసహస్రనామపారాయణలు ఎంతో భక్తితో సల్పుతారు. ఇక పర్వదినాల కోలాహలం చెప్పనలవికాదు. ఇక్కడ ఈనాటి దైవం షిర్డిసాయి, ఆనాటి రాఘవేంద్రస్వాముల మందిరాలు కూడా భక్తజనుల నలరిస్తున్నాయి.

**ఉప్పల్‌లోని శ్రీకరిగిరివేంకటేశ్వరస్వామి**ని అంగరంగవైభోగంగా 1911 సం॥ ఏప్రిల్ 30వ తేదీన ప్రతిష్ఠించారు. శ్రీస్వామివారు ఘనత వహించిన వారు కాబట్టి అంతగొప్పగా ఆలయం నిర్మాణం అపురూప కార్యక్రమాలు, నిత్యోత్సవాలు సహజం. ఇక్కడి పంచముఖ ఆంజనేయస్వామి చూడదగ్గ వాడు. పది భుజాలతో, వానర, నారసింహ, హయగ్రీవ, గరుత్మంత, వారాహరూపుడు, భక్తజనానందధాముడై విరాజిల్లుతున్నాడు. 'ఏనుగకొండ' అనబడే కరిగిరిపై వెలసిన శ్రీవేంకటేశ్వరుడు కామితార్థ ప్రదాతని ప్రత్యేకించి చెప్పనవసరం లేదనుకుంటాను. ఇదికాక ఉప్పల్‌లోని శ్రీవేంకటేశ్వరుడు కూడా భక్తజన కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. ఇక్కడి విశేషం. శ్రావణమాసంలో జరిగే పవిత్రోత్సవంనాడు పట్టుదారాలను భక్తులకు ప్రసాదంగా ఇస్తారు. ఇవి ధరించినవారి కోర్కెలు ఆ శ్రీవేంకటేశ్వరుని దయవలన శ్రీఘ్రమే సిద్ధిస్తాయని భక్తజనుల విశ్వాసం.

## వెలుగులగుట్ట - శ్రీదుర్గామాత

ఇదీ ఉప్పల్‌లోని భాగమే – 200 సం॥ల క్రితం ఈ తల్లి తనవునికిని గొర్రెలకాపరుల ద్వారా తెలియపరచిన ప్రదేశం "వెలుగులగుట్ట". ఈనాడు భక్తజనులకు నిత్యానందం, వెలుగులు సాధించే దివ్యాలయమైంది. తరువాత ఒకప్పుడు మల్లన్నగుట్టగాను, ఉర్దూలో 'రోషన్ పహాడ్' అనే ప్రాంతంలోని వెలుగులగుట్టపై ఉదయాన్నే తొలికిరణాలు

పడటంవలన దీనికి వెలుగుల గుట్టని పేరు వచ్చింది. ఇక్కడి గుహలోని మల్లికార్జునస్వామి మొదట్లో గొర్రెల కాపరులు పూజించేవారు. ఇప్పుడు ఇక్కడ శ్రీభ్రమరాంబమల్లికార్జునస్వామి, శ్రీదుర్గామాత, ఆంజనేయస్వామి ఆలయాలు నవగ్రహమండపం నిర్మించారు. 35 అ॥ ధ్వజస్తంభంకూడ ప్రతిష్ఠించి అంగరంగవైభోగంగా సేవించుకుంటున్నారు.

**వీరపట్నం** నుండి 18 కి.మీ దూరంలోని **రావిర్యాలలోని శ్రీవీరభద్రస్వామి** వారి దేవాలయం చూసి ఎప్పటిది? అనుకుంటే ఓ 300 సం॥లనాటిదని చెప్పవలసివుంటుంది. దీంతోపాటు ఇక్కడ శ్రీనరసింహస్వామి ఆలయం శ్రీగోపాలస్వామి ఆలయాలు కూడా చెప్పుకోవడం కాదు, చూడదగ్గవనాలి.

హైదరాబాదు నుండి మహబూబ్‌నగర్ వెళ్ళే దారిలో **సంగాబాదులో ధర్మగిరి క్షేత్రం** వుంది. ఇది షిరిడిసాయికి సంబంధించినదేకాని, కాస్త భిన్నంగా వుంటుంది. అందుకనే “ధర్మగిరి క్షేత్ర”మనబడుతుంది. ఓ పెద్ద శివలింగం, మండపం ఎదురుగా అతి పెద్ద నందీశ్వరుడు, శివలింగపానపట్టంలో త్రాసుతో మనపాపపుణ్యాలు బేరీజు వేస్తున్నట్లు ధర్మసాయి వుంటారు. సుందరరంరాజఅయ్యంగార్ అనే భక్తుడు సాయికి ఆలయం కట్టించాలనుకుంటాడు. ఆ కోరిక తీరక మరణిస్తాడు. సాయి ఆతని కుమార్తె ధరణిమాతకు కలలో కనుపించి, ఈ ప్రాంతంచూపి, ఈ రకంగా ఆలయం నిర్మాణం చెయ్యమని, దానిని ‘ధర్మగిరి’ క్షేత్రం చేస్తాడు. శ్రీసాయి ఆలోచనలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న ఈ క్షేత్రం కులాతీత, మతాతీత శక్తిగా, దర్శనీయమై వెలుగొందుతోంది.



**శంషాబాద్‌లోని శ్రీరామాలయం** పెద్ద ఆవరణలో వున్న అతి పురాతన చిన్న ఆలయం. దాదాపు 13 శతాబ్దిలో ఈ ఆలయనిర్మాణం జరిగినట్లు తెలుస్తుంది. కాని ఆ పుణ్యాత్ములెవరో తెలియరావడంలేదు. స్థల పురాణం ప్రకారము ఆనాడు రాముడు ఈ ప్రాంతంలో సంచరించాడని, వనవాస సమయంలో రాముడు సంచరించిన ప్రదేశంలోనే ఈ కోదండరామాలయం నిర్మాణం జరిగిందని చెబుతారు. ఇచ్చటి విశేషం. శ్రీసీతారాముల విగ్రహాలు మకర తోరణాలతో సహా ఏకశిలపై చెక్కబడ్డాయని, శ్రీరామ విగ్రహ మకరతోరణంలో దశావతారాలు అందంగా చెక్కబడ్డాయని ఇక్కడ ఆంజనేయుడు స్వామి సన్నిధిలో వుండడు. ధ్వజస్తంభం వద్ద, గరుత్మంతుని ప్రక్కన ఆ మహాభక్తుడు ఆంజనేయుని ప్రతిష్ఠించారు.

**తిరుమలగిరిలోని శ్రీసూర్యనారాయణమూర్తి ఆలయం.** ఇప్పటిదే అయినా ఆ ప్రత్యక్ష భగవానుని శ్రీసూర్యశరణ దుర్గ అనే భక్తుడు ప్రతిష్ఠించి తన భక్తిని చాటుకున్నాడు. గుట్టపైన ముందు మరకత గణపతి, ఆపైన ఎదురుగా వున్న పెద్దరాతిని ఆనుకొనివున్న చిన్న శ్రీసూర్యనారాయణుని సుందరవిగ్రహం, ఆ ప్రక్కనే అశ్వత్థ–వేపవృక్షాలు కలిసిన దేవతావేదిక ఆ ప్రక్కన అందమైన శివలింగం, సరస్వతీదేవి, నాగదేవతలు, ఇంకో ప్రక్క శ్రీసత్యనారాయణ స్వామిని చూడగల్గుతాము. మకరసంక్రాంతి, రథసప్తమి ఇక్కడి ప్రత్యేక పర్వదినాలు.

ఇక్కడున్న మరో ఆలయం అతిపురాతనమయిన అతి పెద్ద **నాగదేవతాలయం**. ఇది ఒకప్పుడు బాగా వెలుగొందినది. బ్రిటిష్ వారి అకృత్యాలవలన శిథిలమైన ఈ ఆలయాన్ని నాగదేవత భక్తురాలైన యోగిని జయలక్ష్మి

మాత అనేక కష్టనష్టాలకు ఓర్చి ఈ ఆలయనిర్మాణం చేసారు. ఇక్కడ నాగదేవతతోపాటు శ్రీనారాయణస్వామి, జయలక్ష్మి వార్ల దివ్యప్రదేశం చూడగల్గుతాము. గర్భాలయంలో నాగదేవత, ఆలయప్రాంగణంలో మహాగణపతి, అలాగే అర్ధమంటపంలో చతుర్ముఖ నాగదేవత, పంచామృతాభిషేకాలతో నిత్యం వేలాదిమంది చేత అర్చింపబడుతుంది. ఎడమవైపు నాగఫణితో కూడిన వినాయకుడు, సర్వసేవితుడైన శివలింగమూర్తి, మయూరవాహనుడైన కుమారస్వామి, సింహవాహని త్రిశూలధారిణియైన ఆదిశక్తి మూర్తులను చూగలుగుతాము. ఇక్కడ పుష్కరిణి. దానివద్ద శ్రీఆంజనేయస్వామి వేప-రావి మొ॥లగు దేవతావృక్షాలు, మహేశ్వర లింగం, నాగశిలలు, మండపానికి వెనుకభాగంలో జయలక్ష్మి మాత ధ్యానమందిరం వగైరాల నెన్నింటినో భక్తితో చూడగలగడమొక విశేషం.

## గండిచెరువు - శ్రీగోదాసమేత శ్రీరంగనాధస్వామి

పూర్వంరోజులలో హయత్‌నగర్... అంటే వెతుక్కోవాలేమోకాని, ఇప్పుడా స్థితిలేదు. దీనికి 8 కి.మీ దూరంలోని గండిచెరువు గ్రామంలోని రంగనాయకులగుట్టపై, శ్రీగోదాసమేత శ్రీరంగనాధస్వామి, పురాతన - 500 సం॥నాటి ఆలయం చూడవచ్చును. స్థలపురాణం ప్రకారం స్వామి ఈ ప్రాంతాలలో తిరుగుతూండేవాడుట. స్వామి పద తాకిడికి పొలాలగట్లు కుదించుకుపోవడమో, కూలి పోవడమో జరుగుతుంటే భక్తులు “స్వామీ! కరుణించ” మని ప్రార్థిస్తే, స్వామి గుట్టపై శయన ముద్రలో వుండి పోయాడని చెప్పుకుంటారు. దాదాపు ఓ అయిదు శతాబ్దాల క్రితం, గండిచెరువు మధ్యభాగంలోని హనుమంతపాదం అనే ప్రదేశంలోని రంగన్న బండ దగ్గర ఓ గుహ వుండేదని, అందులో ఓ పెద్ద మట్టిపుట్ట వుండి వున్నట్టుండి ఒకనాడు ఓంకార నాదం వినిపించే సరికి, తీర్థయాత్రలు చేస్తూ అటువచ్చిన కేశవపట్నం శింగరయ్య, అళంగార్‌స్వామి అనే వైష్ణవభక్తులు విని, అటువైపు వెళ్ళగా సుగంధపరిమళాలు విరజిమ్మే సరికి దానిని ఆ గ్రామపెద్దలకు చెబుతారు. ఆ రకంగా స్వామి భక్తజనులకు చేరువయ్యాడు. దాదాపు 10 అ॥ భారీ విగ్రహరూపంలో స్వామి ఇచ్చే దర్శనం భక్తజనులకు ఆనందదాయకమనడంలో ఏమాత్రం ఆశ్చర్యం కనబడదు. ఇంకా ఈ శివార్లలో స్వామి దివ్యధామంతో పాటు గ్రామదేవతలైన పోచమ్మ, మారెమ్మల సన్నిధిని గూడ మనం చూసి భక్తిప్రపత్తులను ప్రకటించుకోగల్గుతాము. వీరికి ఎదురుగా పోతరాజు చూడవలసినవానిగా దర్శనమిస్తాడు.



# నల్గొండ జిల్లా

## యాదగిరి - శ్రీలక్ష్మీనరసింహస్వామి



త్రేతాయుగంలోనే శ్రీస్వామి ఇక్కడ వెలిసారని చెప్పుకుంటారు. నరసింహ, స్కాంద, బ్రహ్మాండపురాణాలలో కూడా శ్రీస్వామి ప్రస్తావన ప్రముఖంగా కనబడుతుంది. 1148 సం॥లో త్రిభువనమల్లుడు, భువనగిరిలో కోటను నిర్మించుకుని ఈ యాదగిరీశుని సేవించుకున్నట్లు శాసనాలద్వారా తెలుస్తుంది. 15 శతాబ్దిలో శ్రీకృష్ణదేవరాయలు కూడా ఈ స్వామిని సేవించి తగు కానుకలు సమర్పించుకున్నాడు. హిరణ్యకశిపుని వధించిన స్వామి శాంతించిన ప్రదేశమిదేనట. అందుచే ఇక్కడ శ్రీలక్ష్మీతో స్వామి వెలిశాడని చెబుతారు.

హైదరాబాదు నుండి వరంగల్ వెళ్ళే మార్గంలో హైదరాబాదుకు 64 కి.మీ. దూరంలో ఉన్న భువనగిరికి దగ్గరలో ఉన్న ప్రముఖ నరసింహ క్షేత్రం యాదగిరి పుణ్యక్షేత్రం. ఇక్కడికి భువనగిరిలో దిగి చేరుకోవచ్చు. రాయగిరి నుండి కూడా వెళ్ళవచ్చును. శుక్ర, శని, ఆదివారాలు ఇక్కడ ప్రశస్తమైనవిగా తలుస్తారు. చుట్టు ప్రక్కలనుండి వచ్చే వారితో ఈ వారాలు మహారద్దీగా వుంటాయి. ఈ క్షేత్రమునకు బస్సులో వచ్చి కొండపైకి మెట్ల మార్గం ద్వారా నడచి వెళ్లవచ్చు. లేదా బస్సులోను పైకి వెళ్ళవచ్చు.

యాదగిరి స్వామి మహాప్రభావము కలిగి యున్నందున స్వామిని సేవించటానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. వెండిపై బంగారం తాపిన ద్వారాలు, గోపురంపై బంగారు పసిడి కుండలు బాలభానుని అరుణ కిరణాలకు ధగ ధగ మెరస్తూ ఉంటాయి. స్వామి వారి పాదాల నుండి రెండు జలధారలు వచ్చి బయట స్వామివారి పుష్కరిణి ఏర్పడినట్లు చెపుతారు. దీనిని విష్ణు కుండము లేక విష్ణు పుష్కరిణి అంటారు. ఇందులో స్నానమాచరిస్తే స్వామి వారి పాదోదకంలో గ్రుంకులిడినట్లు అవుతుంది. ఈ కుండములో సుదర్శన చక్రం ఉందని ప్రతీతి. ఇందు స్నానము చేసిన వారికి సర్వవిధాల ఉపశమనం కలుగుతుందని చెబుతారు. ఈ తీర్థములో పితృ తర్పణాదులు చేసినచో అశ్వమేధయాగం చేసిన మహా పుణ్యఫలం లభిస్తుంది. యాదగిరి శిఖరాగ్రమున ఈశాన్య దిశలో పరమశివుడు స్వయం భూలింగముగా ఆవిర్భవించారు. కొండపై ఉన్న గుహలో గర్భగుడి నిర్మాణము జరిగింది. ఈ గర్భగుడిలో సర్పాకారములోనూ, పద్మాసనంలోనూ లక్ష్మినరసింహస్వామి స్వయంభువు (మూలవరుల) దర్శనమౌతుంది. ప్రక్కనే ఉన్న అమ్మవారి సన్నిధిని భక్తులు దర్శించవచ్చు.

ఆ ఆలయంలో ప్రతిరోజు ఉదయం సుప్రభాతం, మధ్యాహ్నం రాజభోగం సాయంత్రం అర్చన రాత్రి రాజభోగం, ప్రసాద వితరణ జరుగుతాయి. ప్రతిరోజు స్వామి వారికి పాలతో అభిషేకం జరుగుతుంది. స్వామి వారి బ్రహ్మోత్సవము ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ విదియ మొదలు ద్వాదశి వరకు నవరాత్రి దీక్షలో ఉత్సవాలు జరుగుతాయి. వైశాఖ మాసంలో నృసింహ జయంతి జరుపుతారు. యాత్రికుల సౌకర్యము కొరకు కాటేజీలు కలవు. ప్రతి ఐదు నిమిషాలకు యాదగిరికి భువనగిరి నుండి బస్సు సౌకర్యము కలదు.

ఇక ఈ ఆలయ వివరాలు వివరంగా ....

హిరణ్యకశిపుని రక్షించిన నరసింహుడు 'ఉగ్ర' నరసింహుడు. ఇది రాక్షససంహారానికేతప్ప అర్చనీయంకాదని, ప్రహ్లాదుడు స్వామిని కోరితే, స్వామి అహోబిలంనుండి ఇక్కడకు వచ్చాడు. ఈ అర్చావతారాన్ని మొదట బ్రహ్మదేవుడు ఆకాశగంగాజలంతో పూజించాడు. అందువలన స్వామివారి పాదాలనుండి జలధార రావడం...



మరొక కథ ప్రకారం విభాండకుని కుమారుడైన ఋష్యశృంగుని తెలియనివారుండరు. వీరి ఆధ్వర్యంలో పుత్రకామేష్టి జరిగి రామలక్ష్మణ భరత శతృఘ్నులు జన్మిస్తారు. ఋష్యశృంగులవారి కుమారుడు 'యాదుడు'. చిన్నతనంనుండే ఇతనికి నరసింహస్వామి అంటే భక్తిశ్రద్ధలు ఎక్కువ. దీనిని తాను స్వామిని సేవించుకొనడానికి వీలైన స్థలంకోసం వెదుక్కుంటూ, ఒకచోట అలసిపోయి నిద్రిస్తూంటే -- ఆ కలలో ఆంజనేయ స్వామి ఫలానగుట్టమీద నరసింహస్వామి వున్నాడని చెబుతాడు. ఆ రకంగా స్వామివారికోసం వెదుకుతూ, ఆయనను కనుగొనలేక తపస్సు ప్రారంభిస్తే, మరల ఆంజనేయస్వామి దర్శన మిచ్చి ఈ గుట్టమీద వున్న గుహలో స్వామి అదృశ్యరూపంలో వున్నాడని చెబుతాడు. అడుగుపెట్టడానికి వీల్లేకుండా మహాభయంకరంగా ఉన్న గుహలోకి యాదుడు ప్రవేశించి, స్వామికోసం మరల తపస్సు ప్రారంభిస్తాడు.

అతని భక్తికి మెచ్చిన స్వామి ఒక పెద్ద అగ్నిజ్వాలగా దరిశనమిచ్చి వరం కోరుకోమంటే, ఆ భక్తుడు, ఈ గుట్ట మీద తనపేరున ప్రఖ్యాతమవ్వాలని, భక్తులను సదా సంరక్షించి, కాపాడాలని కోరుకుంటాడు. ఆ తదుపరి ఆంజనేయస్వామి, యాదునికి దర్శనమిస్తే 'స్వామీ నీ వల్లనే నృసింహస్వామిని దర్శించగల్గాననగానే, శ్రీస్వామి తత్వాన్ని ఆనందభరితంగా చెబుతాడు. దీనికి సంతోషించిన యాదుడు స్వామినికూడ ఇక్కడే నిలచి భక్తులకు స్వామితత్త్వం తెలుపుతూ తరింపచెయ్యమని ప్రార్థిస్తాడు.

ఈ ఆలయంలో స్వామి జ్వాలానరసింహస్వామి, యోగనరసింహస్వామి, లక్ష్మీనరసింహస్వామి మూడు రూపాలలో భక్తజనసంరక్షణకు సిద్ధంగా వున్నాడు. ఒక సమయంలో, యాదమునిని ఒక బ్రహ్మరాక్షసుడు మ్రింగబోతే "స్వామి నరసింహా" అనేసరికి, ఆరుకోణాలు గల ఒక దివ్య చక్రం రాక్షసుని సంహరించి, యాదమునిని రక్షిస్తే, ఆయన ఆ దివ్య చక్రాన్నిక్కడే వుండమని భక్తజనసంరక్షణం చెయ్యమని ప్రార్థిస్తాడు. అదే ఆలయగోపురం మీద కల దివ్యచక్రం.

ఈ నరసింహక్షేత్రంలో పరమ శివుడుకూడా స్వామి వారిని సేవించుకొనడానికి వచ్చి ఇక్కడే వుండిపోతాడు. ఈ క్షేత్రానికి ఈశాన్యంలోవున్న బ్రహ్మకుండం వద్ద "స్వయంభూలింగరూపుని ఆలయంలో మనం మహాదేవుని దర్శించవచ్చును. ఆ తదుపరి కాలంలో ఈ ఆలయంకూడా ఇతర ఆలయాలవలే శిధిలమైతే, గ్రామంలోని పెద్దలకు కలలో కనుపించి, తన వునికిని తెలియబరిస్తే ఆ గ్రామ పెద్ద గ్రామప్రజలతో కలిసి, గుట్టంతా వెదకి,

సింహం వంటి శిరస్సుమీద వుండే జూలు, ఊర్ధ్వపుండ్రాలను ఒక రాతిమీద దర్శించి, ఆ ప్రాంతాన్ని శుభ్రంచేసి, అర్చనాదులకు వీలుగా తయారుచేసాడు. ఇక్కడ గుహే తప్ప ఆలయం వుండేదికాదు. ఈ మధ్యకాలంలో ఆ గుహను తొలిచి, దారిచేసి ఆలయరూపమిచ్చారు. అయితే లోపలవున్న అలనాటి విగ్రహాలను మాత్రం అంగుళంకూడా కదపక, దాని పవిత్రతను అలాగే కాపాడారు.

ఈ గుట్టక్రింద మరొక నరసింహస్వామి ఆలయం వుంది. స్థానికుల కథనం ప్రకారం – ఇదే అక్కడి తొలి ఆలయమని ఆ తదుపరి కాలంలో స్వామి గుట్టనెక్కి గుహలో కూర్చున్నాడని చెబుతారు. అందుకని దర్శనంగా ఈ ఆలయంలో కొన్ని పాదముద్రలు కనుపిస్తాయి. ఇవి స్వామివారివని స్థలపురాణం చెబుతుంది.

మరొక విశేషం...

ఈ ఆలయంలోని ప్రక్కనగల గోడలో పగులు ఏర్పడి, అందులోంచి సన్నటి నీటిధార క్రింద పడుతుంటుంది. నిరంతరం, నిర్విరామంగా ప్రవహించే జలధార ఎక్కడనుండి వస్తుందో ఎవరికి తెలియదు. ఈ ఆలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామి ఆలయం వుంది. ఇది యాదునికి ప్రత్యక్షమైన స్వామి ఆలయంగా స్థలపురాణ వివరం.

చెప్పుకోవడంకాదు కాని, ఓపిక వున్నవాళ్ళు ఒక్కసారి దర్శనం చేసుకోవడంలో పొందే అనుభూతి "అనుభూతే" అది వర్ణించడం మాటలతో కుదరదని, స్వామి దర్శనం చేసి తరించండి!!

ఇక పౌరాణికంగా చూసే ఋష్యశృంగుని కుమారుడైన యాదృషి నరసింహస్వామి భక్తుడు. స్వామిని దర్శించాలని చేసిన అన్వేషణలో భాగంగా ఇక్కడికి వచ్చి అలసి ఒక రావిచెట్టుక్రింద నిద్రిస్తే ఆంజనేయస్వామి కలలో కనుపించి "నీ పట్టుదల, భక్తి అత్యంత శ్లాఘనీయం. తపస్సు చేయి. నీకు తోడుగా వుంటాను. స్వామి తప్పక సాక్షాత్కరిస్తాడని చెబుతాడు. ఆ కలకు మురిసి యాదుడు అక్కడే తపస్సు మొదలుపెడతాడు. అతని ఉగ్రతపస్సుకు నరసింహస్వామి ఉగ్రుడై దర్శనమిస్తే, దానిని చూడలేని యాదుడు "స్వామీ! ఈ ఉగ్రం వదిలి శాంతుడవై దర్శనమివ్వాలంటే, అప్పుడు స్వామి లక్ష్మీసమేతుడై దర్శనమిచ్చి వరమడుగుతాడు. ఇక్కడ వెలసి భక్తజనులను కరుణించమన్నవాడికి, స్వామి వివిధ రూపాలు దర్శించాలనే కోరిక కల్గి మరల తపస్సు చేస్తాడు.

భక్తులకోరిక తీర్చడం తన బాధ్యతగా తలిచే ఆ స్వామి, మరల నీ కోరిక... అంటే నీ వివిధ రూపాలు దర్శించాలనుంది. అంటాడు. అన్నీ నీకు చూడటం సాధ్యంకాదు. మూడు రూపాలు చూసి తృప్తి పడమంటాడు. జ్వాలానారసింహ, యోగ, గండభేరుండ నారసింహులుగా దర్శనమిస్తాడు. అప్పుడు మహదానందపడిన యాదుడు "స్వామీ! ఇక నన్ను నీలో కలుపుకోమని ప్రార్థిస్తాడు. ఆ యాదర్షి పేరునే శ్రీస్వామి నివాసం యాదగిరి గుట్ట అయింది.

గుహలో నాల్గు రూపాలలో నిలిచిన స్వామి, తాను అజ్ఞాతంనుండి బయటికి రావాలని తలచి, కొండ దిగువపల్లె గ్రామాధికారికి కలలో కనుపించి, తాను నాల్గు రూపాలలో గుట్టపై వున్నానని చెప్పేసరికి ఆ గ్రామాధికారి కొంతమందితో కలిసి, గుట్టలోని గుహలో రేఖామాత్రంగావున్న జ్వాలానరసింహాది రూపాలను ఆంజనేయస్వామిని కనుగొని పూజాదికాలు ప్రారంభించాడు.

ఆంజనేయస్వామి గుడివున్న బండపై గండభేరుండ నరసింహమూర్తి, గర్భగుడిలో జ్వాలానరసింహుడు ఇంకాస్త ముందుకు వెడితే యోగ నరసింహుడు, ఆపైన లక్ష్మీనరసింహస్వాములను మనం చూసి తరించవచ్చును. ఇక్కడ

చేసే ప్రదక్షిణలు ఫలప్రదాలు. దీనివలన మానసిక, శారీరక, ఆర్థికబాధలే కాదు, సర్వసమస్యలు పరిష్కరింపబడతాయి. ఇటువంటివారికి శ్రీస్వామి కలలో కనబడి సమస్యాపరిష్కారం చెయ్యడం కూడా కలదు.

ఇక్కడి మరో దివ్యధామం. "శ్రీనాగకోటేశ్వరాలయం. ఇది చెప్పడానికి యాదగిరి గుట్ట. కాని శ్రీనరసింహాలయానికి కి.మీ దూరంలో శివలింగం రూపంలో నిర్మించిన ఆలయమిది. అయిదు అడుగుల నాగాభరణంలో కనుపించే ఈ ఆలయం ఎత్తు దాదాపు 101 అ॥. ఇది ఇప్పటిదే అయినా సర్పదోషం కలవారికి, కుజ, నాగదోషాలున్నవారికి ఈ స్వామి సేవ ఆనందదాయకమౌతుంది. అభీష్టసిద్ధి కల్గిస్తుంది.

"సురేంద్రపురి" అనగా పండరీపూరులోని కైకడీమఠం గుర్తుకు వస్తుంది. అదొక మాయామందిరం. ముందుకు వెళ్ళడమేతప్ప వెనుతిరగడం కుదరని ఆ దివ్య ధామం తలపుకు తెచ్చే ఈ సురేంద్రపురి దర్శించదగ్గదనడంలో దోషం ఆవగింజంతైనా వుడదనడం తప్పుకాదు.

హుజూర్‌నగర్ సమీపంలో కృష్ణా తీరంలోని మట్టపల్లి గ్రామంలోని పర్వతంపైగల గుహలోని స్వయంభు స్వామి శ్రీ లక్ష్మీనరసింహమూర్తి. ఇక్కడ స్వామితో పాటు మనం దక్షిణావృత శంఖాన్ని ఇక్కడ దర్శించవచ్చును. పూర్వం భరద్వాజమహర్షి శ్రీస్వామి దర్శనం కోరి తపస్సు చేసారుట. ప్రహ్లాదవరదుడు భరద్వాజునికి ప్రత్యక్షమై దీవించాడని, అప్పుడినుంచి స్వామిని దేవతాదులు, మహర్షులు పూజించడం మొదలు పెట్టారుట. గుహలోని ఒక శిలాశాసనం ద్వారా ఈ ఆలయం 1100 సం॥కు ముందుదని తెలుస్తోంది. అనంతరకాలంలో గుంటూరు జిల్లాలోని తంగెడు గ్రామవాసియైన మాచిరెడ్డి అనే భక్తునికి కలలో కనుపించి, తనవునికిని చెప్పి పునఃప్రతిష్ఠించమని స్వామి కోరడం, ఆ భక్తుడు మాచిరెడ్డి స్వామి ఆదేశాన్ని అనుసరించి, ప్రతిష్ఠ, ముఖమండపాలు నిర్మించడం జరిగింది.

ఈ క్షేత్రం విశిష్టత – యమధర్మరాజు ఇక్కడికి వచ్చి స్వామికి ప్రదక్షిణలు చేస్తాడుట. ఇక్కడికి వచ్చిన వారు కృష్ణానదిలో స్నానం చేసి 32 ప్రదక్షిణలు చేస్తే సర్వదోషాలు తొలగి సుఖశాంతులతో వుంటారు. స్వామివారికి ఆనందదాయకంగా వుండటానికి రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మిలను ఆతర్వాత కాలంలో ప్రతిష్ఠించినట్లు చెబుతారు. సర్వసిద్ధి క్షేత్రం కాబట్టి సదా దర్శనీయమని చెప్పాలి. తప్పదు.

## మేళ్ళ చెరువు - కామేశ్వరీ సమేత శంభులింగేశ్వరుడు



కోదాడకు సమీపంలోని మేళ్ళచెరువులోని పురాతన ఆలయం శ్రీకామేశ్వరిసమేత శంభులింగేశ్వరాలయం. చూడటానికిది చిన్న ఆలయం. ఇక్కడి శివలింగం పెరుగుతూవుంటుందంటారు. లింగం పైభాగాన ఓ గుంట, అందులో నీరు వూరుతుంటుంది. అదే పూజారులిచ్చే తీర్థజలం.

13వ శతాబ్దిలో కాకతీయ ప్రభువు రుద్రగణపతిదేవుని ఆదేశం ప్రకారం, హుజూర్‌నగర్‌లోవున్న శ్రీ వేణుగోపాలస్వామిని, వారి సామంతు కాపయసేనాని ఆలయం నిర్మించి, ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది. ఇక్కడ ఆశ్వయుజ శుద్ధ విదియ నాడు జరిగే పరికల

రామస్వామి తిరుణాలు చెప్పుకోదగ్గవి. ఇక్కడికి 4 కి.మీ దూరంలోగల ఫణిగిరిపై వెలసిన స్వయంవక్త శ్రీ సీతారాముల వారి ఆలయం కూడా దర్శించదగ్గ ఓ దివ్యక్షేత్రంగా చెప్పవచ్చును.

సూర్యాపేటకు 30 కి.మీ దూరంలోని రామగిరి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం కూడా అతి పురాతనమైనదే. ఇక్కడ ఈ ఆలయంతోపాటు రాముడు ప్రతిష్ఠించిన శివలింగం కూడా వుంది. సీతాదేవివని చెప్పే పసుపు, కుంకుమభరిణలు చూడదగ్గ విచిత్రం కాని విశేషం. ఈ గుడిచుట్టూ కొన్ని లోహవిగ్రహాలు, ఆళ్వారుల రాతి విగ్రహాలు చూడగల్గుతాము.

## కొలనుపాక - శ్రీసోమేశ్వరుడు

ఆలేరుకు 6 కి.మీ దూరంలో కొలనుపాక, అతి పురాతన శ్రీ సోమేశ్వరాలయం వుంది. దీనిని కోటి లింగాల ఆలయంగా శైవులు ఆరాధిస్తారు. ఇచ్చటి స్వామిని చంద్రుడు ప్రతిష్ఠించినందువలన స్వామిని సోమేశ్వరుడని పిలుస్తున్నారు. ఇందుండే జగద్గురువు శ్రీ రేణుకాచార్యులవారు అవతరించి, వీరశైవానికి ప్రాణప్రతిష్ఠచేసి, మూలమూర్తులయ్యారు. దీనిని కాకతీయులు, చాళుక్యులు వగైరా ఎందరో పోషించారు. ముఖ్యంగా కాకతీయ శిల్ప కళారీతులు ఇక్కడ స్పష్టంగా చూడవచ్చును.

## మణిద్వీపేశ్వరి విశ్వజనని పరాశక్తి పీఠం

ఇటువంటి పీఠాలు, ముఖ్యంగా మణిద్వీపేశ్వరీ, భువనేశ్వరీ, మహామాతృకాలయాలు అపురూపం, అటువంటిది యాదగిరి నరసింహక్షేత్రంలో, శ్రీమణీద్వీపవాసిని, శ్రీచక్రమహాసామ్రాజ్ఞి లలితా పరమేశ్వరిని మూలకేంద్రంగా ఇతర దేవీదేవతలతో సాంప్రదాయబద్ధంగా నెలకొల్పిన – ఇటీవలదే అయినా దర్శించ దగ్గ అపురూప క్షేత్రం ఈ మణిద్వీపేశ్వరీ విశ్వజననీ పరాశక్తి పీఠం.

## పాలెం - శ్రీలక్ష్మీనరసింహస్వామి

ఎంతసేపు రాముడు, కృష్ణుడు ... అనుకుంటాము, ఆంజనేయుడు, గణపతి, శివుడు, పార్వతి, కుమారస్వామి అనుకుంటాము. కానీ వీరందరితోపాటు ఇతర దేవీదేవతలు కూడా ఎక్కువ సంఖ్యలోనే దర్శనమిస్తాయి. నరసింహ మూర్తి, ప్రహ్లాదవరదుడని అనుకుంటాము. ఏదో రెండుమూడు ప్రాంతాలు తల్చుకుని తృప్తి పడతాము. భగవచ్ఛక్తి అనంతమని, ఆ భగవంతుడు అనంతుడని అర్థం చేసుకోము. అటువంటి దివ్యక్షేత్రాలలో అపురూప, అతిప్రాచీన శ్రీలక్ష్మీనరసింహ, దర్శించదగు ఇతరదివ్యక్షేత్రాలు కొన్నివున్నాయి. అటువంటి ప్రాచీన క్షేత్రాలలో నకిరేకల్ కు 8 కి.మీ దూరంలో మూసీనది తీరంలోగల పాలంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయమొకటి. దీనిని 13వ శతాబ్దిలో నిర్మించారని కొన్ని ఆధారాలు తెలుపుతున్నాయి. 200 సం॥ల క్రితం ఈ ఆలయానికి కొంత తీర్చిదిద్దినట్లు కూడా తెలుస్తుంది. సాలగ్రామ శిల, గరుడపీఠంపై, శ్రీలక్ష్మీనృసింహస్వామి వెలసినట్లు క్షేత్ర సమాచారంద్వారా తెలుస్తుంది.

ఆనాటి జమీందారు గుండమరాజు కృష్ణయ్యకు స్వామి కలలో కనబడి తన వునికిని తెల్పగా, తెల్లవారి తన కుమారులతో కృష్ణయ్య బయలుదేరి, అడవి అంతా వెదుకుతాడు. కానీ స్వామి ఆచూకీ దొరకలేదు. నిరాశతో వెనుదిరుగతూంటే ఒక వృద్ధుడు కనుపించి విషయం తెలుసుకుని, ఇక్కడికి సమీపంలో ఎత్తైన మహావృక్షము

దానిపై గరుడపక్షి కనుపిస్తాయి. మిమ్మల్ని చూసి ఆ గరుడపక్షి ఎగిరిపోతుంది. అక్కడ చూడండి. స్వామి దొరకుతాడని చెబుతాడు. చాలా సంతోషమని ముందకు సాగిన వాళ్ళు వెనుదిరిగి చూస్తే ఆ చెప్పిన వృద్ధుడు కనబడడు.

ఆ విధంగా భక్తజనసంక్షేమార్థం స్వయంవ్యక్తుడై వెలసిన దివ్యక్షేత్రమిది. ఇక్కడి క్షేత్రపాలకుడు శ్రీ ఆంజనేయస్వామి. ఆ తర్వాత, తర్వాత ఆళ్వారులతో పాటు మణవాళముని కూడా ఇక్కడ ప్రతిష్ఠింపబడతాడు. ఇక్కడి గోదాదేవిని 'కల్యాణకల్పవల్లి'గా చెబుతారు. ఈ స్వామి దర్శనం, కంకణధారణంవలన అసాధ్యాలు సాధ్యమవుతాయి. ఈశాన్యదిశలోని రావి, వేపచెట్టు వద్ద ప్రతిష్ఠించిన శేషశాయి, సర్వదోషనివారకుడు, సంతానప్రదాతకూడా!

## చెరువుగట్టు - శ్రీపార్వతి జడలరామలింగేశ్వరుడు



నార్కెట్‌పల్లి మండలం, చెరువుగట్టులోవుందీ ప్రసిద్ధ దివ్యక్షేత్రం. త్రేతాయుగంలో పరశురాముడు 108 శివ లింగాల ప్రతిష్ఠ వివిధ ప్రాంతాలలో చేస్తాడు. అందులోని చివరిది 'మహేశ్వర'లింగప్రతిష్ఠ. అవతార పురుషుడైన పరశురాముడు తన తండ్రి జమదగ్ని మహర్షిని వధించిన కార్తవీర్యార్జునుని సంహరించడమే కాకుండా రాజు – రాజరికంపైగల కోపంతో క్షత్రియుడనేవాడు లేకుండా చంపుతాడు. ఆ పాపపరిహారార్థం, 108 లింగాలు వివిధ ప్రాంతాలలో ప్రతిష్ఠ చేసినవాటిలో ఇది చివరిది. అనంతరం శివునికోసం తపస్సు చేస్తే శివదర్శనం లభించదు. దాంతో కోపించిన పరశురాముడు ఈ లింగాన్ని కొడతాడు. అప్పుడు అభయంకరుడైన శివుడు దర్శనమొసగి, పరశురాముని నీలక్ష్యం తప్పక నెరవేరుతుంది. ఇక్కడ నేను కలియుగాంతంవరకు వుండి భక్తులను అనుగ్రహిస్తానంటాడు.

ఆ రకంగా వెలసిన స్వామి, అభయంకరుడు. ఆశ్రితవత్సలుడు. అమ్మవారు పార్వతీ ఆలయం గట్టు క్రింద వుంది. శ్రీజడలరామలింగేశ్వరస్వామి, శ్రీభద్రకాళి సమేత శ్రీవీరభద్రుడు మొ॥గువారు ఇచ్చట కొలువుదీరారు. పరమపవిత్రము, పావనమైనది ఏదైనా దర్శించుట కనీస ధర్మం.

## వాడపల్లి - శ్రీ మీనాక్షి సమేత అగస్త్యేశ్వరస్వామి



దక్షిణానికి కారణాంతరాలవలన వచ్చిన అగస్త్యులవారు ప్రతిష్ఠించిన శివలింగాలు ఎన్నో వున్నాయి. అనంతర కాలంలో వాటిని ఆయా ప్రాంత–కాల రాజులు అభివృద్ధి పరిచారు. అటువంటిదే ఈ మూసి - కృష్ణా సంగమ స్థానంలోని వాడపల్లి గ్రామంలో వెలసిన శ్రీమీనాక్షీ సమేత శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయం. 12 శతాబ్దిలో కాకతీయ

రాజులు అభివృద్ధి చేసినట్లు తెలుస్తుంది. గర్భాలయంలో మీనాక్షి అగస్త్యేశ్వరులు, అంతరాలయంలో నంది, మండప ఎడమభాగాన అమ్మవారు, కుడివైపు సుబ్రహ్మణ్యుడు, ఉత్తరాన అగస్త్యేశ్వరుడు, దక్షిణాన వినాయకుడు, వగైరా దేవతామూర్తులను దర్శించగల్గుతాము. పర్వదినాలలో ఈ ప్రాంతశోభ దర్శించవలసినదే తప్ప వర్ణించలేము.

## వాడపల్లి - లక్ష్మీనరసింహస్వామి



వాడపల్లిలోనే చెప్పుకోదగ్గ దైవం ఆలయం శ్రీలక్ష్మీనరసింహస్వామి. మిర్యాలగూడకు 20 కి.మీ దూరంలో ఈ గ్రామముంది. దీనిని కొందరు 'వజిరాబాదు' అని కూడా అంటారు. పంచనారసింహక్షేత్రాలలో ఒకటైన శ్రీలక్ష్మీ నరసింహుని అపురూప ఆలయంలో మూడు భాగాలుగా వుంటుంది. గర్భాలయంలో స్వామి శ్రీలక్ష్మీదేవిని తన తొడపై కూర్చోబెట్టుకుని భక్తజనులకు దర్శనం ప్రసాదిస్తాడు. ఈ ఆలయంలో రెండు దీపాలు అఖండంగా వెలుగుతాయి. బొడ్డుదగ్గరి జ్యోతి నిశ్చలంగా వుంటే, ముక్కువద్ద గల దీపం మిణుకు, మిణుకు మంటుంటుంది.

స్వామి ఉచ్ఛ్వాసానిశ్వాసలకు భక్తులు ఈ దీపం కదుల్తుందంటారు. అందుకేనేమో ఈయనను 'దీపాలయ్య'గా కూడా పిలుస్తారు. అంతరాలయంలో దీపస్తంభం, ప్రథమమంటపంలో ఆళ్వారులు, రెండవమంటపంలో తూర్పున శిలాశాసనాలు, ముందు భాగంలో గరుత్మంత, ఆంజనేయ స్వామిలను దర్శించగల్గుతాము. ప్రథమ మంటపంలోని శ్రీలక్ష్మి చూడచక్కని తల్లి.

ఈ దేశమే దేవతాభూమి, దేవతలు నడయాడిన దివ్యధామ మనడానికి, ప్రతి ప్రాంతంలో అడుగడుగునా మనకు దర్శనమొసగే ఆలయాలనే దివ్యధామాలు చెప్పుకోదగ్గ ఋజువులు. అటువంటిదే నల్గొండ జిల్లాలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన పానగల్లు. ఇక్కడికి 3 కి.మీ దూరంలోని పచ్చల సోమేశ్వరాలయం బహుప్రసిద్ధి పొందినది. దీనికి పంచేశ్వరాలయమని మరో పేరు కూడా వుంది. ఈ ప్రాంతం 10-12 శతాబ్దాలలో కల్యాణిచాళుక్యులు, ఆ తదుపరి కుందూరు చోళులు, ఆతదుపరి కొంతకాలం కాకతీయులు రాజధానిగా ప్రఖ్యాతి చెందినదీ ప్రదేశం. ఇక ఆలయాలవిషయానికి వస్తే వారివారి పాలనలో వారి అభీష్టానికి నిదర్శనంగా ఆలయాలు నిర్మించడమొక సాంప్రదాయం. ఇక్కడ శ్రీస్వామివారితోపాటు శ్రీరాజరాజేశ్వరీదేవి, నందీశ్వరుడు, నాగప్రతిమలను మనం చూడవచ్చును. మహాశివరాత్రితోపాటు, ఇతర ఉత్సవాలుకూడా ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు.


ఇంకా ఇక్కడ, **శ్రీఛాయాసోమేశ్వరాలయం** కూడా చెప్పుకోదగ్గది. చూడదగ్గది. గ్రామానికి 2 కి.మీ దూరంలో పంటపొలాలలో వున్నాడీ దేవుడు. ఇక్కడి ఆలయ విశేషం - రాత్రింపగళ్ళతో నిమిత్తం లేకుండా, 24 గంటలు, ఇచ్చటి శివునిపై ఛాయ (నీడ) పడటంతో, దీనిని 'ఛాయాసోమేశ్వర' ఆలయంగా పిలవడం జరుగుతుంది. ఈ నీడ రాక మహామహులకు కూడా అగమ్యగోచరం. ఈ ఆలయం ముందు గల చెరువును 'ఉదయసముద్ర'మంటారు.

ఉదయభానుడనే కుందూరు రాజుల వంశీకుడు నిర్మించడంతో ఆతని పేరుతో ప్రసిద్ధిగాంచింది. ఈ ఆలయనిర్మాణం కూడా ఉదయభానుడే జరిపించాడని చరిత్ర చెబుతోంది.

దీనిని మూడు కూటాలు (భాగాలు) గా నిర్మించినందువలన దీనిని 'త్రికూటాలయ'మని కూడా పిలుస్తారు. తూర్పుభాగంలో ప్రధానదేవత, రెండవదానిలో శ్రీదత్తుడు, దక్షిణ ముఖంలో ఈశ్వరుని మనం చూడగల్గుతాము. ఛాయాసోమేశ్వరుడు ఎప్పుడు ఏదో నీడతో కప్పబడివుంటే, తూర్పువైపున వెన్నెల కాంతిపడుతుంటుంది. ఉత్తర గర్భాలయంలో చిత్రంగా, ఒక మనిషి నీడ, ఏడు నీడలుగా కనబడుతుంది. కార్తీకం, మహాశివరాత్రి, ఇతర పర్వ దినాలలో శివపూజలు, అభిషేకాలు, ఉత్సవాలు– భక్తజనులకు ఆనందదాయకమనడంలో ఆశ్చర్యమేముంది? ఆనందమే, ఆనందం. ఈ చరిత్రాత్మక పానగల్లులోని మరొక ఆలయం 13వ శతాబ్దిలో నిర్మించినట్లు తెలిపే శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం. ఆ శిల్పకళను బట్టి ఇది కాకతీయుల కాలంలో నిర్మించబడినదని భావన. ఇచ్చటి స్వామిముందు, ఈ ప్రాంతంలో ఆచారమో, అలవాటో లేని 'శ్రీకూర్మం' భక్తికి నిదర్శనంగా, నిర్మింపబడి వుండటమొక విశేష మని చెప్పుకోవాలి. శ్రీస్వామి ఆయనదేవేరులు ఇతర భక్తులతో మనకు దర్శనమివ్వడం, మనం చూడగల్గడం మన అదృష్టమని తలవాలి.

## వేములకొండ - శ్రీమత్స్యగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి

వలిగొండ మండలంలో వుందీ వేములకొండ. ఈ గుడి గ్రామానికి 3 కి.మీ దూరంలో 'మత్స్యగిరి' కొండ, దానిపై శ్రీలక్ష్మీనరసింహస్వామి, అతిపురాతనమైనవి. దీనిని వేములకొండ ఆలయంగాకూడా పిలుస్తారు. అయితే ఈ స్వామి ఎప్పటివాడో చెప్పేవారు, చరిత్ర లభ్యమవడం లేదు. పుష్కరణివుంది. ఇందులో చేపలు ఒకే జాతికి చెందినవి. కుప్పలుతెప్పలుగా వుంటాయి. స్వామికి ఆలయంలేదు. వున్నదొక మండపం. ఇంకా వీటికి తిరునామాలవలె గీతలు వుండటం మరొక విశేషం.



# ఖమ్మంజిల్లా

## "అదిగో భద్రాద్రి - గౌతమి ఇదిగో చూడండి !" (భద్రాచలం)



తెలంగాణాలోని ఖమ్మంజిల్లా భద్రాచల పుణ్య క్షేత్రము సాధారణంగా చూడనివారు అనేకన్న తెలియని వారుండరు. ఇట్టి పరమ పావనమైన పుణ్యక్షేత్రము గౌతమి నది (గోదావరి) తీరంలో ఉండటం, స్వామి వారి తొడమీద అమ్మవారు కూర్చుని ఉండటం విశేషం. స్వామి వారి పేరు శ్రీరామచంద్రుడు అయితే అమ్మవారి పేరు సీతమ్మే. రామపాదం దగ్గర అవుతున్న కొద్ది భక్తజన హృదయాలలో రామనామ స్మరణ పెరుగు తుంటుంది.

"అదిగో భద్రాద్రి ... ఇదిగో గౌతమి చూడండి" అనేసరికి భద్రాద్రి రామయ్య కొండదిగి మన చెంతకు వచ్చి అక్కున చేర్చుకున్న ఆనందం కల్గుతుంది. ఒకప్పుడు ఇక్కడికి వెళ్ళాలంటే ప్రయాణం ఇబ్బందులు వుంటే వుండవచ్చును. కానీ ఈనాడు ఆ రాముడే కదలివస్తున్నాడంటే ఎన్ని రకాల సదుపాయాలు ఇస్తున్నాడో తలచుకుని పొంగిపోతాము. ఇక దీనిని గురించి ఇంత పెద్దదనడం, ఇంతగొప్పగా ఇక్కడ కల్యాణం జరుగుతుందని వర్ణించడం శ్రీరామాదులను చిన్నచేసినట్లువుతుంది. ఇవ్వాల్టి రోజున ఐశ్వర్యార్ధమైన భద్రాద్రి రాముడి గాథ జనులను ఓ మూర్ఖుడా! అని హెచ్చరిస్తుంది. నిజం.

భక్తుడు భద్రుడు ప్రార్థనతో భక్తవత్సలతో శంఖచక్రాల అస్తవ్యస్తంగా పట్టుకుని స్వామి సీతను వళ్ళో పెట్టుకుని చిద్విలాసంగా కూర్చుంటాడు. సదా అన్నకు తోడైన తమ్ముడు ధనుష్పాణియై ప్రక్కన ఉంటాడు. ఇక అక్కడకు వెళ్ళాక ఏం చూడాలంటే... అడుగడుగున సీతారాములు లక్ష్మణుల అడుగులతో పులకించిన ఆ ప్రదేశంలోని ప్రతి అంగుళం పరవశింపచేసేదే. చూసి తరించాల్సిందే. పులకరించడానికి ఈ దేహం ఉలుకు పలుకు లేక రామనామంతో, ఆ పురాణదంపతుల వనవిహారశోభల విశేషాలతో తమ్ముడు లక్ష్మణుడు సేవాదృక్పథం మానవాళి జీవనానికి మనుగడ, ఏలుగడ తెలియచెప్పే దివ్యమానవతాధర్మం, మహత్వ సూక్తి మరువరానిదనిపిస్తుంది. అందుకే "శ్రీరామశ్శరణంమమ" అనేది. ఇక కారణజన్ముడైన కంచర్ల గోపన్న అనబడే 'రామ' దాసుడిని ధర్మావతారుడివి ఇవన్నీ చూడటం ఈ జన్మ అదృష్టం. ఈ దేహమానందం. పర్ణశాల పంచవటి, అన్నరాముడు తమ్ముడు లక్ష్మణుడు అద్భుతమైన పర్ణశాలను అన్నావదినలకై తమ్ముడు నిర్మాణకౌశలాన్ని మెచ్చుకొని మురిసిన అన్న రాముడు అంతకు మించి ఏమీకోరని లక్ష్మణుడు ఇక స్వయంగా వెళ్ళి చూడాలి. ఈ దేశజీవకథలో మమేకం కావాలి.

ఖమ్మం జిల్లాలో గోదావరి ఒడ్డున వెలసిన ఈ దివ్యక్షేత్రము భద్రాచలం రోడ్డు రైల్వేస్టేషన్‌కు 50 కి.మీ. దూరంలో ఉంది. ఈ పుణ్యక్షేత్రములో శ్రీరాముని వనవాస సమయంలో శ్రీ సీతారామలక్ష్మణులు కొంతకాలం గడిపినట్లు చెబుతారు. రామచంద్రుని పాదస్పర్శ సోకిన ఈ ప్రాంతమంతా భక్తులకు దివ్యమైన యాత్రా స్థలమే. వైకుంఠ ఏకాదశి, శ్రీరామనవమి రోజులలో లక్షలాది భక్తులు స్వామి వారి దర్శనం చేసుకుంటారు.

17వ శతాబ్దంలో భద్రాచలం ప్రాంతాన్ని పాలించిన గొల్కొండ తానీషాగా పేరుపొందిన అబుల్‌హసన్ వద్ద

అక్కన్న, మాదన్నలు ఇరువురు మంత్రులుగా ఉండేవారు, వారి మేనల్లుడు కంచర్ల గోపన్న. ఈయన రామ భక్తుడు కావడం, ఆయనకు కబీరుదాసు రామనామ తారక మంత్రం ఉపదేశించడం జరుగుతుంది. ఆ మంత్రోపదేశంతో ఉప్పొంగిపోయి "తారకమంత్రం కోరిన దొరికెను ధన్యుడనైతిని ఓరన్నా, మీరిన కాలుని దూతల పాలిటి మృత్యువుయని నమ్మికయున్నా" అంటూ రాముని స్తుతిస్తాడు. అలాంటి గోపన్నను అక్కన్న, మాదన్నలు తాహసీల్దారుగా నియమిస్తారు. గోపన్న తన నిధులను సక్రమంగా నిర్వహిస్తూ ఎన్నో సంవత్సారాలుగా బకాయి ఉన్న పన్ను వసూలు చేస్తాడు. ఆ వసూలు చేసిన డబ్బుతో అనాడు ఎండకు ఎండి వానకు తడుస్తున్న భద్రాద్రిరామునకి చక్కని ఆలయం నిర్మించాడు. అదే ఈనాడు మనం చూస్తున్న సుందర దివ్యక్షేత్రం.



ప్రజల నుండి వసూలు చేసిన డబ్బుతో రామమందిరం కట్టించి నందుకు రామదాసుగా కూడా పిలువబడే ఈ గోపన్నను 12 సంవత్సరాలు గొల్కొండ కోటలో తానీషా బందీగా ఉంచాడు. అటువంటి రామదాసు తాను జైలులో ఉండగా అనేక కీర్తనలు రామునిపై వ్రాసాడు. వాటిలో కొన్ని మాత్రమే నేడు లభిస్తున్నాయి. కొద్దికాలానికి రామ లక్ష్మణులు రాజోద్యోగ వేషములో తానీషా వద్దకు వచ్చి కలలో దర్శన మిస్తారు. "ఏ దేశమున నుండువారు మీరు, ఎందుండి ఇట వచ్చినారు" అని తానిషా అడిగిన మాటకు రామదాసు బంటులమని రామ లక్ష్మణులు చెప్పినారుట. తర్వాత ఆరులక్షల మూటను తానీషాకు ఇచ్చి రామదాసు బాకీ మొత్తం చెల్లించినట్లు చెప్పి అంతర్ధానమయ్యారుట.

కలలో యిచ్చిన ధనము నిజముగా లభించటంతో తానీషా గోపన్న భక్తిభావనలకు వివశుడై ఆయనను బంధవిముక్తుని చేయుటయే కాకుండా ఆయన శేష జీవితమంతా శ్రీరామ కైంకర్యంలోనే గడపటానికి సకల సదుపాయాలు సమకూరుస్తాడు. తానీషా భద్రాద్రి ఆలయానికి మణులు, మాన్యాలు సమకూర్చి నిత్య పూజలు ఘనంగా జరిగే ఏర్పాటు చేసాడు.

ఈ పుణ్య క్షేత్రములో ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ పాడ్యమి మొదలుకొని నవమి వరకు కళ్యాణ ఉత్సవాలు అమిత వైభవంగా జరుగుతాయి. ఆ రోజులలో స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు గొల్కొండ నవాబులు పంపేవారు. ఆనాటి ఆచారం ప్రకారం ముత్యాల తలంబ్రాలను ఈనాడు ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి పంపిస్తారు.

ఈ భద్రాచలానికి 25 కి.మీ. దూరంలో పర్ణశాల ఉంది. రావణుడు సీతను ఆపహరించిన ప్రదేశంగా దీనిని భావిస్తారు. భద్రాచలంలో చూడదగ్గ ముఖ్య స్థలములు ఉష్ణకుండం, రామదాసు ధ్యానమందిరం. ఇక వివరంగా, వివరాలలోకి వెడితే...

సీతారాములు తమ వనవాసకాలంలో కూర్చున్న బండరాయి ఆ తరువాతి కాలంలో మేరువు కుమారుడు భద్రునిగా పుట్టి శ్రీరామునిపై భక్తిని పెంచుకుని, తపస్సుచేసి, తనపై 'అమ్మతో స్థిరంగా వుండమని" కోరుతాడు.

అదే భద్రుడు “గిరి” అయ్యాడు. కాబట్టి భద్రాద్రి, భద్రాచలం. ఈ ప్రాంతమంతా దండకారణ్య ప్రాంతం, చరిత్రకన్నా పురాణేతిహాసాలు కథలు, గాధలతో ఈ ప్రాంతం, రామచరిత్రతో ముడిపడివుంది.

ఇక్కడ “ఉష్ణగుండం” వుంది. నాగలోకాధిపతి అయిన ఆదిశేషుడు రాక్షసుల బాధనుండి బయట పడటానికి ఇక్కడికి వచ్చి అగ్నిగుండం వ్రేల్చి, శివునిగూర్చి తపస్సు చేస్తాడు. శేషుడు హోమం చేసినచోట ఒకగుంట ఏర్పడింది. దానినే శేషగుండం లేదా ఉష్ణగుండం అంటారు. ఇది వూరికి కాస్త దూరంగా వుంటుంది.

శ్రీరాముడు సీతాన్వేషణలో భాగంగా ఈ ప్రాంతంలో తిరుగుతూవుంటే ‘శబరి” అనే ఆమె రామునికి మధురఫలాలను తినిపిస్తుంది. ఆమె భక్తికి మెచ్చి రాముడు ఆమెకు శాశ్వతత్వాన్ని కల్పిస్తాడు. దాంతో ఆమె శబరినదిగా మారి ఇక్కడ ప్రవహిస్తోంది.

1620 సం॥ ప్రాంతంలో పోకలదమ్మక్క అనే ఆమెకు రాముడు కలలో కనుపించి తన వునికిని చెబితే, ఆ తల్లి గ్రామస్థుల సాయంతో చిక్కని అడవిప్రాంతంలో వెదికితే సీతారాముల విగ్రహాలు దొరికాయట. ఆతల్లి వాటికి భక్తితో తాటాకుల పాకవేసి తనకు తోచిన పూజచెయ్యడం ప్రారంభించింది. ఒకనాడు దమ్మక్క పనిమీద పొరుగూరు వెడితే స్వామికి నైవేద్యం పెట్టమని తన పిల్లకు పురమాయించింది. ఈ పిల్ల నైవేద్యం తయారుచేసి స్వామిని తినమంటుంది. దాంతో ఈపిల్ల మంకుపట్టు పట్టి చస్తానని భీష్మించుకునేసరికి స్వామి మనవలె పిల్లకు కనుపించి, ఆమెపెట్టిన ఆహారాన్ని తింటాడు. ఆ తర్వాత వూళ్ళోకి వచ్చిన దమ్మక్క ప్రసాదం గురించి అడిగితే, ఆ పిల్ల స్వామి తినేశాడంది. నమ్మని దమ్మక్క కూతుర్ని దండించపోతే “నేనే తిన్నా”నంటాడు రాముడు.

ఇదే కాలంలో అంటే 1620 ప్రాంతాలలోనే నేలకొండపల్లి గ్రామంలో కంచర్ల లింగన్న, కామమ్మ దంపతులకు కల్గిన గోపన్న అనేవాడు రామభక్తుడు. ఇతనికి ఆ గ్రామానికి వచ్చిన కబీరు, మంచి భవిష్యత్ ఉందనితలచి “రామమంత్రం” ఉపదేశిస్తాడు. అతను స్మరిస్తూంటాడు. కాలం గడుస్తుంది. తల్లిదండ్రులు మరణించడంతోవారు తన మేనల్లుని స్థితి చెప్పి భద్రాచలానికి తాసీల్దారుగా చేస్తారు. ఆనాడు ఈ ప్రాంతమంతా గోల్కొండ నవాబు సామ్రాజ్యంలో భాగంగా వుండేది. తానీషా ఆస్థానంలో గోపన్న మేనమామలు అక్కన్న, మాదన్న మంత్రులుగా వుండేవారు.

ఇదిగో ఈ సమయం – శ్రీరామునిదనుకుంటాను. ఈ సమయంలో శ్రీరామనవమి వచ్చింది. పోకల దమ్మక్క తాసీల్దారును కలిసి కల్యాణం చేయించాలంటుంది. తన కులదేవత శ్రీరామకల్యాణమనేసరికి ఆ తాసీల్దారు ప్రజలతో కలిసి అంగరంగవైభవంగా కల్యాణం జరిపిస్తాడు. అక్కడనుండి కథ మొదలు. రామాలయం నిర్మాణం, తనది, ప్రజలది, ప్రభుత్వధనం ఖర్చుపెట్టి అందంగా ఆలయనిర్మాణం జరుగుతుంది. తానీషాకు తెలిసి, ప్రభుత్వ సొమ్ము, తన సొమ్ముగా ఖర్చు పెట్టుకున్నందుకు బందీచేస్తాడు. ఎన్ని బాధలు పడాలో అన్ని బాధలు పడ్డాడు. ఎన్ని బాధలు పెట్టాలో, అన్ని బాధలు తానీషా పెట్టాడు. చివరకు ప్రాణత్యాగం చేద్దామనుకున్ననాటి రాత్రి రామలక్ష్మణులు తాము గోపన్న సేవకులమంటూ తానీషాకు ఇవ్వవలసిన పైకాన్నిచ్చి, తాము, గోపన్న ఋణవిముకులౌతారు. ఇంతవరకు గోపన్నగా పిలువబడిన ఇతడు ఇప్పుడు రామదాసుడౌతాడు. ఇతనికి తానీషా భక్తుడౌతాడు.

దీంతో అతడు నిజంగా రామదాసుడౌతాడు. తను విడుదలైన సందర్భంలో వూరందరికి సంతర్పణ చేస్తారు. వూరందరు సంతోషంగా వున్న సమయంలో గోపన్న కుమారుడు వంటశాలలోని గంజిగుంటలో పడిపోతాడు. ఆనందం ఆవిరైపోతుంది. ఆ పిల్లవాడిని స్వామి ముందర వుంచి “స్వామీ!” అంటాడు. పిల్లవాడు బ్రతుకుతాడు.

ఈ రోజులలోనే ఒకనాడు కబీరు గోపన్న చరిత్రను విని, రాముని దర్శించుకునే ఆనందంతో వస్తే, పూజారులు ఆయనను ఆలయంలోనికి దర్శనానికి రానివ్వక తరిమేస్తారు. కబీరు వెళ్ళిపోయిన కొద్ది క్షణాలకు రామవిగ్రహాలు కనిపించవు.

ఇది రామదాసుకు తెలిసి "స్వామీ!" అని కబీరు దాసును వెదుక్కుంటూ వెడితే, వారికెదురుగా ఈ సీతారాములు వుంటారు. క్షమించమంటాడు. ఆలయానికి రమ్మంటాడు. ఆయనతోపాటు విగ్రహాలు వస్తాయి. అటువంటి దివ్యక్షేత్రమిది.

1650 సం॥లో కట్టిన ఈ ఆలయం సరైన ఆలనాపాలనా లేక శిధిలమైతే, 1955 సం॥లో అంటే మూడు శతాబ్దాల తర్వాత ఆనాటి రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి కల్లూరి చంద్రమౌళిగారు భక్తుల విరాళాలతో తిరిగి ఆలయ పునరుద్ధరణం చేసి ఈనాటి శోభాయమాన చరిత్రకు కారణభూతులయ్యారు.

ఈనాడు దర్శించే ప్రముఖ పుణ్యక్షేత్రాలవలె భద్రాచల రాముడు ప్రముఖుడయ్యాడు.

ఇటు పౌరాణిక, చారిత్రక ప్రాధాన్యం కల్గిన ప్రదేశంగా ఈ భద్రాచలాన్ని, రాముడిని చెప్పుకోవచ్చును.

ఖమ్మంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయముంది. ఇంకా ఈ ప్రాంతం కాకతీయుల ఏలుబడి కేంద్రంగా వెలసిందని చెబుతారు. ఇంకా ఈ ప్రాంతంలో మౌద్గల్య మహర్షి తపస్సు చేసారని ఈ ఆలయాన్ని రెడ్డి రాజుల కాలంలో నిర్మాణం జరిగిందని చెప్పబడుతుంది. గర్భాలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి, అంతరాలయంలో శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారు ఎడమవైపు శ్రీకేశవస్వామి చూడదగ్గది. సమయాన్నిబట్టి కార్యక్రమాలలో పాల్గొనదగ్గది.

## భ్రమరాంబ సమేత శ్రీరామలింగేశ్వరాలయం

ఇక్కడి శివలింగం శ్రీరాముడు ప్రతిష్ఠించాడంటే ఈ ఆలయమెంత ప్రాచీనమైనదో అర్థమవుతుంది. ఇక ఆలయం 12, 13 శతాబ్దాలలో నిర్మింపబడినట్లు తెలుస్తుంది. చూడటానికిది చిన్న ఆలయమైనా గర్భాలయంలో శ్రీరామ లింగేశ్వరుడు, ఆయన కుడిప్రక్క భ్రమరాంబ, ముందు నంది, ఈయనకు దగ్గర్లో నవగ్రహాలు, ముఖద్వారంలో ఆంజనేయస్వామి చూడచక్కని దర్శనం.

రోటరీనగర్‌లోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు, నర్తకి సినిమాహాలువద్ద శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం వరంగల్లుకు వెళ్ళే దారిలో శ్రీసత్యనారాయణ సహిత శ్రీవీరాంజనేయ దేవాలయం మరియు శ్రీ సీతారాముల ఆలయాన్ని ఒకే పెద్ద గుడిలో దర్శించవచ్చును. అలాగే శ్రీఅయ్యప్ప, శ్రీకన్యకా పరమేశ్వరి తల్లి దేవస్థానాలతో పాటు 150 సం॥లక్రితం నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వరుసగా ఓపిక చేసుకుని చూస్తే భక్తి తెలుస్తుంది. భగవంతుడు ఉనికిని గ్రహించగల్గుతాము. ఇక ఆంజనేయస్వామి విషయానికి వస్తే ఈయన సర్వ దేవతాస్వరూపుడు. సర్వ మంత్రస్వరూపుడు కూడా. అందుకే సీతామాత మొదట్లో చిన్నపిల్లవానిగా తలచి తొందరపడ్డా ఆయన దివ్యమంగళ విగ్రహం చూసి భ్రమసి, ఇకపై చూడలేక 'యమకుబేర వరుణాధిపతులు, కవికోవిదులు నిను స్తుతిస్తారు. అష్టసిద్ధి నవనిధి ప్రదాత'వని పెద్దమనసుతో ఆశీర్వదించి తను రామపత్నిననే సత్యం చాటుకుంటుంది.

## జమలాపురం శ్రీవేంకటేశ్వరుడు

ఒకప్పుడు శ్రీవేంకటేశ్వరుడు సూచీ కొండలోని ఒక గుహలో వుండటంతో ఒక భక్తుడు స్వామిని ప్రజాబంధువు కమ్మని కోరడంతో ప్రస్తుతమున్న ప్రాంతములో వెలుస్తాడు. వేయి సంవత్సరాల చరిత్ర కలిగిన దివ్యాలయ ప్రదేశమిది. ఇక చరిత్ర ప్రకారం ఆలోచిస్తే ఇక్కడవున్న రెండుగుహలలో ఒకటి వైకుంఠగుహగాను, రెండవదానిని కైలాస గుహగాను పిలువబడుతుంది. ఈ గుహలలోని వైకుంఠ గుహను జాబాలి మహర్షి ఆశ్రమం చేసుకుని తపస్సు చేసుకుంటుంటే, ఒకనాడు వైకుంఠనాథుడు ఆ భక్తుని ఏంకావాలని కోరడం, నీవిక్కడ నిలచి వుండమని భక్తుడు కోరడం జరుగుతుంది. ఆ రకంగా శ్రీమన్నారాయణుడు శ్రీనివాసుడై ఇక్కడ వుండిపోతాడు. కాలక్రమంలో ఎందరో భక్తులు ఇక్కడికివచ్చి స్వామిని సేవించేవారు.




వీరిలో ఉప్పల అక్కుభొట్లు వయోభారంతో కొండ మెట్లు ఎక్కలేక స్వామీ నన్ను దయచూడమని ప్రార్థిస్తాడు. భక్తజనబాంధవుడు 'సరే' నీవు బయలుదేరు, నీవెనుకనే వస్తాను. పొరపాటున వెనుదిరిగావో, అక్కడే ఆగిపోతా నంటాడు. ఇద్దరు బయలుదేరారు. శ్రీవేంకటేశ్వరుని పాద చిహ్నంగల కొండవద్దకు రాగా, పెద్దశబ్దంతో ఉలిక్కిపడి భయంతో వెనుదిరిగాడు. స్వామి ఆగి పోతాడు. అంతర్ధానమౌతాడు. ఆమాత్రమే తన కదృష్టం దొరికిందని ఆ భక్తుడు ఆనందపడి శ్రీస్వామి పూజలో తరించాడు. ఇక్కడ మెట్లమార్గం ప్రాచీన శ్రీవేంకటేశ్వరుని పాదముద్రలు, అలిమేలు మంగతో పాటు ఒక చిన్న శివాలయం వుంది. ఇక్కడి ఉత్సవాలు చెప్పడంకాదు చూసితీరాల్సినవి.

జిల్లా కేంద్రంనుండి 22 కి.మీ లోగల నాగులపంచ గ్రామంలోని శ్రీకోదండరామాలయం, అతి పురాతనమైనదే కాని నిర్మాణకాలం మాత్రం తెలియరావడంలేదు. గర్భాలయ వేదికపై పట్టాభిషేక విగ్రహాలున్నాయి. వీటిలో రామసీతలు ఒకే విగ్రహంలో వుండటమిక్కడి విశేషం. పైగా గోదాదేవి సన్నిధిలో వుండటం ఇంకావిచిత్రం. ఆంజనేయుడు లేకపోవడం మరీ చిత్రం. శ్రీవేణుగోపాలస్వామి ముఖమంటపగోడపై మత్స్యావతారం ... చూడదగ్గది.

కూసుమంచికి ఉత్తరదిక్కున వుందీ పరమేశ్వరాలయం. కాకతీయుల పాలనాదక్షతకు, కళానైపుణ్యానికి మచ్చు తునక. పెద్దపెద్ద బండరాళ్ళు పేర్చి, శిల్పాకృతులు ఏర్పరచడం వారికే చెల్లిన విద్య. ఇవ్వాళ మనం గొప్పగా చెప్పుకునే సాంకేతిక పరిజ్ఞానంతో పనిలేకుండా, 19 అడుగుల ఎత్తు 5 అడుగుల మందము, 7 అడుగుల వెడల్పు గల బండలను, దాదాపు 35 టన్నుల బరువువుండే వాటిని 55 అడుగుల పైకి లేపటం ఆనాటి సమర్ధతకు చెప్పని సాంకేతిక నైపుణ్యానికి ఒక పరాకాష్ట. దక్షిణ భాగంలోని శ్రీవేణుగోపాల స్వామి గుడి వరంగల్లులోని వేయిస్తంభాల (రుద్రేశ్వరాలయం) గుడిని గుర్తుచేస్తుంది. ప్రధానాలయానికి మూడు వైపుల ఉత్తర–దక్షిణ–తూర్పులలో మార్గా లున్నాయి. వీటిమధ్య గుండ్రంగా చెక్కిన 15 అడుగుల వెడల్పుతో గుండ్రని మండపం, మధ్యలో తిరిగేందుకు మార్గంతోపాటు ఆలయంలో 2 గదులున్నాయి.

మొదటి గదిపై భాగాన గొలుసువలె కన్పడే ఏనుగుల శిల్పాలు అత్యంత రమణీయం. ఇక ఆలయంలోని శివలింగం ఈ రాష్ట్రంలోనే పెద్దదానిగా చెబుతారు. ఈ శివలింగంపై సూర్యకిరణాలు పడేటట్లు రూపుదిద్దిన ఆలయం. ఇక్కడి ఉత్సవాలు ఘనమైనవి, ఘనత వహించినవి. కనుక మనం చూడాలికదూ! ఓం నమశ్శివాయ.

జీళ్ళచెరువు శ్రీవేంకటేశ్వరాలయం ఇప్పటిది. శ్రీవేంకటేశ్వరుడు కలియుగ వరదుడు, నిత్యకల్యాణచక్రవర్తి దర్శించాలి. అడుగడుగుదండాలు పెట్టి మన భక్తిని ప్రకటించుకోవాలి.

## మహదేవ శివాలయం - కల్లూరు

కాకతీయుల కళాపోషణ ఎంతగొప్పదో వీరశైవభక్తి కూడా అంతేగొప్పది. కుసుమంచి కుక్కనూరు, కమిడిచెర్లనుండి, పెనుబల్లి వరకేకాదు, ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా కాకతీయ కళాపోషణ కనబడకుండాపోదు, చూడకుండా వుండలేము. కాకపోతే ఈ ఆలయం శ్రీప్రతాపరుద్రుడు నిర్మించడమొక విశేషం. శివపార్వతుల కల్యాణం స్వయంగా ఆలయంలో జరిపించడం మరొక విశేషం. ఇంకా ఆలయం చుట్టు పంచలింగాలున్నాయి. ఆనాటి ధ్వజస్తంభం కూలిపోయింది కాని చెప్పుకునేటందుకు కోనేరు వుంది. ఇక్కడే మహారాణి రుద్రమదేవి, తమ శివభక్తిని, వైష్ణవత్వాన్ని కూడా కల్పి గౌరవించిన ఘనులుగా శ్రీవేణుగోపాలస్వామి, ఆలయాన్ని నిర్మించింది. నిత్య పూజలతో అది కళకళ లాడుతుంది.

## గజగిరి - శ్రీనరసింహాలయం

నాగులపంచకు 5 కి.మీ దూరంలో జగన్నాథపురంలో చింతచెట్టుక్రింద వెలసిన కనకదుర్గ అమ్మవారి పెద్దమ్మతల్లిగా ఈ ప్రాంతం ఆరాధ్యదేవత. భక్తజనరక్షకి, వరదాయిని, పూర్వం ఈ అడవిప్రాంతంలో ఇప్పుడు పెద్దమ్మతల్లి వుండే చింతచెట్టు క్రింద పులి విశ్రాంతి తీసుకునేది. మొదట్లో భయపడేవారు రాను, రాను దానికి దండంపెట్టడం, ఆపై చిన్న ఆలయం నిర్మించడం, ఆ పులే అమ్మవారిగా, దేవతాస్వరూపంగా తలవడం, చివరకు అక్కడొక పెద్ద ఆలయం భక్తజనుల సందోహం, ఉత్సవాలు, పూజలు అన్నీ ఆనందదాయకాలే. పాల్గొనాలని అనిపించేవే!

ఖమ్మానికి 40 కి.మీ దూరంలో గార్లవుంది. గార్ల అనేసరికి అటువైపువారికి ఆలయాల సముదాయంగా కనుపిస్తుంది. ఇక్కడ 15వ శతాబ్దంనాటి ప్రాచీన శ్రీవేంకటేశ్వరాలయం, ఆనాటి శోభలు, ఆభరణాలతో కనువిందు చేస్తున్నాయి. ఇక చరిత్రకు వస్తే 'ఎడ్డివెంగళయ్య' అనే మూగభక్తునికి శ్రీవేంకటేశ్వరుడు కనుపిస్తే దానిని గ్రామస్థులకు సైగలతో చెబుతాడు. వారు నమ్మక పరిహసిస్తే, ఆనాటి రాత్రి వారిలో ఒక వ్యక్తికి స్వామి కనిపించి విషయం చెబితే స్వామికోసం తెల్లవారి బయలుదేరుతారు. వారు చూస్తుండగా స్వామి గోవుగా మారి కొంతదూరం వెళ్ళి జువ్విచెట్టు వద్ద శిలాకృతి దాలుస్తాడు. ఇక పంచలోహవిగ్రహాలు కూడా అక్కడ పుట్టలో దొరికినవే. గార్ల వేంకటేశ్వరుడంటే తిరుమల వేంకటేశ్వరుడే. ఇక ఇక్కడ జరిగే ఉత్సవకళ్యాణాలు, ఈ ప్రాంతాలవారికి కమనీయాలు.

## రామగిరి - శ్రీసీతారామాంజనేయస్వామి

ఈనాటి ఆలయంలో వెలిసినవాడు ఒకనాటి భక్తానుగ్రహ సంరక్షకుడు పరిపాలకుడు.

ఖమ్మం మండలంలోని తీర్థాల గ్రామంలో కూడలి సంగమేశ్వరాలయం చెప్పుకోదగ్గది. దర్శించదగ్గది. చరిత్ర

ప్రకారంచూస్తే శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం చూసిన మునులు తమ సంచారంలో భాగంగా ఈ ప్రాంతానికివచ్చి 'ఆలేరు–మున్నేరు–బుగ్గలేరు నదుల సంగమ ప్రాంతంలో శివుని ప్రతిష్ఠించాలని పరమేశ్వర సంకల్పంగా తలచి ప్రతిష్ఠించి, వాళ్ళు తరించారు. మనకు సంగమేశ్వరుడిని అందించారు. మరొక కథ ప్రకారం ఒక ఆయుర్వేద వైద్యుడు వనమూలికల కోసం అడవికి వెళ్ళి ఆప్రాంతం త్రవ్వుతుంటే అపురూప శివలింగం లభిస్తుంది. దానికి 'పాకయాజి' అనే మరో బ్రాహ్మణుడు ఆలయం కట్టిస్తాడు. దీంతో ఇక్కడ సంగమేశ్వరుడు, అలాగే శ్రీవేంకటేశ్వరుడు, సృష్టికి – రెండు కళ్ళుగా తీర్థాలలో వెలియడం, ఎందరికో ఆనందం కాదు, అందరికి ఆనందం కలిగించింది. ఇక్కడ శ్రీస్వామికి కుంకుమార్చనలు, కల్యాణాలు నిర్వహించడమొక అపురూప కార్యక్రమంగా అక్కడవారు పరవశిస్తారు.

**మోల్‌మెట్ట శ్రీవీరభద్రాలయం,** గోదావరి అవతల ఒడ్డునగల ఇరవెండి గ్రామంలోని పురాతన శ్రీవేణుగోపాల స్వామి, రుక్మిణీసత్యభామ సమేతుడై వున్నాడు. ఈయనకు సంతాన ప్రదాతగా పేరు. కానీ ఈనాడు ఏభోగం లేనట్లు శిథిలమవుతోంది. దీనిని చూసే భక్తరామదాసు భద్రాచలాన్ని తీర్చిదిద్దాడని అనుకుంటారు. ఇక్కడ "యోగమాయ" విగ్రహం ఆలయంముందు భాగంలో వుంది. ఈ తల్లిని స్మరించినా స్పృశించినా, సర్వగ్రహ, దుష్టపీడలు, సర్వము నివారణమౌతాయిట.

## జీళ్ళచెరువు - శ్రీసీతారామచంద్రస్వామి

ఇది 300 ఏండ్ల శ్రీసీతారామచంద్రులవారి దేవస్థానం. దీనిని శ్రీయరసాని వరదారెడ్డిగారి నాయనమ్మకు, మీ ప్రాంతంలోని కొండపై శ్రీసీతాలక్ష్మణ ఆంజనేయ సమేతుడిగా తాను వెలుస్తానని, కలలో శ్రీస్వామి చెప్పగా, దాని నామె అందరికి తెలిపారు. ఆ రకంగా స్వామివారు ఇక్కడ ఒక తులసి చెట్టు, 12 బారుల బండరాయి, నాగేంద్రుని పడగ రూపంలో స్వామివారు ధనుర్బాణధారిగా అందరికి కనుపించడంతో ముందు విస్తుపోయినా ఆ తర్వాత అంజలి ఘటించారు. ఆనాటి నుండి ఆలయనిర్మాణం, ఆతదుపరి అర్చనాదులు భద్రాచలం వలె అభిజిల్లగ్నంలో కల్యాణం, కమనీయం, కామితార్థప్రదాయకం.

భద్రాచలానికి 100 కి.మీ దూరంలో **"పేరంటపల్లి"** లో ఎంతో గొప్పది, ప్రాచీనమైన శివాలయం వుంది. దీని పేరు **పరమేశ్వరాలయం**. ఇదిప్పుడు కాలం కలిసివచ్చినట్లు పర్యాటక కేంద్రంగా రూపొందుతోంది.

**కొత్తగూడెం** గ్రామంలో వెలిసిన **శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి.** ముఖ్యంగా పిల్లలదేవుడైన ఈ విజయ గణపతి పరీక్షలకు వెళ్ళేవారిని, శుభకార్యాలు జరుగక విఘ్నములతో బాధపడేవారిని కరుణించి కాపాడే దేవుడు ఈ ఆదిపూజ్యుడు.

భద్రాద్రికి 5 కి.మీ దూరంలో వుంది ఈ మోతిగడ్డ గ్రామం. ఈ గ్రామంలో గోదావరి మధ్యగల కొండపై వుంది శ్రీవీరభద్రస్వామి ఆలయం. దక్షయజ్ఞంలో తను తొందరపడి పుణ్యమూర్తులను పీడించినందులకుగాను, ఇక్కడ శ్రీరామనామ తారకమంత్రాన్ని జపిస్తూ ధన్యుడయ్యాడు ఈ వీరభద్రుడు. ఈ ఆలయం కాకతీయులు నిర్మించారంటారు. ఇక్కడ శివాలయం కూడ వుంది.

## ఉగ్రనరసింహస్వామి - మల్లూరు

భద్రాచలానికి 100 కి.మీ దూరంలోని మల్లూరులో 6 అడుగుల ఎత్తు, 8 భుజాలతో శ్రీనరసింహస్వామి కొలువైవున్నాడు. ఈ ప్రాంతాన్ని ఒకప్పుడు "హేమాద్రి" అని కూడా పిలిచేవారు. ఇక్కడగల 'చింతామణి' జల నిరంతరం, ఏ అంతరంలేకుండా ప్రవహిస్తుంది. పూర్వమిక్కడ గుహలలో నవనారసింహులుండేవారని అంటారు. ఇక ఇక్కడి నారసింహుడు ఉగ్రుడే అయినా దుష్టజనశిక్షకుడు, భక్తజనరక్షకుడుగా ఈ ప్రహ్లాదవరదుడు వినుతికెక్కాడు. వైశాఖ శుద్ధ పున్నమినాడు శ్రీస్వామివారి కల్యాణం. ఇక నిత్యపూజలు, అభిషేకాలు, ఇతర ఉత్సవాలు, యధావిధి క్రమం తప్పకుండా జరగడమొక విశేషమనే చెప్పాలి.

## నేలకొండపల్లి - ఉత్తరేశ్వరాలయం

"నేలకొండపల్లి" అనేసరికి చటుక్కున 'విరాటనగర'మంటారు. అంత ప్రాచీనమైనదిక్కడి ప్రాంతం. ఇక్కడి ఉత్తరేశ్వరాలయం. ఇక్కడగల ప్రాచీన బౌద్ధస్థూపాన్ని విరటుని గద్దెగా పిలవడం వలన, విరటుడన్నా వారి రాజ్యమన్నా ఇక్కడి వారలకు భక్తిప్రపత్తులు ఎక్కువని తెలుస్తుంది. ఇక ఇక్కడి శివాలయాన్ని విరటుని కుమారుడు ఉత్తరుడు నిర్మించాడని, ఆతని పేరున ఉత్తరేశ్వరాలయం ప్రసిద్ధిచెందిందని ప్రతీతి.

ఇక్కడి **భక్తరామదాసు మందిరం** – తలుచుకోదగ్గది దర్శించతగ్గది. ఎందుకంటే ఈ రామదాసు ప్రాతః స్మరణీయుడంటే – అది దోషంలేని మాట. నిజం చెయ్యాల్సిన మాట. శ్రీరామదాసు ఇక్కడే వున్నాడన్న ఈ స్థలాన్ని ప్రయాగ లక్ష్మీనరసింహంగార్కి, రామదాసుగారో, వారి వంశీకులో దానమిస్తే, 1972 సం॥లో ఆ వంశస్థులనుండి మరల దానం పొంది, శ్రీరామదాసు స్మృతిచిహ్నంగా ఈ మందిరాన్ని నిర్మించారుట. దీని వలన ఇద్దరు భక్తులను ప్రతినిత్యం ఉదయాన్నే స్మరించుకోవచ్చును.

ఒకనాటి **"ముత్తారం"** నేటి కృష్ణాపురంలో, **శ్రీరామచంద్రప్రభువు దేవాలయం** వుంది. సుమారు 250 సం॥ల క్రిందట వనం కృష్ణరాయలనే భక్తుడు ప్రతి సంవత్సరం భద్రాద్రికి వెళ్ళి 'శ్రీ'రామకల్యాణం, చూసి వచ్చేవాడు. వయస్సు మళ్ళుతుంటే అడుగుసాగక 'స్వామీ! ఈ సంవత్సరం ఎలాగో వచ్చాను. ఇకపైన ... అడుగుపడని ఆ భక్తుని అశక్తత, ఆవేదనని రాముడు విన్నాడు. ఒక భక్తుని వేషంలో వచ్చి జాగ్రత్తగా ఆతనిని ఇంటివద్ద దింపుతాడు. అయినా కృష్ణరాయలుకు దిగులు. వచ్చే సంవత్సరం ఎలాగ? అందుకు రాముడు ఆ రాత్రి అతని కలలో కనుపించి 'భక్తా! బెంగపడకు. నీతోటలోని పుట్టలో భద్రాద్రి పోలికలతో నే నిలిచివున్నాను. నన్ను వెలికిదియ్యి. ఆలయం కట్టించు. భద్రాద్రిలో చేసే అభిజిల్లగ్న కల్యాణం కాక, ఇక్కడ సూర్యాస్తమయానంతరం కల్యాణం జరిపించమని సూచిస్తాడు. ఆ రకంగా ఇక్కడ స్వామి వెలియడం, కల్యాణాలు జరగడం ఒక బ్రహ్మానందమై కూర్చుంది.


**అన్నపురెడ్డిలోని** (ఖమ్మంకు 75 కి.మీ) **బాలాజీ దేవాలయానికి** 700 సంవత్సరాల చరిత్ర వుంది. కాకతీయుల కాలంలో నిర్మించినట్లు చెబుతారు. అయితే కాలంచేసే గాయాలకు, కొంత వెనుకబడినా తిరిగి స్వామి శక్తి, భక్తి లోకానికి వుంది. తన చిద్విలాసాన్ని, లీలావిలాసాలను శ్రీవేంకటేశ్వరుడు ప్రకటించు కున్నాడు. భక్తజనులకు ఆనందదాయకుడయ్యాడు. ఇక్కడ ఉత్సవాలకు, సంబారాలకు కొదవలేని కొండంత దేవుడి ఆలయమిది.

మధిరకు 15 కి.మీ దూరంలోని **"తక్కెళ్ళపాడు"** లోని ఈనాటిదైనా మహాద్భుత ఆలోచన, నిర్మాణం **"శ్రీ లలితామహాత్రిపురసుందరీ" ఆలయం**. ఈ తక్కెళ్ళపాడు గ్రామవాసి శ్రీగుంటుపల్లి సత్యనారాయణ ఈ ఆలయాన్ని నిర్మించారు. కంచి కామకోటి శ్రీశ్రీశ్రీ జయేంద్రసరస్వతీస్వామి వారిచేతులమీదుగా ప్రతిష్ఠా కార్యక్రమం మొత్తం జరిపించారు. శ్రీలలితా మహాత్రిపురసుందరీ ఆలయం, అపురూపం, అద్వితీయం. ఆ తల్లి స్మరణమే సకలపాపహరణం జ్ఞానతేజోవంతము.

ఖమ్మంజిల్లాలోని "రామగిరి" ప్రాంతాన్ని దండకారణ్యంగా పిలువడం, దీనిని దండుడనే రాక్షసుడు తన ఏలుబడిలోకి తీసుకోవడం అందరికి తెలిసిందే. మాయలేడి పేరుతో రావణుడు, ఇక్కడకుటీరము నిర్మించుకుని కాలం గడిపే అపురూప దంపతులలోని సీతమ్మను మాయచేసి తీసుకుపోతుంటే జటాయువు అడ్డుపడి, రావణుని చీకాకుపెడతాడు. దాంతో రావణుడు జటాయువు రెక్క నరుకుతాడు. అదిపడ్డ ప్రాంతం 'జటాయురెక్క" ఝతపాకగాను, రానురాను 'యటపాక' అయింది.

రెండవరెక్కను నరకగా పడిన ప్రదేశము రెక్కిపల్లి, రేఖపల్లిగా ఇప్పుడు పిలువబడుతోంది. అశక్తుడైన జటాయువు రామనామంతో, కొనప్రాణాలతో రాముని కోసం ఎదురుచూస్తుంటే, రాముడాదిక్కుకు వచ్చి జటాయువు నుండి సర్వం విని, తన చేతులలో ప్రాణం విడిచిన ఆ పెద్దబుద్ధి జటాయువుకు దహనసంస్కారాలు చేసిన ప్రాంతమిదేనని శబరికి మోక్షము ఇచ్చిన ప్రదేశమిదేనని చెప్పుకుంటారు.

## స్తంభాద్రి - శ్రీలక్ష్మీనరసింహుడు


శ్రీ స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం (గుట్ట), (ప్రాచీన దివ్యక్షేత్రం), ఖమ్మం.

ఖమ్మంలో పట్టణంనడిబొడ్డున 150 అడుగుల ఎత్తు గల కొండపై ఈ స్వామి వేంచేసియున్నాడు. ఈ నారసింహుడు హిందూ మహమ్మదీయ భేదం లేనివాడు. అందర్నీ అనుగ్రహించే స్వయంభువుడు. మౌద్గల్య మహర్షి కోరిక మేరకు ఇక్కడ స్వామి స్తంభంనుండి వెలిసినట్లు, అలనాటి భక్తప్రహ్లాదుని భక్తికి కట్టుబడి, హిరణ్యకశిపుని వధ చేసినట్లు ఈనాడు మహర్షి ప్రార్థనతో ఇక్కడ వెలసి దుష్టజన శిక్షణ, శిష్టజన రక్షణ తనధ్యేయంగా ధర్మమూర్తిగా ప్రకాశిస్తున్నాడు. దరిచేర్చి భక్తుల నాదుకుంటున్నాడు. దక్షిణాముఖుడైన ఈ స్వామి చెంత శ్రీలక్ష్మీ, ప్రక్కన అద్దాలమంటపం, ఎదురుగా ధ్వజస్తంభం, దాని ప్రక్కన తూర్పుముఖంగా ఆంజనేయుడు, శ్రీవేంకటేశ్వరస్వామి, వెనుకవైపు ఎప్పుడు నీళ్ళుండే కోనేరు చూడాలి, తరించాలి. అప్పుడే కదా జన్మ ధన్యం.

# మహబూబ్‌నగర్ జిల్లా

## అలంపురం - జోగులాంబ

అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన ఈ తల్లి గురించి "అమ్మ కదా! లోకానికి రావలసినంత అందుబాటులోకి, వెలుగులోకి, రాలేదు. కర్నూలునుండి అలంపురానికి 30 కి.మీ. దూరం. ఇటు నుండి వెళ్ళడమే శ్రేయస్కరం. కర్నూలుకు 15 కి.మీ. దూరం "అలంపురం రోడ్డు" అనే రైల్వేస్టేషనువున్నా అక్కడినుండి వూళ్ళోకి మరో 15 కి.మీ. వెళ్ళాలి. కాబట్టి కర్నూలునుండి వెళ్ళడమే మంచిది. ఉదయాన్నే వెళ్ళి సాయంకాలానికి ఎటువంటి పరిస్థితులలోను తిరిగివచ్చేయవచ్చును.



మహబూబ్‌నగర్‌కు 90 కి.మీ దూరంలో తుంగభద్రానదీతీరంలో అలంపురంలో వెలసిన జోగిలాంబ దేవాలయం చరిత్ర ప్రసిద్ధిగాంచినదేకాదు శ్రీశైలానికి పశ్చిమ ద్వారంగా కూడా చెప్పబడుతుంది. సిద్ధవటం, త్రిపురాంతకం, ఉమామహేశ్వరాలు దక్షిణ, తూర్పు, ఉత్తర ద్వారాలుగా చెప్పబడుతున్నాయి. 18 శక్తిపీఠాలలో అయిదవదీ తల్లి. ఇక్కడ జోగులాంబతోపాటు బాలబ్రహ్మేశ్వరుడు అధిష్ఠానదేవత. దీనిని శైవ పీఠంగా దక్షిణ కాశీగా పిలుస్తారు. అంతేకాదు అలంపురాన్ని కాశీక్షేత్రంగా కూడా పిలుస్తారు. ఇక్కడ కోటిలింగాలు కూడా ప్రతిష్ఠించినట్లు చెబుతారు. ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని హలం (నాగలి) పురంగా పిలిచేవారు. అది రానురాను 'అలంపుర'మై వెలసిల్లింది. ఇచ్చటి గ్రామదేవత ఎల్లమ్మతల్లి. ఈ తల్లిపేరునే ఎల్లమపురం, ఎలంపురం... అంటూ కాలక్రమేణా అది 'అలంపురం'గా మారిందనేది కొందరి అభిప్రాయం.

ఇక ఇక్కడి ప్రధానదేవతలైన, ఈశ్వరుని, జోగులాంబ తల్లిని ప్రతిష్ఠించింది బ్రహ్మదేవుడేనని, అందుకనే ఇక్కడి శివుని బాలబ్రహ్మేశ్వరుడని పిలుస్తారని, ఈ క్షేత్రాన్ని బ్రహ్మేశ్వర్యపరశురామక్షేత్రమని, శక్తిపీఠమని పిలుస్తున్నారని స్థలపురాణం ద్వారా తెలుస్తుంది. ఇచ్చటి తల్లి నిజానికి స్వయంభువుగానే ప్రసిద్ధిచెందింది. 200 సం౹౹ వరకు జోగులాంబ, బాలబ్రహ్మేశ్వరాలయం వుండేది. అప్పుడే తల్లిని కిటికి గుండా చూడవలసివచ్చేది. అనంతరం ఈ తల్లికి ప్రత్యేకంగా ఆలయం కట్టి ప్రతిష్ఠించడంతో అమ్మను కనులారా దర్శించే అదృష్టం భక్తజనులకు కల్గింది.

అలంపురంలో కృష్ణ – తుంగభద్రల సంగమస్థలంలో నవబ్రహ్మల ఆలయాలు కూడా వున్నాయి. తేజస్వరూపమైన అమ్మదర్శనం అనంతానందదాయకం. అమ్మ కేశాలు గాలిలో తేలుతూవుండి, అందులో బల్లి, తేలు, గబ్బిలం, కపాలం వంటివి చిత్రంగా కనుపిస్తాయి. దీనివలన ఎవరింట్లోనైనా కళతగ్గితే ఇవి వరుస వెంబడి కనుపిస్తాయని, ఒకదాని వెంట మరొకటి ఆ కుటుంబ నాశనాన్ని /మరణాన్ని సూచిస్తాయని చెప్పుకుంటారు.

ఈ ఆలయాలను బాదామి చాళుక్యులు కాలంలో నిర్మించబడ్డాయని, ఆరవ శతాబ్దం మధ్యకాలంలో రెండువందల సం౹౹లో సాగించిన పరిపాలనా కాలంలో తొమ్మిదిమంది శిల్పులతో విడివిడిగా ఈ నవబ్రహ్మల ఆలయాలు నిర్మించబడ్డాయని, అవి 1. బాలబ్రహ్మేశ్వర, 2. కుమార, 3. అర్క, 4. వీరబ్రహ్మేశ్వర, 4. విశ్వ, 6. తారక, 7. గురు, 8. స్వర్ణ, 9. పద్మ బ్రహ్మేశ్వరాలయాలని చెబుతారు. వీటిల్లో ప్రముఖమైన బాలబ్రహ్మేశ్వరాలయం క్రీ౹౹శ౹౹ 702 నాటిగా చరిత్రకారులు గుర్తించారు.

ఈ నవబ్రహ్మేశ్వరాలయాలలో రెండో, మూడో తప్ప మిగిలినవన్నీ చెప్పుకునేటందుకు తప్ప, చరిత్రకందవు. విగ్రహాలు లేవు. గోపురాలు దెబ్బతిన్నాయి. తలచుకుని, తలచుకుని బాధపడాలి. ఇక్కడి కోటలోని నరసింహస్వామి దేవాలయం, దానివద్ద గల కోనేరు చెప్పుకోదగ్గవి. ఎక్కడ పుట్టిందో తెలియదుకాని, ఆ నీరు తుంగభద్రలో కలవడం ఒక విశేషం.

బాలబ్రహ్మేశ్వరాలయంలో చేసే అభిషేకజలం చిత్రంగా అక్కడే ఇంకిపోతుందితప్ప, ఎక్కడికీ పోదు. ఇచ్చటి ఎనిమిది చేతులతో ప్రకాశించే మాధవిమాత – స్మరిస్తే తరింపచేస్తుంది. ఇక స్థల పురాణానికి వస్తే ఈ ప్రాంతం ఒకనాటి జమదగ్ని మహర్షి తపోప్రాంతం. మహాపతివ్రతయైన రేణుకామాత క్షణకాలం అచ్చటి నదికి తన భార్యలతో జలక్రీడలకై వచ్చిన మహారాజు విలాసాలకు భ్రమపడటంతో, ఆమె ఎప్పుడూ చేసే ఇసుకకుండ ఆనాడు తయారుకాలేదు. మహర్షి అనుష్ఠానానికి జలం తీసుకువెళ్ళలేకపోతుంది. వట్టి చేతులతో వచ్చిన ఆమెను, పరిస్థితిని దివ్యదృష్టితో గమనించిన మహర్షి తన పిల్లల్ని పిలిచి, ఆవేశంతో తమ తల్లిని వధించమని ఆదేశిస్తాడు. వారు ధిక్కరిస్తారు. చివరకు అందరిలోకి చిన్నవాడైన రాముడు పితృవాక్య పరిపాలకుడౌతాడు. ఇది అందరికి తెలిసిందే. కాకపోతే ఇక్కడి విశేషం రాముడు పరశువుతో తల్లి తలను ఖండిస్తే అదికాస్తా, ఛండాలురు నివశించే ప్రాంతంలో పడేసరికి, ఆమెను ఎల్లమ్మగాను, మొండాన్ని ఇక్కడి బాలబ్రహ్మేశ్వర ప్రాంతంలో భూదేవిరూపంలో, సంతాన ప్రదాత్రిగ ప్రకాశిస్తుందని వరమిచ్చారని, అక్కడి విశేషానికి ఒక పురాణగాథ చెబుతారు. కనుక ఈ దివ్య క్షేత్ర దర్శనం, ఈ సంగమ స్థలస్నానం, ఇచ్చట చేసే పుణ్యకార్యాలు, ఎంతో శ్రేష్ఠమన్నారు కనుక మనం కూడా ఆ దివ్య క్షేత్రదర్శనానికి ప్రయత్నిద్దాం.

అలంపురంలోని ప్రధానాలయం బాలబ్రహ్మేశ్వరాలయం. దీనిని ఆనుకుని మరో ఏడు ఆలయాలు, అర కి.మీ దూరంలో పాపనాశనతీర్థం వున్నాయి. తీర్థసమీపంలోకూడా పురాతన ఆలయాలు కొన్ని కనబడుతాయి. బాలబ్రహ్మేశ్వరాలయానికి పడమటగా సంగమేశ్వరాలయం వుంది. ఇది దర్శించదగ్గ దివ్యాలయం. బాల బ్రహ్మేశ్వరాలయం ప్రాంగణంలో "గరుడబ్రహ్మ, స్వర్గబ్రహ్మ, పద్మబ్రహ్మ" అనే మూడు చిన్న ఆలయాలు, లోపలికి ప్రవేశిస్తుంటే ద్వారానికి ఆనుకుని కుమారబ్రహ్మ ఆలయం, దానివెనుక మ్యూజియం వున్నాయి.

కుమారబ్రహ్మవున్న ఆలయం దాటుకుని కొద్దిగా ముందుకు వెడితే అక్కడ అర్కబ్రహ్మ, విశ్వబ్రహ్మ, వీరబ్రహ్మ ఆలయాలున్నాయి. ఇక్కడ తారకబ్రహ్మ ఆలయం కూడా వుందని చెబుతారు. ఈ బాల బ్రహ్మేశ్వరాలయాన్ని బ్రహ్మసృష్టిగా చెబుతారు. స్థల పురాణమైతే, రససిద్ధుడు ఈ ఆలయాన్ని శివుని ఆదేశంతో నిర్మించినట్లు, శివుడితనికి తలనుండి జోగులాంబను నోటినుండి గణపతిని, నాభినుండి "రసము"ను అనుగ్రహించాడుట. దీనివల్లనే అతడిక్కడ ఆలయం నిర్మాణం గావించాడంటారు. ఇవన్నీ చారిత్రక ప్రాధాన్యం కల్గివున్నాయి. కొన్ని ఎర్రఇసుక రాతి నిర్మాణాలను కూడ మనం చూడవచ్చు. ఎంతో చరిత్ర కల్గిన ఈ ఆలయాలు నిజంగా అపురూపాలు.

ఇక్కడి సంగమేశ్వరాలయం చారిత్రకంగా, శిల్పకళారీతిగా చెప్పుకోదగ్గ దర్శించగల క్షేత్రం. నిజానికి ఇది ఆనాటి ప్రాచీన ఆలయంకాదు. కానీ, శ్రీశైలంవద్ద ఆనకట్ట కట్టడంతో తుంగభద్ర కృష్ణానదుల సంగమస్థానంలో ఈ ఆలయం వుండేది. వర్షాకాలంలో వరదలు వచ్చినపుడు ఇది మునిగిపోతుందని, పురాతత్వశాఖవారు ఆ ఆలయాన్ని యథాతథంగా విడదీసి, అలంపురానికి అర కి.మీ దూరంలో విశాలమైన ప్రదేశంలో నిర్మించి, చరిత్రకు సముచితస్థానం కల్పించారు.

ఇది దర్శించవలసిందేతప్ప, దారి విడిచినట్లు, ప్రక్కదారి పట్టి, తప్పుకునే క్షేత్రంకాదు. ఎందుకంటే దీనిని శాతవాహనులు, ఇక్ష్వాకులు, పల్లవులు, చాళుక్యులు... మరెందరో మహనీయులు దర్శించి, తమ భక్తిప్రపత్తులను చాటుకున్నక్షేత్రం.

## కురుమూర్తి - వేంకటేశ్వరుడు

ఆత్మకూరు పట్టణానికి 13 కి.మీ దూరంలో చింతకుంట మండలం, కురుమూర్తి గ్రామంలోని ఏడుకొండలలోని కాంచన గుహలో వెలసిన శ్రీనివాసుడు ఆ తిరుమలవాసుడేనని, కుబేరుని వడ్డి తాకిడికి తట్టుకోలేక స్వామి ఒక అర్ధరాత్రి ఇక్కడికి వచ్చి కొంతసేపు విశ్రాంతిగాను, ఇక్కడి కాంచన గుహలో వెలిసాడని, స్వామిరాకకు పులకరించిన కృష్ణవేణమ్మ ఉత్తరదిశగా వెళ్ళబోయే స్వామికి పాదుకులను సమర్పించిందని, కాలక్రమంలో వాటికి, కాకతీయులనాటి నుండి 'ఉద్దాల'సేవగా చేస్తున్నారని చరిత్ర చెబుతుంది. ఆనాడు స్వామివారు తన దేవేరితో స్నానం చేసిన ప్రదేశం 'గుండాలజలాశయం'గా పిలువబడుతోంది. తిరుమలకు, ఈ కాంచనగుహల కురుమూర్తి వేంకటేశ్వరునికి ఎంతో సామ్యంవుంది. ఇచ్చటి కార్తీకపౌర్ణమికి ముందు జరిపే బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిపే కల్యాణోత్సవంలో రాయలసీమనుండి తెచ్చిన ఆవుచర్మంతో చేసిన పాదుకలకు గొప్ప వూరేగింపు జరుగుతుంది. ఈ ఉత్సవాన్ని దర్శించడానికి, ఈ పాదుకలతో కొట్టించుకోవడానికి ఎక్కడెక్కడినుండో ఎందరో, అసంఖ్యాకంగా వస్తుంటారు. ఇది విని, చదువదగ్గదేకాదు, చూసి, తరించవలసిందికూడా!

## బీచుపల్లి - ఆంజనేయుడు

అతి పురాతనమైనదని అనడానికి వీలుగా 16వ శతాబ్దంలో, ప్రహ్లాదస్వరూపుడు, రాఘవేంద్రులకు ముందు తరాలవాడు, శ్రీకృష్ణదేవరాయల గండకాలాన్ని తొలగింపచేసిన శ్రీశ్రీశ్రీ వ్యాసరాయలవారు ప్రతిష్ఠించిన మహామూర్తి. ఈ మారుతి. ఈయనను ఇక్కడి జనులు "బీచుపల్లి రాయుడు" అనికూడా పిలుస్తారు. ఇక ఈ క్షేత్రస్థల పురాణాన్ని కనుక గమనిస్తే – తమ పర్యటనలో భాగంగా శ్రీవ్యాసరాయలవారు తమ శిష్యులతో పర్యటిస్తున్న సమయంలో, ఒక శిష్యుడు ఈ ప్రాంతానికి వచ్చాక కృష్ణానది ఒడ్డునగల ఒక బండపై శ్రీగురువుల కాషాయవస్త్రాలను ఉతుకబోతే చిత్రంగా ఆ రాయి నేను 'ఆంజనేయస్వామి' ననేసరికి భయపడి, పరుగు పరుగున గురుదేవులను చేరి ఆ విషయం చెబుతాడు.

ఆ విషయాన్ని విన్న శ్రీవ్యాసరాయలవారు శిష్యుడు చెప్పిన బండవద్దకు వస్తే మళ్ళీ 'తాను ఆంజనేయ స్వామిననేసరికి ఆ బండను అతికష్టంమీద దొర్లిస్తే క్రింద భాగంలో శ్రీస్వామి దర్శనమైందట. అతులితబలధాముడైన తమను మేము మోయలేమని, మాకు అనుకూలంగా బరువు తగ్గించుకోమని వ్యాసరాయలు కోరుతారు. అందుకు సమ్మతించిన ఆంజనేయస్వామి, తాను ఎక్కడ బరువెక్కితే అక్కడ ప్రతిష్ఠించాలని చెప్పి, వాళ్ళు తీసుకువెళ్ళే విధంగా తేలికవుతాడు. ఈ ప్రాంతంలోని ఒక రావిచెట్టు వద్దకు రాగా స్వామి, తన యథాస్థితిపొందేసరికి అక్కడే స్వామిని ప్రతిష్ఠిస్తారు. ఆ రకంగా స్వామి అక్కడ వెలసి తన అభీష్టం మేరకు బోయలను తమకు పూజారులుగా నియమించుకుంటాడు. ఇది చిత్రమేకాదు, సర్వశక్తిమంతుడు ఈ ఆంజనేయుడు.

## మహబూబ్‌నగర్ ఆంజనేయస్వామి

విదేశీదాడులతో విసిగిపోయినవారు, చివరికి ఆంజనేయస్వామిని రక్షకుని చేసి, తమను, తమ ఆస్తులను కాపాడమని వేడుకొంటారు. ఆ రకంగా వెలసిన భక్తజన పరంధాముడే ఆంజనేయుడు. సర్వజగద్రక్షగా నిలిచి తన వారిని కాపాడుకునే అంజనీసుతుడు, భక్తపరాధీనుడే హనుమద్దేవుడు.

## శ్రీలక్ష్మీనరసింహస్వామి

ఇది ఇటీవల ప్రతిష్ఠించినదే అయినా ఇక్కడ సింహాచలంలో ప్రత్యక్షంగా చూడలేని శ్రీవరాహస్వామి, శ్రీ నరసింహస్వాములు, చిత్రంగా ఇక్కడ విడివిడిగా దర్శనమిచ్చి, అపురూప క్షేత్రం చేసి భక్తజనబాంధవులయ్యారు. వీరిని దర్శించుకోగల్గడం, ఒక అదృష్టంగా తలవాలి. ఇక్కడ వీరితోపాటు, ఇతర దేవీ-దేవతలను, అలాగే కొండమీద రాతిగుండ్లమీద శ్రీవరాహస్వామిని దర్శించ పులకించవచ్చును.

## షాద్ నగర్ - వేంకటేశ్వరుడు

ఫరూఖనగర్‌గా పిలిచే షాద్‌నగర్ వేంకటేశ్వరుడు 1692-1719 సం॥ల మధ్యలో నిర్మించబడిన ప్రాచీన ఆలయం. అచ్చం తిరుమలలోని శ్రీవేంకటేశ్వరుని జ్ఞప్తికి తెచ్చే ఈస్వామి ఆలయంలో సప్తఆలయ సముదాయాలు, వాటిలో రామాలయ, శ్రీనరసింహాలయం, వరాహ, పాండురంగ, రంగనాయక ఆలయాలు కుడివైపున, ఎడంవైపు - భవానీ మాత, శివపంచాయతనాలు, కాలభైరవ - ఆంజనేయ గరుత్మంతాదులను, నవగ్రహాలను దర్శించవచ్చును. ఇక పదవ శతాబ్దంలో నిర్మించబడినట్లు చెప్పే జటప్రోలు శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయం మహబూబ్‌నగర్‌నుండి 158 కి.మీ. దూరంలోని కొల్హాపూరుకు సమీపంలో వుంది. అయితే 10వ శతాబ్దంలో ప్రారంభమైన ఆలయం, కారణమేమైనా 16వ శతాబ్దిలో పూర్తయిందని, ఈ జటప్రోలు రాజవంశీయులు, దీనితోపాటు మరికొన్ని ఆలయాలు నిర్మించినట్లు కూడా తెలుస్తోంది.

## ఉర్కొండ - అభయాంజనేయుడు

నిజాం పాలనలోనేకాదు ఎక్కడైనా శిల్పులు తమకు కావల్సిన శిల్పాల రాతికోసం కొండల నాశ్రయిస్తారు. ఆ అన్వేషణలో కొందరు శిల్పులు 'ఉర్కొండ' కొండపై ఒక పెద్ద శిలను చూసి, అభయాంజనేయునిగా రూపుదిద్ది గట్టుఇప్పలపల్లికి తరలించబోతే, ఆ విగ్రహం తీసుకువెళ్ళే బండి, ప్రస్తుతం స్వామివున్న ప్రాంతానికి వచ్చేసరికి కదలక మొరాయించింది. ఆనాటిరాత్రి స్వామి, శిల్పి భోజరాయలకు కలలో కనుపించి తననిక్కడే ప్రతిష్ఠించమని కోరడంతో ఆ అపూర్వఅభయాంజనేయులక్కడ వెలసి భక్తజనకామ్యక ప్రదాత అవుతాడు. అలాగే ఇక్కడి 24 అ॥ శివుని భారీ విగ్రహంకూడా దర్శించతగ్గది.

## మల్దకల్ (మొదలకల్) లక్ష్మీవేంకటేశ్వరుడు

గుడిలేని వూరు, బడిలేని వూరు బండబ్రతుక్కి సమానమన్నట్లుగా, ప్రతివూరిలో భగవంతుడు ఏదో రకంగా వెలసి భక్తజనులకు కామ్యకప్రదాత అవుతాడు. అందుకే ప్రతివూరుకు అందులోని స్వామికి ఏదో విశిష్ట చరిత్ర వుంటుంది. నంద్యాలనుండి రాయచూరు వెళ్ళే మార్గంలో 14 కి.మీ వద్ద ఈ మల్దకల్ గ్రామముంది. ఇక్కడ లక్ష్మీవేంకటేశ్వరుడు, కలియుగారంభములో తిరుపతిలో అవతరించడానికి ముందు స్వామి ఇక్కడ ఆదిశిలపై తన పాదముంచాడుట. అందుకే ఆదిశిల లేక మొదలకల్లు అని పిలుస్తారని పురాణగాథ. ఇక్కడి ఆదిశిలపై ఈశ్వరుడు తపస్సుచేసాడని, అందుకే ఆ ఆదిశిలపై శ్రీనివాస లక్ష్మీదేవి, అనంతశయన, వరాహ, ఆంజనేయాదులు, ఏకశిలపై వెలిసారని, ఇచ్చటి క్షేత్రపాలకుడు పరమశివుడని స్థలపురాణం తెలుపుతుంది.

ఇంకా ఇప్పటివాడైన వనపర్తి వేంకటేశ్వరుడు, ఎప్పటివాడో అయిన 'వట్టెం'గ్రామంలోని అడ్డగట్టు సొరంగం (గుట్టకింద లింగాపురం)లోని శివలింగానికి, ఇక్కడి గుట్టపైగల శ్రీవేంకటేశ్వరుడు క్షేత్రపాలకుడు. చూడదగ్గవాడు. అలాగే 17వ శతాబ్దిలో లోకాయపల్లి సంస్థానాధీశులు నారాయణపేటకు 4 కి.మీ దూరంలోని అడవిలో రెండు కొండలమధ్య లోయలో నిర్మించిన హౌదుంబర దేవాలయం, అక్కడ సహజంగా ఏర్పడిన కోనేరు, దాని ప్రక్కనేగల ఏనుగులు నీళ్ళు త్రాగడానికి వీలుగా నిర్మించిన బావి, సందర్భనం వలన సకల కోర్కెలు సిద్ధింపచేస్తాయని భక్తుల అపార నమ్మకం.

## సింగోటం - శ్రీలక్ష్మీనరసింహస్వామి



కొల్హాపూరుకు 10 కి.మీ దూరంలోని సింగోటంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి చిత్రంగా లింగరూపుడై విశేష పూజలందుకుంటున్నాడు. ఇక్కడి రత్నగిరి కొండపై రాణిరత్నమాంబ నిర్మించిన 'రత్నలక్ష్మి' అమ్మవారు, ఇది వేయి సం॥లనాటిదని, ఆనాడు సురభి వంశపాలకులలో 11వ తరంవారు, చిన్న ఆలయం నిర్మిస్తే అది ఈనాడు అతిపెద్ద దేవాలయమైంది.

స్థలపురాణం ప్రకారం, ఒక రైతు నాగలి దున్ను తుంటే వచ్చిన శిలను తొలగించి గట్టుపై వుంచుతాడు. కానీ అది తెల్లవారేసరికి రైతు నాగలికి అడ్డుపడింది. దాంతో అతడు భయపడిపోయాడు. ఈ తరుణంలో శ్రీనరసింహస్వామి ఆ ప్రాంతరాజు సింగమనాయకుడి కలలో కనుపించి తన ఉనికిని చెప్పి పవిత్ర ప్రదేశంలో తనను ప్రతిష్ఠించమని కోరతాడు. ఆ శిలే లింగరూపంలోని శ్రీనరసింహస్వామి. ఈ లింగరూపంలోని చిత్రం, ఆకారానికి లింగం. అయితే ఆకృతికి కళ్ళు, ముక్కు, నోరు, నవచక్రాలు, బొడ్డువద్ద రత్నం మనం చూడగల్గుతాము.

ఇక్కడ శివకేశవ భేదం కనబడదు. ఇరువురికి తగు విధంగా సేవలు జరుగుతాయి. ఈ నరసింహస్వామి ప్రక్కనే శివలింగముండటం, ఇందుకు నిదర్శనం. ఈ స్వామికి మ్రొక్కుకున్న ఏ మ్రొక్కయినా తీరుతుందన్న విశ్వాసమే ఇక్కడి భక్తులకు శ్రీనరసింహరక్ష శివరక్షకూడా!

## రంగాపూర్ "ఉమా'మహేశ్వరుడు

అచ్చంపేటకు 8 కి.మీ దూరంలో రంగాపూరు గ్రామం. దీనికి ఎడమవైపున 4.5 కి.మీ గల ఎత్తైన కొండలపై శ్రీఉమామహేశ్వరులు దర్శనమిస్తారు. ఇది శ్రీశైలానికి 92 కి.మీ. హైదరాబాదుకు 144 కి.మీ లలో వుంది. శ్రీశైలానికి ఉత్తరద్వారంగా ఈ ఉమా మహేశ్వర 'రంగాపూరు' పిలువబడుతుంది.



1377 శాసనాలద్వారా కాకతీయ సామ్రాజ్యం పడిపోయాక రేచర్ల వంశస్థుడైన మాధవనాయకుడు ఈ క్షేత్ర నిర్మాణం చేసాడని, మెట్లమార్గం ఏర్పాటు చేసాడని తెలుస్తోంది. ఇది సహజ సిద్ధక్షేత్రం. కొండ చరియ కప్పుగా, ఇరుప్రక్కలా గోడలతో ఆలయం నిర్మించబడింది. స్వామికి కుడివైపున ఉమాదేవి, ఎడమవైపు మహిషాసురమర్దని దర్శనమిస్తారు.

ఈ మందిరంలోని భూగర్భ జలధార కాలంతో పనిలేకుండా ఎప్పుడు ఒక చెంబుడు నీళ్ళు వూరుతునే వుంటుంది. 1280 ప్రాంతంలో దీనిని 'చెన్నమహేశ్వరం'గా పిలిచేవారుట. ఇక్కడ చతుర్భుజ గణపతి, దుర్గాదేవి వగైరా దేవతామూర్తులున్నారు. పండుగలు, జాతరలు, పరమోత్సాహంగా జరుపుకునే దివ్యక్షేత్రమిది. పర్వదినాలు, జాతర్లలో ఎక్కడెక్కడివారో, ఇక్కడికి వచ్చి, స్వామి దర్శనం చేసుకుని, జాతర్లు ఉత్సవాలలో పాల్గొని తరిస్తారు.

## గండి - మైసమ్మ

హైదరాబాద్‌నుండి కర్నూలుకు వెళ్ళే రహదారిలో 50 కి.మీ దూరంలోని మైసిగండిలోని వేపచెట్టుక్రింద బురుజు గోడలో ఈ మైసమ్మతల్లి వెలసింది. ఈమె ఎప్పటిది? అంటే ... ఎప్పటిదో... కొన్ని వందల సం॥రాల నాటిదంటారు. అంత ప్రాచీన చరిత్ర గల మహిమల తల్లి ఈ మైసమ్మతల్లి. ఈ మైసిగండి మైసమ్మ తల్లి, ఈ చుట్టుప్రక్కల ప్రాంతాల వారందరికి కేవలం గ్రామదేవతకాదు, ఆరాధ్యదేవత.మొదట్లో ఒక చిన్న శిలారూపం వుండేది. కాలక్రమంలో ఇక్కడ విగ్రహం ప్రతిష్ఠించి, అమ్మవారి కరుణాకటాక్షములు అందరు విశేషంగా పొందునట్లు చేసారు.

ఇక – ఈ తల్లి ఆలయానికి అర కి.మీ దూరంలో శివాలయం, రామాలయం, అన్నపూర్ణేశ్వరిల ప్రాచీన ఆలయాలున్నాయి. వీటిని అక్కన్న, మాదన్న నిర్మించినట్లు చెబుతారు. వీటి కెదురుగా కోనేరు దానికి ఎదురు

మైసమ్మ వున్నందువలన ఈ కోనేరు (గండి) మైసమ్మగండి, మైసిగండిగా పేరు పొందింది. అటు ఇటు వెళ్ళే యాత్రీకులు, యాత్రాబస్సులు ఇక్కడ ఆగి, ఈప్రాంతాన్ని దర్శించుకు వెళ్ళడమొక ఆనవాయితీ అయింది.

## మల్లేశ్వరం

కొల్హాపూరుకు దగ్గర్లోని సప్తమ సంగమక్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన ప్రదేశంలోని కృష్ణాతీర ప్రాంతంలోని మల్లేశ్వరం మహిమాన్వితమైంది. ఇక్కడి "అగస్త్యేశ్వర, మల్లేశ్వరాలయాలు, ప్రాంతం మల్లేశ్వరం అయింది. ఇక్కడి కృష్ణకు ఇరువైపుల ఆరు క్షేత్రాలున్నాయి. అవి మల్లేశ్వర, రాజరాజేశ్వర, రామలింగేశ్వర, విశ్వేశ్వర, సాంబశివేశ్వర, శంభులింగేశ్వరాలయాలతోపాటుగా వీరభద్రేశ్వరస్వామి ఆలయం కూడా వుంది. చూడదగ్గ వనడంలో తప్పులేదు.

ఇందులో కొన్ని పెబ్బేరు రోడ్డుకు ఉత్తరాన పునర్నిర్మించబడ్డా, చారిత్రిక ప్రాధాన్యం, పురాణ నేపథ్యం ఆలయాల ప్రశస్తి అడుగంటలేదని తెలుసుకోవాలి.

## మాణిక్యగిరి - మాణిక్యేశ్వరి

నారాయణపేటకు సమీపంలోని ఆంధ్ర – కర్ణాటక సరిహద్దులోని మాణిక్యగిరిలో 'మాతామాణిక్యేశ్వరి' అమ్మవారి ఆలయముంది. దీనిని సూర్యనంది క్షేత్రమని కూడ పిలుస్తారు. మనవారితోపాటు మహారాష్ట్ర, కర్ణాటకలనుండి కూడ భక్తులు వచ్చి అమ్మను సేవించుకుంటూంటారు. ఇంకా ఆస్తికత, ధర్మచింతన నిలచివుందంటే ఇటువంటి పరమపవిత్రుల సంచారం వల్లనే అన్నది తప్పక ఇక్కడ సత్యంగా గోచరిస్తుంది. సకల మానవాళి సంక్షేమం కోరే ఈ తల్లి మాణిక్యగిరిపై తానుంటే శివాలయం, శ్రీవేంకటేశ్వర, గణపతి, పార్వతీ దేవాలయాలు, కొండక్రింద శ్రీదత్తాత్రేయ, బసవన్న, ఆంజనేయాలయాలను కూడ నిర్మింపచేసి ఆర్షధర్మానికి అంజలి ఘటింపచేస్తున్నదీ తల్లి.

## లక్ష్మీపురం - నవనారసింహ క్షేత్రం

అమరాబాదునుండి 14 కి.మీ లో వున్న లక్ష్మీపురం నవనారసింహ దేవాలయాలకు ప్రసిద్ధిపొందిన ప్రదేశము. నవనారసింహ ఆలయాల్లో బాల, ప్రసన్న, శాంత నరసింహాలయాలు శిథిలావస్థలో వుండగా, మిగిలిన వరాహ, వృద్ధ, ఉగ్ర, యోగ, వరద నారసింహాలయాలతోపాటు ప్రధాన నరసింహాలయము చూడతగ్గ విగా వున్నాయి. ఒకేచోట ఇన్ని ఆలయాలు కల ఈ లక్ష్మీపురంలోని నవనారసింహాలకు, అహోబిల నవనారసింహులకు పోలిక కనబడదు. కానీ భక్తులకు అనిర్వచనీయ, అవ్యక్తానందాన్ని మాత్రం తప్పక శ్రమ లేకుండా ప్రసాదిస్తాయి.

మహబూబ్‌నగర్‌కు 25 కి.మీ లలో వున్న కోయిల కొండ, కొండపైగల వీరభద్ర స్వామి ఆలయం ఒక నాటి కోట, అచ్చటి ఇతరాలయాలు, ప్రాభవానికి నిదర్శనంగా కనుపిస్తుంది. చరిత్ర కనుమరుగైనా చిత్రంగా ఈ ఆలయమింకా కళతగ్గక భక్తజనుల పూజలందుకుంటోంది.

## సోమశిల - సోమేశ్వరుడు

మహబూబ్‌నగర్ 120 కి.మీ, కొల్లాపూరుకు 9 కి.మీ దూరంలో సోమశిల అనే గ్రామంలో అతిపురాతనమైన శ్రీలలితాంబ సమేత శ్రీసోమేశ్వరస్వామివార్ల ఆలయముంది. అందరు తలచుకునే 12 జ్యోతిర్లింగాలు, ఈ సోమశిలలోని సోమేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరాయి. రాష్ట్రకూటులు, కల్యాణిచాళుక్యులు, విజయనగర రాజులలో పాటు సురభి సంస్థానాధీశుల పాలనలో ఈ క్షేత్రం దివ్యంగా విరాజిల్లింది.



రాజులు గతించారు. చరిత్ర ముగిసింది. కాలప్రభావం స్తంభించి కాలచక్రమార్పుల కారణంగా శ్రీశైలంప్రాజక్టు పేరున ఈ ప్రాంతం ముంపుకు గురైతే, ఎగువమిట్టన ఈ ఆలయాల పునర్నిర్మాణం జరిగింది. ఇక్కడి ఈ సప్తనదుల సంగమం, ద్వాదశజ్యోతిర్లింగాలు, భక్తులకు బ్రహ్మానందం ప్రసాదిస్తాయనడం అతిశయోక్తి కాదు. ఇచ్చటి 15 ఆలయాలలోని అద్భుత శివలింగాల దర్శనం, దుష్కర్మనాశకంగా తలవవచ్చును.

## నోయనోనిపల్లి - మైసమ్మతల్లి

నాగర్‌కర్నూలు నుండి కొల్లాపూర్ వెడుతుంటే 9 కి.మీ దూరంలో వుందీ నోయనోనిపల్లి. ఇక్కడి తల్లే గ్రామదేవత శ్రీనైనపల్లి మైసమ్మతల్లి. వంద సం॥కు ముందునుండే ఇచ్చట ఈ తల్లి వుందని, పూర్వం ఒకానొక సమయంలో గొల్లలు, తమ పశువులు సరిగ్గా పాలివ్వక చిక్కి శల్యమైతే ఈ మైసమ్మతల్లికి మ్రొక్కుకున్నారుట. అంతే పశువులు ఆరోగ్యమొంది, పాలివ్వడం ప్రారంభించాయట. ఇక అక్కడనుండి ఆతల్లికి ఆరాధనలు, నివేదనలు ప్రారంభమయ్యాయి. ప్రతి పని ఆతల్లికి నివేదించి జరుపుకోవడమొక ఆనవాయితీ అయింది. చుట్టుప్రక్కల ప్రాంతాలనుండి లక్షలలో ఆదివారం జాతరకు తరలివచ్చి తమ మ్రొక్కులు చెల్లించుకుంటారుట. భక్తితో సేవిస్తే భగవంతుడు కరుణిస్తాడంటే ఇదేనేమో!

## శ్రీరంగాపురం - శ్రీరంగనాధస్వామి

వనపర్తి సమీపంలోని ఈ గ్రామంలో, గరుడాద్రి అనే కొండపై శ్రీరంగనాధస్వామి వెలిసారు. గతంలో కొరిపాడుగా పిలువబడే ఈ గ్రామం, శ్రీస్వామి గరుడాద్రిపై వెలియడంతో శ్రీరంగాపురమైంది. చరిత్ర ప్రకారం శ్రీకృష్ణదేవరాయలు శ్రీరంగక్షేత్రం దర్శించాక, అటువంటి ఆలయం తనరాజ్యంలోకూడా వుంటే బాగుంటుందనిపించింది. ఆ ఆలోచనతో అలాగ సాగుతుంటే ఒకనాటి రాత్రి శ్రీరంగనాథుడు రాయలకు కలలో కనుపించి, గరుడపక్షి నీకు దారిచూపుతుంది. అక్కడ నన్ను ప్రతిష్ఠించమంటారు. ఆసమయంలో తన దిగ్విజయ యాత్రలలో భాగంగా ఇక్కడకు వచ్చిన రాయలవారు, తెల్లవారి తను చూచిన గరుడపక్షిని అనుసరిస్తే ఒక ప్రదేశంలో స్వామి వారి విగ్రహం లభిస్తే దానిని గరుడాద్రిపై ప్రతిష్ఠింపచేసి ఆలయనిర్మాణాదులు జరిపించారుట. ఆ రకంగా స్వామి వెలసి భక్తజనకోటికి ఆనందం పంచిపెట్టాడు.

## బుగ్గరామేశ్వరం

జడ్చర్లకు 10 కి.మీ దూరంలో ఈ బుగ్గరామేశ్వర ఆలయముంది. ఇది అత్యంత పురాతనమైనదని, సుమారు క్రీ॥శ॥ 750 ప్రాంతంలో నిర్మించబడివుంటుందన్నది చరిత్రచెప్పే విషయం. ఇచ్చటి స్వామి 'బుగ్గరామేశ్వరుడు". స్వామికి నైఋతి భాగంలో సుమారు 9–10 శతాబ్దాలకన్న ముందే నిర్మించిన వీరభద్రస్వామి, అందులోని స్వామి, తన ప్రాచీనతను చాటుకుంటున్నాడు.

## మన్యంకొండ - శ్రీలక్ష్మీవేంకటేశ్వరుడు

పాలమూరుకు 15 కి.మీ దూరంలో మన్యంకొండ. దీనిపైగల శ్రీలక్ష్మీవేంకటేశ్వరుడు పేదవారి దైవంగా ఇక్కడ ప్రసిద్ధుడైనాడు. ఈ కొండపైగల ఈ ఆలయంలో ఉలి తగులని మూలవిరాట్టు, సహజపాదాలు, కోనేరు అన్న భగవల్లీలలకు నిదర్శనంగా కనుపిస్తాయేతప్ప ప్రతిష్ఠ కాదు. ప్రయత్నమసలేకాదు. ఇచ్చటి గుహలలో మునీశ్వరులు తపస్సు చేసుకునే వారిని ఆనాటి 'మునులకొండ' కాలక్రమేణ మన్యం కొండ, మానికొండగా పిలువబడుతుందని చెబుతారు. కొండపై శేషసాయిని తలపింపచేసే మెలికలుగల సహజ సిద్ధకొండలో ఏడు ద్వారాలు దాటితే, శ్రీస్వామి స్వయంభువుగా ఆనాటి మునుల కోరికపై వెలిసారని, ఈస్వామిని ఒకసారి దర్శిస్తే, తిరుమలవాసుని ఏడుసార్లు దర్శించిన పుణ్యమొస్తుందని ప్రతీతి.

ఈ స్వామికి 12 కి.మీ దూరంలో కొండదిగువన అలిమేలుమంగ దర్శనమిస్తుంది. వీరభద్రుడు ఈ క్షేత్రపాలకుడు. మాఘ, ఫాల్గుణాలలో జరిగే ఉత్సవాలకు, భాద్రపద మాసములోని వీరభద్రుని అగ్నిగుండ పండుగకు భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చి తమ భక్తి ప్రపత్తులను చాటుకుంటారు.

## శిర్సనగండ్ల - శ్రీసీతారామచంద్రుడు

మహబూబునగర్‌కు 76, దేవరకొండకు 25, చారగొండనుండి 5 కి.మీ దూరంలో ఈ శిర్సనగుండ్ల వుంది. ఇది 14వ శతాబ్దందని తెలుస్తుంది. ఇక్కడి విశేషం మహాభక్తుడైన శ్రీధరం రామయజ్వికి శ్రీరాముడు కలలో కనుపించి, తను పాల్వంచకు సమీపంలోని రావిచేడు గ్రామంలోని పురోహితుడు భాస్కరుని ఇంట్లోని కాకరపాదు క్రింద వున్నామని, తీసుకువచ్చి ప్రతిష్ఠించమని చెబుతాడు. శ్రీస్వామి ఆదేశంతో మేళతాళాలతో వెళ్ళి, స్వామి వారి విగ్రహాలను కనుగొన్నారు. అయితే రాయచేడు గ్రామస్థులు ఆంజనేయస్వామిని తమకు వదలి, శ్రీసీతారామలక్ష్మణులను తీసుకువెళ్ళమని కోరుతారు. ఆ రకంగా స్వామి కోరి ఈ ప్రాంతంలోని కొండపై వెలసి, కోర్కెలు తీర్చే కామితార్థప్రదాయకుడైనాడు.

ఈ జిల్లాలోని గంగాపురంలోని చెన్నకేశవాలయం కూడా అతి పురాతనమైనదే. ఒకప్పుడు చారిత్రక నగరాలలో ఒకటిగా ఈ గంగాపురం, వర్ధమానపురాలు ప్రఖ్యాతి గాంచాయి. ఆ రోజులలో వర్ధమాన పురాన్ని 'వడ్డవాని గాను, గంగాపురాన్ని 'కేశవపురం', మాయాపురమని పిలవబడేవి. ఇవి ఆనాడు జైన సాంప్రదాయానికి కేంద్రంగా

వుండేది. కాకపోతే 12వ శతాబ్దంలో చంద్రవంశ పుణ్యశీల మహారాజు ఈ శ్రీలక్ష్మీచెన్నకేశవాలయాన్ని నిర్మించారని ఆ తరువాత కాలంలో జక్కన్న వంశీయులు ఈ అపురూప ఆలయాన్ని పరిరక్షించారని తెలుస్తోంది. కాకపోతే మొగలాయీల దండయాత్రలో ఈ ఆలయం చాలా భాగం దెబ్బతిని చరిత్రకు గుండెకోత మిగిల్చింది.

**షాద్‌నగర్** (ఫరూక్‌నగర్) మండలంలోని ఈ **శ్రీరామలింగేశ్వరాలయాన్ని** అలనాడు శ్రీరాముడు ప్రతిష్ఠించినట్లు చెబుతారు. సీతాన్వేషణలోభాగంగా శ్రీరాముడు ఈ లింగాన్ని ప్రతిష్ఠించాడని ఈ లింగం పెరుగుతూంటుందని, అందుచే ఈ ఆలయం పగుళ్ళని స్థలపురాణంగా చెబుతారు. అయితే కాలచక్రంలో ఆ లింగం అదృశ్యమైందని, శ్రీమాణిక్యప్రభు శిష్యుడొకడు ఇక్కడ తపస్సు చేసుకుంటుంటే శ్రీరాముడు దర్శనమిచ్చి శివలింగం వివరాలు చెప్పి పూజచెయ్యమని కోరుతాడుట. దాంతో ఇది ఉత్తరరామేశ్వరమైంది. ఆ రకంగా ఈ ప్రాంతం భక్తజనుల నిలయమైంది. అమావాస్యనాడిక్కడి భక్తజనుల పరవళ్ళు చూసితీరాల్సిందే.

అచ్చంపేట మండలం, ఉప్పునుంతలకు 123 కి.మీ దూరంలోని **మామిళ్ళపల్లిలో** అతిపురాతనమైన **నరసింహ క్షేత్ర**ముంది. 1107 నుండి 1235 వరకు చోళులు వర్ధమానపురాన్ని రాజధానిగా పరిపాలిస్తున్న కాలంలో "దుందుభీక్షేత్రం"గా పిలువబడుతున్న ఈ ఆలయమే కాదు ఈ ప్రాంతమంతా ఎంతో విశేష ప్రఖ్యాతిగాంచింది. మామిడితోటలో దొరికిన ఈ విగ్రహం గ్రామస్థుల అదృష్టంగా కోరిన కోర్కెలు తీర్చే కల్పవృక్షమైంది. అలాగే ....

కొడంగల్ మండలంలోని **కస్తూర్‌పల్లి** మరో **మహానంది** అంటే ఆశ్చర్యంలేదు. ఇక్కడి **'లొంకబసవన్న' ఆలయం** ఎంతో ప్రాచీనమైనది. ఇక్కడకూడ మహానందిలోని నందినోట్లో నుంచి వచ్చినట్లే జలం వచ్చి పరిసర గ్రామాల పొలాలను సస్యవంతం చేస్తుంది. ఇంకా ఇక్కడి విశేషం ఎవరైనా అపవిత్రంగా వస్తే నందినోటినుండి వచ్చే జలమాగిపోతుందని, తిరిగి సంప్రోక్షణ శుద్ధిల తర్వాతే నంది నోట జలం ప్రవహిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.


మహబూబ్ నగర్ జిల్లాలో చరిత్ర కందని, చెప్పుకోలేని అపురూప ప్రదేశాలు, ఆలయాలు ఎన్నో దర్శనమిస్తాయి. వీటిని తెలుసుకోగల్గడమొక అదృష్టం. దర్శించగల్గడం మరొక జన్మధన్య అదృష్టం. అటువంటి పుణ్యతీర్థాలలో చెప్పుకోదగ్గది హైదరాబాదు శ్రీశైలం ప్రధాన రహదారిలో ఫరహాబాదు అటవీ ప్రాంతంలోని 'సల్వేశ్వర్' ఎత్తైన కొండలనుండి జాలువారే నీటితో ఏర్పడిన తీర్థం. ఇక్కడ సర్వేశ్వర్ తీర్థం, పుష్కరతీర్థాలున్నాయి. ఇక్కడ శివప్రియులైన చెంచుల పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతుంటాయి. ఇక్కడి ఆరాధ్యదైవం చెంచుల ఆరాధ్యదైవం లింగమయ్య. ఇక్కడి లింగమయ్యకు ఇరుప్రక్కల దక్ష, వీరభద్రులు విగ్రహాలను కూడా దర్శించగల్గుతాము.

**గమనిక : ఇంకా వుండవచ్చును. చిన్నదైనా, పెద్దదైనా తీర్థ, క్షేత్ర వివరాలు తెలుపండి. తదుపరి ప్రచురణలో తెలుపుతాము. దర్శించాలనుకునేవారికి దారి చూపినట్లవుతుంది !!!**

## ఉపయుక్త విషయములు

1. స్నానము చేయకుండా సంధ్యావందనము మరియు దేవుని పూజ చేయరాదు. దేవునికి పెట్టిన నైవేద్యమును దైవప్రసాదముగా భావించి తినవలెనేతప్ప పారవేయరాదు.
2. ఒక దీపపు వత్తి వెలుగుచుండగా రెండవ వత్తి మొదటి దానితో వెలిగించరాదు. దీపమును నోటితో ఆర్పరాదు.
3. దేవుని పూజకు ఉపయోగించిన (పీట) ఆసనమును మరియొక పనికి ఉపయోగించరాదు.
4. వ్రతము చేసిన రోజున భార్యతో కాని, ఇతర స్త్రీలతో కాని సంపర్కము చేయరాదు.
5. ఏకాదశి రోజున ఉపవాసము వుండి, ద్వాదశినాడు బ్రాహ్మణునకు అన్నదానము చేసిన భోగభాగ్యములు కలుగును.
6. ఉదయముననే లేచి రాగి పాత్రలో పోసిన నీరు త్రాగిన ఆరోగ్యము బాగుండును.
7. బూడిద గుమ్మడికాయను బుధవారం రోజున ద్వారము (ఇంటి) నందు కట్టిన దిష్టిదోషములు తొలగును.
8. దైవకార్యములు చేయునప్పడు, జపము చేయునప్పడు తూర్పు ముఖముగా కూర్చుండవలెను.
9. గ్రహణం పూర్తిగా పట్టిన తరువాత మంత్రోపదేశం పొందవలెను. గ్రహణం విడిచిన తర్వాత తప్పకుండా తలస్నానం చేయవలెను.
10. గోపూజ చేయునపుడు ముందుగా తోకకు పూజ చేయవలెను.
11. శివునకు అభిషేకము, విష్ణువునకు అర్చన, అమ్మవారికి అలంకరణ చేయుటవలన కోరికలు ఫలించును.
12. దేవతాప్రతిష్టను ఉత్తరాయణమునందు చేయవలెను.
13. క్షుద్రదేవతా ప్రతిష్టను దక్షిణాయనము నందు చేయవలెను.
14. ప్రతిరోజు సుందరకాండ చదువుటవలన కష్టములు తొలగి మనశ్శాంతి కలుగును.
15. శనికి నువ్వులు దానము యివ్వవలెను. శని త్రయోదశినాడు శనికి తైలాభిషేకము చేయించవలెను.
16. స్త్రీలు ప్రాతఃకాలమున తులసిపూజ చేసిన సౌభాగ్యం కల్గును.
17. రావిచెట్టును శనివారము తప్ప యితర రోజులలో తాకరాదు.
18. మారేడుచెట్టు చుట్టూ 9 సార్లు ప్రదక్షిణ చేసిన శివానుగ్రహము కలుగును.
19. శ్రీ వేంకటేశ్వరస్వామికి : వడపప్పు, పానకము నైవేద్యము పెట్టవలెను, తులసీమాల మెడలో ధరించవలెను.
20. వినాయకునకు : బెల్లం, ఉండ్రాళ్ళు, జిల్లేడుకాయలు నైవేద్యం పెట్టవలెను. (శ్వేత) తెల్లని అక్షతలతో పూజించవలెను.
21. ఆంజనేయునకు : అప్పములు నైవేద్యము పెట్టవలెను. తమలపాకులతోను, గంగసింధూరముతోను పూజించ వలెను.
22. సూర్యునకు : మొక్కపెసలు, క్షీరాన్నము నైవేద్యము పెట్టవలెను. ఎర్రని పూలతోను, అక్షతలతోను పూజించవలెను.
23. సత్యనారాయణమూర్తికి : గోధుమ రొట్టెలు నైవేద్యము.
24. శ్రీ షిర్డి సాయిబాబావారికి : గోధుమ రొట్టెలు, పాలకోవా నైవేద్యము.
25. శ్రీకృష్ణునికి : అటుకులతో కూడిన తీపి పదార్థములు నైవేద్యం పెట్టవలెను. తులసీదళములతో పూజించవలెను.
26. ఈశ్వరునకు : కొబ్బరికాయ, అరటిపళ్ళు నైవేద్యం, మారేడు దళములతోను, నాగమల్లి పుష్పములతోను పూజించవలెను.
27. గాయత్రీదేవికి : అప్పాలు వంటి తీపివంటకాలు, అరటిపండ్లు పెట్టవలెను.
28. లలితాదేవికి : బెల్లం పరమాన్నము, పులిహోర నైవేద్యము పెట్టవలెను.
29. లక్ష్మీదేవికి : క్షీరాన్నము, మధురఫలములు నైవేద్యం పెట్టవలెను, తామర పుష్పములతో పూజించవలెను.
30. దుర్గాదేవికి : మినపగారెలు, అల్లంముక్కలు నైవేద్యం పెట్టవలెను.
31. సంతోషిమాతకు : పులుపులేని పిండివంటలు నివేదన.

## అరుణాచలప్రదేశ్




మహాభారతంలోను, కల్కి పురాణంలోను, అరుణాచల ప్రదేశ్ ప్రసక్తివస్తుంది. పరశురాముడు రాజులను చంపిన పాపప్రక్షాళనమిక్కడ చేసుకున్నాడని, వ్యాసులవారు ఇక్కడ కొంతకాలం తపస్సుచేసారని, అలాగే శ్రీకృష్ణుడు ఆమె కోరిక మేరకు రుక్మిణిని అపహరించిందిక్కడేనని పురాణ కథనం

ఇంకో తమాషా - భారతదేశంలో సూర్యోదయం ముందుగా ఇక్కడే జరుగుతుందని, అందుకనే ఈ రాష్ట్రాన్ని "లాండ్ ఆఫ్ రైజింగ్ సన్" అని పిలుస్తారు. ఇక్కడ చూడటానికి ఎన్నో మందిరాలు వున్నాయి. చరిత్రవుంది.

**ఇతానగర్** - ఇది అరుణాచలప్రదేశ్ రాజధానేకాదు, ఓ పెద్ద చారిత్రక పట్టణంకూడా. 14, 15 శతాబ్దాలలో దీనిని "మాయాపూర్" అని పిలిచేవారు. ఇక్కడి కోట, బౌద్ధారామాలు వగైరాలు చూడవలసిన చారిత్రకప్రదేశాలు.

### మాలినితాన్ (మాలినీదేవి) మందిరం

షియాంగ్ కొండల ముఖద్వారములో వుందీ ప్రాంతం. 14వ శతాబ్దంనాటి మందిర అవశేషాలను పురాతత్వశాఖ త్రవ్వి బయటకుతీసింది. ఈ త్రవ్వకాలలో ఐరావతం, సూర్యరథం వగైరాలు లభించాయి. పురాణకథ ప్రకారం, శ్రీకృష్ణుడు రుక్మిణిని అపహరించి శిశుపాలుని నుండి రక్షించిన ప్రాంతమిదేనట. శ్రీకృష్ణ-రుక్మిణులకు, పార్వతిదేవి ఇక్కడే ఆతిథ్యమిచ్చిందటకూడా! అందుకని ఇక్కడ పార్వతీ మందిరముంది. ఈ తల్లిని "మాలినీదేవి" అని పిలుస్తారుట. గౌహతినుండి ఇక్కడకు బస్సు సర్వీసు వుందిట.



దిజాంగ్‌జిల్లాలోని "భీస్మాకు" నగరం ఒక పర్యాటక స్థలం. ఆర్యులకాలంనాటి నాగరికతను చూడగల అతి ప్రాచీన పట్టణం. తీన్‌సుపియా రైల్వేస్టేషనుకు 100 కి.మీ దూరంలో వున్నదీనిని అధికసంఖ్యలో పర్యాటకులు దర్శిస్తుంటారు.


ఇది ఎనిమిదవ శతాబ్దంనాటి పార్వతీమందిరమైన అక్షయగంగ. కల్కి పురాణం ప్రకారం శివుడు దక్షయజ్ఞంలో దగ్ధమైన సతీదేవిని శరీరరూపంలో తీసుకువెళ్తుంటే ఆమె శరీరభాగమొక్కటి ఇక్కడ పడిందని, అదే అక్షయ గంగ అయిందని చెప్పబడుతుంది.

## పరశురాంకుండ్



అరుణాచలప్రదేశ్‌లోని ప్రధాన నగరం "తేజూ". దీనికి 13 కి.మీ దూరంలో ఈ పరశురాంకుండ్" వుంది. ఇది చాలా పురాతనమైంది. పవిత్రమైనదిగా అనాదినుండి భక్తుల విశ్వాసం. అందుకు నిదర్శనంగా ఏడాదిపొడుగునా ఇక్కడికి భక్తులు వచ్చి స్నానాలు చేస్తారు. ఇక చారిత్రంగా మహావిష్ణు అవతారమైన పరశురాముడు తన తండ్రి జమదగ్ని ఆదేశంతో తల్లి "రేణుక"ను చంపుతాడు. ఆ తరువాత తండ్రి అభిమానంతో తల్లి, సోదరులను పొందుతాడు. కానీ మాతృహత్యాపాపం అనంతమయ్యేసరికి ఇక్కడి కుండంలో తన కత్తిని, కడిగి పాపప్రక్షాళన చేసుకుంటాడు. అందుకనే భక్తులు ఇక్కడికి వచ్చి ఇచ్చటి కుండంలో స్నానంచేసి పాపప్రక్షాళనమొందుతారు.

## మేఘన ఆలయం



ఈ రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలలో ఒకటి 'డోపూర్జి'. ఇక్కడే దాదాపు 5000 సంవత్సరాలకు పైగా చారిత్రకనేపథ్యం కల్గినదానిని మేఘన గుహాలయ ముంది. అయితే ఇంతటి ప్రాధాన్యం కల్గినదానిని మనవాళ్ళు 1962 సంవత్సరంలో గుర్తించగలిగారు. ఇది 300 అడుగుల ఎత్తైన కొండపై నిర్మిపండిన ఆలయం. కొండపైకి అదే ఆలయాన్ని చేరడానికి మెట్లున్నాయి. చుట్టుకుండాలు, ప్రకృతి రమణీయంగా కనులకు విందుచేస్తాయి. ప్రక్కనో నది గలగల శబ్దంచేస్తూ మనోల్లాసమేకాదు, నయన మనోహరంగావిస్తుంది. ప్రస్తుతం ఇక్కడికెందరో సందర్శకులు వస్తున్నారు. ఆలయాన్ని, ప్రకృతి అందాలను దర్శించి పులకించిపోతున్నారు.



# అస్సాం




భారత్‌కు ఈశాన్య ప్రాంతంలో అస్సాం రాష్ట్రముంది. దీనికి రాజధానిగా డిస్‌పూర్ ఉంది. గత 30 ఏళ్ళ కాలంలో క్రొత్త ఈశాన్య రాష్ట్రాల ఏర్పాటు వల్ల అస్సాం ఎన్నోసార్లు విభజనకు గురైంది.

అసోమ్ అనే పదం నుండి అస్సాం వచ్చింది. అసోమ్ అంటే అసమానమైన అని అర్థం ఉంది. ఈ రాష్ట్రంలో చారిత్రకంగా భిన్న సంస్కృతులు, వర్ధిల్లాయి. గతాన్ని పరిశీలిస్తే, 1826లో యాండ్రాట్రేటి క్రింద అస్సాంను బ్రిటిష్ వారు స్వాధీనం చేసుకోగా, తరువాతి పరిణామాలలో కొన్ని 1832లో కౌచర్, 1835లో జాంతియా హిల్స్‌ను అస్సాంలో కలిపేశారు. 1839లో ఎగువ అస్సాం పై దాడి జరిగి బెంగాల్‌లో కలిసి పోయింది. 1874లో ప్రత్యేక అస్సాం ఏర్పాటయింది. అనంతరం నవంబర్ 1వ తేదీన 1956లో అస్సాం స్వతంత్ర రాష్ట్రంగా అవతరించింది.

విస్తీర్ణం : 78,438 చ.కిమీ. ప్రధాన భాషలు : అస్సామీ

**సరిహద్దులు :** తూర్పున: నాగాలేండ్, మణిపూర్, దక్షిణాన: మేఘాలయ, మిజోరం, త్రిపుర; పశ్చిమాన : బంగ్లాదేశ్, బెంగాల్‌లు. ఉత్తరాన – భూటాన్, అరుణాచలప్రదేశ్‌లు.

ఇది ఒకప్పటి ఈశాన్యరాష్ట్రం. సప్తసోదరీమణులుగా ప్రఖ్యాతి గాంచినది. ఆనాడు ప్రఖ్యాతిగాంచిన 'అస్సాం' ఈనాడు, అస్సాం, మణిపూర్, మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర, అరుణాచలప్రదేశ్, మిజోరాంలు ఏడు ముక్కలు, ఏడు స్వతంత్ర రాష్ట్రాలయాయి. ఈ ప్రాంతాలలో 166 తెగలు, వివిధ భాషలు మాట్లాడుతున్నారు. తమతమ సంస్కృతీసాంప్రదాయాలను సందర్భానుసారంగా చాటుకుంటున్నారు.

కొంతమంది తరాలు (శతాబ్దాల) క్రితమే దక్షిణ ఆగ్నేయ(ఆసియా) దేశాలనుండి తరలివచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. తమ తమ ఆచారసాంప్రదాయాలను వారి వారి పద్ధతిలో మరువకుండా అమలుచేసుకుంటున్నారు. ఇచ్చటి నది బ్రహ్మపుత్ర.

పురాణాలప్రకారం ఇది ఒకప్పటి నరకుని రాజధాని ప్రాగ్జ్యోతిషపురం. చరిత్రకు, పురాణాలకు, వింతలు, సాహసాలకు, అన్వేషణలకు, ప్రకృతికాంత పరవళ్ళ పరవశత్వానికి, ఈ హిమాలయపాదపీఠం అనాదినుండి పేరు పొందినది. ఆస్తికులకు ఆలయ దర్శనాలు, ప్రకృతి ప్రియులకు పరవశత్వం కల్గించే కొండల అందచందాలు, గిరిశృంగాలు, వారి వారి ఆసక్తినిబట్టి చూడవచ్చును. ప్రకృతి ప్రియులకు, ప్రకృతి దేవతలయితే, ఆస్తికులకు, ఆలయాలు, అందాల శిల్పాలు ఆరాధనీయాలు.

ఇటువంటివి దర్శించి, తరించాలితప్ప, వర్ణించి, విపులంగా వివరించడం మాటలతో కుదరదు. చూసేకళ్ళు పరవశించే ఆనందాన్ని, మాటల మనసు వ్యక్తపరుచలేదన్నది సత్యంగా తలవాలి.

## గౌహతి



రాష్ట్ర రాజధాని, ఇక్కడ అశ్వక్రాంత స్వామి ఉన్నారు. శ్రీకృష్ణుడు నరకాసురుని వధించిన చోటు సుక్లేశ్వర ఘుట్– నదికి ఇవతల రాజధాని, అవతల ఆలయం, పడవపై వెళ్ళి చూడాలి, ఉమానందస్వామి, మానసాదేవి ఆలయాలు కూడా ఇక్కడ చూడవచ్చు! ఉమానందస్వామి విగ్రహానికి 5 ముఖాలు, 10 చేతులు ఉంటాయి, మన్మధుడు శివుని కంటిమంటకు బూడిదయిన ప్రదేశంకూడా ఇదేనని అంటారు.

## నవగ్రహ ఆలయం

ఈ నవగ్రహ ఆలయం, గౌహతి నగరంలో సిత్రోకాల అనే ఒక కొండమీద వెలసి ఉంటుంది. భక్తులు, నవగ్రహ పూజలు, శాంతులు చేయించుకుంటూ ఉంటారు. ఈ ఆలయంలో ఉన్న నవగ్రహ ప్రతిమలు తొమ్మిది కూడా విశేష ప్రాచుర్యం పొందాయి. ప్రతి ఏటా భక్తులు విశేష సంఖ్యలో వచ్చి వీటిని పూజించి, తమ భక్తిని చాటుకుంటూ ఉంటారు.

## మదనకొమ దేవ ఆలయం

కామరూప ఖజురహాలో అని పిలువబడే ఈ ఆలయంలో 24 ఆలయాల సంపుటి ఉంటుంది. ఈ ఆలయం చుట్టూ దట్టమైన సాల్, టేకు అడవులతో చాలా నిశ్శబ్ధంగా ఉంటుంది. ఈ ఆలయం ఎప్పుడు స్థాపించబడిందో ఖచ్చితంగా తెలియదు గాని, ఇది 10–12వ శతాబ్దంలో నిర్మింపబడిందని విశ్వసిస్తారు. పంచరథ్ అని పిలువబడే ఈ మదన కొమదేవ్, బ్రహ్మపుత్రలోయలో నిర్మించబడింది. ఈ ఆలయంలో ఉమామహేశ్వరులు కొలవబడతారు. ఇక్కడ ఆరు తలల భైరవుడు, నాల్గుదేవతల శివుడు, భయంకరాకారుడైన రాక్షసుడు, స్త్రీల, పురుషుల ప్రతిమలు కనువిందు చేస్తుంటాయి.

## శుక్రేశ్వర




బ్రహ్మపూల్ నది ఒడ్డున, గౌహతి నగరంలో ఈ శుక్రేశ్వర ఆలయం నిర్మింప బడింది. ఈ ఆలయాన్ని క్రీ.శ. 1744 లో ప్రమత్తసింగ్ అనే రాజు నిర్మించారు. ఈ ఆలయంలో ఉన్న శివలింగం, చాలా భారీ స్వరూపంలో ఉంటుంది. కలికా పురాణం ప్రకారం, శుక్రేశ్వర లింగం ఇక్కడే వెలసిందని నమ్మకం. భక్తులు ప్రతి ఏటా విశేష సంఖ్యలో వస్తుంటారు.

**ముఖ్యగమనిక :** అసలు అడుగుపెడితే చారిత్రక – పౌరాణిక ప్రాధాన్యం, అపురూపశిల్పాలు, కట్టడాలు, అద్భుత నిర్మాణాలు, ఊహలకందని విధంగా మనలకు కనువిందేగాదు, మానసోల్లాసం కూడా కల్గిస్తాయి. చూడగల్గిన వారు అదృష్టవంతులు. ఆ అదృష్టం – ఆధ్యాత్మిక చారిత్రక ప్రియులకు లభించాలని కోరుకుందాం!



## కామాఖ్యా ఆలయం



పౌరాణిక ప్రతిష్ఠని కలిగిన అనేక ప్రాంతాలు గౌహతీ నగరంలో వున్నాయి. అందులో 'నీలాచలం' కొండపైన నెలకొని వున్న కామాఖ్య దేవాలయం అతి ముఖ్య మయింది. గౌహతీ నగరానికి పది కిలోమీటర్ల దూరాన బ్రహ్మపుత్రా నది తీరాన వున్న ఈ గొప్ప తీర్థస్థానానికి ఓ విచిత్రమైన స్థలపురాణం వుంది. నిర్జీవి అయిన తన ప్రథమ సతి శరీరాన్ని పరమ శివుడు ఆకాశమార్గాన తీసుకు వెడు తుండగా ఆమె 'మర్మావయవం' యిక్కడ రాలి పోయిందట'. 'ఆ యోని రాలిన చోటులోనే విశ్వకర్మ చేత ఈ కామాఖ్య దేవాలయం నిర్మించబడిందట' ఈ మందిరాన్ని శక్తి స్థలంగా పిలుస్తూండటం కూడా జరుగుతోంది. అందుకే కాబోలు తాంత్రిక సిద్ధులూ, యోగులూ, ఈ క్షేత్రాన్ని అధిక సంఖ్యలో దర్శిస్తూ వుంటారు.

ప్రతి ఏటా యిక్కడ 'అంబుచి' అనబడే ఉత్సవాన్ని 'ఆగస్ట్' మాసంలో నిర్వహిస్తూ వుంటారు. ఆ సమయంలో దేశంలోని అనేక ప్రాంతాల నుండి జనం ఇక్కడికి తరలి రావటం జరుగుతోంది.

కామాఖ్య దేవాలయంలోకి వెళ్ళే ముందు భక్తులంతా బయట వున్న పుష్కరిణిలో స్నానాలు చేస్తారు.

దేవీ మందిరం వున్న ఈ కొండపైకి చక్కని రోడ్డు మార్గం వుంది. కొండపై నుంచి చూస్తే గౌహతీ నగరం ఎప్పుడూ కూడా చాలా అందంగా కనిపిస్తుంది. ఇక్కడ తార, భువనేశ్వరి, ఛిన్నమస్త, భగళ, ధూమావతి, కాళీ, భైరవి అనే ఏడు ఆలయాలు కాక, అయిదు శివాలయాలు "అమృతేశ్వరి, కోటిలింగ, అఘోర, సిద్ధేశ్వర, కామేశ్వరస్వామి ఆలయాలను కూడా చూడవచ్చును.

గౌహతినుండి 40 కి.మీ చిట్టగంలో భగవతి అమ్మవారి ఆలయం, చంద్రశేఖరపర్వతంపై వుంది. ఇక్కడ నిరంతరం అగ్ని ప్రజ్వరిల్లుతున్న శీతాకుండం దగ్గర్లో వుంది.

ఇక్కడి ఈ తల్లి మూలంగానే ఈ ప్రాంతానికి 'నీలాచల'మనే పేరు వచ్చిందిట. ఇంకా ఇక్కడి విచిత్రం కాలానుగుణంగా ఈ తల్లి మూడు రూపాలు పొందుతుందిట. వీటిని 'త్రిపురశక్తి'రూపాలుగా చెప్పుకుంటారు. ఆమె భర్తతో సుఖించాలనుకున్నప్పుడు తెల్లని తామరపువ్వుపై పసుపుపచ్చని మాల ధరించి వుంటుంది. దీనిని 'త్రిపురసుందరి' గాను; సంతోషంగావున్నప్పుడు సింహవాహినిగా రూపమొందితే, 'త్రిపురబాల'గాను, ఆవేశంవస్తే శవంపై నిలబడి, కత్తి పట్టుకున్న భయంకర రూపాన్ని 'త్రిపురభైరవి'గాను చెబుతారు. ఈ తల్లి అందానికి మరొకరు సాటిరారని, ఈమెను 'లలితకాంతిక' అని పిలుస్తారని కాళికాపురాణం చెబుతోంది. మృగశిర 3వ పాదంనుండి ఆరుద్ర మొదటి పాదంవరకు అమ్మవారికి బహిష్టురోజులు. అందుకనే ఆషాఢ శుద్ధ సప్తమినుండి ఏకాదశి వరకు కామాఖ్యదేవికి ఋతుదినాలుగా పరిగణిస్తారు. మొదటి మూడు రోజులు ఆలయాన్ని మూసేస్తారుకూడా! నిజానికి ఆలయం ఎన్నో దాడులకు గురయింది. మళ్ళీమళ్ళీ పునర్నిర్మితమైంది. ఇక్కడి ఆలయంలో ఏ విగ్రహముండదు. యోనిలాగ వున్న పగులునుండి నీరువూట కారుతుంది. గుంట అడుగుభాగానికి చేరుకుంటుంది. దీనిని తెల్లటి వస్త్రం కప్పి పూలతో అలంకరిస్తారు. ఈ యోని తీర్థం సేవిస్తే సర్వపాపాలు, వ్యాధులు నశిస్తాయంటారు. దారిలో సౌభాగ్యకుండముంది. ఇందులో స్నానంచేసి, అమ్మదర్శనానికి వెడతారు. ఆలయ ప్రాంగణంలో మరొక ప్రక్క పార్వతీ కుండం. ఇందులో స్నానంచేసి అమ్మవారిని దర్శించాలనేది స్థపురాణం తెలుపుతోంది.

## తేజ్‌పూర్

దర్రాంగ్ జిల్లాలో ఉన్న ఈ ప్రాంతంలోని దహా పర్వతం మీద వెలసిన శ్రీకృష్ణుని ఆలయం చూడవచ్చు! బాణాసురుని కూతురయిన ఉషాకన్యను శ్రీకృష్ణుని మనుమడు అనిరుద్ధుడు వివాహమాడిన ప్రదేశం, శ్రీకృష్ణునిచేత బాణాసురుడు ఓడించబడిన ప్రాంతం. దీనికి కలకత్తా నుంచి బస్సు సౌకర్యం కూడ ఉంది.

## హాజో

ఇక్కడ మణికూటపర్వతం ఉన్నది. దీనిపై హయగ్రీవ మాధవస్వామి కొలువై ఉన్నాడు, ప్రక్కనే కేదారేశ్వర విగ్రహం కూడా ఉన్నది, గౌహతి నుంచి 27 కి.మీ.

## శివ్‌సాగర్

శివసాగరం సరస్సు ఒడ్డున పెద్దశివాలయాన్ని దర్శించ వచ్చు! ఇది ఎత్తయిన ఆలయం కూడా! ఇక్కడ అమ్మవారు కామాఖ్యదేవి, బ్రహ్మపుత్రా నదీ పరీవాహక ప్రాంతం, అమ్మవారు ఇక్కడ నది ప్రక్కన గల నీలాచల పర్వతం మీద వెలిశారు, ఇక్కడ ఇంకా చాలా ఆలయాలున్నాయి, నవగ్రహాలకు ఆలయాలతో పాటు మానసాదేవి, ఉమానందశివుడు, అశ్వక్రాంత స్వామి ఆలయాలు సుప్రసిద్ధాలు.



## సాడియా



పచ్చిమాంసం తినే కాళీదేవి అవతారంగా - తామ్రేశ్వరీదేవిగా కొలుస్తారు, ఉగ్రతార అనే పేరు కూడా ఉంది, దేశంలోని వ్యాధులు ప్రబలితే ఇక్కడ అమ్మవారికి బలి ఇస్తారు.

## అశ్వక్రాంత్‌స్వామి ఆలయం - గౌహతి



నరకాసుర సంహారార్థం వచ్చిన కృష్ణుడు ఇక్కడ కొంతసేపు విశ్రాంతి తీసుకుని, ఆ తదుపరి నరకాసుర సంహారార్థం వెళ్ళినట్లు చెబుతారు. ఇక్కడి కృష్ణుడు తాబేలు కప్పలపై పడుకున్న విగ్రహం, గుర్రపుగుర్తులు కూడ చూడవచ్చును.

## పాండునాథ ఆలయం

ఇదీ విష్ణుస్వరూపమే. రైల్వేస్టేషన్ నుండి 4 కి.మీ దూరంలో ఈ ఆలయముంది. ఇక్కడి విగ్రహం ప్రక్కనేగల 5 శిలలను పంచపాండవులుగా చెబుతారు.

## వశిష్ఠమహర్షి ఆశ్రమం

గౌహతికి 15 కి.మీ దూరంలో బ్రహ్మపుత్రానది తీరంలో వశిష్ఠ మహర్షి ఆశ్రమం వుంది. ఇది పెద్ద ఉద్యానవనం. ఈ వనం ప్రక్కనుండే లలిత, సంధ్యకాంత అనే మూడు వాగులు ఈ ఆశ్రమాన్ని చుట్టుముడుతూ ముందుకు సాగుతాయి. ఒకప్పుడు వశిష్ఠులు ఇక్కడ తపం చేసినట్లు ఇక్కడవారి విగ్రహముంది. దీనికి కొంచెం దూరంలో తపోవనముంది అక్కడ పరమపతివ్రత, మాత అరుంధతి తపోప్రదేశమట. అక్కడున్న శిలను 'అరుంధతి' మాతకు ప్రతీకగా చెప్పుకుంటారు.



## మానసాదేవి

ఈమె జరత్కారుని తల్లి. నాగమాత, పాము కరిస్తే ఈ ఈతల్లిని స్మరించుకుంటే 'విషహర'మగుతుందిట. ఈమె వాసుకి చెల్లెలు. ఈ ఆలయంలో ఈమె చుట్టు సర్పరూపాలు చెక్కబడివున్నాయి.

**చూడవలసిన వాటిలో -**

ఒకప్పటి **'రోహిత'** నేటి బ్రహ్మపుత్ర నుండి నదిలో 2 కి.మీ దూరం వెడితే కనుపించే ఆలయం **'ఉమానందస్వామి'.** ఇది చూడదగ్గది. గర్భగుడిలో చదరంగా చిన్న గుంట - అది శివుడని, దాని ప్రక్కన మరో చిన్నది - అది ఉమాదేవిది. ఉమాదేవికి ఆనందం కల్గించిన ప్రదేశంగా ఉమ పేరుతో శివుడు ఉమానందుడయ్యారు.

ఇచ్చటి సితబాదు నుండి 17 కి.మీ దూరంలోని **'శ్రీకాంచనకాంతిదేవి' ఆలయం** పురాతనమైనది. శక్తివంతమైనది. ఈ మహిమగల తల్లి సకల భక్తజన ఆరాధ్యురాలు.



గోల్‌పారా జిల్లానుండి 12 కి.మీ దూరంలో **సూర్యపహాడ్.** అక్కడ ద్వాదశాదిత్యుడైన శ్రీసూర్య నారాయణా, వేదపారాయణా' అనే **భాస్కరుని దేవాలయం.** దీని ప్రశస్తి కాళికాపురాణంలో కూడా వుంది. ఇక్కడి ఇంకా విశేషం. పన్నెండు చేతులలో ఆయుధాలు ధరించిన మానసాదేవి రూపం. తలపై ఏడు శిరస్సులు కల నాగపడగను ధరించి, దర్శన మిస్తుంది ఈ తల్లి.

ఇక్కడి జాతీయ రహదారికి ఆనుకునివున్న **'టిన్‌సుకియా'** ఖిల్లాలో **'త్రిలింగమందిర'మనే శివాలయం** వుంది.



ఇదీ ఓ యాభై సంవత్సరాలనాటిదైనా ఇక్కడి మర్రిచెట్టు ప్రసిద్ధమైంది. దానికి లక్షలగంటలు కట్టబడివుంటాయి. ఇక్కడి శివలింగం అక్కడ దొరికిందే. సాధువు ప్రతిష్ఠించినదానికి ఇప్పటికోరూపం వచ్చింది. విశేషం - ఆ లింగం పెరుగుతూండటం, ఆలోచించదగ్గ గమనించదగ్గ విశేషం.

**కాలం, ప్రకృతి, నియమం, యాదృచ్ఛికత, పదార్థం, శక్తి, బుద్ధి - ఇవి కానీ వీటి కలయిక కానీ మూలకారణాలుగా పరిశీలనకు నిలవజాలవు. ఎందుచేతనంటే ఇవి సృష్టించబడినవి.**

- శ్వేతాశ్వతర ఉపనిషత్తు

# బీహార్




పాట్నా రాజధానిగా ఉన్న ఈ రాష్ట్రంలో 18 జిల్లా లున్నాయి. బౌద్ధుల కాలంలో పర్యాటక ప్రాంతంగా ఉండే విహారా అనే పేరు నుంచి బీహార్‌గా రూపాంతరం చెందినదని చరిత్రకారులు చెబుతారు.

మౌర్యుల కాలంలో బీహార్ వారికి ప్రధాన పట్టణంగా ఉండేది. అశోక్ చక్రవర్తి కాలంలో రాజధాని పట్టణాలైన మగధ, పాటలీపుత్రంలకు ఎంతో చరిత్ర ఉంది. కాలక్రమంలో అనేక మార్పుల అనంతరం 1936లో బీహార్ స్వతంత్ర రాష్ట్రమైంది.

విస్తీర్ణం : 94,163 చ.కిమీ. ప్రధాన భాషలు : హిందీ

**సరిహద్దులు :** తూర్పున : పశ్చిమ బెంగాల్, దక్షిణాన: ఒరిస్సా, పశ్చిమాన : మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాన : నేపాల్‌లు

## బుద్ధగయ, రాజగిరి, నలందా, పాట్నా, వైశాలి (బీహార్)



**పాట్నా:** నాలుగు చ.మైళ్ళు వైశాల్యం గల అశోకుని రాజభవనం ఈ ప్రాంతంలో ఉంది. అనేక పవిత్ర స్థూపాలు గల ఈ ప్రదేశము బీహారు రాజధాని అగుట వలన ముఖ్య వ్యాపార కేంద్రముగా ప్రసిద్ధి చెందినది. పాట్నా లోని మ్యూజియంలో గుప్తులు, మౌర్యులు కాలంనాటి అనేక శిల్పాలు పొందుపరచబడి ఉన్నాయి.



**మాంఘిర్ :** పూర్వం అంగరాజ్యానికి ముఖ్యపట్టణమైన ఈ గ్రామంలో ప్రసిద్ధి చెందిన హిందూ దేవాలయాలతో పాటు పురాతనకోట కూడా కలదు.

**గయ :** పాట్నా నుండి 206 కి.మీ. దూరంలో ఉన్న ఈ పుణ్య స్థలమును "పితృగయ" అంటారు. హిందువులకు చాలా ముఖ్యమైన ఈ స్థలములో శ్రాద్దం పెడితే జీవితంలో శ్రాద్ధవిధులు నిర్వర్తించ నవసరం లేదని చెబుతారు. ఇక్కడ విష్ణు పాదాలయం ఫల్గునీ - మధుర స్వేదానదులు కలిసే చోట ఉంది. ఈ ఆలయంలో హిందువులకు మాత్రమే



ప్రవేశం. ఇండోర్ మహారాణి అహల్యబాయిచే కట్టించిన 30 మీటర్లు ఎత్తుగల గాలి గోపురం ఉంది. రాతితో చేసిన విష్ణుపాదం ముద్రని వీక్షించి, నది ఒడ్డున ఉన్న స్నాన ఘట్టాలకు వెళ్లండి.

**బుద్ధగయ :** ఇక్కడ బోధివృక్షము క్రింద బుద్ధుడు తపస్సు చేసిన స్థలము ఉంది. ఈ ప్రదేశంలోనే బుద్ధునికి జ్ఞానబోధ కలిగినది. ఇక్కడ రాతిపలకం మీద బుద్ధుడు కూర్చున్నాడని చెబుతారు. నిరంజనానది ప్రక్కన ఉన్న ఈ పుణ్య స్థలములో వసతి ఏర్పాట్లు కలవు. ప్రపంచ నలుమూలల నుండి బౌద్ధులు ఈ ప్రాంతమునకు వస్తుంటారు.

## జహ్నుముని ఆశ్రమం

పాట్నాకు 122 కి.మీ. దూరంలోని సుల్తాన్‌గంజ్‌లో జహ్నుముని ఆశ్రమం వుంది. పరమేశ్వరుని మెప్పించి గంగను తెస్తున్న భగీరథుడు, ఆ వచ్చే గంగ తన వయ్యారాల నడకలతో జహ్నుముని ఆశ్రమాన్ని ముంచెత్తితే, కోపించిన మహర్షి ఆ గంగను త్రాగేస్తాడు. పితరుల భస్మరాసులపై గంగను పారించాలనుకున్న భగీరథుడు వచ్చిన అవాంతరానికి కృంగిపోతే మహర్షిని అర్థిస్తే తన ఎడమ చెవిలోనుండి గంగను విడిచాడు. ఆ రకంగా గంగ "జాహ్నవి" అయింది. ఆ ఆశ్రమ ప్రదేశమిది.

ఇక్కడికి 25 కి.మీ. సోనేపూరులో చూడదగ్గ హరిహరాలయముంది. దీనిని శ్రీరాముడు నిర్మించాడని చెబుతారు. శ్రీమద్భాగవతంలోని గజేంద్రమోక్ష ఘట్టం ఇక్కడే జరిగిందంటారు. అలాగే బీహారీ షరీఫ్ సమీపంలోని బారాగావ్‌లోని ఆదిత్య ఆలయం కూడా చూడతగ్గదే!



## మహాబోధి ఆలయం (బిహార్)



క్రీ.పూ. 3వ శతాబ్ధిలో అశోక చక్రవర్తి ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్రకారులు చెపుతారు. ఉత్తర భారత దేశంలో కనిపించే ఆలయాల శైలికి విభిన్నంగా దీనిని నిర్మించారు.

శ్రీలంక రాజైన మేఘవర్మ ఈ ఆలయానికి ఒక ఆశ్రమం నిర్మించారని ప్రతీతి. ఈ నిర్మాణం సముద్ర గుప్తుని పాలనలో జరిగింది. కాని 12వ శతాబ్ధిలో ముస్లిమ్ రాజులు దండయాత్రలో ఈ ఆలయం పూర్తిగా ధ్వంసం చేయబడ్డది. 1876లో బ్రిటిష్ ప్రభుత్వ సలహా, సహాయాలతో బర్మారాజు ఈ ఆలయ శిధిలాలపై మరలా దీనిని పునరుద్ధరించారు.

భూమి స్పర్శ ముద్రలో ఉన్న నిలువెత్తు బుద్ధుని రూపం దర్శనమిస్తుంది. ప్రతి ఏటా భక్తులు విశేషంగా వస్తూవుంటారు.


## కుండలీపురం

జైనుల ఆరాధ్య దైవమయిన మహావీరుడు 'వైశాలి'లో జన్మించాడనే ప్రగాఢ నిదర్శనాలున్నా జైనుల్లోని ఓ తెగగా పరిగణించబడుతూన్న 'దిగంబర సన్యాసులు' తమ తీవ్రవాదంతో 'కుండలీపురాన్ని' మహావీర జన్మస్థానంగా పరిగణిస్తున్నారు. 'కుండలీ పూర్' రాజ్‌గిరికు 18 కి.మీ. దూరంలో వుంది. పాట్నా యిక్కడికి 120 కి.మీ. దూరాన వుంది. గయ నుంచి యిక్కడికి సులభంగా చేరుకోవచ్చు. 'గయ'కి విమాన, రైలు సౌకర్యాలున్నాయి.



కుండలీపూర్‌లోని జైనమందిరాన్ని అనుకొని దీర్ఘపుష్కరిణి, పాండవ పుష్కరిణి అనబడే రెండు కొలనులున్నాయి. దిగంబరులు యిందులో స్నానాలు చేస్తూవుంటారు. కుండలీ పూర్‌లో బస్సు సౌకర్యాలు లేవు. రాజ్‌గిర్ నుంచే యిక్కడికి వచ్చి వెళ్ళటం ఉత్తమం.

## ఉజ్జయిని



భూపాల్ పట్టణానికి 184 కి.మీ. దూరంలో వున్న ఉజ్జయిని నగరం శిప్రానదీ తీరాన విస్తరించి వుంది. దేశంలోని వారణాశి, బోధగయ, కాంచీపురం తీర్థస్థానాల మాదిరిగానే ఉజ్జయినిలో కూడా శైవ, వైష్ణవ, జైన, బౌద్ధ మతారాధకులకు ప్రాచుర్యం లభించింది. యిక్కడ మాంత్రిక విద్యలకు కూడా మంచి ప్రోద్బలం లభించేదట.

అశోకుని కాలంలో ఉజ్జయినిని అవంతీ రాజ్య రాచనగరుగా తీర్చిదిద్దటం జరిగింది. చంద్రగుప్తమౌర్యుడు తన పాటలీపుత్రానికి బదులుగా యిక్కడి నుంచే తన రాజ్యాన్ని పరిపాలించాడట.

మహాకవి కాళిదాసు కూడా ఉజ్జయినీ నివాసిగా తెలుస్తోంది. చంద్ర గుప్తుని తర్వాత మాళవ, పరామర, శైలాదిత్యరాజులు ఉజ్జయినిని



పాలించారు. మొఘల్ చక్రవర్తి అక్బర్ ఉజ్జయినీ నగరానికి ప్రాకారాన్ని కట్టించాడు. మొఘలుల తర్వాత మరాఠా రాజులు, తదనంతరం సింధియా రాజవంశీయులు ఉజ్జయినిని కైవసం చేసుకున్నారు. ఉజ్జయినిలోని మహంకాళీ దేవాలయం అతి ప్రసిద్ధి చెందింది. యాత్రికులకు యిక్కడ తగు వసతి లభిస్తుంది. ఇక్కడి నుంచి 'ఇండోర్'కు వెళ్లవచ్చు.

## శ్రీమంగళగౌరి ఆలయం



గయనుండి 3 కి.మీ దూరంలో ఫల్గుణీ నదీతీరంలో ఈ మంగళగౌరి ఆలయం వుంది. అష్టాదశ శక్తి పీఠాలలో ఈ ఆలయాన్ని ఒకటిగా చెబుతారు. సతీదేవి వక్షస్థలం పడిన ప్రదేశమిదేనట. ఈ ఆలయం మంగళగిరి పర్వతంపై వుంది. ఈ తల్లిని భక్తులు "మంగళగౌరి లేక సర్వమంగళాదేవి" అనిపిలుస్తారు. ఇది ఫల్గుణి, మధుర, శ్వేదానదుల సంగమం. ఇక్కడ దశావతారాలు చెక్కిన ఆలయం, మహిషాసురమర్దని, అరణ్యదేవి ఆలయాలున్నాయి. కాళిదాసు ఇక్కడే ఘనచరిత్రుడయ్యాడు. రాత్రి పూట ఆరాధించే దేవుడు, నిరంజన, అహల్యాదేవి ఆలయాలు దర్శనీయాలు. ఈ ప్రాంతంలో జనార్దనస్వామి ఆలయముంది. ఆలయ

ప్రాంగణంలో ఉగ్రమూర్తి భద్రకాళివుంది. శ్రావణ మంగళవారాలు, మామూలు మంగళవారాలలో ప్రార్ధనలు, పూజలు మహాద్భుతంగా జరుగుతాయి. ప్రతి పర్వదినం పండుగే!

**"గదాధర్‌ఘాట్"**లోని **గదాధరుని (విష్ణుమూర్తి) ఆలయం** అపురూపమైంది. ఇతడు రాక్షసుడైనా బ్రహ్మభక్తుడు. నీ ఎముకలు నాకు కావాలంటే 'అవశ్య'మంటాడు. విశ్వకర్మతో గదను చేసి బ్రహ్మకిస్తే, దానిని విష్ణువు తీసుకుని 'హేతీ' అనే రాక్షసుని చంపి, తాను గదాధరుడౌతాడు. ఇది ఫల్గుణి వద్దగల ఆలయం.

**సుజాత ఆలయం:** బుద్ధునికి పాలనిచ్చిన తల్లిగా ఈమెను చెబుతారు. ఈ ఆలయం ఫల్గుణీ నదీవద్ద వుంది. ఇక్కడి బౌద్ధసన్యాసులు ధ్యానం చెయ్యడానికి వస్తుంటారు.

**సూర్యదేవాలయం:** పాట్నా నుండి 75 కి.మీ దూరంలోవుంది. ఇక్కడ గల కొండపైన కోనేరువుంది. దీనికి పడమరగా నాల్గు భుజాల సూర్యనారాయణమూర్తిని మనం చూడగల్గుతాము. 13వ శతాబ్దంలో కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు ఈ ఆలయం కట్టించాడంటారు. సూర్యకుండమనే పుష్కరిణి వద్ద శ్రాద్ధకర్మలను నిర్వహిస్తారు. ఈ దక్షిణార్కుని విగ్రహం మనం చూపే వాటికన్నా కొంత భిన్నంగా వుంది. కోటు, బూటుతో కనుపిస్తాడు. ఇక్కడి ఒకానొక సమయంలో సూర్యారాధన బాగా జరిగేది. అందుకనే ఈ ప్రాంతాలలో ఎన్నో సూర్యమందిరాలను చూడగల్గుతాం. గర్భగుడి చిన్నది. కాని మంటపంలోని స్తంభాలమీద సూర్యుడు, బ్రహ్మ, విష్ణు, దుర్గల చిత్రాలు చిత్రంగా చెక్కబడివున్నాయి.





**అజగవ్‌నాథ ఆలయం :** సుల్తాన్‌గంజ్‌లోని (భాగలపూరుకు 5 కి.మీ) అజగవ్‌నాథ్ దేవాలయ ముంది. ఇది పురాతన మహిమాన్విత శివాలయం. పూర్వం దీనిని అంగరాజ్యమనేవారు. ఇక్కడ కర్ణుని కోటకూడా వుంది. ఇక్కడి దేవుడు అజగవ్‌నాథ్. ఆయన ధనస్సుకూడా ఇక్కడ చూడవచ్చును.

**పాట్నాలోని పతాన్‌దేవి ఆలయాలు :** పూర్వమీ పాట్నాని 'పాటలీపుత్రం'గా పిలిచేవారు. ఇది బీహారుకు రాజధాని. వాయు పురాణంలో దీనిని 'కుసుమపురం'గా చెప్పబడింది. ఇది సిక్కుల గురువైన గురుగోవింద్‌సింగు జన్మస్థలం కూడా. ఇక్కడ పెద్ద పతాన్‌దేవి, చిన్న పతానుదేవి ఆలయాలు వున్నాయి. ఈమెను పాట్నా నగరదేవతగా పూజించి, ఆరాధిస్తారు. ఇక్కడ ఆంజనేయ స్వామి ఆలయం కూడా వుంది.





**సోనేపూర్ హరిహరనాథాలయం :** పాట్నాకు 25 కి.మీ దూరంలో గల సోనేపూరులోవుంది. ఇది గంగా గండకీల సంగమప్రదేశం. ఇక్కడి హరిహరనాథాలయం అత్యంత ప్రాచీనమైనదని, దీనిని శ్రీరాముడు స్వయంగా నిర్మించాడంటారు. ఇంకా గజేంద్రమోక్షం ఇక్కడే జరిగిందని చరిత్రకారుల భావన. కార్తీక పున్నమినాడు ఇక్కడ జరిగే ఉత్సవం చూసి తీరవలసిందే.

**ఉత్తరార్క మందిర్ :** గయలో మరో రెండు సూర్య దేవాలయా లున్నాయి. మొదటిది ఉత్తరార్కమందిరం, రెండవది గయాదిత్యమందిరం. మొదటిది ఉత్తర మానస సరస్సు వద్ద, రెండవది ఫల్గుణీ నదీ తీరాన ఉన్నాయి. ఇంకా సీతాకుండ్, రామశిలాపర్వతం, భాగేశ్వరీ ఆలయాలు చూడవలసినవి. గయలో ఎక్కడైన పిండప్రదానం చెయ్యవచ్చును. కొన్ని కొన్ని ప్రాంతాలలో విశేష ప్రాధాన్యముంటుంది.

గయాదిత్యమందిరం వద్దగల 'సూర్యకుండం' 1000 మెట్లతో వుంది. దీనికి పడమరలో చతుర్భుజ సూర్యనారాయణు డున్నాడు. ఇక్కడ పిండప్రదానాలు చేస్తారు. ఇక్కడ చూడవలసినది కృష్ణద్వారకలోని శ్రీకృష్ణ ఆలయం, త్రిజోగినాథాలయం వగైరాలు.



**మసారాలో పరాశనాధ్ దేవాలయం :** శివలింగ ప్రతిష్ఠ జరిగిన జైన దేవాలయం. ఇక్కడ శివప్రతిష్ఠ జరిపితేనే తప్ప జైనాలయం నిర్మించరాదన్న ప్రజాభిప్రాయం మన్నించబడింది. ఇక్కడే ఉషాఅనిరుద్ధుల వివాహం జరిగిందనేది చరిత్ర చెప్పే విషయం.

**సిద్ధేశ్వరస్వామి ఆలయం - సిద్ధేశ్వరం :** గయకు 20 కి.మీ దూరంలో వుందీ క్షేత్రం ఇచ్చటి బారాంబర్ పర్వతంపై బారారాజారావు నిర్మించాడని, ఇక్కడి తల్లిని 'సిద్ధేశ్వరి' అని పిలుస్తారు. అనంతచతుర్దశి ఇచ్చట ముఖ్యమైన పండుగ. ఇక్కడి శివలింగానికి పూజలు రాత్రులందు చేస్తారు. పాదభాగంలో ఏడు గుహలున్నాయి, చూడదగ్గవి. ఇక్కడ గంగ పాతాళగంగ పేరుతో ప్రవహిస్తుంది. ఇక్కడ అతి పెద్ద బుద్ధవిగ్రహం కూడా వుంది.



**ధుంకా - వాసుకీనాధ దేవాలయం :** వైద్యనాధం నుండి 50 కి.మీ. దూరంలో ఈ ధుంకా క్షేత్రముంది. ఇక్కడికి బస్సు సౌకర్యం కూడా వుంది. ఇక్కడ వాసుకీ పర్వతముంది. క్షీరసాగర మధనం తదుపరి వాసుకిని కూడ విడిచిపెట్టేసారుట. ఇక్కడి వాసుకీ నాథాలయంలోని శివలింగాన్ని నాగేశ్వర జ్యోతిర్లింగంగా భావించి పూజిస్తారు. పార్వతీదేవి, కాల భైరవుడు, మొ॥ విగ్రహాలను కూడా ఇక్కడ మనం చూడ గల్గుతాము. ఈ లింగం వాసుకిచే పూజించ

బడినది కావున దీనిని 'నాగేశ్వర'లింగమని, 'వాసుకీనాధ'లింగమని, ఈనాటి భక్తులు స్మరించి పూజించుకుంటున్నారు.

**బక్సర్ - సీతామర్హి:** జనకపూర్ నుండి దాదాపు 15 కి.మీ దూరంలో మిథిలానగరం, అక్కడ లఖన్‌దేయీ నదీ తీరం చూడగల్గుతాము. త్రేతాయుగంలో సంతానం కోరిన జనకమహారాజు ఇక్కడ యజ్ఞం చేయ భూమిని దున్నుతుంటే ఒకపెట్టె దొరికి, అందులో సీతాదేవి వుంది. జనకుని కూతురు కాబట్టి ఆ వరప్రసాదిని జానకిగా వర్ధిల్లిందని పురాణవచనం. ఇక్కడి ఊరి మధ్యలో చక్కని సీతారాముల మందిరముంది. అందమైన వెండి రేకులతో, నగిషీలతో పూజామందిరముంది. ఇక్కడే సీత దొరికిందని ఆలయం నిర్మించి, అందులో సీతారాముల విగ్రహముంచారు. ఇక్కడికి 5 కి.మీ దూరంలో అప్పుడు 'పుణ్యారణ్య'మని, ఇప్పుడు 'పూనేరాధం' అనే ప్రదేశంలో ఒకవైపున సీతారాములు, ప్రక్కగా ఊర్మిళాలక్ష్మణులు మరొకప్రక్కన రాధాకృష్ణుల విగ్రహాలు, ఈ మందిరం వెనుక ఒక సరస్సు వుండటంతో కొందరు సీతాదేవి ఇక్కడే దొరికిందంటారు. మొత్తానికిది సీత జన్మ ప్రదేశం.



**రామాలయం:** ఇది త్రేతాయుగంలో విశ్వామిత్రుని సిద్ధాశ్రమంగాను, ఇక్కడే మహర్షి 'రామసోదరులకు' బల, అతిబల విద్యల నొసగాడని, ఇక్కడే విశ్వామిత్రుని యజ్ఞాన్ని రామసోదరులు కాపాడారని, అందుకు నిదర్శనంగా యజ్ఞకుండాలు, విశ్వామిత్రుని ఆలయం, దీనికి కొద్దిదూరంలో పెద్ద 'సీతా'రామాలయము వున్నాయి. ఇక్కడే రాముడు మారీచ, సుబాహులను శిక్షించింది. మహర్షి 'కౌసల్యా సుప్రజారామా, సూర్యోదయ వేళాయెరా, మేలుకోవయ్య దాశరథీ, దైవకార్యముల్ సలుపవేగ" అని మేల్కొల్పింది. ఇచ్చట మామూలుగా నిత్యపూజలు, పర్వదినాలలో ప్రత్యేక ఉత్సవాలు 'రామ-రామ' అంటూ ఎంతో వైభవంగా జరుగుతాయి.

**ఎవ్వరూ కూడా ఎప్పుడయినా ఎలాంటి కర్మాచరణ లేకుండా జీవించలేరు. అది అసాధ్యం. ఎందుచేతనంటే ప్రకృతి గుణాలు తమ స్వభావం ప్రకారం ప్రతి జీవి చేత ఏదో ఒక కర్మ (పని)ను చేయిస్తూనే ఉంటాయి.**

- భగవద్గీత

**అనేకత్వంలో ఏకత్వం అన్నది ప్రకృతి సూత్రం, హిందువులు దీన్ని గుర్తించారు. ప్రతి పరాయి మతమూ "ఇవే పరమ సత్యా" లని ఏవో కొన్ని సిద్ధాంతాలను ప్రతిపాదించి వాటిని బలవంతంగా ఆచరింపజేసేలా చూస్తుంది.**

- వివేకానంద

**ప్రతివారిలో స్వయంప్రకాశశక్తిగా ఉన్న 'సత్త'ను అద్వితీయమైనది, అన్ని కారణాలనూ పర్యవేక్షించేదీ అయిన 'సత్త'ను వారు ధ్యానమార్గం ద్వారా సాక్షాత్కరించుకున్నారు.**

- శ్వేతాశ్వతర ఉపనిషత్తు

## :: సూక్తులు ::

ఈ కనిపించే జగత్తు యావత్తూ ఓంకారమే, మరింత స్పష్టంగా చెప్పాలంటే భూత, భవిష్యత్ వర్తమాన కాలాల్లో ఉన్నది అంతా ఓంకారమే. ఈ మూడు కాలాలను అతిక్రమించినది కూడా ఓంకారమే.

– మాండూక్యోపనిషత్తు

ఈ అశాశ్వత జగతిలో పరివర్తనశీలమైనది అంతా కూడా భగవంతునిచే ఆవరింపబడాలి. నిన్ను నీవు పోషించుకో, ఎవరి ధనాన్నీ ఆశించొద్దు.

– ఈశావాస్యోపనిషత్తు

అన్నిటికీ ఆత్మే మూలం. దానిచేతనే చెవి వింటుంది, కన్ను చూస్తుంది, నాలుక మాట్లాడుతుంది, మనస్సు గ్రహిస్తుంది, ప్రాణాలు పనిచేస్తాయి.

– ఈశావాస్యోపనిషత్తు

ఏ మహానుభావుడు జ్ఞానేంద్రియాలను, మనస్సును గెల్చి, అసక్తిని విసర్జించి కర్మేంద్రియాలచే కర్తవ్యాలను నిర్వహిస్తాడో ఆ వ్యక్తి విశిష్టుడు.

– భగవద్గీత

ఎన్నటికైనా విశ్వమానవమతం అనేది ప్రభవిస్తే, అది తాను ప్రకటించే భగవంతుడి మాదిరే దేశాలకూ, కాలాలకు అతీతమై అనంతమై వెలయాలన్నదే నా మతం.

– వివేకానంద

ఇంద్రియాలను జయించలేనివారు పవవిత్రమైన కాషాయ వస్త్రాన్ని కట్టడం తగదు. అలా కట్టాలనుకునే వారు నియమాన్నీ, సత్యాన్ని వంచిస్తున్నారు.

– బుద్ధుడు

క్షరాక్షరాల వ్యక్తావ్యక్తాల కలయికచే ఏర్పడిన ఈ సమస్త విశ్వానికీ భగవంతుడే స్థితికారకుడు. భగవంతుని గురించి తెలియనంత కాలమూ జీవాత్మ ఐహిక సుఖాలలో ఆసక్తికి బద్ధమై వుంటుంది. భగవంతుని సాక్షాత్కరించుకోగానే అన్ని బంధాలూ వీడిపోతాయి.

– శ్వేతాశ్వతర ఉపనిషత్తు

# ఛత్తీస్‌ఘడ్




"జగదల్‌పూరు" ఓ జిల్లా కేంద్రం. ఇక్కడ చూడదగినవి దంతీశ్వరి మందిరం, బస్తర్‌పాలెస్, చిత్రకూట, తీర్థాఘర్ తమరా, చిత్రధారా జలపాతాలు. వీటితోపాటు పదవశతాబ్దంనాటి కులుమనార్ గుహలు, కైలాస్‌గుహలతో పాటుగా బరసూర్, నారాయణపూరులోని చారిత్రక శిధిలాలతో వీటిని చూస్తే మన కళ్ళు చెమర్చక మానదు.

నాలుగు వందల సం॥ల చరిత్ర కల్గిన పట్టణం బిలాస్‌పూరులో ఎన్నో చారిత్రక స్థలాలు, మరెన్నో చెక్కుచెదరని కోటలోని రాజభవనాలు ఆశ్చర్యంగా చూడదగ్గవి. ఇక్కడ ఎన్నో ప్రాచీనమందిరాలున్నాయి. వాటిలో మహామాయ భైరవనాథ్, రత్నేపూర్ దేవాలయాలు, అలాగే మల్హార్ ప్రాంతములోని పాతాళేశ్వర్, విఘ్నేశ్వర్ మందిరాలతోపాటు "తలాగామ్" కూడా ఒక చూడవలసిన ప్రదేశం.



అలాగే డుంగూర్‌ఘర్ అనేచోట కొండపైగల బంబ్లేశ్వరీమాత ఆలయం, రాయపూరులోని మహదేవ్ మందిరం, మహామాయా మందిరాలతోపాటు ఆసక్తిగలవారు దుధాదారి బౌద్ధారామాన్ని, బుద్ధపారా సరస్సులను చూడవచ్చును.

రాయపూర్‌కు 78 కి.మీ. దూరంలోవున్న శ్రీరామ సోదరుడు లక్ష్మణునికిగల, దేశంలోని ఏకైక లక్ష్మణ మందిరం, ఆ ప్రక్కనేగల గాంధీశ్వరి ఆలయాలు, రాయపూరు నుండి 46 కి.మీ లలో త్రినదీసంగమం – మహానది, పెడి సుందూరు నదుల కలయికను, పర్యాటక స్థలంగా "దుర్గ్"ను, కోర్బాకు సమీపంలోని సరస్సును, చారిత్రక శివాలయాన్ని, సీతామని గుహలు, దేవాలయాలు వగైరా పర్యాటకుల్ని ఆకర్షిస్తాయి. ఆనందపరుస్తాయి.

## కోర్బా - శివాలయం



కోర్బా పట్టణానికి దగ్గర్లో ఒక సరస్సువుంది. దీని ప్రక్కనే చారిత్రక, పౌరాణిక ప్రాధాన్యం గల ఒక శివాలయ ముంది. ఇక్కడే 'కంకీ' అనేచోట కూడ మరొక శివాలయముంది. ఇచ్చుట 'లఫాఘర్' అను ఒక పెద్ద కోట చూడదగ్గది. ఇక్కడి సీతామని గుహలు, అక్కడి దేవాలయాలును పర్యాటకులు విపరీతంగా అభిమానిస్తుంటారు. వెండాల్ జలపాతం ఆనకట్టలు ఆకర్షణీయాలు. ఇటు చారిత్రక పరిశోధకులకు, ప్రకృతి ప్రియులకు మధురానందమీ ప్రదేశం.

## దంతేశ్వరి దేవాలయం



ఇది 'దంతేవాడ' జిల్లాలో వున్న ప్రసిద్ధ ఆలయం. ఇచ్చటి ఆరాధనమూర్తి "దంతేశ్వరి". ఇది చాళుక్యులు 14వ శతాబ్దంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ తల్లి కాకతీయులకు ఆరాధ్యదేవత. ఇది ఒక శక్తిపీఠంకూడా. ఎందుకంటే సతీదేవి పన్ను ఇక్కడ పడింది కాబట్టి 'పన్ను' అంటే 'దంత'మని, ఈ తల్లి 'దంతేశ్వరి'గా విఖ్యాతమయింది. ఇచ్చటి ఆలయం కళాతృష్ణకు నిదర్శనం. శాకినీ, ఢాకినీ నదుల సంగమం. ఇచ్చటి గరుడ స్థూపం చూడవలసినది. దసరా ఉత్సవాలు ఇక్కడ దేవతలు దిగివచ్చేటట్లు జరుగుతాయి.

## శివానీ దేవాలయం - కాంకర్



కాంకర్ నగరంలో ఈ శివాని (శివరాణి) ఆలయముంది. ఈ ఆలయంలో ప్రతిష్ఠించబడినది కాళిమాత విగ్రహం. భక్తులు ఈ తల్లినే ఇటు కాళిఅనీ, అటు దుర్గగాను భావించి పూజించుకుంటారు. రెండు రూపాల తల్లి ఈ జగజ్జనని. ఇటువంటి భావన కల్గిన దేవతావిగ్రహాలు ఒకటి ఇక్కడ, రెండోది కలకత్తాలోను వుంది. ఇక్కడ నవరాత్రులు మహాద్భుతంగా జరుపుతారు. ఎక్కడైనా సరే నవరాత్రుళ్ళు నయనానందకరంగా భావించాలి.

## గంధేశ్వర దేవాలయం

దీనిని మహానది ఒడ్డున నిర్మించారు. ఇది శివుని ఆలయం. చాలా పురాతనమైనది. ఇందులో నటరాజు, శివుడు, గరుడనారాయణుడు, మహిషాసుర మర్దిని మొ॥ దేవతల దివ్యవిగ్రహాలున్నాయి. ఇక ముఖద్వారం పైన శివలీలలు ఎంతో హృదయానందకరంగా చిత్రీకరించబడ్డాయి. చూడదగ్గవి.

## రాజిమ్ - రాజీవ్‌లోచన్ దేవాలయం



రాయపూర్‌కు 45 కి.మీ దూరంలో ఈ రాజిమ్, అక్క డ రాజీవలోచన దేవాలయ సమూహం మనం దర్శించవచ్చును. ఈ మొత్తం ఆలయ సముదాయంలో ప్రధానమైనది రాజీవ్‌లోచన దేవాలయమే. ఇక్కడి ప్రధాన దైవం శ్రీమహావిష్ణువు. అయితే వామనుడు, నరసింహ, త్రివిక్రమ, మొ॥ దేవతామూర్తులను కూడా ఇక్కడ చూడగల్గుతాం. దీని చరిత్రను గమనిస్తే నూనెను అమ్ముకునే స్త్రీ ఈ ఆలయనిర్మాణమునకు నడుంకట్టింది. కాని

ప్రజలీ ఆలయాన్ని ఆదరించరేమోన్న అనుమానం బయలుదేరితే ఒకనాటి రాత్రి శ్రీమహావిష్ణువు కలలో కనుపించి నీకా సందేహం వలదు. తప్పక ఈ ఆలయం అభివృద్ధి చెందుతుంది. ఎందరో దర్శించి, తరిస్తారని" అభయపూర్వక వరదానం చేస్తాడు.

ఆలయం పూర్తవుతుంది. ప్రతిష్ఠ జరుగుతుంది. దీనికి క్షత్రియులు పూజారులు. ఉదయం బాలునిగా, మధ్యాహ్నం యువకునిగా, రాత్రి వృద్ధునిగా అలంకరిస్తారు. ఈయన తలపాగాను తరతరాలుగా ఒకే కుటుంబం వారు నేసి ఇస్తున్నారు. ప్రతి పున్నమికి ఇక్కడ జరిగే వుత్సవానికి అసంఖ్యాక జనం తరలివస్తారు. దీనిని 'చత్తీస్‌గడ్ ప్రయాగ'గా ముద్దుగా పిలుచుకుని ఆనందిస్తారు.

## బాలాజీ మందిరం



రాయఘుర్‌లో శ్రీబాలాజీ దేవాలయముంది. దీనిని 1610 సం॥లో శ్రీ బలభద్రదాసు, భోసలీలు నిర్మించారు. దీని గోడలు రాముని చిత్రాలతో నిండివుంది. శ్రీమహావిష్ణువుకు ప్రతిరూపాలుగా చెప్పబడే గండకీ నదిలో లభించే అపురూప సాలిగ్రామముల నిక్కడ మనం చూడవచ్చును.

ఈ రాయఘుర్‌లో శ్రీబాలాజీ ఆలయంతోపాటు వున్న మరో ఆలయం 'శ్రీశ్యామమందిరం'. ఇదీ పురాతనమైనదే. ఇక్కడి దైవము నీలవర్ణ ఛాయతో ప్రకాశించే ఆ విష్ణుమూర్తే! ఇక్కడ ఏకాదశి, జన్మాష్టమి సమయాలలో ఉత్సవాలు, మహోత్సాహంగా జరుగుతాయి. ఉత్సవాల సమయాలలో ఈ ఆలయమెప్పుడు కిటకిటలాడుతుంటుంది.

బుఢ్రాతలాబ్‌కు సమీపంలో 500 సం॥ల చరిత్ర కల్గిన బంజారిమాత దేవాలయాన్ని మనం చూడవచ్చును. ఇక్కడి దేవుడు శ్రీరాముడు. రాయపూరులోని ప్రముఖ దేవాలయాలలో బంజారిమాత దేవాలయమొకటి. మనం పూజించే దుర్గామాతను ఇక్కడివారు 'బంజారామాత'గా పిలిచి, కొలుస్తారు. హరిష్‌జోషి, ఈ మందిర నిర్మాత. స్థానికుల కథనం ప్రకారం శ్రీహరిష్‌జోషి ఒక శిలను చూస్తాడు. అందులో దేవతాంశ, అస్పష్టమైన దేవతారూపం దర్శనమివ్వడంతో దానికి నిత్యార్చనను ప్రారంభించాడు.

ఇది వూళ్ళో వాళ్ళకు తెలిసి, వాళ్ళుకూడా ఈ విగ్రహ పూజకు తరలిరాసాగారు. చివరకా రూపాన్ని బంజారి మాతగా తలవడం, ఆ తల్లి భక్తుల అభీష్టాలను తీరుస్తుండటంతో ఆలయనిర్మాణం జరిగింది. ఇదికాక ఈ బుఢ్రా తలాబ్‌కు సమీపంలో "దుధదారి" దేవాలయముంది. ఇదీ పురాతన దేవాలయమే. ఇక్కడి దైవం శ్రీరామ చంద్రుడు. చూడదగ్గ దర్శనీయాలు.

## దుంగారఘుర్ - జంబ్లేశ్వరి



ఛత్తీష్‌ఘడ్‌లోని, దుంగారఘుర్ అనే ప్రాంతంలో 1600 అ॥ ఎత్తు కొండపై ఈ 'బంబ్లీశ్వరి" ఆలయముంది. ఇదేకాక కొండ దిగువన 'చోటీబంబ్లేశ్వరి' అనే మరో ఆలయముంది. ఈ ఆలయం లోని మాతా బంబ్లేశ్వరిని దుర్గాదేవిగా భావించి, తమ అర్చనలతో ఆనందిస్తారు. కొండపైకి వెళ్ళేందుకు 'రోప్‌వే' సౌకర్యము కూడావుంది.

## : : సూక్తులు : :

వ్రత పాలకుడయిన అగ్ని పరమవ్యోమంలో పుట్టి వ్రతాలను కాపాడుతున్నాడు. ఆ సుకర్ముడు ఆకాశాలను కొలుస్తున్నాడు. వైశ్వానర అగ్ని తన మహిమచేత స్వర్గాన్ని తాకుతున్నాడు.

– రుగ్వేదం

మాటలు దేన్ని ప్రకటించలేవో, మాటలనే ఏది ప్రకటిస్తుందో అది మాత్రమే బ్రహ్మం అనీ ఈ ప్రజలు పూజించే ఇది కాదనీ గ్రహించండి.

– కేన ఉపనిషత్తు

రుషులు వేదమంత్రాలతో ఏ ఏ యజ్ఞకర్మలను దర్శించారో అవన్నీ కూడా సత్యమే. మూడు వేదాలు వీనిని విస్తారంగా వర్ణిస్తాయి. సత్యప్రియులారా ! వీటిని మీరు నిత్యం అనుష్టించండి. పుణ్యలోకాలకు దారి అదే.

– ముండక ఉపనిషత్తు

సత్యం, తపస్సు, దమము, శమము, అగ్నిహోత్రం, అతిథి సత్కారం, సంతానోత్పత్తి, రుతుకాలంలో భార్యా సంగమం, పుత్ర వివాహాదులు, స్వాధ్యాయ ప్రవచనాలు – ఇవన్నీ అవశ్యం ఆచరణీయాలు.

– తైత్తిరీయ ఉపనిషత్తు

అర్జునా ! నీ విధ్యుక్త కర్మలను సక్రమంగా నిర్వర్తించు. నిర్వ్యాపారంగా ఉండటం కంటె ఏదో ఒక పనిచేస్తూండడమే మేలు. పనిపాటలు బొత్తిగా చేయని సోమరులకు దేహయాత్ర సాగడం కష్టమే.

– భగవద్గీత

తత్వశాస్త్రం ఏం చెప్పినా, వేదాంతం ఏం స్థిరీకరించినా లోకంలో మరణం ఉన్నంత వరకూ మానవ హృదయంలో బలహీనత అనేది ఉన్నంతవరకు, మానవ హృదయాల్లోంచి ఆర్తనాదం వెలువడుతున్నంత వరకూ భగవంతుడిపై విశ్వాసం ఉండి తీరుతుంది

– వివేకానంద

దట్టంగా వేయని కప్పు నుంచి వర్ష బిందువులు లోపలికి జారే విధంగా, వివేకం లోపించిన మనస్సు నుంచి విషయవాంఛలు ప్రవహిస్తూనే ఉంటాయి.

– బుద్ధుడు

చైతన్యవంతుడైన కర్త, చైతన్య రహితమైన కర్మ, ఈ రెండెంటి మధ్య సంబంధం కల్పించే మాయ – ఈ మూడూ కూడా బ్రహ్మమే అని గుర్తించినప్పుడు ఆత్మ అనంతమై విశ్వరూపం దాల్చి కర్తృత్వ భావన నుంచి విముక్తి పొందుతుంది.

– శ్వేతాశ్వతర ఉపనిషత్తు

# ఢిల్లీ



**చత్తర్‌పూర్ మందిర్:** మొగల్ పరిపాలనలో అనేక స్మారక కట్టడాలను నిర్మించిన చక్రవర్తులు అద్భుతమైన హిందూ ఆలయాలను కూడా



నిర్మించగలరని ఈ చత్తర్‌పూర్ మందిర్ నిరూపిస్తుంది. కుతుబ్‌మీనార్ నుండి 4 కి.మీ. దూరంలో ఉన్న ఈ మందిరం, దాని పరిసర ఆలయాలు, మిరుమిట్లు గొలుపుతూ చూపరులను ఆకర్షిస్తూ ఉంటాయి. తెల్లని మెరిసే పాల రాతితో నిర్మించబడ్డ ఈ ఆలయ సముదాయం, చాలా ప్రసిద్ధి చెందినది. ఇందులో ప్రధాన ఆలయంలో, శక్తి స్వరూపిణి అయిన దుర్గామాత వెలసి ఉంటుంది. ఈ ఆలయ నిర్మాణం దక్షిణభారత శైలిలో ఉండుట ఓ ప్రత్యేకత. ఇటువంటి మందిరాన్ని కన్నులారా చూస్తే గాని వర్ణింపశక్యంగాదు.

**ఇస్కాన్ టెంపుల్:** 1998లో నిర్మితమైన ఈ ఆలయం, కైలాష్ ప్రాంతంలో సంత్‌నగర్ రోడ్డులో, హరికృష్ణ కొండ వద్ద ఉంది. ఈ అద్భుతమైన ఆలయ శిఖరం 90 అడుగుల ఎత్తులో ఉంటుంది. 1500 మంది భక్తుల సమావేశానికి అనువుగా పూర్తి ఎయిర్ కండీషన్ చేయబడింది. రష్యా చిత్రకారులచే గీయ బడిన, రాధాకృష్ణ, సీత, శ్రీరాముడు, లక్ష్మణుడు, భక్త హనుమాన్‌ల కుడ్య చిత్రాలు కనువిందు చేస్తుంటాయి. ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు, కీర్తనలు, భజనలు, భక్తి గీతాలు, ప్రవచనాలు మొదలగు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి. శ్రీ కృష్ణుడు వెలసిన ఈ ఆలయం, హరేరామ హరేకృష్ణ, భక్తులచే నిర్మింపబడింది.




అద్భుతంగా నిర్మింపబడిన ఈ ఆలయం, భారతదేశంలో ఉన్న అతి పెద్ద ఆలయాల్లో ఒకటిగా పరిగణింప బడుతుంది. ఈ ఆలయంలో ప్రత్యేకాకర్షణగా ఒక మర మనిషి, గీతాపారాయణం చేయడం మరిచిపోలేని అనుభవం.

**కల్కాజీ మందిర్:** కల్కాజీదేవిగా (కాళిగా దేవి) వెలసిన ఈ కల్కాజీ మందిర్ నెహ్రూపేలస్ (ఒక వ్యాపార సముదా యము) అవతల ఉంటుంది. కల్కాదేవి (కాళికాదేవి) అనబడే ఈ శక్తి కల్కాజీ ఆలయం 12 ప్రక్కల గోపురాలతో, బహాయి ఆలయం మాదిరిగా అదే కొండపై వెలసి ఉంటుంది. ఇక్కడి కట్టడాలు 1764 సం॥కి



సంబంధించినవైనా, ఇక్కడ ఈ ఆలయానికి 19వ శతాబ్ధంలో జరిగిన మార్పు, చేర్పులవలన, ఈ ఆలయం చాల నవీనంగా కనిపిస్తూ ఉంటుంది.

ప్రత్యేకమైన సాధువులచే జరుపబడుతున్న భజనలు, స్తోత్రాల మూలంగా ఈ ఆలయం హిందూమతానికి ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ ఉంటుంది. ప్రత్యేకంగా అక్టోబర్ నెలలో జరిగే నవరాత్రి మహోత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొని తరిస్తూ ఉంటారు.

**కాలి బారి మందిర్ :** బిర్లా మందిర్‌కు కుడి ప్రక్క కూతవేటు దూరంలో వెలసిన ఈ కాలిబారి మందిర్ ఆలయం, చూడ్డానికి చిన్నదిగా ఉన్నా, కాళికామాత వెలసిన ఈ ఆలయం చాలా ప్రసిద్ధి గాంచింది. ప్రత్యేకంగా ఢిల్లీలో నివసించే బెంగాలీలకు ఆరాధ్య దైవమని చెప్పవచ్చు. అక్టోబర్‌లో జరిగే దుర్గా నవరాత్రి ఉత్సవాలకు కేంద్ర బిందువు అయి వెలుగుతోంది. భయం గొలిపేటట్లు యుద్ధానికి సిద్ధమైనట్లు ఉండే దుర్గాదేవి అంశే ఈ కాళి అని నమ్ముతారు. ఇక్కడ దేవికి మద్యం అర్పిస్తారు.



ఆలయం లోపల నున్న ఒక పెద్ద రావిచెట్టు, ఆలయం పైకప్పులోంచి పొడుచుకు వచ్చి ఆలయానికి నీడనిస్తుంది. భక్తులు, ప్రజలు, తమ తమ వినతులు, కోర్కెలు, తీరేందుకు గాను ఈ రావిచెట్టుకు ఎర్రని దారాలు కట్టి తమ విశ్వాసాన్ని చాటుకుంటారు.



**హనుమాన్ మందిర్ :** ఢిల్లీలో, కాన్నాట్‌ప్లేస్‌కు 250 కి.మీ దూరంలో బడాఖరక్ సింగ్ రోడ్డులో వెలసిన ఈ ఆలయం నిర్మాణానికి చాలా విశిష్టత సంపాదించుకొంది. ఈ ఆలయం, మహారాజు జైసింగ్ ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ నిర్మాణ సమయంలోనే జరిగిందంటారు. కాని కాలక్రమేణా భారీ ఎత్తులో, ఆలయానికి మార్పులు చేర్పులు జరిగినవని అంటారు.

**బిర్లా మందిర్ (లక్ష్మీనారాయణ మందిర్) :** 1938లో రాజు బలదేవదాస్ చేత నిర్మింపబడ్డ ఈ ఆలయం, ఢిల్లీలోని కాన్నాట్‌ప్లేస్‌కు పడమరగా వెలసి ఉంది. బిర్లా మందిర్‌గా పిలువబడే ఈ ఆలయం, సిరులకు, అదృష్టదేవతకు నిలయమై ఉంటుంది. దీని నిర్మాణం నవ్యతరహాగా ఉంటూ, పలు భక్తులను, విదేశీ యాత్రికులను ఆకర్షిస్తూ ఉంటుంది. విష్ణుమూర్తి అంశ ఆయన లక్ష్మీనారాయణుడు వెలసి ఉంటాడిక్కడ.

ఈ ఆలయంలో ప్రతి గోడమీద, హిందూ చిత్రాలు, భావాలు మరియు గీతాబోధ, ఉపనిషత్తులతో అలంకరించబడి ఉంటాయి. మహాత్మాగాంధీచే ప్రారంభోత్సవము కాబడిన ఈ ఆలయం, 1933–39లో నిర్మింపబడినది, ప్రత్యేకంగా



అస్పృశ్యుల, అంటరానివారికొరకు ఉద్దేశించబడింది. భారతదేశంలో మిగతా బిర్లా మందిరాలవలే ఈ ఆలయం కూడా బిర్లా కుటుంబంలోని వారిచే నిర్మించ బడింది.

100 ఎకరముల స్థలంలో, 200 కోట్ల రూపాయల వ్యయంతో ఈ అక్షరధామ్‌ను నిర్మించారు. 11,000 మంది శిల్పులు అయిదేళ్ళపాటు శ్రమించి దీనిని నిర్మించారు. ఇందులో కృత్రిమనదీ పడవ విహారం అనుభవించదగ్గ ఆనందం.

ఇక్కడి సరోవరంలో 151 పుణ్యనదీజలాలను తెచ్చి కలిపారు. ఈ పవిత్ర జలం 108 గోముఖ శిల్పాలనోటినుండి వచ్చేటట్లు నిర్మించారు. ఇక్కడ నిర్మించిన మెట్ల బావి దేశంలోనే అతి పెద్దది. 2870 మెట్లమధ్య 300 అడుగుల పొడవు, వెడల్పుగల కమలాకర యజ్ఞగుండం, పగలు యజ్ఞగుండంగా, రాత్రి ఫౌంటెన్‌గా మారి నయనోత్సవం చేస్తుంది. ఇది అపురూపం. ఆసక్తిగలవారికి దర్శనీయం.

**సూర్యసరోవరం**: ఢిల్లీకి 10 కి.మీ దూరంలో వున్న ఈ ప్రాంతం చారిత్రక నేపథ్యం కల్గివుంది. షుమారు 900 సం॥ క్రితం, ఈ ప్రాంతాన్ని పరిపాలించిన "తోమార్" రాజవంశీయులు నిర్మించిన సూర్యదేవాలయం, దాని ప్రక్కనే ఒక సరస్సు వున్నాయి. దీంతో ఈ ప్రాంతాన్ని "సూరజ్‌కుండ్" గా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడీ ప్రాంతం పర్యాటక స్థలంగా కూడా తీర్చిదిద్దారు.




**ఎఱ్ఱకోట** : 1648 సం॥లో నిర్మించిన ఇది ఢిల్లీకి ఒక ఆకర్షణ. చారిత్రక నేపథ్యంకలదికూడా. ఎర్రని రాళ్ళతో నిర్మించిన కోట 108 అడుగుల ఎత్తుగలది. దీని ప్రక్కనే మోతిమసీదు, పెర్లుమాస్క్, రంగమహలు లున్నాయి. కోట వెనుక ప్రవహించే యమునానదిని చూడవచ్చును.



**కుతుబ్‌మీనార్**: 1198లో ప్రారంభమైన ఈ కుతుబ్ మీనారు 14 అడుగుల వెడల్పున్న చారిత్రక నిర్మాణం. 1351లో రాజా ఫిరోజ్‌షా, 1489లో సికిందర్‌లోడీ, వీటికి మరమ్మత్తులు చేయించారు. ఇచ్చటి మసీదులోని స్తంభాలన్నీ, హిందూ, జైన మత శిల్పసంస్కృతిలో కనబడతాయి.

ఇక్కడో ఇనుప స్తంభంవుంది. 4వ శతాబ్దానికి చెందిన దీనిపై హిందూదేవతల బొమ్మలు చెక్కబడి విష్ణుమూర్తికి

అంకితమివ్వబడింది. ఇది చంద్రగుప్తుడి కాలంనాటిదని చెబుతారు.



**జామామశీదు** : క్రీ॥శ॥ 1656లో షాజహాన్ చక్రవర్తి, ఆగ్రానుండి తన రాజధానిని ఢిల్లీకి మార్చాక దీనిని నిర్మించాడని చెబుతారు. ఇది ఎంత పెద్దదంటే ఒకేసారి 25,000 మంది ప్రార్థనలు జరుపడానికి వీలుగా నిర్మించబడింది.

ఇందులో మహమ్మద్ ప్రవక్త "కేశా"న్ని భద్రపరిచారు. అలాగే ప్రవక్త వాడిన చెప్పుల్నీ కూడా ఒక ప్రత్యేక స్థలంలో భక్తుల దర్శనార్థం వుంచారు.



**జంతర్‌మంతర్** : 1724లో ఇది నిర్మించబడింది. మహారాజు జయసింగు దీని నిర్మాత. ఖగోళ, నక్షత్రశాలల శాస్త్ర అధ్యయనానికిది బాగా వుపయోగపడుతున్నదని దీని నిర్మాణ సారాంశం. అంబర్‌కోటను రాజధానిగా చేసుకుని పరిపాలించిన రాజా సవాయమాన్ ఇటువంటి జంతర్‌మంతర్‌లను "జయపూర్, వారణాసి, ఉజ్జయిని, మధురలలో నిర్మింపచేసాడు. ఈయన ప్రతిభను గౌరవించినట్లు ఔరంగజేబు, ఈయనను ఆ గ్రామ, అలాగే మాళవ రాజ్యానికి గవర్నరును చేసారుట. సామాన్యులకిది అర్థంకాని వింతయినా పర్యాటకులకు ఆకర్షణం. శాస్త్రవాదులకు సంతర్పణ.



ఇంకా ఇక్కడ పార్లమెంటు భవనం, లోటస్ టెంపుల్, రాష్ట్రపతి భవనం, ఇండియాగేటు, వగైరాలు చూడవచ్చును.

పాతఢిల్లీ చారిత్రకానందాన్నిస్తే, న్యూఢిల్లీ క్రొత్త అందాలకు చోటుచేస్తుంది. నిజానికీ (పాత) ఢిల్లీ చారిత్రాత్మక, పౌరాణిక ప్రధాన్యం కల క్షేత్రమని చెప్పాలి. పాండవులు ఏలిన హస్తినాపురమిదే. పాండవుల కోటగా చెప్పబడే అపురూప కట్టడం చూడదగ్గది. ఆకాశాన్ని అంటినట్లు ఎత్తుగా ఉండే ఆ కోట గోడలపై అలనాడు వేసిన రంగులు అస్పష్టంగానైనా ఇప్పుడు చూడవచ్చును.



ఇటు మహమ్మదీయులు ఈ భారతానికి వచ్చి చేసిన దారుణాలు ఫలితంగా ఎన్నో ఆలయాలు మసీదులయ్యాయి. దీనిని ఇప్పటికి సర్దుకోలేక ఆ పరిమిత వర్గాలైన, ముస్లిం-క్రైస్తవులను

నెత్తిన పెట్టుకుని సమరసభావం, సమతావాదమంటూ, ఈనాటి పాలకులు, అధికారానికే వెంపర్లాడుతున్నారుతప్ప, చారిత్రక, పౌరాణిక నైసర్గిక పరిస్థితులను గుర్తించడంలేదు.

కమనీయ, ఘనమైన చరిత్రగల ఈ దేశాన్ని అందులో, రాష్ట్రాలలోని అపురూప శిల్పసంపదను, చారిత్రక ఆలయాలను, పౌరాణిక ప్రాంతాలను గుర్తించి, గౌరవించడంలేదు. వాటికివ్వదగిన ప్రాధాన్యతను, ఘనతను, వారసత్వాన్ని గౌరవించి, ప్రముఖస్థానాన్నివ్వడంలేదు. బ్రిటిష్‌వారు వెళ్ళడానికి ముందున్న అపురూప సంపద, మనవారు అధికారంలోకి వచ్చాక మనపాలకులు, నిజంచెప్పాలంటే, భ్రష్టుపట్టించారుతప్ప ఘనచరిత్రను గౌరవించలేదు. వాటిని కాపాడలేదు. కాపాడే సావకాశమున్న కొందరు ఘనులు, మన దౌర్భాగ్యంకొద్ది కాళ్ళు, వేళ్ళు విడదీసి అమ్ముకుని ఆనందించారుతప్ప జాతికివ్వవలసిన గౌరవం, చరిత్ర కివ్వవలసిన ప్రాధాన్యం, పురాణ సంపదకు తగు ప్రాతినిధ్యమిచ్చిన దాఖలాలు ఎక్కడా మచ్చుకుగూడ కనబడవు.

ప్రతి మశీదు, ఒక ఆలయం లేదా మందిరం పునాదులమీద, ఆలయాల ప్రక్కన నిర్మించి, వారేదో, ఈ దేశానికి పునాదిగా ప్రకటించుకుంటూంటే, మన పాలకులు సత్యమెరిగికూడా, అమాయకజనాభా ఓట్ల కోసం, ప్రాచీన సంపదను, తగులబెడుతున్నారు. అధర్మానికి ఆజ్యం పోస్తున్నారు.

**ఇక దర్శనీయాలు :**

## స్వామి నారాయణ్ అక్షరధాం

ఢిల్లీలో చూడగదిన వాటిలో ఇదొకటి. ఒకనాటి ఇంద్రప్రస్థం. నేటికినీ అనేక మందికి తరతరాల రాజధాని. 100 ఎకరాల భూభాగంలో నిర్మితమైన ఆలయాల సముదాయమిది. సంస్కృతీ సాంప్రదాయాల పరిరక్షణలో



భాగంగా, నిర్మాణం ఈనాటిదే అయినా, ఆలోచన, ఆచరణ అద్భుతం. అహ్మదాబాద్ వాస్తు శిల్పి శ్రీ వీరేంద్ర త్రివేదీ నిర్మించిన ఈ కళాఖండాన్ని 148 రాతిఏనుగులు తమ భుజాలపై మోస్తున్నట్లు వుంటుంది. గర్భభాగంలో 11 అ॥ ఎత్తు బంగారు తాపడం చేసిన స్వామినారాయణ్ విగ్రహం చూడముచ్చటగా వుంది. పురాణగాధలకు సంబంధించిన చిత్రాలు అడుగడుగునా మనల్ని పులకింపచేస్తాయి. నిజానికి స్వామి నారాయణ ఒక బాలయోగి. ఆయన చివరికొక మతశాఖకు అధ్యక్షుని గానే కాదు వ్యవస్థాపకునిగా మారిన తీరును రకరకాల దృశ్యాలతో, హృదయానికి హత్తుకునేట్లు 'నీలకంఠ' దర్శన్‌లో దర్శించవచ్చును. ఇక్కడో మెట్ల బావి వుంది. అది ప్రపంచంలోనే లోతైనదిగా చెబుతారు. ఇందులోని ఎనిమిది ఆకుల పద్మం ఆనాటి గణితవిజ్ఞానానికి 'దర్పణ'మని చెప్పాలి. ఇచ్చటి 60 ఎకరాల ప్రశాంతవాతావరణంలో వున్న కొలనులో పది నిముషాల బోటు ప్రయాణం, పదివేలకుపైగా కల్పితదృశ్యాలు హిందూసంస్కృతిని ప్రతిబింబింప

చేస్తూంటే, పులకించి, పొంగిపోవచ్చును. ఇంతటి దివ్యప్రదేశం, సంస్కృతీసౌరభాల పులకరింత ఒక వింతకాదు, చెప్పుకోలేని ఎంతో వింతవింత అనుభూతి అనాలి.

ఢిల్లీలోని ఒక చిన్న గ్రామం **'బహాపూర్'.** ఇక్కడి బహాయి తరహా ఆలయముంది. కాకపోతే ఇక్కడ సర్వులకు సముచిత స్థాముంది. దర్శనం చేయవచ్చును. ఎవరైనా ప్రార్థన చేసుకోవచ్చును. కానీ మతప్రవచనాలు, కర్మలు మాత్రం చెయ్యకూడదు. ఇది పద్మాకారంలో వుంటుంది. ప్రముఖ మతాచార్యుల సూక్తుల నాధారంగా ఏర్పడిన మతమిది. సర్వత్ర దైవాన్ని దర్శిస్తారు. దానిని ప్రముఖంగా ప్రకటించ ఒప్పుకోరు.

తూర్పుఢిల్లీలోని **మయూర్‌విహార్‌లో "ఉత్తరగురువాయూరప్పన్"** అనే శ్రీకృష్ణుని ఆలయముంది. ఇది ఈనాటిదే అయినా, కేరళలోని గురువాయూరప్పన్‌కు ప్రతిరూపంగా నిర్మింపబడింది. ఇక్కడ వీరు సంస్కృతీసాంప్రదాయాలను, సమాజసేవను చక్కగా నిర్వహిస్తుంటారు

**చాందినీచౌకు** వద్దగల **'దిగంబరజైన' మందిరం** – ఒక పురాతన ఆలయం. ఇది 1656లో నిర్మింపబడింది. దీనికి సమీపంలో 1959లో పునరుద్ధరించబడిన గౌరీశంకర్ ఆలయాన్ని మొదట్లో మరాఠా సైనికుడు 'అపాగంగాధర్' నిర్మించాడు. గర్భగుడిలో శివపార్వతులు, వినాయకుడు కుమారస్వామి విగ్రహాలు, శివలింగముందు – శివుడు, పార్వతులను జాతి (రాళ్ళతో) రత్నాలతో అలంకరించిన విగ్రహాలను కూడా ఆనందంగా చూడవచ్చును.

ఢిల్లీలోని – **లోడీ రోడ్డులో** ఈనాటి ప్రపంచ ప్రజల ఆరాధ్యదైవం **'షిర్డిసాయిబాబా' ఆలయ**ముంది. అసంఖ్యాక ప్రజలు దీనిని దర్శిస్తారు. నిత్యం నాల్గు హారతులు, సంస్థానపూజ, గురువారంనాడు పల్లకీ ఉత్సవం, ప్రత్యేక పూజల్ని మనం చూడవచ్చును. ఇది ఈనాటిదే.

**జగన్నాథ ఆలయం** – కూడా ఇప్పటిదే. పూరి వెళ్ళి చూడలేనివారికి, ఈ ఆలయం, ఇచ్చటి పూజాకార్యక్రమాలు ఆనందదాయకాలు. ఇది గ్రీన్‌పార్కు ప్రదేశంలో వుంది.

**కన్నాట్‌ప్లేసులోని** అతి పురాతనమైందీ **బాలహనుమాన్ దేవాలయం.** ఉత్తరదిశలో బారీ ఆంజనేయుని విగ్రహాన్ని చూసితీరాలి. స్వామికి కుడివైపున సీతారామలక్ష్మణవిగ్రహాలను కూడా మనం చూస్తాము. ప్రక్కనగల చిన్నచిన్న గదులవంటి ఆలయాలలో శివుడు, పార్వతి, వినాయకుడు, కుమార స్వామి, దుర్గాదేవి, లక్ష్మీనారాయణులు, సంతోషిమాతలను చూడగల్గుతాం. వీటిని ఢిల్లీ కార్పొరేషనువారు ఏర్పాటుచేసారు. ఇక చారిత్రకంగా చూస్తే – కురుక్షేత్ర సంగ్రామమయ్యాక అయిదు దేవాలయాలను నిర్మించారుట. అందులో ఈ బాలహనుమాన్ దేవాలయ మొకటి. దాదా గురు అని పిలువబడే మహరాజ మంగళదాస్ అనే సంత్‌కు స్వామి కలలో కనుపించి, తాను స్వయంభువునని చెప్పడంతో దాసు రామచరితమానస్‌లోని సుందరకాండ, రామాయణ గాధలు పాలరాతి ఫలకాలపై చెక్కబడ్డాయి. గోపురంలోని విమానంపై చంద్రరేఖ ఉండటంతో ఇది హిందూముస్లింలకు ఆరాధ్యమయింది. మహ్మదీయుల దాడినుండి తప్పించుకుంది.



యమునానదిపై నిర్మించిన 'హనుమాన్' సేతువంతెన దాటగానే ప్రాచీనమైన **మర్కట హనుమాన్ దేవాలయాన్ని** చూడగల్గుతాం. మొగలులకాలంలో యమునాబజార్‌లో మర్కట బాలాజీ అనే స్వామి ఈ ఆలయపునర్‌నిర్మాణం


చేసాడు. అందుకే కొందరు ఈయనను (దేవుని) యమునాబజార్ హనుమాన్ మందిరమని, మర్కటహనుమాన్ దేవాలయమని పిలుస్తారు. నాలుగు అడుగుల ఎత్తులోవున్న స్వామి పశ్చిమాభిముఖుడు. ఎప్పుడు సింధూరపూతతో దర్శనమిస్తాడు. ఇంకో విచిత్రం స్వామి విగ్రహం చుట్టూ నీళ్ళు, కుడిచేతిలో సంజీవనీ పర్వతంతో, ఎడం చేతితోనేలకానించి వున్నట్లుంటుంది.

దీనిని కృతయుగం చివర్లోగాని, త్రేతాయుగం మొదట్లోకాని నిర్మించివుండాలి. అపురూపము, అత్యద్భుతమైనదీ ఆలయం.

## చత్తర్‌పూర్ - శనిదేవాలయం



కుతుబ్‌మీనారుకు 16 కి.మీ దూరంలో శనీశ్వరుని ఆలయముంది. ఇది ఎప్పటిదో తెలియదు. చిన్నచిన్న విగ్రహాలతో వుండే ఈ ఆలయంలో 2003 సం॥ మార్చి 31న అనంతశ్రీ వైభూషిత జగద్గురు శంకరాచార్యస్వామివారు, ప్రపంచంలోకెల్ల అతి పెద్దదైన శని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అప్పటినుండి దినదినాభివృద్ధి నొందుతూ, శని, ఆది వారాలలో అధికసంఖ్యలో భక్తుల నాకర్షించి, తన కృపను స్వామి ప్రసాదిస్తున్నారు.


శని దేవాలయం, ఛత్తర్‌పూర్

## : : సూక్తులు : :

ఆత్మ చలిస్తుంది, చలించదు. అది దూరంలో ఉన్నది, దగ్గర ఉన్నది. అది ఈ అంతటి లోపలా ఉన్నది. ఈ అంతటి వెలుపల కూడా వ్యాపించి ఉన్నది.

– ఈశావాస్యోపనిషత్తు

మనస్సుచేత గ్రహించడానికి శక్యంకానిదీ, అయితే దేనిచేత మనస్సు గ్రహింపబడుతున్నదో అది మాత్రమే బ్రహ్మం అనీ, ఈ జనులు ఇక్కడ పూజించే ఇది బ్రహ్మ కాదనీ తెలుసుకో.

– కేనోపనిషత్తు

నీ కర్తవ్యాలను ఆసక్తి లేకుండా నిరంతరం నిర్వహింపుము. అనాసక్తితో కర్తవ్యాలు ఆచరించడం వల్ల పురుషుడు పరమపదం సాధిస్తాడు.

– భగవద్గీత

మనిషి అనేక విషయాల గురించి అన్వేషిస్తున్నాడు. ఈ అన్వేషణలలో 'ఆత్మదర్శనం' కోసం చేసే అన్వేషణ అత్యంత ప్రియమైనది. ఆత్మ, భగవంతుడు, మోక్షం అనే వాటి గురించి జ్ఞానాన్ని సాధించేందుకు చేసిన యత్నం లాటిది మానవుడు మరిదేనికోసమూ చేయలేదు.

– వివేకానంద

పదార్థం అశాశ్వతమైనది. భగవంతుడు నాశరహితుడు, అమరుడు, ఏకమాత్రుడైన ఆ భగవంతుడే అశాశ్వత పదార్థాలనీ, జీవాత్మనూ పాలిస్తాడు. ఆయనను ధ్యానించి ఆయనతో తాదాత్మ్యం చెందడం వల్ల చివరకు అన్ని మాయలూ అంతమైపోతాయి.

– శ్వేతాశ్వతర ఉపనిషత్తు

సత్యగుణం వల్ల జ్ఞానం, రజోగుణం వల్ల లోభం తమోగణం వల్ల అజ్ఞానం.. భ్రాంతి ప్రమాదాలు చేకూరుతాయి.

– శ్రీ కృష్ణపరమాత్మ

స్వాతికులకు ఉత్తమ లోకాలు, రాజసులకు మానవలోకం, తామసులకు నీచమైన పశుజన్మలు ప్రాపిస్తున్నాయి.

– శ్రీకృష్ణపరమాత్మ

దేహకారణమైన త్రిగుణాలను జీవుడు అతిక్రమిస్తే జన్మమృత్యు జరాది దుఃఖాల నుంచి తరించి మోక్షం పొందుతాడు.

– శ్రీకృష్ణపరమాత్మ

ఆరోగ్యం బావుంటేనే చతుర్విద పురుషార్థాలైన ధర్మ, అర్ధ, కామ మోక్షాలను సాధించడానికి వీలవుతుంది.

– స్కందపురాణం

# గోవా




2001 జనాభా లెక్కల ప్రకారం అతి తక్కువ విస్తీర్ణం గల రాష్ట్రంగా గోవా నమోదైంది. పానాజీ రాజధానిగా గోవాలో రెండు జిల్లాలు మాత్రమే ఉన్నాయి.

మహాభారతంలోని భీష్మపర్వంలో పేర్కొన్న గోమంత పట్టణం లేక గోపికా పట్టణమే ఈ గోవా. క్రీస్తు పూర్వం 2వ శతాబ్ధిలో గోవా, శాతవాహనుల ఏలుబడిలో ఉంది. క్రీ.శ. 150 నుండి 540 ఎ.డి. వరకు బాదామి చాళుక్యులు పాలించారు. తర్వాత క్రీ.శ. 753-973 వరకు రాష్ట్రకూటులు పాలించారు. ఆ తర్వాత దేవగిరి యాదవులు, ఢిల్లీ సుల్తానులు, విజయనగర రాజులు, బహమనీ సుల్తానులు, మొదలగు వారి రాజ్యాలలో గోవా ఒక భాగంగా ఉండేది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1961లో డయ్యు డామన్‌లతో పాటు గోవా స్వేచ్ఛావాయువులు పీల్చుకుంది. 1993లో గోవాకు రాష్ట్రప్రతిపత్తి కల్పించబడింది.

**విస్తీర్ణం : 3702 చ.కిమీ.** **ప్రధాన భాషలు : కొంకణి, మరాఠీ, హిందీ.**

## శ్రీ మంగేష్ ఆలయం



నేషనల్ హైవే 4-ఎలో, గోవాలోని పానాజి నుండి దాదాపు 23 కి.మీ. దూరంలో వెలసి ఉంది శ్రీ మంగేష్ ఆలయం. ఇక్కడ ఉన్నటు వంటి స్వాగత ద్వారం, దీప స్థంభం మరియు ఇతర అరుదైన కట్టడాలతో చాలా ఉన్నతంగా ఉంది, ప్రతి ఏటా వేలాది భక్తుల పూజలందు కుంటుంది. ఈ ఆలయం మొదటగా కొర్టాలిమ్ అనే ప్రదేశంలో రహస్యంగా ఉండేది. కాని 16వ శతాబ్ధిలో ఇప్పుడున్న ప్రదేశంలోకి మార్చబడింది. ఈ ఆలయం చూడ్డానికి చిన్నదైనా, మరే ఇతర హిందూ దేవాలయాలకు తీసిపోదు. దీని ప్రాకారం, గర్భగుడి, ఆలయ శిఖరాలు, విశాలమైన ప్రాంగణం, సిక్కుల గురుద్వారాలను గుర్తుకు తెస్తుంటాయి. కాని ఒకసారి లోనికి ప్రవేశించిన వెంటనే ఇక్కడున్న హిందూ విగ్రహాలు, ప్రతిమలు, శాస్త్రీయ కట్టడాలు కన్నుల పండుగ చేస్తుంటాయి.




## మహదేవ్ ఆలయం



13వ శతాబ్ధంలో కదంబుల పాలనలో ఉన్న గోవాలో అన్ని ప్రాంతాల్లోనూ, అన్ని హిందూ దేవుళ్ళు, దేవతల ఆలయాలు కట్టబడినాయి. నాగేశ్వర ఆలయం, శాంతా దుర్గ ఆలయం, మహలక్ష్మి ఆలయం రామనాథ్ ఆలయం మొ॥.

దురదృష్టవశాత్తు, కాలక్రమేణా కొందరు దుష్టుల పాలనలో చాలా ఆలయాలు నేలమట్టం అయిపోగా తిరిగి 400 సం॥ తర్వాత అందులో కొన్ని దేవాలయాలు తిరిగి పునరుద్ధరించబడి ప్రజలకు చేరువ అయ్యాయి. పడమర గోవాలో, ఉన్న శ్రీ మహదేవఆలయం ఒక్కటే పోర్చుగీసు వారి ముందున్న సంస్కృతిని తెలిపే విధంగా ఉంటాయి. ఆలయ నిర్వహణ బాధ్యత (ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) వారు తీసుకున్నారు. ఈ 12వ శతాబ్ధికి చెందిన ఆలయం, భక్తులకు, యాత్రికులకు, అప్పటి రోజులు గుర్తుకు తెస్తువుంటుంది.

## దామోదర ఆలయం



కుషావతి నది ఒడ్డున జంబాలిమ్ అనే ప్రదేశంలో ఈ దామోదర ఆలయం వెలసి ఉంటుంది. ఈ ఆలయం 16 శతాబ్ధికి చెందినది అంటారు. మార్గోవా నుండి 22 కి.మీ. దూరంలో దామోదర ఆలయం ఉంటుంది. ఇక్కడ గులాల్ పండగ, వేలాది భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంటుంది.

పాండికి 5 కి.మీ. దూరంలో పర్వతాల మధ్యనున్న శివాలయం, పవిత్ర సరోవరం చూడవచ్చును. పనాజి నుండి 26 కి.మీ. దూరంలోని ఒండోరాలో శ్రీగణపతి దేవాలయాన్ని అలాగే పాండానుండి 25 కి. దూరంలోని "శ్రీరామనాథ పంచాయతం"గా పేరు గాంచిన శ్రీరామనాథ, శ్రీలక్ష్మీనారాయణ, శ్రీశాంతదుర్గ, శ్రీబీతల్, శ్రీసిద్ధనాథ ఆలయములను చూడవచ్చును. వీటికి "పంచాయుత"మని పేరు.

పనాజినుండి 33 కి.మీ. శ్రీ శాంతదుర్గాలయాన్ని 1713లో నిర్మించారు. అమ్మవారికి ఇరువైపుల శివ, కేశవులు వుండటం, ఈ ఆలయ ప్రత్యేకత.

నర్వేమ్ నుండి 37 కి.మీ దూరంలో సప్తకోటేశ్వరాలయముంది. దీనిని శివాజీమహరాజు పునరుద్ధరించారు.

మహల్సా దేవాలయం, మంగేష్ ఆలయంనుండి కి.మీ దూరంలో, మార్దోవాపి దగ్గరలో వుంది. శ్రీమహావిష్ణువు దేవతగా, సాగరమథనాంతరం లభించిన అమృతం కోసం దేవదైత్యులు పోట్లాడుకుంటుంటే, శ్రీమహావిష్ణువు జగన్మోహినియైన విగ్రహం మనమిక్కడ చూడవచ్చును.

దీనిని బ్రహ్మస్థానమని, తపస్య క్షేత్రమని పిలుస్తారు. చౌగి పట్టణానికి 40 కి.మీ. దూరంలోని పార్లగాలి అదే గ్రామంలో వున్న శివస్వామి ఆలయం, పెద్దవటవృక్షం చూడగల్గుతాము. ఇది మొదటి శివక్షేత్రమంటారు. తపస్సు చేసుకునేవారికి అనుకూలమైన ప్రదేశం. ఇక్కడి వటవృక్షం, శివలింగం పూజనీయాలు.




పాండా నుండి 4 కి.మీ దూరంలోని బందోడులో ప్రశాంతవదనయైన మహాలక్ష్మి ఆలయముంది. ఇక్కడి అమ్మవారు శివధ్యానములో వుంటుంది. దీనిని శక్తి పీఠంగా చెబుతారు.

ఇవికాక ఇక్కడి "చర్చ్ ఆఫ్ అవర్‌లేజి ఆఫ్ హెల్ప్, సైంటు ఫ్రాన్సిస్ గేబ్రియర్ సమాధి (కేధగ్రిల్) చూడ వచ్చును. 14 వ శతాబ్ద శ్రీవిజయనగరరాజులు రాయల్ హార్బర్ నిర్మించారు.

## శాంతదుర్గాలయం - రామనాధ్



పానాజినుండి 83 కి.మీ దూరంలో ఈ ఆలయముంది. ఇక్కడి ఆరాధ్యదేవి 'దుర్గ'. ఈమెనే శాంతదుర్గ అనికూడ పిలుస్తారు. ఈ ఆలయం 1713 లో నిర్మించ బడింది. ఈ అమ్మవార్ని ఎంతసేపుచూస్తున్నా ఇంకా చూడాలనే కోరిక బలమవుతుంటుంది. ఈమె గోవా ప్రజల ఇలవేలుపు. ఇంకో విశేషం. హరిహర భేదం లేనట్లు శివకేశవులమధ్య ఈ శాంత దుర్గాదేవి పూజల నందుకుని ఆరాధింపబడటం అపురూపం.

## సప్తకోటేశ్వరాలయం - నర్వీమ్



నర్వీమ్ – బిచోలింకు షుమారు 37 కి.మీ దూరంలో దివాడి దీవిలో ఈ ఆలయముంది. ఈయన కదంబరాజుల ఆరాధ్యదైవం. తమ దాడులలో భాగంగా పోర్చుగీసువారు ఈ ఆలయాన్ని ధ్వంసం చేస్తే ఛత్రపతి శివాజీ మహారాజు దీనిని పునర్నిర్మించి, లింగప్రతిష్ఠ చేసాడని చరిత్ర చెప్పే సత్యం.

## పానాజిలోని హిందూ ఆలయాలు



26 కి.మీ దూరంలో భగవతి ఆలయముంది. సింహద్వారానికి ప్రక్కలా రెండు ఏనుగులతో ఎంతో అందంగా, ఆదరంగా వుంటుందీతల్లి.

## చంద్రనాథ్ ఆలయం



ఇది 15 కి.మీ దూరంలో వున్న చంద్రనాథ్ అనే శివుడు (లింగం). ప్రతి పౌర్ణమికి స్వామిపై చంద్రకిరణాలు ప్రసరించడంతో స్వామికి, చంద్రనాథుడని పేరువచ్చింది.

## బిచోలిం ఆలయం

37 కి.మీ దూరంలో వుందీ ఆలయం. దత్తజయంతికి కూడా పెద్ద ఉత్సవం జరుగుతుంది. గ్రహపీడితులు, మతిలేనివారిని కరుణించే దేవునిగా ఇచ్చటి దత్తనాథుడు పూజింపబడుతున్నాడు.

## మర్ధోల్ మహల్సా - విష్ణుమూర్తి



పానాజికి 23 కి.మీ దూరంలోవున్న మార్ధోల్ మహల్సాలోని విష్ణుమూర్తి ఆలయం. మంగేష్ నుండి –1 కి.మీ దూరంలో వున్న ఈ ఆలయం అపురూపమైంది. స్వామి విష్ణుమూర్తి రూపం మాత్రం జగన్మోహినైన 'స్త్రీ' రూపం. ఈ జగన్మోహిని రూపం, మనము ఆంధ్రదేశంలోని ర్యాలిలో కూడ చూడగల్గుతాము.

పానాజికి 17 కి.మీ లలో శ్రీదేవకీ కృష్ణదేవాలయముంది. గోవాలోని దేవాలయాలలో దీనిని పరమపవిత్రంగా తలుస్తారు. శ్రీకృష్ణుడు, తనతల్లి కలిసి వున్న ఆలయం దేశంలో ఇది ఒక్కటే. అందుకనే దీనికి అత్యంత గౌరవం. ఇంకా ఈ ఆలయంలో సహజంగా వుండే భూదేవి, లక్ష్మీలతోపాటు మల్లినాథుడు, కాత్యాయని, దాదాశంకర్ మొ॥ దేవతామూర్తులను చూడగల్గుతాము. జనవరి ఫిబ్రవరి మాసాలలో పౌర్ణిమనాడు గొప్ప ఉత్సవాలు జరుగుతాయి.

## మహాలక్ష్మి దేవాలయం

పనాజి పట్టణానికి నడిబొడ్డున వుందీ ఆలయం. మహాలక్ష్మి అంటే సకల సంపదలకు నిలయం. హిందువనేవాడికి ఆరాధ్యదైవం. పోర్చుగీసువారి దండయాత్రలనంతరం కట్టబడిన మొట్టమొదటి హిందూదేవాలయమీ మహాలక్ష్మీ క్షేత్రం.

బండోరా–పోండా నుండి 4 కి.మీ దూరంలో వుందీ మహాలక్ష్మీకూడా! మహాభారతంలో చెప్పిన 'గోమంత పర్వతమే' ఈ 'గోవా' రాష్ట్రమని చెప్పబడుతోంది. పోర్చుగీసువారి ఇక్కడ కాలుపెట్టి తమ ప్రాభవం నిలుపుకునేందుకు

ఎన్నో హిందూదేవాలయాలను ధ్వంసం చేసారు. అలాగచేసినవాటిలో కొన్ని ఆతరువాతికాలంలో నిర్మించారు. ఈ బండోరా ప్రాంతంలో మహాశివునికి మూలమైన నాగుషీ ఆలయంతోపాటు దగ్గర్లోగల శ్రీమహాలక్ష్మి ఆలయం కూడా భక్తులను స్వాగతించినట్లు అలరిస్తుంది.

ఇక్కడి విశేషం గర్భగుడిలోని శ్రీమహాలక్ష్మి చేతిలో శివలింగముండటం. అలాగే కాళికాపురాణం తెల్పిన 24 శక్తిపీఠాలలో దీనినొకటిగా తలవడం చెప్పుకోదగ్గ ప్రాముఖ్యత. ఇక్కడి అమ్మవారు ప్రశాంతరూపిణిగా శివధ్యానంలో వున్నట్లు బ్రహ్మానందరూపిణిగా దర్శినమిస్తుంది. పర్వదినాలలో ఎంతో ప్రాముఖ్యతను, సంబరాలను స్వతంచేసుకునే తల్లి ఈ మహలక్ష్మిమాత.

## రామనాథ్

పోండానుండి 35 కి.మీ దూరంలో రామనాథ్ అనే ప్రాంతంలో శ్రీరామనాథ్, లక్ష్మినారాయణ శ్రీశాంతదుర్గ, శ్రీబీతల్, శ్రీసిద్ధనాథ్ ఆలయాలు వున్నాయి. ఇవన్నీ ఒకేచోటున వుండటంతో పంచాయతన ఆలయాలుగా ప్రసిద్ధికెక్కాయి.

## పార్తగాలి శివాలయం

చౌడీపట్టణంకు 40 కి.మీ దూరంలో పార్తగాలి అనే ప్రదేశంలో పురాతన శివాలయం వుంది. దీనిని మొదట్లో పురాతన వటవృక్షం క్రింద నిర్మించబడింది. ఇది తపోభూమి. తపస్సు చేసుకునేందుకు ఎంతో అనువుగావున్న ప్రదేశం. ఇక్కడి వటవృక్షం అక్కడి శివలింగం కేవలం దర్శనీయాలుకాదు, పూజనీయాలు. దీనికి బ్రహ్మాస్థానమని, తపస్యక్షేత్రమని కూడా పేర్లు. శివరాత్రి వంటి పర్వదినాలలో కార్తీక – మాఘ మాసాలలో భక్తులు విశేషంగా ఈ ఆలయదర్శనం చేస్తారు.



## : : సూక్తులు : :

ఉత్తమమైన ఆరోగ్యం పురుషార్థ సాధనకు సాధనం – స్కంధపురాణం

వ్యక్తిగా ప్రతి ఒకర్నీ మనం గౌరవించాల్సిందే... కానీ ఎవర్నీ మనం ఆరాధించకూడదు. – ఐన్‌స్టీన్

ఆశ నుండి విముక్తి పొందితే దుఃఖం అంతమవుతుంది. – బుద్ధుడు

దుష్కార్యాలకు దూరంగా వుంటూ ఆస్తిక భావంతో, శ్రద్ధాసక్తులతో సత్కార్యాలను ఆచరించడమే పండితులైనవారి లక్షణం.

– విదురుడు

దైవసంకల్పం, బుద్ధిమంతుల శక్తి, విధ్వాంసుల పట్ల వినయం, పాపాలను నాశనం చేసే కార్యాలను ఆచరించడం అనే ఈ నాలుగు మానవుల భయాలను దూరం చేస్తాయి.

– విదురుడు

పాపమను తీగెననుసరించి వచ్చు భయ దుఃఖాదులు రామానామస్మరణమను ఖడ్గముచే తెగిపోవును.

– కంచర్ల గోపన్న

భగవత్ లీలల శ్రవణం, దైవసఌ్తుతి, నామ సంకీర్తనల ద్వారా దైవప్రేమను అలవరుచుకోవాలి.

–స్వామీ చిదానంద

సరియైన ఆధ్యాత్మిక భావనతో చేసే ప్రతి పనీ పూజయోగము అవుతుంది. – స్వామీ చిదానంద

ధ్యానం చేసేందుకు అధిక సమయం లభింపకపోయినా, దేహం కార్యకలాపాలందున్నప్పుడు దివ్యనామాల్ని స్మరిస్తూ వుండవచ్చు. – స్వామీ చిదానంద

ఒక ప్రాణికి ఉపకారం చేసినచో అది సాక్షాత్తూ మాధవ సేవే ! – స్వామీ విద్యాప్రకాశానంద

పూలలో సువాసన వ్యక్తులలో యోగ్యత దాచినా దాగవు – జవహర్‌లాల్ నెహ్రూ

మంచి కార్యాన్ని సాధించలేని జ్ఞానం నిష్ప్రయోజమైనది. – జవహర్‌లాల్ నెహ్రూ


హృదయంలో మాలిన్యం గలవారు ఆరోగ్యవంతులు కాలేరు. – జవహర్‌లాల్ నెహ్రూ

ప్రతి మనిషీ తన తోటి మనిషికి ఉపయోగపడే పని కనీసం ఒక్కటైనా చెయ్యాలి ! – ఓ సూక్తి

భోగాలతో పాటూ రోగాలు కూడా జీవితంలో పెరుగుతూ వుంటాయి – ఓ సూక్తి

ఉత్సాహం ఓ అగ్నిపర్వతం ఏ సందేహం దానిపై మొలవదు – ఓ సూక్తి

# గుజరాత్




దేశానికి పశ్చిమంగా ఉన్న గుజరాత్ రాష్ట్రానికి రాజధానిగా గాంధీనగర్ ఉంది. 19 జిల్లాల సమాహారమైన గుజరాత్ ఎంతోమంది మహనీయులకు జన్మనిచ్చిన స్థలం. భారత జాతీయోద్యమ నాయకుడు జాతిపిత మహాత్మా గాంధీకి జన్మ నిచ్చింది ఈ గుజరాత్ రాష్ట్రమే.

గుజరాత్ రాష్ట్రాన్ని పూర్వం సౌరాష్ట్రంగా పిలుస్తుండే వారు. మౌర్యులు, గుప్తులు, ప్రతీహరులు ఈ రాష్ట్రాన్ని పాలించారు. మహమ్మదీయులు, మరాఠీలు, బ్రిటిష్‌వారు పరిపాలించిన సమయంలో ఇక్కడి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుత గుజరాత్, ఒకప్పుడు (బొంబాయి) మహారాష్ట్రంలో భాగంగా ఉండేది. 1960, మే 1వ తేదీన గుజరాత్ స్వతంత్ర రాష్ట్రంగా అవతరించింది.

విస్తీర్ణం : 1,96,024 చ.కిమీ. ప్రధాన భాషలు : గుజరాతీ, హిందీ.

**సరిహద్దులు:** తూర్పున: మధ్యప్రదేశ్, ఆగ్నేయాన : మహారాష్ట్ర, ఉత్తరాన : పాకిస్తాన్, పశ్చిమాన : అరేబియా సముద్రం.

## జునాగఢ - గిరినార్



గుజరాత్ రాష్ట్రములోని ప్రముఖ యాత్రాస్థలములలో జునాగఢ ఒకటి. జునాగఢ అంటే పురాతన కోట అర్థం. 259 సంవత్సరాలనాటి శిలాశాసనాలు ఈ ప్రాంతములో ఉన్నాయి. 12వ శతాబ్దములో నిర్మించిన నిమినాధుని దేవాలయం కూడా ఈ ప్రాంతము దగ్గరలో ఉన్న గిరినార్‌లో ఉంది. గిరినార్–జునాగఢకు 8 కి.మీ. జైన దేవాలయా లలో ప్రముఖమైన ఈ దేవాలయమునకు వెళ్లే మార్గములో దామోదర కుండంలో స్నానం చేస్తే పవిత్రత చేకూరుతుంది. దీనికి దగ్గరలోనే గండశిల వస్తుంది. దీనిమీద అశోకుని శాసనాలు ఉన్నాయి.

జునాగఢకి 5 కి.మీ. దూరంలో ఉపర్ కోటిలో రాజపుత్రరాజు నిర్మించిన కోటలో 1500 సంవత్సరాల నాటి తీర్థ స్థలాలు ఉన్నాయి. ఇక్కడే అంజనేయస్వామి, స్వామి నారాయణ దేవాలయం, దుర్గ దేవాలయాలు ఉన్నాయి. జునాగఢ్‌కు 128 కి.మీ. దూరంలో గల అడవులలో ఉన్న విశ్రాంతి కేంద్రములో అనేక రకములైన జంతువులను చూస్తూ గడపవచ్చును. గిరినార్ కొండ సుమారు 10 వేల మెట్లు ఎక్కితే ప్రముఖ దత్తపీఠం ఉంటుంది. పరమ పవిత్రమైన ఈ దేవభూమి అహ్మదాబాదుకు 216 కి.మీ. దూరం మాత్రమే. ఇక్కడకు దగ్గరలోనే మక్బారాలలో జునాగఢను పాలించిన ప్రభువుల స్మారక చిహ్నాలు ఉన్నాయి. నరసింహ మెహతా ఆలయంలో గుజరాత్‌లో గొప్ప కవి శిఖామణి స్మారక చిహ్నం గలదు.

## లక్ష్మీనారాయణ మందిరం



గోమతి నది అవతల ఉంది ఈ ఆలయం. ఈ దేవాలయంలో రాయి నీటిలో తేలడం విశేషం. బయటకు తీస్తే రాయి బరువుగా ఉంటుంది. మరి నీటిలో ఎలా తేలుతుందో అంతా కృష్ణమహిమ అంటారు ఇక్కడి భక్తులు.

## శారద మఠం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రము సోమనాథ్‌లోనే మరొక పుణ్యస్థలము ఆదిశంకరాచార్యులు వారు స్థాపించిన శారదా పీఠం. ఈ దేవాలయం ద్వారకాధీశుని దేవాలయమునకు వెనుక వైపున ఉంది. గోమతినదీ తీరంలో ఉన్న ఈ క్షేత్రము కూడా భక్తులు దర్శించ దగ్గ పుణ్యస్థలము. ఈ గోమతినదికి అవతలవైపున ఉన్నదే లక్ష్మీనారాయణ దేవాలయం. ఈ నదిలో చేసే స్నానమువలన సరికొత్త శక్తి లభిస్తుందన్నది భక్తుల నమ్మకం.


## బేట్‌ద్వారక

ద్వారకా నుంచి ఐదు కి.మీ. దూరంలో ఉన్న ఈ క్షేత్రము సముద్రం నుండి మోటారు బోటు ద్వారా వెళ్ళాలి. సముద్రంలో బోటు ద్వారా వెళ్లే భక్తులు ఒక ఆనందాన్ని పొందుతారు. ఈ క్షేత్రములో శ్రీ కృష్ణభగవానుని బంగారు విగ్రహం చూచుటకు అనేక మంది భక్తులు ఉవ్విళ్లూరుతూ ఉంటారు. ఇక్కడే ఉన్న చిన్న సరస్సును కూడా భక్తులు చూడవచ్చు.

## రుక్మిణి ఆలయం

అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన ఈ రుక్మిణి ఆలయం ద్వారకకు ఒక కి.మీ. దూరంలో ఉంది. శ్రీ మహాలక్ష్మి అమ్మవారుగా కొలువబడే ఈ క్షేత్రము అత్యంత ప్రాముఖ్యత గల క్షేత్రం.






## పట్టాన్

పుష్పావతి నదీ తీరాన ఉన్న సూర్య దేవాలయం (మొథేరా) నుంచి 30 కి.మీ. దూరంలో గల పట్టాన్ ప్రాంతము క్రీ.శ. 8వ శతాబ్ధములో నిర్మించిన ప్రాంతమిది. ఈ ప్రాంతంలోనే పెద్ద సరోవరం, జైన దేవాలయాలు ఉన్నాయి.

## బాలక తీర్థం

శ్రీ కృష్ణభగవానుడు ద్వాపర యుగాంత మున అడవిలో ఉన్నప్పుడు కిరాతకుడు బాణం వేసాడు. అది సరిగ్గా కృష్ణుడు కాలిబొటన వేలికి తగిలింది. ఈ సన్నివేశం కళ్ళకు కట్టినట్లు చూపించే విగ్రహం సోమనాథ్ క్షేత్రములో బాలక్ తీర్థ మందిరంలో ఉంది. ఈ సోమనాథ్‌నకు దగ్గరలోనే త్రివేణి సంగమం కూడా ఉంది.

## మొథెరా - సూర్యదేవాలయం

ప్రపంచంలో ఉన్న రెండు సూర్యదేవాలయాల్లో మొథెరా సూర్య దేవాలయం ఒకటి. మొదటిది కోణార్క్‌లో, రెండవది మొథెరా. గుజరాత్ రాష్ట్రంలో అహ్మదాబాద్‌కు 100 కి.మీ. దూరంలో, పుష్పవతీ నది ఒడ్డున, ఒక ఎత్తైన ప్రదేశం ఉంది. ఇది ఎప్పుడు నిర్మితమైందో ఖచ్చితంగా తెలియదు కాని ఇక్కడ గోడలపై ఉన్న రాతను బట్టి, ఈ ఆలయం 1025–1026 ఎ.డి.లో నిర్మితమైంది అనుకోవచ్చు. ఈ ఆలయంలో చాలా భాగం ఇంకా దీని మొట్టమొదటి జ్ఞాపకాన్ని కలిగి ఉంటాయి. ఈ మొథెరా సూర్య ఆలయం, 11వ శతాబ్ధపు నిర్మాణ చాతుర్యాన్ని చాటుతుంటుంది.


ఈ ఆలయంలో, సూర్య ఆలయం, నృత్యమండపం, సూర్యకుండ అనే 3 ముఖ్యమైన భాగాలుగా ఉంటాయి. పురాతన లిపితో ఎన్నో రాతలు మనకు ఇక్కడ కనిపిస్తాయి. ఆదిత్యులు, లోకపాలకులు, దేవిలు, అనే 3 గ్రూపులు నిలువెత్తు విగ్రహాలతో కన్నుల విందు చేస్తుంటాయి. మిగతా మూలల్లో, శివ, విష్ణు, వివిధ రూపాల్లో దర్శనమిస్తారు. ఇక్కడ సమావేశ మందిరంలో అత్యద్భుతంగా మలచిన స్థంభాలను చూసి భక్తులు ఆనందపరవశులౌతారు. తొలి సూర్యకిరణం ఈ ఆలయంలోకి ప్రవేశించేటట్లు ఈ ఆలయం నిర్మించబడింది. స్కాందపురాణం, బ్రహ్మపురాణాల ప్రకారం ఈ ప్రాంతాన్ని “ధర్మారణ్య”మని పిలిచేవారు. తన పాపహరిహారార్థం ఏం చెయ్యమంటారని వశిష్ఠుని అడిగితే, ఆ బ్రహ్మర్షి ఈ ధర్మారణ్యంకు వెళ్ళమని చెప్పారుట. ఇక్కడి విశాలమైన మడుగును ‘రామమడుగు’ లేదా ‘సూర్యమడుగు’ అని పిలుస్తారు.



అల్లాఉద్దీన్ ఖిల్జి ఈ ప్రాంతాన్ని చేజిక్కించుకున్నాకే ఈ సూర్యదేవాలయాన్ని ధ్వంసంచేస్తే, ఆ తరువాత కాలంలో

దీనిని పురాతత్వ శాఖవారు సంరక్షిస్తున్నారు. ఆదిదేవ నమస్తుభ్యం అనే సూర్యనారాయణుని ఆలయాలు, ఈ దేశంలో మూడే మూడువున్నాయి. అవి కాశ్మీరులోని "మార్తాండ ఆలయం, ఒరిస్సాలోని కోణార్క, ఈమొఢేరా... అన్ని అపురూప శిల్పాలు నైపుణ్యంగల ఆలయాలవలె – ఇదీ చూడదగినది.

**ద్వారక:** ఏడు ముక్తి స్థలాల్లో ఒకటైన ద్వారక, గుజరాత్ రాష్ట్రంలో ఉంది. పురాతన కాలాల నుండి అత్యంత ప్రసిద్ధమైన ద్వారకను ఒకప్పుడు ద్వారవతి అని పిలిచేవారు. భారతీయుల ఆరాధ్యదైవమైన శ్రీకృష్ణ భగవానుడు సింహాసనాన్ని అధిష్టించి పరిపాలించింది ఈ ప్రదేశాన్ననే చరిత్ర చెబుతోంది. ఈ పరిసరాల్లో, రుక్మిణి ఆలయం, లక్ష్మీనారాయణ ఆలయం మరిన్ని ఇతర ప్రదేశాలను కూడా దర్శించవచ్చు. ఆదిశంకరాచార్య తన నాలుగు పీఠాల్లో ఒక దానిని ఇక్కడే స్థాపించారు. మిగిలిన మూడు శృంగేరి, పూరి, జోషిమఠ్‌లలో ఉన్నాయి. ఈ ఆలయం 5 అంతస్థుల కట్టడంతో, 60 స్థంభాలతో విలసిల్లుతోంది. శ్రీకృష్ణుడి మనవడు వలన, ఈ ఆలయాన్ని జగల్‌మందిర్ అని కూడా అంటారు.



భక్తులు, స్వర్గద్వారం గుండా ప్రవేశించి, మోక్షద్వారం గుండా వెలుపలికి వస్తారు. ఇక్కడున్న రుక్మిణి ఆలయం 1000 సం॥ల క్రితం నిర్మింపబడింది. ఇక్కడ కొద్ది దూరంలోనే భెట్‌ద్వారక్ దీవిని సందర్శించవచ్చు. దీనిలోనే శ్రీకృష్ణుడు ఒక రాక్షసుణ్ణి వధించాడు అని అంటారు.

**అక్షరధామ్:** ఇక్కడ గాంధీనగర్‌లో ఉన్న స్వామి నారాయణ ఆలయం చాలా చక్కగా ఉంటుంది. ఇది నవీన భారతశైలిలో నిర్మింపబడింది. ఇది సొంతం, రాజస్థాన్ నుండి తేబడిన 6000 టన్నుల ఏకరాతి నుండి మలచబడింది. ఇక్కడ నిర్మాణంలో స్టీలు గాని, సిమెంట్ గాని వాడబడలేదు. శిల్పుల అంచనాల ప్రకారం ఈ ఆలయం మరో 1000 సం॥లు నిలచి వుంటుంది. ఇది 108 అడుగుల ఎత్తు, 240 అడుగుల పొడవు, 131 అడుగుల వెడల్పుతో కన్నులవిందు చేస్తుంటుంది. ఈ శతాబ్దిలోనే ఒక అద్భుత కట్టడంగా పేరుపొందిన ఈ ఆలయం 1,20,00,000 పని గంటలతో, 900 మంది నిపుణులతో నిర్మించబడింది, ఇక్కడ మలచబడిన 93 స్థంభాలు, 40 కిజనలతో శిల్పుల నైపుణ్యాన్ని విశద పరుస్తూ ఉంటుంది ఈ దేవాలయం. ఈ అక్షరధామ్ ఆలయంలో మధ్యలో విశాలమైన ప్రదేశంలో, పూర్తి బంగారంతో చేయబడిన స్వామి వారి విగ్రహం కన్నార్పనీయదు.



# పరిటన

భావనగర్‌కి 56 కి.మీ. దూరంలో క్రీ.శ.14వ శతాబ్దికి చెందిన ప్రముఖ జైనక్షేత్రం పరిటనా! దాదాపు 863 జైన మందిరాలిక్కడ వున్నాయంటారు. యింకా కొన్ని కొత్త మందిరాలు కూడా ఈ మధ్యలో కూడా కట్టబడ్డాయి. 'పాలితానా' ని 'శత్రుంజయ' అని కూడా వర్ణించటం జరుగుతోంది. కొండమీదవున్న వందలాది జైనమందిరాలలో రాత్రిపూట కనీసం పూజారి కూడా వుండరు. అంతా చీకటి పడకముందే కొండదిగిపోతూవుంటారు. ఇది యిక్కడి ఆశ్చర్యకరమైన ఆచారం!

జైనులకు అతి ముఖ్యమైన తీర్థం పరిటన! జైనుల మొదటి తీర్థంకరుడైన ఆదీశ్వరుడిచే ఈ మందిరాలు నిర్మించబడ్డాయట. 16వ శతాబ్దంలో నిర్మించబడిన 'చౌముఖ ఆదినాథ' దేవాలయం యాత్రికుల్ని అధికంగా ఆకర్షిస్తోంది. కుమార్‌పాల్, సంప్రీతిరాజ్, విమలషా అనే మందిరాలు కూడా దర్శించదగ్గవి. స్థానిక వల్లభ్‌పూర్ శిథిల దుర్గం కూడా ఇక్కడ చూడదగిన మరో ప్రదేశం! పోర్చుగీసుకాలంనాటి 'డయ్యూ' ద్వీపానికిక్కణ్ణుంచే వెళ్ళవచ్చు. భావనగర్‌నుంచి యిక్కడికి అనేక బస్సులు నడుస్తుంటాయి. పరిటానాలో మంచి వసతి సౌకర్యాలు లభిస్తాయి.

**సిద్ధక్షేత్రం - పరిటన**: ఇక్కడికి విమాన సర్వీసులున్నాయంటే, ఈ క్షేత్ర వైశిష్ట్యం గుర్తించదగ్గదే. ఇక్కడి ఒక పర్వతంపై 900 దేవాలయాలు, 700 విగ్రహాలు వున్నాయంటే ఆశ్చర్యమా? అద్భుతమా! హిందూజైన దేవాలయాలు, అలాగే ముస్లిం దర్గా, మతసామరస్యానికి చిహ్నంగా రూపొందించారుట.ఆ మహనీయులకు వందనాలు, అనేక వేల అభివందనాలు చెప్పకతప్పదు.

వీటిని శత్రుంజయ పర్వతాలంటారు. ఎన్నో ఒడిదుడుకులకులోనై, ఇప్పుడిలాగ కనుపిస్తుంది. వూహించుకుంటే, వారసత్వ పరిరక్షణామూర్తులకు తప్పక జేజేలు చెప్పాలి. పూర్వకాలంలో ఈ పురాతన నగరాన్ని "పద్లిప్తాపూరు" అని, ఇచ్చటి పర్వతాన్ని, "పుండరీకగిరి" అని పిలిచేవారుట.

ఈ పర్వతంపైనిగల దిగంబరజైన మందిరంలో ధర్మరాజు, భీముడు, అర్జునుని విగ్రహాలను చూడవచ్చును. వీరు ఇక్కడ మోక్షం పొందినందుకు నిదర్శనంగా ఈ విగ్రహాలను పెట్టారుట.

**పాటన్ దేవాలయం** : ఒకప్పుడు ఇక్కడ ఒక విశాలమైన సరస్సు 'సహస్రలింగతాలాబ్' దీని ఒడ్డున 1108 శివాలయా లున్నాయంటే ఆశ్చర్యమేస్తుంది. అవునా?

గుజారదేశ పాలకులలో మహాకీర్తి నార్జించినవాడు సిద్ధరాజు జైనసింగు. 1050 ప్రాంతం మహారాణి ఉదయమతి 'రాణినీవావ్' అనే రాణిగారి బావిలో కనుపిస్తుంది. ఏడు మంటపాలుగా నిర్మించిన ఈ బావి గోడలపై దేవీ – దేవతలు, పురాణగాథలు, ఋషీశ్వరులు, విగ్రహరూపంలో శిల్పాలుగా నిలిచివున్నారు.

ఇదొక చరిత్ర. ఇక్కడ వెయ్యి తాళపత్రగ్రంథాలు భద్రపరుపబడివున్నాయి. కల్హణుడిలాంటి మహానుభావులకు నిలయము ఈ ప్రాంతం.

## సోమనాధేశ్వరుడు

సౌరాష్ట్రే సోమనాధంచ.... అంటారే, ఆ స్వామి వెలసింది ఇక్కడే. మొట్టమొదటి జ్యోతిర్లింగం. ఇక్కడి ఆలయంలో బంగారం, మణులు, మాణిక్యాలు, ఎన్నో నిక్షిప్తమైవున్నాయని, గజనీ మహమ్మద్, అనేకమార్లు దండయాత్ర చేసి ఇచ్చటి అమూల్య సంపదను కొల్లగొట్టుతుండేవాడు. శిథిలమయ్యే తరుణంలో మహాభక్తురాలైన రాణీ అహల్యాబాయి అసలు గుడికి ఎదురుగా మరో గుడి కట్టి భూగృహంలో శివుని ప్రతిష్ఠించింది. పైన మరో శివలింగం దర్శనీయంగా వుంచింది.



ఆ తర్వాతకాలంలో సర్దారు వల్లభాయిపటేలు, పాతగుడిని పునరుద్ధరించారు. ఇక్కడ చూడవలసినవి చాలా వున్నాయి.

1. శ్రీకృష్ణుడు అవతార పరిసమాప్తి చేసిన వృక్షం ..... ఆ స్థలంతోపాటు 2. సముద్రకెరటాలు అభిషేకించే వాయులింగాలు, 3. ఇక్కడికి 250 కి.మీ. కృష్ణుడు పాలించినట్లు చెప్పే రాజుకాని రాజ్యము "భేట్ ద్వారకా, కృష్ణుడు గోపికల చీరలు ఎత్తుకెళ్ళిన సరస్సు. 4. ఇతర గుళ్ళు, గోపురాలు.

అయితే అహమ్మదాబాదునుండి 400 కి.మీ దూరంలోని "వీరవల్" కు వెళ్ళి అక్కడనుండి బస్సు లేదా ఆటోలో సోమనాథ్ చేరుకోవచ్చును.

ఇదెంత పౌరాణికమైనదంటే క్షయవ్యాధిగ్రస్తుడైన చంద్రుడు, ఇక్కడి ప్రభాసతీర్థంలో శివుని గూర్చి తపస్సు చేసి ప్రసన్నం చేసుకుని, తన వ్యాధిని నిర్మూలించుకుంటాడు. ఈ ప్రభాసతీర్థానికి అధిపతి సూర్యుడు అయినా శివకరుణతో ఆరోగ్యవంతుడైన చంద్రుడు శివుని కూడ ప్రతిష్ఠిస్తాడు. అందుకే సోమనాథుడని పేరుపొందాడు. ఈ శివుని కృష్ణుడు పూజించినట్లు భాగవతం చెబుతోంది.

కనుక ఇటువంటి జ్యోతిర్లింగ స్వరూపుని దర్శనం జన్మజన్మల పాపహరం, సుఖశాంతిమయం.

## నాగేశం



ఇదీ ద్వాదశజ్యోతిర్లింగ దేవాలయమే. గుజరాతులోని ద్వారకా పట్టణానికి 12 కి.మీ. దూరంలో వుంది. ఈ ఆలయం (పాతది) జీర్ణ మయ్యేసరికి క్రొత్తది నిర్మాణం చేసారు. ఇచ్చటి స్వామి పేరు నాగేశ్వరుడు. స్త్రీలకిక్కడ ప్రవేశం లేదు. ఇక్కడి ఆలయం బయట పెద్ద శివలింగం వుంది. ఇక్కడ ఏ రకమైన వసతి లభించదు కాబట్టి ఇలాగ వచ్చి అలాగ వెళ్ళిపోవల్సిందే! తప్పదు!

గుజరాత్‌లోని బరూచికి 15 కి.మీ లో 'కబీరువాడా' వుంది. అతను నాటిన మర్రిచెట్టు వయస్సు 500 సం॥లు. ఇక్కడ 2000 సం॥నాటి పురాతన శివాలయం వుంది. గుజరాతుకిదే ప్రాచీన శివాలయం.

అరసూరు – మౌంటు ఆబూ రోడ్డు లో 22 కి.మీ. దూరంలో వుంది. ఇది సతీదేవి రొమ్ముపడిన ప్రదేశమంటారు. ఇక్కడి అంబాజీదేవాలయం శక్తిపీఠాలలో ఒకటి. ఇక్కడే శ్రీకృష్ణుని భర్తగా కోరిన రుక్మిణి అమ్మవారిని పూజించింది.

సిద్ధపూరు మాతృ వంశానికి పిండప్రదానం చేసే స్థలం.

ద్వారకకు 13 కి.మీ. నియంగాం వుంది. అమ్మవారి పేరు హరసిద్ధిదేవత. ఇక్కడ అమ్మవార్ని ప్రతిష్ఠించారు. విక్రమాదిత్యుని ప్రార్థనమేరకు అమ్మవారు పగలు ఉజ్జయినిలోను, రాత్రి ఇక్కడ వుండేది.

ఆంజనేయుడు సంజీవని పర్వతం తీసుకువెడుతుంటే రాలిన ముక్క ఈ "పరాగడ్". ఇక్కడ మహాకాళి, భద్రకాళి ఆలయాలు వున్నాయి.

తులసీశ్యాంలోని కుంతి, భీమ ఆలయాలు ఇక్కడి వేడినీటిధారలు. అలాగే కంసుడు చంపబోయిన యోగమాయ "బహుబరాజి" వెలసిన ప్రాంతం.

ఇలాగ – ఈ సౌరాష్ట్రంలో (గుజరాతు) అడుగడుగునా ఎన్నో ఆలయాలు, చారిత్రక – పౌరాణిక ప్రదేశాలు, గాథలు కనుపిస్తాయి. కనువిందు చేస్తాయి. కైవల్యానికి దారి చేస్తాయి.

## అంబాజీమాత పీఠం – దంతా



రాజస్థాన్ సరిహద్దులోని దంతా తాలూకాలోని గబ్బర్ కొండలపై అంబాజీమాత పీఠం వుంది. ఇది శక్తీపీఠాలలో 52వది. అతి పురాతనమైన క్షేత్రం. దీని చుట్టు ఆరావళి కొండలతో కప్పబడివుంది. ఈ కొండలలోని గబ్బరు కొండ అంబాజిమాతకు దివ్యక్షేత్రమైంది. పురాణాల ప్రకారం సతీదేవి గుండె ఇక్కడ పడింది. నిటారుగా వున్న ఈ ప్రాంతం ఎక్కడం, చాల కష్టం. ముందు 300 మెట్లెక్కి అతిసన్నటి ఇరుకు మార్గంలో ప్రయాణించాలి. 'అరాసురి అంబాజీ'గా పిలిచే ఈ ఆలయంలో గర్భాలయంలో విగ్రహానికి 'విసాశ్రీ యంత్రాన్ని' ప్రతిష్ఠించారు. ఈమే (యంత్రరాజమే) ఇక్కడి దేవత.

దీనిని కళ్ళకు గంతలు కట్టుకుని మరీ పూజించాలితప్ప ప్రత్యక్షంగా దర్శించకూడదు. భాద్రపద పౌర్ణమినాడు ఇక్కడ పెద్ద వుత్సవం జరుగుతుంది. పాండవులు తమ వనవాసకాలంలో ఈ తల్లిని పూజించేవారని చెబుతారు. ఆలయం వెనుక 'మన్‌సరోవర్' అనే సరస్సు వుంది. దీనికి రెండు ప్రక్కల రెండు ఆలయాలున్నాయి. వీటిలో ఒకటి మహాదేవునిది, రెండవది అంబాజీమాత సోదరి 'అజయ దేవకి'ది. సరస్వతీనది జన్మస్థానానికి దగ్గర్లో అంబాజీమాత ఆలయానికి 8 కి.మీ దూరంలో పురాతనమైన శ్రీకోటేశ్వర మహాదేవ ఆలయముంది.

## కబీరువాడ



సూరత్‌కు 80 కి.మీ దూరంలో భక్తకబీరు దాసుపేరుతో ప్రసిద్ధమైన 'కబీర్‌వాడా' చూడదగ్గ క్షేత్రం. రామనామానికి అంకితమైన ఈ భక్తుడు జన్మస్థలం గుజరాత్. ఇందులోని బరూచికి 15 కి.మీ ఈ మహాభక్తుడు నివసించాడు. ఇప్పుడు దాని వయస్సు 500 సం॥లు. మర్రిచెట్టు దర్శించాక, శుక్లతీర్థానికి వెడతారు. ఇక్కడ 2000 సంవత్సరం నాటి పురాతన శివాలయముంది. మహామహులు తపస్సు చేసుకునే ప్రదేశమిది. ముందుగా నర్మదానదీ స్నానం, తదుపరి అత్యంత పురాతనమైనదనే ఈ శివాలయం దర్శనం. అప్పుడే అక్కడున్న కబీరుదాసు విగ్రహాన్ని కూడా దర్శించి, తమభక్తి ప్రపత్తులను చాటుకుంటారు. ఈ ప్రాంతమంతా కబీరు పంథాతో పరమపవిత్రమై, తత్వగీతాలు, బోధలతో మార్మోగుతుంటుంది.

## కాళిమాతాలయం - చంపానేర్ పావగఢ్

పంచమహల్ ఖిల్లాలో హలోల్‌వద్ద 'చంపానేర్-పావగఢ్' లున్నాయి. పావగఢ్ కొండపై నిర్మింపబడిన కాళికామాత ఆలయం మహాప్రసిద్ధిగాంచింది. ఇక్కడి కొండలపైగల కోట 16వ శతాబ్దంలో గుజరాతుకు రాజధానిగా ప్రఖ్యాతి చెందింది. అసలు 8వ శతాబ్దంనుడి 14వ శతాబ్దం వరకు ఎన్నో కోటలు, రాజప్రసాదలు, పురాతన, మతపరకట్టడాలు ఇక్కడచోటు చేసుకున్నాయి. వనరాజ్ చావడరాజు తన భార్య చంపా పేరిట 'పావగఢ్‌కొండ దిగువప్రాంతంలో 'చంపానేర్'ను స్థాపించాడు.



ఒకసారి నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న పటాయిరాజు జైసింహ్ కాళికాదేవి చేసే నృత్యాన్ని అమ్మగా చూడకుండా, చెడుదృష్టితో చూసినందువలన అమ్మ కోపించింది. దాంతో ఈతడు గుజరాత్ చక్రవర్తి మహమ్మదు బెగ్డాచే ఈ ప్రాంతమాక్రమించి, జైసింహ్‌ను పదవిభ్రష్టునిచేసినట్లు చివరకాతనిచేతిలో మరణించినట్లు చెబుతారు.

అయితే బెగ్డా సంస్కృతీసౌరభాలకు తిలోదకాలివ్వకుండా 'చంపానేర్‌కోట, ఓరా మశీదు, మాండవి, కీర్తిస్తంభం షాత్కదేవాలయం, జామామశీదు, నగీనా, కేవ్డా మశీదులు మున్నగునవి నిర్మించినాడు. తన కళాతృష్ణను చాటుకున్నాడు. 550 మీ॥లు ఎత్తయిన కాళికామాత దర్శనానికి, ఎక్కడెక్కడినుండో ఎందరెందరో వస్తారు. ఇప్పుడు వారందరికి అమ్మవారిని చూపడానికి 'రోప్‌వే' సౌకర్యం కూడా వుంది. ఆ తర్వాత

కూడా భక్తులు అమ్మవార్ని చూడటానికి, కనీసం 250 మెట్లు ఎక్కాల్సివుంటుంది.

**ఇక చూడవలసినవాటిలో** అహ్మదాబాద్‌లోని అతి ప్రాచీన **'నారాయణ మందిరం'**, వారి విష్ణుభక్తికి నిదర్శనం. అంతకుమించి అహ్మదాబాదువారికి ఈ స్వామి నారాయణుడు ఆరాధ్యదైవంగా చెప్పాలి. దీనిని చూడాలితప్ప వర్ణించడం కుదరదు.



**మెహషాన్ జిల్లాలో** వీరంగం రైల్వేస్టేషనుకు 175 కి.మీ దూరంలో **'సిద్ధపూర్'** అనే క్షేత్రం వుంది. అలాగకాక అహ్మదాబాదునుండి 115 కి.మీ. దూరంలో, ఈ **సిద్ధపూర్ శ్రీమహాలక్ష్మి ఆలయాన్ని** మనం దర్శించగలము. శ్రీదేవిభాగవతం చెప్పిన 108 శక్తిపీఠాలలో ఇది ఒకటి. పంచపుణ్య సరోవరాలలో ఒకటైన బిందుసరోవరం వద్ద, సరస్వతీ నదీతారాన ఈ సిద్ధవనం, మాతృగయగా, కర్దమమహర్షి తపస్సు చేసిన స్థలంగా, కపిల మహర్షి జన్మస్థలంగా, ప్రసిద్ధిగాంచిన ప్రదేశమిది.

గయాశ్రాద్ధాలు ఇక్కడ జరుపుతారు. పితృదేవతలకు శాశ్వతపుణ్య లోకాలు ప్రసాదించే ప్రదేశాలలో ఇది ఒకటి. ముఖ్యంగా మాతృవంశము వారికి ఇక్కడ పిండప్రదానాలు, శ్రాద్ధకార్యాలు చేయగల్గడం శ్రేష్ఠం. పరమపుణ్యం. ఇక్కడ ఎన్నో మందిరాలు చూడగలం. కాని వాటిలో గోవిందమాధవ్, రణచోరు, రాధాకృష్ణమందిరాలు, రుద్రమాల వగైరాలు ప్రసిద్ధమైనవి, చూడవలసినవి.

**డాకోరు, రణచోరు భగవాన్ :** గోధ్రా మార్గంలో ఈ క్షేత్రముంది. పంచద్వారకలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రం గోమతీనదితీరంలో వుంది. మనకు తిరుపతివలె, ఉత్తరాది (ఔత్తరాహికులకు) వారికి క్షేత్రమంత గొప్పది. ధంకమహర్షి పేరుతో ఈ క్షేత్రం 'డాకోర్' అయింది. ఇచ్చటి ప్రధాన ఆలయం 'రణచోర్‌జి' ద్వారకనుండి తీసుకువచ్చి ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుని రణచోరు భగవానుగా పిలుచుకుని, పూజిస్తారు. ఇంకో విశేషం, శ్రీకృష్ణ తులాభారం ఘట్టం ఇక్కడే జరిగిందని, ఆలయంలో ఒక ప్రక్కగా పెద్ద వెండిత్రాసును వుంచారు.

**కరంజేశ్వర్ :** ధబోయ్‌నుండి 70 కి.మీ సిన్హోరాకు కొద్దిదూరం, దానాపూరుకు సమీపంలో ఈ దావాపూర్ కరంజేశ్వరుడున్నాడు. ప్రసిద్ధ నర్మదా తీరానగల ఈ క్షేత్రం 'పుండరీకు'డనే నాగదేవత, పరమశివునికోసం తపస్సు చేసిన ప్రదేశంగా చెబుతారు. అందుకేనేమో ఇక్కడ 1. నాగేశ్వర్‌లింగం, 2. భరతేశ్వర్‌లింగం, కరంజేశ్వరలింగాలు, వరుసగా, పుండరీకుడు, దుష్యంతుని కుమారుడు భరతుడు; మేధాతిథి దౌహిత్రుడు కరంజేశ్వరుడు, శివుని ఆరాధించి, తమ పేర్లతో, పరమశివుడు ప్రసిద్ధమయ్యేటట్టు చేసుకున్నారు. ఇంకా దక్షప్రజాపతి పుత్రికలలోని 'ఖ్యాతి' కూడా ఇక్కడ మహేశ్వరుని పూజించినట్లు చెబుతారు. ఇక్కడి అమ్మవారి పేరు సకలసౌభాగ్యాలను ప్రసాదించే 'శ్రీసౌభాగ్య సుందరీదేవి".

1. పోర్‌బందర్‌కు దగ్గర్లోని **'హరిసిద్ధిమాత'ఆలయం** ఈ అమ్మవారిని యంత్రరూపంలో పూజిస్తారు. విక్రమాదిత్య మహారాజు ప్రార్థనమేరకు, ఈ తల్లి పగలు ఉజ్జయినీలోను రాత్రి ఈ క్షేత్రంలోను కొలువైవుంటుందిట. అందుకని

ఈ ఆలయాన్ని రాత్రివేళల్లో మాత్రమే తెరుస్తారు.

2. ఇది **వెర్ణుబాబా** ఆశ్రమం. బందిపోటు దొంగలబారినుండి ప్రజలను రక్షించిన సాహసి, యోధుని పేరున ఈ ప్రాంతం ప్రసిద్ధిచెందింది. ఇది సింధుకు 70 కి.మీ దూరంలో వున్న వీరక్షేత్రం.

3. **పవాగఢ్ :** ఇది పరోవాకు 50 కి.మీ దూరంలో చంపనీర్ ప్రక్కనగల కొండ. ఆంజనేయుడు సంజీవని సర్వతం తీసుకు వెడుతుంటే, వాయువరప్రసాదుని తీవ్రవేగానికి ఆ కొండలోని కొంత భాగం విరిగిపడిన ప్రదేశమిది. ఇక్కడ మహాకాళి, భద్రకాళి ఆలయాలు ఓపికచేసుకుని చూడదగినవి.

4. **పిండారా :** ఇది ద్వారకకు సుమారు 32 కి.మీ దూరంలోవుంది. ఇక్కడ తర్పణాలు, పిండప్రదానాలు చేస్తారు. దూర్వాసమహర్షి ఆదేశంతో ఇక్కడి పిండాలు నీటిపై తేలుతుంటాయి.

5. **'సారస్య :** ఆలయంలో ఉదయంనుండి అస్తమయం వరకు సూర్యకిరణాలు ఇక్కడి శ్యాంసుందర్, రుక్మిణీ మాత ఆలయంపైపడి ప్రకాశిస్తూ సాయంకాలానికి యథాప్రకారం నీలవర్ణంతో వుంటాయి.

6. **హిరణ్యాక్షి, కోసంబీ, భీమలీ నదుల సంగమప్రాంతం** ఈదర్‌కు 25 కి.మీ దూరంలోవుంది. దీనిని ఖేడ్‌బ్రహ్మ అంటారు. ఇక్కడి దేవిపేరు 'క్షీరేజాంబ'. హాతనీ కూడా సంగమమే. హాతనీ, నర్మదా నదుల సంగమ ప్రాంతంలో వెలసిన దేవుడు 'వైద్యనాథు'డు. కతఖేడ్‌కు షుమారు 46 కి.మీ దూరంలో 'నర్మదా–బాణగంగా' నదుల సంగమదేవత 'సంగమేశ్వ'రుడు. దర్శనీయుడు.

**తులసీశ్యాం – జునాగఢ్‌కు** 165 కి.మీ దూరంలో 'ఘిర్' అటవీప్రాంతంలో వున్న ఆలయం. ఇక్కడ ఇంకా భీమసేనునికి, కుంతికి కూడా ఆలయాలున్నాయి. అక్కడ వేడినీటిధారలు 'వంకియా' అనబడే బౌద్ధగుహల్ని చూడగల్గుతాం.

ఇప్పుడు ఇక్కడెన్నో సంగమప్రదేశాలను దర్శిస్తాం. దేవలీకి సుమారు 70 కి.మీ దూరంలోని నర్మదా–భీమకుల్యా సంగమం; దేవర్‌కు 2 కి.మీ దూరంలో శంఖంతో అభిషేకించే కంబకేశ్వరుడు; కర్ణాలికి 16 కి.మీ దూరంలో నర్మదా రేవతి సంగమంలోని 'నారదేశ్వర్' ఆలయం; పరసోడాలోని శివమహాదేవ్, మారుతి ఆలయాలు; ఝుర్జరీ, సురసరీ, అమర్‌వేలే నదుల సంగమప్రదేశం పరమపవిత్రమైనదిగా భావిస్తారు.

నర్మదా– మణి నదుల సంగమప్రదేశంలోని **భూదేశ్వర్ ఆలయం**లోని స్వామిపేరు 'మణినాగేశ్వర్', దీనికి 15 కి..మీ దూరంలో నర్మదా–అనఢ్‌వాడీ నదుల సంగమ ప్రదేశంలో ఈ భీమేశ్వరాలయముంది.దీనిని 'రామపుర' మంటారు.నర్మదా–కరంజియా నదుల సంగమప్రదేశంలో వెలసినదీ రూఢ్ ఆలయం. ఇచ్చటి దైవం పేరు 'నాగేశ్వర్'.

**'బహుచరాజి' దేవి** బాలాయంత్రంపై ప్రతిష్ఠింతమైనదేవి. ఈమె వాహనం కోడిపుంజు. దీనిని చిన్న పిల్లలక్షేత్రంగా చెప్పుకుంటారు. ఇక్కడ పుట్టువెంట్రుకలు, వగైరా పిల్లల కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఇంకా చెప్పాలంటే ఆనాడు కంసుని హెచ్చరించిన యోగమాయే ఈ దేవి.

నర్మదా – ఎరండి నదుల సంగమస్థలంలో **'సువర్ణశిలా'** గ్రామముంది. ఇక్కడి ఆలయం ప్రక్కన అత్రి,

అనసూయల ఆలయాలుకూడా మనం చూడగల్గుతాము. బరూచికి 16 కి.మీ దూరంలో నర్మదా-మధుమతి నదుల సంగమ ప్రదేశం వెలసిన ఆలయం **'మోటాసాంజా'.** ఇక్కడి స్వామిని సంగమేశ్వర్, అంగమేశ్వర్ అని భక్తులు పిలిచి కొలుచుకుంటారు.

ఆశాపురి ఆలయం **'నారాయణసరోవరం'** (కచ్ జిల్లాలో) వుంది. పిల్లలకు పట్టిన దృష్టిదోషం వగైరాలకు ఈ తల్లిని పూజిస్తారు. బరూఛికి 25 కి.మీ దూరంలో నర్మదా - ఎరండి నదుల సంగమ ప్రదేశంలోని ఆలయం. దేవతను 'కపిలేశ్వర్'గా పిలుస్తారు. 'లోహరియా' ఆలయం మల్లేశ్వర్‌కు 20 కి.మీ దూరంలో బరూచిజిల్లాలోవుంది. రేవా నది సాగరసంగమ ప్రదేశంలో వెలసిన మహిమాన్విత ఆలయంలోని దేవతలు 'విమలేశ్వర్' మరియు 'శ్రీహరి'లుగా భక్తులు పూజించి తరిస్తున్నారు.

**పోర్‌బందర్ :** కోమటింట పుట్టిన గాంధీ జన్మస్థలమిది. అలాగే శ్రీకృష్ణుని బాల్యమిత్రుడు సుదాముడు నివసించిన ప్రదేశంకూడా ఇదే. పాతాళ అహిరాముని సంహరించిన శ్రీకృష్ణరూపం, ఏకాదశముఖ ఆంజనేయుని దివవ్యరూపం దర్శించగలం.

**గోపితలాబ్ :** నాగనాధ్‌కు సుమారు 10 కి.మీ దూరంలో వుందీ క్షేత్రం. శ్రీకృష్ణ నిర్యాణవార్త విన్న గోపికలు ప్రాణత్యాగం చేసిన ప్రదేశమిది.

**సారంపూర్**లో వెలసిన దేవుడు ఆంజనేయుడు. ఇది మహిమాన్విత దేవాలయమని ప్రతిష్ఠా సమయంలోనే విగ్రహం వూగి భక్తులను పరవశింపచేసింది.

**మాధవపూర్ :** ఇది రేవుపట్టణం. దీనిని భీష్మకుని రాజధాని 'కుండిని' పట్టణంగా చెబుతారు. ఇది మలుమతి నది సాగరసంగమ ప్రదేశంలో వెలసిన ఆలయం. ఇక్కడ శ్రీకృష్ణుడు, రుక్మిణిలను (ప్రత్యక్షంగా) దర్శించి భక్తులు తరిస్తారు. రుక్మిణీ అపహరణ ఘట్టాలు మనకు కనువిందు చేస్తాయి.

కచ్‌ప్రాంతంలో, గాంధీధామ్‌కు దగ్గర్లో **'నాగర్‌కా'** అనే క్షేత్రముంది. పురాణకాలంలో దీనిని స్తంభతీర్థంగా పిలిచేవారు. ఇక్కడ, సూర్యదేవాలయం, నారదుడు ప్రతిష్ఠించిన బ్రహ్మదేవాలయాలు చూడగల్గుతాం.

సోమనాథ్‌కు 25 కి.మీ లలో **'ప్రాచపిప్ల'** వుంది. ఇక్కడే సుభద్రాఅర్జునుల వివాహం జరిగింది. కాకపోతే ఇప్పుడీ ప్రాంతం పిండప్రదానాలు, శ్రాద్ధకర్మలకు శ్రేష్ఠమైనదిగా చెబుతారు. సూర్యదేవాలయంతోపాటు, ఇంకొన్ని దేవాలయాలున్నాయి.

ఇవన్నీ చూడవలసిన దివ్యక్షేత్రాలు. ఇప్పుడు ప్రతి రాష్ట్రంలో పర్యాటకశాఖవారు భక్తజనుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. లెండి! బయలుదేరండి. అపురూప క్షేత్ర సందర్శనంతో, ఆనందానుభూతులను పొందండి!

: : స్వస్తి : :

## : : సూక్తులు : :

ధర్మాన్ని తెలుసుకున్నంత మాత్రాన ప్రయోజనం లేదు, దాన్ని అచరిస్తేనే ఫలితం వుంటుంది !

– ప్రాచీన సూక్తి

అందర్నీ గుడ్డిగా నమ్మడం ఎంత దోషమో... ఎవర్నీ నమ్మకపోవడం కూడా అంతే దోషం! – ఓ సూక్తి

వైద్యుల్ని, మేథావుల్ని, బ్రహ్మజ్ఞానుల్ని, వృద్ధుల్ని, అధికారుల్ని, అతిధుల్ని అందరికంటే ఎక్కువగా గౌరవించాలి

– ఓ సూక్తి

మనసును దైవకార్యములందు లగ్నం చేయువారు పాపాలు చేయడానికి సాహసించలేరు.

– ఓ సూక్తి

పెదవులతో చేసే భగవన్నామస్మరణ కన్నా... చేతులతో చేసే సేవే చాలా మంచిది. భగవంతుని భజనలు చేసినా, పాటలు పాడినా అవి హృదయాంతరాల్లోంచి పెల్లుబకాలి ! – ఓ సూక్తి

సజ్జనుల సేవ చేయడం ద్వారా భగవంతుడి సన్నిధికి చేరుకోవచ్చు ! – ఓ మంచిమాట

చేయిచాచి మీముందుకు వచ్చినవారికి చేతనైనంత సాయం అందించండి ! – ఓ సూక్తి

సత్ప్రవర్తన, సదాశయాలు, సదా పెదవులపై చెరగని చిరునవ్వు, సశ్శీలత, సత్సాంగత్యం, సద్భావనలు మీలో వుంటే మీరు గొప్ప వ్యక్తిత్వం గలవారిగా, ఆదర్శనీయులుగా వెలుగొందుతారు !

– ఓ సూక్తి

జ్ఞానవృక్షం ఫలాలు పలురకాలు, వాటిని ఆరగించి అరిగించుకోగలవాడు మరో బలశాలి కాగలడు.

– మేరికోలరిడి

జీవితాన్ని చూసి వణికిపోయే వాడు మూడొంతులు చనిపోయినట్టే లెక్క – రస్సెల్

జీవితమే విందు తర్వాత, మృత్యువనే పానీయం సేవించక తప్పదు. – గాలీబు

నీకు వీలైనంత వరకూ నవ్వుతూ వుండు. అది చౌక అయిన ఔషధం. – బైరన్

ఎలా చదవాలో తెలియగాలే గాని ప్రతి మనిషీ ఒక గ్రంథమే. – విలియమ్ బౌలింగ్

# హర్యానా




2001 జనాభా లెక్కల ప్రకారం స్త్రీ, పురుష నిష్పత్తి అతి తక్కువ గల రాష్ట్రంగా హర్యానా నమోదైంది. ఈ రాష్ట్రంలో 17 జిల్లాలున్నాయి. పంజాబ్‌నకు, హర్యానాకు ఉమ్మడి రాజధానిగా చండీగడ్ ఉంది. వేద కాలం నుండి హర్యానాకు చరిత్ర ఉన్నట్టు తెలుస్తుంది. హర్యానా రాష్ట్రం భరతుని సామ్రాజ్యానికి జన్మస్థలంగా కూడా ప్రసిద్ధి. మహాభారత్ కావ్యంలో కూడా హర్యానా ప్రస్తావన ఉంది. వేదకాలం నుండి ఢిల్లీ సుల్తానుల వరకు, వివిధ సామ్రాజ్యాలు హర్యానాను పాలించాయి. కాల క్రమేణా పంజాబ్ లోని కొన్ని ప్రాంతాలను వేరు చేసి భాషాప్రయుక్త రాష్ట్రంగా హర్యానాను ఏర్పాటు చేసారు. 1966 నవంబర్ 1వ తేదీన హర్యానా రాష్ట్రం స్వతంత్ర్య రాష్ట్రంగా ఏర్పాటైంది.

విస్తీర్ణం : 44,212 చ.కిమీ. ప్రధాన భాషలు : హిందీ, పంజాబీ

**సరిహద్దులు**: తూర్పున: ఉత్తరప్రదేశ్, దక్షిణాన : రాజస్థాన్, పశ్చిమాన : పంజాబ్, ఉత్తరాన : హిమాచల్‌ప్రదేశ్‌లు.

## కురుక్షేత్రం

కురుపాండవుల భీకర పోరు ఇక్కడే జరిగింది. 18 అక్షౌహిణుల సైన్యం రక్తంతో తడిసిన ఈ యుద్ధరంగం ఇప్పటికి ఎరుపుగానే ఉంటుంది. శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి గీతోపదేశం చేసినదిక్కడే. ఉత్తరాయణ పుణ్యకాలంలో భీష్ముడు మరణించినది కూడా ఈ ప్రదేశమే. 300 పైగా పవిత్ర ప్రాంతములు ఈ క్షేత్రములో ఉన్నట్లు చెప్పబడుచున్నది. హర్యానా రాష్ట్రములో ఉన్న ఈ క్షేత్రములో చేపలు పట్టుట వంటి హింసాత్మక కార్యములు చేయరాదు.



ఈ హర్యానా రాష్ట్రములోనే శ్రీ కృష్ణ భగవానుడు తర్పణములు వదిలిన "సూరజ్ కుండ్ సరస్సు" గీతోపదేశానికి సాక్షిగా ఉన్న "అక్షయ వట వృక్షం" భక్తి, జ్ఞాన, కర్మ, వైరాగ్యాములను బోధించే భగవద్గీతను 300 భాషల్లో ముద్రించి భద్రపరచిన గీతాభవనం ఉన్నవి. "కర్నల్" అని కర్ణుడి జ్ఞాపకార్థంగా పిలువబడే ప్రాంతమునకు 5 కి.మీ. దూరంలో కర్ణ సరస్సు ఉంది. మనుస్మృతి కూడా ఇక్కడే రాయబడింది. ఇది మహాపవిత్ర పుణ్యక్షేత్రం. ఋగ్వేద, సామవేదాలకిదే పుట్టినిల్లు. ఈ క్షేత్రంలో

300 పుణ్యతీర్థాలున్నాయి. ఢిల్లీనుండి 152 కి.మీ దూరంలోవున్న ఇక్కడికి రావడానికి ప్రయాణసౌకర్యం బాగావుంది. ఢిల్లీ సెంట్రల్ బస్‌స్టేషన్ నుండి ఛండీఘర్ వెళ్ళే బస్సులలో ఇక్కడికి రావడం తేలిక.




ఇది విష్ణుమూర్తికి అంకితం చేయబడిన ప్రదేశం. బ్రహ్మసృష్టి ఇక్కడినుండే ప్రారంభమైందని, దీనిని వేదభూమిగా చెబుతారు. ఇక్కడి శివాలికా పర్వతశ్రేణుల్లో ఆదిమానవసంచారం కనుగొన బడింది. వామన పురాణంప్రకారం, ఈ ప్రాంతాన్ని కురుమహారాజు పరిపాలించాడని, ఈ కురు మహారాజు కురుక్షేత్ర నిర్మాణానికి, నాగలికి నందిని కట్టి భూమిని త్రవ్వాడుట. ఇంకా చెప్పాలంటే వేదవ్యాసుడు ఇక్కడే మహాభారత రచన కుపక్ర మించాడుట. అర్జునుడు శ్రీకృష్ణునికి గీతోపదేశం చేసింది కూడా ఇక్కడేనని చెబుతారు. మహాభారతకాలంలో ఈ హర్యానాను "బహుధాన్య" మండలంగా ప్రస్తావించారు.

తదుపరి ఇక్కడి దర్శనీయ స్థలాల్లో బ్రహ్మసరోవరం చాలా ముఖ్యమైంది. కుంభమేళా, గ్రహణ సమయాలలో ఇక్కడ రద్దీ బాగా వుంటుంది. ఇక్కడి "సన్నిహిత సరస్సు" వనగంగా సరస్సులను, ప్రజలు అతి పవిత్రమైనవిగా చెబుతారు. అలాగే ఇక్కడి "జ్యోతిసార" మనే ప్రదేశంలో శ్రీకృష్ణుడు, అర్జునునకు గీతాబోధను చేసాడుట. ఇక్కడో పెద్దమర్రిచెట్టువుంది. చూడటానికి ఎంతో ఆకర్షణీయంగా కనుపిస్తుంది.

## థానేశ్వర్



సరస్సులో దొరికిన త్రిపుర సమేత శివలింగానికి పెద్ద మందిరాన్ని నిర్మించారు. కమలనాభి అనే ప్రదేశములో బ్రహ్మవిష్ణువుల మందిరముంది. అందులో బ్రహ్మ శ్రీమహావిష్ణువు నాభినుండి జన్మించిన విగ్రహముంది. భీష్ముడు శరతల్పంపై నిద్రించిన దృశ్యం "నర్తకుల" అనే ప్రదేశంలో చూడవచ్చును.

## జ్వాలామాలేశ్వరి మందిరం

హర్యానాలోని జింద్ జిల్లాలోని ఈ మందిరం మహాభారతకాలంనాటిది. కురుక్షేత్ర సంగ్రామంలో తమకు విజయం కల్గించమని పాండవులు ఈతల్లిని మ్రొక్కుకున్నారుట. ఢిల్లీనుండి 123 కి.మీ.లో వుందీ మందిర ప్రదేశం.

## భూతేశ్వరమందిరం

ఇదీ జింద్ జిల్లాలోనే వుంది. పానిపట్‌కు దగ్గరగా వుంది. కర్నల్ నుండి కూడా ఇక్కడికి రావచ్చును. దీనికి చారిత్రక ఆధారాలు తెలియడంలేదు. కాకపోతే, ఇక్కడి హరికైలాసమందిరం, జ్వాలామాలేశ్వర తీర్థం, సూర్యకుండమనే సరస్సులు దర్శనీయాలు.

## పెహోవా



ఈ ప్రాంతాన్ని అతి పుణ్యప్రాంతంగా తలుస్తారు. పితృదేవతలకు శ్రాద్ధకర్మలను - ఇక్కడ చేస్తే వారు తరిస్తారనేది ప్రగాఢ విశ్వాసం. ఈ ప్రాంతాన్ని తొలి రోజుల్లో "ప్రితూదక"మని పిలిచే వారు. "ప్రితువు" ఈ రాజ్యాన్ని పాలించాడుకాబట్టి దీనికాపేరు వచ్చింది.



ఈ ప్రితు రాజు తండ్రి "రాస్తంగుడు" చనిపోతూ సరస్వతీ నదితీరానికి తీసుకువెళ్ళమని కోరడం, ఆయన మరణించడంతో, పితృశ్రాద్ధ కర్మలను ఆ రాజు ఇక్కడే చేస్తాడు. అప్పటినుండి ఇక్కడొక ఆచారమయింది. ఎందరెందరో వచ్చి శ్రాద్ధక్రియల నిక్కడ జరుపుతుంటారు.

## శివ ఆలయం (భగోల్)



హర్యానా రాష్ట్రంలోని మహేంద్రఘర్ నుండి సుమారు 25 కి.మీ. దూరంలో వున్న ఈ భగోల్ అనే ప్రదేశం, హిందూవులకు చాలా ముఖ్యమైన ప్రదేశం. ఇక్కడ ప్రసిద్ధి చెందిన శివ ఆలయం వుంటుంది. శివరాత్రి సందర్భంగా ఇక్కడ చాలా పెద్ద ఉత్సవం జరుపబడుతుంది. దాదాపు దేశ నలుమూలల నుండి భక్తులు వచ్చి ఈ ఉత్సవంలో పాల్గుంటారు.

భక్తులు తమ తమ మ్రొక్కుబడులు చెల్లించుకుంటూ వుంటారు. పవిత్ర గంగాజలంను తీసుకొని వచ్చి, పరమశివుని అభిషేకం చేస్తారు. మ్రొక్కులు మొక్కుకున్న భక్తులు, 7 రోజులు ముందుగా, గంగాజలం తేవడానికి హరిద్వార్‌కువెళ్ళి, కావర్ అనబడే రెండు కుండల నిండుగా గంగాజలాన్ని తీసుకొని, కాలి నడకన హరిద్వార్ నుండి భగోల్‌కు వస్తుంటారు. తీసుకురాబడిన గంగాజలాన్ని క్రిందకు దించితే అపవిత్రమౌతాయని, మార్గమధ్యంలో ఎక్కడా కూడా క్రిందకు దించకుండా పరమశివుని అభిషేకం కోసం తేవడం చెప్పుకోదగ్గ విశేషం.

## శీతల్‌దేవి ఆలయం



హిందూ పుణ్యక్షేత్రాల్లో ముఖ్యమైన ఈ శీతల్‌దేవి ఆలయం హర్యానా రాష్ట్రంలోని గుర్‌గాం గ్రామం సమీపంలో, ద్రోణాచార్యుని జన్మస్థలమైన గురుగాం ప్రదేశంలో వుంది. శక్తి పీఠాల్లో ఒకటైన ఈ శీతల్‌దేవి ఆలయంకు సంవత్సరం పొడుగునా భక్తులువస్తూ వుంటారు.

ఇక్కడి స్థలపురాణం ప్రకారం ఫరూక్‌నగర్‌లో నివసించిన ఒక పేద వడ్రంగి కుమార్తె బహు అందగత్తె కావడం వలన, అప్పటి మొగల్ చక్రవర్తి, ఆమెపై మనసుపడి వివాహమాడ దలచెను. పరమతస్థుడైన మొగల్ చక్రవర్తికి తన కుమార్తెనివ్వడం యిష్టంలేక, ఆ చక్రవర్తికి భయపడి భరత్‌పూర్ రాజైన రాజా సూరజ్‌మాల్‌ను శరణుకోరెను. ఈ వివాదము తన పరిధిలోనికి కాకపోవులచే సహాయము చేయుటకు రాజు నిరాకరించెను. నిరాశ చెందిన పేద వడ్రంగి, రాజా సూరజ్ మాల్ తనయుడైన యువరాజును సహాయమర్థించెను. ఈ విషయమై యువరాజు, తన తండ్రిని సంప్రదించి, తండ్రి యొక్క విముఖతను ఎరిగి రాజనుమతి లేకుండగనే, ఢిల్లీ ప్రయాణమై మార్గమధ్యంలో ఈ గుర్‌గాం ప్రదేశంలో తాను విజయుడనై తిరిగి వస్తే, దేవికి ఆలయం కట్టిస్తానని మ్రొక్కుకొని, యుద్ధంలో విజయుడై వచ్చి ఈ ఆలయం నిర్మింపచేసాడని అంటారు.


## అచలేశ్వర్

ఉత్తరాదిన ఉన్న ఒకే సుబ్రహ్మణ్యస్వామి గుడి ఇది, ఇక్కడ శివపార్వతులను కూడా సందర్శించవచ్చు! అమృతసర్–పఠాన్ కోట రైలు మార్గంలో బరూలాకు 6 కి.మీ. దూరంలో వుంది.

## మానిమజ (చండీఘడ్)



మానసాదేవి ఆలయం గల పట్టణం, ఇది శక్తిపీఠం, చండీఘడ్‌కు దగ్గరగా ఉంది. ఇదే తరహాలో మరో దేవాలయం 'పంచకుళ' వద్ద కూడా ఉన్నది. సతీదేవి శిరోభాగం ఇక్కడ పడినట్టుగా చెప్తారు. ఇక్కడకు చేరువలోని కర్నాల్ బోర్డర్ దగ్గర కైథల్ వద్ద కపిస్థల హనుమాన్ మందిరం కూడా చూడదగ్గది, మానిమజకు చండీఘర్ నుంచి కారు/ ఆటోలో వెళ్ళవచ్చు!



## జయంతిదేవి



చండీఘడ్‌కు 13 కి.మీ దూరంలో శివాలికా పర్వత శ్రేణుల్లో ఈ ఆలయముంది. జయంతీనది తీరంలోవున్న ఈ ఆలయం భక్తులను విపరీతంగా ఆకర్షిస్తుంది.

**అంబాలా పట్టణంలోని 'అంబాదేవి' మందిరం** చూడదగ్గది. ఈ తల్లిపేరుతోనే ఈ పట్టణానికి 'అంబాలా' అని పేరువచ్చింది. ఈ తల్లిని ఆ జగన్మాత స్వరూపమైన 'భవానీ, దుర్గాదేవి' అని కూడా పిలుచుకుని తమ భక్తిప్రపత్తులను చాటుకుంటారు.

ఇంకా **హిస్సార్‌జిల్లా** లోని దిగంబర జైన మందిరం, ఇతర జైన మందిరాలు, ఎనిమిదవ శతాబ్దంనాటి కోట, అందులోని అష్టధాతు విగ్రహాలు, 14 జైన తీర్థంకరుల విగ్రహాలను కూడా ఆసక్తికలవారు దర్శించవచ్చును అలాగే ....



**సైనిక్‌పురి కాలనీ**లో 21, 25 అడుగుల ఎత్తుగల **శివలింగాన్ని** చూస్తాం. ఇచ్చటున్న గుహలో శివుడు తపస్సు చేస్తున్నట్లుంటుంది. ఈ శివుని ప్రక్కనే ఆదిదంపతులైన పార్వతీవిగ్రహం చూడముచ్చటగా వుటుంది. పండుగ, సెలవు దినాలలో ఎందరో వచ్చి ఈ శివుని దర్శించి, పరవశిస్తారు.



**కైతాల్ మందిరాలు :** ఇక్కడ ఎరుపురాతి ఇటుకలతో నిర్మించిన అనేక మందిరాలు ఉన్నాయి. ఇవన్నీ 7వ శతాబ్దిలో శాలివాహన చక్రవర్తుల కాలంనాటివని చరిత్ర చెబుతుంది. ఒకసారి శాలివాహనచక్రవర్తికి అస్వస్థతరాగా నేలపై జారిపడ్డాడుట. ఈ నేల ప్రభావంతో ఆతడు ఆరోగ్యవంతుడై, తన స్వాధీనంలోవున్న ప్రాంతం మేరకు అనేక దేవీ మందిరాలను నిర్మించాడుట. ఈ మందిర దేవతలకు నిత్యపూజలు సక్రమంగా జరుగుతున్నాయంటారు.

## : : సూక్తులు : :

కష్టపడి పనిచేయని మనుషులకు దేవతలు దగ్గరకారు. – ఋగ్వేదం

వైరాగ్యభావనలు లేకుండా ఏ మనిషీ, తనమనసుని పరోపకారానికి సంపూర్ణంగా ఉపయోగపడేలా చేయలేడు.

– వివేకానంద

మనిషి శరీరంలో అణువంత ఆశ, ఆకాశమంత శక్తిని అందిస్తుంది. – ఓ సూక్తి

జీవితంలో ఎదురైన అవకాశాలన్నీ ఒకవేళ కలిసిరాకపోయినా, నిరాశను మాత్రం దగ్గరకు రానివ్వకూడదు

– ఓ సూక్తి

ధర్మాన్ని మనం రక్షిస్తే ... ధర్మం మనల్ని రక్షిస్తుంది ! – వేద సూత్రం

జీవిత సాగరాన్ని దాటడానికి ధర్మం మనకొక నావలా సహకరిస్తుంది ! – ఓ సూక్తి

ఆధ్యాత్మిక చింతన లేకుండా మనిషిలో వినయశీలత పెరగదు. – ఓ సూక్తి

సకాలంలో ప్రారంభించిన పనులు ఫలమును చేకూర్చును. – ఓ సూక్తి

సూర్యచంద్రులు, మేఘములు, వృక్షములు, నదులు, గోవులు, సత్పురుషులు పరోపకారం కొరకు దేవునిచే సృష్టింపబడిరి.

– ఓ సూక్తి

వృత్తిని సాక్షాత్తు దైవంలా భావిస్తే అవృత్తే మిమ్మల్ని దైవంలా కాపాడుతుంది ! – ఓ సూక్తి

విచలితమైన నీ బుద్ధి ఎప్పుడూ పరమాత్మయందు నిశ్చలముగా, స్థిరముగా వుండునో, అప్పుడు నీవు యోగమును పొందగలవు. – భగవద్గీత

నిరంతరం ఆసక్తిని వదిలి, ఎల్లవేళలా కర్తవ్య కర్మను చక్కగా చేయుచుండుము. – భగవద్గీత

ధైర్యం, సూక్ష్మదృష్టి, తత్త్వనిశ్చయశక్తి, పనులయందు నేర్పుగలవాడు తన కార్యములందు ఎన్నడూ శ్రమనొందడు.

– సుందరకాండ

ఉత్సాహం, సాహసం, ధైర్యం, సద్బుద్ధి, శక్తి, పరాక్రమం అనే ఆరు గుణాలు ఎచటవుండునో, అచట దైవం వెలసి వుండును. – ఓ సూక్తి

## హిమాచల్‌ప్రదేశ్




ఉత్తరభారత రాష్ట్రమైన హిమాచల్‌ప్రదేశ్‌లో 12 జిల్లాలు ఉన్నాయి. ఈ రాష్ట్రానికి సిమ్లా రాజధానిగా ఉంది.

అద్భుతమైన వర్ణచిత్రపటంలా దర్శనమిచ్చే ఎత్తైన కొండలు, మంచు ప్రాంతాలు, ఆకుపచ్చని లోయలు, కొలనులు, జల జలపారే సెలయేర్లు, హిమాచల్‌ప్రదేశ్ ప్రత్యేకతలు. ఎక్కడ చూసినా, ప్రకృతిలోని అందమంతా ఈ రాష్ట్రంలోనే ఉన్నట్టు కనిపిస్తుంది. ముఖ్యంగా వేసవి నుండి ఉపశమనం పొందేందుకు వేసవి కాలంలో దేశ విదేశాల నుండి వేలాది మంది పర్యాటకులు ఇక్కడికి వస్తారు. ఈ రాష్ట్రం హిమాలయ పర్వతాలకు చేరువలో ఉన్నందున ఇక్కడి వాతావరణం ఎప్పుడూ చల్లగా ఉంటుంది.

**విస్తీర్ణం : 55,673 చ.కిమీ.** **ప్రధాన భాషలు : హిందీ**

**సరిహద్దులు:** తూర్పున: టిబెట్, నైరుతిన : పంజాబ్, ఉత్తరాన : జమ్ముకాశ్మీర్, ఈశాన్యాన : ఉత్తరప్రదేశ్, దక్షిణాన : హర్యానాలు ఉన్నాయి.

## బైద్యనాధ్ ఆలయం



బీస్ లోయలో అతి ప్రాముఖ్యమైన కట్టడం ఈ బైద్యనాధ్ ఆలయం. నాగర్‌కోటకు 23 మైళ్ళ దూరంలో, పంజాబ్ నుండి కుగ్రాలోయ మార్గంలో, వెలసి ఉంటుంది ఈ బైద్యనాధ్ ఆలయం "కిరంగామా"లో వుంది. ఈ ఆలయం అనంతర కాలంలో వైద్యులకు ప్రభువైన బైద్యనాథ్‌గా మార్చబడింది. నగ్రీ శైలి పనితనానికి ఇదో మచ్చు తునక. పడమట వైపున ఈ ఆలయం 8 అడుగుల చతురస్రాకారంలో లోపల, 18 అడుగులు, వెలుపల మరియు 20 చ.అడుగుల మంటపంతో ఒక చిన్న పిరమిడ్‌ని తలపించే విధంగా ఉండటం విశేషం.

## లక్ష్మీనారాయణ ఆలయం

చంబా దగ్గరలో ఉన్న దేవాలయాల సముదాయంలో ఆరు దేవాలయాల సముదాయమే ఈ లక్ష్మీనారాయణ ఆలయం, చక్కని శిఖర శైలిలో నిర్మింపబడినది. చంబ వ్యవస్థాపకుడైన రాజా సాహిత్యవర్మ పరిపాలనలో 10వ



శతాబ్దములో ఈ ఆలయం నిర్మాణం జరిగిందంటారు. ఇందులో వెలసిన శ్రీ లక్ష్మీ నారాయణుని విగ్రహం, చాలా పురాతనమైనది. ఈ ఆలయంలో ఉన్న శిల్పాల్లో, గోపికలతో ఉన్న శ్రీకృష్ణుడు, నరసింహస్వామి, మొ॥ కన్నుల పండుగ చేస్తుంటాయి. వీటిల్లో నాల్గవ ఆలయం పరమశివుని ప్రతిష్ట చేయబడిందీ కావడం ఒక విశేషం. ఏటా లక్షలాది మంది భక్తులను ఆకర్షిస్తూ ఉంటుంది లక్ష్మీనారాయణ ఆలయం.


## జ్వాలాముఖి ఆలయం

భారతదేశంలో ఉన్న 51 శక్తి పీఠాల్లో ఒకటైన జ్వాలాముఖిదేవి ఆలయం, కాంగడా లోయ నుండి 34 కి.మీ., ధర్మశాల నుండి 56 కి.మీ. దూరంలో వెలసి ఉంది. అద్భుతమైన శిల్ప నైపుణ్యంతో ఉన్న ఈ ఆలయం, ఇండోసిక్కుల శైలిలో ఉంటుంది. ఆలయం యొక్క గోపురం, అక్బర్ చక్రవర్తిచే చేయించబడింది. నాలుగు దహించే జ్వాలల రూపంలో ఈ జ్వాలాముఖిదేవి ఉండటం విశేషం. అద్భుతమైన ఆధునిక శైలిలో నిర్మింపబడిద ద్వారాలు ముఖ్యమైన ఆకర్షణలు. ధర్మశాల, సిమ్లా మార్గంలో 20 కి.మీ. దూరంలో, ఒక చిన్న ఎత్తయిన ప్రదేశంలో నిర్మింపబడిన ఈ జ్వాలాముఖి ఆలయం, ప్రతి ఏటా లక్షలాది భక్తులను ఆకర్షిస్తుంటుంది. మరో విశేషమేమిటంటే ఇక్కడ ఏ దేవత విగ్రహం ఉండదు. కేవలం జ్వాలలు మాత్రమే కనిపిస్తాయి. భక్తులు, యాత్రికులు తప్పక దర్శించదగ్గ ప్రదేశం ఈ ఆలయం.




## నైనాదేవి ఆలయం

గంగూఓల్ నుండి 15 కి.మీ., ఆనంద్ సాహెబ్ నుండి 18 కి.మీ., దూరంలో పంజాబ్ రాష్ట్రంలోని రూపార్ జిల్లాలో వెలసి ఉంటుంది, ఈ నైనాదేవి ఆలయం త్రికోణాకారంలో ఉండే ఒక కొండ మీద వెలసిన ఈ ఆలయం నుండి, ఆనందపూర్ సాహెబ్ గురుద్వారాలు ఒకవైపు, గోవిందసాగర్ మరో వైపు చూపరులను ఆకర్షిస్తూ ఉంటాయి. ఇతిహాసాలు ప్రకారం, దక్షుని యజ్ఞసమయంలో, స్వయం ఆహుతైపోయిన సతిని భుజాల మీద వేసుకుని, ఆవేశాగ్రహాలతో ఉన్న శివుని శాంతింపచేసేందుకు మరో ప్రళయం ఆపేందుకు విష్ణువు అనుమతితో శనీశ్వరుడు, ఇంద్రుడు ఆ యొక్క మృత శరీరంలో ప్రవేశించి దానిని 51 భాగాలుగా చేసినట్లు చెబుతారు.



## బాలసుందరి ఆలయం



ధర్మశాల నుండి 51 కి.మీ. దూరంలో వెలసిన ఈ ఆలయము నకు రోడ్డు మార్గం ద్వారా కూడా వెళ్ళవచ్చు. త్రిలోకపూర్‌లో ఉన్న ఈ ఆలయం సహజంగా ఏర్పడ్డ ఒక రాతి గుహలో ఉంటుంది. ఇందులో సిక్కుల పరిపాలన సమయంలో, కాంగ్రా గవర్నరైన తెల్సోసింగ్ మజతా వారి యొక్క రాజభవనం శిధిలాలు కనిపిస్తూ ఉంటాయి. మొగల్ జనరల్ గులావక్ ఖాదిర్‌కు ఇక్కడి స్థానిక రాజపుత్రులకు భీకరమైన యుద్ధం సమయంలో, రాజపుత్రులు ఓడిపోయే పరిస్థితులెదురైనపుడు ఆశ్చర్యకరంగా ఒక స్త్రీ ప్రత్యక్షమై, అనుకోని విధంగా ఇక్కడి రాజపుత్రులకు యుద్ధంలో విజయం సంపాదించిందని, ఆ విజయం సూచకంగా ఈ బాలసుందరి ఆలయం నిర్మితమైందని అంటారు.

## ధర్మశాల - ధర్మకోట



శివాలిక కొండలకు, దౌరిదార్స్ కొండలకు మధ్యన పచ్చని లోయలో అత్యద్భుతంగా వెలసి ఉంటుంది ఈ ధర్మశాల. ఈ ఆలయం, 19వ శతాబ్ధంలో, బ్రిటిష్ పాలనలో వారి యొక్క హిల్‌స్టేషన్‌గా కొద్దికాలం సాగింది. 1959లో ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రతిపాదనను అంగీకరించి, దలైలామా ఈ ప్రదేశాన్ని టిబెట్ ప్రభుత్వ కార్యకలాపాలకు ఉపయోగించడం జరిగింది. ఇక్కడి నుండి కాంగ్రాలోయ మరియు తెల్లని మంచు పర్వతాలు మిక్కిలి కనువిందు చేస్తూ వేలాది మంది భక్తులను ఆకర్షిస్తూ ఉంటాయి.

## వజ్రేశ్వరి దేవి ఆలయం



కాంగడాలో లోయలో ఒక రద్దీ అయిన ప్రదేశంలో వెలసి ఉంటుంది ఈ వజ్రేశ్వరిదేవి. 1009లో దువామద్ ఘజం దండయాత్రలో, ఈ ఆలయం యొక్క విలువైన సంపదంతటినీ దోచుకొనిపోయారు. 1905లో భయంకరమైన భూకంపం, ఈ నగరాన్ని మరియు ఈ ఆలయాన్ని నేలమట్టం చేయగా, 1920లో దీనిని తిరిగి పునరుద్దరించారు.

ఎన్నో ఆటుపోట్లకు గురై మనవలె జీవితం గడిపే తల్లి ఈ వజ్రేశ్వరి

లేదా, విజయేశ్వరి చరిత్ర లేదా పౌరాణిక నేపథ్యంబట్టి ఆలోచిస్తే – పూర్వం జలంధరుడనే రాక్షసరాజు గొప్ప దైవభక్తుడు. బ్రహ్మదేవుని మెప్పించి అనేక వరాలను పొంది, ఆ బలిమితో దేవతలను తన అధీనం చేసుకుంటాడు. దేవతా సామ్రాజ్యన్ని అవలీలగా చేజిక్కించుకుని పాలనం కొనసాగిస్తాడు. దాంతో దేవతలు, శివుని శరణు వేడితే, జలంధరునితో యుద్ధం చేసి, ఓడినట్లు మొహం, పెట్టుకుని – బ్రహ్మతో ఈ విషయం చెబితే, ఆతనిభార్య వృంద మహాపతివ్రతఅనీ, ఆమెకు శీలభంగం జరుగనంత వరకు, ఆతడు అజేయుడని చెబుతాడు. ఇక అప్పుడు చేసేది లేక 'నారాయణా' అంటే దేవతల పక్షపాతిగా ఆమె శీలభంగానికి నారాయణుడు బయలుదేరుతాడు.

ఆ వచ్చింది తన భర్తేనని భావించడంతో శీలభంగం జరుగుతుంది. శివుడు జలంధరుని సంహరిస్తాడు. అప్పుడతడు తన కర్మకు వగచి, 'జరిగినదేదైనా ఈ ప్రదేశం తన పేరుతో శాశ్వతం కావాలని, సర్వదేవతలు, తీర్థములు ఇక్కడ వుండాలని, వీరిని దర్శించవచ్చే భక్తుల పాదముద్రలతో తను తరించాలని వరమడుగుతాడు. శివుడు 'తథాస్తు' అంటాడు. జలంధరుడు వజ్రశరీరుడు కాబట్టి ఇక్కడి తల్లికి 'వజ్రేశ్వరి' అని పేరువచ్చింది. వజ్రేశ్వరి ప్రవేశద్వారానికిరువైపులా గంగా, యమునల విగ్రహాలు, ఆ ప్రక్కనే ఉమాదేవి, శివుడు, భైరవుడు, మొ॥గు దేవతామూర్తుల విగ్రహాలను కూడా చూడగల్గుతాం. చూడవలసిన క్షేత్రమిది!

కాంగ్డా ఒకనాటి 'త్రిగర్త'దేశం. దీనిని దేవభూమి అని కూడా వ్యవహరిస్తారు. ఇక్కడ బగళాముఖి ఆలయం, కాళేశ్వర మహాదేవ్ వంటి అద్భుతమైన ఆలయాలు ఓపిగ్గా చూడదల్చుకుంటే చూడగల్గుతాం. 10వ శతాబ్దంలో ఈ ఆలయం నిర్మించబడింది. మొత్తం ఇక్కడ 15 ఆలయాలు వున్నాయి. వీటిలో ప్రధానమైనవి దులాబ్‌రేంజ్, బ్రజ్వేశ్వరి నదౌన్, కత్‌గర్, జవాలి, జి.టెంపుల్, శివాలయాలు చూడదగ్గవి. ధర్మశాల, చెహన్‌మహదేవ, సిద్ధనాథ దేవాలయాలు ప్రత్యేక ఆకర్షణగా చెప్పాలి. అలాగే, ప్రధాన ఆలయంలోని సీతారాములు, లక్ష్మణుడు, శివుడు దర్శించదగ్గవారు.

**వీరభద్ర ఆలయం :** ఇది దేవభూమి కాంగ్డాలోదే. మంజి, బెనెర్ కాలువల సంగమ ప్రదేశంలో వజ్రేశ్వరికి కి.మీ దూరంలో ఈ వీరభద్ర ఆలయముంది. ఈ జిల్లాలో సిద్ధనాథ ఆలయం, మస్రుర్ ఆలయం చెప్పుకోతగ్గవి. ముఖ్యంగా మన్నార్‌లోని ఆలయ సముదాయం పదిహేను దేవాలయాలతో వుంది. దీనిని 8 శతాబ్దంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.

అనేక దేవాలయాల భుంటర్ మయబ్రహ్మ ప్రజల పాలన సక్రమంగా జరగాలని ఒక మండలిని ఏర్పాటు చేసాడు. అందుకేనేమో, ఇక్కడ **బశేశ్వర్ దేవాలయం, జగన్నాథ, ఆదిబ్రహ్మ, బిజిలీ మహదేవ** వంటి అనేక పురాతన హిందూ దేవాలయాలు కనువిందు చేస్తున్నాయి.

ధర్మశాలకు 80 కి.మీ **'ఉనా'** అనే వూరు వుంది. ఇక్కడి నుండి 52 కి.మీ ముందుకు సాగితే **చింతపూర్ణి,** నవదుర్గలలో ఒకరైన 'చింతపూర్ణి' దేవతను దర్శించగల్గుతాము. నిజానికి ఈ చింతపూర్ణిని చిన్నమస్తకిగా కూడా చెబుతారు.

చంబా పట్టణంలోని కొండమీద ఓ ఆరు ఆలయాలున్నాయి. అవి ఏనాటివి అంటే ... ఏనాటివో... అని చెప్పాల్సివస్తుంది. ప్రవేశద్వారానికి ఎదురుగా లక్ష్మీనారాయణ, కుడివైపున రాధాకృష్ణ చంద్రగుప్త, గౌరిశంకర,

**త్రిముఖేశ్వర, లక్ష్మీదామోదర...** అనే ఆలయాలున్నాయి. 10వ శతాబ్దంలో లక్ష్మీనారాయణ మందిరాన్ని నిర్మించారు. దీన్ని ఆనుకుని **రాధాకృష్ణ ఆలయం** వుంది. పంజాబ్‌రాజు రంజిత్‌సింగు భార్య రాణి శారత 1828లో నిర్మించింది. చంద్రగుప్తఆలయాన్ని చంబాపట్టణ నిర్మాత, లక్ష్మీనారాయణ ఆలయనిర్మాత సాహిల్‌వర్మ నిర్మించాడు.

బిలాసపూరునుండి 45 కి.మీ ముందుకు వెడితే **'బాబా బాలకనాథ' ఆలయం** కనుపిస్తుంది. చిన్నతనంలోనే తన మహిమలను చాటిన బాలక్‌నాథ్ పేరిట ఈ ఆలయం నిర్మించబడింది.

చంబాలోయకు చివర్లో వుంది **'బారమోర్'**. ఇక్కడ పురాతన ఆలయాల సముదాయం వుంది. ఇవన్నీ ఊరిమధ్యలో వుండటమొక విశేషం. దీని ప్రాంగణం చాలాపెద్దది. ఈ ప్రాంగణంలో **నరసింహస్వామి, గణపతి, లక్ష్మణదేవి, సూర్యముఖి, మణిమహేశ్** అనే దేవి, దేవతల ఆలయాలు కనువిందుచేస్తాయి. ఈ ప్రాంగణంలోని పెద్ద ఆలయంలో 84 శివలింగాలున్నాయి. 7-10 శతాబ్దాల ఈ ఆలయాల నిర్మాణం జరిగినట్లు తెలుస్తుంది. ఇది చెక్కతో నిర్మించబడిన ఆలయంగా చెబుతారు. మొత్తం ఈ ఆలయాలను 'చైరాసియా' అని పిలుస్తారు.

ఇక్కడ **'అర్ధగయకుండ్'** వుంది. ఒకసారి పార్వతికి దాహం వేస్తే వినాయకుడు బాణం వేసాడుట. అంతే పాతాళ గంగపైకి వచ్చింది. చివరకు అదే ఒక కొలనుగా మారిందంటారు. ఇక్కడి అమ్మవార్ని 'బ్రాహ్మణి' అని పిలుస్తారు. కాని ఉగ్రమూర్తి ఈ తల్లి. ఈ ఆలయానికి కప్పులేదు. ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలించలేదు. మణిమహేశ్ వెళ్ళేవారికి, ఈ తల్లిని, స్వామిని దర్శించుకుని మరీ వెళ్ళాలి.

బార్‌మారుకు 35 కి.మీ దూరంలో వుందీ మణిమహేశ్. ఇక్కడో పురాతన శివాలయముంది. ఇక్కడివారికిది కైలాసమానససరోవరంతో సమానం. బార్‌మారునుండి ఇక్కడకు హడ్‌సా, దాంచే అనే గ్రామాలగుండా కొండపైకి నడుచుకుంటూ మెల్లిగా వెళ్ళి, అలాగే తిరిగి రావాలి. ఇక్కడో సరస్సువుంది. ఇక్కడి నుండి కైలాస పర్వత సుందర దృశ్యాలను తనివితీర, కన్నుల పండువుగా చూడవచ్చును.

ఇక్కడే రావీ నదీ పరివాహక ప్రాంతంలోవున్న పుణ్యక్షేత్రం బారామోర్. దీనినొకప్పుడు 'బ్రహ్మపురి' అని పిలిచేవారు. ఇక్కడ నరసింహస్వామి ఆలయం కూడా వుంది. ఈ ప్రాంతాన్ని 'శివభూమి' అనుకోవడం కూడా కలదు.

**ఝుంకూమందిరం :** మాల్‌నుండి ఒక గంట నడిచి 2450 మీ॥ ఎత్తున వుండే ఓ శిఖరంపైనగల ఆంజనేయ స్వామిని చూడాలి. దీనిని 'ఝుంకూమందిర'మంటారు. ప్రసిద్ధిచెందిన దేవాలయమిది. ఇక్కడినుండి హిమాలయ పర్వతశిఖరం నయనానందకరంగా చూడవచ్చును. ఆపైన 'మండి'.

మండి జిల్లాలోని కులూలోయలో **'భూత్‌నాథ్ దేవాలయ'** ముంది. ఇది ఈ ప్రాంతంలోని ఒకే ఒక అర్ధనారీశ్వరాలయం. మిగిలిన ఆలయాలు, త్రిలోకనాథ్ - శ్యామకాళి మొ॥నవి బియాస్ నదీతీరంలో వున్నాయి.

ఇక్కడ **పంచవక్త్రమహాదేవాలయం** కూడా వుంది. బియాస్, సుఖేతి నదుల సంగమస్థానంలోవున్న ఈ స్వామికి అయిదు ముఖాలు, పదిచేతులతో వుంటారు. బియాస్ నదిఒడ్డున వున్న మరొక అపురూప దేవాలయం, పాండవులు కట్టినట్టుగా చెప్పే 'బిల్- కాళేశ్వర్' దేవాలయం. దీనిని అచ్చటి భక్తులు విశేషసంఖ్యలో వచ్చి అర్చిస్తారు.

ఇంక కులూలోయలోకి వస్తే – **'పార్వతీమాత ఆలయం, రఘునాధాలయం, బిజిలీ మహదేవ్, గంగా,యమునల ఆలయం,** చెప్పుకోదగ్గవి. ఈ లోయలో దాదాపు 200 పైగా ఆలయాలు వున్నాయి. వీటినన్నింటిని ఈ ధాత్‌పూర్ మైదానానికి తీసుకువచ్చి పెద్ద ఉత్సవం చేస్తారు. ముఖ్యంగా హిడింబాలయం నుండి విగ్రహం రాకుండా మాత్రం కార్యక్రమం ప్రారంభంకాదని గుర్తుంచుకోవాలి. అప్పుడు దేదీప్యమానమైన దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

రఘునాధాలయాన్ని 17వశతాబ్దిలో రాజాజగత్‌సింగ్ నిర్మించాడుట. యాత్రీకులనేకాదు, పర్యాటకులను కూడా పరవశింపచేస్తుందీ ప్రాంతం. అలాగే చూడదగ్గది బిజిలీ మహదేవ్ ఆలయం. అందరికి మల్లే కుంభకోణం తర్వాత గంగా, యమునలకు ఇక్కడ ఆలయాన్ని చూస్తాము.

మండి నుండి 55 కి.మీ. దూరంలో ఈ మణికిరణ్ వుంది. పార్వతీపరమేశ్వరులు భక్తజనులను కరుణించడానికి గగనవిహారం చేసి వారి కష్టసుఖాలు తీర్చేవారుట. అటువంటి విహారసమయంలో పార్వతీదేవి చెవి ఆభరణం ఈ ప్రాంతంలో పడిపోవడం, అది శివునకు చెప్పడం, శివుడు ప్రమధగణాలను హెచ్చరించడం జరిగింది. ప్రమధగణాలు అశక్తులవడంతో శివుడు మూడోకన్ను తెరుస్తాడు. ఆ సమయంలో జరిగిన కల్లోలంవలన భూమిపై రత్నాలు, మాణిక్యాలు అసంఖ్యాకంగా లభించాయి. పార్వతీదేవి ఆభరణం పడిన ప్రదేశం కావున దీనికి 'మణికర్ణ' అని పేరు వచ్చింది. కాలక్రమంలో మణికరణ్ అయింది. ఇచ్చట ఇంకా చూడదగ్గవి రఘునాథ్‌జీ, సీతాదేవి ఆలయాలు. ఇక్కడ వేడినీటి బుగ్గలు కూడా వున్నాయి. వీటిలో స్నానం చేసినందువలన చర్మరోగాలు నశిస్తాయని పెద్దలవాక్కు.

ఇక్కడున్న విష్ణుకుండంలోని కులాంతపీఠంలో వేడినీటి బుగ్గ వుంది. ఇది సకలపాపహరణం. కోపతాపాలు, దుర్గుణాలు నశిస్తాయి. ఈ వేడినీటిలో అన్నం వండుకుని తింటే విష్ణులోకం శాశ్వతమంటారు. కనుక ఓపిక చేసుకుని ఓపికగా చూడవలసిన ప్రదేశం.

శ్రీకృష్ణుడు 'బ్రిజ్‌రాజ్‌గా' వ్రజనాధునిగా చెప్పుకుంటారు. పిలుస్తారు. ఇక్కడి ఆలయంలో మహాభక్తురాలు మీరాబాయితో కలసి, మహావైష్ణవుడు శ్రీకృష్ణుడు పూజలందుకోవడం, నూర్పురులోని ఈ ఆలయవిశేషం.

కాంగ్డాలోని బద్వర్‌గ్రామంలో నాగినీమాత ఆలయముంది. నూర్పురు రాజుల కుల దేవత ఈ నాగినీ మాత. ఈ ప్రాంతంలో నాగదేవతలను 'నాగమాత, రోగముక్త, మహాకాళ్, జీవన్‌దేయానిమా, అధ్వశక్తి, సురసాదేవి... అనే పేర్లుతో పిలిచి పూజించే మందిరాలను, ఈ ప్రాంతంలో చూడగల్గుతాము. నయంకాని రోగాలు ఈ తల్లి దర్శనంతో నయమవుతాయట. ఈ దేవత పరిసరాలలోని మట్టికి, ఔషధగుణాలుండటంవలన రెండు మందులే. మహిమాన్వితాలే! శనివారంనాడు ఇక్కడ ప్రత్యేకపూజలు జరుగుతాయి. ఉత్సవాలు సరేసరి!

భాగ్సునాగ్ పర్యాటక కేంద్రం. ఇక్కడ ఆలయాలు ప్రకృతి అందాలు, రెండూ రెండే! ఆనందరూపాలుగా చెప్పాలి. ఇచ్చటి శివాలయం దగ్గర్లో ధర్మశాల వుంటంవలన యాత్రీకులు, పర్యాటకులను ఏడాది పొడుగునా చూడగల్గుతాము. ఇక్కడ అందమైన కొలనులు, నీటికుండాలు... ఎన్నో పరమపవిత్రాలు.

సోలన్‌దేవి : ఊరుపేరు, దేవతపేరు కూడా అదే. దుర్గామాత స్వరూపంగా ఈ తల్లిని తలుస్తారు. ప్రకృతి ఆరాధకులకు, తీర్థయాత్రాపరులకు ఈ ప్రాంతం పరమకమనీయం.

నగర్‌లోని త్రిపురసుందరీదేవాలయం చూడదగ్గది. ఇక్కడి నిర్మాణాలన్ని చెక్క (దారు) నిర్మాణాలే. త్రిపుర సుందరితోపాటు గణేశ్, బ్రహ్మ, విష్ణువుల విగ్రహాలను చూడగల్గుతాము.

ఇక చివరిగా శ్రీఖండ్ మహాదేవ్ క్షేత్రం. ఇక్కడ పరమేశ్వరుడు ధ్యానం చేస్తూంటాడంటారు. పాండవులు తమ వనవాసకాలంలో ఇక్కడికి వచ్చి స్వామిని దర్శించినట్లు చెప్పుకుంటారు. ఇక్కడి విశేషం ఎంతమంచు కురిసినా ఇక్కడ శివలింగంపై పడిన మంచు వెంటనే కరిగి నీరైపోతుందట. దీనిని శివలీలగా చెప్పుకుంటారు.

## భిమకాళి ఆలయం



అతి పురాతనమైన ఈ ఆలయం, ఎప్పుడు నిర్మింపబడ్డదో ఖచ్చితంగా తెలియకపోయినా, ఇక్కడ లభించిన ఆధారాల బట్టి 7వ శతాబ్ధికి చెందినదిగా గుర్తించారు. పగోడా శైలిలో నిర్మితమైన ఈ ఆలయం మొదటి అంతస్థులో కాళికామాత వెలసి ఉంటుంది. ఇక్కడ ఈ ఆలయం దర్బారుకు ఎన్నో మార్గాలున్నాయి, అత్యద్భుతంగా నిర్మింపబడ్డ ఈ ఆలయం రాయపూర్ బుషార్ రాజులు నిర్మించారన్నది విదితం. ఈ ఆలయం చుట్టుప్రక్కల ప్రదేశాలన్ని 700 సం॥ల పురాతనమైనవి.

## హిడింబ ఆలయం

భీముని భార్య అయిన హిడింబ కొరకు వెలసిన ఈ ఆలయం దర్శించినపుడు చాలా ఆశ్చర్యం కలుగుతుంది.



పంచపాండవులలో ఒకరైన భీముడు హిడింబను ప్రేమించి వివాహము చేసుకున్నట్టు చరిత్ర చెబుతోంది. బ్రహ్మ సృష్టించిన మొట్టమొదటి మానవుడైన మనువు కొరకు ఒక ఆలయం ఒక్క మనాలిలో మాత్రమే ఉంది. అందువలనే ఈ అందమైన ప్రదేశానికి మనాలి అని పేరు వచ్చింది. ఈ హిడింబ ఆలయం సుమారు 600 సం॥ల క్రితం నిర్మింపబడింది. ఈ ఆలయం యొక్క 4 అంతస్తుల శిఖరం చాలా అరుదుగా కనిపించే శిల్ప నిర్మాణానికి అద్దంపడుతూ, పెక్కు మంది భక్తులను, యాత్రికులను ఆకర్షిస్తూ ఉంటుంది.

## శివ ఆలయం




బీస్ నది ఒడ్డునవున్న అందమైన నగరం మండిలో పెక్కు శివ ఆలయాలు కనిపిస్తాయి. ఈ ఆలయాల్లో ముఖ్యమైనవిగా, భూల్‌నాథ్, త్రిలోక్‌నాథ్, పంచవక్త్ర ఆలయాలని చెప్పవచ్చు. దట్టమైన గ్రానైట్‌లో చేయబడ్డ ఈ ఆలయంలో శిల్పకళ అత్యద్భుతంగా ఉంటుంది. పంచ ముఖాలతో యోగ ముద్రలో ఉన్న పరమశివుని మూర్తి ఉన్న పంచవక్త్ర ఆలయం చాలా ప్రసిద్ధి చెందింది. శివరాత్రి పర్వదినమందు లక్షలాది భక్తులు ఇక్కడ కనిపిస్తారు.

## కైలాస శిఖరం - మానససరోవరం



ఇది అందరికి పుణ్యక్షేత్రమే. సముద్రమట్టానికి 22028 అడుగుల ఎత్తునవున్న ఈ మంచుకొండ సర్వులకు ఆరాధ్యము, ఆరాధనీయమైన కైవల్యధామం. ఈ పవిత్ర శిఖరానికి 108 సార్లు ప్రదక్షిణం చేస్తే ఆ శివపదం తప్పక లభిస్తుంది.

కైలాసశిఖరానికి 45 కి.మీ దూరంలో, సముద్ర మట్టానికి 16 వేల అడుగుల ఎత్తున్న సుప్రసిద్ధ పరమ పుణ్య మానస సరోవరం వుంది. ఇది పరమ "హంస"ల నివాసం. దీనికి సమీపంలో రావణుడు తపస్సు చేసిన "రాక్షసతల"మనే జలాశయం వుంది. సరయునదికీ, మానస సరోవరానికి ఏదో అనుబంధముందని విశ్వామిత్రులు అంటారు. ఇంకా దేశంలోని శక్తిపీఠాల్లో ఈ మానససరోవర మొకటి. ఇక్కడే అమ్మవారి చెయ్యి పడినదని చెబుతారు.

ఇది ప్రపంచములోకెల్లా ఎత్తైన సరస్సు. ఋషులు తాము తరించడానికి బ్రహ్మను ప్రార్థిస్తే, తన మానసంనుండి దీనిని సృష్టించినందువలన ఇది 'మానససరోవర'మైంది. ఇందలి నీరు నాల్గు వేదముల సారమని దేవతల నిలయమని, లయకారకుడైన శివుడు, ఇక్కడికి బ్రాహ్మీముహూర్తంలో వస్తాడని చెప్పుకుంటారు. ఇందుండే సట్లెజ్, కర్నాలి, సింధు, బ్రహ్మపుత్రానదులు పుట్టాయంటారు. ఇక కైలాసశిఖరం. పార్వతీపరమేశ్వరుల నిలయం. నిజభక్తులు, తమ తపోశక్తితో, ఇక్కడికి వెళ్ళవచ్చును. ఆ ఆదిదంపతులను దర్శించి ధన్యులు కావచ్చును.

ఒకసారి శంకరాచార్యులవారు, కైలాసానికి, ఆదిదంపతుల దర్శనానికి వస్తే నాల్గు శివలింగాలిచ్చారుట. వాటిని ఆదిశంకరులు తాము ప్రతిష్ఠించిన నాల్గు మఠాలలోను వుంచారుట. ఇక్కడ చూసేవి. చూడగల్గేవి రెండు. ఒకటి కైలాసగిరి, 2. మానససరోవరము. కైలాసగిరికి – మేరు, సుమేరువు, సుషమ్న, హేమాద్రి, రత్నసాను, కర్ణికాచలము, అమరాద్రి, దేవగణ, రజితాద్రి పర్వతములని పలుపేర్లు. పురాణాలలో దర్శిస్తాము. ఈ కైలాసగిరి, ఆత్మానందపరులకు ఒకవైపు సింహంగా, ఇంకోవైపు గుర్రంగా, మరొకవైపు ఏనుగుగా, చివరగా నెమలిలా కనుపిస్తూంది. పర్వతం కూడా రకకరాల రంగులలో కనిపిస్తుంది.

దీనికి ఎన్నోకాదుకాని, నాలుగు మార్గాలున్నాయి. రెండు నేపాల్ ద్వారా, ఒకటి మనదేశంద్వారా, మరొకటి (ఇప్పటి) పాకిస్తాన్ ద్వారా. అయితే నేపాల్, ఢిల్లీమార్గాలనే భక్తులు ఈ సాహసయాత్రకు ఉపయోగించుకుంటున్నారు. కాకపోతే ఢిల్లీమార్గం చైనావారిచేత, ఖాట్మండుమార్గము, టూరిస్టు కంపెనీలద్వారా నిర్వహించబడుతుంది. ఢిల్లీయాత్ర 30 రోజులు; ఖాట్మాండు ద్వారా 18 రోజులు పడుతుంది.

నగ్గర్ నుండి షుమారు 4 కి.మీ దూరంలోని **'నిషాల'** అనే గ్రామంలో **చాముండాభగవతి ఆలయ** ముంది. ఇది పురాతన మంటాముకాని, ఎంత పురాతనమైనదో తెలియదు. ఈ తల్లిని సప్తమాతృకలలో ఒక మాతృకగా, దుర్గాదేవి అవతారాలలో ఒక దేవతగా భక్తులు భావించి భక్తిశ్రద్ధలతో పూజిస్తారు.

**చాముండాగా** ప్రఖ్యాతమైన ఈ ప్రదేశం రైల్వేస్టేషను నుండి 6 కి.మీ. దూరంలో వుంది. ఇక్కడి వనగంగా



ప్రవాహం, ప్రకృతి శోభలు చూడవలసిందే. ఈ ఆహ్లాదకర వాతావరణంలోని విగ్రహాలకు ఎప్పుడు విభూది పూత పూసి వుంటుంది.

ఇక్కడి అమ్మవారు చాముండి, అయ్యవారు అశుతోక్ష శివశంకర్ అని పిలుస్తారు. పాలంపూరుకు 17 కి.మీ లో వుంది **'చాముండా'** అనే చిన్న గ్రామం. ఇక్కడి చాముండాదేవిని, వనదుర్గలలో ఒక దుర్గగా భక్తులు భావిస్తారు. ఈ తల్లి పేరుతోనే ఈ గ్రామం ఆవిర్భవించింది. అభివృద్ధి చెందింది. ఆలయం మొత్తం మూడు అంతస్తులతో ఒక పెద్ద భవనం లాగ వుంటుంది. 'చండ–ముండా'సురులను రాక్షసులను చంపినందువలన 'చండ–ముండ'అని, చండిక అని పేరు వచ్చిందని చెబుతారు. ఇంకా విచిత్రం రెండు గ్రామముల మధ్యగల స్మశానంలో వున్న ఈ ఆలయానికి ఒక కోనేరు కూడా వుంది.

కాంగడాకు 36 కి.మీ దూరంలో దక్షిణంగా **జ్వాలాముఖి** అనే వూరు, **తారాదేవి ఆలయం** వున్నాయి. అసలిక్కడ వున్నది జ్వాలాముఖిదేవి. ఆమె పేరు మీదే వూరికి 'జ్వాలాముఖి' అని పేరువచ్చింది. ఈ అమ్మవారి ఆలయానికి ముందున్న ప్రాంగణానికి ఎడమవైపున చిన్నకొండమీద ఈ తారాదేవి ఆలయముంది. ఈమె దశమహావిద్యలతో ఒక్కర్తెగా పూజింపబడుతుంది. చక్కని శిల్పసంపదతో కూడిన ఈ ఆలయం చూడతగ్గది. సేవించతగ్గదికూడా!

సముద్రమట్టానికి 8500 అడుగుల ఎత్తులో ఘోషి పట్టణంలో ఈ కాళికామాత ఆలయం వుంది. ఈ వూళ్ళోని ముఖ్యదేవాలయాలలో ఈ ఆలయం కూడా చెప్పుకోతగ్గది. ఈ ఆలయంలో కాళిమాతతోపాటు, అమ్మ ఇతర రూపాలైన శ్యామల, చండిని కూడా ఇక్కడ మనం దర్శించగలం. ఈ శక్తిస్వరూపిణిని పండుగలు, ముఖ్యంగా దసరా ఉత్సవాలలో మహావైభవంగా పూజిస్తారు.

## రేణుకా సరస్సు



ఈ సరస్సు, ఉత్తర హిమాలయాలలోని శివాలి పర్వతశ్రేణి అంతర్భాగంలో సహాన్ నుండి 45 కి.మీ దూరంలో వుంది. ఇక్కడే తండ్రి ఆనతి మేరకు పరశురాముడు తల్లిని వధించాడని, అందుకు సంతోషించిన జమదగ్ని మహర్షి పుత్రుని కోరిక మేరకు తిరిగి బ్రతికించారని, అందుకీ ప్రదేశం పరమపవిత్ర తీర్థ క్షేత్రంగా పూజించబడుతుందని, ప్రకృతి అందాల మధ్య ఎంతో ప్రశాంతంగా వున్న సర్వపాపాలను తొలగిస్తుందని, దర్శనీయమని పురాణకథనం.

## ఇతర దర్శనీయాలు

సహాన్‌లోని అతి ప్రాచీనమైన జగన్నాథమందిరం, అలాగే ధర్మశాలకు 40 కి.మీ. దూరంలోని త్రిలోకపూరులోని స్వతఃసిద్ధ గుహాంతర్భాగంలోని శివక్షేత్రం, చాముండీ దేవాలయం నందికేశ్వరాలయాలు సత్వర దర్శనీయాలు.


"బ్రహ్మపురి" అనే భారమావూర్, చంబాలోయలోని రావీనది పరివాహకప్రాంతంలో వుంది. ఇక్కడి ప్రాచీన ఆలయాలలో లక్షణాదేవి, విఘ్నేశ్వరుడు నరసింహమందిరాలు చెప్పుకోదగ్గవి. ఈ ప్రాంతాన్ని "శివభూమి" అని పిలుస్తారు.

కులూ జిల్లాలోని "జగత్‌సుఖ్" లో మహిషాసురుని కన్నులు మూసుకుని వధించే అమ్మవారి అపురూప విగ్రహం వుంది, ఇక్కడి శివుని పేరు గౌరీశంకరుడు.




ఇంకా కులులోయలోని గంగా, యమునా విగ్రహాలు ఇక్కడికి 11 కి.మీ లోని "బియాగ్ - పార్వతి" నదుల సంగమంలోని **బిజిలి మహదేవుడు**, మండి జిల్లాలోని పంచవక్త్ర మహదేవుని ఆలయం, జ్వాలాముఖికి 55 కి.మీ దూరంలో, రాక్షసులతో పోరాడిన అమ్మవారి గాయములు చన్నీటితో కడిగి నెయ్యిని సంక్రాంతి మరునాటినుండి రాస్తారు.

ఇక్కడి అమ్మవారు **వజ్రేశ్వరి.** ఆజ్ఞా విశుద్ధ, అనాహత, మణిపూరక, స్వాధిష్టాన, మూలాధార షట్చక్రరూపిణి ఈ తల్లి. ఆపదలు వచ్చినప్పుడు ఇక్కడి భైరవవిగ్రహంనుంచి కంటి వెంట నీరు, శరీరంనుండి చెమటలు వచ్చే అపురూప ఆలయమిది.




కులూ 4 కి.మీలోని ధౌమ్యగంగ, వ్యాసగంగ, సౌమ్యగంగల సంగమం వుంది. ఇక్కడి చేసే శ్రాద్ధ కర్మలు పితృదేవతలకు పుణ్యధామమౌతుంది.

**అదృష్టం అన్వేషించే వారినే వర్తిస్తుంది !**

– స్పర్జియస్

**పొగడ్త మూడు కాళ్ల కుర్చీలాంటిది, విర్రవీగి కూర్చుంటే వెన్నక్కి తూలే ప్రమాదం వుంది. !**

– ఓ సూక్తి

## జమ్మూ, కాశ్మీర్




భూతల స్వర్గంగా పిలువబడుచున్న ఈ రాష్ట్రం భారతదేశ ఉత్తరాగ్ర భాగంలో ఉంది. జమ్ము కాశ్మీర్‌కు వేసవి కాలపు రాజధానిగా శ్రీనగర్, శీతాకాలపు రాజధానిగా జమ్ము ఉన్నాయి. 14 జిల్లాలను కలిగి ఉన్న ఈ రాష్ట్రం ప్రత్యేక రాజ్యంగా ఉంది.

స్వాతంత్ర్యానికి పూర్వం జమ్మూ-కాశ్మీర్, డోగ్రాల పరిపాలనలో చిన్న రాజ్యంగా ఉండేదని తెలుస్తుంది. స్వాతంత్ర్యానంతరం కూడా ఈ రాష్ట్రం రాజా హరిసింగ్ ఏలుబడిలో ఉంది. అనంతరం పాకిస్థాన్ దళాలు, జమ్ము కాశ్మీర్‌ను ఆక్రమించుకోగా రాజా హరిసింగ్ అభ్యర్థన మేరకు, భారతీయ సేనలు, పాకిస్తాన్ దాడి నుండి జమ్ము-కాశ్మీర్‌ను రక్షించాయి. దీని పర్యావసానంగా 1947 అక్టోబర్ 26వ తేదీన అప్పటి జమ్ము-కాశ్మీర్ రాజాహరిసింగ్, ఈ రాష్ట్రాన్ని భారత్‌లో విలీనం చేస్తూ సంతకం చేసారు. భారత్ ప్రభుత్వం 370వ అధికరణం ద్వారా ఈ రాష్ట్రానికి రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించింది. ఫలితంగా 1957 జనవరి 26 నుండి కాశ్మీర్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైంది.

విస్తీర్ణం : 2,22,236 చ.కిమీ. ప్రధాన భాషలు : కాశ్మీర్, ఉర్దూ, డోగ్రీ

**సరిహద్దులు :** ఉత్తరాన : చైనా, తూర్పున: టిబెట్, దక్షిణాన : హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, పశ్చిమాన: పాకిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్‌లు ఉన్నాయి.

## అమరనాథ్ యాత్రికుల ఆధార శిబిరం పహల్‌గామ్ (జమ్ము-కాశ్మీర్)




జమ్ము-కాశ్మీరు రాజధాని శ్రీనగర్‌కు 96 కిలోమీటర్ల దూరంలో ఉన్న "లిద్దరు" లోయ పరీవాహక ప్రాంతమైన పహల్‌గామ్ ప్రకృతి సిద్ధమైన మంచుతో కప్పబడి నదీజలాలతో అందమైన వంతెనలతో విరాజిల్లే సుందర క్షేత్రము. పహల్‌గామ్ అసలు పేరు పోహల్ గామ్. కాశ్మీరు భాషలో పోహల్ అంటే దీర్ఘకాయుని ఉదర భాగము అని అర్థము. పర్వతశ్రేణుల మధ్య ఉన్న ఈ ప్రాంతమున అడుగడుగునా ఆహ్లాదకరమైన దృశ్యాలే సందర్శకులను మంత్రముగ్ధులను చేసే ఎగుడు దిగుడు మార్గాలు, కళ్లు తిరిగే లోయలు, సుళ్ళు తిరిగే నదీ జలాలు ఈ ప్రాంతములో విశేషంగా కనిపిస్తాయి.

అసంఖ్యాకంగా భక్తులను ఆకర్షించే పురాతన గౌరీ శంకర మందిరం ఈ ప్రాంతములో చూడదగ్గ ప్రదేశము.

భృగుమహర్షి శ్రీ మహావిష్ణువు కోసం తపమాచరించిన పరిశీలన వనం ఈ పహల్‌గామ్‌లోనే ఉందని చెబుతారు. భృగుమహర్షి కఠోర తపస్సుకు దేవతలు సైతం వణికారు. అది యుగాల తరబడి కొనసాగిందని పురాణాలు చెబుతున్నాయి. మునిశ్రేష్ఠుని తపస్సుకు ప్రసన్నుడైన నారాయణమూర్తి అతనికి సాక్షాత్కరించి భృగు మహర్షిని ఆలింగనం చేసుకున్నాడని వారిరువురి ఆలింగనంలో జన్మించిన స్వేదం "లిద్దరు నది" గా రూపాంతరం చెందినదని చెబుతారు.

ఇక్కడి గాలి, స్వచ్ఛంగా, ఆరోగ్యవర్ధకంగా ఉన్నా నీరు మాత్రం తేడాగా ఉంటుంది. అతి శీతల స్వభావం వలన గొంతు వ్యాధులకు దారి తీస్తుంది. ప్రకృతి సౌందర్యాలతో అలరారే ఈ "పహల్‌గామ్" గౌరి శంకర మందిరమునకు తీవ్రవాదుల బెడద ఉన్నా భక్తులు తరలి వెళుతుండడం విశేషం.

**అమర్‌నాథ యాత్ర** : అనిర్వచనీయమైన భక్తి భావము కలిగించే అసామాన్య యాత్ర అమర్‌నాథ్ యాత్ర. దీన్ని గురించిన సమాచారం అందించే ప్రయత్నం చేస్తున్నాము. కాశ్మీరు లోయకు అగ్నేయ దిశగా అమర్‌నాథ్ యాత్రకు ఆరంభ కేంద్రమైన పహల్‌గామ్ అనే గ్రామం నుండి "హరోం హరహర" అంటూ నినాదాలు చేస్తూ భక్తి ప్రపత్తులతో ముందుకు నడుస్తూ మంచు గుహలో ఉన్న జ్యోతిర్లింగాన్ని దర్శించాలనే దృఢ సంకల్పం ఉన్న ప్రతి భక్తునికి హృదయ పూర్వక అభినందనలు తెలుపుతున్నాము. ఈ భక్తుల ప్రాణాలను నిరంతరం కాపాడుతూ రక్షణ కొరకు నియమించిన సైనికులు కూడా అమర్‌నాథ్ యాత్ర దర్శించిన పుణ్య ఫలము పొందు తారు అనడంలో అతిశయోక్తి లేదు. భక్తుల సందోహము కన్న సైనిక సంచలనమే మిన్నగా ఉన్న ఈ యాత్రలో భక్తులు ఉన్ని వస్త్రాలు, టార్చిలైట్లు పూజాద్రవ్యాలు, తినుబండారాలు తప్పనిసరిగా తీసుకుని వెళ్ళాలి.





ఈ భక్తులు పార్వతిదేవి ప్రతిరూపంగా భావించే వెండి దండాన్ని భజంత్రీలు, నృత్య గీతాలతో సాంప్రదాయ బద్ధంగా తీసుకుని వెళతారు. దీన్ని "ఛడీముబారక్" అంటారు. సముద్ర మట్టానికి 11,500 అడుగులు ఎత్తు ఉన్న ఈ ప్రాంతము నుంచి మొదలయి అమర్‌నాథ్ దర్శనంతో యాత్ర ముగుస్తుంది. అమర్ నాథ్ యాత్ర పొడవున చాలా వరకు హోటళ్ళు, దుకాణాలు ఏమీ ఉండవు. రంబాన్ నుండి బనిహల్ టన్నెల్ మీదుగా ప్రయాణించే ప్రతి భక్తునికి సైనికులు రక్షణ కల్పిస్తారు. పహల్‌గామ్ నుంచి అమర్‌నాథ్‌కు 46 కి.మీ. దూరము మాత్రమే ఉంటుంది.

కానీ ఉత్తుంగ శిఖరాలమీద, ఎత్తు పల్లాల మీద ప్రయాణం సాగించాలంటే అంత సులభం కాదు. ప్రాణభీతితో పరిసరాలను పరిశీలిస్తూ ప్రాణ రక్షణ చేసే సైనికుల సమక్షములో పరమేశ్వరుని కీర్తిస్తూ వేలాది భక్తులు అమర్‌నాథ్ యాత్రను చేస్తారు. భక్తులకు సైనికులు తమ పూర్తి సహాయ సహకారాలు, వైద్య సేవలు, ఆహార పదార్థాలు అందిస్తూ ఉంటారు.


కాశ్మీరుకు దక్షిణాన 13,500 అడుగుల ఎత్తున ఉన్న ఈ అమర్‌నాథ్ గుహను దర్శించడానికి దేశం నలుమూలల నుండి భక్తులు భక్తి విశ్వాసాలతో వస్తారు. ప్రకృతి సౌందర్యం, ధవళకాంతులతో దేదీప్యమానంగా ప్రకాశించే హిమాలయ పర్వతాల నుంచి ప్రవహించే “లిద్దరు” అనే వాగు మీదుగా ప్రయాణం చేసి చందన్‌వారి చేరుకోవాలి. మార్గమధ్యములో ప్రకృతి రమణీయ దృశ్యాలు, ఆహ్లాదకరమైన పవనాలు, పక్షుల కిలకిల రావాలు పరవశింపజేస్తాయి. కనువిందు కలిగిస్తూ “చందన్‌వారీ” మీదుగా ప్రయాణం ముందుకు నడుస్తుంది. సముద్ర తలానికి 2923 మీటర్ల ఎత్తున ఉండే ఈ ప్రదేశం పరమాద్భుత సౌందర్యానికి నిలయం.

**శేషనాగ్** : శేషనాగ్ మార్గమధ్యంలో నీలం, ఆకుపచ్చ, గులాబి రంగుల్లో ఉండే చెరువులు, చిన్న చిన్న కాలువలు కనిపిస్తాయి. ఈ ఘాట్ రోడ్డు నుండి ముందుకు వెళ్ళేకొలది ప్రాణవాయువు తగ్గిపోతూ ఉండటం వల్ల ఉక్కిరి బిక్కిరి కావలసి వస్తుంది. అందమైన దృశ్యాలు కనువిందు చేస్తున్నా అధిక సమయం సంచరించడానికి అధికారులు ఒప్పుకోరు. చందన్‌వారీ నుండి ఈ ప్రాంతము నకు 27 కి.మీ. దూరం 12 వేల అడుగుల ఎత్తుకు చేరుకున్న తరువాత మంచుగడ్డలను కోసుకుంటూ ముందుకు పోయే ఆకుపచ్చని ప్రవాహం కనిపిస్తుంది. ఈ నది లోతు ఎంత అన్నది ఎవరు చెప్పజాలరు. ఎందువలన అంటే ఈ నీటిని తాకిన విద్యుత్ ఘాతం తగిలినట్లు చలించి పోతారు. నీటిని ముట్టుకొనుటకు ఎవరూ సాహసించరు. ఈ నది ప్రవాహము పొడవు ఒక మైలు, వెడల్పు అరమైలు. ఈ ప్రవాహానికి అవతల ఏడు శిఖరాలు ఉన్నాయి. అందువలన దీనిని సప్తశిఖరాల సమూహము అంటారు.



అమర్‌నాథ్ గుహకు వెళ్తూ మార్గమధ్యమున పరమేశ్వరుడు తన మెడలో ఉన్న సర్పాన్ని విడిచి వెళ్లాడని, ఇప్పటికీ రాత్రి సమయములలో ఈ శేషనాగు దర్శనం లభిస్తుందని భక్తుల నమ్మకం. ఆదిశేషుడు తన పడగలను పైకెత్తి కొండ గుహల్లో నోళ్లను తెరచి, మాయా వాయువును భక్షించి అసురుణ్ని హతమార్చాడని అంటారు.

**మహాగుహన్ శిఖరం** : దళసరి మంచు పొరలతో చుట్టుకొని ఉండే మహాగుహన్ శిఖరం శేషనాగ్‌కు మైలు దూరంలో 14,800 అడుగుల ఎత్తులో ఉంది. ఆక్సిజన్ సిలండర్లు లేకుండా ఈ మహాగుహన్ దర్శించటం కష్టం. ఈ మహాగుహన్ నుంచి 4000 అడుగుల ఎత్తుకు చేరుకుంటే ‘హత్యారా’ సరస్సును సందర్శించవచ్చు.



**పాపనాశని - పంచతరణి** : మహాగుహన్ శిఖరాన్ని దాటుతూ ప్రకృతి అందాలను దర్శిస్తూపోతే పంచతరణి చేరుతారు. పహలగామ్ నుండి 38 కి.మీ. దూరంలో ఉండే ఈ క్షేత్రము సోన్‌మార్గ్ – చౌల్‌టాల్ మార్గంలో కనబడే అయిదు ధారలు ఏకమైన బృహత్ ప్రవాహమే పంచతరణి. ఈ సంగమ లహరిని "రామ్‌గంగా" అని కూడా వ్యవహరిస్తారు. ఈ ప్రవాహం సింధునదిలో కలుస్తుంది. పంచతరణి దాటాలంటే మంచులో కప్పబడిన వంతెన దాటాలి. ప్రకృతి సిద్ధముగా రూపొందిన ఈ వంతెన చేరువలో "ఢామురుక క్షేత్రము" కూడా ప్రశస్తిగాంచినది.

ఒకనాడు శివుడు కుమారస్వామి నృత్యం చేస్తూ సంధ్యాగమానాన్ని గుర్తించలేదు. సంధ్యా వందనం ఆచరించ లేదని బాధపడే శివుని ఓదార్చిన పార్వతీదేవి తన గణాలలోని ఢమరుకుడు అనే వ్యక్తిని త్రిసంధ్యలను గుర్తుచేయమని నియమిస్తుంది. నిత్యం సంధ్యాసమయాలు తెలిపే ఢమరుకుడు ఒక రోజు మరచిపోయి శివునిశాపానికి గురి అవుతాడు. ఢమరుకుని శివుడు బండరాయిలా ఉండమని శపిస్తాడు. ఢమరుకుడు శివుని ప్రార్థించగా పంచతరణి యాత్ర చేసేవారు ఢమరుకుని దర్శించి ప్రదక్షిణ చేస్తారని అభయమిచ్చాడు. కేశబంధాల నుండి విముక్తి పొందిన గంగమ్మ శివుని తలపై నుంచి అయిదుపాయలుగా ఎగజిమ్మి పంచతరణిగా రూపొందిందని అంటారు. యాత్రికులు ఇక్కడ స్నానం చేసి అమర్‌నాథ్ గుహకు వెళతారు.

**గుప్తగంగ**: "హరహర మహాదేవ, శంభో శంకర్, జై శివశంకర్" అంటూ భక్తుల నినాదాలతో ప్రతిధ్వనించే ప్రదేశమే "గుప్తగంగ" దీన్నే అమరావతి అంటారు. ఈ ప్రవాహం స్వచ్ఛతకు ప్రతిరూపం. నీటి అడుగున ఉండే మంచునేల మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ నదిని దాటుకుంటూ ప్రయాణం చేసే యాత్రికుల అనుభవం చెప్పనలవి కాదు. గుప్త గంగకు సంబంధించి పురాణ కథ ఒకటి ఉంది. మృత్యుభయం కలిగిన దేవతలు ఆవేదనగా శివుని ప్రార్థించగా తన సిగలో జాబిల్లి నుంచి అమర సుధలను దేవకోటికి పరమేశ్వరుడు అనుగ్రహించాడని అంటారు. అమరావతి జలాలు ఆ సుధా ప్రవాహమని భక్తులు భావిస్తారు.

**అమరనాథుని వద్దకు అరుదెంచిన వేళ** : 150 అడుగులు పొడవు 100 అడుగుల వెడల్పు ఉన్న అమర్‌నాథ్ గుహకు చేరుకోవడంతో యాత్రికుల హృదయాలలో భక్తి భావం నిండిపోతుంది. వ్యయప్రయాసలతో కూడిన పయనానికి సార్థకత చేరిందని భావిస్తారు. హిమలింగానికి భక్తి భావాలతో పూజలు నిర్వహించడం విశేషం. అమర్‌నాథ్‌ను ఆసక్తితో తిలకించిన తరువాత యాత్రికులు శాంతియుత వాతావరణంలో తిరుగు ప్రయాణం ప్రారంభిస్తారు. అమర్‌నాథ్ క్షేత్రమహిమ కథా రూపంలో పరమేశ్వరుడు పార్వతికి వినిపించాడని ప్రతీతి. అమర్‌నాథ్ గాథ శ్రవణం పాపహరణమని చెప్తారు.

## శ్రీనగర్

2,260 సంవత్సరాల క్రితం అశోక చక్రవర్తి ఈ పట్టణ వ్యవస్థాపకుడు. స్వచ్ఛమైన నీలిరంగులలో ఉన్న ఈ పట్టణం నీటిపై తేలియాడే నగరం అని కూడా అనవచ్చు. ఈ శ్రీనగర్‌కు చుట్టుప్రక్కల అనేక పుణ్య స్థలములు భక్తులు చూడవచ్చు.

## హార్వాన్

ఇక్కడ ఆదిశంకరాచార్యులు వారి ఆలయం వెయ్యి అడుగుల ఎత్తున గల కొండమీద ఉంది. ఈ గ్రామం ప్రసిద్ధి చెందిన బౌద్ధ విహారం. ఇక్కడ నుండి చూస్తే సుందరమైన ప్రకృతి దృశ్యాలు మనకు కనబడతాయి. ఈ పట్టణము చాలా పురాతనమైనది.

## రఘునాధ్ ఆలయం

రామాయణ గాథకు చెందిన అనేక పవిత్ర శిల్పాలు గల ఈ క్షేత్రము జమ్మునగరం మధ్యలో ఉన్నది.

## రణభీరేశ్వర ఆలయం

అనేక వేల స్ఫటికలింగాలు గల ఈ ఆలయం సుమారు 100 సంవత్సరాలు క్రిందటిది. ఇక్కడ స్వామి రణబీరేశ్వరుడు.

## అనంతనాగ్

శ్రీనగర్‌కు 55 కి.మీ. దూరంలో ఉన్న ఈ పట్టణములో స్వామి శ్రీమహావిష్ణువు, ఇక్కడ నీటి ఊటలు ఎక్కువగా ఉంటాయి.

## అవంతిపూర్

పాండవులు నిర్మించిన అతిపురాతనమైన పట్టణం. కాశ్మీరులో చెప్పుకోదగిన స్థలములలో ఇది ఒకటి.

## పూర్ మండల్

జమ్ము-కాశ్మీరు వెళ్ళిన భక్తులు ఇక్కడకి దగ్గరలోనే ఉన్న పూర్‌మండల్ తప్పక దర్శించాల్సిన యాత్ర స్థలము. ఈ పట్టణం జమ్ము 40 కి.మీ. దూరంలో ఉంది. దీనిని గయాక్షేత్రంగా చెబుతారు. ఇది దేశికనది తీరంలో వుంది. ఇక్కడి స్వామిని "ఉమాపతి" అనీ, అమ్మవారు "ఉమ"గాను పిలుస్తారు.

# మనోహరమైన మానస సరోవరము

ఉత్తరప్రదేశ్‌లోని "అల్మోరా"కు 240 కి.మీ. దూరంలో హిమ వన్నగములో పరమ పవిత్రమైన కైలాస పర్వత శ్రేణిలో ఉన్న పుణ్యక్షేత్రమే మానస సరోవరం. **మానస సరోవరం** అని పిలిచే ఈ లింగాకారములో ఉన్న కైలాస శిఖరం ప్రక్కనే మాంధాతృ శిఖరం కూడా ఉంది. కైలాస మాంధాతృ శిఖరాల నీడలో నిర్మలమైన చల్లని నీటితో శోభిల్లుతూ ఉండే దివ్య సరస్సే మానస సరోవరముగా పేరు గాంచినది.



ఈ సరోవరానికి 22 వేల అడుగుల ఎత్తులలో ఉండేకైలాస శిఖరం, 25 వేల అడుగుల ఎత్తులో ఉండే మాంధాతృశిఖరం ఇక్కడకు విచ్చేస్తున్న భక్తులను విశేషంగా ఆకర్షిస్తాయి. మంచుతో కప్పబడి ధవళ వర్ణ శోభతో మెరసిపోతున్న ఈ శిఖరాలపైని మంచు సూర్యరశ్మికి ప్రవహిస్తుంది. ఆకాశం నిర్మలంగా ఉన్నప్పుడు ఈ కైలాస శిఖరం మానస సరోవరంలో ప్రతిబింబించటం చూసిన భక్తులు దివ్యానుభూతిని, ఆనందాన్ని పొంది యింతకంటే మనోహర దృశ్యాన్ని చూడజాలమని పరవశంతో చెబుతారు.

తెల్లవారుజామున 4 గంటలకే సూర్యోదయం అయ్యే ఈ మానస సరోవరం 200 చ.మైళ్ళ వైశాల్యము, 300 అడుగుల లోతుతో నీలివర్ణపు చల్లని నీటితో నిండి ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు సూర్యస్తమయం శోభను చూసి ఆనందించాల్సిందే. మానస సరోవరంలోని నీరు చల్లగా తీయగా ఉంటాయి. మానస సరోవరంలో కొంత ప్రాంతము బురదగా ఉంటుంది. మరి కొంత ప్రాంతము శిలాసదృశ్యంగా, వేరొక ప్రాంతములో ఇసుక మేటలు వేసి ఉంటుంది. ఒక చోట నీరు చల్లగా ఉంటే వేరొక చోట వేడిగా ఉంటుంది. గంగానది కైలాసం నుండి వచ్చి సరోవరములో కలుస్తుందని పురాణముల ద్వారా తెలుస్తోంది. మానససరోవరంలో స్వర్ణకమలాలు ఉంటాయని, ముత్యాలు గుత్తులుగా దొరకుతాయని, రాయంచలు బారు తీరి విహరిస్తుంటాయని ప్రతీతి.

కానీ స్వర్ణకమాలాలను చూసిన వాళ్ళు లేరు. రాజహంసల పోలిన నీటి పక్షులు ఈ మానస సరోవరంలో ఈనాటికి ఈతలు కొడుతూ ఉంటాయి. ఈ పక్షులు ఈదుతూ సరోవరానికి వింత శోభను కలిగిస్తాయి. చూసిన భక్తులకు మరి ఆనందమే. ఈ హంసలను పోలిన పక్షులు పూర్తి శాకాహారులు. ఆశ్వయుజమాసంలో కురిసే స్వాతి జల్లుల వలన ఏర్పడే ముత్యాలను ఇవి సేవిస్తాయని అంటారు. వరుసలు కట్టి ఆకాశంలో ఎగురుతూ శోభిల్లే సంఘటన చూసి తీరాల్సిందే.

ఈ పవిత్రమైన మానస సరోవరము పుణ్య సరస్సును దర్శించదానికి భారత ప్రజలు ఉవ్విళ్ళూరుతూ ఉంటారు. కానీ వారు చైనా ప్రభుత్వము అనుమతి తీసుకోవలసి ఉంటుంది. చైనా వారి అధీనంలో ఉన్న ఈ కైలాస మానస

సరోవరాన్ని దర్శించటానికి చైనా ప్రభుత్వము కొన్ని నిబంధనలు సడలించి సులభతరం చేస్తున్నది. దీనితో భక్తుల పాలిట కొంగు బంగారం అయిన మానస సరోవరం మరింత సులభంగా దర్శించ వచ్చును.

## వ్యాఘ్రువాహిని - పాహి వైష్ణవీ

**"వ్యాఘ్రు వాహిని, పర్వతవర్ధని పాహివైష్ణవీ శరణం శరణం"** అంటూ లక్షలాదిమంది భక్తులు పర్వత మార్గాన భజనలు చేస్తు సాగిపోయే దృశ్యం జమ్ము-కాశ్మీరు నుండి 60 కి.మీ. దూరంలో వైష్ణవిదేవి ఆలయం వద్ద కనబడుతుంది. పిలిస్తే పలికే దైవంగా, కోర్కెలు నెరెవేర్చే జగదాంబగా షేరేవాలీ (వ్యాఘ్రువాహిని) మాతను పిలుస్తారు.

**స్థలపురాణం :** కురుక్షేత్ర సమరంలో విజయప్రాప్తి కోసం వైష్ణవిదేవిని ఆరాదించమని శ్రీకృష్ణుడు అర్జునునికి చెబుతాడు. జంబూ ద్వీపంలో నున్న త్రికూట పర్వతాలలో వెలసిన దేవతామూర్తి గురించి పురాణాలు చెబుతున్నాయి. ఈ జంబూ ద్వీపం కాలక్రమేణా జమ్మూగా పరివర్తనం చెందింది.



ఈ జమ్మూకు డెబ్బై కిలోమీటర్ల దూరంలో ఈశాన్యంగా ఉన్న త్రికూట పర్వతంపైన గుహాలయంలో వెలసిన దేవీమూర్తిని దర్శిస్తున్న భక్తుల సంఖ్య ఏటా పెరుగుతోంది. విదేశీయులను సైతం ఆకర్షించే ఈ పుణ్యక్షేత్రములో అమ్మవారి పేరు వైష్ణవీదేవి. ఇదే గుహలో ఉన్న సరస్వతిదేవి, దుర్గాదేవిని కూడా భక్తులు చూడవచ్చును. జమ్ముకాశ్మీరు ప్రభుత్వం కొన్ని ఏర్పాట్లు చేయడంతో వైష్ణవీదేవి దర్శనం సులభతరం అవుతోంది. రోజుకు సుమారు 10 వేల పైగా యాత్రికులు విచ్చేస్తున్న ఈ వైష్ణవిదేవి ఆలయమునకు **"శ్రీమాత వైష్ణవీదేవి బోర్డు"** ఏర్పడి సత్రాలు, వసతులు ఏర్పాటు చేసింది. ఏ సమయంలోనైనా ఆనందంగా, సుఖప్రదంగా ఈ యాత్ర సాగించవచ్చు. ఈ వైష్ణవీదేవి ఆలయమునకు జమ్ము నుండి రైలులో కట్రా రైల్వే స్టేషన్‌లో దిగి వెళ్లవలెను. అమ్మవారి దర్శనం చేసుకునే ముందు భైరవనాథ్ దర్శనం చేసుకోవాలి. టోకెన్ సిష్టం ద్వారా రిజర్వేషన్ చేయబడు తుంది. కట్రా నుండి వైష్ణవీదేవి దేవాలయం 13 కి.మీ. ఇక్కడ నుండి నడిచిగాని, గుర్రం మీదగాని, డోలీ మీదగాని వెళ్ళవచ్చును. ఈ దేవాలయమునకు వెళ్ళు మార్గములో ఒక ప్రాంతములో ఉన్న బాణగంగ "చరణ పాదుక", హధీమాత చరణగంగలు దాటాలి. అమ్మవారు తపస్సు చేసిన "ఆధక్వారి" అనే స్థలాన్ని దర్శనం చేసుకోవచ్చు. ఈ దేవాలయంలోనే మహాకాళి, మహలక్ష్మి, మహాసరస్వతి దేవాలయాలు కూడా భక్తులు దర్శించుకొను స్థలములు, అష్టాదశ శక్తి క్షేత్రములలో ఈ క్షేత్రము ఒకటిగా ప్రసిద్ధి.

వాల్మీకి రామాయణంలో చెప్పిన స్వయంప్రభ గుహావర్ణన మన వైష్ణవీమాత గుహావర్ణనకు సరిపోతుంది. దీని సమీపంలోని రామమందిరం దీనికి నిదర్శనం. భైరవుడనే రాక్షసుని వైష్ణవిమాత సంహరించింది. ఆతని ఆలయంకూడా దరిదాపులలో వుంది. అస్సాంలోని కామాఖ్య కూడా ఇటువంటి దివ్యక్షేత్రమే. హిమాచల్‌ప్రదేశ్‌లో ఇటువంటి గుహవున్నా అక్కడ తల్లి జ్వాలాముఖి, ఆకారంలేకుండా ఆ జ్వాల అలాగ ఎగుస్తూనే వుంటుంది. దేవి నాలుక ఈ క్షేత్రంలోపడి శక్తిపీఠాలలో ఒకటయింది. ఇంకా విశేషం – అక్బరుపాదుషా ఈ తల్లికి వెండిగొడుగు చేయించాడుట. దానినికూడ ఇప్పుడు చూడవచ్చును.

## అవంతిపుర ఆలయ శిథిలాలు

రాజైన అవంతివర్మ ఇక్కడ రెండు అద్భుతమైన ఆలయాల్ని నిర్మించాడు. అందులో ఒకటి విష్ణుమూర్తి కొరకైన అవంతి స్వామిన్, మరొకటి పరమశివుని కొరకైన అవంతీశ్వర. అవంతవర్మ రాజు చిన్నప్పటి నుండి వైష్ణవ మతస్థుడై విష్ణుభక్తుడై ఉండి, శివభక్తుడైన తన మంత్రి సుర కోరిక మేరకు శివునికి ఒక ఆలయం నిర్మించడం జరిగింది.

ఈ ఆలయ సంరక్షణకై పెద్ద ఎత్తున నిధులు సమకూర్చిన అవంతివర్మ, పరిపాలన తర్వాత మొదటి లొహరా రాజవంశపువాడైన కల్హనుడు రాజుగా నున్న కాలంలో ఈ యొక్క ఆలయ నిధులన్నీ స్వాధీనం చేసుకొన్నారు.

## మార్తాండ దేవాలయం



ఇంచుమించు ఈ మార్తాండం ఆలయాన్ని కోణార్క (13 వ శతాబ్దంలో) గంగ వంశపురాజు నరసింగదేవుడు నిర్మించడానికి 500 సం॥కు ముందే అంటే సుమారు (699 – 738) ప్రాంతాలలో కాశ్మీరును పాలించిన లలితాదిత్యుడు ఈ మార్తాండ ఆలయాన్ని నిర్మించినట్లు చెబుతారు.

ఈ మార్తాండ తీర్థప్రాంతము కశ్యపమహాముని నివాస భూమిగా చెబుతారు. ఇక్కడి మంచినీటి బుగ్గలు పరమశివుడు ఏర్పరిచినట్లు పురాణ కథనం.

ఇచ్చటి దేవాలయం అపురూపమైనదే. కానీ విదేశీ దాడులు, మన అజాగ్రత్త, స్వార్థపరత్వము మొత్తం ఒక దురదృష్టంగా ఆనాడే శిథిలమైంది. దీనిని నిర్మాణకౌశల్యం, శిల్పరీతులు, ప్రతిఒక్కటి ప్రస్తుతించదగ్గదే! ఇప్పుడు కేవలం శిథిలమైన 84 స్తంభాలున్నాయి. రాశిచక్రం అందులో 12 రాశుల గుణకాలను మనం చూడగల్గుతాము. ఆలనాపాలనా లేని ఈ ఆలయం చరిత్రకు కన్నా మనకు దురదృష్టం అని చెప్పుకోవాలి.

## శంకరాచార్య హిల్

శ్రీనగర్‌లో దాల్‌లేక్ (దాల్ సరస్సు) ప్రక్కనే ఉంటుంది ఈ హిల్, ఒకప్పుడు దీనిని 'తక్త్-ఇ-సులేమాన్' (సాలోమేన్ రాజ్యం) అని పిలిచేవారు. 10 శతాబ్దాల క్రితం శంకరాచార్యుల వారు సనాతన ధర్మ అనే విషయం పై కాశ్మీర్ వచ్చినప్పుడు ఇక్కడే ఉండటం జరిగింది. లలితాదిత్య మహారాజు 6వ శతాబ్దంలో, ఇక్కడ కట్టడం నిర్మించడం వలన కొంతకాలం క్రితం ఈ ఆలయాన్ని గోపాద్రి అని పిలిచేవారు. ఇప్పుటికీ ఈ కొండ ప్రక్కరోడ్డును ఆనుకొని వున్న రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నివాసాలున్న ప్రదేశాన్ని 'గుప్‌కార్ రోడ్' అని పిలుస్తుంటారు.



చాలా ఎత్తున్న ఈ కొండ మీద ఆలయ గోపురం, వృత్తాకారంలో వుంటుంది. పైకప్పు ప్రస్తుత శైలిలో కనబడుతుంది. ఇక్కడ కనబడే పర్షియన్ పద సంపుటి, షాజహాన్ చక్రవర్తి పరిపాలనను గుర్తుకు తెస్తూ వుంటుంది. ఇక్కడ నుండి ఒక రోడ్డు, ఇంకా పైనున్న టి.వి. కేంద్రానికి పోతుంది. కాస్త పెందరాళే వెళ్ళగలిగితే, ఆపై నుండి కనపడే ప్రకృతి అందానికి ఏవరైనా పరవశులౌతారు.

## ఖిర్ భవాని హిల్



శ్రీనగర్ జిల్లాలో, తుళ్ళముల అనే ప్రదేశంలో వుంటుంది ఈ ఖిర్ భవాని హిల్. హిందూవులకు చాలా ప్రాముఖ్యమైన ప్రదేశం యిది. హిందూ దేవత రజ్ఞాదేవి ఇక్కడ వెలసి వుంటుంది. ప్రతి ఏటా జ్యేష్ఠఅష్టమి (మే-జూన్) లో హిందూ భక్తులు, యాత్రీకులు ఈ దేవత అనుగ్రహం కోసం వచ్చినప్పుడు జరిగే ఉత్సవం కన్నుల పండుగగా వుంటుంది. సంవత్సరం పొడుగునా, ప్రతి శుక్లపక్ష అష్టమికి దేవికి పూజలు జరుపుతారు భక్తులు. 1912లో మహారాజా ప్రతాప్‌సింగ్‌చే స్థాపింపబడిన ఈ ఆలయం తర్వాత కాలంలో మహారాజా హరిసింగ్‌చే పలు మార్పులు చేర్పులు జరిగాయి. ఈ ఆలయంలో రజ్ఞాదేవి, తెల్లని పాలరాతితో చేయబడిన ప్రతిమ రూపంలో ఉంటుంది.

## బాణగంగ

వైష్ణోదేవి చరణ పాదుకలున్న స్థలం. కాట్రా నుంచి 2 కి.మీ. మాత్రమే! ఇక్కడ ఉన్న సెలయేటి స్నానం చేసి, ముందుగా అమ్మవారి పాదుకలు స్పృశించిన తర్వాతనే వైష్ణోదేవి ఆలయ సందర్శనకు వెళ్తారు. నడవలేని వారి కోసం గుర్రబగ్గీలున్నాయి.

## పహల్గాం

కుంకుమపూల చేలున్న శ్రీనగర్ పరిసరాలలో అద్భుత రాజసౌధాలున్న ప్రాంతం అవంతీపూర్. తర్వాత పహల్గాం ప్రసిద్ధం. ఇక్కడ శేషధారా నది ఉంది. దీనిలో విడ్డర్ నది సంగమం స్థానం వద్ద డచ్చీ మైదాన్ ప్రకృతి సౌందర్యానికి రాచబాట. తుకారియా అనే ప్రదేశంలో అద్భుత హిమ సౌందర్యం ఎంత చూసినా తనివి తీరదు.

## పంచతరణి



శివుడు పంచముఖ గంగను విడిచిన ప్రదేశం. అమర్‌నాథ్ యాత్ర చేసే వారికి ఇది చివరి మజిలీ. సముద్ర మట్టానికి 14 వేల అడుగుల ఎత్తున ఉంది. ఇక్కడకు చేరుకున్న వారికి దేహ ధారుఢ్యం సరిగ్గా లేకుంటే తలనొప్పి వంటి చిన్న చిన్న ఇబ్బందులు ఎదురవుతాయి. ముందే కొంత సిద్ధపడి ఉండటం మంచిది.

## పార్వతీ లోయ

ఇక్కడే శివుడు దాదాపు వేలాది సంవత్సరాలు తపోదీక్షలో ఉన్నాడు. గొప్ప సౌందర్య విరాజితమైనది, కులూ లోయ దీనికి దక్షిణపుదిక్కున ఉన్నది, సమీప కేంద్రం భుంటర్ పట్టణం ఈలోయ మార్గంలోనే శ్యామనందా తపో భూములున్నాయి, మార్చి-నవంబర్ నెలల మధ్య ట్రెక్కింగ్‌కు అనుకూలంగా కూడా ఉంటుంది.

## జమ్ము కాశ్మీర్

శ్రీనగర్‌లో మనకు కనువిందు చేసేది ఒక ప్రక్క 'డాల్' సరస్సు. మరొక ప్రక్క 1000 అడుగుల ఎత్తుగల జగద్గురు ఆదిశంకాచార్యవారి పర్వతం. ఈ కొండపైన మరొక దేవాలయం "జేష్ఠేశ్వరాలయం". 4000 సం॥కు పూర్వం రాజాశాండిమన్‌చే నిర్మించబడింది. మరొక వింత సోలమహారాజు హజరత్‌సులేమాన్ దీనిని నిర్మించాడని మహ్మదీయుల వాదన.

12వ శతాబ్దంలోని శ్రీకల్హణుని "రాజతరంగిణి" ప్రకారం దీనిని "గోపాదరి"కొండ అని అనేవారుట. 1368లో ఈ ఆలయాన్ని గోపాదిత్యుడు నిర్మించాడని, చెబితే, ఇంకొందరు ఆధునిక చరిత్రకారులు అశోకచక్రవర్తి కుమారుడు జాలుగా, 200 బి.సి.లో నిర్మించాడని అంటారు.

ఇది ఏమైనా ఈ ఆలయం క్రొత్తదికాదు. పురాతన ఆలయ పునాదులపైనే ఇప్పటి ఆలయం నిర్మించబడింది. పురాతన ఆలయ శిథిలాలు, చుట్టుకనబడుతున్నాయన్నది స్పష్టము.

దాదాపొక వెయ్యి సం॥లనాడు జగద్గురు ఆదిశంకరాచార్యులవారు ఇక్కడికి వచ్చి తపస్సు చేసారని, ఆ రోజులలో ఆనాటి విశ్వవిద్యాలయ అధికారి ఆచార్య అభినవగుప్తునితో జరిపిన వాదన, సంభాషణల అనంతరం, ఆదిశంకరులవారికి భక్తిమార్గముకూడా (వాదన తప్ప నివేదనలేని పద్ధతికి స్వస్తి చెప్పించి) నేర్పారని ఇచ్చటివారి అభిప్రాయము. శంకరులు బసచేసిన కొండ కనుక దీనికి "శంకరాచార్యులవారి కొండ" అని పేరువచ్చింది. ఇంకా

శ్రీనగర్‌లోని పట్నీటాపు సమీపంలోని బాసుకీనాథ్ శివాలయంనుండి శివుని శూలము 'ఛడి" బయలు దేరుతుంది.

వేరినాగ్ జీలంనది జన్మస్థలం. ఇక్కడి అమ్మవారు నాగేశ్వరి, అయ్యవారు నాగేశ్వరులు.




**అవంతిపురంలో** (శ్రీనగర్‌కు 30 కి.మీ) విష్ణ్వాలయం శివాలయాలున్న ప్రదేశం. ఇక్కడి విష్ణువును అవంతీస్వామిగా, శివను అవంతీశ్వరునిగా పిలుస్తారు. ఇక్కడి విష్ణుమూర్తి తన ఆరు భుజాలలో రెండింటితో శ్రీదేవి, భూదేవిలను మిగిలిన నాల్గు భుజాలలో శంఖు, చక్ర, గదా, ధనస్సులను కల్గివుంటాడు.

శ్రీనగర్– లేహ్‌మార్గంలో, లేహ్‌కు 20 కి.మీ దూరంలోని "స్పిటిక్‌గుహ"లో అమ్మవారు సంవత్సరం మొత్తము ముఖం దాచుకుని, సంక్రాంతినాడు దర్శనమిస్తుంది. ఇక్కడి విశేషమిది.

శ్రీనగర్‌కు 27 కి.మీ దూరంలోని పటాన్‌లో శివునికి, సరస్వతికి ఆలయాలున్న ప్రత్యేక ప్రదేశంగా చెప్పాలి.

ఈ "బాణగంగ" వైష్ణవీమాత చరణపాదుకలున్న ప్రదేశం. ఇది కాట్రాకు 12 కి.మీ దూరంలో వుంది.

పూంఛ్‌కు 23 కి.మీ దూరంలో వున్న ఈ ఆలయంలో చెకుముకి రాళ్ళ శివలింగముంది. ఇక్కడ శ్రావణ పౌర్ణమినాడు గొప్ప ఉత్సవం జరుగుతుంది. "దశనామీఖాడే" అను గ్రామంనుండి రజిత దండాన్ని భక్తులు ఊరేగిస్తూ ఇక్కడికి తెస్తారు.

శ్రీనగర్‌కు 40 కి.మీ దూరంలో వున్న గండర్‌బల్ "తుళుముల" ఆలయం. ఇక్కడి గుడికి తలుపులు, ద్వారబంధాలులేవు. అయితే నీటివూటలున్నాయి. ఇవి రాత్రిళ్ళలో రకరకాల రంగులలో చిత్రంగా కనుపించే ఆలయం.

అమరనాథయాత్ర, వైష్ణోదేవి దర్శనం గురించి తెలియనివారులేరు. చూడకపోయినా కనీసం వినేవాళ్ళను మనం చూస్తాం. అమరనాధుడు (మంచులింగం) పెద్ద అమరనాధుడని, రాజపురామండిలో వున్న అమరనాధుడు బుడ్డి (బుఢా) అమరనాధుడని ఈమధ్యనే వెలుగులోకి వచ్చిన నిజం.

పూంచ్ నుండి 23 కి.మీ దూరంలో **'రాజ్‌పూరామండి'** అనే ప్రాంతంలోని పురాతన శివాలయాన్ని **'బుఢా అమరనాథ్'**గా పిలిచి, భక్తులు పూజించుకుంటున్నారు. ఇది లోరన్ నదీతీరంలోవుంది. శ్రావణపున్నమినాడు జరిగే ఉత్సవమిక్కడ చూడదగ్గది. ఈ ఆలయాన్ని శివుడిని చెకుముకిరాళ్ళతో నిర్మించినట్లు తెలుస్తుంది. 'దశనామాఖాడి' అనే గ్రామంనుండి వెండిదండాన్ని వూరేగిస్తూ ఈ ఆలయానికి తీసుకువస్తారు.

పూర్వకాలంలో చంద్రికామహారాణి ప్రతి సంవత్సరము లిద్దరు లోయలో వెలసిన అమరనాధుని పూజించి పులకరించేది. ఒక సంవత్సరము అనారోగ్య కారణంచేత శివదర్శనానికి వెళ్ళలేక బాధపడుతూంటే, పరమశివుడు వృద్ధ రూపంలో వచ్చి ఈ బుడ్డి అమరనాధుని దర్శించమని, లోరన్‌లోయలోని చెకుముకి లింగాన్ని గురించి చెప్పి చిత్రంగా అంతర్ధానమౌతాడు. ఇదీకాక శివుడు పార్వతికి ఆమెకోరిక మేరకు పరమసృష్టి రహస్యమైన జననమరణ విశేషాలను ఇక్కడ నుంచే ప్రారంభించి, తన మంచు లింగం వద్దకు వచ్చేసరికి పూర్తిచేస్తాడుట. అందుకు విద్దరు లోయ, లోరన్ లోయలలోని అమరనాధుడు 'అమర'నాధుడేనని, ఇరువురికి భేదంలేదని చారిత్రక పౌరాణికంగా తెలుస్తుంది.

**ఆల్మోరా**నుండి సుమారు 40 కి.మీ. దూరంలో ఓ కొండపైన **భద్రకాళి ఆలయ** ముంది. ఇచ్చట నది గుహలో నుండి ప్రవహిస్తూంది. ఇచ్చటికి 16 కి.మీ దూరంలో భాగేశ్వరి, పరము, గోమతి నదుల సంగమముంది. ఇక్కడే మార్కండేయముని తపస్సు చేశారు. దీనికి 21 కి.మీ దూరంలో వైద్యనాథ్ క్షేత్రముంది.

**జమ్మూ కాశ్మీరు** మధ్యలో **శ్రీరామవీరేశ్వరాలయ** ముంది. దీనిని 1888 సం॥లో శ్రీరణభీర్‌సింగ్‌నిర్మించారు. ఈ ఆలయంలోని గోడల మీద చిత్రాలు చిత్రంకాదు, చూడదగ్గవి. దీనికి దగ్గర్లో శ్రీరామావీరేశ్వర ఆలయమనే శివాలయమొకటి నిర్మించబడింది. వెయ్యి లింగాలు కల్పి ఇక్కడి ప్రతిష్ఠాలింగాన్ని సహస్ర లింగేశ్వరునిగా పిలిచి, పూజించుకుంటారు.

ఇక్కడనుండి (జమ్ము) 62 కి.మీ దూరంలో మానససరోవరానికి ప్రత్యామ్నాయం లేదా ప్రతిరూపంగా మానసార్ సరస్సు వుంది. శేషనాగుకూడా ఇక్కడే కొలువైవున్నాడు. ఇక్కడ శేషనాగుతోసాటు, దుర్గా, ఉమాపతి, నరసింహ వగైరా ఆలయాలను భక్తితో దర్శించవచ్చును.

**బారాముల్లాలోని మహారాణి శివాలయం** చూడదగ్గది. పూర్వం జలోద్భవుడనే రాక్షసుడు 'నైసార' సరస్సును తన చేతి చిక్కించుకుని ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురిచేసాడు. దాంతో ప్రజలు విష్ణుమూర్తిని శరణువేడగా, ఆయన వరాహరూపమెత్తి తన దంతంతో జలోద్భవుడిని కొండని కదిలించగా, నీరు వూరులోకి రావడం ప్రారంభించింది. ఇతన్ని విడిచిపపెట్టకూడదని రాక్షసాంతకుడైన విష్ణువు ఆతనిని చంపి ప్రజలకు మేలుచేసాడుట. ఈ కథను విని పులకరించిన మహారాణి మోహినీ బల్ సిసోడియా 1915 సం॥లో మహారాణి మోహినేశ్వర శివాలయంగా దీనిని నిర్మించడం జరిగింది. ఈ ప్రాంతమంతా సహజ జలపాతాలు, సరస్సులు, ప్రకృతి రమణీయ దృశ్యాలమధ్య ఈ శివాలయం, ఇటు యాత్రీకులను, పర్యాటకులను ప్రకృతి ఆరాధకులను, పరవశింపచేస్తుంది.

మానససరోవరానికి 2 కి.మీ దూరంలో ఈ **రాక్షస్థల్ సరస్సు** వుంది. దీనిని 'లక్షాత్' అనికూడా పిలుస్తారు. ఇక్కడే మహాశివభక్తుడు రావణబ్రహ్మ త్రేతాయుగ ఆరంభంలో తపస్సు చేసిన ప్రదేశము. 'లక్షాతు' అంటే హంసల ద్వీపమని, శీతాకాలంలో నీరు గడ్డకట్టుకుపోయిన సమయంలో హంసలీ ప్రాంతానికి వచ్చి, ఇతరపక్షులతో కల్పి వలసజీవులవలె తమ సంతానమభివృద్ధి చేసుకుంటాయిట.

శ్రీనగర్‌కు 40 కి.మీ దూరంలో **'పూల్వామా'**లో అనేక దేవాలయాలు ఉన్నాయంటారు. ఇందులో ముఖ్యంగా పేయర్, అవంతీశ్వర్ ఆలయం మొదలైన ఆలయాలు పర్యాటకులకు పనికివచ్చే మతపర, చారిత్రక కట్టడాలు, శిథిలాలయాలు... ఎన్నో ... ఎన్నెన్నో ... మనం దర్శించగలుగుతాం.

లేహ్‌కు 20 కి.మీ దూరంలో **'స్పిటక్' గుహ** వుంది. ఇక్కడి అమ్మ కాళికామాత. ఈ తల్లి ముఖం సంవత్సరం మొత్తం కప్పబడి, ఒక్క సంక్రాంతినాడు మాత్రం భక్తజనులకు ముఖదర్శనం ప్రసాదిస్తారు.

**తీర్థపురి** – జ్యోషిమఠం ద్వారా కైలాస పర్వతానికి వెళ్ళే దారిలో, సట్లెజ్ నదీతీరాన వుంది. ఇక్కడ వేడినీటి బుగ్గలు భక్తులకు ఆనందానుభూతులను ప్రసాదిస్తాయి. ఇక్కడే భస్మాసురుడు శివునిగూర్చి తపస్సు చేసి వరాలు పొందినట్లు చెబుతారు.

లేహ్ జిల్లాలోని **'ఆల్చి'** గ్రామం, దీనికి 'ఇండస్' నదిఒడ్డున సుమారు 70 కి.మీ దూరంలో హిమాలయ పర్వత శ్రేణులమధ్యగల ఈ **'ఆల్చి' మఠం** పర్వతపాదభాగాన మనం చూడగల్గుతాము. గడ్డకట్టుకు పోయే చలిలో, ఇక్కడ మఠాలు, నివాసాలు, తపస్సులేమిటి? అని ఆశ్చర్యపోకండి. దేవుడు కావాలంటే జీవుడు దేహ భ్రాంతిని విడువాల్సిందే. అందుకే ఎముకలు కొరికే, ఆ గడ్డ కట్టే చలిలో దేవునికై ఆరాటం, ఇంకా చెప్పాలంటే పోరాటం. ఇక్కడి ఆల్చి మఠం 11వ శతాబ్దినాటిదంటారు. మఠంలో 'దు–ఖాంగ్, సంత్సెక్' ముంజశ్రీ, ఆలయాలున్నాయి. ఇంకా వీటి గోడలపై బుద్ధుడు, ఆతని బోధనలు, ఇతర దేవతలకు సంబంధించిన చిత్రాలను చూడగల్గుతాం.

జీలం నది జన్మస్థానంలో అతిప్రాచీన శివాలయం **'నాగేశ్వర్'మందిరం.** ఇచ్చటి అమ్మవారిపేరుకూడా నాగేశ్వర్‌తో వస్తుంది– నాగేశ్వరీదేవి.

జమ్ముకు 16 కి.మీ దూరంలో **'శుద్ధ మహదేవు'** అనే ప్రదేశంలో, ఇదే పేరుతో స్వామి ఆలయముంది. అయ్య, అమ్మలపేర్లు ఒక్కటే, శుద్ధమహదేవ్, శుద్ధమహాదేవి. పరమేశ్వరుడు తన త్రిశూలంతో రాక్షససంహారంలో భాగంగా "శుద్ధంతర్' అనే రాక్షసునిపై ప్రయోగిస్తే రాక్షసుని మరణం, త్రిశూలం రెండుముక్కలవడం జరుగుతుంది. ఇక్కడ ఆ త్రిశూలం నిత్యపూజలందుకోవడమొక విశేషం.

**అనంతనాగ్** ఆ పేరులోనే 'అనంతుని' దని తెలుస్తుంది. దీనిని కశ్యపమహర్షి తపస్సు చేసిన ప్రదేశంగా కూడా చెప్పబడుతుంది. ఇక్కడ వేడినీటి బుగ్గలెన్నో వున్నాయి. వాటిలో స్నానం, రఘునాథ మందిర దర్శనం శ్రేష్ఠం. ఇంకా ఇక్కడ ఏకాదశరుద్రుడు, రాధాకృష్ణులు, శ్రీలక్ష్మీనారాయణుల మందిరాలు భక్తులను పరవశింపచేస్తాయి. ఏకాదశ రుద్రుడు శివుని విగ్రహం – నిజంచెప్పాలంటే నయనానందకరమే.

శ్రీనగర్‌కు సమీపంలో **'భదోర్‌నాహ'** అనే ప్రదేశంలోని అతి ప్రాచీన **శివాలయం**, నల్లరాతి విగ్రహం కల్గిన ఈ ఆలయాన్ని 'బా(వా)సుకీనాథ్ ఆలయంగా చెబుతారు. అమరనాథ్‌కు తీసుకువెళ్ళే శివుని శూలము "ఛఢి' ఇక్కడినుండే బయలుదేరుతుంది. జీలం నది జన్మస్థానములో పుట్టిన శివాలయంగా దీనికి విశేష ఖ్యాతి వుంది.

## : : సూక్తులు : :

వేదం మానవ జాతికి పరమాత్మ ప్రసాదించిన ప్రాచీన గ్రంథం. – దాశరధి రంగాచార్య

వేదం భారతదేశంలో వెలసింది, అంతమాత్రాన యిది మన దేశానికే చెందినది కాదు : సమస్త మానవాళికీ చెందినది.

– దాశరధి రంగాచార్య

మానవ జన్మ పరిపక్వతకు, మోక్షానికీ... మనసే ప్రధాన సాధనం. – ఓ సూక్తి

ఉదయం ఆలోచించు, మధ్యాహ్నం ఆచరించు, రాత్రివేళ నిద్రించు – విలియం బ్లాక్

మతంలేని విజ్ఞానశాస్త్రం గుడ్డిది. విజ్ఞానశాస్త్రం లేని మతం కుంటిది. – ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

కృతజ్ఞత గొప్ప సుగుణం మాత్రమే కాదు, అన్ని సుగుణాలకూ తల్లి వంటింది ! – సిసిరో

ఏ మనిషికైనా ఆత్మ తప్ప యింకొక మంచి గురువు ఉండబోదు

– స్వామీ వివేకానంద

దేవుడు లేడని నొక్కి చెప్పేవారు, మళ్ళీ మళ్ళీ దేవుడి గురించి మాట్లాడుతూనే ఉంటారు.

– హేవుడ్ బ్రౌన్

మనిషిని పూజించడం, భజించడం నేర్చావంటే భగవంతుణ్ణి విస్మరించావన్న మాట ! – మహాత్మాగాంధీ

అన్ని ఋతువుల్లోనూ కోయిల కూయదు, అలాగే జీవితంలో అన్ని వేళల్లోనూ ఆనందం లభించదు.

– థామస్ పుల్లర్

అంతరాత్మ ముందుగా మనల్ని ఓ స్నేహితుడిగా హెచ్చరిస్తుంది. ఆపైన ఓ జడ్జిలాగా హెచ్చరిస్తుంది.


– కింగ్ శ్టానిస్లాస్ (పోలెండ్)

కాలం క్షణభంగురమైనది కదా అని, విలువైన క్షణాలెన్నింటినో వ్యర్ధంగా గడిపెయ్యడం అనేది తెలివైనవారు చేసే పనికాదు.

– జాన్ రస్కిన్

దేవుడు మానవ జాతిని అభివృద్ధి చేయడానికి మాత్రమే ప్రేమను సృష్టించాడు. – ఓ సూక్తి

## జార్ఖండ్




ఒకప్పటి బీహారు రాజధాని "రాంచీ" ఇప్పుడు జార్ఖండ్‌లో వుంది. ఇక్కడి, అలాగే రాంచీ పట్టణానికి 140 కి.మీ లోవున్న బెట్‌లా నేషనల్‌పార్క్, రాంచీలు, పర్యాటక సముదాయం పుష్కలంగా వున్న ప్రాంతాలే తప్ప, ఇక్కడ కళాఖండాలు, అపురూప నిర్మాణాలు అగుపడవు. కాకపోతే సముద్ర మట్టానికి 3700 అడుగుల ఎత్తులో వున్న నేత్రాహార్, నిజంగా నేత్రానందం చెయ్యగల ప్రకృతి పులకరించే అందాలసీమ.




ఇక అపురూప కట్టడాలు, కళాదృశ్యాలకు వస్తే, ఈ రాంచీలోని జగన్నాథమందిరం, 300 ఏండ్ల నాటిది. అచ్చు పూరీలోని ఆలయానికి ప్రతిరూపమన్నా ఆశ్చర్యపోవల్సిన పనిలేదు. "బైద్యనాథధామ"మనే పుణ్యక్షేత్రం సంతాల్ (పరగణా) జిల్లాలోవుంది. అలాగే ప్రముఖ జైనక్షేత్రం పాదసనాథ్ – ఓ కొండ మీద



వుంది (రాంచీలు).

"భద్రకాళి" అని పిలిచే "భాదులీ (చాపరస్) భత్రే జిల్లాలో ఛోటానాగపూర్‌లో వుంది. ఇంక ఇక్కడ చూడాల్సినవి, ఎంతసేపు సీతాజలపాతాలు, హండ్రు జలపాతాలు, పంచఘాట్ జలపాతాలుతప్ప, చారిత్రక, పౌరాణిక ప్రాధాన్య మున్న ప్రత్యేక ప్రాంతాలు కాని, రమణీయ శిల్ప కళాసంపదకాని మనం కనలేము.

## సూర్యదేవాలయం - బుండుకు

రాంచికి 39 కి.మీ దూరంలో బుండుకు సమీపంలో ఈ ఆలయముంది. రథాకారంలో నిర్మించబడిన ఈ ఆలయం 18 చక్రాలు, 8 గుర్రాలతో పరుగుపెట్టడానికి సిద్ధంగావున్నట్లు కనబడుతుంది. ఇక్కడో పుష్కరిణి వుంది. ఇందులో స్నానం చేసినవారి సర్వపాపాలు, దోషాలు, తెలిసిచేసినా, తెలియకచేసినా పరిహారమౌతాయి. ఇక్కడ ధర్మశాల వుంది. ప్రకృతి రమణీయతను కూడా ఆస్వాదించగల్గుతాము.

## జగన్నాథ్‌పూర్ దేవాలయం



రాంచికి షుమారు 10 కి.మీ దూరంలో ఈ ఆలయముంది. క్రీ॥శ॥ 1691 సం॥లో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పూరీ జగన్నాథాలయానికి ప్రతిరూపంగా దీనిని తీర్చి దిద్దారు. ఇక్కడ రథయాత్ర పూరీలోవలె జరుగుతుంది. ఈ ఆలయ నిర్మాత 'జగన్నాధపూర్ ఠాకూర్ అవినాధ్ షహాడియా.

## దేవేరీ ఆలయం



రాంచీలోని మరో ఆలయం 'దేవేరీ' అనబడే దుర్గాదేవి ఆలయం. స్థానికులు ఈ దేవతను 'సొల్హాబుజి' అని పిలుస్తారు. దుర్గాదేవికి మరోపేరు, ఈ పేరు. ఇక్కడ మామూలు బ్రాహ్మణ పూజారులతోపాటు 'పహన్స్' అనే గిరిజనపూజారులు కూడా పూజాకార్యక్రమాలను నిర్వహిస్తారు. ఇసుకరాతి స్తంభాలతో వున్న చూడచక్కని ఆలయం.

## అమ్రేశ్వరధామ్ (అంగ్రబడి దేవాలయం)



రాంచీకి సుమారు 40 కి.మీ. దూరంలో ఈ అంగ్రబడి దేవాలయం వుంది. ఇక్కడి ప్రధాన దేవతలు శివుడు, రాముడు, సీత, హనుమంతుడు మరియు విఘ్ననాయకుడైన గణపతి, శంకరాచార్య (ద్వారకా) పీఠానికి చెందిన స్వామి స్వరూపానంద సరస్వతి. ఈ ఆలయం పేరును 'అమ్రేశ్వరధామ్"గా మార్చారు. ఇక్కడ ప్రత్యేక సమయాలలో ఉత్సవాలు కూడా జరుగుతాయి.

## ఛిన్నమస్తాదేవి ఆలయం

దశమహావిద్యలలో ఒక విద్య అయిన ఛిన్నమస్తాదేవి ఆలయం రాంచీకి 18 కి.మీ దూరంలో రాజ్‌రప్ప వద్ద, దామోదర్ భైరవి నదుల సంగమస్థలంలో వుంది. కాళీపూజతోపాటు అనేక సాంప్రదాయ, ఆచార ఉత్సవాలు జరుగుతుంటాయి. ఈ ఆలయదర్శనాకికి, అమ్మ కరుణను పొందడానికి ఎక్కడెక్కడినుండో




భక్తులు వచ్చి తమ సేవలతో అమ్మను పూజించుకుంటారు. ఈ ఆలయం చుట్టూ దశమహావిద్యలైన, తార, షోడశి, భువనేశ్వరి, భైరవి, భగళా, కరాల, మాతంగి, ధూమవతి కాళి మొ॥ ఆలయాలు ఆ తరువాతి కాలంలో నిర్మించబడ్డాయి. ఇచ్చట సంక్రాన్తికి మహోత్సవం జరుగుతుంది. లక్షలాది మంది భక్తులతో కళకళలాడుతువుంటూంది. దసరా ఉత్సవాలు సరేసరి భక్తజనసందోహానికిది నిలయంగా కనబడుతుంది.



## ధన్‌బాద్ - శక్తిమందిరం

ధన్‌బాదుజిల్లాలో వుందీ శక్తిమందిరం. ఇచ్చటి ప్రధానదైవం దుర్గామాత. ఈ మాతను ఓ శక్తిగా, తల్లిగా భక్తులు పూజించి పరవశిస్తారు.

**బైద్యనాథ్ సమీపంలో "9 లక్షల మందిర"మనే శ్రీరాధాకృష్ణుల మందిరం,** బేలూరు 'రామకృష్ణ' మందిరంవలె ఎంతో విశాలంగా, ఆకర్షణీయంగా వుంటుంది. విష్ణు సంబంధిత పర్వదినాలు ఇక్కడ ప్రత్యేకతను సంతరించుకుంటాయి.



**డియోఘడ్‌కు** 10 కి.మీ దూరంలో **తపోవన్** అనే కొండపైన **శివాలయం**వుంది. ఇచ్చట శివుని తపోవంతు మహాదేవునిగా పూజిస్తారు. ఇక్కడ ఎన్నో గుహలు వున్నాయి. ఒక గుహలో శివలింగముంది. ఇచ్చట పగిలిన రాయి హనుమంతుని దివ్యరూపాన్ని చూపిస్తుంది. కొండ ప్రారంభంలోని 'షుక్తకుండ' కొలనులో భక్తులు పవిత్రస్నానం చేసి స్వామి దర్శనానికి వెడతారు. ఈ కొలనులో ఆనాడు సీతాదేవి కూడా స్నానం చేసిందట.

**డియోఘడ్‌కు** షుమారు 13 కి.మీ దూరంలో **త్రికూటపర్వత**ముంది. 2470 అడుగుల ఎత్తులో ఈ



పర్వతముపై మూడు శిఖరాలు వుండటంతో **'త్రికూటపర్వతం' లేదా 'త్రికూటాచల్'** అని పిలవ బడుతుంది. ఈ కొండపైనగల శివాలయంలోని శివుని 'త్రికూటాచలమహాదేవుని'గా భక్తుల పూజలందు కుంటున్నాడు. ఈ పర్వతాన్ని 'మయూరాక్షినది' ముఖద్వారంగా కూడా చెబుతారు.



**హజారిబాగ్** జిల్లాలోని రాతిగుహలను **'ద్వారపాల్ రాతిగుహ'** అని పిలుస్తారు. ఇక్కడి గుహ నిజంగా గుహకాదు. ఒకపెద్ద బండను ఈ రకంగా తీర్చిదిద్దారు. దీని ప్రవేశద్వారమునకు ఎడమప్రక్క ఏనుగుబొమ్మ చెక్కబడింది. రెండవ రాతిగుహ పేరు **'దరుకొత్రి'.** ఈ గుహకు ఎలాంటి ఆకర్షణలుకాని, వింత, అద్భుత చెక్కడాలుకాని వుండవు. మూడవ రాతి గుహను 'గుణబుద్ధ'ని చైత్యముగా చెబుతారు.

ఇదీ చూడవలసిన జార్ఖండ్ చరిత్ర.

తీరా అక్కడకు వెళ్ళాక చూసేవారికి ఇంకా ఎక్కువ దర్శనీయాలు వుండవచ్చును.



హింద్రూఫాల్స్, జార్ఖండ్

# కర్ణాటక




ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ముందుకురుకుతున్న కర్ణాటకలో 20 జిల్లాలున్నాయి. ఎలక్ట్రానిక్ సిటీ ఆఫ్ ఇండియాగా పేరొందిన బెంగుళూరు నగరాన్ని రాజధానిగా కలిగి ఉన్న రాష్ట్రం కర్ణాటక.

కరనుడు అనే పేరుతో ఈ రాష్ట్రానికి కర్ణాటక అని పేరు వచ్చింది. 4వ శతాబ్ధంలో కర్ణాటకను మౌర్యులు పాలించారు. 30 ఏళ్ళు తర్వాత శాతవాహనులు, 300 ఏళ్ళ శాతవాహనుల పరిపాలన అనంతరం కాదంబరులు పాలించారు. ఆరో శతాబ్ధి ప్రారంభంలో చాళుక్యులు, హోయసలాలు కర్ణాటకను  పాలించగా, 14వ శతాబ్దంలో విజయనగర రాజులు, అనంతరం వడయారులు పాలించారు. బ్రిటిష్ పాలనలో కర్ణాటకను హైదరాబాద్, మైసూర్‌లుగా విభజించి రాజరిక పాలన సాగించారు. అనంతరం నవంబర్ 1వ తేదీన 1956లో కర్ణాటక రాష్ట్రం అవతరించింది.

**విస్తీర్ణం : 1,91,791 చ.కిమీ.**　　　　　**ప్రధాన భాషలు : కన్నడం**

**సరిహద్దులు**: పడమరన కేరళ, తూర్పున ఆంధ్రప్రదేశ్, దక్షిణాన తమిళనాడు, కేరళలు, వాయవ్యంగా గోవా, ఉత్తరాన మహరాష్ట్రా, పశ్చిమాన అరేబియా సముద్రం ఉన్నాయి.

## చాముండీ దేవాలయం - మైసూరు

కర్ణాటక అనేసరికి ముందు మైసూరు, తర్వాత బెంగుళూరు జ్ఞాపకానికి వస్తాయి. మైసూరు దసరా ఉత్సవాలకు, బెంగుళూరు ఐ.టి. పరిశ్రమకు ప్రసిద్ధి. చాముండీ దేవాలయం చరిత్ర ప్రసిద్ధిగాంచినది. మైసూరు మహారాజులకు కులదైవం. పురాణ నేపథ్యంగల ఈ తల్లి అసలుపేరు మహిషాసురమర్దని. అతి బలవంతుడు, వరబలగర్వితుడైన మహిషాసురుడు, దేవతాదులను పదవీభ్రష్టులను చేసి ఏడిపిస్తూంటే వాని వరాలలోలేని ఆదిశక్తిగా అవతరించి, అతన్ని సంహరించిన ప్రదేశమిది. ఒకనాటి మహిషాపురం కాలక్రమేణ మైసూరై కూర్చుంది. 1000 మెట్లు ఎక్కి ఈ బంగారు తల్లిని దర్శించాలి. అయితే ఇప్పుడు వాహనాలు, వృద్ధులు వెళ్ళడానికి వీలుగా కొండమార్గం ఏర్పాటు చేసారు.

శ్రీకృష్ణరాజవడయారు కాలంలో ఈ ఆలయానికి మరమ్మత్తులేకాదు, అద్భుత గోపుర నిర్మాణం కూడా కావించబడింది. ఇచ్చటి దసరా ఉత్సవాలు ప్రపంచ ప్రసిద్ధిగాంచినవనడంలో ఏమాత్రం సందేహం లేదు.

**అన్నపూర్ణేశ్వరి ఆలయం చిక్‌మగళూరు** కు 100 కి.మీ దూరంలో వుంది. సేక్షపత్నం రాజైన రుక్మాంగద, తన చిన్నకూతురుకీ గ్రామం అరణంగా ఇవ్వడంతో దీనికి 'చికమగళూరు(చిన్నకూతురు)' అని పేరు వచ్చింది. ఇది పురాతన ఆలయం. పేరుకు తగ్గట్లు ఇక్కడ ప్రతినిత్యం అన్నసంతర్పణ జరుగుతుంటుంది.

## బాదామిలో యాత్రా ప్రదేశాలు



**బాదామి గుహలు :** ఈ "బాదామి" అనేది ఒకనాటి "వాతాపి"కి రూపాంతర నామం. అగస్త్య మహాముని కడుపులో జీర్ణమైన "వాతాపి" పేరు నేడు "బాదామి"గా మారింది. బాదామి కోట ఎదురుగా ఒక కి.మీ. దూరంలో నున్న కొండలో నాలుగు గుహాలయములు నిర్మింపబడ్డాయి. చాళుక్యరాజు, మంగలేశ ఈ గుహా లయాలు పూర్తిగా నిర్మించుటకు సహకరించారు. ఈ గుహలని చేరటానికి 200 మెట్లని ఎక్కాలి.

**మొదటి గుహ** : ఈ గుహశైవులది. ఇక్కడ ముఖ్య మయిన చెక్కడాలు శివుని నృత్యం. రెండు చేతులు గల్గిన వినాయకుడు, మహిషాసురమర్ధిని, ఆర్ధనారీశ్వరుడు మరియు శంకరనారాయణ

**రెండవ గుహ** : ఇది వైష్ణవాలయము, పై కప్పు మీద అనంతశయన, బ్రహ్మ, విష్ణు, శివుడు మరియు అష్టదిక్పాలకుల చెక్కడాలను చూడవచ్చు.

**మూడవ గుహ**: ఇంకొన్ని మెట్లు ఎక్కితే వచ్చే యీ గుహ అన్నింటిలో పెద్దది. ఈ గుహలో శైవుల, వైష్ణవుల చెక్కడాలను చూడవచ్చు. ఇంకా ఇక్కడ స్థంభాల మీద చక్కటి బొమ్మలను చూడవచ్చు. ఇక్కడ త్రివిక్రమ, నరసింహుడు, శంకరనారాయణ, భువరహ, అనంతశయన మరియు హరిహరులను చక్కటి ఫ్రేములలో మలచబడినవి చూడవచ్చును.

**నాలుగవ గుహ**: మూడవ గుహకి దక్షిణ దిక్కుగా వుంది. మహావీరుడు విగ్రహము ఉంది. ఇంకా పద్మావతి మరియు తీర్థంకరుల చెక్కడములను చూడవచ్చు. రెండు మూడు గుహల మధ్యగా ఏటవాలుగా ఉన్న మెట్లన్ని ఎక్కివెళితే దక్షిణ దిక్కుగా ఉన్న బాదామి కోటలో టిప్పుసుల్తాను చేత పెట్టబడిన పాతకాలం నాటి తుపాకి చూడచ్చు.

## కొల్లూరు మూకాంబికా దేవాలయం




కర్ణాటక రాష్ట్రములో ప్రముఖ దివ్యక్షేత్రములలో ఒకటిగా పేరుపొందిన శ్రీ మూకాంబికా అమ్మవారి దేవాలయం మంగుళూరుకు 130 కి.మీ. దూరంలోనూ, ఉడిపికి 70 కి.మీ. దూరంలోనూ ఉన్నది. బళ్ళారి నుండి షిమోగా వెళ్ళి షిమోగా నుండి కొల్లూరుకు బస్సులో కూడా యాత్రికులు వెళ్లవచ్చును. బెంగుళూరు నుండి కొల్లూరు డైరెక్టు బస్ సౌకర్యము కలదు. శ్రీ కొల్లూరు మూకాంబికా దేవి కొల్లూరులో స్వయంభువైన జ్యోతిర్లింగము. పరమేశ్వరుని స్వహస్తలిఖితమైన శ్రీ చక్రముతోడనూ, జ్యోతిర్లింగమును

నిలువుగా రెండు భాగములుగా విభజించుతూ, వామభాగము దక్షిణ భాగము కన్న ఎక్కువగా చూపట్టుచూ 'శక్తి' ఆధిక్యతను చూపెడు "సువర్ణరేఖ" తోడనూ కనుల పండుగగా నిలిచి "శ్రీ కంఠర్లిప్త శ్రీ చక్రమధ్యస్థాయై నమోనమః " అని అర్పింప బడుచున్నది. ఇచ్చట దేవి లింగ దర్శినియై త్రిశక్తి స్వరూపిణిగా ('మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి) ఐక్య స్వరూపమై నిలిచియున్నది. శ్రీదేవి యిచ్చట "జ్యోతి చక్రాసన ముఖ్యపీఠస్థాయై నమోనమః" అని అర్చింపబడుచున్నది.

స్వయంభువైన జ్యోతిర్లింగమునకు ఎదుట భాగమున ఆదిమహాలక్ష్మియైన "ఇష్టదేవత", ఇరు పక్షములందు మహాకాళీ, మహసరస్వతుల ఉత్సవ విగ్రహములతో కూడి యుండునటుల శ్రీ మజ్జగద్గురు ఆదిశంకరాచార్యుల వారిచే ప్రతిష్ఠింపబడియున్నది. తన్ను శరణుని కొలువవచ్చెడు భక్తుల నాశీర్వదించుటకు, "ఇష్టదేవత" పద్మాసనియై, యోగముద్రయందుండి మంత్రమూర్తియై, త్రినేత్రములతో, శంఖ, చక్ర, వరదాభయహస్తములతో కనిపిస్తుంది. శ్రీ మూకాంబిక మోక్షప్రదాయిని, సర్వసిద్ధి ప్రదాయిని, సత్యసంధాయిని, "మహామాతృకరుణామృత శ్రీ మూకాంబికాయై నమః" అంటే సదా కరుణించేది. కృతయుగమునందు కోలమహర్షియను ముని శ్రేష్ఠుడు పవిత్ర హృదయముతో తపమాచరించి, ఈశ్వరుని వశపరచుకొని, తరువాత "పరాశక్తి"ని గూర్చి తపమాచరించి ఆమెను కూడా వశపరచుకొన్నారు. శ్రీదేవి ధర్మరక్షణ సల్పుటకు వాగ్ధానమిచ్చి, మర్త్యలోకవాసినియై, చిత్కళా సంభూతయై, స్వయం భూద్భవజ్యోతిర్మయలింగమందు శివశక్తి స్వరూపిణియై నిలచియున్నది. మూగవారిని, మాట్లాడించడం, అజ్ఞానులను జ్ఞానులుగా మార్చుట చేతను, మూకాసురుని సంహరించినందులకు ఈ దేవికి 'మూకాంబిక'యను పేరు సార్ధకమై నిలచియున్నది.

"నవకోటి మహాదుర్గ సంవృతాయై నమో నమః" అని అర్చింపబడుచున్నది. "ఓం శ్రీ మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతీ ఐక్యరూప శ్రీమూకాంబికాయైనమః" అని ప్రార్థించేవారికి అభీష్టసిద్ధి ఈ తల్లి.

## నందిహిల్స్

60 కి.మీ. సముద్రమట్టం నుంచి 5000 అడుగుల ఎత్తులో ఉంది. ఇది వేసవి విడిది. వేయి సంవత్సరాల కాలంనాటి రెండు శివాలయాలు ఒకటి కొండల మొదలులో, రెండవది నందికొండలమీద ఉన్నాయి. ఈ కొండలపై టిప్పుసుల్తాన్ వేసవి విడిది కలదు. నిలువుగా నుండి 2000 అడుగుల ఎత్తులో ఒక కొండ వుంది. దాన్ని టిప్పు డ్రాప్ అంటారు ఆ రోజులలో దోషిగా ఎంచబడిన నేరస్తులను ఈ శిఖరం నుండి క్రిందకు త్రోయబడేవారనికూడా చెబుతారు. ఈ శిఖరం నుంచి నలుదిక్కుల వున్న గ్రామాలు దివ్యంగా కనిపిస్తాయి. నంది హిల్స్‌లో వాతావరణం వేసవికాలం 29 డిగ్రీలు వరకూ, చలి కాలం 21 డిగ్రీ నుండి 11 డిగ్రీల వరకూ, నందిహిల్స్‌కు 28 కి.మీ. దూరంలో సుబ్రమణ్యేశ్వర టెంపుల్ వుంది.



## విరూపాక్ష ఆలయం



చాణుక్యులను ఓడించిన సందర్భంగా రెండవ విక్రమాదిత్యుని ఇద్దరు భార్యలు మల్లిఖార్జున మరియు విరూపాక్ష ఆలయములను నిర్మించారు. విరూపాక్ష ఆలయాన్ని లోకమహదేవి నిర్మించినది కాబట్టి దీనిని లోకేశ్వర అని పిలిచేవారు. ఈ ఆలయంలో లింగోద్భవం, నటరాజు, రావణానుగ్రహ మరియు ఉగ్రనరసింహుల చక్కటి శిల్పకళను చూడ వచ్చును. ఈ ఆలయాన్ని ద్రవిడ శైలిలో నిర్మించారు.


## హోయసలేశ్వర్

ఈ ఆలయం చూపులను ఆకట్టుకొనే విధంగా వుంటుంది. ఆలయం వేదికపై నుంచుని చూస్తే దేవాలయం వైపుగా చూస్తున్న రెండు నందులు కనపడతాయి. తూర్పుదిక్కున వున్న గణేషుడి విగ్రహం కూడా కనిపిస్తుంది. పెద్ద ఆలయంలో రెండు ఆలయాలు వున్నాయి. మొత్తం గుడికి నాలుగు ద్వారాలున్నాయి. ఇక్కడ ఆలయంలోని శిల్పాలు బేలూరు ఆలయంలో వాటికన్నా పెద్దవి. కొన్ని శిల్పాలు రాతికి రెండు వైపులా రెండు విభిన్న భంగిమలతో చెక్కబడి కనిపిస్తాయి. బేలూరు ఆలయాన్ని దర్శించినవారు ఈ హళిబేడు ఆలయాన్ని తప్పక దర్శిస్తారు. ఈ హళిబేడు హిందూ దేవాలయాలు కేదారేశ్వర మందిరం, జైన మందిరం, రంగనాథ్ ఆలయాలు నగరమధ్యలో వున్నాయి. ఇక్కడ హోయసలేశ్వర్ ఆలయాన్ని మంత్రి కేతుమల్లు 1121 సం॥లో నిర్మింపచేశాడు.

## వైదీశ్వర ఆలయం

కావేరి నది ఒడ్డున ఉన్న తలకాడ అనే ఊరిలో 12 శతాబ్దం నాటి వైధీశ్వర ఆలయం ఉంటుంది. పరమశివుడు ఇందులో పూజలందుకుంటూ ఉంటాడు. ఈ తలకాడ ఊరు గంగా సామ్రాజ్య రాజధానిగా కూడా మంచిపేరు తెచ్చుకుంది. పంచలింగ దర్శనం అనే ఉత్సవం 4-12 ఏళ్ళకొకసారి వచ్చి భక్తులను ఆనందపరవశులను చేస్తుంది.

## నరసింహ ఆలయం



విష్ణు భక్తులకు పుణ్య క్షేత్రమైన నరసింహ ఆలయం కర్ణాటకలోని మెల్‌కోట జిల్లాలో ఉంటుంది. ఈ మెల్‌కోట అనే ఊరికి, 1137లో చనిపోయిన రామానుజాచార్యకి, చాలా సంబంధం ఉంది. ఇక్కడున్న నారాయణ ఆలయంలో నారాయణుడితో పాటు శ్రీరామానుజాచార్యులు కూడా కొలువబడుతుండడం ఒక విశేషం.

ఇక్కడవున్న సంస్కృత రీసెర్చ్ సంస్థ చాలా ప్రసిద్ధి చెందినది. ఇలా ఈ

దేవాలయం గోపురం, లోపల మంటపం ఇక్కడ వున్న శిల్పాలు, శాసనాలు, రామానుజాచార్యుని పూర్వపు సంస్కృతిని తెలియజేస్తుంటాయి.

## సోమేశ్వర ఆలయం



కర్ణాటకలోని గడగ్ జిల్లాలో ఈ సోమేశ్వర ఆలయం వెలిసి వుంటుంది. ఈ గడగ్‌లో 11-12వ శతాబ్దానికి చెందిన ఎన్నో శిల్పాలు, కట్టడాలు ఇప్పటికీ ఇక్కడ కనువిందు చేస్తుంటాయి. ఈ ఆలయంలో పురాతన శైలి చెక్కడాలు, కట్టడాలు అబ్బురపరుస్తూ ఉంటాయి. ఈ రోజుకి కూడా జాగ్రత్తగా వాటిని భద్రపరచి కాపాడుతున్న భక్తులు ఎంతో మంది కనిపిస్తారు.

## భూతనాధ ఆలయం



కర్ణాటకలోని బాదామిలో ఈ భూతనాధ ఆలయం వెలసింది. ఈ ఆలయం ఒక్కసారిగా నిర్మితం కాలేదు. అంచెలంచెలుగా సాగిన ఈ ఆలయ నిర్మాణం, పిరమిడ్ ఆకారం గల దీని గోపురం 6-7 శతాబ్దాలలో జరిగింది. దీని మంటపం, స్థంభం మొ॥నవి 11వ శతాబ్దంలో నిర్మించ బడినవని చరిత్రకారులు చెపుతారు. శేషునిపై శయనిస్తున్న విష్ణుమూర్తిని, ఒక జైన భగవానునిమూర్తిని భక్తులు దర్శిస్తారు. ఈ ఆలయం కట్టడాలు, చాళుక్యుల శైలిలో వుంటాయి.


## గలగనాధ ఆలయం

కర్ణాటకలోని మత్‌ప్రభ నది ఒడ్డున ఉన్న పట్టడకల్ జిల్లాలో 8వ శతాబ్దపు ప్రాచీన కట్టడాలెన్నో ఉన్నాయి. అందులో ప్రముఖమైనది ఈ గలగనాధ ఆలయం, చాళుక్యులచే స్థాపించబడిందని నమ్మకం. ఈ ప్రదేశంలో జనాభా తక్కువగా ఉన్నా, చాలా ప్రత్యేకమైన రాజరికపు ఠీవి కనిపిస్తూ వుంటుంది. ఈ ఆలయ గోపురం, మంటపం మరియు శిల్ప చాతుర్యం కన్నులపండువుగా ఉంటుంది.

## అయివోల్-దుర్గ ఆలయం

అతి పెద్దదైన, ప్రాచీనమైన దుర్గ ఆలయం కర్ణాటకలోని అయివోల్‌లో వెలసింది. చాలా విస్తీర్ణం గల ప్రదేశంలో నిర్మింపబడ్డ ఈ దుర్గ ఆలయంలో, శిల్పకళాచాతుర్యం ఉట్టిపడుతూ, విశేష సంఖ్యలో యాత్రికులను, భక్తులను ఆకర్షిస్తూ ఉంటుంది. ఇక్కడ ఉన్న, పరమశివుడు, నంది, నరసింహ, విష్ణుమూర్తి, గరుడ వాహనం, దుర్గాదేవి, హరిహరుల శిల్పాలు అద్భుతంగా మలచబడి ఉంటాయి. ఈ ఆలయానికి మిస్‌నోమర్ అనే మరో పేరు కూడా ఉంది.

## బుల్ టెంపుల్



15 అడుగుల ఎత్తు, 30 అడుగుల పొడవు గల ఈ నంది విగ్రహము ఈ దేవాలయంలో ఉంది. తూర్పు భారతదేశంలో ఉన్న నాలుగు ప్రధాన నంది దేవాలయాలలో ఇది ఒకటి. ఏకశిలతో నంది విగ్రహం దక్షిణాది శిల్పకళా రీతులతో నిర్మింపబడి ఉండడం విశేషం. ఈ దేవాలయము నకు దగ్గరలోనే గణపతి దేవాలయం, శివాలయం వున్న భక్తులు చూడవచ్చు. బెంగుళూరులోని అతి పురాతన దేవాలయాలలో ఇదొకటి.

## చాముండి హిల్స్

మైసూరు నుండి రోడ్డు ద్వారా 10 కి.మీ. దూరంలో ఈ పుణ్యక్షేత్రము కొండమీద ఉన్నది. సుమారు 1000 మెట్లు ఉన్న ఈ కొండపై ఉన్న దేవత చాముండేశ్వరి. ఈ చాముండేశ్వరి కొండపై 16 అడుగుల ఎత్తు 25 అడుగుల పొడవుగల నంది విగ్రహము దాటితే చాముండేశ్వరి ఆలయం వస్తుంది. దేవాలయం ఉదయం గం.9.00 నుండి గం. 12.00 వరకు సాయంత్రం గం. 5.00 నుండి రాత్రి గం. 9.00 వరకూ ఉంటుంది. మైసూరు సెంట్రల్ బస్సుస్టాండ్ నుండి అనేక బస్సులు ఈ దేవాలయమునకు వెళ్తాయి.

## ఉడిపి శ్రీ కృష్ణ భగవానుడు



కర్ణాటక రాష్ట్రంలోని కన్నడ జిల్లాలకు పశ్చిమంగా మంగుళూరుకు 60 కి.మీ. దూరంలో ఉన్న ఉడిపి పుణ్యక్షేత్రము అనేక దేవాలయాలతో ప్రతినిత్యం లక్షలాది భక్తులతో కళకళ లాడుతూ ఉంటుంది. చారిత్రక ప్రసిద్ధిచెందిన ఈ పవిత్ర స్థలము అనేక పండ్ల తోటలు, కొబ్బరి, పోక చెట్లతో ప్రకృతి సౌందర్యంతో పరవశింపచేస్తుంది. క్రీ.శ. 13వ శతాబ్దంలో శ్రీమధ్వాచార్యులు ఈ పుణ్యక్షేత్రములో శ్రీకృష్ణుని విగ్రహం ప్రతిష్ఠించి నట్లు చెబుతారు.

ఈ క్షేత్రములో శ్రీ మధ్వాచార్యులవారు ఎనిమిది మఠాలు స్థాపించి, రెండు సంవత్సరాలకు ఒక మఠం చొప్పున శ్రీకృష్ణ మందిరంలో పూజా కార్యక్రమాలు నిర్వహించునట్లు, అర్చనలు జరుపునట్లు ఏర్పాటు చేసారు. శ్రీమధ్వాచార్యులు స్థాపించిన 1. పాలిమార మఠం, 2. ఆదమారు మఠం 3. కృష్ణాపుర మఠం, 4. పుత్తిగేయ మఠం 5. సోదె మఠం 6. పేజావర మఠం 7. కాణూర మఠం 8. శిరూర మఠాలకు ఎనిమిది అధిపతులు నియమింపబడ్డారు. వీరు ఈ దేవాలయాన్ని పర్యవేక్షిస్తారు.

ఉడిపి క్షేత్రములలో "మధ్యసరోవర" మహోత్సవం చాలా ప్రముఖమైనది. ఈ మహోత్సవానికి విశేషంగా

భక్తులు విచ్చేస్తారు. ప్రాచీన భారతీయ సంస్కృతి కన్నులకు కట్టినట్లు జానపద నృత్య నాటికలను ప్రదర్శిస్తారు. ఇచ్చటి విశేషం. భక్తుడు కనకదాసు శ్రీకృష్ణదర్శనం చేయబోతే అర్చకులు అంత్యుజుడవు. నీకార్హతలేదని గెంటివేస్తారు. అప్పుడా భక్తుడు ఆర్తితో వెనుకనుండి ప్రార్థిస్తే తూర్పుముఖంగల స్వామి పడమర దిశకు తిరిగి కనకదాసును తన దర్శనంతో కరుణిస్తారు. గవాక్షం నుండి దర్శనం పొందిన ఆనాటి భక్తుల కరుణకు నిదర్శనంగా ఇప్పుడు అందరు కిటికీలో నుండే శ్రీస్వామిని దర్శించాలి. ఏ స్థలంలోనైతే కనకదాసు నిలచి స్వామిని ప్రార్థిస్తాడో, అక్కడ "కనకదాస"మంటపమని, ఒక మంటపాన్ని నిర్మించారు. ఆలయంలో అడుగుపెట్టకూడదనే పూజారుల నియమవిరుద్ధంగా, ఆ మహాభక్తుని స్వామి ఎంత గౌరవించాడో తెలుసుకుంటే, విపరీత పోకడలకు మనం పోక, స్వామి కరుణకు అందరు సమానులేనని తెలుసుకోవడం సర్వోత్తమమని అర్థమవుతుంది. ఉడిపికి ఐదు మైళ్ళ దూరంలో కొండమీద మణిపాల్ స్వర్గధామం పలువురిని ఆకర్షిస్తుంది. ఈ క్షేత్రానికి సుమారు మూడు కి.మీ. దూరంలో సముద్ర తీరం పర్యాటక స్థలంగా పేరు పొందింది.

## గోకర్ణం




కర్నాటక రాష్ట్రంలోని ఈ క్షేత్రములలో సముద్రతీరం గోకర్ణ (ఆవు చెవి) ఆకారంలో ఉండుటవలన ఈ క్షేత్రానికి గోకర్ణమని పేరు వచ్చినది. కల్వార్ నుండి 55 కి.మీ. దూరంలో వుంది. అంకోలానుంచి గోకర్ణానికి బస్సులో వెళ్ళడం మంచిది. గోకర్ణానికి దక్షిణాన హొన్నావర్, దీనికి దక్షిణాన మంగుళూరు వున్నాయి. మంగుళూరునుండి 3 గంటలు, హొన్నవర్‌నుండి గంట ప్రయాణం. బస్సు సర్వీసు మనకు సులభంగా సుఖంగా వుంటుంది. ఈ క్షేత్రము పరమశివుడు ఆత్మలింగం రావణాసురునికి ఇచ్చిన ప్రదేశంగా చెబుతారు. కాశిలో విశ్వనాధ దేవాలయం తర్వాత అంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ దేవాలయంలో విఘ్నేశ్వరుని కూడా భక్తులు దర్శించ వచ్చును. దీనినే మహా లంకేశ్వర దేవాలయంగా కూడా చెబుతారు.

ప్రముఖ దత్త క్షేత్రముగా కూడా గోకర్ణము పేరు గాంచినది. ఆలయానికి వెడుతున్నదారిలో చిన్న సందు వుంది. అక్కడ వున్న తీర్థాన్ని కోటితీర్థమంటారు. ముందు ఇక్కడ స్నానం చేసి, తదుపరి సముద్రస్నానం, ఆ తర్వాత ఒక పాత్రలో తీసుకున్న సముద్రపు నీటితో మహాబలేశ్వర దర్శనం చెయ్యాలి. ఇది ఆనవాయితీ.

భూమిలో సగం దిగబడిన లింగం, రావణుని బలశక్తికి రాసుకుని గాయాలు నెత్తురుతో వుండటంతో, ఆ లింగాన్ని కప్పివేస్తూ రాళ్ళు పేర్చారు. అన్నిటికన్న పైన వున్న రాయి "ఆవు చెవి" మాదిరిగా వుంటుంది. చేత్తో తాకితే లింగబాణం దర్శించవచ్చును. అరవై సం॥లకోసారి ఈ స్వామిని సంపూర్ణంగా (రాళ్ళుచుట్టూలేకుండా) దర్శించవచ్చును.

కోటితీర్థం ఒడ్డున శ్రీకృష్ణ, నరసింహ, చింతామణిగణపతి వారి ప్రక్కన శంకరనారాయణ, వెంకటేశ్వర, శారదాంబ ఆలయాలు, పొలిమేరల్లో భద్రకాళి, వున్నాయి. ఈ క్షేత్రం చుట్టు రామతీర్థం, జటాయుతీర్థాలు, గోగర్భాలున్నాయి. పౌరాణిక ప్రాధాన్యం బాగా కల, బ్రహ్మహత్యాపాతకాన్ని కూడా నశింపచెయ్యగల 'దివ్యక్షేత్రం' ఈ 'గోకర్ణ క్షేత్రం'."కులోట" అనే వూరికి పది కి.మీ. దూరంలో వుందీ క్షేత్రం. సముద్రపుటలలు, ప్రశాంత ఆహ్లాదవాతావరణం అనుభవించేవారికి వీలుగా ఇప్పుడు వసతి, ప్రయాణసౌకర్యాలు వున్నాయి. కాబట్టి ఆసక్తివున్నవారు దర్శించవచ్చును.

## సోమనాధపురం



మైసూరు నుండి 45 కి.మీ. దూరంలోని ప్రముఖ పుణ్య స్థలము సోమనాధపురం. ముగ్గురు మూర్తులు గల ఈ దేవాలయంలో శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ జనార్ధనస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలు ప్రసిద్ధి చెందినవి. ఈ దేవాలయాల మీద రామాయణ, మహాభారత, భాగవత కథలే కాక హోయసల రాజుల చరిత్ర కూడా కనువిందు చేసే శిల్పకళతో చెక్కబడి ఉంటాయి. ఇచ్చటి శిల్ప కళ, అణువణువునా చూపరులను దిగ్భ్రమపొందిస్తుంది. చూడాలనే తపనను కళ్ళు ప్రదర్శిస్తే, కాళ్ళు కదలకుండా కళ్ళను శిల్పాలను చూడమన్నట్లు నిలబడిపోతాయి.

## హాళిబేడు

కర్నాటక రాష్ట్రంలోని ప్రముఖ యాత్రా స్థలమైన బేలూరుకు 14 కి.మీ. దూరంలోనూ, బెంగళూరుకు 185 కి.మీ. దూరంలోనూ ఉన్న మరో ప్రముఖ యాత్రా స్థలము "హాళిబేడు". క్రీ.శ.12,13 శతాబ్దాల కోసలరాజు కాలంలో రాజధాని అయిన ఈ హాళిబేడులో ప్రముఖ హోయసలేశ్వరాలయం అపూర్వ శిల్పకళతో ఇమిడి ఉంటుంది. ప్రశాంత వాతావరణం కలిగిన ఈ దేవాలయమునకు బేలూరు నుండి అరసకేరి నుండి బస్సు సదుపాయం కలదు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఈ దేవాలయానికి దేశనలుమూలలనుంచే కాక విదేశీయులు కూడా వస్తూ ఉంటారు.



ఎంతో శిల్పకళ ఇమిడి ఉన్న ఈ దేవాలయం శిల్పకళ నేర్చుకునే వారికి నిఘంటువు లాంటిది అంటారు. ఎందరో శిల్పకళ నేర్చుకునే విద్యార్థులు ఈ హోయసల దేవాలయములోని శిల్పాల విజ్ఞాన విషయాలను అవగాహన చేసుకునే యత్నం చేస్తారు. సుమారు 100 సంవత్సరాలు పైగా నిర్మాణం చేసిన ఈ దేవాలయం స్వామి వార్ల పేరు సంతలేశ్వరుడు. హోయసలేశ్వరుడు లింగాకారములో ఉన్న ఈ ఈశ్వర ఆలయానికి ఎదురుగా చిన్న నందులు, బైట మంటపంలో మెడచుట్టూ రాతి ఆభరణాలు కలిగి ఉన్న పెద్ద నందులు, నాలుగు ద్వారాలు ఉన్న ఈ దేవాలయంలో శిల్పాలు బేలూరు ఆలయంలోని శిల్పాల కన్నా పెద్దవిగా ఉంటాయి. ఈ హోయసలేశ్వర దేవాలయాన్ని విష్ణువర్ధనరాజు మంత్రి కేతుమల్లు నిర్మించినట్లు చెబుతారు.

వీటిని చూడాలేతప్ప, వర్ణించడం మాటలకు, మనసుకు చాతకాదు. కళ్ళు చూడటంతప్ప, చూడాలనే తప్ప వర్ణించడం చాతకానివి. మన తాతముత్తాతలకు వారి ముందు తరం వారికి జేజేలు పల్కుతూ, చూడలేనితనానికి క్షమించమని కోరుదాం. కనీసం చదువుకుని ఆనందిద్దాం.

## వైట్ ఫీల్డు



బెంగుళూరుకు 25 కి.మీ. దూరంలో ఉన్న సత్యసాయిబాబా వారి ఆశ్రమం ప్రపంచ ప్రఖ్యాతి గాంచినది. సంవత్సరం పొడవు అనేక వేల మంది ఈ వైట్‌ఫీల్డు ఆశ్రమాన్ని దర్శించుకుంటారు. ఆంధ్రా నుంచి బెంగుళూరు వెళ్ళు బాబా భక్తులు ఆ ఆశ్రమంలో బాబా వారిని దర్శించుకుంటారు. బాబా వారి వేసవి విడిది అని కూడా భక్తులు చెబుతారు.

**తలకావేరి :** కావేరినది జన్మస్థలమైన తలకావేరి కర్నాటక రాష్ట్రములలోని మెర్కారా నుంచి 60 కి.మీ. దూరంలో సముద్ర మట్టానికి 4188 అడుగుల ఎత్తున ఉంది. ఈ పవిత్రమైన పుణ్యనదికి బృహస్పతి తులారాశి యందు ప్రవేశించినపుడు (కావేరి) పుష్కరాలు జరుగుతాయి. వేలాది మంది భక్తులు ఆ సమయంలో ఆ గ్రామం దర్శిస్తారు.

## హంపి - విజయనగరం

బెంగుళూరుకు 353 కి.మీ. దూరంలో ఉన్న హంపి – విజయనగరం గురించి చాలా మందికి తెలుసు. ఈ హంపి హోస్పేట రైల్వేస్టేషన్ నుండి 13 కి.మీ. దూరంలో, బళ్లారి ఎయిర్‌పోర్టు నుండి 74 కి.మీ. దూరంలోనూ ఉంది. విజయనగరం సామ్రాజ్య శోభని, శ్రీ కృష్ణదేవరాయల కళావైభవాన్ని చాటి చెప్పే అనేక శిల్పాలు, జ్ఞాపకాలు ఈ నాటికి హంపిలో కనబడతాయి.



**విరుపాక్ష దేవాలయం :** ఈ దేవాలయం శిధిలమైనా నిత్యపూజలు జరుగుతుంటాయి. శివుడికి అంకితమైన ఈ ఆలయంలో స్వామిని విరూపాక్ష లేదా పంపాపతి అంటారు. డిసెంబరు, ఫిబ్రవరి నెలలో ఈ ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఆలయంలో ఉన్న రెండు గణేష్ విగ్రహాలలో ఒకటి గణేష్ ఆలయంలో ఉండగా, వేరొకటి బయట ఉంటుంది. ఇక్కడే విజయనగరం రాజు శ్రీకృష్ణదేవ రాయులు 1513లో నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయం బాగా శిధిలమై ఉంది.

ఇక్కడ స్వామి బాల కృష్ణుడు. ఏక శిలతో నిర్మించిన శ్రీ నరసింహ దేవాలయ మును కూడా భక్తులు చూడవచ్చు. 15వ శతాబ్ధంలో శ్రీకృష్ణదేవరాయులు నిర్మించిన మరొక దేవాలయం "హాజరరామ దేవాలయం" కూడా భక్తులు చూడవచ్చు. ఆలయగోడలపై ఆనాటి శిల్పకళ ఈనాటికి మనం చూడ వచ్చు. పద్మమహాలు, రాతిరథాలు, సప్తస్వరాల స్తంభాలు... చెప్పలేని మధురానుభూతిని కల్గిస్తాయి. విజయనగర రాజుల ప్రాభవానికి జేజేలు పలికిస్తాయి.

విరూపాక్ష ఆలయంనుండి కి.మీ. దూరంలో మతంగ పర్వతం వుంది. దానికన్నముందు ఋశ్యమూక పర్వతం, దీనికి తూర్పుగా 4 మైళ్ళ దూరంలో మాల్యవంతం, తుంగభద్రకు అవతలిఒడ్డున ఒక పర్వతముంది. అది దాటితే ఆనెగొంది. ఇక్కడ నవబృందావనాలున్నాయి. వీటి వివరం, ఈ రచయితే వ్రాసిన శ్రీసద్గురు రాఘవేంద్రస్వామి జీవితచరిత్ర, నిత్యపారాయణగ్రంథంలో గమనించవచ్చును. పడమరగా ప్రవహిస్తూ చెరువులాగ వున్న తుంగభద్రను "పంపాసరోవరం"గా పిలుస్తారు. పంపాదేవి అంటే పార్వతీదేవి మరొక అవతారం.

ఈ పంపాక్షేత్రం పార్వతీదేవి తపంవలన కాశీ, బదరీలతో సమానమైన అత్యంతపవిత్ర పుణ్యభూమియని పద్మపురాణం, సృష్టి పురాణాలలో చెప్పబడింది. అందుకే ఇక్కడి విరూపాక్షస్వామిని "పంపాపతి" అనికూడ పిలుస్తారు.

ఈ క్షేత్ర నిర్మాతయైన విద్యారణ్యులు శృంగేరి శారదాపీఠవిద్యార్థి. అసమాన తపోమూర్తి కాబట్టే శృంగేరి శంకరాచార్య పదవి నధిష్టించి, అనంతరకాలంలో శృంగేరి విరూపాక్ష పీఠాన్ని నెలకొల్పి, విజయనగర నిర్మాణానికి, దానికి కీర్తిప్రతిష్ఠలకు ఆద్యులు, ఆచార్యులు అయ్యారు.

అందరిలోకి శ్రీకృష్ణదేవరాయలకాలంలో విజయనగర సామ్రాజ్యకీర్తిప్రతిష్ఠలు, సిరిసంపదలు, పౌరుషప్రతాపాలు దేశవిదేశాలకు విస్తరించాయి.. ముఖ్యంగా బహమనీ సుల్తానులు "శ్రీకృష్ణ.... అంటే భయపడే స్థితి ఆనాడు ఏర్పడింది. 1665 సం॥ జనవరి 23న తల్లికోట యుద్ధంలో విజయనగరసామ్రాజ్యం అయినవాళ్ళ ఘాతుకాలకు, తురుష్కుల బలప్రదర్శనతో, తలవంచవలసి వచ్చింది.

అప్పటి ప్రాభవంపోయింది.ఎక్కడికక్కడ శిల్పాలు, కట్టడాలు, అందాలభవనాలు, అపురూప నిర్మాణాలు చెప్పుకునేందుకు వీలుగా చరిత్రలో శిథిలంగా నిలిచాయి. నన్నడిగితే అక్కడికి వెళ్ళకూడదు. మనసు-సంస్కారం, కళాభిరుచి, కళ్ళువున్నవాళ్ళు ఆ శిధిలశిల్పాలను, కట్టడాలను చూసి గుండె బాదుకుంటాడు. ఎందుకిటువంటి దుర్మార్గుల కాలంలో జన్మించానా? అని అనుక్షణం బాధపడతాడు.

విదేశస్థులే ఇక్కడ జరిగిన దురాగతాలకు గుండెలు బాదుకున్నారంటే, మనము - ఏరికోరి మన ఇంటిని మనం తగులబెట్టుకున్నట్లు అవతలివారికి ఆస్కారమిచ్చి నాశనమైపోయాం. ఓ నరసింహుడు, ఓ గణపతి, ఓ శివలింగం, ఇలాగ నిస్సహాయులుగా నిలిచిపోయారు. ఒక్క విరూపాక్షుని ఆలయం మాత్రం ఇప్పటికీ చూడదగినదిగావుంది. ఆ నిర్మాణాలు... అంత భారీగా ఎలాగ నిర్మించారో, ఆ భగవంతునికే తెలియాలి.

ఈ దగ్గర్లోని కంపిలి మ్యూజియంలో హంపి శిధిలాలను దర్శించవచ్చును. ఎక్కడికక్కడ అద్భుత కట్టడాలు,

మరింత అద్భుత సాంకేతిక నైపుణ్యం, రాణీగారి స్నానశాల, పద్మమహల్, గజశాల, దసరా దిబ్బ, దీనికి దక్షిణంగా "హజారరామాలయం".

ఇలాగ ఒక్కొక్కటిచూస్తూ, అడుగు కదుపుతుంటే, అంతా యాంత్రికంగా జరుగుతున్నట్లుంటుంది. కళ్ళుచూస్తాయి. దాని కనుగుణంగా కాళ్ళు నడుస్తాయి. తుంగభద్రకు మలుపు తిరిగితే కోదండరామాలయం, అటునుండి విఠలాలయానికి దారి, ఇంకాస్త ముందుకు వెడితే రాతిరథం, అక్కడో మంటపం, దానివెనుక శిధిల విఠలాలయం. ఈ మంటపంలో సంగీత స్తంభాలున్నాయి. వాటిని మనం తడితే సప్తస్వరాలను వినవచ్చును.

ఇది ఒకరోజు, రెండురోజులలో చూసేదికాదు. మనసుపెట్టి, చర్మచక్షువులతో అరంగుళం, అరంగుళం దర్శిస్తే కల్గే ఆత్మానందం దేవుడెరుగు. పడేబాధ మాత్రం అనంతం. అయినా చూడాలి. కొన్ని వందల సంవత్సరాలు ఏకఛత్రాధిపత్యం వహించి శాశ్వతంగా నిలువవలసిన ఈ సామ్రాజ్యం, అనివార్యకారణాలవలన రెండువందల సం॥లలో ముగిసిపోయింది.

## ప్రపంచ చరిత్రకు బహుబలి - శ్రావణ బెళగళ

జైనులు పరమ పావనమైన పుణ్యక్షేత్రముగా భావించే వాటిలో కర్ణాటక రాష్ట్రములోని శ్రావణ బెళగొళ ముఖ్యమైనది. దిగంబర జైనులు పవిత్ర యాత్ర స్థలముగా భావించే ఈ క్షేత్రము కర్ణాటక రాష్ట్రములో హసన్ జిల్లాలో 2000 సంవత్సరాల క్రిందట నిర్మించి నట్లు తెలుస్తోంది. బెంగుళూరుకు 150 కి.మీ. దూరంలోను, మైసూరుకు 96 కి.మీ. దూరములోనూ ఉన్న ఈ క్షేత్రమునకు బస్సు, రైలు సౌకర్యము కలదు. తెలుగు, తమిళ, కన్నడ యాత్రికులే కాక విదేశాల నుండి విచ్చేస్తున్న భక్త జనసందోహము ఇక్కడ విడిది చేయడానికి జైన ధర్మసత్రము. ట్రావలర్స్ బంగ్లాలు కూడా ఉన్నవి. ప్రఖ్యాతిగాంచిన ఇక్కడి బహుబలిని "గోమటేశ్వరుడు" అని కూడా పిలుస్తారు. 59 అడుగుల ఎత్తుగల ఈ బహుబలి విగ్రహం ఇంద్రగిరి పర్వతంపై ఉన్నది. గ్రైనేట్ రాతితో మలచబడినది ఈ విగ్రహం. ఈ విగ్రహం ఐహిక బంధాలను తెంచుకున్న నిర్వికల్పస్థితికి ప్రతీకగా కన్పిస్తుంది. ఏ ఆధారము లేకుండా నిటారుగా నిలబెట్టిన విగ్రహం ప్రపంచంలోనే పెద్దది. శిల్పకళా వైభవాన్ని చాటి చెప్పే ఈ విగ్రహము ఎండా వానలు, ప్రకృతి వైపరీత్యాలు నుండి తట్టుకుంటూ చెక్కుచెదరకుండా ఉంది. నిత్య అభిషేకములు, పూజలు జరుపుకుంటున్న ఈ బహుబలిది విరాట స్వరూపము కావున అభిషేకములు పాదములకు మాత్రమే చేస్తారు. 12 సంవత్సరములకు ఒకసారి మాత్రమే మొత్తం విగ్రహానికి అభిషేకం చేస్తారు.



దీనినే "మహామస్తకాభిషేకము" అంటారు. ఆ రోజున 108 కలశాలతో జలం, కొబ్బరి నీరు, అరటిపళ్ళు,

బెల్లం, నెయ్యి, పాలు, పసుపు, బంగారు నాణెలు మొదలైన వాటితో అభిషేకము చేసిన తరువాత పాదములకు వద్దకు చేరిన వాటిని ప్రసాదంగా భక్తులకు పంచుతారు. కన్నుల పండుగగా కన్పించే ఈ విగ్రహం దర్శించటానికి జనం ఉవ్విళ్లూరుతూ ఉంటారు. ఈ బహుబలి విగ్రహం చూడడానికి వెళ్లే యాత్రికులు డోలి సహయముతో కూడా వెళతారు. "నమోహరిహంతాణం, నమో సిద్దాణం, నమో ఆయిర్యాణం, నమో ఓజ్వాయాణం, నమో లోయినవ సాహునం" అని ప్రార్థించే జైనులు తండోపతండాలుగా తరలి వస్తుంటారు.

## మంగుళూరు - మంగళాదేవి



బెంగుళూరుకు 345 కి.మీ. దూరంలో వుంది. మెర్కారా నుంచి 115 కి.మీ. దూరంలో పశ్చిమ తీరంలో వుంది. ఇక్కడ నౌకాకేంద్రం, సుల్తాన్ బ్యాటరీ, లైట్ హౌస్‌హిల్, మంగళాదేవి ఆలయం, మ్యూజియం వున్నాయి. దగ్గరలో ముదిచిత్ర 20 కి.మీ. దూరంలో వుంది. ఇక్కడ వేయిస్థంభాల మంటపముతో పాటు పురాతన కోట వుంది. ఉడిపికి వెళ్ళేదారిలో 60 అడుగుల ఎత్తులో గౌతమేశ్వరుని విగ్రహం వుంది. ఇక్కడే పద్మనాభస్వామిని చూడవచ్చు. మంగుళూరుకి 25 కి.మీ. దూరంలోవున్న సూరత్ కాల్‌లోనూ 16 కి.మీ. దూరంలో వున్న ఉల్లెయిలలోనూ సుందర బీచ్‌లు వున్నాయి.

నాథ సాంప్రదాయీశుడైన మత్సేంద్రనాథుడు తన భార్య ప్రమీలదేవి పేరుతో ఈ ఆలయాన్ని నిర్మించాడని, భార్య మరణా నంతరం, ఆమెను మంగళాదేవిగా పిలిచాడని, ఆ పేరుతోనే ఇక్కడి అమ్మవారు ప్రసిద్ధిచెందిందని చెబుతారు. దీనికి (మంగుళూరుకు) చారిత్రక, పౌరాణిక నేపథ్యం పుష్కలంగా వుంది.

రామాయణంలోని రాముడు, భారతంలోని సహదేవుడు దీనిని పరిపాలించారుట. అశోకుడు కూడా ఈ ప్రాంతాన్ని పాలించాడు. ఇది పెద్దరేవు పట్టణం కూడా!

అనేక దర్శనీయాలతోపాటు, చారిత్రక శిధిలాలు, పౌరాణిక గాధలు, పోగా మిగిలిన అవశేషాలతో భారత శిల్పకళాచరిత్రను, వివిధరీతులలో ప్రకటించే ఒక సుమనోహర ప్రదేశమిది.

## బేలూరు దేవాలయము

ఇప్పుడు బేలూరు కుగ్రామం. పురాతన కాలములో ఇది పెద్ద రాజ్యానికి రాజధాని. ఆ కాలములలో ఈ రాజ్యాన్ని యాదవ రాజులు పరిపాలించారు. యాదవ రాజులు మొట్టమొదట చాళుక్యుల వారి ఆధీనములో ఉండేవారు. తర్వాత స్వతంత్రు లైనారు. దక్షిణ భారత దేశంలో చోళులు మరియు పాండ్యులు, యాదవులపై

అధికృత పొందారు. యాదవరాజుల్లోని విష్ణు వర్ధనుడు చాళుక్యులను తుదముట్టించాడు. విష్ణువర్ధనుడు చెన్న కేశవుని ప్రధాన ఆలయాన్ని నిర్మించాడని చెబుతారు. ఈ రోజుకి కూడా వేలాది భారతీయులు మరియు విదేశీయులు ఈ దేవాలయం యొక్క శిల్పకళను సందర్శించుటకు విచ్చేయు చున్నారు. ఈ దివ్యప్రదేశమునకు. ఆర్ట్సుకాలేజి విద్యార్థులు ఈ అద్భుతమైన శిల్పకళను చూడకమానరు. ఒక్కొసారి వీరు కొన్ని వారాలకాలం వుండి ఈ శిల్పకళ గురించి తెలుసుకొనుటకు వుండిపోతారు పక్షులు, జంతువులు, నాట్యకత్తె మరియు ఇతర చిత్రములు పూర్తిగా అలంకరింపబడి జీవకళ ఉట్టిపడుతున్నట్టుగా వివిధ భంగిమలలో వున్నాయి ఇక్కడ శిల్పాలు. తల్కండ మీద విజయం సాధించినందుకు గుర్తుగా విష్ణువర్ధనుడు ఈ ఆలయాన్ని నిర్మించారని అక్కడ వ్రాసిన శాసనాల ద్వారా చెప్పబడుతోంది. ఇచ్చటి శిల్పకళ చూచి తీరవలసిందేతప్ప ఇంతగొప్ప అని,



ఎంతగొప్పదో అని అనడం, చెప్పలేనితనమౌతుంది. తనివితీర చూడవలసిన దానిని, తెలుసున్నట్లు వర్ణించడం తెలివితక్కువతనంగా తలవాలన్నది, నా భావన.

ఈ పుణ్యక్షేత్రము శ్రావణ బెలగోలకు 90 కి.మీ. దూరంలోనూ, హసన్‌కు 40 కి.మీ. దూరంలోనూ, బెంగళూరుకు 222 కి.మీ. దూరంలోనూ ఉంది. ఈ క్షేత్రములో స్వామి చెన్నకేశవస్వామి. ఈ దేవాలయము అద్భుతమైన శిల్పకళతో ఇమిడి ఉంటుంది. దేశ, విదేశీయులు ఎక్కువగా సందర్శించే ఈ దేవాలయాన్ని విష్ణు వర్ధనుడు నిర్మించినట్లు చెబుతారు. అనేక మంది విద్యార్థులు ఈ ప్రాంతము సందర్శించి చిత్రకళ గురించి అభ్యసిస్తారు.

శ్రీ రామానుజాచార్యులు సలహా మేరకు విష్ణువర్ధనుడు వైష్ణవ మతాన్ని స్వీకరించి అందుకు గుర్తుగా ఈ దేవాలయాన్ని నిర్మించినట్లు చెబుతారు. మూడు ద్వారాలు గల ఈ దేవాలయం లోపల అందంగా చెక్కబడ్డ స్థంభాలతో, గర్భ గృహము బంగారపు పూత పూసిన రాగి రేకులతో అలంకరించబడి ఉంటుంది.

తూర్పు దిక్కున ద్వారం వద్ద విష్ణు వర్ధనరాజు దర్బారుని, రాక్షసుల రాజు బలి, వామనుడు వరాలు ఇవ్వటం, నంది మీద ఉన్న శివుడు, కృష్ణుని కాళీయమద్దనం, విష్ణువు గరుడ వాహనుడై ఉండడం మొదలగు శిల్పాలు పలువురిని ఆకర్షిస్తాయి.

## గుల్బర్గా

ఇక్కడ ప్రఖ్యాతిచెందిన శరణ బసవేశ్వరాలయం ఉంది, అమ్మవారు బసవేశ్వరి. శక్తి అంశతో కూడుకున్న మహాపూర్‌తాయి అని పిలువబడే అమ్మవారు ప్రతి ఏటా వైశాఖ మాసంలో నగ్నస్త్రీల చేత అర్చించబడతారు, సంతానం కోరే స్త్రీలకు ఇటువంటి మొక్కు ఉంటుందట, ఇక్కడ కూడా ముస్లిం పాలకులనాటి చారిత్రక అవశేషాలు అధిక సంఖ్యలో ఉన్నాయి. బీజాపూర్ నుంచి ఇక్కడకు 159 కి.మీ.

## బిజపూర్

చారిత్రక ప్రాధాన్యతగల ప్రాచీన పట్టణం, గోల్‌గుంబజ్ అనే పురాతన కట్టడం చూడొచ్చు! చాళుక్యరాజుల కాలంలో 'విజయపురం' తర్వాత బీజపూర్ అయింది, (మన బెజవాడ మాదిరి) అల్లావుద్దీన్ ఖిల్జీ దురాక్రమణల ఫలితంగా హిందూ నిర్మాణాల స్థానంలో ముస్లిం ప్రాబల్యం అధికంగా ఉండే నిర్మాణాలు వెలిశాయి. ఇక్కడ మ్యూజియం, ఆర్ట్‌గ్యాలరీ అలనాటి చారిత్రక సాక్ష్యాల్ని కళ్ళముందుంచుతాయి. పార్కులు, చెరువులు కూడా ఎక్కువే! ఈ సమీపంలో చూడాల్సినవి, ఇక్కడకు దగ్గర్లోని ఎలగురులో హనుమాన్ టెంపుల్, అయిహోలలో మల్లికార్జునాలయం, 17 కి.మీ. దూరంలో వున్న పట్టడకాళలో ఐదు ఈశ్వరాలయాలు ఉన్నాయి. అయిహోలలో వసతి ఏర్పాట్లున్నాయి, దగ్గరి ఎయిర్‌పోర్ట్–బెల్గాం.

## హాల రామేశ్వర

చిత్రదుర్గ జిల్లా కేంద్రంనుంచి బస్సులో 40 కి.మీ. దూరం, గంగాదేవిగా వెలసిన అమ్మవారున్నారు, ఇక్కడి పుష్కరిణి నీటిలో ఎన్నో రకాల వస్తువులు అరటిపళ్ళు, మామిడిపళ్ళు, పెరుగన్నం, కొబ్బరి, నెయ్యి, ఆకువక్కలు ... లాంటి వస్తువులు తేల్తూ వస్తుంటాయి. నీరు తెల్లగా పాలవలె ఉంటుంది, ఈ కోనేటిలో నీరు ఏకాలంలోనూ మట్టం తగ్గదు, ఇక్కడ పంచలింగాలు కూడా ఉన్నాయి, ఆలయాలకు పై కప్పులేదు.

## తలక్కాడ్

ఇక్కడ వైద్యేశ్వర స్వామిని దర్శించవచ్చు! ఇది పంచలింగ క్షేత్రాలలో ఒకటి, తల్–కాడ్ అనే ఇద్దరు కిరాత సోదరులు స్వామిని సేవించి మోక్షం పొందారు. ఇక్కడే కీర్తి నారాయణుని గుడి కూడా ఉంది, ఇది కూడా పంచలింగ క్షేత్రమే! బెంగుళూరు నుంచి 130 కి.మీ. లేదా మైసూరునుండి 65 కి.మీ. ఇంకాదగ్గరగా అంటే శివసముద్రంనుండి 24 కి.మీ. బస్సు సౌకర్యం కలదీక్షేత్రానికి. ఇచటి శివుడు పంచముఖాలు, పంచనామాలు, పంచ ఆవరణాలతో, పంచలింగాలుగా దర్శనమిస్తాడు. ఏమిటీ క్షేత్రాలు, వివరాలు అనకండి. ఈ భరతఖండంలో అత్యున్నత మానవజన్మను పొందిన వారు తరించాలనే ఉద్దేశంతో, ఆ పరమేశ్వరుడు తన ప్రతిరూపంగా అందించిన ఈ దివ్య సంపద నర్ధంచేసుకుంటే, ఆతడు తనే అవుతాడనే తపనతో అందించిన మహత్తర అదృష్టం – ఈ క్షేత్ర – తీర్థ సందర్శన, మనకు లభించిన వారసత్వసంపద.

## బసడిహళ్ళి

హళేబీడు హొయసలేశ్వరాలయానికి చేరువగా అరమైలు దూరంలోనే బసడిహళ్ళి ఉంది, ఇక్కడ దక్షిణదిక్కుగా ఉన్న మూడు జైన మందిరాలు గొప్ప శిల్పకళా విలసితమై ఉన్నాయి. పార్శ్వనాథాలయం చూడదగినది. పన్నెండు స్థంభాలున్న ఈ గుడిలోని స్థంభాల్లో మనం మన నీడచూసుకోవచ్చు! నల్లరాతితో చెక్కిన పార్శ్వనాథుడు ఆకర్షణీయ విగ్రహం 14 అడుగుల ఎత్తున ఉంది. తలపై ఏడుతలల సర్పం ఉంటుంది, శిల్పకళకు అద్దం పట్టినగుడిగా దీనిని చెప్పాల్సివుంటుంది.

## పట్టడకల్

మలప్రభ నదీతీరాన ఉన్న ఈ క్షేత్రంలో కడసిద్ధేశ్వర ఆలయం, జంబులింగాలయం, సంగమేశ్వరాలయం, మల్లికార్జునగుడి, విరుపణ్ణ గుడి, పాపనాధేశ్వరుని గుడి దర్శించగలం! జంబులింగాలయం ఇసుకరాతితో చెక్కిన అసంపూర్తి ఆలయం. క్రీ.శ. 696-733 ప్రాంతంలో చాళుక్య రాజైన విజయాదిత్యుడు ఈ సంగేశ్వరాలయం నిర్మించినట్లు తెలుస్తూంది. సంగమేశ్వరాలయంలో నటరాజు, ఉగ్రనరసింహస్వామి విగ్రహాలు మలచినతీరు అద్భుతం, పైకప్పు మీద కూడా విగ్రహాలు చెక్కబడినట్టివైనాన్ని శ్రీశైలం మల్లికార్జునాలయంలో వలె చూడగలం! లింగోద్భవం, నటరాజ, రావణానుగ్రహ శిల్పాలు విరూపాక్షాలయంలో ఉన్నాయి. అన్ని శిల్పాలు ద్రావిడ రీతిలో చెక్కారు, రామాయణ-మహాభారత ఘట్టాలు ఉన్నట్టి పాపనాధ ఆలయం క్రీ.శ. 7వ శతాబ్ది నాటిది.

మొదటి విక్రమాదిత్యుడు శ్రీశైలక్షేత్రానికి పశ్చిమ ద్వారమైన అలంపురంలో శివదీక్షను తీసుకున్నాడు. అందువల్లనే ఈ పట్టడకల్ మల్లిఖార్జునాలయం, శ్రీశైలవాసుని అనుకరించినట్లు కనబడుతుంది. తదనంతరకాలంలో బాదామి చాళుక్యులు పట్టడకల్‌కు 12 కి.మీ. దూరంలోని మహాకూటలో, మహాకోటేశ్వ రాలయలో వృద్ధమల్లిఖార్జునస్వామి ఆలయాన్నికూడా నిర్మించారు. అంటే వీటన్నింటికి ఆదిమూలం శ్రీశైల మల్లిఖార్జున ఆలయమేనని స్పష్టమౌతుంది.

## చిత్రదుర్గ

నాటి ఘటోత్కచుని ఆశ్రమంవున్న ప్రదేశమే ఈ చిత్రదుర్గ. బెంగుళూరుకు 220 కి.మీ దూరంలో వున్న హిల్ స్టేషను ఇది. చారిత్రక ప్రాధాన్యం, పురాణ నేపథ్యంగల ప్రదేశమీ చిత్రదుర్గ.

ఇచ్చట ఎత్తైన కోటలోగల సిద్ధేశ్వర, హిడింబేశ్వర, ఏకనాధేశ్వరి, ఫాల్గుణేశ్వర, గోపాలకృష్ణమూర్తుల విగ్రహాలు పురాణకాల తీపిగుర్తులుగా మలిచారు. ఒకనాటి విజయనగర మండలాధీశుడు తిమ్మన్న, నాయకుడై, నాయక రాజుల కాలంగా, ఈ ప్రాంతం వారి ఏలుబడిలో దిగంతకీర్తి పొందినట్లు ఉజ్వలంగా ఎదిగింది.

ఇక్కడి కోటను మహాద్భుతంగా మదకరి నాయకుడు నిర్మించాడు. ఇక్కడున్న చంద్రవల్లి గుహలు, ఇచ్చటి పెద్ద సరస్సు చూడాల్సినవే. శాతవాహనుల కాలంనాటి మట్టి పాత్రలు నాణాలు లభ్యమయ్యాయి. ఎంతో చారిత్రక, పౌరాణిక ప్రదేశంగా గర్వంగా చెప్పుకోదగ్గ ప్రదేశం.

## మేల్‌కోట - శ్రీకృష్ణదేవాలయం

శ్రీవైష్ణవులకు ఈ క్షేత్రం తిరునారాయణపురం. ప్రతి ఏటా ఫాల్గుణ మాసంలో వైరముడి అనే గొప్పఉత్సవం జరుగుతుంది, చల్లపిళ్ల రాయుడనే పేరుగల శ్రీకృష్ణాలయం ఇక్కడ ఉంది. యదుగిరి కొండ మీద కావేరి తీరానగల ఈ ఆలయం శ్రీమద్రామానుజాచార్య ప్రతిష్ఠ, ఈ ఆలయంలో హరిజనులకు కూడా ప్రవేశం ఉంది. ప్రతిఏటా జరిగే బ్రహ్మోత్సవాలలో చివరి మూడురోజులు హరిజనులకు మాత్రమే దర్శనం ఉంటుంది, మైసూరు నుండి 98 కి.మీ. బెంగుళూరు నుండి 188 కి.మీ. దూరంలో వుందీ ప్రాంతం.

కర్ణాటక - శ్రీరంగపట్నం తాలూకాలోని మేల్‌కోట పవిత్రమైన యాత్రాస్థలంగా చెబుతారు. మైసూరుకు 50

కి.మీ దూరంలో యదుకొండపై వుందీ ఆలయం. ఇక్కడే జైనమతావలంబీకుడైన హోయసాల రాజు విష్ణువర్ధనుని శ్రీరామానుజులు వైష్ణవునిగా మార్చారు. 12వ శతాబ్దంవరకు దివ్యంగా వెలిగిన మేల్కోట, 14వ శతాబ్దానికి ధ్వంసమయింది. ఆఖరికి మహారాష్ట్రులు కూడా, ఈ పట్టణాన్ని ధ్వంసం చేసారు. కానీ, అదృష్టంకొద్దీ ఇక్కడి కృష్ణదేవాలయం మాత్రం తన వైభవాన్ని నిలబెట్టుకుంది. దీనిని "చల్లపిళ్ళ రాయదేవాలయం"గా పిలుస్తారు. తమ దండయాత్రలో భాగంగా అన్ని దేవాలయాలను నాశనం చేసో, మశీదులుగా మార్చో, తమ విధ్వంసాన్ని చాటుకునే మహ్మదీయులు ఇక్కడి కృష్ణ విగ్రహాన్ని ఢిల్లీకి తీసుకువెడితే, దానిని సుల్తాను కూతురు చూసి ముచ్చటపడి, తనకు తెలియని విగ్రహారాధనను ప్రారంభించింది. ఇది ఆమెకు ఆనందం. సుల్తానుకు చిరాకు. ఇటువంటి సమయంలో రామానుజులు అక్కడికి వెళ్ళి విగ్రహాన్ని అడిగితే, కుమార్తెను కాదనలేని సుల్తాను ఇవ్వ నిరాకరిస్తాడు. అప్పుడు రామానుజులు, "కృష్ణా! చల్లపిళ్ళరాయ" అని గొంతెత్తి పిలిస్తే, స్వామి రామానుజుల చేతిలో వ్రాలాడుట. దానిని ఉత్సవ విగ్రహంగా రామానుజులు ప్రతిష్ఠించారు.



ఆ తరువాత కాలంలో కూడ చూడదగ్గ ఆలయం దక్షిణాదివారికే స్వంతమైనట్లు, ఆలయాలు, వాటి నిర్మాణం, అపురూప కట్టడాలు, శిల్పసంపద – "నభూతోనభవిష్యతి" చేసిన నిర్మాణాలు, కళాతృష్ణకు వందన శతాలర్పిస్తూ ఆ వందనీయ క్షేత్రాలను దర్శించే ఆనందాన్ని ప్రసాదించమని, ఆనందనందనుని ప్రార్థిద్దాం.

## నంజనగూడు - దేవాలయం

మైసూరుకు 18 కి.మీ. దక్షిణంగావున్న ఒక చిన్న అందమైన పట్టణం ఈ నంజనగూడు. ఇక్కడి స్వామిని 'నంజుండేశ్వరు'డంటారు. శ్రీకంఠేశ్వరుడని చెబుతారు. శివుడు విషం త్రాగడంవలన కంఠం నల్లనైందని, శివుడిని పై విధంగా పిలుస్తారు. స్వామి పేరే, వూరికి పేరయ్యింది.



ఇది చోళులకాలంనాటిదిగా చెబుతారు. ద్రావిడశైలిలో నిర్మింపబడింది. గర్భగుడిలో మైసూరు మహారాజు మూడవ కృష్ణరాజువడయారు స్థాపించిన శివలింగాలు కనుపిస్తాయి.

దీని సమీపంలో కౌండిన్య నది గట్టున పరశురామాలయం వుంది. ఈ ఆలయ దర్శనం చేస్తేనే నంజునగూడు యాత్ర పూర్తి అయినట్లు. ఇక్కడే పరశురాముడు తన మాతృహత్యాపాపం పోగొట్టుకోవడానికి తపస్సు చేసాడని, ఇచ్చటి మట్టి ఔషధానికి

మిన్నగా సర్వరోగ నివారిణిగా పనిచేస్తుంది. ఇందుకు నిదర్శనంగా, ఈ మట్టిని తన ఏనుగుకంటికి వ్రాసి ఓ భక్తుడు దాని గుడ్డితనాన్ని పోగొట్టుకున్నాడని – అలాగే --

ఇచ్చటి శివుడు నేత్రదృష్టి ప్రదాతగా కూడా చెబుతారు. క్షేత్ర ప్రాశస్త్యము, పవిత్రత, శిల్పకళ సంపద సర్వము దర్శనీయమని భక్తుల వుద్దేశం.

## శృంగేరి

శృంగేరినే "శృంగగిరి" అని కూడా అంటారు. ఇక్కడ 12 రాశి చక్రాలుగల స్థంభాలు ఉన్నాయి. సంవత్సరములో ఒక్కోనెల ఒక స్థంభం మీద సూర్యకాంతి పడుతుంది. అలా సంవత్సరం పొడవున 12 స్థంభాలు మీద సూర్యకాంతి



పడుతుంది. భక్తుల వసతికి శృంగేరి మఠం వారి సత్రము, ట్రావెలర్స్ బంగ్లాలు ఉన్నాయి. ఆదిశంకరులు ప్రతిష్ఠించిన పీఠాలలో మొదటిదిది. చెప్పుకోదగ్గ శైవక్షేత్రం, గొప్ప ఆధ్యాత్మిక నిలయం కూడా! అద్వైతమతాచార్యులైన శంకరులు (జగద్గురు ఆదిశంకరాచార్యులు) శృంగేరిలో నివసిస్తూ స్థాపించిన ఆధ్యాత్మిక పీఠం. హిందువులకు వీరి వాక్కు శాసనం. ధిక్కరించడానికి వీలుకాని మహోన్నత పీఠం. రాజాధి రాజులే వీరి శాసనాలకే తలవంచారు.

పవిత్ర తుంగభద్రానది తీరంలో ప్రస్తుతం శారదా మాత ప్రతిష్ఠించిన ప్రదేశంలో, ఒక పాము పడగవిప్పి ప్రసవించే కప్పను, సూర్యరశ్మి నుండి కాపాడింది. ఆ దృశ్యం చూసిన శంకరులు మహదానందపడ్డారు. ఇటువంటి ప్రదేశంలో కనుక ఆధ్యాత్మిక మఠం నిర్మిస్తే ప్రజలంతా సుఖసంతోషాలతో వుంటారని, శారదా పీఠాన్ని, ఇక్కడ శృంగేరిలో ప్రతిష్ఠించారు.

ఈ పీఠానికి తొలి అధిపతి శ్రీశంకరుల శిష్యులు శ్రీ సురేశ్వరా చార్యులవారు. ఆనాటి నుండి నేటివరకు దినదిన ప్రవర్ధనమౌతూ, ఎందరినో చెంతకుచేర్చుకుంటూ, ఆధ్యాత్మికాభివృద్ధిలో ముందంజలో వుంది.

14వ శతాబ్దంలో హరిహరరాయలు, బుక్కరాయల పాలనాకాలంలో ఇచ్చటి మఠం, ఆలయాలు, అలాగే వారు నిర్మించిన "విద్యాశంకర దేవాలయం", ద్రావిడ, హొయసాల సంస్కృతులకు నిలయంగా నిర్మించబడ్డాయి. ప్రస్తుత పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ భారతీతీర్థస్వామి ఈమధ్యనే ఆంధ్రదేశాన్ని ఆశీర్వదిస్తున్నట్లు అడుగడుగున పర్యటించి, అర్థులకు తమ ఆశీస్సులు నందించారు.

ఆరవ శతాబ్దంలో జైన, బౌద్ధాలు, విపరీతంగా ప్రచారంపొంది, తూర్పు ఆసియా దేశాలకు పాకి, ఆర్షసనాతన ధర్మానికి, వేదసంస్కృతికి తూట్లు పడే సమయంలో ఆవిర్భవించిన ఆదిశంకరులు, తమ అతిచిన్న 30 సం॥ల జీవితంలో అఖండ భారతాన్ని ముమ్మారు పర్యటించి, ధర్మప్రతిష్ఠాపనం గావించారు. ఆయా దేవతలను ఉగ్రంనుండి శాంతిపథానికి మళ్ళించారు.

రామానుజులు, మధ్వులు వలెనేకాక అఖండభారతావనిలోని ధర్మం యావత్తు సద్ధర్మంగా మెలగాలని శివ–

కేశవ, గణాపత్య, శాక్యాయ... అనే పద్ధతులు, వాటి భేదాలను ఎత్తిచూపకుండా సర్వదేవతా ప్రియుడై దేవతలనందర్నీ వారివారి పేర్లతోనే స్తుతించారు. వేదసంస్కృతిని, ఆర్షధర్మాన్ని ప్రతిష్ఠింపచేసారు. ఈ ధర్మ ప్రతిష్ఠాపనలో భాగంగా–

తూర్పున (పూరీలో) గోవర్ధనపీఠం, ఉత్తరాన బదరిలో జ్యోతిపీఠం, పశ్చిమాన ద్వారకలో కాళికాపీఠం, దక్షిణాన ఈ శృంగేరీలో శారదాపీఠం నిర్మించారు. వీరందరిని "శంకరాచార్య" అని పిలవడమొక ఆచారమైంది. పైవాటికితోడు "కంచిపీఠం"కూడా, ఈ దక్షిణాదిలో ధర్మప్రతిస్థాపనకు నిలిచింది.

ఋష్యశృంగుడు జన్మించిన ప్రదేశం కావున దీనికి "శృంగగిరి"అని, కాలాంతరంలో "శృంగేరి" అని ప్రసిద్ధి పొందింది. ఈ పర్వతంపైగల మల్లికార్జునునిలో, ఋష్యశృంగుని తండ్రి విభాండకులవారు ఐక్యమైతే, ఋష్యశృంగుడు ఇక్కడికి దగ్గర్లోగల "లిగ్గ" అనే వూరిలోని శృంగేశ్వరస్వామిలో లీనమయ్యాడు. అంటే చారిత్రక, పౌరాణిక నేపథ్యాలుగల ప్రదేశం ఈ శృంగేరి.

## కాలడి

త్రిశూరుకు నలభైఅయిదు కి.మీ. దక్షిణంగాను, ఎర్నాకులానికి 30 కి.మీ ఉత్తరంగాను గల "కాలడి" గ్రామంలో క్రీ.శ. 790వ సం॥ వైశాఖ శుద్ధ పంచమినాడు శివగురు, ఆర్యాంబ దంపతులకు వరప్రసాదునిగా జగద్గురు ఆదిశంకరాచార్యులవారు జన్మించారు. ఆతరువాత కొంత కాలానికి తండ్రి మరణిస్తే – అయిదవ ఏట తల్లి ఆర్యాంబ శంకరులకు ఉపనయనం చేయించింది. శంకరుల ధారణాశక్తి అపురూపం, అమోఘం.

అవతార పురుషులైన స్వామి ఒకనాడు పూర్ణానదిలో స్నానం చేస్తుంటే, ఒక మొసలి ఆయన కాలును పట్టుకుంది. "అమ్మా! నేనిలాగవుంటే మరణించాలి. అదే సన్యసిస్తే కొన్నాళ్ళు నీకు ఆనందం కల్గిస్తాను. చెప్పు. మరణమా... సన్యాసమా?" అనేసరికి బిడ్డడి జీవనాన్ని కోరే తల్లి "సరే సన్యసించ"మంటుంది. అందుకు శంకరులు మరల నాకు జన్మనిచ్చిన నీకు అంత్యకాలంలో చెంతచేరి, నీ చింత తీరుస్తానంటాడు.

అలాగ ప్రారంభించిన ప్రస్థానంలో శంకరులు నర్మదాతీరానికి వచ్చి అక్కడ "గోవింద భగవత్పాదుల"ను దర్శించి, వారి ఆదేశంతో గౌడపాదులవద్ద యోగ, తత్వశాస్త్రాల నభ్యసించారు. అదే "అద్వైత"సిద్ధాంతానికి ప్రచారమూలము, స్ఫూర్తి అయింది. శంకరవిజయానికి నాందికూడా అయింది.

శంకరులు ప్రయాగలో కుమారిలభట్టును దర్శిస్తే వీరి మనస్సును తెలుసుకున్నవాడై మండనమిశ్రుని వద్దకు వెళ్ళి మీ అద్వైతప్రచారం సాగించమంటారు. మండనమిశ్రునితోపాటు, ఆతని భార్యకూడ ఉద్దండురాలే. ఆమె మధ్యవర్తిగా వాదం ప్రారంభమవుతుంది. శంకరులముందు తన భర్త ఓడిపోతున్నాడని తలచి––

"బాల్యంనుండి సన్యాసిగా జీవించే మీరు గృహస్థాశ్రమధర్మాలపై... అని ఆగి, భర్తను గెలిపించుకుంటుంది. మండనమిశ్రుడు పరిస్థితినర్థం చేసుకుని, శంకరులకు శిష్యుడౌతాడు. ఆతడే శృంగేరిపీఠ "సురేశ్వరాచార్యు"లనబడే శంకరాచార్యులు.

13, 14 శతాబ్దాలు శృంగేరి చరిత్రకు సువర్ణాధ్యాయంగా చెప్పాలి. పద్మపాదుడు, హస్తామలక, త్రోటక సుర్వేశ్వరులు శ్రీశంకరుల శిష్యులు. విద్యారణ్యులు కూడా కాలక్రమంలో ఈ పీఠాన్ని అధిష్ఠించారు. ఇచ్చటి ఆలయాలు, వాటి శిల్పసంపద, కట్టడాలు కనువిందు చెయ్యడంకాదు, కళ్ళు తెరచుకుని చూసేటట్లు చేస్తాయి.

ఇటు ఆధ్యాత్మిక, అటు కళాభిరుచి, ఇటు ప్రశాంతత, అటుముక్తి కోరేవారు తప్పక చూడవలసిన దివ్యక్షేత్రం ఈ "శృంగగిరి" అనే శృంగేరి పీఠానికి అధిపతులౌతారు.

## ధర్మస్థళ్

జైన సాంప్రదాయం పుణికిపుచ్చుకున్న ఈ ఆలయ నిర్వాహకుల నిర్వహణలో లింగాకారశివుని, వైష్ణవ సంప్రదాయ అర్చకులు, అర్చించడం హిందూదేశ మత సామరస్యానికి ప్రతీకగా కనబడుతుంది. ఈ ఆలయ నిర్వాహకులు జైనమతస్థులైన హెగ్డే కుటుంబీకులు. ఇంకో తమాషా ఏమిటంటే తరతరాలుగా అంటే సుమారు అయిదువందల సం॥గా వీరు ఈ ఆలయాన్ని నిర్వహిస్తున్నారు.

దీనికి ఒక కమిటీ, ట్రస్టు లేదా ప్రభుత్వ అజమాయిషీ ఏమీలేదు. సర్వహక్కులు హెగ్డేవారివే. ఈ ఆలయం దాని ఆస్తులు వీరివే. అయితే వారి కుటుంబంలోని, ఆ తరంలోని జ్యేష్ఠుడు ఈ ఆలయానికి అధిపతి. ఆలయ నిర్వహణ సదుపాయాల కల్పన బాధ్యతగా ప్రవర్తించడం తప్ప, మాదేనని ఇష్టారాజ్యంగా వ్యవహ రించడం తగదు. మంగుళూరు నుండి 70 కి.మీ దూరంలో ఈ 'ధర్మస్థల' వుంది. కర్ణాటకలోని ప్రతి ముఖ్యమైన వూరినుండి ఇక్కడికి బస్సు సౌకర్యం వుంది.




నిజానికి ఇది ఒక చిన్న గ్రామం. అయినా వచ్చిన భక్తులను ఆదరించే తల్లిగా, ఆలయనిర్వహణలోని సత్రాలు భక్తులకు వసతిని, వంటసామాగ్రిని, బియ్యం మొదలైనవాటిని ఇస్తారు. ఈ స్వామిని "మాటతప్పని స్వామి" అనీ, 'ఇచ్చిన వరం నిలబెట్టుకునేస్వామి' అని చెబుతారు. ఇక్కడికి కి.మీ దూరంలో గల నేత్రావతిలో స్నానం చేసి స్వామిని దర్శించుకొనడమొక ఆనవాయితీ.

ఈ "ధర్మస్థళ్" అసలుపేరు "కుడుమ". అయిదువందల సంవత్సరాలక్రితం "నెల్యాద్రిగృహం"లో బ్రహ్మన్న హెగ్డేగారు వుంటుండేవారు. ఒకనాటి రాత్రి జైనమతధర్మదేవతలు, బ్రహ్మన్నను "నెల్యాద్రిగృహం" ఇవ్వమని కోరుతారు. వారి అభీష్టం మేరకు తమ వసతిని ఇచ్చి తాము వేరే చోటవుంటూ, ఈ నెల్యాద్రిన జైనమతధర్మ దేవతలు విగ్రహాలనుంచి పూజించుకుంటూంటే, మరల స్వప్నదర్శన మొసగి తమకు విడివిడిగా ఆలయాలు కట్టించి ఉత్సవాలు జరిపించమని కోరతారు. అలాగే చేస్తాడు కానీ ఈ ఆలయంలో అర్చకత్వం చెయ్యడానికి ఎవరూ ముందుకురాని సమయంలో అప్పన్న అనే తమ దూతద్వారా "కద్రి" అనే ప్రాంతంనుండి శివలింగం తెచ్చి ఇవ్వడంతో, దానిని బ్రహ్మన్న ప్రతిష్ఠింపచేసాడు. దాంతో అర్చకులు తమ వైదిక కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ శివుడే మంజునాథుడు.

16వ శతాబ్దంలో "సోదె" మఠాధిపతి శ్రీవాది రాజతీర్థులవారు దైవనిర్ణయంగా ఇక్కడికి వచ్చారు. బ్రహ్మన్న ఆ స్వామిని తమ ఆలయాన్ని దర్శించి, భిక్ష స్వీకరించమని కోరుతాడు. ఇది అన్యమతస్థులు ప్రతిష్ఠించినది కనుక

తాము రాలేనంటారు. అయితే తామే ప్రతిష్ఠించమని బ్రహ్మన్న వినయంగా కోరుతాడు.

ఆ రకంగా స్వామివారు రాజతీర్థులవారి వలన రెండోసారి ప్రతిష్ఠించబడతారు. శ్రీవైష్ణవులు పూజారులవుతారు.

ఈ కుడుమ 'ధర్మస్థళ్' అవుతుంది. ఈ మంజునాథుడు సర్వభక్తజన ఆరాధ్యుడౌతాడు. ఇటువంటి సనాతన ధర్మసమ్మతమైన ఈ దివ్యక్షేత్రం దర్శించి, తరించగల్గడం ఉత్తమోత్తమం, క్షేమం.

## కుక్కి సుబ్రహ్మణ్యం

కర్ణాటకలోని ఏకైక ఈ "సుబ్రహ్మణ్య" క్షేత్రాన్ని ప్రతినిత్యం వేలాదిమంది భక్తులు దర్శిస్తుంటారు. ఇక్కడి దేవుని "కుక్కి సుబ్రహ్మణ్యం" అంటారు. చాంద్రమానం ప్రకారం, ఆంధ్రతోపాటు, కర్ణాటక, పశ్చిమ తీర ప్రాంతీయులు చాంద్రమానాన్ని అనుసరిస్తూండటంవల్ల మార్గశిర శు॥ షష్టిని, సుబ్రహ్మణ్య షష్టి – స్కందషష్టి" అని వ్యవహరిస్తూ మహోత్సవంగా పూజాది ఉత్సవాలు నిర్వహిస్తారు.

ఈ కుక్కి సుబ్రహ్మణ్యాన్ని చేరడానికి మంగుళూరు నుండి ఓ నూరు కి.మీ., ధర్మస్థళ్ నుండి 60 కి.మీ., హసను నుండి 90 కి.మీ వుంటుంది. అయితే బస్సు సౌకర్యం అన్నిచోట్ల నుండి వుండటంవల్ల ప్రయాణానికేమీ ఇబ్బంది వుండదు.

ఈ వూళ్ళో "ధారానది" అనే ఒక చిన్న వాగు వుంది. ఇదే కుక్కి సుబ్రహ్మణ్యానికి పేరు ప్రతిష్ఠలు పెట్టింది. ఈ స్వామి దర్శనం, ధారానది స్నానం, సర్వరోగాలను హరిస్తుంది. దీంతో ప్రతినిత్యం వందలలో, పర్వదినాలలో వేలలో భక్తులు వస్తూం టారు. మాతృశాపగ్రస్థుడైన వాసుకి శివుని పూజిస్తే, ఇక్కడవుండ మని, అనంతరకాలంలో నా కుమారుడు నీకు తోడుగా వుంటాడని, నేను లింగరూపుడనై "కుక్కిలింగ"మని పేరున ప్రసిద్ధుడనౌతానని, నిన్ను దర్శించిన వారికి సర్వరోగాలు నయమవుతాయని, అభయంగా, వరమిస్తాడు.




"తారకాసుర" సంహారానంతరం, కుమారస్వామి ఈ ధారానదిలో తన శూలాన్ని కడుగుతాడు. ''అపవిత్రః పవిత్రోవా..." అన్నట్లు శుద్ధియైన శూలంవలెనే ఈ ధారానదిలో స్నానంచేసిన వారి సర్వపాపాలు పరిహరింప బడతాయి. ఇది పౌరాణికంగా ఎంతో ప్రాశస్త్యమున్న ప్రదేశం.

శాపగ్రస్థయైన అదితి, శ్రీకృష్ణుని కుమారుడు సాంబుడు అలాగే పరశురాముడు, ఈ ధారానదిలో స్నానం చేసి తమతో పాటు భక్తులుకూడా పవిత్రులయ్యేట్లు అనుగ్రహిస్తారు.

## శ్రీరంగపట్నం - టిప్పుసుల్తాను రాజధాని

మైసూరుకు 18 కి.మీ దూరంలోవుంది. చూడవలసిన ప్రదేశం. శ్రీరంగపట్టణంలో శ్రీరంగనాధస్వామి పురాతనుడు, సనాతనుడుకూడా! స్వామి ఆదిశేషునిపై పవళించివుంటే, పాదాలచెంత గౌతమ మహర్షి వుంటారు. ఇక్కడ టిప్పుసుల్తాను భవనం, ఆయన మరణించిన స్థలం, కోటప్రాంతంలో చెన్నకేశవస్వామి ఆలయం వున్నాయి. అలాగే చాముండేశ్వరీ



ఆలయం, జగన్మోహన్ పాలెస్‌లో వున్న మ్యూజియం ఇచ్చటి పెద్దనంది విగ్రహం, భారత దేశంలోని ప్రముఖ నందులలో మూడవదిగా చెప్పాలి. ఇక్కడే లలిత మహల్ పాలెస్ వుంది. ఒకప్పుడిది మహారాజుల వేసవి విడిది. ఇప్పుడు అయిదు నక్షత్రాల హోటలు.

మహారాజ భవనం చూచి తీరాల్సిన సుందర భవనం. 1880 సం॥లో నలభై లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించారు. ఇప్పుడా నిర్మాణం నలభై నుండి అరవై కోట్లపైమాటగానే చెప్పాలి. ఇక్కడ ఈ భవనాన్ని చూడడానికి గైడ్లు వున్నారు. వారి సహకారంతో వివరంగా చూడవచ్చును.

ఇది దేవీభాగవతం ప్రకారం "మహిషు"డనే రాక్షసుని ఆ జగదాంబ సంహరించిన ప్రదేశం. ఆ రోజులలో దీనిని మహిష పురమనేవారు. కాలక్రమేణ అది 'మైసూర'యి కూర్చుంది.ఆ తర్వాత ఇక్కడ చూడవలసింది 28 కి.మీ దూరంలోని బృందావన గార్డెన్సు.

ఒడయారు వంశస్థులు దాదాపు అయిదువందల సం॥లు ఈ మైసూరును పాలించారు. 1399 సం॥లో గుజరాతులోని ద్వారకనుండి ఇక్కడికి వచ్చిన యదురాయడు, కృష్ణరాయడు అను రాజకుమారులు. మేల్కోటేలో గల "శ్రీనారాయణ" అనే స్వామిని సేవించుకోవడానికి వచ్చి, కోడి భైరవేశ్వరుని ఆలయంలో ఆ రాత్రి పడుకున్నారు. అప్పుడు వారు విన్న మాటలప్రకారం తమ వునికిని చెప్పి, తాము తప్పక మారనాయకుని శిక్షించి, తమ రాకుమార్తెను



తమకు అప్పగిస్తామని చెప్పి మహారాణికి వాగ్దానం చేసిన మేరకు రాకుమారిని అప్పగిస్తారు. ఇటువంటివారు తన కల్లుడవడం క్షేమదాయకమని తలచిన మహారాణి, వారిలో పెద్దవాడైన యదురాయనికి తన కుమార్తెనిచ్చి వివాహం జరిపించింది. దీంతో మైసూరులో ఒడయార్ వంశజుల పాలనకు శ్రీకారం చుట్టబడింది. అప్పట్లో వీరు విజయనగర రాజులకు సామంతులు. 1610 సం॥లో విజయనగర రాజ్య పతనమయ్యాక రాజా ఒడయార్ కాలంలో మైసూరు స్వతంత్ర రాజ్యమయింది. అప్పుడు శ్రీరంగపట్నం మైసూరుకు రాజధాని.

1799 సం॥లో అయిదేళ్ళ కృష్ణరాజ ఒడయార్‌మహారాజ సింహాసనం అధిష్ఠించడంతో, రాజధాని మైసూరుకు మార్చబడింది. దినదినాభివృద్ధి గాంచింది. దసరా ఉత్సవాలకు మైసూరు పెట్టింది పేరు. ఆ రాజదర్బారు, ఆ ఉత్సవాలు ఇప్పటికి చూడవలసిందే! వూరు, కట్టడాలు, చారిత్రక, పౌరాణిక నేపథ్యం, ప్రతి ఒక్క యాత్రీకుని ఆనందసాగరంలో ముంచెత్తుతుందనడంలో ఏమాత్రం అతిశయం కనబడదు. అంత చూడదగ్గది, ఆనందించదగ్గది.

**ఇతర దర్శనీయాలు :**



**హోయసలేశ్వరాలయం – హళేబీడు** (పాతపట్నం) అమరశిల్పి జక్కన్న కుమారుడు డక్కణచేత అద్భుతాలు సృష్టించుకున్న అపురూప శిల్పకేంద్రం.వీటి వర్ణనకన్నా ప్రత్యక్షంగా భగవంతుడిని కళ్ళతో చూడగల్గడం నిజంగా అదృష్టం. 1121 విష్ణువర్ధనుని సేనాని కేతుమల్లుడు ఈ ఆలయ నిర్మాణం ప్రారంభించాడు. ఇది పూర్తవడానికి 105 సంవత్సరాలు పట్టిందిట. విశాలమైదానంలో నిర్మించిన ఈ నిర్మాణంలో కనిపించేది ఒక ఆలయం. వున్నవి విడివిడిగా రెండు ఆలయాలు. ఒకటి హొయసలేశ్వరుడ, రెండవది శాంతాలేశ్వరుడు.రకరకాల జంతువులతో ఆలయగోడలు చెక్కబడ్డాయి. ప్రతిదీ పరమాద్భుతమే ఇది .. అని ఎన్ని... ప్రత్యేకత దేనిని చెప్పలేము.గణేశుని నాట్యం, పరమశివుని తాండవం, కైలాసాన్నెత్తే రావణుడు, దశావతారాలు, రామాయణ దృశ్యాలు ... అన్ని ... ఎన్ని ... అని చెప్పలేము. చూసేవారిది అదృష్టం. చూడగల్గడం మహత్తరదృష్టం.



హుబ్లీ వద్ద గల 'నవల్గుండ్' తాలూకాలో **అన్నిగెరిలో** గల **శ్రీఅమరేశ్వరస్వామి దేవాలయం** పురాతనమైంది. ప్రకృతి శోభలతో శోభాయమానంగా కనువిందు చేసేది. ఇక్కడ శిల్పకళా, దాని సృష్టి అపురూపమని చెప్పాలి. ఈ అమరేశ్వర దేవాలయంతో పాటు, ఇక్కడ అమృతేశ్వరస్వామి దేవాలయం కూడా వుంది. దీనిని కల్యాణ చాళుక్యుల కాలములో నిర్మించి నట్లు చరిత్ర చెబుతోంది. దేవాలయములో ఎన్నో పురాణ గాథలు దర్శనమిస్తాయి. ఆలయంపైకప్పు 76 స్తంభాల మీద ఆధారపడివున్నట్లు నిర్మించారు. ఇచ్చట శిల్ప కళావిన్యాసం, అనుక్షణంకాదు, అంగుళం అంగుళం ప్రత్యేకించి చూడదగ్గది.

కాద్వరజిల్లా, కేంద్రంలో **'ఇడుగంజి'** ప్రాంతంలో **"ద్విభుజగణపతి"** ఆలయముంది. ఇది త్రేతాయుగంనాటిదిగా చెబుతారు. శరావతినది ఒడ్డున వున్న స్వామిని విఘ్నవినాయకునిగా తలంచి, శ్రద్ధగా పూజిస్తారు.

రాయచూరు జిల్లా నారాయణపేటకు 28 కి.మీ దూరంలో **'కాళేబెళగొంది'** అను క్షేత్రంలో **'శ్రీబనదవీరేశ్వరు'నిగా** కొలువబడుచున్న శ్రీవీరభద్రేశ్వరస్వామి ఆలయముంది. ఈతడిక్కడ లింగరూపుడు. గర్భాలయమంలోని శివలింగం 40 సం॥కొకసారి 9 అంగుళాలకు రాగానే, మరల ప్రతిష్ఠ జరుగుతుంది.



మంగుళూరుకు 3 కి.మీ దూరంలో **'బొలారా'** అనే **మంగళాదేవి ఆలయము** వుంది. ఒకప్పుడు దీనిని మంగళాపురమనేవారు. అదే కాలక్రమంలో 'మంగుళూరు'అయింది. ఈ ఆలయాన్ని నాధసాంప్రదాయీశుడైన మత్స్యేంద్రనాధుడు నిర్మించినట్లు స్థలపురాణం చెబుతోంది. ఇక చరిత్ర ప్రకారం చూస్తే తులనాడును, కుండవర్మ పరిపాలించేరోజులవి. ఒకనాడు గోరఖ్‌నాధుడు, మత్స్యేంద్రనాధుడు దర్శించి 'రాజా! నీవు అదృష్టవంతుడివి. నీ రాజ్యము భోగభాగ్యముల సుసంపన్నమైంది. ఒకప్పుడు మంగళాదేవి ఉండేది. ఆమెను అర్చించి, తరించమంటే, ఆమె వివరాలు కోరతాడు. అప్పుడువారు ఒక ప్రాంతానికి రాజును తీసుకువెళ్ళి త్రవ్వించగా, అక్కడ మంగళాంబిక విగ్రహం లభిస్తుంది. అక్కడనుండి ఆ వూరిని మంగళాపురం, ఆ తదుపరి మంగుళూరును చేసింది.



బెంగుళూరుకు 90 కి.మీ దూరంలోని **కోలారులోని 'కోలారమ్మ గుడి'** గ్రామదేవత. ఇక్కడి గుడిలోని వినాయకుడు ప్రత్యేక స్వరూపుడు. ఒకవైపు నుండి చూస్తే గణపతిగాను, మరొక వైపునుండి చూస్తే గరుత్మంతునిగాను దర్శన మిస్తాడు. ఇంకొకవైపునుండిచేస్తే హనుమంతుడై ముచ్చటగా మూడు రూపాలతో నయనానందం కల్గిస్తున్నాడు.



కోలార్‌జిల్లాలోవున్న ముల్‌బాగల్ నుండి 6 కి.మీ దూరంలోని **'కురుడుమెలె'లో** విజయనగరరాజుల చేత నిర్మించబడి 12 అడుగుల ఎత్తుగల సాలగ్రామ **విఘ్నేశ్వరుడు** దర్శించదగ్గవాడు. ఈ స్వామిని గంగ, చోళ, హోయసాల రాజులు కూడా శ్రీస్వామిని అర్చించినట్లు శాసనాలలో వుంది. ఊరు చిన్నదేఅయినా, స్వామికోసం ఎందరెందర్నో రప్పిస్తుందీ గ్రామం.

**మురుదేశ్వరస్వామి :** ఉత్తర కర్ణాటక్‌లోని ఉత్తరాన జాతీయ రహదారికి 2 కి.మీ దూరంలో శ్రీమురుదేశ్వరస్వామి ఆలయము వుంది.ఇక్కడి విచిత్రం మూడు వైపుల అరేబియా సముద్రం, 'కందుక' అనే కొండపై 23 అంతస్తులతో 249 అడుగుల ఎత్తులో అలరారుతోంది.123 అడుగుల ఎత్తుగల ఈ సుందర విగ్రహం మలచడానికి దాదాపు 2 సంవత్సరాలు పట్టిందట. సూర్యరశ్మి పడినప్పుడీ విగ్రహం ధగద్ధగాయమానంగా మెరుస్తుంది.

రావణుని మోసంచేసి ఆత్మ లింగాన్ని గోకర్ణంలో ప్రతిష్ఠింపచేసిన దేవతల దుర్మార్గానికి కోపంతో తాను ఆత్మలింగాన్ని భద్రంగా వుంచుకోవడానికి ఏర్పాటు చేసుకున్న పెట్టె దానికి కట్టిన వస్త్రము, నిరుపయోగమయ్యాయని తలచి, విసిరేస్తే, అది శివప్రభావం తగ్గని శక్తిగా, ఇక్కడ పడుతుంది. మురుదేశ్వరునిగా ప్రఖ్యాతమవుతుంది.

ఇంకా శనేశ్వరదేవాలయం వగైరాలను ఇక్కడ దర్శించవచ్చును. ముఖద్వారం వద్ద పెద్ద పెద్ద ఏనుగుల శిల్పాలు... ఇవి, అవి... అని చెప్పడంకాదు, తీరా చూడగల్గడం, చూసిదానికి పరవశించడం చేయాలి.

**హోరనాడు అన్నపూర్ణేశ్వరి :** చిక్‌మగళూర్‌కు 100 కి.మీ దూరంలో హోరనాడు, అక్కడగల అన్నపూర్ణేశ్వరి దేవాలయం ప్రకృతి పరిసరాలు చూడదగ్గవి. ఆలయాన్ని దర్శించిన వారందరికి అమ్మవారి అన్నప్రసాదమందించ బడుతుంది.



శృంగేరికి 2 కి.మీ దూరంలో **'కిగ్గా'** గ్రామంలో **ఋష్యశృంగ మహర్షి** ఆలయముంది. కరువుకాటకాలతో సతమతమయ్యే రోమపాదుని రాజ్యంలో అడుగుపెట్టేసరికి కేవలం వర్షాలే కాదు, ఆ ప్రాంతమంతా సస్యశ్యామలమౌతుంది. ఇక్కడే ఋష్యశృంగులు తమ దేహముక్తి గాంచారుట. ఇక్కడి శాసనాలలో ఈ దేవుని పేరు 'కిల్గలింగేశ్వర' లేదా 'కిల్గదేవర' అనివున్నాయిట. ఇక్కడి శివలింగంపై కొమ్మువలె ఒక రుద్రాక్ష వుంటుంది. శృంగేరి వెళ్ళినవారు తప్పక దర్శించే పుణ్యప్రదేశమిది.

**అమృతేశ్వరస్వామి, అమృతపురం :** ఇదీ చిక్‌మగళూర్ సమీపంలోనిదే. 67 కి.మీ దూరంలో వున్న ఈ ఆలయాన్ని అమృతేశ్వర దండనాయక హోయసాలరాజు, రెండవ వీరబల్లాల్ నిర్మించినట్లు తెలుస్తోంది. 11-12 శతాబ్దాలలో హోయసాల రాజులు మనలాటికి దగ్గర్లో అనేక నగరాలు, పట్టణాలు వాటిలో అత్యద్భుతమైన ఆలయాలు నిర్మించారని, అన్నీ దగ్గర్లో వున్నా, కళాదృష్టి సృష్టిలో మాత్రం వేటికవే ప్రత్యేకతను సంతరించుకుని వాటి ఔన్నత్యాన్ని చాటుకుంటున్నాయి. ఇప్పుడు మనం దర్శిస్తున్న అమృతేశ్వరస్వామి ఆలయం తాటి, కొబ్బరి తోపులు (తోటలు) మధ్యవుంది. ఆలయ గోడలపై గల అద్భుత శిల్పాలు అద్భుతాలు. అనన్యసామాన్యాలు, అపురూపాలనే



చెప్పాలి. మండపం బయటిగోడలపైగల దాదాపు 140 పలకలుపై భారతీయ ఇతిహాసాలు, పెద్దపెద్ద శిల్పాలు, దక్షిణ వైపు గోడపై 70 పలకలపై రామాయణగాథ, ఉత్తరంవైపు శ్రీకృష్ణచరిత్ర, మరో 45 పలకలపై మహాభారత గాథతోపాటు, కన్నడ కవి జన్నసాహితీ సౌరభాలు, కవితలు కూడ చెక్కబడ్డాయి.

చిత్రం -- **చిత్రదుర్గ లో హిడింబకు ఆలయం**, 7 దుర్గాలతో 7 ప్రాకారాలతో కోట లోపలిభాగంలో 18 దేవాలయాలు, 10 ద్వారాలు, 38 ప్రవేశమార్గాలతో అద్భుతంగా వుండెకోట నిజంగా దుర్గమేననవచ్చు. ఆనాటి వారి అద్భుత నిర్మాణ శక్తికి నిజంగా మనం నీరాజనాలర్పించాలి. అంత దుర్గమంగా, ఆ దుర్గం ఈనాడు మనకి కనుపిస్తుందంటే ఆనాడు ... వూహించుకోవలసిందే తప్ప వర్ణించడమసాధ్యం.



ఇక ఈ కోటలో సిద్ధేశ్వర, ఏకనాధేశ్వరి, ఫాల్గుణేశ్వర, గోపాలకృష్ణ, హిడింబేశ్వర ఆలయాలున్నాయి. పురాణగాధ ప్రకారం చరిత్రను గమనిస్తే మహాభారతంలోని హిడింబ (భీమునిభార్య), ఆమె అన్న హిడింబాసురుడు ఇక్కడే వుండేవారని అన్న రాక్షసప్రవృత్తి చెల్లెలు నిశాంతప్రవృత్తి వలన సోదరుడు భీముని చేతిలో మరణించాక, తాను భీమునివలచి, పెండ్లి చేసుకుంది. వారు సంచరించిన ప్రాంతమవడంతో, గుర్తుగా ఇక్కడ హిడింబేశ్వర ఆలయం, మిగిలిన ఆలయాలతోపాటు రూపుదిద్దుకుంది.

ఈ కోట **చిత్రదుర్గ** పేరుకు తగ్గట్లు ఎంతో దుర్గమంగా, వూహలకతీతంగా కనబడుతుంది. నాల్గవ కోట దాటాక గణపతి ఆలయం, ప్రక్కనేగల చిన్నగుట్టపై లింగేశ్వర ఆలయం, రాతి దీపపు స్తంభం, ఉయ్యాల కొక్కాలు, వసంతకోనేరు, పాడుబడ్డ కట్టడాలు, సిద్ధేశ్వరీదేవి ఆలయం, ఇంకా ముందుకు వెడితే చెరువులు, అక్కడున్న గుట్టలపై వేణుగోపాలస్వామి ఆలయం వున్నాయి. అంతేకాదు మశీదుకూడా వుంది. దీంతో సర్వమత సమానత్వం ఇక్కడ చోటుచేసుకున్నట్లు ప్రస్ఫుటంగా కనబడుతుంది.

**సౌందత్తి ఎల్లమ్మ (రేణుకా) దేవి :** బెల్గాం జిల్లా సౌందత్తికి 5 కి.మీ దూరంలో కొండపై ఈ తల్లి దేవాలయముంది. నిజానికీమె జమదగ్ని మహర్షి భార్య, పరశురాముని తల్లి 'రేణుకామాత'. ఎల్లమ్మగా జనపదాలలోను, రేణుకగా నాగరీకులు పూజిస్తుంటారు. గ్రామదేవతగా ఈ తల్లి పూజలందుకుంటుంది. కర్ణాటక, గోవా, మహారాష్ట్రలలో ఈ ఎల్లమ్మ దేవాలయాలు, ఒకనాటి దేవదాసీవ్యవస్థ వుండేది. కాలక్రమంలో దేవదాసీవ్యవస్థ కనుమరుగవుతోంది కానీ ఆలయాలు, అర్చనలు, పోతరాజుల వీరంగాలు మామూలుగానే వున్నాయి.

**కూడలసంగమ – బసవేశ్వరుడు :** భగల్‌కోట జిల్లా, కృష్ణా, మలప్రభా నదుల సంగమప్రాంతంలో, ఆల్మట్టికి 15 కి.మీ దూరంలో శ్రీబసవేశ్వరాలయం వున్న కూడల సంగమముంది. దీనిని 'కప్పడిసంగమ'మని కూడా పిలుస్తారు. మహాశివభక్తుడు బసవేశ్వరుడు పుట్టిన భూమి. 12వ శతాబ్దంలో ఈ మహనీయుడు అత్యంత కీర్తిగడించిన ప్రతిభాశాలి. లింగాయిత మతానికి మూలపురుషుడైన బసవేశ్వరుడు నందీశ్వరుని అవతారంగా తలిచేవారు. అందుకే బాల్యం నుండి శివభక్తికల్గి గొప్ప జ్ఞానిగా ప్రకాశించాడు.



**సొండూరు – సుబ్రహ్మణ్యుడు :** సొండూరు నుండి 10 కి.మీ దూరంలోవున్న లోహగిరి అనే కొండపై వుంది. ఒకనాటి స్కందపురం నేటి సొండూరు. రాక్షసగురువైన శుక్రాచార్యులు శివపుత్రుడు సుబ్రహ్మణ్యేశ్వరుని



బలహీనపరచాలనే వుద్దేశ్యంతో, రాక్షసులపైగల ప్రేమతో అందాల సుందరీమణులను సృష్టించి, స్కందునిపైకి పంపుతాడు. అందుకు విముఖత చూపే కుమారస్వామి ఈ లోహగిరికి వచ్చి స్థిరపడుతాడు. సీతాన్వేషణ సమయంలో శ్రీరాముడు, అనంతరం పంచపాండవులు, లింగాలను ప్రతిష్ఠించి, సేవించారని స్థలపురాణం చెబుతుంది.



**బెంగుళూరుకు** 60 కీ.మీ దూరంలో నారాయణ యతి సమాధిపై వెలసిన అద్భుతాలయం **'కైవారం తాతయ్య ఆలయం'గా** ప్రసిద్ధిచెందిన ఈ యతి కీర్తనలు అక్కడ ప్రదర్శిస్తున్నారు. దీనికే బ్రహ్మాండపురి, ఏకచక్రపురమని పేర్లున్నాయని తెలుస్తోంది.

పానాజీకి 78 కి.మీ, పాండాకు 48 కి.మీ దూరంలో **'తంబిడి సుర్లా'** ప్రాంతంలోని **మహదేవ ఆలయం** 1175-76 సం॥ల కాదంబరాజైన శివబెత్తా పెర్మిగారిరాణి కమలా దేవి తన సత్కార్యాలతోపాటు ఈ ఆలయనిర్మాణం చేసారని చెబుతారు. ఇచ్చటి రాయి మెత్తగా వుంటుంది. ధృఢంగాను వుంటుంది. ఇంతటి విశిష్ట ప్రాచీన ఆలయం ఈ ప్రాంతంలో చూడబోము.



**బీదర్‌లోని 'జారణీ శ్రీనరసింహస్వామి ఆలయం'.** ఇది నీటి ఒరవడితో ఏర్పడిన ప్రకృతి ప్రసాదిత లేదా దైవ నిర్మాత సహజ గుహాలయంతప్ప మానవనిర్మితంకాదు. ఈ దైవాన్ని దర్శించాలంటే అరకిలోమీటరు నీటిలో సాగితే ఆ నీరే స్వామిని చూపి ధన్యులను చేస్తుంది. నీరు ఎక్కడనుండి వచ్చేది అనూహ్యము.

పూర్వం జరాసురుడనే భక్తుడు తన తపోసిద్ధితో ఈ ప్రాంతాన్ని సృష్టించుకుని తపోమూర్తి అవుతాడు. హిరణ్యకశిపుని వధానంతరం స్వామిని, జరాసురుడుని కూడా వధించమని మునులు కోరగా సంహరించాడు. ఎంతైనా రాక్షసుడు రాక్షసుడేననేసరికి నరసింహస్వామి ఇతనివద్దకు వచ్చి భక్తికి మెచ్చి, అమరత్వం తప్ప ఏమైనా కోరుకోమంటాడు. భగవత్‌శక్తిని గుర్తించలేని భక్తుడు నరసింహస్వామితో పోరాడి మరణిస్తూ 'నువ్వు ఇక్కడే వుండమంటాడు. ఆ రకంగా నరసింహుడు జరనరసింహునిగా నిలిచి, భక్తజనులను సంరక్షించడం, ఆశ్రితులను ఆదరించడం చేస్తున్నాడు.

**నందిదుర్గలోని 'భోగనందీశ్వ'రాలయం** ద్రవిడ వాస్తు రీతిలో కొండమీద 1200 సంవత్సరాల క్రితం నిర్మించబడింది. ఒకనాటి ఈ నందికొండలప్రాంతం 'ఆనందగిరి'గా, ఇప్పుడు 'నందిదుర్గ'గా పిలువబడుతుంది. ఇక్కడ శివపార్వతుల ఆలయముంది. ఇక్కడి కోట టిప్పుసుల్తాన్‌చే నిర్మించబడింది. ఇక్కడున్న చెరువును కల్యాణిసరస్సుగా వ్యవహరిస్తారు.

మైసూరుకు 40 కి.మీ దూరంలో **సోమనాథపూరు**, అక్కడి **చెన్నకేశవస్వామి ఆలయంతోపాటు, జనార్దన వేణుగోపాలస్వామివార్ల ఆలయాలను** చూడగల్గుతాము. రామాయణ, మహాభారత, భాగవతగాధలు, హొయసాల రాజుల చరిత్ర చూడగల్గుతాము. హళేబీడు, బేలూరు శిల్పకళ, హంపీని మించినట్లు కనిపిస్తాయి. అమరశిల్పి జక్కన్న నిర్మితమైన ఈ ఆలయం, అందలి శిల్పసంపదను అసూయపట్టలేని మహ్మదీయులు నాశనంచేస్తే, ఇప్పుడా ఆలయాలలో ధూపదీపనైవేద్యాలు లేవుకాని, పర్యాటకులకు మాత్రం తనివితీరని కన్నుల పండువ, మానసికానందం ప్రసాదిస్తున్నాయి. ఇక్కడి విశేషం వేణుగోపాలుని నోట్లోని వేణువును ఎక్కడ తట్టినా మధురమైన నాదం మనసులను దోచుకుంటుంది.

**పావగడ శనైశ్చరాలయం :** ఇది చాలా పురాతనమైంది. ప్రసిద్ధిపొందినది. అత్యంత కళాత్మకంగా, నిత్యధూప దీప నైవేద్య నీరాజనాలతో విలక్షణంగా వుండే ఆలయ దర్శనం దర్శించదగ్గది. ఆంధ్రకర్ణాటక సరిహద్దులో వుంటంవలన ఉభయ రాష్ట్రాలవారితో ఆలయం రద్దీగా వుంటుంది. ఈ ఆలయదర్శనం, స్వామి సందర్శనంవలన సకల రుగ్మతలు తొలగి, ప్రశాంతత చేకూరుతుందనేది భక్తుల అనంత విశ్వాసం.





బెంగుళూరులోని **బసవనగుడి** ప్రాంతంలోని **విఘ్నేశ్వరుడు** విశ్వకల్యాణమూర్తిగా చెప్పాలి. సింహాచలం అప్పన్నకు చందనం అద్దినట్లు, ఈ గణపతికి 100 కిలోల వెన్నను అద్ది 3 రోజుల తర్వాత, ఆ వెన్ననిచ్చిన భక్తులకు వొలిచి ఇస్తారుట. అసలు విషయం ఇక్కడి వినాయకుడు పెరుగతూ వుంటాడు. అందుకైనా ఒకసారి వెళ్ళిదర్శిద్దాం, రండి!

**కూడ్లి నరసింహస్వామి**, ప్రహ్లాదుడు తపస్సు చేసిన ప్రదేశం, గాలవ్య మహర్షి తపస్సు చేసిన దివ్యప్రదేశం. తుంగ, భద్ర నదుల సంగమప్రదేశమైన ఈ వూళ్ళో 'శృంగేరి వారి మఠం నిత్యభోజనాదులతో 'శృంగేరీ దర్శనం కూడ్లి భోజనం" మరువరానిదన్నమాట నిత్యసత్యం. ఈ ఆలయానికి సమీపంలో హొయసల శైలిలో రామేశ్వరాలయం, సంగమేశ్వరా, భవానీశంకర, శారదాంబ ఆలయాలు దర్శించవలసినవి. సంగమేశ్వరాలయం, పేరుకు తగ్గట్లు, ఎల్లప్పుడూ గర్భాలయంలో నీరు నిలిచివుంటుంది.



**శింజనకోట కోదండరామాలయం**, **కొళక్కంలోని** సౌతె **గణపతిమందిరం** చూడదగ్గవి. ఒక్కటేమిటి? ఇలాగ ఎన్ని ఉన్నాయో ఆ దేవునికే తెలియాలి.



**లక్కుండి, ఐహోల :** ఈ రెండు చోట్ల ప్రత్యక్ష సూర్య నారాయణమూర్తి దేవాలయాలున్నాయి. గదగ్ నుండి 10 కి.మీ దూరంలోని లక్కుండిలో శ్రీసూర్య నారాయణమూర్తి దేవాలయం, అతి పురాతనమైంది, 11 శతాబ్దంలో కల్యాణ చాళుక్యులు 101 దేవాలయాలు నిర్మించారని, అందులో ఈ ప్రత్యక్ష భగవానుని ఆలయ మొకటిగా చెబుతారు. ఇంచుమించు ఈ ఆలయాల కన్నింటికి జక్కనాచార్యులు పర్యవేక్షకుడని చెబుతారు. ఎన్నో ఆలయాలు శిథిలమై పోగా, ఆనాటి వైభవానికి కళాతృష్ణకు నిదర్శనంగా నాగనాథ, నీలకంతేశ్వర, విద్యాశంకర నారాయణ, కుంభా కేశ్వర, విరూపాక్షేశ్వర, హాలుగంటి బసవేశ్వర, మల్లి కార్జున, చంద్రమౌళీశ్వర, వీరభద్రేశ్వర, బ్రహ్మజి జైన దేవాలయాలు, ఈ సూర్య దేవాలయాన్ని మనం చూడగల్గు తున్నాము.

బీజాపూరు నుండి 130 కి.మీ దూరంలో **ఐహోల** ప్రత్యక్ష భగవానుడైన **శ్రీసూర్యనారాయణమూర్తి దేవాలయం,** 7వ శతాబ్దిలో చాళుక్యులచేత నిర్మింపబడింది. ఇచ్చట స్వామి తన దేవేరిలు ఉష, పద్మిని సమేతుడై అశ్వారూఢునిగా ఉన్న విగ్రహం మనం దర్శించగల్గుతాము. ఇటువంటి విగ్రహాలలో ఇదే ప్రథమమని, ఇటువంటివి అరుదని చెప్పక తప్పదు.



**ముక్తినాగక్షేత్రం, రామోహల్లి :** చూడటానికి చిన్నదైనా జాతీయ రహదారిలోవున్న ముక్తినాగక్షేత్రము ఇది. 16 అడుగుల 36 టన్నుల బరువుకల్గి ఏడు పడగలతో చుట్ట చుట్టుకున్న అద్భుత నాగేంద్ర శిల్పం ఏకశిలావిగ్రహం. ఇక్కడ ఎన్నో నాగప్రతిమలున్నాయి. ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన నాగవిగ్రహంగా ఈ క్షేత్రం ప్రసిద్ధిచెందింది. వివాహం కానివారు, సంతానంలేని, ఆయురారోగ్యములు కోరువారు తప్పక దర్శించవలసిన క్షేత్రం.



**హిందూపూరు**కు 15 కి.మీ దూరంలో ఈ **విదురాశ్వత్థక్షేత్రం** వుంది. విదురుడు తీర్థయాత్రలు చేస్తూ ఇక్కడికి వచ్చి మైత్రేయులవారు గురువుగా, ఇరువురు కలిసి తపస్సు చేస్తూంటే పినాకిని నదిలో ఒకనాడు అశ్వత్థవృక్ష కొమ్మ నీటిలో తేలుతూ వచ్చింది. మైత్రేయులవారి ఆదేశంతో దానిని విదురుడు పాతాడు. అదే ఈనాడు విదురాశ్వత్థ వృక్షము, క్షేత్రమై విరాజిల్లుతోంది. ఈ

వృక్ష సమీపంలో ఎవరు వారి కోరికతో పూజచేసిన అది తప్పక ఫలిస్తుంది. అందుకు ముఖ్యంగా వివాహం కానివారు, సంతానం కోరువారు, ఇక్కడికి వచ్చి పూజలు చెయ్యడం, నాగప్రతిష్ఠలు చెయ్యడం పరిపాటి అయింది.

**తొండనూరు శ్రీకృష్ణ పార్థసారథి :** పూర్వం విష్ణువర్ధన మహారాజు కుమార్తెకు పట్టిన బ్రహ్మరాక్షసిని మంత్ర జలంతో పోగొట్టిన ప్రదేశంగా దీనిని చెబుతారు. ఈ స్వామిపేరు 'నంబి నారాయణపెరుమాళ్ళు'గా, తల్లిని 'అరవిందవల్లి' తాయారుగా పిలచుకుని భక్తులు పూజిస్తున్నారు. పురాతన ఆలయాన్ని దర్శించగల్గడమొక అదృష్టమే.



**కుడుపు – అనంత పద్మనాభస్వామి :** మంగుళూరుకు 10 కి.మీ దూరంలో ఈ గ్రామముంది. 'కుడుపు' అంటే తుళు భాషలో 'పాముబుట్ట' అని అర్థం. అల్లాగే శ్రీస్వామి కూడా అయిదు తలలతో చూడటానికి పాము వలె వుంటాడు. ఆలయం కేరళ పద్ధతిలో ఎర్రని, పెంకులతో నిర్మాణం. స్థలపురాణం ప్రకారం విష్ణుభక్తుడైన వీరబాహువు తెలియని పరిస్థితులలో కన్న కుమార్తెతో సంబంధం పెట్టుకుంటాడు. బంధం తెలుసుకుని అనుబంధాలకు, జరిగిన పాపానికి ప్రాయశ్చిత్తంగా తన చేతులు నరికేసుకుంటాడు.



అప్పుడు విష్ణుమూర్తి ప్రత్యక్షమై మూడు పాముల దేవాలయ నిర్మాణాన్ని ఒకే ఒక్క రోజులో పూర్తిచేస్తే పాప పరిహారమౌతుందని చెప్పగా, ఆలయ నిర్మాణానికి ప్రారంభిస్తాడు. గుడి చివరి దశకు వచ్చేసమయానికి రాజు, శత్రువు గోపినాథుడు కోడిలా కూసేసరికి నిరుత్సాహపడితే జరిగింది చెప్పి, 'ఆలయం పూర్తి చెయ్యి' అంటాడు. ఆలయం పూర్తయవుతుంది. పాపపరిహారమైనట్లు చేతులు వస్తాయి. అయితే ఇక్కడ నాగపంచమిని విశేషంగా చేస్తారు. నాగులపూజ మహోత్సాహంగా జరుపుతారు.

**ఖండోబా దేవాలయం, మాంగ్‌సులి :** ఈ ఖండోబా దేవాలయాలు ఎక్కువగా మహారాష్ట్రలోని వాటి సరిహద్దు ప్రాంతాలలోను చూడగలం. ఈయన్ను శివావతారంగా చెబుతారు. శ్రీసద్గురు సాయిబాబా జీవితచరిత్రలో మనకు ఖండోబా దేవాలయం గూర్చిన ప్రస్తావన వస్తుంది. కర్ణాటకలో మైలారా పేరుతో ప్రకటితమైన దైవం కూడా ఖండోబా మరోరూపమే. స్థల పురాణం ప్రకారం – మల్లా, మణి అనే సోదరులు బ్రహ్మదేవుడిచ్చిన వరంతో పెచ్చిరిల్లి ఆఖరికి ముక్కు మూసుకుని తపస్సు చేసే ఋషులను సైతం బాధిస్తుంటే, పరమశివుడు ఆగ్రహించి మార్తాండ భైరవుడని, వీరభద్రుడి వంటి తన అంశను పంపుతాడు. అతను మల్లా, మణులను సంహరిస్తుంటే మణి మార్తాండ భైరవునికి శరణాగతుడై నీతోపాటు నా విగ్రహము ప్రతిష్ఠించి, మేకమాంసం నాకు నివేదన చేసేటట్లు వరమివ్వమంటాడు. అదీ వీరి కథ.

## : : సూక్తులు : :

ప్రపంచంలో సుఖాలు జీవం లేని శవాలవంటివి. – రామతీర్థుడు

సాహసం చేయకుండా మనిషి ఏ ఇతర సద్గుణాలనూ ఆచరణలోకి తెచ్చుకోలేడు.

– ఇందిరాగాంధి

మానవ శరీరం భగవంతుడు అనుగ్రహ పూర్వకంగా ఇచ్చిన మహత్తర దానం – ఉత్పల

ఈ మానవ శరీరం సోపానక్రమంగా లభించినదే, కానీ హఠాత్తుగా ప్రాప్తించినది కాదు. – ఉత్పల

మనిషి శరీరం ఒక వాహనం వంటిది. దీన్ని ఆరోహించి మనుష్యుడు దేవత్వం పొందదానికి త్వరితగతిని పరుగెత్తవలసి ఉంటుంది. – ఉత్పల

మనుష్యుడు అహంకారం చేతనే స్వర్గ, నరక వాసాలను అనుభవిస్తుంటాడు. – ఉత్పల

మనుషుడు ఈ లోకంలో శ్రమపడి అభ్యసించవలసింది వైరాగ్యం ఒక్కటే. – ఉత్పల

తత్త్వజ్ఞానం గలవారు వైరాగ్యవంతులవుతారు. తత్త్వజ్ఞానం మనుష్యుడ్ని ధీనుడిని చేస్తుంది. – ఉత్పల

కుల, మతాల పేరుతో నరజాతిని వేరు చేసి మాట్లాడేవారిని ఆ దేవుడు ఎన్నటికీ క్షమించడు ! – ఓ సూక్తి

నేను పనిచేస్తే భగవంతుడు నన్ను గౌరవిస్తాడు. అయితే నేను గానం చేసినపుడు ఆయన నన్ను ప్రేమిస్తాడు.

– రవీంద్రనాథ్ ఠాగూర్

దేవుడున్నాడని నమ్మేవారికన్నా... దేవుడు లేడని విశ్వసించేవారే దేవుడ్ని ఎక్కువసార్లు తలచుకుంటారు.!

– వివేకానందుడు.

వేలాది వ్యర్థమైన మాటలకన్నా, విన్నంతనే శాంతిని, కాంతిని ప్రసాదించే మంచి మాట ఒక్కటి చాలు.

– బుద్ధుడు

రాత్రివేళ సూర్యుడు కనిపించలేదని కన్నీరు కారుస్తుంటే ఆఖరికి నక్షత్రాలు కూడా నీకు కనిపించకుండా పోతాయి.

– ఠాగూర్

దైవాన్ని మనుష్యరూపంలో ఆరాధించడం అలవరుచుకోవాలి. – ఓ సూక్తి

భగవంతుడు ఇచ్చిన దానితో హాయిగా, సంతోషంగా, తృప్తిగా జీవించగలగటమే నిజమైన వైరాగ్యం.

– శ్రీ గురు సాంబశివుడు.

# కేరళ




భారతదేశంలో కెల్ల అక్షరాస్యత సాధనలో అగ్రగామిగా భాసిల్లే కేరళ రాష్ట్రంలో 14 జిల్లాలు ఉన్నాయి. కేరళకు తిరువనంతపురం రాజధానిగా ఉంది. అశోకుడు వేయించిన శాసనాలనుబట్టి చేరా వంశరాజులు కేరళను పాలించినట్లు తెలుస్తుంది. మధ్య యుగ భారతదేశంలో కేరళ విజయనగర సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. కాలక్రమంలో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి కేరళ, ట్రావంకూర్, కొచ్చిన్ అనే రెండు ప్రధాన రాజ్యాలుగా విభజించబడింది. మలబార్ పూర్తిగా బ్రిటిష్ ఆధిపత్యం క్రింద ఉండేది. పరిపాలన సౌలభ్యం కోసం 1949 జూలై 1న ట్రావంకూర్, కొచ్చిన్‌లను కలిపి ఒక రాష్ట్రంగా ఏర్పాటు చేసారు. మలబార్, మద్రాసులో భాగంగా ఉండిపోయింది. 1956 నవంబర్ 1వ తేదిన మలబార్, కొచ్చిన్, ట్రావన్‌కూర్ లు కలిపి కేరళ రాష్ట్రం ఏర్పాటైంది.

**విస్తీర్ణం : 38,863 చ.కిమీ.** **ప్రధాన భాషలు : మలయాళం**

**సరిహద్దులు**: ఉత్తరాన కర్ణాటక, తూర్పున ఈశాన్య తమిళనాడు, వాయవ్య పశ్చిమాన హిందూ మహాసముద్రం కనిపిస్తాయి.

## పట్టుమన్నూరు - మహదేవ ఆలయం



కేరళలోని అతి ప్రాముఖ్యమైన ఆలయాల్లో ఈ మహదేవ ఆలయం ఒకటి. ప్రతి ఏటా ఉత్సవాలు కన్నులపండుగగా జరుగుతాయి. ఎర్నాకుళం, తిరువనంతపురం రైలు రోడ్డులో, దక్షిణ కొట్టాయం ప్రాంతంలో వెలసి ఉంది ఈ మహదేవ ఆలయం.

పడమర వైపుగా ఉన్న ఈ దేవాలయం పైకప్పు పూర్తి రాగితో తాపడం చెయ్యబడింది. ఈ గోపుర కలశం కూడా చాలా వైవిధ్యంగా ఉంటుంది. ఈ ఆలయ ముఖ మండపంలో రెండు నందీశ్వరుని ప్రతిమలు ఒకటి పూర్తి శిలతోను మరొకటి లోహంతో చేయబడి కన్నుల విందు చేస్తుంటాయి. ఇక్కడ పార్వతీదేవి ప్రతిమ లేకపోయినప్పటికీ, వెలుపల ఒక ప్రదేశంలో పార్వతీదేవి మంటపం ఉంటుంది. ప్రతి ఏటా మలయాళ నెలైన కుంభంలో 10 రోజులు జరిగే ఉత్సవానికి భక్తులు విశేషంగా వస్తుంటారు.

## కల్‌పతి దేవాలయం

కేరళలోని పాలక్కడ అనే ఊరికి 3 కి.మీ. దూరంలో ఉన్న ఈ కల్‌పతి దేవాలయంలో, శివుడు విశ్వనాధస్వామిగా వెలసి వుంటాడు. కేరళలోని అతి పురాతన దేవాలయాల్లో ఈ కల్‌పతి దేవాలయం ఒకటి. ప్రతీ ఏటా జరిగే రథోత్సవం ఏడు రోజుల పాటు ఉత్సాహంగా జరుగుతుంది. ఈ ఉత్సవపు ఆఖరి 3 రోజుల్లో స్వామిని రథంమీద వేలాది భక్తులతో ఊరేగిస్తారు. ఈ ఉత్సవంలో అతి ప్రాముఖ్యమైన 3 రధాలను అందంగా పూలతోను, మాలలతోను అలంకరించి ఊరేగింపు జరుపుతారు. వేలాది భక్తులు, లక్షలాది చేతులు ఆ రధాలను లాగటానికి తాపత్రయపడతారు. ఈ విశేషాన్ని కన్నులారా చూడాలే తప్ప వర్ణింప శక్యం కాదు.

## అంబళపూజ



కేరళలోని ఆలప్పూజ అనే ప్రాంతానికి దక్షిణంగా 8 మైళ్ళ దూరంలో శ్రీకృష్ణుడు వెలసి ఉన్న దేవాలయమే ఈ అంబళపూజ ఆలయం. ఈ ఆలయంలో ఇవ్వబడే పాల పాయసం, కేరళ రాష్ట్రమంతటా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ కొద్ది దూరంలో కరుమడి అనే ప్రదేశంలో బౌద్ధమతం ప్రబలినట్లు నిదర్శనంగా బుద్ధుని విగ్రహం ఉంటుంది. 12 ఏళ్ళకు ఒకసారి వచ్చే పర్లిపన అనే ఉత్సవం చాలా బాగా జరుగుతుంది. ఒకప్పుడు ఈ ప్రదేశంలో నరబలులు ఇవ్వబడేవి .



## తాలి ఆలయం

కోజికోడ్‌కి కాస్త దూరంలో ఉన్న ఈ ఆలయంలో పరమశివుడు వెలసి వుంటాడు. ఈ ఆలయపు ముఖ మంటపం చాలా ఎత్తైన గోడలతో అందమైన శిల్పాలతో కనువిందు చేస్తుంటుంది. ఇక్కడున్న కోనేరు కూడా చాలా ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏటా 8 రోజుల పాటు చాలా వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తారు.

## శివగిరి మఠం



హిందూ పండితుడు, ఆధ్యాత్మిక గురువు శ్రీ నారాయణగురు, ఈ మఠాన్ని స్థాపించారు. ప్రతి ఏటా డిసెంబరు 30 నుండి జనవరి 1వ తేదీ వరకు జరిగే ఉత్సవంలో గురువు గారు 1928లో సమాధి చేయబడిన ప్రదేశంలో వేలాది భక్తులు వచ్చి పూజలు చేసి, తమ శ్రద్ధాభక్తులను ప్రదర్శించుకుంటారు.

నారాయణగురువుగారు స్థాపించిన ఒకే మతం, ఒకే కులం, ఒకే దేవుడు అనే నినాదంతో ఏర్పడ్డ శ్రీ నారాయణ ధర్మసంఘం యొక్క ముఖ్య కార్యాలయం కూడా శివగిరి మఠంలో ఉంది. ఏటా ఈ శివగిరి కొండల్లో జరిగే ఉత్సవాల్లో మూకుమ్మడి వివాహాలు, వినోద కార్యక్రమాల వంటివి ఎన్నో జరుగుతూ భక్తులకు గురువుగారి బోధనలు గుర్తుకు తెస్తుంటాయి.

## శబరిమల

ఈ భారతదేశంలో తిరుపతి, షిర్డి, శబరిమల తెలియనివారు లేరనే చెప్పాలి. కేరళలోని శబరిమల కొండపైనున్న శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయం ప్రసిద్ధి గాంచిన దివ్యక్షేత్రము. దేశం నలుమూలల నుండి వచ్చే భక్తులతో ఈ పరమ పవిత్రమైన కొండల మధ్య, ప్రకృతి సౌందర్యాలకు నిలయమైన క్షేత్రములో స్వామి "మణికంఠుడు" అను నామ ధేయంతో పూజలందుకొంటున్నారు. కేరళ రాష్ట్ర ప్రజలే కాక ఇటు ఆంధ్రా, అటు కర్నాటక రాష్ట్ర ప్రజలు, దేశ విదేశీయులు, అనేకులు శ్రీ స్వామి అయ్యప్ప మాలధారణ చేసి భక్తిశ్రద్ధలతో ఈ యాత్రకు వస్తారు.



కార్తీక మాసములో అయ్యప్పమాల వేసుకున్న భక్తులు ఉదయమునే లేచి కాలకృత్యములు తీర్చుకుని నది వద్దకు గాని బావి వద్దకుగాని వెళ్ళి చన్నీటి స్నానము చేసి, నుదుట విభూతి, చందనము ధరించి స్వామివారి శరణుఘోష మంత్రము పఠించి దగ్గరలో ఉన్న పుణ్యక్షేత్రము గాని, దేవాలయము గాని సందర్శించవలెను. అయ్యప్పస్వామి నియమములు మాలవేసిన గురుస్వామి దగ్గర తెలుసుకుని నియమాలు పాటించుతూ 40 రోజులు దీక్ష పూర్తి చేసిన వారు "ఇరుముడి"తో స్వామి వారి శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లాలి. గురుస్వామి చెప్పిన నియమనిబంధనలు పాటించి మొదటి సారి శబరిమలైకు వెళ్ళు వారిని 'కన్నెస్వామి' అని, రెండవ సారి వెళ్ళువారిని 'కత్తిస్వామి' అని, మూడవసారి వెళ్ళు వారిని 'గధస్వామి' అని, నాలుగవసారి వెళ్ళువారిని 'గంటస్వామి' అని అంటారు. ఇలా నాలుగుసార్లు పూర్తి చేసుకుని ఐదవసారి వెళ్ళువారిని గురుస్వామి అంటారు. గురుస్వాములుగా దీక్ష పుచ్చుకున్నవారు స్వామి యొక్క పూజ, యాత్ర చేయు విధానము గురించి అనుభవము ఉండాలి. "ఇరుముడి" కట్టుకుని యాత్రకు బయలుదేరువారు తాము బయలుదేరు తేదీ ముందుగా నిర్ణయించుకుని రైలులో గాని, బస్సులో గాని టిక్కెట్ రిజర్వు చేసుకొనవలెను. "ఓం స్వామియే శరణం అయ్యప్పా", స్వామి శరణం - అయ్యప్ప శరణం" అంటూ యాత్రకు బయలుదేరు స్వాములు కొట్టాయం లేదా ఇతర ప్రాంతముల ద్వారా గాని శబరిమలకు స్వాగత ద్వారమైన "ఎరుమేళి" చేరాలి. ఈ రచయిత వ్రాసిన అయ్యప్ప చాలీసా చదవండి.

**ఎరుమేళి :** ఇక్కడ వావరన్ స్వామి మశీదు, ధర్మశాస్త్ర దేవాలయం కలవు. దేశ నలుమూలల నుండి వచ్చు అయ్యప్పలు "పేట తుళ్ళి" కార్యక్రమం చేసి వావర్‌స్వామిని దర్శించుకుని, నడుచుటకు శక్తి ఉన్నవారు ఎరుమేళి



అడవిమార్గం ద్వారా శబరిమల వెళతారు. లేనివారు పంబ చేరుకుని సన్నిధానం వెళతారు.

"స్వామిదింతక తోంతోం, అయ్యప్ప దింతక తోంతోం" అంటూ పారవశ్యంతో నృత్యం చేసే భక్తులు రంగులు రాసుకుని, బుడగలు కట్టుకుని అటవికుల వలె నృత్యం చేస్తారు. శబరిమల యాత్రలో ముఖ్యమైన పుణ్యస్థలము "ఎరుమేళి".

అయ్యప్పస్వామి చేతిలో ఓడిపోయిన ఓవరన్ అను ముస్లిం తనను స్వామి శిష్యునిగా చేసుకోమని అడిగిన మీదట కులమత, బేధాలు మరిచి నిన్ను దర్శించుకొనిన తర్వాత ఎవరైతే నా దగ్గరకు వస్తారో వారి కోరికలు నెరవేరునని అయ్యప్పస్వామి అభయం ఇచ్చినందున, భక్తులు ఓవరన్ స్వామి మసీదుకు వెళ్ళి విభూది తీసుకుని వావరన్ స్వామి దర్శనం చేసుకుని ఎరుమేళి ధర్మశాస్త్ర దేవాలయం చేరుకుంటారు. అక్కడ భక్తులు కొబ్బరికాయ కొట్టి "ఎరుమేలి ధర్మశాస్త్రావే శరణం అయ్యప్ప, వావరస్వామియే శరణం అయ్యప్ప" అంటూ ముందుకు సాగుతారు. నడచివెళ్లే మార్గములో మొదట వచ్చేది "కాళ్కెకట్టి" ఆశ్రమము. కాళైకట్టి అనగా నందీశ్వరుని పగ్గంతో కట్టిన స్థలము అని అర్థం. మహిషుని అయ్యప్ప వధిస్తుండగా తిలకించడానికి పరమేశ్వరుడు నంది వాహనుడై వచ్చారని చెబుతారు. ఇక్కడ స్వాములు కర్పూరం వెలిగించి కొబ్బరికాయ కొట్టి అళుదానదికి వెళతారు.

**అళుదానది**: మహిషిని సంహరించు సమయంలో మహిషి శరీరంపై స్వామి తాండవం చేయు సమయంలో మహిషి కంటి వెంట వచ్చిన నీరే అళుదానది అని అంటారు. కాలినడకన వచ్చిన భక్తులు అళుదానదిలో స్నానము చేసి రెండు రాళ్లను తీసుకుని కొంత సమయం విశ్రాంతి తీసుకుని "అళుదానదియే శరణం అయ్యప్ప" అంటూ "అళుదా మేడు' బయలుదేరుతారు.

**అళుదామేడు**: విశ్రాంతి తీసుకున్న అయ్యప్పలు అళుదానది దగ్గర ఉన్న కొండ అళుదామేడు ఎక్కుతారు. నిట్టనిలువునా ఉన్న ఈ కొండ ఎక్కు భక్తులు దిక్కులు చూడరాదని, టార్చిలైట్స్ దగ్గర ఉంచుకోవాలని తమ బృందము పక్కన వచ్చునట్లు గమనించుటకు, తాము ఎంతదూరములో ఉన్నది గుర్తుగా "శరణుఘోష" మంత్రము చెబుతూ, "అళుదామేడు శరణం అయ్యప్ప" అంటూ కొండ ఎక్కవలెను. కొండ ఎక్కిన భక్తులు చేరు స్థలమే "కల్లిడంకుంద్ర". ఇచ్చట ప్రాణంపోయిన మహిషి శరీరం పెరుగుట చూసి శ్రీ స్వామి రెండు రాళ్ళను మహిషి శరీరంపై పెట్టి పెరగకుండా ఆజ్ఞాపించెను. కావున భక్తులు కూడా అళుదానదిలో తీసిన రాళ్ళను ఇక్కడ వేసి కర్పూరం వెలిగించి ముందుకు సాగుతారు. ఇచ్చట నుండి "ఉదుంబరమల" చేరుకుని ప్రార్థనలు చేసుకుంటారు. కొంత సమయం విశ్రాంతి తీసుకుని కరిమల కొండ ఎక్కుతారు.



**కరిమల**: 'కరి' అనగా ఏనుగు అని 'మల' అనగా కొండ అని అర్థం. ఏనుగులు నివసించే ఈ స్థలమే కరిమల అని అంటారు. భక్తులకు అయ్యప్ప రక్ష అగుట వలన భక్తులను ఏనుగులు ఏ విధంగాను ఇబ్బంది పెట్టవని గురుస్వాములు చెబుతారు. అక్కడ నుండి అయ్యప్ప స్వాములు "కరిమల ఎత్రమే శరణం అయ్యప్ప, కరిమల ఎరక్కమే శరణం అయ్యప్ప" అంటూ పెరియాన పట్టం చేరుతారు.

**పెరియాన పట్టం** : నడకమార్గంలో చివరి క్షేత్రమైన పెరియపట్టం దాటి పంబకు చేరుతారు. ఈ పెరియానపట్టం నుండి కూడా అయ్యప్ప స్వాములు జ్యోతి సమయంలో జ్యోతిని చూస్తారు. విశ్రాంతి తీసుకొను అయ్యప్పలు ఇక్కడ విశ్రాంతి తీసుకుంటే మంచిదని చెబుతారు. ఈ క్షేత్రము దాటిన తరువాత పంబనదీ తీరం రద్దీగా ఉండు ప్రదేశం కావటం వలన ఇక్కడనే కాలకృత్యములు, స్నానము ముగించుకుని కర్పూర హారతి తీసుకుని పంబ చేరుతారు.

**పంబా తీరము**: శబరిమల సన్నిధానం తర్వాత యాత్రలో అత్యంత ప్రముఖమైనది పంబతీరం. పంబ స్నానం చేసి పితృతర్పణములు వదులుతారు "పంబాస్నానము-పాపహరణం" అంటూ పంబలో భక్తుడు తాను పడిన కష్టములు అన్ని మరచి "పంబానదియే శరణం అయ్యప్ప" అంటూ కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని స్వామి వారు వేంచేసి యున్న శబరి కొండకు బయలుదేరుతారు.



పంబ నుండి బయలుదేరిన స్వాములు కన్నెమూల గణపతి విగ్రహం వద్ద కొబ్బరికాయ కొట్టి ఆంజనేయస్వామి, పార్వతి, వినాయక దేవాలయాలు సందర్శించుకుని పందళరాజ వంశీకుల దగ్గర విభూది తీసుకుని ముందుకు నడుస్తారు. అక్కడ నుండి యాత్రికులు 'నీలమల, అప్పాచిమేడు' చేరుకుంటారు. కష్టమైన ఈ కొండ ఎక్కిన స్వాములు విశ్రాంతి తీసుకుని సున్నపు ఉండలు ఇరువైపుల ఉన్న లోయలలోకి విసురుతారు. అక్కడ నుండి భక్తులు 'శబరిపీఠం' చేరుతారు.

**శబరిపీఠం**: శబరిపీఠం చేరిన భక్తులు కొబ్బరికాయ కొట్టి ప్రదక్షిణ చేసి ముందుకు నడుస్తారు. ఈ ప్రాంతములోనే శబరికి స్వామి మోక్షము ఇచ్చారని నా దగ్గరకు వచ్చు భక్తులు ప్రతివారు నిన్ను దర్శింతురని అభయమిచ్చెనని చెబుతారు. ఇక్కడ నుండి 'శరంకుత్తియాల్' చేరుతారు.



**శరంకుత్తియాల్**: ఇక్కడకు చేరు భక్తులు ఇక్కడ ప్రదక్షిణ చేసి తమ దగ్గర ఉన్న శరములు (మొదటి సంవత్సరం వారు బాణం పుల్ల, రెండవ సంవత్సరం వారు కత్తి, మూడవ సంవత్సరం వెళ్లు వారు గద, నాలుగవ సంవత్సరము వెళ్ళువారు గంట) ఇక్కడ గుచ్చుతారు.

అయ్యప్పస్వామి వారిని వివాహము చేసుకోమని కోరిన మాలికాపురత్తమ్మకు అయ్యప్పస్వామి సమాధానం చెబుతూ ఏటా నా దగ్గరకు కొత్తగా వచ్చే కన్నెస్వాములు రాని రోజున నిన్ను వివాహము చేసుకొందునని మాట ఇచ్చినందున, "తాముకన్నెస్వామిగా వచ్చినామని గుర్తుగా స్వాములు ఇక్కడ బాణం పుల్లలు గుచ్చుతారని" చెబుతారు. ఇక్కడ నుండి స్వాములు శబరిగిరిపై నున్న అయ్యప్పస్వామి దివ్య మంగళ విగ్రహము చూచుటకు ఉవ్విళ్ళూరుతుంటారు.

శబరిమల అయ్యప్పస్వామి సన్నిధి చేరు భక్తులు ఇరుముడితో స్వామి వారి దర్శనం చేసుకొనుటకు 'పదునెట్టంబడి'

మెట్ల మార్గం ద్వారా దేవాలయమునకు వెళ్లి స్వామి వారి దర్శనం చేసుకుని క్రిందకు వచ్చి గురుస్వామి చేత ఇరుముడి విప్పించుకుని, ఇరుముడిలో ఉన్న నేతికొబ్బరికాయలోని నేతితో స్వామివారికి అభిషేకం చేసి 'స్వామియే శరణం, శరణం అయ్యప్ప' అంటూ భక్తితో కొలుస్తారు. మండల దీక్ష చేసిన స్వాములకు తమ నెయ్యాభిషేకంతో స్వామి దీక్ష ముగుస్తుంది. శబరిమలలోనే మాలికాపురత్తమ్మ హోమగుండం, బ్రహ్మగుండం మొదలగు స్థలములు భక్తులు చూడవచ్చును.

## ముఖ్య యాత్రాస్థలముల మధ్య దూరం

| | | | |
|---|---|---|---|
| శబరిమల నుండి పంబ | 9 కి.మీ. | కన్యాకుమారి నుండి తిరుచందూరు | 89 కి.మీ. |
| శబరిమల నుండి ఎరుమేలి | 96 కి.మీ. | కుంభకోణం నుండి తంజావూరు | 38 కి.మీ. |
| శబరిమల నుండి త్రివేండ్రం | 186 కి.మీ. | కుంభకోణం నుండి స్వామిమలై | 8 కి.మీ. |
| శబరిమల నుండి విజయవాడ | 1159 కి.మీ. | కుంభకోణం నుండి సిర్కలి | 60 కి.మీ. |
| పంబ నుండి నందళం | 102 కి.మీ. | కుంభకోణం నుండి చిదంబరం | 60 కి.మీ. |
| పంబ నుండి కొట్టాయాం | 122 కి.మీ. | మద్రాసు నుండి తిరువణ్ణామలై | 167 కి.మీ. |
| పంబ నుండి ఎరుమేలి | 86 కి.మీ | మద్రాసు నుండి మహాబలిపురం | 59 కి.మీ. |
| పంబ నుండి ఎర్నాకులం | 197 కి.మీ. | మద్రాసు నుండి కంచి | 71 కి.మీ. |
| (వయా ఎరుమేలి) | | మద్రాసు నుండి తిరుత్తణి | 84 కి.మీ. |
| ఎరుమేలి నుండి కొట్టాయాం | 52 కి.మీ. | మద్రాసు నుండి తిరుపతి | 143 కి.మీ. |
| ఎరుమేలి నుండి ఎర్నాకులం | 121 కి.మీ. | మద్రాసు నుండి బెంగళూరు | 334 కి.మీ. |
| ఎరుమేలి నుండి త్రివేండ్రం | 148 కి.మీ. | మద్రాసు నుండి విజయవాడ | 430 కి.మీ. |
| వండి పెరియల్ నుండి కొట్టాయాం | 108 కి.మీ. | మద్రాసు నుండి చిదంబరం | 228 కి.మీ. |
| వైకం నుండి ఎట్టిమానూరు | 13 కి.మీ. | మద్రాసు నుండి హైదరాబాద్ | 699 కి.మీ. |
| కొట్టాయాం నుండి ఎట్టిమానూరు | 41 కి.మీ. | మద్రాసు నుండి కొడైకెనాల్ | 498 కి.మీ. |
| త్రిచూరు నుండి గురువాయూరు | 29 కి.మీ. | మద్రాసు నుండి మధురై | 480 కి.మీ. |
| మదుర నుండి కన్యాకుమారి | 232 కి.మీ. | మద్రాసు నుండి మామళ్ళపురం | 61 కి.మీ. |
| మధుర నుండి రామేశ్వరం | 152 కి.మీ. | మద్రాసు నుండి మైసూరు | 469 కి.మీ. |
| మధుర నుండి పళని | 119 కి.మీ. | మద్రాసు నుండి ఊటి | 535 కి.మీ. |
| మధుర నుండి తిరుచ్చి | 166 కి.మీ. | మద్రాసు నుండి త్రివేండ్రం | 709 కి.మీ. |
| మధుర నుండి తంజావూరు | 165 కి.మీ. | మద్రాసు నుండి రామేశ్వరం | 169 కి.మీ. |
| మద్రాసు నుండి తంజావూరు | 334 కి.మీ. | త్రివేండ్రం నుండి కాలడి | 235 కి.మీ. |
| మైసూరు నుండి బెంగుళూరు | 136 కి.మీ. | త్రివేండ్రం నుండి కొట్టాయాం | 100 కి.మీ. |
| మైసూరు నుండి శ్రావణబెళగళ | 86 కి.మీ. | త్రివేండ్రం నుండి శబరిమలై | 185 కి.మీ. |
| మైసూరు నుండి బేలూరు | 155 కి.మీ. | త్రివేండ్రం నుండి ఎరుమేలి | 149 కి.మీ. |
| త్రివేండ్రం నుండి గురువాయూరు | 323 కి.మీ. | కొట్టాయాం నుండి వైకం | 41 కి.మీ. |
| త్రివేండ్రం నుండి త్రిచూరు | 4 కి.మీ. | కొట్టాయాం నుండి ఎట్టిమానూరు | 54 కి.మీ. |

## భగవతి అమ్మవారి దేవాలయం - చోటా నిక్కరు



చోటా నిక్కర్ భగవతి అమ్మవారి దేవాలయం కేరళలోని ప్రసిద్ధిచెందిన అమ్మవారి పుణ్యక్షేత్రములలో ఒకటి. భగవతి అమ్మవారిని మహిమగల దేవతగా కేరళ ప్రజలు, ఆంధ్రా ప్రజలు కొలుస్తారు. దేశంలో పలు ప్రాంతాల నుండి వచ్చిన గాలి, పీడ, దెయ్యాలు పట్టిన స్త్రీలపై అమ్మవారి తీర్థం చల్లుతారు. క్షుద్రశక్తుల విరుగుడుకు ఈ దేవాలయం పెట్టింది పేరు. వివిధ రాష్ట్రముల నుండి వచ్చు అయ్యప్ప భక్తులకు ఇక్కడ ఉచిత భోజనవసతి ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడకు విచ్చేస్తున్న టూరిస్ట్ బస్సుల దగ్గర చిన్న పిల్లలు పొట్ట కోసం పోట్ట వాయించుకుంటూ పాటలు పాడే దృశ్యం ప్రతిభక్తునికి ఆశ్చర్యం కలిగిస్తుంది. దేవాలయం వెనుక ఉన్న పసరు కోనేరులో స్నానమాచరించిన సర్వ పాపములు పోవునని భక్తులు నమ్మకం.

## కాలడి



కేరళ రాష్ట్రమునందు అల్వాల్ జిల్లాలోని కాలడీ శ్రీ శంకర భగవత్పాదుల వారి జన్మస్థలము. ప్రసిద్ధ కృష్ణదేవాలయము ఉన్న గురువాయూరు నుండి, త్రిచూరు నుండి లేదా అల్వాల్ నుండి కాలడికి బస్సు సౌకర్యము కలదు. శ్రీ శంకరుల తర్వాత చాలా శతాబ్దములు కాలడిని పట్టించుకున్న వారెవ్వరూ లేరు శ్రీ శృంగేరి పీఠాధిపతులు శ్రీ శంకరుల జన్మ గృహమున్న స్థల నిర్ణయమునకు కృషి చేసిరి. వీరి బృందము పూర్ణనది వెంట అన్వేషణ చేయగా కాలడి గ్రామమునందు వ్యక్తి ప్రమిదలో దీపము వెలిగించి ప్రదక్షిణము చేయుచుండెను. ఆ వ్యక్తిని పిలిచి విశేషమేమని ప్రశ్నించగా ఆ రాతి దీపస్థంభము శంకరులచే వారి తల్లి ఆర్యాంబ గారి చితి వద్ద స్థాపించబడినది. అని ఇచ్చట దీపము పెట్టుట వారి వంశాచారము అని చెప్పినారట. అంతటితో వారి అన్వేషణ పూర్తియినది.

ప్రధాన గృహమునకు ఆగ్నేయంగా తొమ్మిది అడుగుల దూరంలో శంకరుల జీవిత చరిత్ర, శంకరుల జన్మగృహము, సన్యాసము పుచ్చుకొనుట, మొసలి ఘట్టము మొదలగునవి నిర్ణయించి, ఆ ప్రదేశములలో శంకరుల స్మారక మందిరం కట్టుట ప్రారంభించిరి. 1910లో పూర్తయిన ఈ మందిరం దీర్ఘచతురస్రాకారాములో ఉంటుంది. లోపల విశాలమైన మందిరంలోనికి ప్రవేశించగానే శారదా దేవి పీఠము, గుడి ఉంటుంది. చుట్టూ సప్తమాతృకలు,

ప్రక్కనే శంకరుల జన్మగృహము, ఇందులో తేజోమూర్తి, విజ్ఞాన బ్రహ్మ అగు శ్రీ శంకరాచార్యులు వారి విగ్రహము ప్రతిష్టించబడి ఉంది. శ్రీ శంకరుల గుడికి ఎదురుగా వినాయక దేవాలయము, మందిరం వెలుపలి వైపున శ్రీ కృష్ణదేవాలయము ఉన్నవి. కృష్ణమందిరమునకు, స్మారక మందిరమునకు నడుమగల దారిలో వెళ్ళినచో శంకరులను మొసలి పట్టిన స్నానఘట్టము వస్తుంది. ఈ గట్టున నదిలో స్నానమాచరించినవారికి పాప విమోచనము కలుగునని భక్తుల విశ్వాసం.

కాలడిలో బస్సు దిగగానే సుమారు రెండు కి.మీ. దూరంలో శృంగేరి మఠం ఉంది. యాత్రికులకు వసతి గృహములు కలవు. బసకు సరిపడా హాలు, గదులు కలవు. మరొయొక వైపు బస్సు స్టాండుకు రెండు కి.మీ. దూరంలో కంచికామకోటి పీఠాధిపతి వారి శంకర స్మారకస్థూపము, శ్రీ చంద్రమౌళీశ్వర దేవాలయములు గలవు. ప్రదక్షిణ మార్గమున నున్న మెట్లపై నుంచి మనము ఈ స్థూపశిఖరము చేరవచ్చును. ఇచ్చట శ్రీ శంకరుల జీవిత చరిత్ర, వారి విజయములు తెల్పు శిల్పములు, చిత్రములు మధ్య మధ్య దేవాలయాలలో మలచబడినవి. ధనుర్మాసములో విశేషంగా భక్తులు వచ్చు ఈ కాలడి మనము తప్పక దర్శించవలసినవి.

## ధన్వంతరి ఆలయం




వడక్కన్ చేర్రి రైల్వేస్టేషనుకు పడమరగా 9 కి.మీ. దూరం లోని నెల్లువాయ గ్రామంలో ధన్వంతరీ ఆలయముంది.క్షీరసాగర మధనంలో ధన్వంతరి అమృతంతో ఆవిర్భవించినట్లు చెబుతారు. జరా, వ్యాధి - మరణాలను హరింపచేసే దివ్యౌషధము "అమృతం". కేరళలోని అతిప్రాచీన దేవాలయమిది. అమృతం, జలగ, చక్రం, గదలున్న నాలుగు చేతుల ధన్వంతరిని మనం ఇక్కడ చూడవచ్చును.

నవంబరు, డిసెంబరులో నెల్లువాయ ఏకాదశి పేరున 37 రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయి. ఈ సమయంలో కేరళలోని ఆయుర్వేద, అల్లోపతి వైద్యులు సర్వులు ఇక్కడికి వచ్చి స్వామిని సేవించుకుని, ఆయన ఆశీస్సులను అభ్యర్థిస్తారు.

## పద్మనాభస్వామి దేవాలయం - త్రివేండ్రం

కేరళలోని ప్రముఖ పుణ్యక్షేత్రములలో త్రివేంద్రంలోని పద్మనాభ దేవాలయం ఒకటి. పురాతనమైన ఈ దేవాలయాన్ని 1733లో మార్తాండవర్మ పునరుద్దరించి నట్లు చెబుతారు. ఇతడు తాను "పద్మనాభదాసుడ"నంటూ ఆనాటి భరతునివలె "రామరాజ్యం"గా తన సర్వస్వము స్వామికి అర్పించి, సేవకునివలె రాజ్యపాలన చేస్తాడు. ఇక్కడ స్వామి సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు. త్రివేంద్రం పట్టణానికి దక్షిణ దిక్కులో 64 నల్లరాతి స్థంభాలతో చుట్టూ వసారాలతో ఈ దేవాలయం నిర్మించియున్నది. మూడు ద్వారాలు ఉన్న ఈ దేవాలయంలో ఒక ద్వారము గుండా వెళితే ముఖం, రెండవ ద్వారం వైపు వెళితే నాభి ప్రాంతము దర్శనమవుతాయి. ఇక్కడ స్వామిని అనంతశయనుడు,



అనంతరూపం, అనంతవైభవంతో అనంతమూర్తిగా వ్యక్త మవుతాడు. "సత్యం - జ్ఞానం - అనంత"మన్న వేదవాక్కు ఈ స్వామికి సరిపోతుంది. పన్నెండు వేల శాలిగ్రామ శిలలతో కూర్చబడిన విగ్రహం అపురూపమనే చెప్పాలి. ఇక్కడ ఈ స్వామిగాక సీతాలక్ష్మణ హనుమదాదుల ఆలయాలు వున్నాయి. గర్భగుడిలో ప్రవేశిస్తూ యోగనరసింహస్వామి ఆలయాన్ని కూడా దర్శించవచ్చును. ఈ ఆలయంలో స్వామిని ఉదయం గం. 4.00 నుండి 5.15 వరకూ, 6-15 నుండి 6-45 వరకే, 8-45 నుండి 9-30 వరకు మరియు సాయంత్రం గం. 5-00 నుండి 7-15 వరకు దర్శించ వచ్చును.

**పద్మనాభపురం:** త్రివేంద్రంనకు దక్షిణంగా 53 కి.మీ. దూరంలో ఉన్న పద్మనాభపురంలో చక్కటి శిల్పాలతో పాటు రాతి, కంచు విగ్రహాలు చూడవచ్చు. ఇక్కడ స్వామి ఆదికేశవుడు 18 అడుగుల పొడవైన విగ్రహ రూపం. స్వామి పశ్చిమాభిముఖుడైన స్వామి అనంతపద్మనాభుని చూస్తూంటాడు. ఇది ఆది-అనంతమని భక్తజనుల ఆరాధనలోని ఆంతర్యం. కన్యాకుమారి వెళ్లే దారిలో ఉన్న ఈ పద్మనాభపురంలో కోట ఉంది. సుమారు 17, 18 శతాబ్దాలకు చెందిన అనేక చిత్రాలను ఈ కోటలో చూడవచ్చు.

## వడక్కనాధన్ స్వామి దేవాలయం - త్రిస్సూర్



కొచ్చిన్‌కు 74 కి.మీ. దూరంలో ఉన్న త్రిస్సూర్‌లోని వడకనాధస్వామి దేవాలయం కూడా ప్రముఖయాత్రాస్థలము. పురాతనమైన ఈ దేవాలయం ఏప్రిల్, మే నెలలో 'పూరం' పండుగ సందర్భంగా బ్రహ్మాండమైన ఉత్సవము జరుగుతుంది. ఆకర్షణీయంగా అలంకరించబడిన గజ రాజులు స్వామి వారికి వందనం చేస్తాయి. దేశ విదేశాల నుండి విశేష సంఖ్యలో భక్తులు ఈ పండుగకు విచ్చేస్తారు. కేరళలోని అతి పురాతనమైన దేవాలయాలలో ఇది ఒకటి. ఈ గజరాజులు పై గొడుగు పెట్టుకొని జరిపే ఊరేగింపు చెప్పడంకన్నా చూస్తే మరి ఆనందమే ఆనందం ! మరియు ఈ క్షేత్రము సంగీత, నృత్య, సాహిత్య కళలకు కూడా నిలయం.

## వైకోమ్ - మహదేవుడు

ఖరుడు అనే రాక్షసుడు చిదంబరంలో శివుని తపస్సుచేసి మూడు లింగాలను పొందాడు. మార్గ మధ్యంలో



వైకోమ్‌కు రాగా, అలసట తీర్చుకోవడానికి ఒక లింగాన్ని భూమిపై పెడితే, అది భూమిలోకి కూరుకు పోయేసరికి, దాన్ని పెకలించాలని ఎంతో ప్రయత్నించి విఫలుడౌతాడు. దాంతో మిగిలిన రెండింటిని కూడా సమాన దూరాలలో ప్రతిష్ఠిస్తాడు. మొదట్లో మోకాలు లోతునీళ్ళలో ఈ శివుడు వుంటే, పరశురాముడు ఆలయం కట్టించి, పూజావిధానాన్ని ఏర్పాటు చేస్తాడు. పరశురాముని పూజావిధానం ప్రకారం--

స్వామి ఉదయాన్ని దక్షిణామూర్తిగా, మధ్యాహ్నం కిరాత మూర్తిగా, సాయంసమయాన సచ్చిదానంద మూర్తిగా పూజింపబడుతున్నాడు. ఇక్కడ వచ్చిన భక్తులకు ప్రసాదంగా కడుపునిండా అన్నంపెడతారు. ఈ ప్రసాదం సేవనంవలన అనారోగ్యం తొలగి, భక్తులు ఆనందమూర్తులౌతారు. ఏటా కార్తికమాసంలో అష్టమినాడు వైకోమ్ అష్టమిగా ప్రత్యేక పూజలు నిర్వర్తిస్తారు.

## శ్రీ కృష్ణదేవాలయం - గురువాయూరు

త్రిచూరుకు 29 కి.మీ. దూరంలో గల ఎర్నాకులం నుండి 100 కి.మీ. దూరంలో ఉన్న మరో ప్రముఖ పుణ్యక్షేత్రం గురువాయూరు. శ్రీ కృష్ణభగవానునికి నిలయమైన ఈ దేవాలయాన్ని నిత్యం వేలాది మంది భక్తులు దర్శించు కుంటారు. పురాణగాధ ప్రకారం ద్వారక సముద్రంలో మునిగిపోతే, ఒకనాడు బ్రహ్మపూజించిన విగ్రహాన్ని, కృష్ణుడు, తన మిత్రుడైన ఉద్ధవునికి ఇస్తాడు. పరిస్థితిని గమనించిన బృహస్పతి (గురు) వాయుదేవుడు కలిసి జాగ్రత్తగా దీనిని ఇక్కడ ప్రతిష్ఠిస్తారు. అందుకు నిదర్శనంగా ఈ వూరు గురు+వాయువు+ఊరు = గురువాయూరై కూర్చుంది. ఇది నారద పురాణంలో విచిత్రమనిపించే కథనం. అయిదువేల సంవత్సరాల చరిత్ర కల్గిన ఈ విగ్రహం “పాతాళాంజన”మనే విశిష్ఠపదార్థంతో నిర్మింపబడింది. ఇక్కడ శివుడు తపస్సు చేసుకుంటున్న సమయంలో పరశురామునితో కలిసి వచ్చిన గురు, వాయువులను చూసి, దీనినిక్కడే ప్రతిష్ఠించమని శివుడు చెప్పాడుట. అందుకు దీనిని ‘రుద్రతీర్థ’మని కూడా అంటారు. ఇటువంటి గురువాయూరును ఆంధ్రా నుండి శబరిమల వెళ్ళు భక్తులు తప్పనిసరిగా దర్శించుకొను పుణ్యక్షేత్రాలలో ఇది ఒకటి. హిందువులకు మాత్రమే దర్శన అవకాశం గల ఈ దేవాలయంలో ఫిబ్రవరి, మార్చి నెలలో కేరళ నాట్యాలలో ప్రధానమైన కథాకళి నాట్యాలను చూడవచ్చు. విశాలమైన ప్రాంగణంలో ఉన్న గిరిగింద గింజలు కదిపితే భక్తుల కోర్కెలు నెరవేరుతాయని చెబుతారు. ఈ దేవాలయం దగ్గర యాత్రికులకు అన్ని వసతులతో కలిగిన హోటళ్ళు, సత్రములు అందుబాటులో ఉంటాయి. దేవాలయం ప్రాంగణంలో దేవాలయంనకు దగ్గరలోనే ఈ దేవాలయ ప్రధాన గజరాజులు విగ్రహం కూడా భక్తులను ఆకర్షిస్తుంది. ఎర్నాకులం నుండి కేరళ టూరిస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు ప్రత్యేక బస్సులు



నడుపుతున్నారు. కొచ్చిన్ నుండి 109 కి.మీ. దూరంలో ఉంది. వసతికి ఆరాధన టూరిస్ట్‌హోమ్, ఈస్ట్‌నాడా అరుణోదయం టూరిస్ట్ హోమ్ కె.టి.డి.సి. వారి టూరిస్ట్ బంగ్లాలో అడిగి తెలుసుకోవచ్చును.

## భగవతి దేవాలయం - చెంగనూరు

కేరళ రాష్ట్రములో ప్రసిద్ధ భగవతి దేవాలయం చెంగనూరు. ఈ ఊరు పేరును ఇప్పుడు కొత్తగా "కొడంగలూరు" అని పిలుస్తారు. అమ్మవారి పేరు భగవతి అమ్మవారు ఈ క్షేత్రములో జనవరిలో జరుగు 'తాలాపొలి' మార్చి, ఏప్రిల్‌లలో జరుగు భరణి ఉత్సవములకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తారు. కేరళలోని అయ్యప్పస్వామి దేవస్థానమునకు వెళ్లు భక్తులు చెంగనూరు శ్రీ భగవతి అమ్మవారిని తప్పనిసరిగా దర్శించుకుంటారు. విశాలమైన ప్రాంగణం కలిగి ఉన్న ఈ దేవాలయమునకు ఎదురుగా కొంత దూరము వెళితే పంబనది వస్తుంది. భక్తులు ఈ నదిలో స్నానం చేయుటకు అనువైన స్థలము. రైల్వేస్టేషన్ నుండి బస్సు సదుపాయం కలదు. ఇక్కడ నుండి శబరిమలైకు బస్సు సదుపాయం కలదు.



## శుచీంద్రం

త్రివేంద్రంనుండి కన్యాకుమారికి వెళ్ళే దారిలో, కన్యాకుమారికి 15 కి.మీ దూరంలో ఈ శుచీంద్రం వుంది. గౌతముని వలన శాపగ్రస్తుడైన ఇంద్రుడు అర్ధరాత్రి నుండి ప్రభాతవేళ వరకు సలసలకాగే నేతిధారలలో నడుస్తూ, త్రిమూర్తులను సేవించినందువల్న, ఇంద్రుడు శుచి అయ్యాడు కాబట్టి దీనికి "శుచీంద్ర"మని పేరు వచ్చింది. ఆలయంలో అడుగుపెట్టగానే ఆంజనేయస్వామి పెద్ద విగ్రహం మనలను పలుకరిస్తున్న ట్లుంటుంది. కన్యాకుమారిని వివాహం చేసుకోదలచిన శివుడు, స్థానేశ్వరుడై ఇక్కడ బ్రహ్మచర్య వ్రతాన్ని పాటించాడుట. కల్యాణమంటపంలో సప్తస్వరాలను వినిపించే శిలలు మీటగానే సంగీతాన్ని వినిపిస్తాయి. దీని పరిసర ప్రాంత అడవులలో పూర్వం అత్రిమహర్షి, అనసూయ తపస్సుచేసారుట. వీరిని పరీక్షించవచ్చిన త్రిమూర్తులను ఆ తల్లి పసిపాపలను చేసి పాలనిచ్చింది. అందుకు నిదర్శనంగా అక్కడ త్రిమూర్త్యాత్మక మహాలింగముద్భవించింది. దీనికి పాదభాగం 'బ్రహ్మ', మధ్యన 'విష్ణువు', అగ్రభాగం "శివు"డయింది. ఇక్కడ మరో విశేషం. 2 వేల సం॥లనాటి దివ్యవృక్షముంది. అందులోనుండే త్రిమూర్తి లింగం వెలిసింది. ఇక్కడ కులమతాల ప్రసక్తిలేకుండా సర్వులు స్వామిని సేవించి తరించవచ్చును.

## వేదారణ్యం

సరస్వతీదేవి వీణా వాదనంలో పార్వతిచేత ఓడిపోయిన ఈ ప్రదేశంలో శైవ క్షేత్రం వెలసింది, వేదాలు స్వామిని అర్చించిన ప్రదేశం కనుక వేదారణ్యమైనది. అమ్మవారిని వేదనాయకి అని వ్యవహరిస్తారు. పిశాచగణాల్ని పారద్రోలే

వీరహట్టి వినాయకుని ఇక్కడ దర్శించవచ్చు! తంజావూరు జిల్లా మన్నారుగుడి నుండి 250 కి.మీ. దూరంలో తిరుచిరాపల్లి, ఎయిర్‌పోర్ట్ కూడా 50 కి.మీ.దూరంలో వుంది.

## తిరువారూరు



వేయి స్తంభాల మండపంగల తిరువారూరు, నాగ పట్టణం- తంజావూరుల మధ్య వుంది. స్వామివారు వల్మీకనాథుడు. ఈ శివక్షేత్రం వద్ద రెండు రోజుల పాటు యాత్రసాగే అతి పెద్ద రథం ఊరేగింపుగా వెళ్తుంది. అచలేశ్వరుడు- కమలాంబికల ఆలయం కూడ ఉంది. ఇక్కడ త్యాగరాజస్వామి వారి కోవెల కూడా ఉంది. కోనేరు 'కమలాలయం'లో స్నానం సర్వపాపహరం అని ప్రతీతి.

## తిరుమనంజేరి



కళ్యాణ సుందరేశ్వరస్వామివారి, పార్వతీదేవి అమ్మవారి ఆలయం చూడదగ్గది. ఇది నూతన వధూవరులు తప్పకుండా దర్శించదగ్గ ప్రదేశం అని చెబుతారు. కారణం శివపార్వతుల కళ్యాణం ఇక్కడే జరగటం. తమిళంలో 'తిరుమనం' అంటే కళ్యాణం అని అర్థం! అమ్మవారి పేరు కోకిలాంబాళ్.

## తిరుచ్చందూరు




కన్యాకుమారి నుండి 99 కి.మీ. తిరునవ్వేలి నుండి 48 కి.మీ. దూరంలో ఇక్కడ కుమారస్వామి ఆలయం ఉంది. విష్ణుమూర్తి, గజలక్ష్మి ఆలయాలు కూడా చూడదగ్గవి. శ్రీదేవి-భూ-నీళాదేవి సమేత శ్రీ కృష్ణమూర్తి ఆలయం కూడా ఉంది. దేవాలయాలకు వెళ్ళే భక్తులకు ఎండ తగలకుండా షెడ్స్ నిర్మించారు.

## శంకరనారాయణ్ కోయిల్

శివకేశవులకు తేడా లేదని చాటి చెప్పే క్షేత్రం ఇది, అమ్మవారు గోమతీదేవి. ఇక్కడిస్వామి శంకర నారాయణుని స్వస్థత చేకూర్చే స్వామిగా అభివర్ణిస్తారు.... మతిస్థిమితంలేని రోగులకు, చర్మరోగులకు ఈ స్వామి దర్శనం వరప్రసాదమేనని నమ్ముతారు, ఇంకా ఇక్కడ షణ్ముఖ-నటరాజ ఆలయాలున్నాయి. సిరివిల్లి పుత్తూర్ నుంచి 42 కి.మీ. చెన్నయ్ నుంచి బస్సులున్నాయి.

## అళగర్ కోయిల్

అళగిరి స్వామిగా పేరుగాంచిన సుందరరాజ పెరుమాళ్ వెలసిన క్షేత్రం ఇది, ఇక్కడకు మధురై నుంచి



20 కి.మీ. బస్సులో వెళ్ళవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం వినాయక స్వామి ఎదుట చేసిన ప్రమాణాలు ఏవిధంగా చెల్లుతాయో, ఇక్కడ కూడా అదే విధంగా స్వామి ఎదుట చేసే ప్రమాణాలకు చాలా కేసుల్లో విలువ ఇస్తారు, అసత్యం ప్రమాణం చేస్తే స్వామి వారి అగ్రహానికి పాత్రులై నశిస్తారన్న నమ్మకం కూడా ఉంది. మధుర మీనాక్షిని ఈయన సోదరిగా భావిస్తారు, ఇక్కడ ప్రమాణాల నిమిత్తం సాక్షులు/కక్షిదార్లు ఫీజు చెల్లించవలసి వుంటుంది, స్వామి వారికి దోసెల నైవేద్యం చేస్తారు, స్వామివారు 3 భంగిమలలో దర్శనం ఇస్తారు.

## త్రిచాంబరం



కన్ననూరుకు 25 కి.మీ దూరంలో బడగరకు 10 కి.మీ దూరంలో ఈ త్రిచాంబరముంది. ఇక్కడ అతి పురాతన కృష్ణదేవాలయము వుంది. కంసుని సంహరించిన ఆనందప్రదుడైన పరమాత్మ ఇక్కడ వెలిసాడన్నది భక్తుల విశ్వాసం. వెన్న ముద్దలు తింటూ, ఆకలిగా ఉన్న శ్రీకృష్ణుని బాల్యం విగ్రహం గల ఆలయం ఇక్కడ ఉంది, గర్భవతులైన స్త్రీలు, మంచి తెలివితేటలు కలిగిన శిశువును ఇమ్మని ఈ స్వామిని ప్రార్థిస్తారు, అయితే ఈ ఆలయం సమీపంలోనికి ఏనుగులు రావు, మిగిలిన అన్ని ఆలయాల్లోనూ ఏనుగులకు ప్రవేశం ఉంది. శ్రీకృష్ణుడు బాలుడుగా ఉండగా కంస ప్రేరణవల్ల ఒక మదగజం ఆయనను త్రొక్కి వేయడానికి రాగా తొండంతో సహా దాన్ని ఎత్తి గిరివాటు వేసి శ్రీకృష్ణుడు సంహరించినట్టు పురాణగాధ, కన్ననూర్ జిల్లా కేంద్రానికి 25 కి.మీ. దూరం, ఇదే బడగరకు 10 కి.మీ. దూరం.

## కొడంగళూర్

కొడంగళ్ నది సముద్రంలో కలిసేచోటు, ఈ ప్రదేశం ఒకదీవిపైన ఉన్నది, ఇక్కడ వెలసిన అమ్మవారిని 'కణ్ణకి' అమ్మవారు అంటారు, ఈ విగ్రహాన్ని పనసకర్రతో చెక్కారట ఎనిమిది చేతుల్లో ఎనిమిది ఆయుధాలు ధరించిన అమ్మవారిని భగవతీదేవిగా ఆరాధిస్తారు.

## ఎట్టమనూర్

ఇక్కడ శివస్వామి కోవెలలో మొదట దీపస్తంభాన్ని పూజించి, ఆ తర్వాతనే శివుని కొలిచే వింత ఆచారం ఉంది. స్వామి వారిది పశ్చిమముఖం–రుద్రరూపుడైన స్వామినే 'ఎట్ట మనూరప్పన్' అని కీర్తిస్తారు, ఇక్కడ స్వామి వారికి ఎదుట రాతినంది, లోహనంది ఉండగా ధ్యానం–నైవేద్యం లోహనందికే!. ఇక్కడి దీపస్తంభం మసిని

కండ్లకు కాటుకగా పెట్టుకుంటే నేత్రరోగాలు రావని ఒక నమ్మకం, కనుకనే ఈ అఖండ దీపాన్ని ఆరకుండా నిత్యం వెలిగిస్తుంటారు.

## పర్కళ

త్రివేంద్రం జిల్లాలో త్రివేంద్రానికి 51 కి.మీ. దూరంలోని అరేబియా సముద్రానికి అతి చేరువగా ఉన్నది పర్కళ, ఇక్కడ చాలా పురాతనమైన జనార్ధనాలయం ఉన్నది, ఇక్కడికి ఎత్తయిన కొండలగుట్టల నడుమనుంచి స్వచ్ఛమయిన జలం ప్రవహిస్తూ ఉంటుంది. ఈ నీటిలో స్నానం చేస్తే పాపాలు పోతాయని ప్రతీతి, స్వామివారి కుడిచేయి పెదవుల్ని తాకడం గనుక జరిగితే, ప్రళయం రాగలదట !

## వైక్కం

కొట్టాయం జిల్లాలోని కొట్టాయంకు 40 కి.మీ. దూరాన ఎర్నాకుళం నుండి 30 కి.మీ. దూరాన ఉన్నది వైక్కం, దీన్ని 'దక్షిణకాశి'గా కొందరు వ్యవహరిస్తారు, స్వామివారినని 'వైకతప్పన్' అంటారు. ఈ శివమూర్తిని దర్శించుకోవడాన్ని 'ఆనంద దర్శనం'గా వ్యవహరిస్తారు, కులమత భేదం లేకుండా అందరూ ఈ స్వామి వారిని అనాదిగా (ఎటువంటి ప్రభుత్వశాసనాలు లేకముందే) దర్శించుకోవడం జరుగుతోంది. ఇక్కడ శివుడు తమతో కూడా కలిసి భోంచేస్తాడని భక్తుల నమ్మకం, 'కరుణా స్వరూపుని'గా అభివర్ణించబడే ఈస్వామి వారి ఆలయ ప్రాంగణంలోనే పైకప్పులేని నవదుర్గాంబ గుడి కూడా సందర్శించుకోవచ్చు !

**ఇతర దర్శనీయాలు**:



కేరళలోని **తాలిపరంజాలో శ్రీరాజరాజేశ్వరస్వామి వారి దేవాలయం** చాలా పురాతనమైందికానీ ధ్వజస్తంభంలేని శివాలయమిది. అయినా ఈతడు 'రాజాధిరాజు'గా ప్రజలచే కీర్తింపబడుతున్నాడు. ఇక్కడి స్వామివారిని నేతితో అభిషేకిస్తారు. అమ్మవారి పేరు అయ్యవారిపేరే 'రాజరాజేశ్వరి'. సతీదేవి శిరస్సు పాడిన ప్రాంతంగా శక్తిపీఠంగా భక్తజనులు భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఇక్కడి విశేషం పగటిపూట స్త్రీలకు ఆలయ ప్రవేశం నిషిద్ధం. సాయంత్రం 6 గం॥లతర్వాత హాయిగా అమ్మను అయ్యను దర్శించుకోవచ్చును.

శ్రీరామసోదరుడు **భరతునికి ప్రత్యేక ఆలయముంది.** ఇక్కడి భరతుని పేరు 'కుతల్‌మాణిక్యం'. ఈతని ఆ విష్ణుస్వరూపునిగా అర్చించి పూజిస్తారు. ఇక్కడ స్వామికి నైవేద్యం 101 వంకాయలు, పద్మాలు, తులసి, బిల్వదళాలలో పూజ. ఈ ప్రసాదంగా లభించిన వంకాయల కూర వండుకుని తింటే అనారోగ్యం తొలగిపోతుందిట. రాముని స్వాగతించిన ప్రదేశమిదేనని, తిప్రయార్‌లో శ్రీరాముని, మరుకొలములో లక్ష్మణదేవాలయం, పాయేమొలో శతృఘ్నుని దేవాలయాలున్నాయి. ఇక్కడి భరతుని ఒకేఒక్కరోజులో దర్శించినవారు ధన్యజీవులు, వారికి మోక్షము సిద్ధిస్తుందని పెద్దలమాట.

క్విలన్ పట్టణానికి 22 కి.మీ దూరంలోగల **కొట్టారక్కర మహాగణపతి** మహిమాన్వితుడు. ఇక్కడి దేవాలయాలన్ని

మిగిలిన కర్ణాటక, తమిళనాదులకు భిన్నంగా ఎర్రపెంకులతో (పూర్వపు పెంకుటిళ్ళ మాదిరి) నిర్మించారు. హిందువులు కానివారికి ప్రవేశనిషిద్ధం. ఇక్కడ శివుని పరివారం మొత్తం వున్నా, శివుడు ప్రధానదైవమే అయినా, చిత్రంగా మహాగణపతి విశేష పూజలందుకుంటుంటాడు. కథాకళి నృత్యాన్ని ప్రవేశపెట్టిన కొట్టారక్కర తంబురన్, ఈ గణపతి ఆశీస్సులు నొందినవాడే. మొదట్లో రామనాట్టంగా పిలిచే నృత్య సాంప్రదాయం చివరకు కథాకళిగా విశేషకీర్తి నార్జించింది. కొట్టారక్కర తన తొలినృత్యాన్ని మహాగణపతి వద్దే ప్రదర్శించి, ఆశీస్సులు పొందడం, మరొక విశేషం.



**కాలికట్‌కు** 125 కి.మీ దూరంలోవుందీ **'సీతా లవకుశ' ఆలయం**. శ్రీరాముడు అశ్వమేధయాగం ప్రారంభించి విజయాశ్వాన్ని పంపితే లవకుశులు, తాము వీరులమంటూ దాన్ని నిరోధిస్తారు. దాంతో రామసోదరులకు, శ్రీరామునికి కూడా ఈ పిల్లలతో యుద్ధం జరిగింది ఈ ప్రదేశములోనే. ఈ ప్రదేశములో 'శ్రీరాముడు తమ తండ్రి' అని మహర్షి ద్వారా తెలుసుకున్న లవకుశులు ఇక్కడే తమ పశ్చాత్తాపానికి చిహ్నంగా శివలింగం సృష్టించడంతో, కాలక్రమంలో ఈ లింగానికి 'కుశలవ పురీశ్వరుడు' అని పేరు వచ్చి, ప్రసిద్ధమైంది.



**కొడంగల్లూరు కాళిక** : చెట్టికులాంగర భగవతి ఆలయం విషయంలో ఈ తల్లి ప్రస్తావనేకాదు ఈ తల్లి అభయంకూడా అనుగ్రహంతో వినగల్గుతాము. జిల్లా కేంద్రంనుండి 240 కి.మీ దూరంలో 'కుట్టుంగల్, చెటవాయి, అజికోడ్ నదుల సంగమం దీవిలో ఈ అమ్మవారి ఆలయముంది. అన్నిటిలాగ శిలావిగ్రహంకాక పనసకర్రతో చెయ్యబడిన విగ్రహమిది. దారకుడనే రాక్షససంహారార్థం, శివుని భ్రుకుటినుండి వెలువడిన మహాకాళి రాక్షస సంహారం చేస్తుంది. ఉగ్రత్వం తగ్గక పోయేసరికి, శివుడు ఇద్దరు పిల్లల్ని సృష్టించి, తల్లిపాలు త్రాగేటట్లు చేసినా ఆ తల్లి శాంతించకపోయేసరికి, శివుడు కామరూపుడై ఆ తల్లిముందు చేసిన నృత్యానికి శాంతిస్తుంది. ఆ రకంగా రాక్షస సంహారార్థం వెలసినదీ కాళి.





**తిరువట్టూరు ఆదికేశవస్వామి** : 13 అడుగుల స్వామి శేషశయ్యపై పరుండి దర్శనమిస్తారు. ఈ విగ్రహం క్రింద ఒక రాక్షసుని విగ్రహముంది. ఈతనిని సంహరించిన స్వామి, ఆతని కోరిక ఆతనిపై పడుకుని మనకు దర్శినము ఆతనికి మోక్షము ప్రసాదించారు. దీనికి 3 ద్వారాలున్నాయి. మొదటి ద్వారం నుండి స్వామివారి శ్రీముఖం, రెండవద్వారంనుండి వక్షస్థలం, మూడునుండి పాదాలు దర్శించగల్గుతాము.

**మన్నరశాల నాగరాజు** : అలప్పీ దగ్గరలోని మన్నరశాల నాగరాజుస్వామి ఆలయం వుంది. తన తండ్రిని చంపిన రాజుపై కక్షగట్టి రాజకుల నాశనం ప్రారంభించిన పరశురాముడు చివరకు విసుగెత్తి తన గొడ్డలిని



విసిరేస్తే, దాని దూకుడుకు సముద్రుడు వెనక్కి వెళ్ళిపోతే ఏర్పడిన ప్రదేశమే నేటి కేరళ. అప్పుడీ క్షేత్రం సస్యశ్యామలంగా వుండాలని నాగరాజు గూర్చి తపస్సుచేస్తే నాగరాజు ఇక్కడ నిలిచాడన్నది ఒక కథ. మరొకకథ ప్రకారం దావానంలో మాడిపోయే నాగసంతతిని బ్రాహ్మణదంపతులు రక్షించగా వారిని కరుణించడాని కన్నట్లు నాగరాజే తన అయిదు తలలతో పుత్రుడిగా, ఆ తదుపరి మానవరూపంలో కుమారునిగా జన్మించినట్లు చెబుతారు. ఇక్కడ ఆ వంశంలోని స్త్రీలే అర్చనాదులు నిర్వహిస్తూంటారు. సంతానం, సౌభాగ్యం, శ్రేయస్సు కోరేవారిక్కడ నాగదేవతల్ని పూజించి సుఖిస్తున్నారు. మరో కథ ప్రకారం ఖాండవదహనానంతరం సర్పరాజు వాసుకి సంతానం ఇక్కడ పదిఎకరాల తోటలో అభివృద్ధి చెందినట్లు చెబుతారు. మొత్తానికి ఇక్కడ 5, 7 పడగలు గల రకరకాల విగ్రహాలున్నాయి.

**త్రిప్రయార్ శ్రీరామచంద్రుడు** : భరతుని ఆలయంవద్ద శ్రీరామ, వాని సోదరుల ప్రస్తావన వస్తుంది. శ్రీరామ, భరత, లక్ష్మణ, శతృఘ్న విగ్రహాలు సముద్రంలో కొట్టుకు వస్తే రామవిగ్రహం నెమలినీడపడినప్పుడు ప్రతిష్ఠించమని, మిగిలినవి వేరువేరుచోట్ల ప్రతిష్ఠించమని ఆకాశవాణి చెప్పగా అలాగే చేసారు. బలిపీఠం కూడా అలాగే నెమలి నీడ పడిన ప్రదేశంలో ఏర్పాటుచేసారు. అయితే అది గిరగిర తిరగడం ప్రారంభించేసరికి ఒకయోగి దానిపై మేకు కొట్టగా అది తిరగడం ఆగిపోయింది. మేకు కొట్టిన గుంటను మనమిప్పుడు చూడగల్గుతాము.



ఇక్కడ శ్రీరాముడు, శ్రీమహావిష్ణువు అవతారంగా నాల్గు భుజాలు, శ్రీదేవి,భూదేవిలతో మనం చూస్తాము. ఈ దేవేరులు స్వామిని పూజించాలని పడమటి ద్వారం గుండా వస్తే ఒక భక్తుడు చూసి ద్వారం మూసేసరికి అమ్మవార్లిద్దరూ ఇక్కడే వుండిపోయారు. ఒకసారి టిప్పుసుల్తాను ఇక్కడున్న అమ్మవారు సీతాదేవి చేతిని ఖండించగా రక్తం కారసాగింది. దాంతో చేతికి బంగారు తొడుగు చేయించి, తన తప్పును మన్నించమని ప్రార్థిస్తాడు. అంతేకాదు, ఆలయ నిర్వహణ నిమిత్తం కొన్ని భూములిచ్చినట్లు శాసనాలద్వారా తెలుస్తుంది.

మంచి చెడు సృష్టికి, భగవంతునికి లేదన్నట్లు, అభిమానధనుడు, కలి అవతార పురుషుడైన దుర్యోధనునికి ఇక్కడ ఆలయం నిర్మాణం చేసారు. క్విలన్‌కు సమీపంలోని **పొరువళి పెరువిరుత్తి మలనాడు** లో వుందీ **దుర్యోధన ఆలయం**. ఆయురారోగ్యాలను, పంటలను కాపాడేవానిగా దుర్యోధనుని ఇక్కడివారు పూజిస్తారు. ఈ ఊరి ప్రక్కనే ఇంకా చిత్రమనకండి రాజకీయాలలో రాటుదేలి దుర్యోధనాదుల పతనానికై శ్రమించిన శకునికి కూడా ఆలయముంది. మళయాళంలో 'మల–నాద' అంటే 'కొండమీది దేవాలయ' మని అర్థం. అనకూడదుకాని సాంప్రదాయ పద్ధతిలో ఎంతో అందంగా వుంటుందీ ఆలయం.



పాండవుల అరణ్యవాసం పూర్తయ్యాక, అజ్ఞాతవాసంలో వారిని బహిరంగపర్చాలని శకుని, దుర్యోధనులు చెయ్యని ప్రయత్నంలేదు. ఇంకా ఇక్కడ సిద్ధులున్నారని వారి అనుగ్రహం పొందితే పాండవుల నాశనం తప్పదనే ఆశతో ఈ ప్రాంతానికి వచ్చినవారికి 'కురువ'లు అపురూప స్వాగతమిస్తారు. దాంతో ఆ ప్రాంతాన్ని వారికే ధారపోస్తాడు. సిద్ధులప్పుడు పాండవులను జయించాలంటే పరమశివుని కటాక్షం కావాలంటారు. దాంతో ఇప్పుడు ఆలయంలో విగ్రహం లేని గద్దెవున్న ప్రదేశంలో దుర్యోధనుడు తపస్సు చేసాడని, దుర్యోధనుడు తమ కారాధ్యదైవమని కురువలు భక్తిశ్రద్ధలతో పూజించి, పరవశిస్తారు. ఇక్కడ జరిగే ఉత్సవాలు (మీనమాసం, మార్చి, ఏప్రిల్) చూసి తీరాల్సిందే.

**పవిత్రేశ్వరంలోని శకుని ఆలయం** కూడా దుర్యోధన ఆలయంవలెనే పూజాదికాలను పొందుతోంది. ఇక్కడ నుండే యుద్ధతంత్రం రచించినట్లు స్థానికులు చెప్పే రకకరాల కథలను మనం వినగల్గుతాము.

**పర్కళ** రైల్వే స్టేషన్‌కు 2 కి.మీ దూరంలో ఈ **జనార్దనస్వామి ఆలయం** వుంది.ప్రకృతి అందాల మధ్య పరవశింపచేసేదీ ఆలయం.



**ఆరాన్‌ముల పార్థసారథి**: 'తిరుపల్లాయ్' అనే దివ్య తిరుపతి నుండి 3 కి.మీ దూరంలో ఈ క్షేత్రం ఆలయం వుంది. ఈ దేవుని సంతానప్రదాతగా చెప్పుకుంటారు. దీనిని ధర్మరాజు ప్రతిష్ఠగా చెబుతారు. సంతానహీనులిక్కడికి వచ్చి అనాధపిల్లలను లాలించి, పాలిస్తారు. వారి లాలనతో తమకు సంతు కల్గుతుందనేది భక్తుల విశ్వాసం.

**మహదేవర్ ఆలయం, కేరళపురం :** త్రివేంద్రానికి 60 కి.మీ దూరంలో ఈ వూరు వుంది. ఇది అతి పురాతనమైన ఆలయం. 12వ శతాబ్దంలో తిరువాన్కూర్ సంస్థానాధిపతి ఆదికులశేఖర్ పెరుమాళ్ వీరకేరళవర్మ ఈ ఆలయనిర్మాణం చేసారు. ఇక్కడి గణపతి విగ్రహం విశేషం. ఎప్పుడూ ఒకేరంగులో కన్పించక పోవడం, ఆగస్టు నుండి జనవరిలో తెల్లగానూ, మిగిలిన నెలలో శ్యామలవర్ణంతో కనబడుతుంది. ఈ విధంగా రంగు మారడమనేది గణపతి మహిమను చాటుతుండటంతో, ఈ గణపతిని మహా మహిమాన్వితునిగా భక్తులు తలచి పూజిస్తారు.



కాలికట్ దగ్గర్లో **కాసరగాడ్** అనే ఊరిలో **వినాయక ఆలయ** ముంది. ఈ మహాగణపతి ఆలయం పెద్దదిగా వుంటుంది. ఈయన స్వయంభువు గణపతి. పైగా క్రమక్రమంగా పెరిగే తత్వమీ గణపతి విగ్రహానిది. ప్రస్తుతం గణపతి శిరోభాగం, గర్భగుడి కప్పుకు తాకుచున్నట్లుంది.

**స్వర్ణత్తుమన ఆలయం – పలంతోట్టం :** ఆదిశంకరుల జన్మభూమి కాలడికి దగ్గర్లో ఈ పలంతోట్టం క్షేత్ర ముంది. శ్రీలక్ష్మీకటాక్షానికి నిదర్శనమీ క్షేత్రం. కనకధారాస్తోత్రంతో పేద ఇల్లాలిని, ఆదిశంకరులు కరుణించిన ప్రదేశమే ఈ స్వర్ణత్తుమన ఆలయం.



**నెన్మిని శ్రీబలదేవ ఆలయం :** గురువాయూరుకు తూర్పున 2 కి.మీ దూరంలో నెన్మిని ప్రాంతంలో శ్రీబలదేవులకు ఆలయ ముంది. వైశాఖ శు॥ తదియ బలరాముని జన్మదినం. ఈనాడే త్రేతాయుగం ప్రారంభమైందని పురాణాలు చెబుతున్నాయి. శంఖుచక్రాలు, జపమాల, నాగలితో చతుర్భుజునిగా కనుపించే బలరామునికి కూడ వృశ్చికోత్సవాలు (నవంబరు, డిసెంబర్) పన్నెండురోజులుపాటు జరిగే త్సువాలు నయనానందకరం.

**కుమారనల్లూర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం** చెప్పుకోదగ్గది. ఇక్కడి అమ్మవారు మీనాక్షిదేవి. తన చెలికత్తెలతో తిరిగివస్తూ ఆకలిగా వుంటుంది కాబట్టి ... అని, నివేదనను ప్రహారీగోడలపై పెడతారు. ఆమె ఆకలి తీరి తమను కాపాడుతుందనేది భక్తుల నమ్మిక.



# మధ్యప్రదేశ్




భారతదేశానికి గుండెకాయ (హార్ట్ ఆఫ్ ఇండియా) గా పిలువబడే ఈ మధ్యప్రదేశ్‌కు భోపాల్ రాజధానిగా ఉంది. ఇక్కడ మొత్తం 27 జిల్లాలు ఉన్నాయి.

అవిభక్త మధ్యప్రదేశ్ రాష్ట్రం నవంబరు 1, 1956లో ఏర్పడగా, నవంబరు 1, 2002న జరిగిన రాష్ట్రాల పునర్ విభజన ఫలితంగా దీనిలో కొంతభాగం చత్తీస్‌ఘర్‌గా ఏర్పడింది. విస్తీర్ణపరంగా భారతదేశంలో రెండవ పెద్ద రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో అనేక యాత్రా స్థలాలున్నాయి. చరిత్ర ప్రసిద్ధి చెందిన ఖజురహో దేవాలయాలు ఈ రాష్ట్రంలోనివే. బుద్ధుని జీవితంలో అతి ముఖ్యఘట్టమైన సాంచి ఈ రాష్ట్రంలోనిదే.

**విస్తీర్ణం : 3,08,446 చ.కిమీ.** **ప్రధాన భాషలు : హిందీ, ఉర్దూ**

**సరిహద్దులు:** తూర్పున బీహార్, ఒరిస్సా, ఉత్తరాన రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లు, పశ్చిమాన గుజరాత్, దక్షిణాన ఆంధ్రప్రదేశ్, మహరాష్ట్ర ఉన్నాయి.


## సాంచి

హైదరాబాదు – న్యూఢిల్లీ రైలు మార్గంలో భూపాల్ తర్వాత 'సాంచీ' రైల్వేస్టేషను వస్తుంది. ఈ సాంచి పట్టణం ఒకప్పుడు ప్రముఖ బౌద్ధారామంగా చెలామణి అయింది. క్రీ.పూ. మూడవ శతాబ్ద కాలంలో అశోక చక్రవర్తిచే యిక్కడ ప్రథమ స్తూపం నిర్మించబడింది. క్రీ.శ. 1912లో సర్ జాన్ మార్షల్ అన్న బ్రిటిష్ అధికారిచే పున్నర్నిర్మింపబడిన ఈ సాంచీ క్షేత్రం తిరిగి పర్యాటకుల్ని ఆకర్షించటం ప్రారంభించింది. 16 మీటర్ల ఎత్తులో 37 మీటర్ల వ్యాసార్ధం కలిగిన సాంచీ ప్రథమ స్తూపం దేశంలోని బౌద్ధస్తూపాలన్నింటిలోకి విశేషమయినదిగా పరిగణించబడుతోంది. ఈ స్తూపం చుట్టూ నాలుగు ద్వారతోరణాలున్నాయి. ఈ ద్వార



తోరణాలపై వున్న శిల్పకళాకృతులు మనల్ని ఎంతో ఆకట్టుకుంటాయి. భూపాల్ పట్టణం నుంచి సాంచీకి బస్సులు నడుస్తుంటాయి.

## ఓంకారేశ్వర్ ఆలయం



ఇండోర్ పట్టణానికి 88 కి.మీ. దూరంలో వున్న ఈ పుణ్యక్షేత్రంలో, ద్వాదశ జ్యోతిర్లింగాలలోని ఒక శివ లింగం ప్రతిష్ఠించబడింది. నర్మదానది తీరానగల ఈ నగరంలోని ఓంకారేశ్వర దేవాలయం వేలాది భక్తులను ఆకర్షిస్తూవుంటుంది.

ఈ దేవాలయం నర్మదా, కావేరీల సంగమ స్థానంలోని ఓ లంకలో నెలకొని వుంది. ఇక్కడ స్నానం చేస్తే సర్వపాపాలు నశిస్తాయని శాస్త్ర వచనం. ఈ నది పడమరగా ప్రవహించి, అరేబియా సముద్రంలో కలవడమొక విశేషం. ఉజ్జయిని గుడిలో క్రింద భాగాన మహాకాళేశ్వరుడు పై భాగంలో ఓంకారేశ్వరుడు వున్నట్లు, ఇక్కడ క్రింద ఓంకారేశ్వరుడు పైన మహాకాళేశ్వరుడు వుంటారు. ఇది నాల్గు అంతస్తుల గుడి. క్రింద, మొదటి అంతస్తులలో శివుడు, 3,4 అంతస్తులలో శివుడు, అమ్మవారు వగైరా ఉపాలయాలు వున్నాయి. ఈ ఓంకారేశ్వరుని అమరేశ్వరుడని కూడా పిలుస్తారు. పాలు, నీళ్ళు, పూలు, మారేడు దళాలతో ఓంకారేశ్వరుని పూజిస్తారు. మూలవిరాట్టుకి ఎదురుగాగల శివలింగానికి అన్నాభిషేకాలు చేస్తారు. ఇక్కడి నర్మదా, కావేరి నదుల మధ్య ప్రాంతాన్ని శివపురి, మాంధాతృపురి అని పిలుస్తారు. జ్యోతిర్లింగ మధ్యన వున్న చిన్న చీలికద్వారా అభిషేక జలం నర్మదానదిలో కలిసి, ఆ నదిని మరింత పవిత్రం చేస్తుంది.

ఆలయం ప్రధానద్వారం మెట్లకు ఎడం ప్రక్కనగల గూడులోని పంచముఖ గణేశుడు, సింధూరం అద్ది మనోహరంగా కనుపిస్తాడు. నర్మదా నదికి రెండు వైపులా చూడదగ్గ ఆలయాలు వున్నాయి. కాకపోతే కొండ ప్రాంతం ఇరుకుసందులు, కాలినడకే ప్రాధాన్యత తప్ప, ఆటోలు, రిక్షాలు దొరకవు. ఇక్కడ" వికట హనుమాన్" ఆలయం వుంది. ఇక్కడ వెయ్యి సం॥ల నాటి మార్కండేయ ఆలయం, ఆశ్రమాలు ఇతరాలయాలు వున్నాయి. మొత్తంమీద ఇక్కడి ఆలయాలన్ని పరమశివ భక్తురాలైన మహారాణి అహల్యాబాయి నిర్మించినవే. నర్మదా పరిక్రమ చేసేవరకు ఎన్నో ఆలయాలను చూడవచ్చును. చారిత్రక, పౌరాణిక విషయాలను తెలుసుకోవచ్చును. ఈ లంకలోనే సిద్ధనాథుడనే దేవుని పేరిట మరో మందిరం వుంది.

ఓంకారేశ్వర్ ప్రాంగణంలో చక్కని వసతి లభిస్తుంది.

## ఖజురహో

క్రీ.శ. 1000లో చందేలా వంశపు రాజులచే నిర్మింప బడిన ఈ మందిరాలు, భారతీయ సంస్కృతికి అద్దం పట్టే అపురూప ప్రతిబింబాలు. ప్రపంచంలోకెల్ల అద్భుత శిల్పకళా సృష్టికి ఈ ఖజురహోని నిదర్శనంగా చెప్పవచ్చు. వెయ్యేళ్ళ భారతీయ సంస్కృతితో పాటు, దేవతలు, జంతువులు, పౌరాణిక గాథలు, నాట్యగత్తెల బొమ్మల్ని ఈ

మందిరాలపై చూడవచ్చు. ఇప్పటి ఖజురాహోను ఆనాడు "ఖర్జురువా హల్" అని పిలిచేవారు. ఇప్పటి ఖజురాహోకు తూర్పుప్రాంతంలో పాత ఖజురహో వుంది. ఆ గ్రామంలో మూడు ఆలయాలు, 1 కి.మీ. దూరంలో మరో 3 ఆలయాలు, దక్షిణ ప్రాంతంలో రెండు ఆలయాలు, నగర మధ్యలో ఇంకొన్ని ఆలయాలు వున్నాయి. ఈ ప్రాంతాన్ని "బుందేల్‌ఖండ్" అనేవారు. 9-13 శతాబ్దాలమధ్య ఈ ప్రాంతాన్ని చందేలా వంశరాజులు పరిపాలించారు. ఇక్కడి ఆలయాలన్నీ శిల్ప నిర్మాణం, ఆకృతిలో ఇంచుమించు ఒకేలాగ వుంటాయి. ఆలయముందు శిఖరం చిన్నదిగా వుండి, రానురాను గర్భగృహం మీది విమానము, శిఖరము అన్నింటికంటే ఎత్తుగా వుంటాయి.



ఇక్కడి దక్షిణప్రాంతంలోని చతుర్భుజ ఆలయం, ధూల్‌దేవ్ ఆలయంలోని శివలింగం, తూర్పు ప్రాంతంలోని జైన దేవాలయాలు, బ్రహ్మదేవుని ఆలయం, వామన ఆలయం, జవరి, హనుమాన్ ఆలయాలు, 64 (చౌషట్) మంది యోగినుల ఆలయం, మహదేవ, మాతంగేశ్వరాలయాలు, వరాహ, లక్ష్మణ, ఖాండారియా మహదేవ, దేవి జగదాంబ ఆలయం, చిత్రగుప్త విశ్వనాథ, నంది, పార్వతి, ప్రతాపేశ్వర, (జైన, బౌద్ధ, మహమ్మదీయ రీతులలో) చూడవచ్చును. మనంగా వెదుక్కుంటూ వెళ్ళలేకపోతే, రాష్ట్ర పర్యాటక శాఖవారి సహకారం, పురాతత్వశాఖ వారి గైడ్ల సేవాసౌకర్యం పొంది చక్కగా దర్శించవచ్చును.

ఇక్కడే ఆదిశంకరులు ఉపనిషత్తులకు భాష్యం రాశారు. ఇక్కడి గౌరీ సోమనాథమందిర శివలింగం దర్శించినవారికి పూర్వజన్మ, రాబోయే జన్మల విషయాలు తెలుస్తాయంటారు. ఇక్కడే సూర్యవంశపు రాజు మంధాత తపస్సు చేసాడు. మేరువు గొప్పతనాన్ని భరించలేని వింధ్యుడు శివుని గూర్చి తపస్సు చేసి నాకు ప్రశాంతతను ప్రసాదించి, నాపై నివసించుమని కోరతాడు. అటువంటి దివ్యక్షేత్రం ఓంకారేశ్వరక్షేత్రం.

ఖజురహో నాట్యోత్సవాలు ప్రతి ఏటా నిర్వహిస్తూ వుంటారు. ఎన్నోరకాలు కళలను, పురాణేతిహాసాలను తనలో యిముడ్చుకున్న ఖజురహో దేవాలయ శిల్ప సంపదను జీవితంలో ఒక్కసారైనా సందర్శించవలసిందే.

## అమర్‌కంటక్

ఇది నర్మదానది జన్మస్థలం, అలాగే ఝుహీలా, శోణనదులకి కూడా పుట్టినిల్లు, తూర్పునపుట్టి పశ్చిమంగా ప్రవహించే నర్మదను ఇక్కడ మేఖలమాతగా ఆరాధిస్తారు, నది జన్మస్థలంలోనే 14 మందిరాలున్నాయి. అందులో 7 మందిరాలలో మహదేవుని రూపాలు వున్నాయి. ఇక్కడి 2 కి.మీ. దూరంలో కపిల మహాముని తపస్సుచేసిన కపిలధార జలపాతం, అలాగే ఉడా దగ్గర ధూధ్‌దార అనే మరో జలపాతం వున్నాయి. ఇక్కడి అమ్మవారి ఆలయం శ్రీచక్ర ఆకారంలో వుంది. చుట్టు నాగకన్యలు, అమ్మవారి రూపాలు, ప్రకృతి అందాలు, అడుగడుగునా ఇటు ఆహ్లాదం, అటు ఈశ్వర దర్శనం చేయిస్తూ పులకరింపచేసే అమరధామం ఈ అమరకంటక్. సోణేశ్వరుదు,

జ్వాలేశ్వరుడు కొలువై ఉన్నారు, భద్రానదికీ కూడా ఇదే జన్మస్థలమని చెబుతారు, బిలాస్‌పూర్ జిల్లా కేంద్రానికి 97 కి.మీ., షాడోల్ నుంచి 98 కి.మీ.లలోవున్న అమరకంతేశ్వరాలయం దర్శించదగ్గది.

## మండలేశ్వర్

ఇండోర్ నుండి బధ్వా వరకు రైల్లో వచ్చి, అక్కడి నుండి 50 కి.మీ. బస్సులో ప్రయాణిస్తే ఇక్కడకు చేరుకోవచ్చు! ఇక్కడి మహేశ్వరీ నదీ తీరంలో స్వాహాదేవి ఆలయాన్ని శక్తి పీఠంగా పిలవబడుతున్న భవానీదేవి ఆలయం దర్శించగలం! ఇది శక్తి పీఠం.

## మహేశ్వర్

నర్మద, మహేశ్వరీ నదుల సంగమస్థానంలో–వెస్ట్ నిమార్ జిల్లా కసర్వాడ్‌కు 10 కి.మీ. దూరంలో ఉంది, ఓం కారేశ్వర్‌రోడ్ నుంచి కూడా ఇక్కడకు చేరుకోగలం! ఇక్కడ స్వామివారు మాతంగేశ్వరుడు, అమ్మవారు భవానీమాత స్వాహాదేవిని మహిష్మతి అంటారు. అమ్మవారి పేరిట దీనిని మహిష్మతీనగరం అని కూడా అంటారు.

## గంగేశ్వర్

నర్మదానది పశ్చిమ వాహినిగా ప్రవహించే ప్రదేశంగా నర్మదాఖులా నదుల సంగమస్థానంగా ప్రసిద్ధి చెందింది గంగేశ్వర్, ఇక్కడ స్వామిని గంగేశ్వరునిగా ఆరాధిస్తారు, ఇక్కడకు ఒక కి.మీ. దూరంలో చారుకేశ్వర్ ఉంది, వెస్ట్‌నిమార్ జిల్లాలో బడవాహ రైల్వేస్టేషన్‌కు 20 కి.మీ. దూరంలో ఉంది.

## మహోబా

ఖజురాహోకు 45 కి.మీ. ఝూన్సీకి 60 కి.మీ. దూరంలో ఉన్న మహోబాలో కంతేశ్వరాలయం, చండికాలయం, చూడవలసినవి, అగ్నేయంలో ద్వారాలుండే ఆలయాలు అరుదు, అటువంటివిక్కడ చూడగలం! ఇక్కడకు సమీపంలోనే ఒక సూర్యదేవాలయం ఉంది. పశ్చిమంవైపు గోకర పర్వతం, కొన్ని చీకటి గుహలు, భైరవమూర్తి గుడి దర్శించవచ్చు!

## మహాకాళేశ్వరుడు

ద్వాదశ జ్యోతిర్లింగక్షేత్రాలలో ఒకటైన ఉజ్జయినీ కాళేశ్వరుడు "దక్షిణా(భిముఖ)" మూర్తి. ఇంకా ఇక్కడ చితాభస్మంతో స్వామిని అర్చిస్తారు. క్షిప్రానది ఒడ్డునగల ఈ ఉజ్జయిని పొరుగరాజులు ఆక్రమించుకోవాలని తలుస్తూంటే, రాజు శిక్షకు గురైన శ్రీకరుడు అనే చిన్నారి ఈ విషయాన్ని ఆ పూజారికి చెబుతాడు. ఇది రాజుగార్కి తెలిసేలోగా బ్రహ్మవరప్రసాదియైన దూషణాసురుడనే రాక్షసుడి అండతో శత్రువులు ఉజ్జయినిపై దండెత్తుతారు. ఈ పరిస్థితి గ్రహించిన శ్రీకరుడు, పూజారి శివుని ప్రార్థిస్తారు. దీంతో శివుడు మహాకాళేశ్వరుడిగా ఉగ్రరూపంలో అవతరించి దూషణాసురుడిని, ఇతరులను సంహరిస్తాడు. ఇందుకు ప్రతిగా భక్తుల ప్రార్ధనతో మహాకాళేశ్వరుడు జ్యోతిర్లింగమూర్తియై ఇక్కడ దక్షిణాభిముఖుడై వెలిసాడని పౌరాణిక, చారిత్రక నేపథ్యం గల ఓ కథ.

## మహేశ్వరం



మహాభారత గాథలో వర్ణించబడిన 'కార్త్య వీర్యార్జున' రాజుకు మహేశ్వరం రాజధానిగా వుండేది. నర్మదానదీ తీరాన గల ఈ పట్టణాన్ని ఆ కాలంలో 'మహిష్మామతి' అని పిలిచేవారు. ఇక్కడ అనేక శివమందిరాలు వున్నాయి. యిక్కడి హోల్కార్ రాజులకి చెందిన కోట కూడా మనం దర్శించవచ్చు.

'చిత్రకూటం' అనబడే పర్వతం ఈ మహేశ్వరా నికి దగ్గరలోనే వుందని యాత్రికులు గమనించాలి. ఇండోర్ నుంచి మహేశ్వరానికి బస్సులు నడుస్తుంటాయి.

## రావణుని దేవాలయం

ఉజ్జయిని మారుమూల ప్రాంతం చిక్కులలో ప్రజలు రావణాసురుని పూజించడమే గాకుండా, విజయ దశమినాడు ఇక్కడ జాతర్లుకూడా చేస్తారు. ఇంకా ఇక్కడో విచిత్రం, గాడిదరూపం గల ఖరాన్నదేవిని కూడా, రావణాసురుని ప్రీత్యర్థం పూజిస్తారు.

ఇక్కడ జాతర్లు జరక్కపోతే ఏదో అనర్థం జరుగుతుందన్నది ప్రజల భయం. ఇక్కడ రావణసంతతికి చెందినవారు వున్నారుట. ఆశ్చర్యంగా వుందికదూ!

## చిత్రకూటం

ఇది రామాయణంతో ముడిపడివున్నదని పౌరాణిక వాదుల విశ్వాసం. ఇక్కడ సీతారాములు 11 సం.ములు అరణ్యవాస సమయంలో నివసించారని చెబుతారు. ఇక్కడి ప్రతి అణువు, అడుగడుగునా రామాయణం, రామునిపేరుతో వున్నాయని, అంతకు మించి ప్రతివారు ఒకరినొకర్ని "రాం!రాం!" అని పలుకరించుకుంటారు.



ఒకానొక సమయంలో, పూర్వం ఈ చిత్రకూటం కరువుకాటకాలతో అల్లాడిపోతే, సతీ అనసూయ తన తపస్సుతో, మందాకినిని ఇక్కడ పారించి, కరువు కాటకాలు లేకుండా చేసిందట. అందుకని ఈ ప్రాంతాన్ని సతి అనసూయమాత తపోభూమిగా చెబుతారు.

సీతాదేవిని కాకాసురుడు బాధించి, రామునిచేత శిక్షింపబడిన ప్రదేశమిదే. ఇక్కడి పెద్ద పెద్ద గుహలలో ఒక్కడొక్కడే నడువగలిగే ప్రదేశం. ఇక్కడ గోదావరి "గుప్తం"గా వుంది. రామలక్ష్మణులను

సుగ్రీవుడు, మారుతి కలిసిన ప్రదేశంగా దీనిని చెబుతారు. ఈ గుప్తగోదావరి ప్రవాహదారిలో ఒక శివలింగం వుంది.

చిత్రకూటానికి 25 కి.మీ హనుమాన్ ధార వుంది. ఎక్కడ నుండి వస్తుందో తెలియదు. 40 కి.మీ యమునా నది వుంది. ఇక్కడ తులసీదాసు విగ్రహముంది. ఆయన వ్రాసిన రామచరితమానస్‌ను భద్రపరచిన స్థలంకూడా ఇక్కడ కనబడుతుంది.

చిత్రకూటానికి దగ్గర్లో కామతోగిరి, దీనిమీద రాముడు నివసించాడంటారు. వేలాది కోతులు, ఎన్నో గళ్ళు ...అంతా రామాయణంతో కలిసిమెలిసినట్లు వుంటుంది.

"రామదర్శక్" అని చిత్రకూట్‌లో ఒక గుహలో రామాయణ ఘట్టాల ప్రదర్శనాలయముంది. ఇక్కడ రాజులకు సంకేతంగా కొన్ని చెట్లుకూడా పెంచారు. ఇక్కడి గిరిజనులు పాడుకొనే పాటలు అందంగా వుంటాయి. ప్రకృతి పరిసరాలు, అధ్యాత్మికత కలబోసినట్లు ఇక్కడ మనం చూడవచ్చును.

## ఉజ్జయిని

ఒకప్పటి "అవంతి" రాజ్యమిది. కనకశృంగ, పద్మావతి, కుశస్థలి, కుముద్వతి, భోపాల్‌కు 188 కి.మీ దూరంలో వుంది. ఇక్కడి అధిదేవతలు మహాకాళేశ్వరుడు, మహాకాళి. ఇక్కడ చితాభస్మంతో శివునకు పూజ చేయడమొక ఆనవాయితీ. భూగర్భగుడి అయిదు అంతస్తులలోవున్నా ఈ ఆలయం చారిత్రక పౌరాణిక ప్రాముఖ్యత కలది. దక్షిణాభిముఖంగా వుండే ఈ దేవుడు భూఅంతర్భాగంలో వుంటాడు. శివుని అందరు దర్శించ వచ్చును. భద్రతదృష్ట్యా ఎక్కువ జాగ్రత్తలు అడుగడుగునా తీసుకున్నారు. గర్భగుడిలోనే పార్వతి, గణపతి హనుమంతుని విగ్రహాలువున్నాయి.



ఇక్కడి కాలభైరవుడు మధ్యపానప్రియుడు. భక్తులు సమర్పించే ఈ మద్యం కాలభైరవుని నోటిదగ్గర వుంచితే పెద్ద శబ్దం చేస్తూ సీసా ఖాళీ అవుతుంది. ఈ విచిత్రం... విచిత్రమే అయింది తప్ప విషయ వివరం ఎవరు తెలుసుకో లేకపోయారు. ఈ స్వామిని దర్శిస్తే బ్రహ్మహత్యాపాతకం పోతుందని పురాణాలు చెబుతాయి. ఈ ప్రదేశంలోనే నిరక్షరాస్యుడైన కాళిదాసుని బీజాక్షరాలు వ్రాసి మహాకవిగా మార్చింది ఆ తల్లి.

ఉజ్జయినికి 7 కి.మీ ఈ భర్తృహరివున్న గుహలు 400 అడుగులమేర విస్తరించాయి.ఇక్కడ పరమేశ్వర లింగముంది. భర్తృహరి సుభాషితాలనిక్కడే భద్రపరచినట్లు చెబుతారు.

ఈ ఉజ్జయినికి 5 కి.మీ దూరంలో సాందీపులవారి ఆశ్రమం, బలరామకృష్ణులు విద్యాభ్యాసం చేసినట్లు చెబుతుంది. ఇక్కడ వీరితోపాటు సుదాముని విగ్రహం కూడ వుంది. ఇక్కడి (ఉజ్జయిని) సమీపంలోని హరసిద్ధి ఆలయం, మంగళనాథుని పేరిట కుజునికి ఆరాధన, నక్షత్రశాలలో ఒకటైన యంత్రశాలలను చూడవచ్చును.

## భోజరాజేశ్వరాలయం

మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌కు 28 కి.మీ దూరంలో వుందీ భోజరాజేశ్వరాలయం. దీనిని ధారాదేశాన్ని ఏలిన భోజరాజు నిర్మించినట్లు చెబుతారు. సమున్నతంగా ఆలయం నిర్మించారుతప్ప, అర్చనాదికాలు చేయాలంటే, అంతరాలయంలో పది,పన్నెండు మెట్లుదిగి శివునికి చేరుకోవాలి. అందుకని ఇంతశ్రమపడలేని భక్తులు బయటవున్న శివపంచాయతనానికి పూజలు చేసుకుని వెళ్ళిపోతుంటారు. దీనికి ఆలనాపాలనా లేనట్లు అర్చనాదికాలు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. చారిత్రక పౌరాణిక నేపథ్యంకల్గిన ఈ ఆలయాన్ని అభివృద్ధిచేస్తే భక్తుల రాకపోకలకు సులువు, దర్శించేవారి మనసుకు తృప్తికల్గుతుంది.

జబల్‌పూర్‌కు 15 కి.మీ దూరంలో గౌరీశంకరమందిరం 1155 సం.లో నిర్మించబడింది. దీనికి 1.5 కి.మీలో వున్న ధురంధర్ జలపాతం చూడదగ్గది. శాతవాహనులు నిర్మించిన ఈ ఆలయం నర్మదా, సరస్వతీ నదుల సంగమస్థలంలోవుంది. కానీ ప్రచారంలేదు. ప్రాముఖ్యత తెలియదు.

## హయగ్రీవావతారము



గౌహతికి 22 కి.మీ. దూరంలోని మణికూట (హోజలు) పర్వతముపై హయగ్రీవుని ఆలయముంది. ఈయన ప్రక్కనే కేదారేశ్వరస్వామికూడా వున్నాడు. ఇక్కడి స్వామిని హయగ్రీవ మాధవస్వామి అని అంటారు. మత్స్యావతారం కన్నా ముందు మధుకైటభులను శిక్షించి స్వామి వేదాలను బ్రహ్మకు ఇస్తాడు. బాణాసురుని కుమార్తె ఉషను, శ్రీకృష్ణ మనుమడు అనిరుద్ధుడు వివాహమాడిన ప్రదేశం. బాణాసురుని గర్వమణచిన ప్రదేశము ఇదే. దార్వాంగ్‌జిల్లా తేజోపూరులో దహపర్వతముపై శ్రీకృష్ణ ఆలయం అలాగే త్రిపురారిగా శివమందిరాలు వున్నాయి. గౌహతికి ఆవలిఒడ్డున "అశ్వక్రాంత్‌స్వామి" ఆలయం ప్రాంతం, నరకాసురుని వధించిన ప్రాంతంగా చెబుతారు.

### దర్శనీయాలు :

**ఉజ్జయనికి** 5 కి.మీ. దూరంలో **'కాల్బదేవి'** వుంది. ఇచ్చట పురాతనమైన **సూర్యదేవాలయం**, సిప్రానది ప్రక్కన పూర్వ ఏనాటినుంచోవుండే దానిని 15వ శతాబ్దిలో ఖిల్జి సుల్తాన్ నాసీర్షా ధ్వంసం చేశాడు. ఈ ఆలయ శిధిలాలు మనల్ని దిక్కుతోచని స్థితిలోకి నెట్టివేస్తున్నాయి. శిధిలాలు, మాత్రం వెక్కిరిస్తూన్నట్లు వెక్కివెక్కి ఏడిపిస్తున్నాయి. ప్రక్కనేగల 'బ్రహ్మకుండం' చెక్కుచెదరకుండా నిల్చివుంది. ఈ బ్రహ్మకుండాన్ని అప్పటి నుండి భక్తులు దర్శిస్తూనే వున్నారు.

ధాతియానుండి 17 కి.మీ, ఝాన్సీనుండి సుమారు 11 కి.మీ దూరంలో **ఉన్నవ్ క్షేత్ర** ముంది. 18వ శతాబ్దంలో ధాతియా సంస్థానాధీశులచే 'పహూజ్' నదీ తీరంలో శ్రీసూర్యదేవాలయం, నిర్మించబడింది. ఇచ్చటున్న

మూడు కుండాలలో ఎటువంటి దీర్ఘవ్యాధులైనా పోతాయిట. ఇక్కడి సూర్యనారాయణుని 'బ్రహ్మణ్యదేవ్, బ్రహ్మబాలాజీ' అనికూడ పిలుస్తారు. ఇక్కడ బింబాకృతిలో సూర్యుడు వెలిసాడని చెబుతారు. ఇక్కడ సూర్యునితో మిగిలిన 8 మంది గ్రహరాజులను మనం చూడగల్గుతాం. ఉత్తరాయణంలో పెద్ద ఉత్సవం జరుగుతుంది. నిత్యపూజలు సరేసరి. వసంతపంచమి, రంగపంచమి వగైరా పర్వదినాలు పెద్దఎత్తున ఉత్సవాలు జరుగుతాయి. అప్పుడు రద్దీ ... అమ్మో చెప్పలేము. వూహించలేమూకూడా!

**అర్చా – శ్రీరామమందిరం :** ఇది గ్వాలియర్ నుండి 120 కి.మీ లో శ్రీరామక్షేత్రం. 16 వ శతాబ్దంలో నిర్మించిన రామరాజాలయం వుంది. యమునకు ఉపనదియైన బెట్వానదీమధ్యలోని ఒక ద్వీపంలో వుందీ అర్చాకోట. 1531లో బుందేల్‌ను పాలించిన రుద్రప్రతాప్ దీని నిర్మాత. అర్చాను పాలించినవారిలో మధుకర్‌షా, కృష్ణభక్తుడు. ఆయన భార్య శ్రీరామభక్తురాలు. ఇది ఇద్దరి మధ్య కొంతవాదానికి కారణమైంది. ఒకసారి మహారాణి అయోధ్య దర్శనానికి వెడుతూంటే, వస్తూ శ్రీరాముని తెచ్చేమాటైతే రా! లేకపోతే వద్దంటాడు. భక్తజనప్రియుడు కదా భగవంతుడు మహారాణి ననుసరిస్తాడు. రాజు రామమందిరం నిర్మిస్తాడు. తర్వాత తర్వాత రాణీ నివాసభవనాన్ని రామరాజాలయంగా తీర్చిదిద్దుతాడు. ప్రతిఏటా శ్రీరామనవమి ఊరంతా కోలాహలంగా, ప్రతిఒక్కరు పెండ్లి పిలుపునందుకుని రాముని పెండ్లికి తరలిరావడం, ఈ వూరి ఆచారమైపోయింది.

**అజ్మీర్ ఖాండ్వా** రహదారిలో ఖరగాంకు దగ్గరలో ఈ పవిత్ర ప్రదేశముంది. ప్రాచీనమైన ఈ క్షేత్రంలో పూర్వం 99 ఆలయాలు, 99 సరోవరాలు, 99 కుండములు వుండేవని చెబుతారు. ఇప్పుడు మనం ఆలయాలు పోయి శిథిలమండపాలను చూడగల్గుతున్నాం. ఇక్కడి కొద్దిదూరంలో మహాలక్ష్మి ఆలయముంది. ఇక్కడి అమ్మవారి విగ్రహం 'ప్రకృత్యైనమః, వికృత్యైనమః' అంటారు కాబట్టి ఎంతో అందంగా వుంటుంది. ఇంకా ఈ విగ్రహం త్రికాలాలలో (ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం) మూడు విధాల కనుపిస్తుందని స్థానికుల భావం.

**జటాశంకర ఆలయం :** 'పచ్‌మరి' జబల్‌పూరు మార్గంలో పిపారియా రైల్వేస్టేషనునుండి 47 కి.మీ దూరంలో వింధ్య పర్వతశ్రేణులలోని ఒక భాగాన్ని 'సాత్పురా' పర్వతశ్రేణిగా చెబుతారు. ఈ దట్టమైన అడవుల మధ్యభాగంలో వుందీ పచ్‌మరి.ఇక్కడి పొడుగాటి గుహలోవుంది జటాశంకర ఆలయం. ఇక్కడ శివలింగం తోపాటు శివుడు, పార్వతి విగ్రహాలు కూడా వున్నాయిట. ఈ ప్రాంతంలో పాండవుల గుహలు వున్నాయి. ఇవి ద్రౌపదితో కల్పి ప్రతిఒక్కరికి వున్నాయి. వనవాసకాలంలో వారీ గుహలలో నివసించారుట. ఇవి 6 లేక 7 శతాబ్దంలో నిర్మించినట్లు చరిత్రకారుల భావన.

**బడేమహదేవ్** అనేచోట ఒక గుహలో **బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, గణపతి** మూర్తులున్నారు. ఇంకా ఆనాడు భస్మాసురుని మోహినీ అవతారంతో శ్రీహరి వధించిన ప్రదేశమిదేనని చెబుతారు. గుప్తమహదేవ్‌లోకూడా శివలింగము, గణపతిని చూస్తాం. చౌరాఘర్ అనే ప్రదేశంలో మరొక శివాలయం వుంది. కొండపైకి వెళ్ళాలంటే స్వర్గానికి వెళ్ళాలన్నంత కష్టం. నిట్టనిలువుగా వున్న వేయి మెట్లను ఎక్కితే స్వామి దర్శనం, సులభుడు, సుశీలుడు కాబట్టి సులభమౌతుంది.

**జబల్‌పూరు** జిల్లాలో **జాబాలిమహర్షి ఆశ్రమం** నిర్మించుకుని వున్నాడుట.ఆయన పేరుతోనే జాబాలిపురం

'జబల్‌పూరు'అయింది. పూర్వం శివుడు నాశనం చేసిన 'త్రిపురాలు' ఈ ప్రాంతానికి దగ్గర్లో వుండేవట. అందుచేత శివునికి త్రిపురాసురుడని, ఈ వూరికి 'త్రిపురి' అనే పేరువచ్చిందట. మహారాణి దుర్గావతి కాలంలో జబల్‌పూరు ఎంతో పేరుప్రఖ్యాతులను పొందింది. ఇచ్చట చూడవలసినవి మదన్‌మహల్, తిల్వారాఘాట్ వద్దగల మహదేవ్ ఆలయం, చిన్నకొండమీదగల చౌసత్‌యోగినీ ఆలయం, రాణి దుర్గావతి మ్యూజియం, నర్మదానది ఒడ్డునగల లామ్‌హెటాఘాట్ అనే స్నానఘట్టం వగైరాలు. పాలరాతి కొండలమధ్య జబల్‌పూరులో అందం సామాన్యులకన్నా, ప్రకృతి ఆరాధకులకు మరింత ఆనందదాయకం. భృగుమహర్షి ఆశ్రమం ఇక్కడ వుండేదట. ఇక్కడి పాలరాతి కొండలమధ్యనుండి సన్నని ఇరుకైన దారిలో ప్రయాణిస్తే నర్మదా సోయగాలు, దాని ప్రవాహం చూడటానికి ఎంతో విచిత్రంగా, అందంగా వుంటాయిట.

గోండియానుండి బాలాఘాట్‌కు పోవు మార్గంలో సుమారు 5 కి.మీ దూరంలో వుందీ **నాగరా క్షేత్రం.** ఇక్కడి అతిప్రాచీనమైన శివాలయం, అందులోని నల్లరాతి శివలింగం చూడవలసింది. శివలింగం అడుగు భాగంలో విభిన్న చదరపు పలకలు, ప్రతి పలకపైనా నాగదేవత రూపం దర్శించవలసిందే!

**నర్మదా దర్శనం :** 'అమర్‌కంటక్' అనేసరికి నర్మదాదేవి' ఆలయం జ్ఞప్తికి వస్తుంది. ఈ నర్మద జన్మస్థానం కూడ ఇదే. శివుని చెమట (స్వేదం)నుండి పుట్టిన ఈ నర్మదను దక్షిణగంగగా పిలిచి, ఇక్కడివాళ్ళు కొలుచుకుంటారు. నర్మదా పరిక్రమ ఎందరో మహనీయులు చేస్తారు. ఏ నదీ తీరంలో లేనట్లు ఇక్కడ 14 మందిరాలున్నాయి. అందులో 7 శివునివే!

నర్మదా జన్మస్థానంలోని **అమరకంఠేశ్వర, పార్వతి నర్మదానదీ ఆలయాలు** దర్శించదగ్గవి. ఇక్కడి స్నానకుండాలలో భక్తులు స్నానంచేసి తమ భక్తిప్రపత్తులను చాటుకుంటారు. అమర్‌కంటక్ సముద్రమట్టానికి సుమారు 3495 అడుగుల ఎత్తునవుంది. ఇక్కడో చిన్నకొలను వుంది. ఇదే నర్మద జన్మస్థలం. ఇక్కడికి 3 కి.మీ లో నర్మద వయ్యారాలు చిలికిస్తుంది. దీనిని 'కోకిలధార'గా చెబుతారు. ఇక్కడినుంచి అడుగడుగున జలకుండాలు ఆలయాలు, మహర్షుల నివాసాలు, తపోభూములందు దర్శించగల్గుతాం. భృగుమహర్షి తపోభూమిని దాటి కాస్తముందుకు సాగితే 'మహామేరు' అనే శివాలయం వుంది. ఇది దాటితే 'కరణమంది'రమనే మరొక ఆలయం. దీనికి మూడు వైపులా చిన్నచిన్న ఆలయాలను చూస్తాం. శోణ, నర్మద, ముహీలా అనే మూడు నదులు అమరకంటక వద్ద పుట్టినవే. పశ్చిమంగా ప్రవహిస్తున్నాయి. నర్మదను మేఖలమాతగా ఇక్కడివారు ఉదహరిస్తారు.

ఇక్కడ జ్వాలేశ్వర, శోణేశ్వర్ అనే ఆలయాలనుచూస్తాం. వీటికి దగ్గరలో 'శ్రీచక్ర' ఆకారంలో నిర్మించబడిన అమ్మవారి ఆలయం వుంది. ఈ ఆలయాన్ని చుట్టు నాగకన్యలతో, అమ్మవారివివిధ రూపాలతో ఎంతో అందంగా తీర్చిదిద్దారు. ఇచ్చటి పూజలు సత్వరఫలితాలనిస్తాయని, గాయత్రి ఉపాసన అత్యంత ఫలప్రదమని, చేయవలసిన వారు తప్పక చెయ్యాలని చెబుతారు.

జబల్‌పూరులోని మరొక అత్యంత ప్రాచీన శివాలయం **'గుప్తేశ్వరాలయం'.** ఈ ఆలయానికి ఎదురుగా పార్వతీ మాత ఆలయముంది. గుప్తేశ్వరుని దర్శనంవలన ఇహలోకవాంఛలు తొలగి, శివజ్ఞానంతో గమ్యస్థానానికి చేరుతామన్నది భక్తుల విశ్వాసం. పూర్వమీ ప్రాంతం ఋషివాటిక. ఇప్పుడిది జనవాసమై కూర్చుంది. దేవుడు గుప్తేశ్వరునిగా వూరిబయట అన్నీవిడచి, మరచినట్లు, నిర్మోహుడై నీరాజనాలందుకుంటున్నాడు. ఇక్కడి కొండల్లోకి చూస్తే ఆ కొండలలో శివలింగ స్వరూపం చూడగల్గుతాము.

## : : సూక్తులు : :

మనిషి తన చిత్తంలోని ప్రవృత్తులని నియంత్రించుకుని, తన వశంలో వుంచుకోవడమే యోగం.

– పతంజలి

ప్రతి సమస్యకూ ఓ పరిష్కారం వుంటుంది ! వెతికి చూస్తేనే అది దొరుకుతుంది !

– ఓ సూక్తి

మనిషికి బాగా అవసరమయ్యేది కాలమే ! అయితే మనిషి ఎక్కువగా దుర్వినియోగం చేసుకొనేది కూడా కాలాన్నే !

– ఒక సూక్తి

ఈ భూమీ్మద ఆనందాన్ని మించిన పరిపుష్ట పోషకాహారం వేరొకటిలేదు !

– ఓ సూక్తి

భగవద్గీత పరిష్కారం చూపలేని సమస్య ఈ ప్రపంచంలోనే లేదు.

– మహాత్మాగాంధీ

భగవంతుడు చల్లని చూపు లేకపోతే, మంచివారితో మైత్రీ బంధం అసలే దొరకదు.

– తులసీదాస్

మనిషికి నమ్మకం అనేది లేకపోతే, అజ్ఞానికి ఆదితాళం.

–స్వామీ రామతీర్థుడు

చిరునీతి వాక్యాలే మనిషి ప్రవర్తించవలసిన పద్ధతులు నేర్పేది.

– ప్యాలే

మనకి సాయం చేసుకోగలిగితేనే, ఆ భగవంతుడైనా మనకి సాయం చేసేది !

– హెచ్. స్పెన్సర్

ప్రయత్నం, సాహసం, ధైర్యం, బుద్ధిబలం, శక్తి, పరాక్రమం, ఆరుగుణాలు ప్రతి మనిషిలో ఉండటం అవసరం.

– భామినీ విలాసం

హృదయంలో ప్రేమ గలవారు ఆత్మక్లేశంతోను, అశాంతితోనూ బాధపడరు.

– జాన్‌బార్ట్

జీవితం అంటే ఒక సమస్యనుంచి మరో సమస్యకు ప్రయాణం మాత్రమే ! ఏ సమస్యలూ లేని జీవితమంటూ వుండదు.

– ప్రాచీన సూక్తి

విద్య, వివేకం, పరిజ్ఞానం బావిలో నీళ్లు వంటివి. అవి తరగని నిధులు వాడుతున్న కొద్దీ ఊరుతుంటాయి.

– జె.ఎం. క్లార్క్

పొరపాటు చేయలేనివాడు, తన జీవితంలో ఏ పనీ చేయలేడు.

– లింకన్

ఎంత మంచి పనిఅయినా మొదట్లో అసంభవమైనదిగానే కనిపిస్తుంది.

– కార్లైల్

# మహారాష్ట్ర




35 జిల్లాలు కలిసియున్న మహారాష్ట్రకు ముంబాయి నగరం రాజధానిగా ఉంది. వైశాల్యాన్ని బట్టి, భారతదేశంలో 3వ స్థానాన్ని ఆక్రమించి ఉందిది.

మౌర్యులు ఏలుబడిలోకి వచ్చిన తర్వాత మాత్రమే మహారాష్ట్రకు చరిత్ర ఏర్పడింది. క్రీ.శ. 1294 వరకు అనేక హిందూ రాజుల ఏలుబడిలో ఉన్న ఈ రాష్ట్రం ఆ తర్వాత ముస్లిం పాలకుల వశమైంది. శివాజీ కాలంలో మహారాష్ట్ర గొప్ప వెలుగు వెలిగింది. ఆ తర్వాత పీష్వాలు మరాఠా సామ్రాజ్యాన్ని ఏర్పరిచారు. ఇది గ్వాలియర్ నుండి దక్షిణాన గల తంజావూరు వరకు విస్తరించింది. 1761లో జరిగిన పానిపట్ యుద్ధంలో అహ్మద్ షా అబ్దాలి మహారాష్ట్రను గెలుచుకున్నారు. ఆ తర్వాత 1818లో బ్రిటిష్ ఏలుబడిలోకి వచ్చింది. 1960 మే 1వ తేదీన స్వతంత్ర రాష్ట్రంగా అవతరించింది.

**విస్తీర్ణం : 3,07,713 చ.కిమీ.** **ప్రధాన భాషలు : మరాఠి, గుజరాతి, హిందీ**

**సరిహద్దులు**: దక్షిణాన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఉత్తరాన తూర్పున మధ్యప్రదేశ్, పశ్చిమాన అరేబియా సముద్రం, వాయువ్యాన డయ్యూ, డామన్, గుజరాత్ ఉన్నాయి.

## మొరెగాం

పూణె నుండి 50 కి.మీ. దూరంలో కల ఈ ప్రదేశం లక్ష్యసిద్ధిదాయకమైనది. ఇదో మహిమాన్విత పుణ్య క్షేత్రం. ఈ క్షేత్రంలో మయూరేశ్వర్ – వినాయకుడు వేంచేసి ఉంటాడు. మహారాష్ట్రలో ఉన్న అష్ట వినాయకుల్లో ఒకరైన ఈ మొరెగాం మయూరేశ్వర ఆలయం చాలా ప్రసిద్ధి చెందినది.

సిద్ధి, బుద్ధి అను తన అనుచరులతో వెలసిన ఈ ఆలయంలో సోదరుడైన కార్తికేయుని వాహనాలైన నెమలి, నాగరాజులతో కూడా కనువిందు చేస్తాడు ఈ మయూరేశ్వర వినాయకుడు. పటిష్టమైన స్థంభాలతో రాతిగోడ కట్టడాలతో ఉన్న ఈ ఆలయంలో, అన్ని వినాయక ఆలయాలలో వలే వినాయకచవితి ఉత్సవం చాలా ఆడంబరంగా జరుగుతుంది. భూత ప్రేత గణాలపై విజయానికి చిహ్నంగా విజయదశమినాడు కూడా చాలా బాగా ఉత్సవం జరుపుతారు.

## ఎల్లోరో - కైలాసనాథ ఆలయం

ఔరంగాబాద్ నుండి 29 కి.మీ. దూరంలో హిందూ జైన దేవాలయాల సముదాయం ఈ ఎల్లోరా గుహలు, మొత్తం 34 ఉన్నాయి. ఇందులో 12 బౌద్ధమతానికి, 17 హిందూమతానికి, 5 జైన మతానికి చెందినవి. రెండవ

గుహలో బుద్ధుని విగ్రహం, 6వ గుహలో అసానముద్రలో ఉన్న బుద్ధ విగ్రహం వున్నాయి. 11వ గుహ రెండస్తులది, 12వ గుహ మూడు అంతస్తులు కలిగి ఉంటుంది. 16వ గుహలో హిందూ ఆలయాలున్నాయి. ఈ గుహల్లో హిరణ్యకశిపుణ్ణి వధించిన ఉదంతం, ఆది దంపతుల కళ్యాణ ఘట్టాలు, పాచికలాడే రసవత్తర ఘట్టాలు, అనేక శిల్పాలు అత్యంత రమణీయం. ఇక్కడ ఉన్న కైలాసగుహ నిర్మాణ సమయంలో కొండతొలచిన రాయి బరువు రెండు లక్షల టన్నులుంటుంది. ఇక్కడ ఉన్న ఈ కైలాసనాథ ఆలయం ద్రవిడ సంస్కృతికి చేరువగా ఉంటుంది.

60,000 చ॥అ॥ స్థలంలో నిర్మించిన ఈ ఆలయం గోపురం (విమానం) 90 అడుగులు ఉంటుంది. ఈ ఆలయగోపురం తమిళనాడులోని మల్లమ్మపదంలో రథాలను గుర్తుకుతెస్తూ ఉంటుంది. పల్లవులచే నిర్మింపబడ్డ ఈ ఆలయం, మరియు మల్లమ్మపురంలో ఆలయం ఒకే సమయంలో నిర్మింపబడినవి.

## మహాలక్ష్మీ ఆలయం (కొల్హాపూర్)



ఒకప్పటి కరవీరపురం ఈనాటి కొల్హాపూర్. అతి పురాతనమైన మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం చాలా ప్రశస్తమైన ఆలయంగా ప్రసిద్ధి. ఆలయం బులబాయి దేశాయి రోడ్డులో ఉంది. మహారాష్ట్రలో ఉన్న 4 శక్తి పీఠాలైన భవాని–తుల్జాపూర్, మహలక్ష్మి–కొల్హాపూర్, మహామాయ లేదా రేణుకాదేవి–మహుర్, జగదాంబ–సప్తశృంగిలలో ఒకటైన ఈ ఆలయం పూణెకి 240 కి.మీ. ఉత్తరంగా జాతీయ రహదారిపై వెలసి ఉంటుంది. ఈ మహలక్ష్మిదేవి విగ్రహం 3 అడుగుల, నల్లని ఏకశిలపై మలచబడిన ఈ ఆలయమందలి శ్రీ చక్రయంత్రం కూడా గోడలపై కనిపిస్తుంటుంది. ఈ ఆలయంలో మరో విశిష్టత ఏమిటంటే, సంవత్సరానికి ఒకమారు మార్చి, ఏప్రిల్ నెలల్లో సూర్యాస్తమయం యొక్క సూర్య కిరణాలు, ఈ దేవి పాదాలను 3 దినాల వరకు తాకుతూ ఉంటాయి.

## భవాని ఆలయం - తుల్జాపూర్

మహరాష్ట్రలో, షోలాపూర్‌కి దగ్గరగా ఉన్న సహ్యాద్రి కనుమలలో, యమునాచల అనే కొండపై వెలసి ఉంది ఈ భవాని ఆలయం. ఈ ఆలయ ప్రవేశద్వారం కాస్త ఎత్తులో ఉండుటచే, భక్తులు కొన్ని మెట్లు ఎక్కి పైకి వెళ్ళి దేవిని దర్శించుకుంటారు.

12వ శతాబ్దం నుండి ఈ ఆలయం ఉన్నట్టు చరిత్రకారులు చెప్తారు. 3 అడుగుల ఎత్తు ఉన్న గ్రానైట్ విగ్రహ రూపంలో ఉన్న భవానీదేవి, ఆయుధాలు ధరించిన చేతులతో, మహిషాసురుని తల ఒక చేతితో ఉన్న ఈ దేవి విగ్రహం భీతి గొలుపుతూ ఉంటుంది. తుంజ, తురజ, త్వరిత మరియు అంబ అను నాలుగు పేర్లలో ఈ దేవిని ఇక్కడ కొలుస్తారు. ప్రతిరోజు 4 సార్లు పూజలు, హారతులు జరుగుతాయి. ప్రతీ మంగళవారం దేవిని ఊరేగింపుగా తీసుకొని వెళ్తారు.

## ఎలిఫెంటా గుహలు

క్రీస్తుశకం 6వ శతాబ్దంలో ఇవి చెక్కబడినట్లు అర్థమవుతోంది. పడమటి వైపుగల గుహకు, తూర్పు, పడమర, ఉత్తరాలలో మూడు ప్రవేశ ద్వారాలు వున్నాయి. ఇందులో ఒక గుడి వుంది. అది శివునిది. శివుడి జీవితంలోని వివిధ ఘట్టాలను, శివుని వ్యక్తిత్వాన్ని సూచించే తొమ్మిది ఫలకాలను ఇక్కడ మనం చూడవచ్చును. ఈ గుహలు మొదట్లో బౌద్ధానికి ఆ తదుపరి శైవానికి ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి.


## గౌరీశంకర్

అర్ధనారీశ్వరాలయం గల ప్రాంతం. విగ్రహం యొక్క చేతి వ్రేలి ఎముక నేటికీ బైటికి కనిపిస్తుంది. ఇక్కడుండే సోమపుష్కరిణి (చంద్రభాగ నది)లో స్నానం చేసి స్వామి వారిని దర్శించాలి. ఈ నదీతీరం పొడవునా చాలా ఆలయాలున్నాయి. పూనే-షోలాపూర్ రైల్వేలైన్‌లో షోలాపూర్ నుండి 60 కి.మీ., పండరిపూర్ నుంచి 30 కి.మీ.లలోవున్న భీమనదినే 'చంద్రభాగ' అని కూడా అంటారు.

## మహాబళేశ్వర్

ప్రకృతి అందాలకు, పరిసరాల ప్రశాంతతను కోరేవారు చూడవలసిన అందాల ప్రదేశం. చాలామంది మహాబలిపురం, ఇదీ ఒకటే అనుకుంటారు కాదు, మహాబలిపురం తమిళనాడు వద్ద ఉంది. ఇది మహాబళేశ్వర్ పశ్చిమ కనుమలల్లో ఉన్న ఈ కొండప్రాంత పట్టణం గొప్ప వేసవి విడిది. చినమన్ జలపాతం, లింగమల జలపాతం ఇక్కడ అత్యంత సహజ సుందరంగా కనువిందు చేస్తాయి, షహాజీకాలం నాటి ప్యాలెస్‌ను చూడవచ్చు! ఇక్కడకు 19 కి.మీ. దూరంలో పంచ్‌గనీ విశ్రాంతి కేంద్రం ఉంది. ఇదొక హిల్‌స్టేషన్, పూణే నుంచి 120 కి.మీ. దూరం, 272 కి.మీ. దూరాన ముంబై నుంచి బస్సుమీద కూడా రావచ్చు! జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ అనుకూల వాతావరణం, వసతికి కాటేజీలున్నాయి, టెబుల్‌ల్యాండ్ ప్రకృతి సౌందర్యానికి ఆటపట్టు.

## నాసిక్ - త్రయంబకేశ్వర్



ముంబయ్ నుండి 185 కి.మీ. గోదావరి నదీ తీరంలో ఉన్న ఈ పట్టణంలో పుష్కరకాలంలో శ్రాద్ధ విధులు నిర్వర్తించవచ్చు. రామాయణ ఘట్టాల్లో అధిక భాగం ఇక్కడ జరిగాయంటారు. పంచవటి, తపోవనం, సీత గుహ, రావణుడు సీతను అపహరించుట, జటాయు మోక్షస్థానం దర్శనీయాలు. అన్ని దగ్గర దగ్గరగానే ఉంటాయి. పాండవ గుహలు, చంబార్ గుహలు కూడా ఉన్నాయి.

గోదావరీ నది జన్మస్థలం ఈ త్రయంబకం. ఇక్కడ తీర్థరాజం అనే కోనేటి ఒడ్డున ఐదు శిరస్సులతో – 15 కన్నులతో త్రయంబకేశ్వర స్వామి వెలిశాడు. పురుషులకు మాత్రమే ప్రవేశం. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఇది ఒకటి. నాసిక్ జిల్లా కేంద్రానికి 34 కి.మీ.దూరంలో వుంది.


శ్రీస్వామి శివలింగంనుండి గోదావరి ఉబికి ఉబికి వస్తుంది. ఎక్కడనుండి ఎలాగ వస్తుందనేది కనుగొనలేని పరమ రహస్యం. ఇక్కడ చూడవలసినవి 103 శివలింగాలున్న గుహ, పుష్కరఘాట్, కపాలేశ్వరస్వామి ఆలయం సీతాదేవి గుహ, జటాయువు మోక్షప్రాంతంతోపాటు గుడిదగ్గరవున్న "బ్రహ్మగిరి" కొండ. అసలు ఇక్కడ గౌతమి ఆవిర్భవించడానికి గల మూలకారణం...

ఒకానొక సమయంలో సుదీర్ఘ కరువుకాటకం వచ్చి ప్రజలు అల్లల్లాడిపోతుంటే, గౌతమమహర్షి వరుణుని గూర్చి తపస్సు చేస్తే, అతను ప్రత్యక్షమై ఒక సరస్సు నిర్మించుకో. దానిని అక్షయం చేస్తానంటాడు. దీంతో ఆప్రాంతమంతా సస్యశ్యామలమౌతుంది. ఇది తెలిసిన వారందరు ఇక్కడకు వలస వస్తారు. ఆ వచ్చినవారందరికి తన తపశ్శక్తితో ధాన్యం పండించి వారందరికి సమృద్ధిగా అన్నపానాదులు ఏర్పాటు చేస్తాడు. విశ్వాసఘాతకులవలె తిన్న ఇంటికి ఎసరుపెట్టే విధంగా ముని బృందాలు గౌతముని గొప్పతనాన్ని గుర్తించక ఒక మాయాగోవును సృష్టించి, గౌతముని పంటచేలుపైకి పంపుతారు. అది చూసిన గౌతముడు ఒక దర్భను తీసుకుని దానిని అదిలించబోతే అదికాస్త మరణిస్తుంది. గంగ దానిమీద పారితే నీవు పవిత్రుడవవుతావనేసరికి, లోకకల్యాణార్థం గౌతముడు తపస్సుచేసి, శివుని కరుణతో గంగను ఆ గోవుపై పారిస్తాడు. ఆ రకంగా గౌతమి గంగవుతుంది. ఈశ్వరుడు త్ర్యంబకేశ్వరుడౌతాడు. ఈ ప్రాంతాన్ని, గంగావతరణాన్ని, త్రయంబకేశ్వరుని ఆలయాన్ని, చారిత్రక, పౌరాణిక, శిల్పశాస్త్రం దృష్ట్యా దర్శించి తరించవలసిందే!

నాసిక్‌కు 7 కి.మీ దూరంలో చూడతగ్గ సోమేశ్వరాలయం వుంది. 50 కి.మీ దూరంలో "వాణి" గ్రామముంది. ఇక్కడి సప్తశృంగి ఎందరికో ఆరాధ్యదైవం. కులదైవం కూడా. చైత్రపౌర్ణిమకు ఇక్కడ పెద్ద ఉత్సవం జరుగుతుంది. ఈమె గురించి ఈ రచయిత వ్రాసిన శ్రీసద్గురు సాయిబాబా జీవితచరిత్ర, నిత్యపారాయణ గ్రంథంలో విపులంగా చదువవచ్చును.

## శని శింగణాపూర్

ఆలయం లేకుండా లింగరూపుడైన శనీశ్వరుడున్న ప్రాంతం, ఇక్కడ దొంగతనాలు జరగవు కనుక ఇళ్లకు తాళాలుండవు. తలుపులు అసలుండవు. కనుక ఇక్కడ ఈ స్వామికి ఎదురుగా లక్ష్మీదేవి విగ్రహం ఉంది. షిర్డీ నుంచి నేరుగా బస్సులున్నాయి, అహ్మద్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి 30 కి.మీ దూరంలో ఈ వూరు వుంది.



## అజంతా



ఔరంగాబాదుకు 106 కి.మీ. దూరంలో వున్న అజంతా కొండలు ఓ గుర్రపునాడా ఆకారంలో విస్తరించి వున్నాయి. క్రీ.శ. 1819లో బ్రిటిష్ వారు ఈ గుహల్ని కనుగొన్నారు. ఈ గుహలు క్రీ.పూ. మూడవశతాబ్ది కాలం నాటివని చరిత్రకారులు నిర్ధారించారు. అజంతా గుహలు మొత్తం 29 వున్నాయి. నల్లని రాతి కొండల్ని తొలిచి నిర్మించిన ఈ గుహల్లో హీనయాన, మహాయాన బౌద్ధ సంస్కృతికి చెందిన ఆధారాలు నిక్షిప్తం అయివున్నాయి.

గుహల అంతర్భాగంలోని గోడలపైన రకరకాల రంగులనుపయోగించి ఆకాలంలో వేసిన చిత్రాలు యింకా జీవం పోసుకుని మనముందు నిలిచి ఉన్నాయి. గుహల వెలుపలి భాగంలోని శిల్పాకృతుల్ని చూస్తూ పర్యాటకులు పరిసరాల్నే మరిచిపోతుంటారు.

బుద్ధుని జాతక కథలన్నీ అజంతా చిత్రాల్లో మనకి ప్రస్ఫుటం అవుతాయి. ఈ గుహల్ని ఉదయం తొమ్మిది నుంచి సాయంకాలం ఐదున్నర దాకా పర్యాటకుల దర్శనార్థం తెరిచివుంచుతారు. ఔరంగాబాదు నుంచి పొద్దున్నే బయలుదేరి వచ్చి ఈ గుహల్ని దర్శించి వెళ్ళటం బావుంటుంది. గుహల సమీపంలో బస చేసే అవకాశాలు లేవు.

## బొంబాయి



పడమటి కోస్తాతీరంలో గల అంతర్జాతీయ ప్రఖ్యాతి పొందిన మహానగరం బొంబాయి. మహారాష్ట్ర రాజధాని అయిన ఈ నగరమును పురాతన కాలంలో సప్తద్వీపపురంగా, ప్రాచీన కాలంలో ముంబాయిగా పిలుస్తారు. అధ్యాత్మికంగా బొంబాయి చూస్తే చాలా పురాతన దేవాలయాలు ఉన్నాయి. జైనులు ఎక్కువగా ఉండే ఈ నగరంలో జైనాలయం ప్రసిద్ధి గాంచిన పుణ్యస్థలము. పాలరాతితో కట్టబడి అద్దాల మందిరంగా పేరు గాంచిన ఈ మందిరం నలువైపుల తీర్థంకరుల విశేషాలు చిత్రించి ఉంటాయి. ముంబాయిలో ముఖ్యంగా చూడవలసిన క్షేత్రములు "బాన్ గంగా", "ముంబాదేవి" ఈ బాన్‌గంగా ముఖ్య యాత్రస్థలము. సుమారు 100 దేవాలయాలు ఉన్న ఈ ప్రాంతము ప్రతీ భక్తుడు చూడవలసిన స్థలము. ఈ ప్రాంతంలో మహదేవ్ మందిర్, కాశిమఠ్, భజరంగబలి దేవాలయం, మహాలక్ష్మిదేవి దేవాలయాలు చూడదగ్గ పుణ్యస్థలములు. దాదర్‌లోని సిద్ధి వినాయక దేవాలయం, కల్బాదేవి ప్రాంతములోని ముంబాదేవి దేవాలయం, ఫన్స్వాడి సి.పి. టాంక్

దగ్గరలోని బాలాజి మందిరం కూడా భక్తులు చూడవలసిన పుణ్యస్థలములు.

**మలబార్ హిల్స్:** చక్కటి ఉద్యానవనాలున్న ఈ ప్రాంతంలో వాకేశ్వర దేవాలయం ఉంది. శ్రీరామచంద్రులు వారు విశ్రమించిన ఈ ప్రదేశములో రాముడు ప్రతిష్టించిన రామలింగ దేవాలయం ఉంది.

**పూనా:** ఒకప్పుడు ఇది ఛత్రపతి శివాజీ రాజధాని. ఈ ప్రదేశమే బాలగంగాధర్ తిలక్ జన్మస్థలము. పూనా నుండి 5 కి.మీ. దూరంలో గల చిరు పర్వతంపై పార్వతీదేవి అమ్మవారి ఆలయం ఉంది. ఈ ప్రాంతములోనే సుందరమైన జలపాతం కూడా ఉంది.

## ప్రతాప్‌ఘర్ కోట



పూనా నుండి 25 కి.మీ. దూరంలో ఉన్న ఈ గ్రామంలో భవాని ఆలయం ఉంది. ఇది శివాజీ మహా రాజుకు పెట్టని కోట. అఖండ హిందూ సామ్రాజ్య నిర్మాతగా వెలుగొంద తీర్చిదిద్దిన శ్రీసమర్ధరామదాసు, నేతృత్వ ప్రభావంతో ఏర్పడిన ఈ కోట, ఇందులోని దుర్గాలు, దుర్గమాలే. ఆనాటి ప్రప్రథమ భారత ప్రధాని పండిత జవహర్‌లాల్ నెహ్రూ ఈ కోటను దర్శించి, శివాజీ అఖండ తెలివితేటలకు, ఈ కోట నిర్మాణశైలికి అబ్బురపడి అంజలి ఘటించాడంటే ఈ మహావీరుని శక్తిస్తోమతలు అర్థం చేసుకోవచ్చును. ఢిల్లీ పాదుషా ఔరంగజేబుకు కంటిలో నలక, చెప్పులో రాయి అయి, ముప్పుతిప్పలు పెట్టాడంటే శివాజీ మహారాజు వీరవిక్రమాలు, ఆలోచనా పరిధి, అనుక్షణం మెచ్చుకో దగ్గవి.

ఇక ప్రతీది వివరించుకుంటూపోతే అదొక చారిత్రక నవలో, పురాణేతిహాసమో అవుతుంది. ఆనాడు ఈ దేశంలోని ఏ ప్రాంతానికైనా వెళ్ళాలంటే ముందు ఆత్మశక్తి, ఆతదుపరి ఆసక్తి, భక్తిశక్తి ఇలాగ.... ఎన్నో కలిసివుండేవి.

ఈనాడు ప్రయాణ, రవాణా, వసతుల విషయంలో పెద్ద ఇబ్బందిలేదుకానీ, చరిత్ర చెప్పేవారు, విషయాన్ని వివరించి చెప్పేవారు కావాలి. అందుకు మా ఈ ప్రయత్నం మొత్తం పరిష్కారం కాకపోయినా, కొంతలోకొంత ఎంతైనా ప్రయోజనకారిగా ... విషయాలుగా అందిస్తున్నాం అందుకోండి. ఓపికవున్నవారు, వెళ్ళండి. లేనివారు చదువుకుని, మన పెద్దలు, తాతముత్తాతల మేధాశక్తికి, శక్తికి, భక్తికి అంజలి ఘటించండి.

### బొంబాయి నుండి వివిధ ప్రాంతాలకు దూరం

**విశాఖపట్నం 1376 కి.మీ. విజయవాడ 1010 కి.మీ. తిరుపతి 1230 కి.మీ. వారణాసి 1590 కిమీ.**

**కలకత్తా 2081 కి.మీ. గ్వాలియర్ 1089 కి.మీ. ఢిల్లీ 1408 కి.మీ. హైదరాబాద్ 739 కి.మీ.**

# మహారాష్ట్రాలోని ప్రముఖ దివ్య క్షేత్రములు

# అష్ట వినాయక దర్శనం



భారతీయుల ఇష్టదైవము విఘ్నేశ్వరుడు. ఈ విఘ్నేశ్వరుని ప్రముఖ దేవాలయాలు మహారాష్ట్రలో వేర్వేరు ప్రదేశాలలో ఉన్నాయి. అనేక ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు మహారాష్ట్రలో ఉన్న ఈ వినాయక దేవాలయాలను దర్శించుకుంటారు.

**మధురేశ్వర్ మందిరం**: ఆకర్షణీయమైన వజ్రాలు తలపై పొదగబడి ఉన్న ఈ వినాయకుని దేవాలయం కరహనదీ తీరంలో ఉత్తరముఖంగా ఉంటుంది. షిర్డి నుండి 210 కి.మీ. దూరంలో పూనా జిల్లా "మోరేగావ్" గ్రామంలో ఉంది. ఈ గ్రామం పూనా, షోలాపూర్ రహదారిలో ఉంది.

**సిద్ధి వినాయకుడు**: గజముఖ తొండము కుడివైపునకు ఉన్న ఈ సిద్ధి వినాయకుడు మహత్తరమైన సిద్ధిస్థానము షిర్డి నుండి 285 కి.మీ. దూరంలో అహ్మద్‌నగర్ జిల్లాలోని సిద్ధిటేక్ అనే గ్రామంలో ఉంది. పూనా-అహ్మద్‌నగర్ జిల్లాలో సరిహద్దు అయిన భీమానది ఒడ్డున ఉన్న ఈ మహత్తర మందిరం పీష్వారాజుల కాలం నాటిదని చెబుతారు.

**భళారేశ్వర మందిరం** : ఇది రాయగడ్ జిల్లాలోని పాళి అనే గ్రామం తూర్పుదిశగా కలదు. ప్రకృతి సౌందర్యానికి, మందిర నిర్మాణానికి ఎంతో ప్రసిద్ధిపొందిన ఈ వినాయక మందిరం దగ్గరలో ఉన్న "ఉన్‌హెర్" అను స్థానంలో వేడినీటి జల ఎల్లప్పుడూ పారుతూ ఉంటుంది.

**శ్రీ వరద వినాయక మందిరం** : ఈ క్షేత్రము పూనా నుండి ముంబాయి వెళ్ళే జాతీయ రహదారిపై భోపాలి అను గ్రామంలో ఉంది. మహడ్ అని కూడా ఈ గ్రామం పిలువబడుతున్నది. తూర్పుదిశగా ఉన్న ఈ మందిరంలో వినాయకుని తొండము ఎడమవైపుగా కలదు. ఈ క్షేత్రము షిర్డి నుండి 299 కి.మీ. దూరంలో కలదు.

**చింతామణి మందిరం** : ఈ వినాయక మందిరం ముళా-ముఠా నదీ తీరాన గల ధేపూర్ గ్రామంలో ఉత్తరాభిముఖంగా ఉన్నది. ఎంతో ఆకర్షణీయమైన పర్యాటక స్థలముగా ఉన్న ఈ దేవాలయంలో స్వామి వారు విగ్రహం కూర్చున్న రీతిలో ఎడమవైపు తొండముతో తూర్పు దిశగా ఉంటుంది.

**లేన్యాద్రి గిరిజాత్మక మందిరం** : ఇది పూనా జిల్లాలోని జున్నర్ తాలుక లేన్యాద్రి అనే గ్రామంలో కలదు. షిర్డి నుండి బస్సు సౌకర్యం ఉన్న ఈ గ్రామం షిర్డికి 155 కి.మీ. దూరంలో ఉంది. ఎత్తైన కొండలపై ప్రకృతి సౌందర్యాలలో ఇమిడి ఉన్న ఈ అష్టవినాయక దేవాలయం కొండపై గుహలో ఉంటుంది. దక్షిణ ముఖంగా కొండ గుహలో ఉన్న ఈ వినాయకుని దర్శించటానికి కొండకు మెట్లు ఉన్నాయి.

**విఘ్నేశ్వర మందిరం (ఓజార్)** : పూనా జిల్లాలో జున్నర్ తాలూకా ఓజార్ అను గ్రామంలో కూకుడి నదీ తీరాన గల ఈ మందిరం రాళ్లతో నిర్మించబడి ఉంటుంది. తూర్పు ముఖంగా ఉన్న ఈ విఘ్నేశ్వరునికి ఎడమవైపు తొండము కలదు. షిర్డి నుండి 145 కి.మీ. దూరంలో ఉంది.

**శ్రీమహా గణపతి మందిరం** : అహ్మద్‌నగర్ నుండి పూనా వెళ్లే రహదారిపై రాంజాన్‌గాం అను గ్రామంలో ఉన్న ఈ మహా గణపతి మందిరం తూర్పుదిశగా ఉంటుంది. ఎంతో తేజస్సుతో ఉన్న ఈ మహాగణపతి విగ్రహంపై సూర్యుడు దక్షిణదిశ నుండి ఉత్తర దిశగా వెళ్ళే మధ్య కాలంలో సూర్యకిరణాలు పడతాయి.

## షిర్డి పుణ్యక్షేత్రము

మహారాష్ట్రములోని ప్రసిద్ధి చెందిన శ్రీ షిర్డిసాయి బాబా వారి దర్శనమునకు వెళ్ళు ఆంధ్రా భక్తులు హైదరాబాదు నుండి మన్మాడ్ స్టేషన్ ద్వారా షిర్డి చేరవచ్చును. హైదరాబాదు నుండి ప్రభుత్వ మరియు ప్రైవేటు హైటెక్ బస్సులలో కూడా షిర్డి చేరవచ్చును. షిర్డి చేరిన భక్తులు మొదట "న్యూభక్తనివాసము" చేరుకుని వసతి ఏర్పాటు చేసుకోవాలి. ఇప్పుడు షిర్డి వరకు రైలు వుంది.



సుమారు 500 వరకు గదులు ఉన్న ఈ వసతి గృహములో టూరిస్ట్ సౌకర్యము కూడా కలదు. ఇందులో భక్తులు సామానులు భద్రపరచుకొనుటకు లాకర్ సదుపాయం, ఉచిత బస్సు, దగ్గరలో ఆంధ్రా భోజనహోటళ్లు, క్యాంటిన్, దేవస్థాన పుస్తకాలు షాపులు ఉంటాయి. పడుకోవటానికి పరుపులు, దుప్పట్లు కూడా తక్కువ ధరకు ఇస్తారు. ఇక్కడ అడ్వాన్సు రిజర్వేషన్ ఉండదు.

**గురుస్థానం :** సామానులు భద్రపరచుకుని ఉచిత బస్సులో గాని, టాంగాలోగాని మందిరమునకు వెళదాం. బాబాగారి మందిరం దగ్గర మొదట "గురుస్థానం" దర్శించుకుందాం. ఇది సాయిబాబా గారి యొక్క గురువుగారి స్థానం. అందువలన దీనికి గురుస్థానము అని పేరు వచ్చినది. సాయిబాబా వారు 16వ ఏట ఈ గురుస్థానము వద్దనే వెలుగులోకి వచ్చారు. ఈ గురుస్థానం వద్ద గల వేపచెట్టు (నింబవృక్షము) పవిత్రమైనది. బాబా వారి పాదుకలు, బాబావారి చిన్న విగ్రహం దర్శించుకుని ఈ క్రింది శ్లోకము చదువుకుని

**"సదా నింబవృక్షస్య మూలాధి వాసత్... సుధా శ్రావిణం తిక్తమప్యప్రియతం.**

**తరుం కల్పవృక్షాధికంసాధయంతం నమామీశ్వరం సద్గురుం సాయినాధం."**

అక్కడ నుండి ప్రక్కవీధి ద్వారా బాబావారి "ద్వారకామాయి" చేరుదాం.

**ద్వారకామాయి :** ఈ పుణ్యస్థలములో బాబావారు కూర్చుండే రాయి, భక్తుల పాపములను హరించే ధుని, బాబావారు ఉపయోగించిన పొయ్యి, సచ్చరిత్రలో చెప్పబడిన గోధుముల బస్తా, తిరగలి, పల్లకి మొదలగునవి చూడవచ్చు. బాబావారు ఆ రోజుల్లో వెలిగించిన అగ్నిహోత్రం ఈ రోజు మనము ధుని రూపంలో చూడవచ్చు.

అందువలనే "ధుని దర్శనం దుఃఖనాశనం" అని భక్తులు అంటారు. ఇక్కడి నుండి లక్షలాది భక్తులు "బాబారక్షించు" అంటూ బాబా సమాధి మందిరమునకు వెళతారు.

**సమాధి మందిరం :** షిర్డిలో అతి ముఖ్యమైన ఈ మందిరం నాగపూర్ నివాసి "బూటి" అనునతడు బాబా ఆజ్ఞ మేరకు నిర్మించాడు. అందువలనే దీనిని "బూటి" మందిరం అంటారు. ఇందులోనే "బాబావారి దివ్యమంగళ విగ్రహం" ఏర్పాటు చేయబడింది. బాబావారి సమాధి ఇదే – ఎక్కడెక్కడి భక్తులు దర్శించుకునే 'సమాధి' మందిరం.. ఈ మందిరంలోనే బాబావారికి హారతులు జరుగుతాయి. ఈ మందిరంలో బాబావారికి కుడిచేతివైపు గదిలో బాబా వాడిన ఆనాటి సామానులు, బాబావారి దుస్తులు తిలకించవచ్చును. భక్తిపూర్వకంగా మనసారా బాబాగారిని స్మరించుకొనుటకు ఈ హారతి కార్యక్రమానికి ముందుగానే భక్తులు క్యూలో నిలబడి ఉంటారు. బాబా సమాధి దగ్గర పాదుకలు దర్శనం చేసుకుని వెనుక మార్గం ద్వారా బయటకు వస్తారు. ఇక్కడ నుండి మనం 'చావడి' వైపు వెళదాం.

**చావడి :** ఇది బాబాగారు రోజు విడిచి రోజు నివసించిన పుణ్యస్థలము. ఇది ద్వారకామాయి ప్రక్కనే వుంది. ఇందులో బాబావారు కూర్చున్న కుర్చీ, చివరగా వాడిన మంచం, భక్తులు చూడవచ్చును. ఈ మందిరంలోని కుడివైపు గదిలోకి స్త్రీలను అనుమతించరు. ప్రతి గురువారం రాత్రి ద్వారకామాయి నుండి ఈ చావడికి పల్లకిలో బాబావారి పాదుకలు, బాబావారి పటం ఊరేగింపుగా తీసుకువస్తారు. ఈ కార్యక్రమానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొంటారు. ఇవి ప్రధానంగా భక్తులు చూడవలసిన ముఖ్య స్థలములు. ఇక్కడ నుండి మనం బాబా వారి శిష్యుల సమాధులు, మిగిలిన ప్రదేశాలకు వెళదాం.

**అబ్దుల్ బాబా సమాధి :** ఇది బాబా వారి చావడికి ఎదురుగా ఉన్నది. ఈ అబ్దుల్‌కి బాబా దగ్గర విశిష్ట స్థానముంది. బాబా దగ్గర వీరు కూర్చుని 'ఖురాన్' పఠించుచుండెడివారు. బాబా ఇతనిని "కాకి" అని పిలుస్తూండేవారు. సాయిబాబాకు, అబ్దుల్లా అంటే ఎక్కువ అభిమానంగా ఉండేది. వీరు ఎల్లప్పుడు 'అల్లాసాయి' అని జపం చేస్తుండేవారు.

**మారుతి మందిరం :** ఈ దేవాలయం బాబావారి సమాధి మందిరమునకు ముందు ఉన్న ద్వారము దాటి ముందుకు నడిస్తే ఎడమవైపు ఉంటుంది. బాబా వారు ప్రతిరోజు ఈ మారుతి మందిరం సందర్శించేవారు. దీనికి దగ్గరలోనే గణేష్ మందిరం, శనీశ్వర దేవాలయం, శివాలయం ఉన్నవి. అక్కడ నుండి లక్ష్మిబాయి షిన్డే ఇంటికి వెళదాము.

తొమ్మిదినాణేలు కలిగిన లక్ష్మిబాయి షిణ్డే ఇల్లు చావడికి ఎదురు రోడ్డులో కొంచెం ముందుక నడిస్తే ఎడమవైపు చిన్న సందులో లక్ష్మీబాయి షిణ్డే ఇల్లు వస్తుంది. బాబాగారి కాలమును జ్ఞప్తికి తెచ్చే ఈ ఇంటిలో లక్ష్మిబాయి షిణ్డే పాలరాతి విగ్రహము కలిగిన చిన్న గూటిలో బాబావారు ఆ పుణ్యమహిళకు ఇచ్చిన తొమ్మిదినాణేలను భక్తులు తిలకించవచ్చును. ఇదే గదిలో బాబాగారు కూర్చుని అన్నం తినునపుడు ఆనుకున్న కొయ్య స్థంభమును కూడా భక్తులు చూడవచ్చు. ఈ ఇంటిలో షిణ్డే కుమారుడు వారి కుటుంబ సభ్యులు వచ్చిన వారికి షిణ్డే గురించి వివరిస్తూ ఉంటారు. భక్తులు ఇటువంటి స్థలమును దర్శించునపుడు వాటిని కాపాడుకోవటం కూడా భక్తుల ధర్మము కనుక వాటిని పాడుచేయటం గాని, పేర్లు రాయటం గాని చేయవద్దని ఆ ఇంటివారి మనవి. కంటికి రెప్పలా కాపాడే గురుదేవుని శరీరము శిధిలావస్థకు చేరుకోవడం చూసి శోకతప్తహృదయులయిన భక్తులలో తన పరమభక్తురాలైన

లక్ష్మిబాయి షిండేను బాబా సంజ్ఞలతో పిలిచి తన అంగీలోంచి తొమ్మిది బంగారు నాణాలు తీసి ఆమెకు అందించారు. ఇవి మామూలు నాణాలు కావు. 1) శ్రవణం, 2) కీర్తనం, 3) స్మరణం, 4) పాదసేవ, 5) అర్చణము 6) నమస్కారము 7) ధ్యానము 8) సఖ్యత 9) ఆత్మనివేదన అనే తొమ్మిది భక్తి మార్గాలను సూచించే పావన ప్రభోదములని శ్రీసాయి షిండేకు చెప్పారు. తనను కరుణించిన ఆ తీరుకు షిండే కళ్ళు కన్నీటి చలమలే అయ్యాయి.

**నానావళి సమాధి :** ఈయన కూడా సాయిబాబా పరమభక్తుడు. ఈయన 1918లోనే మరణించారు. ఈయన సమాధి స్థానం కూడా లెండివనం దగ్గర ఉంది. ఇక్కడ నుండి భోజనశాలవైపు వెళ్లి సాయి ప్రసాదం తీసుకుని వద్దాం.

**సాయిప్రసాద్ - సహపంక్తి భోజనము :** షిరిడి వెళ్లే భక్తులు మొదటి హారతి అయిన తరవాత షిర్డిలోని పుణ్యస్థలములకు వెళితే, రెండో హారతి చూసుకుని వెళ్ళేది. "సాయిప్రసాద్" భోజనాలయానికి, గురుస్థానానికి ఉత్తరంగా ఉన్న సాయిప్రసాద్ రూపం "అన్నదాతలూ విచ్చేయండి" అంటూ భక్తులను పిలుస్తూ ఉంటుంది. ఎందరో భక్తులు అందరికీ ఒకటే వరస అని లోపలకు వెళ్ళిన యాత్రికులకు సంస్థానము వారు అన్నం, సాంబారు, పరోటాలు, పప్పు, కూర మొదలగు పదార్థాలు వడ్డిస్తూ ఆకలి తీరుస్తున్నారు.

తక్కువ ఖర్చుతో వండి వడ్డించే ఈ భోజనాలయంలో టిక్కెట్లు తీసుకుని తోటి యాత్రికులకు, బీదవారికి ఉచితంగా భోజనం పెట్టించవచ్చును. నిజంగా వారి దృష్టిలో అన్నదాన ప్రభువులు, షిర్డి వెళ్ళే భక్తులకు కనీసం ఒకసారి అయినా ఈ సాయి ప్రసాద్ భోజనాలయంలో భోజనం చేయాలని కోరిక కలుగుతుంది.

**లెండీవనము:** షిర్డి వెళ్ళే భక్తులు దర్శించవలసిన మరొక పుణ్యస్థలము లెండీవనము. బాబా వారి పాదధూళితో పవిత్రమైన ఈ వనము బాబా వారు నాటిన పూలవనం. యిప్పటికీ మనకు బాబావార్ని గుర్తుచేస్తూ ఉంటాయి. ఈ లెండీవనము 'రహతా' మెయిన్ రోడ్డును ఆనుకుని బాబావారి మందిరమునకు వెళ్లే దారిలో ఉన్నది. ఈ లెండీవనములో పూల, ఫల, వృక్షములతో పాటు దత్తాత్రేయుని మందిరం, నందాదీపము, శ్యామకర్ణసమాధి, బావి మొదలగునవి మనకు కనిపిస్తాయి. ప్రశాంతమైన వాతావరణంలో సాయిపై భక్తి భావములు వీచే లెండీవనం షిర్డిలో దర్శించవలసిన దివ్య స్థలము. ప్రతిరోజు బాబా వారు ద్వారకామాయి నుండి లెండీవనమునకు వెళ్ళి బావి నుండి నీరు కడవలతో తోడి పూలమొక్కలకు స్వయంగా పోసేవారట, తదుపరి లెండీవనములో ఉన్న నందాదీపాన్ని వెలిగించి ద్వారకామాయికి వచ్చేవారట.

**ద్వారకామయి - ధుని దర్శనం - దుఃఖనాశనం :** మానవాళికి కష్టాలు బాపి, శాంతి కలుగజేయుటకు మహారాష్ట్రములో షిర్డి గ్రామంలో శ్రీసాయిబాబా వారు ఒక పాడుబడిన మశీదులో నివసించి 1918లో విజయదశమి తత్కాల ఏకాదశి పర్వదినమున భక్తుల సమక్షములో మహాసమాధి చెందారు. శ్రీ బాబావారు ఆ మశీదులో నిత్యం అగ్నిహోత్రము నిర్వహించేవారు. వారు నిర్వహించిన అగ్ని హోత్రము షిర్డిలో నిర్విరామంగా వెలుగుతూ ప్రజలకు దర్శనమిస్తూ వారి వారి పాపములను దహింపజేస్తోంది. దానినే తరువాతి కాలంలో ధునిగా పిలిచేవారు. ద్వారకామాయిలో అగ్నిజ్వాలగా వెలుగొందు ఈ ధునిలో ప్రజలు కర్పూరము, ఎండుకొబ్బరి, అగరబత్తి, ఆవుపేడ పిడకలు, ఆవు నెయ్యి, నువ్వులు, సాంబ్రాణి మొదలగు పదార్థములు వేసి తాము చేసిన పాపములను దహింపచేయుటకు ప్రార్థిస్తారు. బాబావారు ఉదయం నిద్రలేవగానే ఎక్కువసేపు ధునికి ఎదురుగా కూర్చొని

నమస్కరిస్తూ కట్టెలను సవరించి ప్రార్ధనలు చేసి మిగతా కార్యక్రమములు చేసేవారు. "ధుని దర్శనం దుఃఖనాశనం-క్షేమదాయకం" అంటూ భక్తులు నేటికి ద్వారకామాయిలోని ధునికి పూజలు చేస్తూ ఉంటారు. ఈ ధుని నుండి వచ్చిన భస్మమే విభూతిగా భక్తులకు సంస్థానము వారు పంచుతూ ఉంటారు. ఈ విభూతిని నుదుట ధరిస్తే, సేవించితే రోగనాశనం జరుగుతుంది.

## శ్రీ ఖండోబా మందిరం

ఇది చాలా పురాతనమైన అత్యంత మహిమ కలిగిన మందిరం. బాబాగారు 1854లో ఫకీరు వేషములో మొట్టమొదట ఈ మందిరానికి వచ్చారు. అప్పుడు ఆలయ పూజారి అయిన మహాల్సావతి రెండవసారి షిర్డి వచ్చినపుడు, ఇంకా చెప్పాలంటే చాందుపాటిల్ పెండ్లి బృందంతో ఖండోబా ఆలయం ప్రక్కనగల మహల్సావతి పొలములో పెండ్లి వారి బండ్లు దిగుతుంటే చూసిన మహల్సా బాబాను చూసి 'ఆవోసాయి' 'రండి సాయి' అని పిలిచారు. అప్పటి నుండి బాబావారికి సాయి అని పేరు స్థిరపడి సాయినామం ప్రసిద్ధి చెందినది. అందువలన షిర్డిలో ఇది ఒక ముఖ్యమైన మందిరంగా పేరొందినది. మెయిన్‌రోడ్డులో సాయినాథ్ అసుపత్రి ప్రక్కన ఈ మందిరం చూసి మనం సాకూరి ఉపాసిని బాబావారి దేవాలయంనకు వెళదాం.



**షిర్డిలో సౌకర్యాలు :**

**ప్రసాదాల కౌంటరు** : మందిరమునకు ఎదురుగా ఉంది. లడ్డులు, పాలకోవా అమ్ముతారు. పాలకోవా బాబావారికి సమర్పించి ప్రసాదంగా భక్తులు తెచ్చుకుంటారు.

**బాబా విభూది** : గురుస్థానం ప్రక్కన బాబాగారి విభూది ఇస్తారు.

**బాబా వస్తువులు** : బాబా వారికి ఇచ్చిన శాలువాలు వగైరా ప్రతి గురు, ఆదివారాలలో ఉదయం 8 గం. నుండి 9 గంటల సమయంలో వేలం వేస్తారు.

**వెండి నాణేలు** : స్వచ్ఛమైన వెండితో తయారు చేసిన వెండి నాణేలు కావలసిన వారు దేవస్థానం ఎంక్వైరీ ఆఫీసులో సంప్రదించవచ్చును.

**పారాయణ గది**: భక్తులు షిర్డిలో సాయిసత్ చరిత్ర పారాయణ చేయువారు ఇప్పుడు లెండివనంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పారాయణ గది యందు నిశబ్దంగా పారాయణ చేసుకోవచ్చును. ఇతర గ్రంథములు కూడా ఈ గదిలో ఉంటాయి.

**ఉచిత ఆసుపత్రి**: రహత మెయిన్ రోడ్డులో ఉన్న సాయి సంస్థాన్ ఆసుపత్రిలో ఉచితంగా యాత్రికులు చికిత్స పొందవచ్చును.

## ఉపాసిని బాబా - సాకోరి

షిర్డిసాయిబాబావారి శిష్యగణములో చెపుకోదగ్గవారు శ్రీ ఉపాసిని బాబా. వీరు గొప్ప సాధకులు, మహాజ్ఞాని. వీరి ఆశ్రమము షిర్డికి దక్షిణముగా 5 కి.మీ. దూరములో సాకోరీ ఉన్నది.



పండ్ల తోటల మధ్య ఉన్న ఈ విశాలమైన ఆశ్రమములో గురుకుల కన్యాశ్రమముగా కూడా నడుపబడుచున్నది. ఉపాసిని బాబావారి శిష్యురాలు బ్రహ్మచారిణి శ్రీమతి గోదావరి మాతాజీ ఆశ్రమ పురోభివృద్ధికి పాటుపడి 1992లో దేహాన్ని చాలించారు. శ్రీ ఉపాసిని బాబా వారి నిత్య కార్యక్రమాలు నేటికి ఈ ఆశ్రమంలో నిర్విరామంగా కొనసాగుతూ ఉన్నవి. ఈ ఆశ్రమంలో ఉన్న 'మునగచెట్టు' మధ్యలో గణపతి ఆకారం ఏర్పడింది. సుమారు వంద సంవత్సరముల పైబడి విశిష్టమైన ఆకారము కలిగి యిక్కడకు విచ్చేసిన భక్తుల పాలిట వరప్రసాదినిగా వెలుగొందు తోంది. ఈ ఆశ్రమమును దర్శించే భక్తులు షిర్డి నుండి గుర్రపు బండిలో వెళ్ళిరావచ్చును. శ్రీ ఉపాసిని మహారాజ్ వారి శిష్యులైన శ్రీ మెహర్‌బాబా వారు కూడా ఈ ఆశ్రమమున కొంత కాలము గడిపి తదుపరి అహ్మద్‌నగర్‌లోని 'మెహరాబాదు'లో తన ఆశ్రమాన్ని నెలకొల్పారు.

**జంగిలి మహారాజా వారి ఆశ్రమము :** ఈ ఆశ్రమము షిర్డి నుండి 7 కి.మీ. దూరంలో షిర్డి నుండి మన్మాడ్ వెళ్ళే రహదారిలో రమ్యమైన, శాంతియుతమైన ప్రదేశంలో కలదు. జంగిలి మహారాజ్ సంస్థ, చైతన్యపురి వారిచే నడుపబడుచున్న ఈ ఆశ్రమంలో మహారాజ్‌వారి మందిరం, ధ్యానమందిరం, సమర్థ హిందూ మందిరం కలవు. గురుపౌర్ణమి, గోకులాష్టమి, శ్రీరామనవమి పండుగలు ఎంతో వైభవముగా జరుగు ఈ క్షేత్రములో భక్తుల కొరకు ధర్మశాల, భోజనశాలలు కలవు.

## పాండురంగస్వామి దేవాలయం - పండరీపూర్



"పాండురంగా హరి జైజై! రామకృష్ణ హరి జైజై !!" అని భజన చేస్తూ మహారాష్ట్రలోని తమ ఇష్టదైవమైన పండరీనాధుని కీర్తనలు పాడుతూ ఇటు మహా రాష్ట్ర.కర్ణాటక నుంచి అటు ఆంధ్రా వరకు భక్తులు దర్శించే క్షేత్రమే పండరీపురం. ఇక్కడ స్వామి పాండు రంగడు (విఠల్) భార్య రుక్మిణి. మహరాష్ట్ర ప్రజలకు ఇలవేల్పు అయిన ఈ స్వామి దేవాలయం షోలాపూరు జిల్లాలో షిర్డికి 282 కి.మీ. దూరంలో ఉంది. సాధువులు పుట్టిన స్థలముగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రములో నేటికి భక్తతుకారం మాదిరిగా తంబర

వాయించుతూ భక్తి కీర్తనలు పాడే భక్తులు మనకు కనబడతారు. ఆంధ్రరాష్ట్రము నుండి వెళ్ళు భక్తులు ముందుగా గజానన మహారాజ్ సత్రం (చౌల్ట్రీ) దగ్గరకు వెళ్లి రూము తీసుకుని సామానులు భద్రపరచుకుని పాండురంగస్వామి వారి దేవాలయమునకు వెళ్లాలి.

అనంతరం నదీ గర్భంలో ఉన్న పుండరీకుని తల్లిదండ్రుల సమాధులు, అవతల ఒడ్డున వల్లభాచార్య సమాధి, రామమందిరం, కాళికా మందిరం, జ్ఞానేశ్వర్ మహారాజమఠం చూడవలసిన క్షేత్రాలు. ముఖ్యంగా ఈ పుణ్యక్షేత్రంలో ఉన్న "పద్మవ్యూహం" చూసి తీరవలసిన ప్రదేశము. దీనిని కైకడీమఠమని కూడా అంటారు. గజానన మహారాజ్ చౌల్ట్రీ నుండి టాంగా మీద వెళ్ళే ఈ "పద్మవ్యూహం"లో అనేక గదులలో అనేక విగ్రహాలు ఉంటాయి. ఎటు నుండి ఎటువెళతాం. ఎక్కడ మెట్లు దిగి ఎక్కడ ఎక్కుతాం అనేది విచిత్రంగా కనబడుతుంది. ఇక్కడ దారి తప్పి ప్రక్కకు వెళ్ళారో మళ్లీ మీతో వచ్చిన వారి దగ్గరకు వెళ్ళుట కష్టంగానే ఉంటుంది. "నిదానం – ప్రధానం" అంటారు ఇక్కడి కమిటీ వారు.

**శ్రీ విఠోబా ఆలయం :** చలువరాతితో నిర్మించిన ఆలయం, ఇక్కడ స్వామిని తాకవచ్చు ఆలింగనముకూడా చేసుకొనవచ్చును. హాలులో ఆంజనేయ స్వామి, గణేషుని దర్శించి, దగ్గరలోని గోపాలపురంలో జనాబాయి, సక్కుబాయి, వాడిన బిందెలు, తిరుగలి, కుండలను చూడండి. గర్భాలయం దగ్గరిలో రుక్మాబాయి దేవాలయం కూడా ఉంది.

ఈ క్షేత్ర నిర్మాణానికి మూలకారకులు కాకపోయినా, మహారాష్ట్రలో భక్తి సామ్రాజ్యానికి పెద్దపీట వేసిన వారు జ్ఞానేశ్వర్, నామదేవ, ఏకనాథ్, తుకారాం. వీరంతా కారణజన్ములు. విఠల్‌నాథుని భక్తులు.

నివృత్తినాథ్, జ్ఞానేశ్వర్, సోహన్, ముక్తాబాయిలు సోదరసోదరీమణులు. సన్యసించిన తదుపరి గురువుగారి ఆదేశంతో వీరి తండ్రి సంసారంలోకి రావడం శాస్త్ర, ధర్మవిరుద్ధమని, ఈ కుటుంబాన్ని వెలివేసారు. అయినా ఆ భగవత్కృపాపాత్రులు కాబట్టి ఈ పిల్లలు శాసనకర్తలుగా, సమాజ నిర్దేశకులుగా నిలిచారు. ఈ జ్ఞానేశ్వర్‌కు సమకాలికుడు నామదేవ్.

గోరాకుంభార్, చొఖమేళా, ఏకనాథ్, తుకారాంలు మహారాష్ట్రులలో భక్తితత్వానికి (భావనానికి) సోపానాలుగా చెప్పవచ్చును. కన్నడవాసి పురందరుదాసు పండరీ భక్తుడు. ఆషాఢ శుద్ధ ఏకాదశికి పండరీలో జరిగే బ్రహ్మాండమైన ఉత్సవం చూడదగ్గది. వారి భక్తికి పరవశింపదగ్గది.

పద్మాలాకోటవలె, చెప్పుకోదగ్గ చారిత్రకకోట సజ్జనగడ్. ఇక్కడే సమర్ధరామదాసు, శివాజీని అఖండ హిందూ సామ్రాజ్యాధిపతిగా "ఛత్రపతి"ని చేసి తీర్చిదిద్దింది. ఇక్కడ సమర్ధరామదాసు సమాధి వుంది. ఇక్కడే శ్రీధరస్వామిగా విఖ్యాతుడైన సమర్ధరామదాసు శిష్యభక్తుని సమాధి కూడా వుంది. చారిత్రక మేధాసంపత్తికి నిదర్శనాలీ ప్రాంతాలు.

**అంబర్‌నాథ్ :** 1060లో నిర్మించిన గొప్ప శివాలయం. చుట్టూ మంచి రమణీయ ప్రదేశాలు, ఈ ప్రదేశం మంచి పిక్నిక్ స్పాట్ కూడా.

**తుల్జాపూర్ :** మహిమగల శక్తిపీఠం. శివాజీకి భవాని వరప్రసాదంగా ఖడ్గాన్ని సమర్పించింది ఇక్కడే.

**భీమశంకర్ :** నేరాల్ వద్ద వుంది. భీమానది పుట్టిన సహ్యాద్రిపై వెలసిన స్వామి శంకర మహాదేవుని ఆలయం వుంది.

## భక్తతుకారం జన్మస్థలమే - దేహూ



భారతదేశంలోని కొందరు సాధువులనదగు గృహస్థ భక్తులలో భక్త తుకారాం ఒకరు. ఈయన జన్మస్థలము మరియు సమాధి స్థానము మహారాష్ట్రలోని పూనాకు 30 కి.మీ. దూరంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రము షిర్డికి 234 కి.మీ. దూరంలో ఉంది. తుకారాం మహారాజ్ పాడిన కీర్తనలు భక్తులు ఎన్నటికీ మరువరు. ఇదే గ్రామంలో విఠల్‌స్వామి మందిరం కూడా భక్తులు దర్శించు స్థలము.

**సజ్జన్‌గడ్:** షిర్డికి 315 కి.మీ. దూరంలో సతారాజిల్లాలో ఉన్న ఈ పుణ్య స్థలములో ఛత్రపతి శివాజి గురువైన సమర్ధ రామదాసు స్వామి సమాధి మందిరం కలదు.

## అంబరనాథ ఆలయం

ముంబాయికి అతి చేరువలో వున్న ఆలయంలోని "అంబర్‌నాథ" ప్రసిద్ధుడు. అద్భుతశిల్ప కళ కల్గి 1060 ప్రాంతంలో "అంబర్‌నాథ్" పేరిట నిర్మితమైన శివాలయం చూడదగ్గది. శివలింగం భూమిలో పాతుకుని వుంటుంది. ఆలయ గోడలపై గల శిల్పకళ చూడాలంటే కళ్ళుచాలవు.

## ఔండా నాగేశ్వరుడు

సికింద్రాబాదు - మన్నాడు మార్గంలో పర్భనిలోదిగి ఔండా నాగనాథ్ చేరవచ్చు. ఇక్కడి శివుని "నాగేశ్వర లింగ"మంటారు. ఇది 5000 సం॥నాటి పురాతన ఆలయమని చెబుతారు. ఇది కృతయుగంనాటిదని దీనిని ద్వాపరంలో ధర్మరాజు పునరుద్ధరిస్తే, 18వ శతాబ్దంలో రాణి అహల్యాబాయి దీనిని పునరుద్ధరించారని చెబుతారు.

ఇక్కడ ద్వాదశ జ్యోతిర్లింగాల చిన్న చిన్న దేవాలయాలు నిర్మింపబడ్డాయి. అంతకుమించిన విశేషం నాగుపాములు ఆలయంలోకి వచ్చి శివునికి పడగపట్టుట చెప్పుకోదగ్గ, చూడదగిన విశేష క్షేత్రం. అలాగే ఇక్కడ విష్ణుమూర్తి, అర్ధనారీశ్వర ప్రతిమలు చూడవచ్చు. ఇచ్చటి లింగం సైకత (ఇసుక) లింగం. కాబట్టి చూడటమే తప్ప స్పృశించడం తగదు.

## భగవతిమాత ఆలయం - కొల్హార్

షిర్డి నుండి అహ్మద్‌నగర్ వెళ్ళేదారిలో షిర్డికి 24 కి.మీ. దూరములో కొల్హార్ శ్రీ భగవతిమాత ఆలయం ఉన్నది. జిల్లాలోని ప్రసిద్ధిచెందిన జాగృతి స్థానాల్లో ఇది ప్రముఖమైనది. ఇక్కడ నుండి రాహురికి 16 కి.మీ. ఈ పురాతన ఆలయములో శ్రీ భగవతిమాతతో సహా తుల్జాభవాని, రేణుకామాత, సప్తశృంగి మాతలు వెలసియున్నారు. పూర్వము ఇచ్చట దేవదానవుల మధ్య కలహము జరుగుట వలన కల్లోలము బయలుదేరిందని ఆ కారణము వల్ల యిది కొల్హార్ అని పిలువబడిందనే విషయం ప్రచారంలో ఉంది. దీని ప్రక్కనే 'ప్రవరా' నది ప్రవహిస్తున్నది.

పూర్వము క్షీరసాగర మథనము జరిగినపుడు ఉద్భవించిన అమృత భాండము మోహిని చేయి నుండి తొలగినపుడు అమృత బిందువులు ఈ నదిలో పడుటచే యిది అమృతవాహిని అని పిలువబడుచున్నదని ప్రతీతి. జాతీయ రహదారి ప్రక్కనే భగవతి కొల్లేశ్వర్ ఆలయం ఉన్నది. ఈ పురాతన ఆలయములో శివలింగము ప్రక్కన పార్వతీ దేవి విగ్రహము ఉన్నది. అరణ్యవాసములో ఈ ప్రాంతమునకు వచ్చిన శ్రీ రామచంద్ర భగవానులు తమ స్వహస్తములతో ఇసుకతో ఈ లింగము నిర్మించి ప్రతిష్ఠించినట్లు చెబుతారు. శ్రద్ధాభక్తులతో కొలిచే భక్తుల మనోభీష్టములు నెరవేర్చే ఫలప్రదాయని శ్రీ భగవతి మాత.

## ఖిద్రాపూర్ కోపేశ్వరుడు



అద్భుత కళాఖండం, మహాద్భుత క్షేత్రం. ఆదరణలేని అపురూప క్షేత్రం. కొల్హాపూరు/మీరజ్/ సాంగ్లీలలో ఎక్కడినుండైన రోడ్డు మార్గాన ఇక్కడికి రావాలి. ఇక్కడి కోపేశ్వర మందిరం శిల్పకళారామమంటే తప్పుకాదు. 1109-1180 మధ్యకాలంలో శిలాహార్ వంశానికి చెందిన రెండో భోజుడు నిర్మించిన అపురూప కళాఖండమిది. స్వర్ణమంటపం, సభామంటపం, అంతరాళ కక్ష్య, గర్భగృహంతో, కళ్ళుచెదిరే శిల్పసంపదతో మహాద్భుతంగా వుంది. ఉగాదినాడు కోపేశ్వరస్వామిని సూర్య కిరణాలు తాకేటట్లు నిర్మించబడిన అద్భుతాలయం. ఇది ఎంతగొప్పదో చెప్పేకన్న కళ్ళతో ఒకసారి చూస్తే మన జన్మ ధన్యమవుతుంది. కళ్ళు బ్రహ్మానందాన్ని పొందుతాయి.

## పంచవటి - వటేశ్వరాలయం

నాసిక్‌కు 5 కి.మీ దూరంలో వుందీ పంచవటి. ఇక్కడ అయిదు వటవృక్షాలు. అక్కడో ఆలయం. దీనిని వటేశ్వరాలయమంటారు. ఇక్కడున్న సీతాగుహలో రాముడు సీతను వుంచి, ఖరదూషణాదులను ఇక్కడే చంపాడని చెబుతారు. ఇది నిజమా? కాదా? అన్న ప్రశ్నకాదుకానీ, ఎటూ నాసిక్ వెళ్ళినవారు ఈ వటేశ్వరుని దర్శించడంలో తప్పులేదు కదూ! కదా!!

## భక్తుల కోర్కెలు తీర్చేడి గాణ్గాపురం

దత్తాత్రేయుని అవతారమైన శ్రీ నృసింహ సరస్వతి వారి పుణ్యస్థలము గాణ్గాపురం (గంధర్వపురం). మాఘశుద్ధ చతుర్ధశి (శ్రీ దత్త జయంతి) పర్వదినమున భక్తులు విశేషంగా విచ్చేయు ఈ క్షేత్రము మద్రాసు - బొంబాయి రైలు మార్గముగా 'గాణ్గాపురం రోడ్డు' దిగి గాణ్గాపురం చేరాలి (అన్ని రైళ్ళు ఆగవు). ఈ క్షేత్రమునకు రెండు కిలోమీటర్ల దూరములో దక్షిణాన భీమ అమరజనదులు వున్నవి. ఉత్తరమున "తంతుకేశ్వర్", పశ్చిమాన 'భగీరధి' తీర్థము



'చక్రేశ్వర్' (కేశవమందిరం) ఉన్నది. ఈ పవిత్ర పుణ్యస్థలముల మధ్యన ఉన్నదే శ్రీ నృసింహసరస్వతి, దత్తమహారాజ్ మండపము.

తూర్పు దత్తపాదుకులు, మహాదేవ మందిరం, దక్షిణాన ఔదంబర్ వృక్షము, పడమరన అశ్వద్ధ వృక్షము ఉన్నవి. ఆ అశ్వద్ధ వృక్షము మీద ఉన్న బ్రహ్మరాక్షసునికి శ్రీ నృసింహ సరస్వతి మహారాజ్ శాపవిముక్తి కలిగించెనని గురుచరిత్ర చెబుతున్నది. ఇక రెండు కిలో మీటర్ల దూరంలో భీమ–అమరజ నదుల సంగమ పుణ్యక్షేత్రములో ప్రతి పన్నెండు సంవత్సరాలకు పుష్కర తీర్థము జరుగుతుంది. ఈ పుణ్య తీర్థానికి దేశ విదేశీ యాత్రికులు ఇక్కడికి విచ్చేస్తారు. గాణ్గాపురంలో ఈ నదిలో స్నానమాచరించినవారు సర్వపాపముల నుండి విముక్తులగుదురని భక్తుల నమ్మకం. అందుకని ముందు శ్రీదత్తగురుచరిత్ర ఈ రచయిత వ్రాసినదే చదవండి. ఈ క్షేత్ర మహాత్మ్యము, దత్తమహాత్మ్యము అర్థమవుతాయి.

## పంచగంగలు కలిసిన పుణ్యస్థలము - నర్సోబావాడి

మహారాష్ట్రలోని మీరజ్ – కొల్హాపూర్ రైలు మార్గములో జయసింగ్‌పూర్ రైల్వేస్టేషను నుండి భక్తులు నర్సోబావాడి చేరవచ్చును. శ్రీ నృశింహసరస్వతి ఈ ప్రాంతములో నివసించిన పన్నెండు సంవత్సరములలో శిరోల్–కురుద్వాడ గ్రామములకు భిక్షకు వెళుతుండేవారు. కృష్ణ–పంచగంగలు కలిసే చోటు ఈ చతురస్రాకార నర్సోబావాడి మహా పవిత్రమైన పుణ్యక్షేత్రము.



ఔదంబర వృక్షములు ఎక్కువగా ఉండే ఈ పవిత్ర మహారణ్యమునకు తూర్పు దక్షిణంగా ప్రవహించే కృష్ణానదిలో పంచగంగలు వచ్చి కలుస్తాయి. ఈ పవిత్ర నదుల స్నానఘట్టాలకు దగ్గర మేడి వృక్షము క్రింద రాతితో కట్టిన అందమైన దత్తమందిరం భక్తుల పాలిట వరప్రసాదినిగా పేరుగాంచింది. భక్తులకు దర్శనము ఇచ్చే నృసింహ సరస్వతి వారి నల్లని పాదుకులను భక్తులు మధ్యాహ్న సమయములో మాత్రమే చూచుటకు వీలు కలుగుతుంది. ఈ ఆలయంలో పూజ, హారతి, మహాభిషేకము నిత్యము భక్తులు చేసుకొనవచ్చును. పౌర్ణమి పర్వదినమున అనేక మంది భక్తులు కాలినడకన విచ్చేసి నదీ తీర్థములో స్నానమాచరించి శ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు, పారాయణ చేసుకుంటూ తమ భక్తి ప్రపత్తులను పెంచుకుంటారు. ఈ క్షేత్రానికి దక్షిణంగా అష్ట తీర్థ దేవస్థానము కూడా యాత్రికులు దర్శించవలసిన పుణ్య స్థలము.

**అష్ట తీర్థములు :** శుక్ల తీర్థము, పాపవినాశక తీర్థము, సిద్ధ తీర్థము, కోటి తీర్థము, శక్తి తీర్థము, షట్కాల తీర్థము, ప్రయాగ తీర్థము, అమర తీర్థము.

## దత్తక్షేత్రముగా పేరుగాంచిన కరంజ నగరం




నాగపూరు – మన్మాడ్ బ్రాడ్‌గేజ్ రైలు మార్గములో మూర్తిజాపూరులో దిగి 30 కిలోమీటర్లు బస్సులో గాని, నేరోగేజ్ రైలుమార్గంలో గాని కరంజనగరం చేరవచ్చు లేదా నాగపూరు నుండి అకోలా వెళ్ళి అక్కడ నుండి కరంజ వెళ్ళవచ్చు. నృసింహ సరస్వతి స్వామిని ఈ క్షేత్రములో దర్శించవచ్చును. శ్రీ నృసింహ సరస్వతి ఇక్కడే జన్మించి బాల్యములో ఆడుకున్న ఈ స్థలమును గురుమందిరముగా రూపొందించారు. శ్రీ స్వామికి ప్రీతి పాత్రమైన మర్రిచెట్టు, దాని ప్రక్కన గురుమందిరంలో నృసింహసరస్వతి పాలరాతి విగ్రహము భక్తులు దర్శించవలసిన పుణ్యస్థలములు. ఇక్కడ భక్తులకు వసతి, మధ్యాహ్న భోజనము దేవస్థానము వారు ఏర్పాటు చేయుచున్నారు.

1486 సంవత్సరము పుష్యశుద్ధ విదియనాడు స్వామి జన్మించారని శ్రీ వాసుదేవానంద సరస్వతి వారు లోకానికి తెలియజేస్తున్నారు. 1905 ప్రాంతములో శ్రీ వాసుదేవ సరస్వతి ఇచ్చట రామమందిరములో బసచేయ దాని ప్రక్కనే ఉన్న షావుకార్ల భవనములో నృసింహసరస్వతి దర్శనమిచ్చెను. తాను జన్మించిన స్థలము, ఆడుకొను చోటు శ్రీ స్వామికి దృశ్యమైనట్లు చెప్పుచున్నారు. ఆ స్థలమును శ్రీ స్వామి గుర్తుచేసి అక్కడ నృసింహ సరస్వతి పటము, దాని దగ్గర పాదుకలు పెట్టిరి. కరంజ విచ్చేయు భక్తులు ప్రతిదినము 4 గంటల నుండి 6 గంటల మధ్య ఈ పుణ్యస్థలమును దర్శించవచ్చును. గురు మందిరంలోని శ్రీ స్వామి వారి పాలరాతి విగ్రహమును భక్తులు తాకరాదని దేవస్థానము వారి మనవి. కావున భక్తులు వారికి సహకరించ ప్రార్థన.

## గజానన మహారాజ్ సంస్థానము - షేగాం

షేగాం రైల్వేస్టేషన్‌లో దిగి బయటకు వచ్చి శ్రీ గజానన మహారాజ్ సంస్థానమునకు చేరు భక్తులు రూమ్ తీసుకుని సామానులు భద్రపరచుకుని దేవాలయమునకు వెళ్ళవలెను. సీతారామలక్ష్మణుల పాలరాతి విగ్రహము



కలిగిన ఈ దేవాలయములో భక్తులను విశేషముగా ఆకర్షించేది ఆలయ ప్రశాంతత. ఈ దేవాలయములో ప్రవేశించు భక్తులకు ఎడమవైపు వినాయక ఆలయము, కుడి వైపు నుండి లోపలకి ప్రవేశించి సీతారామ లక్ష్మణ మూర్తులను దర్శించి, ఆలయ క్రింది భాగమున ఉన్న గజానన మహారాజ్ యొక్క సమాధి మందిరం చూడవలెను. 19 మెట్లు దిగి శ్రీ మహరాజ్ యొక్క పాలరాతి విగ్రహములు, పాదుకలు చూసిన భక్తుల ఆనందమునకు హద్దులు ఉండవు. ఆలయమునకు కుడివైపున ఉన్న హాలులో ధుని, వెండి తొడుగు కలిగిన పాదుకలు శ్రీ పాండురంగస్వామి విగ్రహము చూడవలసినవి.

## వైద్యనాథుడు

రాణి అహల్యాబాయి ఎంతో భక్తిప్రపత్తులతో కాశి, ఉజ్జయిని సోమనాథ, ఓంకారేశ్వర, శ్రీశైలం, వైద్యనాథ్ మొ॥లగు దేవాలయాలను అభివృద్ధి చేసినట్లు చెప్పడంకాదుకానీ శాసనాలద్వారా తెలుస్తుంది. ఈ వైద్యనాథుడు పేరుకు తగ్గట్లు అనారోగ్యాలు తగ్గిస్తాడని భక్తుల నమ్మకం. ఈ దేవాలయం చుట్టు జ్యోతిర్లింగాల పేరుతో శివలింగాలు ప్రతిష్ఠించారు. ఇక్కడికి బస్ సౌకర్యం, రైలు మార్గం కూడా వుంది. వసతి సౌకర్యాలు వున్నాయి.

కాకపోతే ఇది అసలైన జ్యోతిర్లింగం కాదని, ఢిల్లీనుండి కలకత్తా వెళ్ళే దారిలోగల జెసడి (రైల్వేస్టేషను వుంది) స్టేషనునుండి 6 కి.మీ దూరంలోగల జ్యోతిర్లింగం అసలైన వైద్యనాథుడని అంటారు. దీని గురించి, వివరాలు తెలుసుకునే పురాణగాధను కూడా కొద్దిగా గ్రహిద్దాం.

శివభక్తుడైన లంకేశ్వరుడు ఒకానొక సమయంలో శివానుగ్రహం కోరి యజ్ఞం చేస్తాడు. తన పది శిరస్సులను ఒక్కొక్కటే ఆహుతిచేస్తూ, పదవ శిరస్సు వద్దకు వచ్చేసరికి శివుడు అనుగ్రహిస్తాడు. ఖండించబడిన తన శిరస్సులు యధాప్రకారం వుండవలెనని, నీవు మా లంకలో స్థిరంగా వుండాలని కోరతాడు. "తథాస్తు" అన్న శివుడు, తన బదులు తన ఆత్మలింగాన్నిస్తాడు.

ఇది నచ్చని దేవతలు, గణపతిని ప్రేరేపించి, సంధ్యానుష్ఠాన సమయానికి, కనుపించిన కుర్రవానికి ఆత్మలింగాన్నిచ్చి, తాను అనుష్ఠానం చేసుకుని వచ్చేలోగా క్రిందపెట్టవద్దని చెబుతాడు. అంతవరకు మొయ్యలేనని సతాయించే విఘ్నేశ్వరుడు రావణుడు తిరిగి వచ్చే అదనుచూసి ఆత్మలింగం క్రిందపెట్టేస్తాడు. దీనికోసం ఆతను చేసే ప్రయత్నంలో వళ్ళంతా రక్తసిక్తమైతే, కరుణాళువుయైన శివుడు, ప్రత్యక్షమై ఆతని గాయాలు మాన్పుతాడు. కనుక శివుడు ఇక్కడే, ఈ చితాభూమిలో వైద్యనాధుడై వెలిసాడని, అందుకే ఈ శివునికి వైద్యనాధుడని పేరు వచ్చిందన్నదొక పురాణగాధ.

ఇక్కడి మార్కండేయ తీర్థం, హరిహరతీర్థం, గణపతి మందిరం చూడవచ్చును. గర్భాలయంలోకి వెళ్ళి భక్తులు అభిషేకం చేసుకోవచ్చును.

## భీమశంకరుడు

పూనేకు 130 కి.మీ దూరంలో ఈ భీమశంకరం వుంది. ఇది ప్రాచీన దేవాలయం. ఇక్కడికి బస్సు సౌకర్యం కూడా వుంది. 40 కి.మీ మాత్రం కేవలం కొండలు, కోనల మధ్య ప్రయాణం. అక్కడక్కడ ఇళ్ళు, చిన్నచిన్న బడ్డికొట్లుతప్ప, వూరుగా ఎక్కడా ఏమీ కనబడదు. ఇక్కడి వాతావరణం అగమ్యగోచరం. ఎప్పుడు వానో, ఎప్పుడు పొగమంచు దట్టంగా వుంటుందో చెప్పలేము. కాని దేవాలయం పైన శిల్పకళాచాతుర్యం చెప్పుకోదగ్గది. గర్భగుడికి మెట్లు దిగి వెళ్ళాలి. శివలింగం భద్రంగా వుండటంకోసం పానపట్టంతో కల్పి వెండితొడుగు తొడిగారు. దీంతోనే అభిషేకాదులు నిర్వహిస్తారు.

పూర్వమొకానొక సమయంలో లోయలోకి కట్టెలు కొట్టేవాడు వెళ్ళి కట్టెలు కొడుతుంటే ఖంగుమనడం, రక్తం కనపడటం జరిగింది. తీరాచూస్తే అక్కడొక శివలింగం. దాంతో అతను భయపడి స్థానికులకు, రాజుగారికి

చెబుతాడు. ఇక్కడ ఆలయం నిర్మిస్తారు. ఇప్పటికీ మనం శివలింగంపై గొడ్డలి గాటును చూడవచ్చును.

మరొక కథ ప్రకారం కుంభకర్ణుని కుమారుడైన ఈ భీముడు, బ్రహ్మను గూర్చి తపస్సు చేసి, అఖండపరాక్రమాన్ని, దివ్యాయుధాన్ని పొంది, దేవతలను, మునులను పీడిస్తూ, పాతాళానికి వెళ్ళి అక్కడ కామరూపేశ్వరుడనే చక్రవర్తిని, ఆతని భార్యను చెరబడతాడు. పరమశివభక్తుడైన ఆ పాతాళాధిపతి, భార్య చెరలోని మట్టి శివలింగం చేసుకుని, తమ భక్తిని పెంపొందించుకుంటే, అదిచూసిన భీమశంకరుడు అది కుదరదని, లింగాన్ని ఖండించబోయేసరికి, తన కంటిమంటతో అతన్ని చంపేస్తాడు. అందరు సంతోషిస్తారు. ఆ భీమశంకరుని పేరునే ఈ క్షేత్రం పేరు పొందిందని, ఆ శివుడే జ్యోతిర్లింగ స్వరూపుడై భీమశంకరుడని పేరు పొందాడని చెబుతారు.

## ఘృష్ణేశ్వరుడు



ద్వాదశజ్యోతిర్లింగాలలో ఇది ఒకటి. ఇదీ పాతాళంలోనే వున్నట్లు మెట్లు దిగి లోపలికి వెళ్ళాలి. ఈ శివుడిని అందరు చూడవచ్చు. అభిషేకం చేసుకోవచ్చు. హంగు ఆర్భాటంలేని ఆలయప్రదేశం. విశాలమైన ప్రాంగణంలో అద్భుత శిల్పసంపదతో, పరమ ప్రశాంతంగా వుండే దివ్యక్షేత్రం.

ఔరంగాబాద్‌నుండి 30 కి.మీ. దూరం. ఈ ఘృష్ణేశ్వరానికి 6 కి.మీ.లలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఎల్లోరా గుహలున్నాయి. ఇక పౌరాణికంగా ఆలోచిస్తే శివపార్వతుల మధ్య మాటామాటావచ్చి శివుడు మాయమైపోతే, ఆయన్ని వెదుక్కుంటూ వచ్చి పార్వతి శివునిక్కడ కనుగొని, కోయయువతిగా శివుని ఆకర్షిస్తుంది. దీనికి కామ్యకవనమని పేరు. ఇందులో ఇతరులకు ప్రవేశం లేదన్నది శివశాసనం.

ఒకనాడు పార్వతికి దాహంవేస్తే, శివుడు త్రిశూలంతో పాతాళంనుండి భోగావతి నదిని పైకి తెస్తాడు. దీనిని శివతీర్థమంటారు. మరోసారి పార్వతి తన చేతిలో కుంకుమ వేసుకుని ముద్దగా చేసేసరికి చిత్రంగా అది శివలింగంగా మారి, అందులోంచి దివ్యజ్యోతి వచ్చేసరికి, దానినొక రాతిలో వుంచి పరమేశ్వరానుమతితో పార్వతి ప్రతిష్ఠిస్తుంది. అదే కుంకుమేశ్వరలింగం. ఘృష్ణేశ్వరుడన్నా, కుంకుమేశ్వరుడన్నా ఒకటే. మరో కథనం ప్రకారం...

పూర్వం దేవగిరి పట్టణంలోని సుధర్ముని భార్య ఎంతకాలానికి తమకు సంతానం లేకపోయేసరికి, ఆమె తన చెల్లెలు ఘృశ్మలను పెండ్లి చేసుకోమంటుంది. ఈమె పరమశివభక్తురాలు. ప్రతినిత్యం 1001 పార్థివ శివలింగాలకు పూజచేసి, వాటిని చెరువులో నిమజ్జనం చేసి భుజించేది. ఆమెకో పిల్లాడు. అతడు పెరిగి పెద్దవాడయ్యాడు. పెండ్లికూడా చేసారు. అయితే మొదటిభార్య + అక్కగారు, అసూయపాలయి, ఒకనాటి రాత్రి, ఆ చెల్లెలు కొడుకు తలనరికి, చెరువులో పడేసి ఏమీ ఎరుగనట్లు పడుకుంటారు. తెల్లవారి ఈ దారుణాన్ని కోడలు, అత్తగారితో చెప్పి బావురుమంటుంది. అప్పుడామె, "చూడమ్మా! నేటితో లింగార్చన పూర్తవుతుంది. నిష్కల్మష భక్తితో నేను చేసిన పూజలకు ఆ పరమేశ్వరుడు నీ పతిని బ్రతికిస్తాడంటుంది. యధావిధిగా 1001 లింగాలకు పూజచేసి చెరువులో

కలిపేసరికి, శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమంటాడు. నా కోడలికి పతిభిక్ష పెట్టు. అలాగే ఎవరైనా సరే, వారికి సంతాన నష్టం, అకాలమరణం లేకుండా కాపాడు. ఈ ప్రదేశంలో ఘృష్ణేశ్వర నామంతో జ్యోతిర్లింగ స్వరూపుడివై భక్తజనులను కాపాడమన్న ఆమె కోరికకు "తథాస్తు" అని శివుడు, ఘృష్ణేశ్వరుడిగా ఇక్కడ వెలిసాడు.

## షిర్డి పరిసరాలలో ముఖ్య పుణ్యస్థలములు

**అద్దాల మందిరం :** ఇది శాంతినాథ్ దిగంబర్ జైన మందిర కార్యనిర్వాహక సమితి ద్వారా నిర్మించబడినది. ఇందులో 16వ తీర్థంకర్ శ్రీ శాంతినాథ్ మహారాజ్ వారి విగ్రహాన్ని స్థాపించారు. ఈ మందిరాన్ని గాజు పెంకులు మరియు గ్రనైట్ మార్బుల్ రాళ్లతో ఎంతో ఆకర్షణీయంగా కట్టారు. ఈ మందిరం షిర్డి మున్సిపాలిటీ ఆఫీసు వెనకాల కాన్‌కోరి వెళ్లే రోడ్డులో వుంది. సమాధి మందిరము నుండి అర కిలోమీటరు దూరంలో ఉంది.

**శనీశ్వర దేవాలయం :** శింగణాపూర్ భారతదేశంలోని ప్రముఖ శనీశ్వర దేవాలయాలలో మహారాష్ట్రలోని శని శింగణాపూర్ గ్రామం ఒకటి. చల్లని పరిసరాలతో, చక్కటి వాతావరణంలో ఉండే ఈ గ్రామంలో ఏ ఇంటికి తలుపులు గాని, కిటికీలు ఉండవు. ఎవరైనా దొంగతనం చేయడానికి ప్రయత్నించినా శనిదేవుడు తన ప్రభావాన్ని చూపుతారు. షిర్డీ నుండి 75 కి.మీ. దూరంలో ఉన్న ఈ క్షేత్రములో భక్తులు శనీశ్వరునికి అభిషేకములు చేసుకొనవచ్చును.

## నేవాస

**శ్రీ మోహినీరాజ మందిరం.** ఈ దేవాలయం షిర్డి నుండి 70 కి.మీ. దూరంలో కలదు. శివుడు మోహిని అవతారము దాల్చిన ఈ క్షేత్రములో మోహిని రాజు దేవాలయం పేరుగాంచినది.

## తుల్‌జాపుర్ - శ్రీ భవానీమాతా మందిరము




తుల్‌జాపూర్ శ్రీ భవానీమాతా మహారాష్ట్రంలో కులదేవతగా ప్రసిద్ధి పొందిన మందిరము. తూర్పు ముఖంగా యమునాచల్ పర్వతాల యొక్క బాలాఘాట్ కొండపై కల ఈ మందిరములో శ్రీ భవానీ విగ్రహం సింహంపై కూర్చున్నట్లుగా ఉంటుంది. ఆమె పాదాల క్రింద మహిషాశురుని మొండెం మరియు ప్రక్కన వాని తలపడి ఉన్నాయి. భవాని మాతా ఎడమ చేతిలో మహిషాశురుని జుట్టు, కుడి చేతిలో త్రిశూలం కలదు. వేరే చేతులలో వివిధ రకాల ఆయుధాలు కలవు. మందిరములోని సభా మండపము 16 స్థంభాలతో కూడి ఎంతో దివ్యంగా ఉంది. తుల్‌జాపూర్, ఉస్మానాబాద్ జిల్లాలో కలదు. షిర్డీ నుండి 360 కి.మీ. దూరం.

**పంచవటి :** గోదావరికి ఆవలిఒడ్డునగల ప్రదేశాన్ని పంచవటి అని పిలుస్తారు. శ్రీరాముడు తన అరణ్యవాస సమయాన్ని సీతతో ఇక్కడ గడిపాడంటారు. అయిదు మర్రిచెట్లు ఒకగుహలాగ వున్న ఈ ప్రాంతాన్ని పర్ణశాల

అంటారు. ఇక్కడున్న స్వామిని 'వటేశ్వరు'డని పిలుస్తారు. ఇక్కడ వున్న గుహను సీతాగుహగా చెబుతారు. ఖర, దూషణ, త్రిశిరులతో యుద్ధంచేస్తూ సీతను ఈ గుహలో వుండమని కోరతాడు. దీనికి కొద్దిదూరంలో సీతాపహరణ ప్రదేశము, అక్కడో మందిరమున్నాయి. కాలారామ, కపాలేశ్వరస్వామి దేవాలయాలు, సీతాగుహకు సమీపంలో వున్నాయి.

ఈ నాసిక్‌లోనే **"సుందరనారాయణ"** ఆలయం. ఇది 1750 సం॥లో పీష్వా బాజీరావు చేత నిర్మించబడింది. ఇక్కడ విష్ణుమూర్తి తన దేవేరులు శ్రీదేవి భూదేవిలతో అందంగా కనిపిస్తాడు. ప్రతి సంవత్సరం మార్చి 20, 21 తేదీలలో సూర్యుని కిరణాలు స్వామివారి పాదాలను ముద్దుపెట్టుకుంటాయి.

ముంబైలోని "సెయింట్ జేవియర్ వస్తుసంగ్రహాలయంలో (మ్యూజియం) 2 ½ అంగుళాలు **నృత్యగణపతి విగ్రహం** చూడముచ్చటగా వుంటుంది. ఒకమూల నృత్యభంగిమలోవుంటే తొండం మోదకం స్వీకరిస్తూన్నట్లుంది.

ఇక నాసిక్‌లో **కాలరామ, సప్తశృంగిమాత, తపోవనాలను** చూడాలి. కాలారామమందిరం 1794 సం॥లో పీష్వాలచే నిర్మించబడింది. 12 సం॥లు నిర్మాణం పట్టిన ఈ ఆలయం నల్లరాతితో నిర్మాణమైంది. కాబట్టి 'కాలారామ' మందిరంగా పేరుపొందింది. ఇక్కడి విశేషం ముఖప్రవేశ ద్వారంనుండి ఉదయకిరణాలు ఆంజనేయుని గుడిపై ప్రసరించడం ఆనాటి వాస్తుకళకు, ఆలయ నిర్మాణానికి అపురూప నిదర్శనం.



**నాసికకు** సుమారు 55 కి.మీ దూరంలోని నందూరి గ్రామం వద్ద సప్తశృంగి పర్వతంపై **సప్తశృంగి దేవత ఆలయం** వుంది. ఈ దేవి ప్రస్తావన ఈ రచయిత గురుదేవులు శ్రీవోరుగంటి రామకృష్ణ విరచిత 'శ్రీసద్గురు సాయిబాబా జీవిత చరిత్ర, నిత్యపారాయణ గ్రంథంలో చూడవచ్చును. ఇక్కడి తల్లిని 18 హస్తాలతో 18 రకాల ఆయుధాలు ధరించిన శత్రునాశనిగా చూపుతారు. ఇక్కడ జరిగే చైత్రపున్నమి ఉత్సవానికి ఎక్కడెక్కడినుండో, ఎందరెందరో భక్తులు వస్తారు.

పంచవటికి 2 కి.మీ దూరంలో ఈ తపోవనముంది. కపిల మహర్షితో సహా ఎందరో మునిచంద్రులు ఇక్కడ తపస్సు చేసి నందువలన దీనిని **'తపోవన'** మని పిలుస్తారు. లక్ష్మణుడు శూర్పణఖ ముక్కుకోసింది ఇక్కడేనంటారు. అందుకు గుర్తుగా లక్ష్మణాలయం, శ్రీరామునిమందిరం, సీతపాదాలు, ఇక్కడ చూడవచ్చును. 8 తీర్థాలతోకూడిన గోదావరి 'నదీసంగమం'గా దీనిని తలుస్తారు. ఇది చూడనిదే నాసిక్ యాత్ర పూర్తికాదన్నది భక్తుల అభిప్రాయం.

వార్ధా స్టేషనుకు కొంచెం దగ్గర్లో ఈ **"కుండలపుర"** ముంది. ద్వాపరంలో ఇది భీష్మకుని రాజధాని కుండినపురంగా చెబుతారు. రుక్మిణి పెండ్లికి ముందుగా శ్రీకృష్ణుని భర్తను చెయ్యమని ప్రార్థించిన దుర్గామాత ఆలయముంది. అందుకేనేమో ఇక్కడ రుక్మిణీ శ్రీకృష్ణుల ఆలయం ప్రత్యేకంగా దర్శనమిస్తుంది.

జాతీయ రహదారి **'కాసరఖేడ్ – అడగాన్'** ల మధ్య అడగాన్‌కు 8 కి.మీ దూరంలో ఈ అతిపురాతన **'మనుదేవి' ఆలయం** వుంది. ఇక్కడి తల్లి పేరు 'ఖందేష్‌దేవి'. ఎనిమిది బావులు ఇక్కడ చూడగల్గుతాం. ఆలయ నిర్మాణం చేద్దామనుకుంటున్న తరుణంలో మనుదేవి, గణేష్, శివలింగం, అన్నపూర్ణాదేవి విగ్రహాలు బయటపడ్డాయి. నవరాత్రుళ్ళు ఇక్కడ బాగా జరుగుతాయి. ముఖ్యంగా క్రొత్త దంపతులు ఇక్కడికి వస్తూంటారు. ఏడాదిలో నాలుగుసార్లు భక్తులీ తల్లిని దర్శించవస్తారు.

పంచగంగాక్షేత్రంగా మీరజ్‌కు 10 కి.మీ దూరంలో ఈ దివ్య ప్రదేశం ప్రసిద్ధిగాంచింది. దీనిని **'నృసింహవాడి'** అని కూడా పిలుస్తారు. కాంసారి, కుంభీ, తులసి, భోగవతి, సరస్వతి, నదులు కృష్ణానదిలో కలిసే సంగమప్రదేశమిది. ఇది ముఖ్యంగా దత్తక్షేత్రం. ఇక్కడి అమరేశ్వరుడు (శ్రీవోరుగంటి వ్రాసిన 'ఓం శ్రీదత్త గురుచరిత్రలో చూడవచ్చు) అతి మహిమాన్వితుడు. నదికి ఇరుప్రక్కల ఆలయాలు ఉన్నాయి. నిజంచెప్పాలంటే ఇది సాధకులకు తపోభూమిగా చెప్పవచ్చును.

పూనెకు 100 కి.మీ దూరంలో ఈ ప్రాంతముంది. ఇది కృష్ణానది జన్మస్థలం. ఇంకా శివాజీ మహారాజు ప్రతాపఘడ్ కోటకూడా ఇక్కడ చూడగల్గుతాం. తీర్థయాత్రీకులకు, పర్యాటకులకు, ప్రకృతిప్రియులకు అందరికి పనికివచ్చే నయనానందకర పవిత్ర ప్రదేశం. దీనిని **"పంచగంగాక్షేత్ర"** మని కూడా అంటారు. ఇక్కడ కృష్ణానదితోపాటు, వేణి, కోయిన, కృష్ణ, సావిత్రి, గాయత్రి కూడా జన్మించాయట. ఇక్కడ ఉన్న మహాబలేశ్వర్ శివలింగముపైనుండి ఈ అయిదు నదులు ప్రవహించడమొక విశేషం.

వేణి, సతారాకు దక్షిణంగా 30 కి.మీ దూరంలో ఈ రెండూ కలిస్తే కృష్ణ **'కృష్ణవేణి'** అయింది. కొయినా మహాబలేశ్వరంనుండి 40 కి.మీ దూరంలో కొండలలో పుట్టి 'కరాడ'లో కృష్ణతో కలుస్తుంది. సావిత్రి మహాబలేశ్వరం వైపు వచ్చి కృష్ణలో కలుస్తుంది. చూడచక్కని ప్రదేశం.

**పాచీరా జంక్షన్‌కు** 30 కి.మీ దూరంలో ఈ **'పద్మాలయ'**మనే వూరువుంది. ఈ క్షేత్రంలోవున్నవి రెండు విగ్రహాలు. అందులో ఒకటి ఆదిశేషుడు ప్రతిష్ఠించాడుట.

**సజ్జన్‌గడ్‌లో** – మహాభక్తుడు శివాజీ మహరాజు గురుదేవులు, ఆంజనేయుని అవతారమైన **శ్రీ సమర్ధ రామదాసు మఠము,** ఆలయము ఒక కొండపైన చూడగల్గుతాము. ఇక్కడి సీతారాముల ఆలయనిర్మాత సమర్ధరామదాసు. ఇక్కడ ప్రత్యేకంగా వూరులేదు, రామదాసు మఠము, శ్రీసీతారాముల ఆలయాల వలన ఈ ప్రాంతం ప్రఖ్యాతిపొందింది. ఇక్కడ శ్రీసమర్ధరామదాసు ఆనాడుపయోగించిన మంచము, భోజన పళ్ళాలు, మంచినీరు బిందె, పాదరక్షలు, చేతికర్రలను చూడగల్గుతాం. ఇది ఆస్తికులకు, చారిత్ర పరిశోధకులకు మహదానందదాయకం.



**ఆళంది** – ఇది చారిత్రక, పౌరాణిక నేపథ్యంగల ప్రాంతం. ఇక్కడి **జ్ఞానేశ్వరమహరాజు సమాధి, రుక్మిణీసమేత పాండురంగస్వామి వారి ఆలయం** చూడదగ్గవి. పూనానుండి 25 కి.మీ దూరంలో ఈ ఆళందీక్షేత్రంవుంది.

**పూనాలోని** మరో ఆలయం ఊరికి చివరిగా ఓ కొండపైగల **పార్వతీదేవి ఆలయం**. ఇక్కడి ఆలయం కన్న అందులో కొలువైన పార్వతీమాతను చూసి తీరాలి. మూడువందల సం॥ల క్రితం పీష్వాలు దీనిని నిర్మించారు. భక్తులకు కొంగుబంగారమీ తల్లి.



**నాగపూరులో** చూడదగ్గది **'అంబాదేవి మందిరం'.** అలాగే దత్తావతారునిగా తలచే **తాజుద్దీన్ బాబా సమాధి,** నాగపూరు 155 కి.మీ దూరంలో వుందీ అంబాదేవి మందిరం. స్థలపురాణం ప్రకంరం శ్రీకృష్ణుడు, రుక్మిణిని, ఆమె కోరిక మేరకు అపహరించి, ద్వారకలో వివాహం చేసుకున్నాక దర్శించిన మొదటి మందిరంగా చెబుతారు. విదర్భవాసులకు ఈ తల్లి ఇలవేల్పు. అందుకని నాగరూపు, విదర్భవాసులు ఎంతో భక్తితో ఈ తల్లిని పూజించి, పరవశిస్తారు.

**రామటేక్ రామాలయం.** కొండమీద శ్రీరామాలయంవుంది. శ్రీరాముడు వనవాసకాలంలో ఇక్కడ తపస్సు చేసే అగస్త్యమహర్షిని దర్శించినట్లు స్థలపురాణం. శంభుకమహర్షి ఇక్కడే శ్రీరామ కరుణతో ముక్తిని పొంది 'ధూమ్రేశ్వర్' శివలింగంగా పూజింప బడుతున్నాడు. అంబరీషుడు కూడా ఇక్కడ తపస్సు చేసాడుట. రాముడు వీరాసనంలో కూర్చున్నాడన్న ప్రదేశంలో శ్రీసీతా రాముల మందిరం, తూర్పున లక్ష్మణాలయం నిర్మించారు. దక్షిణంలో సీతాదేవి స్నానంచేసిన 'సీతాకుండ' ముంది. ఇంకో విశేషం మహాకవి అమ్మవారి అభిమానపాత్రుడు. కాళిదాసు, తన 'మేఘసందేశ' గ్రంథాన్ని ఇక్కడే ప్రారంభించాడుట.



ఇదీ మహాభక్తనిలయమనే భగవన్నివాస మహారాష్ట్ర చరిత్ర.

**వాస్తవానికి సర్వమూ బ్రహ్మమే, బ్రహ్మమయమే, లోపల ఉన్న ఈ ఆత్మకూడా బ్రహ్మమే. ఆత్మకు పాదాలు నాలుగు, వైశ్యానరుడు మొదటి పాదం, తైజసుడు రెండో పాదం. ప్రాజ్ఞుడు మూడో పాదం. ఆత్మ తత్వపుసారమే నాలుగో పాదం.**

– మాండూక్య ఉపనిషత్తు

**'సృష్టికర్త' సంతానం కావాలనుకుని ధ్యానరూపంలో తపస్సు చేశాడు. అలా తపస్సు చేసి పదార్థం, శక్తి అనే జంటను సృష్టించాడు. ఈ రెండూ ఏకమై బహువిధ సంతానాన్ని సృష్టిస్తాయని సృష్టికర్త భావించాడు.**

– ప్రశ్నోపనిషత్తు

## : : సూక్తులు : :

ఈ సృష్టి భగవంతుడు రచించిన సుందరకావ్యం, దీనికి మృత్యువూ లేదూ, అనారోగ్యమూ లేదు.

– అధర్వణ వేదం.

శరీరం ఆత్మ నివసించే స్థానం కనుక, అది ఓ పవిత్రమైన పుణ్యక్షేత్రంలా పవిత్రమైనదే.

– మహాత్మాగాంధీ

సప్త ద్వీపాలలోనైనా, నవఖండాలలోనైనా, ముల్లోకాలలోనైనా శాంతితో సరితూగగలిగే సుఖం లేనేలేదు.

– తులసీదాస్

కారు ఎక్కినంత మాత్రాన ఎవరూ గొప్పవారు కాలేరు. ఒక్కోసారి కాకి కూడా కారు మీద కూర్చుంటుంది.

– జవహర్‌లాల్ నెహ్రూ

పశువుని మానవుడిగానూ, మానవుణ్ణి మాధవుడిగానూ మార్చేదే నిజమైన మతం.

– స్వామీ వివేకానంద

మనిషికి అతను చేసే పనిలో ఉండే కార్య కౌశలాన్ని యోగం అంటారు.

– శ్రీకృష్ణ భగవానుడు

జీవితంలో మధుర క్షణాలన్నీ పోగుచేసుకోండి. అదే పెద్ద తనంలో పట్టుపరుపై మెత్తదనాన్ని యిస్తాయి.

– టార్కింగ్‌టన్

జ్ఞానం అమాంతంగా పొంగిపొర్లదు. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతుంది.

– మెకాలే

ఆత్మ తప్ప నీకు మరో మంచి గురువు లేదు.

– వివేకానంద


శాశ్వత సత్యాన్వేషణే జీవితం.

– యజుర్వేదం

నిన్న గడిచిపోయింది. రేపు తెలియదు. ఈ రోజే అన్నిటికన్నా విలువైనది.

– గొథే

# మణిపూర్ (మణిపురి)




ఇది పౌరాణిక మణిహారం. పురాణ గాధామయం. ఒకసారి రాధాకృష్ణులు రాసలీలలో మునిగి, శివుని ఇక్కడకు ఎవరు రాకుండా కాపలా వుండమంటే, ప్రకృతి పురుషుల ప్రణయానికి తన్మయత్వమొందిన దుర్గాదేవి, శివుని చేరి తనతో నాట్యం చేయమంది. ఈ సమయంలోనే శ్రీమహావిష్ణువు, ఇతర దేవతలు ప్రకృతి పరవశించి పులకరించినట్లు, నాట్యం చేస్తూంటే...

ఆందరితోపాటు ఆదిశేషుడుకూడా నాట్యం ప్రారంభించాడు. ఆ తన్మయత్వంలో ఆదిశేషుని తలలోని మణులు జలజలరాలి, ఈ ప్రదేశం "మణిపురి" అయిందట. ఇంక భారతంలోకి వెడితే కురుక్షేత్ర యుద్ధమయ్యాక ధర్మరాజు అశ్వమేధం చేయతలపెడితే అన్నదమ్ములలో ఒకడైన అర్జునుడు జైత్రయాత్రకు వచ్చి చిత్రాంగదను ప్రేమించి, పరిణయం చేసుకోబోతే, మణిపుర మహారాజు నీ కుమారుని నాకు వారసుని చెయ్యమంటే ఆమెను వివాహం చేసుకుని, మూడు సం॥లు అక్కడే వుండి బభ్రువాహనుడు పుట్టాక తన ప్రయాణం కొనసాగిస్తాడు.

అందుకని మణిపురివాసులు తాము బభ్రువాహనుని సంతతివారమని చెప్పుకుని పొంగిపోతారు. ఇలాగ ఎన్నెన్నో కథలు, గాధలతో ముడిపడ్డ ప్రదేశమీ "మణిపురి".

ఇక ఇంఫాల్‌లో చిత్రాంగదను పెండ్లాడిన ప్రదేశం. బాహుబలి గా ఆంజనేయుని విగ్రహం, "పఖాంగ్బా" అనే సర్పదేవాలయం, రఘునాధజీ ఆలయాలు, ఇంఫాల్‌కు 27 కి.మీ. దూరంలో వున్నాయి. 1467లో చైనా నిర్మాణపద్ధతిలో కట్టిన విష్ణుమూర్తి ఆలయం, 45 కి.మీలలో దేవత ఆలయం, గోవింద్‌జీ ఆలయం. (ఇది మణిపూర్ మహారాజుల భవంతుల ప్రక్కన రెండు బంగారు డోములతో వున్న దేవాలయం. ఇందులో ప్రధాన దేవతలు బలరామకృష్ణులు. వీరికి ప్రక్కన జగన్నాధుడు. ఇలాగ చెప్పుకొనేకన్న ఈ రాష్ట్రంలో చూడదగ్గవి అగర్తాలలోని లక్ష్మీనారాయణ, ఉమామల్లేశ్వర, కాళి, జగన్నాధస్వామి దేవాలయాలు.

ఉదయపూర్ నుండి 60 కి.మీ. దూరంలోని ఉనకోటిలోని హరగౌరి, పంచముఖశివ, విష్ణుపాదం, కాలభైరవ, వాసుదేవ, హనుమాన్, గణపతి, రామ, లక్ష్మణస్వామి దేవాలయాలు.

అగర్తలానుండి 65 కి.మీ దూరంలోని రాధకిషోర్‌పూరులోని రాధాకృష్ణ దేవాలయం, దుమార జలపాతం దగ్గర్లోని తీర్థముఖ మహాదేవస్వామి దేవాలయాలు...

నెగ్రిటింగ్‌లోని శివమహదేవుడు, అమరపురంలోని వైష్ణవి, లక్ష్మీ, సరస్వతి, మంగళచండి ఆలయాలు, చూడటానికి సిద్ధంగావున్న ప్రాచీన ఆలయాలు.

## బిష్ణుపూర్ - విష్ణుమూర్తి ఆలయం

"బిష్ణుపూర్" అంటే 'విష్ణుపుర'మనే చెప్పాలి. ఇక్కడి విష్ణుమూర్తి ఆలయం ఇంఫాల్‌కు షుమారు 27 కి.మీ దూరంలో వుంది. 1967 సం॥లో అఖండ భారతావనిలో చైనా నిర్మాణపద్ధతిలో నిర్మించబడిన ఆలయం. ప్రస్తుతం ఇది శిథిలావస్థలో వుంది. దీనికి దగ్గర్లోని 'కైనా' అనే ప్రదేశం హిందువులకు పరమపవిత్రంగా చెప్పబడింది.

## ఇంఫాల్ - గోవిందజి ఆలయం

ఇంఫాల్‌లోని దేవాలయాలన్నింటిలో గోవిందజీ ఆలయం చాలా ముఖ్యమైంది. రాజర్షి భాగ్యచంద్ర ఆధ్వర్యంలో 18వ శతాబ్దిలో ఈ ఆలయం నిర్మించబడింది. మణిపూరురాజుల భవంతుల ప్రక్కనే వుందీ ఆలయం. హోలీకి ఇక్కడ గొప్ప ఉత్సవం జరుగుతుంది. ఆలయం ఎంతో అందంగా బంగారు డోములతో నిర్మించబడింది. గర్భాలయంలో ప్రధాన దేవతలు బలరామకృష్ణులు, మరో ప్రక్కన జగన్నాధుడు ప్రతిష్ఠించబడ్డారు. మొదట్లో ఈ ఆలయాన్ని మహారాజు నాగసింగ్ నిర్మించగా, 1868లో వచ్చిన భారీ భూకంపంలో ఈ ఆలయం చాలావరకు ధ్వంసమవడంతో, ఆ తరువాతి కాలంలో మహారాజు చంద్రకీర్తి దీనిని పునర్నిర్మాణం గావించి పునరుద్ధరించారు.

## ఇంఫాల్ - కృష్ణదేవాలయం

ఇంఫాల్ నదీతీరంలో 1704లో ఆనాటి మహారాజుచే నిర్మించబడిన కృష్ణదేవాలయం. గర్భాలయంలో 3 అడుగుల ఎత్తులో శ్రీకృష్ణ విగ్రహంపై ప్రతిష్ఠించబడింది. ఇక్కడ శ్రీకృష్ణుని బాల్యంనుండి యవ్వనము వరకున్న వివిధ దశల విగ్రహాలు కనువిందు చేస్తాయి. ఇంకా చెప్పాలంటే విగ్రహంలోని శ్రీకృష్ణుని అమాయకత్త్వం చూడముచ్చటగా వుంటుంది.

## ఇంఫాల్ - హనుమాన్ దేవాలయం



ఇంఫాల్ నదీతీరంలోదే మహాబలి అడవులలో శ్రీహనుమాన్ ఠాకూరు ఆలయముంది. ఇక్కడి ఆంజనేయుడు ఏ విధమైన పటాటోపం లేకుండా సాధారణ మానవునివలె దర్శనమిస్తాడు. 1725 సం॥లో గరిబ్ నివాజ్ రాజుగారిచేత వంగ (బెంగాల్) శిల్పకళాచాతుర్యంతో అర్థచంద్రాకారపు ఆకారంలో నిర్మించబడింది. ప్రధానాలయం, ఆనుకుని ఒక మండపం వున్నాయి. రామనంది తెగవారికిది అపురూప ఆలయం. ఇక్కడి విగ్రహాన్ని పెద్ద రాతిపలకపై చెక్కారు. ఆనాటి రాజు పాలనాకాలంలో నిర్మించిన ఏకైక హిందూ దేవాలయంగా దీనిని చెబుతారు.

## అగర్తల - రాధాకృష్ణ ఆలయం

అగర్తలా నుండి 65 కి.మీ. దూరంలో 'రాధాకిశోర్‌పూర్' లో, శ్రీరాధాకృష్ణస్వామి ఆలయం వుంది. అలాగే ఈ వూళ్ళో ఇంకా "దుమార్" జలపాతం దరిదాపుల్లోని 'తీర్థముఖ్' అనే ప్రదేశంలోని మహాదేవస్వామి ఆలయం చెప్పుకోదగ్గవి. చూసి, ఆనందించదగ్గవి.

## వనదేవతాలయం

ఇంఫాల్‌నుండి మరో 45 కి.మీ ముందుకు సాగితే వచ్చే మెయిరంగ్‌లో వనదేవతాలయం వుంది. ఇక్కడి వనదేవతా, వనదేవుని ఆలయం చూడతగ్గది.


**చూడదగిన ప్రదేశాలు**




గోపీనాథ్ దేవాలయం



గోవింద్‌జీ దేవాలయం



సనమహికియోంగ్



విష్ణు దేవాలయం

## : : సూక్తులు : :

నశించే వస్తువులు తనవి అనుకోవడంతోనే మనుష్యుడు తన స్వరూప జ్ఞానాన్ని విడిచిపెట్టినవాడవుతున్నాడు.

– ఉత్పల

జీవకోటిలో ఉత్తముడైన మనుష్యుణ్ని సన్మార్గానికి మరల్చడానికి సత్యాహిత్యం అనంతంగా వెలసింది.

– ఉత్పల

ఆత్మ కనబడదూ, అదృశ్యమూ అవదు. అందుకే ఆత్మ దర్శనాన్ని శాశ్వతం చేసుకోవాలి.

– రమణవాక్కు

ప్రాణులన్నీ భగవంతుడి అంశలే. ఏ ప్రాణిపైన కించిత్తు ద్వేషభావం వహించడం భగవంతుడిని ద్వేషించడం అవుతుంది.

– ఉత్పల

సత్సాంగత్యమే ఆత్మ వికాశానికి మూలం.

– రామకృష్ణపరమహంస

తెలివిగల భార్య తన భర్త మాటలను శిరసావహించడం ద్వారా అతడిపై అధికారాన్ని సంపాదిస్తుంది.

– లాటిన్ సూక్తి

సృష్టి రహస్యాన్ని  విశదం చేయగల శక్తి తర్క కౌశలానికి లేదు.


– ఠాగూర్

మరణిస్తూ కూడా సంతోషంగా ఉండేవాడు గొప్ప పరాక్రమశాలి.

– సూక్తి

ఇంటిలో ఇల్లాలిని వదిలి వెలయాలి కోసం వెళ్ళువాడు వెర్రివాడు. వరిచేనులో పరిగె ఏరుకున్నట్లు ... – వేమన

# మేఘాలయ




ఇది ఎటునుంచి ఎటుచూసినా చారిత్రక ప్రాధాన్యం కన్న పర్యాటక ప్రాధాన్యంగల ప్రాంతం. వేసవి విడుదులు, విహారస్థలాలు, విలాస భవనాలు, ఆనందాలు, కనువిందు కొందరికి, మనస్సు పసందు మరికొందరికి...

చూసి ఆనందించడం, ఆనందించడంకోసం చూడటం, ఇక్కడి స్థితి.

ఇది విలాస, విహారయాత్రలవారికి తప్ప చారిత్రక, పౌరాణిక ప్రాముఖ్యం కల్గిన శిలలు శిల్పాలు, కథలు గాథలు, కనబడవు. కనుక చూడదలిచినవారు విలాసంగా చూడండి. ఆనందించదలచిన విహారంగా, ఆనందించండి!!

## జైంతేశ్వరి దేవాలయం



షిల్లాంగ్ జిల్లాలోని జైంతియా హిల్స్‌పై దుర్గాదేవి ఆలయముంది. ఇది ఎంతో పురాతనమైనది. ఈ జైంతేశ్వరి కొండజాతివారి దేవతగా కొలువబడుతున్న దుర్గాదేవి. ఇక ప్రాంతం – ఆనాటి రాజుల వేసవి విడిది. ఆనాటి రాజ ప్రాసాద శిథిలాలప్రక్కన ఈ ఆలయం వుంది. జైంతియా రాజు హిందూమత స్వీకరణకు గుర్తుగా ఈ ఆలయం నిర్మించబడిందని చెబుతారు. 500 సంవత్సరాల చరిత్రగల ఈ ఆలయం, 51 శక్తిపీఠాలలో ఒకటిగా ఇక్కడి ప్రజలు చెప్పుకోవడం కాదు పూజించి తరిస్తున్నారు. సతీదేవి ఎడమ తొడ ఇక్కడ పడిందని, అందుకే ఇక్కడి తల్లిని 'జైంతేశ్వరి' అని పిలవడం జరుగుతుంది.

ఇక్కడి విశేషం పూజల సమయంలో అరటిచెట్టును అలంకరించి, పూజించి, అనంతరం ఊరేగింపుగా తీసుకువెళ్ళి, 'మైంటేడ్' నదిలో నిమజ్జనం చేస్తారు. గొప్ప ఆచారమనకండి. ఆచార,సాంప్రదాయాలిక్కడ చక్కగా పాటింపబడు తున్నాయి.

## మహాదేవ్ కోలాధామం

షిల్లాంగ్‌లోని గుహాలయంలోదిది. స్థానికుల కథనం ప్రకారం లఖియాబాబా అనే ఒక సాధువు ఈ నిర్మల ప్రదేశాన్ని దర్శించి, ఇక్కడే తన నివాసం ఏర్పరచుకుని తపోమూర్తి అయ్యాడుట. ఇదొక కథ. మరో కథనం




ప్రకారం ఒక సుబేదారుకు కలలో ఎర్రని వస్త్రములు ధరించిన సాధువు కనుపించి తనకొక ఆలయం నిర్మించ మని కోరాడుట. దాంతో సుబేదారు ఈ ప్రాంతమంతా వెదుకగా ఒక శివలింగం కనుపించడంతో, దాని కోసం గుహాలయమును నిర్మింపచేసాడుట.

దీనికి సమీపంలో తులసీమాత, లక్ష్మీనారాయణ గౌరీ, శంకర మహదేవ్ మొ॥గు చిన్నచిన్న ఆలయాల్ని చూడగలుగుతాము. శివుని లింగమున్నచోట్ల వున్న బిలము, గౌహతి (అసోం)లోని కామాఖ్య ఆలయం వరకు ఉన్నదని, శివుడు ఈ మార్గాన్నే ప్రయాణిస్తారని భక్తజనుల నమ్మకం.



నార్తియంగ్ దుర్గా ఆలయం



ఇస్కాన్ టెంపుల్



బాల్‌పక్రమ్ నేషనల్ పార్కు





మేఘాలయ గుహలు, ప్రకృతి దృశ్యాలు

# మిజోరాం

జాతీయపటంలో "ఐజోల్" రాజధానిగా గల ప్రాంతమిది.

500 అడుగుల ఎత్తున త్లవాంగ్ నదీలోయ ప్రాంతం.

ఇచ్చట చల్లని గాలులు, అందమైన ప్రకృతి, చూడాలనుకునే వారికి సుందరదృశ్యాలు.

ప్రకృతి పరవశించి, పులకరింపచేసే పువ్వులు కాలానుగుణంగా సువాసనలు వెదజల్లుతూ మనుషులను, మనసులను ఆహ్లాదపరుస్తాయి.

ఇక్కడ చెప్పుకోదగ్గది, చూడదగ్గది... ఏమీ లేదంటే ఆశ్చర్యపోకండి!!!

ప్రకృతిని దర్శించవచ్చును. చారిత్రక కట్టడాలు చరిత్రను తెలిపే శిధిలాలు చూడవచ్చును. కళాదృష్టితో కళాసృష్టికి జోహార్లర్పించవచ్చును. కళ్ళ, మనస్సుకు కాదేది మానసోల్లాసమని మహదానందపడవచ్చును.




**మిజోరాంలో చూడదగిన ప్రదేశాలు**



మిజోరాం



చర్చి



మిజోరాం టెంపుల్ ఫెస్టివల్



మిజోరాం దృశ్యం

## : : సూక్తులు : :

ప్రపంచం అంతటికి అధిపతివైననూ నీ ఆయుష్షుకు అధిపతి కాలేవని తెలుసుకో!

– సూక్తి

పోయిన నిమిషం కూడా తిరిగి తీసుకురాలేవు. మంచి పనులు వాయిదా వేయరాదని తెలుసుకో!

– సూక్తి

మంచి మనులకు ఖర్చు చేసి పుణ్యాన్ని పెంచుకో. ఆ పుణ్యమే నీ రాతను నిర్ణయించునని తెలుసుకో!

– సూక్తి

భార్య మాటలు నమ్మి అన్నదమ్ములతో తగువులాడేవాడు కుక్కతోక పట్టుకుని గోదారి ఈదినట్లే!

– వేమన

వందలకోట్లకు అధిపతివైననూ ఒక్క నిమిషం ఆయుష్షు కొనలేవని తెలుసుకో...

– సూక్తి

నిన్ను ఎవరుగాని కోపానికి గురిచేస్తే వెంటనే రియాక్టు కాకు. ఒక్కసారి గట్టిగా గాలి పీల్చుకో, పది వరకు లెక్కపెట్టు. ఈ విషయం అంత కోపగించుకోవాల్సినంత ముఖ్యమైనదా అని ప్రశ్నించుకో.

– సూక్తి

విశ్వాసం హిమాలయం వంటిది – సూక్తి

పిల్లలు దేవుళ్ళతో సమానం. వారితో అబద్ధాలు ఆడించకూడదు. వారికి చెడుపనులు చెప్పకూడదు...

– మహాత్మాగాంధి

వినేవారినిబట్టే ముఖస్తుతి చేసేవారు మనగలుగుతారు. – సూక్తి

## నాగాలాండ్




ఇదీ పర్యాటక ప్రదేశమే. అందాలు చూడటానికి, ఆహ్లాద మొందదానికి తహతహలాడే వారికీ అనువైన ప్రదేశం. ఆనంద మందిరం.

భక్తులు, చారిత్రక, పౌరాణిక, శిల్ప కళాభిలాషులు, ఇక్కడ చూడటానికి ఏముంది? అంటే... పర్యాటకులు... ఎంతోవుంది... అని చెప్పే లేదా చెప్పగల ప్రదేశం.

అయితే ఇక్కడ అడుగు పెట్టి ఆ అడుగు తీసి మరొక అడుగు వెయ్యడానికి ప్రభుత్వంనుండి అనుమతిని పొందాలి. లేకపోతే ఆ అడుగు వెనక్కే తప్ప ముందుకు పడదు. అది గ్రహించి అడుగువేస్తే ...

ప్రకృతి ఆరాధకులు, సౌందర్యారాధకులు వారికి కావాల్సిన అందాలను, ఆనందాలను పొందగల్గుతారు.

## సింగ్రిజాన్ శివాలయం



దిమాపూర్‌లోని సింగ్రిజాన్ అనే గ్రామంలో ఒక శివాలయం వుంది. ఇది ఈనాటిదే. ప్రజలంతా కలిసి దీనిని 1961 సంIIలో నిర్మించారు. ఇక స్థానికుల కథనం ప్రకారం, ఒక స్థానికుడు 'రంగపహార్' రక్షిత అటవీ ప్రాంతానికి వెళ్ళి, అచ్చట గల ఒక రాతిని చూసి కత్తిని పదును పెట్టుకునేటందుకు బాగుంటుందని ఇంటికి తీసుకు వచ్చాడు. ఒకనాడు దానిపై కత్తిని పదును పెడుతూంటే ఎర్రని ద్రవం కారటంతో ఆశ్చర్యపోయి, దానిని ప్రజలకు తెలియబరుస్తాడు. ఆ గ్రామస్థునికి ఆనాటి రాత్రి శివుడు కలలో కనుపించి, అది శివలింగమని, తన రూపమని చెప్పి అంతర్థానమయ్యాడు. ఆతర్వాత కూడా ఎన్నో సార్లు కనిపించాడు.

దాంతో ఆ శివలింగానికి పూజలు ప్రారంభించి చివరకు శివునికి ఆలయ నిర్మాణం చేసి, భక్తిశ్రద్ధలతో స్వామిని సేవిస్తున్నారు.

## కాళీమాత ఆలయం



దిమాపూర్ కలిబరిలోని కాళీమాత విగ్రహంకాదు, ఆలయం చెప్పుకోదగ్గది. ఈ ఆలయంకూడా ఇప్పటిదే. 1956లో నిర్మించారు. కొలిచిన వారికి కొలిచినట్లు, ఎంతమాత్రమును ఎవ్వరు తలచిన అంతమాత్రమే నీవన్నట్లు ... ఆ తల్లి కరుణతో అందరు సుఖసంతోషాలతో వుండి, తమ భక్తిశ్రద్ధలను ప్రకటించుకుంటున్నారు.

**నాగాలాండ్‌లో చూడదగ్గ సుందర ప్రదేశాలు**




నాగాలాండ్ ముఖద్వారం







## ఒరిస్సా




భారతదేశానికి తూర్పున గల ఒరిస్సా రాష్ట్రానికి భువనేశ్వర్ రాజధానిగా ఉంది.

30 జిల్లాల సమాహారమైన ఒరిస్సా జువెల్ ఆఫ్ ది ఈస్ట్‌గా ప్రసిద్ధి గాంచింది.

ప్రాచీన కాలంలో మౌర్యులు, గుప్తులు, శిశునాగులు, ఖారవేలులు, గంగ్రైవంశపు వారు ఒరిస్సాను పరిపాలించి నట్లు తెలుస్తోంది. ఒరిస్సాను పూర్వం ఉత్కళ, కళింగ, అద్ర అని పలుపేర్లతో పిలిచేవారు. ఈ రాష్ట్రంలోనే క్రీ.పూ. 268. సం॥లో కళింగయుద్ధం జరిగింది. గతంలో చైనా యాత్రికుడు హ్యూయన్‌త్సాంగ్ 7వ శతాబ్దంలో ఒరిస్సాను సందర్శించినట్లు చెబుతారు.

విస్తీర్ణం : 1,55,707 చ.కిమీ. ప్రధాన భాషలు : ఒరియా, హిందీ

సరిహద్దులు : ఒరిస్సాకు తూర్పున బంగాళాఖాతం, ఉత్తరాన జార్ఖండ్, దక్షిణాన ఆంధ్రప్రదేశ్, పశ్చిమాన చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు ఉన్నాయి.

## భువనేశ్వర్



ప్రస్తుతం ఒరిస్సా రాజధాని అయిన భువనేశ్వర్‌లో అనేక ప్రముఖ దేవాలయాలు ఉన్నవి. క్రీ.శ. రెండవ శతాబ్దములో జైన చక్రవర్తి పరిపాలించినట్లు చెప్ప బడుచున్న ఈ నగరంలో అనేక దేవాలయాలు. సుమారు 500 వరకు శిథిలావస్థలో ఉన్నాయి. బిందు సరోవరం చుట్టూ ఉన్న ఈ దేవాలయాలు ముక్కోటి దేవతలకు ప్రీతికరం. ఈ దేవాలయాలలో ప్రముఖ దేవాలయం లింగరాజాలయం. ఇక్కడ ప్రవేశం హిందువులకే ఉంటుంది. స్వామి వారి పేరు త్రిభువనేశ్వరుడు. సుమారు 1400 సంవత్సరాల క్రితం నిర్మాణం జరిగినట్లు తెలుప బడుచున్న ఈ దేవాలయం 40 మీటర్లు ఎత్తు ఉండి ఎన్నో సుందర శిల్పాలు కలిగి ఉంటుంది. మరొక ప్రముఖ దేవాలయం రాజారాణి ఆలయం. అనేక శృంగార భంగిమల్లో సజీవంగా మలచబడిన ఎన్నో శిల్పాలు ఇక్కడ కన్పిస్తాయి. ముక్తేశ్వరాలయం, బ్రహ్మేశ్వర ఆలయం, వాసుదేవాలయం చూడవలసినవి. ఇంక గణేశ గుహ, ఏనుగు గుహలు, ఉదయగిరిలో వున్నాయి. ఖండగిరిలోని లాట్‌ఘురా గుహల్లో జైన తీర్థంకరుల విగ్రహాలు వున్నాయి. చూడదగ్గవి. భువనేశ్వర్ నుండి పూరి 56 కి.మీ. కోణార్క్ నుండి 64 కి.మీ. కలకత్తా నుండి 498 కి.మీ. దూరంలో ఉంటుంది.



ఈ నగరాన్ని ఆలయాల నిలయం అని ప్రస్తుతిస్తారు. అద్భుత శిల్పసంపద, అసమాన కళానైపుణ్యం నిర్మాణం, చారిత్రక నేపథ్యం – ప్రతిఒక్కటి – పూరీతో కల్పి చెప్పుకోదగ్గది. చూడదగ్గది.

**ఓఢ్యాణము**

అమ్మవారి పద్దెనిమిది శక్తిపీఠాల్లో ఒకటి,
ఇక్కడి గిరిజా దేవిమీద భక్తులకు అపారమైన భక్తి

## కోణార్క్ సూర్య దేవాలయం



ఒరిస్సా రాజధాని భువనేశ్వర్‌కు 64 కి.మీ. దూరంలో ప్రముఖ సూర్యదేవాలయం ఉన్న పుణ్యక్షేత్రం కోణార్క్. క్రీ.శ. 13వ శతాబ్ధములో నరసింహదేవ నృపతి ఈ దేవాలయం నిర్మించినట్లు చెబుతారు. ఇసుక నేలలో సుమారు 70 మీటర్లు ఎత్తున ఉన్న ఈ ఆలయం నిర్మాణం శాస్త్ర పరిశోధకులకు కూడా అంతుపట్టని విషయం అది. ఈ ఆలయాన్ని నిర్మించుటకు 12 సంవత్సరాల కాలం పట్టినదని చెబుతారు.

ఏడు అశ్వాలు గల రధాన్ని శ్రీ సూర్య భగవానుడు అధిరోహించి ఉన్నట్లు కనబడతారు. ఈ రధాన్ని చూడవలసినదే కానీ వర్ణించటం కష్టం. ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శించుటకు పూరి నుండి సముద్ర ఒడ్డున రోడ్డు మార్గం కూడా కలదు. ఈ ఆలయంలో అనేక నిలువెత్తు విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణ.

చూడదగ్గది, కళావిలాసానికి తలవూపదగ్గది. అద్భుత శిల్పలావణ్యానికి చేతులెత్తి మ్రొక్కతగ్గది. "ఏకచక్రరథారూఢం" అన్నట్లు విగ్రహంలేని విశ్వమందిరమిది. ఇది 13వ శతాబ్దంలో గంగ వంశీయుడైన రాజా నరసింహ దేవుడు నిర్మించాడు. దీనికి కొద్దిదూరంలో వున్న నటరాజ స్వామి చూడదగ్గదేవుడు. కోణార్కలోని ప్రతి అడుగు, ఆ ప్రక్కన కనబడే శిల్పం శిథిలమో, రూపమో తెలియదు కాని, వంగి చూడదగ్గది. ఇంతటి మేధాశక్తి, చాతుర్యంకల మన తాతముత్తాతలకు వారసులము కాకుండా, గట్టిగా సిమెంటుతో కట్టినది, దృఢమైనదనే కట్టడం, పట్టుమని 30 సం॥రాలుకూడా వుండటంలేదు. మన అల్పాయుష్కుల వలె, కట్టడాలుకూడా కన్నీళ్ళు తెప్పిస్తున్నాయి. దురదృష్టం.



## పాటలీపుత్రం

ఒకనాటి "పాటలీపుత్రం" నేడు భవానీపాట్నాగా రాజిల్లుతోంది. ఇక్కడ అనేక దేవాలయాలతో, ఆధ్యాత్మికతతో, అంజలి ఘటించదగ్గ విధంగా కనుపిస్తుంది.



నిజానికీ ప్రాంతానికి, మనవాళ్ళుకన్న విదేశస్థులు విపరీతంగా వస్తున్నారంటే, వీటి చరిత్ర ఎంత ఘనమైనదో కనీసం, మనం అర్థంచేసుకున్నా చాలు. ఇక్కడి "మాణికేశ్వరీ"దేవి మహాతల్లి, చల్లని తల్లి. ఇంక చెప్పాలంటే అమ్మలగన్న యమ్మ, "కలహండి" ఒకనాటి కోరుండం. ఒక్కసారి ఈ ఆలయాన్ని చూస్తే, అప్పుడు నిజంగా మన జన్మ ధన్యమైందని తలుస్తాం. విదేశీయులు ఎందుకు వస్తారో తెలుసుకుంటాం!

యోగినిగుడి – భువనేశ్వర్ పొలిమేర్లల్లో వున్న 64 యోగినుల గుడులు. అతి సుందరమైన ఈ విగ్రహాలను దర్శించడం కూడా ఒక ఆనందమే!

భువనేశ్వర్‌కు 350 కి.మీ., సాంబల్‌పూరుకు 32 కి.మీ దూరంలో, మహానది తీరంలో కట్టబడిన శివాలయం. ఈ కొండ మీద పాలు పోస్తే, అవి తక్షణం మాయ మవుతాయట. ఇంకో విషయం, ఈ కొండ ఓ ప్రక్కకు వంగిందట. దీనిని ఆశ్చర్యంగా చూడటానికి, పర్యాటకులెందరో వచ్చి విస్తుపోతున్నారు.

అలాగే తులసీక్షేత్రమనే, భువనేశ్వరుకు 95 కి.మీ బలదేవుని గుడి, 42 కి.మీలోని వేడినీటిగుండాలు, ఘటకేశ్వరాలయం, భువనేశ్వర్‌లోని కృష్ణబలరామ, సుభద్రల విష్ణాలయం, కటక్‌లోని దుర్గామాధవ మందిరం, మహానది మధ్యలోని సింహనాధ, నృశింహనాధుడు, ఇలాగ ఎన్ని వున్నాయి అంటే ఎన్నో.... అన్ని చూడలేము. అయినా చూడటానికి ప్రయత్నిందాం!

## పూరి - జగన్నాధస్వామి దేవాలయం

భారతదేశంలో ఏ రాష్ట్రములోనైనా జగన్నాధ రథయాత్ర జరుగుతోంది. అంటే ముందుగా గుర్తుకు వచ్చేది పూరి. ఒరిస్సా రాష్ట్రములో బంగాళాఖాత తీరప్రాంతలోని ఈ పుణ్య క్షేత్రములోని స్వామి వారి పేరు జగన్నాధుడు. స్వామి వారికి తోడుగా బలరాముడు, చెల్లెలు సుభద్ర ఉంటారు. ఎనిమిదో శతాబ్దములో గంగవంశపు రాజు అయిన మహాశివ గుప్తయయాతి ఈ దేవాలయం నిర్మించినట్లు చెబుతారు. ఈ ఆలయ గోపురం 58 మీటర్లు ఉండి శంఖాకారం కలిగి ఉంటుంది. సుదర్శన చక్రం కలిగి ఉన్న ఒక జెండా గోపురంపై ఉంటుంది. ఈ దేవాలయము ప్రధాన ద్వారము ఇరువైపుల ఉన్న రాతి సింహాలు పలువురిని ఆకర్షిస్తాయి. ఈ ఆలయం ప్రత్యేక ఆకర్షణ ఆషాఢ



శు॥ విదియనాడు జరిగే రథయాత్ర. లోకప్రసిద్ధి చెందిన ఈ రథయాత్రలో లక్షలాది మంది భక్తులు వచ్చి పాల్గొంటారు. 16 చక్రాలు కలిగిన 14 మీటర్లు ఎత్తు ఉన్న ఈ రధాన్ని గుడించా మందిరం వరకు నడుపుతారు. రథచక్రాన్ని కాల చక్రంగా భావిస్తారు. ఈ రథాన్ని లాగటానికి వేలాదిమంది భక్తులు ఉత్సాహంతో ముందుకు వస్తారు. ప్రతి సంవత్సరం రథయాత్ర పూర్తి అయి గమ్యం చేరిన తరువాత ఆలయానికి తెచ్చి ఆ రథాన్ని విడగొడతారు. ఈ క్షేత్రంతోపాటు శ్రీ గుడించా మందిరం, చక్రతీర్థం, గంగమఠం, గోపినాథ ఆలయం కూడా భక్తులు దర్శించదగ్గ పుణ్య స్థలములు. ఈ క్షేత్రమును తిరుపతి – పూరి ఎక్స్‌ప్రెస్ రైలు గాని, లేదా భునేశ్వర్‌లో దిగి బస్సులో గాని చేరవచ్చును. భక్తులు నరేంద్ర తీర్థంలో స్నానము చేయుట మంచిది. పూరీ నుంచి బయలుదేరేవి, అలాగే పూరీ వరకు ఇప్పుడు రైలుసౌకర్యం వుంది.

"అంతా రామమయం" అన్నట్లు "సర్వం జగన్నాథ"మని ఇక్కడి వాడుక. అసలిక్కడకు రావడానికి ముందు ఆలయాల నిలయమైన భువనేశ్వర్‌లోని లింగరాజు ఆలయంతో మన ప్రయాణం ప్రారంభిద్దాం. బిందుసరోవరమనే తీర్థం చెంతనవుంది ఈ లింగరాజ ఆలయం. ఈ భువనేశ్వర్‌లో ఎన్ని ఆలయాలున్నాయో, అందులో శిలలెన్ని వున్నాయో చెప్పలేము. అడుగడుగునా ఒక లింగం ఆలనాపాలనా ఆచ్ఛాదన లేకుండా కనుపిస్తూంటే -- అడుగువేస్తూ రెండు చేతులు జోడించడం తప్ప మరేమీ చెయ్యలేము. ఆధారాలనేకన్న చరిత్ర దొరకదు. చెప్పలేరు. జగన్నాధుడు పూరీని, లింగరాజు త్రిభువన పావనమైన ఈ భువనేశ్వరిని శివకేశవ స్వరూపం చేస్తూన్నారు. ఈ లింగరాజు ఆలయం చుట్టూ 500 ఆలయాలు వున్నాయంటే, అంజలి ఘటిస్తారా? ఆశ్చర్యపోతారా?

సవర తెగరాజు విశ్వావసు వారసులు. ఆలయసాంప్రదాయం ప్రకారం ఊరేగింపు నిమిత్తం ఆలయంలోని రత్నపీఠికనుండి విగ్రహాలను బయటికి తీసుకువచ్చి రథాలమీద వుంచుతారు. మూలవిరాట్టులు కదిలి రావడమనేది ఈ పూరిలోనే తప్ప మరెక్కడలేదు. ఇది ప్రత్యేకించి 'ఇది' అని వర్ణించిచెప్పటం కన్నా చూడగల్గడముత్తమం.

## లింగరాజ ఆలయం



భువనేశ్వర్‌లో లింగరాజాలయం వుంది. ఇక్కడ ప్రవేశం హిందువులకే. ఇక్కడ వున్నది త్రిభువనేశ్వరుడు. ఈ దేవాలయం పునాది 1400 సంవత్సరాల క్రితం జరిగింది. 40 మీటర్ల ఎత్తు వుండే యీ గంభీర హైందవ దేవాలయంలో అడుగడునా కనిపించే శిల్పాలు అబ్బుర పరుస్తాయి. ఇక్కడి నుండి కుడిపక్కగా వెళితే రాజా రాణి ఆలయం వస్తుంది. స్థంభాల మీద చెక్కిన శిల్పాలు శృంగార నైషధాన్ని గుర్తుకుతెస్తాయి. రమ్యంగా మలచిన రసపూరిత జంటలు సజీవంగా

వున్నట్లు అన్పించక మానదు, పరమాద్భుతాన్ని కలిగించే ముక్తేశ్వరాలయం, బ్రహ్మేశ్వరాలయం, వాసుదేవాలయం తప్పనిసరిగా చూడదగ్గవి. ఒరిస్సా సంస్కృతికి అద్దం పట్టే అనేక తాళపత్రాలు, శిల్పఖండాలు అనేక ఆయుధాలు గల మ్యూజియంతోపాటు హోటల్ కళింగ చూడవలసిందే.

## బ్రహ్మేశ్వరాలయం

ఈ భువనేశ్వర్‌లో మొత్తం 9999 ఆలయాలు వున్నాయంటారుట. ఏడవ శతాబ్దానికే ఈ ఆలయాలు వున్నాయట. అంతేకాదు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీముఖ లింగేశ్వరాలయం, అరసవెల్లి సూర్య నారాయణమూర్తి ఒకే పద్ధతిలో నిర్మించిన ఆలయాలు.



పరమేశ్వరగుడిలో అపురూప శిల్పకళను ప్రదర్శిస్తూ విష్ణువు, యముడు, సూర్యుడు, సప్త మాతృకల విగ్రహాలు రూపొందించారు. నమోనమః . భాస్కరేశ్వర్ గుడితోపాటు లక్ష్మణేశ్వర్, భక్తేశ్వర్‌ల ఆలయాలున్నాయి. ఇవీ 7వ శతాబ్దంలో నిర్మించా రనుకుంటారు. ఇక్కడి శివలింగం రెండు అంతస్తులలో వుంటుంది. ఇదో విశేషం.

పదవ శతాబ్దంలో, కళింగ వాస్తుపద్ధతిలో నిర్మించిన ఆలయం ఇక్కడి శివుడు రకరకాల భంగిమ లలో తపస్సు చేసుకుంటున్న విగ్రహాలు చూస్తాం. పంచతంత్రకథలు గోడలపై చెక్కారు. హిందూ, బౌద్ధ– జైన శిల్పచాతుర్యం కొట్టవచ్చినట్లు కనబడు తుంది. ఇక్కడవున్న సరస్సులో స్నానం చేస్తే సర్వరోగాలు పోతాయట.

ఈ వరుసలో రాజారాణి ఆలయం. ఎర్ర ఇసుకరాతితో నిర్మించారు. ఇందులోని శిల్పకళ నోరు తెరచుకుని చూడవలసిందే.

ఇక్కడి ఎనిమిదవ శతాబ్దానికి చెందిన వైతాల్‌దియోత మందిరం 'కాకర' శిల్పాల కళాకౌశలానికి మచ్చుతునక. ఇక్కడికి భక్తులకన్న పర్యాటకులే అధికంగా వచ్చి, ఈ కళాసృష్టికి కదలని కాళ్ళతో రెండు చేతులు జోడించి, పులకించి, పెదవి విరుస్తారు. ఈ గోడలపై శివపార్వతులు, ఏనుగుల్ని వేటాడే విధం, ఉషోదయ, సూర్యోదయం తోపాటు అరుణోదయ సమయంలోని సప్తాశ్వరథారూఢుని దివ్యకాంతులు పొందుపరిచారు. ఇక్కడి కపాల అనేదుర్గ, మహిషాసురమర్దినీ రూపం మహాభయంకరమనిపిస్తాయి.

రత్నగిరి – ఉదయగిరి – బౌద్ధానికి దర్శనీయాలు. ఇక జాజ్‌పూరునుండి 20 కి.మీ వెడితే వచ్చే గ్రామాన్ని "వైతరణి" అని అంటారు. ఇక్కడి అమ్మవారు గిరిజాదేవి. ఈమె త్రిశక్తి స్వరూపిణి. ఇక్కడ పితృదేవతలకు శ్రాద్ధక్రియలు సల్పుతారు.

అఖండలేశ్వర్, లింగేశ్వరు, త్రిలోచనేశ్వర్‌లు జగన్నాధ, కాళీమాతలు చూడదగ్గ ఆలయాలు. ఇక్కడ దగ్గర్లోని అమ్మవారిలో విష్ణుమూర్తి వరాహావతారం వుంది. ఇక్కడే సతీదేవి "నాభి" పడినచోటు. అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన ఈ దివ్యక్షేత్రం - నమామి జగన్మాతరం.

## సోమేశ్వర్

64 మంది యోగినీ దేవతలు గల పుణ్యక్షేత్రం, ఇక్కడ బౌద్ధ-విష్ణు ఆలయాలు ఉన్నాయి. సోమతీర్థం అని కూడా అంటారు. టిట్లాఘర్‌కు 32 కి.మీ. దూరంలలో ఉన్న రాణీపూర్ వద్ద ఈ గుడి ఉంది.

## సింహపురి

ఘడమధుపూర్ రైల్వేస్టేషన్ నుండి 3 కి.మీ. దూరంలో గల సింహపురి లేదా సింహపూర్‌లో శయన మూర్తి అయిన గంగా నారాయణస్వామి కొలువై ఉన్నాడు. ఈ స్వామి వారి విగ్రహం నిత్యం నీట మునిగి ఉంటుంది, సంక్రాంతి రోజున మాత్రం నీటిపైకి వచ్చి కన్పిస్తుంది, బస్సు సౌకర్యం (ఒరిస్సాలోని అన్ని ప్రాంతాల నుంచీ ఇక్కడకు గలదు).

## మహేంద్రగిరి

ఒరిస్సాలో ఈ పేరిట పెద్ద అడవి, కొండలవరుసా కూడా ఉన్నాయి, ఆంధ్రప్రాంతంతో పంచుకున్న ఈ భూభాగం అత్యధిక ప్రాంతం అటవీ ప్రదేశం, ఇక్కడ ప్రకృతి దృశ్యాలు ఎంతో సుందరంగా కనిపిస్తాయి. పంచపాండవులలో కుంతీపుత్రులు అయిన అర్జున భీమ ధర్మజులకు ఇక్కడ ఆలయాలున్నాయి. పర్లాకిమిడి సబ్-డివిజన్ (ఆంధ్ర)లో కొంత భాగం మహేంద్రగిరులకు కేటాయించారు, గంజాంజిల్లా నుండి బస్సులో వెళ్ళవచ్చు.

**దర్శనీయాలు :**

పవిత్ర **గంధమాదన పర్వతం**పై వుందీ **నరసింహస్వామి ఆలయం**. ఇది హనుమత్ప్రతిష్ఠగా చెప్పాలి. ఈ ఆలయాన్ని తన భుజాలపై మోసుకువచ్చి ఇక్కడ నిలిపాడట. రామాయణ కాలంలో హిమాలయాలలో వుండే దీనిని సంజీవని కోసం హిమాలయాలకు వెళ్ళినప్పుడు నరసింహస్వామి మందిరాన్ని తెచ్చి ఇక్కడ ప్రతిష్ఠించాడుట. ఇక్కడ 'పాపహరిణి' అనే నది ప్రవహిస్తూంది. కాలాంతరంలో 14వ శతాబ్దంలో ఖాళీగా వున్న ఈ ఆలయంలో నరసింహస్వామిని ప్రతిష్ఠించారనేది చరిత్రకారుల పెద్దలమాట.



**కటక్** ఒకప్పటి ఒరిస్సా రాజధాని. పట్టణ శివార్లలో ప్రాచీన నదిఒడ్డున ఈ **దుర్గామాధవ మందిరం** ఉంది. ఇది 13వ శతాబ్దంనాటిదని, ఇక్కడ శ్రీమహావిష్ణుఅవతారమైన మాధవుని (కేశవాది నామాలలో ఈ పేరు వస్తుంది)తో పాటు దుర్గామాతను ప్రతిష్ఠించారని అందుకు ఈ పురాతనాలయం 'దుర్గామాధవమందిరం'(సోదరీసోదరుల)గా పిలువబడుతుందని పెద్దలమాట.



**భువనేశ్వర్‌లో** లింగరాజాలయం తరువాత చెప్పుకోదగ్గది ఈ **రాజారాణి ఆలయం**. కళాత్మకంగా, వాస్తుపరంగా జరిగిన గొప్ప నిర్మాణమిది. 'రాజారాణి'అనేది ఏ దేవత పేరుకాదు. ఆలయ నిర్మాణాని కుపయోగించిన రాళ్ళపేరు. ఇది ఎర్రఇసుకతో నిర్మించిన ఆలయం. ఎంతో కళాత్మకంగా తీర్చిదిద్దబడింది.

గిరిజాదేవి – జాజ్‌పూర్ నుండి 20 కి.మీ దూరంలో **'ఓఢ్యాణం' అనే గిరిజాదేవి ఆలయం** కల గ్రామముంది. అష్టాదశశక్తి పీఠాలలో ఒకటైన శక్తిపీఠమిది. ఈ తల్లిని 'భిరిజాదేవి' రజాదేవి అని ఇక్కడి వైతరిణిని 'భిరజానది' అని చెబుతారు. శ్వేతవరాహరూపుడైన శ్రీమహావిష్ణువు ఈ ఆలయంలోని గిరిజాదేవిని అర్చిస్తున్నాడంటారు. దీనికి నిదర్శనంగా ఈ ఆలయ సమీపంలో 'వరాహావతార' ఆలయముంది. వైతరిణి దాటడం జీవి పుణ్యాపుణ్యములను నిర్ణయిస్తుంది. ఇక్కడ దసరా ఉత్సవాలు బాగా జరుగుతాయి. దుష్టసంహారిణి, మహిషాసురమర్దనిగా ఈ తల్లి కనుపిస్తుంది. ఇక్కడి అఖండలేశ్వర్, లింగేశ్వర్, త్రిలోచనేశ్వర్, కాళిమాత ఆలయాలు కూడా దర్శనీయాలే.



లింగరాజఆలయానికి రెండు ఫర్లాంగుల దూరంలో వుందీ **'బిందుసాగర'మనే పెద్ద పుష్కరిణి**. ఒకప్పుడు దీనిని 'ఏకామ్రకావనం' అనేవారుట. పరమేశ్వరునికి కాశీకంటే యిదో మహాఇష్టముట. దాంతో ఒకనాడు పార్వతి గోపికరూపం దాల్చి ఇక్కడకు వస్తుంది. కృత్తి, వాస అనే రాక్షసులు పార్వతి అందాన్ని భ్రమసి మోహిస్తారుట. అపుడామె నన్ను మీ భుజాలపై మోసుకువెళ్ళండి. ఎక్కడ ఆపమంటే అక్కడ ఆపాలి. అప్పుడు పెళ్ళి సంగతి... అనేసరికి అమాయకులైన రాక్షసులు స్త్రీ మోహంతో ఈమెను భుజాలకెత్తుకున్నారు. ఆదిశక్తికదా, వారి శక్తిని హరించి, పాతాళానికి నొక్కేసింది.



అప్పుడామెకు తనివితీరని దాహం వేయగా పరమేశ్వరుడు ఈ భారతంలోని నదీనద జలాల్ని ఒక్కొకబిందువు వర్షించమనగా ఒక్క గోదావరి తప్ప మిగిలిన వాటితో ఈ బిందుసాగరమేర్పడింది.ఆ తదుపరి తన తప్పును మన్నించమని శివుని అర్థించి దోషవిముక్తురాలౌతుంది. అందుకనే సంవత్సరానికి ఒకసారి జగన్నాధుని ఈ కోనేటిలో పవిత్ర స్నానం చేయిస్తారు. ఇంకో విశేషం. ఆలయాలకు తమిళనాడులోని కుంభకోణమే మూలమంటారు. కానీ, ఈ భువనేశ్వరి సకల భువనాలకే ముక్తి క్షేత్రంగా ఈశ్వరుని కరుణతో విరాజిల్లుతుంది. పూర్వమీ ప్రాంతంలో దాదాపు 3000 ఆలయాలు వుండేవట.

పరశురామాలయం ప్రక్కన **కేదారేశ్వర, సిద్ధేశ్వర ముక్తేశ్వర ఆలయాలు** చూస్తాం. అందులో ముక్తేశ్వరాలయం అద్భుతమైంది. అందమైంది. లింగరాజాలయం కన్నా చూటానికి చిన్నదైనా అద్భుతము, అత్యంత సౌందర్యమైన కళింగవాస్తు, శిల్పకళలతో విగ్రహాలు ఆకర్షణీయంగా మనల నలరిస్తాయి. సుమారు 10వ శతాబ్దంలో నిర్మించినట్లు తెలుస్తుంది. గోడలమీద పంచతంత్ర కథలు చెక్కారు. శిల్పసంపద మహాద్భుతమనాలి. ఇక్కడి సరస్సులో చేసే స్నానం వలన దీర్ఘరోగాలనుండి విముక్తి లభిస్తుందట.

ఇక్కడి **పరశురామేశ్వరాలయం** 7వ శతాబ్దిలో నిర్మించినదంటారు. అనంతవాసు దేవాలయ సమీపంలో వున్న ఈ ఆలయం ఇక్కడి ఆలయాల కన్నింటికి మొట్టమొదటిదని, లింగరాజాలయం కన్న ప్రాచీనమైనదని చరిత్రకారుల అభిప్రాయం. ఇంకా ఇక్కడ ఒరిస్సా శిల్పకారుల శిల్పకళానైపుణ్యంతోపాటు లోపలగల శ్రీమహావిష్ణువు, యముడు, సూర్యుడు, సప్తమాతృకలను (విగ్రహాలుగాకాక) చూసిన ఆనందం కల్గుతుంది.



భువనేశ్వర్‌కు 8 కి.మీ దూరంలో **"ఉదయగిరి, రత్నగిరి" గుహ** లున్నాయి. దీనిని తాంత్రిక బౌద్ధానికి మూలకేంద్రంగా చెబుతారు. కొండక్రింద కాలువ మీద లోకేశ్వరుని పెద్ద విగ్రహం చూడముచ్చటగా వుంది. కాకిపిల్ల కాకికి ముద్దు – ఎవరి శిల్పకళా, వాస్తునైపుణ్యాలు వారికానందం. కాకపోతే కొన్ని, కొన్ని అందరికి ఆనందదాయకమౌతాయి.



కాల ప్రవాహంలో కొండ బ్రద్దలైనప్పుడు వచ్చి కొన్ని ప్రాచీన కట్టడాలు నాశనమై చెప్పుకుందుకు ఆనవాళ్ళు మాత్రమే మిగిల్చాయి. ఈ గుహలు 400 సంవత్సరాల నాటివంటారు. కాని ఇక్కడి శిల్పకళా, ఆకళానైపుణ్యం అభినందించడం కాదు, ఆనందపరవశమొంది రెండుచేతులు జోడించాలనడంలో తప్పులేదు.



**ఇచ్ఛాపూర్** (భువనేశ్వరుకు 95 కి.మీ దూరంలో) **బలదేవుని ఆలయ**ముంది. దీనికి తులసిక్షేత్రమని మరోపేరు. బలదేవుడంటే బలభద్రుడనబడే బలరాముని ఆలయం. పూరీలో జరిగినట్లు పూజాదికాలు ఉత్సవాలు జరుగుతాయి.

ఇక – **పురుషోత్తమం**లో శ్రీకృష్ణబలరాములతోపాటు దర్శనమొసగే దివ్యుడు **'పురుషోత్తముడు'** భగవద్రామానుజులు మంగళాశాసనం చేసిన ప్రదేశమిది. ఇక్కడి స్వామివార్ని వరుణ ప్రతిష్ఠగా చెబుతారు. ఈ పురుషోత్తముడు మార్కండేయ మహర్షిని కరుణించినట్లు స్థలపురాణం తెలుపుతుంది.

**సంబల్‌పూర్‌కు** 32 కి.మీ దూరంలోని పురాతన శివాలయం **విమలేశ్వరునిది**. ఇక్కడ మహానది ప్రవహిస్తుంది. 1520లో రాజా బలియార్ సింహుడీ ఆలయాన్ని నిర్మించాడంటారు. కొండమీదగల ఈ ఆలయాన్ని కొద్దిగా



దూరం జరిగిచూస్తే పిసాటవర్ ఒరిగినట్లు, ఆలయ శిఖరమొకవైపు ఒరిగినట్లు కనిపిస్తుంది. దీనిని చూడటానికే ఎంతోమంది పర్యాటకులు తీర్థయాత్రీకుల భక్తితోపాటు కలిసివస్తారు. దీనిని దేవతానిర్మితమని భక్తులభావం.

గంజాం జిల్లా **బుగుడాలో 'బిరుంచి నారాయణమఠ'** ముంది. దీనిని సూర్యోపాసన కేంద్రంగా భావిస్తారు. ఇది కళాత్మకంగా ఎంతో గొప్పది. రామాయణ గాధకు ఇక్కడిచ్చిన చిత్రరూపం ప్రతివారిని పరవశింపచేస్తుంది.



భువనేశ్వర్‌నుండి 45 కి.మీ దూరంలోని **'చండీక్కోల్'** స్టేషను దగ్గర్లో **'మహావినాయక్ ఆలయం'** కలదు. ఇది నిజంగా మహా గొప్పది. మహిమాన్వితమైంది. ఇక్కడి విశేషం. స్వయంగా వెలసిన శివలింగంవలె కన్పించు శిలలో 4 దిక్కులలో పంచాయతనమూర్తివలె గణపతి, శివుడు, విష్ణువు, సూర్య, అంబిక(దుర్గ), అద్భుతంగా మలచబడి భక్తుల నానందసముద్రంలో ఓలలాడిస్తాయి. ఈ స్వామిని పాండవులు లక్షస్వర్ణచంపక పుష్పాలతో పూజించారని స్థలపురాణం తెలపుతోంది.



చండీపూర్‌కు సుమారు 40 కి.మీ దూరంలో **'రిమున'** అనే పురాతన క్షేత్రముంది. ఇక్కడి **'క్షీరచోరగోపీనాథ' ఆలయం** శతాబ్దాల చరిత్ర కల్గింది. కదంబ, చంపక వృక్షాల మధ్య నిర్మించబడిన ఈ ఆలయాన్ని శ్రీచైతన్యప్రభువు, వారి గురువు శ్రీ మాధవేంద్రపురి, వారి శిష్యుడు శ్రీజీవస్వామి గోస్వామి దర్శించి పరవశించినట్లు తెలుస్తోంది.

**హాటకేశ్వరస్వామి ఆలయం, భువనేశ్వర్** కు42 కి.మీ దూరంలో వుంది. ఇక్కడ వేడినీటి బుగ్గలున్నాయి. ఇక్కడకు వచ్చే తీర్థ, పర్యాటకుల కోసం స్నానశాలల్ని



కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందంటే దీని ప్రాముఖ్యత గమనించకోర్తాను.

## : : సూక్తులు : :

నమ్మకమైన స్నేహితుడు దైవానికి ప్రతిరూపం...

– నెపోలియన్

అత్యాశ సమసిపోయినపుడే శాంతి ప్రారంభమవుతుంది.

– సూక్తి

పిసరంత కోపాన్ని అణచుకోగలిగితే, కొండంత విచారం తప్పించుకోవచ్చు.

– సూక్తి

బలాధ్యుడవై, ధైర్యశాలివై నిలబడు... బాధ్యతనంతా నీమీదే పెట్టుకో. నీ విధికి నీవే విధాతవని తెలుసుకో...

– స్వామి వివేకానంద

ఊపిరిపోసుకోగానే బంధాలు కలుస్తాయి. ఊపిరిపోగానే జ్ఞాపకాలు మిగులుతాయి.

– సూక్తి

తెలివిగలవారు ఎప్పుడూ కూడా ఇతరులు వైఫల్యం పొందినచోటనుంచి విజయాన్ని సాధించడం ప్రారంభిస్తారు...

– ఎల్‌స్టోన్

విప్లవాలు, నేరాలు పెదరికంనుంచే పుట్టుకొసాయి

– అరిస్టాటిల్

మనిషి అల్పజీవి, మట్టి చిరంజీవి...

– సూక్తి

మానవుడు పుట్టిన మరుక్షణం నుండి మరణం వైపు పయనిస్తాడు

– సూక్తి

తల్లియున్నంత వరకే గారాబం, ఆమెలేనిచో నరకమే. మంచికాలం ఎప్పుడూ మర్యాద పొందుతుంది...

– వేమన

# పంజాబ్




ప్రపంచ ప్రసిద్ధి గాంచిన స్వర్ణదేవాలయాన్ని కలిగి ఉన్న పంజాబ్ రాష్ట్రానికి చండీఘర్ రాజధానిగా ఉంది. ఈ రాష్ట్రంలో మొత్తం 14 జిల్లాలు ఉన్నాయి. భౌగోళికంగా పంజాబ్ తన ఉత్తరాన ఇతర దేశాలతో సరిహద్దును కలిగి ఉండటంతో ఎప్పుడూ యుద్ధాల బారిన పడుతోంది. ఆర్యులు మొట్టమొదటిసారిగా భారతదేశానికి ఈ రాష్ట్రం నుండే ప్రవేశించారు.

క్రీ.పూ. 326 లో అలెగ్జాండర్ ది గ్రేట్, పంజాబ్ గుండా ప్రయాణించాడు. చంద్రగుప్తమౌర్యుని పరాక్రమానికి మాసిడోనియా గవర్నర్ తోకముడవగా, పంజాబ్ మౌర్యసామ్రాజ్యంలో ఒక భాగమైంది. ఆ తర్వాత కృషాణులు అధికారంలోకి వచ్చారు. 10వ శతాబ్దం నుండి బాబర్ వంటి ముస్లిం పాలకులు రావడంతో పంజాబ్ వారి ఏలుబడిలోకి వచ్చింది. స్వాతంత్ర్యానంతరం 1966 నవంబర్ 1వ తేదీని రాష్ట్ర హోదాను పొందింది.

విస్తీర్ణం : 50,362 చ.కిమీ. ప్రధాన భాషలు : పంజాబీ

**సరిహద్దులు**: దక్షిణాన రాజస్థాన్, హర్యానాలతో, తూర్పున హిమాచల్‌ప్రదేశ్‌తోనూ, ఉత్తరాన జమ్ము-కాశ్మీర్‌తోనూ సరిహద్దులు కలిగిన ఈ రాష్ట్రానికి పడమర పాకిస్థాన్ ఉంది.

## అమృతసర్ - ఆనందపూర్



ఇక్కడవున్నది స్వర్ణకాంతులు వెదజల్లే పరమ పవిత్ర "గురుద్వార" అంటే గురు క్షేత్రము, గురునిలయం. మానవాళిని మహత్తరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో వివిధ పద్ధతులను మేళవించి 1497లో గురునానక్ ''సిక్కు'' మతాన్ని ప్రారంభించారు. ఈశ్వరుడు (భగవంతుడు) ఒక్కడేనని, ఆతనిని స్నానం, ధ్యానం, దానం ద్వారా ప్రతిఒక్కరు నిష్కల్మష చిత్తంతో ఆ పరమేశ్వరుని చేరుకో గలరని తెలిపేదే సమతామూర్తియైన సిక్కు మత సిద్ధాంతం.

ఈ లక్షణాలన్నీ భక్తజనులు అర్థంచేసుకొని ఆచరించే విధంగా "ఆదిగ్రంథ" మని పిలువబడే "గ్రంథసాహెబ్" రూపొందించబడింది. గురుపరంపరకు ఆద్యుడు శ్రీగురునానక్. ఈయన ప్రారంభించిన సిక్కు మతానికి, గ్రంథసాహిబ్ పరమ పూజ్యమని, మరో గురువుతో పనిలేదని, గురుపరంపరలోని పదవ గురువు గురుగోవింద సింగ్ తేటతెల్లం చేయడంతో, గ్రంథసాహిబ్ – "గురుగ్రంథసాహిబ్" అయింది.



అయితే అయిదవ గురువు అర్జునసింగు ఈ గ్రంథసాహిబ్‌ను రూపొందించారు. స్వర్ణదేవాలయాన్ని "హరిమందిర"మని కూడా పిలుస్తారు. దీనికి "దర్బారు సాహెబ్" అని మరో పేరుతో కూడా పిలుస్తారు. ఈ గ్రంథరాజంలో 3500 గేయాలు వున్నాయి. ఇవి కబీరు, రామానంద్, నామదేవువంటి మహాభక్తులు రచించినవి. ఇవి ఆలయంలో ప్రదక్షిణం చేసేటప్పుడు నాల్గుమూలలనుండి శ్రావ్యంగా వినిపిస్తాయి.

ఈ హరిమందిరం "అమృతసరోవరం" అనే నిర్మలమైన జలాశయం మధ్య క్రీ.శ. 1577లో నాల్గవ గురువు శ్రీరామదాసు నిర్మించారు. ఆ తర్వాత దీనిని 1803లో మహారాజా రణజీత్‌సింగ్ పునర్నిర్మించారు. ఈ ఆలయాన్ని ఉత్తర దిక్కునుండి దర్శించాలి. వచ్చిన ప్రతివారికి శాకాహార భోజనం పెట్టబడుతుంది. ఈ హరిమందిరంలో గురువులు, త్యాగవీరులు సంబంధించిన వివరాలు చూడగల్గుతాము. ఈ స్వర్ణమందిరం తర్వాత ఆనందపూరులో మరో గురుద్వారా వుంది. దీనిని గురు తేజ్‌బహదూర్ నిర్మించారు. సిక్కు మతవ్యాప్తికి ఈ గురుద్వారా ఎంతో దోహదపడింది.

## అచలేశ్వరము

ఇది "బరూల" రైల్వేస్టేషనుకు 6 కి.మీ దూరంలో వుంది. దేవతాధిపత్యము పొందాలని భూప్రదక్షిణం చేసి రమ్మని శివపార్వతుల ఆదేశం మేరకు కుమారస్వామి భూప్రదక్షిణానికి బయలుదేరుతాడు. అయితే గణపతి, తల్లిదండ్రులకు ప్రదక్షిణంచేసి భూప్రదక్షిణ ఫలంపొందే సరికి, కుమారస్వామి తన ప్రయత్నం విరమించుకుని "అచలము" (కొండగా)గా కదలకుండా వుండిపోతాడు. ఆ ప్రాంతమే ఇది. ఇక్కడే "కుమారు"నికోసం పార్వతీపరమేశ్వరులు కూడా కొలువుతీరారు.



గురుగోవిందసింగు కుమారునిపేరుతో "ఫతేగర్" ఏర్పడింది. గురుగోవిందసింగ్, ఔరంగజేబుని ఎదిరించి, ఇక్కడే స్థిరపడి సిక్కుమతాన్ని వ్యాప్తి చేస్తాడు. ఇక్కడ ఫతేఘర్‌సాహెబ్, గురుద్వారా జ్యోతిస్వరూప్, సాహిద్‌గంజ్, రోజాషరీఫ్, బాబాసామీర్ దర్గా, దాసనామీ అఖారా, మాతాశ్రీ చక్రేశ్వరి ఆలయం, నామదేవ మందిరం వగైరాలు చూడదగ్గవి.

మహాదేవుని నివాసమైన "కైలాసనగరం" ఈ కిన్నాపూర్ జిల్లాలో "కల్పా" లో వుంది. ఇక్కడ 16వ శతాబ్దంలో నిర్మించిన దుర్గాదేవి మందిరం, ఇక్కడి యమునానది పడమరవైపు జమదగ్ని ఆశ్రమంతోపాటు రేణుక, జమదగ్నిల విగ్రహాలు, 5 అడుగుల శక్తిపీఠాల్లో ఒకటైన జ్వాలాముఖి, విద్యేశ్వరీదేవితోపాటు, 40 అడుగుల ఎత్తుగల బంగారు

త్రిశూలం, కీలాంగులోని త్రిలోకనాధ ఆలయాలు, వరుస వెంబడి చూడవచ్చును.

అలాగే చూడవలసిన వాటిలో పఠాన్‌కోట, బిజిలీఆలయం, శిల్పకళ, చాతుర్యం వుట్టిపడే బాషిష్వర మహాదేవుని ఆలయం, కులు నుండి 45 కి.మీ దూరంలోని పార్వతీదేవి కర్ణాభరణం పడిన పార్వతిలోయ. ఇక్కడ పాతాళ జలధార వుంది. అనంతనాగ్, శ్రీమహావిష్ణువు శయనాగారం. ఇది శ్రీనగర్ నుండి 55 కి.మీ దూరంలో వున్న పౌరాణిక ప్రదేశం.

## దుర్గియానా ఆలయం - అమృతసర్



స్వర్ణదేవాలయానికి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అమృతసర్‌లో వున్న "దుర్గియానా" ఆలయమెంతో ప్రసిద్ధి చెందింది. చూడటానికి ఇది స్వర్ణదేవాలయంలాగానే వుంటుంది. చిన్నకొలను, దానికి వంతెన చూడటానికి అన్ని విధాలా స్వర్ణదేవాలయాన్ని పోలివుంటుంది. ఇక్కడ శ్రీలక్ష్మీ నారాయణ, దుర్గామాత, సరస్వతి మాత ఆలయాలున్నాయి. ఇది 16వ శతాబ్దంలో స్వర్ణదేవాలయ నిర్మాణసమయంలోనే నిర్మించబడినట్లు తెలుస్తోంది.

## బారా ఆంజనేయదేవాలయం

ఈ దేవాలయం కూడా ఈ దుర్గియానా ఆలయంలోవుంది. ఇది త్రేతాయుగంనాటిదంటారు. ఈ బారామందిరాన్ని



'లాంగూ దేవాలయమందిర'మని పిలువడం కూడా కలదు. ఇక్కడ పురుష సంతానం కోసం భక్తులు మ్రొక్కుకోవడం, ఇక్కడున్న ప్రాచీన రావిచెట్టుకు ఒక దారం కట్టడం, తమ కోరిక నెరవేరిన తక్షణం ఆ పిల్లవానితో రావడం కూడా ఆనవాయితీ. అలాగే తమ పిల్లలకు ఆంజనేయునిగా వేషంవేసి, ప్రాచీన రావిచెట్టు వద్ద ఆ అవతారాన్ని తొలగించి, తాము మునుపు కట్టిన దారాన్ని కూడా విప్పి బారా ఆంజనేయునిపై తమకుగల భక్తిప్రపతులను చాటుకుంటారు. ఈ స్వామిని దర్శించడానికి దేశవిదేశాలనుండి కూడా భక్తులు వస్తారు. తమ మ్రొక్కులను తీర్చుకుంటారు.

ఇక చరిత్రలోకి వస్తే – ఒక సామాన్య పౌరుడు సీతను అవహేళన చేసాడని, ఆమెను అడవికి పంపుతాడు. అక్కడ సీత లవకుశులకు జన్మనిస్తుంది. ఆ తరువాత కొద్దికాలానికి శ్రీరాముడు అశ్వమేధం చెయ్యతలచి గుర్రాన్ని విడిచిపెడితే పిల్లలైన బాలురు ఆ యజ్ఞాశ్వాన్ని చెట్టుకు కడతారు. ఆ చెట్టే ఇక్కడి రావిచెట్టని, అందుచేత తమకోర్కెలు నెరవేరుతున్నాయని ఆంజనేయుని అద్భుత శక్తికి అంజలిఘటిస్తారు, అర్చించి మురిసిపోతారు.

**దర్శనీయాలు :**



మహాభారతకాలంనాటి **'విరాటనగరం'గా** చెప్పబడే 'హోశియారుపూర్'లోని **'దసూహా' ప్రాచీన క్షేత్రం.** తమ ఇంట్లో శుభకార్యాలు జరుగతున్నాయంటే, ఆనాడు పాండవులు తమ ఆయుధాలు దాచుకున్న జమ్మిచెట్టును పూజించడం ఈ వూరి సాంప్రదాయం. ఇక్కడి సరోవరం భీముడు తవ్వించాడని చెబుతారు. ఈ సరోవరం మధ్యలో శ్రీకృష్ణమందిరం, సరోవరం చుట్టు బాబా బాలక్‌నాథ్, శివ, లక్ష్మీనారాయణులు, సరోవరంలో కమలాలు నయనానందకరం చేస్తాయి.

**కురుక్షేత్ర** స్టేషన్‌కు 28 కి.మీ దూరంలో ఈ **'పెహేవా'** వుంది. దీనిని పూర్వకాలంలో 'పృథూదకము' (పెద్ద సరస్సు) అనేవారు. పృధుమహారాజు తన తండ్రికిక్కడ అంత్యక్రియలు చేయుటచే ఈ పేరు వచ్చిందిట. ఇది పరమ పుణ్యము, పూజ్యము. విశ్వామిత్రులు బ్రహ్మత్వమొందినది ఇక్కడేనని చెబుతారు. ఇచ్చట సుబ్రహ్మణ్య దేవాలయంతోపాటు సరస్వతి, చతుర్ముఖ, శివునకు గూడా చెప్పుకోదగ్గ ఆలయాలున్నాయి.

**జలంధర్** అందులోని **బియాస్‌నది.** ఈ 'బియాస్' వ్యాసనదిగా కొందరు చెబుతారు. ఏమైనా ఈ నదీస్నానం పుణ్యమని, సర్వపాపహరణమని భక్తుల విశ్వాసం. సతీతులసి భర్తయైన జలంధరుని వలన ఈ ప్రాంతానికి 'జలంధర్' అని పేరు వచ్చిందని అనుకోవాలి.



**చండీఘర్‌కు** 50 కి.మీ **ఫతేగర్ సాహెబ్** వుంది. గురు గోవిందు సింగు కుమారుని పేరిట ఏర్పడిన నగరంగా దీనిని చెబుతారు. గురుగోవిందసింగ్ మొఘల్ చక్రవర్తి ఔరంగజేబును ధిక్కరించి, ఇక్కడనుండే సిక్కు మతవ్యాప్తికి పూనుకున్నాడు. ఈ పవిత్ర స్థలంలో 'గురుద్వారా, ఫతేగర్‌సాహెబ్, జ్యోతిస్వరూప్, సాహిద్‌గంజ్, రేజాషరీఫ్, బాబా సాలార్‌దర్గా, దాసనామీ అఖారా, మాతాశ్రీ చక్రేశ్వరి ఆలయం, శ్రీనామక్‌దేవ్ మందిరం, తోడర్‌మల్ హవేలీలు దర్శనీయాలు. ఇది సిక్కుమతస్థులు తరుచు దర్శించే పవిత్ర పుణ్యభూమి.



**భటిండా** లోని **తల్వండిసాంబో** సిక్కు మతస్థులకు ఆరాధనీయ ప్రదేశం. భటిండాను 'ధమధమసాహెబ్ అనీ, గురుకికానీ' అనీ గురునానక్ పిలిచేవారు. ఇక్కడే గురు గోవింద సింగు సిక్కులకు మతగ్రంథాన్ని నూతనంగా వ్రాయడంతో 'ఖల్సాదాతక్తత్' అని పేరు వచ్చింది. మానసహైవేలోని ఖానా మందిరంలో జ్యోతిమాతను ప్రతిష్ఠిస్తే, దుర్గామాతగా అది ఓ

భక్తునికి దర్శనమివ్వడంతో, జావాల్‌జీలోవున్న మాత ఆలయానికి చిత్రంగా అనుబంధ మందిరమైంది. భక్తులను, పర్యాటకులనూ విశేషంగా ఆకర్షిస్తుంది.

**పంజాబులోని రామతీర్థం :** అమృతసర్‌కు పశ్చిమాన 14 కీ.మీ దూరంలోవుందీ **రామతీర్థం.** దీనిని వాల్మీకి ఆశ్రమప్రాంతంగా చెబుతారు. లవకుశుల జన్మస్థానము, వాల్మీకి రచనల మూలకేంద్రమిదేనని చెబుతారు. ఇక్కడగల హనుమంతుడు త్రవ్వాడనే బావినిబట్టి సీతామాత ఇక్కడ వుందని అర్థమవుతుంది. ఇచ్చట సీతారామలక్ష్మణుల ఆలయం, సీతమ్మ విగ్రహం వున్న చిన్న కుటీరం, లవకుశులకు విద్యాబుద్ధులు నేర్పిన వాల్మీకి మహర్షి మందిరం, సీతాకుండం మనం దర్శించవచ్చును. నిజమని నమస్కరించవచ్చును.



**జలంధర్‌లో 'శివమందిర'** మనే గురుమందిరం. అతి ప్రాచీనమైంది. ఇది ఎంతో చక్కగా వుంది. హిందూ, ముస్లిం నిర్మాణశైలిలో వుండటం, ఆలయ ముఖద్వారం మశీదును తలపుకు తేవడం జరిగినా, ఆలయంలోపల మాత్రం అంతా హిందూదేవాలయ శైలిని చూడగల్గుతాం. మహాశివరాత్రి నిక్కడ ఎంతో గొప్పగా జరుపుతారు. భక్తజనులకు ఏడాది పొడవునా కొదువలేని శివాలయమిది.

సతీదేవి శరీరభాగాలు పడిన 51 శక్తిపీఠాలలో ఈ **'జ్వాలాముఖి'** ఒకటి. 50 మెట్లు ఎక్కితే కొండపైని ఆలయాన్ని దర్శించగల్గుతాం. సులభంగానే ప్రయాణం, విద్వేశ్వరీ దేవి దర్శనం. ఇక్కడ 40 అడుగుల సువర్ణ త్రిశూలముంది. ఉత్సవాలకు కొదువలేని ప్రదేశం.

**తారన్‌తరన్** – తరింపచేసే ఈ సరస్సు ఇటునుండి అటు వైపుకు ఈదితే ఎటువంటి దీర్ఘవ్యాధులైనకుదురుతాయిట. ఇది గురు అర్జున్‌సింగ్ స్థాపించిన గురుద్వారాకు అనుబంధంగా వున్న సరస్సు.

చాపార్ అనే ప్రాంతంలో 'గోగా అనే నాగదేవత ఆలయముంది. ఈ ఆలయంలో వీచే చల్లనిగాలిని గోగా నాగదేవత ఉచ్ఛ్వాసనిశ్వాసలుగా చెబుతారు. సెప్టెంబరులో ఈ నాగదేవతకు ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. లూధియానా నుండి 27 కి.మీ దూరంలో ఈ క్షేత్రం 3 కి.మీ దూరంలో నాగదేవత ఆలయముంది.



**పఠాన్‌కోట ధమ్‌తార్ ఆలయం :** నిజంచెప్పాలంటే ఇది వీరుల కోట. ఇక్కడెన్నో చారిత్రక కట్టడాలు, పరిశోధకు లకు, పర్యాటకులకు కనువిందు చేస్తాయి. యాత్రికులకిక్కిడ 'ధమ్‌తార్' అనే ప్రాచీన ఆలయ ముంది. ఈ ఆలయగోడలపై రామాయణ, భారత గాధలు శిల్పాలు చూడగల్గుతాం. ఇక్కడికి దగ్గర్లో 'రావినది'. ఈ ప్రాంతాన్ని శరద్‌పూర్ అంటే షాజహాన్ షాహపూరుగా మార్చాడు. ఇక్కడి పురాతన నిర్మాణాలు చూడవలసిందే తప్ప వర్ణించలేము.

## :: సూక్తులు ::

యావత్ ప్రపంచాన్ని జయించగలిగిననూ మృత్యువును జయించలేమని తెలుసుకో.

– సూక్తి

సమస్త తప్పిదాలకు కారణం మనసు. దాన్ని సరిగా ఉంచుకుంటే ఎప్పటికి తప్పులు చేయవు.

– గౌతమబుద్ధుడు

జీవితంలో కోట్లకు కోట్లు సంపాదించుకున్నప్పుడు కలగని ఆనందం ఒక మంచి మిత్రుడిని పొందగల్గినపుడు కలుగుతుంది...

– సర్వేపల్లి రాధాకృష్ణ

చెరకులో ఒక చెదపుట్టి తీపంత చెరచినట్టు వంశంలో ఓ చెడ్డవాడు అందరికి తలవంపులు తెస్తాడు.

– వేమన

వందమంది డాక్టర్లు నీ వెంటవున్నా, నీ పరలోకప్రయాణం ఆపలేరని తెలుసుకో.

– సూక్తి

ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఆత్మవిశ్వాసమే ప్రధాన సోపానం.

– శామ్యూల్ జాన్సన్

సమయం చాలా విలువైంది, రేపు అను దానికి రూపలేదు.

– సూక్తి

ఆనందానికిమించిన ఆరోగ్యంలేదు. సంతోషానికి మించిన సంపద లేదు. సేవకుమించిన స్వర్గం లేదు.

– కెల్ల త్రినాథ్

పుస్తకాలు లేని గది ఆత్మలేని దేహం వంటిది.

– సి.సి.రో.

# రాజస్థాన్




జైపూర్ రాజధానిగా ఉన్న ఈ రాష్ట్రంలో 31 జిల్లాలున్నాయి. భారతదేశానికి ఈ రాష్ట్రం సరిహద్దు రాష్ట్రంగా ఉంటుంది. విస్తీర్ణపరంగా దేశంలోనే అతిపెద్ద రాష్ట్రంగా రాజస్థాన్ అవతరించింది.

గతంలో 1948 మార్చి 17న మత్స్య యూనియన్‌తో పాటు అల్వార్, భరత్‌పూర్, దోల్‌పూర్, కశౌలీ రాజ్యాలతో ఈ రాష్ట్రానికి రూపకల్పన జరిగింది. అనంతరం బర్స్‌వారా, బుంది, టోంక్ రాష్ట్రాలు 1948 మార్చి 28న రాజస్థాన్‌లో కలిసాయి. 1949 మార్చిలో బికనీర్, జైపూర్, జైసల్మేర్, జోథ్‌పూర్, రాష్ట్రాలు కలువగా ఈ రాష్ట్రాన్ని 'యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ గ్రేటర్ రాజస్థాన్' గా పిలుస్తున్నారు.

**విస్తీర్ణం : 3,42,239 చ.కిమీ.** **ప్రధాన భాషలు : రాజస్థానీ, హిందీ**

**సరిహద్దులు :** ఈ రాష్ట్రానికి పశ్చిమాన, వాయవ్యంలో పాకిస్థాన్, ఉత్తరాన పంజాబ్, ఈశాన్యంలో హర్యానా, ఉత్తరప్రదేశ్ ఉంటాయి. అగ్నేయంలో దక్షిణాన మధ్యప్రదేశ్, నైరుతిలో గుజరాత్ ఉన్నాయి.

## ఏకలింగ్‌జీ (కైలాసపురి) రాజస్థాన్

రాజస్థాన్‌లో గల ఉదయపూర్ జిల్లాకి 12 మైళ్ళ దూరంలో ఈ ఏకలింగ్‌జీ వెలసి వుంటుంది. దీనిలో పరమశివునికి పూజలు జరుగుతాయి. ఆదిశంకరాచార్యతో వున్న ఆచార్య విశ్వరూపులవారు ఈ ఆలయాన్ని స్థాపించారు. 2500 చ॥అ॥ విస్తీర్ణంలో వున్న ఈ ఆలయం 65 అడుగుల పొడవు కల్గి వుంటుంది. ఈ ఆలయం చుట్టూ ఎత్తైన, బలమైన ప్రహరీ వుంటుంది. ఈ ఆలయ ముఖద్వారం పడమట వైపు వుంది. లోనికి వచ్చే భక్తులకు విశిష్టమైన శిల్పచాతుర్యం పెక్కు స్థంభాలతో వున్న విశాలమైన హాలు స్వాగతమిస్తుంటుంది. ఇక్కడ 3 నంది విగ్రహాలు కనపడతాయి. ఒక నంది పూర్తి వెండితోను, ఒక నంది పూర్తి ఇత్తడితోను, మరో నంది రాతితోను మలచబడి వుంటాయి. ఈ మహాదేవుడు "ఉదయపూర్" మహారాజుల ఆరాధ్యదైవం. నాలుగు ప్రక్కల నాల్గు ద్వారాలున్న ఈ ఆలయానికి కేవలం "లింగం" గా కాక నాలుగు ముఖాలున్నాయి. వాటిని బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, సూర్య స్వరూపులుగా తలచి పిలుస్తారు. ఇది శ్రీ ఆదిశంకరాచార్యులు అర్చించిన లింగం.





ఈ ఏకలింగ్‌జీ ఊళ్ళో 70 వరకు ఆలయాలుండటం ఒక విశేషం 11వ శతాబ్దం నాటి సాస్-బహు ఆలయం పూర్తి పాలరాతితో చేయబడి వుంటుంది. 15వ శతాబ్దం నాటి అద్భుత్‌జీ జైన్ దేవాలయం నల్లటి గ్రానైట్ రాతితో చేయబడినదై చూపరుల నాకర్షిస్తుంటుంది.

పటలేశ్వర్ మహదేవ్, అర్చుదమాల్, రథాసన్‌దేవి, వింధ్యవాసినిదేవి మొ॥ పెక్కు ఇతర ఆలయాలు కనువిందుచేస్తాయి.

## మౌంట్ అబూ




ఆరావళీ పంక్తులలోని అతి ఎత్తైన పర్వతం మౌంట్ అబూ!.... సముద్ర మట్టానికి 1200 మీటర్ల ఎత్తులో విస్తరించిన ఈ పర్వత నగరం రాజస్థాన్‌లోని ఓ అతి ముఖ్యమైన వేసవి విహారకేంద్రం! యిక్కడి సూర్యాస్తమయ దృశ్యం అత్యద్భుతంగా వుంటుంది. ప్రకృతి పరంగానే కాకుండా మౌంట్‌అబూకు చారిత్రకంగానూ పౌరాణికం గానూ చాలా ప్రాముఖ్యం వుంది. అబూరోడ్ యిక్కడికి దగ్గరగా వున్న రైల్వేస్టేషన్! డబోక్ దగ్గర్లోవున్న విమానాశ్రయం.

మౌంట్ అబూలో మంచి వసతి సౌకర్యాలున్నాయి. స్థానిక దిల్వారా జైనమందిరాలు, ఓ కొండను చెక్కి నిర్మించిన ఆధారదేవి ఆలయం, నక్కీసరస్సు, గోముఖ దేవాలయాలు, రంగనాథస్వామి దేవాలయాలు యిక్కడ చూడాల్సిన యితర విశేషాలుగా గుర్తించబడ్డాయి. సిటీలోని సన్‌సెట్ పాయింట్, అస్త్రాద్రి పాయింట్‌ల నుంచి పరిసర ప్రకృతి అందాలు, సూర్యాస్తమయ దృశ్యం రమణీయంగా కనిపిస్తాయి.

నక్కీ సరస్సులో జలవిహారం చేయవచ్చు! మౌంట్ అబూలో కనీసం ఓ రెండు రోజులయినా వుంటే బావుంటుంది. మళ్ళీ మళ్ళీ రావాలనిపించే ఈ సుందర పట్టణం రాజస్థాన్ రాష్ట్ర టూరిజం డిపార్ట్‌మెంటుకు మంచి ఆదాయాన్ని అందిస్తోంది. ఇది పర్యాటకులకు పసందు, కనువిందు!

## పుష్కర్

జైపూర్ నగరానికి 140 కి.మీ. దూరం లోను, ఆజ్మీర్‌కి కేవలం 11కి.మీ. దూరంలో వున్న పుష్కర్ సరస్సు ఓ సుప్రసిద్ధ హిందూ యాత్రాస్థలం. అందమైన సరస్సులు, భక్తిభావాన్ని పెంపొందించే దేవాలయాలు, హైందవ సాంప్రదాయాలు, కళ్ళకు కట్టినట్లుండే ఈ నగరంలో సరస్సుల వద్ద వుండే స్నాన ఘట్టాలు సందర్శకులను ఆకట్టుకుంటాయి. ఇక్కడ స్నానమాచరిస్తే తీర్థయాత్రలకు సాఫల్యం లభిస్తుందని నమ్మకం.



యాత్రీకులను అమితంగా ఆకర్షించే బ్రహ్మ దేవాలయంతో పాటు, గాయత్రి అమ్మవారికి కూడా ఆలయం వుంటుంది. నగాపహాజ్ కొండ క్రిందుగా విస్తరించిన సరస్సులోని స్నానఘట్టాలు, కాశిలోని గంగా స్నాన ఘట్టాలను పోలి వుంటాయి. ఏటా కార్తీక పున్నమినాడు ఇక్కడ బ్రహ్మాండమైన వుత్సవం జరుగుతుంది. ఆజ్మీర్‌ను కేంద్రంగా చేసుకొని పుష్కర్‌ని దర్శిస్తే బావుంటుంది.

పద్మపురాణం ప్రకారం వజ్రనాభుడనే లోక కంటకుడైన రాక్షసుని బ్రహ్మ తన చేతిలోని తామర పూవుని విసిరి సంహరిస్తాడుట. ఆ పూవులోని మూడు రేకలు పడిన ప్రదేశమే "పుష్కర" మని బ్రహ్మచే పేరు పెట్టబడిన ప్రదేశమే ఈ "పుష్కర"క్షేత్రం. ఇందలి పుష్కర సరస్సు ఎన్ని యాత్రలు చేసినా ఈ పుష్కరయాత్ర చెయ్యకపోతే, తీర్థఫలితముండదట. అందుకే దీనిని తీర్థరాజమంటారు.

దీని ప్రస్తావన రామాయణ, భారతాలలో మనకు కనిపిస్తుంది. కార్తీకపున్నమినాడు ఈ పుష్కర సరస్సులో స్నానం చేస్తే వందల సంవత్సరముల పాటు చేసిన యజ్ఞఫలం దక్కుతుందిట. ఇక్కడి సావిత్రి, గాయత్రి ఆలయాలు దర్శించాలి. ఇంకా ఈ పుష్కర్‌లో 400ఆలయాలు వున్నాయి. ఇందులో బ్రహ్మదేవుడి ఆలయానిప్రక్కనేవున్న అగస్తేశ్వర్ ఆలయం. ఆతర్వాత రంగజీ ఆలయం. ఇది దక్షిణాది పద్ధతిన కట్టిన విష్ణుమూర్తి ఆలయం. ఎన్నో వున్నాయి. ఓపికవున్నవారు ఓపిక చేసుకుని, ఓర్పుతో చూడదగ్గ ప్రదేశం. దీనిని ఆదిశంకరులు గూడా దర్శించారని స్థల పురాణం చెబుతుంది.

## జైసల్మేర్



పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఇండియా పట్టణ్, జోధ్‌పూర్ నుంచి 187 కి.మీ. ఇక్కడున్న కోటలో శ్రీకృష్ణుడు త్రవ్విన బావి ఉంది, ఇక్కడ శివునికి-వినాయకుడికి ఆలయాలున్నాయి, ఇసుక రాతిలో నిర్మించిన 99 బురుజుల కోట ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ, ఢిల్లీ నుంచి ఇక్కడికి 897 కి.మీ. అజ్మీర్‌కు 500 కి.మీ. ఇక్కడ గ్రంధాలయంలో ప్రాచీన తాళపత్రాలున్నాయి.

## రాజస్థాన్

ఇది రాజుల సంస్థానం. ఇందులో ఇన్ని కోటలుగల దేశం మన భారతదేశంలో మరొకటిలేదని చెప్పాలి. కేవలం కోట నిర్మాణమే కాకుండా శిల్పసాంప్రదాయం, అపురూప కట్టడాలు, ఆ నిర్మాణనైపుణ్యం మొత్తం చూడదగ్గదే!



అబూ నుండి కి.మీ దూరంలోని ప్రఖ్యాత పాలరాతి జైన మందిరాలు అయిదింటిని ఇక్కడ మనం చూడవచ్చును. ఋషభదేవుని ఆలయ శిల్పశోభ విశాల వశాహి, లూనవనాహి, పిత్తలహర, చేముఖ వగైరా దేవాలయాల శిల్పనైపుణ్యం కన్నులప్ప గించుకుని చూడాల్సిందే తప్ప చెప్పనలవి కాదు. నిజానికి రాజస్థాన్ అంతటా కనువిందుచేసే కోటలు, ప్రకృతి దృశ్యాల అందాలతోపాటు, మహమ్మ దీయుల దండయాత్రలో శిధిలమై కాల గర్భంలో కలిసి పోయి ఇంకా కొన్ని కొన్ని అందాలను ప్రకటించే కోటలు, రాజమహళ్ళు, ఆలయాలకు, చెప్పుకోదగ్గ స్థిర అందమైన ఛాయాచిత్రం.

దుంగారపూర్‌లో ఉదయపూరు నుండి దక్షిణంగా 114 కి.మీ చూడదగినవి ఉదయనివాస మహలు, జునా మహల్, గైబ్‌సాగర్ (సరస్సు). ఇక్కడి బన్సవార్‌లో ఆనంద్ సాగర్, మహి డాం, నైలాబ్ సరస్సు, ఒకనాటి శిధిలా వస్థలోవుండి మనల్ని కృంగదీసే పురాతన రాజవంశ భవనాలు, అలాగే జయసముంద్, రాజసముంద్, దానవ్‌పూరు, కుంభాలగర్‌లో చారిత్రక, శిల్పకళాదృష్టితో చూడాలి. మానవ మేధస్సులో, చారిత్రకు సాగిలపడాలి.



చిత్తోర్‌గర్ తర్వాత చెప్పుకోదగ్గది చరిత్ర ప్రసిద్ధమైనది ఈ కుంభాలగడ్. కాని దురదృష్టం ఎన్నో కోటలవలె, ఇది శిధిలావస్థకు చేరింది. ఇచ్చటి శిల్ప సంపద నిర్మాణశైలి చూస్తే బావురుమని ఏడవాలని అనిపిస్తుంది. ఇక్కడి కోట, బుంది జులావరులు, రాజస్థాన్ ప్రధాన పర్యాటక మార్గంలోనుండి విడిపడి వుంటుంది. ఇక్కడి బుంది, కోటకు 36 కి.మీ దూరంలో ఉత్తరంగా వుంది.

1631లో ఛత్రపాల్ చేత నిర్మించబడిన ఛత్రమహల్‌లోని బంగారు, వెండి సింహాసనాలు, రాజా రతన్‌సింగ్‌చేత నిర్మింపబడిన రంగమహలు, "దివానీఆమ్" ఒక్కసారి చూసిన వాళ్ళు అక్కడ నుండి కదలలేరు. ఇక జులావర్‌లో కోట, భవాని నాట్యశాల, బౌద్ధుల గుహలు, స్థూపాలుతో పాటు క్రీ.పూర్వంనాటి గుహలను కూడ చూడవచ్చును.

# చూసితీరవలసిన చిత్తోర్‌ఘడ్

ఇది చూడవలసింది. దీని చరిత్ర తెలుసుకోవల్సింది. ఈ ప్రాంతాన్ని "కుశస్థలి" అనికూడా అంటారు. శ్రీరాముని కుమారుడు "కుశుడు" ఈ ప్రాంతాన్ని పాలించాడు. క్రీ.పూ. 57 సం॥నుండి క్రీ.శ. 1597 వరకు వివిధ సమయాలలో, వివిధ రాజులు, ప్రభుత్వాలు ఈ చిత్తోర్‌ను పాలించాయి. మహమ్మదీయులు క్రీ.శ 1220 నుండి 1597 వరకు పలు సమయాలలో, పలు విధాల దండయాత్రలు చేసి, ఈ ప్రాంతాన్ని అల్లకల్లోలం చేసారు. 1568 సం॥లో ఈ కోట అక్బరు వశమైంది. రాణాప్రతాప్ సింగ్‌ను రాజును చేస్తాడు. ఈ మహావీరుడు చిత్తోర్‌ను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తాడు. కానీ ఆ మహావీరుని కోరిక నెరవేరలేదు. అక్బరు కుమారుడు జహంగీర్ రాణాప్రతాప్ మనుమనితో సంధి చేసుకుని చిత్తోర్‌కు ఆతని, మేవాడు సామ్రాజ్యాధిపతిగా అభిషేకిస్తాడు.



నిజానికిప్పుడు మనం చూడవలసినది అపు రూపమైన చిత్తోర్‌కోట, దాని అపురూప నిర్మాణం, మన మేధావులను మించిన మహామేధాసంపత్తి అడుగడుగునా ఆ అపురూప కోట సంభ్రమాశ్చర్యా లలో ముంచెత్తుతుంది.

జైనదేవాలయాలు, కుంభశ్యామ్ ఆలయం, మరో కృష్ణ భక్తురాలు మీరాబాయి కట్టించిన శ్యామనాథ ఆలయం, జయస్తంభం, త్రిమూర్తులన సమిధేశ్వరాలయం, చిత్తూర్ మహారాణి పద్మినీదేవి అంతఃపురం, నీలకంఠ దేవాలయం దానిదగ్గర్లోని కీర్తిస్తంభం – మన చారిత్రక నేపథ్యానికి, అపురూప నిర్మాణ, శిల్పకళాసంపదకు, తీపిగుర్తుగా కనబడతాయి.



ఇక ఉదయపూరులో కోట, మహారాజ భవనం, ఫతేసాగర్‌లు, ఈనాటి కొన్ని కట్టడాలు, ఆనాటి శిథిలాలు, శిల్పాలు. వసతులు వున్నాయి. ప్రయాణసౌకర్యముంది. కావాల్సింది ఓర్పు – ఓపిక.

ఇంకా రాజస్థాన్‌లో నాథద్వార, బికనీర్, జైసల్మీరు, జోథ్‌పూరు, మౌంటు ఆబూ... ఇవన్నీ పురాతన కోటలకు, వాటి శిథిలస్థితిని, అలనాటి నిర్మాణ శైలిని, వారి మేధాసంపత్తిని, చూసి, ఈనాటి వారందరు జేజేలు పలకాలి. జోహార్లర్పించాలి. వీటి కళాత్మకను నిర్మాణశైలిని వర్ణించలేము. గుడ్లప్పగించి చూడటం మినహా మరొక ప్రత్యామ్నాయం మనకు కనబడదు.

# జైపూరు



చూడదగిన పాలరాతి మందిరం. గులాబీ రంగు రాతితో నిర్మించిన భవనాలు, కోట చూసితీరాల్సిందే. ఇక్కడి చంద్రమహల్ అన్నింటికంటె ఎత్తయినది. ఆ తెల్లటి పాలరాతి భవనం, ఇందులోని పాతకాలంనాటి పురాతన ఆయుధసంపత్తి చూడవలసిందే. గోవిందజీ ఆలయం, నక్షత్రశాల, హవామహల్, అనేక రాజుల విగ్రహాలు, చత్రిస్, గాలోటాలోని అందమైన సూర్య దేవాలయం, జోధపూరులో కళాత్మక దృష్టితో, చారిత్రక నేపథ్యంతో, ఆసక్తి పెంచుకుని మరీ చూడగల్గడమొక అదృష్టమని తలవాలి.

అలాగే అజ్మీరు, ఉదయపూరు, జగనివాస్, 17వ శతాబ్దంనాటి జగదీష్ ఆలయం, అబూ శిఖరం, దేవతలు గోళ్ళతో తవ్విన నక్కి సరస్సు, గోముఖ్‌లు కూడా కళాత్మకదృష్టితో చూడదగినవి.

**దర్శనీయాలు :**



గుజరాతుకు సామంతరాజైన సోమసింహుడు **దిల్వారాలో** మొత్తం అయిదు ఆలయాలు నిర్మంచబడ్డాయి. ఇక్కడ నిర్మించిన వాటివతీలోని మల్‌షాహి మందిరం కన్నా లూణావశాహి, శిల్పాలు మరింత అద్భుతంగా వుంటాయి. పీతల్‌హార్ మందిరంలోని ఋషభనాధుని ఆలయం 14వ శతాబ్దంలో భీమాసాహి నిర్మిస్తే, పార్శ్వనాధుడున్న నాల్గవ మందిరాన్ని, వీస్వాల్‌సంఘవి అనే ఆయన 1458లో నిర్మించాడు. ఇక అయిదోది ఆఖరిది 'కుంతనాధస్వామి ఆలయం. దీనివాస్తుశైలి, శిల్పాలు అత్యద్భుతం. ఇక్కడి ఆలయాలు భారతీయ కళాకారుల కళాభిజ్ఞతకు నిదర్శనంగా ప్రముఖంగా చెప్పాలి.

ఈ **ఆబూలో** వున్న నిటారు కొండపైనగల **గురుశిఖర ఆలయం** దర్శించడం కొద్దిగా కష్టమే.

ఇక **'వారాహదేవాలయం'** 12 వ శతాబ్దంలో అజ్మీరును పాలించిన అరుణరాజా కట్టిస్తే దీనిని మొదట్లో జహంగీరు, ఆతదుపరి మౌఢ్యుడైన ఔరంగజేబు సమూలధ్వంసం చేస్తారు. 1727లో తిరిగి జైసింగ్ మహారాజు ఎంతో అందంగా నిర్మింపచేస్తాడు. ఆప్తేశ్వర్ ఆలయం బ్రహ్మదేవుని ఆలయానికి ప్రక్కనుగల గుహలో వుంది. బ్రహ్మదేవుడు యజ్ఞప్రారంభించబోతున్న సమయంలో కపాలం చేతిలో కల్గిన భిక్షువు ఒకడు వస్తే చీదరించుకుంటాడు.



దాంతో అతనా పుర్రెను ఇక్కడ పడేసిపోతే ఆ ఒక్కటికాస్త అనేకమయ్యే సరికి, అప్పుడు బ్రహ్మ ఆ వచ్చింది శివుడని తెలుసుకుని 'మహాదేవా! మన్నించ'మంటూ, ఇక్కడ శివలింగ ప్రతిష్ఠచేసి, పూజించడంతో శాంతుడైన బోళాశంకరుడు యజ్ఞనిర్వహణకు తోడ్పడతాడు. కనుక ఇది మోక్షభూమిగా భక్తులు తలచి, కొలుస్తారు.

జైపూరుకు వస్తే గాలతాజి కొండపై **సూర్యదేవాలయం, గాలవ్యమహర్షి ఆశ్రమప్రాంతం, గోముఖం నుండి వచ్చే జలధార** పరమపవిత్రమని, పర్వదినాలలో భక్తులు ఇక్కడికి వచ్చి పూజించి, తరిస్తారు. చంద్రమహల్‌కు దగ్గరో వున్న చంద్రమహల్‌కు ఉత్తరాన వున్నదీ **గోవిందాజీ ఆలయం**. ఔరంగజేబు మధురపై దండయాత్ర చేస్తాడనే భయంతో ఇక్కడికి తెచ్చి మహారాజా జియాసింగు ప్రతిష్ఠించి నట్లు చెబుతారు.



ఇక్కడే 1525లో శ్రీచైతన్య మహప్రభు శిష్యుడు శ్రీరూప గోస్వామికి బృందావనంలో దొరికిన శ్రీకృష్ణ విగ్రహం ఇక్కడకు తీసుకువచ్చి ప్రతిష్ఠించడం జైపూరు మహారాజు ఉదయాన్నే తన చంద్రమహల్‌నుండి దర్శనం చెయ్యడం జరుగుతుంది. ఇక్కడ కృష్ణాష్టమి చాలా ఘనంగా జరుగుతుంది. ఇక్కడి శ్రీకృష్ణుని 'గోవింద్‌దేవ్‌జీ, శ్రీజా అని కూడా పిలుస్తారు.



**హవామహల్** రాజపుత్ర స్త్రీలు, అంతఃపురవాసులు ప్రశాంతంగా చూడటానికి వీలుగా 'హవామహల్' అనే పలు అంతస్తులు దర్శనీయ రహస్యద్వారాలు కల్గిన దీనిని అందమైన దివ్యానుభూతిగా 1799లో మహారాజా ప్రతాపసింగ్ చేత నిర్మింపబడింది. ఇంకా ఇక్కడ 15 శతాబ్దిలో జైపూరు ప్యాలెస్‌కు దగ్గరగా రాధాకృష్ణుల మందిరాన్ని నిర్మించి తన కుమారుని గుర్తుగా 'జగత్‌శిరోమణి' అని పేరు పెడతాడు. ఇక్కడి శిల్ప కళానైపుణ్యం కళ్ళువిచ్చుకుని చూడవల్సిందే తప్ప వర్ణించడం తగదు. ఈ ఆలయంలోని విగ్రహాన్ని మహాభక్తురాలు మీరాబాయి పూజించేదంటారు. ఇక్కడి రాధాకృష్ణుల వెనుక విష్ణుమూర్తిని చూడగల్గడమొక విశేషం.

జోధ్‌పూరునుండి 75 కి.మీ దూరంలో బాలోత్రా నుండి 8 కి.మీ దూరంలో **ఖేడ్** అక్కడ **రణచోధరాయమందిరం** వుంది. దీని దగ్గరే స్టేషనువుండటంతో ప్రయాణానికి కొంత సులువు. దీని పరిక్రమలో అనేక దేవీ, దేవతల విగ్రహాలను చూస్తాము. పాపపుణ్యాలకిటికీ, ఏనాడో అద్దంగా మలచిన శిల ఇప్పటికీ అద్దంలా వుండటం, వారి కళానైపుణ్యానికి శిల్పచాతుర్యానికి నిదర్శనంగా ఎన్నో నమస్కారాలు, పెట్టినా చాలదు.



శిల్పకళావిలసితమైన **అంబరు** లోని **మీరాబాయి మందిరం**, జయపూరుకు 15 కీ.మీ దూరంలో ఖాటాగ్రామం, అక్కడ గల శిరస్సు, కళానైపుణ్యం, రుక్మిణీసమేతుడైన శ్రీకృష్ణ భగవానుడు అంతా చిత్ర,విచిత్రం. ఇక స్థల పురాణానికి వస్తే ఘటోత్కచుని కుమారుడు బర్బరీకుడు, మూడేండ్ల వయస్సులో శ్రీకృష్ణునితో యుద్ధంలో పాల్గొనే సావకాశ మిమ్మంటాడు. నీ ప్రయోజకత్వమంటే, ఒకే బాణంతో రావిచెట్టు ఆకులను దూసేస్తాడు. ఎవరిపక్షాన పాల్గొంటావంటే ఓడిపోయేవారి పక్షాన అంటాడు. దాంతో కృష్ణుడు ఆలోచించి, ఈతనివలన ఏ ప్రమాదం రాకుండా, నీ శిరస్సు నాకివ్వమంటాడు. ఇస్తాను కానీ మహాభారతయుద్ధం చూసే సావకాశమిమ్మంటాడు. కనుక ఇక్కడున్న శిరస్సు ఆతనిదై వుండాలన్నది స్థానికుల అభిప్రాయం.

**మాండోర్** చూడవలసిన ప్రదేశం.మార్వార్ రాజుల ముఖ్యపట్టణంకూడా. ఇక్కడ ఒక విగ్రహములో 33 కోట్ల మంది దేవతలున్నారు. అలాగే మరో రాయిలో 16 మంది రాజుల విగ్రహాలు చెక్కబడ్డాయి. ఈ విశేషం చూడదగ్గది కదూ!

ఒకప్పుడు **చందేరీ**గా, శిశుపాలుని రాజ్యంగా వర్ధిల్లిన ప్రదేశం లద్నన్‌గా జోధ్‌పూరులో ఒకభాగమైందిప్పుడు. ఇక్కడ జైన దేవాలయాలు, ముఖ్యంగా దిగంబర జైనమందిరం వుంది. ఇచ్చట 166 తీర్థంకరుల విగ్రహాలున్నాయి. పర్యాటకులు ఓపిక చేసుకుని అడుగుముందుకు వేస్తే అద్భుత శిల్పకళ, శాంతినాధ, చార్‌భుజనాథ దేవాలయం, సుఖదేవ్ ఆలయం, బాలాజీ మందిర్, పాబోలో, మంగల్‌పుర బాగిచి, పీర్‌వాబాలాజీ, ద్రోణాచల ఆశ్రమం, వేంకటేశ్వరమందిరం, సుజనఘర్, సింఘిమందిర్‌లను చూడగల్గుతాము.

డెష్నోక్ లోని **కర్ణిమాత ఆలయం**, చిత్తోర్‌గడ్‌లోని **కుంభశ్యామ ఆలయం, సమిధేశ్వర ఆలయాలు,** నగడ, జగదీష్, సూర్యదేవాలయం, నాథ్‌ద్వారాలోని శ్రీనాధుని ఆలయం, విరాటనగర్‌లోని పాండవుల గుహలు, దుంగార్పూర్‌లోని బనేశ్వర, వనేశ్వర, విజయరాజరాజేశ్వర, భువనేశ్వర్ ఆలయాలు దర్శనీయాలు. కేవలం చూడటమేకాదు, అక్కడి శిల్పకళానైపుణ్యానికి, ఆ మహనీయ కళకు శిరసువంచి నమస్కరించాలనడంలో ఏమాత్రం తప్పులేదు.

జైపూరుకు 160 కి.మీ దూరంలో వున్న ఒకనాటి కల్యాణపురి నేటి **కరౌలిలో** సుమారు 300 దేవాలయాలు పైగా వుండటంతో ఈ ప్రాంతాన్నిక పవిత్రస్థలంగా తలిచేవారు. అసలీ ప్రాంతాన్ని క్రీ॥శ॥ 995లో శ్రీకృష్ణుని వంశీకుడైన రాజా విజయపాల్ కనుగొనగా, 1348లో యాదవవంశీయుడైన రాజా అర్జున్‌పాల్ ప్రకటించినట్లు తెలుస్తోంది. ఇక్కడి శిల్పశైలి, రాతికట్టడాలు, చారిత్రక నిర్మాణాలు సిటీపాలెస్, తిమ్మన ఘర్‌కోట, కైలాసదేవి ఆలయం, మదనమోహన్, మహావీర్ జైన్ దేవాలయాలు .... చూడగల్గడం మన అదృష్టమనాలి. ఒక్కొక్కటి విడిగా ఓర్పుగా చూస్తే మనము మన తెలివతేటలు వీరి ముందు నిష్ఫలమనిపిస్తాయి.

ఈ **పాలి లో పరశురామమహాదేవాలయం, చాముండిమాత, సోమనాథ్,** హటుండి రతమహాబీర్ స్వామి దేవాలయాలు, ఇంకా జైనదేవాలయాలు, చూడవలసినవి. నవలక దేవాలయం, చూడదగ్గకాదు, ప్రత్యేకంగా చూడవలసిన దివ్యక్షేత్రం. 1209లో నిర్మించిన సోమనాధ దేవాలయం 15వ శతాబ్దంలో నిర్మించినప్పుడు గుర్రాలపై

స్వారీచేసే కాలచక్ర స్వరూపుడు శ్రీసూర్యనారాయణమూర్తి ఆలయం, ఆదీశ్వర్ దేవాలయం (దీని నిర్మాణానికి 65 సం॥లు పట్టిందిట) చూడదగ్గవి.



అలాగే **బరన్** లోని **సీతాబరి,** సీతాదేవి లవకుశులకు జన్మనిచ్చిన ప్రదేశంగా చెప్పుకుంటారు. అలాగే భండ్ దేవరా (ప్రాచీన శివాలయం, 10వ శతాబ్దిలో నిర్మించినట్లు చెపుతారు) బ్రహ్మణిమాత, మణిహార మహదేవ మందిరం (క్రీ.శ. 600 సం॥ పూర్వం నిర్మించినదిగా చరిత్రకారుల భావన) చూడవలసినవి. బ్రాహ్మణిమాత ఆలయం, పెద్దరాతి క్రింద ఒక గుహలో వుంది. ఇక్కడ వెలిగే జ్యోతి గత 400 సంవత్సరాలుగా వెలుగుతోందని స్థానికుల మాట.

**రానక్‌పూరులో** 15 వ శతాబ్దానికి చెందిన **జైనదేవాలయం** ఇక్కడ దర్శనీయం. **సూర్యభగవానుని దేవాలయం,** ప్రత్యక్షసాక్షి దర్శనానికి నిదర్శనం. రథం నడిపే కాలస్వరూపుడు భాస్కరునికూడ దర్శించగల్గుతాం. ఇక్కడికి దగ్గర్లోని ముచ్చల్‌లో మీసాల శివుని విగ్రహముంది. ఇంకా ఇక్కడ ... అదే **అభనేరిలో** క్రీ.శ. 8-9 శతాబ్దాలో జీవకళ ఉట్టిపడే శిల్పకళాచాతుర్యంతో నిర్మించబడిందీ **'హర్షత్‌మాతా దేవాలయం'**. ఈ తల్లిని సేవిస్తే సంతోష సుఖాలు లభిస్తాయనేది భక్తుల విశ్వాసం. ఇక్కడ జరిగే మూడు రోజుల జాతరకు ప్రక్కగ్రామలనుండి కూడా భక్తులు తండోప తండాలుగా వస్తారు.





జైపూరుకు 10కి.మీ దూరంలోని **గాల్టాలో శ్రీసూర్యభగవానుని ఆలయం.** గాలవ్యమహర్షి కొంతకాలం తపస్సు చేసిన ప్రదేశం. కాలక్రమేణ గాల్టాగా పిలువబడుతుంది. మహర్షి తను పొందిన కుష్ఠువ్యాధిని, సూర్యనారాయణుడు, నవగ్రహాలను పూజించి కుంభ కోణంలో (తమిళనాడులో ఈ విషయం వివరంగా చూడవచ్చును) వీరి అనుగ్రహం పొంది కుష్ఠువ్యాధినుండి రక్షింపబడ్డాడు.



**'రణదంబోర్'** జైపూరుకు దగ్గర్లో **గణపతి ఆలయం** వుంది. ఇక్కడకి రావడానికి బస్సు సౌకర్యం కూడా వుంది. ఇచ్చటి కొండపైని గణపతి ఆలయాన్ని లక్షల సంఖ్యలో భక్తులు దర్శిస్తారు. కొండమీది ఈ గణపతి విగ్రహం పురాతనమైంది కదా, జీర్ణావస్థకు చేరుకుంటోంది. తొండం మాత్రం అదేం మహత్యమో చెక్కుచెదరకుండావుంది. ఇక్కడి దేవుని 'సిద్ధిదాత భగవాన్ గణేశు'డని పిలుస్తారు.

**ఘటియాలా** లో **'చతుర్థ గణేశమందిరం'** అనే గణపతి ఆలయముంది. ఇక్కడి మందిరం వద్దగల స్తంభంపై శ్రీగణేశస్తుతి చెక్కబడింది. పైభాగాన నాల్గు దిక్కులను చూసే నాల్గు గణపతి విగ్రహాలున్నాయి. ఇచ్చటకు భక్తులు బాగానే వస్తారు. పర్వదినాలలో భక్తుల తాకిడికి నిదర్శనం పరవశత్వమే.

నవల్‌ఘడీ స్టేషనునుండి 30 కి.మీ దూరంలో **'లోహర్గళ'** అనే పుణ్యక్షేత్రం వుంది. ఇచ్చటి **సూర్యదేవాలయం** అతి పురాతనమైంది. ఇక్కడ దొరికిన శాసనాలనుబట్టి ఈ ప్రత్యక్షభగవానుని ఆలయం కాక, చిన్నవి, పెద్దవి మొత్తంకల్పి 70 వరకు ఆలయాలున్నాయిట. ఇవన్నీ కూడా ఈ సికార్ ప్రాంతాన్ని పాలించిన రాజులచేత నిర్మింపబడినవే. ఇక్కడ ఉష్ణకుండాలు కూడా వున్నాయి. పర్వతాలనుండి జాలువారే 7 ధారలు ముఖ్యతీర్థములుగా ఇక్కడ ప్రసిద్ధిగాంచాయి. ఈ దేవాలయందగ్గర్లో గల సూర్యకుండంలో అస్తికల నిమజ్జనం చెయ్యడానికి దూరప్రాంతాల నుండి ఎందరెందరో తరలివస్తూంటారు. ఇక్కడ నీటవేసిన అస్తికలు అతికొద్ది కాలంలో జలరూపమొందుతాయనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఉదయపూరునుండి 66 కి.మీ దూరంలో **'కంక్రోలి'** అనే ఊరు వుంది. ఇక్కడగల **ద్వారకాజి ఆలయం.** 1678లో మహారాణా రాజాసింగుచేత నిర్మించబడింది. దీనివలన ఈ ప్రాంతాన్ని 'రాజ్‌నగర్' అనికూడా పిలుస్తారు. ఇక్కడి ముఖ్యదైవం శ్రీకృష్ణుడు. 'ద్వారకాజి' అన్నాకూడా శ్రీకృష్ణుడే!

**శాస్త్రబద్ధమైన కర్మలను ఆచరిస్తూ మాత్రమే మానవుడు నూరేళ్లు జీవించాలని కోరుకోవాలి. దుష్కర్మ కాలుష్యాన్ని దూరం చేసుకోడానికి ఇది మినహా మరో మార్గం లేదు.**

– ఈశావాస్యోపనిషత్తు

**ఆత్మ దగ్గరకు కన్నుపోలేదు. మాటలు, మనస్సు కూడా దరిజేరలేవు. ఇంద్రియాలకు దానిని గ్రహించే శక్తిలేదు. ఇతర లౌకిక వస్తువులలాగా జ్ఞేయ విషయంలాగా అది తెలియబడదు.**

–కేనోపనిషత్తు

**గాఢమైన తపస్సులో ఉన్న బ్రహ్మం సృష్టి చేయాలన్న ఆనందంతో వృద్ధి చెందుతుంది. వృద్ధి చెందిన బ్రహ్మం నుండి అన్నం పుడుతుంది. ఆ అన్నం నుండి శక్తి, మనస్సు, లోకాలు, కర్మలు జన్మిస్తాయి.**

–ముండకోపనిషత్తు

**అనేక రంగుల అద్దాల నుంచి వెలువడుతున్నది ఒకే కాంతి. సత్యం వివిధ మత ధర్మాలకు అనువర్తించేందుకు ఈ చిన్న వ్యత్యాసాలు అవసరమవుతున్నాయి. కానీ అన్ని హృదయాల్లో ఒక్క సత్యమే వెలుగుతున్నది.**

–వివేకానంద

# సిక్కిం




ఇదీ పర్యాటక ప్రాంతమే. అలాగని ప్రక్కన పెట్టకుండా, “అకార” రూపంలో అందించే ఈ తీర్థక్షేత్ర యాత్రాక్రమంలో, క్రమంగా అందిస్తున్నాం.

ఇక్కడ బౌద్ధారామాలు, హిందూమందిరాలు, జైన మందిరాలు, సిక్కు గురుద్వారాలు, మసీదులు, చర్చిలు వున్న సమతాభూమి. కాకపోతే ఇక్కడ 17వ శతాబ్దంలోని బౌద్ధారామం చూడదగ్గది. గాంగ్‌టక్ 3 కి.మీ దూరంలోని బౌద్ధారామం, రుమటకే బౌద్ధారామాలు, శిల్పకళారీత్యా ఎన్నో అందచందాలు పొందుపరచుకున్నాయి.

ఇంకా ఏం చూడాలంటే .... ముందే చెప్పాము. ఇది ఎక్కువ పర్యాటక ప్రదేశ లక్షణాలు కల్గిన యాత్రా ప్రదేశము.

అందములు విందుచేసే అవని ఇదిగో... అంటూ ప్రకృతి పరిసరాల అందాలను ఆస్వాదించదలిచినవారు ఆనందంగా దర్శించగల ఆహ్లాదకర ప్రదేశంగా చెప్పాలి.

# కాంచనగంగ



కాంచనగంగ పర్వతం సిక్కింవాసులకు ఆరాధ్య దైవం. దీని ఉదయసౌందర్య దృశ్యాల్ని వర్ణించడం కుదరదు. అక్కడకు వెళ్ళి ఆనందకరంగా ఆస్వాదించడమే మన తక్షణ కర్తవ్యం. కారణం, కాంచనగంగ అన్నింటికన్న ఎత్తైన శిఖరం. అయిదు శిఖరాలు (ముఖాలు) కల్గివుండటంతో, ఇది ఇక్కడి వారికి ఆరాధనీయం. ఇక్కడ సూర్యుడు మొదట్లో తెల్లని కాంతి, తదుపరి బంగారుకాంతి, ఆ తదుపరి తెలుపు, ఆపైన నీలం. ఇలా చెబుతుంటే పొందలేని ఆనందం, ప్రకృతి పరిశోధకులు, ప్రియులు, చరిత్రశోధకులు, అభిమానులు, సామాన్యులు కూడా పులకించి చూడవలసిన అత్యద్భుత దృశ్యం ఈ కాంచనగంగ. దీని మీదపడే ఉదయకిరణాల ఉల్లాసం విలాసం ఒక వినోదంగా, తనివితీరని ఆనందంగా వుంటుంది.

# గాంగ్‌టక్

గాంగ్‌టక్‌కు 40 కి.మీ దూరంలో ఒక పెద్ద సరస్సు. ఇక్కడో చిన్నదేవాలయం. ఆపై రెండు ఉపనదుల సంగమం చూడవలసిందే. లోయలు, పచ్చిక బయళ్ళు, ప్రకృతి అందాలు కనువిందుకాదు, చేసేది మానసోల్లాసం. ఇక్కడ నుండి కాంచనగంగ దృశ్యం మరింత మనోహరం.



**"గణేష్‌టోక్"** – 'పేరులోనేవుంది పెన్నిధి' అన్నట్లు ఇక్కడి అధినాయకుడు, విఘ్నవినాయకుడు, గణపతి. కష్టపడి గణపతిని చూసాక, అక్కడనుండి నగరాన్ని చూడబోతే గాంగ్‌టక్ అందాలు అద్భుతం, అపురూపమని చెప్పాలి.



**"హనుమాన్ టోక్"** గాంగ్‌టక్‌కు 6 కి.మీ దూరంలోని హిందూ దేవాలయాల కూటమిలో ఈ హనుమాన్ టోక్ ఒకటి. ఇది ఇప్పుడు భారతసైన్యం చేత నిర్వహింపబడుతుంది. దీనికి పురాణ నేపథ్యం కూడా వుంది. సంజీవని కోసం బయలుదేరిన హనుమంతుడు అదేదో తెలియక, మొత్తం పర్వతాన్నే పెకలించుకుని వస్తూ దారిలో కొంచెంసేపు విశ్రాంతి తీసుకున్న ప్రదేశమట ఇది. ఇక్కడ నుండి ప్రకృతి రమణీయకతను ఆరాధకులు చూసి ఆనందించవచ్చును.



**సిద్ధేశ్వర దాం** వద్ద కల **శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయం** కొండ పైన 108 అడుగుల ఎత్తులో వుండటం, శివుడిక్కడ ధ్యానముద్రలో వుండటం చూడతగ్గది. అంతేకాదు ద్వాదశజ్యోతిర్లింగముల నమూనాలు, అలాగే చార్‌ధామ్, పూరి జగన్నాధుడు, గుజరాత్ ద్వారకాపురి, తమిళనాడు రామేశ్వరం, గర్వావలీలోని బద్రీనాధ్‌ల నమూనాలను కూడా చూడ గల్గుతాం. ఇచ్చట శివుని ధ్యానముద్రతోపాటు, 18 అడుగుల కిరాతేశ్వరుని విగ్రహం కూడా చూడగల్గుతాం. స్థలపురాణం ప్రకారం సతీదేవి మరణంతో ఈశ్వరుడు వేటగానిగా కిరాతకుడై ఇక్కడ నివసించాడని భక్తుల అభిప్రాయం.



**రంగీత్ నది ఒడ్డున** మరో ప్రత్యేక **కిరాతేశ్వర ఆలయం** వుంది. పురాణాల ప్రకారం అర్జునుడు శివుని గూర్చి తపస్సు చేసి రాబోవు మహాభారతయుద్ధంలో విజయుడు కావాలని, శివుని ప్రార్థిస్తే 'తథాస్తు' అన్న ప్రదేశమిది.



**గ్యాంగ్‌టక్** లోని **"టూకూర్బరి దేవాలయం" హిందూ దేవాలయం** రాజధానికి నడిఒడ్డునవున్నది. అంచెలంచెలుగా ఈ ప్రాతం ఆలయాలతో కళకళలాడుతూ, యాత్రీకులను ఆనందపరవశులను చూస్తుంది.

ఇక **"రామ్‌టెక్ బౌద్ధారామం"**. ఎత్తైన పర్వతాలు చెప్పుకోవడం, వినడం తప్ప, చూడటమిక్కడే జరుగుతుంది. ఈ ప్రాంతం చారిత్రక పరిశోధకులకు, ప్రకృతి ఆరాధకులకు పెట్టింది పేరు. ఇక్కడి బౌద్ధ స్తూపాలు, కనువిందు చేస్తుంటే, తెలియని పులకింత, తెలిసినవారితో కలివిడిగావున్న ఆనందం అనుభవించగలం.



ఇక్కడ ఆశ్చర్యపరిచే సంఘటన ఒకటుంది. విశ్వగురువు దత్తాత్రేయుడు, సమర్ధసద్గురువు సాయినాధుడని – ఈనాటి ప్రపంచం విశ్వసిస్తూంది. ఆ భావన నిజమన్నట్లు 2010 సంవత్సరంలో షిర్డిసాయిబాబా ఆలయనిర్మాణం జరిగింది. తానులేనిచోటు లేదని భగవంతుడు చెప్పినట్లు ఈ సమర్ధసద్గురువు విశ్వాత్మకుడై నమ్మినవారిని సదా సంరక్షిస్తున్నాడు.

**బాబాహర్భజన్‌సింగు :** సామాన్య సైనికుడే, కాని ఉత్తమాభిరుచిగల ఉత్తమోత్తముడు. అయినా మంచులో కూరుకుపోయి మరణించాడనుకునే వ్యక్తి, ఒకశక్తిగా, దైవస్వరూపునిగా ఎందరికో మార్గదర్శకం వహించడం, వారి సేవలకే (సహాయంచెయ్యడానికే) తానున్నానని చెప్పడం చేతులతో చూపించడమొక అపురూపం.దైవశక్తికి, ధర్మపరిరక్షణకు నిదర్శనమనిచెప్పి అటువంటి పుణ్యమూర్తిలకు అంజలి ఘటించాలి.



## సిక్కిం అందచందాలు





## : : సూక్తులు : :

జీవితంలో ఏదైనా సాధించాలి అనుకునే వ్యక్తి ముందుగా తనలోని బలాలను, బలహీనతలను గుర్తించాలి. బేరీజు వేసుకొని నిర్ణయం తీసుకోవాలి.

– సూక్తి

జీవితంలో ధనం నష్టపోతే కొంత కోల్పోయినట్టు, కానీ వ్యక్తిత్వం కోల్పోతే సర్వస్వం పోగొట్టుకున్నట్లే ...

– స్వామి వివేకానంద

మన మనసు పసిపిల్లవంటిది. కారణం చూసిందల్లా అది కావాలంటుంది.

– సూక్తి

అదృష్ణవంతుడు సముద్రంలోపడ్డా నోటిలో చేపతో తిరిగి రాగలడు

– అరబ్

మండుతున్న చెట్టుమీద ఏ పక్షీ వాలదు... అలాగే కోపంతో రగిలిపోయే వానికి సుఖ సంతోషాలు ఎన్నడూ ఉండవు.

– సూక్తి

మూర్ఖుడు తాను ఇతరులను మోసం చేయగలుగుతున్నాను కాబట్టి తెలివిగలవాణ్ణి అనుకుంటాడు. అది తన పిచ్చితనమని తన నాశనానికి దారితీస్తుందని గ్రహించలేడు.

– సూక్తి

సహాయం చేస్తే మరచిపో ... సహాయం పొందితే గుర్తుంచుకో.

– మహాత్మాగాంధి

పిల్లలు దేవుళ్ళతో సమానం. వారితో అబద్ధాలు ఆడించకూడదు. వారికి చెడుపనులు చెప్పకూడదు...

– మహాత్మాగాంధి

మాట ఇవ్వడానికి తొందరపడకు, ఇచ్చినమాట నిలబెట్టుకోవడానికి ఆరాపడు. – సూక్తి

# తమిళనాడు




ద్రవిడ సంస్కృతికి కాణాచిగా నిలచిన తమిళనాడు 29 జిల్లాల సమాహారం. చెన్నై రాజధానిగా గల ఈ రాష్ట్రం దేశానికి దక్షిణాన నెలకొని వుంది.

ద్రవిడుల సంస్కృతికి తమిళనాడు రాష్ట్రమే మూలం. ఆర్య సంస్కృతి కన్నా 1000 సం॥ ముందే ద్రవిడ సంస్కృతి ఇక్కడ వ్యాపించింది. క్రీ.పూ. 4వ శతాబ్ధం నుంచి తమిళనాడును చోళులు, చేరాలు, పాండ్యులు అనే ముగ్గురు రాజవంశీయులు పరిపాలించినట్లు తెలుస్తోంది. కాలక్రమంలో అనేక పరిణామాల అనంతరం నవంబరు 2, 1956న తమిళనాడు రాష్ట్రం ఏర్పడింది.

**విస్తీర్ణం :1,30,058 చ.కిమీ. ప్రధాన భాషలు : తమిళం, తెలుగు**

**సరిహద్దులు :** తమిళనాడుకు తూర్పున బంగాళాఖాతం, ఉత్తరాన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లు, పశ్చిమాన కేరళ, దక్షిణాన హిందూ మహాసముద్రం సరిహద్దులుగా ఉన్నాయి.

## మద్రాసు



**పార్ధసారధి దేవాలయం :** మద్రాసులోని ట్రిప్లికేన్ ఏరియాలో ఉన్న ఈ దేవాలయం 8వ శతాబ్ధంలో పల్లవ రాజులచే నిర్మించినబడినది. విష్ణుదేవాలయమైన ఈ దేవాలయాన్ని 16వ శతాబ్ధంలో విజయనగర రాజులు పునరుద్ధరించారు. ఇదికాక ముజుందీశ్వరాలయం, శ్రీవల్లీశ్వరగుడి, శ్రీత్యాగరాజస్వామి ఉదనూరై ఆలయం, వుల్లియమ్మ గుడి, కాళికాంబ, అబత్ సహాయేశ్వర, ఆదిపరాశక్తి ఆలయంతోపాటు ఎన్నో వైష్ణవ దేవాలయాలున్న దివ్య ప్రదేశం. అంతేకాదు పార్ధసారథి ఆలయంకూడా ఎన్నో ఆలయాలకు నెలవు/ కూడలి.

### కపాలేశ్వరస్వామి దేవాలయం

మద్రాసు నగరంలో ఉన్నటు వంటి అతిపురాతన దేవాలయాలలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రము కపాలేశ్వరస్వామి దేవాలయం. అందంగా చెక్కబడిన దీని గోపురం చూడదగ్గది. ఈ ఆలయాన్ని పల్లవులు, చోళులు విజయనగర రాజులు సమయాను కూలంగా పునరుద్ధరించి తమ పేరు ప్రఖ్యాతులు, కళాతృష్ణను చరిత్రపుటలలో శాశ్వతత్వం చేసారు. మైలాపూర్‌కు దక్షిణంగాఉన్న ఈ దేవాలయంలో 11 రోజులు “ఆరువత్తుమూడు” ఉత్సవము చేస్తారు. ఈ ఉత్సవములో 8వ రోజు 63 మంది నయనార్లను పెట్టి పూజిస్తారు. ఈ మైలాపూరు 2వ శతాబ్దములో పేరు



ప్రఖ్యాతులు గాంచిన తమిళ కవి "తిరువళ్ళువర్" జన్మస్థల మని చెబుతారు.

నిజానికి ఇది తెలుగువారి "ఇంకా చెప్పాలంటే ఆంధ్రుల ప్రాభవానికి 'మచ్చుతునక' అనే అనాలి. ఇప్పుడు అందరు చెప్పుకునే "చెన్నయ్" ఒకనాటి "చెన్నపట్నం". ఆంధ్రులు నిర్మించిన అద్భుత నగరం. ఇక్కడికి 'చెన్నయ్' అని, చెన్నపట్నం... మదరాసులకు ఎక్కడినుండైనా ప్రయాణ, రవాణా సౌకర్యాలు అన్నివిధాల, అన్ని రకాల అందుబాటులో వున్నాయి. ఈ నగరంలోవున్న మైలపూరులో (నెమలిపట్నం) కపాలేశ్వరాలయం వుంది. ఈ నగరంలో ఈ క్షేత్రఅధిపతి కపాలేశ్వరుడు, అమ్మ కల్పకవల్లి, అమ్మ నెమలి రూపంలో స్వామిని ప్రార్థించినందువల్లే ఈ ప్రాంతానికి మైలపూరు అన్నపేరు. క్రమంగా మైలాపూరు అయింది.

## జంబువృక్షం - జలలింగేశ్వరుడు

యోగ–భోగాలమధ్య భేదమెలాగు వుంటుందని, ఒకసారి పార్వతి, శివుని అడిగితే స్వామి తెలుసుకుని చూడమంటాడు. దాంతో పార్వతి జంబూద్వీపంలోని కావేరికి వచ్చి తపస్సు ప్రారంభించింది. అయితే జగన్మాత కావేరిజలాలను చేతిలోకి తీసుకుందో లేదో ఆ జలం కాస్త లింగరూపమొందేసరికి, ఆశ్చర్యపోయి, తాను అందులో లీనమైపోయింది. ఆ జల లింగం అక్కడే వుండిపోయింది. శివలీలగా హిమాలయ ప్రాంతంలో తపస్సు చేసుకునే సిద్ధుని చేతిలో నేరేడుపండు పడింది. అతడు అలవాటుగా ఈశ్వరార్పణమన్నాడు. అంతే! ఆ పండు మాయమై ఓ గింజ చేతిలో పడితే, అది శివప్రసాదంగా అతడు ఆరగిస్తాడు. అది కాస్తా నేరేడు చెట్టుగా అతని పొట్టలోంచి పుట్టుకరాసాగింది. శివాజ్ఞతో ఇతడు కావేరీ తీరానికి వచ్చి జలలింగేశ్వరునికి ఆచ్ఛాదనగా నిలిచాడు. దీంతో స్వామి జంబుకేశ్వరుడయ్యాడు. ఇది శ్రీరంగక్షేత్ర సమీపంలో నున్న దివ్యక్షేత్రం.

శాక్తేయుల ప్రభావంతో ఉగ్రరూపిణియైన ఈ తల్లిని ఆదిశంకరులు తమ సంచారంలో భాగంగా, శివ – శ్రీచక్రాలను ఆమె కర్ణాభరణాలుగా సమర్పించి, ఆ తల్లి కెదురుగా ప్రసన్నగణపతిని ప్రతిష్ఠించి, భక్తజన కామ్యకరూపిణిని చేస్తారు. ప్రతిరోజు ఉదయం 11 గం. ప్రధానార్చకుడు దేవి ఆభరణాలు, చీరను ధరించి శివుని పూజించడం ఆనవాయితీ. ఏనుగు, సాలీడులు పూజించడం, అవి కాళహస్తి కథవలె వైరంతో సాలీడు ఏనుగు తలలో దూరితే అది తలపగులకొట్టుకోవడం, ఆతదుపరి సాలీడు చోళరాజకుమారుడుగా జన్మించడం, అతడు గతస్మృతులు జ్ఞాపకమొచ్చి ఈ జలలింగేశ్వరునికి, ఏనుగు రావడానికి ఏమాత్రం వీలులేకుండా చిన్నద్వారంలో ఆలయాన్ని నిర్మించడం చెప్పుకోదగ్గ కథ.

ఇంతటి ప్రశస్తమైన ఆలయాన్ని సావకాశమున్నవారు దర్శించుకోదగ్గది అని ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదనుకుంటాను.

## వళ్ళువర్ కోట్టము

మద్రాసు పట్టణము నడిబొడ్డున నుంగంబాకం వద్ద విశాలమైన ఐదు ఎకరాల స్థలములో నిర్మించిన వళ్లువర్ కోట్టమ్ ప్రపంచ మహాకవులలో ఒకరైన తమిళకవి శ్రీ వళ్ళువర్ మహాకవి యొక్క జ్ఞాపక చిహ్నంగా కట్టబడిన అందమైన భవనం. కళా కేంద్రంగా, చారిత్రక చిహ్నంగా విజ్ఞాన వైభవమును పొందుచోటుగా అనేకమంది ఉపాన్యాసాలు చెప్పే ఈ "ఆడిటోరియం" యొక్క ముందు భాగములో వళ్లువర్ కవి రాసిన "అక్షరములన్నిటికిని ఆకారము మొదలు, ఈ లోకములకు 'ఆదిదేవుడు' మొదలు అనే సూక్తి అనేక మందిని ఆకర్షిస్తుంది. గత రెండువేల సంవత్సరముల కళా చరిత్రలో నుంగంబాకం 'వళ్లువరుకొట్టమ్'లో చెక్కబడిన రాతిరథము ప్రప్రథమ నిర్మాణమని ఒక ప్రముఖ దినపత్రికలో తెలుపబడినది. ఈ చక్కని రాతిరథంలో రెండు అడుగుల ఎత్తైన పీఠం మీద ఏడు అడుగుల తిరువళ్లూరు శిలా విగ్రహం చూసిన వారు తన్మయులవుతారు.

## పుంపుహార్




తూర్పుతీరంలో ఉన్న తమిళనాడులో ముఖ్యమైన ఓడరేవుగా ప్రాధాన్యత సంతరించుకున్న ఈ పుంపుహార్‌లో ప్రాచీనమైన శిల్పతాలకం చూడవలసిన స్థలం. కావేరి నది కర్ణాటక నుండి వచ్చి తలైకావేరిగా ఇక్కడ సముద్రములో కలుస్తుంది. తమిళనాడు ప్రభుత్వ ఆర్టుగ్యాలరి ఇక్కడ ఉంది. ఇక్కడ రాతిపై చెక్కబడిన అద్భుత శిల్పాలు కలవు. మద్రాసు నుండి 280 కి.మీ. తంజావూరు నుండి 100 కి.మీ. తిరుచూరు నుండి 150 కి.మీ. దూరంలో ఈ క్షేత్రం ఉంది. సుమారు నాలుగువేల మంది కూర్చుండి చక్కగా సభలు జరుపుకొనుటకు వీలుగా ఉన్న ఈ 'ఆడిటోరియం'లో ఎన్నో సభలు, సమావేశాలు జరుగుతుంటాయి. ఇంతకన్నా ఈ వూళ్ళో "మనైకణ్" అనే ధనవంతుడు ఆ వూరిలోని మరో వ్యాపారి కుమారుడు కోవెలన్‌తో తనకుమార్తె 'కణ్ణగి' నిచ్చి వివాహం చేసాడు. అనుకోకుండా కోవెలన్ ఆ వూళ్ళోని రాజనర్తకి నాట్యముచూసి మోహంలో పడతాడు. ఆమెకూడా చెయ్యి చాపింది, చివరకంతా పూడ్చుకుపోతే అతను వీధినబడతాడు. భార్య ఆదరిస్తుంది. ఓదారుస్తుంది. తన కాలి అందెనొకటిచ్చి వ్యాపారం చెయ్యండి' అంది. షరాపు బజారుకు వెడతాడు. అక్కడ ఇతని దురదృష్టంగా పాండ్యరాణి అందె కాజేసిన కంసాలి, ఇతన్ని మోసం చేసి, రాజు దగ్గరకు చేర్చి ఇతని కాలిఅందెచూపి "దొంగ" అంటాడు. ముందు వెనుక ఆలోచించని రాజు మరణ శిక్ష విధిస్తాడు.

భర్త మరణవార్త విన్న కణ్ణగి, రాజును సభలో కలిసి, తన భర్త నిర్దోషిత్వాన్ని ఋజువుపరుస్తుంది. రాణిగారి అందెలలో గొప్పగా రాజు ముత్యాలున్నాయంటే, తన చేతిలోని అందెలను విసిరి, ఇందులో కెంపులున్నాయి చూడమంటుంది. అది చూసి రాజు నిర్ఘాంతపోయి, ప్రాణాలు విడిస్తే, మహారాణి ఆ వార్తవిని ప్రాణాలు కోల్పోతుంది. కోపంతో రాజు మందిరాన్ని విడిచి బయటికి వచ్చిన కణ్ణగి పతివ్రతాశక్తికి మధుర మాడిపోతుంది. అక్కడనుండి

వైగా నదిద్వార చేర (కేరళ) రాజ్యాన్ని చేరిన ఆమె వెంగై చెట్టువద్ద నిలబడి, యోగంతో ప్రాణాలు విడిచి స్వర్గానికి వెడుతుంది. దీన్ని వేటగాళ్ళ ద్వారా విన్న చేరరాజు, ఆమెకు నమస్కరించి ఆమె స్వర్గారోహణంచేసిన ప్రాంతములో ఆమె కొక ఆలయం కట్టిస్తాడు. అంతటి దివ్యశక్తివంతమైనది "పూంపుహార్ (కావేరిపురపట్టణం).

## కామాక్షీ దేవాలయం - కంచి



అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటి అయిన ఈ క్షేత్రములో అమ్మవారి పేరు కామాక్షి. "కంచి కామాక్షి పలుకు, మధుర మీనాక్షి పలుకు" అనే మాట ఆంధ్రులకు గుర్తుండే విధంగా ఇక్కడ అమ్మవారిని దర్శించుకుంటే సర్వ పాపములు పోతాయని చెబుతారు. కంచిలో కామాక్షి, మధురలో మీనాక్షి, కాశిలో విశాలాక్షి, బెజవాడ కనకదుర్గమ్మ దేవాలయాలు భక్తులు తప్పక దర్శించవలసిన "దివ్య క్షేత్రాలు". దాదాపు వంద ఆలయాలతో, శివకేశవ మూర్తులతో కమనీయంగా రూపుదిద్దుకున్న దివ్యక్షేత్ర మిది. బ్రహ్మ తన యజ్ఞంతో వరదరాజస్వామిని వెలయింపచేసిన క్షేత్రం. పార్వతి, శివుని మామిడిచెట్టు రూపంలో పూజించి తరింపచేసిన ప్రదేశంగా చెబుతారు. ఆది శంకరులు ప్రతిష్ఠించిన కామకోటి పీఠం, కొన్ని జైనమందిరాలు కూడా చూడదగ్గవే. ఇక్కడి ఏకామ్రేశ్వరుని పృధ్వీలింగంగా చెబుతారు.

ఈ కామాక్షి అమ్మవారు మొదట నరబలులు కోరటంతో ఆదిశంకరులు వారు "శ్రీచక్రము" ప్రతిష్ఠించి అమ్మవారిని శాంతింప చేసినట్లు స్థల పురాణం ద్వారా తెలుస్తుంది. ఇందువలనే అమ్మవారి ఆలయంలో ఆదిశంకరుల విగ్రహం ఉంటుంది. కాంచీపురంలో మరోక ప్రసిద్ధ దేవాలయం వరదరాజస్వామి దేవాలయం 100 స్థంభాలు గల ఈ వరద రాజస్వామి దేవాలయంలో క్రింది భాగమున నరసింహస్వామి దేవాలయం ఉంది. రాతితో చేసిన గొలుసు, చక్కని శిల్పాలు ఇక్కడకు విచ్చేసిన యాత్రికులకు ఒక ప్రత్యేక ఆకర్షణ. ఈ దేవాలయంలో ఉన్న వెండి, బంగారు, రాగి బల్లులను ముట్టుకుంటే జీవితంలో ఎన్నడయిన శరీరంపై బల్లి పడినప్పటికి దోషం ఉండదని చెబుతారు. ఆర్ధశాస్త్రమును రచించిన కౌటిల్యుని జన్మస్థలమైన ఈ ప్రాంతమునకు దగ్గరలో బౌద్ధ, జైన స్థూపాలు ఎన్నో ఉన్నాయి.

పల్లవ, చోళులతో పాటు, విజయనగరరాజులు ఈ క్షేత్ర అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారు. వివిధ భంగిమలు, రూపాలతో విజయనగర రాజులు నిర్మింపచేసిన ఏకశిలా విగ్రహాలు మనల్ని ప్రత్యేకించి పలుకరిస్తున్నట్లు పులకరింపచేస్తాయి.

దక్షిణాది అంటేనే శిల్ప సంపద – ఆలయ సమూహాలు. భారతదేశంలో దక్షిణాదిలోగల అపురూప నిర్మాణాలు ఇతరత్రా కనుపించవనడంలో కొంచెమైనా తప్పులేదు.

## ఏకాంబరనాధ దేవాలయం - కాంచీపురం



తమిళనాడు రాష్ట్రములో ఉన్న పెద్ద దేవాలయాలలో ఇది ఒకటి. పంచలింగా లలో ఒకటి. ఐదు ప్రాకారాలు ఉన్న ఈ ఆలయం తొమ్మిది హెక్టారులలో పల్లవులచే నిర్మించబడినదని చెబుతారు. 1000 స్థంభాల మండపం, కోనేరు ఉన్న ఈ ఆలయం యొక్క మొదటి ప్రాకారము, గాలి గోపురం శ్రీ కృష్ణదేవరాయులు 15వ శతాబ్దములో నిర్మించినట్లు చెబుతారు. ఈ దేవాలయంలో ఉన్న మామిడి చెట్టు నాలుగు కొమ్మలకు నాలుగు రకాల కాయలు కాస్తుందని. ఈ చెట్టు మామిడికాయ తింటే సర్వపాపములు పోతాయని భక్తుల నమ్మకం. పంచలింగాలలో ఒకటి అయిన పృధ్విలింగం ఈ దేవాలయంలోనే ఉన్నది. ఇచ్చట స్వామి ఏకాంబరేశ్వరుడు. ఇచ్చట లింగము సగం స్పటికాకారములో ఉంటుంది.

విజయనగరరాజులు నిర్మించిన వెయ్యి స్తంభాల మంటపం ప్రత్యేక ఆకర్షణ, ఈ దేవునికి “దేవరాజస్వామి” అని మరోపేరు కూడా వుంది.

## వైకుంఠ పెరుమాళ్ళు ఆలయం

8వ శతాబ్దంలో పల్లవరాజు నిర్మించిన వైకుంఠపెరుమాళ్ళు ఆలయం, దీనిని నందివర్మ నిర్మిస్తే, అనంతరం 5 శతాబ్దాల తరువాత విజయనగరరాజులు, ప్రవేశప్రాంగణాన్ని ముచ్చటగొలిపే విధంగా, తమ కళాభిజ్ఞతను తెలిపేటట్లు నిర్మించి స్వామికి నీరాజనాలొసగారు.

## రామేశ్వరం - గంధమాధన పర్వతం



రామేశ్వరం నుండి 25 కి.మీ. దూరంలో ఉన్న ఈ దేవాలయం రెండు అంతస్తులు కలిగి ఉంటుంది. శ్రీరామచంద్రుడు రావణ సంహారం తరువాత బ్రహ్మహత్య పోవటానికి ప్రతిష్ఠించిన ఆలయంగా ప్రఖ్యాతి పొందినదీ క్షేత్రం. కోటి నదులు, మూడు సముద్రాలు కలిసిన దివ్యక్షేత్రం రామేశ్వరం. మనదేశంలోని నాలుగు ప్రసిద్ధ పీఠాలలో రామేశ్వరం మొదటిది. మిగిలినవి రెండు ద్వారక, మూడు పూరి, నాలుగు బదరీనాథ్. అంతేకాదు, జ్యోతిర్లింగాలలో రామేశ్వరం ప్రధానమైన శివక్షేత్రం. దేవాలయ అంతస్తు నుంచి చూస్తే రామేశ్వర దీపం కనబడుతుంది.

ఈ రామేశ్వరం దేవాలయంలో 22 తీర్థాలు, ఆలయం బయట మరో 21 తీర్థాలున్నాయి. చుట్టూ కోదండ రామస్వామి, పర్వతవర్ధని అమ్మవారు, గంధమాధన పర్వతం, దర్భశయనం, ఆదిజగన్నాధమందిరం, దేవీపట్నం చూడాల్సినవే. దర్భశయనం, సముద్రుని సాయం కోరుతూ రాముడు శయనించిన స్థలం. ఇక్కడ చూడవలసిన మరో గొప్ప క్షేత్రం "ధనుష్కోటి". కోటినదుల సంగమమని త్యాగరాజస్వామి కీర్తించిన దివ్యక్షేత్రం.

కుంభకోణానికి దగ్గరలో తిరువన్నాపురం వుంది. ఈ ఊళ్ళో శౌరిరాజ పెరుమాళ్ళు ఆలయం వుంది. శౌరిరాజు పెరుమాళ్ అంటే ఎవరోకాదు. కేశవుడు దీర్ఘమైన శిరోజాలతో అందంగావుండే కృష్ణస్వామి విగ్రహం. పొడుగాటి ఈ దీర్ఘకేశాల గురించి ఒక కథ ప్రచారంలో వుంది. ఆ వూరినేలే రాజు ప్రతినిత్యం స్వామికి పూలదండలు పంపేవాడు. ఎందుకో ఒకరోజు స్వయంగా వెళ్ళి స్వామిని దర్శించాలనుకున్నాడు. రాజు పంపే దండలన్ని స్వామికి చేర్చకుండా మధ్యలో అమ్ముతుండేవాడు. ఇది తెలిసి రాజు నిజనిర్ధారణకు బయలుదేరాడు. ఈ విషయం ఆలయపూజారికి తెలిసి, ప్రస్తుతానికి ఆ గండం నుండి బయటపడటానికి భగవంతునిపై భారం వేసి ఓ పూలహారం తయారుచేయించి స్వామికి అలంకరించాడు. రాజు ఆనందించాడు కాని ఆ దండలో తలవెంట్రుక రావడంతో ఏమిటని పూజారిని గద్దిస్తాడు. సమాధానంగా ఇది స్వామివారి శిరోజమంటూ ఠక్కున అబద్ధంచెప్పేస్తాడు. ఆ క్షణానికి వూరుకున్నా, అనుమానంపోని ఆ చక్రవర్తి, ఆలయానికి వచ్చి, స్వామివారి విగ్రహాన్ని సుదీర్ఘంగా పరిశీలిస్తే, పొడుగాటి వెంట్రుకలు కనుపించాయి. చక్రవర్తి, సంతోషించి భక్తితో నమస్కరించాడు. అప్పటినుండి అందరు స్వామిని "శౌరిరాజ పెరుమాళ్ళు" అని పిలుస్తారు.

## నాగేశ్వర ఆలయం - నాగర్ కోయిల్



తమిళనాడులోని తిరుచందూరు దగ్గరలో గల మరొక పుణ్యక్షేత్రం నాగర్‌కోయల్. ఇక్కడ స్వామి నాగరాజస్వామి స్వయంభువు. ఇక్కడ ఆలయము నకు ఎదురుగా ఉన్న కొలనులో భక్తులు స్నానము చేసి నాగరాజస్వామిని దర్శించుకుంటారు. స్వామి వారి గర్భాలయంలో నీరు ఊరుతూ ఉంటుంది. దీనినే భక్తులకు తీర్థముగా ఇస్తారు. ఈ నీటి ఊట ఉన్న ప్రదేశంలోని ఇసుక సంవత్సరంలో సగ భాగము తెల్లగాను, సగభాగము నల్లగానూ ఉండుట ఈ క్షేత్రము యొక్క విశేషం.

**తిరుప్పరకుండ్రం :** ఇక్కడ స్వామి వారి పేరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రసిద్ధ సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రాలలో ఇది ఒకటి. 48 స్థంభాల ప్రాంగణం గల ఈ క్షేత్రం మధుర నుండి 9 కి.మీ. దూరంలో ఉంది.

**అళగర్‌కోయిల్ :** మధుర నుంచి 2 కి.మీ. దూరం ఈ విష్ణువు ఆలయం. కొండమీద ఉష్ణనీటి కుండం వుంది. ఇక్కడ కోతులు విశేషముగా ఉంటాయి. వీటికి భక్తులు తెచ్చుకున్న తినుబండారాలు వేస్తారు.

**తిరువణ్ణామలై :** శ్రీ వేంకటేశ్వరుని దివ్య మంగళ స్వరూపం గల ఆలయం శ్రీ విల్లిపుత్తూరుకు దగ్గర వుంది.

**గాంధీ మంటపం :** పురాతన కాలంనాటి భవనం, గాంధీగారి జ్ఞాపక చిహ్నాలున్నాయి. ప్రవేశం ఉదయం గం. 10.00 నుండి సాయంత్రం గం. 5.30 వరకూ ఉంటుంది.

## శ్రీరంగనాధస్వామి - శ్రీరంగం



తిరుచ్చి నుండి కేవలం 10 కి.మీ. దూరంలో ఉన్న శ్రీరంగపట్నం దేశంలోని విష్ణు ఆలయా లలో పెద్దది. ఇక్కడి స్వామి రంగనాధస్వామి. శ్రీరంగనాధుడు నిరంతర యోగ నిద్రలో ఉంటాడు. 14-17 శతాబ్దాలలో ఈ ఆలయ గోపురాల నిర్మాణం జరిగింది. 21 గోపురాలు గల ఈ గుడిని చోళులు, పాండ్యులు, విజయ నగర, నాయక, హొయసాల రాజులు అభివృద్ధి చేశారు. గుడిలో హిందువులకు మాత్రమే ప్రవేశమున్న ఈ స్వామికి తలనీలాలు ఇవ్వచ్చు. ఇక్కడ తీర్థ విధులు భక్తులు నిర్వర్తిస్తారు. ఈ క్షేత్రాన్ని నవగ్రహాలలో ఒకరైన 'శుక్ర' గ్రహక్షేత్రంగా చెబుతారు. ఈ క్షేత్రం ఇందలి ఆలయ శిల్పాలు, ప్రాకారాలు, దేనికదే సాటిఅన్నట్లు అనంతశిల్ప సంపద, కళాభితృష్ణతో పోటీపడుతున్నట్లు కనిపిస్తాయి.

శ్రీరంగపట్నానికి కలియుగ వైకుంఠమని పేరు. గుడికి ఎదురుగా చందన మంటపం ఉంది. ప్రతి సంవత్సరము రథయాత్ర జరిగే ఈ గుడిని చూడాలంటే పగలంతా సరిపోతుంది. పుష్యమాసంలో మాఘమాసంలో ఇక్కడ స్వామి వారికి ఉత్సవాలు జరుగుతాయి. ఇక్కడి దగ్గరలోనే ఉన్న నృసింహస్వామి దేవాలయం కూడా భక్తులు చూడవలసిన ప్రదేశము. క్రీ॥శ॥ 10వ శతాబ్దం వరకుగల సాహిత్యాత్మక ఆధారాలు లభించాయి. 12, 13, 14, 15 శతాబ్దాలలో ఆయా రాజులు, ఎన్నో ఆభరణాలు, మాన్యాలు స్వామికి సమర్పించిన శాసనాలు 350 పైదాకా లభించాయి. శ్రీమద్రామానుజులు శ్రీరంగ క్షేత్రం కేంద్రంగా దాదాపు 20 సంవత్సరాలు పాటు, తమ ధర్మప్రచారంగావించినట్లు తెలుస్తోంది. 100 వైష్ణవక్షేత్రాలతో (తిరుపతి) శ్రీరంగ క్షేత్రం సర్వత్రా శ్రేష్ఠమైనదని ప్రస్తుతిస్తారు.

## మధుర - మీనాక్షి దేవాలయం

దక్షిణాది క్షేత్రాలలో ప్రముఖ పుణ్యక్షేత్రము మధుర, సంస్కృతి సాంప్రదాయాలకు పెట్టింది పేరు అయిన ఈ క్షేత్రములో అమ్మవారి పేరు మీనాక్షి. కంచి కామాక్షి, మధుర మీనాక్షి, కాశీ విశాలక్షి, బెజవాడ కనకదుర్గమ్మలని తెలుగువారికి చిన్నతనం నుండి గుర్తుచేసే పేర్లు. ఈ మధుర తమిళనాడులో రెండవ పెద్ద పట్టణం. మధురై,



పురాతన, చారిత్రాత్మక పట్టణంగా కూడా పేరు గాంచినది. క్రీ.పూ. 6వ శతాబ్ధంలో నిర్మితమైన ఈ పట్టణము పాండ్యరాజుల రాజధానిగా కూడా చెబుతారు. తమిళం నేర్చుకునే వారికి మధురై పెద్ద పీఠంగా చెబుతారు. ప్రముఖమైన ఈ మీనాక్షి దేవాలయాన్ని పాండ్యరాజులు కట్టించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. 11 అంతస్తులు కలిగి తూర్పు ముఖద్వారము ఉన్న ఈ దేవాలయము ప్రక్కనే ఉన్న సుందరేశ్వర ఆలయం కూడా ప్రసిద్ధి చెందినది.

**సుందరేశ్వర దేవాలయం :** ఈ సుందరేశ్వర దేవాలయమునకు ముందు భాగములో ఉన్న మండపము 'కంపతడి' మండపము అని పిలువబడుతోంది. శివచరిత్ర ఈ దేవాలయ స్థంభములపై లిఖించబడిఉంటుంది. ఇక్కడ ఉన్న పద్మ సరోవరంలో నీరు త్రాగితే సరస్వతీదేవి కటాక్షిస్తుందని అంటారు. పూర్వం కవులు వ్రాసిన గ్రంధాలను ఈ సరోవరంలో వేసేవారని అవి తేలితే వాసిగలవని, మునిగితే రాసి ఉందిగాని వాసి లేనివని తేల్చేవారట !

## తిరుమల నాయకుని భవనం

టూరిజం డిపార్టుమెంటు వారు సౌండ్ లైట్ షోలు నిర్వహిస్తారు. ఇండోసార్సనిక శైలిలో నిర్మించారు. ఈ మహల్‌ని, దర్బారు మహలు, స్నానము గదులు గల దీనికి స్వర్గవిలాసమని పేరు కూడా. ప్రజలకు లోపలికి ప్రవేశం గం. 9.00 నుండి సాయంత్రం గం. 5.00 వరకు మధ్యలో రెండు గంటలు లంచ్ విరామం.

## అరవింద ఆశ్రమం - పాండిచ్చేరి



మద్రాసు నుండి బస్సులో సుమారు 3 గంటలు బస్సు ప్రయాణం లేదా రైలులో గాని ప్రయాణం చేస్తే పాండిచ్చేరి పట్టణం వస్తుంది. దేశ నలుమూలల నుండే గాక విదేశాల నుండి విశేషంగా విచ్చేస్తున్న యాత్రికులకు అరవింద ఆశ్రమము గురించి మాకు అందిన సమాచారం కొంత మీకు అందించగలుగు చున్నాము. పాండిచ్చేరి చేరిన అరివింద మహర్షి భక్తులు, విదేశి టూరిస్టులు ముందుగా పాండిచ్చేరిలోని అరవింద ఆశ్రమం బ్యూరోసెంటర్ చేరాలి. అక్కడ అరవింద ట్రస్టుకు చెందిన ముఖ్య సమాచార కేంద్రంలో మనకు కావలసిన భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాట్లు గురించి టోకెన్స్ తీసుకొనవలయును. ఈ సమాచారకేంద్రం నుండి సుమారు 2 ఫర్లాంగుల దూరంలో శ్రీ అరవింద సమాధి భక్తులను తన్మయులను చేస్తుంది. ప్రతి సంవత్సరం ఆగష్టు 15న అరవింద మహర్షి జన్మదిన మహోత్సవమునకు,

నవంబరు 24న మహర్షి వారు సిద్ధి పొందిన రోజున, ఫిబ్రవరి 21న మాత జన్మదినోత్సవము రోజున, డిసెంబరు 5న మహర్షి వారి మహాసమాధి రోజున, నవంబరు 17న మాత మహాసమాధి చెందిన రోజున దేశ విదేశాల నుండి భక్తులు పాండిచ్చేరి వచ్చేసి అరవింద మహర్షి వారి ఆశ్రమంలో ధ్యానములు చేస్తారు.

అరవింద మహర్షివారు పశ్చిమ బంగాల్ రాష్ట్రములో విష్ణుపూర్ గ్రామంలో కృష్ణధన్‌ఘోష్ దంపతులకు పుట్టిన పుణ్య పురుషులు. వీరు సుమారు 80 సంవత్సరాల క్రిందట పాండిచ్చేరిలోని వేదపురిలో (పూర్వము ఆగస్త్యాశ్రమము) ఆశ్రమం స్థాపించి తన బోధనలు వినిపించసాగారు. శ్రీ అరవింద మహర్షి తరువాత 'డివైన్ మదర్' గా పిలువబడే మాతాజి (మీరా అల్ఫాస్) స్వామి వారి భోదనలు ప్రచారం చేసేవారు. ఈ ఆశ్రమమునకు సుమారు 8 కి.మీ. దూరంలో 'ఆరోవిల్' (మాతృ మందిరం) కూడా భక్తులు దర్శించవచ్చును.

## చిదంబరం



చిత్తంబళం అని కూడా అంటారు. మద్రాసు నుండి 240 కి.మీ. తంజావూరు నుండి 106 కి.మీ.ల దూరం కలిగిన అతి పురాతన ఆలయం. శివుడు ప్రళయరుద్రతాండవం చేస్తున్న విగ్రహం అతిపెద్దది. నాలుగు గోపురాలతో గల నటరాజస్వామి ఆలయంలో నృత్య భంగిమలు వందపైనే ఉన్నాయి. ఆలయంలో, నృత్యమందిరం, వేయి స్థంభాల మంటపం పార్వతీదేవి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంతోపాటు మహావిష్ణువుకు అంకితమైన ఆలయం కూడా ఉంది.

ఈ చిదంబర క్షేత్రంలో మహావిష్ణువు ఆలయంలో, శివుడు, విష్ణువు కనపడతారు. వచ్చినవారి మనోభీష్టానికి వీలుగా పంచలింగాల్లో ఒకటైన ఆకాశలింగముంది. రాతితో చెక్కిన నంది, సువర్ణకోనేరు ఉంది. ఈ కోనేరులో స్నానం సర్వరోగనివారిణి అని భక్తుల నమ్మకం. సుబ్రహ్మణ్య ఆలయంలో స్వామి నెమలి విగ్రహం, వినాయకుని గుడిలో వినాయకుని విగ్రహం పెద్దది. దక్షిణాదిన పాలించిన పల్లవులు, చోళులు, పాండ్యులు, నాయకరాజులతోపాటు విజయనగర సామ్రాజ్యాధీశులు కూడా ఈ అతిపెద్ద పురాతన ఆలయం నిర్మాణానికి సారథులయ్యారు. ఇక్కడ అనేక దేవాలయాలు, స్మారక చిహ్నాలు కూడా మనం దర్శించవచ్చును.

## పాపనాశం

ఈ పాపనాశం ఆరునల్వేలి నుండి కొంతదూరంలో గల ఒక ఊరిలో ఉంటుంది. ఇక్కడి స్థల పురాణం చాలా వైవిధ్యంగా ఉంటుంది. ఒకప్పటి పాండ్యరాజు బౌద్ధమతం స్వీకరించి తన రాజ్యంలో కూడా అందరూ బౌద్ధమతాన్నే పాటించాలని ఆజ్ఞచేసి దానిని పాటించని వారిని నానారకాలుగా హింసించడం ఆరంభించాడు. అప్పుడు ఆ ఊరిలో ఉన్న శివభక్తుడొకడు ఈ హింసను భరించలేక ప్రక్కనున్న మరో రాష్ట్రానికి పారిపోగా దురదృష్టవశాత్తు అక్కడున్న రాష్ట్రంలో యుద్ధం వచ్చి ఆ శివభక్తుడు కూడా శతృబందీ అయ్యాడు. ఆ సమయంలో ఆ శివభక్తుని

ఇద్దరు పిల్లలైన ఒక పాప, ఒక బాబు, కూడా ఈ యుద్ధం వలన తప్పిపోతారు. అలా చాలా కాలం తర్వాత ఆ ఇద్దరు వేరు వేరుగా బెనారస్‌లో కలిసికొని, సోదర సోదరీలని తెలియక, ప్రేమించుకొని వివాహమాడతారు.

ఆ తర్వాత వారిది రక్తసంబంధం అని తెలిసికొని, ఈ పాప పరిహారం ఎలా అని విచారించగా, నల్లని వస్త్రాలు ధరించి, దేశంలో గల అన్ని పుణ్యనదుల్లోను స్నానమాచరిస్తే, ఎప్పుడు ఆ నల్ల వస్త్రం తెలుపురంగులో మారుతుందో అప్పుడే ప్రాయశ్చిత్తం జరిగినట్టని విని ఆ ప్రకారం దేశంలో గల పవిత్ర నదులన్నింటిలో స్నానమాచరిస్తున్నపుడు ఈ పాపనాశం అనే ప్రదేశంలో వారి నల్లని వస్త్రాలు తెల్లగా మారడంతో, వారి పాపానికి ప్రాయశ్చిత్తం జరిగిందని నమ్మకం. అందువలన ఇక్కడ ఆలయంలో పాపవినాశేశ్వర (పాపాలను పరిహరించెడివాడు) అనే దేవుడు పూజలందుకుంటున్నాడు.

## సాయిపురం

(దక్షిణ షిర్డీ) మద్రాసు నగరం పొలిమేరల్లో, పచ్చని ఆహ్లాదకర వాతావరణంలో వెలసి వుంటుంది. శ్రీ షిర్డిసాయి మందిరం ఇక్కడకు వెళ్తే, సాయిబాబా జీవితం గడిపిన, షిర్డీకి వెళ్ళినట్టుంటుంది. దుఃఖాలు, బాధలు, కష్టాలు అన్నింటినీ మరిచిపోయి సంతోషంతో వెనక్కి వస్తారని నమ్మకం.

ఒక భక్తుడు చెప్పినట్లు 'షిర్డీ మట్టిమీద కాలు మోపగానే వారి దుఃఖములు అంతమైపోతాయి' అని, ఆ ప్రకారమే జరుగుతుంది కూడా. ఈ సాయిపురం యొక్క అనుభవాన్ని ఎవరికి వారు అనుభవించాలి తప్ప వర్ణించడం సాధ్యం కాదు.

చల్లని సముద్రపు ఒడ్డున విశాలమైన 7 ఎకరాల విస్తీర్ణంలో ఇక్కడ బాబా ఆలయం కనిపిస్తుంది. ఈ చల్లని నిశబ్ద వాతావరణంలో స్వామి వారి ఆలయంలో ఎంతో మనశ్శాంతి మరెంతో అద్వితీయమైన భావన. అటు వెళ్ళిన భక్తులు తప్పక దర్శించదగ్గ ప్రదేశం ఈ సాయిపురం.

## కుంభకోణం



'ఆలయపురం' అని పిలువబడే కుంభకోణంలో వెలసిన కాశీ విశ్వనాధుని 12 ఏళ్ళకు ఒకసారి వచ్చే మహాయాగం అనే పండుగ ఉత్సవాల్లో చూసిన కన్నులు తరిస్తాయి. కుంభకోణంలో కుంభేశ్వర ఆలయం కోదండైకరుణం ఆలయం, నాగేశ్వర ఆలయం అనే ఈ 3 శివస్థలాలు, ఈ కుంభకోణంలో ఉండటం విశేషం. తమిళనాడులో గల 3 కాయరోహ స్థలాల్లో ఈ కుంభకోణం ఒకటి. మిగిలిన రెండు, కంచినకరుణం, నాగైక్కరుణం. ఇక్కడ నుండి దగ్గరలో గల రామస్వామి ఆలయం, వైష్ణవ దివ్యదేశం సారంగంపాణి ఆలయాలు కూడా దర్శనీయం.

ఇక్కడి కాశీవిశ్వనాధ ఆలయం రెండు ప్రాకారాలతో, 72 అడుగుల ఎత్తైన రాజగోపురంతో చూపరులను ఆకర్షిస్తుంది. ఇక్కడ 9 పవిత్ర నదీ దేవతామూర్తులను కూడా చూడవచ్చు.

## త్యాగరాజ ఆలయం

తిరువారూరులో వెలసిన త్యాగరాజ ఆలయం చాలా పురాతనమైనది మరియు 11/2 సహస్రాబ్ది కాలం పాటు ఉన్న తమిళ మత సంస్కృతిని అద్భుతంగా తెలియచేస్తూ ఉంటుంది. ఈ ఆలయం గురించి భారతదేశంలో చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. ఈ పురాతన విశాలమైన ఆలయం శతాబ్ధాల నాగరికతకు చిహ్నంగా మిగిలిపోయింది.

## కైలాసనాథ ఆలయం



కాంచీపురంలో గల కైలాస నాథ ఆలయం, కాంచీపురం బస్సుస్టేషన్‌కు పడమరగా కొద్ది దూరంలో వెలసి ఉంటుంది. ఈ ఊర్లో అతి పురాతన దేవాలయాల్లో ఈ కైలాసనాథ దేవాలయం ఒకటి. 8వ శతాబ్దంలో, పల్లవరాజుల్లో ఆఖరి రాజైన రాజసింహుడిచే నిర్మింపబడింది. ఈ శివాలయం చుట్టూ చిన్న చిన్న శివలింగాలున్నాయి. ఒకొక్కటి చక్కని శిల్ప నైపుణ్యంతో ఉంటుంది. మానవ జీవితపు ప్రారంభం, అంతం మొ॥ ఆధ్యాత్మిక విషయాలు బహు చక్కగా శిల్పాల రూపంలో కనువిందు చేస్తాయి.

## అరుణాచలేశ్వర ఆలయం



తమిళనాడులోని తిరువణ్ణామలై లోని ఈ అరుణాచలేశ్వర ఆలయం విల్లుపురం నుండి 63 కి.మీ. దూరంలో వుంది. ఈ తేజోలింగంగల అరుణాచల దేవాలయం. దక్షిణ భారతంలో చాల గొప్పది వెయ్యి స్తంభాల మంటపం, 'సింహ'మనే సింహ ద్వారం, 200 అడుగుల ఎత్తైన 'అంతస్తుల గోపురంతో పాటు నాలుగుదిక్కులకు నాల్గు పెద్ద గాలిగోపురాలున్నాయి. ఇందులో ఒకదానిని 1560 సం॥లో శ్రీకృష్ణదేవరాయలు కట్టించాడనే గొప్ప శైవక్షేత్రమిది. ఒకప్పుడు తన విశృంఖల రచనలతో వెర్రెత్తిపోయిన గుడిపాటి వెంకటాచలం, ఇక్కడికి వచ్చి 'ఇదేజీవిత'మని ఇక్కడ వుండిపోయాడు. అపరిమిత ప్రశాంతతను పొంది రమణా చలంగా మిగిలిపోయాడు. ఇక్కడ ప్రతివారు గిరిప్రదక్షిణం చేస్తారు. దీనివలన తమ కోరికలు నెరవేరుతాయనే భక్తిశ్రద్ధల విశ్వాసం వారిని గమ్యానికి చేరుస్తుంది. ప్రశాంతతను కోరేవారు చూసి శాంతిని పొందే దివ్యధామంగా ఈ క్షేత్రం వెలసి ఉంది. శివుని పంచభూతాల్లో ఒకటైన బంగారు లింగం (అగ్నిలింగం) చాలా పెద్ద విస్తీర్ణంలో ఉంటుంది (25 ఎకరాల్లో). భారతదేశంలోని అతిపెద్ద ఆలయాల్లో

ఈ అరుణాచలేశ్వర ఆలయం ఒకటి. తొమ్మిది పెద్ద శిఖరాలతో, పెద్ద ప్రాకారాలతో, అతిపెద్ద లింగాకారాలతో, వెయ్యి స్థంభాల మంటపంతో వెలసి వుంటుంది ఈ అరుణాచలేశ్వర ఆలయం.

ఇక్కడి విశేషం ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమినాడు వెలిగించే జ్వాలాదీపం. ఇక్కడి కొండెత్తు 2668 అడుగులు. ఆపైన పైకి 8 కి.మీ. నడవాలి. వెలిగించే వత్తి ఒక కి.మీ పొడుగు వుంటుంది. ఇందులో వెయ్యి కిలోల నెయ్యి పోసి వెల్గిస్తారు. ఇది పదకొండు రోజులపాటు జాజ్వల్యమానంగా వెలుగుతుంటుంది. ఓపికవున్నవాడు, ఓపగల్గినవాళ్ళు దీన్ని తప్పక చూడాలికదూ!

## కుర్తాళం

ఇక్కడి దేవుడు కుర్తాళేశ్వరుడు. అమ్మవారి పేరు "విరేణునరవాణి". టెంకాశికి 6 కి.మీ. దూరంలో వున్న దీనికి ప్రయాణ సౌకర్యాలు చాలావున్నాయి. ఇక్కడి చిత్రావతి నది అరవై అడుగుల ఎత్తునుండి క్రిందకు దుమికే దృశ్యం చూడఅద్భుతం. అలాగే ఎన్నో ఓషధీగుణాలున్నందువలన, ఇచ్చటి నీరు జిడ్డుగా వున్నా ఆరోగ్యప్రదాయినిగా తలుస్తారు.

## పళణి

తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మధురైకు 123 కి.మి. దూరంలో గల మరొక పుణ్యక్షేత్రము పళణి. ఇక్కడి స్వామివారి పేరు దండాయుధపాణి (కార్తీకేయుడు) ఎత్తైన కొండపై ఉన్న ఈ స్వామి వారి దేవాలయమునకు వెళ్లుటకు 'రోప్‌వే' మార్గము కూడా కలదు. దక్షిణాది రాష్ట్రములో పేరుగాంచిన సుబ్రహ్మణ్య దేవాలయములలో ఇది ఒక్కటి. ఈ క్షేత్రములో భక్తుల సౌకర్యము కొరకు దేవస్థాన సత్రములు, ప్రైవేటు వసతి గృహములు అందుబాటులో ఉంటాయి.



**స్థల పురాణం :** కొన్ని వేల సంవత్సరాల క్రితం శ్రీ భోగర్ అనే సిద్ధుడు తొమ్మిది రకాల ఔషధ మొక్కలు, ఖనిజాలతో నిర్మించినట్లు చెబుతారు. ఇక్కడ ఉన్న దండాయుధపాణి విగ్రహానికి నిత్యం పాలు, పంచామృతం, చందనంతో అభిషేకించి వాటిని భక్తులకు ప్రసాదంగా ఇస్తారు. ప్రతి రోజు రాత్రి స్వామి వారిపై చందనం అద్ది, మరుసటి రోజు ఉదయం భక్తులకు చందనం పంచుతారు. ఈ చందనం 'సర్వరోగాలు' హరిస్తుందని భక్తుల నమ్మకం. దక్షిణ భారతదేశంలోని "మధురై" జిల్లాలో ఉన్న "అరువడై వీడు" లలో ఫళణి చాల ముఖ్యమైన క్షేత్రము. ఈ స్వామికి "కార్తికేయా, కృత్తివాసా, శరవణభవ, గుహా, స్కందా, శూలపాణి, దండాయుధపాణి, వేల్, మురుగా, వల్లీదేవసేన సహిత కుమారా, శక్తిహస్తా.... అంటూ గిరిప్రదక్షిణలు చేసేవారికి సర్వదా ఆపద్బంధువే శరణాగతరక్షకుడే ఈ సుబ్రహ్మణ్యేశ్వరుడు.

-: సుబ్రహ్మణ్య ధ్యానము :-

శ్రీ గాంగేయం వహ్నిగర్భం శరవణ జనితం జ్ఞానశక్తిం కుమారం
బ్రహ్మణ్యం స్కందదేవం గుహ మమలగుణం, రుద్రతేజస్స్వరూపమ్,
సేనాన్యం తారకఘ్నం గురు మచలమతిం కార్తకేయం షడ్యాస్యం
సుబ్రహ్మణ్యం మయూరధ్వజ రథ సహితం దేవదేవం నమామి॥

## కాంచీపురం

మహాబలిపురానికి 64 కి.మీ. దూరం మద్రాసు నుండి 80 కి.మీ. దూరంలో గల ఈ మహిమన్వితమైన పుణ్యక్షేత్రమును "సిటీ ఆఫ్ థౌంజెండ్ టెంపుల్స్" అంటారు. శివకంచి, విష్ణు కంచి అను రెండు భాగాలుగా ఉన్న ఈ క్షేత్రములో ఆది శంకరాచార్యుల వారి కంచి కామకోటి పీఠం ఉంది. శివకంచి పెద్దది, విష్ణుకంచి చిన్నది. వరదరాజస్వామి దేవాలయంలో ఉన్న వెండి బల్లి, బంగారుబల్లి తాకిన వారిపై ఎప్పుడైనా బల్లి పడితే దోషము ఉండదని భక్తుల నమ్మకం.



అష్టాదశ శక్తి పీఠాలతో ఒకటైన కామాక్షి అమ్మవారు నరబలులు కోరడంతో ఆదిశంకరులు శ్రీ చక్రమును స్థాపించి ఆ తల్లిని శాంతించేలా చేశారు. అందువలనే ఆయన విగ్రహం ఆలయంలో ఉంటుంది. కామాక్షి దేవాలయానికి దగ్గరలోనే వామన దేవాలయం ముచ్చటగా ఉంటుంది.

ముగ్గురు మహారాజుల పాలనలో ఈ కాంచిపురం విష్ణుపురిలా శోభిల్లింది. కంచి అనగానే మహిళకు గుర్తుకు వచ్చేది కంచి పట్టుచీరలు. ఈ కంచి పట్టుచీరల దుకాణాలు అనేకం ఈ ప్రాంతములో ఉంటాయి. వరద రాజస్వామి దేవాలయంలో ఉన్న శతస్థంభ మండపములో రాతితో చేసిన గొలుసు ఉంది. వ్రేలాడుతున్న చక్కని శిల్పాలు యిక్కడ ప్రత్యేక ఆకర్షణ. ఓపిక వున్నవాళ్ళు తప్పక చూడవలసిన దివ్యక్షేత్రం. శిల్పకళాధామం.

### కాంచీపురంలో ముఖ్య ఉత్సవములు

| | | |
|---|---|---|
| వరదరాజస్వామి వారి బ్రహ్మోత్సవము | : | మే నెలలో |
| వరదరాజస్వామి వారి గరుడ సేవ | : | జూన్ నెలలో |
| కైలాసనాథ దేవాలయం - మహాశివరాత్రి | : | ఫిబ్రవరి నెలలో |
| కామాక్షి అమ్మవారి ఉత్సవము | : | ఫిబ్రవరి నెలలో |
| ఏకాంబరేశ్వర ఫల్గుణి ఉత్సవం | : | మార్చి - ఏప్రిల్ |

## కనువిందు చేసే కన్యాకుమారి



భారతదేశ పాదపద్మముల వలె ఉన్న కన్యా కుమారి పుణ్యక్షేత్రము సముద్ర అలలతో సదా పాదాభిషేకము చేస్తున్నట్లు ఉండే పవిత్ర స్థలము. సహజ సిద్ధమైన రాతి బండలు, ప్రశాంతమైన వాతావరణం కలిగి ఉన్న ఈ క్షేత్రము ఎటువంటి వారికైనా ఆనందాన్ని అనుభూతిని మిగల్చక తప్పదు. ఇక్కడ సూర్యోదయ, సూర్యాస్తమయాలు చూస్తే సూర్యుడు తిరుగుతున్నట్లు కదులుతున్నట్లు భ్రాంతి కలుగుతుంది. ఈ దృశ్యాలు చూడ వలసినవే కానీ, చెప్పవలసినవి కావు. నలు వైపులా ప్రాకారాలు ఉన్న ఈ పురాతన కన్యాకుమారి ఆలయాన్ని బలరాముడు, అర్జునుడు సందర్శించినట్లు మహాభారతంలో ఉంది. ద్వారము గుండా ప్రవేశమార్గం ఉండే ఈ ఆలయంలో దేవి తూర్పువైపున దర్శనమిస్తుంది.

భాద్రపద, వైశాఖ మాసములలో అత్యధిక భక్తులు ఇక్కడ జరిగే ఉత్సవములలో పాల్గొంటారు. ఇక్కడ ప్రకృతి సిద్ధముగా ఏర్పడిన బండరాళ్ల వలన సముద్ర అలల నుండి రక్షణ కలిగి, యాత్రికులు స్నానములు చేయుటకు వీలుకలిగి ఉన్నది. మూడు సముద్ర జలాలు కలియుచోటున 16 స్థంభముల రాతి మండపము చూడవలసిన స్థలము.

### కన్యాకుమారి పరిసరాలలో పర్యాటక ప్రదేశాలు

**నాగర్‌కోయిలు :** 19 కి.మీ. దూరంలో ఉంది.

**ఉదయగిరి :** మార్తండ రాజు కట్టించిన కోట కలదు. 34 కి.మీ. దూరంలో ఉంది.

## సుబ్రహ్మణ్యక్షేత్రాలు

తమిళనాట శిల్పసంపదకు, ఆలయాల నిర్మాణానికి ఎంతో ప్రాముఖ్యముంది. పేరుకు తమిళనాట... అన్నామేకాని, ఇది తెలుగునాడు... అనడంలో తప్పులేదు. ద్రవిడ సంస్కృతికి మూలకేంద్రం. ఇటువంటి తమిళనాట శివ, కేశవులు, గణపతి (పిళ్ళయ్యారు) స్కందుడు, జగదంబ, ఇవికాక నవగ్రహాలయాలు... ఎన్నో దర్శనమిస్తాయి.

హరిహరుల, ఆలయాలు తదుపరి చెప్పుకోదగ్గ ఆలయసంపత్తి కలవాడు 'స్కందు'డనే సుబ్రహ్మణ్యేశ్వరుడు. ద్రవిడ దేశమైన ఆంధ్రదేశంలో ఈ సుబ్రహ్మణ్యుని సర్పరూపంలో పూజిస్తే, ద్రవిడదేశమని చెప్పే తమిళనాట ఈ సుబ్రహ్మణ్యుని వివిధ నామాలతో పూజిస్తారు. అలాగే వివిధ స్వరూపాలతో విగ్రహరూపంతో అర్చించి ఆరాధిస్తున్నారు.

అటువంటి ఊర్లలో ...

మధురైకి 55 కి.మీ దూరంలో వున్న **"తిరుపురన్ కున్రమ్"** ఒకటి. ఇక్కడే స్వామి దేవసేనను వివాహం చేసుకున్నారుట. ఇచ్చటి విశేషం శివ, కేశవుల విగ్రహాలు ఎదురెదురుగా వుండటం.

రెండవది **తిరుచందూర్.** ఇక్కడ స్వామి విగ్రహం కూర్చునట్లు వుంటుంది.

మూడు **పళని** – మధురైకు 120 కి.మీ దూరంలో భక్తజనులచేత నిత్యనీరాజనాలందుకునే దివ్యక్షేత్రం.

నాల్గవది – కుంభకోణం సమీపంలోని స్వామి విగ్రహం. నయనమనోహరంగా భక్తజనుల నాకర్షించే దివ్యరూపం. దీనిని **'స్వామిమలై"** అంటారు. ఇక్కడే స్వామి తండ్రికి జ్ఞానోపదేశం చేసాడట.

అయిదు – తిరుపతి 60 కి.మీ దూరంలోని **తిరుత్తణి**. స్వామి ఇక్కడే వల్లీదేవిని వివాహం చేసుకున్నారు.

ఆరవది – తిరుత్తణి ఆలయంనుండి 12 కి.మీ దూరంలోవుంది. అడవిలో, ఎత్తయిన జలపాతాలతో, ఎంతో ఆహ్లాదకరంగా వుంటుంది. ప్రయాణ సదుపాయం, వుంది. అడవి ప్రాంతం కాబట్టి కోతులు ఎక్కువే.

## సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం - తిరుత్తణి



భారతదేశంలో విదేశ భక్తులను అధిక సంఖ్యలో ఆకర్షించే పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రములలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వెలసిన "తిరుత్తణి" ఒకటి. మద్రాసు - బొంబాయి రైలు మార్గములో అరక్కోణం 13 కి.మీ. దూరంలో మద్రాసుకు 84 కి.మీ. దూరంలో ఉన్న ఈ క్షేత్రమునకు దక్షిణంగా కంచి, పశ్చిమాన షొలింగర్, ఉత్తరమున తిరుపతి, కాళహస్తి, తూర్పున తిరువాలంగాడు (నటరాజస్వామి) ఉన్నాయి. చిన్న కొండపై ఉన్న ఈ తిరుత్తణి క్షేత్రములోని స్వామిని మురుగన్, చెంగల్రాయి, కుమారస్వామి, సుబ్రహ్మణ్యం మొదలగు పేర్లతో భక్తులు పిలుస్తారు. శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వల్లిని వివాహమాడి ఈ క్షేత్రమున నివసించుట వలన ఈ క్షేత్రము పుణ్యక్షేత్రము అయినదని భక్తుల నమ్మకం.

సముద్ర మథన సమయంలో మంధర పర్వతానికి చుట్టబడిన వాసుకి వచ్చి తిరుత్తణిలో వేంచేసియున్న మురుగన్‌ను సేవించగా తన శరీరానికి తగిలిన గాయాలు నయమైనట్లు పురాణాలు తెలుపుచున్నాయి. ఆలయ రూపురేఖలను బట్టి ఈ దేవాలయము పల్లవుల కాలంనాటిదని చరిత్రకారులు తెలుపుచున్నారు. స్వర్ణద్వారాలతో తిరుమలను పోలియున్న ఈ క్షేత్రము యొక్క గర్భగుడిలో ఆగ్నేయంగా వల్లి అమ్మవారు, ఈశాన్యంగా దేవసేన అమ్మవారి ఆలయాలు ఉన్నాయి. వెలుపలి ఆవరణలో ఉత్తరం వైపు ఉత్సవమూర్తులు ఉన్నాయి. ప్రతి సంవత్సరం జూలై, ఆగస్టు మాసములలో ఆడి కార్తికేయ ఉత్సవము, మార్గశిరమాసంలో సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు తిరుత్తణిలో

విశేషంగా జరుగుతాయి. ప్రతిరోజు వేలాది భక్తులు వచ్చే ఈ క్షేత్రములో కళ్యాణ మంటపములు, ధర్మశాలలు, కొండపైకి బస్సు మార్గము, మెట్ల మార్గము ఉన్నాయి. మద్రాసు, కంచి, తిరుపతి నుండి ప్రయాణ సౌకర్యములు కలవు.

## సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం - తిరుచందూరు



తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రములలో రామేశ్వరము నకు 205 కి.మీ. దూరంలో, కన్యాకుమారి వెళ్ళేదారిలో కన్యాకుమారికి దగ్గరగా ఈ తిరుచందూరు తిరునల్వేలికి 54 కి.మీ, ట్యుటికోరిన్‌కు దక్షిణంగా 38 కి.మీ దూరంలో ఉన్నది. సుమారు వేయి సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ సుబ్రహ్మణ్య దేవాలయం భక్తులు దర్శించదగ్గ స్థలము. సముద్ర తరంగాలు ఆలయాన్ని తాకే ఈ దేవాలయంలో స్వామి ఒక చేతిలో జపమాల మరో చేతిలో పుష్పమును ధరించి భక్తి మార్గమును బోధిస్తున్నట్లు ఉంటుంది. 24 బావులు ఉన్న ఈ దేవాలయంలో "నాలికణర్" అనే బావిలో నీరు తియ్యగా ఉంటాయి. మిగతా బావులలో నీరు ఉప్పుగా ఉంటుంది. భక్తులు ఇక్కడ కొబ్బరికాయ పీచు తీసి కొడతారు. ఇక్కడ మరో శివాలయం కూడా ఉన్నది. శ్రీ ఆదిశంకరులు సుబ్రహ్మణ్య భుజంగప్రయాతంలో వర్ణించినదీ స్వామినే, మూగవారికి మాటలు, చెవిటివారికి వినికిడి శక్తి, అంగవైకల్యంతో బాధపడేవారికి ఆయా అంగాలు వస్తాయన్నది భక్తుల విశ్వాసంకాదు, ప్రత్యక్షసాక్ష్యం. ఇచ్చటి దేవాలయ గర్భగృహం ఒక గుహలో వుంటుంది. దేవాలయ రెండవ ప్రాకారం కొండభాగంలో విష్ణుమూర్తి, గజలక్ష్మిల శిల్పాలు అందంగా వుంటాయి. ఇక్కడ విష్ణుమూర్తి ఆలయం కూడా వుంది. స్కందషష్టి ఇచ్చటి ప్రత్యేక ఉత్సవం.

## తిరువారూరు

తంజావూరు జిల్లాలోని "తిరువారూరు"లోని గుడిని పదిమైళ్ళ దూరంనుండే మనం చూడవచ్చును. 30 ఎకరాల ప్రాంతంలో ఆలయం. అంతే పరిమాణంలో కోనేరు, గుడి నాలుగువైపులా నాల్గు గోపురాలు, చోళరాజులకళాపోషణకు దీటుగా కనుపిస్తుంది. ఈ వూళ్ళోని కోనేరును 'కమలాలయ'మని పిలుస్తారు. ఇక్కడ త్యాగరాజస్వామివారి విగ్రహముంది. అనంతశయనుడైన శ్రీమహావిష్ణువు తైలవర్ణచిత్రం కూడా వుంది.

వేయి స్తంభాల మండపంగల తిరువారూరు నాగ పట్టణం తంజావూరుల మధ్య వుంది. స్వామివారు వల్మీకనాథుడు. ఈ శివక్షేత్రం వద్ద రెండు రోజులపాటు యాత్రసాగే అతి పెద్ద రథం ఊరేగింపుగా వెళ్తుంది. అచలేశ్వరుడు–కమలాంబికల ఆలయం కూడ ఉంది. ఇక్కడ త్యాగరాజస్వామివారి కోవెల కూడా ఉంది. కోనేరు 'కమలాలయం'లో స్నానం సర్వపాపహరం అని ప్రతీతి.

## తిరుకడవూరు

తంజావూరుకు 20 కి.మీ దూరంలోని తిరుకడవూరులోని ప్రాచీన కాలసంహారమూర్తిగా చెప్పే, మార్కండేయుని చిరంజీవిని చేసి యమధర్మరాజును శిక్షించిన "కాలసంహారమూర్తి" పాదాల క్రింద యమధర్మరాజు వుంటే, ఆ ప్రక్కనే మార్కండేయుడు శివుని ప్రార్థిస్తున్న దృశ్యాన్ని కూడ మనం తిలకించవచ్చును.

ఇక్కడి అమృతఘటేశ్వరాలయం, 1008 శంఖాల తీర్థంలో నూరు కాళ్ళ మంటపంతో కూడి వుంటుంది. కార్తీక మాసంలో శంఖాభిషేకములు జరుగుతాయి. దసరాలలో నవరాత్రి ఉత్సవం, చైత్రమాసంలో యమసంహారాలు, ఇక్కడి ప్రత్యేక ఉత్సవాలు.

## తిరుమనంజేరి

శివుని కల్యాణం జరిగిన ప్రదేశమిది. కుట్టాలం రైల్వే స్టేషనుకు 6 కి.మీ దూరంలో వుందీ క్షేత్రం. ఇక్కడి దేవత పేరు శ్రీకళ్యాణ సుందరేశ్వరస్వామి. పార్వతీదేవి అమ్మవారి చేతిని పట్టుకుని పాణిగ్రహణం చేస్తున్నట్లుందీ శిల్పం. ఈ ఆలయంలోని కోనేరును సప్తసాగరతీర్థ మంటారు. ఏడు సముద్రాల నదులు ఇందులో చేరివుంటాయన్నది భక్తజనుల విశ్వాసం. నూతన వధూవరులు తప్పకుండా దర్శించదగ్గ ప్రదేశం అని చెబుతారు. కారణం శివపార్వతుల కళ్యాణం ఇక్కడే జరగటం. వివాహంకానివారు, స్వామి దేవేరియైన 'కోకిలాంబాళ్'ను పూలదండతో అలంకరించి, పూజిస్తే, తమ పిల్లలకు పెండ్లిండ్లు అవుతాయనేది నమ్మకం. ఇక్కడ రాహు దశతో బాధపడేవారు రాహువును పూజించే సావకాశముంది. తిరుజ్ఞాన సంబంధర్, తిరునావుక్కరసు వంటి ద్రవిడ భక్తులెందరో స్వామిని స్తుతిస్తూ రచనలు చేసారు.

చోళరాణి చెంబియన్‌దేవి ఈ దేవాలయాన్ని పునరుద్ధరించినట్లు ఇచ్చట గల శాసనాలవలన తెలుస్తోంది. తమిళంలో 'తిరుమనం' అంటే కళ్యాణం అని అర్థం!

## బృహదీశ్వర ఆలయం - తంజావూరు



తమిళనాడు రాష్ట్రములోని తంజావూరు నగరంలో 1004 వ సంవత్సరంలో ప్రారంభించి సుమారు ఆరు సంవత్సరములు అహోరాత్రులు పనిచేసి కళాశోభతో నిర్మించిన దేవాలయం బృహదీశ్వర ఆలయం. కనువిందు చేస్తున్న ఆనాటి శిల్పకళ ఈ బృహదీశ్వర ఆలయంలో కనబడుతుంది. క్షేత్ర శిఖర దర్శనం పాపనాశనం అంటారు ఇక్కడకు విచ్చేస్తున్న భక్త సమూహము.

ఈ దేవాలయం శిఖరం నీడ భూమి మీద పడదు. ఆలయ గోపురంపై బంగారు పూత పూసిన ఈ శిఖరం నీడ

ఎంత ఎండకాస్తున్న, ఏ వేళలోనూ భూమి మీద పడదు. ఆనాటి వాస్తు శిల్పుల ప్రతిభ ఈనాటికి అంతుచిక్కని వింతే.

ద్రావిడ వాస్తు పద్ధతిలో నిర్మించిన ఈ బృహదీశ్వర ఆలయ ప్రాంగణం 152 మీటర్ల పొడవు. 76 మీటర్ల వెడల్పుతో సువిశాలంగా ఉంటుంది. ఆలయంలో 12 అడుగుల ఎత్తుగల శివలింగాకార బృహదీశ్వర స్వామి నిత్యపూజలతో శోభిల్లుతూ ఉంటాడు. "ఆడవల్లన్" అని పిలువబడే ఈ స్వామి ఆలయం 216 అడుగుల ఎత్తులో 14 అంతస్తులుగా నిర్మించి ఉంటుంది. 81 టన్నులు బరువుగల ఈ శిలాకలశాన్ని ఆనాడు గోపురం మీద ప్రతిష్టించడానికి సుమారు 6 కిలోమీటర్లు ఏటవాలుగా ఇసుక తిన్నెను ఏర్పరచి పెట్టినట్లు చెబుతున్నారు.

గర్భగుడిలోని స్వామికి ఎదురుగా ఉన్న నంది విగ్రహం భారతదేశంలో రెండవ పెద్ద నంది విగ్రహంగా పేరు గాంచినది. 12 అడుగుల ఎత్తు, 19 అడుగుల వెడల్పు ఉన్న ఈ నంది జీవకళ ఉట్టిపడుతూ భక్తులను విశేషంగా ఆకర్షిస్తూ ఉంటుంది. సుమారు 25 టన్నులు బరువు కలిగి ఉన్న ఈ నంది శిల్పకళా శోభకు పెట్టింది పేరుగా ఉంది.

తంజావూరులో వెలసిన ఈ బృహదీశ్వర ఆలయం 16వ శతాబ్దిలో నిర్మింపబడి, ఆ తర్వాత కాలములో చాలా మార్పులు చేర్పులు చేయబడింది. ఈ ఆలయ విమానం 200 అడుగుల ఎత్తుండి దక్షిణమేరు అని పిలువబడుతుంది, ఈ ఆలయ శిఖరం మొత్తం, 81 టన్నుల బరువు గల గ్రానైట్ మీద ఉంటుంది. ఈ గ్రానైట్ పలకను ఒక ప్రత్యేకంగా చేయబడిన రథం మీద 6 కి.మీ. దూరం నుండి బహు వ్యయ ప్రయాసలకోర్చి తేబడింది అంటారు. భారీ ఆకారపు నందులు ఈ శిఖరంలో దర్శనమిస్తాయి. వందలకొలది, శిల్పాలు ఈ విమానాన్ని మరింత అందంగా కనిపింపచేస్తాయి. ఈ ఆలయ ప్రాకారం చాల పెద్దదిగా ఉంటుంది. (500 అడుగులు / 250 అడుగులు) ఈ ఆలయ ప్రాకారపు గోడలు రాజరాజ చోళుని గుర్తు తెస్తుంటాయి. ఈ దేవాలయం దగ్గరలోనే గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం కూడా భక్తులు దర్శించదగిన పవిత్ర పుణ్యక్షేత్రము.

## మహాబలిపురం



'మామల్లపురం' అని పిలువబడే మహాబలిపురం ప్రశస్తి పొందిన పర్యాటక స్థలం. పల్లవరాజు మహేంద్రవర్మ మహాబలిపురం, దళవానూరు, మామండూరు, తిరుచిరాపల్లి మొ॥చోట్ల గుహాలయాలను నిర్మించారు. ఇది వారి కళాతృష్ణకు నిదర్శనం. 1200 సం॥కు పూర్వం పల్లవరాజుల నాటి కళారాధనకు, అసమాన నైపుణ్యానికి నిదర్శనం, పులిగుహ గాంభీర్యము, పంచపాండవులు, ద్రౌపది రథాల నిర్మాణ వైశిష్ట్యం చూడదగ్గవి. మద్రాసుకు 57 కి.మీ. దూరంలో

కాంచీపురానికి 65 కి.మీ. దూరంలో సముద్ర తీరములోవుంది. యిక్కడ పార్థుడు తప్పస్సు చేసిన ప్రదేశం, మహిషాసురమర్ధని గుహ, కృష్ణ-వరహా మంటపాల సముదాయం విదేశాల నుండి వచ్చే సందర్శకులకు కూడా నేత్రనందదాయకం. మహావిష్ణువు సంహరించిన మహాబలి అనే రాక్షసుడి పేరు మీదుగా పూర్వము ఈ ఊరు వెలసింది. అటు తర్వాత మామళ్ళ అనే మల్లయుద్ధ వీరుని స్మారకరూపంగా మారింది. ఈ మహాబలిపురంలో ప్రభుత్వ నిర్వహణలో శిల్పకళా శిక్షణా సంస్థలు, అదే మాదిరిగా పంచలోహ విగ్రహాల విక్రయశాలలు ఉన్నాయి.

ఏక శిలపై చెక్కిన ఐదు రాతి రథాలు, 14 దేవాలయాలు, నాలుగు వాహనాలు, మూడు రాతి మందిరాలు అందరికి కనువిందు చేస్తాయి. పంచపాండవుల రథాలలో ధర్మరాజు రథం పెద్దది. ద్రౌపది రథానికి ఎదురుగా ఏనుగు, సింహం, దుర్గ ప్రతిమలు, ధర్మరాజు, అర్జున రథాలకు పైన గోపురాలు ఉంటే, భీముని వాహనానికి పైన గోళాకారం, సహదేవుని వాహనం మీద త్రిశూల ఆకారం ఉంటాయి. ఇటువంటి ఆలయం భారతదేశానికే తలమానికంగా 1000 సం॥ల నాటి సంస్కృతికి చిహ్నంగా, సగర్వంగా ఇక్కడ దర్శనమిస్తుంది.

## రాక్‌ఫోర్టు



తిరుచిరాపల్లిలోని ఈ రాతికోట చెప్పుకోదగ్గది. ప్రశంసించదగ్గది కూడా. మధుర నాయక రాజులు నిర్మించిన కోట ఇది. ముఖ్యంగా విశ్వనాధనాయకుడు, నగరాభివృద్ధికి ఎంతో పాటుపడ్డాడు. రావణాసురుని సోదరుడు త్రిశిరునివలన మొదట్లో త్రిశరి, త్రిశరిపల్లి నుండి తిరుచిరాపల్లి అయింది. కోటక్రిందభాగంలో బ్రహాండమైన కొలనువుంది. కొండపైకి ఎక్కితే ఒక ప్రక్క నూరుకాళ్ళ మండపం, కొంతముందుకు వెడితే మాతృ భూతేశ్వరాలయము వున్నాయి. ఇచ్చటి శివుడు మాతృమూర్తిగా భక్తులను రక్షిస్తాడు.

## శుచీంద్రము



తమిళనాడు రాష్ట్రములోని కన్యాకుమారి నుండి నాగర్‌కోయిల్ వెళ్ళేదారిలోవుంది. ఇంద్రునికి పాపనివృత్తి చేసిన ప్రదేశము కాబట్టి శుచీంద్రమైంది. ఎనిమిది మైళ్ల దూరములో ఉన్న జ్ఞానారణ్య క్షేత్రమే శుచీంద్రము. అనసూయాదేవి పతివ్రతా ధర్మమును పరీక్షించేందుకు త్రిమూర్తులు భిక్ష అడగడానికి వచ్చి అనసూయ వివస్త్రగా భిక్ష పెడితేగాని అంగీకరించమని తెలుపుతారు. అప్పుడు అనసూయాదేవి తన పతివ్రతా ధర్మ మహిమచే త్రిమూర్తులను పసిబాలకులుగా చేసి భిక్ష పెట్టినట్లు పురాణగాధ చెబుతారు.

ఈ ఆలయమునకు ప్రతిదినము అర్ధరాత్రి దేవేంద్రుడు వచ్చి పూజచేస్తాడని ఇతిహాసములలో చెప్పబడుచున్నది. ఈ గుడి ప్రాకారములోనే పెద్ద ఆంజనేయ విగ్రహం ఉంది. ఇక్కడ ధనుర్మాసములోనూ, చైత్రమాసములోనూ, ఉత్సవములు జరుగుతూ ఉంటాయి. బహుపునీతమైన ఈ ఆలయంలో దేవుని దర్శించుకున్నవారు, ఈ స్థల పురాణము చదివిన వారు సద్గతి చెందుతారు.

దేవేంద్రుడు తపస్సు చేసి పాపవిముక్తుడైన ఈ దివ్య క్షేత్రములో స్థానేశ్వర దేవాలయం కూడా ఉంది. ఇక్కడ భక్తులు చొక్కాలు తీసి స్వామిని దర్శించుకోవాలి. ఇక్కడే అత్రి, అనసూయ తపస్సు చేసిన పుణ్యస్థలాలు ఉన్నాయి. త్రిమూర్తి దేవాలయముగా ఉన్న ఈ స్వామిని భక్తులు దర్శిస్తూ ఉంటారు. ఇది పవిత్రతకు ప్రాచీన ఆలయాలు, కట్టడాలకు, శిల్పసంపదకు పెట్టింది పేరుగా చెప్పుకోవాలి.

## పక్షితీర్థం



మహాబలిపురంనకు 26 కి.మీ. దూరంలోను కంచికి 65 కి.మీ. దూరంలోనూ, కొండమీద గల పుణ్యక్షేత్రమే పక్షి తీర్థము. వీనిని "తిరుక్కలికుంద్ర"మని తమిళసోదరులు పిలుస్తారు. ఇక్కడి స్వామి వేదగిరీశ్వరుడు. ఈ ఆలయానికి ఆనుకునివున్న చుక్కలమ్మ దేవాలయం కూడా భక్తులు దర్శించదగ్గ క్షేత్రము. ఇక్కడున్న తిన్నెమీదకు పురాతన కాలం నుంచి పది – పన్నెండు గంటలు మధ్య రెండు పక్షి రాజములు వచ్చి పూజారి ఇచ్చే ప్రసాదాన్ని స్వీకరించి తిరిగి వాటి గమ్యానికి వెళ్ళిపోతుంటాయి. ఈ మహాత్యము వలనే ఈ క్షేత్రానికి పక్షితీర్థమని పేరు వచ్చినది. ఈ పక్షులు ఎలా వస్తున్నాయో, ఎలా వెళుతున్నాయనేది భక్తులకు అంతు తెలియని రహస్యము. ఈ రెండు పక్షులు కాశీ నుంచి ఇక్కడకు వస్తుంటాయని ఇక్కడి వారు చెబు తుంటారు. ఈ కొండ దిగువన భక్తవత్సలేశ్వర దేవాలయం, త్రిపుర సుందరి దేవాలయాలు ఉన్నవి.

## వేదారణ్యం

సరస్వతీదేవి వీణా వాదనంలో పార్వతిచేతిలో ఓడిపోయిన ఈ ప్రదేశంలో శైవ క్షేత్రం వెలసింది, వేదాలు స్వామిని అర్చించిన ప్రదేశం కనుక వేదారణ్యమైనది. అమ్మవారిని వేదనాయకి అని వ్యవహరిస్తారు. పిశాచగణాల్ని పారద్రోలే వీరహట్టి వినాయకుని ఇక్కడ దర్శించవచ్చు! తంజావూరు జిల్లా మన్నారుగుడి నుండి 250 కి.మీ. దూరం అలాగే తిరుచిరాపల్లి ఎయిర్‌పోర్ట్ కూడా 50 కి.మీ.దూరంలో వుంది.

## శంకరనారాయణ్ కోయిల్

శివకేశవులకు తేడా లేదని చాటి చెప్పే క్షేత్రం ఇది, అమ్మవారు గోమతీదేవి ఇక్కడిస్వామి శంకర నారాయణుని స్వస్థత చేకూర్చే స్వామిగా అభివర్ణిస్తారు.... మతిస్థిమితంలేని రోగులకు, చర్మరోగులకు ఈ స్వామి దర్శనం వరప్రసాదమేనని నమ్ముతారు, ఇంకా ఇక్కడ షణ్ముఖ-నటరాజ ఆలయాలున్నాయి. సిరివిల్లి పుత్తూర్ నుంచి 42 కి.మీ. చెన్నయ్ నుంచి బస్సులున్నాయి.

## అళగర్ కోయిల్

అళగిరి స్వామిగా పేరుగాంచిన సుందరరాజ పెరుమాళ్ వెలసిన క్షేత్రం ఇది, ఇక్కడకు మధురై నుంచి 20 కి.మీ. బస్సులో చేరవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం వినాయకస్వామి ఎదుట చేసిన ప్రమాణాలు ఏవిధంగా చెల్లుతాయో, ఇక్కడ కూడా అదే విధంగా స్వామి ఎదుట చేసే ప్రమాణాలకు చాలా కేసుల్లో విలువ ఇస్తారు, అసత్యం ప్రమాణం చేస్తే స్వామి వారి అగ్రహానికి పాత్రులై నశిస్తారన్న భయం కూడా ఉంది. మధుర మీనాక్షిని ఈయన సోదరిగా భావిస్తారు, ఇక్కడ ప్రమాణాల నిమిత్తం సాక్షులు/కక్షిదార్లు ఫీజు చెల్లించవలసి వుంటుంది, స్వామి వారికి దోసెల నైవేద్యం చేస్తారు, స్వామివారు 3 భంగిమలలో దర్శనం ఇస్తారు.

## మధురాంతకం




కావేరీ నదికి ఏటేటా వచ్చే వరదలు ప్రాణాంతకంగా పరిణమించగా, ఒక ఆంగ్లేయ దొర ప్రార్థన మేరకు ఇక్కడ శ్రీరాముడు తన మహిమ చూపి వరద తగ్గించడంతో సీతాలక్ష్మణ సమేతుడైన శ్రీరామచంద్రమూర్తి ఇక్కడ కొలువైవున్నాడు. కాని ఆంజనేయస్వామి విగ్రహం మాత్రం ఉండదు. రావణవధ జరిగాక శ్రీరాముడు తన రాకను తెలియజేస్తూ భరతుని వద్దకు ఆంజనేయుని దూతగా పంపినందున ఇక్కడ హనుమద్విగ్రహం లేదంటారు.

## విదురిమలై

తిరుచ్చినుండి విదురిమలైకు బస్సులున్నాయి. ఇక్కడవున్నది సుబ్రహ్మణ్యేశ్వరుడు అరుణగిరినాధర్ అనే భక్తునికి స్వామి కలలో కనుపించి, తనను దర్శించమంటే కారడవులలో బయలుదేరివస్తూ, క్రూరమృగాలకు భయపడిపోతుంటే, మురుగన్ వేటగాడి వేషంలో అతనికి తోడుగా వుంటాడు. చొక్కనాధ మంటపంలో శివుడు, మీనాక్షి, గణేశుని విగ్రహాలున్నాయి.

గర్భగృహంలో స్వామి ఆరు ముఖాలతో, భార్యలు "వల్లీ - దేవసేన"లతో దర్శనమిస్తాడు. ఇది చూడదగ్గ ఆలయం. సేవించుకోదగ్గ దేవుడు.

## అలన్‌గుడి దక్షిణామూర్తి




ఆపద్బాంధవునిగా పేర్కొనే ఈ అలంగుడి కుంభకోణంకి 17 కి.మీ దూరంలో వుంది. ఇక్కడే క్షీరసాగర మధనంలో వచ్చిన హాలాహలాన్ని శివుడు మింగి, తనను ప్రస్తుతించే దేవదానవులకు బోధచెయ్యడం వలన ఈ స్వామిని ఆపద్బాంధవుడని, గురు దక్షిణామూర్తి అని పిలుస్తారు. గురువారం నాడు భక్తులు స్వామికి పసుపు పచ్చటి వస్త్రాలు, శనగలు సమర్పిస్తారు. నానబెట్టిన శనగల మాలను గురు (బృహస్పతి) దోషమున్నవారు స్వామికి సమర్పిస్తే విద్యార్థులు పరీక్షలలో విజయ మొందుతారు. గురు దోషము తొలగుతుంది.

ఇంకా 24 ప్రదక్షిణాలు చేసి, అన్నే దీపాలు వెలిగిస్తే సుఖశాంతులతో వుంటారని నమ్మకం. ఇటువంటి మరో ఆలయం తిరుపంతురైలోని శివసందేశ్వరకగుడి. ఇక్కడ శివునికి జ్ఞానబోధ చేస్తున్న కుమారస్వామిని కూడా చూడ వచ్చును. అలాగే పాల్ఘాట్ రోడ్డులోకూడా "శుకపురం" దక్షిణామూర్తి ఆలయం వుంది. చూడండి!!

## స్వామిమలై

గంగ, పార్వతి, అగ్ని, ఆరు (షష్ఠి) మాతృకల సంయుక్త స్వరూపం కార్తికేయుడు. ఇతడు తారకాసుర సంహారం చేసి, దేవతలను లోకాలను రక్షించాడు. కుమారస్వామికి – కుమారా, సుబ్రహ్మణ్య, షణ్ముఖ, ఆర్ముగ, కార్తికేయ, శరవణభవ, దండపాణి, శూలపాణి, కుక్కుటకేతన, వేల్, మురుగ... అనే అనేకపేర్లు వున్నాయి. ప్రణవనాదరహస్యం బ్రహ్మకు తెలియదంటూ, ఆ దివ్యతత్వాన్ని తండ్రికి తెలియచేసిన గణేశుడు (ఈయనను కుమారగురువని పిలుస్తారు) సోదరుడు ఈ చిట్టిగురువు. ఇది కుంభకోణానికి 6 కి.మీ దూరంలో వుంది.



ఈ సుబ్రహ్మణ్యస్వామి షణ్ముఖుడు కాబట్టి, ఈయనకు ప్రత్యేకించి ఆరుచోట్ల ప్రసిద్ధ ఆలయాలు వున్నాయి. ఇదేకాదు మధురకు 8 కి.మీ దూరంలోని "తిరుప్పరకుండ్రం" వున్న ఆలయం దేవయానిని పెండ్లాడిన ప్రదేశం. సూర్యపద్ముడనే రాక్షసుని స్వామి సంహరించిది కూడా ఇక్కడే. ఇందుకు గుర్తుకు "పయముదిర్‌చోలయం" అనే ఆలయాన్ని కూడా మనం చూడవచ్చును. అవ్వయారును స్వామి కరుణించిన ప్రదేశమిది.

## నామక్కల్లు

నల్లని రాళ్ళకు ప్రాణంపోసి, నిలబెట్టిన ఈ వూరు సేలం నుండి 47 కి.మీ దూరంలోని, కరూరు రైల్వే స్టేషనుకు 32 కి.మీ దూరంలో వుంది. పడమటి భాగంలో మూడు ఆలయాలు, తూర్పు భాగంలో రంగనాధస్వామి ఆలయాలున్నాయి. పల్లవుల కాలంనాటి అపూర్వ కట్టడాలుగా వీటిని చెప్పవచ్చును. "అదియేంద్రవిష్ణుగ్రహ"మని పిలిచే నరసింహస్వామి ఆలయం అదియమన్ నాయకునికి త్రవ్వకాలలో లభించింది. నామక్కల్లుకు 17 కి.మీ దూరంలోని బేలకురిచిలోని "కొల్లిమలై" పర్వతపాదం చెంత "మురుగన్" ఆలయం వుంది.

## దారాసురం

కుంభకోణానికి ఆగ్నేయంగా 6 కి.మీ దూరంలోవున్న ఆలయమిది. ఇప్పుడు కుంభకోణంలో కలిసి కుంభకోణమే అని చెప్పాల్సివుంది. ప్రతి పదేసి నిముషములకు ఈ ఆలయాలను చూడటానికి బస్సు, ఆటోల సౌకర్యం వుంది. ఫర్లాంగు పొడవు, అంతే వెడల్పు గల ప్రదేశంలో ఇచ్చట ఆలయాల సముదాయ ముంది.

ఒకప్పుడు పెద్దకోట గోడంత ప్రాకారముండేది. కాలక్రమంలో జరిగిన దాడులలో ప్రాకారంలోని చాలా భాగము గోపురాదులు శిధిలమయ్యాయి. ఇచ్చటి అమ్మవారి ఆలయము, అయ్యవారి ఆలయము విడివిడిగా వున్నాయి. క్రీ.శ. 1146 నుండి 1173 వరకు చోళసామ్రాజ్యాన్ని పాలించిన రెండవ రాజరాజు దీనిని కట్టించాడు.

తంజావూరు, గంగైకొండ చోళపురంలో వున్నవి ఆ పద్ధతిలోనే నిర్మాతమయ్యాయి. అయ్యవారి ఆలయాలు కళాకృతులు, శిల్పతనం దేనికదే గొప్ప తప్ప ఒకదానితో మరొకటి కలిసినట్లు పోలిక కనబడదు.

ప్రతి క్షణము చూడాలనే ఆసక్తి, అనుక్షణం ఆనందించాలనే భావన, చూసే ప్రతి శిల్పము పలుకరిస్తున్నట్లు పులకరింపు. అలాగ చూస్తూంటే ఇలాగ కాళ్ళను కట్టేసి, చూడాలని మనలను ప్రతిష్ఠించినట్లయిపోతాము.

నిలదీసే ఆ శిల్ప చాతుర్యము అడుగడుగున కనిపిస్తుంది. అంగుళం అంగుళం చూడమంటుంది. వీటి వర్ణనం, వివరించి చెప్పడం దుస్సాహసంగా తలవాలి. ప్రత్యక్షంగా దర్శించి పొందే ఆనందం, వినడంలో, చెప్పడంలో వుండదు. కనుక ఇటువంటి దివ్యమైన శిల్పసంపదకు, కేంద్రమైనట్లు ప్రకాశించే ఆలయాలను పరిసరాలను దర్శించగల్గడం మహా,మహా అదృష్టమనే చెప్పాలి.

## శిర్కాళి - వైదీశ్వరన్ కోవె(యి)ల

ఇది చిదంబరానికి, కుంభకోణానికి మధ్యనున్న ప్రాంతం. ఇంకా చెప్పాలంటే 'మాయవరం – చిదంబరా నికి మధ్యవుంది. సాధారణంగా 'కుంభకోణం, మాయ వరం, చిదంబరం" శివాలయాల గురించి చిత్రంగా చెబుతారు. శిర్కుళి, వైదీశ్వరనులు చిదంబరం – మాయా వరాల మధ్య వుంది.

వైదీశ్వరన్ కోవెల చెప్పుకోతగ్గ పుణ్యక్షేత్రం. ఉత్తర తమిళులకు ఆరాధ్యనీయం. ఎవరికే విధమైన జబ్బు చేసినా ఇక్కడికివచ్చి స్వామి నారాధిస్తే ఆవ్యాధి నశిస్తుం దన్నది ప్రతీతి. వూరు చిన్నదే, కానీ దేవాలయం, దాని ప్రాముఖ్యత ఎంతో ఘనమైంది.



ఇక్కడనే సీతాదేవిని రావణుడెత్తుకు పోతుంటే, ఎదిరించిన జటాయువు మరణించిన ప్రదేశమని, రాముడు అంత్యక్రియలు జరిపించాడని చెబుతూ ఒక స్థలాన్ని చూపుతారు. ఇప్పుడిప్పుడే 'నాడీగ్రంథ' జ్యోతిష్కుల పుణ్యమాఅని, ఈ వూరు కాస్త ప్రచారంలోకి వచ్చింది.

శీర్కాళి – వైదీశ్వరన్ కోవెల మధ్య దూరం అయిదు మైళ్ళు. అయినా బస్సు సౌకర్యము బాగా వుంది. రైలు సౌకర్యం వుంది. ఇదేమంత పెద్ద వూరు కాదుకానీ ఇచ్చటి శివుని, అమ్మవారిని సేవిస్తే ఎంతటి మందబుద్ధయినా జ్ఞానవంతుడౌతాడనీ, ఎక్కువమంది ఇక్కడికి వచ్చి అమ్మవారిని, అయ్యవారిని సేవిస్తూంటారు. ఇందుకొక ప్రాచీనగాధ కూడా చెబుతారు. ఏడిచే పిల్లవానికి పార్వతీదేవి పాలుఇస్తే, ఆతడు ఆకలి పోగొట్టుకోవడమేకాదు, తక్షణం జ్ఞానవంతుడై, పదహారేళ్ళ వయస్సులో ఆరువేల కీర్తనలు వ్రాసాడుట. అతడే తిరుజ్ఞానసంబంధర్.

అందుకని ప్రతిఒక్కరు ఈ వూరును సందర్శించి జ్ఞానవంతులు కావాలని తలుస్తారు. ఆ విధంగా ఈ శీర్కాళి పేరు పొందింది. నిజానికి శీర్కాళి, వైదీశ్వరన్ దర్శనీయమేకాదు, దరిచేర్చగల పుణ్యధామమనికూడా చెప్పాల్సివస్తుంది.

దేవత దివ్యజ్ఞానంతో, దివ్యత్వం పొందడానికి వీలుగా వ్రాసిన ఆ సంబంధర్ గీతాలు అద్భుతమని, వాటికవే సాటిగా విమర్శకులు సైతం ప్రస్తుతిస్తారు. అంతటి దివ్యధామమీ వైదీశ్వరన్ కోవెల.

## కుంభకోణం

ప్రాచీన వ్యాపారకేంద్రమేకాదు, అనేక ఆలయాల సమాహారంగా వున్న తీర్థయాత్రాకేంద్రం కూడా. ఈ వూళ్ళో 12 శివాలయాలు, నాలుగు విష్ణ్వాలయాలు, అపురూపమైన బ్రహ్మ దేవాలయం వున్నాయి. పట్టణ మధ్యభాగంలోని సారంగపాణి (విష్ణు) దేవాలయం చెప్పుకోదగ్గది. అలాగే కుంభేశ్వరస్వామి ఆలయం మరువలేనట్టిది. దీనికి సమీపంలోని రామస్వామి ఆలయం ఏకరాతి స్తంభాలపై దశావతారాలు, రామాయణ కథలు చెక్కిన తీరు హర్షించతగ్గది.



మంత్రాలయ రాఘవేంద్రుల పూర్వగురువుల ఆశ్రమం ఇక్కడే వుంది. ఇక్కడనుండే ఆధ్యాత్మిక కిరణాలు లోకానికి అందాయి. అవి శ్రీరాఘవేంద్రులై మనలను కరుణించాయి. ఇక శివాలయా లలో అత్యంత ప్రాచీనమైనది కుంభేశ్వరాలయం. ఒకానొక సమయంలో శివుడు బాణం వేస్తాడు. అది అమృతకుంభానికి తగిలి, కొన్ని అమృతచుక్కలు పడ్డాయి. అదే కుంభకోణం. దీనికి కాశీవిశ్వనాధాలయమనే పేరుకూడా వుంది. ఇచ్చటి నటరాజమండపం పెద్దపెద్ద రాతి చక్రాలతో ఒక రథంవలె కనబడుతుంది. ఇచ్చటి ఆలయాలన్నీ చారిత్రక, శిల్పనిర్మాణ, అపూర్వ కట్టడాలని చెప్పక తప్పదు.

సూర్యుడు అధినాయకుడిగా, నవగ్రహాలు ఆయనను చూస్తున్నట్లు నిర్మించిన

అపురూప ఆలయమిది. ఇక్కడ సూర్యచంద్రాదులు ప్రతిష్ఠించిన వినాయకుని కూడా మనం దర్శించవచ్చును. ఇది కుంభకోణానికి సమీపంలోగల ఆలయం. కుంభకోణానికి 60 కి.మీ. దూరంలో కొన్ని ప్రముఖ క్షేత్రాలున్నాయి. ప్రస్తుత 'సూర్యనార్ కోవెల' కుంభకోణం, తిరుమంగళక్కుడి మధ్య వుంది.

ఇది కుళోత్తుంగచోలుడు నిర్మించిన అద్భుత శిల్పకళాఖండంగా చెప్పవచ్చును. ఇక్కడి ప్రాణనాథేశ్వరుడు అమ్మ మంగళాంబికను, సూర్యచంద్రులు, వినాయకుని ప్రతిష్ఠించి, వారితోపాటు ఈ పార్వతీపుత్రుని పూజించి తరించారుట.గ్రహదోషాలతో బాధపడేవారితోపాటు, గ్రహానుగ్రహం కూడా కోరుకునేవారు దర్శించదగ్గ, అపురూప శిల్పసంపదతోకూడిన దివ్య తపోక్షేత్రంగా తలచి, దర్శించ ప్రయత్నించండి!

కుంభకోణమనే సరికి అక్కడివారు ఇక్కడ 500 పైగా చిన్నా, పెద్దా దేవాలయాలున్నాయంటారు. వాళ్ళనడంకాదు పచ్చినిజం. ఎటుచూసినా, చిన్న (గూడులాంటిదో) పెద్దో మరోరకంగానో దేవుడున్నాగూడు కనిపిస్తుంది. ఎవరు ఆ దేవుడు అంటే – వినాయకుడు, ఆర్ముగం, అమ్మ, శివుడు... మరెవ్వరైనా కావచ్చును. ఇటువంటి ఆలయాల నిలయంలో వున్నా అపురూప ఆలయాలు వాటిలోని శిల్పకళ, నిర్మాణకౌశలం మెచ్చుకునే స్తోమత, అర్హత మనకులేదు. కాబట్టి చేతులెత్తి నమస్కరించగల్గడం మనభాగ్యంగా తలవాల్సివుంటుంది. తప్పదు, నిజంకూడా!

ఇక్కడి ఆలయాలు అపురూప కళాఖండాలనడంలో ఆశ్చర్యం అణుమాత్రం కనబడదు. ఇప్పుడు పెద్దపెద్ద పట్టణాలు, నగరాలుగా చెప్పే ప్రతి ప్రాంతం విడివిడిగా వుండటంతో మరో రూపాంతరంగా వుండటం జరిగేది. అటువంటి పరమపవిత్ర పుణ్యప్రదేశాలలో మధ్వ యతీంద్రులు, మానవాళి సంరక్షకులు శ్రీరాఘవేంద్ర యతీంద్రుల శ్రీగురువుల సమాధి (బృందావనం) చూసుకుని వస్తుంటే అత్యంతాకర్షణీయంగా శ్రీచక్రపాణి దేవాలయం కనుపిస్తుంది. తూర్పు, పడమర ద్వారాలతోవున్న అతి పెద్ద ప్రముఖ వైష్ణవ క్షేత్ర దేవాలయంగా చక్రపాణి ఆలయాన్ని చెప్పవచ్చును. ఇక్కడి ఆలయాలలో కొన్నింటికి ఉత్తరాయణ, దక్షిణాయణ ద్వారాలుండటమొక విశేషం.

ఆగమోక్తంగా అర్చనాదులందుకున్న శ్రీవినాయకుడు, పంచముఖాంజనేయుడు, విజయవల్లి లు నిజంగా చూడదగ్గ ముఖ్యమైన దేవతామూర్తులు. ఇక్కడి చక్రపాణికి ఇరువైపుల 'విజయవల్లి, సుదర్శనవల్లి' లతో కలిసి వుండటాన్ని మనం కనులారా చూడవచ్చును. ఇంకా ఈ కుంభకోణంలో ఏం చూడాలంటే అడుగడుగున కనుపించే అందరు దర్శనీయులే. ఆరాధనామూర్తులే. కాకపోతే లోకానికి తెలిసిన శ్రీఆదికుంభేశ్వర, మహేశ్వర, బ్రహ్మాలయం, శ్రీరామస్వామి, కాశీవిశ్వేశ్వర (ఇక్కడి చంద్రపుష్కరణి శ్రీచంద్రశిఖరేశ్వరుని ప్రతిగా తెలుపుతారు), శ్రీసోమేశ్వర, సారంగపాణి, వనపురేశ్వర, వీరభద్ర, శ్రీవిజయేంద్రమఠం, వీరశైవమఠం, మునేశ్వరామందిరం, నరనారాయణ (దశావతార)మందిరం, శ్రీహయగ్రీవ ఆలయం, ఇవి కొన్ని ఇంకా ....

**హనుమాన్ ఆలయం :** ఇది చూడవలసిన క్షేత్రం. సాధారణంగా శనైశ్చరుడు హనుమ, వినాయక, శివభక్తులను పీడించడనేది దైవవచనం. ఇది ఆయా దేవతలకు శనిమహరాజుకు మధ్య గల ఒప్పందమనండి, ప్రేమాభిమానాలు, కరుణ అనండి, మొత్తానికి ఆయా భక్తులు శనిదేవుని సంపూర్ణ కరుణకు పాత్రులయ్యారు. అయితే, ఇక్కడి హనుమాన్ దేవాలయాన్ని దర్శించిన వారికి శనిదోషప్రభావముండదేయుండదట. ఆంజనేయుని ఆశీస్సులు, శనిదేవుని కరుణపొంది, ఆయా దోషపీడితులు దోషవిముక్తులౌతారు. ఇందుకుగల చరిత్ర కథనమొకసారి తెలుసుకోండి.

లక్ష్మణుని మూర్ఛనుండి రక్షించడానికి హనుమ సంజీవని పర్వతానికై బయలుదేరుతాడు. అతన్ని అడ్డమని రావణుడు త్రిలోకాధినేతగా శనిని శాసిస్తాడు. విధిలేక రావణుని ఆదేశం శిరసావహించి హనుమ నడ్డగిస్తాడు. దీంతో కోపమొచ్చిన హనుమ శనిని ఒక పాదంతో అణగద్రొక్కినట్లు కాలుకదుపుతాడు. హనుమ వీరవిక్రమ ధాటిని ఎదుర్కోలేని శని శరణాగతుడౌతాడు. అందుకు శని తలొగ్గుతాడు. అప్పుడు ఆంజనేయుడు ఆతనిని విడిచిపెట్టేసరికి, హనుమ బంధం నుండి బయటపడతాడు. ఆదృశ్యం మనం చూడలేదు. కానీ ఇక్కడి ఆలయం మాత్రం అదే. ఇక్కడి స్వామిని దర్శించిన వారికి ఎటువంటి బాధలువుండవు. శని అనుగ్రహం పొందగల్గుతారు.

నరనారాయణంలో మనం దశావతారాలను చక్కగా దర్శించగల్గుతాము. ఇక్కడి మరో ఆలయం 'బ్రహ్మాలయం' గా పిలువబడుతోంది. కాని ఇందులో శ్రీమహావిష్ణువు అవతారమైన 'వేదనారాయణు'డు కనబడతాడు.

కుంభకోణమనేసరికి ఆలయగోపురాలు గుర్తుకు రావడం కాదు. కళ్ళలో కనుపిస్తాయి. అవేమిటి? అంటే మాత్రం ఆలోచించాలి. ఇక పరిసరాలలో అందరి దేవతల వలె నవగ్రహాలకు ప్రత్యేక ఆలయాలు, ఒకరితో మరొకరికి సంబంధంలేకుండా వున్నాయి. ఇలాగ విడివిడిగా ఆలయాలున్న నవగ్రహదేవతామూర్తులను ప్రత్యేకంగా ఇక్కడే చూడగల్గుతాము.

కొన్ని ... అంటే ఎన్ని? అనకండి. కొన్ని ఆలయాలు అంగరంగవైభోగంతో, చక్కగా నడుస్తుంటే, కొన్ని ఆలయంగా ప్రకటించుకుని బ్రతకాలికాబట్టి బ్రతుకుతున్నట్లుంటాయి. మరికొన్ని ఆలనాపాలనాలేని దయనీయస్థితిలో, అన్యాక్రాంతమైన ఆస్తులతో వుంటే, మరికొన్ని దుర్భరంగా ... చెప్పలేని దౌర్భాగ్యాన్ని, దరిద్రాన్ని అనుభవిస్తున్నాయి.

ఈ పట్టణం మొత్తానికి చెప్పుకోదగ్గ అపురూప అద్భుత శిల్పఖండం. వళ్ళంతా కళ్ళు చేసుకుని చూడదగ్గ అపురూప ఆలయం ఇప్పటి కుంభకోణ అంతర్భాగమైన 'దారాసురం'. దీనిని గురించి ఎంతచెప్పినా ఇంకా తక్కువే, ప్రపంచపుటలలోకి ఎక్కి విదేశీయులను సాదరంగా ఆహ్వానించే ఒక అపురూప కళాఖండం – ఈ 'దారాసుర ఆలయం'. చరిత్రలోని మన వునికి స్థితి, పాత్రకు నిలువెత్తు సాక్ష్యమిది. నీరాజనాలు పట్టదగ్గ నిండు కొలువున్నది. తలతిప్పలేని తన్మయత్వం కల్గిస్తూ అంగుళం, అంగుళం అనంతశిల్పకళామతల్లికి వెలలేని ఆభరణంగా కీర్తికిరీటంగా పులకింప దివ్యదర్పణంగా చెప్పాల్సివుంటుంది. ఆ పెద్దపెద్ద మండపాలు, అడుగడుగున అద్భుత నగిషీల పనితనం, వీటినుండి నేర్చుకోవాలనేటంత అద్భుత పనితనంతో కూడిన దివ్యధామం దారాసురం.

విదేశీయులు పొందే ఆశ్చర్య, ఆనందాలముందు మనల్ని కేవలమొక దిష్టిబొమ్మలుగానే తలచుకోవాలి. ఆ శిల్పకళాఖండాలను ఎలాగో పరిరక్షించుకోవడంరాని మనం, దాని ఘనతనైనా కనీసం ఘనంగా చెప్పుకోగల్గితే మన జన్మ ధన్యమైందనుకోవాల్సి వస్తుంది. ఇక మిగిలిన ఆలయాలను చూద్దాం.

**ఆదికుంభేశ్వరాలయం :** 16వ శతాబ్దంలో అచ్యుతనాయకుల మంత్రి శ్రీగోవిందదీక్షితులవారు పురుద్ధరించారు. వీరిని గురించి మనం గురుదేవులు శ్రీవోరుగంటి రామకృష్ణప్రసాద్ రచించిన సర్వభారతీయ భాషలలో ఏకైక నిత్యపారాయణగ్రంథం. శ్రీసద్గురు రాఘవేంద్రస్వామి చరిత్రలో చూడవచ్చును.

ఎంత చెప్పుకున్నా, ఇంకా చెప్పుకోగల చరిత్ర కలవూరు కుంభకోణం. అంత చారిత్రకం అంత పౌరాణికం. అంతా శిల్పకళామయం. ఇక్కడికి 15 కి.మీ దూరంలోని "తిరుచరై" లోని సారనాథ ఆలయం 2000 సం॥ల నాటి

చరిత్ర కల్గివున్నదంటే ఈ ప్రాంతం ఎంత విశిష్టమైనదో తెలుసుకోవచ్చును.

ఇంకా ఇక్కడికి 30 కీ.మీ దూరంలోని శ్రీసరస్వతీ ఆలయం అపురూపమైనదేకాదు దర్శించదగ్గది.

రామస్వామి ఆలయంలో హనుమంతుడు వీణ వాయించడమొక విశేషం. అలాగే చక్రపాణి ఆలయంలో బిల్వాలతో విష్ణుపూజ చెప్పుకోదగ్గది. కాశీవిశ్వేశ్వరాలయంలో నదీమతల్లులకు సాకారరూపం. ఒకరుకాదు ఇద్దరుకాదు, తొమ్మిదిమందికి అర్చనలు జరుపడమొక అపురూపమైతే, ఈ స్వామిని పరమశివభక్తుడు, రావణబ్రహ్మ ఆరాధించడమొక చరిత్రచెప్పే సాక్ష్యం.

**ఇతర దర్శనీయాలు :**

**తంజావూరు బృహదీశ్వరాలయం** – తలచుకుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. శ్రీరంగం రంగనాథుడు పలువిశాలమైన ప్రాకారాతో ప్రతి ప్రాకారమొక రక్షగా స్వామిని తలచుకునేటట్లు చేస్తుంది. శరీరమెల్లా పులకిస్తుంది. రాజరాజనరేంద్రుడు తన బలదర్పాలతో ఈ బృహదీశ్వరాలయాన్ని నిర్మించాడు. ఇటువంటి దానిని మనం ఎక్కడా చూడలేము. ఇక్కడి నంది లేపాక్షి తరువాత ఇదే చెప్పుకోదగ్గది. ఇదొక పెద్దకోట. ఈ ఆలయాన్ని చూస్తే ఇప్పుడు చెప్పే శాస్త్రసాంకేతిక విజ్ఞానం అమలులోలేని ఆ రోజులలో ఇంతటి మహాకట్టడమెలాగ కట్టారన్నది అంతుపట్టని పరమరహస్యం. ఆలోచనకందని ప్రశ్న. రాజరాజచోళుడు ఏనుగులతో గంగాజలం తెప్పించి, రామేశ్వరునికి అభిషేకం చేసేవాడుట.

పలుమంటపాలతో, అద్భుతశిల్పాలతో ప్రకాశిస్తూ, గర్భాలయములోని శివలింగం 16 అడుగుల ఎత్తు, 20 అడుగుల కైవారంతో నర్మదాశిలతో రూపొందించబడి, ఏనుగులతో ఇక్కడకు తెప్పించబడిందిట. ఇక విమాన శిఖరం పధ్నాలుగు అంతస్థులతో, 216 అ॥ ఎత్తులో ప్రపంచంలో అత్యంత ఎత్తైనదిగా విరాజిల్లుతుంది. యునెస్కో వారు దీనిని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించారు. ప్రధానాలయం వెనుక నైఋతిమూలలో విఘ్నేశ్వరుడు, ఈశాన్యంలో నటరాజమూర్తి ఆలయమున్నాయి. ముందుగల నందీశ్వరునికి సమానాంతరంగా బృహదీశ్వరుని రాణి 'బృహన్నాయకి' అమ్మవారి ఆలయముంది. బ్రహదీశ్వరునికి ఆనుకుని కుమారస్వామి, ఉత్తరాన 'శివగంగ'వనం చెప్పుకోదగ్గవి. ఆలయశిఖర 13వ అంతస్తు అంతా 108 భరతనాట్యభంగిమలతో నాట్యశాస్త్రాన్ని ఔసోసన పట్టినట్లు కనిపిస్తుంది. ఆగ్నేయంలోని రెండు విఘ్నేశ్వరాలయాలతో ఒకదానిని మీటితే రాతిమోత, మరొకటి కంచుమోత నిస్తాయి. ఇక్కడ 252 శివలింగాలు, అద్భుతశిల్ప సంపద, కళ్ళు ఆర్పలేని నగిషీలతో నరనరాలను ఆనందముద్రల నింపుతుంది.



**తిరుమనంచేరి** లోని **"కళ్యాణసుందర"** **ఆలయంలో** పార్వతీపరమేశ్వరులు పాణిగ్రహణం చేస్తున్న ట్లుంటుంది. వివాహాలుకానివారు ఇక్కడికి వచ్చి, కల్యాణ సుందరుని, కోకిలాంబను కనుక అర్చిస్తే, అతి త్వరలో వివాహమౌతుందిట. ఇది తంజావూరు జిల్లాలోని కుట్టాలం రైల్వేస్టేషనుకు 6 కి.మీ దూరంలోవున్న క్షేత్రం.

ఇంకా తమిళనాడులో, ముఖ్యంగా **కుంభకోణం**లో చూదగ్గవి **శ్వేతగణపతి ఆలయం,** పాలసముద్రాన్ని మథిస్తే ఆ నురుగునుండి ఉద్భవించిన స్వామి ఈ శ్వేతగణపతి.

మార్కండేయ క్షేత్రంగా 108 దివ్యాక్షేత్రాలలో ఒకటిగా చెప్పబడే **తిరునాగేశ్వరానికి,** కి.మీ దూరంలోగల **ఒప్పిలియప్పన్ ఆలయం.** ఇక్కడ భూదేవిలేకుండా స్వామివారి ఉత్సవవిగ్రహాన్ని కదిలించరు. దీని విమానశిఖరాన్ని 'సుధానంద'మని, మార్కండేయునికి ఇచ్చట భూదేవి తులసివనంలో కనిపించినందువలన, ఈ ప్రాంతాన్ని 'తులసివనమని గూడా పిలుస్తారు. ఇక్కడి పుష్కరిణిలో కాలభేదంలేకుండా ఎప్పుడు స్నానం చెయ్యవచ్చును. ఇక పురాణకథనం ప్రకారం ఉప్పులేకుండా పండ్లు, కాయలు తినే మునికి ఆశ్రమం ముందర ఒక బాలిక కనుపిస్తే ఆమెను పెంచి పెద్దచేసి, వయస్సు వచ్చినామెకు తగిన వరుడిని వెదకడం ప్రారంభించాడు. భూదేవి అని పిలచుకునే ఆమెను ఒకనాడొక వృద్ధుడు వివాహం చేసుకుంటానని వస్తాడు. ఆ వచ్చిన వ్యక్తి శ్రీమన్నారాయణునిగా



తలంచి 'ఉప్పులేని చప్పిడికూడు తినే ఆశ్రమంపిల్ల ఆమె' అని చెప్పి వారిరువురికి వివాహం చేస్తాడు. 'ఉప్పు ఇల్లే అప్పా' అనేది 'ఒప్పిలియప్ప' ఆలయమైంది. ఇక్కడి దేవుని లవణంలేని వేంకటేశ్వరుడని పిలుస్తారు. ఇక్కడి దేవి 'భూదేవి.'

**శ్రీరంగం శ్రీరంగక్షేత్రం.** ఏడు ప్రాకారాలు, 21 గోపురాలు 24 మంటపాలతో విరాజిల్లే దివ్యక్షేత్రం. తిరుచ్చి రైల్వేస్టేషనుకు 12 కి.మీ దూరంలో, ఉభయకావేరీ నదులమధ్య విరాజిల్లే అత్యంత పురాతన క్షేత్ర మీ శ్రీరంగం. 156 ఎకరాలలో విస్తరించిన ఈ దివ్యక్షేత్రం, ప్రపంచములోనే అతిగొప్పది. ఇది బ్రహ్మనుండి ఇక్ష్వాకులకు, వారినుండి శ్రీరామునిద్వారా, విభీషణుని కోరికమేరకు విభీషణునికి అందుతుంది. కాని కాలమహిమగా అది లంకకు చేరక, ఈ శ్రీరంగములోనే ఉండిపోతుంది. ఇక్కడి ఆలయశిఖరం 'ఓం'కార రూపంలో కనబడుతుంది. దీనిని బయటికి వరండా వంటి మంటపంలో ప్రత్యేక ప్రదేశంలో నిల్చొని చూస్తే ఈ విచిత్రాన్ని దర్శించగల్గుతాము. మొత్తం 250 ఎకరాలలో కట్టిన అత్యంత ప్రముఖ, పెద్ద విష్ణ్వాలయం ఇది. శేషశయనుడైన మూర్తి స్వామికి కుడివైపున రంగనాయకి (లక్ష్మి) అమ్మవారు వుంటారు. ఈ శ్రీరంగక్షేత్రం తీర్థ, మూర్తి, క్షేత్రంగా విశిష్ఠమైనది. దీనిని శుక్రక్షేత్రంగాకూడా చెబుతారు. ఇక్కడి 9 తీర్థాలుండి ఎక్కడిక్కడి పవిత్రత ఇక్కడే ప్రకటించబడింది. వీటిలోచంద్రపుష్కరిణి ఆలయప్రాంగణంలోను, మిగిలినవి ఆలయానికి నలుదిక్కులా కొద్దిదూరంలోవున్నాయి.

**తిరువైయూరుకు** 3 కి.మీ దూరంలో **'తంజమామణిక్కోయిల్'** వుంది. ఇక్కడ 'తంజ' అనే రాక్షసిని సంహరించడంవలన దానిపేరుతో ఈ ప్రాంతం 'తంజావూరు' అయింది. 108 దివ్యక్షేత్రాలలో దీని నొకటిగా చెబుతారు. దివ్యక్షేత్రాలలో రెండు ఆలయాలున్నాయి. ఒకటి పరాశరమహర్షికి దర్శనమిచ్చిన నీలమేఘపెరుమాళ్ ఆలయం, రెండవది మార్కండేయ మహర్షి ఆనాడు దర్శనమొసగిన శ్రీనరసింహస్వామి. ఇక్కడి దేవేరులను శెంగమలపల్లి తాయార్ అని, తంజనాయకిగా పిలిచి ఆరాధిస్తారు. ఇక్కడి దేవతలను ఆళ్వారులు పూజించి, కీర్తించి తరించారు.

**తిరుచిరాపల్లిలోని రాక్‌పోర్టు దేవాలయం** మధురనాయకులు నిర్మించారు. చోళ, పల్లవరాజులు ఈ ప్రాంతాన్ని పాలించిన మధురనాయకులే ఈ ప్రాంత అభివృద్ధికి వారి హయాములో ఎంతో కృషి చేసారు. కొండకు దక్షిణానగల

కొండపైన తొలచిన సహజ పార్వతీదేవి ఆలయం, నూరుకాళ్ళమంటపం, నూరుస్తంభాల శివాలయం, కొండ చివరన మాతృభూతేశ్వర దేవాలయాలు చూడదగ్గవి. గోపుర నిర్మాణం బంగారంతోను, 1919లో నిర్మించిన గంటస్తంభం చూడాల్సినవి. కొండపైన వినాయకుని దేవాలయముంది. ఈ దేవుడే రాముడు, విభీషణునికొసగిన శ్రీరంగ విమానం లంకకు చేరకుండా చేసినవాడు. దీనికి కుపితుడైన విభీషణుడు వినాయకుని కొట్టాడని, ఆ విగ్రహం కాస్త భయంకరంగా వుంటుంది.


కుంభకోణానికి 16 కీ.మీ దూరంలో **"తిరువెళ్ళియన్ గుడి"** అను క్షేత్రము 108 దివ్యాలయాలలో ఒకటి. ఇక్కడ బ్రహ్మతీర్థం, శుక్రపుష్కరిణి, శోభనవిమానంతో శృంగారసుందరుడనబడే కోలవల్‌విల్లిరామన్ ఆలయం చూడదగ్గది. అమ్మవారి పేరు 'మరకతవల్లి అమ్మ' ఇక్కడి గరుడుడు శంఖుచక్రాలతో దర్శనమివ్వడమొక విశేషం. మార్కండేయుని ఆదేశంతో యముడు నిర్మించిన దీనిని ఇంద్రుడు పునరుద్ధరించినట్లు స్థలపురాణం చెబుతోంది. ఆనాడు ఇంద్ర, శుక్ర, బ్రహ్మ, పరాశర మహర్షులకు స్వామి దర్శనం ప్రసాదించినట్లు చెబుతారు.



తిరుచిరాపల్లికి 5 కి.మీ దూరంలో **"తిరువేనక్కావల్" జంబుకేశ్వరాలయానికి** ప్రసిద్ధి. పంచభూతాత్మకుడైన పరమేశ్వరుడు ఇక్కడ జలరూపంలో ఆవిర్భవించాడు. పంచభూతక్షేత్రాలలో దీనిని రెండవదానిగా చెబుతారు. ఐదు ప్రాకారాల దివ్యాలయంలోని 5వ ప్రాకారం ఒకసిద్ధుని చేత కట్టబడింది. ఆ సిద్ధుడు పరమేశ్వరుడని, ఆతడు కూలిగా ఇచ్చిన విభూతి, బంగారమై పనివారిని కరుణించిందని చెబుతారు. ఒకసారి మాటలమధ్యలో శివుని, పార్వతి పరిహరిస్తుంది. అందుకు కోపించిన శివుడు, తనవద్దనుండి వెళ్ళిపోతాడు. అప్పుడామె ప్రస్తుతం జంబూద్వీపాన్ని చేరి కావేరినదీ నీటితో లింగం తయారుచేసుకొని, పరమేశ్వరునికై తపస్సు ప్రారంభించింది. ఆ తర్వాత ఆమె పట్టుకున్న నదీజలం శివలింగమయ్యేసరికి తాను అందులో లీనమౌతుంది.

జంబురుషి శివుని ఆదేశం మేరకు జంబూవనానికి రావడం, అక్కడ తపస్సు చేసుకోవడం, ఈ సమయంలో పార్వతి అక్కడికి వచ్చి తను ఆత్మశక్తితో తయారుచేసుకున్న జలలింగం, నేరేడుచెట్టు మొదట్లో పెట్టి తపస్సు చేసుకుంటుంది. అది జంబు మహర్షి తలనుండి మొలిచిన జంబువృక్షం. ఒకసారి ప్రతినిత్యం దర్శనానికి వెళ్ళే మహర్షి ఆనాడు జంబూఫలాన్ని శివుని దర్శించి నివేదనగా ఇస్తే, ఆ ఫలం తిని ఆ గింజను వూయడం, అది జండూమహర్షికి లభించడం, దానిని శివప్రసాదంగా తలచి తినడం, తన తలనుండి నేరేడు చెట్టు మొలవడం, అంతా చిత్రమౌతుంది. ఇప్పుడా చెట్టు శివుని వరంవలన, పార్వతిపెట్టిన జలలింగం వలన మోక్షమొందుతాడు. ఆ దివ్యక్షేత్రం ఈ జంబూకేశ్వరం. ఇక్కడి అమ్మవారి పేరు అఖిలాండేశ్వరి. ఇక్కడి పూజారి ఉదయం 11 గం॥లకు చీరజాకెట్టుతో అచ్చం ఆ పార్వతీవలె స్వామిని అర్చిస్తాడు. ఇక్కడి జలకంఠేశ్వరుడు, నిరంతరం తన లింగంనుండి జలాన్ని ఊరింపచేస్తున్నాడు.

**నంగనల్లూరు హయగ్రీవుడు.** విష్ణుమూర్తి అవతారాలలో ఒకడైన హయగ్రీవుడు లక్ష్మీప్రదుడు. అనంతభాగ్యరాశి. ఇక కంచిలోకి వెడితే అది ఆలయాల నిలయం. విష్ణుకంచిలో వరదరాజస్వామి చూడవలసింది. ఇక్కడి బల్లి మరింత విశిష్టమైంది.



ఇక **కంచి వరదరాజును** కృతయుగంలో బ్రహ్మ, త్రేతాయుగంలో గజేంద్రుడు, ద్వాపరంలో బృహస్పతి, ఈ కలియుగంలో శేషుడు పూజించారని చెబుతారు. ఎత్తైన విగ్రహం చెప్పుకోదగ్గది. దేశంలోని అత్యంత ఎత్తైన విగ్రహాలలో దీనిని రెండవదానిగా చెప్పవచ్చును. ఇక ఆలయ నిర్మాణానికి వస్తే రెండంతస్తులలో వుండే ఆలయం శిల్పకళా నైపుణ్యానికి మచ్చుతునక. ఇక్కడి రాతి గొలుసులు చెప్పుకోదగ్గవి, చూడదగ్గవి కూడా. ఎన్నో ఉపాలయాలతో కన్నులనానందపరిచే ఈ దివ్యాలయదర్శనం నిజానికెంతో నయనానందకరమో, ఆలయప్రాంగణంలోని ఆనందసరోవరం, బంగారు తామరతటాకాలు విశేష ప్రాధాన్యం కలవి.

ప్రతి 40 సంవత్సరాలకు కోనేరులోని అత్తి చెక్కతో చెయ్యబడిన స్వామి వారి విగ్రహం బయటకు తీసి 40 రోజులపాటు స్వామి దర్శనాన్ని ప్రసాదిస్తారు. ఇక్కడ బంగారు, వెండి బల్లులు, ఆప్రక్కనే సూర్యచంద్రులు వున్నారు. ఈ బల్లిని ముట్టుకున్నవార్ని ముట్టుకుంటే బల్లి దోషం పోతుందిట. వరదరాజస్వామి ఆలయం క్రిందిభాగాన నరసింహస్వామి ఆలయముంది. ఇక్కడి స్వామికి వెయ్యి కాళ్ళమంటపం వుంది. చోళరాజులు నిర్మించిన దీనిని, అనంతరకాలంలో శ్రీకృష్ణదేవరాయలు తనభక్తికొద్ది ఎన్నో మెరుగులు దిదాడు. ఇక్కడి 600 పైగా శాసనాలు వివిధ కాలాలలో ఆయా రాజులిచ్చిన మాన్యాల వివరాలు తెలియబరుస్తున్నాయి. ఇంకో విషయం అర్థశాస్త్రవేత్త కౌటిల్యుని జన్మస్థలం కూడా ఇదేనట.

**శివకంచి :** శివకంచిలో **ఏకాంబరేశ్వరుని ఆలయం** చెప్పుకోదగ్గ ఆలయం. ఒక మామిడి చెట్టు క్రింద వెలియడంలో స్వామికీ పేరు వచ్చింది. చుట్టు నాల్గు గోపురాలతో, 1008 శివలింగాలు, వెయ్యి స్తంభాల కళామంటపం చూడాలి. పంచభూతాత్మకుడైన శివుడు ఇక్కడ పృథ్వీలింగంగా వెలిశాడు. ఇందుకో కథవుంది. ఒకప్పుడు కైలాసంలో పార్వతిపరమేశ్వరులు పాచికలాట ఆడుతుంటే, శివుడు ఓడిపోతాడు. పార్వతి వెక్కిరిస్తుంది. 'పురుషశ్చ విద్మహే...” అనే శివుడు, పార్వతిని కురూపివి కమ్మని శపిస్తాడు. జరిగిన పొరపాటుకు పార్వతి క్షమించమంటుంది. అప్పుడు పార్వతి ఒకేఒక్క మామిడిపండు కాచే చెట్టువద్ద మట్టితో లింగంచేసి శివుని పూజిస్తుంది. ఈమెను పరీక్షించదలచిన శివుడు గంగను విడిచిపెడతాడు. దాంతో ఆ పృథ్విలింగాన్ని గట్టిగా పట్టుకుని పార్వతి తన భక్తిని ప్రకటించుకుంటుంది. శివుడు సంతోషించి, ఆమెకురూపితనాన్ని పోగొడతాడు.

ఇక్కడి తల్లిని కామాక్షి అంటారు. విష్ణువును వామనమూర్తిగా పూజిస్తారు. ఇది 108 దివ్యతిరుపతులలో ఒకటిగా శ్రీమహావిష్ణువు ఆలయంవుంది. శివుడు మామిడిచెట్టువద్దే వున్నాడు. పార్వతి పూజించిన శివమహాలింగానికి నిత్యం తైలాభిషేకం జరుగుతుంది. ఇక్కడి కామాక్షి ఆలయం చూడదగ్గది. మొదట్లో ఇక్కడి అమ్మవారు ఉగ్రస్వరూపిణి. ఆదిశంకరులు ఈ తల్లిని ప్రసన్నం చేసుకుని 'నా అనుమతి లేకుండా నువ్వు బయటికి వెళ్ళరాదని చెప్పి ఆతల్లి

ఎదురుగా యంత్రప్రతిష్ఠ జరిపి దిగ్బంధనం చేసారుట. అందుకేనేమో అమ్మవార్ని బయటకు తీసుకురావాలంటే ముందు ఆలయం వెనుకగల శంకరుల ఆలయానికి తీసుకువెళ్ళి అటునుండి ఆయన అనుమతి లభించినట్లు వూరేగింపు చేస్తారు. ఈ తల్లికి దగ్గర్లో అపురూపలక్ష్మీ ఆలయం కూడా చెప్పుకోదగ్గది.

కంచికామాక్షి, మధుర మీనాక్షి కాశీవిశాలాక్షి, బెజవాడ కనకదుర్గ లోకమెరిగిన దేవతలు. భక్తజనప్రియులు, సంరక్షకులు. వీరంతా మొదట్లో ఉగ్రులు, మాంసాహారం తీసుకునే బలికోరే మహాబలులు. శంకరుల పుణ్యమా అని ఈ ఉగ్రమూర్తులు, శాంతమూర్తులు, భక్తజనసంరక్షకులయ్యారు.




**కంచిలోని చిత్రగుప్తుడి ఆలయం,** క్రొత్తదా? పాతదా అంటే మధ్యయుగంవంటిదౌతుంది. ఇక స్థలపురాణానికి వస్తే యముడు, బ్రహ్మగార్ని సమీపించి, ఈ పాపపుణ్యాల లెక్కల్ని సరిగ్గా చెప్పగల ఒక గణకుడిని ప్రసాదించమని అడిగితే, కాలక్రమంలో నీ తండ్రి సూర్యదేవుడు నీ అభిలాష నెరవేరుస్తాడంటారు. ఆ క్రమంలో ఓ సమయంలో ఇంద్రధనస్సును చూసి పరవశిస్తే అది స్త్రీగా మారడం, ఆమెకు సూర్యపుత్రునిగా చిత్రగుప్తుడు పుట్టడం జరుగుతుంది. పుడుతూనే ఆతని చేతిలో పుస్తకం, గంటం రేఖలు కనుపిస్తాయి. ఆ తర్వాత వయస్సువచ్చిన చిత్రగుప్తుడు మయబ్రహ్మ కుమార్తె ప్రభావతిని, మనుబ్రహ్మ కుమార్తె నీలావతిని, విశ్వబ్రహ్మకుమార్తె కర్ణికాదేవిని వివాహమాడతాడు. ఇప్పుడు పంచలోహాల కర్ణికాదేవి సమేత చిత్రగుప్తుని విగ్రహం ఆలయంలో వుంది. 1910లో జరిగిన త్రవ్వకాలలో లభించిన ఈ విగ్రహం ప్రతిష్ఠించబడింది. పున్నమినాడు చిత్రగుప్తుని పూజకు ఎందరెందరో వస్తుంటారు.



**కాంచీపురంలో 'శ్రీఉలగళంద పెరుమాళ్'గా** పిలువబడే వామన మూర్తి ఆలయంవుంది. 108 దివ్యతిరుపతులలో దీనిని ఒకటిగా చెబుతారు. అయిదు అంతస్తుల గాలిగోపురంతో, విష్ణువు విశ్వరూపం దర్శింపచేసే ఈ ఆలయం పల్లవులు నిర్మించినట్లు తెలుస్తోంది. పాదాల వద్ద శ్రీదేవి భూదేవిలు వుంటారు. పుష్యమాసంలో ఇక్కడ బ్రహ్మోత్సవాలు అంగరంగవైభోగంగా జరుగుతాయి.

తిరుచ్చినుండి 4 కి.మీ దూరంలో **'ఉరైయూరు'**, అక్కడ **'నాచ్చియారుకోవెల'** చెప్పుకోదగ్గవి. స్వామి సేవలో ఒక కోడి, ఏనుగు పోటీపడి చివరకు కోడి జయిస్తుంది. దాంతో వూరిపేరు 'కోలియూరు' అవుతుంది. ఇక అమ్మవారు 'రాసలక్ష్మి' ఈమెను 'ఉరైయూరు వల్లినాచ్చియార్' అంటారు. ఈమె రంగనాథుని వివాహమాడింది. మీన మాసంలో జరిగే శ్రీరంగంలో జరిగే బ్రహ్మోత్సవాల సమయంలో శ్రీరంగనాథుడు ఇక్కడికి వచ్చి, వాసలక్ష్మితో ఏకాంతవాసం చేస్తాడు. శ్రీస్వామిని, ఈ లీలను ఆళ్వార్లు ఆనందంగా కీర్తించారు.




కంచికి 20 కి.మీ దూరంలో **'మాంగాడు'** అనేగ్రామంలో అలనాటి **'కామాక్షిదేవి ఆలయ'** ముంది. ఇక్కడే ఆ తల్లి పరమశివుని గూర్చి తపస్సు చేసి తరించింది. భక్తులను తరింపచేస్తుంది. ఇక్కడే ఆదిశంకరులు అర్ధమేరును ప్రతిష్ట చేసారు. ఇక్కడి కామాక్షి తపోమూర్తి, పంచాగ్నుల మధ్య నిల్చుని పంచభూతేశ్వరుని కరుణను పొందిన దివ్యప్రదేశం. మాంగాడు అంటే మామిడితోట. ఇక్కడి తల్లి, అక్కడి కంచి లోని ఏకామ్రేశ్వరుని వివాహం చేసకుందని చెబుతారు. మాంగాడు లోని శ్రీచక్రం వనమూలికలతో చేసింది కనుక, కుంకుమార్చనలు తప్ప మరే పూజలు చెయ్యరు. అమ్మవారి శక్తి, తపోశక్తినీ, ఆదిశంకరులు, శ్రీచక్రంలో నిక్షిప్తంచేసిన దివ్యప్రదేశమిది.

కాంచీపురం జిల్లా మధురాంతకంలోని **'ఏరిక్కాత్త రామాలయం'** నిర్మించింది బ్రిటిష్ దొరయైన, రామునిచే ప్రభావితం చెయ్యబడిన ఆలయం. ఇచ్చటి విశేషం. ఆలయం కట్టడానికి ముందు ఇక్కడ 10 చ.మైళ్ళ విస్తీర్ణ చెవురువుండి, వర్షాకాలంలో పొంగిపొరలుతూ, వూరిని ముంచేస్తుంటే 'కల్నల్ బ్లేస్'అనే బ్రిటిష్‌దొర, నిజంగా రాముడు దేవుడు, మానవోత్తముడైతే, ఈ ఉపద్రవంనుండి వూరు రక్షింపబడితే తాను ఆలయనిర్మాణం చేస్తానంటాడు. అంతే శ్రీరామకృపతో ఆ ప్రాంతం రక్షింపబడి, రామాలయ నిర్మాణం జరుగుతుంది.ఇక్కడే విభాండక మహర్షి ఆలయముందని, రాముడు రావణాసంహారానికి ముందు, ఆ తదుపరికూడా ఇక్కడికి వచ్చి మహర్షి దర్శనం చేసుకున్నాడని, అందుకనే హనుమంతుని విగ్రహం అక్కడలేదని, పైగా సీతాదేవికి చేయూత నొసగి పుష్పకవిమానం నుంచి దిగి, మహర్షిని చూపించే దిశలో సీతాదేవి విగ్రహముందని, ఆంజనేయుని విగ్రహం ఆ తరువాతికాలంలో చెఱువుఒడ్డున ప్రతిష్ఠించారని చెబుతారు.

**ఆదికేశవపెరుమాళ్, పెరంబుదూరు.** ఇది కాంచీపురంజిల్లాలోనిది.దీనిని 'గురుస్థలి'గా చెప్పుకుంటారు. దీనిని శ్రీరామానుజుల తండ్రిగారు నిర్మింపచేసి, అనంతరం ఆదికేశవ పెరుమాళ్ ఆలయనిర్మాణం చేసారని, శ్రీరామానుజగురువులు విగ్రహం అందుకు నిదర్శనమని, వైష్ణవదేవాలయాలవలె అర్చనాదికాలు నిత్య 'తిరుమంజన' సేవ ఇక్కడి ఆచారం.

**కాంచీపురంలోనే** 108 ద్యివతిరుపతులలో ఒకటైన **శ్రీపెరుమాళ్ ఆలయం** చూడదగ్గది. విజయనగరరాజులు



ప్రత్యేక సలహాదారు తాతాచార్యులవారు నిర్మించిన శ్రీసంజీవరాయ దేవాలయం కంచిలో వుంది. ఇక్కడి విశేషం స్వామి కోనేరు 136 ఎకరాలలో విస్తరించి వుంది. సంజీవరాయుని దర్శించాలంటే 24 స్తంభాల విశాల మండపం దాటి లోపలికి వెడితే, ఈ మహాభక్తునితోపాటు శ్రీలక్ష్మీ అమ్మవారిని దర్శించవచ్చును. ఇక్కడి శ్రీరామనవమి ఉత్సవాలు విశేష ఆకర్షణ.

**మేల్‌మర్‌వత్తూర్ – ఆదిపరాశక్తి :** చెన్నయ్‌కి 92 కి.మీ దూరంలోని పరమపవిత్ర క్షేత్రమిది. పిలిస్తే పలికే తల్లి, అనునిత్యం కొంగుబంగారమై భక్తుల నలరిస్తుంటుంది. ఇక్కడ 21 మంది సన్యాసులు సన్యాసినులు సజీవసమాధి చెయ్యబడ్డారని వారి శక్తి 'సిద్ధపీఠం'గా ప్రకాశిస్తుందని, శక్తిలేని, శాక్తేయంలేదని, శివుడుకూడా శక్తి కరుణ తొలగితే శివం బదులు శవమౌతారనే శ్రీ ఆదిశంకరుల సౌందర్యలహరి ప్రథమస్తోత్రానికి ప్రత్యక్ష నిదర్శనమీ ప్రాంతం. ఇచ్చటి తల్లి ఆదిపరాశక్తి. ఇక్కడి తీర్థం 'గంజి' ఇదే ప్రసాదం. ఇక్కడ 'శ్రీబంగారు ఆడిగలర్' అనే శక్తిస్వరూప గురుదేవులబోధలు, సేవలు దర్శించి, తరించదగ్గవేతప్ప ప్రవచించి, ప్రకటించగలవికాదు.

**ట్రిప్లికేన్ పార్థసారథి**, 108 దివ్యక్షేత్రాలలో ఒకటి దర్శించదగ్గ ఆలయాలలో అతిప్రాచీనమైనది. అలాగే కుల, మతాతీత **రజనీరాజా ఆలయ** మొకటి. ఆదిశంకరులు తెల్పిన విధంగా షన్ముఖ, షణ్మత సాంప్రదాయం ప్రకారం గణపతి, శివుడు, విష్ణువు, శక్తి, సుబ్రహ్మణ్య, సూర్యభగవానులను దర్శించవచ్చు. మనకిష్టమైన వార్ని మన కిష్టమైన పద్ధతిలో ఆరాధించవచ్చును. ఇంకా ఆలయ ప్రాంగణంలో అమృతగణపతి, శ్రీదేవి భూదేవి, ఆంజనేయ, అయ్యప్ప, నవగ్రహాలను కూడా దర్శించగల్గుతాము. ఇక్కడ సేవా కార్యక్రమాలుకూడా సజావుగా నిర్వహించబడుతున్నాయి.



అనారోగ్యాలను పోగొట్టి, అగస్త్యమహర్షికి ఆనందం కల్గించిన శివుడే **మరుంధేశ్వరుడు** చెన్నయ్ పొలిమేరలలోని **తిరువాన్‌మయూర్‌లో** పానపట్టంపై చిద్విలాసంగా, నిలచి, నిత్యపూజలందుకుంటున్నాడు. ఎకరం స్థలంలో చోళులీ ఆలయనిర్మాణం చేసారు. కానీ ఆలయాభివృద్ధి మాత్రం విజయనగరరాజుల కాలంలో జరిగింది. ఇక్కడి శివలింగం వాల్మీకి మహర్షి ప్రతిష్ఠించినదని, అందుకే ఈ వూరికి 'తిరువాల్మాకి ఊరు' అనే పేరు వచ్చిందని చెప్పుకుంటారు. ఒకానొక సమయంలో శివప్రతిష్ఠ చేసిన వాల్మీకి మార్కండేయ మహర్షిని శివారాధనావిధానం చెప్పమని కోరతాడు. అప్పుడు మహర్షి 'ముందు దక్షిణభారతానికి బయలుదేరండి. ఎక్కడౌతే నేను ఇక్కడేవున్నాను అని వినబమదుతుందో అక్కడ శివప్రతిష్ఠ చెయ్యండి. మిగలినవన్నీ వాటంతట లభిస్తాయి." అంటారు. ఆ రకంగా శివుడు వెలసి దీర్ఘరోగుల అనారోగ్యమూర్తులకు ఆరోగ్యప్రదాతవుతాడు. ఇక్కడి మహామండపంలో 108 శివలింగాలుంటాయి. ఆలయం తూర్పు, పడమర గోపురాలతో మహామండపం, ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలుగా వున్నది.

చెన్నయ్‌లోని **అవ్వయార్ గణపతి** ఎంతో ప్రసిద్ధుడు. ఈ పిళ్ళైయ్యార్ విశేషం కొలచినవారికి స్వర్గప్రాప్తి నివ్వడం. అందుకేనేమో ఇక్కడి స్వామి తొండం పైకెత్తి దర్శనమిస్తాడు.

**అంకోల గణపతి ఆలయం** చూడదగ్గది. ఒకనాటి చతుర్వేదపురము, ఈనాడు చిన్నకావనముగా పిలువబడుతూ, పొన్నేరికి 3 కి.మీ దూరంలో రాబేరు సెంటరు నుండి 6 కి.మీ దూరంలో వుంది. దక్షిణాపధానికి వచ్చి అగస్త్యులకు కాశీని చూడాలనే కోరిక కల్గింది. ఆనాటి రాత్రి శివుడు అగస్త్యుడు వారికి కలలో కనుపించి, చతుర్వేదపురంలో



'చతుర్వేదేశ్వరు'నిగా వున్న నన్ను అక్కడున్న అంకోలా చెట్టువద్ద 108 రోజులు ప్రతినిత్యం ఒక శివలింగాన్ని చేసి అర్చిస్తే కాశీ విశ్వేశ్వరుని దర్శించిన పుణ్యఫలం లభిస్తుందంటాడు.

శివునాజ్ఞ ప్రకారం అగస్త్యులు అంకోలా చెట్టువద్ద ప్రతినిత్యం ఒక లింగం చొ॥న 108 రోజులు 108 లింగాలను పూజిస్తాడు. చివరిరోజున చిత్రంగా 108 శివలింగాలు ఏకమై ఏకదంతుని రూపు దాల్చేసరికి అగస్త్యుడు కారణం తెలియక కలవరపడుతుంటే శివుడు అగస్త్యుల నూరడిస్తూ 'శివపూజ చేసావుకాని, పూజ ప్రారంభంలో, ఆదిగణపతి పూజ మరచిన కారణంగా ఇలాగ జరిగింది. అయినా ఇది నీకు బాధాకరమైన లోకానికి మంచిదే అంటాడు. అప్పుడు జరిగిన పొరపాటుకు చింతిస్తూ చతుర్వేదేశ్వరస్వామి ప్రక్కన మరొక శివలింగం ప్రతిష్ఠిస్తాడు.దానిని శ్రీనూటెత్రేశ్వరస్వామి అని పిలుస్తున్నారు. అంకోలా వృక్షం శాఖోపశాఖలుగా విస్తరించిన దాని వయస్సు రెండువేల అయిదువందల సంవత్సరాలు, ఈ వృక్షశాఖలక్రింద వివిధ దేవతామూర్తులున్నారు. అందులో సూర్యుడు, సుబ్రహ్మణ్యం కూడా వున్నారు. వివాహం కోరువారు తన కోరిక చెప్పుకుని స్వామిని అర్చిస్తే 108 రోజులలో తీరతుందని, అప్పుడు వడమాల సమర్పించుకునే ఆచారం అనాదిగా వుంది. అదే జరుగుతుంది.

**మధుర మీనాక్షి :** ఈ ఆలయం గురించి, ఇక్కడి శిల్పకళ గురించి చెప్పేకన్న, ఆరవ శతాబ్దంలో పాండ్య రాజు కులశేఖరుడు నిర్మించిన ఆలయమిది. ఆ తర్వాత వివిధ కాలాల్లో గోపురప్రతిష్ఠ జరిగాయి. నిజానికిది శివమందిరం. సుందరేశ్వరునిగా వెలసిన దివ్యప్రదేశం. పరమేశ్వరుడు అమృతం చిలికించిన ప్రదేశం కాబట్టి 'మధుపురమ'నేది, రానురాను మధురయింది. రామాయణకాలంతో కూడా అనుబంధం కలిగివుంది. తనకు వారసురాలిగా రాజ్యమేలుతున్న రాజకుమార్తె 'మీనాక్షి'. ఈమె పాలనను మీసాలుగల మగధీరులు కాదంటే వారినందర్ని ఛేదించి, ఇంకా... అనేసరికి అందాల సుందరేశ్వరుడు కనుపిస్తాడు.అప్పుడు గతం జ్ఞప్తికి వచ్చిన పార్వతి మాత ఈనాటి మీనాక్షిగా, శివస్వరూప 'సుందేశ్వరు'ని వివాహం చేసుకుంటుంది. ఆలయం నగరం నడిబొడ్డున ఒక కోటలా వుంటుంది.

చైత్రమాసంలో మీనాక్షి సుందరేశ్వరుల కల్యాణం జరుగుతుంది. చైత్ర పౌర్ణమినాడు నిజంగా, సాంప్రదాయబద్ధంగా 'బాలుడు–బాలిక'కు వివాహం జరుపుతారు. నవరాత్రుళ్ళలో 107 మంది కుమారులను పూజచేస్తే తీరా పూజయ్యాక చేస్తే 108 మంది కనిపిస్తారు. ఎవరా ఒకటి అని ఆలోచించినా, ఆరాతీసినా 'ఒక్కడే అయిన ఆ పరాంబిక' 108వ కుమారిగా వచ్చి భక్తజనసేవల నందుకుంటుంది. అమ్మవారికి ప్రతి సోమవారం సాయంత్రం పూజానంతరం 'వజ్రపుముక్కుపుడక'ను అలంకరిస్తారు. దాని ధగద్ధగలు వర్ణనాతీతం. దాని ఖరీదు అంచనాలకు దొరకనిదిగా చెప్పుకుంటారు.

**రామేశ్వరుడు –** మొదట సముద్రస్నానం, ఆ తర్వాత 22 బావులలో స్నానం, చెయ్యాలిట. ఇది 10వ శతాబ్దిలో నిర్మించినట్లు చెబుతారు. మూడు ప్రాకారాలతో విరాజిల్లే మొదటి ప్రాకారంలో రాముడు ప్రతిష్ఠించిన జ్యోతిర్లింగ ముంది. ప్రక్కన కాశీవిశ్వనాథలింగముంది. ఇక్కడ కోటితీర్థమేకాదు, సర్వతీర్థాలు వున్నాయి. రెండవదానిలో అమ్మవారి ఆలయం, మూడవప్రాకారంలో ఒక మహల్‌ను తలపింపచేస్తుంది. ఇక్కడ రామలింగ, కోదండరామ,

నటరాజ, సేతుమాధవస్వామి ఆలయాలు, కోనేరు, ఇతర తీర్థాలను చూడగల్గుతాము. కాశీయాత్రచేసినవారు, ఆ గంగను తెచ్చి రామేశ్వరంలో సముద్రంలో కల్పి, ఈ రామేశ్వరుడిని దర్శిస్తే తప్ప యాత్ర ముగియదని, ఫలం లభించదని చెబుతారు. 12వ శతాబ్దంనుండి వివిధ రాజులు, ఈ క్షేత్రాభివృద్ధికి దోహదపడ్డారు. దేశంలోని నాల్గు ధామాలలో మొదటిది రామేశ్వరం. రెండు ద్వారక, మూడు పూరి, నాల్గు బదరీనాథ్. వీటిని దర్శిస్తే కాశీవెళ్ళకపోయినా ఫర్వాలేదుకాని, రామేశ్వరం మాత్రం వెడతానని వెళ్ళకపోతే మహాపాపమట.

ఈ మహల్ మండపం 4000 అడుగుల పొడవు, 21 అడుగుల వెడల్పు, 20 అడుగుల ఎత్తుతో ఎంతో అందంగా నిర్మించబడింది. ఇంకా ఈ ఆలయసరిసరాలలో కోదండరాముడు, పర్వతవర్ధని, గందమాదన పర్వతం, దర్భశయనం, ఆదిజగన్నాథమందిరం, దేవీపట్నం వగైరాలు చూడదగినవిగా చెబుతారు.

**మధురలోని** మరొక పవిత్ర దేవాలయం. మీనాక్షిదేవి సోదరునిగా చెప్పే **అళఘర్ కోవెల.** ఈ అళఘర్ స్వామి ఇక్కడ కూర్చుని, నిల్చుని, పడుకుని త్రివిధ భంగిమలలో దర్శనమిస్తాడు. చూడవలసిన ఆలయాలలో ఇదొకటి.

**"ధనుష్కోటి"** ఈ మాట వినేసరికి 'పాంబన్' బ్రిడ్జి జ్ఞాపక మొస్తుంది. ఒకప్పుడు రామేశ్వరం వెళ్ళేవారు, ఈ బ్రిడ్జి



మీదుగా రైలుప్రయాణం చేసేవారు. ఇప్పుడు కాలమార్పుల వలన ఆ అవకాశంలేదు. 1964లో జరిగిన ప్రమాదంతో ఈ యాత్రకు తెరపడింది. ఒకప్పుడు ధనుష్కోటిని దర్శించి, సముద్ర స్నానాలు చేస్తే తప్ప కాశీ-రామేశ్వరయాత్ర పూర్తయినట్లు కాదనేవారు. ఇప్పుడా ప్రాంతం మున్గి వుండటంతో, ఈ చెయ్యవలసిన కార్యక్రమాలు రామేశ్వరం లోనే పూర్తిచేసుకుంటున్నారు.

**రామేశ్వరానికి** 5 కి.మీ దూరంలో వుందీ **ఏకాంత రామేశ్వరం.** ఇది సేతు నిర్మాణసమయంలో జరిగే హడావుడి నుండి కాస్త ప్రశాంతి పొందడానికి రాముడీ స్థలంలో ఏకాంతంగా గడిపినట్లు, అలాగే ఇక్కడి ఆలయంలో రాముడు సీతాదేవితో ఒక చేతిని ఎత్తి మాట్లాడుతున్నట్లుంది. దీనిని ఏకాంత రామేశ్వరమంటారు. అసలీ ప్రాంతమంతా రాముని ఆనవాళ్ళు, రామాయణంతో మమేకమైన ప్రాంతంగా చెప్పుకొనవచ్చును. రామేశ్వరానికి 25 కి.మీ దూరంలో గంధమాదన పర్వతముంది. ఇదే రామరావణయుద్ధానికి అంకురార్పణజరిగిన ప్రదేశం. ఇక్కడనుండే ఆంజనేయుడు సముద్ర లంఘనం చేసాడు. తిరిగి వచ్చాక రామలింగ ప్రతిష్ఠ చేసిన ఆలోచనా స్థలంకూడా ఇదే. ఇక్కడి రెండంతస్తుల ఆలయంలో రామపాదముద్రలను మనం చూడగల్గుతాము.



**దర్భశయనం** : ఇది 108 వైష్ణవ దివ్యతిరుపతులలో ఒకటి దీనిని తమిళనాట **'తిరుప్పుల్లాణి'** అని పిలుస్తారు. సాధారణంగా రామేశ్వర యాత్రానంతరం ఈ క్షేత్రం దర్శించడం ఆనవాయితీ. సముద్రం దాటడమెలాగో తెలియక దర్భశయనం పరచుకుని, రాముడు సముద్రుని

ప్రసన్నం కోరిన ప్రదేశమిది. ఇచ్చటొక పెద్ద రావిచెట్టు వుంది. ఎందరో మహర్షులు ఇక్కడ తపస్సు చేసారు. కనుక సంతానహీనులు ఇక్కడికి వచ్చి మ్రొక్కుకుంటే వారు సంతానవతులౌతారనేది ఇచ్చటిమాట.



**శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయం, నాగర్‌కోయిల్** అంటాము కాని ఈ నాగర్‌కోయిల్‌కు 22 కి.మీ దూరంలో మూడు సముద్రల సంగమప్రదేశంలో అద్భుతమైన ఈ ఆలయం వెలిసింది. ఇంకా ఇందులోని విశేషం ఈ విగ్రహాన్ని త్రేతాయుగంలో మహావిష్ణు అవతారమైన పరశురాముడు ప్రతిష్ఠించాడని చెబుతారు. ఇక్కడి అమ్మవారు కన్య కుమారి. ఈ విశాల విశ్వంలోని 108 శక్తిపీఠాలలో దీనినొకటిగా చెబుతారు. ఇక బాణాసురుని వధ నిమిత్తం ఈ తల్లి ఆవిర్భవించినదని, శుచీంద్రంలో కఠిన తపస్సు చేసుకునే ఆమెను ఆ పరమశివుడే వచ్చి వివాహం చేసుకోవాలని తలచిన ఆమె, ఈ విషయాన్ని తన తండ్రిద్వారా శివున కందించింది. కాన ఆమె తలంపుకు విరుద్ధంగా వివాహమైతే దుష్టరాక్షస సంహారం జరుగదు కాబట్టి, ముహూర్త సమయానికి శివుడు యోగమూర్తయ్యేటట్లు నారదుడు పన్నాగం పన్నుతాడు. అతని ఆలోచన ఫలించింది. ఈలోగా బాణాసురుడు ఈ కన్య అందచందాల గురించి విని 'బాలా' అంటాడు. తనకిచ్చి పెండ్లిచెయ్యమని ఆమె తండ్రికి కబురు పంపుతాడు. తాను కోటగుమ్మం వద్ద నిలచి, తనను గౌరవించా లని, పిల్లనిచ్చి పెండ్లి చెయ్యాలని, కాందటే ... కస్సుమంటాడు. ఆతని నెవరు ఏం చెయ్యలేకపోతారు.

అప్పుడే 16 సం॥ల బాలామణి వీరమూర్తియై విజృంభించింది. ఈ కన్యక చేతిలో ఆతడు నిర్జీవితుడౌతాడు. అనంతర శివుని యోగసమాధి గురించి తెలుసుకున్న కన్యక శివునికోసం నిరీక్షిస్తూ 'కన్య'గానే మిగిలిపోతుంది. ఇక్కడే వివేకానందుని రాక్, తపస్సుకు గుర్తుగా స్మారకచిహ్నం కూడా ఏర్పరిచారు.

త్రిమూర్తులు ఏకరూపుతో వెలసిన ప్రదేశం – **శుచీంద్రంలోని స్థానేశ్వరుడు.** స్థానేశ్వరుడు శివునిగా మహాపుణ్య తీర్థమైన పుష్కరతీర్థంలో వున్నట్లు పురాణాలు చెబుతాయి. ఇక ఇక్కడ కన్యాకుమారిని వివాహం చేసుకోదలచిన శివుడు స్థానేశ్వరుడై బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ యోగమూర్తవుతాడు. ఇక పురాణ నేపథ్యానికి వస్తే – గౌతమముని శాపంతో కృంగిపోయిన ఇంద్రుడు ఇక్కడే తపస్సు చేసి పరిశుద్ధుడైనందువలన ఈ ప్రాంతానికి 'శుచీంద్ర'మని పేరు వచ్చిందిట. ఇంకా మహాపతివ్రత త్రిమూర్తులను పాపలుగా చేసుకుని, మాతృమూర్తిననిపించుకున్న అనసూయామాత, తన భర్త అత్రిమహర్షితో (వీరిరువులు విశ్వగురువు దత్తునికి మాతాపితలు) ఇక్కడే తపస్సు చేసారుట. ఇక్కడి ఆలయంలోని శివలింగం (మూడు మూర్తులు కలిసిన దివ్యలింగం) పాదంలో బ్రహ్మ, మధ్య విష్ణువు, శిరోభాగం శివస్వరూపంగా చెబుతారు. ఇక్కడి చెట్టుక్రింద శ్రీదత్తులు నివసించారని ....

అలాగే ఆదిశంకరులు, ఇక్కడ శివుని ప్రత్యక్షం పొంది ఆనందతాండవం దర్శించాడుట. ఇక్కడి ముఖమంటపానికి ప్రక్కనగల పెద్ద విశాల మంటపంలో ఒకేస్తంభంలో పొడుగాటి వెదురు బొంగులవంటి రాతికర్రలనుండి సప్తస్వరాలు వినిపించడమొక విశేషం. అలాగే ఇక్కడి ఓ విగ్రహం ముందు వైపు పురుషుని గాను, వెనుకనుండి చూస్తే స్త్రీ

మూర్తిగాను కనబడటమొక వింత. ఇక్కడ గణపతి 'విఘ్నేశ్వరి' అని స్త్రీ రూపంలో వుండటం దాదాపు 2000 సం॥నాటి దివ్యవృక్ష దర్శనం, ధన్యజీవనానికి నిదర్శనం.

**తిరువళ్ళిక్కేణిలోను పంచాలయాలు** – 108 దివ్య తిరుపతులలో ఒకటిగా చెబుతారు. ఈ క్షేత్రంలో స్వామి, శ్రీరామునిగా, కృష్ణునిగా, శ్రీరంగనాధునిగా, గజేంద్రవరదునిగా, నరసింహస్వామిగా అయిదు రూపాలలో కొలువై వుండటమొక విశేషం. అత్రి, జాబాలి వంటి మహర్షులీ స్వామిని దర్శించి తరించారుట. ఇక ఆళ్వారులు సరేసరి. ఈ దివ్యలను స్తుతించి, పరవశించారుట.

**నాగర్‌కోయిల్ – నాగరాజు –** పురాతన మందిరం. దీనిని చోళులు నిర్మిస్తే, పల్లవులు అభివృద్ధిపరిచారు. పేరుకు ఇది హిందూదేవాలయమే కాని గోడలపై జైనతీర్థంకరులు మహావీర, పార్శ్వనాధచిత్రాలు, చిత్రంగా చూడగల్గుతాము. కన్యాకుమారిలో మూడు సముద్రాల మేలుకలయిక, సంగమ ప్రదేశంలో పరశురాముడు ప్రతిష్ఠించిన వినాయకుని చూడగల్గుతాము. భక్తజనరక్షకుడు, ఆశ్రిత వత్సలుడైన గణపతి, సర్వదా, దర్శనీయుడు. దయగల దేవుడు.

శివకంచిలో **'తిరుఊఅగమ్'** అనే ప్రదేశంలో **'నాగతీర్థ'**ముంది. ఆనాడు ఆదిశేషునికి ప్రత్యక్షమైన స్వామి ఇక్కడ భక్తజనవశంకరుడయ్యాడు. అయ్యగారు 'ఉలగళంద' పెరుమాళ్‌గాను, అమ్మవారు అమృతవల్లితాయారుగాను నిత్యనీరాజనాలందుకుంటున్నారు. ఈ స్వామి లీలావిశేషాలను తిరుమంగై ఆళ్వారులు ఘనంగా ప్రస్తుతించారుట.



ఒకప్పటి 'మాయావరం' నేటి **'మైలాడుతురై'.** ఇది చాలా పురాతనమైంది. దీని **రాజగోపురం** 9 అంతస్థులతో దక్షిణ భారతావనికే తలమాణిక్యంవంటిది. దక్షప్రజాపతి నిరీశ్వర (శివుడు లేకుండా) యాగం ప్రారంభించడం, శివదంపతుల, పరివారాన్ని తప్ప సర్వులను పిలువడం తెల్సిన సతీదేవి ఏదో పొరపాటు జరిగివుంటుందని తలచి ఆయాగానికి వెళ్ళి అవమానపడటం, శివునికి కోపం రావడం, వీరభద్రుని జననం ఇవన్నీ తెలిసినవే. అయితే సతీదేవి ఆ యాగానికి వెళ్ళినప్పటి నుంచి ఓ నెమలిపిల్ల చిత్రంగా ఈమె ఒడిలో కూర్చుంటుంది. దక్షుని దుర్భాషలకు కుపితురాలైన సతీదేవి యోగాగ్నిలో తన ఒడిలో నెమలిపిల్ల వుందని మరచి ఆహుతైపోతుంది. దాంతో సతీదేవి నెమలిగా పుట్టి, తన పాపప్రక్షాళనకుగాను, మయూర రూపంలో శివుని ప్రతిష్ఠిస్తే శివుడు మయూరనాథుడౌతాడు. ఆ ప్రదేశమే ఈ ప్రదేశము. ఇక్కడి తల్లి అభయాంబికా, అభయ ప్రదాంబికా అని పిలవబడుతుంది. ఇక్కడ పరమ పవిత్ర వృషభతీర్థం సర్వపాపహరిణి. ఒకానొక సమయంలో రుద్రునకు కోపమొచ్చి నందిని విసిరేస్తాడు. అతడు మాయవరంలోని కావేరీలో పడిపోతాడు. దాంతో దీనికి నందిపడ్డది కాబట్టి వృషభతీర్థంగా వినుతికెక్కుతుంది. ఇంకా ఇక్కడి విశేషం ప్రతిపౌర్ణమికి, గంగా యమునలు వస్తాయని దాంతో ఇది మరింత పవిత్రమైంది. కనుక ఇక్కడ చేసే తర్పణ పిండప్రదానాలు పితృదేవతలను తరింపచేస్తాయిట. ఇంకా ఇక్కడి బ్రహ్మవనం, సుందరవనాలేకాదు, ఈ ప్రాంతమంతా చూడదగ్గది. భక్తిప్రపత్తులతో సేవించదగ్గది.

నాగపట్నానికి 4 కి.మీ దూరంలోవున్న **'తిరుక్కడియాయూరు'** లోని **శ్రీఅమృతకడేశ్వరస్వామి**వారు అభిరామ అమ్మవారితో కలిసి వెలిసిన ప్రదేశం. స్థలపురాణం ప్రకారం పూర్వం దేవదానవులు అమృతమధనసమయంలో గణపతిని పూజించనందుకు కోపంతో ఒక కడివెడు అమృతాన్ని కూడా దాచాడుట. అది కాస్తా మహాశివలింగమై కూర్చుంది. శివుడు అమృతకడేశ్వరునిగాను, పార్వతి 'అభిరామి'గా, వినాయకుడు 'కళ్ళల్ వినాయగర్'గాను మారిపోయారు. ఇక్కడ 'కళ్ళల్' అంటే 'దొంగ' అని అర్థం. 63 మంది నాయర్లలోని కుంగిలియ నయనార్, కారినాయనార్‌లు నివాసస్థలమిదేనని చెబుతారు.



శివభగవానుడిచ్చట అష్టమస్థానంలో వెలిసియున్నాడు. ఇచ్చటనే తిరునవక్కరసు, సంబంధర్, సుందరర్ వగైరా భక్తశ్రేష్ఠులు స్వామిని పూజించి తరించారుట. ఇక్కడి బిల్వవృక్షం, పింజల వృక్షములు తాకి తరించదగ్గవి.

ఈ క్షేత్రానికి సంబంధించిన ఓ దివ్యగాధ వుంది. అది శరభోజి మహారాజు పరిపాలిస్తున్న కాలంలో 'అభిరిమభట్టర్' అనే భక్తశ్రేష్ఠుడు ఇక్కడి అమ్మవారిని పూజిస్తూ కాలం గడుపుతుండేవాడు. ఒకనాడు ఆ మహాభక్తుడు ధ్యాననిమగ్నుడైవున్న సమయంలో వచ్చిన శరభోజమహారాజు అది నిజమైనధ్యానమా లేక నటనమో తెలియక 'అయ్యా! ఈరోజు ... అంటాడు. ఆ సమయంలో నిండు పున్నమివంటి పూర్ణచంద్రబింబము వంటి అమ్మ ముఖమును దర్శిస్తున్న మహదానందసమయమది అవడంతో శరభోజి ప్రశ్నకు ఆ సమాధిస్థితిలో 'నిండు పున్నమి' అని ఎంతో నిండుగా, నిబ్బరంగా చెబుతాడు. దాంతో రాజు అదిరిపడతాడు, నాతో పరిహాసమా అని అనుకుంటూ 'అభిరామా! ఈ రోజు అమావాస్యయితే నిండుపున్నమిఎలా'గన్నాడు. ఆ పూర్ణచంద్రుని చూపకపోతే నీకు శిరచ్ఛేద'మంటాడు.

ఇదంతా కాస్సేపు గందరగోళమైనా 'అమ్మా! నీమాట నీవు దక్కించుకో. నిన్ను దర్శిస్తు నీ తమకంలోనేనన్న మాట. ఇంతటి ఉపద్రవానికి దారిచేసిందని, ఆ తల్లికి శరణాగతుడౌతాడు. మహాభక్తప్రియమైన ఆ తల్లి పుత్రవాత్సల్యంతో అభిరాముని మాట నిలుపడానికి తన చెవికుండలాన్ని ఆకాశానికి విసరి, భక్తుని మాట నిల్పింది. భక్తరక్షకియని ప్రసిద్ధిగాంచింది. ఇందుకు శరభోజి ఆశ్చర్యపోయి, 'మహాభక్తశ్రేష్ఠా! మీ భక్తిని బడాయిగా తలచిన నాకళ్ళు తెరచుకున్నాయి. నా జన్మ ధన్యమైందని అభిరామునికి శరణాగతుడౌతాడు. ఇక్కడ మార్కండేయుని రక్షించడానికిగాను కాలసంహారమూర్తియై యముడిని శిక్షించిన ఉత్సవం చాలాబాగా జరుగుతుంది. ఇక్కడనుండి కాశీకి సొరంగమార్గం కూడా వుందిట. ఇక్కడి అమృతఘటేశ్వరస్వామి ఆలయం కూడా దర్శనీయమైంది. 108 శంఖాలలోకల్గిన జలంతో కార్తీక సోమవారం స్వామిని అభిషేకిస్తారు. నూరు కాళ్ళమంటపం చూడచక్కనిది. దక్షిణాన్ని అమ్మవారు చూస్తుండటం వలన నిత్యకల్యాణంతోపాటు, ఆయుష్షుహోమం, మృత్యుంజయ, హోమం, కలశపూజలను శాస్త్రోక్తంగా జరుపుతారు.

నాగపట్నానికి సమీపంలో లేదా, తంజావూరు చెంతగల **వేదారణ్యంలో 'వేదనాయక ఆలయ'** ముంది. ఇక్కడి విశేషం పార్వతీదేవి, సకల శాస్త్రపారంగతురాలైన సరస్వతిని, వీణావాదనంలో ఓడించినందులకు నిదర్శనంగా ఈ 'వేదనాయకి' అవతారం, ఆలయం వెలిసాయి. ఇక చారిత్రక నేపథ్యం రామరావణయుద్ధానంతరం, రాక్షస ప్రేతలు,

రాముని అనుసరిస్తుంటే, వినాయకుని ప్రార్థించి తన సంకల్పం చెపుతాడు. అందుకు నిదర్శనంగా ప్రక్కనే తన పేరుతో ఒకవూరు, రామనాధుడని శివలింగం, చండికేశ్వర, చండికేశ్వరి విగ్రహాలతో, శివుని వేదనాయకుడని, పార్వతిని వేదనాయకి అంటూ పూజిస్తారు.

వినాయకుని **'వీరహట్టి వినాయకు'** డని పిలుస్తారు. ఈ స్వామిని పూజిస్తే ఎటువంటి గాలి, ధూళి, భూత, ప్రేత పిశాచాది ఏ దుష్టగ్రహాలు మనదరికి రావు. ఈ స్వామి పేరు వింటేనే అవన్నీ ఆమడదూరం పారిపోతాయి. ఇంకా ఇక్కడి విశేషం. వేదాలు సాకారమై వచ్చి, పూజలు చేసుకుని, ముఖద్వారాన్ని బంధించి వెళ్ళిపోవడంతో, సరాసరి స్వామిని దర్శించలేక ప్రక్కద్వారంనుండి దర్శించాల్సివుంటుంది.

దక్షిణాది పుణ్యక్షేత్రాలకు మహానిలయం. అందులో తమిళనాట, ఆంధ్రదేశం తదుపరి, అంతటి విశిష్టమైన శాక్తేయ, గణాపత్య, బౌద్ధ, జైనాది సాంప్రదాయాలెన్నో తెలియగా, వాటి నన్నింటిని ఆదరించింది. సమత్వాన్ని, సమభావాన్ని ప్రకటించింది. అటువంటి తమిళనాడులో **'నాగపట్నం జిల్లాలోని అనంతమంగళం'** చెప్పుకోదగ్గది. రామరావణ యుద్ధం ముగిసింది. తన ధర్మం నెరవేరిందని తలుస్తున్న సమయంలో, నారదుడు 'దేవా! రావణసంహారం జరిగింది కానీ, రాక్షసపీడ వదలలేదు. రావణుని సంతానం సముద్రపు అడుగున తపోమూర్తులుగా వున్నారు. సమయం చూసి వేటువేస్తారంటాడు. అందుకు సమాధానంగా రాముడు తన అవతార లక్ష్యం రావణవధ అని, అది నెరవేరిందని, ఇక మిలిలిన కార్యాన్ని 'హనుమంతుడు' నిర్వహిస్తాడని, అందరు తమ తమ ఆయుధాలు శక్తుల నిస్తారు. హనుమంతుడు త్రినేత్రుడు దశభుజుడై, పలుఆయుధాలతో రాక్షససంహార క్రీడ ముగిస్తాడు. అలాగ తిరిగి వచ్చిన స్వామి 'అనంతమంగళు'ని కీర్తిస్తారు. ఆ విధంగానే స్వామి అక్కడ అవతరిస్తాడు.

నాగపట్నంజిల్లాలోని కరైకాల్ సమీపంలోని **తిరువన్నాపురం** తలచుకుని తరించదగ్గది. ఇక్కడి **శౌరిరాజ పెరుమాళ్** అందమైన కేశములతో వున్న కేశవుడు. ఇది అప్పటి రాజు స్వయంగా దర్శించి, శౌరిరాజ పెరుమాళ్‌ను కీర్తించాడు.


జలకంఠేశ్వర ఆలయం – వెల్లూరు

అలాగే **వెల్లూరుకోటలో** 1566లో చిన్నబొమ్మినాయక్ నిర్మించిన స్వామి 5 అడుగుల మూర్తి **జలకంఠేశ్వరుడు**. అమ్మవారి ఆలయంకూడా విశేషించి చూడదగ్గది. ఇక్కడి కల్యాణమంటపశోభలను గమనించి పరవశించిన బ్రిటిష్‌వారు, జాగ్రత్తగా ఏరాయికారాయి విడదీసి లండన్‌లో పునఃప్రతిష్ట చెయ్యాలని తలంచారు. కాని దీనికోసం బయలుదేరిన స్టీమరు మధ్యలో మునిగిపోవడంతో ఈ కార్యక్రమానికి తెరదించారు.

తిరునల్వేలికి 20 కి.మీ దూరంలో, తిరుచందూరుకు 17 కి.మీ దూరంలో **ఆళ్వార్ తిరునగరిలో** వుందీ **ఆదినాధస్వామి ఆలయం**. దీనిని శ్రీవైష్ణవ భక్తుడు, అనంతరం గురువైన జన్మస్థలంగా ప్రశంసించబడుతుంది. స్థల పురాణం ప్రకారం తన వివాహానికి వచ్చేవారిని అడ్డుకొమ్మని, శివుడు, అగస్త్యులవారితో చెబుతాడు. ఆ ప్రకారం విశ్వకర్మ కైలాసం వెళ్ళకుండా అడ్డుకునేసరికి, విశ్వకర్మ కోపించి, నీభాష



నీకు తప్ప మరెవ్వరికి పనికిరాదనేసరికి, శివుని ప్రార్థించి, వేదాలతో సమానమైన ప్రతిపత్తి నివ్వమని కోరుతాడు. అందుకు శివుడు అంగీకరిస్తూ దీనిని ముందుకాలంలో నిర్వహింపచేసే వ్యక్తి జన్మిస్తాడని వూరడిస్తాడు. అలాగ జన్మించిన వరప్రసాదే 'నమ్మళ్వారు'. తమిళభాషకు, భాషగా తగు విధమైన ప్రాముఖ్యతను, ఘనతను కల్గిస్తాడు.

వెల్లూరుజిల్లా **ఘటికాచలములోని నరసింహస్వామి,** తిరునల్వేలి సమీపంలోని **నంగునేరిలోని 'వనమాలై పెరుమాలై పెరుమాళ్** సర్వశక్తిమంతులు. తెనాలి రామకృష్ణుని ఘటికాచల మహాత్మ్యం ద్వారా ఈ స్వామి శక్తిని తెలుసుకోవచ్చును. గ్రహపీడితులు, మానసిక రోగులు, దీర్ఘవ్యాధిగ్రస్థులకు ఈ క్షేత్రం సర్వశుభంకరి. ఇది 108 దివ్యతిరుపతులలో ఒకటిగా పేరుపొందింది. చిన్నదైన రెండవకొండపై యోగాంజనేయస్వామి వున్నారు. నరసింహస్వామిది ఉత్తరముఖం, యోగాంజనేయులు పడమర ముఖంగా వుంటారు. ఈ స్వామి గోడకున్న చిన్నరంధ్రంనుండి, యోగానంద నరసింహస్వామి ఆలయ శిఖరం దర్శించవచ్చును.



ఇక **నంగునేరిస్వామి** శ్రీదేవి, భూదేవిలతో ఎంతో ఆకర్షణీయంగా విష్ణుమూర్తిలా వుంటాడు. విష్ణువు కన్న తాను ఉన్నతుడనని తలచే బ్రహ్మకు అహంకారం తగ్గించాలని స్వామి, మధుకైటభులను బ్రహ్మకు మీదకు దాడిచేయిస్తే వారిని ఎదుర్కోలేక మరల పద్మనాళం చేరబోతే, శ్రీమహావిష్ణువు దాని దారిని బంధించేసరికి విధిలేక వెనుతిరిగి, జ్ఞానోదయం కలిగి శ్రీవిష్ణుశక్తికి శరణాగతుడనంటాడు. ఆ దేవదేవుని దివ్యరూపప్రదేశమిది.

తిరునల్వేలికి 50 కి.మీ దూరంలోని **శంకరన్‌కోవెల** ప్రాంతంలోని **'శంకరనారాయణ'కోవెల** శివ, విష్ణుమయంగా వుంటుంది. కట్టుబొట్టు అన్ని సగం శివ వేషధారణ, సగం విష్ణురూప అలంకరణలతో బ్రహ్మానందం ప్రసాదింపచేసే దివ్యక్షేత్రంగా అలరారుతుంది. ఇక్కడి విశేషం పూజలు అర్ధరాత్రి వరకు చెయ్యడం ఒకటి. రెండు 40 రోజులు ఈ స్వామిని సేవిస్తే సకలవిధరోగాలు నశించిపోవడం. గోమతి అమ్మవారికి, సర్పరాజులైన శంఖ, పద్మలకు, శివ, కేశవ అభేదం లేకుండా స్వామి శంకరనారాయణుడై దర్శనమొసగడమొక విశేషం.





**కుర్తాళం** ప్రకృతి రమణీయం. ఆ పీఠాధిపతులే **శ్రీ భారతీ సిద్ధేశ్వరానందులుగా** మనమధ్యనే తిరుగుతున్న మహనీయులు. టెంకాశికి 6 కి.మీ దూరంలోని ఈ క్షేత్రం ఇక్కడి చిత్రావతి నది జలపాత స్నానం, దర్శన, స్పర్శనలు ఎంతో శ్రేష్ఠం. ఇక్కడ స్నానం చేసినవారి సర్వరోగాలు నశించిపోతాయి.

**శివకంచిలోని** ఏకామ్రేశ్వరుని కోవెలకు దగ్గర్లోని **'తిరుప్పాడగమ్'లో** రుక్మిణీసత్యభామలతో పాండవ దూత శ్రీకృష్ణుని విగ్రహముంది. దీనిని 108 తిరుపతులలో ఒకటిగా చెప్పుకుంటారు. కాంచీపురానికి 7 కి.మీ దూరంలో విజయరాఘవస్వామి ఆలయముంది. ఇదీ 108 దివ్యక్షేత్రాలలో ఒకటే. ఇచ్చట స్వామి విజయరాఘువుడు, అమ్మవారు మరకతవల్లి. సంతానహీనులకు సంతానం ప్రసాదించేస్వామిగా ఆళ్వారులలో ఒకరైన తిరుమంగై గొప్పగా కీర్తించాడుట.

**తిరువణ్ణామలై అరుణాచలేశ్వరుడు, తిరువారూరు త్యాగేశ్వరస్వామి** (ఈ స్వామి విశేషం – త్యాగయ్య ప్రసిద్ధి గాంచిన సంగీత కళానిధి. ఆయన భార్య కమలాంబ, త్యాగేశ్వరస్వామి ఆయన దేవేరిల పేర్లు అనితలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది) చిదరంబరం నటరాజస్వామి, త్యాగయ్య, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు ఈ తిరువారూరు వాస్తవ్యులే. తిరువాయూర్ (మన్నారుగుడి) రాజగోపాలస్వామి ఆలయం (1133 సం॥లో కులోత్తుంగచోళుడు నిర్మించినది) తిరువాయూరు జిల్లాలోదే అయినా తిరుచెన్‌గాట్టం గుడిలోని అతి పురాతన గణపతేశ్వరాలయం వుంది. ఈయనను 'నవవక్ర్త వినాయకు'డని పిలువడం కూడా కలదు. 7వ శతాబ్దంలో పల్లవరాజుల సైన్యాధికారి 'చిరుతొండర్'చే ప్రతిష్ఠింపబడినది. అప్పట్లో రాజధానిని 'వాతాపి' గా పిలిచేవారని, ఈ విగ్రహాన్ని బాదామి నుండి తెచ్చారని, అందుకు ఈయనకు 'వాతాపి గణపతి' అని కూడా పిలుస్తారని చెప్పుకుంటారు.



**శ్రీవిల్లిపుత్తూరు శ్రీమహాలక్ష్మి ఆలయం :** మధురకు 74 కి.మీ దూరంలో విరూధ్‌నగర్ జిల్లాలో వుంది. ఇక్కడ మహాలక్ష్మి (గోదాదేవి) అమ్మవారున్నారు. 108 దివ్యతిరుపతులలో ఇదొకటి. ఇది అపురూప ఆలయం. దీనిని 7వ శతాబ్దంలో వల్లభ దేవ పాండ్యన్ నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఇక విష్ణుచిత్తుడు, గోదాదేవి ధనుర్మాస కథనం అందరికి తెలిసిందే. వివాహంకాని కన్యలు, కోర్కెలతో సతమతమయ్యేవారు ఇక్కడికి వచ్చి అమ్మవార్ని సేవిస్తే మనోభీష్టం నెరవేరుతుంది.

ఇక్కడున్న మరో దేవుడు – ద్రవిడ జాతికి ఆరాధ్యనీయుడైన **సుబ్రహ్మణ్యం.** ఇక్కడే దేవయానితో సుబ్రహ్మణ్యానికి వివాహం జరిగింది. ఇక్కడ ఆలయాన్ని పరాశరులు, విశ్వకర్మను ప్రార్థించి, మరీ నిర్మింపచేసారుట. కారణం పరాశరుని ఆరు గురు కుమారులు శాపవశాత్తు శరవణసరస్సులో చేపపిల్లలై బ్రతుకుతుంటే, అది చూడలేని మహర్షి 'నాయనలారా! సుబ్రహ్మణ్యుని పూజించండి. తరిస్తా'రంటాడు. వారు అలాగే చేస్తారు. తమ శాపం నుండి బయటపడతారు. కుమారుల శాపవిమోచనం కల్గించినందులకు కృతజ్ఞతగా పరాశర మహర్షి స్వామికి ఆలయనిర్మాణం జరిపించారు. ఈ వివాహానికి త్రిమూర్తులతోపాటు, విష్ణుమూర్తి కుమార్తె సుందరవిల్లి వచ్చి సుబ్రహ్మణ్యునిపై మరులుకొంటే, పెద్దల అనుమతితో ఆమెను వివాహం చేసుకుంటాడు. దాంతో అది సుందరవిల్లి పేరిట కాలక్రమంలో శ్రీవిల్లిపుత్తూరుగా పిలువబడసాగింది.



ఇంకా **శివగంగలోని సుందరరాజపెరుమాళ్ళు, కారైకుడిలోని 'కర్పగ వినాయకుడు'.** ఈయన కర్పగ అంటే కల్పవృక్ష వినాయకుడని పిలుచుకుంటారు. 5వ శతాబ్దంలో పల్లవులు నిర్మించారు. ఈ జిల్లా శివగంగలోనే తిరుప్పవణంలో మూర్తి గణపతి దేవాలయముంది. ఇక్కడ చేసే పితృపితరుల పూజలు, తర్పణాలు కాశీ, రామేశ్వరాలలో చేసిన ఫలితాన్ని ఇస్తాయి.



పుదుక్కోట జిల్లాలో **'విరాలిమలై'** లో శివకుమారుడు **సుబ్రహ్మణ్యుని ఆలయ** ముంది. ఇక్కడే సుబ్రహ్మణ్య భక్తుడు అరుణగిరినాథర్‌ను తన ఆలయం దర్శించమని చెప్పి చొక్కనాథర్ మంటపంలో అష్టమసిద్ధిని కల్పించాడు. ఇక్కడ మనం శ్రీవల్లీ దేవసేనా సమేత స్వామిని చూడగల్గుతాం. పుదుక్కోటై రాజుగారు ఉదరశూలతో బాధపడుతుంటే, స్వామి పూజారులకు కనుపించి రాత్రిపూట పూజాసమయంలో ఒక చుట్టను రాజుగారికి ఇమ్మని చెబుతారు. అది పీల్చగానే కడుపునొప్పి పోతుందిట. రాత్రిపూట చుట్టనిచ్చే ఆచారం ఇప్పటికి కొనసాగుతుంది.

**తిరునల్వేలిలోని రామాలయం**లో చిత్రంగా ఆంజనేయుడు రామనామం చేస్తూంటే, ఆగానాన్ని తన్మయుడై పద్మాసనం వేసుకుని రాముడు వింటున్నట్లున్న విగ్రహాలు ఇక్కడి విశేషాకర్షణ. **తిరువళ్ళూరులోని వీరరాఘవ పెరుమాళ్,** మాయవరం సమీపంలోని **తిరునాగై సౌందర్యరాజపెరుమాళ్** అలాగే విల్లుపురం జిల్లాలోని **తిరుక్కోవళ్ళూరు** (విల్లిపురానికి ఉత్తరంగా 45 కి.మీ దూరంలో) గ్రామంలోని **తిరువిక్రమ పెరుమాళ్ళ ఆలయం** 2వేల సంవత్సరాల నాడు పల్లవరాజులతో నిర్మితమైనట్లు చెబుతారు. అయితే ఇక్కడి శాసనాలను బట్టి ఈ ఆలయం ఒకేసారి నిర్మితంకాలేదని, అంచెలంచెలుగా అభివృద్ధి చెందినదని తెలుస్తోంది. ఇక్కడే మృకండమహర్షి ఆలయంవుంది. ఒకసారి వర్షం వస్తూంటే 'పోయిగై ఆళ్వారు, పూదుత్తార్ ఆళ్వారు, పెరియాళ్వార్లు తడిసిముద్దయి, ఎటువెళ్ళాలో తెలియక, ఆశ్రమంలోని ఒక ఇరుకుగదిలో ఒదిగి, ఒదిగి నిల్చుంటారు. భక్తులు కదా! వారి సత్సంగంలో వారు మున్గిపోతారు. ఎందుకోవున్నట్లుండి ఇరుకుగా అన్పించినవారు, పరీక్షించి చూస్తూ ఇంకేవరు? తాము సదా స్మరించి, పూజించే స్వామివారు త్రివిక్రమావతారమూర్తి. ఈ దేవుని దేవేరి పుష్పవల్లి తాయారు. ఇక ఈ క్షేత్రము చుట్టు, శంఖ, వరాహ, అగస్త్య, కలువ తీర్థాలున్నాయి. తమ మధ్య తమతోవున్న స్వామిపై 'తిరువన్దాది' అనే శ్లోకాలను ఆ భక్తమహాశయులు ఆశువుగా చెబితే, ఈ శ్రీతిరువిక్రమునిపై పొయిగై ఆళ్వారు, వందపాశురాలను చెబుతారు. ఇక్కడి పెన్నానది, బ్రహ్మపాదాలనుండి జాలువారిన గంగా జలబిందువులు. ఈ పెన్నలో స్నానంచేసి, అష్టాక్షరీ మంత్రజపం చేసినవారికి పునర్జన్మవుండదుట.

తమిళనాట **శ్రీసుబ్రహ్మణ్య, గణపతి, శివ, ఆండాళ్ (అమ్మవారు) విష్ణు .... ఇలాగ సర్వదేవతలకు ఆలయాలు,** ఆరాధనలు వున్నాయి. ఎవరికి వారే అయినా వాళ్ళందరివారు, వరప్రసాదులుకూడా. అందుకనే ఇక్కడ అతిముఖ్యమైన

ఆరు – పళని, తిరుచెందూరు, తిరుత్తమణి, స్వామమలై, తిరుప్పరకున్రం, పలముదుర్‌చోలై సుబ్రహ్మణ్య స్వామి కోవెలలు, శివగంగ జిల్లాలోని పిళ్ళయ్యారుపట్టిలో 400 సంవత్సరాలనాటి వినాయకుని ఆలయం వుంది. ఈ ఆలయ విశేషం ఇక్కడ స్వామివారి వాహనం ఎలుక విగ్రహం చెవిలో మన కోర్కెలు చెబితే, అది స్వామివారికి తెలిపి మనలను అనుగ్రహింపచేస్తుందన్నది జనవాక్యం.

ఇంతవరకు మనం మామూలు దేవతల దేవాలయాలను తెలుసుకున్నాం. 'నవగ్రహాలు' అనడం, వినడం, ఒక గుంపులోలాగ ఒకచోట వుంటే వెళ్ళి **'ఆదిత్యాయచ సోమాయ మంగళాయ బుధాయచ, గురుశుక్రశనైభ్యశ్చ రాహువే కేతువేనమః"** అని నమస్కారం పెట్టి ప్రదక్షిణలు చెయ్యడం పరిపాటి ఇందుకు భిన్నంగా తమిళనాట నవ గ్రహాలకు తొమ్మిది ఆలయాలు, మనోరంజకంగా వుండటమొక విశేషం. ఇటువంటి ఆలయసముదాయాన్ని మరెక్కడా కనబోము.



**1. 'తిరుమంగళంకుడిలో సూర్యనార్ ఆలయ'** ముంది. కుంభకోణంనుడి 15 కి.మీ దూరంలో 1075–1120 సం॥లమధ్య కులోత్తుంగ చోళుడీ ఆలయాన్ని నిర్మించాడని చరిత్ర చెప్పే సాక్ష్యం. మూడు అంతస్తులతో కళ్ళు చెదిరే శిల్పకళాసంపదతో, సూర్యనారాయణమూర్తి భార్యలైన ఉష, ఛాయాసమేతుడై ప్రత్యక్ష భగవానుడు. భక్తులకు దర్శనమిస్తున్నాడు. ఇంకా ఈ ఆలయంలో విశాలాక్షి, కాశీవిశ్వేశ్వరులను, నవగ్రహాలు ప్రతిష్టించినా వినాయకుని దర్శించగల్గుతాము. చరిత్రను గమనిస్తే పూర్వం కలవుడనే ఋషి తనకు త్వరలో కుష్టురోగం వస్తుందని తలచి నవగ్రహాలను ప్రసన్నం చేసుకుని రోగవిముక్తుడౌతాడు. ఇందుకు బ్రహ్మకోపించి, 'నా రాతనే ధిక్కరించినందులకు మీరా కుష్టురోగమొందండి అని సూర్యచంద్రులను శపిస్తాడు. వారు క్షమించి శాపోపశమనం తెలుపమని ప్రార్థిస్తారు. అప్పుడు శాంతించిన బ్రహ్మ, తిరుమంగళక్కుడిలోని ప్రాణనాథేశ్వరుని సేవించి శాపోపశమనం పొందమని చెబుతారు. దాంతో సూర్యచంద్రులు భూలోకానికి వచ్చి వినాయకుని ప్రతిష్ఠించి, ప్రాణనాథేశ్వరుడిని, గణపతిని సేవించి బ్రహ్మ శాపంనుండి విముక్తులౌతారు. ఇంతకుమునుపే తాను కుష్టువ్యాధినుండి బయటపడినందులకు కృతజ్ఞతగా నవగ్రహాలు తపమాచరించిన ప్రదేశంలో కలవమహాముని ఆలయం నిర్మిస్తాడు. అదే సూర్యనాధ్ దేవాలయం. ఇక్కడి సూర్యదేవుని అతినిష్ఠగా పూజించాలి. పూజానంతరం తొమ్మిది సార్లు స్వామికి ప్రదక్షిణం చెయ్యాల్సివుంటుంది. దీనిని ఇప్పటి భక్తులు ఎంతో పవిత్రంగా నిర్వహిస్తున్నారు.

**2. తిరువైయార్ – చంద్రదేవాలయం :** దీనికి (తిరువైయార్) 5 కి.మీ దూరంలో 'తిన్గాలూర్ కోవెల' అనే చంద్రగ్రహ దేవాలయం వుంది. సుఖసంతోషాలు, దీర్ఘాయుష్షు కోరువారు చంద్రుని పూజిస్తారు. సెప్టెంబరు, అక్టోబరు మాసాలలో అలాగే మార్చి, ఏప్రిల్ నెలలో... అదీ ఫల్గునీ నక్షత్ర సమయంలో వచ్చే చంద్రకాంతి ఇచ్చట శివలింగంపై సరాసరి ప్రసరించడమొక విశేషం.

**3. తిరువైయారు అంగారక దేవాలయం :** తిరువైయారుకు 6 కి.మీ దూరంలో కుజ (అంగారక) గ్రహ దేవాలయముంది. దీనిని వైతీశ్వరన్ కోవెల గా కూడా పిలుస్తారు. వ్యాధులెటువంటివైనా అంగారకుడు నిర్మూలిస్తాడు. ధైర్యం, విజయం ప్రసాదిస్తాడు. భక్తికి మురిసి వివాహాలు కూడా జరిపిస్తాడు.

**4. తిరువెన్నారు బుధ దేవాలయం :** అంగారకుని 10 కి.మీ దూరంలో బుధుని దేవాలయముంది. ఇక్కడి స్వామి 'శ్వేతారణ్యేశ్వరుడు'. అమ్మవారు విద్యాంబిక. వాల్మీకి రామాయణంలో ఈ ఆలయ ప్రస్తావన కనుగొనవచ్చును. బుద్ధి, తెలివితేటలు, బ్రతుకు, ఈ బుధుని కరుణవల్లనే పొందగల్గుతాము. పురాణాల ప్రకారమీతడు తారా చంద్రుల కుమారుడు. ఇది చాలా పురాతనాలయంగా చరిత్ర చెబుతోంది.

**5. బృహస్పతి దేవాలయం :** అలగుండి, కుంభకోణానికి 18 కి.మీ దూరంలో వుంది. దీనిని 1131లో విక్రమ చోళచక్రవర్తి నిర్మించాడుట. ఇక్కడిస్వామి 'గురు దక్షిణామూర్తి'. ఇంకా కాలకూట విషాన్ని శివుడు మ్రింగిన ప్రదేశమిదేనని కూడా చెబుతారు. దీంతో శివుని 'ఆపద్ సహాయేశ్వరర్' అని దేవతలు కొలిచారుట. అప్పుడు శివుడు గురుదక్షిణామూర్తియై దేవతలకు జ్ఞానబోధ చేసి తరింపచేస్తాడుట. గురుదోషమున్నవారు నానబెట్టిన శనగల దండస్వామికి వేసి, 24 ప్రదక్షిణలు చేసి, స్వామి సన్నిధానంలో 24 దీపాలను వెలిగించాలి. ఇక్కడిస్వామి 'అరణ్యేశ్వరుడు'. దక్షిణామూర్తిస్వామికి కూడ ఆరాధన సలిపి గురుగ్రహదోషాలను పోగొట్టుకుంటారు.

**6. శుక్రదేవాలయం, కాంచనూరు :** ఇక్కడి సూర్యదేవాలయానికి 3 కి.మీ దూరంలో ఈ ఆలయముంది. దీనిని పలాశవనం, బ్రహ్మపురి, అగ్నిస్థలమని కూడా అంటారు. ఇక్కడే బ్రహ్మ– పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని దర్శించాడని కూడా చెబుతారు. స్త్రీల అనారోగ్యం గురించి వారి భక్తులిక్కడకు వచ్చి ప్రార్థనలు చేస్తారని చెప్పుకుంటుంటారు.

**7. తిరునల్లార్ శనిగ్రహ దేవాలయం :** ఇది కుంభకోణానికి 53 కి.మీ దూరంలో కరైకాల్‌కు 7 కి.మీ దూరంలో వుంది. ఈ ఆలయం పురాతనమైంది. ప్రసిద్ధిచెందిందికూడా. లక్షలాదిమంది భక్తులు ఇక్కడికి వచ్చి శనిదేవుని కొలుస్తారు. నలమహారాజును తన కార్యక్రమంలో భాగంగా శనిదేవుడు పట్టుకున్న ప్రదేశమిదని చెబుతారు. ఇక్కడి నలతీర్థస్నానం, సర్వపాపహరణమని భక్తుల నమ్మిక. ఈ ఆలయంలోని స్వామిని 'దర్భారణ్యేశ్వరు'నిగా పిలుస్తారు.స్వామిని దర్భలతో ప్రత్యేకించి పూజిస్తారు. దర్భల కొసలకు ముడివేస్తే తమను కష్టాలు దరిచేరవని భక్తుల విశ్వాసం. ఇక్కడున్న మరో దేవాలయం 'నలనారాయణ' దేవాలయం. ఇచ్చట నలదమయంతుల విగ్రహాల్ని మనం చూడగల్గుతాము. శని ప్రభావంనుండి లేదా కల్పించే ఆపదలనుండి బయటపడాలంటే శనిదేవునితోపాటు నలదమయంతులను కూడా పూజించాలిట.

ఈ ఆలయం నాల్గు యుగాలలోను వుందిట. కృతయుగంలో ఆదిపురిగా, త్రేతాయుగంలో దర్భారణ్యంగా,

ద్వాపరంలో వేదపురిగా, ఈ కలియుగంలో నలేశ్వరంగా పిలువబడుతుంది. నలమహారాజు స్నానం చేసి, శనిమహారాజు బాధలనుండి తప్పించుకున్న 'బ్రహ్మదండం' తీర్థం కూడా చూడవచ్చును. ఇక్కడ గూటిలో రాతితో చెక్కబడిన శనిదేవునికి అభిషేకాలు ప్రతినిత్యం భక్తిశ్రద్ధలతో జరుపబడుతాయి. మహాభక్తులు, తిరుజ్ఞానసంబంధర్, తిరునావుక్కరసు, సుందరన్ శనీశ్వరునిపై ఎన్నో పాటలు రచించారు. ఇక్కడ శనీశ్వరునకు బంగారు కాకివాహనముంది. మూలవిగ్రహానికి బంగారు కవచము వుంది. మహామహిమాన్వితమీ క్షేత్రం. ఇక్కడ ప్రతి రెండున్నర సంవత్సరాలకు 'శనిపెయెర్చి' అనే ఉత్సవం చేస్తారు. అది చూడదగ్గది. ఓపిక వున్నవాళ్ళు పాల్గొనదగినది.

**8. రాహుగ్రహ దేవాలయం, తిరునాగేశ్వరం :** కుంభకోణానికి కేవలం 5 కి.మీ దూరంలో ఈ దేవాలయం వుంది. అది పురాతనమైనది. రాహుగ్రహదేవాలయం ఇచ్చటి దైవాన్ని 'నాగనాథు'నిగా పిలుస్తారు. ఈ తిరునాగేశ్వరంలోని స్వామిని నలుడు, గౌతముడు, పరశురాముడు, ఇంద్రుడు, సూర్యుడు మొ॥గువారు అర్చించినట్లు చరిత్ర చెబుతోంది. రాహుగ్రహ దోషాలున్నవారు ఇక్కడ చేసే పూజలవలన సుఖశాంతులను పొందుతారనేది భక్తజన ప్రగాఢ విశ్వాసం. పంచపాండవులు ఈ రాహువును సేవించిన వారిలో వున్నారు. ఇంకా ఇక్కడి విశేషం రాహుకాలంలో కనుక పాలతో అభిషేకిస్తే, ఆపాలు కంఠం దిగేసరికి నీలంగా మారిపోతాయి. మిగిలిన సమయాలలో మామూలుగానే వుంటాయిట.

**9. కేతుగ్రహం :** 'కీల్‌పెరుంపల్లమ్' పూంపుహారుకు 2 కి.మీ దూరంలో ఈ దేవాలయముంది. కుంభకోణం వెళ్ళినవాళ్ళకు ఈ నవగ్రహాలను దర్శించగల్గడం సులభాతిసులభంకాకపోయినా, సులభమని చెప్పాల్సివుంటుంది. ఇచ్చట కేతుగ్రహదోష నివారణకు ప్రత్యేక పూజలు జరుగుతుంటాయి. ఇక్కడ 9 పుష్కరిణులున్నాయి. వీటిలో స్నానం చేసి, 12 వారాలు కనుక స్వామిని ఆరాధిస్తే నవగ్రహదేవతామూర్తుల అనుగ్రహం లభిస్తుందిట. పూర్వకాలంలో సూర్యుని పరీక్షిత్తు, చంద్రుని చిత్రాంగద, పాండ్యుడు; అంగారకుని పురూరవుడు; బుధుని సోమస్కందుడు; గురువును ఇంద్రుడు; శుక్రుని ధూమకేతు; శనీశ్వరుని నలమహారాజు నియమానుసారం ఆరాధించి, తమతమ దోషాలను పోగొట్టుకున్నారని పురాణాల కథనం.

ఇదీ నవగ్రహదేవాతామూర్తుల ఆలయాల గాథ.

ఇక మళ్ళీ తమిళనాడులోని మరికొన్ని దేవతలను అలాగే 33 కోట్ల మంది దేవతలనే మన ఆర్షభూమిలోని ఇతర దేవీ,దేవతామూర్తులు, గ్రామదేవతల వివరాలతో సహా తెలుసుకుందాం!

ఇప్పుడు పెళ్ళికాని అమ్మాయిలు, అబ్బాయిలు పఠించే తారకమంత్రం గురించి తెలుసుకుందాం! 'తిరుమణ తిరుతల సుట్రుల్లా' ఇదేం మంత్రమనుకోకండి. దీనికి మన భాషలో అర్థం 'కల్యాణక్షేత్రాల సందర్శనం' అని. ఆలయాల మయమనుకునే తమిళనాట... ఇంకా చెప్పాలంటే ఈ ద్రవిడదేశంలో పెళ్ళికాని వారిని కరుణించే పదకొండు దివ్యక్షేత్రాలున్నాయి. ఏ క్షేత్రం దర్శించినా ఫలితం వెంటనే లభిస్తుంది. పదకొండు దర్శిస్తే పరమానందదాయకం. అలాగని గాలిలో దీపం పెట్టి 'దేవుడా! నీ మహిమ...' అనకూడదు. మన ప్రయత్నాలు మనం చెయ్యాలి. ఒక ఇల్లాలు సంతానం కోరి ఒక మహనీయుని దర్శిస్తే ఆయన అశ్వత్థవృక్షం చుట్టూ మూడు మార్లు ప్రదక్షిణ చేస్తే సంతానం కల్గుతుందని చెబుతారు. గబగబ మూడుసార్లు ప్రదక్షిణం చేసి కడుపు తడుముకుందిట.

దైవశాసనం, మహనీయులవాక్కు + మన ప్రయత్నం = కర్తవ్యాన్ని నిర్వహింపచేస్తుంది. అలాగని మన కర్మానికి మనల్ని విడిచిపెట్టక తమిళనాడు టూరిస్టు డిపార్టుమెంటువారు, ఈ అన్ని ఆలయాలకు కల్పి హడావుడిదైన ఒక పాకేజీ ఏర్పాటుచేసారు. ఇది మూడు రోజులలో పూర్తవుతుంది. ముందుగా ...

**1. ముదిచూర్ :** తాంబరం–చెన్నయ్‌లోని ఆలయం. ఇది హరిహరక్షేత్రం. ఇక్కడి దేవత 'విద్యాంబిక' అమ్మా అని ప్రార్థించినా, అయ్యలారా అని హరిహరుల్ని పూజించినా కల్యాణం జరుగుతుందిట.

**2. తిరువిడనత్తై :** మహాబలిపురం వద్ద గల శ్రీలక్ష్మీవరాహస్వామి ఆలయం వుంది. ఇక్కడి అమ్మవారు 'కోమలవల్లి' తాయారు. త్రేతాయుగంలో శ్రీమహావిష్ణువు 'కలవుడు' అనే మహర్షికి జన్మించిన 360 మంది కుమార్తెలను వివాహం చేసుకున్నాడుట. కాబట్టి 'కన్నెచెర' పోగొట్టే ఈ దేవదేవుని అమ్మతో కలిసి పూజిస్తే వివాహమౌతుంది.

**3. తిరుమణంజేరి :** శివపార్వతుల కల్యాణం జరిగిన దివ్య ప్రదేశమిది. ఇక్కడి శివుని పేరు 'సుందరేశ్వరుడు'. ఈ క్షేత్ర దర్శనమే 'కల్యాణకారకం.'

**4. ఉప్పలియప్పన్ :** మార్కండేయ మహర్షికి పుత్రికగా జన్మించిన భూదేవి, కాలాంతరంలో శ్రీమహావిష్ణువునే పెండ్లి చేసుకుంటుంది. పెండ్లి కాదనుకునే లేక ఎలాగ చెయ్యాలనుకునే మహర్షికి మహదానందం కల్గించిన దివ్యప్రదేశం కాబట్టి కల్యాణం గురించి చింతించేవారికిది కల్పవృక్షం గా చెప్పబడుతుంది.

**5. నాచ్చియారు :** 108 దివ్యతిరుపతులలో ఇదొకటి. ఇక్కడ విష్ణుమూర్తి. 'నరైయూరు'నంబిగా, అమ్మవారు 'నాచ్చియారు'గా వెలుగొందుతున్న ప్రదేశం. ఈ క్షేత్ర దర్శనం వివాహానికి శుభమౌతుందని చెప్పవచ్చును.

**6. తిరుకరుకావూరు :** ఇది అతి ప్రాచీన అత్యంత మహిమాన్విత శైవక్షేత్రం. ఇక్కడి శివ పత్ని పేరు 'గర్భరక్షాంబిక'. పెండ్లికానివారు, సంతానహీనులు ఈ తల్లిని సేవిస్తారు. పుట్టమట్టితో రూపుదిద్దుకుందీ శివలింగమని, దీనికి అభిషేకాలు లేవుకానీ పునుగు సుగంధద్రవ్యాలను అలాగలాగ ... సుతిమెత్తగా అద్దుతారు.

**7. తిరుచ్చేరై :** శ్రీదేవిభూదేవి సమేత విష్ణుమూర్తి ఇక్కడ 'సారనాధు'నిగా వెలిసాడు. దీనిని 108 దివ్యక్షేత్రాలలో ఒకటిగా చెబుతారు. ఇక్కడి అమ్మవారి పేరు 'సారనాయకి' కావేరినది సాకారియై శ్రీమహావిష్ణువును వివాహమాడిం దిక్కడే. అందుకని కల్యాణం ఆలస్యమయ్యేవాళ్ళు ఈ ఆలయాన్ని దర్శిస్తే వారికి తప్పక వివాహమౌతుంది.

**8. మధురై :** పాండ్యరాజు తన కుమార్తె మీనాక్షిని, 'చొక్కనాధు'డైన పరమేశ్వరునికిచ్చి వివాహం జరిపిన ప్రదేశం. ఈ క్షేత్రదర్శనం ఇక్కడి దేవీదేవతల పూజనం మనోభీష్టములను నెరవేర్చి వివాహము, సంతానం ప్రసాదించబడుతుంది.

**9. తిరునల్లూరు :** ఇదీ శివక్షేత్రమే. ఇచ్చటి దేవుని పేరు 'పంచవర్ణేశ్వరుడు', కాని 'కల్యాణ' సుందరేశ్వరునిగా భక్తులు ఆరాధిస్తారు. శివపార్వతుల కల్యాణాన్ని దక్షిణముని, ద్రావిడముని అగస్త్యులవారు ఇక్కడనుండే దర్శించారని ఇచ్చట చేసే పూజలవలన కల్యాణాలు జరుగుతాయనేది భక్తులపరిపూర్ణ విశ్వాసం.

**10. తిరువేదగం :** వైగీనదీ తీరాన కొలువైన శివక్షేత్రం. కల్యాణదాయకం. ఇక్కడి అమ్మవారు, అయ్యవార్లను 'ఏడగనాథర్', ఇలావర్‌కులాలి అమ్మై' పేర్లతో పూజించి, తరిస్తారు.

**11. తిరువీళిమిళలై :** ఇక్కడ శివుడు, కాత్యాయినీ దేవిని వివాహమాడిన దివ్యప్రదేశము. ఇచ్చటి స్వామిపేరు 'వీళినాథుడు'. ఇది కల్యాణ ప్రదేశంకాబట్టి 'కల్యాణ'కారకమని భక్తుల విశ్వాసం.

ఇలాగ చూస్తూంటే, ద్రావిడ దేశంలోని ప్రతి అంగుళం పరమపవిత్రమైందే, పూజనీయమే. ఆవరుసలో చూస్తే **'తిరుక్కావళంపాడి'లోని 'గోపాలకృష్ణఆలయం'**, 108 దివ్యతిరుపతులలో ఒకటిగా ప్రసిద్ధిచెందిన ప్రదేశము. ఆళ్వారులలో తిరుమంగై ఈ స్వామిని ఆరాధించి, స్తుతించిన ప్రదేశం. ఇచ్చటి **మంగైమఠంలో వీరనరసింహస్వామి** వారి ఆలయం వుంది. చూడదగ్గదనే చెప్పాలి.



ఇలాగే సేలం జిల్లా, **'మల్లూరులో బాలకృష్ణుని దేవాలయ'** ముంది. వ్యాసరాయలవారు ఈ ఆలయం నిర్మించి ఇందులో సాలగ్రామ శిలతో చెక్కబడిన బాలకృష్ణుని విగ్రహం తను చిన్ననాట గురువుగారి దగ్గర విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో దర్శించిన స్వామి మూర్తిని ఇక్కడ ప్రతిష్ఠింపచేసారు. కృష్ణాష్టమి నాడు సూర్యనారాయణమూర్తి తన కిరణాలతో స్వామిని అర్చిస్తాడు. ఆలయ పరిసరాలలో 3 శివాలయాలు వున్నాయి. ఇతర దేవతామందిరాలు వున్నాయి. అయినా శ్రీకృష్ణదేవ రాయలను గండకాలంలో రక్షించిన, పురందరదాసుల గురువైన వ్యాసరాయలవారి భక్తికి నిదర్శన మీ ఆలయం.

ఇప్పుడు దేవతలు అయ్యారు. అసలు **మనకు దేవీ, దేవతలెందమంది?** లెక్కలు విడివిడిగా చెప్పలేరుకాని **మొత్తం '33 కోట్లమంది' అంటారు.** అందులో గ్రామదేవతలు వున్నారుకాబట్టి వారిని గూర్చి కూడా తెలుసుకుందాం! ఇక్కడో చిన్న మెలిక వుంది. గ్రామ దేవతలనేసరికి కొందరు ఉదాసీనత చూపుతారు. ఈ సమయంలో మీకొక విషయం. ప్రతివారికి కులదేవత వుంటుంది. కులదేవత లేకపోతే గ్రామదేవత. ఆ తర్వాతే మనం అభిమానించే, ఆరాధించతలచిన దైవం. ఇటు గ్రామదేవతను, అటు కులదేవతనుకాదని ఆరాధించే ఆరాధనలు; బ్రాహ్మణులు, గాయత్రి చెయ్యకుండా చేసే పూజలవంటివవుతాయి. ఫలితం రాదుసరికదా, అధర్మపాలనకు అనవసరపాపం మూటగట్టుకోవల్సివస్తుంది.

**ఇప్పుడు గ్రామదేవతల గూర్చి వివరంగా తెలుసుకుందాం!**



**అయ్యన్నార్ దేవాలయం :** 'అయ్య' లేక 'అయ్యగారు' అనే పోతురాజు వంటి ఓ గ్రామదేవత. చూడటానికి కలిపురుషుడిలా కనిపిస్తాడు. చేతిలో కత్తి, గుర్రంపై స్వారీ చేస్తూ కనిపిస్తాడు. గ్రామాన్ని కబళించే అంటు, విషవ్యాధులను, గాలి, ధూళివంటి క్షుద్రదేవతలను తరిమికొట్టి తమగ్రామాలను రక్షించుకోవడం వీరి కర్తవ్యం. అలాగే గ్రామస్థులు వీరిని పూజిస్తారు.



**మధురై వీరన్ :** ఈయనకూడా ఒక గ్రామ దేవతే. చేయని నేరానికి రాజదండనకు గురైన వీరన్ నిజానికి మహావీరుడు. నాయక్ రాజుల ఆస్థానంలో సేనాధిపతి. ఈయన ఆధిపత్యాన్ని భరించలేని కొందరు ధూర్తులు, వీరన్‌పై రకరకాల చాడీలు చెప్పి ఆతన్నే ఒక బందిపోటు దొంగగా రాజుచేత శిక్షింపచేస్తారు. ఆ ప్రమాదంలో ఆతను మరణిస్తాడు. ఆ తర్వాత సత్యం తెలిసిన రాజు, పలుప్రాంతాలలో అతని విగ్రహాలు పెట్టించి, మరీ గౌరవిస్తాడు. ఆ దేశభక్తుడు గ్రామదేవత, రాజ్యరక్షణకు పాటుపడుతున్నాడు.



**కరుప్పుస్వామి ఆలయం :** ఈ నల్లని దేవుని, ప్రజలు తమ ఆరాధ్యదైవంగా, రక్షకునిగా, చల్లని దేవునిగా పూజించుకుంటారు. ఈ నల్లని దేవుడెవరోకాదు, రామ కుమారుడైన కుశుడే. ఒకసారి రాముని దర్శించడానికి లవకుశులు తల్లి ఆశీస్సులతో వెడతారు. రాముడు వారిని చూసి, ఎవరైతే అగ్నిగుండంలో ఏ విధమైన గాయంలేకుండా నడిచి వస్తారో వారు నాకు అంగరక్షకులంటాడు. లవుడు వెనుకంజవేస్తాడు. కుశుడు ముందుకు వస్తాడు. సురక్షితంగా అగ్నిగుండంలో నడిచివస్తాడు. కాకపోతే ఆతని శరీరం మాత్రం నల్లబడుతుంది. ఆ నల్లని వాడే ఇప్పుడు వీరు కొలిచే నల్లనివాడు. వీరి ప్రాణరక్షకుడు.



**ఇసక్కి అమ్మ :** 'ఇసక్కి' అమ్మ ఒక గ్రామదేవత. ఈ తల్లికి ఆలయం 'శుచీంద్రం'లో వుంది. అందరి గ్రామదేవతలవలె అంటువ్యాధులు, విషజ్వరాలు, గాలి,ధూళి, క్షుద్రశక్తుల విహారంనుండి, తన గ్రామాన్ని రక్షించుకోవడం ఈ తల్లి కర్తవ్యం. అందుకనే ఈ తల్లిని తమ ప్రాణరక్షకిగా గ్రామస్థులు తలచి కొలుస్తారు. కన్యాకుమారి, తిరునల్వేలి, సేలం జిల్లాలలో ఈ తల్లిని ఆరాధించేవారెక్కువ. జంతుబలులు ఇవ్వడం ఒకనాటి ఆచారం.

**శ్రీపెరియాచ్చి అమ్మ :** నిజం చెప్పాలంటే 'పెరియాచ్చిఅమ్మ' అంటే పెద్దమ్మగా తలవాలి. ఈ తల్లికి శిశుజననంలోను, వారి రక్షణలోను ప్రముఖ స్థానం వహించే చల్లని తల్లి. ఈమె పూజనం సకల శ్రేయోదాయకం. ఇందుకు పరమదుర్మార్గుడైన ఆ దేశపు రాజే నిదర్శనం. రాజుగారి భార్యకు ప్రసవసమయం వచ్చిందికాని, ఆ దుర్మార్గుని సంతానాన్ని రక్షించడానికి ఏ ఒక్కరు రాకపోయేసరికి, తల్లిగా పెరియాచ్చి అమ్మ మంత్రసానిగా వస్తుంది. పురుడుపోస్తుంది. రాజును బహుమతి అడుగుతుంది.



సంతోషంతో బహుమతి ఇవ్వవలసిన రాజు, నానాతిట్లు తిట్టి, భటులతో అసలు నిన్నెవరు రమ్మన్నారంటూ గెంటిస్తాడు. అందుకు భద్రకాళి అయి ఆ తల్లి ఈ రాజును చీమను నలిపినట్లు తన కాలిక్రింద నలిపి, దుష్టశిక్షణతో, రాజ్యానికి సుఖశాంతులను ప్రసాదిస్తుంది. రాజకుమారుడు నేలమీద పడితే ఉపద్రవమన్న సంగతి తెలిసిన పెరియాచ్చి అమ్మ ఆ పిల్లవాడు భూమిపై పడకుండా చేతులలో ధరించి, రాజ్యవినాశనాన్ని ఆపుతుంది. అందుకే ఈ తల్లి శిశుసంరక్షకి, లోకరక్షకి కూడా!



**సమయపురం మారియమ్మ :** మహామహిమగల తల్లి. భక్తరక్షకి, దుష్టశిక్షకి. తిరుచిరాపల్లికి 16 కి.మీ దూరంలో ఈ సమయపురం మారియమ్మ ఆలయముంది. ఈమెను శ్రీరంగనాథుని సోదరిగా చెప్పుకుంటారు. పుష్యమాసంలో జరిగే ఉత్సవాలకు, శ్రీరంగంనుండి పట్టుబట్టలు వగైరా సారెను సాంప్రదాయబద్ధంగా ఆలయమర్యాదలతో అర్పించడమొక ఆచారం. రక్తబీజుని సంహరించిన భద్రకాళి అపరావతారంగా, ఈ సమయపురం మారియమ్మను చెప్పుకుంటారు.

**శ్రీమహాలక్ష్మీదేవి, నారాయణీపీఠం :** కాట్పాడి రైల్వేస్టేషనుకు దగ్గర్లో ఈ క్షేత్రం వుంది. వెల్లూరుకు 6 కి.మీ దూరంలోని శ్రీనారాయణీ పీఠంలో శ్రీలక్ష్మి అమ్మ గ్రామదేవతగా కొలువైంది. ఈమెకిక్కడ బంగారు తాపడంచేసిన ఆలయం నిర్మించబడింది. ఈ స్వర్ణదేవాలయం ఏగ్రామదేవతకు లేనివిధంగా తీర్చిదిద్దబడింది. స్థలపురాణం ప్రకారం చెట్టుక్రింద గ్రామదేవతగా పూజలందుకుంటున్న లక్ష్మీదేవిని వున్నట్లుండి ఒక బాలుడు పూజించడం మొదలుపెట్టాడు. మొదట్లో పట్టించుకోనివారు, ఆతర్వాత తర్వాత ఆతనిని చేరడం, ఆ పిల్లవాడు చెప్పినవి చెప్పినట్లు జరగడం అలాగ ప్రారంభించి, ఈనాడు స్వర్ణదేవాలయం నిర్మించే దశకు వచ్చింది. లక్ష్మీఅంశతో జన్మించిన ఆనాటి పిల్లవాడు ఈనాడు 'నారాయణీఅమ్మగా' పీఠంపై నిలిచి భక్తజనులకు కొంగుబంగారమయ్యాడు.





**మంగళాదేవి కణ్ణంగిమాత :** కేరళలోని పాలక్కడ్ పట్టణం, తమిళనాడు సరిహద్దు, అక్కడి కణ్ణంగిమాత ఆలయం పరమప్రసిద్ధం. ఈ తల్లిని మంగళాదేవి అని భక్తులు కొలిచి, ఆరాధిస్తారు. ఈ కణ్ణంగి మాత తన దివ్యశక్తితో ఆదిపరాశక్తిగా, పార్వతి, కాళిగా భక్తులచే అర్చించబడుతుంది.

**తిరుప్పుళ్ళంపూతంగుడి :** కుంభకోణానికి 10 కి.మీ దూరంలో వుందీ క్షేత్రం. 108 తిరుపతులలో ఇది ఒకటి. సీతను అపహరించి తీసుకువెడుతున్న రావణు నెదిరించి, జటాయువు ప్రాణపరిత్యాగం చేసిన ప్రదేశమిది. అందుకునే శ్రీరాముడు ఇక్కడే జటాయువుకు మోక్షాన్ని ప్రసాదించాడు. ఇక్కడి ఆలయంలో తూర్పుముఖంగా పడుకునివున్న 'వల్విల్లరాములు, పొత్తామరైయాల్ తాయర్లు, శోభనవిమానం, గృధ్రతీర్థంకల స్వామిని, పన్నెండు మంది ఆళ్వారులలో ఒకరైన తిరుమంగై ఆళ్వార్ ఎంతో గొప్పగా కీర్తించారు.

ఇది తమిళనాటి ద్రావిడ దేశంలోని పరమపవిత్ర ఆలయాల స్వరూపం. దర్శనం, స్పర్శనం మంచిదే. కానివారు చదువుకుని సంతోషించడానికి వీలుగా వ్రాయబడింది. ఇంతేనా ... అనకండి .. ముందు ఇవి చూడగల్గితే అక్కడనుండి మిగిలినవి అలాగే చూడగల్గుతాము. నిజం ప్రయత్నించండి!!

**విషయ సుఖాలకు లొంగకుండా సంసారంలో తిరిగేవాని, భోజనాదులందు నియమంగలవాని, జితేంద్రియుని, శ్రద్ధాళువునీ ఏ మారుడూ చెరపజాలడు.**

– బుద్ధుడు

**శబ్దాలు లేని ఓంకారమే తురీయం. ఇది నాలుగవ అవస్థ. ఇది సర్వాతీతమైన, నిర్వికారామైన సత్త పరమానందం, అద్వైతం. ఇలాంటి ఓంకారమే ఆత్మ, దీన్ని గ్రహించిన వాడు తన ఆత్మను పరమాత్మలో లీనం చేసుకుంటాడు.**

– మాండుక్యోపనిషత్తు

**సూర్యుడే శక్తి, చంద్రుడే పదార్థం. లేదా సాకారం, నిరాకారం అయినదంతా కూడా పదార్థమే. అవును ఆకారమే పదార్థం.**

– ప్రశ్నోపనిషత్తు

**ఆత్మ సాక్షాత్కారం పొందనివారూ, ఇంద్రియ సుఖాలపై ఆసక్తిగల అసుర స్వభావులూ, ఆత్మ హంతకులూ వీరంతా మరణం తర్వాత మళ్లీ జన్మలు పొందుతారు.**

– ఈశావాస్యోపనిషత్తు

**ఆత్మ అన్నది తెలిసిన దానికంటె నిస్సంశయంగా భిన్నమైనది. తెలియని దానికంటే నిస్సందేహంగా అతీతమైనది. ఈ విషయం మాకు మా పూర్వీకులు చెప్పారు.**

– కేనోపనిషత్తు

**సృష్టికర్త అయిన బ్రహ్మ, సకల జీవకోటి, వాటి ఆహారం అన్నీ కూడా సర్వజ్ఞుడు, సర్వవిదుడు, జ్ఞానమే తపంగా గలవాడు అయిన పరబ్రహ్మ నుంచి ఉద్భవిస్తున్నాయి.**

– ముండకోపనిషత్తు

# త్రిపుర




ఇక్కడ ముఖ్యంగా ముందు చూడవలసినంది 'శక్తి' పీఠాలలో ఒకటైన త్రిపురసుందరీదేవి ఆలయం. సతీదేవి శరీరాన్ని 8 ఖండాలుగా ఖండించినప్పుడు ఆ తల్లి కుడి పాదం ఇక్కడ పడి, ఇది శక్తి పీఠమైందని చెబుతారు. పేరు త్రిపుర సుందరేకాని, అమ్మ ఇక్కడ కాళికాదేవిగా దర్శనమిస్తుంది.

దీనిని 1501లో మహారాజా ధన్యమాణిక్య దీనిని నిర్మించాడు. ఇది కూర్మరూపంలో వుండటంతో దీనిని "కూర్మ దేవాలయం" అని కూడా అంటారు.

పిలక - ఒక ప్రముఖ బౌద్ధారామం. ఎనిమిదవ శతాబ్దం నాటి ఈ మందిరంలో పది కి.మీ మేర ఎన్నో శిధిలాలయాలు కనబడతాయి. అవలోకితస్వామి, నృసింహదేవళం ఇచ్చటి ప్రముఖ దేవాలయాలు.

అగర్తలకి 27 కి.మీ దూరంలో కొండపై కమలాసాగర్ సరస్సు, కాళిమాత గుడి, జగన్నాధాలయం చూడవచ్చును.

ఊనకోటి (వేయికి ఒకటి తక్కువ)లో 12వ శతాబ్దంనాటి పెద్ద రాతి శిల్పాలు అద్భుతంగా దర్శన మిస్తాయి. అలాగే

గోమతీ నది తీరంలోని భువనేశ్వరి గుడి, ఉదయపూర్ మహరాజు గోవిందమాణిక్య మహారాజు నిర్మించిన దానిని కూడ మనం చూడగల్గుతాము.

ఇవన్నీ చూసేవారికి ఆసక్తికి, 'ఆ'శక్తికి నిదర్శనంగా మనం తలవాల్సివుంటుంది.

'మీరు చూసారా?' అని పొరపాటున ప్రశ్నిస్తే వచ్చే సమాధానం వినయంగా 'నమస్కారం'. ఇది సంస్కారమో, సభ్యతో ఆపరమేశ్వరునికే తెలియాలి.

"త్రిపుర" అనగానే త్రిపురసుందరి జ్ఞాపకమొస్తుంది. ఇంకా త్రిపురాసుర సంహారకుడైన శివుడు జ్ఞాపకానికి వస్తాడు. అగర్తలకు 57 కి.మీ దూరంలో వున్న కొండపైన మనం తలచుకున్న "త్రిపురసుందరి"మాత దేవాలయముంది. ఆ ఆలయంకూడా శక్తిపీఠాలలో ఒకటిగా చెబుతారు. పరమశివుడు సతీదేవిని భుజాన వేసుకుని, పూనకం వచ్చినట్లు వెడుతూంటే, శ్రీమహావిష్ణువు శివునికి తెలియకుండా, తన చక్రంతో సతీదేవి శరీరాన్ని ఖండిస్తాడు. అప్పుడిక్కడ అమ్మవారి కుడి పాదం ఇక్కడ పడి శక్తిపీఠమైందని చెబుతారు. ఇక్కడి తల్లి - కాళికగా దర్శనమిస్తుంది. ఆలయం తాబేలు ఆకారంలో వుంటుంది. దీనిని కూర్మపీఠమని, అమ్మవారిని 'మాతాబరి' అని పిలుస్తారు. ఈ ఆలయం 1501లో మాణిక్యమహారాజుచేత నిర్మించబడింది.

అసలిక్కడ విష్ణుమూర్తి ఆలయం కట్టాలనుకున్నారు. కాని అమ్మవారు కలలో కనబడి, తాను త్రిపురసుందరినని, తన విగ్రహం చిట్టగాంగ్‌కు సమీపంలో వుందనడంతో, విష్ణుమూర్తి - నారాయణుడుకాస్తా 'నారాయణి' అయిపోయి,

బెంగాలీపద్ధతిలో నిర్మించబడింది. ఇక్కడ 51 శక్తిపీఠాల నమూనాలను ఇక్కడ చూడగల్గుతాం. పిడుగుపడి ఈ ఆలయం ధ్వంసమైతే 1681లో మహారాజ రామమాణిక్యం పునర్నిర్మించాడు. ఈ ఆలయంలో త్రిపురసుందరి, 2 అడుగుల ఛోటిమ, ఎర్రరాతితో మలచబడ్డ కాళిమాతను చూడగల్గుతాం. ఇక్కడ సారగ్ అనే పుష్కరిణి వుంది. ఇందులో స్నానంచేసి దేవీదర్శనం చెయ్యాలనేది ఆలయ ఆచార,సాంప్రదాయం.

ఈ అగర్తలకు 14 కి.మీ దూరంలో పాత అగర్తలవుంది. ఇక్కడ చెప్పుకోదగ్గ "చతుర్దశ (14) దేవతాలయం వుంది. ఇన్ని దేవతల్ని ఒకేచోట చూడగల్గడం మన అదృష్టంగా భావించి పులకించాలి.


అగర్తలకు 27 కి.మీ దూరంలో కమలాసాగర్‌లోని "కాళిగుడి" కొండపై నుంది. అతిపురాతనమైంది. ఈ కొండపై ఒక పెద్ద సరస్సు వుంది. ఈ ఆలయాన్ని 15 శతాబ్దిలో ధన్యమాణిక్యమహారాజు నిర్మించాడని చెబుతారు. ఈ ఆలయంలో ఆరాధనలందు కుంటున్న ఈ తల్లిని "మహిషాసురమర్దిని"గా భక్తులు తలుస్తారు. ఇక్కడ కాళిమాత పీఠభాగంలో శివలింగముండటంతో 'ప్రకృతి, పురుషంచైవ" అన్నది సత్యమై నిలిచంది. జగతః పితరౌ వందే నన్నది మరొక్కసారి సత్యమై నిలిచింది.

అగర్తలాలోని "ఉనకోటి". కోటికి ఒకటి తక్కువనే దేవతాశిల్పాలనిక్కడ చూడగల్గుతాం. ఇవన్నీ 12వ శతాబ్దంనాటి శిల్పాలని, 7వ శతాబ్దంలో నిర్మించిన శివాలయమొకటి వుందని చెబుతారు. ఇక్కడ 30 అడుగుల కాలభైరవ విగ్రహముంది. అశోకాష్టమి అనే పుణ్యతిథిన ఇక్కడ పెద్ద ఉత్సవం మహాగొప్పగా జరుగుతుంది.

ఎక్కడ? అనకుండా, అక్కడా ఇక్కడా తేడాలేకుండా అడుగడుగు, అంగుళం అంగుళంలో నిలిచిన ఆ దైవశక్తిని, దైవంగా తలచే మన భాగ్యమే భాగ్యముగా రండి, పులకించి ఆనందంగా, ఈ అద్భుత దృశ్యాలను చూడలేని ప్రకృతిని, రమణీయ దృశ్యాలను, చారిత్రక ప్రదేశాలను కనులారా చూద్దాం. మనసారా ఆనందిద్దాం!

**చూడదగిన ప్రదేశములు**









# ఉత్తరప్రదేశ్





లక్నో రాజధానిగా ఉన్న ఈ రాష్ట్రంలో మొత్తం 13 జిల్లాలున్నాయి. ఈ లక్నోను గతంలో లక్ష్మణపురిగా పిలిచేవారు.

మహాభారతం, రామాయణాలలో సైతం ఉత్తరప్రదేశ్ గురించిన ప్రస్తావన ఉంది. రామాయణంలోని 'కోసల' రాజ్యం మహాభారతంలో 'హస్తినాపురం' రెండూ ఈ రాష్ట్రంలోనివే. క్రీ.శ. 6వ శతాబ్ధంలో ఈ రాష్ట్రంలోకి జైనిజం, బుద్ధిజం ప్రవేశించాయి. బుద్ధుడు తన మొట్టమొదటి ఉపన్యాసాన్ని 'సారనాధ్'లో ఇచ్చాడు. ఈ రాష్ట్రంలోని బదరీనాథ్‌లో శంకరాచార్య ఆశ్రమాన్ని నిర్మించారు. రామానందుడు, కబీర్, తులసీదాస్, బీర్‌బల్ మొ॥గు వారంతా ఈ రాష్ట్రానికి చెందినవారే. 1950 జనవరిలో రాష్ట్ర హోదాను పొందింది. నవంబర్ 2000లో ఈ రాష్ట్రంలోని కొంత భాగాన్ని ఉత్తరాంచల్‌గా విడదీశారు.

**విస్తీర్ణం : 2,38,566 చ.కిమీ.** **ప్రధాన భాషలు : హిందీ, ఉర్దూ**

**సరిహద్దులు:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి తూర్పు బీహార్, దక్షిణాన నైరుతిన మధ్యప్రదేశ్, పశ్చిమాన రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరాన టిబెట్, నేపాల్ వాయువ్యాన హిమాచల్‌ప్రదేశ్ ఉన్నవి.

## వారణాసి



**'కాశీ'** అనబడే ఈ పుణ్యక్షేత్రం యావత్ భారతీయులకూ అతి పవిత్రమైన యాత్రాస్థలంగా యుగయుగాలనుంచీ కొనియాడబడుతోంది. 'వరుణ' 'అసీ' అనబడే నదుల ఆధారంగా 'కాశీ' కి వారణాసి పేరు వచ్చింది 'కాశీ' అనగా ఓ గొప్పవెలుగు... అది పుణ్యలోకాలకు మార్గాన్ని చూపే వెలుగు. అందుకే హిందువులందరూ తమ చివరి యాత్రా స్థలంగా 'కాశీ'ని ఎన్నుకునే వాళ్ళు. వారణాశిలోని గంగాస్నానం తమ ఆత్మలకు మోక్షప్రదాయకమవుతుందని యాత్రికులందరూ భావిస్తారు.

కాశీ విశ్వనాథుడనబడే శివదేవుడు యిక్కడి ముఖ్య ఆరాధ్యదైవం. వారణాశికి దేశంలోని అన్ని భాగాల్లోంచీ నేరుగా చేరుకునే విమాన, రైలు సౌకర్యాలున్నాయి. ఢిల్లీ, ఆగ్రా, ఝాన్సీల మీదుగా బస్సులో యిక్కడికి చేరుకోవచ్చు. వారణాశిలోని దశాశ్వమేధఘాట్, మణికర్ణ, హరిశ్చంద్ర పంచగంగా అసీ ఘాట్‌లు ఎల్లపుడూ యాత్రికులచే

కిటకిటలాడుతూ వుంటాయి. కాశీలో ఉదయస్నానం... సూర్యపూజలు అతి ముఖ్యమైనవి. యివన్నీ గంగా తీరంలో చేస్తారు.




భారతమాతా మందిరం, దుర్గాలయం, తులసీ మానస దేవళం, అలంగిర్, గ్యానవాపి మసీదులు వారణాశిలో దర్శించాల్సిన ప్రదేశాలు. వారణాశిలో యాత్రికుల సౌకర్యార్థం అనేక హోటళ్ళు, ధర్మశాలలు పనిచేస్తున్నాయి. లుంబినీ, పిప్రాహ్వా, కౌశాంబి, గోరఖ్‌పూర్, కుషినగర్, చున్నార్, చంద్రప్రభ, కుశ్‌రూని, మఘర్, పావా, జాన్‌పూర్, రామ్‌నగర్ తండా – వైంధామ్ జలపాతాలు వారణాశి పరిసరాలలో దర్శించాల్సిన యితర ప్రదేశాలు 'పిప్రాహ్వనే' 'కపిలవస్తు' నగరంగా అంటున్నారు.

వారణాశిలో మనం కనీసం మూడు రోజులైన వుండనిదే అన్ని ప్రదేశాలని చూడలేం. యిక్కడ చక్కటి వసతి లభిస్తుంది. ఈ కాశీకి వచ్చినవాళ్ళు ముందు దుండి వినాయకుని దర్శించి, ఆపైన కాశీవిశ్వేశ్వరుని, అన్నపూర్ణమ్మను దర్శించాలి. వీరికి కొద్దిదూరంలో విశాలాక్షి అమ్మవారి ఆలయంవుంది. ఇది చూడటానికి ఆలయంలాగ అనిపించదు. చూడటానికో ఇల్లులాగ వుంటుంది. ఇక్కడ వ్యాసకాశిలోని కాశీ విశ్వవిద్యాలయం. దీనిని భారతీయతకు పట్టుకొమ్మగా పండిత మదనమోహన మాలవ్యా రూపొందించారు. ఇవి దాటితే సారనాథ్ బౌద్ధసాంప్రదాయం, స్తూపాలు, చైత్యాలతో వెలుగొందేది. మహ్మదీయులు తమ దండయాత్రలలో కాశీవిశ్వేశ్వరుని విడువలేదు. ఈ సారనాథ్ బౌద్ధస్తూపాలని వదలలేదు. అయినా సంస్కృతి, సాంప్రదాయాలు, కళాభిజ్ఞత గుర్తించేవారు దర్శించదగ్గ దర్శనీయాలివి. క్షేత్రం తీర్థం పరమపవిత్రాలు. ఏమాత్రం సావకాశమున్నా తప్పక దర్శించాలి.

## సారనాథ్

వారణాశికి కేవలం 10 కి.మీ. దూరంలో 'సారనాథ్' అనబడే అతి పవిత్ర బౌద్ధమత క్షేత్రం వుంది. గౌతమ బుద్ధుడు యిక్కణ్ణుంచే తన మతోపదేశాల్ని ప్రారంభించాడట.



'ధామెక్', 'ధర్మరాజిక్' అనబడే బౌద్ధస్తూపాల్ని పర్యాటకులు విశేష సంఖ్యలో దర్శిస్తారు. సారనాథ్‌లో అశోకుడు ప్రతిష్టించిన అశోక స్థంభాన్ని మనం యిక్కడ చూడవచ్చు. ఇదేనేటి మన రాజ్యాంగ చిహ్నం. సారనాథ్‌లోని బౌద్ధారామాల అవశేషాలు మనకు అతి ప్రశాంత వాతావరణంలో కనిపిస్తాయి. బెనారస్ రాజు గోవిందచంద్రుడి రాణి, కుమారదేవి నిర్మించిన దీర్ఘచతురస్రాకార స్తూపాన్ని యిప్పుడు అతి జాగ్రత్తగా కాపాడుతున్నారు.

సారనాథ్‌లో అనేక ద్వారతోరణాలు మనకి కనిపిస్తాయి. వారణాశిని కేంద్రంగా చేసుకుని సారనాథ్‌ని దర్శించటం మంచిది.

## మథుర

ఆగ్రాకు 56 కి.మీ. దూరంలో యమునా నదీ తీరాన వున్న మథురా పట్టణం భారతీయులందరికి ఓ మహా పుణ్యక్షేత్రం. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు యిక్కడ జన్మించాడు. బ్రజభూమి అని పిలువబడే ఈ మథురని కనిష్కుడు తన రాజధానిగా పరిపాలించాడు. అశోకుడు, శాక్యులు, కుషానులు, గుప్త రాజులు కూడా మథురని ఎంతో వృద్ధిలోకి తెచ్చారు. వైష్ణవమతంతో బాటుగా బౌద్ధ మతం కూడా మథురలో ప్రాబల్యాన్ని సంతరించుకుంది.





శ్రీకృష్ణ జన్మభూమి అనబడే కారగార భవనం మీదుగా నేడు మనకో మసీదు కనిపిస్తుంది. ఈ మసీదు మందిర ప్రాంగణాలు ఈ మధ్యవివాద స్థానాలుగా మారిపోవటం చాలా విచారించదగ్గ విషయం.

విశ్రామ ఘాట్, ద్వారకా ధీశ్ మందిరం, సతీ బురుజు, కంసునికోట, గీతామందిరం, బలదేవ మందిరం, బరసానా, గోకులం, గోవర్ధన గిరి, మహావనం, నందగాం మొదలగునవి మథురలో దర్శించదగిన ప్రాంతాలు. మథురకు మరో పది కి.మీ. దూరంలో వున్న గోకుల 'బృందావనం' మనని బాగా ఆకర్షిస్తుంది.

మథురలో మనకు చక్కని వసతి లభిస్తుంది. ఆగ్రా, మథుర, బృందావనాలను సంయుక్త యాత్రగా నిర్వహించటం ఆనందదాయకంగా వుంటుంది.


## అయోధ్య

ఇక్కడే శ్రీరాముడు, పుత్రకామేష్టి వలన జన్మించిన ప్రదేశం. యుగాలు తేడావున్నా.... ఇంకా ఇక్కడ శ్రీరాముని ఉనికిని తెలిపే ఆనవాళ్ళు మనం చూడగలము. ఇక్కడి హనుమాన్ గడీ, కనకభవనం, లక్ష్మణఘాటు, వశిష్ఠ కుండము, భరతకుండము వగైరాలు చూడదగ్గవి. అలాగే వాల్మీకి మందిరం. ఇందు 24000 శ్లోకాల రామాయణం గోడలపై చెక్కబడింది. సరయునది ఒక కి.మీ దూరంలో వుంది. మిగిలినవన్ని బిర్లాలు నిర్మించినవి మందిరం చుట్టుప్రక్కలనే వున్నాయి.



వాల్మీకి మందిరం ఎదురుగా గోవింద రాజ మందిరం వుంది. ఇక్కడ నిత్యం కొన్ని వందల మందికి ఉచితంగా భోజనం పెడతారు. సమయం కనుక్కుని, సమయానికి వెళ్ళి మనము భోజనం చేయవచ్చు. ఇక్కడి గోవిందరాజు మందిరానికి రెండు ఇళ్ళ అవతల "చార్‌ధామ్" అనే మందిరం వుంది. అందులో ద్వారక, మధుర, పూరీ, బదరీనాథ్‌లలోగల దేవతామూర్తుల విగ్రహాలున్నాయి. చెప్పేకంటే... శ్రీరామభక్తి అనన్యంగా కల ఈ ప్రాంతం మనం కంటితో చూసి ఆనందపడటం ఆత్మానంద దాయకం.

## మిస్రిఖ్ తీర్థం



ఇది లక్నో నుండి 90కి.మీ దూరంలో వుంది. ఇక్కడున్న పెద్ద కోనేరులోకి దేవతలు సకల నదీమ తల్లులను ఆహ్వానించి ఆ పవిత్రజలంతో "దధీచి" మహారాజును స్నానం చేయించి లోకకల్యాణార్థం ఆయన ఎముకలను అడుగుతారు. దీని ప్రక్కనే వున్న శివాలయం దధీచి మహర్షి కొలిచిన శివుడు. ఇక్కడే లవకుశులు యాగాశ్వాన్ని బంధిస్తారు. సీతామహాసాధ్వి అవతార పరిసమాప్తిగావించిన స్థలమని కూడా దీనిని చెబుతారు.

## మాతంగీశ్వరాలయం

హైదరాబాద్ - వారణాశి మార్గంలోని సత్నాకు 100 కి.మీ దూరంలో వున్న శిల్పకళాక్షేత్రం ఖజురాహో.



ఝాన్సీనగర్ నుండి 175 కి.మీ. రోడ్డు ప్రయాణం చేసి కూడా ఈ క్షేత్రానికి రావచ్చును. ఇక్కడ క్రీ॥శ॥ 900 - 1000 సంవత్సరముల మధ్య కాలంలో మధ్యభారతాన్ని ఏలిన చందేల రాజవంశంవారు నిర్మించిన అపురూప కళాఖండం ఈ మాతంగేశ్వరాలయం. రాళ్ళను మహాద్భుతంగా తొలచి, మలిచిన మహాద్భుతమీ కళాసృష్టి. సర్వధర్మాలను కలబోస్తూ తీర్చిదిద్దిన ఈ ఆలయశోభ దర్శించవలసిందే. ఇక్కడి వరాహమంటపం,

నంది మంటపం శిల్పచాతుర్యాన్ని ప్రత్యేకించి, పదే పదే చెప్పుకోవాలి. దాదాపు 70 ఆలయాలను గజనీ, ఘోరీ, లోడి వంటి పరమదుర్మార్గులు నాశనం చేసినా, ఆ భగవంతుని దయవలన 22 ఆలయాలను చూడగల్గుతాము. అయితే ఒక్క మాతంగీశ్వర ఆలయంలో తప్ప మిగిలిన చోట్ల ఆలయాలకు అర్చనాదులు లేవని చెప్పాలి.

## కాలప్రియనాథ్ - కాలపి

కాన్పూరునుండి ఇక్కడికి బస్ సౌకర్యముంది. ఇక్కడి స్వామిని 'కాలప్రియనాథు'డని పిలుస్తారు. ద్వాపరయుగాంతంలో ఈ స్వామి వెలిసినట్లు చెబుతారు. అందుకు నిదర్శనంగా పురావస్తుశాఖ వారి త్రవ్వకాలలో ఈ స్వామి శిథిలవిగ్రహం దొరికిందట. ఇక చారిత్రక స్థపురాణం ప్రకారం – శ్రీకృష్ణుని కుమారుడు శాపగ్రస్తుడైన సాంబుడు, సూర్యునిగూర్చి తపస్సు చేస్తే, చంద్రభాగ నదిలో స్నానంచేసి, అప్పుడా సమయంలో దొరికిన విగ్రహాన్ని మూలస్థానం (ఇది ప్రస్తుతం 'ముల్తాన్'గా పాకిస్తాన్‌లో వుంది) లో ప్రతిష్ఠించమంటాడు. ఆ తరువాత విశ్వకర్మ, కల్పవృక్ష సాయంతో నిర్మించిన సూర్యవిగ్రహాలను తూర్పుకొండల్లో యమునానదికి దక్షిణప్రాంతమైన కాలపిలోను, అస్తమయ ప్రాంతమైన మూలస్థానంలోను ప్రతిష్ఠించాడని చెబుతారు. కన్‌జోను పరిపాలించిన యశోవర్మ ఈ క్షేత్రం దర్శించి సూర్యభగవానుని అర్చించేవాడని, ఉత్సవాలను ఘనంగా నిర్వహించేవాడనేది చరిత్ర చెప్పే సత్యం.

## త్రివేణీ సంగమం



అఖండభారతావనిలోనే కాదు, ప్రపంచ ప్రజలకు గూడా ఈ పేరు, ఈ సంగమ పవిత్రత తెలుసు. దీనిని రాముడు దగ్గరనుండి, ముందు, ఆ తదుపరి కూడా ఎందరో దర్శించారు. ఇక చతుర్ముఖ ప్రజాపతి బ్రహ్మ ఇక్కడ యజ్ఞం చేయడంవలన ఈ ప్రయాగను "ప్రయాగరాజు" అని పిలవడం జరుగుతుంది. ఇక్కడ చేసే పుణ్యస్నానాల వలన, తరాలు, తరతరాలు తరిస్తాయనేది శాస్త్ర, పురాణ, వేద, పెద్దల వచనం. ప్రళయంలో కూడా మునుగనివి ప్రయాగ, కాశీ క్షేత్రాలుట. విష్ణువు వేణీ మాధవరూపంలో, పరమశివుడు అక్షయవటవృక్ష స్వరూపునిగా వుండుట మొక విశేషమైతే, ఇక్కడికి వచ్చినవారు కేశఖండనం చేయించుకోవాలని, కురుక్షేత్రములో తర్పణాలు, గయలో పిండప్రదానం చెయ్యాలని చెప్పడంకాదు శాసిస్తారు.

కాశీలో ప్రాణత్యాగం చెయ్యాలనేది కూడా శాసనమే. ఇక పడవలరేవుకు ఆనుకుని ఒక కోట వుంది. ఇందులో భూగృహం, అనేకమంది దేవతామూర్తుల విగ్రహాలు, ఇక్కడే అక్షయవటవృక్షము వున్నాయి. చూడవలసినదికాదు చూడాల్సినవి.

ఇక్కడే అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన మాధవీశ్వరీదేవి ఆలయముంది. చారిత్రక, పౌరాణిక నేపథ్యం కల్గిన వీటిని చూడటం హిందువుగా మన ధర్మం. ఆర్షధర్మ నిర్మాతలవారసులుగా మన కర్తవ్యం.

## శ్రీయుగళ్‌కిషోర్

శ్రీయుగళ్‌కిశోర్ మందిరమని మధురలో వుంది. ఇది అత్యంత పురాతనమైంది. దీనిని నానాకరణ్ చౌహాను నిర్మించాడు. ఇక్కడి 32 అడుగుల విగ్రహం చూపరులను మంత్రముగ్ధులను చేస్తుంది. 1064లో జహంగీర్ ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసినట్లు చెబుతారు.

ఝూన్సీకి 175 కి.మీ. దూరంలో వుంది కళాత్మక “కళాఖండ” మనే కళాప్రదేశం. శిల్పాలనేసరికి ముందుగా మనకు స్ఫురించేవి ‘అజంతా, ఎల్లోరా, ఖజరాహో, హంపి, బేలూరు...’ ఇలాగ కొన్ని కొన్ని జ్ఞాపకానికి వస్తాయి. ఇక్కడి ఎన్నెన్నో ఆలయాలను మతదురహంకారులు నాశనం చేయగా, మిగిలినవాటిలో ఈ ఖజురాహో, కందిరియో మహదేవాలయం, లక్ష్మణదేవాలయం, కాశీవిశ్వనాథ్ ఆలయాలను క్రీ॥శ॥ 900–1000 మధ్యనిర్మింపచేసారు. ఈ ఆలయాలు చూస్తే మన సంస్కృతి, సాంప్రదాయాలు, కళలు, ఆ తృష్ణ ... ఎన్నో... ఎన్నెన్నో అర్థమవుతాయి. ఇక్కడి ఆలయాలులో సర్వమత సమానత్వం చూడగల్గుతాం. శైవ, వైష్ణవ, శాక్తేయ, గణాపత్య, బౌద్ధ, జైన,... వగైరా సర్వధర్మ సమ్మేళనాన్ని ఇక్కడ నయనానందకరంగా దర్శించగల్గుతాము.

ఇక్కడి పెద్ద ఆలయాలేకాదు, అలక్ష్యం చూపక చిన్నచిన్న మంటపాలకు కూడా శిల్పకళను అత్యంతాశ్చర్యంగా, చేరాజవంశంవారు చరిత్రమరువనిగతిని, స్థితిని, కళాత్మకంగా అందించారు. ఇక్కడి లక్ష్మిఆలయం, ప్రక్కనగల వరాహమంటపం కళ్ళు తెరచుకుని మరీ చూడాలి. పరదేశీయులుగా వచ్చిన మహ్మదీయులు, క్రైస్తవులు తమతమ పరిధులను దాటి బ్రతుకడానికి వచ్చినవారు చివరకు ఒక దేశంపై తమ సార్వభౌమాధిపత్యాన్ని ప్రకటింపచేసుకున్నారంటే సంఘటితశక్తి తెలియని మనమెంత దురదృష్టవంతులమో మన సంపదలను ఇతరులకు పంచిపెట్టడానికి సిద్ధపడే దుర్మార్గులకు వారసులమో తల్చుకుంటే, మనము, మన బ్రతుకులను చూసి మనకే అసహ్యమేస్తుంది. ఇటువంటి దౌర్భాగ్యులను బట్టే స్వాతంత్ర్యం హరింపచేసుకుని పరాయిపాలనలో మగ్గి కృంగి, కృశించింది. ఆ దౌర్భాగ్యం మనవారికిప్పటికి వదలలేదు. ఆలయాలు దోచుకోవడం, శిల్పాలు అమ్ముకోవడం, చారిత్రక నేపథ్యాన్ని ... ఆ.. అంతా... భ్రమ... అని అధమాధములుగా నికృష్ట జీవనం గడిపేవారు రౌడీలు, గూండాలుగా ప్రవర్తిస్తూంటే ఎదిరించి మనం, మౌనంగా ఏడ్చుకుంటున్నాం. ఇంకొందరు మనకెందుకంటూ, వారితో కలిసి బ్రతుకుతున్నారు.

## నైమిశారణ్యం

గోమతీ నదీ తీరాన ఉన్న గొప్ప పురాణ ప్రసిద్ధ క్షేత్రం, బ్రహ్మకుండం, చక్రతీర్థం, హత్యాదోష నివృత్తి సరోవరం దర్శించవచ్చు! ఈ ప్రాంతంలో చక్ర తీర్థాన్ని శ్రీవిష్ణువే ఏర్పరచాడని అందుకే ఇక్కడ స్నానం సర్వదోష హరమైనదని అంటారు. ఇక్కడ అనేక మంది సాధుపుంగవులు నివశిస్తుంటారు. కొందరు వచ్చిపోతుంటారు. నైమిశారణ్యానికి 12 కి.మీ. దూరంలో పాండవుల ఖిల్లా, లలితాదేవి గుడి ఉన్నాయి.

మన పురాణాలలో నైమిశారణ్యం అనే ప్రదేశం చాలా ప్రసిద్ధమయిన, ప్రముఖమయిన స్థలంగా

పేర్కొనబడింది. ఇప్పటికీ మనం పూజలు చేస్తున్నప్పుడు 'సూతుడు శౌనకాది మునులకు చెప్పిన విధం' అని చదువుకుంటూ ఉంటాము. ఇవి అన్నీ జరిగినవి ఈ నైమిశారణ్యంలోనే. పైగా వ్యాసమహాముని శౌనకాదులకు పదునెనిమిది పురాణాలు చెప్పిన స్థలం కూడా ఇదే.

ప్రస్తుతం ఈ ప్రదేశం కాన్పూర్ పట్టణానికి 160 కి.మీ దూరంలో 'నీమ్‌సార్' అనే పేరుతో పిలవబడుతూ వుంది. ఇక్కడ గోమతీ నది ప్రవహిస్తూ ఉంటుంది.

భారతావనిలో ప్రతి అణువు పవిత్రం. పవిత్ర నదులతో, పర్వతాలతో, అరణ్యాలతో, పట్టణాలతో, ఆలయాలతో ఆధ్యాత్మికత ఉట్టిపడుతూ కర్మభూమిగా, దేవభూమిగా, ఆర్షభూమిగా విరాజిల్లుతున్నది. ఈ భారతావనిలో ఎన్నో క్షేత్రాలు వున్నప్పటికీ శ్రీరంగం, శ్రీముష్ణం, తిరుమల, తోతాద్రి, బదరీ, నరనారాయణపురం, సాలిగ్రామం, నైమిశారణ్యం స్వయంవ్యక్త క్షేత్రాలుగా ప్రసిద్ధికెక్కినవి. వీటిలో నైమిశారణ్యక్షేత్రంలో స్వామివారు అరణ్య రూపంలో వున్నట్లు పురాణాలు చెప్పుతున్నాయి. కనుక నైమిశారణ్యంలో ప్రతి అణువు ఎంతో పవిత్రమైంది. ఈ క్షేత్రములోని మట్టిని సేకరించి అతి పవిత్రముగా భద్రపరచుకోవడం సాంప్రదాయంగా ఆచరిస్తున్నారు. నైమిశారణ్యంలో 60000 మంది ఋషులు అదృశ్యరూపంలో నేటికినీ తపమాచరిస్తున్నారని ప్రతీతి. కనుక నైమిశారణ్యం తపోభూమిగా, ఆర్షభూమిగా పిలువబడుతోంది. శ్రీమహావిష్ణువు మానసపుత్రులైన శ్రీవిఖనసమహర్షి శ్రావణ మాసం, శ్రవణా నక్షత్రం, శుక్లపౌర్ణమీ సోమవారం రోజున సింహలగ్నంలో ఈ నైమిశారణ్యంలో అవతరించారు.



**శ్రీవిఖనసమహర్షి** చే బోధించబడిన వైఖానస భగవత్ శాస్త్రములను వారి ముఖ్య శిష్యులైన భృగు, మరీచి, అత్రి, కశ్యప మహర్షులు ఈ దివ్యక్షేత్రము లోనే రచించినారు. నైమిశారణ్యంలో తపమాచరిస్తున్న ఋషులను తరుచుగా రాక్షసులు తపోభంగం చేస్తుండెడివారట. అప్పుడు ఆ ఋషులందరు శ్రీమహా విష్ణువుని ప్రార్థించగా, విష్ణుమూర్తి తన సుదర్శన చక్రాన్ని పంపి నైమిశారణ్యంలో తపస్సుకు భంగం కలిగించే రాక్షసులను సంహరించి వారిని కాపాడమని ఆదేశించాడట. అప్పుడు ఆ సుదర్శన చక్రం తిరిగినంత మేరకు వున్న అరణ్యం నైమిశారణ్యంగా పేరు పొందింది. యిలా ఆ సుదర్శన చక్రం తిరుగుతూ ఒకచోట నేలకుతాకి ఉపసంహరించబడినదట. ఆ నేలకు తాకినచోట భూమిని చీల్చు కుంటూపోతుండగా లలితాదేవి ప్రత్యక్షమై ఆ చక్రాన్ని శాంతింపచేసిందట. వేదవ్యాసుడు వేదరాశిని నాలుగు విభాగాలుగా విభజించింది ఇక్కడే. వేదవ్యాసుడు తన ఆశ్రమం వద్ద నిరంతరం గంగానది వుండేటట్లు గంగను ప్రార్థించగా, గంగాదేవి గోమతిగా ప్రత్యక్షమై అనుగ్రహించి, గోమతి నదిగా నైమిశారణ్యంలోని ఋషివాటిక లన్నింటికి ఆధారమైనది.

ఇక్కడ దర్శనీయ స్థలాలలో **బాలాజీ మందిరం** కూడ వున్నది. వ్యాసుడు వున్న ప్రాంతాన్ని 'వ్యాసగద్ది' అని పిలుస్తారు. వ్యాసగద్ది ఎదురుగా పరీక్షిత్తు మహారాజు తప మాచరించిన ప్రదేశముంది. శౌనకమహర్షి సత్రయాగం కావించినది కూడా ఇక్కడే. ఆ యాగశాల సమీపంలో సూత మహర్షి ఆశ్రమం వున్నది.సూతుడు సత్రయాగ




సమయంలో శౌనకాది మహర్షులకు భారత, భాగవత, పురాణ కథాశ్రవణాలను చేయటమేకాక అనేక వ్రతాలను వివరించి ఆచరింప చేసారు. వాటిలో ముఖ్యమైనవి సత్యనారాయణ వ్రతం, వరలక్ష్మివ్రతం, వినాయక వ్రతం మొదలైనవి. అలాగే దధీచి మహర్షి ఆశ్రమం, నారదానంద ఆశ్రమం, దేవపురి యిలా ఎన్నో మహర్షుల ఆశ్రమాలు దర్శనమిస్తాయి. దధీచి వెన్నెముకతో చేసిన వజ్రాయుధం ఇంద్రునకు ఇచ్చినది ఇక్కడే. మహిరావణుని బారినుండి రామలక్ష్మణులను కాపాడి హనుమంతుడు పాతాళలోకం నుండి తీసుకువచ్చింది ఇక్కడే. ఇచట గల దేవపురిలో ఒకేచోట 108 దేవతావిగ్రహములు ప్రతిష్ఠించబడినవి.

**ఇతర దర్శనీయాలు :**



**గోకులం –** మధురకు 12 కి.మీ దూరంలో వుంది. ఇక్కడే కృష్ణుడు గోపాలురతో కలిసి మెలిసి, గోవులను కాచింది, తన ప్రేమను పంచింది. దీనిని 108 తిరుపతులలో ఒకటిగా చెబుతారు. పూతనను చంపిందిక్కడే. చెప్పుకుని చూసి తరించే పురాతన ఆలయాలు మచ్చుకుకూడా కనబడవు. మనం చూసేది ఈనాటి నవీన కట్టడాలు. వినేవి చెప్పే కబుర్లు.

**బృందావనం –** ఈ పేరే భూలోకనందనవనం. శ్రీకృష్ణుడు తన దివ్యచేష్టలతో ఆడి, పాడి, ఆడించిన ప్రదేశం.



చైతన్యప్రభు నృత్యతన్మయత్వం, మీరాబాయి, సూరదాసు వంటివారి భక్తిగీతాలు; ఇప్పుడేమీ ప్రత్యేకంగా ఆనాటి దృశ్యాలు మనం చూడకపోయినా ఆ లీలల్ని విని తరించ గలం. రంగాజి ఆలయం, గోవిందదేవ్‌జీ ఆలయాలు చూడ దగ్గవి. ఇక్కడి విశేషం పాగల్‌బాబా ఆలయం. ఇక్కడి రామాయణ, భారత భాగవత కథలు మనలను పలుకరించి నట్లు సజీవమూర్తులుగా ఆనందింపచేస్తాయి. ఇవన్నీ చూడవలసిందే. చెబితే ఆనందించడానికి, ఆనందం పొందేదితప్ప అందుకునేది అందింపచేసేదికాదు.

ఇక నిధివనం (తులసీవనం) సంత్ హరిదాసు తన భక్తిగానంతో కృష్ణ విగ్రహాన్ని భూమిలోనుండి పైకి తీసిన స్థలం. ఇక్కడ రాధారాణి మందిరం, ఇది మూర్తివనం మధ్యలోవుంది. ఇక్కడ ఇంకా చూడవలసినవి మీరాబాయి మందిరం, శ్రీరాధాగోవిందమందిరము, గోపేశ్వరమందిరం, శ్రీలాలాబాబూమందిరం, శ్రీకృష్ణబలరామమందిరం, కాళీయమర్దనఘాట్, యమునా తీరాన గల స్నానఘట్టాలు, అలాగే రాధారమణమందిరం, బ్రహ్మచారిమందిరం,

సీర్‌మందిరం, టికారియా, గోవింద్‌జీ, గోపనాథజీ, రాధవల్లభ, మదనమోహన్, అష్టసఖి, జయపూర్, ఆనందమాయి మందిరం, చీర్ (గోపికావస్త్రాపహరణ)ఘాట్, విధవా భజనాశ్రమాలు చూస్తేనే శ్రీకృష్ణ లీలాతత్త్వం ఆ ప్రభువు నడయాడిన ప్రదేశంలో అడుగుపెట్టిన ఆనందం తెలుస్తుంది. 'చౌరాశికోశ్' అనే పరిక్రమ చేయగల్గడం (ప్రదక్షిణ) మంచి అవకాశమని, ముఖ్యమని భక్తుల భావన.



**చిత్రకూటం**నుండి 18 కి.మీ లో ఈ **గుప్తగోదావరి** క్షేత్ర ముంది. ఈ పర్వతమధ్య ప్రాంతంలో గల రెండు గుహలలో, రెండవది చాలా ఇరుకుగా వుంటుంది. దీని పగుళ్ళనుండి నీరు వూరి, బయటికి వచ్చి భూమిలోకి వెళ్ళిపోతుంది. అందుకని దీనిని గుప్తగోదావరిగా పిలుస్తారు. సీతారాములు తమ వనవాస కాలంలో ఇక్కడవున్నట్లు రెండు వేదికలను చూడగల్గుతాము.



'కృష్ణ' అంటే **గోవర్ధనగిరి** జ్ఞాపకం వస్తుంది. శిశువులు, పశువులు, గోపాలురను వారివారి ప్రయాణసాధనాలతో ఏడురోజులు రక్షించి, ఇంద్రునికి బుద్ధిచెప్పిన ప్రదేశం. ఇక్కడున్న బ్రహ్మకుండం శ్రీకృష్ణుని నిర్మితమని భక్తులు ఇందులో స్నానం చేసి, గోవర్ధనాలయాన్ని దర్శిస్తారు. కొందరు మహాభక్తితో గోవర్ధనగిరి పరిక్రమచేస్తుంటారు. 200 కి.మీ దూరంలోవున్న ఈ ప్రాంతాన్ని భక్తులు తండోపతండాలుగా ప్రదక్షిణం చేయడమొక ఆచారం.



**ఇక చిత్రకూటం** – ఇదే చిత్రంగా వుంది. దక్షిణ, ఉత్తర దేశాలలో ఒకటికి మూడుచోట్ల దీని ప్రస్తావన. ఇదే నిజమన్నట్లు నిర్ధారణ గమనిస్తాము. అలహాబాదు 125 కి.మీ దూరంలో మందాకినీ నదీ తీరంలో చిత్రకూటముందిట. ఇక్కడే అనసూయా మాతను, సీతాదేవి తన భర్త అనుమతితో దర్శిస్తే, ఆ తల్లి శ్రీరామకల్యాణ విశేషాలను విని, పతివ్రతామతల్లుల ప్రవర్తనను సీతకు తెల్పితే, సీత వినయవిధేయతలు, అణుకువ తన జన్మహక్కుగా 'అమ్మా! చిన్నతనంలో మా అమ్మ, వివాహానంతరం అత్తగారు, చెప్పినట్లు నన్ను తీర్చిదిద్ది, కర్తవ్యతామూర్తిని చేసారంటూ" పెద్దావిడ ఆశ్చర్యపడేటట్లు సత్యభాషణంచేస్తుంది. 'అమ్మపిల్లా' అనుకుంటుంది, అనసూయామాత.

ఇక్కడచూడవలసిన ప్రదేశాలలో శ్రీరాముడు తండ్రికి పిండప్రదానం చేసిన ప్రాంతం, ఒకనాడు బ్రహ్మయజ్ఞం చేసిన యజ్ఞవేదిక, ఆ ప్రక్కనే శ్రీసీతారాములు నివసించిన పర్ణశాల, ఇంకా ఈ క్షేత్రంలోనే తులసీదాసు రామలక్ష్మణులకు తిలకం దిద్దాడు. అడుగడుగునా రాముని తీపిగుర్తుల కోతుల సందడి, సాధువుల సమూహాలతో రామునితో

మనమువున్నామా? అనే భ్రాంతిని కల్గించే దివ్య ప్రదేశం.

ఇలాగే భరతునికి పాదుకలిచ్చిన ప్రదేశం, సీతాదేవికి అనసూయ పాతివ్రత్య ధర్మాలను బోధించిన ప్రదేశం, సీతారాములు శయనించిన స్ఫటికశిల, సీతాదేవి స్నానమాడిన జానకీకుండం, ఇంకాస్త ముందుకు వెడితే హనుమాన్‌ధార, తులసీధామ్, కామత్‌గిరి, తులసి జన్మస్థలం రాజాపురం (35 కి.మీ) కాళిశక్తిపీఠం 19 కి.మీ దూరంలో వున్నాయి.



**అలహాబాదుకు** 80 కి.మీ **వింధ్యవాహినీ ఆలయం** వుంది. శుంభునిశుంభులను మర్దించిన తల్లిగా ఈమెను చెబుతారు. ఈమెకు కౌశికి అనేపేరు కూడా వుంది. దగ్గర్లో అష్టభుజాదేవి మందిరముంది. ఈమెను సరస్వతిగా చెబుతారు. దగ్గర్లోని గుహలో కాళికాదేవివుంది. అష్టభుజ, కౌశికి, మహాకాళిని త్రికోణయాత్రగా దర్శించి, పరవశిస్తారు. చైత్ర, ఆశ్వయుజాలలో వసంత, శరన్నవరాత్రి ఉత్సవాలు దర్శించవలసిందే!



**బ్రహ్మావర్తం** – ఇది కాన్పూరునుండి 16 కి.మీ. దూరంలో వున్న బిటూరు దగ్గర ఈ బ్రహ్మావర్తముంది. ఇక్కడ బ్రహ్మ అశ్వమేధయాగం చేసిన ప్రదేశం, వాల్మీకి రామాయణం రచించిన ప్రదేశంగా ప్రసిద్ధి. విష్ణునాభినుండి పుట్టిన బ్రహ్మ కమలాసనుడైన స్థలంగా కూడా చెబుతారు.

ఇంకొద్దిదూరం వెడితే – **వాల్మీకి తపోభూమి**, ధ్రువుని తండ్రి ఉత్తానపాదుని రాజ్యం ఇదేనని చెబుతారు. ఈ ప్రాంతాలు అడుగడుగునా సీతారాముల కథతో ముడివడినట్లు కనుగొనగలము. యాగాశ్వాన్ని బంధించినది లవకుశులు రామునితో యుద్ధం చేసినదీ ఇక్కడేనంటారు. వీటి దర్శింనం వలన జ్ఞానము, గంగాస్నాన ఫలం లభిస్తాయనేది మహాభారతం తెలుపుతుంది.

**నందిగ్రామం** – అయోధ్యనుండి 20 కి.మీ దూరంలోవుంది ఇదీ రామకథతో ముడిపడిందే! అంతకుమించి రాధాకృష్ణులు తొలిసారి కలుసుకున్న ప్రదేశమిదేనని కూడా అంటారు.



ఢిల్లీకి 100 కి.మీ దూరంలో **'అమరోహనగర్‌నందు వాసుదేవ తీర్థ'** ముంది. పాండవులను చూడాలని వచ్చే కృష్ణుడు ఇక్కడికి వచ్చి కదంబ వృక్షనీడన కొంచెంసేపు విశ్రమిస్తాడుట. అందుకు దీనికి వాసుదేవ్ తీర్థమని, భగవంతుడైన కృష్ణుని

పాదాలచే పవిత్రమైనందువలన పుణ్యప్రదేశమని భక్తుల భావన. 8 ద్వారాలతో గల అష్టకోణ శివమందిరంలో శివ కేశవులను చూడగల్గుతాము. దగ్గర్లో తులసి ఉద్యానవన ముంది. ఆలయ స్తంభాలపై తులసీరామాయణం చెక్కబడివుంది.



కురువంశమూల పురుషుడు కురువు యజ్ఞంచేయుటకు ఈ ప్రాంతాన్ని దున్నినందువలన దీనికి **కురుక్షేత్ర** మని పేరువచ్చింది. ఇచ్చటగీతోపదేశం, కురువంశ నాశనం, పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం మిత్ర సామంతులతో, అనకూడదుకాని శేషం లెక్కించకుండా వుంటే, సమూలంగా నాశనమైన ప్రదేశం. దానికి గుర్తుగా ఇక్కడ కొన్ని స్మారకాలను చూడగల్గుతాం.

ఒకరిగా దుష్టసంహారంలో భాగంగా **కాళియమర్దన ఘట్టం** – అంతటా ధర్మసంరక్షణమే. అందుకే వెలసిన శ్రీకృష్ణుని లీలావిశేషాలు, అవతార లక్ష్యంలోను ఆంతర్యం, సర్వంచూసి, మహదానందపడవలసిన, పడే దివ్యధామం. మనకే లభించిన అదృష్టం. మనమే పొందగల ధన్యజీవనం. నిజం సత్యం.



**"ఓం నమో నారాయణాయ". ఇది ద్వాదశాక్షరి పఠించి తరించండి!**

**ఓంకార శబ్దాన్ని పరబ్రహ్మ అనే భావంతో ఉపాసించాలి. ఈ దృశ్యా దృశ్య ప్రపంచం అంతా బ్రహ్మ నుంచే ఉద్భవించింది. ఓంకారమే బ్రహ్మ అని కూడా అన్నారు. కనుకనే ఈ ప్రపంచమంతా ఓంకారమే అవుతుంది.**

– తైత్తిరీయ ఉపనిషత్తు

**ఇంద్రుడు రక్షణతో మా వద్దకు వచ్చుగాక, సింధువుల సమేతంగా ఉప్పొంగుతున్న సరస్వతీ, ఓషధులతో వర్షన్యమూ, తండ్రిలాగా సుందరమైన స్తుతులతో, స్వాగతాలతో సుఖాన్ని కలిగించే అగ్నీ మా వద్దకు వచ్చుగాక.**

– రుగ్వేదం

## : : సూక్తులు : :

నువ్వు నిన్ను శాసించుకోగలిగితే ఇతరులను శాసించడానికి నీకు అర్హత వుంటుంది.

– సూక్తి

"నా జీవితమే నా సందేశం" అన్నాడు. ప్రపంచానికే మహాత్ముడైన గాంధీజీ.

– సూక్తి

మౌనంగా ఉండాల్సిన సమయంలో మాట్లాడటం, మాట్లాడవలసిన సమయంలో మౌనంగా ఉండటం రెండూ నేరమే.

– సూక్తి

తల్లిదండ్రులను చూడని కొడుకున్నా లేకున్నా ఒకటే, పుట్టలోని చెదలువలె.

– వేమన

ప్రతీపనీ ఓర్పు, నేర్పుతో చేస్తే విజయం సొంతమౌతుంది.

– సూక్తి

క్రిందటి జన్మ వుందో లేదో తెలియదు. ముందు జన్మ వుంటుందో లేదో తెలియదు. తెలిసినదంతా ఈ జన్మలోనే, సంపాదించుకో కావలసినంత సేవతో కూడి పుణ్యాన్ని.

– సూక్తి

సమాజం విఛిన్నం కావడానికి కారణం చెడ్డవారు చేసే పనులు కావు. మంచివారు ఏమీ చేయకుండా కూర్చోవడమే.

– సూక్తి

కార్యసాధకుడు కృషితో విజయం సాధిస్తాడు. సోమరి ఆ ఘనతను అదృష్టానికి అంటగడతాడు.

– సూక్తి

మన మనస్సును మనకంట్రోలులో వుంచుకోలేనపుడు ఇతరులను శాసించే హక్కు మనకెక్కడిది.

– సూక్తి

కీలు లేని కాలు నడకకు పనికిరానట్లే ... క్రమశిక్షణ లేని వ్యక్తి దేనికీ పనికిరాదు.

– సూక్తి

# ఉత్తరాఖండ్




## పంచబదరీలు

**పంచ బదరి క్షేత్రములు :** ఆదిబదిరి, వర్ధబదరి, భవిష్యబదరి, యోగబదరి, బదరి నారాయణ (బదరివిల్).

**ఆదిబదరి :** రుషికేష్ – రామ్‌నగర్ మోటారు రోడ్డులో ఉన్న ఈ క్షేత్రము కర్ణప్రయాగకు 18 కి.మీ. దూరంలో ఉంది.




**వర్ధబదరి :** పిపల్‌కోటి – జోషిమఠ్ రోడ్డులో ఉంది.

**భవిష్యబదరి :** తపోవన్ వెనుక గల సుబేన్ వద్ద కలదు. జోషిమఠంనకు 15 కి.మీ. దూరంలో ఉంది. యోగబదరి జోషిమఠంనకు 25 కి.మీ. దూరంలో పాండుకేశ్వర్‌లో ఉంది.

**బదరినారాయణ - బద్రివిశాల్ :** రుషికేశ్‌నకు 301 కి.మీ. దూరంలో ఉంది.

## పంచ కేదార్‌లు




1. **శ్రీ కేదార్‌నాథ్** : గౌరికుండ్‌నకు 14 కి.మీ. దూరంలో ఉంది.
2. **మధ్యమహేశ్వర్**: నలచెట్టినకు 25 కి.మీ. దూరంలో ఉంది.
3. **తుంగనాథ్** : చోప్టాకు 5 కి.మీ. దూరంలో ఉంది.
4. **రుద్రనాద్** : మండల్ బెట్టికి 28 కి.మీ. దూరంలో ఉంది.
5. **కల్పేశ్వర్** : మిలాంగ్‌కు 9 కి.మీ. దూరంలో ఉంది.

## ఋషికేశ్ నుంచి వివిధ ప్రాంతాలకు దూరము

డెహ్రాడూన్ - 42 కి.మీ., ముస్సోరీ - 77 కి.మీ., దేవ ప్రయాగ - 70 కి.మీ., రుద్ర ప్రయాగ 129 కి.మీ., కర్ణప్రయాగ - 170 కి.మీ., యమునోత్రి - 288 కి.మీ., గంగోత్రి - 258 కి.మీ., ఉత్తరకాశీ 154 కి.మీ., కేదార్‌నాథ్ - 228 కి.మీ., బదరీనాథ్-298 కి.మీ., లక్ష్మణ ఝూలా-5 కి.మీ.



**లక్ష్మణ ఝూల** : హృషికేశ్‌నకు ఈశాన్య దిశగా 3 మైళ్ళ దూరంలో లక్ష్మణ ఝూల అను యాత్రా స్థలము కలదు. ఆధ్యాత్మికచింతన గలవారికి మాత్రమే ఈ ప్రదేశము యొక్క ప్రత్యేకత తెలుస్తుంది. వీటిని దర్శించాలని తలుస్తారు. అయితే ప్రకృతి ఆరాధకులు కూడా వీటిని దర్శించి, ఆనందించగల్గుతారు. లక్ష్మణ ఝూలాకు భక్తులు కాలినడకన వెళ్తూ రామ, లక్ష్మణ, భరత మందిరాలు దర్శించవచ్చు.



**డెహ్రాడూన్ :** ముస్సోరికీ అతి దగ్గర రాబర్స్ గుహలు, అశోకుని శిలాశాసనం, తాపకేశ్వర శివాలయం, బ్రిటిషు మ్యూజియంగల ఈ డెహ్రాడూన్, ఋషికేశ్‌కి 42 కి.మీ. దూరములో వున్న ఈ ప్రాంతములోనే పాండవులు, కౌరవులు ద్రోణాచార్యుని వద్ద యుద్ధ విద్యలు నేర్చుకున్నారు. "డెహ్రాద్రోణ"గా పిలవబడిన ఈ ప్రదేశం ఇప్పుడు డెహ్రాడూన్‌గా అయ్యింది.



**ముస్సోరి :** డెహ్రాడూన్‌కి 35 కి.మీ. దూరంలో వుంది. అనేక రకములైన పండ్లు కనిపిస్తాయి. మోసి, భట్టా, కేంతి మొదలైన జలపాతాలున్న ఈ ప్రదేశంలో గన్‌హిల్ వరకూ రోప్‌వే వుంది. ఈ గన్‌హిల్ కొండ నుంచి బద్రీనాథ్ పుణ్య స్థలం చూడవచ్చు.

**గంగోత్రి** : పరమ పవిత్రమైన గంగానది పుట్టిన పుణ్య స్థలమే గంగోత్రి. ఋషికేశ్ నుండి 24 కి.మీ. దూరంలోనూ, ముస్సోరి నుండి 212 కి.మీ. దూరం లోనూ ఉన్న ఈ క్షేత్రము. సముద్ర మట్టానికి 3,140 మీటర్ల ఎత్తులో ఉంది. భక్తులు తమ పితృదేవతలకు ఇక్కడ తర్పణములు వదులుతారు. ఇక్కడ నుండి 24 కి.మీ. దూరంలో భాగీరథి శిఖరాల మధ్య 4,225 మీటర్ల ఎత్తున ఉన్న పుణ్య స్థలము గోముఖ తీర్థము. ఈ తీర్థమునకు వెళ్ళు భక్తులు మంచు పర్వతాల



మీదుగా వెళ్లవలసియున్నందున కొంచెం జాగ్రత్తగా నడవడం మంచిది. ఇదే పరమ పవిత్రమైన గంగానది పుట్టిన స్థలము. ఇక్కడ మంచుతో కప్పబడిన ప్రదేశమే అలకాపురి, కుబేరుని స్థానము. ఇక్కడనే మంచు కరిగి అలకానంద, మందాకిని నదులు ఏర్పడ్డాయని చెబుతారు. గోముఖం అవతల ఋషులు తపస్సు చేసుకునే నందనవనం ఉందని చెబుతారు.



**యమునోత్రి** : పావన యమునా నది పుట్టిన ప్రదేశం. సముద్ర మట్టానికి 4421 మీటర్ల ఎత్తులో వుంది. యమునాదేవి ఆలయం ఉంది. ఆలయం క్రింద ఉష్ణజల ధారల ఊటలున్నాయి. రమణీయమైన ప్రకృతి అందాలు గల ఈ ప్రదేశం నుంచి పవిత్ర జలాలను బదరీ, కేదారంలో అభిషేకానికి తీసుకు వెళతారు.



**భరతమందిరం** : హృషికేశ్‌ని శ్రీమహావిష్ణువుగా ఊహించి ఇక్కడి గంగా తీరంలో భరతమందిరం నిర్మించారు. శ్రీమహా విష్ణువుకు భరతుడు అనే నామం కూడా ఉంది. అయితే భరత దేవాలయంలో గల శ్రీమహావిష్ణువును 'భరతుడు'గా కూడా కొందరు పిలుస్తారు. ఈ భరత మందిరమునకు 108 సార్లు ప్రదక్షిణ చేసిన బదరీ నారాయణును దర్శించిన ఫలితం కలుగు తుందని ఇక్కడి ప్రజల నమ్మకం. ఈ భరత మందిరంలో ఉన్న సూర్య భగవానుని విగ్రహం ఔరంగజేబు దండయాత్ర సందర్భంగా పాడుచేశాడని ఇక్కడి పూజారులు తెలుపుచున్నారు.



**త్రివేణఘాట్** : యమున, సరస్వతి అనే చిన్న నదులు ఋషికేశ్‌లో గంగతో కలుస్తాయి. ఈ స్థలమును త్రివేణిఘాట్, "కబ్జాభ్రకము" అంటారు. ఇక్కడ ప్రతిరోజూ వేలాది మంది యాత్రికులు తమ పెద్దలకు పిండ ప్రదానం చేస్తారు. సాయం సమయంలో చిన్న చిన్న బుట్టల్లో పుష్పములు, దీపములు అమర్చి పవిత్ర గంగా నదిలో వదులుతారు. ఈ దీపములు హరిద్వార్ వైపు పయనిస్తాయి.

## పంచ ప్రయాగలు

**దేవ ప్రయాగ** : హరిద్వార్‌కు 93 కి.మీ. దూరంలో ఉంది. భగీరథి – అలకనంద నదుల సంగమ క్షేత్రం.


**రుద్ర ప్రయాగ** : దేవ ప్రయాగకు 71 కి.మీ. దూరంలో ఉంది. అలకనంద – మందాకినుల సంగమ క్షేత్రము.

**కర్ణ ప్రయాగ** : రుద్ర ప్రయాగకు 34 కి.మీ. దూరంలో ఉంది. పిండర్ – అలకానందల సంగమ క్షేత్రము.

**నంద ప్రయాగ**: కర్ణ ప్రయాగకు 21 కి.మీ. దూరంలో ఉంది. మందాకిని – అలకానందల సంగమ క్షేత్రము.

**విష్ణు ప్రయాగ** : జోషిమఠంనకు 10 కి.మీ. దూరంలో ఉంది. గంగ – అలకనంద సంగమ క్షేత్రము.

## దేవ ప్రయాగ



ఋషికేశ్ క్షేత్రానికి ఈశాన్యదిశగా 70 కి.మీ. దూరంలో భాగీరథి, అలకానంద నదుల సంగమంలో కల తీర్థ క్షేత్రము. ఇక్కడి సంగమం తర్వాతనే పై రెండు నదులు 'గంగ' పేరుతో పిలువబడి నైరుతి దిశలో ప్రవహి స్తాయి. హిమాలయాల నుండి ప్రవహించే ప్రతి నదిని గంగ అని పిలుస్తారు.

**గోముఖములో పుట్టిన భగీరథి** : గంగోత్రి, గంగా, ఉత్తర కాశీ, టెహరీల గుండా 246 కి.మీ. ప్రవహిస్తుంది.

బదరిఆశ్రమానికి 19 కి.మీ. దూరములో నీలకంఠ పర్వతాలలోని సౌత్‌పంధ్ సరోవరంలో పుట్టిన అలకానంద, గోవింద ఘాట్ వద్ద లక్ష్మణ గంగను విష్ణు ప్రయాగ వద్ద విష్ణుగంగను, నంద ప్రయాగ వద్ద మందాకినీని, కర్ణప్రయాగ పిండర నదిని కలుపుకుని మొత్తం 247 కి.మీ. ప్రవహిస్తుంది. ఈ రెండు పుణ్య ప్రవాహముల సంగమం హిమాలయాలకు వెళ్ళే యాత్రికులు దర్శించుకునే మొదటి సంగమ తీర్థం. హిమాలయాలు సర్వదేవతలకు నిలయమని, శివకేశవ సమన్వయ కేంద్రమని దేవ గంగ హిమాలయాల మీదుగా భూమివైపు ప్రవహిస్తుందని భక్తుల నమ్మకం. సర్వదేవతలు అదృశ్యరూపములో ఇక్కడ విహరిస్తుంటారని కూడా ఆస్తికుల విశ్వాసము. కనుకనే ఈ క్షేత్రమునకు 'దేవ ప్రయాగ' అని పేరు వచ్చింది. ఇక్కడి రామచంద్రుని దేవాలయాన్ని భక్తులు దర్శించుకుంటారు. దేవ ప్రయాగలో యాత్రికులు పితృదేవతలకు 'పిండం' పెడతారు. దేవ ప్రయాగలో నదీ ప్రవాహం కోసి నందు వలన శిలలన్నీ అండా కారములలో ఉంటాయి. వీటిని భక్తులు 'శివలింగాలు'గా భావించి పూజిస్తారు. దేవ ప్రయాగ, హరిద్వారాల మధ్య సాలిగ్రామాలు ఎక్కువుగా దొరుకుతాయి.

## రుద్ర ప్రయాగ

దేవ ప్రయాగ నుండి ఈశాన్య దిశగా అలకనంద ఒడ్డున 69 కి.మీ. ప్రయాణిస్తే 'మందాకిని', 'అలకనంద' ల సంగమ క్షేత్రమయిన రుద్రప్రయాగ వస్తుంది. పౌరి, టెహరీ, చందా జిల్లాల కూడలిలో ప్రకృతి శోభతో విరాజిల్లుతున్న చిన్న నగరం రుద్ర ప్రయాగ. హిమాలయాలలో నగరం అంటే మన ప్రాంతములో చిన్న గ్రామంలా




ఉంటుంది. రుద్ర ప్రయాగ నుండే బదరీనాథ్, కేధార్‌నాథ్ మార్గాలు చీలుతాయి. ఇక్కడ నదిసుడులు తిరుగుతూ, చాలా భయంకరంగా ఉంటుంది. కేదార్‌నాథ్ నుండి బయలుదేరిన అలకనంద, మందాకిని నదులు ఇక్కడ సంగమిస్తాయి.

మందాకినిలో నీరు స్పటిక జలంలాగా స్వచ్ఛంగా ఉంటుంది. అలకనంద నీరు అభ్రకము, సున్నపు కొండల మధ్యప్రవహించుట వలన కొబ్బరినీటిలాగా స్వచ్ఛంగా ఉంటుంది. అలకనది ఉపనది అయిన విష్ణు గంగలలో నీరు వరద నీరులాగా ఉంటుంది. ఈ నదుల సంగమం నేత్రానందంగా ఉండి ఇక్కడికి విచ్చేస్తున్న భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఇక్కడి నీరు సుడులు తిరుగుతూ, నురగలు క్రక్కుతూ పెద్ద పెద్ద అలలతో దుముకుతుంటుంది. ఒంటరిగా వెళితే భయం వలన కళ్ళు బైర్లు క్రమ్మినదిలో పడిపోయే ప్రమాదము ఉంది. ఎలాంటి ప్రమాదం జరగకుండా ఊచలకు వెలుపలే కూర్చుని చెంబులతో నీళ్లు తీసుకొని స్నానం చేస్తారు. రుద్ర స్వరూపంతో ఉండే సంగమం కనుక దీనిని రుద్ర ప్రయాగ అంటారు.

ఈ సంగమ స్థలములో (1300 సంవత్సరాల నాడు) ఆదిశంకరులచే ప్రతిష్టించబడిన 'రుద్రనాథ్‌జీ' మందిరం యాత్రికులు దర్శించుకునే పుణ్యస్థలము. రుద్రప్రయాగకు తూర్పుగా 2-1/2 కి.మీ. దూరంలో అలకానంద ఒడ్డున కోటేశ్వర ఆలయం ఉంది. ఇక్కడి అలకానంద ప్రవాహస్థలం ప్రపంచ దర్శనీయ ప్రదేశములలో ఒకటి.

**ఛట్వాల్ పీపల్ బ్రిడ్జి** : అలకనంద శిఖరాలను చీల్చుకుంటూ గాలికి కదిలే రిబ్బన్‌లాగా సన్నని మార్గం గుండా ప్రవహిస్తుంది. నది వెడల్పు 9 అడుగుల 10 అంగుళాలు ఉంటుంది. లోతు 400 అడుగులు ఉంటుంది. దీనినే ఛట్వాల్ పీపల్ బ్రిడ్జి అంటారు. ఇక్కడ పులులు ఎక్కువగా ఉండటం వలన యాత్రికులు తగు జాగ్రత్తలు తీసుకుంటే ఏ ప్రమాదం జరుగదు. జీవకోటికి ప్రాణశక్తితో పాటు ఆత్మశక్తిని ప్రదానం చేసే ఈ ప్రదేశములో మహాదేవతా స్వరూపులయిన అనేక మంది మహర్షులు తపస్సు చేసుకుంటూ ఉంటారు.

## కర్ణప్రయాగ మహాత్మ్యము



పూర్వమిచ్చుట కర్ణుడు తపస్సు చేసాడు. అతడు అలకనంద, పిండర గంగల సంగమువద్ద యజ్ఞదీక్ష బూనెను. వేద పఠనము చేయుటకై వాసుదేవాది మునులు కర్ణుడు చేయు యజ్ఞమునకు వచ్చిరి. యజ్ఞము నందు కర్ణుడు సూర్యభగవానుని గూర్చి ప్రార్థించెను. సూర్యుడు సంతోషించి, కర్ణునికి ఒక అభేద్యమైన కవచమును ఎన్నటికీ నాశనమవని ఒక అమ్ములపొదిని ఇచ్చి, కర్ణునికి అభయమొసంగి వెళ్ళాడు. అందువలన ఈ క్షేత్రమునకు "కర్ణప్రయాగ" అని పేరు వచ్చినది.

## నందప్రయాగ మహాత్మ్యము



నందప్రయాగనే కణ్వాశ్రమమని గూడా అంటారు. అక్కడ నుండి నందగిరి వరకు గల బదరీ క్షేత్రము పరమ పవిత్రమైనది. కోరిన కోర్కెలనన్నింటిని తీర్చునది. పూర్వము నందమహా రాజిచ్చటనే గొప్పయాగము చేసెను. కావుననే దీనికీ పేరు కలిగినది. ఇక్కడ నంద, అలకనందల సంగమమైనది. నియమ పూర్వకముగా ఇచ్చట స్నాన, దానములు చేయుటవలన పితరులకు ముక్తి కలుగుతుంది.



## విష్ణు ప్రయోగ

పాండులేశ్వరమని మరో పేరు వుంది. వాసుదేవ, బదరీ ఆలయాల్లోని స్వామి విగ్రహాలు పాండురాజు ప్రతిష్ఠించాడని చెబుతారు.

## ప్రయాగ

త్రివేణీ సంగమం, ప్రయాగ అని పిలువ బడుతూన్న అలహాబాదు నగరం హిందువులకు ఓ అతి ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రం.



ఇక్కడ గంగ, యమునా, సరస్వతీ నదులు సంగమం అవుతాయి. పైకి రెండు నదులే కనిపించినా సరస్వతీనది అంతర్లీనంగా కలుస్తోందని చెబుతారు. మొఘలు చక్రవర్తి అక్బరు యిక్కడ ఓ కోటని నిర్మించాడు. త్రివేణి సంగమ స్థానంలో పన్నెండేళ్ళకోసారి కుంభమేళా ఉత్సవాలు జరుగుతాయి.

అశోక చక్రవర్తిచే నాటబడిన స్థంభం ఒకటి ఈ నగరంలో వుంది. 'అక్షయవట' అనే అతి ప్రాచీన కాలంనాటి మర్రిచెట్టు, గణేశమందిరం, నెహ్రూకి చెందిన ఆనంద భవనం, ఘుస్రుభాగ్, భరద్వాజ ఆశ్రమం మొదలగునవి యిక్కడి యితర దర్శనీయ స్థలాలు.

అలహాబాదులోని త్రివేణి సంగమనదీ స్నానం మనకు అతిశుభదాయకం. అదీ మాఘమాసంలో అత్యంత పుణ్యప్రదం. ఇక్కడ చక్కని వసతి సౌకర్యాలు లభిస్తాయి. ఈ నగరం నుంచి ఆగ్రాకు, ఖజురాహోకు బస్సులు

లభిస్తాయి. ఢిల్లీ నుంచి వారణాసి మీదుగా రైల్లో యిక్కడికి చేరుకోవచ్చు. ఆగ్రానుంచీ, ఝూన్సీ నుంచీ కూడా యిక్కడికి నేరుగా చేరుకునే రైళ్ళు నడుస్తాయి. విమాన సౌకర్యం కూడా వుంది. ఇక్కడికి 130 కి.మీ. దూరంలో చిత్రకూటం వుంది. ఇక్కడ వుండమని భరద్వాజమహర్షి రామునికి చెబుతాడు. మందాకినీ నది, జానకి స్నానం చేసిన రేవు, స్ఫటికశిలమీద రాముని పాదముద్రలను మనం చూడవచ్చును. సీతారాములు నడయాడిన పౌరాణిక ప్రదేశమిది.

## కేదార్‌నాధ్



అన్ని తీర్ధములలో కెల్ల ఉత్తమ తీర్ధము కేదారమని, ఈ క్షేత్రమును ఎన్నడు విడువనని, ఈ క్షేత్రము నీకన్న ఎక్కువ నాకు ప్రియమైనదని పార్వతీదేవితో మహేశ్వరుడు చెప్పినట్లు పురాణాలు చెబుతున్నాయి. మిక్కిలి ప్రాచీనమైన ఈ తీర్ధములో స్నానమాచరించినవారు నిస్సందేహంగా శివరూపము దాల్చుదురని పరమేశ్వరుడు – పార్వతితో అనెను. కావున ఈ క్షేత్రములో దేశములోని నలుదిక్కులనుండి విచ్చేసిన భక్తులు స్నానమాచరిస్తారు. ఈ క్షేత్రమునకు దక్షిణముగా రౌతః కుండము కలదు. అచ్చట నీరు త్రాగినంత మాత్రముననే శివరూపులగుదురని పరమేశ్వరుడు చెప్పెనందురు. రౌతఃకుండమునకు క్రింది భాగములో శివకుండము కలదు. అక్కడ ఏడు రోజులు వ్రతమాచరించి ప్రాణములు వదిలినవారికి కైలాస ప్రాప్తి కలుగునని చెబుతారు. ఇక్కడికి దగ్గరలోనే భృగు కుండము కలదు. దానికి 2 యోజనముల దూరంలో రక్తవర్ణములో పొంగుచున్న జలము బయల్వెడును. దానికి ఉత్తరంగా స్ఫటికంతో చేయబడిన "శివవిగ్రహము" దానికి తూర్పుగా 'వహ్నితీర్ధము' గలవు. ఈ వహ్నితీర్ధము అంటే అగ్నితీర్ధం. ఈ జలము మంచురూపమునకు మారును. అచ్చట పూజించినచో అగ్ని తృప్తిపడి కోరిన కోర్కెలు ఇచ్చును.

**గుప్తకాశి :** గుప్తకాశి అనుస్థలము కాశిలో దాగియున్నదని దానిని స్మరించినంతనే మహాపాపములు సహితము నాశనమగునని, ఇక్కడనే ఋషులు ఘోర తపస్సు చేసిరని చెప్పుదురు. ఇచ్చట పరమేశ్వరుడు "సిద్దేశ్వర మహాదేవునిగా" ప్రసిద్ధి చెందియున్నారు. గంగా యమునా నదులు కూడా గుప్త రూపములో ప్రవహించుచున్నదని దానియందు స్నానమాచరించినను, యిచ్చట సువర్ణ, రత్నదానములు చేసిన అనంత ఫలములు కలుగునని చెపుతారు.


**మధ్యమేశ్వర క్షేత్రము :** కేదార్ క్షేత్రమునకు దక్షిణంగా మూడు యోజనముల దూరంలో మూడు లోకములలోనూ రహస్యముగా నుండు మధ్యమేశ్వర క్షేత్రము కలదు. దానిని దర్శించినంతమాత్రాన మానవులు శివభక్తులై శివలోకము పోవుదురని పురాణాలు చెపుతున్నాయి.

**తుంగనాథ క్షేత్రము :** శివుడు పార్వతీదేవితో మూడవ కేదారమయిన తుంగనాథ క్షేత్రము గురించి చెప్పినట్లు పురాణం ద్వారా తెలుస్తోంది. కేదార్‌నాథ్‌కు దక్షిణ దిక్కులో మూడు యోజనముల పొడవు, రెండు యోజనముల వెడల్పు కలిగిన తుంగనాథక్షేత్రము మానవ కోర్కెలు తీర్చు క్షేత్రము. ఇక్కడ భైరవుని పూజించిన, పిదప తుంగనాధుని పూజించవలెను. ఇక్కడ శివలింగంపై నీరు అభిషేకించిన నీటిలో ఎన్ని నీటి బిందువులు ఉన్నవో అన్ని వేల సంవత్సరములు ఆ మానవుడు ఆనందించునని, బిల్వ పత్రములు, పుష్పములతో పూజించిన దరిద్రమన్నది ఉండదని, నానావిధ నైవేద్యములు సమర్పించిన పాప విముక్తి పొందుదురని పరమేశ్వరుడు పార్వతి దేవితో చెప్పినట్లు స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

**రుద్రనాథ క్షేత్రము:** 4వ కేదారముగా అన్ని తీర్థములలో కెల్ల ఉత్తమ రుద్ర దేవాలయముగా ప్రసిద్ధి నొందినది. ఇచ్చట అన్ని రకముల ఆభరణములతో అలంకరించిన శివుని ముఖము చూసినంతనే మనుషులు ముక్తి పొందుతారు. ఇక్కడ ఉన్న వైతరణి నదిలో పిండ ప్రదానము చేసిన అనంతమైన ఫలము లభిస్తుంది. దీనికి పశ్చిమాన 'గోపస్థమ'ను క్షేత్రము కలదు. అచ్చట స్వామి "గోపేశ్వరునిగా" పార్వతీదేవితో కలసి ఉండునని పరమేశ్వరుడు పార్వతిదేవికి చెప్పినట్లు స్థల పురాణం. ఈ గోపేశ్వర క్షేత్రమునందు ఎల్లవేళల పుష్పములు పూయును. ఇక్కడ స్వామి త్రిశూలము చిహ్నము అత్యంత ఆశ్చర్యకరమైనది.

**కల్పేశ్వర క్షేత్రము:** శివుడు దాక్షాయనితో ఈ 5వ క్షేత్రము యొక్క మహాత్మ్యము వివరించెను. అన్ని పాపముల నాశన మొనర్చు క్షేత్రము కల్పేశ్వర క్షేత్రము, దుర్వాసుని శాపము వలన దేవేంద్రుడు సిరిసంపదలు కోల్పోయి తేజో విహీనుడై భయముతో కల్పేశ్వర క్షేత్రములోని ఈశ్వరుని, పార్వతీదేవిని పూజించి కల్ప వృక్షము పొందినాడు. అందువలననే ఈ క్షేత్రములోని స్వామి కల్పేశ్వరునిగా పేరు పొందెను. ఈ క్షేత్రములో స్నానము చేసిన అనంత ఫలము పొందుదురని పరమేశ్వరుడు పార్వతికి తెలిపినట్లు స్థల పురాణం ద్వారా చెప్పబడుచున్నది.


## భూలోక వైకుంఠం బదరీనాథ్



పవిత్ర పుణ్యస్థలాల్లో ముఖ్యమైనది బదరీనాథ్. తపోభూమి అని కూడా పిలువబడే ఈ ప్రాంతము సాక్షాత్తూ భూవైకుంఠము అనే నమ్మకం భక్తులలో ఉన్నది. ఆలయం తెరిచే రోజుల్లో యిక్కడ పవిత్ర కుండములలో స్నానము చేసి బదరివిశాల్ స్వామిని దర్శనం చేసిన వారికి మరోజన్మ ఉండదని చెప్పబడింది. అలకనంద నది ఒడ్డున ఉన్న ఈ బదరీనాథ్ ఆలయమునకు వెళ్ళే భక్తులు ప్రకృతి సౌందర్యమునకు తన్మయులై భక్తి పారవశ్యముతో ప్రార్థనలు చేస్తారు. పద్మాసనంలో వున్న ఈ బద్రీనారాయణమూర్తిని జగద్గురు ఆదిశంకరా చార్యులు గుడిలో ప్రతిష్ఠించారు. వారు ఇక్కడే ఆత్మజ్ఞానమొందారు.

భక్తులను విశేషంగా ఆకర్షించే మరో దృశ్యం లోయకు అటూ ఇటూ ఉన్న నరనారాయణ శిఖరాలు. పగటి ఎండకు ధగధగలాడుతూ శోభిస్తూ ఉంటాయి. రాత్రివేళల్లో నక్షత్ర కాంతితో గంభీరంగా మెరుస్తూ ఉంటాయి. రాత్రి వేళల్లో ఈ శిఖరాలను చూసిన భక్తులకు కనబడే దృశ్యాలు చూసి ఆనందించవలసినదే కాని చెప్పనలవి కాదు. ఋషికేశ్ నుండి సుమారు 110 కి.మీ. బస్సు ప్రయాణం చేస్తే బదరీనాథ్ వస్తుంది. హిమాలయాల్లో 7వ శతాబ్దిలో శ్రీ శంకరాచార్యులు వారు స్థాపించిన శారదా పీఠాల్లో ఒకటి బదరీనాథ్‌లో కలదు.

## ఆధ్యాత్మికతా హృదయం ఋషికేశ్



హరిద్వార్‌కు ఈశాన్య దిశగా 24 కి.మీ. దూరంలో ప్రశాంత వాతావరణంలో "ఋషికేశ్" పుణ్య క్షేత్రము కలదు. ప్రకృతి శోభతో కనబడే ఈ క్షేత్రమునకు దక్షిణ వైపున గంగానది, మిగిలిన మూడు వైపుల హిమాలయ పర్వతాలు ఉన్నాయి. దేశ విదేశాల నుండి వస్తున్న అనేక వేలమంది భక్తులతో ఈ క్షేత్రము రద్దీగా ఉంటుంది.

పవిత్రమైన హృషికేష్ పుణ్యక్షేత్రము సత్యాన్వేషులైన భక్తులకు నివాసము. పవిత్ర సుందర గంగానదీ తీరమున ఉన్నతమైన హిమాలయారణ్యముల నడుమ ఉన్న పుణ్యక్షేత్రమే 'హృషికేష్'. హరి ద్వారము నుండి హిమాలయాలలోని దట్టమైన అడవి మార్గములో ఉత్తరముగా పద్నాలుగు మైళ్ళు ప్రయాణం చేసిన 'హృషికేష్' చేరవచ్చును. అన్నివైపుల ఎత్తైన వృక్షముల సమూహము నయనానందకరంగా ఉండును. హృషికేష్ పట్టణమునందు నీలివర్ణపు గంగా ప్రవాహము మరపురానిది. ఇచ్చట ప్రజలు చెప్పుకొను దానిని బట్టి ఈ ప్రాంతమున 'రైభ్యుడు' అను ఋషి తపస్సు చేసి ఇంద్రియములను జయించిన వాడగుటవలన 'హృషికేష్' అని పేరు కలిగినది. ఈ క్షేత్రమునకు 'కుబ్జమరక' అని పేరు కూడా కలదు. ఈ 'హృషికేష్' లో గడ్డకట్టుకొని పోవు చలిలో గంగానదిలో స్నానము చేయుట, విలక్షణమైన ఆహారమును భుజించుట అతి చలి, అతి వేడి వాతావరణములను భరించుట హృషికేష్‌ను సందర్శించిన దక్షిణ భారతీయులకు విన్నూతనమైన అనుభవం.



## బ్రహ్మకపాలం

బ్రహ్మకపాలమును బదరీనాథ్ అని కూడా పిలుస్తారు. శ్రీ మహావిష్ణువు పద్మాసనాసీనుడై నరుడికి దర్శనమిచ్చి మంత్రోపదేశము చేస్తాడు. ఈ బ్రహ్మ కపాలమునందు స్నానము చేసిన బ్రహ్మహత్యాది పాపములు పోవునని బ్రహ్మకపాలము నందు ధ్యాన పూర్వకంగా పిండప్రదానము చేసిన వారి పితరులు పరమవైభవగతి పొందుతారని

క్షేత్ర పురాణం. ఈ క్షేత్రము గయకు ఎనిమిది రెట్లు ఎక్కువ ఫలము నిచ్చు క్షేత్రమని ఇక్కడ పిండ ప్రదానం చేసిన గయలో పిండ ప్రదానము చేయనవసరము లేదని చెపుతారు. అందు వలన ఇక్కడ తప్పక పిండప్రదానము చేయాలి. ఈ బ్రహ్మకపాలమునకు మించిన సర్వోత్తమ తీర్థము మరి ఒకటి లేదని శివుడు బ్రహ్మకపాల మహాత్మ్యమును స్కందునికి వివరించినట్లు చెప్పినట్లు తెలుస్తుంది.

**గౌరికుండ క్షేత్రము** : కేదారమునుండి నాలుగు క్రోసుల దూరంలో కోరిన కోర్కెలు సిద్ధింపజేయు గౌరి కుండ క్షేత్రము కలదు. పార్వతీదేవి మందాకిని నది ఒడ్డున కార్తికేయుని జననమునకై ఋతుస్నానమాచరించిన స్థలమే గౌరికుండముగా చెప్పబడుచున్నది. ఇచ్చట నీరువేడిగా ఉంటుంది. సింధూర వర్ణము మన్నుకలిగిన ఈ గౌరీకుండములో స్నానమాచరించి ఆ మట్టిని నుదుట తిలకంగా పెట్టుకొనిన వారిని పరమేశ్వరుడు తన ప్రియమైన భక్తులుగా స్వీకరించెదరని చెప్పుదురు. ఈ గౌరి తీర్థమునకు ఒక క్రోసు దూరంలో 'వైనాయక్ క్షేత్రము' కలదు.

**వైనాయక క్షేత్ర స్థల పురాణం** : పార్వతీదేవి స్నానము చేయుచు ద్వారమువద్ద కాపు ఉంచిన విఘ్నేశ్వరుని శిరస్సు శివుడు ఖండించి, పార్వతీదేవి కోరికపై తిరిగి పరమేశ్వరుడు ఏనుగు శిరస్సు అతని శరీరమునకు అతికించగా నాటి నుండి అతడు గజాననుడైనాడు. కావున ఈ క్షేత్రములో ఉన్న వినాయకుని పూజించిన తరువాతనే కేదారము వచ్చి కేదారేశ్వరుని దర్శించవలెనని పరమేశ్వరుడు పార్వతిదేవికి చెప్పినట్లు స్థల పురాణం.

**శ్రీ త్రియోగినారాయణ** : మందాకిని, త్రివిక్రమ నదుల సంగమమునకు పడమటి ఒడ్డున క్రోసున్నర దూరంలో యజ్ఞమను పర్వతముపై నున్న క్షేత్రము త్రియోగి నారాయణ క్షేత్రముగా పేరుపొందినది. ఇక్కడి భక్తులు లక్ష్మీనారాయణుల దర్శనము చేసుకొనవచ్చును. ఈ నారాయణ క్షేత్రములో మూడు యుగముల నుండి అగ్ని మండుతూనే ఉన్నదని, ఇది ఎన్నటికీ ఆరిపోదని పార్వతీ పరమేశ్వరుల వివాహస్థలమని చెపుతారు. "ఓం నమో నారాయణాయ" అను మంత్రము చదివి ఇక్కడ ఉన్న సరస్వతి నదిలో స్నానమాచరించిన వారికి ముందు పదితరములవారు, వెనుక పదితరముల వారు మోక్షము పొందుదురు అని స్థలపురాణం.

**నారదకుండ క్షేత్రము** : అలకానంద నది ఒడ్డున ప్రసిద్ధి చెందిన నారదీయ తీర్థము కలదు. ఈ క్షేత్రములో 50 పైగా విష్ణు విగ్రహములు కలవు. పరమేశ్వరుడు శ్రీ శంకరాచార్యులుగా అవతరించి లోకహితార్థము నారద కుండము నుండి ఒక విగ్రహము తీసి వేరొక చోట ప్రతిష్ఠించెను. ఈ విగ్రహము దర్శించినంతనే మానవుల పాపములు పోవునని పరమేశ్వరుడు పార్వతితో చెప్పినట్లు స్థల పురాణం.

**ఋషిగంగ, కూర్మధార, ప్రహ్లాదధార క్షేత్రములు** : ఋషిగంగలో స్నానము చేసి నీరు త్రాగిన వారు బ్రహ్మత్వమును పొందుదురు. కూర్మధారలో ఆచమనము చేసి, ప్రక్కనే ఉన్న ప్రహ్లాదధారలో స్నానము చేసి ఆచమనము చేయుటవలన భక్తి జ్ఞానము లభించునని భక్తుల నమ్మకం. ఇక్కడ పాతవస్త్రములు ఆశ్రమవాసులకు ఇచ్చి నూతన వస్త్రములు ధరించి బదిరీ క్షేత్రమునకు వెళ్ళుదురు.

## హరిద్వార్



ఉత్తరప్రదేశ్‌లోని పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రము హరిద్వారము. ఐదు ముఖ్య మోక్షదాయక ప్రదేశాలలో హరిద్వారము ఒకటి. సముద్రమట్టానికి 5000 అడుగుల ఎత్తులో ఉన్న ఈ క్షేత్రము పావన గంగానది పర్వత లోయలగుండ మార్గం సుగమం చేసుకుని హరిద్వారము వద్ద సమతుల ప్రదేశంలోని ప్రవేశిస్తుంది. ప్రతి 12 సంవత్సరాలకు గంగ పుష్కరం జరుగుతుంది.

## దక్షప్రజాపతి ఆలయం కన్‌ఖాల్

చాలా పురాతనమైన ఈ కన్‌ఖాల్ హరిద్వార్ స్టేషన్‌కి 4 కి.మీ. దూరంలో వుంది. దక్షప్రజాపతి ఆలయం, సతీ కుండంతో పాటు మహా వీరాంజనేయ ఆలయం వుంది.



**స్థలమహాత్యం :** దక్షప్రజాపతి యజ్ఞాన్ని తలపెట్టి అందరిని పిలిచి, తనని వ్యతిరేకించి వెళ్ళిన కూతురు సతీదేవిని, శివుడ్ని పిలవకుండా యజ్ఞాన్ని ప్రారంభించాడు. పుట్టింటిమీద మమకారంతో శివుడు వొద్దంటున్న వెళ్లిన సతీదేవికి భంగపాటే జరిగింది. తండ్రి అగ్రహించి అల్లుడయిన శివుడ్ని ఘోరంగా దూషించాడు. అది విని భరించలేక సతీదేవి యజ్ఞ కుండంలోకి దూకింది. అది తెలిసి శివుడు కాల రుద్రుడై యజ్ఞాన్ని ధ్వంసం చేసి మృతురాలైన సతీ దేహాన్ని తీసుకొని శోక తప్త హృదయుడయి తిరగటంతో లోకాలే అల్లకల్లోలమయ్యాయి. ఆ ప్రళయాన్ని ఆపే ఉద్దేశ్యముతో శ్రీ మహావిష్ణువు చక్రాయుధాన్ని ప్రయోగించాడు. అది సతీదేవి దేహాన్ని 52 శకలాలుగా చేధించింది.

## వ్యాసగణేశ గుహలు

బదరీకి చేరువగా కేశవ ప్రయాగ వద్ద సరస్వతీ అలకనంద నదుల సంగమం జరిగిన చోట మహాభారత రచన సాగిన గుహలున్నాయి. ఈ నదీతీరాన ఉన్న ఈ గుహల్లో కొంతకాలం పాటు శంకరాచార్యులవారు నివశించారు, వ్యాసునిచేత చెప్పబడిన మహాభారతం గణపతి గంటం దించకుండా ఇక్కడే రాశాడని ప్రతీతి. నారదుడు, శుక్రుడు, భృగువు వంటి దివ్య మునులెందరో ఇక్కడ తపమాచరించినట్లు చెప్పుకుంటారు.

## నైనితాల్



స్థల పురాణం ప్రకారం శివుడు సతీదేవిని తీసుకొని వెడుతుండగా ఆమె కళ్ళు యిక్కడ రాలిపోయాయట. ఆ రాలిన కళ్ళవెంటే జాలువారిన ఆవిడ కన్నీటితో యిక్కడ నయన (కళ్ళు!) తాల్ (సరస్సు) ఏర్పడిందట. పరిసరాల్లోని ఏడుకొండల నుంచి జాలువారే సెలయేటి నీటితో ఈ సరస్సులోని నీరు స్వచ్ఛంగా వుంటుంది. చుట్టూ దట్టమయిన అడవుల మధ్యలో ఏర్పడిన ఈ తటాకం ఎంతో సుందరంగా మన కన్నులకు గోచరిస్తుంది. ఒకనాటి 'నయనతాల్' నేడు 'నైనితాట్' అయింది.

1816వ సంవత్సరంలో భారతదేశాన్ని సందర్శించిన ఓ బ్రిటిష్ వాణిజ్యవేత్త అయిన బారన్ ఈ నైనితాల్ సరస్సు ప్రాంతాల్లోని ప్రకృతి అందానికి ముగ్ధుడయి 1842లో మళ్ళీ తన స్నేహితులతో తిరిగి వచ్చాడు. అతనే తొలిసారిగా నైనితాల్ సరస్సులో పడవల పందాల్ని నిర్వహించాడు. ఆనాడు అతను సూత్ర ప్రాయంగా వాడిన రంగురంగు చారల తెరచాప పడవలే నేటికీ వాడుకలో వున్నాయి.

## అల్మోరా



శ్రీ మహావిష్ణువుకి విడిదిగా పరిగణించబడుతోన్న ఈ హిమవత్ పర్వత ప్రాంతాన్ని కాషాయగిరి అంటూ కూడా పిలుస్తారు. గుర్రపు నాడా ఆకారంలో సముద్ర మట్టానికి 1646 మీటర్ల ఎత్తులో వున్న ఈ నగరాన్ని 1560 సంవత్సరంలో చంద్రవంశజుడైన రాజా కల్యాణ్ నిర్మించాడు. కుమావున్ పర్వతశ్రేణి ప్రాంతాల్ని చంద్ర వంశీయులు చాలా కాలం పరిపాలించారు. అల్మోరా ఆ రాచరికపు రాజధానిగా నేటికి అలనాటి కళా సంస్కృతులకు ప్రతీకగా నిలిచి వుంది. ప్రాచీన చంద్రవంశరాజుల కోట, చక్కగా వేయబడిన రాజమార్గాలూ, నగిషీలు చెక్కబడిన కర్ర గృహాలూ అల్మోరా ప్రజల జీవనసరళిని సవివరంగా తెలియజేస్తాయి.

స్వామి వివేకానందుడు యిక్కడే ఓ గుహలో కూర్చుని జ్ఞానమూర్తిగా మారాడని చరిత్ర చెబుతోంది.

**ఇతర దర్శనీయ ప్రదేశాలు :**

**మహాకాళి దేవాలయం, ఛౌకొరి –** సముద్రమట్టానికి 2010 మీటర్ల ఎత్తులో ఉన్న ఛౌకొరి అందమైన కొండ ప్రాంతం ప్రకృతి ఆరాధకులకు కనువిందు చేసే ప్రాంతం. ఇక్కడి మహంకాళీదేవాలయం, 51 శక్తి పీఠాలలో

ఒకటిగా చెబుతారు. జగద్గురు శంకరాచార్య దీనిని శక్తిపీఠాలలో ఒకటిగా గుర్తించారు. బెరినాగ్ గ్రామంలోని నాగమందిరం, సముద్రమట్టానికి 1350 మీ॥ ఎత్తులో సొరంగం వంటి గుహలోవున్న పాతాళ్ భువనేశ్వరి దర్శనీయాలు. ఇంకా అతిథి గృహం దగ్గర్లోని ఉల్కాదేవి, అందంగా దేవతలను శిలలపై చెక్కి సజీవత కల్పించిన ఘనసేరదేవి ఆలయం తప్పక చూడాలి.



**కాశీవిశ్వనాథాలయం – ఉత్తరకాశి :** హృషీకేశ్‌కు 154 కి.మీ. దూరంలో ఈ ఆలయముంది. కాశీతో అన్ని విధాల వరుణ, అసి నదుల సంగమం ఇటు భగీరథ, అటు



దోడితాల్‌నుండి వచ్చిన వాగు సమానంగా ఉండటంవలన, దీనికి ఉత్తరకాశి అని పేరు వచ్చింది. ఇక్కడెన్నో దేవాలయాలు చూడముచ్చటగా వున్నాయి. పోఖు దేవాలయం, భైరవుని ఆలయం, కుట్టిదేవిఆలయం, కర్ణదేవతాగంగోత్రి, యమునోత్రి, శనిదేవాలయాలు కాశీవిశ్వనాధాలయంతో కల్సి కనువిందు చేస్తాయి. ఇక్కడ మనింటిప్రక్కనవున్న ఆలయానికే వెళ్ళని మనం అక్కడికి ఎందుకు వెడతామని, అనకండి. కొందరికి చూడాలనే కుతూహలం, యాత్ర చేయాలనే సంకల్పం, చేస్తామనే తృప్తి, ప్రక్కన్నుది ఎప్పుడైనా చూడవచ్చుననే ధీమా, మొత్తంకలిపి తీర్థ, క్షేత్ర, యాత్రీకుని చెయ్యవచ్చును.

ఇక్కడి ఊరి మధ్యలో నున్న శివాలయాన్ని కాశీ విశ్వనాధాలయంగా చెబుతారు. 2 అడుగుల ఎత్తు, 2 అడుగుల చుట్టుకొలత కలిగిన ఈ శివలింగం చూడముచ్చటగా వుండటానికి కారణం, మహ్మదీయుల దండయాత్రతో ధ్వంసమైపోయే కాశీవిశ్వనాధాలయంలోని శివలింగాన్ని భద్రంగా ఇక్కడికి తెచ్చి ప్రతిష్ఠించారని, అందుకే ఇంత అందంగా హుందాగా, భక్తజనసంతోషదాయకంగా వున్నదని చెబుతారు. కాశీవిశ్వనాధాలయానికి ఎదురుగాగల చిన్నమందిరం శక్తిఆలయంగా పిలుస్తారు. ఇక్కడా ఒక శివలింగం పానపట్టాన్ని ఆనుకుని 16 చేతుల, మూడు అడుగల దుర్గామాత కూర్చుని కనిపిస్తుంది. మరొక ప్రక్కన వినాయకుడు చూడగల్గుతాము. ఇంకా ఇక్కడ పరుశురామాలయం, దానిప్రక్కన కాళికాలయం, ఆ ప్రక్కన రుద్రనాథాలయం వున్నాయి. ఇక్కడి గంగ ఉత్తరవాహిని. ఇక్కడికి దగ్గరలో పరశురాముని తండ్రి అపర శివావతారమైన జమదగ్ని ఆశ్రమం చూడగల్గుతాం.

**కూర్మాంచల్ :** కూర్మావతారం శ్రీకాకుళంలోనే వుందనుకుంటాము. భారతదేశంలో ఇక్కడా చూడగల్గుతాం. ఇది పేరు పొందిన సైనికస్థావరం. అయినా సమయానుకూలంగా ఉత్సవాలు నిర్వహింపబడతాయి.

**గుప్తకాశీ** – పాండవులు మహాభారతయుద్ధానంతరం, పాపప్రక్షాళనంకోసం కాశీకి వస్తే పరమశివుడు, అక్కడ అదృశ్యమై ఇక్కడ గుప్తంగా వుంటాడు. ఇది సహదేవుడు తెలుసుకుని అన్నలతో కలిసి ఇక్కడికి వస్తే ఆ శిల మందలో గుప్తంగా వున్న శివుని కనుగొన్నారని భీముడు



వేసిన రంకెలకు అన్ని ఆవులు పారిపోతాయి. కోపమొందిన శివుడు తనను అయిదుభాగాలుగా చేసుకుంటాడు. అవే పంచకేదారాలు. ఇచ్చట స్వామి సిద్ధేశ్వర మహాదేవునిగా పూజింపబడుతున్నాడు.

జరిగినదానికి బాధపడ్డ పాండవులు శివుని స్తుతిస్తారు. దాంతో స్వామి జ్యోతిస్వరూపుడై వెలసి పాండవులను అనుగ్రహిస్తాడు.

ఈ **తాపకేశ్వరంలో** ద్రోణాచార్యులవారు తపస్సు చేసి జ్ఞానమొందారుట. ఇక్కడి శివపార్వతుల కల్యాణం చూడదగ్గది.



ఇది డెహ్రాడూన్‌కు 12 కి.మీ దూరంలో **లక్ష్మణసిద్ధ ఆలయం** వుంది. ఇక్కడ ఈ మహనీయుని సమాధిని దర్శించి, భక్తులు శ్రద్ధావంతులౌతారు. రామసోదరుడు లక్ష్మణుడు కూడా రావణసంహారం చేసినందులకు ఇక్కడే ప్రాయశ్చిత్తం చేసుకున్న ప్రదేశమని స్థానికుల భావన.

**చంపావతి**లో అనేక ఆలయాలున్నాయి. నిజం చెప్పాలంటే ఆలయ అర్చనాదుల తతంగంకన్నా, పర్యాటకులకు ఇదొక ఆనందమందిరం. ఇక్కడ క్రన్తేశ్వర్ మహాదేవ్ ఆలయం, బలేశ్వర్, పుర్నగిరి, గ్వాల్ దేవత, నాగంత్, ఆదిత్య, చౌము, పటాలరుద్రేశ్వర్ వగైరా ఎన్నో ఆలయాలున్నాయి. ఇచ్చటి నాగంత్ ఆలయాన్ని ఒక్కరోజులో నిర్మించారుట. ఇది ఇక్కడి విశేషం. ఇక్కడ మాయావతి ఆశ్రమం చూడదగ్గది.



**జ్వాలాదేవి ఆలయం, చంద్రవదన శిఖరం, లఖామండల్ (లక్కఇల్లు) ప్రాంతం** పాండవులను చంపడానికి దుర్యోధనుడు ఏర్పాటు చేసిన ప్రాంతంగా చెబుతారు. కొన్ని ప్రాంతాలు సులువుగాను, కొన్ని కొద్ది కష్టం, మరికొన్ని మరింత కష్టం, ఇంకొన్ని ఇంకొంత కష్టగానే చూడాల్సివస్తుంది. ఇక చంద్రవదన శిఖరం విషయానికొస్తే 51 శక్తిపీఠాలలో ఒకటిగా చెబుతారు. సతీ దాక్షాయణి ఆకాశమార్గంలో పయనిస్తూంటే ఆమె స్తనద్వయంలోని ఒకటి జారిపడటంతో, దీనిని చంద్రవదన శిఖరప్రాంతమంటారు. అందుకుతగ్గట్లు స్తనాకారంలో వుండే ఓ శిలను అక్కడ మనం చూడగల్గుతాం. దేవప్రయాగ మీదుగా ఈ ప్రాంతం చేరడం సులభం.



**గోముఖం –** దీనికి పశ్చిమాన శివలింగ పర్వతం, మేరుగిరి, కీర్తిబమక్ శిఖరాలున్నాయి. తూర్పున గంగపుట్టుక, ఇంద్రుడి నందనవనం, తపోవనాలున్నాయి. శివలింగపర్వతం, కేదారనాథ్‌లు ఇక్కడ నుండి స్పష్టంగా చూడగల్గుతాం.




**జోషిమఠం –** దండధారకుండానికి కొద్దిదూరంలో 'జ్యోతిర్మఠ' ముంది. అక్కడి కల్పవృక్షం 2400 సంవత్సరాల నాటిదిగా చెబుతారు. ఈ చెట్టు చుట్టుకొలత 40 అడుగులు. ఆదిశంకరులు ఇక్కడ తపస్సు చేసి ఆత్మ సాక్షాత్కార మొందారుట. బ్రహ్మజ్ఞానం జ్యోతిస్వరూపంగా దర్శనమివ్వడంవలన దీనికి జ్యోతిర్మఠమని పేరుపెట్టారుట. దీనివద్ద వున్న శివాలయంలో కేదారేశ్వరుని ప్రతిరూపం మనం చూడగల్గుతాం. ఇక్కడే రాజరాజేశ్వరి వుంది. ఇక్కడి ఓగుహలో ఆదిశంకరుల 'సన్నిధి'ని చూడగల్గుతాము.

ఉత్తరహిమాలయాలలోని **కుమావున్ శిఖర శ్రేణులలోని రూపకుండాన్ని, ఆల్మోరా దేవాలయం** ఒకప్పుడు చాందీ వంశస్థుల రాజధానిగా వుండే ప్రాంతంలో ఈ సూర్యదేవాలయం నిర్మించబడింది. ఇది 12వ శతాబ్దిలో నిర్మింపబడిన ఆలయంగా చెబుతారు. దీనిని ఇక్కడివారు 'కోసి' ఆలయమంటారు. సూర్యకిరణాలు మూలవిరాట్టుపై పడటం ఇక్కడి విశేషం. రథసప్తమిని ఘనంగా జరుపుతారు. చూసినవారిది అదృష్టం.

**బదరీ**నుండి 9 కి.మీ దూరంలో కాలినడకలో **ద్రౌపది ప్రాణత్యాగం చేసిన ప్రాంతం** చూడగల్గుతాము. ఈ లక్ష్మీవనంనుండి అడుగుముందుకు వేస్తే 'సహస్రధార'గా అనేక జలపాతాలు, ప్రకృతి పరిశోధకులు, ప్రియులను పరవశింపచేస్తాయి.

పురాణాలలోని **మణిభద్రపురం,** ఇప్పుడు 'మానా'గా పిలువబడుతోంది. ఇక్కడే వ్యాసుడు, వినాయకుడు ఒప్పందం చేసుకుని మహాభారతం రచనను గావిస్తారు. అలకనంద, సరస్వతి నదుల సంగమానికి కొద్ది దూరంలోని గుహలో వినాయకుని చూడగల్గుతాం.

గంగోత్రికి సుమారు 10 కి.మీ. ముందే **భైరవఘాట్,** ఇక్కడి భైరవమూర్తి పురాతన చిన్న ఆలయం. చూడదగ్గది. ఈ భైరవమూర్తిని గంగోత్రి క్షేత్రపాలకుడని చెబుతారు.

**చోప్తా** లోని **తుంగనాథ్ దేవాలయం**, ఆల్మోరా జిల్లాలోని సుందరమైన **కౌసని పట్టణంలో పిన్నాథ్ ఆలయం,** దీనికి 11 కి.మీ దూరంలో **సోమేశ్వర పట్టణంలోని శివాలయం**, మరికొన్ని ఆశ్రమాలు చూడదగ్గవి.



8వ శతాబ్దంనాటి ఆల్మోరాలోని **రాణిఖేత్** లోని **'ఝులదేవి' ఆలయం, బింసర్‌మహాదేవ్ ఆలయాలు** అత్యంత ప్రముఖమైనవి. ఒకప్పటి ప్రాచీన ఆలయ ప్రాంతాన్ని బ్రిటిష్‌వారు వేసవి విడిదిగా మార్చి, పర్యాటకులకు, ప్రకృతి పరిశోధకులు, చారిత్రక అభిలాషులకు ఆనందధామం చేసారు.

**అల్మోరా** లోని మరొకటి **జోగేశ్వరాలయం.** దేవదారు వృక్షాలతోవున్న అందమైన ప్రకృతిరమణీయ లోయప్రాంతం. ఇది ద్వాదశ జ్యోతిర్లింగప్రాంతాలలో ఒకటైన

'నాగేశం'. ఇక్కడ 124 పెద్ద, చిన్న ఆలయాలను మనం చూస్తాం. దేహమే దేవాలయం, జీవుడే ఆ సనాతనుడైన దేవుడనడానికి నిదర్శనంగా, ఈ అఖండ భారతావనిలో ఆలయం, దేవుడులేని ప్రదేశమే కనబడదు. 9–13 శతాబ్దాల మధ్య ఈ ఆలయం నిర్మించినట్లు తెలుస్తోంది. దండేశ్వర్, జాగేశ్వర్, చండికా, మహామృత్యుంజయ, కుబేర్, నవగ్రహ, నందాదేవి ఆలయాలు ఇక్కడి ప్రసిద్ధ దేవాలయాలు.





**లాన్స్‌డౌన్ :** ఒక్కొక్క ప్రాంతంలో, ఒక్కొక్క ప్రాంతం ఆలయాల నగరంగా చెప్పుకుంటారు. ఒరిస్సాలోని భువనేశ్వర్, తమిళనాడులోని కుంభకోణం, ఈ ఉత్తరాఖండంలోని లాన్స్‌డౌన్ ఆలయ నగరాలుగా ప్రసిద్ధిగాంచాయి. ఇది సముద్రమట్టానికి 1706 మీటర్ల ఎత్తులో వుంది. ఇక్కడ కణ్వమహర్షి ఆశ్రమముంది. విశ్వామిత్రుడు కూడా ఇక్కడే తపస్సు చేసాడంటారు. ఇక్కడి ప్రముఖ ఆలయం తారకేశ్వర్ మహాదేవ్ ఆలయం. ఈ శివదర్శనానికి పెద్ద సంఖ్యలో ఎందరో వచ్చి భగవానుని దర్శించి పరవశిస్తారు.

**పితోర్‌ఘర్** జిల్లాలో **మహదేవ ఆలయం** వుంది. దీనిని పాల్, చాంద్ వంశాలు పాలించినప్పుడిక్కడ ఎన్నో ఆలయాలు, కోటలు నిర్మించారు. 15 శతాబ్దం కొద్దికాలమిది బ్రహ్మరాజుల పాలనలోవుంది. బ్రిటిషువారీ ప్రాంతాన్ని హస్తగతం చేసుకునేవరకు పరిపాలించారు. ఇక్కడి శివాలయం చాలాగొప్పది. కపిలమహర్షి తపస్సు చేసిన ప్రాంతం ఇదేనంటారు. పితోర్‌గర్‌నుండి 4 కి.మీ దూరంలో నకులేశ్వర్ ఆలయం వుంది. ఇక్కడి ప్రధాన దైవం శివుడే. ఇది ఖజురాహో శిల్పశైలిలో నిర్మించబడిన ఆలయం. అర్జునేశ్వర్, చండక్, మోస్తమను, ద్వాజ్, కోటగిరి దేవి మొ॥గు ఆలయాలతోపాటు; దిదిహాట్, నారాయణ్ ఆశ్రమం, జూలాఘాట్ వంటివి, ఇటు తీర్థయాత్రీకులైన భక్తులు, ప్రకృతి ఆరాధకులు, చరిత్ర పరిశోధకులైన పర్యాటకులు చూడవలసిన ప్రదేశాలు.



# పశ్చిమ బెంగాల్




అత్యధిక జనాభా గల నగరంగా పేరొందిన కలకత్తాను రాజధానిగా కల్గి ఉన్న రాష్ట్రం పశ్చిమ బెంగాల్. ఈ రాష్ట్రంలో మొత్తం 17 జిల్లాలు ఉన్నాయి.

స్వాతంత్ర్యానికి పూర్వం 1905లో బెంగాల్‌ను కర్జన్ విభజించారు. దీనికి వ్యతిరేకంగానే వందేమాతరం ఉద్యమం ఆరంభమైంది. 1911లో లార్డ్ హర్డింగ్ బెంగాల్ విభజనను రద్దుచేశారు. ఈ సమయంలోనే భారతదేశ రాజధానిని కలకత్తా నుండి ఢిల్లీకి మార్చారు. 1-11-1956 న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం స్వతంత్ర్య రాష్ట్రంగా అవతరించింది. భారతదేశ ధాన్యాగారంగా ప్రసిద్ధి చెందిన పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోనే సుభాష్ చంద్రబోస్, రాజా రామమోహన్‌రాయ్, అమర్త్యసేన్ వంటి మేధావులు కూడా జన్మించటం విశేషం.

**విస్తీర్ణం : 88,752, చ.కిమీ.** **ప్రధాన భాషలు : బెంగాలి**

**సరిహద్దులు :** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంకు తూర్పున అస్సాం, దక్షిణాన బంగాళాఖాతము, ఒరిస్సా, పశ్చిమాన బీహార్, ఉత్తరంగా సిక్కిం వంటి భారతీయ రాష్ట్రాలు సరిహద్దులుగా ఉన్నాయి. పూర్వకాలంలో వంగ దేశంగా పిలువబడిన బెంగాల్ రాష్ట్రంను మేధావుల జన్మస్థలంగా పిలువవచ్చు.

# కాళి ఘాట్

భారతదేశంలోని 52 శక్తిపీఠాలల్లో ఒకటైన ఈ కాళీఘాట్ కలకత్తా కాళి గురించి తెలియని వారు భారత దేశంలో లేరంటే అతిశయోక్తి కాదు. అతి ప్రాశస్త్యం గల ఈ అమ్మవారిని దర్శించడానికి ప్రపంచం నలుమూలల నుండి వస్తారు. కలకత్తా వచ్చి ఈ కాళీమాతను చూడకుండా ఎవ్వరూ తిరిగి వెళ్ళరు. చైత్రమాసంలో నవరాత్రోత్సవాలు బ్రహ్మాండంగా జరుగుతాయి.



ఇక్కడే రామకృష్ణ పరమహంస, వారి శిష్యునిగా వివేకానందుడు సర్వధర్మసారాన్ని ప్రపంచానికి అందించారు. వంగదేశానికి కాళిమాత ఆరాధ్యదేవత. దేశంలోని 5 శక్తిపీఠాలలో ఈ కలకత్తాకాళి మూలమూర్తిగా చెప్పాలి. సతీదేవి పాదభాగం పడిన ప్రదేశంగా దీనిని చెబుతారు. ఈ తల్లి కాస్త ఉగ్రంగా వుంటుంది.

కలకత్తాకు 100 కి.మీ దూరంలో గంగాసాగర్ సంగమం

వుంది. ఇక్కడి కాళిమాత ఎంతో ప్రశాంతంగా వుంటుంది. ఇది కాక దక్షిణేశ్వరంలోని కాళిమాతను కూడా చూడాల్సిందే. భాగీరథి స్నానంచేసి ఇక్కడి ద్వాదశ లింగాలను దర్శించుకోవచ్చును. రామకృష్ణపరమహంస "గదాధరుని"గా కాళిమాతను సేవించిన ప్రదేశమిది.

హుగ్లీ (గంగ) ని దాటగా బేలూరు మఠం చూడచక్కగా దర్శనమిస్తుంది. ఇది వివేకానందుడు తన గురువు నిమిత్తం నిర్మించాడు.

ఇక్కడి మ్యూజియం, రవీంద్ర సరోవరం చూడదగినవి.

దక్షిణేశ్వర శివాలయాన్ని, రాణీరసతుణిదేవి, నగర నడిబొడ్డును 19 కి.మీ దూరంలో నిర్మించింది. ఇక్కడి సమీపంలోనే రామకృష్ణుల నివాస గృహముంది. శారదామాత గుడిని కూడా పరమ పవిత్రంగా తీర్చి దిద్దారు.

విక్టోరియా మ్యూజియం, విలియంఫోర్టు, శీతలనాధ జైనదేవాలయం, శాంతినికేతన్, బిర్లాప్లానిటోరియం, చూడవచ్చును. చూడాలనే ఆసక్తి వుంటే, ప్రతిచోట ఏదో ఒక విధమైన ఆధునికత్వమో, ప్రాచీన చారిత్రక – పురాణ దివ్యత్వమో కనబడుతుంది. దర్శించండి!! కొంత శ్రమించాలి!

## గంగాసాగర్




దీనినే ఆదినాధ క్షేత్రం అనికూడా అంటారు, ఇక్కడనే కపిల మహర్షి భగీరధుల ఆలయాలున్నాయి, ఇక్కడికి చేరువలోనే గంగ సాగరంలో కలిసేది. మకర సంక్రాంతికి గొప్ప ఉత్సవం జరుగుతుందిక్కడ. డైమండ్ హార్బర్‌కు, కాక్‌ద్వీప్‌కు స్టీమర్‌పై వెళ్లవచ్చు! కలకత్తాకు 135 కి.మీ. దూరంలో ఇది వుంది.

## తామ్‌లుక్

ఇక్కడి రూప్ నారాయణ నదీ తీరంలో శ్రీకృష్ణార్జునులకు గుడి ఉంది. మిద్నపూర్ జిల్లాలో ఉన్న ఈ ప్రాంతానికి బస్సులో వెళ్లవచ్చు! రాక్షసులకు తల్లి అయిన దితికి దేవాలయం ఉన్న ప్రదేశం కూడా. ఆమె బుద్ధుని ఆలయంలో వెలసిన అమ్మవారు.

## తారకేశ్వర్



మందులు లేకుండానే వ్యాధుల్ని నయంచేసే స్వామివారుగా తారకేశ్వరుడు వెలసిన క్షేత్రం, అమ్మవారు తారకేశ్వరి చాలా పెద్దగుడి, పండాల ప్రభావం అధికం. వీరికి డబ్బుయావ అధికం. హుగ్లీ జిల్లాలో హౌరాకు 20 కి.మీ. బస్సులో వెళ్లవచ్చు.

కలకత్తా అంతటా మాత్రమే కాక, ఈ రాష్ట్రం మొత్తం మీదనే కాళీ ఆలయాలు అధికం. మజిల్పూర్, మయిస్పూర్, నన్పూర్, బెర్హాంపూర్, ఛట్నా, మంకర్, చితాపూర్, కలింపాంగ్ వంటి పలుప్రాంతాల్లో కాళీగుడులున్నాయి. హౌరా నుండి పూరీ వెళ్లే దారిలో మిద్నపూర్ జిల్లా కేంద్రం నుంచి 65 కి.మీ. దూరంలో డాంటన్ వద్ద శ్యామలేశ్వరాలయం ఉన్నది. కలకత్తాలోనని లాల్‌ధీఘా వద్ద శ్యామరాయ- రాధాబాయి గుడి ఉన్నది, బర్ద్వాన్ జిల్లా మంకర్‌లో మంకేశ్వర శివుడు-ఆనందమాయి మాత గుడి దర్శనీయం.

## బక్రేశ్వర్



శాంతినికేతన్‌కు 58 కి.మీ. దూరంలో వున్న బక్రేశ్వర్‌ని శివశక్తి భక్తులు దర్శిస్తూ వుంటారు. యిక్కడ బక్రేశ్వరస్వామి దేవాలయం, మహిషాసురమర్ధని ఆలయాలువున్నాయి. బ్రహ్మకుండం, అగ్నిగుండం, జుబిత గుండం, చంద్రకుండం, సూర్యకుండం, ఖరకుండం, భైరవ కుండం అనబడే వేడినీటిబుగ్గ (బావు) లిక్కడ యాత్రికులని ఆకర్షిస్తూ వుంటాయి.

శాంతినికేతన్ నుంచి యిక్కడికి బస్సులు నడుస్తాయి. 'బక్రేశ్వర్'లో ఓ మోస్తరు విశ్రాంతి భవనాలు పని చేస్తున్నాయి.

## నలహతి




దేశంలోని 52 శక్తి పీఠాల్లో నలహతి కూడ ఒకటిగా పరిగణలో వుంది. పరమశివుడి భార్య సతి మోచేయి యిక్కడ రాలిపడిందిట. నల వంశపు రాజులకీ గ్రామం రాజధానిగా వుండేది. ఆనాటి దుర్గ శిథిలాలు మనకిక్కడ కనిపిస్తాయి. స్థానిక లలితేశ్వరి దేవాలయాన్ని మనం దర్శించాలి. శాంతినికేతన్‌కి '104' కి.మీ. దూరంలో వున్న ఈ 'నలహతి' కి ఉదయాన్నే చేరుకుని రాత్రికల్లా తిరిగి వెళ్ళటం మంచిది.

యిక్కడికి 7 కి.మీ. దూరంలోనే 'కనక కాళీతల' అనబడే మరోశక్తి స్థలాన్ని కూడా చూడాల్సివుంటుంది. 52 కాళీ పీఠాల్లో 'కనక కాళీతల' కూడా ఒకటిగా భావించబడుతోంది. 'సతి' శరీరంలోని ఓ భాగం యిక్కడ కూడా రాలిపడిందట.

## విష్ణుపురం

కలకత్తా నగరానికి 151 కి.మీ. దూరంలో వున్న 'విష్ణుపురం' ఓ పవిత్ర యాత్రాస్థలంగా గుర్తించబడింది. విష్ణుపురంలో అనేక విష్ణుమందిరాలున్నాయి. క్రీ.శ. 17-18వ శతాబ్దకాలానికి చెందిన ఈ మందిరాల్లో ఒరిస్సా...



బెంగాల్‌లకి చెందిన శిల్పకళాకృతులు మనకి కన్పిస్తాయి. క్రీ.శ. 1643లో రఘునాధ్ సింహుడిచే నిర్మించబడిన 'శ్యామ్‌రాయ్' దేవాలయం చారిత్రకంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. 'మల్ల' రాజుల శిధిల దుర్గాన్ని మనం యిక్కడ చూడవచ్చు. యిక్కడికి దగ్గర్లోని 'సుసునియా' కొండలపై నాలుగవ శతాబ్దానికి చెందిన చిత్రకళలెన్నో గుహల్లో కనిపిస్తాయి. 'సుసునియా' శిఖరాలు పర్వతారోహణ అధ్యయానికి కూడా ఉపయోగపడుతున్నాయి.

కలకత్తా నుంచి విష్ణుపురానికి బస్సు రైలు సౌకర్యాలున్నాయి. ఈ క్షేత్రంలో వెస్ట్ బెంగాల్ ప్రభుత్వ యాత్రాభివృద్ధి సంస్థ నడుపుతోన్న టూరిస్ట్ లాడ్జిలో మనం బస ఏర్పాటు చేసుకోవచ్చు.

**ఇతర దర్శనీయాలు :**



**బేలూరు రామకృష్ణ మఠం –** బేలూరు రామకృష్ణమఠం చెప్పుకోదగ్గది. వారి సేవలు ఇప్పటికి అనుసరించి, ఆచరించ దగ్గవనడంలో ఏమాత్రం అతిశయం, ఆశ్చర్యం కనబడదు. ఒక వ్యవస్థగా మారి, సంఘటితశక్తిగా ఆర్షధర్మప్రచారానికి, మానవ సేవకు ముందుకు వస్తూన్న అద్భుతశక్తి 'రామకృష్ణ' పరమహంస, వారి సంస్థల సేవాకార్యక్రమాలు.

పరగణాల జిల్లాకు 24 కి.మీ దూరంలోని **బోరోల్** లో **త్రిపురసుందరీదేవి** ఆలయముంది.ఇక్కడ విశేషం అమ్మవారి పాదాలచెంత త్రిమూర్తుల విగ్రహాలుండటం. అలాగే అసన్‌సోల్‌కు దగ్గర్లో 'బారక్‌నాథ్' అనే శివాలయం పురాతనమైంది. ఇది కళింగుల కాలంలో నిర్మించినట్లుగా చెప్పబడుతుంది. ఇక్కడ వేడినీటిబుగ్గలున్నాయి. ఆలయ శిల్పకళ, శోభ చూసితీరాల్సిందే. కోలకత్తాకు సుమారు 115 కి.మీ దూరంలో గంగానదికి అవతలివైపున మాయాపూరులో రాధాకృష్ణుల ఆలయముంది. ఇది శ్రీచైతన్య ప్రభువుల జన్మస్థలమని కూడా చెప్పబడుతుంది. దీనిని 'నవద్వీప'ధామమని కూడా పిలుస్తారు. ఇచ్చట రాధాకృష్ణమందిరం, రాధాకృష్ణబాగ్ నందకుమారమందిరం, భజనాశ్రమం ఇంకా అనేక శ్రీకృష్ణభక్తిని ప్రకటించు మందిరాల్ని మనం చూడగలం. ఇక్కడ 'ఇష్కాన్' సంస్థ తమ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. అఖండ నామమిక్కడ ఆగకుండా సాగుతుంది.

హౌరాస్టేషనుకు 5 కి.మీ దూరంలో **గౌడియామిషన్** వుంది.దీనిని 1883లో శ్రీచైతన్యప్రభువులవారి శిష్యులు శ్రీజీవగోస్వామి స్థాపించి, శ్రీకృష్ణభక్తి ప్రచారం సాగించడం ప్రారంభించారు.

హుగ్లీ జిల్లాలో రత్నాకరనది ఒడ్డున **ఖానాకూల్ లోని కుమారీదేవి ఆలయం,** 51 శక్తిపీఠాలలో ఒకటిగా చెప్పబడేదానిని, సతీదేవి కుడిభుజం పడిన చోటును మనం చూడగల్గుతాం. ఇక్కడ అమ్మవారిని 'కుమారిదేవి' గా పిలచి పూజిస్తారు.

జల్పాయిగురీ దగ్గర **బోడా** అనే ప్రాంత సమీపంలో **భ్రామరీదేవి ఆలయం** చూడదగ్గది. ఇదీ 51 శక్తిపీఠాలలో ఒకటి. ఇచ్చట సతీదేవి ఎడమకాలు పడిందట. ఇక్కడి తల్లి భ్రమరీదేవి. అయ్యవారు 'ఈశ్వర' లేక 'అంబర'గా పిలువబడుతున్నాడు.

**చందనాగోరు** నుండి 25 కి.మీ దూరంలో **కృష్ణభగవానుని ఆలయము**. ఇక్కడి గంగానది మధ్యలో గల రాతిగుట్టపై గోపీనాథాలయం చూడతగ్గవి.

విభ్రాజ్‌పూర్ రైల్వే స్టేషనుకు 22 కి.మీ దూరంలో సియూరి దగ్గరగా **బ(ర)క్రేశ్వర్ ఆలయ** ముంది. ఈమెను 'వక్రేశ్వరి' అని కూడా అంటారు. మహిషాసురమర్దనిగా ఈ తల్లి కూడ పూజలు అందుకుంటుంది.ఇక్కడ తన సృష్టికి తానే భ్రమసిన బ్రహ్మ స్త్రీ చాపల్యానికి శివుడు శపించడంతో, ఇక్కడి కుండంలో స్నానం చేయగా పవిత్రు డౌతాడు. ఈ ఆలయాన్ని అష్టావక్రమహర్షి ప్రతిష్ఠించినట్లు తెలుస్తుంది. ఇంకా సత్యయుగంలో శ్రీలక్ష్మీనారాయణుల వివాహ సమయంలో ఇంద్రుడు, అసితాంగమహర్షిని ఎగతాళి చెయ్యగా, విపరీతమైన కోపం వచ్చి నరాలు వంకరపోయి అంగవైకల్యం ఏర్పడుతుంది. దాంతో ఇక్కడికి వచ్చి తపస్సు చేస్తాడు. దాంతో శివుడు మురిసి, మహర్షిని అనుగ్రహించి, ఇక్కడే వక్రనాథుడనే పేరున వుంటానని అభయమిస్తాడు. ఇంకా దీనిని 51 శక్తిపీఠాలలో ఒకదానిగా కూడా చెబుతారు. ఇక్కడి అయ్యవారు వక్రేశ్వర్, బక్రేశ్వరుడని, అమ్మవార్ని బ్రక్రేశ్వరి అని పిలుస్తారు. ఇక్కడి బ్రహ్మకుండంలో చేసే స్నానం సర్వవ్యాధులు తొలగిపోతాయని, నీటిబుగ్గలు కూడా వున్నాయని చెప్పడమేమిటి స్పష్టంగా కళ్ళకు కనుపిస్తుంది. ఇక్కడ వందలాది విగ్రహాలు ప్రతిష్ఠించబడివున్నాయి. ఇక్కడ వూరు, అమ్మవారికోసమే. ప్రత్యేకంగా వ్యాపారస్థులు తప్ప ఇతర ప్రజానీకం చూడటానికి వచ్చేవారేతప్ప, స్థానికులంటూ ఎవరూలేరు.



**డాంటన్** లోని **శ్యామలేశ్వరుడు**, బంకూరాలోని **శ్రీమహావిష్ణువు, శ్రీఏకపాదేశ్వరుడు**, పండాలేలోని **తారకేశ్వర్,** పర్లి **వైద్యనాథధామ్** చూడదగ్గవి. ద్వాదశ జ్యోతిర్లింగాలలో, ఇది పదకొండవ క్షేత్రం. ఇక్కడి శివలింగంపై రావణాసురుని వేలిముద్రలు కనబడతాయి. ఈ ప్రాంతంలో శివగంగ, జగదాంబ మందిరాలను చూడగల్గుతాం. మహారాష్ట్రలోని మన్మాడు నుండి ఈ పర్లీకి రైలు సౌకర్యముంది.

హౌరాకు 20 కి.మీ. దూరంలోని వల్లభపూర్ శ్రీరాంపూరువద్ద పూరి **జగన్నాథాలయం** వంటిది వుంది. పూరీలోవలె ఇక్కడ రథయాత్ర జరుగుతుంది. వల్లభపూరుకు వచ్చి, ఏడు రోజులుంది ఈ రథం తిరిగి వెడుతుంది. హుగ్లీ పట్టణం ఇక్కడ చూడగనే అనేక దేవాలయాలు, మందిరాలు వున్నాయి. కృష్ణారామం, గోవిందారామం, ప్రత్యేకించి చెప్పుకోదగ్గవి. చూడవలసినవి. పట్టణ శివార్లలోకివస్తే అనంత వాసుదేవ, హంసేశ్వరి దేవి మందిరాలను చూడవచ్చును.




తాంత్రిక ఆలయంగా చెప్పబడే, 51 శక్తిపీఠాలలో ఒకటైన **తారాదేవి ఆలయం, బిర్భమ్ జిల్లాలోని తారాపిత్** అనే ప్రాంతంలో వుంది. ఇక్కడ సతీదేవి కళ్ళు పడినందువలన ఇది శక్తిపీఠమైంది. ఆలయశోభ, అందలి శిల్పాలు చూడాలి. మూడు కళ్ళతారాదేవి బాలశివునకు పాలనిచ్చే బొమ్మను కూడా చూడగల్గుతాం. 'అనంతశక్తిస్వరూపిణి, ఆదిశక్తి'అని ఈ తల్లిని భావించవచ్చును. తమ పసుపుకుంకుమలు నిలబడాలని, తమ సౌభాగ్యం కోరుతు సువాసినులు ఇక్కడి తల్లిని పూజించడమొక ఆచారం.

కలకత్తాకు 45 కి.మీ దూరంలో **బంసబాటీ** ప్రాంతంలోని **హంసేశ్వరిని** చూడాలి. ఇక్కడ శివుడు విశ్రమిస్తే ఆయన బొడ్డునుండి వెలువడిన కమలములో అమ్మవారు ఆశీనులై వుండే చిత్రం చిత్రంకాదు, విచిత్రంకాదు, నయనానందకరం.

బర్ద్వాన్ జిల్లాలో **ఖీర్‌గాం** అనే ప్రాంతంలో **యోగాధ్యాదేవి** ఆలయముంది. ఇదీ 51 శక్తిపీఠాలలో ఒకటే. ఇక్కడి క్షీరగ్రామంలో అమ్మవారి కుడి బొటనవ్రేలు పడటంతో శక్తి పీఠమైంది. 1770 సంIIలో రాజాకీర్తిచంద్ర ఈ ఆలయం నిర్మాణం చేసారుట. ఒకప్పుడిది వామాచారక్షేత్రము. ఇప్పుడు ఆ వాసనలు లేవు. అమ్మవారిని కూడా యుగద్యా, యోగాద్య, జోగాదాయి, జుగాద్యా అనే పేర్లతో భక్తులు పిలుచుకుని పూజలు చేస్తుంటారు.

ఈ బర్ద్వాన్ జిల్లాలో **ఉచానీ** అనే ప్రదేశంలో సర్వమంగళాలను ప్రసాదించే **మంగళచండిక ఆలయము** ఉంది. ఇదీ శక్తిపీఠాలలో ఒకటని ప్రత్యేకించి చెప్పవలసిన పనిలేదు. ఇక్కడ అమ్మవారి కుడిమణికట్టు పడిన ప్రదేశంగా చెబుతారు. అమ్మవార్ని 'మంగళచండిక' అని, స్వామివార్ని 'కపిలాంబేశ్వర్' అని పిలుస్తారు. ఈ తల్లిని చండికా, దుర్గా పేర్లతో కూడా పిలుస్తారు. నవరాత్రులలో చండీహోమం ఇక్కడ విశేషంగా జరుగుతుంది. దుర్గాసప్తశతి, నవాక్షరీ మంత్రాలిక్కడ జరుపబడతాయి.

బంకూరా జిల్లాలో **'టెర్రాకోట్'** అనే ప్రాంతంలో 17వ శతాబ్దానికి చెందిన అనేక మందిరాలను చూడగల్గుతాం. ఇవన్నీ మట్టితో కట్టి కాల్చిన గోడలు. ఎర్రగా, చూడచక్కగా వుంటాయి. ఇక్కడి మందిరాలలో 'శ్యామరాయ' మందిరం చాలాపెద్దది. 1643 సంIIలో దీనిని నిర్మించారని చెబుతారు. మిగతామందిరాలలో రసమంచా, కేష్టారాయ, మదన్‌మోహన, శ్రీధర్ మందిరాలు ముఖ్యమైనవిగా చెబుతారు. సెలవుదినాలలో ఈ ప్రాంతమంతా భక్తులతో ముగ్నివుంటుంది చూడచక్కనిది.



**బరద్వాన్‌లోని ధర్మరాజు ఆలయం**, ఆతని ధర్మనిరతికి నిదర్శనంగా నిర్మించబడింది. భోల్పూరుకు 105 కి.మీ దూరంలో **శ్రీ నతాటేశ్వరీదేవి** ఆలయముంది. ఇది చాలా పురాతన ఆలయం. ఇక్కడ అమ్మవారి కాలిఎముకలు

పడిన ప్రదేశమని 51 శక్తిపీఠాలలో ఒకటని భక్తుల విశ్వాసం. ఇక్కడి శివుని పేరు 'యోగీశ్వరుడు'.

ఇక్కడో త్రివేణి సంగమముంది. దీనిని **'ముక్తవేణి'** అంటారు. ఇక్కడ హంసేశ్వరి, శివ, మహావిష్ణువు ఆలయాల్ని చూడగలం. ఇక్కడి భాగీరథీనది దక్షిణంగా, సరస్వతి పశ్చిమంగా, యమున తూర్పుకు సాగడంవలన ఇది ముక్తత్రివేణి అయింది.



లాల్బాగు నుండి 3 కి.మీ దూరంలో **కిరీటకోనలో** అమ్మవారి కిరీటం పడిన ప్రదేశంలో, 51 శక్తిక్షేత్రాలలో ఒకటైన ఈ శక్తిక్షేత్రముంది. అమ్మవార్ని **కిరీటేశ్వరి, విమలాదేవి** అని పిలుస్తారు కాని, అమ్మవారికి విగ్రహంలేదు. ఎర్రరంగు చీర అమ్మవారి రూపంగా పూజలందుకుంటుంది. ఇక్కడి శివుని 'భైరవ' లేక 'సంవర్త' అని పిలుస్తారు. ఈ పురాతన ఆలయాన్ని, మతసామరస్యం పేరిట అక్బరు కట్టించాడంటారు.


**తాంలుక్** సమీపంలో విభాస వద్ద సతీదేవి ఎడమపాదం పడిన **కపాలినీదేవి ఆలయం** వుంది. దీంతో అది 51 క్షేత్రాలలో ఒకటై అమ్మవారి 'భీమరూపా, కపాలినీ' అని పిలుచుకుంటూ పూజిస్తారు. శివుని శర్వానంద అని భజిస్తారు.

హౌరాబ్రిడ్జి దగ్గర **పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం**, డార్జిలింగ్ పర్వతప్రాంతంలోని కుర్సాంగ్ మార్కెట్ 2 కి.మీ దూరంలో **గిథాపహార్ మందిరం** వుంది. శివరాత్రి సంబరాలు ప్రత్యేకంగా చూడవలసిందే తప్ప, వర్ణించ లేము.

రూపనారాయణ నదీతీరంలో రాక్షసులకు తల్లి అయిన **దితిదేవి ఆలయ**ముంది. ఇక్కడే కృష్ణార్జునుల విగ్రహాలున్నాయి. పాండవుల అశ్వమేధాశ్వమును తామ్‌లుక్ యువరాజు బంధించగా, అర్జునునకు ఆ యువరాజుకు ఈ ప్రదేశంలోనే మహాభీకరంగా యుద్ధం జరిగింది. అప్పుడు శ్రీకృష్ణుడు వీరిద్దర్ని సమాధానపరిచి, యజ్ఞాశ్వాన్ని విడిపించాడని స్థలపురాణ సారాంశం.

భోల్‌పూరుకి 30 కి.మీ దూరంలోని **'కెందులి'** గ్రామంలో **రాధామాధవ దేవాలయ** ముంది. ఈ ఆలయం అష్టపదులు వ్రాసి బహుళ ప్రాచుర్యం పొందిన జయదేవుని ఇంటి ప్రక్కనే నిర్మించినట్లు చెబుతారు. దీంతో కొంతమంది దీనిని 'జయదేవా'లయం అని పిలువడం కూడా కలదు. ఇక్కడే **నవరత్న దేవాలయ** మని చూడదగ్గది, మరొకటి వుంది.

బర్ద్వాన్ జిల్లాలో **కటువా** దగ్గర 51 శక్తిపీఠాలలో ఒకటైన సతీదేవి ఎడమచేయిపడిన ప్రదేశమైన **బహులాదేవి ఆలయము** ఉంది. ఇక్కడి స్వామి పేరు 'భారూక్' అంటే సర్వసిద్ధిప్రదాత అని అర్థం. అజయ నదీతీరంలో వున్న ఈ క్షేత్రం దర్శనీయమని వూరికే అనడంకాదు చూడాల్సిందే.



బంకురా జిల్లా మెయిన్‌పూర్‌లో ఈ **డాకోటర్ కాళికాదేవి ఆలయము** వుంది. ఇది పురాతనమైన కాళికాలయం. ఇక్కడ అమ్మవారి విగ్రహం వుండదు. ఇక్కడి పీఠంపైగల కపాలాలపై అమ్మవారి శూలపు గుర్తు వుంటుంది. దీనినే భక్తులు పూజిస్తారు. దొంగలు, తాము తమ వృత్తిని కొనసాగించేముందు ఇక్కడికి వచ్చి ఈ తల్లిని పూజించి మరీ దొంగతనాలకు వెడతారు. అందుకు 'డాకోటర్' కాళిక్ అని ఈ తల్లికి పేరు.

**డిఘాకు** 8 కి.మీ దూరంలో **చండనేశ్వర దేవాలయం** చూడవలసింది. చైత్రమాసం చివర్లో జరిగే గంగామేళా లేదా విష్ణుసంక్రాంతికి ఇక్కడకు లక్షల సంఖ్యలో భక్తులు వస్తారు. దీనికి సమీపంలో **కపాలకుండల ఆలయం, లంకేశ్వరీదేవి ఆలయాలను** మనం దర్శించవచ్చును.



బీర్భూం జిల్లాలో భోల్పూరుకు సుమారు 10 కి.మీ దూరంలో **గర్భాదేవి ఆలయం** వుంది. దీనినే స్థానికులు 'కంకాళి పీఠ' మని పిలుస్తారు. ఇది 51 శక్తిపీఠాలలో ఒకటని, ఇక్కడ అమ్మవారి శరీరంలోని ఎముకపడిన ప్రదేశమని, దీంతో శక్తి పీఠమైందని చెబుతారు. ఇచ్చటి అమ్మవారి మూలవిరాట్టు నీటిలో మున్గి వుంటుంది. ఉగ్రరూపియైన ఈ తల్లిని ఈ జలాధివాసంతో శాంతమూర్తిగా చేసుకున్నారు. ఈ అమ్మవారిని 'దేవాగర్భ లేక కంకాళేశ్వరి' అని స్థానికులు పిలుస్తారు.

డార్జిలింగ్‌లోని 'టాయ్' రైల్వేస్టేషన్‌కు సమీపంలో మనం **'దిర్‌ధామ్' దేవాలయాన్ని** చూడగల్గుతాం. ఇక్కడి దేవుడనేకాదు, ఈ ప్రాంతంలో ఎక్కడో ఒకటి అరా...తప్ప ఎక్కువగావున్న దేవాలయాలు 'శివపార్వతులవే! ఇచ్చటి దైవం పరమేశ్వరుడు భారతావని అఖండభారతావనిగా ఉన్నప్పుడు 1939లో నేపాల్‌రాజు పూర్ణబహదూర్ ప్రధాన్ ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చెబుతారు. పశుపతినాధ దేవాలయం పద్ధతిలో ఈ దిర్‌ధామ్ ఆలయాన్ని నిర్మించారు. దేవాలయపైభాగం, ఈ దేశంలోని ఒక ప్రాంతమైన టిబెట్ ఆరామాలను పోలివుంటుంది. ఇదే ఏకత, ఐక్యత. ఇక్కడ జరిగే శివరాత్రి ఉత్సవాలు మహదానందకరంగా ఉంటాయి. ఇక్కడ నుండి సూర్యాస్తమయాన్ని కాంచనగంగా పర్వతశ్రేణులనుంచి చక్కగా చూసి మహదానంతమొందుతాము.





భీర్భూం జిల్లాలో **నందిపూర్**కు కొద్ది దూరంలో **'నందికేశ్వరి' దేవాలయం** వుంది. ఇక్కడో పెద్ద వటవృక్షం, దానిక్రింద ఈ నందికేశ్వరీదేవి విగ్రహం. ఈ అమ్మవారిని పలునామాలతో నందిని, నందీశ్వరి, నందికేశ్వరి అని పిలుస్తారు. 51 శక్తిపీఠాలలో ఈతల్లి కూడా ఒకటి. ఇచ్చట స్వామిని నందికేశ్వరుడు అని పిలుస్తారు.

బర్ధవాన్ జిల్లాలో **అట్టహాస్** అనే ప్రదేశంలో **ఫుల్లారదేవి ఆలయం** వుంది. మనకు 51 శక్తిపీఠాలున్నాయని, అవన్నీ శరీరంతో పవిత్రంమయ్యాయని, అమ్మవారికి ప్రతిరూపాలుగా చెబుతారు. ఈ ఆలయంలోని అమ్మ వారి మూర్తి చాలా పెద్దది. అందుకే ఈమెను అట్టహాసా దేవి అనీ, ఫుల్లారదేవి అని పిలుచుకుంటారు. అమ్మవారి నవ్వుతున్న పెదవుల వెడల్పు 18 అడుగులు ఉంటుందంటే అమ్మవారి మూర్తి ఎంత పెద్దదో మనం ఆలోచించాలి. ఇది సతీదేవి పెదవులు ఇక్కడ పడిన ప్రదేశముట. ఈ ఆలయంలోని స్వామిని 'విశ్వేశ' అని అంటారు. అమ్మ ప్రక్కనే ఈ జగత్పతి ఆలయమువుంది.



## రుద్రాక్షలు

1. ఏకముఖీ రుద్రాక్ష ధరించిన విచక్షణా జ్ఞానము కలుగును.
2. ద్విముఖీ రుద్రాక్ష ధరించిన ఇంద్రియ నిగ్రహము కలుగును.
3. త్రిముఖీ రుద్రాక్ష ధరించిన నేత్ర రోగములు రావు.
4. చతుర్ముఖీ రుద్రాక్ష ధరించిన వాక్చాతుర్యము కలుగును.
5. పంచముఖీ రుద్రాక్ష ధరించిన విషజంతుభయము కలుగదు. గుండెకు సంబంధించిన వ్యాధులు తొలగును.
6. షణ్ముఖీ రుద్రాక్ష ధరించిన రక్తపోటు, హిస్టీరియా తొలగును.
7. సప్తముఖీ రుద్రాక్ష ధరించిన ఆయుధభయముండదు.
8. అష్టముఖీ రుద్రాక్ష ధరించిన నరముల బలహీనత తొలగును.
9. నవముఖీ రుద్రాక్ష ధరించిన గుండె జబ్బులు రావు.
10. దశముఖీ రుద్రాక్ష ధరించిన పిశాచ బాధలు తొలగును.
11. ఏకాదశముఖీ రుద్రాక్ష ధరించిన సంతానవృద్ధి కలుగును.
12. ద్వాదశముఖీ రుద్రాక్ష ధరించుటవలన పచ్చకామెర్లురావు.
13. త్రయోదశముఖీ రుద్రాక్ష ధరించుటవలన సంతాన సౌభాగ్యములు కలుగును. భార్యాభర్తలకు అన్యోన్యత ఏర్పడును.
14. చతుర్దశముఖీ రుద్రాక్ష ధరించుటవలన ఆరోగ్యము బాగుండి మనశ్శాంతి కలుగును. కామక్రోధాది దుర్గుణములు నశించును.
15. రుద్రాక్షలను స్త్రీలు ధరించరాదు.
16. రుద్రాక్షలను 108 గాని, 54 గాని, 27 గాని బంగారము లేదా వెండి లేదా రాగితీగతో మాలగా తయారుచేయించి మెడయందు ధరించవలెను. జపమాలగాకూడ ఉపయోగించవచ్చును.
17. రుద్రాక్షలు ధరించుటవలన గుండె జబ్బులు, బి.పి., షుగరు మొదలగు దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనం కలుగును. రుద్రాక్షలను అన్ని వర్ణములవారు ధరించవచ్చును.

# ప్రసిద్ధ దత్త క్షేత్రములు

## మహూర్‌ఘుడ్

దీనినే గురుచరిత్రలో మాతాపూర్‌గా చెప్పిరి. ఇది శ్రీదత్త స్వామి ప్రతినిత్యము రాత్రి వుండే ప్రదేశము పరశురాముడు, దేశోపంతుస్వామి సాక్షాత్కారము, అనుగ్రహము పొందినచోటు మహారాష్ట్రనందలి నాందేడులో ఉన్నది. హైదరాబాదు నుండి నిజామాబాదు మీదుగా నేరుగా బస్సులు ఉన్నవి. మహారాష్ట్రనందలి ముర్తజాపూరు మీదుగా బస్సులో వెళ్లవచ్చును.

## కురుంగడ్డ లేక కురుగడ్డ

ఇది కర్ణాటక దేశమండలి రాయచూరు జిల్లా రాయచూరుకు 10కి.మీ.లో కృష్ణానది మధ్యన కల ఒక చిన్న దీవి. ఇచ్చట శ్రీపాద శ్రీవల్లభులు ఎంతో కాలం తపస్సు చేసి ఎందరో భక్తులను అనుగ్రహించి పెక్కు మహిమలను చూపిన ప్రశాంత సిద్ధ క్షేత్రము. ఇదే తరువాత జన్మకు ప్రాతిపదిక వేసి అవతార సమాప్తి చేసిన స్థలము. రాయచూరుకు అన్నివైపుల నుండి రైలు, బస్సు సౌకర్యములు కలవు.

## ఔదంబరం

పూనే, హుబ్లి మార్గములో పవిత్ర కృష్ణానది తీరములో గల ఈ గ్రామము "బిలపడే" అని పిలవబడుచున్నది. ఇచ్చట శ్రీనృసింహసరస్వతులు చాతుర్మాసం గడిపి కృష్ణ ఒడ్డున నిత్య జాగురూపమైన శ్రీపాదుకులను స్థాపన చేసిరి. ఈ స్థలములో ఎందరో మహాత్ములు తపస్సుచేసి సిద్ధిపొందిరి.

## అబూగిరిశిఖరం

రాజస్థాన్ యందు గల అబూకొండపై ఉన్న గురు శిఖరమునందు పురాతన దత్త మందిరం గలదు ఇచ్చటకు రైలు, బస్సు సౌకర్యము కలదు. అన్ని వసతులు గల యాత్రాస్థలము.

## గరుడేశ్వం

గుజరాత్ రాష్ట్రంలోని బరోడాజిల్లాలో నిర్మలమైన నర్మదానది తీరములో గల ఈ స్థలములో అపర దత్తావతారము పరమపూజ్య శ్రీవాసుదేవానంద సరస్వతీ మహరాజ్ (తెంబే) వారు సిద్ధిపొందిన స్థానము.

## అక్కలకోట

అక్కలకోట మహారాజ్ తపస్సు చేసి సిద్ధి పొందిన పెద్ద జాగృతి స్థానము. ఈయననే అపరదత్తావతారమని భక్తులు కొలుస్తారు. ఈ పుణ్యస్థలము గాణుగాపురమునకు చాలా దగ్గర బస్సు, రైలు సౌకర్యము కలదు. ఈ పుణ్య స్థలములో ప్రతిరోజూ విశేష సంఖ్యలో అన్నదాన కార్యక్రమం జరుగుచున్నది.

# పంచ ప్రయాగలు (5)

**(ఉత్తరప్రదేశ్‌లో ఉన్నవి)**

| | | |
|---|---|---|
| 1. దేవ ప్రయాగ<br>అలకనంద + భగీరథి నదీసంగమం | : | ఋషీకేశ్ దాటిన తరువాత<br>కీర్తినగర్ చేరేముందు |
| 2. రుద్ర ప్రయాగ<br>అలకనంద + మందాకిని<br>నదీ సంగమస్థానం | : | ఇక్కడి నుండి కేదార్‌నాథ్‌కు<br>బదరీనాథ్‌లకు మార్గములు<br>చీలును |
| 3. కర్ణప్రయాగ అలకనంద<br>+ కర్ణ గంగా నదీ సంగమ స్థానం | : | రుద్ర ప్రయాగకు<br>నంద ప్రయాగకు మధ్యలో |
| 4. నంద ప్రయాగ<br>అలకనంద + నంద గంగా<br>(పిండారి నది) సంగమ స్థానం | : | కర్ణ ప్రయాగ దాటి<br>ఛమోలి చేరే ముందు |
| 5. విష్ణు ప్రయాగ<br>అలకనంద + విష్ణుగంగా<br>నదీ సంగమ స్థానం | : | జోషిమఠ్ దాటిన<br>తరువాత గోవింద ఘాట్‌కు<br>వెళ్ళే ముందు |

## హిమాలయములలోని "చార్‌థామ్"

1. **యమునోత్రి** : యమునానది పుట్టినచోటు. ఉత్తరప్రదేశ్.
2. **గంగోత్రి** : గంగానది పుట్టినచోటు. ఉత్తరప్రదేశ్
3. **బదరీనాథ్** : బదరీనారాయణాలయం. (వైష్ణవక్షేత్రం) ఉత్తరప్రదేశ్
4. **కేదార్‌నాథ్** : కేదారేశ్వరాలయం. (శైవక్షేత్రం) ఉత్తరప్రదేశ్

# స్త్రీలకు ప్రవేశార్హత లేని ఆలయములు

1. **విష్ణుమూర్తి :** తురునల్లాయి (కేరళ) వైక్కం దగ్గర

అరాన్‌ములకు సమీపాన. ఇచ్చుట గర్భగుడిలోనికి స్త్రీలను అనుమతించరు. ఇది వైష్ణవ క్షేత్రం. అయినా ఇచ్చుట విభూతి వాడుట ప్రత్యేకత.

2. **అయ్యప్పస్వామి :** శబరిమల
"సన్నిధానం" (కేరళ)
పంపానది నుండి 7 కి.మీ. దూరములలో ఎత్తైన కొండమీద గల క్షేత్రము. స్వామివారు బ్రహ్మచారి. రజస్వల అయిన, బహిష్టులు ఆగని స్త్రీలకు ప్రవేశార్హత లేదు.

3. **విమలాదేవి :** పూరీ (ఒరిస్సా)
బంగాళాఖాత తీరం. శక్తి ఉపాసకులకు ముఖ్య కేంద్రం సంవత్సరములో కొన్ని రోజులు స్త్రీలకు ప్రవేశం నిషిద్ధం. అమ్మవారి "నాభి" పడిన ప్రదేశం.

4. **శింగణాపూర్ :** మహారాష్ట్ర
అహమ్మద్‌నగర్ జిల్లా. 30 కి.మీ. అహ్మద్‌నగర్‌కు శనీశ్వరుడు ఇక్కడ పొడుగాటి శిలవలె వుంటాడు. షుమారు 3 అడుగుల వెడల్పు ఓ అయిదు అడుగుల పొడవులో నిరాకారంగా వుంటాడు. లింగానికి చుట్టూవున్న గట్టుపైకి స్త్రీలకు ప్రవేశార్హత లేదు.

## పంచకాశీలు

1. **వారణాసి** : ఉత్తరప్రదేశ్, గంగానదీ తీరం
2. **గుప్తకాశి** : ఉత్తరప్రదేశ్, రుద్రప్రయాగ నుండి కేదారనాథ్‌కు వెళ్ళు త్రోవలో "ఊఖీమర్" దాటిన వెంటనే కలదు.
3. **ఉత్తరకాశి** : ఉత్తరప్రదేశ్
4. **దక్షిణకాశి** : ఆంధ్రప్రదేశ్, ద్రాక్షారామం, తూ.గో. జిల్లా. 32 కి.మీ. కాకినాడ నుండి
5. **శివకాశి** : తమిళనాడు

## ఆంధ్రప్రదేశ్‌లలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు వెలసిన ప్రముఖ క్షేత్రాలు

| | | | |
|---|---|---|---|
| **1.** | పెనుగొండ | : | పశ్చిమగోదావరి జిల్లా |
| **2.** | **తణుకు** | : | పశ్చిమగోదావరి జిల్లా |
| **3.** | **జంగారెడ్డి గూడెం** | : | పశ్చిమగోదావరి జిల్లా |
| **4.** | కొయ్యల గూడెం | : | పశ్చిమగోదావరి జిల్లా |
| **5.** | ఏలూరు | : | పశ్చిమగోదావరి జిల్లా |
| **6.** | ఆచంట | : | పశ్చిమగోదావరి జిల్లా |
| **7.** | భీమవరం | : | పశ్చిమగోదావరి జిల్లా |
| **8.** | పాలకొల్లు | : | పశ్చిమగోదావరి జిల్లా |

| | | | |
|---|---|---|---|
| **9.** | **నరసాపురం** | : | పశ్చిమగోదావరి జిల్లా |
| **10.** | **మార్కాపురం** | : | ప్రకాశం జిల్లా |
| **11.** | **పెద డోర్నాల** | : | ప్రకాశం జిల్లా |
| **12.** | **చీరాల** | : | ప్రకాశం జిల్లా |
| **13.** | **కంభం** | : | ప్రకాశం జిల్లా |
| **14.** | **అమరావతి** | : | గుంటూరు జిల్లా |
| **15.** | **గుంటూరు** | : | గుంటూరు జిల్లా |
| **16.** | **సత్తైనపల్లి** | : | గుంటూరు జిల్లా |
| **17.** | **విజయవాడ** | : | కృష్ణాజిల్లా |
| **18.** | **ఘంటసాల** | : | కృష్ణాజిల్లా |
| **19.** | **పిఠాపురం** | : | తూర్పుగోదావరి జిల్లా |
| **20.** | **ధర్మపురి** | : | కరీంనగర్ జిల్లా (తెలంగాణా) |
| **21.** | **శ్రీశైలము** | : | కర్నూలు జిల్లా |
| **22.** | **విశాఖపట్నం** | : | విశాఖ జిల్లా |
| **23.** | **అనకాపల్లి** | : | విశాఖ జిల్లా |

## లక్ష్మీదేవికి గల 12 నామములు

1. త్రిలోక పూజిత
2. భవమయి స్థిరా
3. విష్ణు వల్లభ
4. సుస్థిర
5. కృష్ణ
6. ఈశ్వరి
7. కమలా
8. లక్ష్మీంచలా
9. హరిప్రియ
10. పద్మాలయ
11. రమ
12. పద్మధారిణి

## సరస్వతిదేవికి గల 12 నామములు

1. భారతి
2. సరస్వతి
3. శారద
4. హంస వాహిని
5. జగతీ ఖ్యాత
6. కుముది
7. బ్రహ్మచారిణి
8. వాగీశ్వరి
9. వృద్ధమాత
10. వరదాయిని
11. చంద్రకాంత
12. భువనేశ్వరి

## అష్టైశ్వర్యములు

1. ధనము 2. ధాన్యము 3. దాసీజనము 4. భృత్యులు 5. పుత్రులు 6. మిత్రులు 7. బంధువులు 8. వాహనములు.

## అష్టకష్టాలు

1. దేశాంతర గమనము 2. భార్యా వియోగము 3. కష్టకాలంలో నున్న ప్రియ బంధుదర్శనము 4. ఎంగిలి తినుట 5. శత్రువులతో స్నేహం చేయుట 6. పరాన్నమునకు వేచి వుండుట. 7. సభలో అప్రతిష్ట వచ్చుట 8. దరిద్రమును అనుభవించుట.

## అష్టమదములు

1. అర్థ మదము 2. స్త్రీ మదము 3. విద్యా మదము 4. కుల మదము 5. రూప మదము 6. ఉద్యోగ మదము 7. యౌవ్వన మదము 8. అన్న మదము.

## అష్టభోగాలు

1. అన్నము 2. వస్త్రము 3. గంధము 4. పుష్పము 5. పానుపు 6. తాంబూలము 7. స్త్రీ 8. గానము.

## అష్ట గణపతులు

1. లక్ష్మీగణపతి 2. క్షిప్ర గణపతి 3. సిద్ధి గణపతి 4. చింతామణి గణపతి 5. ఉచ్ఛిష్ఠ గణపతి 6. ఏకాక్షర గణపతి 7. కుమార గణపతి 8. శక్తి గణపతి.

మోరేగామ్ (మహారాష్ట్ర) వినాయకాలయంలో ఎనిమిది మూలల వెలసిన అష్ట గణపతులు.

1. వక్రతుండ గణపతి 2. వికట గణపతి 3. హేరంబ గణపతి 4. బాలచంద్ర గణపతి, 5. చింతామణి గణపతి 6. సిద్ధి వినాయక గణపతి 7. లంబోదర గణపతి 8. ధూమ్రవర్ణ గణపతి (మహోదర).

## దేవతలు - వాహనములు

| | | | | | |
|---|---|---|---|---|---|
| భైరవుడు | – | శునకము | వాయుదేవుడు | – | లేడి |
| శీతలాదేవి | – | గార్ధభము | కుబేరుడు | – | మనిషి, పుష్పకం |
| గంగాదేవి | – | మొసలి | శివుడు | – | వృషభము |
| యమునాదేవి | – | తాబేలు | సూర్యుడు | – | ఏడు అశ్వాలు పూన్చిన |
| ఇంద్రుడు | – | ఐరావతము | | | ఏక చక్రరథం |
| అగ్ని దేవుడు | – | గొర్రె లేక మేక | బృహస్పతి | – | కృష్ణ సారమనే లేడి |
| యముడు | – | మహిషము | శుక్రుడు | – | గవయ మనే మృగం |
| నిఋతి | – | ప్రేతము | | | (నీలాగాయ్) |
| కుజుడు | – | మేషము | శని | – | కాకి, గ్రద్ద |
| వరుణుడు | – | మొసలి | రాహువు | – | సింహం, ఒంటె |

| | | | | | |
|---|---|---|---|---|---|
| కేతువు | - | సింహం | విఘ్నేశ్వరుడు | - | ఎలుక |
| విష్ణుమూర్తి | - | గరుత్మంతుడు | బ్రహ్మ, సరస్వతి | - | హంస |
| లక్ష్మీదేవు | - | గుడ్లగూబ | పార్వతి | - | సింహము |
| మన్మథుడు, రతీదేవి | - | చిలుక | దుర్గాదేవి | - | పెద్దపులి |
| కుమారస్వామి | - | నెమలి | హనుమంతుడు | - | ఒంటె |

## సప్త పుణ్యములు

1. మనస్సు చేసిన పుణ్యము : దేవుని యందు భక్తి కలుగుట
2. నోరు చేసిన పుణ్యము : దేవుని నామము ఉచ్చరించుట
3. చేతులు చేసిన పుణ్యము : దేవుని పూజించుట
4. కాళ్ళు చేసిన పుణ్యము : దేవాలయమునకు పోవుట
5. కన్నులు చేసిన పుణ్యము : దేవుని చూచుట
6. చెవులు చేసిన పుణ్యము : దేవుని కథలు వినుట
7. శిరస్సు చేసిన పుణ్యము : దేవుని కళ్ళారాచూచుట

## యంత్రములు (శ్రీ చక్రములు వగైరా) నిక్షిప్తమైయున్న ప్రముఖ దేవాలయములు

1. **అన్నవరం :** శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి, అనంతలక్ష్మి సత్యవతీదేవి, మహానారాయణ యంత్రం.
2. **విజయవాడ :** ఆంధ్రప్రదేశ్, కనకదుర్గ, మహిషాసుర మర్దినిగా ఉన్న అమ్మవారి ఉగ్రరూపం తగ్గించడానికి శ్రీ శంకరభగవత్పాదులు అమ్మవారి పీఠం క్రింద యంత్రాన్ని నిక్షిప్తం చేశారు.
3. **శ్రీకాళహస్తి :** ఆంధ్రప్రదేశ్ శ్రీకాళహస్తీశ్వరుడు, అమ్మవారు జ్ఞానప్రసూనాంబ, శ్రీ చక్రము స్థాపించబడినది.
4. **పుష్పగిరి :** ఆంధ్రప్రదేశ్ , కడపజిల్లా, శ్రీ రాజరాజేశ్వరీదేవి. ఇచ్చట శ్రీ చక్రం శిలపై చెక్కబడియున్నది. అదిశంకరాచార్య ప్రతిష్ఠ.
5. **కొరివి :** తెలంగాణా,, వరంగల్ జిల్లా, వీరభద్రుడు, భద్రకాళి, ఇచ్చుట ప్రతిష్ఠించబడిన యంత్రము చాలా శక్తివంతము, మహబూబ్‌నగర్ మీదుగా కొరివి గ్రామం చేరాలి.
6. **శ్రీశైలం :** ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా. స్వామివారు మల్లికార్జునుడు. అమ్మవారు భ్రమరాంబ. శంకరాచార్య స్థాపిత శ్రీచక్రము కలదు.
7. **కొల్హాపూర్ :** మహారాష్ట్ర, మహాలక్ష్మి ఆలయములో రాతి ఫలకముపై నున్న శ్రీ చక్రం పూజలందుకొను చున్నది.

8. **కంచి :** తమిళనాడు, కామాక్షీదేవి. త్రినేత్రధారిణి. మహారౌద్రముగా ఉండే అమ్మవారిని శ్రీచక్ర స్థాపనముచే శాంతింపజేయడమైనది. ఇచ్చట ప్రతిష్ఠించబడిన శ్రీచక్రమునకు నిత్యపూజలు జరుగుచున్నవి.

9. **మహానంది :** ఆంధ్రప్రదేశ్, 20 కి.మీ. నంద్యాల, కర్నూల్ జిల్లాకు మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి, అమ్మవారి వద్దనున్న శ్రీచక్రం శ్రీశంకరాచార్య ప్రతిష్ఠ.

10. **నెల్లూరు :** ఆంధ్రప్రదేశ్, నెల్లూరుజిల్లా, నెల్లూరు టౌన్‌లలో దర్గామిట్టలో వెలసిన శ్రీ రాజరాజేశ్వరీదేవి. ఇచ్చట ప్రతిష్ఠింపబడిన శ్రీ చక్రము పూజలనందుకొనుచున్నది.

11. **శ్రీరంగం :** తమిళనాడు, కావేరీతీరం. ఈ క్షేత్రమున జనాకర్షణ యంత్రం శ్రీ శంకరభగవత్పాదులచే ప్రతిష్ఠించబడినది.

12. **మధురై :** తమిళనాడు, మధురైజిల్లా. మీనాక్షీదేవి. అమ్మవారి విగ్రహం క్రింద శ్రీ చక్ర స్థాపన జరిగియున్నది.

13. **తిరుమల :** ఆంధ్రప్రదేశ్, చిత్తూరు జిల్లా. శ్రీవేంకటేశ్వరుడు. ధనాకర్షణ చక్రం శ్రీ శంకరాచార్యులవారిచే ప్రతిష్ఠించబడినది.

14. **కాశీ :** ఉత్తరప్రదేశ్, విశాలాక్షి అమ్మవారు. ఇచ్చట శ్రీచక్రం శంకరాచార్య ప్రతిష్ఠ. అన్నపూర్ణేశ్వరీదేవి ఆలయంలో కుడిప్రక్క వెలసియున్న లింగముపై శ్రీచక్రము గలదు.

15. **ఉజ్జయిని :** మధ్యప్రదేశ్, అవంతిక. మహాకాళి. ఉగ్రరూపిణియైన అమ్మవారి తేజమును తగ్గించుటకు శ్రీచక్రము ప్రతిష్ఠించబడినది.

16. **కొల్లూరు :** కర్ణాటక. అమ్మవారు మూకాంబిక, సహ్యాద్రి పర్వతశ్రేణి మొదట్లో మారణఘాట్‌లో శ్రీచక్రం నిక్షిప్తమైయున్న క్షేత్రము.

17. **హరిద్వారం :** ఉత్తరప్రదేశ్, మాయాపురి. అమ్మవారు హరదేవి. శ్రీ చక్రం ప్రతిష్ఠించబడినది.

18. **ప్రయాగక్షేత్రం :** ఉత్తరప్రదేశ్. మాయాదేవి. అమ్మవారి పీఠమున శ్రీ చక్రము నిక్షిప్తమై యున్నది.

19. **జంబుకేశ్వరం :** తమిళనాడు. 2కి.మీ. శ్రీరంగం. అమ్మవారు అఖిలాండేశ్వరి. శ్రీచక్రం ప్రతిష్ఠించబడినది.

20. **కుంభకోణం :** తమిళనాడు. తంజావూరు జిల్లా. అమ్మవారు మంగళాంబిక. శ్రీ చక్రము స్థాపించబడినది.

21. **శృంగేరి :** కర్ణాటక, సువర్ణ శారదాదేవి. శ్రీ శంకరాచార్యుల వారిచే శ్రీ చక్రం నిక్షిప్తమైయున్నది.

22. **కోటప్పకొండ :** ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా. త్రికూటేశ్వర క్షేత్రము, జనాకర్షణ యంత్రము గలది.

23. **ప్రాచి :** ఒరిస్సా, తాకటపురమను గ్రామమున ప్రాచీ నదిఒడ్డున వెలసియున్నటువంటి మంగళాదేవి. వీణా యంత్రము స్థాపించబడినది. 65 కి.మీ. పూరి.

24. **మంగాడు :** తమిళనాడు 20 కి.మీ. మద్రాసు, కామాక్షీదేవి ఆలయమున శ్రీ చక్రము స్థాపించ బడియున్నది.

25. **అంబాజీ :** రాజస్థాన్, అరసూర్ R.S. 32 కి.మీ. మౌంట్ అబూ రోడ్ R.S. శ్రీచక్రం స్థాపించబడిన క్షేత్రము.

26. **బహుచరాజీ :** గుజరాత్, మెహషణా జిల్లా. 50 కి.మీ. మెహషణా. పిల్లల దేవత. అమ్మవారి వాహనం కోడి పుంజు.

27. **ఓంకార క్షేత్రం :** మధ్యప్రదేశ్, నర్మదా నదీ తీరం, ఓంకారేశ్వరుడు. ఓంకార యంత్ర స్థాపన జరిగియున్నది.

## నాలుగు ధామాలు

ఈ అఖండ భారతావనికి నాలుగు మూలల నాలుగు ధామాలు వున్నాయి. గుజరాత్‌లో ద్వారకధామం, తమిళనాడులో రామేశ్వర ధామం, ఉత్తరప్రదేశ్‌లో హరిద్వార్ వద్ద బదరీనాథ్ ధామం, ఒరిస్సాలో జగన్నాథ్ ధామం.

**1) రామేశ్వర ధామం :** చెన్నై నుండి ట్రైన్‌లోనూ, బస్సులోనూ వెళ్ళవచ్చు. ఇక్కడ శ్రీ కోదండరామస్వామి, సేతుమాధవస్వామి ఆలయములున్నాయి. అరేబియా మహాసముద్రం, బంగాళాఖాతం కలిసినచోట, సముద్రం మధ్యలో ఓ అద్భుత చిన్నద్వీపం ఈ రామేశ్వరం. ఇక్కడ రామలింగేశ్వరుడిని కనులారా వీక్షించి సేవిస్తే కైవల్యం సునాయాసమని నమ్మిక.

**2) బదరీనాథ్ ధామం :** ఇక్కడ స్వామి శ్రీ మహావిష్ణువు. పద్మాసనాసీనుడై దర్శనమిస్తారు. ఉత్తరప్రదేశ్‌లోని హరిద్వార్ వద్ద వున్న బదరీనాథ్ చేరుటకు ఢిల్లీ, బొంబాయి లాంటి నగరాల నుంచేకాక వారణాసి, ఉజ్జయిని, కలకత్తాల నుంచి రైలు సౌకర్యం వుంది.

**3) ద్వారకధామం :** అరేబియా సముద్ర తీర ప్రాంతాన వున్నదీ ద్వారకధామం. శ్రీకృష్ణభగవానుడు సింహాసనాన్ని అధిష్టించి పరిపాలించిన పవిత్ర ప్రదేశం. గుజరాత్ రాష్ట్రంలో వున్న ఈ పుణ్యక్షేత్రంలో నారాయణ ఆలయం, రుక్మిణి ఆలయం వున్నాయి. ఇక్కడి స్వామి శ్రీకృష్ణ భగవానుడిని దర్శించు కోవటానికి అహమ్మదాబాద్ నుంచి పూరిధామం నుంచి రైలు సౌకర్యం వుంది. అహమ్మదాబాద్ నుంచి ద్వారక 470 కి.మీ.

**4) జగన్నాథ్ ధామం :** బంగాళాఖాత తీర ప్రాంతంలో ఒరిస్సా రాష్ట్రంలో వుందీ ధామం. ఇక్కడి స్వామి జగన్నాధుడు. దీన్నే పూరి జగన్నాధమని కూడా అంటారు. ఈ ఆలయంలో శ్రీకృష్ణుడు, బలరాముడు, సుభద్రల విగ్రహాలు వుంటాయి. హిందువులకి మాత్రమే ప్రవేశమున్న ఈ ఆలయంలో చక్రతీర్థం, గోపినాధాలయం వున్నాయి.

## పంచారామాలు

దేవతలకు, రాక్షసులకు జరిగిన యుద్ధంలో శ్రీకుమారస్వామి తారకాసురుడు అనే రాక్షసుడ్ని వధించి, అతని కంఠంలోని అమృత లింగాన్ని అయిదు ఖండాలుగా ఖండిస్తాడు. ఆ అయిదూ అయిదు ప్రదేశాల్లో పడతాయి. అవే పంచారామాలు. ఈ పంచారామాలు ఆంధ్రప్రదేశ్‌లోనే వున్నాయి.

అవి అమరారామము (అమరావతి), సోమారామము (భీమవరం), క్షీరారామము (పాలకొల్లు), ద్రాక్షారామము (తూర్పు గోదావరి జిల్లాలో), కుమారారామం (సామర్లకోట).

**1) అమరారామము :** గుంటూరు నుండి 27 కి.మీ. పవిత్ర కృష్ణానదీ తీరమున నిలచిన శ్రీ అమరేశ్వరస్వామి

మొదటిది. సుప్రసిద్ధ బౌద్ధ క్షేత్రముగా భాసిల్లిన ఈ క్షేత్రములో దేవేరి రాజ్యలక్ష్మీ అమ్మవారిని కూడా దర్శించవచ్చు. ఇక్కడి స్వామి లింగము రోజు రోజుకి పెరిగిపోతుండటంతో శిరస్సున మేకు కొట్టడంతో అగిపోయింది. దాని తాలూకు గుర్తులు చూడవచ్చు. ఇక్కడి అర్కియోలాజికల్ మ్యూజియం వుంది.

**2) సోమారామము :** ఇక్కడి స్వామి శ్రీ సోమేశ్వర జనార్థనస్వామి. పంచారామాల్లో రెండోదయిన ఈ క్షేత్రంలో స్వామి లింగము గోధుమ, నలుపు వర్ణంలో వుంటారు. ఇక్కడ అమ్మవారిని, శ్రీ జనార్థనస్వామిని దర్శించవచ్చు. భీమవరం నుంచి దగ్గర.

**3) క్షీరారామము :** పాలకొల్లులో వున్న ఈ క్షేత్ర స్వామి రామలింగేశ్వరస్వామి. పంచారామాల్లో మూడవదయిన ఇక్కడి స్వామి వెనుక భాగంలలో చారలుంటాయి. ఇవి జడలని ప్రతీతి. ఇదే అమృత లింగానికి శిరోభాగం. నరసాపూర్ నుండి 8 కి.మీ.

**4) ద్రాక్షారామము :** దక్ష ప్రజాపతి యజ్ఞాలు చేసిన ప్రదేశం. ఇక్కడి భీమేశ్వర లింగము 15 అడుగులుంటుంది. పై నుండి అభిషేకాదులు చేస్తారు. తూర్పుగోదావరి జిల్లాలోని ఈ ద్రాక్షారామం పంచారామాల్లో నాలుగవది. ఇక్కడ అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటి అయిన మాణికాదేవిని కూడా దర్శించుకోవచ్చు. ఈ క్షేత్రము కాకినాడ, కోటిపల్లి వెళ్ళే మార్గంలో వుంది.

**5) కుమారామము :** సామర్లకోట నుండి అతి దగ్గర. ఆలయాన్ని చాళుక్య భీముడు నిర్మించాడు. ఇక్కడి స్వామి లింగం ఎత్తయినది. పంచారామాల్లో చివరిదయిన ఈ క్షేత్రంలో బాలత్రిపుర సుందరీదేవిని కూడా దర్శించుకోవచ్చు. ఇక్కడికి దగ్గరలో 12 కి.మీ. దూరంలో పిఠాపురంలో కుక్కుటేశ్వర లింగము వుంది. ఇక్కడే శక్తిపీఠాలలో ఒకరయిన పురుహూతిక దేవిని దర్శించ వచ్చును.

## ఇతర పుణ్యతీర్థాలు

### ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలలో జిల్లాల వారీగా ....

**శ్రీకాకుళం జిల్లాకు వస్తే...** రావివలస, రాజాం, మందస, చూడవలసిన మహేంద్రగిరులు, శాలిహుండం, కళింగపట్నం, కమిటి, బారువలు.

**విశాఖపట్నంజిల్లాలోకి వస్తే...** పంచదార్ల, అనకాపల్లి, నూకాంబడిక, విశాఖ పోలమాంబ, విజయనగరం – వెయ్యేళ్ళగుళ్ళు, పైడితల్లి, బొబ్బిలికోట, జయతిఆలయాలు, కాజిపేట శ్వేతార్కమూలగణపతి,

**ప.గో.జిల్లాకి వస్తే ...** యనమదుర్రు, పట్టిసీమ, ఆచంట, మద్ది ఆంజనేయస్వామి, రాట్నాలమ్మ, మావుళ్ళమ్మ, దువ్వ దానేశ్వరి పెదకాపవరం, పెనుగొండ, తేతలి,

**కృష్ణాజిల్లాలోకి వస్తే ---**

ఆగిరిపల్లి మహేశ్వరుడు, అవనిగడ్డ సమీపంలోని విశ్వనాధపల్లిలోని అద్దంకి నాంచారమ్మతల్లి, గుడివాడలోని

పార్శ్వనాథదేవాలయం, వడాలి జగన్నాథస్వామి, మొగల్తూరు జమీందారులు అభివృద్ధి చేసిన అగస్త్యేశ్వరస్వామి దేవాలయం, వేదాద్రి యోగనందలక్ష్మీనరసింహస్వామి, బొమ్మదేవరపల్లి శ్రీరంగ నాయకస్వామి, నెమలి వేణుగోపాలస్వామి, చల్లపల్లి సమీపంలోని నడకుదురు లక్ష్మీనారాయణస్వామి (నరకాసుర సంహారానంతరం శ్రీకృష్ణుడు సత్యతో కలిసి పూజించిన అర్చామూర్తి) నల్లమల అడవుల 'నెలవంక'లోని వీరభద్రుడు, చిలకలపూడి పాండురంగడు, తెలియని మొగల్రాజపురం దుర్గాదేవి ఆలయం, పెనుగ్రంచిప్రోలు తిరుపతమ్మతల్లి .... ఇలాగ చెబుతుంటే... ముప్పైమూడుకోట్లమంది దేవతల వలె – వారి దివ్యచరిత్ర అందించడం కష్టం.

**ఇంకా గుంటూరుజిల్లాలోని .....** నరసరావుపేట వెళ్ళే దారిలోని శ్రీజలపాలేశ్వరస్వామి, కైలాసగిరి క్షేత్రం (పేరేచర్ల) దాసాంజనేయస్వామి, తాడికొండ దేవాలయాలు, క్వారీ దేవాలయం, రాయపూడి శ్రీగంగా పార్వతి సమేత సోమేశ్వరస్వామి, నల్లపాడులోని స్వయంభూలక్ష్మీనరసింహస్వామి, యనమదల వీరభద్రస్వామి దేవాలయం, గుత్తికొండగుహలు, వేణుగోపాలస్వామి (యనమదల), కోటప్పకొండ, సీతారామస్వామి ఆలయం, జాగర్లమూడి సంగమేశ్వరాలయం, కారంపూడి చెన్నకేశవ, కానాని మల్లన్న, బాపట్ల భావనారాయణస్వామి, మాచర్ల శ్రీలక్ష్మీసమేత చెన్నకేశవాలయం.

**కడపలోకి వెడితే...** ఒంటిమిట్ట, తాళ్ళపాక, నందలూరు, కందిమల్లయ్యపల్లి, మల్లెంకొండ, దేవునిగడప, ముక్తిస్థలి, సిద్ధవటం...

**కర్నూలులోకి వెడితే...**శ్రీశైలం డ్యాం నుండి 12 కి.మీ దూరంలో పడవ ప్రయాణంతో మనం అక్కమహాదేవి గుహలను దర్శించవచ్చును. గుహలో శివలింగం, బయట పోచమ్మ విగ్రహాలు, కాల్వ బుగ్గరామలింగేశ్వరస్వామి, మూలసాగరములోని చెన్నకేశవ– ఆంజనేయస్వామి, కైరుప్పల వీరభద్రక్షేత్రం, ఆత్మకూరుకొలను భారతి ఆలయం, నందికొట్కూర్ సూర్యదేవాలయం, గోస్పాడు పెద్దమ్మతల్లి, నందవరం చౌడేశ్వరీదేవి, సప్తనది లింగమేశ్వరాలయాలు.

**అనంతపురం జిల్లాలోని దర్శనీయాలు :** ఆత్మకూరు, "మాణిక్యం" రంగనాథస్వామి, తొండపాడు "పల్లికొండ" రంగనాథస్వామి, కదిరి నరసింహం, బుగ్గసంగమేశ్వరుడు, హేమవతి సిద్ధేశ్వరాలయం (అనంతపురానికి 140 కి.మీ), తాడిపత్రి, పుట్టపర్తి, గుత్తి, ధర్మవరం, పెన్న, అహోబిలం, నెట్టికంటి ఆంజనేయస్వామి(వ్యాసరాయలు చిత్రించి ప్రతిష్ఠించిన ఆలయం) ఆలూరులోని రంగనాథస్వామి, జైన సంస్కృతి కల్గిన పెనుగొండ (ఇది ఎన్నో రకాలుగా విశిష్టమైంది), శ్రీపేట వెంకటరమణుడు, కాశీవిశ్వేశ్వర కోదండరామాలయం (అనంతపురం).

**ఇక చిత్తూరు జిల్లాలోకి వస్తే ....** అడుగడుగునా అపురూప కట్టడాలు, శిధిలమైన శిల్పాలు, చరిత్రకు అంది, మనలను అడుగడుగునా సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తే సజీవతకు సాక్ష్యమైన ఇతిహాసాలు. తిరుపతి లోని కపిలతీర్థం, దాని ప్రకృతి సోయగాలు ఆనందించదగ్గవి. ఒకప్పుడు ఎంతో ప్రశాంతంగా వుండే ప్రాంతాలు ఈనాడు మన యాంత్రిక జీవన జీవిత విధానానికి అనుగుణంగానే భక్తులతో కిటకిట లాడుతున్నాయి.

రేణిగుంటకు 11 కి.మీ లోని గుడిమల్లం పరశురామేశ్వరాలయం, రేణిగుంటలో 11 వ శతాబ్దంనాటి పెద్దమ్మ ఆలయం, చోళులనాటి సిద్ధేశ్వరాలయాలు, లక్ష్మీనారాయణలుకాక మరెన్నో దేవాలయాలు ప్రక్క గ్రామాలవారికి కూడా దర్శనీయంగా చెబుతారు. మదనపల్లికి 20 కి.మీ. దూరంలో ఒకనాటి 'ఏనుగుమల్లమ్మ

కొండ', ఈనాటి 'హార్సిలీహిల్సు"గా వేసవి విడిదిగా ప్రఖ్యాతమొందింది.

కాళహస్తి స్వయంభుస్వామి, తరిగొండ వెంగమాంబ ఆలయం, శ్రీపురం గిరిపుర ఆలయం, కేటారు సమీపంలోని శ్రీనారాయణపీఠం (తిరుమలైకొడి గ్రామం), ఇచ్చటి స్వయంభూ అమ్మవారి దేవాలయం, కైలాసకోన (నారాయణపురం) విరూపాక్షపురం (కాళహస్తి తా॥ తొట్టంచేడు గ్రామం), యమగానిపల్లె ద్రౌపదీ ఆలయం, మదనపల్లి మల్లమ్మగుడి, ములకచెరువు కోటమ్మగుడి, బత్తినయ్యకోన భక్తకోటేశ్వరుడు, తిరుత్తనికి 25 కి. దూరంలో నాటి ఘటికాచలం నేటి శోళింగరుగా పిలువబడుతోంది. ఒక కొండపై నరసింహస్వామి, రెండో కొండపై యోగాంజనేయులు వున్నారు.

పుంగనూరు పట్టణానికి సమీపంలోని బోయకొండ గంగమ్మ, కాణిపాకానికి సమీపంలోవున్న వేపంజెర్రిలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయం (ఇందులో వివిధ దేవతలు కొలువైవున్నారు), కుప్పంకు సమీపంలోని కెనమానిపల్లి శ్రీనివాస ఆలయం, ఆంజనేయస్వామి ప్రత్యక్షమై దర్శింపచేసిన జాబాలితీర్థం, నారాయణ వనం దగ్గర్లోని అవణాక్షమ్మ ఆలయం, నారాయణ వనంలోని వేంకటేశ్వరాలయం, శ్రీపల్లి కొండేశ్వరస్వామి, అరగొండ గ్రామంలో 2 కి.మీ ఎత్తులో వెలసిన అర్ధగిరి వీరాంజనేయస్వామి, అక్కడ సహజ సిద్ధంగా ఏర్పడిన సంజీవరాయ పుష్కరిణి, చెప్పుకోవడానికి త్రేతాయుగానిదే అయినా, చోళరాజులు నిర్మించినట్లు శాసనాలద్వారా తెలుస్తోంది.

**ఇంకా ప్రకాశంజిల్లాలోని...** భైరవకోన, శింగరకొండ, సత్యవోలు, అద్దంకి, మార్కాపురం, రంగధాముల మాల్యాద్రి, తరిమెళ్ళ (కంభంమండలం), ఉప్పుటూరు, త్రిపురాంతకం, కనపర్తి, కనిగిరి, మోక్షగుండం రామతీర్థాలు,

**నెల్లూరు** రంగనాధుడు, ఆత్మకూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట సమీపంలోని అలఘుమళ్ళారి కృష్ణస్వామి, ప్రభగిరి, పెంచలకోన, జొన్నవాడ, వేదగిరి, లేబూరుగుళ్ళు చెంగళమ్మతల్లి, మూలాస్థానేశ్వరుడు, గొలగమూడి వెంకయ్యస్వామి.

**తెలంగాణాలోని మహబూబ్‌నగర్‌జిల్లాలోకి వెడితే ....**

కొల్హాపూర్ నియోజకవర్గంలోని సింగోటం లక్ష్మీనరసింహస్వామి, మల్దకనాలోని స్వయంభూలక్ష్మీ వేంకటేశ్వరస్వామి (స్వామి విగ్రహం 8 అ. లక్ష్మీదేవి విగ్రహం 16 అ.) రావూరి ప్రజలకు ఇదే తిరుపతి. వీరు తిరుపతి వెళ్ళరు. ఆ స్వామికి మ్రొక్కరు. కొల్హాపూర్‌కు సమీపంలోని జటప్రోలు అగస్తేశ్వరుడు, నల్లమల అడవులలో రంగాపూరు గ్రామానికి సమీపంలోని ఎత్తైన కొండలపైగల ఉమామహేశ్వరాలయం, కురుమూర్తి శ్రీనివాసు ఆలయానికి తోడు, అలంపురంలో జోగులాంబతల్లి దర్శించదగ్గ తల్లి. 3,4 శతాబ్దాలలోను, 6-12 శతాబ్దాలమధ్య ఈ క్షేత్రం, చెప్పుకోదగ్గ పరిధిలో చరిత్రలో శాశ్వతంగా నిలిచే పద్ధతిలో రూపుదిద్దుకుంది.

ఈక్షేత్రంలోనే నవబ్రహ్మల ఆలయాలువున్నాయి. శ్రీశైలానికి ఈ ఆలయం పశ్చిమద్వారమైతే, దక్షిణాన సిద్ధవటం, తూర్పున త్రిపురాంతకం, ఉత్తరాన ఉమామహేశ్వరాలు. మైసిగండి (అమనగల్లు మండలం) మైసమ్మ మతసామరస్యానికి చిహ్నం. ఇక్కడ అక్కన్న-మాదన్న నాటి ఆలయాలు వున్నాయి. కొల్లాపూరు, పిల్లలమర్రి, ఫరూకుమండలంలోని రాయకల్ శివారులో రాముడు ప్రతిష్ఠించినట్లు చెప్పే రామేశ్వరలింగం, మన్యంకొండ, జైనశిల్పాలకు ప్రతీకయైన గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామిలతో ఎన్నోవున్నాయి. ఓపికగా దర్శించి, దర్శనం పొందవచ్చును.

**ఇక మెదక్ జిల్లాలోని...** ఏడు పాయల కనకదుర్గమ్మ, చింతరేవుల ఆంజనేయస్వామి, 108 అ. తౌనగండ్ల ఆంజనేయస్వామి, సూరసంగంలోని కేతకీ పరమేశ్వరుడు, కొండపాక మండలంలోని రుద్దెడ లింగరూప వీరభద్రుడు, మెదక్ కు 63 కి.మీ దూరంలోని రాగిప్రాలకొలనులోవున్న సరస్వతి ఆలయం, ఎల్లారెడ్డిలో త్రిలింగేశ్వరాలయం, జోగిపేట సమీపంలోని వీరభద్రేశ్వరాలయం, కూడవెల్లిలోని వివిధ ఆలయాలు, నాచగిరి, కుడవలి, బీరంగూడ మల్లికార్జునస్వామి, హానపురం శ్రీలక్ష్మీనరసింహస్వామి, రాంపూరు సమీపంలోని చెట్టుపెద్దమ్మతల్లి చెప్పుకోతగ్గవి.

**నల్గొండ జిల్లాలోని...** యాదగిరిగుట్ట, సురేంద్రపురి, ఫణిగిరి, మట్టపల్లి రామగిరి, పిల్లలమర్రి, భువనగిరికోట, గాజులబండ, నాగార్జునకొండ, పాలెం, కొలనుపాక, చెరువుగట్టు జడల రామలింగేశ్వరస్వామి, రాజపల్లి, పానగల్లు,

**ఖమ్మం జిల్లా (తెలంగాణా)** లోని గార్ల దేవాలయాలు, తీర్థాల సంగమేశ్వరుడు, జమలాపురం అన్నపురెడ్డిపల్లెలోని వేంకటేశ్వరస్వామి, భద్రాచలం సమీపంలోని గుండాల గ్రామంలో చూడదగ్గ వేడినీటిబుగ్గలు, కూసుమంచి శివాలయం ఇతర ఆలయాలు, కల్లూరు మహాదేవాలయం, 'విరాటనగర్' మనే నేలకొండపల్లి రామగిరి సుందరసీతారామ చంద్రస్వామి, జీళ్ళచెరువు సీతారామచంద్రస్వామి, ఖమ్మంలోని స్తంభాద్రి నరసింహస్వామి...

**నిజామాబాదులోనికి వస్తే...** డిచ్‌పల్లి, ఖిల్లా రామాలయం, దోమకొండ, సారంగపూరు, శ్రీకంఠేశ్వరుడు, ఆర్మూరు, బన్యవాడ, ఇందూరు రఘునాథాలయం, బికనూరు సిద్ధరామేశ్వరం, ప్రత్యేకించి నిజామాబాదు, ఏకచక్రపురమనే బోధన్; ఖాజీపేట శ్వేతార్క మూలగణపతి;

**రంగారెడ్డి జిల్లాలోని...** కీసరగుట్ట, చిలుకూరి అనంతగిరి, ఎన్కతల శనైశ్వరస్వామి, సురారం, వర్షక, తొంకక్షేత్రం చూడదగ్గవి.

లక్సెట్టిపేటకు 7 కి.మీ దూరంలోని గూడెంగట్లు సత్యనారాయణస్వామి, సిరిచెల్మ గ్రామంలోని సోమేశ్వరాలయం, జైపురు మండలానికి 40 కి.మీ దూరంలోని జలమడుగు, సిరిపూర్ (సూర్యపురం) చారిత్రాత్మక కోట, ఆదిలాబాదు, బైంసాకల్పలోని వేంకటేశ్వరాలయాలు, దండేపల్లి రాట్నపు చెవులకొండపై వెలసిన సత్యనారాయణస్వామి, ఆదిలాబాదు జిల్లాలోని ఆలయాలు వగైరాలు **తెలంగాణాలో దర్శనీయములు.**

ఇలాగ ఎన్ని చెప్పినా... ఇంకా, ఇంకా.... చూడాల్సినవి, చెప్పవలసినవి ఎన్నో వున్నాయి. ఎంతో కొంత ఆసక్తి కల్గించే ఈ చరిత్ర, కట్టడాలు, శిల్పాలు ముందు తెలుసుకోదగ్గవి.

## పశ్చిమ బెంగాల్

**పుల్లోరా :** పరమశివుని భార్య సతి......... ఇక్కడ కాలుపడిందట. అందుకే ఇక్కడ ఓ శైవక్షేత్రం ఏర్పడింది. జనవరి మాసంలో ఇక్కడ పెద్ద ఉత్సవం జరుగుతుంది.

**గంగాసాగర్ :** అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటి. గంగసాగర సంగమం చేసే ప్రదేశం. మాఘమాసంలో గొప్ప ఉత్సవం జరుగుతుంది.

**చంద్రనాగూర్ :** కలకత్తాకి 39 కి.మీ. దూరంలో ఉన్నది. ఇందులో భువనేశ్వరి, నందలాల్ ఆలయాలున్నాయి.

**బాన్స్‌బెరియా :** వాసు దేవాలయం, హంపీశ్వరి ఆలయాలున్నాయి.

**బకరేశ్వర్ :** ఇక్కడ 200 పైగా దేవాలయాలున్నాయి. ఇందులో ప్రధాన దేవాలయం శివాలయం, శైవ తీర్థాల్లో ఇది ఒకటి.

**మదన్ మోహనుని ఆలయం :** పురాతన దుర్గా ఆలయం. మల్లరాజుల శిధిలాలు ఉంటాయి.

**తారకేశ్వరం :** ఇక్కడ స్వామికి సేవలు చేస్తే రోగాలు పోతాయనేది ఒక నమ్మకం.

**తారాఫిద్ :** అనేక ఆలయాలున్న తీర్థయాత్ర ప్రదేశం.

**వైద్యనాథధామ్ :** శివగంగ, జగదాంబ మందిరాలున్న ఈ క్షేత్రం ద్వాదశ జ్యోతిర్లింగాల్లో పదకొండవది. లింగం శిరస్సుపై రావణాసురుని వేలిగుర్తులున్నాయి.

## బీహార్

**సోనాపూర్ :** అనేక దేవాలయాలున్న ఈ ప్రదేశంలో జరిగే సంతలలో, ఏనుగులను సైతం బేరానికి పెడతారు.

**మాంఘిర్ :** అంగరాజ్యానికి ముఖ్యపట్టణం. ముచ్చటైన హిందూ దేవాలయాలతోపాటు చూడటానికి కోటకూడా ఉంది.

**గయ :** దీనినే పితృగయ అని అంటారు. ఇక్కడ ఒకసారి శ్రాద్ధం పెడితే, జీవితమంతా శ్రాద్ధ విధులు నిర్వర్తించనవసరం లేదు.

**అక్షయవటము :** ఇక్కడున్న వృక్షం క్రింద పితృకర్మలు చేయించి పిండప్రదానం చేస్తారు. అప్పుడే పితృదేవతలకు శాశ్వత కైవల్యం వస్తుందన్న నమ్మకం.

**రాజరప్ప :** శివుని జటాజూట రౌద్రాగ్ని మంటల్లో లేచిన సతిదేహాన్ని గిరగిర తిప్పేటప్పుడు, శిరోభాగం ఇక్కడే పడింది. 51 శక్తి పీఠాల్లో ఒకటైన ఈ ప్రాంతాన్ని తప్పనిసరిగా దర్శించాలి.

## మధ్యప్రదేశ్

**కందరీయ మహదేవుని ఆలయం :** కామ రసోద్దీపనం ఉన్న అనేక శిల్పాలు ఇక్కడ కనిపిస్తాయి. లెక్కకు 1000కి తక్కువ ఉండవు. ఇలాంటి శృంగార లీలలను ప్రతిబింబించే మరో ఆలయం జగదాంబాలయం (కాళీమాత విగ్రహం నల్లరంగులో ఉంటుంది).

**చిత్రగుప్త ఆలయం :** సూర్యభగవానుడు వెలసిన ఈ ఆలయం విష్ణుమూర్తి ఆలయంగా మలచబడిందని స్థానికులు చెపుతారు.

**బ్రహ్మదేవుని ఆలయం :** అతి అరుదైన ఆలయం, కారు రాయితో కట్టబడిన ఈ ఆలయం, శ్రీ మహావిష్ణువు కోసం కట్టబడినది. ఇక్కడికి కొద్ది దూరంలోనే సూర్యుని దేవాలయం ఉంటుంది.

**భోజాపూర్ :** భోపాల్‌కి 28 కి.మీ. దూరంలలో ఉన్న ఈ ప్రదేశంలో భోజరాజు కట్టించిన సోమనాథ ఆలయం ఉంది.

**గోపాల మందిరం :** వెండితో చేయబడిన కృష్ణుని విగ్రహం ఇక్కడ కనిపిస్తుంది. అతి ప్రాచీనమైన నక్షత్రశాల ఉంది. ఈ నక్షత్రశాల 18వ శతాబ్దంలో నిర్మింపబడింది.

**భర్తృహరి గుహ :** భర్తృహరి సుభాషితాలు తెలియనివారు తెలుగునాట లేరనడం అతిశయోక్తి కాదు. 11వ శతాబ్దంనాటి శివాలయం మరియు భర్తృహరి నివసించిన గుహను చూడవచ్చు.

**మహాకాల్ ఆలయం :** 13వ శతాబ్దంలో నాశనం చేయబడిన పురాతన శివుని ఆలయం ఇక్కడే శ్రీకృష్ణుడు విధ్యాభ్యాసం చేసినట్టు పురాణం చెపుతోంది.

**కాలాంజనగిరి :** నీలకంతమహదేవుని ఆలయం ఉంది. భరతుడు తపస్సు చేసిన ప్రదేశం కూడా ఇదే.

**విరాట్‌పూర్ :** పాండవులు 11సం.లు అరణ్యవాసం తర్వాత అజ్ఞాతవాసం చేసింది ఇక్కడే. పాండవులు ఆయుధాలు దాచిపెట్టిన చెట్టును కూడా చూడవచ్చు.

## ఉత్తరప్రదేశ్

**లక్ష్మణతిన్నె :** శ్రీరాముడు తన సోదరుడు లక్ష్మణునికి బహుమతిగా ఇచ్చిన ప్రదేశం.

**స్వర్గద్వార్ :** యాత్రికులు పిండ ప్రదానములు చేసే ఈ చోటునే శ్రీరాముడు అవతారం చాలించి అంతర్ధానమైంది.

**యజ్ఞేశ్వరనాధాలయం :** చంద్రప్రభానది వద్ద యజ్ఞేశ్వరనాధ మహామందిరం ఉంటుంది.

**దక్షయజ్ఞకుండం :** యాత్రీకులు సరోవర స్నానమాచరిస్తారు. దక్షప్రజాపతి యజ్ఞం చేసినచోటు.

**దూర్వాస ధామం :** దుర్వాసముని తపస్సు చేసిన ప్రదేశం.

**చునార్‌కోట :** వామనునికి 3 అడుగులు బలిచక్రవర్తికి యిచ్చినపుడు, స్వామి మొదటి అడుగు ఇక్కడే వేశారు.

**దుర్గాలయం :** 12 స్థంభముల మంటపం కలిగిన ఈ ఆలయం కాశికి దక్షిణదిశలో ఉంది.

**శ్రీకృష్ణుని జన్మభూమి :** శ్రీకృష్ణుని జన్మస్థానం, దేవకి వసుదేవుల చెఱశాల వున్న ఈ ప్రదేశంలో హిందువులు పూజలు జరుపుతారు.

**మహావనం :** మన్నుతిన్న కృష్ణున్ని అదిలించితే నోరుతెరచి, పదునాల్గు భువనభాండములు యశోదకు చూపింది ఇక్కడే.

**నైమిశారణ్యం :** గోమతి తీరంలో ఉంది. బ్రహ్మకుండం, చక్రతీర్ధం ఇక్కడే వున్నాయి. ఇక్కడున్న చక్రతీర్థాన్ని శ్రీమహావిష్ణువు నిర్మించారని చెప్తారు.

## హర్యానా

**సూరజ్‌కుండ్ సరస్సు :** శ్రీకృష్ణుడు తర్పణాలు వదిలిన పవిత్రమైన సరస్సు.

**అక్షయ వటవృక్షం :** గీతోపదేశానికి సాక్షిగా ఉన్న ఈ వటవృక్షం వయస్సు చెప్పాలంటే యుగయుగాలు లెక్కించాల్సిందే.

**కర్నల్ :** కర్ణుని జ్ఞాపకార్ధంగా వెలసిన పట్టణం. కొద్ది దూరంలో కర్ణసరస్సు ఉంది.

**రోహతక్ :** 8-9 శతాబ్దాల శిల్పవిశేషాలు లభించినది ఇక్కడే. విష్ణువు, హనుమాన్ దేవాలయాలున్నాయి.

## పంజాబ్

**దుర్గయానా మందిరం :** 16వ శతాబ్దంలో నిర్మింపబడిన దుర్గాదేవి ఆలయముతో పాటు లక్ష్మీనారాయణ ఆలయం కూడా ఉంది.

**కారన్ కరన్ :** అమృతసర్‌కి 127 కి.మీ. దూరంలో ఉన్న ఈ గురుద్వారాలో, ఈ ప్రక్క నుంచి ఆ ప్రక్కకు ఈదితే భయంకరమైన కుష్ఠువ్యాధి కూడా పోతుందన్నది నమ్మకం.

**కట్‌వాన్‌డి :** శ్రీ గురునానక్ పరమపదించిన స్థానము. సిక్కులకు అతి పవిత్రస్థలం.

**గోగా :** చౌఫాద్‌కి 3 కి.మీ. దూరంలో నాగదేవుని ఆలయం వుంది. ఈ ఆలయంలో వున్న రంధ్రంలోంచి వచ్చే గాలి, నాగదేవుడు గాలి పీల్చి వదలడం వలన వస్తుందని అంటారు.

**జలంధర్ :** హిమాలయాల్లో పుట్టిన బియాస్ నది ఇక్కడ ప్రవహిస్తుంది. అమృతసర్‌కు 80 కి.మీ. దూరంలో ఉన్న ఈ చోట స్నానం చేస్తే సర్వపాపాలు పోతాయని నమ్మకం.

**హోసియాడ్‌పూర్ :** ఇక్కడున్న దేవాలయాల్లో రామాయణ, భాగవతాలకు సంబంధించిన అపూరమైన చిత్రాలు అనేకం ఉన్నాయి.

## హిమాచల్‌ప్రదేశ్

**రేణుక :** జమదగ్ని ఆశ్రమంతో పాటు రేణుక, జమదగ్నిల విగ్రహాలు వున్నాయి. ఇక్కడగల యమునానది పడమరవైపు ప్రవహిస్తుంది.

**ఛాంబలోయ :** 926 మీటర్ల ఎత్తున ఉన్న లోయ ప్రాంతము, శివాలయాలు, విష్ణు ఆలయాలు ఉన్నాయి. క్రీ.శ. 920 సం.లో నిర్మించిన దేవాలయాలు 1.5 కి.మీ. దూరంలో ఉన్నాయి.

**ఖేల్లీ :** కులుమనార్‌కి 4 కి.మీ. దూరంలో ఉన్న ఇక్కడ వైష్ణోదేవి ఆలయం ఉంది.

**పార్వతిలోయ :** కులు అసలు పేరు. ఇక్కడే పార్వతీదేవి కర్ణాభరణం పడింది. దాన్ని సర్పరాజు తీసుకువెళితే, మహదేవుడు తిరిగి ఇమ్మని అడిగాడు. అప్పుడు పాతాళం నుండి పైకి వచ్చి ఇచ్చాడు. ఇక్కడున్న జలధారలో స్నానం చేయవచ్చు.

**కల్పా :** మహదేవుని నివాసమైన కైలాసనగరం ఇదే. కిన్నావూర్ జిల్లా ముఖ్యమైన కేంద్రం అయిన ఈ కల్పా, సముద్రమట్టానికి 6050 మీ.ల ఎత్తులలో ఉంది.

**మణిమహేష్ సరోవరం :** సముద్రమట్టానికి 13,000 అడుగుల ఎత్తులో ఉన్న సరోవర ప్రాంతం, కృతయుగంలో ఆది దంపతులైన శివపార్వతులకు మనోహరమైన క్రీడా ప్రాంగణమని విశ్వసిస్తారు.

**బజౌరా :** శిల్పకళతో, నగిషీల పనితనంతో మనల్ని అబ్బురపరచే బాషిష్వర మహదేవుని ఆలయం ఉంది.

**బిజిలీ ఆలయం :** ఇక్కడి ఆలయం ముందు లింగాకారంలో తెల్లటి స్థంభం ఉంది. సముద్రమట్టానికి 2455 మీ.ల. ఎత్తులో ఈ దేవాలయం ఉంది.

## జమ్ము-కాశ్మీర్

**హరి పర్వతం :** దీన్ని చూడడానికి అనుమతి కావాలి. పార్వతిదేవి విసిరిన రాయి ఈ పర్వతంగా మారిందని అంటారు.

**అనంత్‌నాగ్ :** శ్రీ మహావిష్ణువు శయనాగారం. నీటి ఊటలు అనేకం ఉన్న ఈ అనంతనాగ్ శ్రీనగర్ నుండి 55 కి.మీ.

**రంబీరేశ్వరాలయం :** కొన్ని వేల స్ఫటిక లింగాలున్న ప్రదేశం. ఈ ఆలయాన్ని తప్పక దర్శించాలి.

**శివభేరి :** జమ్ముకు 88 కి.మీ. దూరంలో ఉంది. పురాతన శివాలయం.

**పూర్‌మందిర్ :** జమ్ముకు 30 కి.మీ. దూరంలో వుంది. హిందువులు తప్పనిసరిగా దర్శించాల్సిన యాత్రా స్థలం.

**రఘునాధ ఆలయం :** చక్కటి పవిత్ర శిలలున్నాయి. నగరం మధ్యలో ఉన్న ఈ ఆలయంలో రామాయణ గాధకు చెందిన అనేక మందిరాలున్నాయి.

**కాళికాలయం :** కాళీనది ఎడమవైపు కొండకు దగ్గరవుంది. బహుపోర్టు, బహులోచనుడు అంకురార్పణ చేసిన ఈ కోటలో ఉన్న ఆలయం తప్పక చూడవలెను.

**శేషనాగ్ :** ఇక్కడే గరళకంఠుడు తన మెడలోని పామును వదిలింది.

**తీర్ధపురి :** భస్మాసురుడు వరం పొందిన ప్రదేశం.

## గుజరాత్

**భద్రకాళి :** భద్రకోటలో భద్రకాళి ఆలయంతో పాటు గడియారస్తంభం ఉంది.

**హోధీసింగ్ దేవాలయం :** ఇది పాలరాతి దేవాలయం. సేర్ హోదీసింగ్ నిర్మించిన ఈ (1848) దేవాలయాలలో 12 మంది తీర్థంకరుల పాలరాతి విగ్రహాలున్నాయి.

**భాలక తీర్థము :** శ్రీకృష్ణ భగవానుడు ద్వాపర యుగాంతమున అడవిలో ఉన్నప్పుడు కిరాతకుడు బాణం వేశాడు. అది సరిగ్గా కృష్ణుడి కాలి బొటనవేలికి తగిలింది. ఆ సన్నివేశంతో విగ్రహం ఉంటుంది.

**దేహోస్వర్గ :** శ్రీకృష్ణ భగవానుడు అవతారం చాలించిన చోటు ఎదురుగా గుబురుగా గుహలుంటాయి.

**పావ్‌గడ్ :** రావణయుద్ధ కాలంలో మూర్ఛిల్లిన లక్ష్మణుడి కోసం సంజీవిని పర్వతంను హనుమంతుడు తెస్తుంటే, కొంత భాగం ఇక్కడ పడింది.

**చంపానీర్ :** గాదినందనుడు తపస్సు చేసిన ఈ ప్రదేశంలో శిధిలమైన కోట ఉంటుంది. శక్తి ఆలయం ఉన్న ఇక్కడే విశ్వానది పుట్టినది.

**కపధన్వజ :** వడోదర నుండి 32 కి.మీ. దూరంలో వుంది. ఇక్కడ వేడినీటి ఊటలున్నాయి. ఇక్కడ స్నానం చేస్తే దీర్ఘచర్మవ్యాధులు పోతాయని నమ్మకం.

**ఉభయ కోట :** 13వ శతాబ్దంలో నిర్మించిన ఈ కోట వడోదరకి 25 కి.మీ. దూరంలో ఉంది. ఈ కోటలో రాజమాల్ ఆలయం ఉంది. ఇక్కడ రాధికమాల్, విశ్వనాధ ఆలయాలు ఉన్నాయి.

## మహారాష్ట్ర

**జైనాలయం :** పాలరాతి ఆలయం, అద్దాల మందిరాలు వున్న ఇక్కడ నలువైపులా తీర్థంకరుల విశేషాలు చిత్రించి ఉంటాయి.

**మహాలక్ష్మి దేవాలయం :** పురాతనమైన శ్రీమహాలక్ష్మి ఆలయం చాలా ప్రశస్తమైన ఆలయంగా ప్రసిద్ధి.

**శింగాణాపురం :** ఇంటికి తలుపులే ఉండని వింత గ్రామం. ఈ గ్రామంలోనే శనీశ్వరుని ఆరు బయలు దేవాలయం ఉంది.

**జోగేశ్వరి గుహలు :** అంధేరి స్టేషన్ దగ్గర ఉన్న గుహలు.

**పార్వతి అమ్మవారి ఆలయం :** చారు పర్వతం మీద పూనా నుంచి 5 కి.మీ. దూరంలో ఉంది.

**గణపతి పూల్ :** సుందర విశ్రాంతి ప్రదేశం. ఇక్కడ గల గణపతి దేవాలయం దర్శించదగ్గ ప్రసిద్ధమైనది.

**నాసిక్ :** పశ్చిమ కాశిగా ప్రసిద్ధి పొందిన, గోదావరి తీరంలో ఉన్న ఈ పట్టణంలో 12 సం॥లకు ఒకసారి పుష్కరం జరుగుతుంది. ఇక్కడ రామాలయం, పంచవటి తపోవనం, సీత గుహ, పాండవ గుహలు, రావణుడు సీతమ్మ వారిని ఎత్తుకుపోయిన స్థలంలో జటాయువు మోక్షస్థానం దర్శించదగ్గవి.

**అంబర్‌నాథ్ :** 1060లో నిర్మించిన గొప్ప శివాలయం.

**రామ్‌టెక్ :** ఇక్కడ 600 సం॥ క్రితం నాటి దేవాలయాల సమూహం వుంది. కాళిదాసు, మేఘసందేశం రచించింది ఇక్కడే. శ్రీరామచంద్రుడు ఇక్కడ కొంతకాలం నివసించినట్టు చెప్తారు.

**అనుధనాగ్‌నాథ్ :** ఔరంగాబాద్ నుండి 203 కి.మీ. దూరంలో గల ఈ శైవ క్షేత్రంలో రెండవ జ్యోతిర్లింగం ప్రతిష్ఠితమైవుంది.

## ఒరిస్సా

**ఓధ్యాణము :** ఇక్కడ గిరిజాదేవి ఆలయం ఉంది. అమ్మవారి శక్తి పీఠాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది.

**యోగినీ మందిరాలు :** భువనేశ్వర్‌కి 15 కి.మీ. దూరంలో ఐదు యోగినీ మందిరాల్లో 64 యోగినీ శిల్పాలు, శిల్ప సౌందర్యానికి ప్రతీకలుగా నిలిచి ఉంటాయి.

**హటకేశ్వరస్వామి :** భువనేశ్వర్‌కి 42 కి.మీ. దూరంలో (అత్రి) ఉష్ణగుండాలున్నాయి. ఈ ఉష్ణగుండాలనానుకొనే ప్రసిద్ధ హటకేశ్వరస్వామి ఆలయం ఉంది.

## రాజస్థాన్

**నహరగల్ కోట :** ఇక్కడికి దగ్గరలో గణేశ్ ఆలయం ఉంది. 6 కి.మీ. దూరంలో ఉన్నది. ఈ కోట రెండస్తులుగా కట్టబడింది.

**ఉధ్యానవనం :** ఆగ్రా రోడ్‌కి 10 కి.మీ. దూరంలో వుంది. ఇక్కడ శ్రీమహావిష్ణువు, ఆంజనేయుడు, శివుని దేవాలయాలు ఉన్నాయి.

**జగదీశ్ ఆలయం :** 32 మెట్లు ఎక్కితే నీలమేఘశ్యాముని చూడవచ్చు. ఇత్తడితో చేసిన గరుడ వాహనం కూడా ఉంటుంది.

**రాణక్‌పూర్ :** ఆదినాధుని దేవాలయమైన ఇక్కడ 1439లో నిర్మించిన తొమ్మిది వరండాలున్నాయి. ఇవన్నీ 1444 స్థంభాలపై ఆధారపడి ఉండటమే కాదు ఏ రెండు స్థంబాలు ఒక్కటిలా ఉండవు.

**నాథ్ ద్వారా :** 600 సం॥నాటి శ్రీకృష్ణుని విగ్రహం ఉంది.

**జగత్ ఆలయం :** 1000 సం॥ల నాటి పార్వతిదేవి ఆలయం ఉంది.

**అచలేశ్వరీ మహదేవ్ :** ఇక్కడ లోతు తెలియని బ్రహ్మకుండు ఉంది. పార్వతి పరమేశ్వరుల విగ్రహాలు ఆలయం ముందే ఉంటాయి.

**అంబికాజీ ఆలయం :** అబూ నుండి 20 కి.మీ. దూరం. గుజరాతీయుల ఆరాధ్యదేవతైన అంబికాజీ మాత ఆలయం ఉంది. ఇక్కడే సరస్వతి నది జన్మస్థలం.

**గోముఖం :** గోముఖం నుండి స్వచ్ఛమైన జలాలు క్రిందనున్న సరస్సులోకి వస్తాయి. ఇక్కడే వాల్మీకి ఆశ్రమం ఉంది.

## గోవా

**సప్తకోటేశ్వర ఆలయం :** అతి ప్రాచీనమైన దేవాలయం. శివాజీరాజు మరమ్మత్తులు చేయించారు. ఇక్కడ ఇంకా మహాలాదేవాలయం, శాంతి దుర్గాలయం వుంది. ఈ దేవాలయం 1713లో నిర్మించారు. ఇక్కడ దేవత పార్వతీదేవి అవతారం.

**పాండా :** చూడాల్సిన దేవాలయాలున్నాయి. 10 కి.మీ. దూరంలో తప్పక దర్శించాల్సిన ఆలయాలున్నాయి.

**చంద్రేశ్వర భూతనాథ్ :** పురాతన కాలంనాటి ఆలయాలున్న ఈ ప్రదేశం మడగాంకు 16 కి.మీ. దూరంలో వుంది.

## నేపాల్

**మచ్ఛీంద్రనాథ్ :** ఇక్కడ స్వామికి రథోత్సవం జరుగుతుంది. నేపాల్ రాజవంశ కులదైవం ఈ మచ్ఛీంద్రనాథ్.

**బుధ్ధనీలకంఠవ్ :** శ్రీమహావిష్ణువు పాలసముద్రంలో శేషతల్పంపై పడుకున్నట్టు ఉండే ఈ స్వామిని వైష్ణవులు మహావిష్ణువుగాను, శైవులు నీలకంఠునిగా పూజిస్తారు.

**జనకపురిధావన్ :** మహాశక్తి పీఠాల్లో ఒకటి. సీతాదేవి బాల్యం, పెళ్ళి జరిగిందిక్కడే. జనక మహారాజు పరిపాలించిన ఈ ప్రదేశం ఎంతో పవిత్రం ఆ సీతమ్మతల్లి నడయాడిన ప్రదేశాలు చూస్తుంటే, కన్నుల ముందు కదలాడినట్టే ఉంటుంది.

**సూర్యవినాయక్ ఆలయం :** భట్‌గావ్‌కి 10 కి.మీ. దూరంలో ఉన్న ఈ సూర్య ఆలయం తప్పక దర్శించతగ్గది.

**సాలగ్రామ పహాడ్:** పెద్దగుట్ట, ఇక్కడ సాలగ్రామాలు అధికంగా లభిస్తాయి. బౌద్ధాలయం, నరసింహస్వామి ఆలయం కన్పిస్తాయి.

## కేరళ

**సర్పదేవాలయం :** రాష్ట్రంలోని అలెప్పిజిల్లాలోని ఉన్న ఈ ఆలయం నాగేశ్వర ఆలయంగా ప్రసిద్ధిచెందింది. ఇక్కడ నాగేశ్వరున్నేకాక, ఆయన పట్టమహిషులైన సర్పయక్షి, నాగయక్షిలను కూడా పూజిస్తారు. ఇక్కడ సంచరించే పాములు ఎప్పుడు ఎవ్వరికీ హాని కలిగించవు.

**మన్నరశ్శాల :** ఇక్కడ నాగదేవత కొలువైఉంది. స్థలపురాణం రీత్యా ఈ గుడిని పరశురాముడు నిర్మించాడని చెప్తారు.

**అరన్ముల :** ఎర్నాకుళం నుండి 122 కి.మీ. దూరంలో ఉన్న ఈ ప్రదేశంలో పురాతన కృష్ణుని ఆలయం ఉంది.

## కర్ణాటక

**కేదారేశ్వర ఆలయం :** ఈ ఆలయాన్ని అభినవ కేతలాదేవి నిర్మించారు.

**గోకర్ణం :** పరమశివుడు, రావణునికి ఆత్మలింగం ప్రసాదించినచోటు.

**గణేశ్ ఆలయం :** విరూపాక్ష దేవాలయంలో రెండు గణేశ్ విగ్రహాలున్నాయి. ఒకటి ఆలయంలో, మరొకటి ఆరుబయట ఉంటుంది.

**కృష్ణ ఆలయం :** ఈ ఆలయాన్ని శ్రీకృష్ణదేవరాయులు కట్టించాడు. 1513లో దీనిని నిర్మించారు. ఇక్కడ స్వామి బాలకృష్ణుడు.

**మల్లిఖార్జున ఆలయం :** రెండవ విక్రమాదిత్యుని భార్య త్రిలోకమహాదేవి చేత నిర్మింపబడిన ఈ ఆలయాన్ని త్రిలోకేశ్వర ఆలయమంటారు.


**పాపనాథ్ ఆలయం :** ఈ ఆలయాన్ని 680 ఎ.డి.లో నిర్మించారు. రామాయణ, భారతముల దృశ్యములు చూడవచ్చు.



విశ్వమానవతా గురు పీఠం పారంపర్య పీఠాధ్యక్షులు,
శ్రీ శృంగేరీ విరూపాక్ష పీఠాధిపతులు
జగద్గురు
శ్రీశ్రీశ్రీ బోధానంద భారతీమాంధాచార్యుల వారి
పూర్వాశ్రమ మునిమనుమలు,
పరమహంస పరివ్రాజకాచార్య
శ్రీశ్రీశ్రీ పరిపూర్ణ ప్రకాశానంద భారతీ మహాస్వామి వారి
పూర్వాశ్రమ మనుమలు,
భువనేశ్వరీ, మణిద్వీప, మహామాతృశ్రీ యజ్ఞ నిర్వాహకులు,

పన్నెండు వందలకు పైగా ఆధ్యాత్మిక రచనలతోపాటు - గేయాలు, గీతాలు,
పత్రికల (3) సంపాదకులు, పుస్తక సమీక్షకులు, జ్యోతిష్య గ్రంథాలు,
యువజన, బాలసాహిత్య రచయిత,
కర్ణాటక, మహారాష్ట్రలలో శ్రీ సాయితత్వోపన్యాసాలు...
సహస్రాధిక సాయి వ్రతాలు... మరెన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు....
నిర్వహించిన గురుదేవులు
**శ్రీశ్రీశ్రీ వ్యారుగంటి రామకృష్ణ ప్రసాద్**
కలం నుండి వెలువడిన
ఉత్తర - దక్షిణ ..... మన పుణ్యక్షేత్రాలు సమగ్ర స్వరూపం
"నవరత్న బుక్‌హౌస్" అధిపతి
కీర్తిశేషులు **శ్రీ బుగ్గల కోట రామమూర్తి గారికి**
తన అభిమానంగా అంకితమిచ్చారు.

ఇందులో ఎన్నో విశేషాలు పొందుపరిచారు. అన్ని పొందుపరచడం అందరికీ సాధ్యం కాదు.
ఆధ్యాత్మిక సాహితీ చక్రవర్తి బహుపురాణ గ్రంథకర్తకు ..... నమోవాకములతో....
ప్రచురణ కర్త..



**NAVARATNA BOOK HOUSE**
# 28-22-20, RAHIMAN STREET, ARUNDELPET,
VIJAYAWADA-520 002, PH : 2432813, 98480 82432
www.navaratnabookhouse.com

Rs.300/-